విషయానుక్రమణిక

అధ్యాయం			పేజీ

అధ్యాయం			పేజీ

అధ్యాయం		పేజీ

పురాణ పరిచయం

జయతిపరాశరసూనుః సత్యవతీ హృదయానందనో వ్యాసః
యస్యాస్య కమలకోశే వాఙ్మయ మమృతం జగత్ పిబతి

(వాయుపురాణం : 1-2)

సత్యవతీ హృదయానందకరుడు, పరాశర మహాముని కుమారుడు, తన ముఖమనే కమలంలో సమస్త వాఙ్మయామృతాన్ని దాచుకొని ప్రపంచం చేత త్రాగిస్తున్నవాడు అయిన వ్యాసునికి నమస్కారము అని ఎవనిచేత రచింపబడిందో ఆవాయు పురాణం ఆ మహానుభావునికి నతమస్తకం అవుతుండగా

అచతుర్వదనో బ్రహ్మో ద్విబాహు రపరోహరిః
అఫాలలోచనః శంభుర్భగవాన్ బాదరాయణః *(మహాభారతం-ఆదిపర్వం)*

నాలుగు ముఖాలు లేని బ్రహ్మ, రెండు చేతులతో ఉన్న విష్ణువు, ఫాలభాగంలో కన్నులేని శివుడు బాదరాయణ వ్యాసుడని, తన జన్మకు కారణభూతుడైన కృష్ణ ద్వైపాయనునికి ప్రణతులర్పిస్తున్నది మహాభారతం.

అలాంటి వ్యాసమహాముని చేతిలో అష్టాదశ (18) పురాణాలు రూపు దాల్చాయని భారతీయుల విశ్వాసం. పురాణ శ్రవణం బహుకాలంగా ఈ దేశంలో సంప్రదాయమనే నదికి కాలువలు తీస్తున్నదే. అందుకే

యథా పాపాని పూయంతే గంగావారి విగాహనాత్
తథా పురాణ శ్రవణాద్ దురితానాం వినాశనమ్

(వామనపురాణం - 95-86)

గంగానదిలో స్నానం చేయటం చేత పాపాలు నశిస్తాయి. అలాగే పురాణ శ్రవణం చేత కష్టాలు దూరం అవుతాయి అని భారతీయుల నమ్మకం.

పురాణాల ప్రాముఖ్యత

భారతీయ సంస్కృతికి అవిచ్ఛిన్నంగా కొన్నివేల సంవత్సరాల నుంచి మూలాధారాలుగా నిలుస్తున్నవి వేదాలు. ఎన్ని విదేశీ దండయాత్రలు జరిగినా, ఎన్ని సాంస్కృతిక దౌష్ట్యాలు చోటు చేసుకొన్నా మన సనాతన ఆర్షసంస్కృతి ఈనాటికీ నిలిచి ఉన్నది అంటే అందుకు కారణం వేదాలేనని చెప్పుకోవాలి. ఈ వేదాల యెడల మనకు గల భక్తి గౌరవాల కారణంగానే మనం ఐహిక సుఖాలనే కాకుండా ఆముష్మిక ఉన్నతికి మార్గాలు వేసుకోగలుగుతున్నాము. వేదాల ద్వారానే మనం జీవితంలో తప్పకుండా ఆచరించవలసిన కర్తవ్యాలను, విధులను తెలుసుకొని ఆచరించగలుగుతున్నాము. 'పుమాన్ పుమాంసం పరిపాతు విశ్వతః –అనే వేదమంత్రం ఒక మనిషి తన తోటిమనిషికి సహాయం చేసి దాని ద్వారా తన జన్మను సఫలం చేసుకోమని బోధిస్తున్నది. అలాగే "మిత్రస్యాహం చక్షుషా సర్వాణి భూతాని" అనే మంత్రం సమస్త ప్రాణులను మిత్రభావంతో చూడాలని నిర్దేశిస్తున్నది. 'కృణ్మో బ్రహ్మావో గృహే సంజ్ఞానాం పురుషేభ్యః' అనే మంత్రం – ఓ ప్రజలారా మనమందరం కలసి మానవులలో సద్భావం కొరకు, సద్భావనకోసం దైవాన్ని ప్రార్థిద్దామనే కర్తవ్యాన్ని బోధిస్తున్నది. ఇలా మానవుడు తన జన్మను సార్థకం చేసుకోవడానికి వేదాలు సన్మార్గాన్ని ఉపదేశిస్తున్నాయి, కర్తవ్యాన్ని ప్రబోధిస్తున్నాయి. వేదాలలో చెప్పబడిన అంశాలు చాలా వరకు నిగూఢంగా ఉంటాయి. సామాన్యునికి కూడా అర్థం అయ్యే విధంగా ఉపదేశం చేయడానికి పురాణాలు ఉద్భవించాయి. అందుకే ఋగ్యజుస్సామ అధర్వణ వేదాలనేవి నాలుగైతే, ఆ వేదాలతో సమానంగా 'పురాణం పంచమోవేదః' అని అయిదవ వేదంగా కీర్తించబడుతున్నది. భారతీయ సంస్కృతియొక్క స్వరూప స్వభావాలను సమగ్రంగా తెలుసుకోవాలంటే పురాణ అధ్యయనం చాలా ముఖ్యం. పురాణాలు భారతీయ సంస్కృతికి కొలదండాలవంటివి. ఆ పురాణాల మీద ఆధారపడే, ఆధునిక భారతీయ సమాజం తన నీతి నియమాలను నిర్దేశించుకొంటున్నది. పురాణాల్లో లేని విషయాలు ఏమీ లేవు. దేవతలు, ఋషుల వృత్తాంతాలు, సదాచారాలు, పదునాలుగు విద్యలు, మానవ కర్తవ్యాలు అన్నింటిని తనలో ఇముడ్చుకున్న ఈ పురాణ ప్రక్రియయే ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించు కొన్నది. అందుకే పురాణాలను గురించి కొంతైనా తెలుసుకొనటం ప్రతి భారతీయునికి అవశ్యకర్తవ్యం. భారతీయఇతిహాస దృష్టితో చూస్తే పురాణాలకు మహత్తరమైన స్థానం ఉన్నది. ప్రతి హిందువుకు పురాణ అధ్యయనం ఏదో విధంగా అనివార్యం అవుతున్నది. అందుకే భారతీయులపై పురాణ సాహిత్యం నెరిపినంత గాఢ ప్రభావం మరి ఏ సాహిత్యం చూపలేకపోయింది.

పురాణం అంటే ఏమిటి?

'పురాణ' శబ్దం యొక్క వ్యుత్పత్తి పాణిని అష్టాధ్యాయిలోను, యాస్కుని నిరుక్తంలోను, పురాణాలలో కూడా కనిపిస్తుంది. పాణిని చెప్పిన ప్రకారం 'పురాభవమ్' (ప్రాచీనకాలంలో జరిగినది) అనే అర్థంలో 'సాయంచిరం పాహ్ణే ప్రగే అవ్యయే భ్యష్టచ్యేట్చ్యు లౌతృట్చ' (4-3-23) అనే సూత్రం ద్వారా 'పురా' శబ్దానికి 'టుచ్యే' ప్రత్యయంచేరి, తరువాత దానిపై 'తుట్ 'ఆగమంగా వచ్చినందువలన పురాతన శబ్దం ఏర్పడుతుంది. ఇంతేకాకుండా పాణిని రచించిన "పూర్వకాలైక సర్వజరత్పురాణనవకేవలాః సమానాధి కరణేన" (2-1-49), "పురాప్రోక్తేషు బ్రాహ్మణ కల్పేషు" (4-3-105)అనే ఇంకో రెండు సూత్రాలలో పురాణశబ్దాన్ని ఉపయోగించాడు. యాస్కుని నిరుక్తం ప్రకారం 'పురాణం' పురానవం భవతి (3-4-19) అనే ఇంకో రెండుసూత్రాలలో పురాణ శబ్దాన్ని నిర్వచించాడు. అంటే ప్రాచీనమైనదైనా క్రొత్తదిగా ఉండేదానిని 'పురాణం' అంటారని భావం. వాయు పురాణంలో 'పురాఅనతి' అని పురాణానికి వ్యుత్పత్తి చెప్పబడింది. అంటే ప్రాచీన కాలంలో జీవించి ఉన్నదానిని పురాణం అంటారు అని బ్రహ్మాండపురాణం (1-1-1-173) 'పురా ఏతద్ అభూత్' అంటే ప్రాచీన కాలంలో ఈ విధంగా జరిగింది అనే దానిని తెలియజేసే శాస్త్రమే పురాణం అని వివరిస్తున్నది. ఈ వ్యుత్పత్తులను పరిశీలిస్తే, పురాణం అనేది ప్రాచీన కాలానికి సంబంధించిందని తెలుస్తుంది. ఆర్యజాతి యొక్క వైదిక సాహిత్యానికి చెందిన జ్ఞానానికి, విజ్ఞానానికి అక్షయ నిధి పురాణం, ఇప్పటివరకు ప్రపంచంలో జ్ఞానులు, శాస్త్రవేత్తలు చెప్పిన విషయాలన్నీ పురాణాలలో ఉన్నాయని (కొందరి) భావన. మొత్తంమీద ప్రాచీన కాలంలో జరిగిన విషయాలను ఇప్పుడు జరుగుతున్నవానివలె ధర్మోపదేశకంగా తెలిపేవి పురాణాలు అని చెప్పవచ్చు.

పురాణాల పాత్ర ఏమిటి ?

పురాణం అంటేనే ప్రాచీనమైనదని అర్థం. సృష్టికి ప్రారంభంలో జ్ఞానరాశి సామాన్య శబ్దాలలోను, వాక్యాలలోను, చెప్పటానికి వీలుకాని సమయంలో పురాణాలను దేవతలు సేకరించారు. ఆ ప్రాచీన కాలపు ఆలోచనాధార, భావనాధార, జ్ఞానధారలు విస్తారంగా పురాణాలను కూర్చటంలో ప్రతిఫలించింది. దీనివలన వేదార్థాన్ని సరియైన పద్ధతిలో, సరిగా అవగాహన చేసుకొనే వీలుకలిగింది. అదే 'పురాణ ఉపబృంహకత' అని పిలువబడింది. ఈ విధంగా భారతీయ సంస్కృతి సనాతన ధర్మాలలోని తులలేని రత్నాలు పురాణాలలో పొదగబడ్డాయి. వానిని సూక్ష్మంగా, తులనాత్మకంగా పరిశీలించి అవగాహన చేసుకొనకపోతే వేదార్థం సరియైన పద్ధతిలో అవగాహనకాదు. ఈ విశ్వంలో పరమాత్ముడు ఒకడే. అయితే ఆయా స్థలాలలో, ఆయా పురాణ ఖండాలలో వివిధ దేవ

తల ఉపాసనను తెలిపిన కథలలో దేవతలు, ఋషులు, తపస్వులు, మునులు, విప్రులు, పర్వతాలు, సముద్రాలు, తీర్థాలు, వృక్షాలు, పశుపక్ష్యాదులు – అన్నీ ఆ విషయాన్ని ప్రతి పాదించేవిగానే పురాణాల్లో చెప్పబడ్డాయి. అన్నీ కూడా పరమాత్ముని దివ్య చైతన్య స్ఫూర్తిని ఒకదానికి ఒకటి సహకారకంగా వివరించేవే. ఈ విధంగా సమగ్ర జీవన విధా నంలో సమగ్ర బ్రహ్మాండ విషయాలలో, భావనలో ఒకే ఒక పరమాత్ముని సాక్షాత్కారం చేసుకొనే విధానాన్నే పురాణాలు ప్రతిపాదించాయి. అందుకు అవసరమైనంత సమర్థవంతంగా రూపుదిద్దుకున్నాయి. ఈ విషయాలనే పురాణ విద్య అన్నారు. అది మహర్షులకు సర్వ స్వంగా నిలిచింది. ఎన్ని రకాలైన దరిద్రాలకు భారతదేశం గురి అయినా, ఆ నిధే తర తరాలుగా ఈ దేశ సాంస్కృతిక వైభవాన్ని నిలబెట్టింది. ఇదే చరిత్రలో పురాణాలు నిర్వ హించిన పాత్ర.

పురాణాలు - జయము అనే పేరు

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసంతతో జయ ముదీరయేత్

అని మహాభారతము చెప్పుతున్నది. అందుచేత మహాభారతానికి జయము అనే పేరు ఉన్నట్లు తెలుస్తున్నది. 'జ' అంటే సంస్కృత సంఖ్యా పరిగణనాన్ని బట్టి 8. 'య' అంటే 1 అనగా 81.

'అంకానాం వామతో గతిః' అనే నుడిని బట్టి ఇది 18 అవుతుంది. 18 పర్వాలు గలది, 18 అధ్యాయాల భగవద్గీత కలది, 18 రోజుల కురుక్షేత్ర సంగ్రామం గలది, యుద్ధంలో పాల్గొన్న 18 అక్షౌహిణుల సైన్యం గలది, మహాభారతం – అందుకే ఆ మహాగ్రంథం 'జయం'.

అలాగే పురాణాలకు కూడా 'జయము' అనే పేరున్నది. అసలు పవిత్రమైన హిందూ గ్రంథాలకు 'జయము' అనే పేరు ఉన్నట్లున్నది. చూడండి.

అష్టాదశ పురాణాని రామస్య చరిత్రం తథా
కార్ష్ణం వేదం పంచమం, యన్మహా భారతం విదుః
తథైవ విష్ణు ధర్మాశ్చ, శివధర్మాశ్చ శాశ్వతాః
జయేతి నామతేషాం, చ ప్రవదంతి మనీషిణః – *భవిష్యత్పురాణం.*

అని అష్టాదశ పురాణాలకు, రామాయణానికి, మహాభారతానికి, విష్ణుపురాణం, శివధర్మ పురాణం, శారీరక సూత్ర భాష్యాలకు జయం అనే పేరు ఉన్నదని తెలుస్తున్నది.

జయం జయత్యనేన సంసారమితి జయో గ్రంథః

ధర్మార్థ కామమోక్ష ప్రతిపాదకమై సంసార జయమునకు అనగా ఈ లోకము నందు విజయము పొందుటకు సాధకములైన గ్రంథాలను జయము అంటారని తెలుస్తున్నది.

పురాణాల ఆవిర్భావం

పురాణాలు ఎలా ఆవిర్భవించాయి అనే విషయాన్ని గురించి ప్రాచీన వాఙ్మయంలో అనేక విషయాలు చెప్పబడ్డాయి. పురాణాల ఆవిర్భావంలో రెండు ధారలు కన్పిస్తాయి. 1. వ్యాసునికి పూర్వపు సంప్రదాయం 2. వ్యాసోత్తర సంప్రదాయం. వ్యాసునికి ముందు 'పురాణం' అనే పదానికి లోకంలో బాగా ప్రచారంలో ఉండి, అవ్యవస్థితంగా ఇక్కడ అక్కడా చెల్లాచెదురుగా ఉన్న లోకవృత్తాత్మకమైన విద్య అని మాత్రమే అర్థం. దీనికి ప్రమాణంగా ప్రాచీన గ్రంథాలలో 'పురాణము' అని ఉన్నదేగానీ, పురాణ సంహిత అని లేక పోవడమే. అంటే దీనివలన ఏదీ గ్రంథంగా గాక విద్యావిశేషమనే దానిని భావించాలి.

పురాణాల తత్వాన్ని గురించి స్కాందపురాణంలోని రేవాఖండంలోను, పద్మ పురాణం (సృష్టిఖండం), మత్స్యపురాణంలోను 'కల్పాంతరంలో పురాణం ఒకటిగానే ఉండేదని, అది త్రివర్ణాలైన ధర్మ అర్థ కామాలకు సాధనంగా ఉండేదని, అది చాలా పెద్దగా శతకోటి శ్లోక విస్తారంగా ఉండేదని, ఆ పురాణం దేవలోకంలో ఉండేదని, కాలాంతరంలో క్షీణబుద్ధు లైన మానవులు దానిని గ్రహించలేనందువలన, శ్రీమహావిష్ణువు మానవుల క్షేమం కోసం దానని నాలుగు లక్షల శ్లోకాలకు వ్యాసునిగా అవతరించి పరిమితం చేశాడని చెప్తున్నాయి. అందువలన మనుష్యలోకంలో పురాణాలు చతుర్లక్ష శ్లోకాలకు పరిమితం అయింది. ఆ చతుర్లక్ష శ్లోకాలనే 18 పురాణాలుగా వేదవ్యాసుడు చేశాడు. అవే ఈనాడు లభ్యం అవు తున్నాయని ఆ పురాణాలు ఘోషిస్తున్నాయి. కొందరు ఇది చతుర్లక్షాత్మకమైన ఒకే పురా ణంగా ఉండేదని దానినే బ్రహ్మాండ పురాణమని పిలిచేవారని అదే 18 విభాగాలుగా చేయబడిందని తెలుపు తున్నారు. ఏదైనా ఈ 18 పురాణాలను వేదవ్యాసుడు రచించాడని ఈ యుగంలో భావించడం సరియైనదే.

ఒకానొక కాలంలో ఒకటే పురాణం ఉండేదా ?

పురాణ వాఙ్మయం విస్తృతంగా పెరిగి నాలుగు లక్షల శ్లోకాల పరిమితికి చేరిన నేడు ఈ విషయాన్ని నిర్ధారించటానికి అంతగా అవకాశంలేదుగానీ పండితులు అనేకులు 'ఆరంభంలో పద్దెనిమిది కాదని తెలుపుతున్నారు. మొదట శ్లోకాత్మకమైన పురాణం ఒకటే ఉన్నట్లు అది క్రమంగా వేదోపబృంహణం చేయటం అనే అంశం ఆధారంగా క్రమంగా

పెరిగినట్లుగా, దాని గ్రంథసంఖ్య మొదట కొద్దిగా ఉండి తరువాత పెరుగుతూ పోయి, వేలువేలు కాలాలలో పెరిగిన కూర్పులు బయలు దేఱినట్లుగా చెప్పటానికి పురాణాలలోనే కొన్ని సూచనలు ఉన్నాయని తెలుపుతున్నారు.

జాక్సన్ అనే ఐరోపీయ పరిశోధకుడు "వైదికయుగం చివరి భాగం నుంచి క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం వరకు ఇతిహాసాలకు అనుబంధంగా పురాణం ఒకటి ఉండి నట్లుగా అందులో సర్గము, ప్రతి సర్గము, వంశము, వంశాను చరితము, మన్వంతరమ అనేవి వర్గీకరింపబడినట్లు హిందువుల వ్రాతలవలననే తెలియవస్తున్నది. స్టీఫెన్ కాలం వఱకు వేలువేలు మఠాలలో వ్రాయబడుతూ వచ్చిన శాక్షన్ వృత్తాంతా (శాక్షన్ క్రానికల్)ల వంటివే ఈ పురాణాలు. నార్మనుల దండయాత్ర తరువాత పరస్పర సంబంధంలేని భాగాలు ఆ వృత్తాంతంలో చేరిపోతూ వచ్చినట్లే హిందూ సామ్రాజ్య కేంద్ర ప్రభుత్వం అంతరించిన పిదప పండిత సమావేశాలు అంతకుపూర్వం కంటే కష్టతరమైనా అప్పటి నుంచి ఆయా పుణ్యక్షేత్రాలలోని పండితులు తమ దగ్గరగల శ్లోకాత్మకమైన మూలపురాణ ప్రతులలో అక్కడక్కడా మార్చటం, కొన్నిచోట్ల స్థానిక విషయాలను చేర్చి గ్రంథాన్ని పెంచడం సంభవించి ఉండాలి. మూల గ్రంథమైన ఆది పురాణం నుంచి ఈ విధంగా బ్రహ్మపురాణం ఒరిస్సాలోను, పద్మపురాణం పుష్కర క్షేత్రంలోను, అగ్నిపురాణం గయలోను, వరాహపురాణం మధురలోను, వామన పురాణం స్థానేశ్వరంలోను, కూర్మపురాణం వారణాసిలోను, మత్స్యపురాణం నర్మదా ప్రాంతంలోను పుట్టాయి" అని వ్రాశాడు.

మూలపురాణంలోని శ్లోకాలు ఎన్ని?

దేశకాలాలను బట్టి పురాణాలు చాలా మార్పులను పొందాయి. ఇప్పుడు స్పష్టంగా ఆ మూల పురాణ రూపాన్ని కనుక్కోలేకపోయినా కొన్ని ఆధారాలనుబట్టి ఒకపాటి నిర్ణయానికి రావచ్చు. భవిష్యత్పురాణంలోని "సర్వాణ్యేవ పురాణాని సంజ్ఞేయాని నరర్షభద్వాదశైవ సహస్రాణి ప్రోక్తానాం మనీషిభిః" అనే శ్లోకంవలన పురాణాలు అన్నీ కలిపి మొదట 12,000 శ్లోకాలకు పరిమితమేనని తెలుస్తున్నది. అలాగే 'పునర్వృద్ధింగతా నీహ ఆఖ్యానైర్వివిధైర్నృప, యథాస్కాందంతథాభేదం భవిష్యం కురునందన" (ఓ రాజోత్తమా పురాణాలు అన్నీ కలిపి మొదట 12,000 గ్రంథంగా ఉండేది. కాల క్రమంలో అనేక వ్యాఖ్యానాలు చేరి అది వృద్ధి చెందింది అని చెప్తూ, ఇంకా స్కాందం శత సహస్రంతు లోకానాం జ్ఞాతమేవహి, భవిష్యమేతదృషిణా లక్షార్థ సంఖ్యయాకృతం' స్కాందం లక్షగ్రంథాల పరిమాణం భవిష్య పురాణం యాభైవేల గ్రంథంగా పెరిగిందని లోకులందరికీ తెలుసు అని తెలుపుతున్నది.

మొదటలో ఉన్న ఆది పురాణం పేరు ఏమిటి?

ఒక్క పురాణం నుంచి పెక్కు పురాణాలు పుట్టాయనటానికి విష్ణుపురాణమే ఒక దృష్టాంతము. విష్ణు పురాణం పురాణాలకే ఆదర్శమైనదని, పురాణాలలో పురాతనమైనదని పరిశోధకుల భావన. కానీ ఈ విష్ణుపురాణం కూడా స్వతంత్రం కాదు, ఒకప్పుడిది బ్రహ్మాండపురాణం అనే సర్వసమగ్ర పురాణం యొక్క భాగంగా ఉండేది. తరువాత కాలంలో దాని నుంచి చీలి, స్వతంత్ర పురాణం అయింది. 16వ శతాబ్దంవాడైన వెన్నెల కంటి సూరన విష్ణుపురాణాన్ని తెలుగులోకి అనువదించాడు. అందులో షష్ఠ్యంతాలైన తరువాత “అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పంబూనిన బ్రహ్మాండపురాణంబు నందలి పరాశరసంహితయైన శ్రీవిష్ణుపురాణంబునకు కథాక్రమంబెట్టిదనిన’ అని చెప్పాడు. ఇంతేకాక ప్రతి ఆశ్వాసం చివర గద్యలోను ఇలాగే వ్రాశాడు. దీనిని బట్టి 16వ శతాబ్దంలోని సంస్కృత విష్ణుపురాణ ప్రతిలో అది బ్రహ్మాండపురాణంలోని పరాశర సంహిత అనబడే భాగమని వ్రాసి ఉండాలని నిశ్చయంగా తెలుసుకొనవచ్చు. అయితే ఎందుకు ఈ విషయం ప్రస్తుత ముద్రిత సంస్కృత విష్ణు పురాణంలో చెప్పబడలేదంటే ఇది స్వతంత్ర పురాణం కాక ఒక మహాపురాణంలోని భాగం అంటే దాని గౌరవం తగ్గిపోతుందనే భయం వలన కావచ్చును. ఇటీవలివారు సంస్కృత లిఖిత ప్రతులు వ్రాసుకొనే సమయంలో ఈ మాటను ఎత్తివేసి ఉండవచ్చు. అయితే కొన్నింటిలో మాత్రం పరాశర సంహిత అని ఉన్నది.

అయితే 11వ శతాబ్దంనాటి ఆల్‌బెరూనీ అనే పండితుడు భారతదేశం వచ్చి మన గ్రంథాలను కొంత పరిశీలించటం జరిగింది. ఆయన ఇచ్చిన పురాణాల పట్టికలో విష్ణుపురాణం, బ్రహ్మాండ పురాణాలు వేర్వేరుగా పేర్కొనబడ్డాయి. అందువలన పదకొండవ శతాబ్దానికి ముందే బ్రహ్మాండపురాణం నుంచి విష్ణుపురాణం విడిపోయిందన్నమాట. భారతదేశంలో వైష్ణవమతం బాగా ప్రచారంలోకి వచ్చిన తరువాత విష్ణుపురాణం బ్రహ్మాండపురాణ భాగమని పేర్కొనడం ఆగిపోయి ఉండవచ్చు.

మొత్తంమీద మొదట బ్రహ్మాండమనే పురాణం ఒకటే ఉండేదని, అది అనేక సంహితలుగా ఉండేదని, విష్ణుపురాణం ఆ సంహితలలో ఒకటని చెప్పవచ్చు.

ఇక వాయుపురాణాన్ని పరిశీలించగా అందరు పండితులు వాయుపురాణాన్ని ప్రాచీన పురాణంగా అంగీకరిస్తున్నారు. ఇది హర్షచరిత్రంలోను, బాణుని కాదంబరిలోను పేర్కొనబడింది. ప్రస్తుతం బ్రహ్మాండపురాణంగా ముద్రితం అయిన గ్రంథంలో దాదాపు రెండువంతులు అంటే పరశురామ సర్గ వృత్తాంతము, లలితోపాఖ్యానం తప్ప మిగిలిన భాగం 78 అధ్యాయాలు, శ్లోకాలతో సహా మారకుండా వాయుపురాణంలో యథాశ్లోకంగా ఉన్నాయి. కాబట్టి వాయుపురాణం అసలు వాయుపురాణం కాదని గయాక్షేత్రమాహాత్మ్యం

కూడా కలిసి ఉన్న బ్రహ్మాండపురాణంలోని ఒక భాగమని భావించవచ్చు. అనగా బ్రహ్మాండపురాణంలోని వాయు సంహితను వాయు పురాణంగా పరివర్ధితం చేసి ఉండ వచ్చని భావించటంలో ఎలాంటి అసంగతము ఉండదు. ఇందుకు బలంగా నారదపురాణంలోని ఒక కథలో దీనికి సూచన ఉన్నది. అందులో "నాలుగు పాదాలతోను బ్రహ్మాండపురాణాన్ని వర్ణించి ఉన్నాను. ఇది పదునెనిమిదవది, అనుపమానమైనది. సారాతీతమైనది. బ్రహ్మాండపురాణం నుండి పారాశర్యమహాముని దీనినే అందరికీ పదెనెనిమిది విధాలుగా చెప్పి ఉన్నాడు. ఆ మహాముని నావలన పురాణాలను విని, మననముచేసికొని ధర్మశీలురును, దీనానుగ్రహకరులైన మునులకు తెలియచెప్పి వానిని లోకమున వ్యాపింపచేసెను. (నారదపురాణం 100-29-35) అని చెప్పబడింది.

దీనినిబట్టి బ్రహ్మాండపురాణమే అన్ని పురాణాలకు మూలాధారమని ఒక పురాణ గాథ ఉన్నట్లు తెలుస్తున్నదిగదా. ఇంకొక ఆధారం మన భారతీయ హిందువులు క్రీ.శ. 5వ శతాబ్దానికంటే ముందే బలిద్వీపానికి వలస పోయారు. వెళ్లేటప్పుడు వారు తమతో తమ గ్రంథాలను కూడా కొన్నింటిని తీసుకొని వెళ్ళారు. అవి ఆ దేశ భాష అయిన 'కవి' భాషలోనికి అనువదించబడ్డాయి. ఆ గ్రంథాలలో సంస్కృతమూలాలతో సహా ఋగ్వ జుస్సామఅథర్వవేదాలు, రామాయణ మహాభారతములు కూడా ఉన్నాయి. పురాణాలలో ఆ బలిద్వీపవాసులు ఒక్క బ్రహ్మాండాన్నే గానీ, మిగిలిన వాటి పేర్లను కూడా ఎరగరు. అంటే మిగిలిన వాటి పేర్లను కూడా తెలియనంతగా ఉన్నారంటే ఆనాటికి ఒక్క పురాణమే ఉండేదని భావించవచ్చుగదా. పైగా బలిద్వీపంలో ఒకతెగ శైవులు ఉన్నారు. వారు బ్రహ్మాండపురాణన్నే తమ పురాణంగా అంగీకరిస్తారు. అందువలన హిందువులు వలస పోయినప్పుడు ఒకటే పురాణం ఉండేదని భావించవచ్చు. అలాగే నేటి బ్రహ్మ పురా ణంలో చాలా భాగాలు మక్కికి మక్కి విష్ణుపురాణంలోని భాగాలే భాగవతంలోని కథలు అన్నీ విష్ణుపురాణాన్ని అనుసరించి వ్రాయబడినవే. అలాగే అనేక పురాణాలలో ఉన్న శ్రాద్ధకల్ప విషయాలు దాదాపు ఏకరీతిగా ఉన్నాయి. అందువలన మొత్తంమీద క్రీస్తుశకం మూడు నాలుగు శతాబ్దాల వరకు పురాణం అనే పేరుతో ఒకే గ్రంథం ఉండేదని, దానికే అప్పుడుకానీ, అటుతరువాత కానీ బ్రహ్మాండపురాణం అనే పేరుండేదని దానిలో పన్నెండు వేల శ్లోకాలకంటే ఎక్కువగా ఉండేవి కావని, ఆ పురాణంలోని భాగాలు క్రమంగా దాని నుంచే వేరుపడి ప్రత్యేక పురాణాలు అయినాయని, ఈ విధంగా తఱిగి పోవటం వలన మూల పురాణం క్రమంగా సన్నగిల్లి, కేవలం పేరుకు మాత్రం మిగిలిందని, మూల పురాణ భాగాలన్నింటిలోకి గొప్పవి, మొట్టమొదట చీలిపోయినవి విష్ణు వాయు పురాణాలు కావచ్చునని, కొంతకాలం వరకు ఏయే భాగాలు ఏయే మూల గ్రంథ భాగాలో తెలుప

బడుతూ ఉండేవని, కాని క్రమంగా మతము మీది అభిమానము ఎక్కువైన కొద్దీ గౌరవ భంగం అని తలచి కావచ్చు మూలగ్రంథపు పేరును జారవిడిచి స్వతంత్రాలైన ప్రత్యేక పురాణాలుగా వాటిని ప్రకటించడం మొదలైందని నిర్ణయించవచ్చు.

పురాణం లౌకిక శాస్త్రం. ఇది వేదం కంటే భిన్నమైనది. కానీ వేదానికి అనుకూల మైనట్టిది. ఇదే వేదోపబృంహణం. ఇది ఎప్పుడూ స్థిర రూపాన్ని కలిగి ఉండదు. ఇది కాలాన్ని అనుసరించి, పరివర్తన శీలకమైనట్టిది. కాల ప్రభావంచేత మార్పులను పొందుతుం టుంది. అందుకే తంత్రవార్తికమనే గ్రంథం వేదం అకృత్రిమమైనదని, పురాణం కృత్రిమ మైనదని చెప్తున్నది. అందుకే నిరుక్తం 'పురాపి నవం భవతి' పాతది అయినా కొత్తగానే ఉంటుంది అని చెప్పింది. అంటే కాలాంతరం ఉత్పన్నమయ్యే మార్పులను పురాణం తనలో లీనం చేసుకొంటుందని దీని భావం.

వేదాలు పురాణాలను గురించి ఏమి అంటున్నాయి?

వైదిక కాలం నుంచి నేటివరకు వేదాలకు పురాణాలకు గల సంబంధం రక రకాలుగా వ్యక్తపరచబడింది. వేద పురాణాలు రెండూ ఒకరకంగా అవినాభావ సంబంధం గలవే, భారతీయతత్త్వం ప్రకారం వేదాలు అపౌరుషేయాలు అంటే మానవులు ఎవరూ వాటిని వ్రాయలేదు. భగవంతుడు వాటిని రచించలేదు. అవి నిత్యాలు, అనాదులు అని భారతీయుల విశ్వాసం. ప్రాచీనులు శబ్దాన్ని ధ్వనిని వేరువేరుగా భావించారు. వేద ధ్వని నిత్యం (వాచా విరూప నిత్యయా – ఋగ్వేదం–8–75–6) అంటే ఉచ్చరించటం చేతనే అది వినపడుతుందని, కానీ వేదశబ్దం నిత్యమని, ఉచ్చరించకపోయినా అది నిలిచే ఉంటుందని వారి విశ్వాసం. ప్రళయ కాలంలో వేదశబ్ద రాశి అంతా భగవంతునిలో నిక్షిప్తం చేయబడుతుంది. సృష్టి జరిగే సమయంలో పరమేశ్వరుని ద్వారానే వేదపురాణాలు వెలువడ్డాయి. వేదాలలోని గూఢమైన అర్థాలను తపస్సుద్వారానే అవగాహన చేసుకొనే వీలుంటుంది. వేదాలు ఈ నిగూఢమైన అర్థాలను గురించే భగవద్గీతలో భగవంతుడు 'వేదాంతకృద్వేద వివేద చాహమ్' (11–15) అని తెలిపాడు. ఈ విధంగా వేదాలలో నిక్షిప్తమైన గూఢార్థాలను గ్రహించటానికి సరళమైన భాష అవసరం. అందుకు పురాణాలు రామాయణ మహాభారతాలు రచింపబడ్డాయి. వేదాలు, పురాణాలు, రామాయణం, భారతం ఇవి అన్నీ కూడా ఒకే ఒక అఖండ ధర్మాన్ని ప్రతిపాదిస్తున్నాయి. ఈ విధంగా వేదాలలో భాగమైన ఉపనిషత్తులలోని నిగూఢతత్త్వం పురాణాలలో విపులంగా విశదంగా చెప్పబడింది.

నారదపురాణం, వేదాలకంటే పురాణాలకు ఉన్నత స్థానాన్ని కల్పిస్తున్నది. వేదాలు సమగ్రంగా పురాణాలలోనే ప్రతిష్ఠితాలుగా ఉన్నాయి అని ఇంకా ('న వేదే గ్రహ సంచారో

నశుద్ధిః కాలబోధినీ' – (నారద పురాణం – 2 – 24 – 19) అంటే వేదాలలో జ్యోతిష్యానికి సంబంధించిన గ్రహ సంచారం, ఇతర వ్యావహారిక విషయాలు ఎక్కడా లేవు అంటుంది. ఒక ఉదాహరణను చూద్దాం. పురాణాలలో చంద్రగ్రహణ సమయంలో రాహువు చంద్రుడిని కబళిస్తాడని పురాణాలు చెప్తున్నాయి. కానీ ఆధునిక విజ్ఞాన శాస్త్రం చంద్రుడు భూమి యొక్క నీడ (ఛాయ)లోనికి ప్రవేశిస్తాడని చెప్తుంది. కాబట్టి పురాణంలో చెప్పబడింది అభూత కల్పన అని భావించటం జరుగుతుంది. చంద్రుడు భూమి యొక్క ఛాయలోనికి ప్రవేశించినప్పుడు ఆ ఛాయలో ఒక చేతన శక్తి ఉంటుందనేది అందరికీ తెలిసిన సత్యమే – ఆ చేతన శక్తే పూర్ణచంద్రుడిని కనపడకుండా చేసి కొంత సమయం పాటు చంద్రుడి తేజం కానరాకుండా చేస్తుంది. అందువలన అది ఆసురీశక్తిగా భావింపబడుతుంది. దీనినే మనం రాహువు రాక్షస శక్తి అని అంటున్నాం. ప్రకృతిలో జరిగే అన్ని సంఘటనల లోను ఈ చేతన శక్తి యొక్క ప్రమేయం పైకి కనిపించకుండానే ఉంటుంది.

దేవీ భాగవతం 'శృతిస్మృతీ, ఉభేనేత్రం పురాణం హృదయం స్మృతమ్ ఏతత్త్రయోక్త ఏవ స్యాద్ధర్మోవా ఉ అన్యత్ర కుత్రచిత్' (11–1–21) అంటుంది. అనగా ధర్మ పురుషుడికి శృతులు, స్మృతులు రెండు కళ్ళైతే పురాణాలు హృదయం అవుతాయి. పురాణాలలో ఆరెం డింటిలో (శృతులు, స్మృతులలో) చెప్పిన ధర్మాలు ఉంటాయి. వేరే ఎక్కడా ఉండవు అంటుంది.

ఋగ్వేదంలో అనేక మంత్రాలలో పురాణ శబ్దం ఉపయోగించబడింది. (ఋగ్వేదం 3–5–4–9, 3–58–6, 10–130–6) కానీ ఆ సందర్భాలలో ఆ పురాణ శబ్దానికి అర్థం కేవలం 'ప్రాచీనమైన'ది అనేదే. అధర్వణ వేదంలో పురాణ శబ్దం రెండు స్థానాలలో ఉపయోగించబడింది. (ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషాసహ, ఉచ్ఛిష్టజ్జజ్ఞిరే సర్వేదివి దేవా దివిశ్రితాః–11–7–24, తమితిహాసశ్చపురాణంచ –15–6–11) దీనివలన అధర్వవేద కాలానికి పురాణాలు రూపాన్ని సంతరించుకొన్నాయని నిశ్చయంగా చెప్పవచ్చు. కాబట్టి పురాణం నిగమ ఆగమాలనే మూలంగా గ్రహించినదనే విషయం స్పష్టం. ఇప్పుడు మనం సనాతన ధర్మం అని పిలుస్తున్నది వ్యవహారతయా పురాణ ప్రధానమే. ఇందులో సందేహం లేదు. వైదిక వాఙ్మయంలో సంహితలు మాత్రమే కాకుండా బ్రాహ్మణకాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు కూడా భాగాలే – వీటిలో పురాణాలను స్పష్టంగా విపులంగా పేర్కొనటం జరిగింది. శతపథ బ్రాహ్మణం అనేది యజుర్వేదంలోని ఒక భాగం. అందులో పురాణం యొక్క పుట్టుకే విశేషమైన గాథగా చెప్పబడింది. (మధ్వా హృత యోహవా ఏ ఇతా దేవానాం యదనుశాసనాని విద్యావాకో వాక్యమితిహాస పురాణం గాథా నారాశంస్య (శ.బ్రా. 11–5–6–8) ఇక్కడ 'ఇతిహాస పురాణమ్' అనేవి కలిసిపోయిన రూపంలో ఒక సమస్త పదం ద్వారా నిర్దేశింపబడింది. అయితే అధర్వణ వేదంలోని గోపథ బ్రాహ్మణంలో

(ఏవమిమే సర్వే వేదా నిర్మితాః ససంకల్పాః సరహస్యాః సబ్రహ్మణాః సోపనిషత్కాః సేతిహాసాః సాన్వాఖ్యానాః సపురాణాః (గో. బ్రా 1-2-10) అని పురాణము ఇతిహాసములను వేరువేరుగా పేర్కొని ఆరెండింటి విభిన్నతను తెలుపుతున్నది.

ఆరణ్యకాలు, ఉపనిషత్తులు బ్రాహ్మణక సాహిత్యం యొక్క అంతిమ స్వరూపాలు. బ్రాహ్మణక గ్రంథాల పరివర్ధితరూపాలుగా ఆరణ్యకాలు, ఉపనిషత్తులు విలసిల్లుతున్నాయి. వీటిల్లో పురాణ ప్రసక్తి అనేక మార్లు కనిపిస్తుంది. తైత్తిరీయ ఆరణ్యకంలో పురాణ శబ్దం కనిపిస్తున్నది. అందులో 'పురాణాని' అనే బహువచన రూపము (బ్రహ్మ యజ్ఞ ప్రకరణేయద్ బ్రాహ్మణానీతిహాసాన్ పురాణాని కల్పాన్ గాథా నారాశంసీ భేదాహృతయో దేవానామ భవన్ (తై.ఆ. 2-9) అని కనిపిస్తుంది. దీనితో ముందు చెప్పబడిన 'ఆఖ్యానాల బహుత్వం తెలుస్తుంది. అలాగే బృహదారణ్య కోపనిషత్ పురాణాన్ని వేదంతో సమానంగా (అస్య మహతో భూతస్యనిశ్వసిత మేతద్ యద్ ఋగ్వేదో యజుర్వేదః సామవేదో అథర్వాఙ్గిరస ఇతిహాసః పురాణమ్' (బృ. ఉ. 2-4-10) పరిగణిస్తున్నది. అంటే ఇతిహాస పురాణాలు మహాభూతేశ్వరుడైన పరమేశ్వరుని శ్వాస రూపాలని తెలుపుతున్నది. అలాగే ఛాందోగ్యోప నిషత్తులో (అధర్వణ చతుర్థామితిహాసపురాణం పఞ్చమం వేదానాం వేదమ్ - ఛా.ఉ. 7-1-1) సనత్కుమారుని వద్ద బ్రహ్మ విద్యను నేర్చుకొనే సమయంలో నారదుడు తాను క్షుణ్ణంగా నేర్చుకొన్న విద్యలలో వేదాలతోపాటుగా ఇతిహాస పురాణాలను కూడా నేర్చుకొన్నానని స్పష్టంగా పేర్కొన్నాడు. ఇక్కడ ఉపయోగించిన పఞ్చమం అనే పదం పురాణాలను పంచమ వేదాలుగా భావించబడుతుండేదని చెప్పటానికి స్పష్టమైన ఉదాహరణ. పంచమ వేదమనే భావనలో స్థిరపడిన పురాణ విద్య వేదాలతో సమానంగా అతిప్రాచీన కాలం నుంచే భావించబడేదనే విషయం నిశ్చితం. అందువలన ఇతిహాస పురాణాలు పంచమ వేదాలుగా ప్రసిద్ధి చెందాయి.

పురాణాలు - వేదోప బృంహణము

పురాణాలన్నీ వేదాలకు ఉపబృంహకాలే. ఉపబృంహకం అంటే ఏమిటి ? ఏ విషయం వేదంలో సూచింపబడిందో లేక సంక్షేపంగా చెప్పబడిందో ఆ విషయాన్ని విస్తారంగా నిరూపణగా వివరించటమే ఉపబృంహకత. పురాణాలు వేదాల ప్రామాణిక తలను అన్నిటికంటె ఎక్కువగా వివరిస్తున్నాయి. మహాభారతం కూడా ఇదే విషయాన్ని పురాణ రూపంలోని పూర్ణ చంద్రుడు శృతి (వేదం) అనే వెన్నెలను కాస్తాడు అని ధృవీకరిస్తున్నది. కూర్మ (1-2-19) వాయు (1-201) పద్మ (5-2-51-52) బ్రహ్మాండ (1-1-1-27) మొదలైన పురాణాలు ఇదే విషయాన్ని నొక్కి చెప్తున్నాయి. ఉపబృంహణ

పదంలోని 'బృహి' లేక 'బృహ్' అనే ధాతువుకు వర్ధనము, పెంచు అని అర్థం. అంటే వేదంలోని మంత్రాల ద్వారా ప్రతిపాదించబడిన అర్థం, సిద్ధాంతం లేక కథానకాలను విస్తరించి, వాటిని పోషించ టమే పురాణాల ద్వారా చేయబడిన వర్ధనం. దీని వలన సమస్త పురాణాలు భారతాది ఇతిహాసాలు ఏదో ఒక రూపంలో వేదార్థాన్ని ఉపబృంహణం చేస్తున్నాయి అని తెలుస్తుంది.

వేదాలను అధ్యయనం చేసేవారు వానిని సాంగోపాంగంగా అర్థాన్ని కూడా తెలుసుకోవాలని మనువు చెప్పాడు. వాయు పురాణం నాలుగు వేదాలను, వాని అంగాలైన ఆరు శాస్త్రాలను, ఉపనిషత్తులను అధ్యయనం చేసిన వ్యక్తి అయినా, పురాణాలను కూడా అతడు క్షుణ్ణంగా అధ్యయనం చేస్తేనే విచక్షణుడు కాగలడుకానీ లేకపోతే ఆ వేదాధ్యయనం విచక్షణారహితం అవుతుందని ఘోషిస్తున్నది. ఉదాహరణకు ఉపనిషత్తులలో ఒకే బ్రహ్మ చేసిన ఆకాశం యొక్క సృష్టిని గురించి కేవలం అతి సంక్షేపంగా సంకేతంగా మాత్రం (తైత్తిరీయ ఉపనిషత్తు-2-1) ఉన్నది. ఇదే విషయం అగ్ని (ఛాందోగ్యోపనిషత్తు 6-23) నీరు (ఛాందోగ్యోపనిషత్తు 6-2-4)ల సృష్టి విషయంలో కూడా ఇలాగే సూచనగా ఉండగా, పురాణాలలో దీనినే విస్తరించి ఈ తత్త్వాల ఉత్పత్తి, నాశనముల వివరణ (వాయు 4-2) ((బ్రహ్మ (2-3)) బ్రహ్మాండ 2-36) కూర్మ (1-2,4,7,8) పురాణాలలో సంపూర్తిగా ఇవ్వ బడింది. ఐతరేయ బ్రాహ్మణంలోను కఠోపనిషత్తులోను చెప్పబడిన హరిశ్చంద్ర నచికేత కథలు బ్రహ్మపురాణం (104వ 105వ అధ్యాయం) భారత సభాపర్వం (అధ్యాయం 12) అనుశాసన పర్వం (అధ్యాయం 91)లలో పర్యాప్త విస్తారంగా వివరించటం జరిగింది. ఋగ్వేదంలోని ఋచవృత్తాంతం పురూరవ ఊర్వశీ వృత్తాంతాలు విష్ణు పురాణం (4-6-64)లో విపులంగా చెప్పబడ్డాయి.

పురాణాలలో వేదార్థ ఉప బృంహణం నాలుగు రకాలుగా జరిగింది.

1. వైదిక మంత్రాలలోని విశిష్ట పదాలకు అర్థాలు వివరించటం.
2. వైదిక మంత్రాలను వ్యాఖ్యానించటం
3. వైదిక ఆఖ్యానాల (కథల)ను విస్తరించటం
4. వైదిక ప్రతీకలను వ్యాఖ్యానించటం.

ఈ విధంగా పురాణాలు వేదార్థాన్ని అనేక విధాలుగా ఉపబృంహణం చేయటం జరుగుతున్నది. అందుకే గోస్వామి అనే పండితుడు పురాణ పదానికి 'పూరణాత్ పురాణమ్' అని వ్యుత్పత్తిని చెప్పటం చాలా సమంజసంగా ఉన్నది. వేదార్థాన్ని పూర్తి చేసేదే పురాణమని దీని అర్థం.

వ్యాసపరంపర

కృష్ణ ద్వైపాయనుడనే వ్యాస భగవానుడు పురాణ సంహితను కూర్చి పురాణాలను సువ్యవస్థిత రూపంలో ప్రతిష్ఠింప చేయటంలో పురాణ వికాసంలో కొత్త యుగం ప్రారంభం అయింది. పురాణాలలో చెప్పబడిన విషయాల ప్రకారం వ్యాసుడు విష్ణువు యొక్క అపరాంశ సంభూతుడు కాబట్టి ఆయనకు కృష్ణద్వైపాయనుడు అనే పేరు కూడా ఉన్నది. అయితే వాయుపురాణం వ్యాసుడిని బ్రహ్మ అవతారం అని చెప్తుంటే, కూర్మ పురాణం శివుని అవతారం అని ప్రకటిస్తున్నది. ద్వైపాయనుడు అనే పేరు ఆయన యమునా నది యొక్క ఒక సైకత ద్వీపంలో పుట్టినందువలన ఏర్పడింది. కృష్ణుడు అనే పేరు ఆయన శరీర వర్ణం నల్లగా ఉన్నందువలన ఏర్పడింది. ఆయన తల్లి సత్యవతి, తండ్రి పరాశర మహాముని. ఆయన వేదాలను నాలుగు భాగాలుగా విభజించి వాటికి ఒక సువ్యస్థను ఏర్పాటు చేసిన వాడు. అందుకే ఆయనకు వేదవ్యాసుడని పేరు వచ్చింది. వేదవ్యాసుడు నాలుగు వేదాలను పైల, వైశంపాయన, జైమిని, సుమంతులనే నలుగురు శిష్యులకు బోధించాడు. వీళ్ల నలుగురు అనగా – పైలుడు ఋగ్వేదాన్ని, వైశంపాయనుడు యజుర్వేదాన్ని, జైమిని సామవేదాన్ని, సుమంతుడు అధర్వణ వేదాన్ని అభ్యసించి వేద పారంగతులైనారు. ఆయనకు అయిదవ శిష్యుడు కూడా ఉన్నాడు. అతడే సూతుడైన రోమహర్షణుడు. వేదవ్యాసుడు ఆ సూత రోమహర్షణునికి ఇతిహాస పురాణాలను బోధించాడు. సూతుని పుత్రుడు సౌతి. పద్మ పురాణం ఈ సౌతి పేరు ఉగ్రశ్రవుడని చెప్తున్నది. ఈయనే నైమిశారణ్యంలో శౌనకాది మహామునులకు మహాభారతాన్ని వినిపించాడు. ధర్మానికి హాని కలిగినప్పుడు, మానవ క్షేమానికి వ్యాసుడు అవతారం ఎత్తుతాడని పలువురు ధర్మరక్షకుల విశ్వాసం.

మన పద్దెనిమిది పురాణాలను వ్యాసుడే వ్రాశాడు (కూర్చాడు) అని భారతీయుల విశ్వాసం. కొందరు పండితులు కొన్ని శాస్త్రీయ ప్రమాణాలను ఆధారంగా తీసుకొని ఈ పద్దెనిమిది పురాణాలను అనేకులు ఋషులు, మునులు కలసి రచించారని తెలుపుతున్నారు. మేధాతిధి అనే మనుధర్మశాస్త్ర వ్యాఖ్యానకర్త ఉద్దేశ్యంలో 'పురాణాని వ్యాసాది ప్రణీతాని' (మను–3–222) అన్నదానిలో ఆదిపదాన్ని అనుసరించి పురాణాలు కేవలం వ్యాసుడు మాత్రమే రచించినవి కాదని ఋషులు మునుల రచనా భాగస్వామ్యం వాటిల్లో ఉన్నదని అభిప్రాయ పడ్డాడు. ఇలాగే మార్కండేయ పురాణంలో కూడా 'బహులాఃపరమర్షయః' అని చెప్పిన విషయం కూడా ఆలోచించవలసినదే. బ్రహ్మముఖం నుంచి పురాణం (ఇక్కడ ఏకవచనం – ప్రత్యేకంగా గమనించాలి) వెలువడింది. ఆ తరువాత ఎందరో బ్రహ్మర్షులు పురాణ సంహితను కూర్చారు. అంటే బ్రహ్మముఖం నుంచి పురాణం విద్యారూపంలో వెలువడగా తరువాత మహర్షులు పురాణాలన్నీ గ్రంథరూపంలో సమకూర్చారన్నమాట.

కూర్మపురాణం కూడా 'వ్యాసాద్యైః' అని వ్యాసుడు మొదలైనవారు అని చెప్తున్నది. అంటే వేదవ్యాసుడు రెండు సంహితలను సమకూర్చాడన్నమాట మొదటిది ఇతిహాస విషయకమైన జయసంహిత (ఇది మహాభారత సంహితకు మూలరూపం) రెండవది పురాణ విషయక పురాణ సంహిత. తరువాత ఆయన శిష్యుడైన రో (లో) మహర్షణుడు, ఆయన ముగ్గురు శిష్యులు – అకృతవ్రణ, సావర్ణి, శాంశపాయనులు మొత్తం నాలుగు పురాణ సంహితలను విస్తరించగా మొత్తం పద్దెనిమిది పురాణాలుగా క్రమపరిణామం చెందాయి. ఇందులో మూల కృషి వేద వ్యాసునిదే. పురాణ సంహితలను పద్దెనిమిదిగా విస్తరింపచేయటం ఆయన కృషి ఫలితమే. అందువలనే వేదవ్యాసుడే పద్దెనిమిది పురాణాల కర్త అని చెప్ప బడుతున్నది. బ్రహ్మాండ పురాణంలో "బృహస్పతిశ్చ శుక్రశ్చ వ్యాసః సారస్వతస్తథా, వ్యాసాః శాస్త్ర ప్రణయన వేదవ్యాస ఇతి స్మృతః"అని చెప్పటం కూడా ఈ విషయాన్ని బలపరుస్తుంది.

వ్యాసుడు యజ్ఞకర్మల నిష్పాదనం కోసం నాలుగు సంహితలుగా విభజించినప్పుడే పురాణ సంహితను ఏర్పాటు చేశాడని చెప్పబడింది. దానిని నలుగురు విశిష్ట శిష్యులకు బోధించి, వారిచే వాటిని అధ్యయనం చేయించి ప్రచార బాధ్యతను నిర్దిష్ట పరిచాడు. రోమహర్షణుడు కూడా వ్యాసుడు తనతో చర్చించిన పురాణ సంహితపై ఆధారపడిన తన పురాణ సంహితను ఏర్పరచుకొని ఈ సంహితను తన ఆరుగురు శిష్యులకు బోధించాడు. ఈ శిష్యుల పేర్లు మనకు వాయు పురాణం నుంచి తెలుస్తున్నాయి. ప్రాచీనకాలంలో వ్యక్తుల పేర్లు, వారి స్వంత నామాలతో పాటు గోత్రకర్తల పేర్లు కూడా జోడింపబడి ఉండేవి. అందుకే ఈ ఆరుగురి పేర్లు వాయు పురాణంలో రెండు విధాలుగా కనిపిస్తున్నాయి. ఒకటి వారి వైయక్తిక నామం రెండవది గోత్రజనామం. ఈ క్రమం ఇలా ఉంటుంది.

కృష్ణద్వైపాయన వ్యాసుడు
(కలియుగంలో పురాణ సంహితను మొదటగా కూర్చిన మహర్షి)

రోమహర్షణ సూతుడు
(వ్యాసుని నుంచి పురాణ సంహిత మొదట గ్రహించిన ముని)

1. సుమతిఆత్రేయుడు 2. ఆకృతివ్రణకాశ్యప 3. అగ్నివర్చాభారద్వాజ

4. మిత్రాయువాశిష్ఠ 5. సోమదత్తసాకర్ణ 6. సుశర్మాశాంశపాయన


(విష్ణుపురాణం)

ఈ ఆరుగురు శిష్యులలో ముగ్గురు ఆకృతివ్రణ కాశ్యపుడు, సోమదత్త సావర్ణి, సుశర్మాశాంశపాయనులు తాము మరల కొత్త పురాణ సంహితను తయారుచేసుకొన్నారు. ఈ విధంగా మొత్తం నాలుగు పురాణసంహితలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ నాలుగు సంహితలు వేరువేరుగా భావించకూడదు. అవి అన్నీ ఒక అర్థాన్ని లేక భావాన్ని తెలియ జేసేవే. కేవలం కొన్ని సందర్భాలలో పాఠాంతరాలు మాత్రమే కనిపిస్తాయి. ప్రస్తుతం లభ్యం అవుతున్న పురాణాలలో ఒక్క విష్ణుపురాణమే పరాశరమహాముని కృతంగా కనిపిస్తుంది. మిగిలిన అన్ని పురాణాలు వ్యాసుడు రచించినట్లే తెలుస్తున్నది. అయితే శ్రీకృష్ణ భగవానుడి మంగళ చరిత్రగల శ్రీమద్భాగవతం మాత్రం వ్యాసుని కుమారుడైన శుకమహర్షిచేత మొదటగా ప్రవచనం చేయబడింది. ఇదే పరంపరగా ఇప్పటి వరకు కొనసాగుతున్నది.

పురాణ సాహిత్య పరంపర వ్యాసుని పారివారిక పరంపర ఈ విధంగా ఉంటుంది.

వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమకల్మషం
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్

వ్యాసుడు వశిష్ఠునికి ప్రపౌత్రుడు, శక్తికి పౌత్రుడు, పరాశరుని పుత్రుడు, శుకునికి తండ్రి. అప్పుడు వారి వంశ క్రమం ఇది.



ఇది ఇప్పటి వ్యాసుని వంశక్రమం. వ్యాసుడు అనేది ఒక వ్యక్తిపేరు కాదు అది ఒక పదవి. ఈ విషయాన్ని దేవీభాగవతం స్పష్టంగా పేర్కొంది. అతడు ప్రతి ద్వాపర యుగములోను ప్రభవిస్తాడు. ప్రపంచ క్షేమంకోసం ఒక వేదాన్ని నాలుగు వేదాలుగా, ఒక పురాణ సంహితను 18 పురాణాలుగా (వ్యాసిస్తాడు) విభజిస్తాడు. వేదాలను విభజించిన కారణంగా ఆయన వేదవ్యాసుడు అని పిలువడతాడు.

పురాణాల సంఖ్య

అష్టాదశ సంఖ్య ప్రత్యేకత. ప్రాచీనకాలంలో భారతదేశంలో ముఖ్యంగా సంస్కృత

వాఙ్మయంలో 18 సంఖ్యకు చాలా ప్రత్యేకత ఉన్నది. పద్దెనిమిది సంఖ్యను పవిత్రమైనదిగా భావించేవారు. అందుచేత కూడా దీనికి విస్తృత ప్రాచుర్యం వచ్చింది. పంచమ వేదంగా భావించే వ్యాసమహాభారతంలో ప్రధాన పర్వాల సంఖ్య 18. అందులో శ్రీ కృష్ణపరమాత్ముడు ప్రవచించిన భగవద్గీతలో అధ్యాయాల సంఖ్య 18. పాండవ కౌరవ పక్షాల మొత్తం సైన్యం సంఖ్య 18 అక్షౌహిణులు. కురు పాండవ యుద్ధం జరిగిన రోజుల సంఖ్య 18. అలాగే మహాభాగవతంలోని శ్లోకాల సంఖ్య 18 వేలు. అలాగే మహా పురాణాల సంఖ్య 18. ఉప పురాణాల సంఖ్య 18. ఔపపురాణాల సంఖ్య 18. ఏయే పురాణాలు మహా పురాణాలు అనే దాంట్లో కొద్దిపాటి మతభేదం ఉన్నా పురాణాల సంఖ్య మాత్రం 18 అని ఏకగ్రీవంగా అందరూ అంగీకరించే విషయమే. ఈ 18 సంఖ్య ఏదో కారణం లేకుండా నిర్హేతుకంగా పెట్టింది కాదని అది సహేతుకమేనని సాభిప్రాయమని పండితుల భావన.

వ్యాసులు

అష్టాదశ పురాణాలను వ్యాసుడు రచించాడని చెప్పబడుతున్నది. వ్యాసుడు ఒక వ్యక్తి కాదు అనేకులని కొందరి అభిప్రాయం. కొందరు ఇంద్రుడు మొదలైన శబ్దాలలాగానే వ్యాస శబ్దం కూడా బిరుదవాచకం. కృత, త్రేతా, ద్వాపర, కలి యుగాలు నాలుగు కలసి ఒక మహాయుగం అని పిలువబడుతుంది. వీనిలో

యుగ గణనం

		దేవవర్షము	మానుషవర్షములు
1.	కృతయుగం	4800	17,28,000
2.	త్రేతాయుగం	3600	12,96,000
3.	ద్వాపరయుగం	2400	8,64,000
4.	కలియుగం	1200	4,32,000
	మొత్తం	**12,000**	**43,20,00**

ఈ మహాయుగాలలో ప్రతి ద్వాపరయుగాంతంలోను ఒక్కొక్క తపోనిధి వేద విభాగం, అష్టాదశ పురాణ రచనము, అష్టాదశ విద్యా వ్యాపనము చేసి 'వ్యాసుడు' అనే బిరుదు పొందుతాడు అని చెప్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న వైవస్వత మన్వంతరంలో ఇప్పటికి ఇరవై ఎనిమిది ద్వాపర యుగాలు గడచిపోయాయి. ఆయుగాలలో అవతారం దాల్చిన వ్యాసులు వీరు. 1. బ్రహ్మ 2. ప్రజాపతి (మనువు) 3. ఉశనుడు 4. బృహస్పతి 5. సలిత 6. మాత్యువు 7. ఇంద్రుడు 8. వశిష్ఠుడు 9. సారస్వతుడు 10. త్రిధాముడు 11. త్రివృషుడు 12. భరద్వాజుడు 13. అంతరిక్షుడు 14. ధర్ముడు 15. త్రయ్యారుణి

16. ధనంజయుడు 17. మేధాతిథి 18. వ్రతి 19. అత్రి 20. గౌతముడు 21. ఉత్తముడు (హర్యాత్మ) 22. వేనుడు (వాజిశ్రవుడు) 23. సోముడు (ఆముష్యాయణుడు) 24. తృణ బిందువు 25. భార్గవుడు 26. శక్తి 27. పరాశరుడు 28. కృష్ణ ద్వైపాయనుడు.

రాబోయే ద్వాపరయుగంలో అశ్వత్థామ వ్యాసుడు కాగలడు. పై 27 వ్యాసుల పేర్లలో కొన్ని పురాణాలలో తేడా కనిపిస్తున్నది. వ్యాసనామాలలో కూర్మపురాణంలో కూడా కొంత భేదం కనిపిస్తుంది. అవి కల్పభేదాన్ని బట్టి ఏర్పడినవేనని భావించాలి.

పురాణము, వ్యాసుడు, సూతుల స్థానం

పురాణ పరిశోధన చేసిన కొందరు విద్వాంసులు ప్రాచీన కాలంలో పురాణానికి సంబంధించిన రెండు విధాన పరంపరలు ఉండేవని భావిస్తున్నారు. 1. సూతపరంపర 2. వ్యాస పరంపర. ఈ రెండు విధాన పరంపరలను గురించి తెలుసుకొనేముందు సూతుడు ఎవరు ? వ్యాసుడు ఎవరు అనే విషయం మనం తెలుసుకోవటం అవసరం. మహాభారతంలోనూ పురాణాలలోను సూతుని వ్యక్తిత్వం ఒక ప్రహేళిక (చిక్కు ప్రశ్న) లాంటిది. సూతుడిని రోమహర్షణుడు లేక లోమ హర్షణుడంటారు. అంటే తన వాక్పటిమ చేత శ్రోతల రోమాలు నిక్కపొడుచుకొనేటట్లు చేసేవాడు అని దాని అర్థం. (లోమాని హర్షయాఞ్చక్రేశ్రోత్వంణాంయత్ సుభాషితైః, కర్మణా ప్రథితస్తేన లోకే ఉ_స్మిం ల్లోమహర్షణః (వా.పు 1-16) కూర్మపురాణం కూడా 'తస్యతే సర్వరోమాణి వచసా హర్షితాని యత్, ద్వైపాయనస్య భగవాంస్తతో వే రోమహర్షణః (కూ.పు. 1-1-4) అని చెప్తుండగా స్కాంద పురాణం ప్రభాసఖండంలో (1-6) పురాణంలో భగవంతుని విషయాలను గురించి వ్యాసుడు వివరిస్తున్నప్పుడు స్వయంగా సూతుని వెంట్రుకలే నిక్కపొడుచుకొనేవి కాబట్టి, ఆయనకు సూతుడనే పేరు వచ్చిందని తెలుపుతున్నది. కూర్మపురాణం ఈ రెండు జరుగుతాయి కాబట్టి ఆయనకు రోమహర్షణుడనే పేరు వచ్చిందని తెలుపుతున్నది. సూతుడు అంటే రథసారథి అని అర్థం. ప్రతిలోమ వివాహం వలన జన్మించినవాడని ఇంకొక అర్థం. ప్రతిలోమ వివాహం అంటే ఎక్కువ కులపు స్త్రీని తక్కువ కులానికి చెందిన పురుషుడు వివాహమాడటం. బ్రాహ్మణ స్త్రీకి క్షత్రియ పురుషుని యందు జన్మించిన వ్యక్తి సూతుడు అనబడతాడు. 'సూతులు' అనే ప్రతిలోమజాతి గౌతమ ధర్మ సూత్రాలలో పేర్కొనబడింది. అయితే పురాణాలలో వర్ణించిన సూతుడు ఈ రకం పుట్టుకగల వ్యక్తి కాదు. అంటే ఆయన ప్రతిలోమ జాతికి చెందినవాడు కాదు. బ్రాహ్మణ క్షత్రియ జాతుల కంటె భిన్నుడు. పౌరాణిక సూతుడు గొప్ప లేక తక్కువ స్థాయికి చెందిన మునిగా కనిపిస్తున్నాడు. అతడు అర్థ దైవీశక్తి గల వ్యక్తిగా గౌరవింపబడతాడు.

వాయు, బ్రహ్మాండ, విష్ణుపురాణాలు – పితామహుడు బ్రహ్మచేస్తున్న యజ్ఞంలో సోమరసాన్ని తీసే రోజున విష్ణ్వంశతో సూతుడు అవతరించాడని చెప్తున్నాయి. కూర్మ పురాణం (1–1–6) కూడా ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నది. సూతులు రెండు రకాల వారు ఉన్నారు. ఒకరు సంకరజాతివారు, రెండవరకం పురాణ ప్రవక్తలు. పురాణ ప్రవక్తలైన సూతులు బ్రాహ్మణ జాతికి చెందినవారు.

కూర్మ పురాణం ప్రారంభంలోనే (1–11–3–6) ఇతిహాస పురాణాల అధ్యయనం కోసం సూతుడు వ్యాసుని శిష్యరికం చేశాడని, స్వాయంభువ మనువు చేసిన యజ్ఞంలో 'సుత్యాహ దినం' నాడు ఈయన ఉత్పత్తి జరిగిందని చెప్పబడింది. ఇంతేకాకుండా అదే కూర్మపురాణంలో (1–13–12–17) వేన పుత్రుడు పృథువుచేత చేయబడిన పైతా మహయజ్ఞంలో స్వయంగా శ్రీమహావిష్ణువు పౌరాణిక సూతుడుగా సోమరసాన్ని ఆహుతి ఇచ్చే సమయంలో జన్మించాడని చెప్పబడింది. ఆహుతి ఇచ్చే సమయంలో దేవ గురువు బృహస్పతికి ఇవ్వవలసిన ఆహుతి దేవరాజైన ఇంద్రునికి, ఇంద్రునికి ఇవ్వవలసినది బృహస్పతికి ఇవ్వబడింది. ఈ ఆహుతి ఇచ్చే సమయంలో ఉచ్చరించిన మంత్రాలలో వర్ణ విపర్యయం అంటే అక్షరాలు పలకటంలో తారుమారు జరిగింది. దీన్నే వర్ణసంకరం అంటారు. వర్ణము అంటే అక్షరము అని కూడా అర్థం ఉన్నది కదా. అంటే ధర్మ శాస్త్రాలలో బ్రాహ్మణ స్త్రీకి క్షత్రియ వీర్యం వలన పుట్టిన వ్యక్తి అని పిలువబడ్డాడు అనీ, అదేవిధంగా ఇక్కడ సూతునికి కూడా వర్ణ విపర్యయం జరిగింది. ఇతడికి కేవలం పురాణ ప్రవచనం చేసే అధికారం ఇవ్వబడింది. వేదాధ్యయనం చేసే అధికారం అయితే లేదు. వాయు పురాణం మొదలైన ఇతర పురాణాలలోలేని ఈ విశేషం ఒక్క కూర్మ పురాణంలోనే స్పష్టంగా సూతులకు వేదాధ్యయనాధికారం లేదని చెప్పబడింది.

సూతుల యొక్క వృత్తేమిటి ?

దేవతలు, మునులు, రాజుల వంశాల మీద దృష్టినిలిపి, వారిని సచేతనులుగా ఉంచటం అంటే సత్కార్యాలయెడ, ధర్మంపట్ల ప్రజలను అనురక్తులను చేసి సమాజాన్ని చైతన్యశీలంగా ఉంచటం. సూతులకు వృత్తి అని చెప్పబడుతున్నది. ఇందుకు వారికి ఆధారాలు ఏమిటంటే అప్పటివరకు ఇతిహాస పురాణాలలో చెప్పబడిన ఆయా దేవతల, మునుల, రాజుల వంశాను చరిత్రలే. వీరు కాకుండా ఉన్న ఇంకొక సూతశాఖవారు క్షత్రియ ధర్మాన్ని అవలంబించటం లేకపోతే కనీసం రథాలను తోలి ఏనుగులు, గుఱ్ఱాలకు చికిత్స చేస్తూ తమ పొట్టపోసుకుంటారు. దీనికి ఉదాహరణగా మనం మహాభారతంలో కర్ణుని పెంచిన తండ్రి యొక్క చరిత్రను తీసుకొనవచ్చు. ఆయా సందర్భాలలో తగినట్లుగా

పురాణ ఇతిహాసాలలో సూతుల పుట్టుకతో పాటు మాగధుల (రాజాస్థానాల్లో రాజును స్తుతించటం రాజు రాకను తెలియజేయటం మొదలైన పనులు చేసేవారు) జన్మ వృత్తాంతం కూడా చెప్పబడింది. దాని ప్రకారం పృథువేనుడిని స్తుతించటానికి, ఈ సూతులే నియమింప బడ్డారని చెప్పబడింది. సూతుల ఈ జన్మ వృత్తాంతం విష్ణుపురాణం, బ్రహ్మాండపురాణము, వాయుపురాణాలలో కాస్త విస్తృతంగానే కనిపిస్తున్నది.

మార్కండేయ పురాణంలోని ఆరవ అధ్యాయంలో శ్రీకృష్ణుని అన్న బలరాముడు ఒక సూతుని వధించగా అందువలన కలిగిన బ్రహ్మహత్యాపాతకానికి ప్రాయశ్చిత్తంగా బలరాముడు తీర్థ యాత్రలు చేసినట్లు చెప్పబడింది. దీనిని బట్టి కూడా పౌరాణిక సూతులు బ్రాహ్మణులని తెలుపుతున్నది. కూర్మ పురాణం కూడా (1-23-15) సూతుని నోటి ద్వారా స్వయంగా తన కులానికి చెందినవారు వేద వర్జితులని చెప్పినట్లుగా వివరిస్తున్నది. శౌనకాది మహామునులు సూతుని నుంచే పురాణ విద్యను గ్రహించారు. సూతుల దైవిక ఉత్పత్తిని ఎవరూ సరైందిగా స్వీకరించకపోయినా అతి ప్రాచీన కాలంలోనే ఎటువంటి కించపడకుండా బ్రాహ్మణులు సూతుని నుంచే గాథలు, ఆఖ్యానాలు మొదలుగా గల పురాణ విద్యను గ్రహించారనేది సత్యం. ఇదే పరంపరగా ఉపనిషత్తులలో కూడా మనకు కని పిస్తుంది. ఆయా ఉపనిషత్ గాథల్లో బ్రాహ్మణులు కేవలం క్షత్రియుల నుంచే కాదు శూద్రుల నుంచి కూడా ఎటువంటి శంక సంకోచాలు లేకుండా విద్యను గ్రహించే వారు అంటే జ్ఞాన ప్రాప్తిని పొందేవారన్నమాట. రైక్వ, జానశ్రుతి, సత్యకామ, జాబాలి ఇంకా ఇతరుల గురించి ఐతరేయము మొదలైన గ్రంథాలలోని గాథలు ఈ విషయాన్ని నిరూపిస్తాయి.

రెండు ప్రాచీన వాఙ్మయాల ప్రవాహాలు

అతి ప్రాచీన కాలం నుంచి మనకు బ్రహ్మ నుంచి ఆవిర్భవించిన వాఙ్మయ ప్రవాహాలు పరస్పర ఉపకారకాలుగా ఉండి, రెండు మార్గాలలో ప్రవహిస్తున్నాయి. వాటిలో మొదటిది వేదవాఙ్మయ ప్రవాహము. రెండవది పురాణవాఙ్మయ ప్రవాహము. వేదవాఙ్మయ ప్రవాహం కర్మ ప్రధానమైనది. పురాణ వాఙ్మయ ప్రవాహం కర్తృ ప్రధానమైనది. మొదటిదైన వేద వాఙ్మయ ప్రవాహాన్ని మునులు స్వీకరించి ప్రచారం చేశారు. అందుచేత ఈ రెండు సమాన ప్రమాణ్యంగలవే. కృష్ణద్వైపాయన వ్యాసుడు ఒకటే వేదంగా ఉన్నదానిని నాలుగుగా విభజించాడు. అలాగే ఒకటే పురాణ సంహితను అష్టాదశ పురాణాలుగా విభజించాడు. విభజించినవాడు కాబట్టి ఆయన వ్యాసుడైనాడు. ఇది ఇంతకుముందే వివరించబడింది.

పురాణాలు ఏవి?

వ్యాసుడు రచించిన పద్దెనిమిది పురాణాలను తేలికగా గుర్తుంచుకొనటానికి పద్మపురాణంలో ఒక సూత్రం ఉన్నది. అది

'మ'ద్వయం 'భ'ద్వయం చైవ 'బ్ర'త్రయం 'వ' చతుష్టయం
'అ' 'నా' 'ప' 'లింగ' 'కూ' 'స్కా'ని పురాణాని పృథక్ పృథక్

(దేవీ భాగవతం 1-3-21)

అంటే ఆయా పురాణాల పేర్లను అనుసరించి 'మ'తో ప్రారంభమయ్యేవి రెండు – మత్స్య, మార్కండేయ పురాణాలు; 'భ' తో ప్రారంభయ్యేవి రెండు – భాగవత, భవిష్య పురాణాలు; 'బ్ర'తో ప్రారంభమయ్యేవి మూడు – బ్రహ్మ, బ్రహ్మవైవర్త, బ్రహ్మాండ పురాణాలు. 'వ'తో ప్రారంభమయ్యేవి నాలుగు – వరాహ, వామన, వాయు, విష్ణు పురాణాలు. 'అ' తో ప్రారంభమయ్యేది అగ్నిపురాణం, 'నా'తో ప్రారంభమయ్యేది నారదపురాణం, 'ప'తో ప్రారంభమయ్యేది పద్మపురాణం; లింగ – అంటే లింగపురాణం, 'కూ'తో ప్రారంభమయ్యేది కూర్మపురాణం, 'స్కా' తో ప్రారంభం అయ్యేది స్కాందపురాణం. భాగవతం అని చెప్పే దానిలో అది దేవీభాగవతమా లేక విష్ణు భాగవతమా అని పండితుల మధ్య విస్తృతమైన చర్చ జరిగింది. అలాగే వాయుపురాణం స్థానంలో కొందరు శివ పురాణాన్ని చేరుస్తున్నారు. ఎక్కువ మంది పండితులు విష్ణు భాగవతమే అష్టాదశ పురాణాలలో ఒకటని అలాగే వాయు పురాణాన్నే శివపురాణమని ఒకప్పుడు వ్యవహరించేవారని, అందుచేత వాయు పురాణమే అష్టాదశ పురాణాంతర్గతమని సమర్థిస్తున్నారు.

పురాణాల ప్రాచీనత

ఎందరో ఋషులు మహర్షుల ద్వారా ప్రచలితమైన సంస్కృత సాహిత్యం యొక్క వివిధ శాఖలను పరిశీలిస్తే వేదాలు, పురాణాలు భారతీయ సంస్కృతీ పరిరక్షక సహోదరులనే విషయం అవగతమౌతుంది. వేదకాలంనుంచే ఎందరో మహర్షులు తమ తమ విఖ్యాత గ్రంథాలలో పురాణాల యొక్క విశిష్టతను చాటుతూనే ఉన్నారు. పురాణాలలో చెప్పబడిన ఇహలౌకిక, పారలౌకిక అభ్యుదయ సాధక ఉపదేశాల బలం ఆధారంగానే హిందు సమాజం సృష్టి కాలం నుంచి నేటివరకు, అజరామరంగా విలసిల్లుతూ ఈ పవిత్ర భారతభూమిని సభ్యనాగరిక దేశాలలో అగ్రశ్రేణిలో నిలబడేటట్లు చేసింది.

పురాణాల ప్రాచీనతను నిరూపించాలంటే వేదకాలం నుంచి నేటి వరకు నిర్మితం అవుతున్న సంస్కృత సాహిత్యంలోని విశిష్ట గ్రంథాల ఆధారంగా నిరూపణ జరుగుతుంది.

అథర్వణ వేదం

ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషాసహ
ఉచ్ఛిష్టా జ్జజ్ఞిరే సర్వేదివిదేవా దివిశ్రితాః – అని తెలుపుతున్నది.

(ఋగ్వేదము, సామవేదము, ఛందము, యజుర్వేదాలతోపాటు పురాణము దేవలోకంలో ఉండే నక్షత్రమండలం ఆ ఉచ్ఛిష్టము అనగా ప్రపంచాన్ని పాలించే పరమాత్మ నుంచే ఉద్భవించినవి). అంతేగాకుండా, అదే అథర్వణవేదం

యంత్ర స్కంభః ప్రజనయన్ పురాణం వ్యవర్తయత్
ఏకం తదంగం స్కంభస్య పురాణమను సంవిదుః – అంటున్నది.

(వ్యాసరూపంలో ఉద్భవించి సర్వరక్షకుడైన ఈశ్వరుడు గురుశిష్య పరంపరతో వ్యాపించిన పురాణాలను రచనా బద్ధం చేయగా, వేదం యొక్క ఒక ప్రధాన అంగమైన పురాణాలు పరమాత్మను తెలిపేవేనని గ్రహించవలెను)

ఇక ఋగ్వేదం 'సనాపురాణ మధ్యేరాత్ (ఇప్పుడు నేను సనాతన పురాణములను అధ్యయనము చేయుదును) అనియు

'పురాణమోకః సఖ్యం శివమ్ వామ్' (ఓ అశ్వినీ కుమారులారా! మీ ఇద్దరి స్థానము పురాణమే ఎందుకనగా పురాణాల ద్వారా మీ ఇద్దరి స్థానము తెలియగలదు. మీ ఇద్దరి సఖ్యముచేత ఎంతో శుభము కలుగగలదు) అంటుంది. ఇంకా శథపథ బ్రాహ్మణం "అథ నవమేఽహని కించిత్పురాణమాచక్షేత్" (యజ్ఞము చేయునప్పుడు తొమ్మిదవ రోజున పురాణ పఠనము చేయవలెను. ఇతిహాస పురాణాలను ప్రతి దినము పఠనము చేయవలెను. ఇంకా ఇతిహాస పురాణాలను ప్రతి దినము ఎవరు పఠనము చేయుదురో అతడు దేవతలను తృప్తి పరచగలడు అని కూడా చెప్తున్నది. అంతేగాకుండా ఆదే శతపథ బ్రాహ్మణం 'ఈవిధంగా కల్పము, రహస్యము, బ్రాహ్మణము, ఉపనిషత్తు, ఇతిహాసము పురాణములతోనే వేదము నిర్మింపబడిన'దని చెప్తుంది. ఛాందోగ్యోపనిషత్తులో ఒక కథ ఉన్నది. ఆ కథ ప్రకారం దేవర్షియైన నారదుడు విద్యాధ్యయనం కోసం సనత్కుమారుని వద్దకు వెళ్ళగా, అప్పుడు సనత్కుమారుడు, నారదుని ఇంతకు ముందు ఇక్కడకు రావటానికి పూర్వం నీవు ఏమేమి చదివావని ప్రశ్నించాడట. అప్పుడు నారదుడు 'ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేద మాథర్వాణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదమ్' (భగవంతుడా లేక పూజ్యుడా! నేను ఋగ్వేదమును, యజుర్వేదమును, సామవేదమును, అథర్వణ వేదమును ఇంకా ఐదవది వేదాలకు వేదమైన ఇతిహాస పురాణాలను అధ్యయనం చేశాను) అని తెలిపాడు. దీనిని బట్టి వేదాలతో సమాన స్థానము పురాణాలకు ఉన్నదని తెలుస్తున్నది.

మనకు ఒక సందేహం కలగవచ్చు. అసలు ఈ సృష్టి జరిగి ఎంతకాలం అయింది అని. ఈ ప్రశ్నకు జవాబుగా మనం పురాణాలనుంచే వివరణ పొందవచ్చు. ఎందుకంటే హిందువులు చేసే ప్రతి పని ఈ తత్త్వాన్ని తెలుసుకొనే ప్రారంభించడం జరుగుతుంది. హిందువులు ప్రతిరోజు తమ నిత్యనైమిత్తిక కామ్య కర్మలను అనుష్ఠించేటప్పుడు నియమాను సారం అద్యబ్రహ్మణోద్వితీయ పరార్ధే శ్వేత వరాహ కల్పే వైవస్వత మన్వంతరే అష్టావింశతమే కలియుగే ప్రథమ పాదే ...... (ఫలాని కర్మలేక పనిని) కరిష్యే' అని సంకల్పం పఠించి సృష్టి గణనను తెలుసుకొంటున్నాడు. దీని అర్థం బ్రహ్మయొక్క ఆయుష్షు 50 సంవత్సరాలు గడచిన తరువాత ద్వితీయ పరార్థ సమయంలో శ్వేత వరాహ కల్పంలోని వైవస్వతుడనే ఏడవ మనువు కాలంలో 18వదైన కలియుగ ప్రథమ భాగంలో ఫలానా ధర్మకార్యం నెరవేరుస్తున్నాను అనేదే. గణితశాస్త్రాన్ని అనుసరించి దీనిని లెక్కిస్తే సృష్టి ఆరంభం నుంచి విక్రమశకం 2015 వరకు (దీనికి 58 తీసివేయగా ఇంగ్లీషు సంవత్సరం వచ్చును. అనగా 1957 వరకు). మనుష్య సంవత్సరంలో ఒక వంద తొంభై ఏడుకోట్ల ఇరవై తొమ్మిది లక్షల నలభై తొమ్మిదివేల యాభై తొమ్మిది సంవత్సరాలు గడిచిపోయినాయి.

దీన్ని లెక్కగడదాము :

1. గత ఆరు మనువుల కాలం అంటే అమన్వంతర కాలం =	184,03,20,000
2. గత ఆరు మన్వంతరాల సంధ్యాకాలం =	1,20,96,000
3. ఏడవ మన్వంతరంలో గతించిన 27 చతుర్యుగాల కాలం =	11,66,40,000
4. 28వ చతుర్యుగంలో గడచిన సంవత్సరాల కాలం =	38,93,059
మొత్తం	**197,29,49,059**

ఇది క్రీ.శ. 1957 వ సంవత్సరం వరకు గణించిన గత సంవత్సరాలు. భారతీయ పురాణ పండితులను అనుసరించి ప్రస్తుత విజ్ఞానశాస్త్రజ్ఞులు 5, 6 వేల సంవత్సరాల కాలం నుంచి 30 కోట్ల సంవత్సరాల కాలం వరకు మాత్రమే అంచనాలు కడుతున్నారు. కానీ పురాణాలు, తెలిపిన సృష్టికాలం దాదాపు 200 కోట్ల సంవత్సరాల నాటి నుంచి గణిస్తు న్నాయి. ఆధునిక విజ్ఞానం ఇంకా విస్తరించి క్రమంగా ఇంకా ప్రాచీన చరిత్రవైపు పోగలిగితే పురాణాలు లెక్కగట్టిన ఈ కాలం వరకు చేరుకొనగలుగుతుంది.

పురాణల క్రమంలోని అర్థం

పద్దెనిమిది మహా పురాణాలను చెప్పేటప్పుడు ఇది ఇన్నవ పురాణమని, క్రమ సంఖ్యలు ఇవ్వబడ్డాయి. ఈ క్రమం అనుసరించవలసినదేనా అంటే, పురాణవేత్తలు అయిన

పండితులు ఇది సాభిప్రాయమని, ఈ క్రమం చారిత్రక కారణాలవల్ల ఏర్పడింది కాదని, ఆయా పురాణాలలో ప్రతిపాదించబడిన, వర్ణించబడిన విషయాలను బట్టి ఏర్పడిందని తెలుపుతున్నారు. అష్టాదశ పురాణాలలోను ఎన్నో విషయాలు వివరించ బడ్డాయి. కానీ ఒక్కొక్క పురాణంలో ఒక్కొక్క విషయం ప్రముఖంగా, ప్రాధాన్యతతో వివరించబడ్డది. ప్రాధాన్యతను బట్టి పేర్లు ఏర్పడటం (ప్రాధాన్యేన వ్యపదేశాభవంతి) అనేది లోకరీతిగా ఉన్నదే.

పురాణాల ప్రధానమైన లక్ష్యం ఈ సృష్టిని గురించి వివరంగా తెలపటం. మూల తత్త్వం నుంచి సృష్టి ఎలా ప్రారంభం అయింది? అది ఏ విధంగా జరిగింది? ఏయే పరిణామాలను పొందింది? ప్రధాన వంశాలు ఎలా ఏర్పడ్డాయి. అందలి కీర్తి వంతులు ఎలాంటి జీవితాలను గడిపి ఆ కీర్తిని సంపాదించారు? చివరకు తిరిగి ఈ సృష్టి మూల తత్త్వంలో ఎలా విలీనం అవుతుంది? ఇదే సృష్టి ప్రవాహధార విశ్వసర్గంతో ప్రారంభమై ప్రతి సర్గంతో అంతం అవుతున్నది అనే ఈ ఆద్యంతాల మధ్యన ఉన్నవే మన్వంతర వంశ వంశాను చరితలు. అనే ధారాప్రవాహాలు. పురాణ పంచలక్షణాల వివరణ ఆంతర్యం ఇదే. ఈ పంచలక్షణ స్వారస్యము, సమన్వయము ఇదే. ఇలా సృష్టితత్త్వ ప్రతిపాదనం పురాణ తాత్పర్యం అయినందున పురాణ క్రమంలో ఔచిత్యం తేటతెల్లం అవుతుంది.

1. సృష్టిని గురించి అవగాహన చేసుకొనేటప్పుడు ఈ బ్రహ్మాండాన్ని ఎవరు సృష్టించారు అనే సందేహం కలగటం సహజం. సకలాతీతుడైన పరమాత్మ లేక పరబ్రహ్మ సృజించాడని తెలుస్తుంది. సృష్టిని బ్రహ్మ చేశాడని పురాణాలు చెపుతున్నాయి. 'తైత్తిరీయ సంహిత' 'బ్రహ్మ బ్రహ్మ భవత్ స్వయమ్' అంటే పరబ్రహ్మమే బ్రహ్మ అయినదని తెలుపుతున్నది. కాబట్టి సృష్టికర్త అయిన బ్రహ్మ గురించి తెలియచేసేది బ్రహ్మపురాణం.
2. సృష్టికార్యం నిర్వర్తించే బ్రహ్మ ఎలా జన్మించాడు అనేది తరువాత వచ్చే ప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబు చెప్పేది పద్మపురాణం. పద్మం నుండి బ్రహ్మపుట్టాడు కనుక పద్మ పురాణం రెండవది.
3. సృష్టికి కారణభూతుడైన బ్రహ్మ పుట్టింది పద్మం నుంచి అయితే ఆ పద్మానికి మూలం ఏది? అది విష్ణువు నాభినుంచి పుట్టింది. అందులోనుంచే బ్రహ్మ ఉద్భవించి, తపస్సు చేసి సృష్టి చేశాడు. ఆ విష్ణుతత్త్వాన్ని ప్రతిపాదించేది విష్ణు పురాణం. కాబట్టి అది మూడవ పురాణం.
4. విష్ణువు వాసస్థానం ఏది? ఆయన శేషశయ్యపై పవళించి ఉంటాడు. ఆ శేషునికి ఆధారం వాయువు. ఆశేషశయ్యను నిరూపించేది వాయుపురాణం. అది నాల్గవ పురాణం.

5. శేషుడు క్షీరసాగరంలో ఉంటాడు. ఆ సముద్ర రహస్యాల్ని వివరించే పురాణం కనుక శ్రీమద్భాగవతం ఐదవ పురాణం.
6. విష్ణు భగవానుని నిరంతరం సేవిస్తూ తన మధురవీణాగానంతో కీర్తిస్తుండే నారదుని పేరనున్న నారదపురాణం - ఆరవ పురాణం.
7. ఈ సృష్టిచక్రాన్ని ఈ విధంగా తిప్పేదెవరు అనే ప్రశ్నకు చాలా సమాధానాలు ఉన్నా కానీ వానిలో 'దేవి' అన్న సమాధానం ఒకటి. ఆమెను గురించి తెలిపేది మార్కండేయపురాణం.
8. ఘటంలో ప్రాణంవలెనే బ్రహ్మాండంలో శక్తి ఉన్నది. ఆశక్తి అగ్ని రూపంలో ఉండి క్రియాశీలమైన వస్తువులకు మూలప్రేరణ ఇస్తూంటుంది అనేది ఒక అభిప్రాయం. దీనిని ప్రతిపాదించే అగ్ని పురాణం - ఎనిమిదవ పురాణం.
9. అగ్నితత్త్వం సూర్యునిపై ఆధారపడి ఉన్నది. అందువలన సూర్యుడే క్రియాశీల వస్తువులకు ప్రేరణ శక్తి. అందువలననే వేదం సూర్యుడే స్థావర జంగమ సృష్టికి ఆత్మ అని తెలుపుతున్నది. ఈ విధంగా సృష్టికి ఉత్ప్రేరకం 'ఉత్పాదకుడైన సూర్యుడి మహిమ విశిష్టమైనది. ఆయన మహిమను ప్రతిపాదించేది భవిష్యపురాణం. తొమ్మిదవ పురాణం.
10. బ్రహ్మం నుంచే జగత్ సృష్టి జరుగుతున్నది. ఈ జగత్తంతా బ్రహ్మం యొక్క వివర్తం. వికారం-వివర్తం. ఈ రెండింటికి తేడా ఉన్నది. నిజంగా మారటం వికారం. నిజంగా మారకున్నా, మారినట్టు కనిపించడం వివర్తం. జగత్తు బ్రహ్మం వల్ల కలిగినదే. కానీ ఈ జగత్తు సత్యంకాదు. ఇది మాయికం. ఇది బ్రహ్మవైవర్తం. కనుక బ్రహ్మవైవర్తం అనే పేరుతోనే విశ్వానికి మూల కారణం బ్రహ్మమనీ, విశ్వం బ్రహ్మవివర్తమనీ తెలిపే బ్రహ్మవైవర్త పురాణం - పదవ పురాణం.
11. బ్రహ్మం నిర్గుణము. సగుణరూపంలో దానిని కనిపెట్టి, జీవుడు దానిని ఊహించాలి. అందుకు మార్గాన్ని సూచిస్తూ, సమాధానం ఇచ్చేవి మిగిలిన పురాణాలు. శివ విష్ణు రూపాలు బ్రహ్మంయొక్క సగుణ రూపాలుగా ప్రసిద్ధి చెందినవి. ఇందులో శివుని గురించి చెప్పేది లింగపురాణం - పదకొండవ పురాణం.
12. బ్రహ్మం యొక్క సగుణరూపంగా ప్రసిద్ధి చెందిన రూపాలలో శివుడుగల వివిధ తీర్థ క్షేత్రాలను, వ్రతాలను తెలిపేది స్కాందపురాణం - పన్నెండవ పురాణం.
13. బ్రహ్మంయొక్క సగుణ రూపంగా ప్రసిద్ధి చెందిన రూపం విష్ణు రూపం. ఆయన అవతారాలు ధరించి, భూమిపైకి దిగివచ్చి భక్తుల కష్టాలు తొలగించి వారికి ముక్తి పొందే ఉపాయాలను కూడా ఉపదేశిస్తాడు. అవతార ప్రయోజనం కేవలం రాక్షస సంహారమే కాకుండా జీవునికి సంసార జంబాలం నుంచి విముక్తిని కలిగించి

ఆనందమయ ముక్తి పొందే విధానం కూడా నేర్పటం భగవానుడు మర్త్యరూపం ధరించడంలోని ప్రయోజనం అని భాగవతం తెలుపుతున్నది. కనుక అవతార రూపధారుడైన విష్ణుమూర్తి అవతారాలను తెలియజేసే వరాహపురాణం – పదమూడవ పురాణం.

14. అలాగే విష్ణువు యొక్క వామనామావతార వృత్తాంతాన్ని తెలిపే వామన పురాణం పధ్నాలుగవ పురాణం.
15. విష్ణువు యొక్క కూర్మావతార వృత్తాంతాన్ని తెలిపే కూర్మపురాణం పదిహేనవ పురాణం.
16. శ్రీమహావిష్ణువు యొక్క మత్స్యావతార వృత్తాంతాన్ని తెలిపే మత్స్యపురాణం పదహారవ పురాణం.
17. జ్ఞానంవలన, ఉపాసన వలన జీవులకు కలిగే గతులూ, మరణానంతరం జీవుని స్థితి, అతడు ఏమి అవుతాడనే ప్రశ్నలకు జవాబులు గరుడ పురాణంలో లభ్యం అవుతాయి. అందువలన గరుడ పురాణం పదిహేడవ పురాణం.
18. జీవుని సమస్త గతులను గురించి విపులంగా చెప్పే బ్రహ్మాండపురాణం 18వ పురాణం.

హిందూ ధార్మికసారం జీవులు తమ కర్మఫలాన్ని అనసరించి ఈ బ్రహ్మాండంలో సుఖదుఃఖాలను అనుసరిస్తూ తిరుగుతూ ఉంటారనేదే.

ఈ విధంగా సృష్టివిద్యకు సంబంధించిన విషయాలను వివరిస్తూ జ్ఞాన, కర్మలను తెలియజేయటంలో అష్టాదశ మహాపురాణాలు దిశా నిర్దేశకాలుగా ఎంతో ఉపయోగకరమైనవిగా భావించబడుతున్నాయి. అందుకే వాని వరుస క్రమానికి కూడా సార్థకత ఉన్నదని మొదటే చెప్పబడింది.

పురాణ రచనా క్రమము

అష్టాదశ పురాణాలలో పద్మ పురాణాన్నే మొదట కృష్ణద్వైపాయన వ్యాసుడు రచించాడని, తరువాత సర్వ పురాణాల నుంచి సారాన్ని ఆకర్షించి భాగవతం రచించాడని పద్మ పురాణం తెలుపుతున్నది.

తత్ర పద్మ పురాణంతు, ప్రథమంచ ప్రణీతవాన్
తతో ఽన్యాని పురాణాని కృత్వా షోడశతు క్రమాత్
అష్టాదశం భాగవతం, సారమాకృష్య సర్వతః
కృతవాన్ భగవాన్ వ్యాసః శుక మధ్యాపయసత్స్వయమ్

(పద్మ పురాణాన్ని ముందుగా రచించి, తరువాత ఇంకొక పదహారు పురాణాలను క్రమంగా కూర్చాడని 18వదైన భాగవతాన్ని ఈ 17 పురాణాల యొక్క సారభూతంగా వ్యాసుడు కూర్చాడని తెలుస్తున్నది)

వ్యాసుడే శుకునికి భాగవతాన్ని స్వయంగా బోధించాడు.

పురాణ సంహిత

విష్ణు పురాణం, వ్యాసుడు పురాణాలను సమకూర్చిన విధానాన్ని తెలుపుతూ

ఆఖ్యానైశ్చాప్యుపాఖ్యానై, ర్గాథాభిః కల్ప శుద్ధిభిః
పురాణ సంహితాం చక్రే, పురాణార్థ విశారదః అని తెలుపుతున్నది.

ఆఖ్యానము, ఉపాఖ్యానము, గాథ, కల్ప శుద్ధులతో కూడిన రచనయే పురాణ సంహిత అని పురాణార్థ విశారదులు తెలుపుతున్నారు. అయితే ఈ ఆఖ్యాన, ఉపాఖ్యానాదులకు అర్థం ఏమిటి అనే సందేహం వస్తే,

స్వయం దృష్టార్థకథనం, ప్రాహురాఖ్యానం బుధాః
శ్రుత స్యార్థ కథనముపాఖ్యానం ప్రచక్షతే – అని వివరించబడింది.

అనగా పురాణకర్త స్వయంగా చూసి చెప్పినది ఆఖ్యానము. ఉదా : భారత కథ మొదలైనవి.

వేదము వలన విని చెప్పినది ఉపాఖ్యానము. ఉదా : హరిశ్చంద్ర కథ మొదలైనవి.

పితృగీతలు, పృథివీ గీతలు మొదలైనవి గాథలు –

శ్వేత వరాహము, నీలలోహితము మొదలైనవి కల్పాలు. నిర్ణయము కల్పశుద్ధి.

పురాణ శబ్దము మహాపురాణ పరంగా కూడా అన్ని పురాణాలలోను వాడబడింది.

పురాణ సంహితకు సహాయకాలు

వ్యాస మహర్షి ఆఖ్యాన, ఉపాఖ్యాన, గాథా, కల్పశుద్ధులు అనే నాలుగు ఉపకరణాలను తీసుకొని, తన పురాణాన్ని కూర్చాడు.

ఆఖ్యానైశ్చాప్యుపాఖ్యానైర్గాథాభిః కల్పశుద్ధిభిః
పురాణ సంహితాం చక్రే పురాణార్థ విశారదాః *(విష్ణు పు. 3-6-15)*

'స్వయం దృష్టార్థ కథనం ఆఖ్యానం' అనగా వక్త తాను స్వయంగా చూసి చెప్పిన విషయము అని అర్థం. దీనికి వ్యతిరేకార్థమే ఉపాఖ్యానము. వేరొకని ద్వారా పరంపరాగతంగా తాను వినిన విషయాన్ని వివరించటమే ఉపాఖ్యానము అని చెప్పుకొనవచ్చు. ఈ వివరణ ద్వారా రామ, నచికేత, యయాతి వృత్తాంతము మొదలైన కథలు పరంపరాగతముగా వచ్చునట్టివి. రామోపాఖ్యానం, నచికేతోపాఖ్యానం, యయాత్యుపాఖ్యానం పేర్లతో అవి ప్రచారంలో ఉన్నాయి. అందువలన ఇవి ఉపాఖ్యానాలు. అయితే కొందరు ఆయా వృత్తాంతాల పరిమాణాన్ని బట్టి విభజన చేస్తున్నారు వివరిస్తున్నారు. ఆకారంలో పెద్దవిగా

అంటే దీర్ఘంగా ఉండే వృత్తాంతాలు ఆఖ్యానాలని, కొద్దిపాటి వృత్తాంతంగలవి లేక చిన్నకథ గలవి ఉపాఖ్యానాలని చెప్పబడుతున్నాయి. ఈ వివరణ ప్రకారం రామాయణం సుదీర్ఘమైన కథగలది కాబట్టి రామాఖ్యానం కాగా, రామకథలో భాగంగా ఉండి కొద్దిపాటి కథగల సుగ్రీవ వృత్తాంతం మొదలైనవి 'సుగ్రీవోపాఖ్యానం' అని చెప్పవచ్చు. దీనికి సమర్థనగా మహాభారతం తనను గురించి తాను 'ఇతిహాస'మని 'ఇతహాసోత్తమ'మని చెప్పుకొన్నా ఆఖ్యానమని కూడా (ఇదం కవివరైః సర్వైరాఖ్యాన ముపజీవ్యతే –ఆదిపర్వం) చెప్పుకొన్నది.

గాథ : ప్రాచీన సాహిత్యంలో వేద, బ్రాహ్మణ, ఉపనిషద్, పురాణాలలో అనేక ప్రాచీన స్తుతులు, గీతాలు వంటివి ఉన్నాయి. వీటి కర్త ఎవరో తెలియదు. ఇది చాలావరకు ఒక గొప్ప చక్రవర్తిని స్తుతిస్తూనో ఒక మహాదాత దాతృత్వాన్ని ప్రశంసించేవిగానో అసామాన్య శౌర్యవంతుని శౌర్యాన్ని ప్రస్తుతించేవిగానో ఉంటాయి. ఋగ్వేద సంహితలో ఇలాంటి గాథలను "నారాశంసి" అనే పేరుతో ఉన్నాయి. ఐతరేయ బ్రాహ్మణంలో కూడా అష్టమ పంచికలో ఇంద్రుని మహాభిషేక సందర్భంలో ప్రాచీన చక్రవర్తులైన రాజుల పట్టాభిషేక ములు, వానివలన వారు ఆర్జించిన యోగముల వివరణ చేయబడింది. ఆ సందర్భంలో అనేక ప్రాచీన గాథలు ఈ సందర్భంలో ఉద్ధరించబడ్డాయి. వీటిల్లో చాలా పురాణాల్లో ఈ గాథలు రాజుల వర్ణనలలోను, ముఖ్యంగా భాగవత నవమ స్కంధంలో ఉద్ధరించ బడ్డాయి. గృహ్యసూత్రాలు కూడా వివాహ సందర్భాలలో గాథలను పాడటం నిర్దేశిసు న్నాయి. అంటే గాథలు ఆయా రాజులకు సంబంధించి ప్రఖ్యాతమైనవే. ప్రజల నాల్కలపై అవి సజీవంగానే ఉన్నాయి. వాటిని వ్రాసిన వారెవరో తెలియదు. ఈ లోకప్రియమైన అజ్ఞాతకర్తృకమైన శ్లోకాలనే 'గాథ'లు అని పిలుస్తారు. వీటిని కూడా పురాణాలు సంహితల నిర్మాణంలో వ్యాసుడు సమకూర్చుకొని ఉపయోగించుకొన్నాడు. ఈ గాథలకు శ్లోకాలనే పేరు కూడా ఉన్నది. (తదప్యేతే శ్లోకా అభిగీతా (ఐతరేయ బ్రాహ్మణం – అధ్యాయం 39) ఐతరేయ బ్రాహ్మణంలోని 39వ అధ్యాయంలోగల గాథలే కొద్ది తేడాతో భాగవతం నవమ స్కంధంలో కనిపిస్తున్నాయి.

కల్పశుద్ధి : దీనికి బదులుగా కల్పజోక్తి అని బ్రహ్మాండ పురాణంలోను, కులకర్మభిః అని వాయుపురాణంలోను ఉన్నదని ఇంతకుముందు చెప్పబడింది. కల్పశుద్ధి అనే పదానికి చాల అర్థభేదాలు ఉన్నాయి. కల్పజోక్తి అనే పదానికి వివిధ కల్పాలలో పుట్టిన విషయములు లేక పదార్థాలు అని ఒక అర్థం అయితే శ్రీధరస్వామి కల్పశుద్ధి అంటే 'శ్రాద్ధకల్ప'మని చెప్పాడు. ఈ పదాన్ని గురించి పురాణాలు ఏమీ చెప్పడం లేదు. మరికొందరు పండితులు దీనికి ధర్మశాస్త్రయుక్తంగా ఏవో అర్థాలు చెప్పారు. కానీ దీనికి వివిధ కల్పాలలో జరిగిన విషయములు అనగా పంచలక్షణాలు అందలి అంశాలైన వంశమన్వంతరాలని చెప్పుకొన

వచ్చు. అయితే ఇది ఇప్పటికీ ఏ పండితుడు నిర్ధారించని అంశం. ఇక్కడగల కల్పశుద్ధిభిః అనే పదానికి బ్రహ్మాండపురాణంలోని కల్పజోక్తిభిః అనీ, వాయు పురాణంలో 'కులకర్మభిః' అని పాఠాంతరాలున్నాయి.

ప్రాచీన వాఙ్మయంలో మనకు 'పురాణము' 'పురాణ సంహిత' అనే రెండు పదాలు వినిపిస్తాయి. ఇంతకుముందే పురాణం అనే పదానికి లోకంలో బాగా ప్రచారంలో ఉండి అవ్యవస్థితంగా, ఇక్కడా అక్కడా చెల్లాచెదరుగా ఉన్న లోకవృత్తాత్మకమైన విషయంగల విద్య' అని తెలుసుకొన్నాం.

దీనినే అన్ని శాస్త్రాలు పురాణాలు వేదాల కంటే పురాణమే ముందు బ్రహ్మ నోటి నుండి వెలువడ్డాయని, తరువాత వేదాలు పుట్టాయని తెలుపుతున్నాయి.

పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణాకృతమ్
అనంతరంచ వక్త్రేభ్యో వేదాస్తస్య వినిర్గతాః – అని చెప్పింది ఇదే విషయాన్ని.

ఈ విధంగా పురాణాలు అవ్యవస్థిత రూపంలో చెల్లాచెదరుగా ఉండగా, వ్యాసుడు వాటికి ఒక వ్యవస్థను ఏర్పాటుచేశాడు. చెల్లాచెదురుగా ఉన్న ఆ విషయాలన్నింటినీ, గ్రంథరూపంలో క్రోడీకరించాడు. ఇదే పురాణ సంహిత. వ్యాసుడే పురాణ సంహితను రచించి రోమహర్షణ సూతునికి దానిని బోధించాడని, దానిని ప్రచారంలోకి తెచ్చే విధానం కూడా ఆయన సూతునికి తెలిపాడని తెలుపుతున్నారు.

పురాణ ప్రతిపాదిత విషయాలు

సామాన్య దృష్టితో చూచి పురాణాలలో ప్రతిపాదితమైన విషయాలను ఈ విధంగా సంగ్రహంగా భావించవచ్చు.

ఋషిదేశ మహావీర చరితాన్యవతారకాః
లాజావిధిర్వ్రతా, స్త్రీర్థానామ్నాం సాహస్ర మేవచ
ఋషి రాజ్ఞాం వంశసూచీ, యుగాస్సృష్టిశ్చ ద్వాదశ
సామాన్యతః పురాణేషు, విషయాః ప్రతిపాదితా.

ఋషులు, దేశాలు, మహావీరుల చరిత్రలు, అవతార కథలు, యజ్ఞాలు ఆచరింప వలసిన విధులు, వ్రతాలు, తీర్థాలు, ఋషుల రాజుల వంశాదికాలు, యుగాలు, సృష్టి క్రమము అనే పన్నెండు విషయాల వర్ణన సామాన్య దృష్టితో చూడగా పురాణాలలో ఉండాలని పెద్దలు తెలుపుతున్నారు.

పురాణవేత్తకు సర్వజ్ఞ బిరుదము

'సర్వజ్ఞుండను నామము శర్వునకె' అని శివుడు ఒక్కడే సర్వజ్ఞ పదానికి అర్హుడని పెద్దల వాక్యం కానీ, సర్వవిషయ సమన్వితమైన పురాణాలనుపుక్కిట పట్టినవాడు కూడా సర్వజ్ఞుడు కాగలడుగదా. అందుకే

యేత్వేతాని సమస్తాని పురాణానిచ జానతే
భారతంచ మహాబాహో; తే సర్వజ్ఞా మతానృణామ్

(మహాభారతము, అష్టాదశ పురాణాలను తెలుసుకొనినవాడు సర్వజ్ఞుడని అన వచ్చునని దీనివలన తెలుస్తున్నది)

యోవిద్యాచ్చతురో, వేదాన్, సాంగోపనిషదోద్విజః
నచేత్పురాణం సంవిద్యా, నైవ సస్యాద్విచక్షణః

(నాలుగే వేదాలు, ఉపనిషత్తులు, షడంగాలు తెలుసుకొన్నా బాగా పురాణాలను తెలుసుకొనకపోతే విచక్షణుడు కాదు అని బ్రహ్మాండపురాణం వ్యతిరేక మార్గంలో తెలుపుతున్నది)

పురాణము - ఆల్బెరూనీ

ఆల్బెరూని మధ్య ఆసియా ప్రాంతానికి చెందిన పారశీక భాషలో మహాపండితుడు. ఇతని కాలం పదకొండవ శతాబ్ది ఉత్తరార్థం. ఇతడు దాదాపుగా మన తెలుగుకవి నన్నయ భట్టుకు సమకాలికుడని చెప్పవచ్చు. భారతదేశం మీదకు గజనీ మహమ్మదు దండెత్తి వచ్చేటప్పుడు తన వెంట ఎందరో పండితులు, కవులను తీసుకొని వచ్చాడని చరిత్రకారులు చెపుతున్నారు. వారిలో ఒకడు అల్బెరూని. ఇతడు మంచి పండితుడు. అనేక విద్యలమీద ఆసక్తి ఉన్నవాడు. భారతదేశం వచ్చిన తరువాత అతడు ఇచ్చట సంస్కృత పండితుల సహాయంతో మన దేశాన్ని గురించిన ఎన్నో విషయాలను తెలుసుకొన్నాడు. జ్యోతిషశాస్త్రం, దర్శనాలు ఇతనికి అభిమానపాత్రమైన విషయాలు. అందుకే ఆ రెండిటిల్లోను భారతీయ విజ్ఞానాన్ని మధించాడు. భారతదేశాన్ని గురించి అతడు రచించిన గ్రంథంలోని 12వ పరిచ్ఛేదంలో భారతీయుల ప్రాచీన సాహిత్యం గురించి విస్తృతంగా వివరించాడు. ఈ గ్రంథం రచనాకాలం క్రీ.శ. 1067 ప్రాంతం. ఆ సందర్భంలోనే అతడు అష్టాదశ పురాణాల పట్టికను ఇచ్చాడు. అయితే ఇతను రెండు రకాల పట్టికలను తన గ్రంథంలో ఇచ్చాడు. ఒక పట్టికను విష్ణుపురాణాన్ని అనుసరించి ఇచ్చాడు. దీని ప్రకారం ఇప్పుడు ఎక్కువగా వ్యాప్తిలో ఉన్న పురాణాల పేర్లు తెలిపే సూచికే ఇది అని చెప్పవచ్చు. రెండవ పట్టికలో ఇచ్చిన పేర్లలో కొన్ని ఉపపురాణాలు కూడా చేరాయి. ఈ రెండో పట్టిక ప్రకారం అతడు పేర్కొనిన 18 పురాణాలు ఇవి. 1. ఆదిపురాణం 2. మత్స్యపురాణం 3. కూర్మపురాణం

4. వరాహ పురాణం 5. నరసింహపురాణం 6. వామన పురాణం 7. వాయు పురాణం 8. నందీ పురాణం 9. స్కాందపురాణం 10. ఆదిత్యపురాణం 11. సోమపురాణం 12. సాంబ పురాణం 13. బ్రహ్మపురాణం 14. మార్కండేయపురాణం 15. తార్క్ష్య(గరుడ) పురాణం 16. విష్ణుపురాణం 17. బ్రహ్మాండపురాణం 18. భవిష్య పురాణం.

ఈ పట్టికను విశ్లేషణ చేస్తే

1. ఆల్బెరూనీ కాలానికే మహాపురాణ, ఉపపురాణాలు కలసి పోతూ ఉన్నాయి. ప్రజల దృష్టిలో వానికి అంతా తేడా లేదు.
2. ఉప పురాణాలు ఆరువరకు రచింపబడి ఉన్నాయి. అవి పురాణాలుగానే పరిగణింప బడుతున్నాయి. అవి 1. ఆదిపురాణం 2. నరసింహపురాణం 3. నందీపురాణం 4. ఆదిత్యపురాణం 5. సోమపురాణం 6. సాంబపురాణం.
3. ఆదిపురాణం వేరు. బ్రహ్మపురాణం వేరు. కొన్ని పురాణాలలో ఆది బ్రాహ్మ్యం అని బ్రహ్మ పురాణం చెప్పబడింది.
4. ప్రస్తుత కాలంలో సౌర పురాణం అనే పేరుతో సూర్యుని గురించి చెప్పే పురాణం ఆనాడు లేదని ఆనాడు ఆదిత్య పురాణం ఉన్నదని చెప్పవచ్చు. అది నేడు అనుప లభ్యం. కానీ దాని తెలుగు అనువాదం ఉన్నది. దానిని గురించి ఇంకా లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉన్నది.
5. నేటి కాలంలో సాంబపురాణం ఉన్నది. ఆదిత్యుని విషయంతో జోడింపబడిన చంద్రుని గురించి తెలిపే సోమపురాణం ఆనాడు ప్రచారంలో ఉండేది. ఇప్పుడు లేదు.

ఆల్బెరూనీ తాను ఈ అష్టాదశ పురాణాలలో కేవలం ఆదిత్య, మత్స్య, వాయు పురాణాలలోని కొన్ని అంశాలు మాత్రమే చదివినట్లుగా తెలుపుతున్నాడు. అతడు విష్ణు పురాణము, విష్ణుధర్మోత్తరాల నుంచే భౌగోళిక సంబంధమైన అనేక అంశాల వివరాలను తన గ్రంథంలో ఇచ్చాడు. దీనివలన నాటికి ఈ రెండు పురాణాలు అత్యంత ప్రచారంలో ఉన్నట్లు గ్రహించవచ్చు. ఇలా ఆల్బెరూనీ పురాణాల నుంచి, వాటిని గురించి విలువైన సమాచారం అందచేశాడు.

బల్లాలసేనుని దానసాగరము - పురాణము

క్రీ.శ. 1169లో వంగదేశపు చివరి స్వతంత్ర పరిపాలకుడు, లక్ష్మణసేను (1160–1210)ని తండ్రి బల్లాలసేనుడు. బల్లాల సేనుడు హేమంతసేనుని పౌత్రుడు. విజయసేనుని కుమారుడు. బల్లాల సేనుని కుమారుడైన లక్ష్మణసేనుడు యుగకర్త. అతనిపేరుమీద లక్ష్మణ సంవత్సరము లేక లక్ష్మణ శకము అనే కాలగణన ప్రారంభం అయింది. ఇతని ఆస్థానంలోనే జయదేవుడు, గోవర్ధనాచార్యుడు మొదలైన విఖ్యాత సంస్కృత కవులు

ఉండేవారు. బల్లాలసేనుడు 'సాగరము' అని చివర వచ్చే అయిదు విశిష్ట గ్రంథాలను రచించాడు. అవి 1. అద్భుత సాగరము 2. దాన సాగరము 3. ప్రతిష్ఠా సాగరము 4. ఆచార సాగరము 5. వ్రత సాగరము. ఇందులో అద్భుత సాగరం, దానసాగరాలు మాత్రమే ముద్రితం. దానసాగరంలో వ్రత సాగరం పేర్కొనబడింది. అద్భుత సాగరం క్రీ.శ. 1167లో ప్రారంభించబడి అతని కుమారుడైన లక్ష్మణసేనునిచేత పూర్తి చేయబడింది. దానసాగరం క్రీ.శ. 1169లో రచింపబడింది. బల్లాలసేనుని సాహిత్య జీవనం క్రీ.శ. 1155 నుండి 1180 వరకు అని చెప్పవచ్చు.

దానసాగరం ప్రారంభంలో బల్లాలసేనుడు పురాణ స్వరూపాన్ని వివరించాడు. ఈతడు తాను ఏయే పురాణాల నుంచి ఏయే విషయాలను సేకరించాడో కొన్నింటిని ఎందుకు వదలివేశాడో తెలిపిన విషయాలు చాలా ప్రామాణికమైనవి. ఆ రోజుల్లో ఇంత ప్రామాణిక ఆలోచన ఉన్నవారే చాలా ఆరుదని చెప్పవచ్చు.

దానసాగర పురాణము ధర్మశాస్త్ర గ్రంథాల నుంచి దాన విషయకమైన సర్వ విషయాలను సంగ్రహించి కూర్చిన గ్రంథం. ఆయన తన దానసాగరంలో బ్రహ్మ, వరాహ, ఆగ్నేయ, భవిష్య, మత్స్య, వామన, వాయు, మార్కండేయ, విష్ణు, శివ, స్కంద, పద్మ (అనే పురాణాలు), సాంబపురాణం, కాలికా పురాణం, నందిపురాణం, ఆదిత్య, నరసింహ, మార్కండేయ, విష్ణుధర్మోత్తర, విష్ణుధర్మాలనే ఉపపురాణాలు, గోపథ బ్రాహ్మణ, రామాయణం నుంచి మహాభారతం నుంచీ, మను, వశిష్ఠ సంవర్త మొదలైన స్మృతుల నుంచి ఉదాహరించాడు. పైన పేర్కొన్న 12 పురాణాలు తప్ప ఇతర పురాణాల నుంచి పేర్కొన లేదు. వాటి అప్రామాణ్య ప్రామాణ్యతల గుఱించి బల్లాల సేనుడు వెలిబుచ్చిన అభిప్రాయం చాలా విలువైనది. అతడు

భాగవతంచ పురాణం బ్రహ్మాండంచైవ నారదేయంచ
దానవిధి శూన్యమేతత్ త్రయమపి నిబద్ధమవధార్య"

(దానసాగరం - ఉపక్రమణిక 57)

అని భాగవతము, బ్రహ్మాండపురాణం, నారదీయ పురాణాలలో దాన సంబంధమైన విషయాలేమీ లేవు కాబట్టి వాటిని తాను స్పృశించలేదని చెప్పాడు. ఇలాగే ఇంకా మిగిలిన అనేక గ్రంథాల గుఱించి అతడు సహేతుకమైన కారణాలిచ్చాడు. మత్స్య పురాణంలో చెప్పబడిన మహాదానముల యొక్క సారమే లింగపురాణంలో కూడా చెప్పబడడం వల్ల దానిని ప్రమాణంగా తీసుకొనలేదని చెప్పాడు. భవిష్యత్పురాణంలో సప్తమి తిథుల వరకు మాత్రమే సంగ్రహంగా చెప్పబడింది. పైగా పాఖండులైన బౌద్ధులు దానిని ఖండించడం చేతను, శివరహస్యము, విష్ణు రహస్యాలనేవి ప్రజలలో ప్రచారంలో ఉన్నా దాన

విషయకమైన వృత్తాంతాలు వాటిల్లో సంగ్రహంగా ఉన్నందువల్లనూ ఇవి మౌలిక గ్రంథాలుగా బల్లాల సేనుడు గ్రహించలేదు. భవిష్యోత్తర పురాణంలో ఆచార వర్ణన మొదలైన విషయాలున్నా దీనిలో ప్రామాణికంగా తీసుకోదగిన ఆధారాలు లేవని అతని ఉద్దేశ్యం. స్కాందపురాణంలోని మూడు ఖండాలు – కాశీ, రేవా, అవంతీ ఖండాలు కేవలం కథల మీదనే ఆశ్రితాలు. గరుడ, బ్రహ్మ, ఆగ్నేయ పురాణాలు. ఇరవైమూడు వేల శ్లోకాలున్న విష్ణుపురాణం, ఆరు వేల శ్లోకాలున్న రెండో లింగపురాణంలో దీక్ష, ప్రతిష్ఠ, నాస్తికుల (పాఖండికుల) యుక్తులు, రత్నపరీక్ష, మిథ్యావంశానుచరితం, కోశ – వ్యాకరణాది విషయాలు ఉండడం, అసంగతమైన కథలతో ఉండడం, పరస్పరం విరోధం కలిగిన విషయాలుండడం, మన్మథుని గుఱించిన కథలు, భంధ, ధూర్త, పాఖండ (బౌద్ధులు), లింగి (సన్యాసి, పాశుపత – పంచ రాత్రులకు చెందినవాడు) అనే విషయాల ద్వారా ప్రపంచానికి ఉపకారం చేయని విషయాలున్నందువల్ల ఈ పురాణ ఉప పురాణాలన్నీ నిరాకరించబడ్డాయి. దేవీ భాగవతం కూడా ఇందులోకి చేరుతుంది. ఇందుకు కారణం ఇది పురాణ ఉపపురాణాలలో చేర్చబడ లేదు. రెండవది దీనిలో నిందిత కర్మలైన మారణ, మోహనాది కర్మలు వివరించబడి నందువల్లనూ, పాఖండ, తంత్రశాస్త్ర విషయాలు చెప్పబడి వానిని అనుసరిస్తున్నందు వలన ఇది కూడా నిరాకరించబడింది. కాబట్టి ఈ గ్రంథాల నుంచి శ్లోకాలు ఉద్ధరింప బడలేదు.

పై విషయాలనుబట్టి బల్లాలసేనుని దానసాగరమనే గ్రంథం ద్వారా క్రీ.శ. 12వ శతాబ్దానికి చెందిన పురాణాల గురించి తెలుసుకొన కలిగిన విషయాలు.

1. మహాపురాణాలలో విష్ణు భాగవతమే పరిగణింపబడెడిది. దేవీ భాగవతము కాదు.
2. వాయుపురాణం, శివపురాణం రెండూ మహాపురాణాలలోనివిగా పరిగణింపబడేవి.
3. స్కాందపురాణంలోని సంహితాత్మక భాగంలోని శివరహస్య ఖండం కూడా స్కాందంగానే పరిగణింపబడేది. కానీ ఈ విషయం ఇంకా లోతుగా ఆలోచించ వలసి ఉన్నది.
4. బ్రహ్మ, ఆగ్నేయ, లింగ, విష్ణు పురాణాలు ఆ రోజులలో రెండు విధాలుగా లభ్యం అవుతుండేవి. 23 వేల శ్లోకాలుండే విష్ణుపురాణం, ఆరువేల శ్లోకాలుండే లింగ పురాణం ఆ కాలంలో ప్రామాణికంగా తీసుకొనబడలేదు. కూర్మపురాణంలో చెప్పినట్లుగా (1–17–20) ఉప పురాణాలుగా స్కంద, వామన, బ్రహ్మాండ, నారదీయ పురాణాలు ఆరోజులలో ఉండేవి. ఇవే పేర్లతో మహా పురాణాలు ఉండేవి.

దీనివల్ల చాలా పురాణాలే సంక్షేప రూపంలో ఉపపురాణాలుగా ఆ రోజుల్లో ఉండేవని నిర్ణయించవచ్చు. కానీ ఆయా మహాపురాణాల పేర్లతోనే ప్రచారంలో ఉండేవని చెప్పగలం.

5. ఆ రోజులలో ప్రజలు తంత్ర విధానాలను సమర్థించేవారు కాదు. అందువలననే దేవీ భాగవతం ప్రామాణికంగా తీసుకొనబడలేదు. ఇలాగే స్కాందంలోని కొన్ని భాగాలు కూడా వదలివేయబడ్డాయి.
6. గరుడ పురాణాన్ని బల్లాలసేనుడు పైన చెప్పిన అనేక కారణాల వల్ల ప్రామాణికంగా తీసుకొనలేదు.

ఇలా బల్లాలసేనుని ఈ కథనం ద్వారా 12వ శతాబ్దికి చెందిన పురాణాలను గురించిన అనేక విషయాలను మనం గ్రహించుకొనవచ్చు.

పురాణ పరిచయం

వేలకొలది శ్లోకాలు, వందల కొలది వృత్తాంతాలు ఉన్న ఒక్కొక్క పురాణం ఒకే విభాగంగా ఉండటం కుదరనిపని. అందుకే ఇవి భాగ, ఖండ, అంశ, స్కంధ, పాద, పర్వ, సంహిత అధ్యాయాలనే విభాగాలుగా చేయడ్డాయి. దీని అర్థం అన్ని విభాగాలు ఒకే పురాణంలో ఉంటాయని కాదు. కొన్నింటిలో కొన్ని కొన్ని ఉండవచ్చు. అలాగే భాగ, అంశ, ఖండాలలో కూడా అనేక అధ్యాయాలు ఉండవచ్చు. ఆ విధంగా అన్ని పురాణాల లోను అధ్యాయాలనే విభాగం ఉంటుంది. కానీ భాగ, ఖండ, అంశాలు వేటికవి ప్రత్యేకంగా కొన్ని కొన్ని పురాణాల లోనే ఉంటాయి. ఇక్కడ ఏయే పురాణాలు ఏయే విభాగాలుగా చేయబడిందో కూడా తెలుపబడింది.

అష్టాదశ పురాణాల గురించి చాలా విషయాలు ఇంతకుముందే తెలియజేయ బడ్డవి కదా. ఇక ఇప్పుడు వానిలో చెప్పబడిన విషయాలను గురించి తెలుసుకొందాం.

1. బ్రహ్మపురాణం :

ఈ పురాణానికి 'ఆదిబ్రాహ్మ్యం' అనే పేరు కూడా వ్యాప్తిలో ఉన్నది. పురాణాలలో ఉండవలసినవిగా చెప్పబడే సమస్త విషయాలు ఇందులో ఉన్నాయి. సృష్టి వివరణ తరువాత సూర్యవంశం, చంద్రవంశ రాజుల వృత్తాంతం అతి సంక్షిప్తంగా ఉన్నది. పార్వతీ వృత్తాంతం చాలా ఎక్కువగా దాదాపు పది (30 నుంచి40 వరకు) అధ్యాయాలలో వర్ణించబడింది. మార్కండేయాఖ్యానం తరువాత గౌతమీ, గంగ, కృత్తికా తీర్థం, చక్రతీర్థం, పుత్రతీర్థం, యమతీర్థం, ఆపస్తంబ తీర్థం మొదలైన అనేక ప్రాచీన తీర్థ విశేషాలు గౌతమీ మాహాత్మ్యంలో భాగంగా (అధ్యాయాలు 70 నుండి 175) వివరించ బడ్డాయి. శ్రీకృష్ణ భగవానుడి చరిత్ర 180 నుంచి 212వ అధ్యాయం వరకు 326 అధ్యాయాలలో విస్తృతంగా వర్ణించబడింది. శ్రీకృష్ణునిచరిత్ర అంతా భాగవతం దశమ స్కంధంలో చెప్పినట్లే ఉన్నది. భేదం ఏమాత్రం లేదు. ఇంతేకాకుండా ఈ పురాణంలో జీవుడు మరణించిన తరువాత పొందే వివిధ అవస్థల వర్ణనకూడా అనేక అధ్యాయాలలో కన్పిస్తుంది. అయితే

పురాణాలలో మనకు సహజంగా కనపబడే భూగోళ వర్ణన అంత ఎక్కువగా దీనిలో కని పించదు. కానీ ప్రస్తుత ఒరిస్సా రాష్ట్రంలో ఉన్న కోణాదిత్య (కోణార్క) అనే పేరుగల తీర్థ వివరణ దానికి సంబంధించిన సూర్య ఆరాధన గురించి వివరణ ఈ పురాణంలోని ప్రత్యేకత. సూర్యమహిమ, ఆయన ప్రసరించే శక్తిని గురించిన వివరణ ఆరు అధ్యాయాలలో ఉన్నది.

ఈ పురాణంలో దాదాపు పది అధ్యాయాలలో సాంఖ్యయోగ వివరణ చాలా విస్తృతంగా (234 నుండి 244) ఉన్నది. కరాళజనకుడు ప్రశ్నించటం వలన వశిష్ఠ మహర్షి చేత మహిమాన్వితమైన సాంఖ్యయోగ సిద్ధాంతాలు వివరించబడ్డాయి. ఇక్కడ గమనించ వలసిన ముఖ్య విషయం ఒకటి ఉన్నది. తరువాత కాలంలో ప్రచారంలోకి వచ్చిన సాంఖ్య యోగ విషయాలు అనేకం ఇందులో చెప్పబడిన ముఖ్య సాంఖ్య విషయా లతో విభేదిస్తున్నాయి. అంతకుపూర్వపు సాంఖ్యంలో తత్త్వాలు 25 అని చెప్పబడగా, ఇందులో మూర్ధస్థానీయంగా 26వ తత్త్వం యొక్క వివరణ ఉన్నది. పౌరాణిక సాంఖ్యంలో నిరీశ్వర వాదం ప్రతిపాదితంకాదు. ఇందులో జ్ఞానంతోపాటు భక్తికి కూడా విశిష్టమైన స్థానం ఇవ్వబడింది. ఈ పురాణంలోని ఇంకొక విశేషమేమంటే ఇందులోని కొన్ని అధ్యా యాలు వ్యాస మహాభారతంలోని పన్నెండవదైన శాంతిపర్వంలోని కొన్ని అధ్యాయాలతో అక్షరం అక్షరం ఏకీభవిస్తున్నవి. ధర్మమే పరమ పురుషార్థమని ఈ పురాణం ఉద్ఘోషిస్తున్నది.

ధర్మేమతిర్భవతు వః పురుషోత్తమానాం
సహ్యేక ఏవ పరలోకగతస్య బంధుః
అర్థాః స్త్రియశ్చ నిపుణైరపి సేవ్యమానా
నైవ ప్రభావ ముపయంతి న చ స్థిరత్వమ్ ***(బ్ర.పు. 255-35)***

పురుషోత్తములైన వారి కందరకు ధర్మమునందే బుద్ధి స్థిరమగుగాక. పరలోకము నకు పోయినప్పుడు అది ఒక్కటియే బంధువు కాగలదు. అర్థకామములను రెండింటిని ఎంత జాగ్రత్తగలవారుగా సేవించినను వాని వలన లభించు ఫలము స్థిరములు కావు. అవి ఎట్టి సత్ఫలములను చూపలేవు.

ఇది రెండు భాగాలుగా చేయబడింది. 1. పూర్వభాగం, 2. ఉత్తర భాగం. రెండు భాగాలలోనూ కలిపి 245 అధ్యాయాలున్నాయి. నారదపురాణాన్ని అనుసరించి ఇందులో పదివేల శ్లోకాలు ఉండగా మత్స్యపురాణానుసారము 13,000 శ్లోకాలు ఉన్నాయి.

2. పద్మపురాణము

ఈ పురాణం విస్తృతిలో స్కాందపురాణానికి తరువాతదిగా ఉండి, మిగిలిన 16 పురాణాలకంటె పెద్దది. దీనిలోని శ్లోక సంఖ్య అర్థలక్ష (యాభైవేలు). అంటే లక్ష శ్లోకాల

విస్తృతిగల మహాభారతంలో సగము, భాగవతానికి దాదాపు మూడురెట్లు పెద్దదైన పురాణం ఇది. ఈ పురాణం రెండు రకాలైన పాఠాలతో లభిస్తున్నది. వంగదేశ పాఠం ఒకటి. ఇది ఇప్పటికీ ముద్రితం కాలేదు. వ్రాతప్రతిగానే ఉన్నది. రెండవది ఆనందాశ్రమ పాఠ ప్రతి. ఇది ఆరుఖండాలు అనగా... 1) ఆదిఖండం, 2) భూమిఖండం, 3) బ్రహ్మఖండం, 4) పాతాళఖండం 5, సృష్టిఖండం, 6) ఉత్తరఖండం అనే ఆరు భాగాలుగా ముద్రితమైంది. ఇందులోని 125వ అధ్యాయంలోని శ్లో.48-49 శ్లోకాల ప్రకారం ఈ ఖండ విభజన అనంతర కాలంలో జరిగినట్లు తెలుస్తున్నది. మూలంలో ఐదు ఖండాలు మాత్రమే ఉన్నాయని అముద్రిత వంగప్రతిలో అదే రకమైన విభజన ఉన్నదని పురాణపండితులు తెలుపుతున్నారు. దీనికే

ప్రథమం సృష్టిఖండం హి భూమిఖండం ద్వితీయకమ్
తృతీయం స్వర్గఖండంచ పాతాలశ్చ చతుర్థకమ్
పంచమంచోత్తరంఖండం సర్వపాప ప్రణాశనమ్ – అని తెలుపుతున్నది.

1. సృష్టిఖండం : దీనిలో 82 అధ్యాయాలున్నాయి. ఇందులోని ప్రథమ అధ్యాయం వలన ఈ పురాణంలో 55,000 శ్లోకాలున్నాయని, ఈ పురాణం అయిదు పర్వాలతో విభజింపబడిందని తెలుస్తున్నది. అవి 1) పౌష్కర పర్వం – ఇందులో దేవతలు, మునులు, పితరులు, మనుష్యుల వంటి తొమ్మిది రకాల సృష్టిని గురించిన విపులవర్ణన ఉన్నది. 2) తీర్థపర్వం : ఇందులో పర్వత, ద్వీప, సప్తసాగర వర్ణన ఉన్నది. 3) తృతీయ పర్వం: దీనిలో ఎక్కువగా దక్షిణలను ఇచ్చే రాజుల వర్ణన ఉన్నది. 4) చతుర్థపర్వం : రాజుల వంశాను కీర్తనం ఉన్నది. 5) మోక్షపర్వం : మోక్షము దాని సాధన మార్గాల గురించిన వివరణ ఉన్నది. ఈ ఖండంలోనే సముద్రమథనం, పృథుజననం పుష్కర తీర్థవాసుల ధర్మవృత్తాంతం, వృత్రాసుర సంగ్రామం, వామనావతారము, మార్కండేయముని ఉత్పత్తి, కార్తికేయజననం, శ్రీరామచరిత్రం, తారకాసుర వధ మొదలైన వృత్తాంతాలు విస్తారంగా వర్ణింపబడ్డాయి.

2. భూమి ఖండం : ఈ ఖండం మొదట్లోనే శివశర్మ అనే పేరుగల బ్రాహ్మణుడు పితృ భక్తి చేత స్వర్గాన్ని పొందటం, పృథుమహారాజు పుట్టుక, చరిత్ర వర్ణనము, ఒక మాయా వేషధారి యొక్క బోధల ద్వారా జైన ధర్మ విషయాలు విని వేనుడు చెడుమార్గాన్ని ప్రవేశిం చడం, అప్పుడు సప్తర్షులవలన అతడి భుజమథనం జరిగి, పృథువు జన్మించడం, అనేక విధాలైన నైమిత్తిక, ఆభ్యాదాయక దానాల తరువాత, సతీసుకళ యొక్క పాతివ్రత్య సూచక కథలు చాలా విపులంగా వివరించబడ్డాయి. యయాతి, మాతలుల ఆధ్యాత్మిక విషయ సంవాదాలు, పాపపుణ్య ఫలవివరణలు, విష్ణుభక్తి ప్రశంస తెలుపబడ్డాయి. చ్యవన మహర్షి వృత్తాంతం సుదీర్ఘంగా తెలుపబడింది. పద్మపురాణం ముఖ్యంగా విష్ణుభక్తికి ప్రతిపాదితము. కానీ ఇందులో ఇతర దేవీ, దేవతల యొక్క అనాదరభావ ప్రకటన లేదు. ఇందులో

శివకేశవ అభేదత్వమే ప్రకటించబడింది. ఈ తత్త్వమే

శైవం చ వైష్ణవం లోకమేకరూపం నరోత్తమ
ద్వయోశ్చాప్యనంతరం నాస్తిఏకరూపం మహాత్మనోః
శివాయ విష్ణురూపాయ విష్ణవే శివరూపిణే
శివశ్చహృదయే విష్ణుః విష్ణోశ్చహృదయే శివః
ఏకమూర్తిస్త్రయోదేవాః బ్రహ్మవిష్ణు మహేశ్వరాః
త్రయాణామంతరంనాస్తి, గుణభేదాః ప్రకీర్తితా

అనే శ్లోకం ద్వారా తెలుపబడింది.

3. స్వర్గఖండం : ఈ ఖండంలో దేవ, గంధర్వ, అప్సర, యక్షాదిలోకాల విస్తృతవర్ణన వున్నది. ఈ ఖండంలోనే శకుంతలోపాఖ్యానం కూడా ఉన్నది. ఇది మహాభారతంలోని శకుంతలోపాఖ్యానంతో పూర్తిగా విభేదిస్తున్నది. కానీ కాళిదాసు అభిజ్ఞానశాకుంతల కథతో పూర్తిగా ఏకీభవిస్తున్నది. అందుకే కొందరు పండితులు కాళిదాసు అభిజ్ఞాన శాకుంతల కథేతిహాసం మహాభారతం నుంచి కాక ఈ పద్మపురాణం నుంచి గ్రహించాడని తెలుపుతున్నారు. విక్రమోర్వశీయం గురించి కూడా ఇలాంటి వాదమే ఉన్నది.

4. పాతాళఖండం : ఈ ఖండంలో నాగలోకం యొక్క విస్తృత వర్ణన ఉన్నది. ప్రసంగతః రావణ విషయం వచ్చినప్పుడు మొత్తం రామాయణకథ ఇందులో చెప్పబడింది. ఇందులోని ఇంకొక ప్రత్యేకత ఏమిటంటే కాళిదాసు తన రఘువంశంలో చెప్పిన రామకథతో ఇందలి వృత్తాంతం పూర్తిగా సరిపోలుతూ ఉన్నది. రావణవధానంతరం సీతాపరిత్యాగం, కుశలవ జననం, రామాశ్వమేధవృత్తాంతాలు కూడా ఇందులో చెప్పబడ్డాయి. ఈ వృత్తాంతం అంతా భవభూతి రచించిన ఉత్తర రామచరిత కథావృత్తాంతంతో ఏకీభవిస్తున్నది. ఈ పురాణంలో వ్యాసుడు అష్టాదశ పురాణాలను రచించిన విషయం తెల్పి అందులో భాగవతపురాణం యొక్క మహిమ విస్తృతంగా వివరించబడింది.

5. ఉత్తర ఖండం : ఈ అయిదవదైన ఉత్తరఖండంలో వివిధ రకాలైన ఆఖ్యానాల సంక్షిప్త వర్ణనం ఉన్నది. ఈ ఖండంలోనే విష్ణుభక్తిని గురించిన ప్రశంస విస్తృతంగా కనిపిస్తుంది. దీనికి పరిశిష్ట అంశంగా 'క్రియాయోగసారం' అనే భాగం కూడా లభిస్తున్నది. ఇందులో వ్రతాలు, తీర్థసేవనం మొదలైన విషయాలతో శ్రీమహావిష్ణువు విశేషంగా ప్రసన్నుడై కోరికలు తీరుస్తాడని చెప్పబడింది.

పద్మపురాణం విష్ణుభక్తి ప్రతిపాదక పురాణాలలో ముందుగా నిలిచే గ్రంథం. భగవంతుని నామ గుణగానం ఎన్ని విధాలుగా చక్కగా చేయవచ్చునో, ఎన్ని పేర్లు

అపరాధ యుక్తాలైనవో మొదలైన విషయాలకు సమాధానం చాలా ప్రామాణికంగా ఈ పురాణంలో లభిస్తాయి. అందువలననే తరువాతకాలంలో వచ్చిన వైష్ణవ సంప్రదాయక గ్రంథాలు ఈ పురాణాన్ని విశేషంగా స్తుతించి ప్రామాణికంగా స్వీకరించాయి. సాహిత్య దృష్టితో చూచినా ఈ పురాణ శైలి బహుసుందరంగా ఉంటుంది. సామాన్యంగా పురాణరచనలో అనుష్టుప్ఛందం విశేషంగా ఉపయోగపడుతుండగా ఇందులో అనుష్టుప్ ఛందమేగాక ఇతర దీర్ఘ ఛందాలు కూడా విశేషంగా ఉపయోగించబడ్డాయి. ఉదాహరణకు ఈ శ్లోకం చూడండి :

సంసారసాగరమతీ్వ గభీరపారం, దుఃఖోర్మిభిర్వివిధ మోహమయైస్తరంగైః
సంపూర్ణమస్తి నిజదోషగుణైస్తుప్రాప్తం, తస్మాత్ సముద్ధర జనార్దన మాంసుదీనం

ఇలాంటి చక్కని రచనా శైలితో ఉన్న పురాణం ఇది.

ఇందులో సృష్టి ఖండంలో 82 అధ్యాయాలు, భూ ఖండంలో 125 అధ్యాయాలు స్వర్గ ఖండంలో 39 అధ్యాయాలు, పాతాళ ఖండంలో 113 అధ్యాయాలు, చివరిదైన ఉత్తర ఖండంలో 282 అధ్యాయాలు ఉన్నాయి. మొత్తంమీద ఈ గ్రంథంలో 641 అధ్యాయాలలో 55,000 శ్లోకాలు ఉన్నాయి.

3. విష్ణుపురాణం :

దార్శనిక ప్రభావ దృష్టితో చూస్తే విష్ణుభాగవతం, ప్రథమ గ్రంథంగా నిలిస్తే, ద్వితీయ స్థానాన్ని విష్ణుపురాణం ఆక్రమిస్తుంది. వైష్ణవ దర్శనానికి మూలాలంబనం విష్ణు పురాణమే. అందువలననే వైష్ణవ మత ప్రతిపాదకులు శ్రీమద్రామానుజులవారు తమ శ్రీభాష్యంలో దీనినే ప్రమాణంగా తీసుకొని, ఎన్నో సందర్భాలలో దీనిలోని భాగాలను ఉద్ధరించారు. పరిమాణంలో ఇది చిన్న పురాణమే. కానీ ప్రభావంలో మాత్రం చాలా గొప్ప గ్రంథం. దీనిలోని భాగాలను 'అంశాలు' అంటారు. దీనిలో ఆరంశాలు ఉన్నాయి. ఈ ఆరు అంశాలు 126 అధ్యాయా లుగా విభజించబడ్డాయి. విస్తృతిలో ఇది శ్రీమద్భాగ వతంలో మూడవవంతు మాత్రమే.

ఇందులోని ప్రథమ అంశంలో సృష్టివర్ణన ఉన్నది. (11వ అధ్యాయం నుంచి 20 వరకు) ద్వితీయ అంశంలో భూగోళం యొక్క సాంగోపాంగ వివరణ విస్తృతంగా ఉన్నది. తృతీయాంశంలో వివిధాశ్రమ సంబంధమైన కర్తవ్యాల విధులు చెప్పబడ్డాయి. ఈ అంశం లోనే మూడు అధ్యాయాలలో (4,5,6) వేదముల యొక్క వివిధ శాఖల విశిష్టమైన వర్ణ నము ఉన్నది. ఇది వేదాధ్యయనం చేసేవారికి వేద విజ్ఞాన జిజ్ఞాసువులకు చాలా అవసర మైన విషయము. నాల్గవ అంశం ముఖ్యంగా ఐతిహాసిక లేక చారిత్రక విషయాలకు సంబంధించినది. ఇందులో చంద్రవంశానికి చెందిన యయాతి చరిత్ర చెప్పబడింది.

యదు, తుర్వసు, ద్రుహ్య, అను, పురులనే ఈ అయిదు ప్రసిద్ధ క్షత్రియ వంశాలను గురించిన విషయాల వర్ణన వివిధ అధ్యాయాలలో ఉన్నది. పంచమాంశం 37వ అధ్యాయంలో శ్రీకృష్ణ భగవానుని అలౌకిక చరిత్ర, వైష్ణవభక్తుల వృత్తాంతము ఉన్నది. ఈ అంశంలో భాగవతంలోని దశమ స్కంధంవలె శ్రీకృష్ణ చరిత్ర సంపూర్తిగా వర్ణించబడింది. కానీ ఈ చరిత్ర లోని వృత్తాంతాలు సంగ్రహంగానే ఉన్నాయి. షష్ఠాంశంలో కేవలం ఆరు అధ్యాయాలు మాత్రమే ఉన్నాయి. ఇందులో ప్రళయము గురించి, భక్తి వివేచన గురించి వివరించబడి ఉన్నది.

సాహిత్యదృష్టితో చూస్తే విష్ణుపురాణం చాలా రామణీయకమైన గ్రంథం. వృత్తాంతాలను సరసంగా, సుందరంగా వివరించిన పురాణం ఇది. దీని నాల్గవ అంశంలో ప్రాచీన గద్యరూపాలకు విశిష్ట ఉదాహరణలు లభిస్తాయి. జ్ఞానంతోపాటు భక్తియొక్క సామంజస్యం ఈ పురాణంలో చాలా హృద్యంగా ప్రదర్శింపబడింది. ప్రధానంగా ఇది విష్ణుపారమ్యంగా రచింపబడిన పురాణం అయినా, ఇందులో సంప్రదాయక వైష్ణవేతర న్యూనత సుతరాము కనిపించదు. శ్రీకృష్ణ భగవానుడే స్వయంగా తాను శివుడు అభిన్నులమని శ్రీముఖునితో చెప్పిన ఈ విషయం ద్వారా తెలుస్తుంది.

యో஽హం సత్వం జగచ్చేదం సదేవాసుర రమానుషం
మత్తో నాన్య దశేషం యత్, తత్తంజ్ఞాతుమిహార్హసి
అతిద్యామోహితాత్మానః పురుషాభిన్న దర్శినః
వదంతి భేదం పశ్యంతి, చావే యోరంతరంహర.

అంతేగాకుండా మనుష్యులు మాట్లాడాలి. ఆ మాట్లాడేది సుందరంగా ఉండాలని ఈ పురాణం తెలుపుతున్నది చూడండి.

హితం, మితం, ప్రియంకాలే వశ్యాత్మా యో஽భిభాషతే
సయాతి, లోకానాహ్లాదహేతు భూతాన్ నృపాక్షయాన్.

పురాణాల మిత్రసమ్మితంగా విషయాన్ని వివరిస్తుందనేది విష్ణుపురాణం ద్వారా ప్రతి అక్షరంలోనూ నిరూపించబడుతుంది.

ఇది రెండు భాగాలు. పూర్వభాగం, ఉత్తర భాగం అనేవే. ఇప్పుడు కేవలం పూర్వ భాగమే లభ్యం అవుతున్నది. ఈ పూర్వభాగం ఆరు అంశాలుగా విభజించబడింది. ప్రథమాంశంలో 22, ద్వితీయాంశంలో 16, తృతీయాంశంలో 28 చతుర్థాంశంలో 24 పంచమాంశంలో 38. షష్ఠ్యాంశలో 8 అధ్యాయాలు ఉన్నాయి. మొత్తం ఆరు అంశాలలోని 12 అధ్యాయాలలో 23 వేల శ్లోకాలు ఉండగా ఉత్తర భాగం లభ్యం కావటం లేదు. అయితే కొందరు విష్ణు ధర్మోత్తరమనే పురాణాన్ని విష్ణుపురాణ ఉత్తర భాగంగా భావిస్తున్నారు. విష్ణు ధరోత్తరాన్ని కలుపుకొంటే ఇంతకు ముందు చెప్పిన 23 వేల శ్లోక సంఖ్య సంపూర్ణం అవుతుంది.

5. వాయు పురాణం :

ఇది అన్ని పురాణాలలోకి చారిత్రకదృష్టితో చూస్తే ప్రాచీనమైన పురాణం. మహాకవి బాణభట్టు తన కాదంబరి గద్యకావ్యంలో 'పురాణేవాయు ప్రలపితమ్' అని దీనిని పేర్కొన్నాడు. అందువలన దీని రచనము బాణభట్టు కంటే చాలా పూర్వమే జరిగి ఉండాలని చెప్పవచ్చు. మిగిలిన వానితో పోలిస్తే ఇది పరిమాణంలో చిన్నదే. ఇందులో కేవలం 112 అధ్యాయాలున్నాయి. శ్లోకాల సంఖ్య దాదాపు పదకొండువేలు. ఈ పురాణం నాలుగు పాదాలుగా విభజించబడింది. వీటిని పాదాలు అంటున్నారు. అవి. 1) ప్రక్రియాపాదం, 2) అనుషంగపాదం, 3) ఉపోద్ఘాత పాదం, 4) ఉపసంహార పాదం అనేవి. దీని మొదటి ప్రక్రియాపాదంలో సృష్టిక్రమాన్ని గురించి చాలా విపులంగా అనేక అధ్యాయాలలో వర్ణించబడింది. తరువాత చతురాశ్రమ విధానాల వివరణ ఉన్నది. ప్రాచీన భౌగోళిక విషయాల అధ్యయనం కోసం ఈ పురాణం చాలా ఉపయోగకరమైన గ్రంథం. ఇందులో జంబూ ద్వీపవర్ణన విస్తృతంగా ఉన్నది. అలాగే ఇతర ద్వీపాల విషయం కూడా చక్కని శైలిలో 6 అధ్యాయాలలో (34 నుంచి 39 వరకు) వివరించబడింది. ఖగోళవర్ణన కూడా ఈ పురాణంలో విస్తృతంగా చేయబడింది. (50 నుంచి 53 అధ్యాయాలు) అనేక అధ్యాయాలలో యుగ, యజ్ఞ, ఋషి, తీర్థవర్ణనలు విస్తృతంగా లభ్యం అవుతున్నాయి. 60వ అధ్యాయంలో నాలుగు వేదాలలోని వివిధ శాఖల వివరణ విస్తృతంగా ఉన్నది. సాహిత్య దృష్టితో ఈ పురాణం విస్తృతంగా అధ్యయనం చేయవలసిన అవసరం చాలా ఉన్నది. ప్రజాపతి వంశవర్ణన (అధ్యయం 61-65) కశ్యపీయ ప్రజ్ఞాసర్గ (66-69 అధ్యాయాలు), ఋషివంశ వర్ణన (70వ అధ్యాయం), ప్రాచీన బ్రాహ్మణ వంశాల చరిత్రను తెలుసుకొనటానికి ఈ వివరాలు చాలా వరకు ఉపయోగపడతాయి. శ్రాద్ధవర్ణన కూడా అనేక అధ్యాయాలలో ఉన్నది. 86వ అధ్యాయం87వ అధ్యాయం వరకు సంగీత విషయాలను గురించిన ప్రత్యేక వివరాలు ఉన్నాయి. 99వ అధ్యాయాల ప్రాచీన రాజుల చరిత్రను విస్తృతంగా వివరించింది. అందుచేత చారిత్రక దృష్టితో పరిశీలిస్తే ఇది చాలా ముఖ్యమైన పురాణం.

ఈ పురాణం యొక్క ముఖ్యవైశిష్ట్యం శివచరిత్రాన్ని విస్తృతంగా వర్ణించటం. కానీ ఇది సంప్రదాయిక దృష్టికోణంతో చూస్తే నిందార్హమైనదికాదు. చాలా అధ్యాయాలలో ఇందులో విష్ణువర్ణన కూడా ఉన్నది. విష్ణుమాహాత్మ్యము, ఆయన అవతారాల వర్ణన చాలా అధ్యాయాలలో కనిపిస్తుంది. పశుపతి ఆరాధనను తెలిపే పాశుపతయోగం ఈ పురాణంలో చాలా ప్రత్యేకంగా నిరూపించబడింది. అలాగే ఆ పాశుపతయోగ ప్రక్రియ చాలా విస్తృతంగా 11-15 అధ్యాయాలలో వివరించబడింది. ఈ విషయం ప్రాచీనయోగ శాస్త్ర అధ్యయనానికి చాలా అవసరమైనది. 24వ అధ్యాయంలో చెప్పబడిన శౌర్యస్తవం

సాహిత్యదృష్టితో పరిశీలించటానికి చాలా ప్రభావవంతమైనది. 30వ అధ్యాయంలో దక్షప్రజాపతి చేసినట్లుగా చెప్పబడే శివస్తుతి చాలా సుందరమైన రచనగలది. ఇవి వేదంలోని రుద్రాధ్యాయస్తుతులకు పౌరాణికరూపాలుగా చెప్పవచ్చు, చూడండి :

నమఃపురాణప్రభవే, యుగస్య ప్రభవేనమః
చతుర్విధస్య సర్గస్య, ప్రభవేఽనంత చక్షుషే,
విద్యానాం ప్రభవేచైవ, విద్యానాం పతయేనమః
నమోవ్రతానాంపతయే, మంత్రాణాం పతయేనమః

దీని నాలుగు పాదాలలో మొదటిదైన ప్రక్రియా పాదంలో 1-6 అధ్యాయాలు, రెండవదైన ఉపోద్ఘాత పాదంలో 7-64 అధ్యాయాలు మూడవదైన అనుషంగ పాదంలో 65-99 అధ్యాయాలు నాల్గవదైన ఉపసంహార పాదంలో 100-112 అధ్యాయాలు వెరసి 112 అధ్యాయాలు ఉన్నాయి.

శివ పురాణమా, వాయు పురాణమా ? ఏది మహా పురాణం అనే మీమాంస పురాణ పండితులలో ఉన్నదన్న విషయం ఇంతకుముందే చెప్పబడింది గదా. ఇక్కడ ఆ రెండింటిని గురించి పరిశీలిద్దాం :

శివ పురాణం ఏడు సంహితలుగా విభజించబడింది. 1.విద్యేశ్వర సంహిత 2. రుద్ర సంహిత, 3. శతరుద్ర సంహిత 4. కోటి రుద్ర సంహిత 5. ఉమా సంహిత 6. కైలాస సంహిత 7. వాయవీయ సంహిత అనేవి ఆ ఏడు విభాగాలు. ఇందులో రెండవదైన రుద్ర సంహిత 1. సృష్టి ఖండం 2. సతీ ఖండం, 3. పార్వతీ ఖండం 4. కుమార ఖండం 5. యుద్ధ ఖండాలనే అయిదు ఖండాలుగా విభజించబడింది. అలాగే ఏడవదైన వాయవీయ సంహిత పూర్వార్థ ఉత్తరార్థాలనే రెండు భాగాలుగా చేయబడింది. ఈ విధంగా మొదటిదైన విద్యేశ్వర సంహితలో 25 అధ్యాయాలు, రెండవదైన రుద్ర సంహితలో (20 + 43 + 55 + 20 + 19) 197 అధ్యాయాలు మూడవదైన శతరుద్ర సంహితలో 42, నాల్గవదైన కోటిరుద్ర సంహితలో 43, ఐదవదైన ఉమాసంహితలో 57 అధ్యాయాలు ఆరవదైన కైలాస సహింతలో 23, ఏడవదైన వాయవీయ సంహితలో (35 + 41 = 75) అధ్యాయాలు వెరసి 464 అధ్యాయాలు 24 వేలశ్లోకాలు ఉన్నాయి.

5. శ్రీమద్భాగవతం :

భాగవతం భక్తి శాస్త్ర సర్వస్వంగా పండితులు భావిస్తారు. వైష్ణవ ఆచార్యులు ప్రస్థానత్రయంతోపాటు భాగవతాన్ని కూడా తమ ఉపజీవ్య గ్రంథంగా భావిస్తారు. వైష్ణవంలో శాఖలైన వల్లభ సంప్రదాయం, చైతన్య సంప్రదాయ అనుయాయులపై భాగవత తత్త్వ

ప్రభావం చాలా ఎక్కువ. భాగవతమునందలి తత్త్వ గూఢార్థాలను వివరించటానికి వివిధ వైష్ణవ సంప్రదాయ అనుయాయులు, తమతమ తత్త్వవాదాలను అనుసరించి దీనికి ప్రత్యేక వ్యాఖ్యానాలు రచించారు. రామానుజమతానుసారం సుదర్శన సూరి రచించిన శుకపక్షీయము, వీరరాఘవాచార్యుని భాగవతచంద్రచంద్రిక, మధ్వమతాను సారం విజయా ధ్వజుని పదరత్నావళి, నింబార్క మతానుసారం రచించిన శుకదేవాచార్యుని సిద్ధాంత ప్రదీపము, వల్లభమతానుసారం స్వయంగా వల్లభుడే రచించిన సుబోధిని ఇలాంటివి ఇంకా లెక్కకు మిక్కిలిగా అనేక వ్యాఖ్యానాలు ఉన్నాయి అంటే, భాగవతం యొక్క విశిష్టతను తెలుసుకొనవచ్చు. అద్వైతమతానుసారం శ్రీధరస్వామి రచించిన శ్రీధరీయ వ్యాఖ్య విశేష ప్రచారంలో ఉన్న వ్యాఖ్య. ఆయా సంప్రదాయాల మౌలికమైన ఆధ్యాత్మిక కల్పనల ఆధారంగా నిలిచిన గ్రంథం, ఈ పద్దెనిమిది వేల శ్లోకాలు కలిగిన భగవంతుని స్వరూపమైన భాగవతం. వివిధ వైష్ణవ సంప్రదాయాలకు చెందినవారు తమ తమ సంప్రదాయాలకు అనుగుణంగా వ్యాఖ్యలు వ్రాసినా, భాగవతంలో అద్వైత తత్త్వానికి మాత్రమే సరిగా సమ న్వయం అయ్యే ఘట్టాలు చాలా ఉన్నాయి. ఇందుకు కారణం భక్తికి అద్వైతానికీ వైరుధ్యం లేకపోవటమే. భాగవతంలో

అహమే వాసమేవాగ్రే, నాన్యద్యత్సరసత్పరమ్
పశ్చాదహం యదేతచ్చయోన, శిష్యేతసోఽస్మ్యహమ్ (2-9-32)

(సృష్టికి పూర్వం నేనే ఉన్నాను. అప్పుడు స్థూల ప్రపంచంగాని, తత్కారణంగానీ లేదు. తర్వాత ఆవిర్భవించిన ప్రపంచమూ నేనే. ప్రళయానంతరం మిగిలేదీ నేనే) - వంటి అద్వైత తత్త్వ ప్రతీకాలైన అనేక శ్లోకాలను ఉద్ధరించవచ్చు.

అద్వితీయ జ్ఞాన రూపమైన పరబ్రహ్మనే అనేక నామాలతో పిలుస్తూ ఉంటారు.

వదన్తి తత్తత్వ విదస్తత్త్వం యద్ జ్ఞానమద్వయమ్
బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి శబ్దతే
జ్ఞానం విశుద్ధం పరమార్థమేకమనంతరం త్వ బహిర్బ్రహ్మసత్యం
ప్రత్యక్ ప్రశాన్తం భగవచ్ఛబ్ద సంజ్ఞం యద్వాసుదేవం క్వయోవదన్తి *(5-12-11)*

అని చెప్పబడింది. అలాంటి పరబ్రహ్మతత్త్వాన్ని కనుగొనటానికి ఉత్తమ సాధనంగా భక్తిని ఉపదేశించటం భాగవతం యొక్క వైశిష్ట్యము.

భాగవతంలోని భాగాలను స్కంధాలంటారు. మొత్తం భాగవతం 12 స్కంధాలుగా విభజించబడింది. ఇందులో ప్రథమ స్కంధంలో 19, ద్వితీయ స్కంధంలో 10 తృతీయ

స్కంధంలో 33, చతుర్థ స్కంధంలో 31, పంచమ స్కంధంలో 26, షష్ఠ స్కంధంలో 19, అష్టమ స్కంధంలో 15, నవమ స్కంధంలో 24, దశమ స్కంధంలో 90, ఏకాదశ స్కంధంలో 31 ద్వాదశ స్కంధంలో 13 వెరసి 335 అధ్యాయాలున్నాయి. ఇందులోని మొత్తం శ్లోకాల సంఖ్య 18,000. పురాణాలను గురించి తెలుపుతూ భాగవతం పురాణానికి దశ లక్షణా లుండాలని నిర్దేశించింది. పురాణం పంచ లక్షణం అని చెప్పిన నిర్వచనం ప్రకారం ఈ గ్రంథానికి పంచలక్షణాలే గాక తాను స్వయంగా పురాణ లక్షణాలుగా చెప్పిన దశ లక్ష ణాలు కూడా దీనికి సమన్వయిస్తాయి. భాగవత రచన క్రీ.శ. 6వ శతాబ్దానికి ముందే జరిగి ఉండాలి. ఇందులో దక్షిణ దేశంలోని నదులు, పర్వతాలు, తీర్థక్షేత్ర ప్రశంసలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ గ్రంథం ద్రవిడ దేశంలో విష్ణు భక్తి ఎక్కువగా ఉండగలదని చెప్తున్నది. ఆ కారణంచేత ఇందుకు దక్షిణ దేశంలో జన్మించిన ఆళ్వారు (వైష్ణవభక్తు)ల సూచనలు ఉండి ఉండవచ్చని భావించటం జరిగింది. ఈ పురాణం దక్షిణదేశంలో అందులోనూ ద్రవిడ దేశంలో రచింపబడి ఉంటుందని పురాణ విమర్శకుల అభిప్రాయం.

అయిదవ మహాపురాణమైన భాగవతం పరిగణనలోను విష్ణు భాగవతమే మహా పురాణమని దేవీ భాగవతం ఉప పురాణమని కొందరు భావిస్తుండగా శాక్తేయులు కాదు దేవీ భాగవతమే మహా పురాణమని వాదిస్తున్నారు. ఎవరి వాదాన్ని బలపరిచే ఉపపత్తులు వారికి ఉన్నాయి.

దేవీ భాగవతం కూడా పన్నెండు విభాగాలుగానే విభజించటం జరిగింది. ఒక్కొక్క విభాగం పేరు స్కంధం. ఇందులో వరుసగా 20, 12, 30, 25, 35, 31, 40, 24, 50, 13, 24, 24. అధ్యాయాలు వెరసి 328 అధ్యాయాలు ఉన్నాయి. ఈ పురాణంలోను శ్లోకాల సంఖ్య 18,000 లే.

6. నారదపురాణం :

నారదపురాణము, మహాపురాణ రూపమున ఉపపురాణ రూపమున కూడా లభ్యం అవుతున్నది. అందువలన ఈ రెండింటిని వేరు వేరుగా పేర్కొనటానికి కొందరు నారదీయపురాణము అని పిలుస్తున్నారు. హెచ్.హెచ్.విల్సన్ వంటి కొందరు పండితులు ఇది సాధారణ వైష్ణవ భక్తి గ్రంథమని, 16వ శతాబ్దంలో రచింపబడిందని తెలుపుతున్నా ఇది అంతగా పరిగణించవలసిన విషయం కాదు. 12వ శతాబ్దంవాడైన బల్లాల సేనుడు తన దానసాగరం అనే గ్రంథంలో ఈ పురాణంలోని శ్లోకాలను ఉద్ధరించాడు. 11వ శతాబ్దంవాడైన ఆల్బెరూని కూడా తన యాత్రా విశేషాల గ్రంథంలో దీనిని పేర్కొన్నాడు. అందువలన ఈ పురాణం ఈ యిరువురి కాలం కంటే ప్రాచీనమైనదని చెప్పవచ్చు. ఈ గ్రంథం పూర్వభాగంలోని 24-25 అధ్యాయాలలో వర్ణాశ్రమాచారాలు, 28వ అధ్యాయంలో

శ్రాద్ధవిధి ప్రాయశ్చిత్తము మొదలైనవి వర్ణించబడ్డాయి. దీని తరువాత వ్యాకరణం, నిరుక్తం, జ్యోతిషం ఛందస్సు, మొదలైన వివిధ శాస్త్రాల విషయాలు వివిధ అధ్యాయాలలో వివరించ బడ్డాయి. అనేక అధ్యాయాలలో విష్ణువు, రాముడు, ఆంజనేయ, కృష్ణ, కాళి, మహేశ్వరుల మంత్రాల వివిధ విధులు నిరూపించబడ్డాయి. ఇందులో మోక్షం సాధించటానికి విష్ణు భక్తియే పరమసాధనంగా చెప్పబడింది. ఈ అంశాన్నే స్వీకరించి ద్వితీయ భాగంలో 7-37 అధ్యాయాలలో పరమవిష్ణుభక్తుడైన రుక్మాంగదమహారాజ చరిత్ర వర్ణింపబడింది.

ఐతిహాసిక దృష్టితో చూచినా ఈ పురాణానికి చాలా ప్రత్యేకత ఉన్నది. అష్టాదశ పురాణాలలో చెప్పబడిన విషయానుక్రమణిక పూర్వభాగంలోని 92 నుంచి 109 అధ్యాయాలలో ఇవ్వబడింది. అన్ని పురాణాలలోను చెప్పబడిన విషయాలను తెలుసు కొనటానికి ఈ అనుక్రమణిక చాలా ఎక్కువగా ఉపయోగపడుతుంది. దీని ఆధారంగా ప్రస్తుతం లభ్యం అవుతున్న పురాణాలమూల రూపము, ప్రక్షిప్త అంశాలను మనం తేలికగా తెలుసుకొనవచ్చు. దీనిలో విష్ణుభక్తికి ప్రాధాన్యత ఉన్నా ఈ పురాణంలో పురాణ పంచ లక్షణాలు కూడా ఉన్నాయి. నారద పురాణం విష్ణు పారమ్యాన్ని బోధించే పురాణం మాత్రమే కాదు. పాంచరాత్ర విధాన వర్ణనం కూడా ఈ పురాణంలో కనిపిస్తుంది. ఇది అనేక వైష్ణవ ఆగమాలను పేర్కొంటున్నది. ఈ పురాణంలో బౌద్ధుల నింద చాలా ఎక్కువగా కనిపిస్తుంది. అలాగే వైష్ణవులకు ముఖ్యదినమైన ఏకాదశీ వ్రతమాహాత్మ్య వర్ణనం అతి విస్తృతంగా కనిపిస్తుంది. వైష్ణవ భక్తుడైన రుక్మాంగదుని ఉపాఖ్యానంలో తన రాజ్యంలోని 8 నుంచి 80 సంవత్సరాల వయస్సు ఉన్నవారివరకు ఏకాదశీ వ్రతం చేయాలని, అలా చేయని పక్షంలో వారు వధ్యులు-దండ్యులు ఔతారని ఆజ్ఞ ఇచ్చాడని ఈ పురాణం తెలుపుతున్నది.

ఈ పురాణం క్రీ.శ. 700-800 ల మధ్య రచింపబడి ఉండాలని పండితుల భావన. నారద పురాణం రెండు భాగాలుగా చేయబడింది. అవి పూర్వ భాగం, ఉత్తర భాగాలుగా పిలువబడుతున్నాయి. వీటిలో పూర్వ భాగంలో నాలుగు పాదాలు ఉన్నాయి. ఈ నాలుగు పాదాలలోను ఉండగా, 125 అధ్యాయాలు ఉత్తర భాగంలో 82 అధ్యాయాలు మొత్తం 207 అధ్యాయాలుగా విభజించబడి ఉన్నది. దీనిలోని మొత్తం శ్లోకాల సంఖ్య 25,000 లు.

7. మార్కండేయ పురాణం :

మార్కండేయ మహామునిచేత చెప్పబడిన పురాణం కాబట్టి దీనికి మార్కండేయ పురాణమనే పేరువచ్చింది. విస్తృతిలో ఈ పురాణం చిన్నదేనని చెప్పాలి. ఈ పురాణం మొత్తాన్ని పర్గీటర్ ఆంగ్లంలోకి అనువాదం చేశాడు. దీనిలోని తొలి కొన్ని అధ్యాయాలు

జర్మన్ భాషలోకి కూడా అనువదించబడ్డాయి. ఆ భాగంలో మరణానంతరం జీవుని స్థితి చెప్ప బడింది. పశ్చిమదేశీయ పండితుల అభిప్రాయం ప్రకారం ఈ పురాణం అతి ప్రాచీన మైనది. వారి దృష్టిలో ఇది చాలా ప్రజాదరణ గలది. అందరూ అవశ్యం అధ్యయనం చేయ దగింది. నిజానికి వారిభావన సరియైనదే. ప్రాచీనకాలానికి చెందిన ప్రసిద్ధ బ్రహ్మావాదిని మహర్షిణి మదాలస పవిత్ర చరిత్ర ఈ గ్రంథంలో బాగా విస్తరించి వివరించబడింది. మదాలస తన పుత్రుడైన అలర్కునికి చిన్నతనం నుంచే బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించి నందు వలన అతడు మహారాజు అయిన తరువాత గూడా జ్ఞాన యోగకర్మయోగాలను సమన్వయించి చూపించి పరిపాలన సాగించాడు. ఇందులో చెప్పబడిన దుర్గాసప్తశతి చాలా ప్రత్యేకత గలది. ఇందులో దేవీ భక్తులకు సర్వస్వరూపిణియైన దుర్గ యొక్క పవిత్ర చరిత్ర చాలా విస్తారంగా వర్ణించబడింది. దుర్గాసప్తశతి మహాకాళి–మహాలక్ష్మి–మహాసరస్వతీ రూపురాలైన దేవి యొక్క మాహాత్మ్యాన్ని ప్రతిపాదిస్తూ 136 అధ్యాయాలలో విస్తరించింది. మన్వంతర వర్ణనం కూడా విస్తృతంగా కలిగిన పురాణం ఇది. కొన్ని వైదిక కర్మల ద్వారా అభీష్టఫలాలను ఏ విధంగా పొందవచ్చునో కొన్ని ఉపాఖ్యానాల ద్వారా విశదీకరించ బడింది. అనేక విష యాలు మార్కండేయపురాణం నుంచి దేవీ భాగవతంలోనికి స్వీకరింపబడ్డాయి. ఈ పురాణ రచనాకాలం క్రీ.శ. 400–500 మధ్యకాలం అని పురాణ విమర్శకుల అభిప్రాయం.

మార్కండేయ పురాణంలో 136 అధ్యాయాలు ఉన్నాయి. దీని శ్లోక సంఖ్య 9,000లు కానీ ఇప్పుడు లభ్యమవుతున్న మార్కండేయ పురాణంలో కేవలం 6,900 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి.

8. అగ్నిపురాణం :

అందులో చెప్పబడిన విషయాల వైచిత్ర్యంవల్ల అష్టాదశ పురాణాలలో అగ్ని పురాణానికి చాలా ప్రత్యేకత ఉన్నది. ప్రస్తుతం లభ్యం అవుతున్న అగ్నిపురాణంలో నారద పురాణం చెప్పిన విషయానుక్రమణిక యథాతథంగా ఉన్నది. కానీ నారదపురాణం 'ఇది ఈశానుకల్పంలో జరిగిన వృత్తాంతం' అని చెప్పిన విషయం మాత్రం లభ్యం కావటం లేదు. ఇందులోని రెండవ అధ్యాయంలో 'ప్రాప్తే కల్పేతువారాహే కూర్మరూపోऽ అభవద్ధరిః' అని చెప్పబడటం చేత ఇది వరాహకల్పవృత్తాంతం అని తెలుసుకొనవచ్చు. పైగా 'వసిష్ఠాయాऽ అనలో అబ్రవత్' అనగా వసిష్ఠునిచేత చెప్పబడిన అగ్నివృత్తాంతం కూడా లేదు. బ్రహ్మ మానసపుత్రుడైన మరీచిమహాముని ద్వాదశ వార్షిక సత్రయాగంలో అగ్నికి ధర్మానుష్ఠానాన్ని గురించి చేసిన ఉపదేశం మీద ఆధారపడి ఈ పురాణం ఆరంభం అవుతున్నది. స్కాంద పురాణంలోని శివరహస్య ఖండంలో ఈ పురాణం అగ్నిదేవుని

మహాత్మ్య ప్రతిపాదనం ఈ పురాణ ప్రధాన లక్ష్యం అని పేర్కొంటున్నా, ఇలాంటి వృత్తాంతాలు అగ్ని పురాణంలో లేనేలేవు. ప్రస్తుతం అగ్ని పురాణమని, వహ్ని పురాణమని రెండు పురాణాలు లభ్యం అవుతున్నాయి. రెండింటిలో చెప్పబడిన విషయాలలోను కొంత ఐక్యత ఉన్నది. బల్లాలసేనుడు అగ్ని పురాణంలోనివిగా ఉద్ధరించిన కొన్ని శ్లోకాలు ప్రస్తుత అగ్ని పురాణంలో లభ్యం కావటం లేదు. అగ్ని పురాణంలోని చాలా విషయాలు, వహ్ని పురాణంలో కూడా ఉన్నాయి.

దీని వక్త అగ్ని. శ్రోత వశిష్ఠుడు. ఇందులో ఈశానుకల్ప వృత్తాంతం ఉన్నది. ఆధునికులు అగ్ని పురాణాన్ని భారతీయుల సమస్త విజ్ఞానకోశం అంటున్నారు. దీనిని జాగ్రత్తగా పరిశీలిస్తే పురాణాల ముఖ్య ఉద్దేశ్యం భారతీయ విద్యలను జనసామాన్యం చేరువలోనికి తీసుకొనిరావటమే అనిపిస్తుంది. ఇందులోని 383 అధ్యాయాలలో అనేక విషయాలు వివరించటం ఆశ్చర్యం అనిపిస్తుంది. ఇందులో అవతారతత్త్వంతోపాటు రామాయణ మహాభారత హరివంశ కథలసారం ఇవ్వబడింది. అనేక విధాలైన దేవాలయాల నిర్మాణ కళను వివరించటంతోపాటు విగ్రహప్రతిష్ఠ పూజావిధానం మొదలైన వాటిని గురించి విస్తృతంగా వివరించబడింది. నాలుగు ఉపవేదాలు, వేదాంగాలు, తాత్త్విక, దార్శనిక విషయాలు మాత్రమే గాకుండా పశుచికిత్స, ధర్మశాస్త్ర, రాజనీతి, ఆయుర్వేదం మొదలైన శాస్త్రాల విషయాలు ప్రత్యేకంగా వివరించటం జరిగింది. చివరలో కావ్య సౌందర్య విషయాలతోపాటు అలంకార శాస్త్ర విషయాలు కూడా ఇందులో చెప్పబడ్డాయి. ఛందశ్శాస్త్రం 8 అధ్యాయాలలో వివరించబడింది. వ్యాకరణశాస్త్ర క్లుప్తీకరణ చాలా ప్రత్యేకంగా చెప్పబడింది, కౌమార వ్యాకరణం అనే పేరుతో ఒక చిన్న వ్యాకరణము, ఏకాక్షర కోశము, నామలింగానుశాసనము, యోగశాస్త్ర అంగాల వివేచనము అద్వైత వేదాంత సారము ఇందులో సమకూర్చబడ్డాయి. ఈ విధంగా అగ్ని పురాణంలో భారతీయ సాహిత్యము, సంస్కృతులకు సంబంధించిన అన్ని విషయాలు సంక్షిప్త రూపంలో సంకలనం చేయబడ్డాయి. అందువలననే 'ఆగ్నేయేహి పురాణేఽస్మిన్ సర్వావిద్యాః ప్రదర్శితాః" అని చెప్పబడింది. ఇందులో ఆయుర్వేదము, గాంధర్వవేదము, అర్థశాస్త్రంవంటి వేదాంగాలకు సంబంధించిన విషయాల వర్ణన ఉన్నది. ఇందులో పురాణ పంచలక్షణాలతోబాటు హిందూ సంస్కృతి, సాహిత్యాల అన్ని విషయాల వివరణ ఉన్నది.

బ్రహ్మజ్ఞానం తతఃపశ్చాత్ పురాణ శ్రవణే ఫలమ్
ఏతదాగ్నేయకం విప్ర పురాణం ప్రకీర్తితమ్.

ఈ పురాణ శ్రవణం లేక మననం ద్వారా బ్రహ్మజ్ఞానం లభిస్తుందనటంలో అతిశయోక్తి లేదు. ఈ పురాణ రచన క్రీ.శ. 7-11 శతాబ్దాల మధ్య జరిగి ఉండవచ్చు.

దీని సంస్కరణ క్రీ.శ. 13వ శతాబ్దిలో జరిగి ఉండవచ్చు. అగ్ని పురాణంలో అనేక తాంత్రిక అనుష్టాన విధానాలు ప్రతిపాదించబడ్డాయి. వీనిలోని కొన్ని ప్రత్యేక అనుష్టానాలు ఈనాటికి వంగదేశంలో ప్రచారంలో ఉన్నాయి. అందువలన ఇది వంగ దేశంలో రచింపబడి ఉండాలని భావించబడుతున్నది.

అగ్ని పురాణంలో 383 అధ్యాయాలు ఉన్నాయి. అందులో నారద పురాణానుసారం 25,000 శ్లోకాలు, మత్స్యపురాణాను సారం 13,000 శ్లోకాలు ఉండాలి. కానీ వాస్తవంలో నేడు లభ్యం అవుతున్న అగ్నిపురాణంలో 12,000 శ్లోకాలు ఉన్నాయి.

9.భవిష్యపురాణం :

ఈ పురాణ విషయంలో పండితులలో ఉన్నంత గందరగోళం వేరు ఏ పురాణం విషయంలో కూడా లేదు. రాబోయేకాలంలో జరుగబోయే వృత్తాంతాలను వివరించదలచిన పురాణం కాబట్టి దీనికి ఈ పేరు వచ్చింది. ఇందువలన ఈ పేరును సార్థకం చేయ టానికి ఆయా కాలాలలో పండితులు రాబోయే చరిత్ర అంటూ అనేక అర్వాచీన విషయా లను చేర్చటం జరిగింది. తత్ఫలితంగా 'ఇంగ్రేజ' అనే పేరుతో ఇంగ్లీషువారు భారతదేశం రావటం కూడా చెప్పబడింది. జ్వాలాప్రసాద్‌మిశ్రా అనే పండితుడు తమ దగ్గర నాలుగు భవిష్య పురాణ లిఖిత ప్రతులున్నట్లు, ఒకదానితో మరొకదానికి అంతగా సంబంధం లేనట్లు తెలిపారట. ఇవి అన్నీ కలిపివేయగా ఏర్పడిన పురాణం ఈనాడు భవిష్యపురాణంగా ప్రచారంలో ఉన్నది. ఈ పురాణాన్ని నారద, అగ్ని, మత్స్య, వాయు పురాణాలు పేర్కొం టున్నవి. అందుచేత ఇది ప్రాచీన పురాణమేనని చెప్పటంలో ఏమాత్రం సందేహించవలసిన అవసరం లేదు. నారద పురాణాన్ని అనుసరించి ఇందులో అయిదు పర్వాలున్నాయి. ఈ పురాణంలో సూర్యోపాసన విస్తృతంగా వర్ణించబడింది. శ్రీకృష్ణుని పుత్రుడైన సాంబునికి కుష్ఠురోగం సంప్రాప్తించగా దాని నివారణకోసం గరుత్మంతుడు శాకద్వీపం నుంచి బ్రాహ్మణులను తీసుకొనిరాగా వారు సూర్యోపాసనా విధానంచేత ఆ వ్యాధిని నయం చేశారని ఈ పురాణం తెలుపుతున్నది. సూర్యోపాసన రహస్యాలు, కలియుగంలో ఆవిర్భవించిన అనేక రాజుల వంశవర్ణన కూడా ఈ పురాణంలో విస్తృతంగా ఉన్నది. ఆ రాజుల చరిత్రను అధ్యయనం చేయటానికి ఈ భాగ అధ్యయనం చాలా ముఖ్యం.

సృష్టి, స్థితి, లయలకు సంబంధించిన విషయాలు, ఆదిత్య చరిత్ర వర్ణన, పుస్తకములు వ్రాయుట లేక రచయితల లక్షణాలు, అన్ని సంస్కారాలు లేక కల్పాల వర్ణన, బ్రహ్మ, విష్ణు, శివుల మహిమ వర్ణన, ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే పురుషార్థాల చతుష్టయ వివరణ ఈ పురాణంలో ఉన్నది.

భవిష్య పురాణం ఐదు పర్వాలుగా విభజించబడింది. అవి 1. బ్రహ్మ పర్వం 2. వైష్ణవ పర్వం 3. శైవ పర్వం 4. సౌరపర్వం 5. ప్రతి సర్గ పర్వం – ఈ మొత్తం అయిదు పర్వాలలోను 605 అధ్యాయాలు ఉన్నాయి. నారద పురాణానుసారం 14 వేల శ్లోకాలు, మత్స్యపురాణానుసారం 14,500 శ్లోకాలు ఇందులో ఉన్నాయి.

10. బ్రహ్మవైవర్తపురాణం :

ఈ పురాణంలో పద్దెనిమిదివేల శ్లోకాలున్నాయి. అంటే భాగవతంతో సమాన విస్తృతి కలిగిన పురాణమన్నమాట. దీనిలో నాలుగు ఖండాలున్నాయి. 1) బ్రహ్మఖండం, 2) ప్రకృతి ఖండం, 3) గణేశఖండం, 4) కృష్ణజన్మఖండం. ఈ నాలుగు ఖండాలలోను కృష్ణజన్మఖండం పురాణంలో దాదాపు సగంకంటే పైభాగమే ఉన్నది. ఈ ఖండంలో 133 అధ్యాయాలున్నాయి. శ్రీ కృష్ణచరిత్రాన్ని విస్తృతంగా వర్ణించడం ఈ పురాణ ప్రధాన లక్ష్యం అనిపిస్తుంది. రాధ కృష్ణుని యొక్క శక్తి అని అందువలన రాధయొక్క వృత్తాంతం సాంగోపాంగంగా వర్ణించిన పురాణం ఇది. ఈ రాధావృత్తాంతం వల్లనే పలువురు పురాణ తత్త్వజ్ఞులు దీనిని చాలా ఆధునిక పురాణం అని భావిస్తున్నారు. కానీ వాస్తవానికి రాధ యొక్క కల్పన ప్రాచీనమైనదే. మహాకవి భాసుడు తన బాలచరిత్ర నాటకంలో శ్రీకృష్ణుని బాల్య క్రీడలు, రాధవర్ణన విస్తృతంగానే చేశాడనే విషయం మరువరాదు. భాసుడు క్రీ.శ. తృతీయ శతాబ్దంవాడు. అందువలన ఈ పురాణ రచనాకాలం మూడవ శతాబ్దానికి ముందే జరిగి ఉంటుందని భావించాలి. భాగవత దశమస్కంధంలోనూ ఈ పురాణంలో తప్ప వేరెక్కడా శ్రీకృష్ణచరిత్రం ఇంత విస్తృతంగా వర్ణించటం కనిపించదు.

1) బ్రహ్మఖండం : ఇందులో కేవలం ముప్పై అధ్యాయాలు మాత్రమే ఉన్నాయి. ఈ భాగంలో శ్రీకృష్ణుని ద్వారా జరిగిన జగత్సృష్టి వర్ణించబడింది. దీని 16వ అధ్యాయంలో ఆయుర్వేదశాస్త్ర విషయాలు చెప్పబడ్డాయి.

2) ప్రకృతి ఖండం : ఇందులో శ్రీకృష్ణుని ఆదేశానుసారం ప్రకృతి దుర్గ, లక్ష్మిసరస్వతి సావిత్రి, రాధల రూపంలో అప్పుడప్పుడు ఆవిర్భవించిన విషయాలు వర్ణించబడ్డాయి. ఈ ఖండంలో సావిత్రి, తులసిల కథలు విస్తృతంగా చెప్పబడ్డాయి.

3) గణేశఖండం : ఇందులో గణేశుని ఉత్పత్తి ఆయన చరిత్రలు వర్ణింపబడ్డాయి. గణేశుడు శ్రీకృష్ణుని అవతారమని ప్రతిపాదించబడింది.

వివృతం బ్రహ్మకార్త్స్న్యేన, కృష్ణేన యత్రశౌనక
బ్రహ్మవైవర్తకంతేన, ప్రవదంతి పురావిదః – *1-1-10*

కృష్ణుడు బ్రహ్మను వివరించటం చేత దీనిని బ్రహ్మ వైవర్తకమనే పేరు వచ్చిందని ఇందులో చెప్పబడింది. దీనికే బ్రహ్మ కైవర్త పురాణమని ఇంకొక పేరు ఉన్నది. ఈ పేరు ఎందుకు వచ్చిందో అంత స్పష్టంగా తెలియటంలేదు. దాక్షిణాత్యులలో బ్రహ్మ కైవర్త మనే పేరే ఎక్కువ ప్రచారంలో ఉన్నది. నారదపురాణంలో ఉన్న ఈ పురాణ విషయాను క్రమణిక ప్రస్తుతం లభ్యం అవుతున్న బ్రహ్మవైవర్త పురాణంలో చెప్పబడిన విషయాలతో పూర్తిగా ఏకీభవిస్తున్నది. శ్రీకృష్ణ పారమ్యాన్ని ప్రతిపాదించటం చేత కృష్ణభక్తులైన వైష్ణవులు ఈ పురాణానికి చాలా ప్రాముఖ్యతనిస్తున్నారు. ముఖ్యంగా గౌడీయవైష్ణవులు ఈ పురాణంపై హెచ్చుగా ఆదరణ చూపిస్తారు.

4) కృష్ణజన్మఖండం : సృష్టి ప్రకరణంలో నారద బ్రహ్మల సంవాదం, నారద శివలోక గమనము, తరువాత జ్ఞానలాభము, సావర్ణి, నారదుల శ్రీకృష్ణమాహాత్మ్య విషయక సంవాదము, ప్రకృతి అంశభూత కళల మాహాత్మ్యవర్ణనము గణేశ జన్మకథ, కార్తవీర్యచరిత్ర, పరశురామ గణేశ సంవాదము, శ్రీకృష్ణజననము, శ్రీకృష్ణుని వివిధ బాల్యలీలలు, కంసాది దుష్టుల హననము ద్వారకకు తిరిగివచ్చుట ఇందులో వర్ణింపబడ్డాయి.

బ్రహ్మవైవర్త పురాణం బ్రహ్మపారమ్యాన్ని బోధించే పురాణమని, అందుచేత ఇది రాజస పురాణాలలో చేరుతుందని అనేక పురాణాలలో చెప్పబడి ఉన్నది. మనకు లభ్యం అవుతున్న ఈ పురాణంలో శ్రీకృష్ణపారమ్యం చెప్పబడింది. అక్కడక్కడ బ్రహ్మనింద కూడా ఉన్నది. శ్రీకృష్ణుడే పరాత్పర బ్రహ్మ అనీ, ఆయన నివాసం గోలోకంలో అనీ, ఆయన భార్య రాధ అనీ, ప్రతిపాదించే బ్రహ్మవైవర్తం ప్రాచీన బ్రహ్మవైవర్తాన్ని వైష్ణవులు మార్చి వేయగా ఏర్పడినది. తంత్రశాస్త్రానికి సంబంధించిన విషయాలు పురాణాలలో తొమ్మిది, పదవ శతాబ్దాలలో ప్రవేశించాయి కాబట్టి, ఈ పురాణంలోని ప్రకృతి ఖండ, గణేశ ఖండాలలో తంత్రశాస్త్ర ప్రభావం అత్యధికంగా కనిపిస్తున్నందువలన ఈనాడు లభ్యం అవుతున్న బ్రహ్మవైవర్తపురాణం తొమ్మిదవ శతాబ్దం కంటె ప్రాచీనం కాదని, రాధాకృష్ణ సంప్రదాయం వర్ణింపబడి ఉండటం చేత ఇది 15వ శతాబ్దం ప్రాంతానికి చెంది ఉండవచ్చునని కొందరు పండితుల అభిప్రాయం.

ఈ పురాణంలో ముస్లిములను పేర్కొనటం జరిగింది. సంకర జాతులను వర్ణించే సందర్భంలో స్త్రీయందు మ్లేచ్ఛునివలన 'జోలా' జాతి పుట్టిందని తెలియజేయబడింది. "మ్లేచ్ఛాత్కువిందర కన్యాయాం జలా జాతిర్బభూవహ" (10-121) హిందీలోని 'జులాహా' (సాలెవాడు) వంగభాషలో 'జోలా' అయింది. అశ్వినీ కుమారుల వీర్యంవలన బ్రాహ్మణ కన్యయందు 'వైద్యుడు' పుట్టినాడని (10-123) తెలియజేయబడింది. ఈ ప్రసిద్ధి బెంగాల్‌లో

ఉన్నది. అందుచేతనే బెంగాల్‌లో బ్రాహ్మణులలో 'వైద్యుల'ను తక్కువచూపు చూస్తారట. ఇందులో నేటికీ బెంగాల్ ప్రాంతంలో ప్రచారంలో వున్న ఆరాధనాపద్ధతులు, వివిధ దేవతా పూజా విధానాలు చెప్పబడినాయి. రాధా వల్లభ సంప్రదాయానికి బెంగాల్ ఆవాసము. అందుచేత వీనినన్నింటినీ పరిశీలిస్తే ప్రస్తుతం లభ్యం అవుతున్న బ్రహ్మవైవర్త పురాణం బెంగాల్ ప్రాంతంలో రచింపబడిందని, ఇది ప్రాచీన బ్రహ్మ వైవర్త పురాణం కంటే వేరైనదని పండితులు, పురాణ విమర్శకులు భావిస్తున్నారు.

బ్రహ్మవైవర్త పురాణం 1. పూర్వ భాగ 2. ఉత్తర భాగాలనే రెండు భాగాలుగా చేయబడింది. ఇందులో మొదటిదైన బ్రహ్మ ఖండంలో 30, రెండవదైన ప్రకృతి ఖండంలో 57 మూడవదైన గణేశ ఖండంలో 46, నాల్గవదైన శ్రీకృష్ణ జన్మఖండం పూర్వ ఉత్తర భాగాలు కలిపి 133 అధ్యాయాలతో వెరసి 266 అధ్యాయాలు ఉన్నాయి. దీనిలో కూడా 18 వేల శ్లోకాలు ఉన్నాయి.

11. లింగపురాణం :

శివలింగచరిత్రం గురించి వివరించటం జరిగింది (లింగస్య చరిత్రోక్తత్వాత్ పురాణం లింగముచ్యతే) కాబట్టి దీనిపేరు లింగపురాణం అయిందని శివపురాణం పేర్కొంటున్నది. వివిధ పురాణాలలో లింగోద్భవం గురించి చెప్పిన విషయాలన్నీ ఇందులో ఉన్నాయి. ఈశానుకల్ప వృత్తాంత ప్రసంగం బ్రహ్మచేత చెప్పబడిందని ఈ పురాణంలో ఉన్నదని స్వయంగా లింగపురాణమే తెల్పుతున్నది. కానీ మత్స్య , నారద పురాణాలను అనుసరించి అగ్నికల్పంలోని కథావృత్తాంతం లింగపురాణంలో చోటుచేసుకోవాలి. ఈశానుకల్ప వృత్తాం తాలు అగ్నిపురాణంలో ఉన్నాయి. ఇందులో శివకేశవుల వృత్తాంతాలు వర్ణింప బడినా, ఎక్కడా అన్యదేవతా నింద కనిపించదు.

లింగపురాణంలో శివలింగపూజా వర్ణన హృదయంగమంగా చెప్పబడింది. శివుని ద్వారా సృష్టి ఆవిర్భావం చెందిందని, శివుని 28 అవతారాల వృత్తాంతము, శివసంబంధ మైన అనేక వ్రతాలు, తీర్థాలకు సంబంధించిన విశేషాలు ఇందులో ఉన్నాయి. ఇందులో శైవ దర్శనాలకు అనుకూలమైన పశు, పాశ అలాగే పశుపతి శబ్దాల వివేచనాత్మక వ్యాఖ్య కనిపిస్తుంది. లింగోపాసనయొక్క ఆవిర్భావము చాలా చక్కగా విశకరించబడింది. శివతత్త్వమీమాంస అధ్యేతలకు చాలా ఉపయోగకరమైనది ఈ పురాణం.

స్కాందపురాణంలోని రేవాఖండం, భాగవతం, మత్స్య నారదపురాణాలు, బ్రహ్మ వైవర్త పురాణానుసారం ఇది పురాణాలలో 11వ స్థానాన్ని ఆక్రమిస్తుంది. దీనిలో పదకొండు వేల శ్లోకాలున్నాయి. హలాయుధుడు తన ఒక గ్రంథంలో బ్రహలింగపురాణాన్ని ఒకదాని

నుంచి ఒకవచనాన్ని ఉద్ధరించాడు. కానీ అలాంటి పురాణమేదీ లభించలేదు. ఇదికాకుండా వసిష్ఠ లింగపురాణం ఒకటి లభిస్తున్నది. ఈ పురాణంలో శివుడిని లింగరూపంలో ఆరాధించే విధానాలు చెప్పబడ్డాయి. ఇందులో శైవదర్శనానికి ముఖ్యంగా పాశుపత సిద్ధాంతానికి సంబంధించిన అనేక విషయాలు ప్రతిపాదించబడ్డాయి. అష్టమూర్తియైన శివునికి ఎనిమిది మూర్తులకూ ఎనిమిది వైదిక నామధేయాలు చెప్పబడ్డాయి. అవి : పృథ్వీమూర్తి – శర్వుడు; జలమూర్తి = భవుడు; అగ్నిమూర్తి = పశుపతి; వాయుమూర్తి = ఈశానుడు; ఆకాశమూర్తి = భీముడు; సూర్యమూర్తి = రుద్రుడు; సోమమూర్తి = మహాదేవుడు; యజమానమూర్తి = ఉగ్రుడు అనేవి. ప్రత్యేకమూర్తికి భార్యా, ఒక పుత్రుడు చెప్పబడ్డారు.

బౌద్ధధర్మ ప్రాబల్యం తగ్గి, బ్రాహ్మణధర్మం అభివృద్ధి పొందుతున్న సమయంలో ఈ పురాణం కొంత సంస్కారం జరిగినట్లు భావించటానికి అవకాశం ఉన్నది. అప్పుడు అగ్ని పురాణంలో చెప్పినట్లు ఈశాన కల్పవృత్తాంతం ఇందులో చేరి ఉంటుందని భావించటానికి అవకాశం ఉన్నది. ఈ లింగపురాణంలో అగ్నికల్ప వృత్తాంతం అని స్పష్టంగా లేకపోయినప్పటికీ, ఇందులో ప్రతిపాదించిన విషయాలతోపాటు అగ్నిమయ లింగ వివరణ కూడా ఉన్నందువలన అలా భావించవలసివస్తున్నది.

సంప్రదాయజ్ఞుల చేతివాటంతో ఇందులో కొన్ని ప్రక్షిప్తాలుగా చేరిన శ్లోకాలను తీసివేసినట్లైతే లింగపురాణ ప్రాచీన రూపం కంటికి కట్టకలదు. ఇందులో ఉండే వివిధ వృత్తాంతాలను విడివిడిగా మార్చి అరుణాచల మాహాత్మ్యం, పంచాక్షర మాహాత్మ్యం, రుద్రాక్ష మాహాత్మ్యం, రామసహస్రనామం వంటి విడి పుస్తకాలుగా కూర్చడం జరిగింది. అనేక బాహ్య ఆంతరంగిక ప్రమాణాలను బట్టి ఈ పురాణం అష్టమ నవమ శతాబ్దాలకు సంబంధించి ఉంటుందని విమర్శకుల అభిప్రాయం. దానసాగరం అనే ఇంకొక స్మృతి గ్రంథాన్నిబట్టి ఆరువేల శ్లోకాలుగల ఇంకొక లింగ పురాణం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇదే వసిష్ఠలింగ పురాణమేమో.

లింగ పురాణం 1. పూర్వభాగం 2. ఉత్తరభాగమనే రెండు విభాగాలుగా చేయబడింది. అందులో పూర్వభాగంలో 108 అధ్యాయాలు, ఉత్తర భాగంలో 55 అధ్యాయాలు మొత్తం163 అధ్యాయాలు ఉన్నాయి. దీనిలోని మొత్తం శ్లోకాల సంఖ్య 11 వేలు.

12. వరాహ పురాణం :

విష్ణువు వరాహావతారాన్ని ధరించి భూదేవిని పాతాళలోకం నుంచి ఉద్ధరించిన వృత్తాంతం గల కథ ప్రధానంగా కలది కాబట్టి ఈ పురాణానికి వరాహ పురాణమనే

పేరువచ్చింది. మత్స్యపురాణంలో చెప్పబడిన దానిని అనుసరించి ఈ పురాణంలో మానవ కల్పంలోని వృత్తాంతాన్ని పృథ్విసమక్షంలో విష్ణువుద్వారా మహావరాహమూర్తి యొక్క మాహాత్మ్యం వర్ణించబడింది, కాబట్టి ఇది వరాహపురాణం అయింది. దీనిలోని శ్లోకసంఖ్య 24,000. అధ్యాయాల సంఖ్య 218. ఉపలబ్ధం అవుతున్న వరాహ పురాణాన్ని అనుసరించి నారదపురాణంలో చెప్పబడినట్లు మానవకల్ప వృత్తాంతం కానీ, మహా వరాహమాహాత్మ్య ప్రతిపాదనము ఏమీ ఇందులో కనిపించటం లేదు. ఇది గౌడదేశ పాఠము, దాక్షిణాత్య పాఠము అని రెండు విభిన్న రూపాలలో లభ్యం అవుతున్నది. రెండింటికి అధ్యాయాల సంఖ్య, శ్లోక సంఖ్యలలో కూడా మార్పులు ఉన్నాయి. ప్రస్తుతం లభ్యం అవుతున్న వరాహ పురాణంలో పదకొండువేల శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం గౌడదేశ పాఠమే ప్రచారంలో ఉన్నది. కానీ కలకత్తాలో అచ్చయిన ప్రతిలో కేవలం పదివేల ఏడువందల శ్లోకాలే ఉన్నాయి. అంటే ఇందులో చాలా భాగం ఇప్పటివరకు లభించలేదన్నమాట. ఈ పురాణంలో విష్ణువుకు సంబంధించిన అనేక వ్రతాలు వివరించబడ్డాయి. ప్రస్తుతం లభ్యం అవుతున్న వరాహ పురాణం భవిష్యోత్తరపురాణం లాగా, అనేక పురాణాలనుంచి తీసుకొన్న విషయ సమాహారమేమో అనిపిస్తుంది. విష్ణు సంబంధమైన ద్వాదశీవ్రతమాహాత్మ్యం ఇందులో విస్తృతంగా చెప్పబడింది. పదకొండు నెలలలో ఉన్న పదకొండు ద్వాదశులకు పదకొండు విష్ణురూపాలతో సంబంధం ఉన్నట్లుగా చెప్పబడింది. ఇలా మార్గశిర శుక్ల ద్వాదశి-మత్స్యద్వాదశ, పుష్యద్వాదశి-కూర్మద్వాదశి, మాఘద్వాదశి, వరాహ ద్వాదశి, ఫాల్గుణ ద్వాదశి - నరసింహద్వాదశి, చైత్ర ద్వాదశి-వామన ద్వాదశి, వైశాఖ ద్వాదశి - పరశు రామద్వాదశి, జ్యేష్ఠ ద్వాదశి-రామద్వాదశి, ఆషాఢ ద్వాదశి-కృష్ణద్వాదశి- శ్రావణ ద్వాదశి-బుద్ధ ద్వాదశి, భాద్రపద ద్వాదశి-కల్కి ద్వాదశి, ఆశ్వయుజ ద్వాదశి-పద్మనాభ ద్వాదశి.

ఇందులో చెప్పబడిన బుద్ధద్వాదశిని పరిశీలిస్తే హిందూ సమాజం బుద్ధుని ఒక అవతారంగా స్వీకరించిన తరువాతనే ఈ పురాణ రచన జరిగి ఉండవచ్చని భావించే అవకాశం ఉన్నది. ఆస్తికులు కొందరు వ్యాస మహాముని క్రాంతదర్శి కాబట్టి తనతర్వాత రాబోయే కాలంలో పుట్టబోయే బుద్ధుడిని పేర్కొని ఉంటాడని భావిస్తారు. ఇందులోని ఉత్తర భాగంలో పులస్త్య - కురురాజ సంవాదంలో చాలా విస్తరించి వివిధ వ్రతాలు, తీర్థాలు వాని మాహాత్మ్యాలు అనేక ధర్మ ప్రసంగ కథలు చెప్పబడ్డాయి. వీటిలో ఎక్కువ భాగం విష్ణువ్రతాలే. అయితే వీటిలో రెండు విషయాలకు చాలా ప్రత్యేకత ఉన్నది. ఒకటి మధురా మాహాత్మ్యం. మధురకు సంబంధించిన అనేక తీర్థాల విస్తృత ప్రసంగం ఇందులో ఉన్నది. రెండవది నచికేతోపాఖ్యానము. ఇందులో యమ నచికేతుల కథలో ప్రసంగవశాత్తు స్వర్గనరకలోకాల విస్తృతవర్ణన ఉన్నది. కఠోపనిషత్తులో చెప్పిన కథతో

ఈ కథ ఏకీభవిస్తున్నా, అందులో చెప్పిన ఆధ్యాత్మిక విషయాలు ఇందులో ఏమీ లేవు. నారద పురాణంలో చెప్పిన శ్లోక సంఖ్య ఇప్పుడు లభ్యం కావటం లేదు. శ్లోకాల్లో చాలా తక్కువే ఉన్నాయి. ఇది వరాహపురాణ పూర్వార్థం మాత్రమే అని భావించే అవకాశం ఉన్నది. నారదపురాణంలో పూర్వార్థ ఉత్తరార్థాలనే రెండు ఖండాలు చెప్పబడ్డాయి. దీనిలోని చాలా భాగాలు వేరేపురాణాలుగా లభ్యం అవుతూ అయినా ఉండాలి లేకపోతే పూర్తిగా దొరక కుండా పోయి అయినా ఉండాలి. ఇంతకు మించి ఇప్పుడు నిర్ణయించి చెప్పే అవకాశం లేదు.

లభ్యం అవుతున్న గౌడీయ, దాక్షిణాత్య పాఠాలు ఒక విషయంపైన ఉన్నవానిలో కూడా శ్లోకాలలో తేడా ఉండి వేరు వేరు గ్రంథాలుగాను, భిన్నకర్తృకాలుగానున్నట్లు తెలుస్తున్నది. జర్మనీలోని బెర్లిన్ గ్రంథాలయంలో ఉన్న రెండు ప్రతులను పరిశీలిస్తే ఈ విషయాలు స్పష్టం అవుతాయి. పదమూడవ శతాబ్దానికి చెందిన చతుర్వర్గ చింతామణి రచయిత హేమాద్రి వరాహ పురాణంలోని బుద్ధద్వాదశిని పేర్కొనడం, 12వ శతాబ్దికి చెందిన గౌడచక్రవర్తి బల్లాలసేనుడు వ్రాసిన దానసాగరంలో దీని నుంచి అనేక శ్లోకాలను ఉద్ధరించటంచేత ఇది 10వ శతాబ్దానికి ముందు కాలానికి చెందినదిగా భావించవచ్చు.

ఇందులో చాతుర్మాస్య మాహాత్మ్యం, గీతామాహాత్మ్యం, వేంకటశైలమాహాత్మ్యం, విష్ణుమాహాత్మ్యం, అంబికా మాహాత్మ్యం మొదలైనవానిని అనేక విడి పుస్తకాలుగా చేయవచ్చు. రామానుజీయ వైష్ణవ మతానికి చెందిన అనేక విషయాలు ఇందులో చేర్చబడ్డాయి. నారాయణుడే ఆది దేవుడని స్థాపించటం, జ్ఞానవర్గ సముచ్చయం, శ్రాద్ధవర్జ్య పదార్థాలు, ద్వాదశి నాటి విష్ణు పూజా విధానం, వివిధ లోహాలతో భగవత్ ప్రతిమా నిర్మాణం, వాటి ప్రతిష్ఠ, పాంచరాత్రాగమ ప్రామాణ్యం మొదలైనవెన్నో రామానుజ సంప్రదాయం వారిచే యథాతథంగా గ్రహించబడ్డాయి.

వరాహ పురాణంలో రెండు భాగాలు ఉన్నాయి. ఒకటి పూర్వ భాగం రెండు ఉత్తర భాగం మొత్తం రెండు భాగాలలోను 218 అధ్యాయాలు 24 వేల శ్లోకాలు ఉన్నాయి. ఇప్పుడు సంపూర్తిగా ఈ పురాణాం లభ్యం కావడం లేదు.

13. స్కాందపురాణం :

ఈ పురాణంలో, స్కందుడు అంటే కుమారస్వామి శైవతత్త్వాలను నిరూపణం చేశాడు కాబట్టి దీనికి స్కాందపురాణమనే పేరు వచ్చింది. పురాణాలు అన్నింటిలోకి అతిపెద్దదైన పురాణం ఇది. దీనిలో శ్లోక సంఖ్య 81,000లు. అంటే ఇది భాగవతం కంటే అయిదు రెట్లు పెద్దది. లక్ష శ్లోకాలున్న మహాభారతం కంటే అయిదవ వంతు చిన్నదన్నమాట. ఈ పురాణంలో సంహితలు, వాటిలో ఖండాలు, వాటిలో మాహాత్మ్యాలు

ఇలా అంతర విభాగాలున్నాయి. ఈ పురాణంలో ఒకటైన సూత సంహిత (అధ్యాయం 20-12) ప్రకారం దీనిలో ఆరు సంహితాలు ఉన్నాయి. అవి.

1)	సనత్కుమార సంహిత -	36,000	శ్లోకాలు
2)	సూతసంహిత -	6,000	శ్లోకాలు
3)	శంకర సంహిత -	30,000	శ్లోకాలు
4)	వైష్ణవ సంహిత -	5,000	శ్లోకాలు
5)	బ్రాహ్మసంహిత -	3,000	శ్లోకాలు
6)	సౌరసంహిత -	1,000	శ్లోకాలు
	మొత్తం -	**81,000**	**శ్లోకాలు**

ఈ సంహితలలో చెప్పబడిన విషయాలను గురించి నారదపురాణం విస్తృతంగా తెలుపుతున్నది. స్కాందపురాణానికి మరొకరకంగా కూడా ఖండరూపంలో విభజన ఉన్నది.

1)	మాహేశ్వర ఖండం -	174	అధ్యాయాలు
2)	వైష్ణవ ఖండం -	153	అధ్యాయాలు
3)	బ్రహ్మ ఖండం -	87	అధ్యాయాలు
4)	కాశీఖండం -	100	అధ్యాయాలు
5)	అవంతీ ఖండం -	367	అధ్యాయాలు
6)	నాగరఖండం -	178	అధ్యాయాలు
7)	ప్రభాసఖండం -	414	అధ్యాయాలు
	మొత్తం	**1471**	**అధ్యాయాలు**

ఈ విధానం ప్రకారం 81,000 శ్లోకాలు ఉన్నాయి. అందువలన ఒక్కొక్క ఖండం దాదాపు పన్నెండువేల శ్లోకాల పరిమాణంతో ఉంటుందని భావించవచ్చు. అలాగే స్కాందపురాణంలోని శంకర సంహితలోగల హాలాస్య మాహాత్మ్యం, దీనిలో ఆరు సంహితలు 50 ఖండాలు ఉన్నాయని తెలుపుతున్నది. సంహితలలో సూత సంహిత శివోపాసన విషయంలో అద్వితీయమైనది. ఈ సంహితలో వైదిక, తాంత్రిక విధానాలు రెండింటిలోను శివారాధనను విస్తృతంగా వర్ణించింది. ఈ సంహితలోని ఈ విలక్షణత వలననే విజయనగర సామ్రాజ్యంలో మంత్రి సాయణుని సోదరుడు మాధవుడు దీనిచే ఆకర్షితుడై తాత్పర్యదీపిక అనే అతి ప్రామాణికము విస్తృతమైన వ్యాఖ్యానాన్ని రచించాడు. ఈ సూత సంహితలో ఆరు ఖండాలు ఉన్నాయి 1) మొదటిది శివమాహాత్మ్య ఖండం. ఇందులో

13 అధ్యాయాలలో శివమాహాత్మ్యం విశేషంగా ప్రతిపాదించడం జరిగింది. 2) రెండవది జ్ఞానయోగ ఖండం - దీనిలో 20 అధ్యాయాలున్నాయి. ఇందులో ఆచార ధర్మాలు వర్ణించిన తరువాత హఠయోగ ప్రక్రియ సాంగోపాంగంగా వివేచించబడింది. 3) మూడవది ముక్తి ఖండం. దీనిలో 9 అధ్యాయా లున్నాయి. ముక్తి సాధన మార్గాలు వివరించబడ్డాయి. 4) నాల్గవది యజ్ఞ వైభవ ఖండం. ఇది అన్ని ఖండాలలోనికి పెద్దది. ఇది తిరిగి రెండు భాగాలు చేయబడింది. 1) పూర్వభాగం, 2) ఉత్తర భాగం. పూర్వ భాగంలో 47 అధ్యాయాలున్నాయి. వీనిలో అద్వైత వేదాంతం శైవభక్తితో జోడించి చాలా ప్రావీణ్యంతో ఆధ్యాత్మికతత్త్వ వివేచన చేయబడింది. దార్శనిక దృష్టితో చూస్తే ఈ ఖండం చాలా విలువగలది. తత్త్వవివేచన లోతుగా చేయటానికి అవ కాశం కల్పించేదిగా ఉంటుంది. దీని ఉత్తరభాగంలో రెండు గీతలు చేరి ఉన్నాయి. 1) బ్రహ్మ గీత, 2) ఇంకొకటి సూతగీత. బ్రహ్మగీతలో 12 అధ్యాయాలున్నాయి. రెండవదైన సూత గీతలో ఎనిమిది అధ్యాయాలున్నాయి. ఇవి కూడా ఆధ్యాత్మిక విషయశోభితాలు. ఆత్మ స్వరూప వివేచనము, దాని సాక్షాత్కార ఉపాయాలు చాలా చక్కగా ఇందులో ప్రతిపాదించ బడ్డాయి. ఇందులో శివప్రసాదం వలననే సర్వకర్మ సమకూరగలవని ప్రతిపాదించబడింది.

శంకర సంహిత : ఇది కూడా అనేక ఖండాలుగా విభజించబడింది. ఇందులోని మొదటి ఖండమే శివరహస్య ఖండము. మొత్తం శంకర సంహితలో ఈ ఖండమే సగం వరకు ఉన్నది. ఈ శంకర ఖండంలో 13,000 శ్లోకాలు ఉన్నాయి. 7 కాండాలుగా విభజించ బడింది. ఆ ఏడుకాండలు : 1) సంభవకాండ, 2) ఆసురకాండ, 3) మాహేంద్రకాండ, 4) యుద్ధకాండ, 5) దేవకాండ, 6) దక్షకాండ, 7) ఉపదేశకాండ.

ఆరవ సంహిత సౌర సంహిత : ఇందులో శివ పూజా సంబంధమైన అనేక విషయాలు విపులంగా వర్ణించబడ్డాయి. మొదటిదైన సనత్కుమార సంహిత, ఇది షుమారు 20, 22 అధ్యాయాలుగల చిన్నసంహిత, ఇవి తప్ప మిగిలిన సంహితలు నేడు లభ్యంకావటం లేదు.

ఖండాత్మకమైన స్కాందపురాణం వివరాలు పరిశీలించగా.

1. మాహేశ్వరఖండం : ఈ ఖండంలో తిరిగి రెండు చిన్నఖండాలు ఉన్నాయి. 1) కేదార ఖండము, 2) కుమారికా ఖండం. ఈ రెండు ఖండాలలోను శివపార్వతుల అనేక విధాలైన చిత్రవిచిత్ర లీలలు సుందరంగా వర్ణించబడ్డాయి.

2. వైష్ణవ ఖండం : ఈ ఖండంలో భాగంగా ఉత్కళ ఖండం ఉన్నది. ఉత్కళ ఖండంలో ప్రస్తుత ఒరిస్సా రాష్ట్రంలోగల పూరీలోని జగన్నాథ మందిర విశేషాలు, పూజా విధానము, ప్రతిష్ఠ ఇంకా దానికి సంబంధించిన అనేక ఉపాఖ్యానాల వర్ణన ఉన్నది. ఇంద్రద్యుమ్న

మహారాజు నారదుని ఉపదేశంతో జగన్నాథుడు ఉన్న స్థానాన్ని కనుక్కొన్న విశేషాలు, మొదలైన విషయాలు విస్తృతంగా ఈ ఖండంలో చెప్పబడ్డాయి. ఈ విధంగా పూరీ జగన్నాథ క్షేత్ర ప్రాచీన చరిత్ర తెలుసుకొనటానికి ఈ ఖండం అత్యంత ఉపయోగకారి.

3. బ్రహ్మ ఖండం : ఇందులో రెండు ఖండాలున్నాయి. 1) బ్రహ్మారణ్య ఖండము, 2) బ్రహ్మోత్తర ఖండం. బ్రహ్మారణ్య ఖండంలో ధర్మారణ్యం అనే ప్రదేశం యొక్క మాహాత్మ్యం విశదంగా తెలుపబడింది. అదే ఖండంలో ఉజ్జయినీ మహాకాళేశ్వరుని పూజా ప్రతిష్ఠానాదులు తెలుపబడ్డాయి. రెండవదైన బ్రహ్మోత్తర ఖండం 22 అధ్యాయాలుగా విభజించబడింది. ఇందులో శివభక్తి, శివమాహాత్మ్యం, శివవ్రతం, రుద్రాక్ష, విభూతి మాహాత్మ్యం మొదలైన శివారాధనకు సంబంధించిన అనేక విషయాలున్నాయి. ఈ బ్రహ్మోత్తర ఖండం ఆంధ్రదేశంలో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. 17వ శతాబ్దంలో బ్రహ్మోత్తర ఖండం కూడా అష్టాదశ పురాణాలలో ఒకటిగా ప్రజలు భావించేవారని అయ్యలరాజు నారాయణామాత్యుని హంసవింశతి ద్వారా తెలుస్తున్నది. దీనికి తెలుగులో అయిదు ప్రబంధశైలి అనువాదాలు, రెండు ద్విపద అనువాదాలు, మూడు వచన అనువాదాలు, ఒక్కొక్క మాహాత్మ్యం ఒక్కొక్క కావ్యంగా వచ్చాయంటే దీని ప్రభావం తెలుగునాట ఎంత ఉన్నదో గ్రహించవచ్చు.

4. కాశీఖండం : ఇందులో కాశీ క్షేత్ర మహిమ వర్ణించబడింది. కాశీలోని సమస్తదేవతలు, శివలింగాల ఆవిర్భావము, మాహాత్మ్యము విశేషంగా ఇందులో ప్రతిపాదింపబడ్డాయి. కాశీ యొక్క ప్రాచీన భూగోళ వివరాలు తెలుసుకోటానికి ఇది బహుళోపయోగకారి.

5. రేవా ఖండం : రేవానది అంటే నర్మదానది అని అర్థం. నర్మదానది ఉత్పత్తి దాని తీరంపైగల తీర్థ క్షేత్రాల విస్తృతవర్ణన ఇందులో ఉన్నది. సత్యనారాయణవ్రతం చేసుకొనేటప్పుడు చెప్పే కథ ఈ రేవాఖండంలోనే ఉన్నది.

6. అవంతీ ఖండం : అవంతీ నగరమే ఉజ్జయినీ నగరం. అక్కడ గల భిన్న భిన్న శివలింగాల ఉత్పత్తి మాహాత్మ్యము ఈ ఖండంలో వివరించబడింది. ప్రాచీన అవంతీ దేశ ధార్మిక స్థితి యొక్క పూర్తి దిగ్దర్శనం ఈ ఖండంలో కనిపిస్తుంది.

7. తాపీ ఖండం : ఇందులో నర్మదకు ఉపనది అయిన తాపీనది ఒడ్డునగల నానా తీర్థక్షేత్ర వర్ణన ఉన్నది. నారద పురాణానుసారం దీని ఆరవ ఖండం పేరు నాగర ఖండం. ప్రస్తుతం లభిస్తున్న నాగర ఖండంలో మూడు భాగాలున్నాయి. 1.విశ్వకర్మ ఉపాఖ్యానం 2. విశ్వకర్మ వంశాఖ్యానం 3. హాటకేశ్వర మాహాత్మ్యం అనేవి అవి. ఈ మూడవ ఖండంలో నాగర బ్రాహ్మణుల ఉత్పత్తి చెప్పబడింది. భారతదేశీయ సామాజిక స్థితిని తెలుసుకొనటానికి ఈ ఖండం చాలా ముఖ్యమైనది.

8. ప్రభాసఖండం : ఇందులో ప్రభాస క్షేత్రవర్ణన చేయబడింది. ద్వారకానగర పరిసర ప్రాంతాలను గురించి తెలుసుకొనటానికి ఇది ఉపయోగపడుతుంది.

స్కాంద పురాణం ముఖ్యంగా శైవపురాణం. ఇందులో దేశంలోని అనేక మూలలలో గల తీర్థక్షేత్ర మాహాత్మ్యాల వర్ణన ఉన్నది. అలాగే ప్రాచీన భారతదేశ భౌగోళిక స్థితిని తెలుసుకొనటానికి ఇది ఉత్తమ ఆధార గ్రంథం. అందువలన వాటిని గురించిన అనేక అద్భుత గాథలు ఉపాఖ్యానాలు ఇందులో చోటు చేసుకున్నాయి. ఇందులో అనేక కథలు అనేక పర్యాయాలు అనేక స్థలాలలో భిన్న భిన్న రూపాలలో మరల మరల వస్తుంటాయి. ఇది అతి ప్రాచీనకాలంనాటి పురాణం అనేదాంట్లో సందేహం లేదు. ఎందుకంటే క్రీ.శ. 1000 నాటి వ్రాతప్రతి కలకత్తాలో లభ్యం అయింది. అదే ఆశ్చర్యం అనుకొంటే అంతకంటే వింతగా స్కాందపురాణం వ్రాతప్రతి నేపాలు రాజప్రాసాద గ్రంథాలయంలో క్రీ.శ. 7వ శతాబ్దానికి చెందిన ప్రతి ఉన్నదని పండితులు తెలుపుతున్నారు. దీని మూలరూపం ఏమిటి ? అది ఎలా ఇంత బృహద్రూపాన్ని సంతరించుకొన్నది అనే విషయం భవిష్యత్తులో పురాణ పండితులు తేల్చాలి.

స్కాంద పురాణం ఏడు ఖండాలుగా విభజించబడింది. 1. మహేశ్వర ఖండం, 2. వైష్ణవ ఖండం 3. బ్రహ్మ ఖండం, 4. కాశీఖండం, 5. అవంతీ ఖండం 6. నాగర ఖండం 7. ప్రభాస ఖండము. ఒక్కొక్క ఖండం ఇంకా అనేక అవాంతర ఖండాలుగా కూడా విభజింపబడింది. ఇందులోని మాహేశ్వర ఖండంలో 174 అధ్యాయాలు వైష్ణవ ఖండంలో 156 బ్రహ్మ ఖండంలో 87 కాశీఖండంలో 100 అధ్యాయాలు అవంతీ ఖండంలో 387 నాగర ఖండంలో 279 అధ్యాయాలు ప్రభాస ఖండంలో 421 అధ్యాయాలు వెరసి 1671 అధ్యాయాలు ఉన్నాయి. నారద పురాణం ప్రకారం 81,000 శ్లోకాలు ఉండాలి. మత్స్య పురాణానుసారం 81,102 శ్లోకాలు ఉండాలి. స్కాందపురాణం ప్రస్తుతం సంహితాత్మకంగాను, ఖండాత్మకంగాను కూడా రెండు భిన్నభిన్న రచనలు లభ్యం అవుతున్నాయి.

14. వామన పురాణం :

మత్స్య పురాణంలో చెప్పిన ప్రకారం, బ్రహ్మ వామన అవతారాన్ని, మాహాత్మ్యాన్ని ఆధారంగా చేసుకొని, త్రివర్గాలకు సంబంధించిన విషయాలను వివరించిన పురాణం కాబట్టి దీనికి వామన పురాణం అని పేరు వచ్చింది. దీనిలోని శ్లోక సంఖ్య పదివేలు. ఇందులో 95 అధ్యాయాలున్నాయి. ఇది 1) పూర్వ, 2) ఉత్తర భాగాలుగా విభజించబడి ఉన్నది. ఉత్తర భాగానికే ఇంకొక పేరు బృహద్వామన పురాణం. ఇందులో నాలుగు

సంహితలున్నాయి. 1) మాహేశ్వరీ సంహిత, 2) భాగవతీ సంహిత, 3) సౌర సంహిత, 4) గణేశ్వరీ సంహిత. ప్రతి సంహితలోను దాదాపు వేయి వేయి శ్లోకాలున్నాయి. మాహేశ్వరీ సంహితలో శ్రీకృష్ణ చరిత్రము ఆయన భక్తుల వృత్తాంతాలు ఉన్నాయి. భాగవతీ సంహితలో జగదాంబ పార్వతి యొక్క అవతార కథ ఉన్నది. సౌర సంహితలో సర్వసాక్షి సూర్య భగవానుని మాహాత్మ్యం వర్ణించబడింది. గణేశ్వరీ సంహితలో గణపతి యొక్క మాహాత్మ్యం వివరించి ఉన్నది. పులస్త్యుడు మొదటిసారిగా దీనిని నారద మహామునికి వివరించగా నారదుడు వ్యాసునికి చెప్పినట్లు, ఆయన రోమహర్షణ సూతునికి తెలుపగా ఆయన నైమిశారణ్యంలో ఋషులకు ఈ పురాణాన్ని వివరించినట్లు వక్తృశ్రోతృపరంపర తెలుపుతున్నది. వామన పురాణంలోని భిన్న విభిన్న కథలతోపాటు వామనావతార కథ విస్తృతంగా వర్ణించబడింది. ఇందులో శివ, శివమాహాత్మ్య, శివతీర్థ, శివశివా వివాహ, గణేశోత్పత్తి, కార్తికేయ జననం మొదలైన వృత్తాంతాలు కావ్యకళా దృష్టితో వర్ణించబడ్డాయి. అంతేగాకుండా అనేక తీర్థాలు, వనాలు, వాని మాహాత్మ్యం, సృష్టివర్ణన, ధర్మ నిరూపణం మొదలైనవి కూడా సుందరంగా వర్ణించబడ్డాయి.

ఇప్పుడు వామన పురాణ ఉత్తర ఖండం లభ్యం కావటం లేదు. కేవలం పూర్వ భాగం మాత్రమే లభిస్తున్నది. ఇందులో మొత్తం 95 అధ్యాయాలున్నాయి. అందువల్లనే దీనిని అసంపూర్ణ పురాణం అనవచ్చు. ప్రస్తుతం షుమారు ఆరు వేల శ్లోకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. ఇది మొదట్లో వైష్ణవ పురాణమే అయినా కాలక్రమంలో శైవ ప్రభావం చేత దీనిలో శివచరిత్ర కూడా ప్రవేశపెట్టబడి ఉండవచ్చు. ఇది కురుక్షేత్రంలో వ్రాయబడి ఉంటుంది. ఈ పురాణంలో కాళిదాసు రచనలతో అనేకమైన సామ్యాలు ఉన్నాయి. ఇందులో శైవవైష్ణవ చరిత్రల అందమైన కలయిక కనబడుతుంది. ఈ పురాణం బహుశః క్రీ.శ. ఏడవ–పదవ శతాబ్దం మధ్యన రచింపబడి ఉంటుందని ఒక ఊహ. దీనిలో నుంచి అనేక ప్రత్యేక గ్రంథాలను వెలువరించవచ్చు. వాటిలో నరకచతుర్థీ కథ, గంగా మాహాత్మ్యం, గంగా మానసిక స్నానం, వారాహ మాహాత్మ్యం, వెంకటగిరి మాహాత్మ్యం మొదలైనవి కొన్ని మాత్రమే. దీని నాలుగు సంహితలలో మొత్తం 95 అధ్యాయాలుండగా ఇందులో మొత్తం పదివేల శ్లోకాలు ఉన్నాయి. ఇందులో రెండవదైన ఉత్తరభాగం ప్రస్తుతం లభ్యంకావటం లేదు.

15. కూర్మపురాణం :

కూర్మరూపుడైన జనార్దనుడు పాతాళలోకంలో ధర్మ, అర్థ, కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థ సాధన గురించి విష్ణు భక్తుడైన ఇంద్రద్యుమ్నునికి, ఇంద్రుడు మహర్షుల సమక్షంలో తెలుపుతూ చేసిన వివరణ అని ఈ పురాణం ద్వారా తెలుస్తున్నది. ఇందులో

లక్ష్మీకల్పంలోని వృత్తాంతం కలదని తెలుపబడింది. దీనిలోని శ్లోకాల సంఖ్య 17 వేలు. కూర్మపురాణం రెండు భాగాలుగా ఉన్నది. పూర్వభాగం, ఉత్తర భాగం. పూర్వభాగంలో 53, ఉత్తర భాగంలో 46 మొత్తం 99 అధ్యాయాలున్న పురాణం ఇది. కూర్మపురాణం నాలుగు సంహితలుగా విభజించబడింది. 1) బ్రాహ్మీసంహిత, 2) భాగవతీసంహిత, 3) సౌరీసంహిత, 4) వైష్ణవీ సంహిత. ఈ బ్రాహ్మీ సంహిత తిరిగి పూర్వార్థం, ఉత్తరార్థాలుగా విభజించబడింది. ఇందులో పూర్వార్థంలో 53, ఉత్తరార్థంలో 46 వెరసి 99 అధ్యాయాలున్నాయి. ఈ బ్రాహ్మీ సంహితలో మొత్తం ఆరువేల శ్లోకాలు ఉన్నాయి. నారద పురాణానుసారం నాలుగు సంహితలలోను కలిపి 17 వేల శ్లోకాలు, మత్స్యపురాణానుసారం 18 వేల శ్లోకాలు ఉన్నట్లు తెలుస్తున్నది. తంత్రశాస్త్రానికి సంబంధించిన ఎన్నో విషయాలు ఇందులో ఉన్నాయి. అయితే ప్రస్తుతం లభ్యం అవుతున్న కూర్మపురాణంలో కేవలం ఆరు వేల శ్లోకాలే ఉన్నాయి. అంటే దాదాపుగా మూడింట రెండువంతులు లభ్యం కాకుండా పోయిందన్నమాట. ఇందులో పురాణమంతటా శివుని ప్రాధాన్యమే చెప్పబడింది. అలాగే అనేక సందర్భాలలో బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు భేదంలేదని ప్రకటించబడింది. ఈ ముగ్గురు పరబ్రహ్మ యొక్క వివిధ రూపాలని చెప్ప బడింది. ఇందులో శక్తి పూజకు కూడా చాలా ప్రాధాన్యత ఉన్నది. శక్తి యొక్క సహస్ర నామస్తోత్రం (1-12) దీనిలో ఉన్నది. విష్ణు శివులు లక్ష్మీ గౌరిల ప్రతిరూపాలని చెప్ప బడింది. శివపారమ్యం ఎంత ఎక్కువగా ప్రతిపాదించబడిందంటే విష్ణు స్వరూపుడైన శ్రీకృష్ణుడు శివుని ప్రసాదం చేతనే జాంబవతి యందు సాంబుడనే పుత్రుడిని పొందగలిగాడని విపులంగా తెలుపుతున్నది.

ఇందులోని పూర్వభాగంలోని సృష్టి ప్రకరణం తరువాత, పార్వతి తపస్సు, ఆమె సహస్రనామాలు వర్ణించబడ్డాయి. ఇక్కడే కాశీ ప్రయాగ క్షేత్రమాహాత్మ్యం తెలుపబడింది. ఉత్తర భాగంలో ఈశ్వర గీత, వ్యాసగీత అనే రెండు గీతలు ఉన్నాయి. ఈశ్వరగీతలో భగవద్గీతలో తెలిపిన విధానంలోనే ధ్యానయోగం ద్వారా శివసాక్షాత్కారం లభిస్తుందని చెప్పబడింది. వ్యాసగీతలో నాటి ఆశ్రమాల కర్తవ్యము, ఆచరింపవలసిన కర్మలు, వ్యాస మహర్షి ద్వారా బోధింపబడ్డాయి. ప్రస్తుతం ఇందులోని నాలుగు సంహితాలలోను కేవలం బ్రాహ్మీ సంహిత మాత్రమే లభిస్తున్నది. మిగిలిన సంహితలు అలభ్యాలు.

దీనిలో తాంత్రిక గ్రంథాలలోని చాలా విషయాలు కలిసిపోయినట్లుగా తెలుస్తున్నది. నారద పురాణం ప్రకారం ఈ పురాణంలో చెప్పబడిన విషయాలు డామర, యామలాద తంత్ర గ్రంథాలలో ఉన్న విషయాలే. ఇందులో చాలా స్తోత్రాలు, మాహాత్మ్యాలు ప్రత్యేకంగా పరిగణన పొందుతున్నాయి. మహేశ్వరునికి శాంతి విద్యపై నాలుగు విధాలైన శక్తులున్నాయని, అందుచేతనే పరమేశ్వరుడు చతుర్వ్యూహుడనీ ఇందులో చెప్పబడింది.

ఇది పాంచరాత్రాగమాల నుంచి గ్రహించిన పద్ధతి. వాస్తవంలో ఇది మొదట పాంచరాత్ర మతాన్ని ప్రతిపాదించే పురాణమని, కాలక్రమంలో పాశుపతులు దీనిలో పాశుపత ప్రక్రియను ప్రవేశపెట్టారని పండితుల అభిప్రాయం. ఈ పురాణం 5,6 శతాబ్దాలలో రచింపబడి ఉండాలి.

16. మత్స్యపురాణం :

ఇది కూడా విస్తృతపురాణాలలో ఒకటి. ఇందులో 290 అధ్యాయాలున్నాయి. మొత్తం 15 వేల శ్లోకాలు ఉన్నాయి. మత్స్య రూపంలోని శ్రీమహా విష్ణువు కల్పాదియందు శ్రుతి అర్థమును నరసింహ వర్ణన సందర్భంలో ఏడుకల్పాల విషయ వివరణ చేసినట్టిదే మత్స్యపురాణమని స్వయంగా ఇందులో చెప్పబడి ఉన్నది. ప్రారంభంలో మన్వంతరాల గుఱించి సంక్షిప్తమైన వివరణ చేసిన తరువాత పితృదేవగణాల వర్ణన విస్తృతంగా ఉన్నది. అనేక రకాల వ్రతాలను గురించిన సుందరమైన వర్ణన ఇందులో కనిపిస్తుంది. తీర్థాలలో శ్రేష్ఠమైన ప్రయాగక్షేత్ర భౌగోళిక వివరణ, మాహాత్మ్యము చాలా విపులంగా ఉన్నది. రాజవంశ వర్ణనలలో సోమవంశ వర్ణన చాలా విపులంగా ఉన్నది. పరమేశ్వరుని త్రిపురాసుర యుద్ధము సంహారము సవివరంగా విపులంగా చెప్పబడింది. తారకాసుర వధకూడా ఇందులో విస్తృతంగా చెప్పబడింది. మత్స్యావతార కథ ప్రధానంగా ఉండడంచేత దీనికి మత్స్య పురాణం అనే పేరు సార్థకం అవుతున్నది. కాశీ ప్రయాగక్షేత్రాలు, నర్మదా నదీ ప్రాంతంలో ఉన్న క్షేత్రాలను గురించిన విపుల వర్ణన ఉన్నది. ఋషివంశాల వర్ణనం, 25 అధ్యాయాలలో రాజధర్మ ప్రతిపాదనము వివిధ దేవతామూర్తుల ప్రతిమ, నిర్మాణాదుల విస్తృత వర్ణనం ఈ పురాణంలో ప్రధానంగా ప్రతిపాదించబడిన విశేషం.

మత్స్య పురాణంలోని 53వ అధ్యాయంలో అష్టాదశ పురాణాల యొక్క లక్షణాలు, దానిలో చెప్పబడిన అంశాలు, శ్లోక సంఖ్య మొదలైనవి విపులంగా తెలియజేయబడ్డాయి. ఇది మిగిలిన పురాణాల ప్రస్తుత స్థితిని ఊహించటానికి ప్రముఖంగా పనికివస్తున్నది. మత్స్యమూర్తి, మనువులకు ప్రళయ విషయాన్ని గురించిన సంభాషణ, మానసిక సృష్టి తర్వాత, మైథున సృష్టి ఆరంభం, బ్రహ్మ సరస్వతుల చరిత్ర, పృథు చరిత్ర, సూర్య సోమవంశ వర్ణనము యయాతి చరిత్ర, సప్త సంతానాల ప్రతిష్ఠ అనేక వ్రత విధానాలు, దానఫల ప్రతిపాదనము, వివిధ నదీ పర్వత వర్ణనము, శాకము మొదలైన ద్వీపాల వృత్తాంతము, యుగవివరణ తారకోపాఖ్యానం, దేవాసుర సంగ్రామ వర్ణనం, నర్మదా మాహాత్మ్యము, సావిత్ర్యుపాఖ్యానం, రాజవంశవర్ణనము, శమనజ్ఞానము, గృహ నిర్మాణం మొదలైన అనేక విషయాలు ఇందులో వర్ణించబడ్డాయి.

ప్రళయ కాలంలో అన్ని నదులూ నశించినా, నర్మదానది మాత్రం నశించదని చెపుతూ నర్మదా నదికి గంగ కంటె కూడా ఎక్కువ వైశిష్ట్యాన్ని అంగీకరించడం నర్మదా నదీతీరాన్ని అనుసరించి ఉన్న చిన్న చిన్న తీర్థాలను కూడా వర్ణించటం మొదలైన ఆధారాలను బట్టి ఈ పురాణం నర్మదా నదీ తీరంలో రచింపబడి ఉండవచ్చని ఊహించవచ్చును.

కాళిదాసుని విక్రమోర్వశీయంలో ఉన్న కథకు ఈ పురాణంలోని ఊర్వశీ ఉపాఖ్యానానికి అత్యంత సామ్యం ఉండడంచేత ఇది కాళిదాసుకు అనంతరం రచింపబడి ఉంటుందని కొందరి ఊహ. నారద పురాణంలో చెప్పబడినట్లుగానే ఇందులోని, అధ్యాయ సంఖ్య శ్లోకసంఖ్య ఉన్నది. అందువలన పురాణ విమర్శకులందరూ దీని వాస్తవికతను ప్రామాణికతను, ఏకగ్రీవంగా అంగీకరిస్తున్నారు. ఇది 16వ పురాణం అయినా దేవీ భాగవతాన్ని అనుసరించి ఇది మొదటి పురాణం కావాలి. స్మృతిరఘునందనుడనే పండితుడు రచించిన 'వృషోత్సర్గతత్త్వం' అనే గ్రంథంలో 'స్వల్పమత్స్య పురాణమనే చిన్న గ్రంథం ఒకటి పేర్కొనబడినా, అసలు దాని ఉనికే ఏమాత్రం నేడు తెలియటంలేదు.

ఈ పురాణం కొన్ని ప్రత్యేకలను కలిగి ఉన్నది. మొదటిది ఇందులో 53వ అధ్యాయంలో చెప్పిన అన్ని పురాణాల విషయానుక్రమణిక. దీనివలన అన్ని పురాణాల క్రమానుగత వికాసం తెలుసుకొనే అవకాశం కలుగుతుంది. శ్రేష్ఠులైన ఋషిగణం యొక్క వంశ వర్ణనం ఇందులో ఇంకొక ప్రత్యేకత. భృగు, ఆంగీరస, అత్రి, విశ్వామిత్ర, కశ్యప, వసిష్ఠ పరాశర, అగస్త్యాది మహాఋషుల వంశాల వర్ణన 195వ అధ్యాయం నుంచి 202వ అధ్యాయం వరకు చక్కగా చేయబడింది. ఇక మూడవది రాజ ధర్మాల విశిష్ట వివరణ. ఇది 215వ అధ్యాయం నుంచి 243 అధ్యాయం వరకు, దైవ, పురుషకార, సామ, దామ, దండ, భేద, దుర్గ, యాత్ర, సహాయసంపత్తి, తులాదానం వంటి వాని వివరణ, రాజనీతికి సంబంధించిన విశిష్టతలను నిరూపిస్తున్నది. ఈ రాజధర్మంలో ఒక భాగంగా శాంతిఖండాన్ని కూడా చేర్చడం అద్భుతమైన విషయం. (అధ్యాయం 228 నుంచి 238) ఇందులో విషయాలు చాలా నవీనంగా ఉంటాయి. నాల్గవ ప్రత్యేకత ఇందులో చెప్పబడిన ప్రతిమా లక్షణాలు. రకరకాల దేవతలు, దేవుళ్ల విగ్రహాల కొలతలు, తయారుచేయటం చెప్పబడింది. మన ప్రతిమాశాస్త్రం, శాస్త్రీయ పద్ధతులపై ఆధారపడి ఉన్నది. విభిన్న దేవతల విగ్రహాలు కొలతల ప్రకారమే జరగాలి. వాటి ప్రతిష్ఠ, పీఠ నిర్మాణం కూడా ఒక విశిష్ఠ శైలిపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయాలన్నింటి వివరణ ఈ పురాణం (257–270)లో చాలా ప్రామాణికంగా చెప్పబడింది. రాజు తన శత్రువుల మీద దండెత్తి పోయేటప్పుడు ఏ ఏ విషయాలపై దృష్టి కేంద్రీకరించాలి వంటి విషయాలు, రాజధర్మాలు మొదలైనవి విపులంగా వివరించబడ్డాయి.

మత్స్యపురాణం కేవలం అధ్యాయాలుగా మాత్రమే విభజించబడింది. ఇందులో 290 అధ్యాయాలున్నాయి. ఈ 290 అధ్యాయాలలో 14 వేల శ్లోకాలున్నాయి. కానీ నారద పురాణానుసారం ఇందులోని శ్లోకాల సంఖ్య 15 వేలు.

17. గరుడ పురాణము :

శ్రీమహావిష్ణువు గరుడ కల్పంలో గరుడుడు ఉద్భవించిన విషయ వివరణ చేస్తూ బ్రహ్మాండ ఆరంభం దగ్గర నుంచి గరుడునికి వివరించిన పురాణం కాబట్టి దీనికి గరుడ పురాణమనే పేరువచ్చింది. ఇందులో 264 అధ్యాయాలు 18వేల శ్లోకాలు ఉన్నాయని నారదపురాణం తెలుపుతున్నది. ఇది రెండు ఖండాలుగా ఉన్న పురాణం. పూర్వఖండంలో లౌలిక ఉపయోగానికి అవసరమైన సమస్త విద్యల వివరణ విస్తృతంగా ఉన్నది. పురాణ ప్రారంభం లోనే విష్ణువు ఆయన అవతారాల మాహాత్మ్యం గురించి తెలియజేయబడింది. దీనిలోని ఒక అంశంతో అనేక రకాల రత్నాల పరీక్ష, అలాగే ముత్యము (69 అధ్యాయం) పద్మరాగం (70వ అధ్యాయం) మరకత, ఇంద్రనీల, వైడూర్య, పుష్పరాగ, కరకేతన, భీష్మరత్న, పులక, రుధిరాఖ్య రత్నాలు, స్ఫటికము, విద్రుమ పరీక్షలు (71 నుంచి 80 అధ్యాయాల వరకు) తెలుపబడ్డాయి. ఇందులో రాజనీతి (108-115 అధ్యాయాల వరకు) కూడా బాగా విస్తృతంగా వివరించబడింది. ఆయుర్వేదము యొక్క ఆవశ్యకత, రోగనిధానము, చికిత్సా విధానములను గురించి (15 నుండి 181 అధ్యాయాల వరకు) అనేక అధ్యా యాలలో వివరించబడింది. అనేక రకాల రోగాలను పోగొట్టటానికి ఔషధ విధానం (170-196వ అధ్యాయం వరకు) చెప్పబడింది. ఇది చాలా ప్రశంసనీయ విషయం. ఇంకొక అధ్యాయం (199) మనస్సును నిర్మలంగా ఉంచుకొనటానికి ఔషధాలను నిర్దేశించింది. ఆయుర్వేదాన్ని ప్రతిపాదించే ఈ 50 అధ్యాయాలు వేరు పుస్తకంగా ప్రకటించి, ఇతర ఆయుర్వేద గ్రంథాలలాగా దీనిని కూడా పరిశీలించవలసిన అవసరం ఉన్నది. ఛందశాస్త్ర విషయాలు (211-216) అధ్యాయాలు ఇందులో ఉన్నాయి. సాంఖ్య యోగాన్ని గురించి విపులంగా 14 (230 - 243) అధ్యాయాలలో వివరించబడింది. ఒక అధ్యాయం (242)లో గీతాసారాంశం ఉన్నది. ఈ విధంగా గరుడపురాణం ఈ పూర్వాంశం అగ్ని పురాణం వలెనే సమస్త విద్యలకు విజ్ఞాన కోశంగా చెప్పవచ్చును.

ఈ పురాణం యొక్క ఉత్తర ఖండానికి, 'ప్రేతకల్పం' అని పేరున్నది. ఇందులో 45 అధ్యాయాలున్నాయి. జీవి మరణించిన తరువాత మనుష్యునికి ఏ స్థితి కలుగుతుంది. అతడు ఏ యోని యందు తిరిగి పుట్టగలడు ఏఏ భోగాలను అనుభవిస్తాడు మొదలైన విషయాలు అక్కడక్కడా ఇతర పురాణాలలో ఉన్నా, ఈ పురాణంలో అత్యంత విస్తృతంగా సాంగోపాంగమైన వర్ణన ఉన్నది. ఇంత విస్తృతంగా వేరు పురాణాలలో లేదు. ఇందులో

గర్భావస్థ, నరకము, యమ నగరమునకు మార్గము, ప్రేత గణముల వాసస్థానము ప్రేత యోని నుంచి ముక్తి, ప్రేతముల రూపము, మనుష్యుల ఆయుర్దాయము, యమలోక వివరణము, సపిండులైనందున చేయవలసిన విధులు, వృషోత్సర్గ విధానము మొదలైన విషయాలు ఆయా అధ్యాయాలలో విస్తృతంగా ఆసక్తికరంగా వివరించబడ్డాయి. ఒక వ్యక్తి మరణించినప్పుడు అశౌచకాలంలో ఈ ఉత్తరఖండం పురాణంగా చెప్పటం, దానిని ప్రేతబంధువులు వినటం సంప్రదాయంగా హిందువులలో ఉన్న విషయమే. ఈ ప్రేతకల్ప భాగం జర్మన్ భాషలోకి కూడా అనువదించబడింది.

నారదపురాణం, మత్స్యపురాణాలలో గరుడ పురాణ విషయాలుగా చెప్పబడినవి. యథాతథంగా లభ్యం అవుతున్నాయి. ప్రస్తుతం లభ్యం అవుతున్న గరుడ పురాణంలో ఏడువేల శ్లోకాలు ఉన్నాయి. లభ్యం అవుతున్న గరుడ పురాణంలో శ్లోకసంఖ్య తక్కువగా ఉన్నా, చెప్పబడిన విషయాలు మాత్రం కొరత లేదు. ఇందులోని భవిష్య రాజవంశాఖ్యానాన్ని చదివితే ఇది జనమేజయుని కాలంలో సంకలింపబడినట్లు తెలుస్తుంది. మత్స్య, విష్ణు పురాణాలలోని భవిష్యరాజ వంశాఖ్యాన వృత్తాంతాలలో ఆంధ్ర, గుప్త రాజవంశాలు పేర్కొనబడ్డాయి. కానీ ఇందులో ఆ వృత్తాంతాలు లోపించటంవలన, ఇది ఆ పురాణాలకంటే ప్రాచీనమని భావించటం సమంజసంగా ఉంటుంది.

శూద్రక మహారాజు కాలంలో బౌద్ధ హిందూ ధర్మాలు కలసిపోయాయి. ఆ సమయంలో బౌద్ధమతము, బుద్ధుని ఆరాధన మనదేశంలో ఎక్కువగా ఉండేది. అందువలననే బుద్ధుడు విష్ణువు యొక్క 21వ అవతారంగా పేర్కొనబడ్డాడు. ఇందులో బుద్ధుని తండ్రి ఆయన వంశం (శుద్ధోధకో రాహులశ్చ సేనజత్ శూద్రకస్తథా) స్పష్టంగా చెప్పబడ్డాయి.

ఇందులోని వృత్తాంతం తార్క్ష్యకల్పం నాటిది అని చెప్పబడింది. తార్క్ష్యుడు గరుడుడే. అదే గరుడ కల్పవృత్తాంతం. ఇందులో గయామాహాత్మ్యం చాలా విపులంగా చెప్ప బడినందున గయ క్రీ.శ. 6,7 శతాబ్దాలలో విస్తృత ప్రచారంలోకి బౌద్ధమత పతనం తరువాత వచ్చినందున ఇది ఎనిమిదవ శతాబ్దం కాలంనాటి పురాణంగా భావించవచ్చు. మిథిలా ప్రాంతంలో దీని రచన జరిగి ఉండవచ్చని భావించబడుతున్నది. దీని నుండి ప్రత్యేకంగా త్రివేణీస్తోత్రము, పంచపర్వమాహాత్మ్యము, విష్ణు ధర్మోత్తరము, వేంకటగిరి మాహాత్మ్యము, శ్రీరంగనాథ మాహాత్మ్యము, సుందరపుర మాహాత్మ్యము మొదలైనవానిని ప్రత్యేక గ్రంథములుగా ఏర్పాటు చేయవచ్చును.

గరుడ పురాణం రెండు ఖండాలుగా విభజించబడింది. పూర్వ ఖండం, ఉత్తర ఖండం. దీనిలోని ఉత్తర ఖండానికే ప్రేత కల్పమనే ఇంకొక పేరు ఉన్నది. ఈ పురాణంలో

పూర్వఖండంలో 240, ఉత్తర ఖండం (ప్రేత కల్పం)లో 78 అధ్యాయాలు మొత్తం 318 అధ్యాయాలు ఉన్నాయి. దీనిలో నారదపురాణానుసారం 19 వేల శ్లోకాలు మత్స్య పురాణాను సారం 18 వేల శ్లోకాలు ఉన్నాయి.

18. బ్రహ్మాండ పురాణము :

సమస్త బ్రహ్మాండాన్ని ఆధారంగా తీసుకొని బ్రహ్మచేత భవిష్యకల్పవృత్తాంతంగా చెప్పబడిన పురాణం కాబట్టి దీనిపేరు బ్రహ్మాండపురాణం అయ్యింది. ఇందులోని శ్లోక సంఖ్య 12,200 భువన కోశం లేక ఈ సకల చరాచర బ్రహ్మాండ వర్ణన అన్ని పురాణాలలోను ఉంటుంది. కానీ ఈ పురాణం ఈ బ్రహ్మాండం (విశ్వం) అంతటిని సాంగోపాంగంగా వరిస్తుంది. నారదపురాణాన్ని అనుసరించి దీనిలో 161 అధ్యాయాలు, 12,000 శ్లోకాలు ఉన్నాయి. ఇప్పుడు పురాణంలో ఉన్న విషయానుక్రమణి నారద పురాణంలో చెప్పబడిన విషయానుక్రమణికతో సరిపోతున్నది. కూర్మపురాణం చెప్పిన పురాణపు పేర్లలో ఇది వాయవీయ బ్రహ్మాండపురాణం అని పేర్కొంటున్నది. ఈ విషయాన్ని అనుసరించి మన పురాణాలపై పరిశోధన చేసిన పాశ్చాత్య పురాణ పండితులు ఇది వాయుపురాణము యొక్క విస్తృత రూపమని, దీనికి మూలం వాయు పురాణమేనని భావించారు. కానీ ఇది సరియైన అభిప్రాయం కాదు. నారదపురాణాన్ని అనుసరించి వాయుదేవుడు వ్యాసునికి ఈ పురాణాన్ని బోధించాడని తెలుస్తున్నది. అందువలననే సరిగా ఇది వాయుప్రోక్త బ్రహ్మాండపురాణమని చెప్పబడింది.

ఈ పురాణ ప్రథమ ఖండంలో విశ్వభూగోళ వర్ణన విస్తృతంగా చేయబడింది. జంబూద్వీపము, అందులోని పర్వత, నదీ నద వర్ణన అనే అధ్యాయాలలో '66-72 వరకు) చేయబడింది. భద్రాశ్వ, కేతుమాల, చంద్రద్వీప, కింపురుషవర్ష, కైలాస, శాల్మిల ద్వీప, కుశద్వీప, క్రౌంచద్వీప, శాకద్వీప, పుష్కరద్వీపము వంటి అనేక వర్షములు, దీపముల వర్ణన విభిన్న అధ్యాయాలలో, ఆకర్షణీయంగా సమగ్రంగా లభ్యం అవుతున్నది. ఈ పురాణపు తృతీయ పాదంలో భారతదేశంలోని ప్రసిద్ధులైన క్షత్రియ వంశ వివరణ చారిత్రక దృష్టితో చాలా విలువగల భాగము.

ఈ పురాణాన్ని గురించిన ఇంకొక ప్రత్యేకత ఏమంటే క్రీ.శ. 5వ శతాబ్దంలో బ్రాహ్మణులు ఈ పురాణాన్ని జ్వాలా(బలి)ద్వీపానికి తీసుకొనిపోయారు. అక్కడ ఇది ప్రాచీన జావాభాష అయిన 'కలిభాష'లోకి అనువదించబడింది. ఆ అనువాదం ఈ రోజుకు ఉపలబ్ధం అవుతున్నది. అందువలన ఈ పురాణం చాలా ప్రాచీన కాలానికి చెందినదిగా భావించవచ్చును. ఈ పురాణము యొక్క 16, 17, 18 అధ్యాయాలలోని భవిష్య

కల్పవృత్తాంతం విస్తారంగా వర్ణితమైంది. ఈ రకమైన విస్తృతకల్పవర్ణనం మిగిలిన ఇతర పురాణాలలో లభించదు. అందువలన లభ్యం అవుతున్న బ్రహ్మాండపురాణ అస్తిత్వం, మౌలికత, మహాపురాణత్వాన్ని గురించి ఎటువంటి సందేహాలు పెట్టుకొనవలసిన అవసరం లేదు. బ్రహ్మాండపురాణం అష్టాదశ పురాణాలు అన్నింటిలోను ప్రాచీనతమమైనదని పురాణతత్త్వజ్ఞుల భావన. స్కాందపురాణంలాగానే దీనిలో కూడా అనేక మాహాత్మ్యాలు వర్ణింపబడ్డాయి.

దీని ప్రథమ ఖండంలో నదులు తీర్థాల వర్ణనతరువాత నక్షత్రమండలము యుగ ములు, మన్వంతరాల విపుల వివరణ ఉన్నది. విశ్వ విఖ్యాతులైన క్షత్రియ ప్రభువుల వంశ వర్ణనము చారిత్రకంగా విలువైనట్టిది. నారదపురాణ సూచికను అనుసరించి అధ్యాత్మ రామాయణము ఇందులోని భాగమే. కానీ ప్రస్తుతం ఉపలబ్ధం అవుతున్న బ్రహ్మాండ పురాణంలో అధ్యాత్మ రామాయణం లభ్యంకావటం లేదు. ఈ అధ్యాత్మరామాయణము శ్రీరామ చరిత్రను ఆధ్యాత్మికముగా వ్యాఖ్యానించిన గ్రంథము. దీనిని అనుసరించి రాముడు పురుషుడు. సీత ప్రకృతి. శ్రీరాముడు పరబ్రహ్మము, సీత ఆయన యొక్క అనిర్వచనీయమైన మాయ. ఈ ఇద్దరి లీలా విలాసమే ఈ సర్వప్రపంచము. బ్రహ్మ, మాయతో కూడా భారాన్ని తగ్గించడంకోసం పరబ్రహ్మమైన రాముని కోరగా ఆయన ఈ భూలోకములో శ్రీరామునిగా అవతరించి తన లీలలను విస్తారంగా ప్రదర్శించాడు.

బ్రహ్మాండ పురాణం నుంచి రామాయణకథ విడిపోయి అధ్యాత్మ రామాయణంగా ప్రసిద్ధి చెందిందని పండితుల విశ్వాసం. లేకపోతే రామాయణ కథ దాదాపు అన్ని ఇతర పురాణాలలోను ఉన్నదే. కానీ అధ్యాత్మ రామాయణంలో అది బాగా విస్తరించబడింది. నారదపురాణంలో చెప్పబడిన బ్రహ్మాండ పురాణ విషయానుక్రమణికలో రామాయణ ప్రసక్తి లేదు. చెప్పబడుతున్న శ్లోకాల సంఖ్య అధ్యాత్మ రామాయణము, లలితోపాఖ్యానము కలవనిదే పూర్తికాదు. ఈ రెండు విడి గ్రంథాలే గాక బ్రహ్మాండ పురాణం నుంచి ఇంకా గణేశ కవచం, తులసీకవచం హనుమత్కవచం, సిద్ధ లక్ష్మీస్తోత్రం, సీతాస్తోత్రం, లలితా సహస్రనామస్తోత్రం, లలితోపాఖ్యానం, సరస్వతీస్తోత్రం వంటివి వేరుగా విడదీయవచ్చును.

ఈ పురాణంలో పరశురామచరిత్ర కూడా సవిస్తరంగా చెప్పబడింది. పరశు రామునితో దృఢ సంబంధం ఉండటం చేతను, సహ్యాపర్వత గోదావరీ ప్రాంతాలను అధి కంగా వర్ణించటం చేతను, ఈ పురాణం ఆ ప్రాంతాలలో రచింపబడి ఉంటుందని, దీని లోని కొన్నిభాగాలు ప్రాచీనమైనవని అందువలన ఇది క్రీ.పూ. 1,2 శతాబ్దాలలోనే రచితం

అయి 600-900 సంవత్సరాలలో పరిపూర్ణం అయి ఉంటుందని పండితుల అభిప్రాయం.

మహా పురాణాలలో చివరి స్థానాన్ని ఆక్రమిస్తున్న బ్రహ్మాండ పురాణం వాయు పురాణంలాగానే నాలుగు పాదాలుగా విభజించటం జరిగింది. 1. ప్రక్రియాపాదము 2. అనుషంగ పాదము, 3. ఉపోద్ఘాత పాదము, 4. ఉపసంహార పాదము.

ఇందులో మొదటి రెండు పాదాలైన ప్రక్రియ, అనుషంగాలను పూర్వ భాగమని తరువాత తృతీయ పాదమైన అనుషంగ పాదాన్ని మధ్యభాగమని నాల్గవదైన ఉపసంహార పాదాన్ని ఉత్తర భాగమని పిలుస్తారు. వీనిలో మొత్తం 161 అధ్యాయాలు ఉన్నాయి. ఈ పురాణంలో నారద పురాణానుసారం 12 వేల శ్లోకాలు మత్స్య పురాణానుసారం 12 వేల రెండువందల శ్లోకాలు ఉన్నాయి.

పురాణాలలోని విషయ ఐక్యత

మొత్తం మీద పరిశీలించగా కొన్ని పురాణాలలో ఒక కథ విస్తృతంగా వర్ణించబడి ఉంటే ఇంకొక దాంట్లో అతి సంక్షిప్తంగా ఉండవచ్చు. కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం. వాయుపురాణంలో గయామాహాత్మ్యం విస్తృతంగా 56 శ్లోకాలలో ఉంటే అగ్ని పురాణంలో సంక్షిప్తంగా 23 శ్లోకాలలోనే చెప్పబడింది. అలాగే మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామనావతార కథలు వాయుపురాణంలో అతి సంక్షేపంగా ఉన్నాయి. రామాయణంలోని ఏడుకాండల కథ అగ్ని పురాణంలో ఏడు అధ్యాయాలలో చెప్పబడింది. కానీ గరుడ పురాణంలో ఒక అధ్యాయంలోనే సరిపెట్టబడింది. అలాగే మహాభారత కథ అగ్ని పురాణంలో మూడు అధ్యాయాలలో ఉంటే గరుడ పురాణంలో ఒక అధ్యాయంలో ముగించబడింది. హరివంశం మొత్తం కేవలం 55 శ్లోకాలలో గరుడ పురాణంలో ముగించబడింది.

ఆయుర్వేదాన్ని గురించి గరుడ పురాణంలో 57 శ్లోకాలలో ఉంటే అగ్ని పురాణంలో అది 200 శ్లోకాలుగా ఉన్నది. అగ్ని పురాణం, గరుడ పురాణం రెండింటిలోను కార్తికేయుని మొదలుకొని కాత్యాయనుడి వరకు వ్యాకరణ విషయాలు వచ్చాయి. కానీ పాణిని గురించిన ఊసేలేదు. అగ్ని పురాణంలో 'విద్య' కు సంబంధించిన విషయాలు చెప్పబడినను గరుడు నారద పురాణాలలో కనీసం దానిని పేర్కొనలేదు. అదేవిధంగా గరుడ పురాణంలో నాట్యశాస్త్రానికి సంబంధించిన చర్చ, ఆనందవర్ధనాచార్యుని ద్వారా చెప్పబడిన 'ధ్వని' యొక్క వికాసవర్ణన చక్కగా ఉన్నా, గరుడ పురాణంలో కనిపించదు. ఇలాంటివి అనేక భేదసాదృశ్యాలు పురాణాల గురించి చెప్పతగినవి ఎన్నో ఉన్నాయి.

వివిధ పురాణాల ఆది శ్రోత - వక్త

ఇక్కడ చెప్పబడినవి ఆయా పురాణాలను మొదటగా చెప్పిన వక్తలు వారి నుంచి మొదటిసారి విన్న శ్రోతలు, తరువాత ఒక్కొక్క పురాణానికి వక్తృ శ్రోతృపరంపర ఉండ వచ్చును.

సం.	పురాణం	ఏకల్పవృత్తాంతం	వక్తృశ్రోతలు
1.	బ్రహ్మ పురాణాన్ని	బ్రహ్మ కల్పంలో	బ్రహ్మ మరీచి మహామునికి బోధించాడు
2.	పద్మ పురాణాన్ని	పద్మ కల్పంలో	స్వయంభువుమనువు బ్రహ్మకు బోధించాడు
3.	విష్ణు పురాణాన్ని	వరాహ కల్పంలో	పరాశరుడు బ్రహ్మకు బోధించాడు
4.	శివ (వాయు) పురాణాన్ని	శ్వేత కల్పంలో	శివుడు వాయువుకు బోధించాడు
5.	భాగవత పురాణాన్ని	సారస్వత కల్పంలో	విష్ణువు బ్రహ్మకు బోధించాడు
6.	నారద పురాణాన్ని	బృహత్ కల్పంలో	పూర్వ భాగాన్ని – సనకాదులు నారదునికి బోధించారు. ఉత్తరభాగాన్ని – వశిష్ఠుడు మాంధాతకు బోధించాడు
7.	మార్కండేయ పురాణాన్ని	శ్వేత వారాహకల్పంలో	మార్కండేయుడు జైమినికి బోధించాడు
8.	అగ్ని పురాణాన్ని	ఈశాన కల్పంలో	అగ్నిదేవుడు వశిష్ఠునికి బోధించాడు
9.	భవిష్య పురాణాన్ని	అఘోర కల్పంలో	బ్రహ్మ మనువుకు బోధించాడు
10.	బ్రహ్మ వైవర్త పురాణాన్ని	రథంతర కల్పంలో	సావర్ణి నారదునికి బోధించాడు
11.	లింగ పురాణాన్ని	కల్పాంతకల్పంలో	పరమశివుడు నారదునికి బోధించాడు
12.	వరాహ పురాణాన్ని	మనుకల్పంలో	విష్ణువు పృథ్వికి బోధించాడు
13.	స్కాంద పురాణాన్ని	తత్పురుషకల్పంలో	స్కందుడు భూమికి బోధించాడు
14.	వామన పురాణాన్ని	కూర్మ కల్పంలో	బ్రహ్మ పులస్త్య మహామునికి బోధించాడు
15.	కూర్మ పురాణాన్ని	లక్ష్మీ కల్పంలో	విష్ణువు పులస్త్య మహామునికి బోధించాడు
16.	మత్స్య పురాణాన్ని	సప్త కల్పంలో	విష్ణువు మనువుకు బోధించాడు
17.	గరుడ పురాణాన్ని	గరుడ కల్పంలో	విష్ణువు మనువుకు బోధించాడు
18.	బ్రహ్మాండ పురాణాన్ని	భవిష్య కల్పంలో	బ్రహ్మ మనువుకు బోధించాడు

వివిధ పురాణాలలోని శ్లోక సంఖ్య

పురాణం పేరు	అగ్నిపురాణం ప్రకారం 272 అధ్యాయం	మత్స్యపురాణం ప్రకారం (53) అధ్యాయం	నారద పురాణం ప్రకారం	భాగవతంప్రకారం (12 - 13)	దేవీభాగవతం ప్రకారం (1 - 3)
1. బ్రహ్మ పురాణం	25,000	13,000	10,000	10,000	10,000
2. పద్మ పురాణం		55,000	55,000	55,000	55,000
3. విష్ణు పురాణం	23,000	23,000	23,000	23,000	23,000
4. శివ పురాణం	14,000 (వాయు)	24,000 (వాయు)	24,000	24,000	24,6000 (వాయు)
5. భాగవతం	18,000	18,000	18,000	18,000	18,000
6. నారద పురాణం	25,000	25,000	25,000	25,000	25,000
7. మార్కండేయ పురాణం	9,000	9,000	9,000	6,000	6,000
8. అగ్ని పురాణం	12,000	16,000	15,000	15,400	16,000
9. భవిష్య పురాణం	14,000	14,500	14,000	14,5000	14,500
10. బ్రహ్మ వైవర్త పురాణం	18,000	18,000	18,000	18,000	18,000
11. లింగ పురాణం	11,000	11,000	11,000	11,000	11,000
12. వరాహ పురాణం	14,000	24,000	24,000	24,000	24,000
13. స్కాంధ పురాణం	84,000	81,000	81,000	81000	81,000
14. వామన పురాణం	10,000	10,000	10,000	10,000	10,000
15. కూర్మ పురాణం	8,000	18,000	17,000	17,000	17,000
16. మత్స్య పురాణం	13,000	14,000	15,000	14,000	14,000
17. గరుడ పురాణం	8,000	18,000	19,000	19,000	19,000
18. బ్రహ్మాండ పురాణం	12,000	12,200	12,000	12,000	12,000

జైన సాహిత్యంలో పురాణాలు

అతిప్రాచీన కాలంలోనే అంటే క్రీ.పూ. 600 సంవత్సరాల ప్రాంతంలోనే హిందూ మతం నుంచి వేరై విరోధ భావనలతో ఏర్పడిన మతం జైనం. అయినా హిందూ ధర్మం యొక్క బలమైన ప్రభావం వలన పెద్దగా హిందూమతంతో వేరుపడలేకపోయింది జైనం. కాబట్టి హిందువుల యొక్క వేద వేదాంగాలు అంటే వైదిక సాహిత్యం, పురాణ వాఙ్మయం మొదలైనవాటివలెనే జైనమతానుయాయులు కూడా తమవైన ధర్మ గ్రంథాలు, దర్శన గ్రంథాలు వంటి వానితో పాటు పురాణ సాహిత్యాన్ని కూడా ఏర్పాటు చేసుకొన్నారు. ఇతర ధర్మాలకు చెందిన గ్రంథాలపై హిందూ పురాణాల ప్రభావం ఎలా ఉన్నదో అలాగే జైన ధార్మిక వాఙ్మయంపైన హిందూ పురాణాల ప్రభావం ఎక్కువగానే ఉన్నది.

మధ్య యుగాలలో భారతీయ దర్శన శాస్త్రాలలో న్యాయగ్రంథాలను రచించినవారు జైనులు బౌద్ధులే. అయితే బౌద్ధ జైనులు వేదాలను ప్రామాణికంగా అంగీకరించనందువలన వారి దర్శనాలను నాస్తిక దర్శనాలనటం మొదలైంది. ఆస్తిక దర్శనాలు న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, మీమాంసలనే ఆరని మనకు తెలిసినదే. అలాగే నాస్తిక దర్శనాలనే వేద ప్రామాణ్యాన్ని అంగీకరించని దర్శనాలు ఆరు భాగాలుగా ఉన్నాయి. అవి : చార్వాక దర్శన, జైనదర్శన, బౌద్ధ దర్శనాలు అనేవి. మళ్ళీ బౌద్ధ దర్శనాలు సంప్రదాయ భేదాలతో నాలుగు భాగాలుగా విభజించబడ్డాయి. అవి : 1. మాధ్యమిక, 2. యోగాచార, 3. సౌత్రాంతిక వైభాషికభాగాలు, ఎవరో తెలీదు కానీ ఈ నాలుగు విధాల బౌద్ధ సంప్రదాయాన్ని ముఖ్య లక్షణాలన్నింటినీ ఒక్క శ్లోకంలో ఎంత బాగా చెప్పాడో చూడండి.

ముఖ్యోమాధ్యమికో వివర్తమఖిలం శూన్యస్యమేనేజగత్
యోగాచారమతేతు సంతి మతయస్తానాం వివర్తో ఽ ఖిలః
అర్థోస్తి క్షణికస్త్వసావనుమితో బుద్ధ్యేతి సౌత్రాంతికః
ప్రత్యక్షం క్షణ భంగురంచ సకలంవై భాషికో భాషతే

నాస్తిక దర్శనాల చారిత్రక ప్రభావంచేత ఆస్తిక దర్శనాలు ఆరూ ప్రభావితమైనాయి. యథార్థానికి బౌద్ధ జైనాలు రెండూ విశాల హిందూజాతికి అంగాలే. హిందువులపై తమ ధర్మము, దర్శనాల ప్రభావం ఉన్నట్లుగానే జైనులపైగూడా వారి పురాణముల ప్రభావం ఉన్నది.

బ్రాహ్మణకపురాణాలలో అష్టాదశ పురాణాలు, ఉపపురాణాలు ఉన్నట్లుగానే జైన ధర్మంలో కూడా 24 పురాణాలు ఉన్నాయి. ఈ 24 పురాణ గ్రంథాలలో జైన ధర్మానికి చెందిన 24 మంది తీర్థంకరులైన మహాపురుషుల మాహాత్మ్యం చెప్పబడింది. అయితే

బ్రాహ్మణ మతానికి చెందిన అష్టాదశ పురాణాలు పంచ లక్షణ సమన్వితాలు. కానీ జైన పురాణాలకు ఈ పంచలక్షణాలు ఉండవు. పైగా పురాతనం పురాణం 'స్యాత్తన్మహన్మహ దాశ్రయాత్' అని చెప్పటం చేత తమజిన ధర్మానికి చెందిన ప్రాచీన మహాపురుషుల కథా ప్రతిపాదకాత్మకాలుగా ఉంటాయి. జైనుల ఇరవై నాలుగు పురాణాలలోను వరుసగా 24 మంది జైనతీర్థంకరుల మాహాత్మ్య కథలు చెప్పబడి ఉంటాయి. ఈ పురాణాలలో

1. ఆదిపురాణం
2. అజితనాథపురాణం
3. సంభవనాథ పురాణం
4. అభినందపురాణం
5. సుమితనాథపురాణం
6. పద్మ ప్రభ పురాణం
7. సుపార్శ్వ పురాణం
8. చంద్రప్రభపురాణం
9. పుష్పదంత పురాణం
10. శీతలనాథ పురాణం
11. శ్రేయాంస పురాణం
12. వాసుపూజ్య పురాణం
13. విమలనాథ పురాణం
14. అనంతజీత పురాణం
15. ధర్మనాథ పురాణం
16. శాంతినాథ పురాణం
17. కుంథనాథ పురాణం
18. అమరనాథ పురాణం
19. మల్లినాథ పురాణం
20. ముని సువ్రత పురాణం
21. నేమినాథ పురాణం
22. అరిష్టనేమి పురాణం
23. పార్శ్వనాథ పురాణం
24. సమ్మతి పురాణం అనేవి.

ఈ ఇరవై నాలుగు జైన పురాణాలలో బాగా ప్రసిద్ధి గలవి ఆది పురాణం, పద్మప్రభ పురాణం, అరిష్టనేమి పురాణం (దీనికే ఇంకొక పేరు హరివంశపురాణం) ఉత్తరపురాణాలే. మళ్ళీ వీటిల్లో ఆదిపురాణం, ఉత్తర పురాణాలు అనే వాటికి విశేష ప్రభావం ఉన్నది.

ఆదిపురాణం

జినధర్మంలో మొదటి తీర్థంకరుడైన ఋషభదేవుని కథలు ఈ పురాణంలో వర్ణించబడ్డాయి. ఈ పురాణం ప్రకారము, జైన సంప్రదాయం ప్రకారం పరంపరగా వస్తున్న వినికిడిని అనుసరించి ఈ ఋషభ దేవుడు సర్వార్థ సిద్ధియోగంలో ఉత్తరాషాఢ నక్షత్రం ధనూరాశిలో ఉన్నప్పుడు చైత్రమాసం కృష్ణాష్టమీ రోజు ఇక్ష్వాకు వంశరాజు నాభి అతని భార్య మరుదేవి గర్భంలో, వినీత మనే నగరంలో జన్మించాడు. ఆయన చతుర్యుగాల సమాప్తి పర్యంతం అంటే ఎనభై నాలుగు లక్షల సంవత్సరాల పాటు జీవించి

మోక్షప్రాప్తి చెందగలరని జైనమత సంప్రదాయం తెలుపుతున్నది. భాగవతంలో ఈ తీర్థంకరుని వర్ణన హృదయంగమంగా ఉంటుంది. భాగవతంలో కూడా ఈ తీర్థంకరుని తల్లిదండ్రుల పేర్లు మరుదేవి, నాభి అనే చెప్పబడింది. ఈయన భగవద్గుణ సంపన్నుడని భాగవతం వర్ణిస్తున్నది. ఈయన భార్యపేరు జయంతి అని, ఆమె ఇంద్రుని కుమార్తె అని, ఆమె ద్వారా ఆయనకు ధర్మాత్ములు, వేదజ్ఞులు, భాగవత ధర్మానుయాయులైన భర తుడు కుశావర్తుడు మొదలైన నూర్గురు పుత్రులు జన్మించారని అదే గ్రంథం వివరిస్తున్నది. భాగవతంలో చెప్పబడిన భగవంతుని అవతారాలలో ఎనిమిదవది ఈ ఋషభ దేవుని అవతారము.

ఈ పురాణంలో 47 పర్వాలు ఉన్నాయి. మహాభారతంలో గూడా గ్రంథాంతర విభాగాల పేరు పర్వాలే గదా. ఈ గ్రంథ రచయిత జనసేనుడు ఈ గ్రంథంలో సిద్ధసేనుడు, వాదీంద్ర చూడామణి, సమంత భద్రుడు, దేవముని మొదలైన వారి పేర్లను పేర్కొన్నాడు. ఇందువలన గ్రంథ రచనా కాలం సుగమం అయింది. రచయితకు వీరందరి సహాయం లభించినట్లు తెలుస్తున్నది. ఈ గ్రంథంలో సృష్టి తత్త్వ విచారణకు సంబంధించి వ్యక్తీక రించిన భావాలను పరిశీలిస్తే రచయిత రాబోయే కాలంలో ఆచార్య శంకరుల వారి అద్వైత మత సిద్ధాంత బ్రహ్మసంబంధ వాదాలను ఖండించటానికే చెప్పబడిందా అన్నట్లు ఉంటుంది.

ఉత్తర పురాణం

ఇది ఆది పురాణానికి ఉత్తర భాగం. ఆదిపురాణకర్త జిన సేనాచార్యుడు. అందులో 44 సర్గలు వ్రాసిన తరువాత పరమపదం చెందాడు. తరువాత 45వ సర్గ నుండి 47వ సర్గ వరకు వ్రాసి ముగించి చివరలో జినసేనుని చరిత్రను కూడా కలిపి రచించి జినసేనుని శిష్యుడైన గుణభద్రుడు ఆదిపురాణ ఉత్తర భాగాన్ని సమాప్తం చేశాడు. గ్రంథం చివరి భాగంలో సమస్త శాస్త్రాలకు సారభూతమైన ఈ పురాణం ధర్మపరులైన, శ్రేష్ఠులచేత శకం 820, పింగళ సంవత్సర ఆశ్వయుజమాస శుక్ల పక్ష పంచమి బృహస్పతి వారంనాడు పూర్తిచేయబడ్డది అని పేర్కొనబడింది. ఈ కాలం విశ్వవిఖ్యాత కీర్తిశాలి, సర్వశత్రు వినాశకుడు అకాలవర్ష చక్రవర్తి రాజ్యాధిరోహణం చేసిన సంవత్సరానికి సరిపోతుంది.

వస్తుతః ఉత్తర పురాణం జైనుల చతుర్వింశతి (ఇరవై నాలుగు) పురాణాలకు సారభూతమైన కోశం లాంటిది. ఇందులో అన్ని జైన పురాణాల సారము ఇమిడి ఉన్నది. ఇది 48వ పర్వంతో మొదలు అవుతుంది. రెండవ జైనతీర్థంకరుడు అజితనాథుని నుంచి 24వ తీర్థంకరుడైన మహావీరస్వామి వరకు గల అందరు తీర్థంకరుల చరిత్రలు ఇందులో

ఉన్నాయి. ఆదిపురాణం ఉత్తర పురాణాలలో తీర్థంకరుల జీవిత చరిత్ర చిత్రణకు ముందుగా చక్రవర్తులు, రాజుల చరిత్రలు ఉన్నాయి. జైన పురాణాలను అనుసరించి పూర్వజన్మలో ఈ రాజులు, చక్రవర్తులే మరుజన్మలో తీర్థంకరులుగా జన్మనెత్తారు. ఈ రెండు పురాణాల తోను కలిపి ఇరవై నాలుగు మంది తీర్థంకరులు, పన్నెండు మంది చక్రవర్తులు, తొమ్మిది మంది వాసుదేవులు తొమ్మిది మంది శుక్లబలులు, తొమ్మిది మంది విష్ణుద్విసులు మొత్తం అరవై మూడు మంది మహాత్ముల చరిత్రలు వివరించబడ్డాయి. అందుకే దీనిని 'త్రిషష్ట్య వయవి' అని కూడా అంటారు.

బౌద్ధ సాహిత్యంలో పురాణాలు

బౌద్ధ పురాణాలనే త్రిపిటకాలంటారు. హిందూ ధర్మంలో పురాణాలకు ఎంత వైశిష్ట్యం ఉన్నదో బౌద్ధ ధర్మంలో త్రిపిటకాలకు అంతే విశిష్టత ఉన్నది. బుద్ధ భగవానుడు జ్ఞానోదయం కలిగి బుద్ధత్వాన్ని పొందిన తరువాత ఆయన మహాపరినిర్వాణం (స్వర్గా రోహణం) పొందేంతవరకు ఉన్న మధ్యకాలంలో ఆయన ఉపదేశించిన విషయాలు సమ స్తమూ సంగ్రహంగా త్రిపిటకాలలో సంకలించబడ్డాయి. త్రిపిటకాల (అంటే మూడు గంపలు)లో బోధిసత్త్వుడు అయిన బుద్ధ భగవానుని బోధనలు అన్నీ పొందుపరచబడి ఉన్నాయి.

1. సుత్త పిటకం, 2. వినయ పిటకం, 3. అభిధర్మ పిటకం అనేవి ఆ మూడు బౌద్ధ పిటక గ్రంథాలు.

1. స్తుతపిటకం లేక సూత్ర సమూహము అనే మొదటి గ్రంథంలో బౌద్ధులు అనుసరించవలసిన ఉపదేశాలు సూత్ర రూపంలో సంగ్రహించబడ్డాయి.
2. వినయ పిటకం అనే రెండవ గ్రంథంలో సంక్షేమ విషయాలను తెలిపే బోధనలు సంకలించబడ్డాయి.
3. అభిధమ్మ పిటకం అనే మూడవ గ్రంథంలో నైతిక, మనోవైజ్ఞానిక ధర్మాలు విశ్లేషించ బడ్డాయి. ఇవి దార్శనికత ఆధారంగా శిలలపై చెక్కించబడిన, వాటి ఆధారంగా నిలిచి ఉన్నందుకు ఏమి కారణమో తెలియకుండా ఉన్నది.

తథాగత బుద్ధుని అనుయాయులైన విద్వాంసులు ఈ త్రిపిటకాలను సంపాదించి సంకలనం చేశారు. ఈ గ్రంథాల ఆధారంగానే బౌద్ధ ధర్మానికి చెందిన ధార్మిక, ఆధ్యాత్మిక, భౌతిక, తాత్త్విక విషయాలను, వానిని ఆచరించవలసిన విధానాలను గురించి తెలుసుకొనే వీలుకలుగుతున్నది. వీటి ద్వారా శీలము, సమాధి, బుద్ధి అనే మూడు గుణాలతో సుసంప

న్నుడైన వ్యక్తి మాత్రమే ఈ భవసాగరబంధనాలనుంచి విముక్తుడు కాగలడని బుద్ధ భగవానుని ఉపదేశాల సారమని గ్రహించవచ్చు.

పురాణ పురుషుడు నారాయణుడు

అష్టాదశ పురాణాలు నారాయణుడైన శ్రీమహావిష్ణువు యొక్క శరీరముగనే భావింపబడింది. నారాయణుడు పురాణపురుషుడు అని భావించటం సమర్థనీయమే కదా. అందుచేత ఆ పురాణ పురుషుని అష్టాదశ పురాణ మూలమూర్తిగా భావించటం జరిగింది. ఈ విషయం పద్మపురాణం ఆదిఖండంలో చెప్పబడింది. విష్ణువు యొక్క వివిధ అవయవాలు వివిధ పురాణాలుగా భావించబడ్డాయి. అప్పుడు మొత్తం అష్టాదశ పురాణాలు ఆయన స్వరూపమే అవుతుంది.

సీ. పాద్మము హృదయంబు బ్రాహ్మము మూర్ధంబు
మజ్జగారుడము వామనము త్వచము.
భాగవతము దొడల్ బ్రహ్మాండమస్థులు
మాత్స్యము మెదడు కౌర్మంబు వెన్ను
లైంగవారాహముల్ దక్షిణ వామ గు
ల్ఫంబులు నారదీయంబు నాభి
రోమముల్ స్కాందము వామ దక్షిణ భుజ
ద్వంద్వంబు శైవంబు వైష్ణవంబు

గీ. వామపాద మాగ్నేయంబు వామజాను
తలము బ్రహ్మవైవర్తంబు దక్షిణోరు
పర్వము భవిష్య మపసవ్య భావమొంది
నట్టి పదము మార్కండేయ మచ్యుతునకు.

(ఆంధ్రపద్మ పురాణం. ఆది ఖం. 828)

అని పద్మ పురాణం తెలుపుతున్నది. దీనిని అనుసరించి పురాణ పురుషుడైన నారాయణుని అవయవములతో వివిధ పురాణములు ఏకీభవిస్తాయి.

పటము ఫుల్ పేజీ.... (విష్ణు మూర్తి పటము)

1.	పద్మ పురాణము	-	హృదయము
2.	బ్రహ్మ పురాణము	-	శిరస్సు
3.	గరుడ పురాణము	-	మజ్జ
4.	వామన పురాణము	-	చర్మము
5.	భాగవత పురాణము	-	తొడలు
6.	బ్రహ్మాండ పురాణము	-	ఎముకలు
7.	మత్స్య పురాణము	-	మెదడు
8.	కూర్మ పురాణము	-	వెన్ను (పృష్ఠము)
9.	లింగపురాణము	-	కుడిచీలమండ
10.	వరాహ పురాణము	-	ఎడమ చీలమండ
11.	నారద పురాణము	-	బొడ్డు
12.	స్కాందపురాణము	-	వెంట్రుకలు
13.	శివపురాణము	-	ఎడమ భుజము
14.	విష్ణుపురాణము	-	కుడి భుజము
15.	అగ్ని పురాణము	-	ఎడమ పాదము
16.	మార్కండేయ పురాణము	-	కుడి పాదము
17.	బ్రహ్మవైవర్త పురాణం	-	ఎడమ మోకాలు
18.	భవిష్య పురాణం	-	కుడి మోకాలు.

పురాణ లక్షణాలు

ప్రపంచంలో ప్రతివస్తువుకు ధర్మాలు లేక లక్షణాలు అనేవి ఉంటాయి. అలాగే పురాణమంటే ఏమిటి అని చాలామందికి సందేహం కలుగుతుంటుంది. తేలికగా 'పురాణం పంచ లక్షణం' అని పెద్దలు చెప్తుంటారు. అంటే అయిదు లక్షణాలు గలది పురాణం అని ఆ అయిదు లక్షణాలేవి అంటే

సర్గశ్చ ప్రతి సర్గశ్చ వంశో మన్వంతరాణిచ
వంశాను చరితం చేతి పురాణం పంచ లక్షణమ్ *(మత్స్యపు - 53 - 64)*

అంటే 1. సర్గము, 2. ప్రతి సర్గము 3. వంశం 4. మన్వంతరం 5. వంశాను చరితమనే అయిదు లక్షణాలు గలది పురాణము. ఈ శ్లోకం దాదాపు అన్ని పురాణాలలోను,

సంస్కృత నిఘంటువు అమరకోశంలోను కనిపిస్తుంది. ఈ పంచ లక్షణాలు సర్వేసర్వత్ర పరిగణింప బడే పరంపరాగత విషయంగా భావించవచ్చు. పురాణాలకు భాగవతం వంటి కొన్ని పురాణాలు దశ లక్షణాలను నిర్దేశిస్తున్నాయి. అయితే పంచలక్షణాలే ప్రాచీన మైనవిగా భావించబడుతున్నాయి.

ఈ అయిదు లక్షణాలు అన్ని పురాణలలోనూ కొంత సమన్యూనాధిక రూపంలో వర్ణించబడినవే. కొన్నింటిలో ఒక లక్షణం గురించి అధికంగా, కొన్ని లక్షణాలు అల్పంగా చెప్పబడి ఉండవచ్చు. కొన్ని పురాణాలలో ఒక విషయమే చాలా విస్తృతంగా వర్ణించిన సందర్భాలు ఉన్నాయి. ఉదాహరణకు మార్కండేయపురాణంలో కేవలం మన్వంతర విషయాన్ని గురించే విపుల వివరణ ఉండగా, భాగవతంలో వంశాను చరితం మాత్రమే ప్రధానం చేయబడింది. విష్ణుపురాణంలో సర్గ అంటే సృష్టి విషయాన్ని గురించిన విపుల వర్ణన ఉన్నది. ఆయా పురాణాలలో ఒక విషయం యొక్క ఆధిక్యత ఇంకొక విషయం యొక్క న్యూనత కనిపిస్తుంది. అందువలన పురాణాలలోని రహస్యాలను తెలుసుకొనాలంటే అన్ని పురాణాల సవిమర్శనాత్మక అధ్యయనం అవసరం. అప్పుడు పురాణ రహస్యాల యథార్థ జ్ఞానం కలుగుతుంది.

1. **సర్గం :** ఈ సర్వ ప్రపంచము అందులోని నానా పదార్థాల ఉత్పత్తి అనగా సృష్టినే సర్గ అంటారు. సర్వానికి మూలమైన ప్రకృతిలో మూల గుణాలు క్షుబ్దం అయిపోయినప్పుడు మహతత్త్వం ఉద్భవిస్తుంది. ఈ మహత్తత్వం నుంచి సత్వరజస్తమోగుణాలనే మూడు గుణాలు అహంకారాలు అవుతాయి. ఈ త్రివిధాలైన అహంకారాల నుంచి పంచతన్మాత్రలు (భూతములు మాత్రం) ఇంద్రియాలు, అలాగే (పంచ) భూతాలు పుడతాయి. ఈ ఉత్పత్తి క్రమ విధానమే సర్గము అని పిలువబడుతుంది.

దీని ముఖ్య వర్ణన పురాణాల ద్వారానే లభ్యం అవుతున్నది. శ్రీమద్భాగవతంలో (12-7-11)

> **అవ్యాకృత గుణక్షోభాన్ మహతస్త్రివృత్తోఽ హమ్**
> **భూతమాత్రేంద్రియార్థానాం సంభవః సర్గ ఉచ్యతే**

అని సర్గ యొక్క లక్షణం తెలుపబడింది.

అంటే ఈ జగత్తు అందలి నానా పదార్థాల ఉత్పత్తి లేక సృష్టి సర్గ అని చెప్పబడు తుంది. ఈ సృష్టిలో శాశ్వతుడు పరమాత్మయైన భగవంతుడు. ఆయనలో నిక్షిప్తంగా ఉండే ప్రకృతితత్త్వం యొక్క సత్త్వ, రజస్తమోగుణాల క్షోభ్యతచేత మహత్తత్త్వము జనించి

దాని నుంచి అహంకార తత్త్వము, ఆ అహంకార తత్త్వం నుంచి పంచతన్మాత్రలు, ఏకాదశ ఇంద్రియాలు పంచమహాభూతాలు, వీనికి అధిష్ఠాతలైన దేవతల ఉత్పత్తిని లేక సృష్టిని సర్గ అంటారు.

2. ప్రతి సర్గము : సర్గం అనే పదానికి వ్యతిరేకమైనది ప్రతిసర్గం. అంటే సమస్త ప్రపంచం యొక్క ప్రళయం. విష్ణుపురాణంలో ప్రతి సర్గము అనే లక్షణానికి బదులుగా 'ప్రతి సంచరము' అని చెప్పబడింది. ఈ బ్రహ్మాండం స్వభావరీత్యానే ప్రళయకారి. ఈ ప్రళయం నాలుగు విధాలు. నైమిత్తికము ప్రాకృతికము, నిత్యము, ఆత్యంతికములనేవే ఆ నాలుగు.

3. వంశం : 'రాజ్ఞాం బ్రహ్మప్రసూతానాం వంశం త్రైకాలికో ఽ న్వయః అంటుంది భాగవతం. అంటే బ్రహ్మ ద్వారా ఎందరు రాజులు సృష్టించబడ్డారో వారి యొక్క భూత, భవిష్యవర్తమాన కాలంలో గల సంతాన పరంపరను వంశము అని అంటారు. వాస్తవానికి పురాణాలలో రాజవంశాల వర్ణన మాత్రమే కాక ఋషులవంశాల వర్ణనకూడా చేయబడింది.

4. మన్వంతరం : పురాణాలలో చెప్పబడిన ప్రకారం ఈ పదానికి అర్థం విభిన్న కాలాలలో జరిగిన సంఘటనలకు గుర్తుగా ఉండే కాల గణనం. పురాణాలను అనుసరించి మొత్తం 14 మన్వంతరాలు ఉన్నాయి. ప్రతి మన్వంతరానికి ఒక అధిపతి ఉంటాడు. ఆయన ఒక మనువు. ఆ మనువు సహాయం వలననే పంచ పదార్థాలు ఇంకా అనేక విభజనలుగా ఉత్పత్తిని పొందుతాయి. దేవతలు, మను పుత్రులు, ఇంద్రుడు, సప్తర్షులు, భగవంతుని యొక్క అవతారాలు అనే ఆరు విశేషాలతో కూడిన కాలాన్నే మన్వంతరం అని అంటారు.

5. వంశాను చరితము : 'వంశాను చరితం తేషాం వృత్తం వంశ ధరాశ్చయే' అంటుంది భాగవతం (12 -7-16). ఇంతకుముందు తెల్పినట్లుగా చక్రవర్తుల, ఋషుల వంశాలలో ఉత్పన్నం చెంది, ఆయా వంశాలకు మూల పురుషులైన రాజుల విశిష్ట వర్ణనమే వంశాను చరితం అనబడుతుంది. ఇందులోనే మనుష్య సంతతిగా వివిధ వంశాలలో జన్మించిన మహర్షులు రాజుల చరిత్ర కూడా చేర్చబడి ఉంటుంది. మహర్షుల చరిత్రలను తెలుపుతూ వివిధ రాజ వంశాల చరిత్రను కూడా ప్రత్యేకంగా పురాణాలు వివరించాయి.

కానీ ప్రాచీన రాజనీతి శాస్త్రాలలో 'పురాణం పంచ లక్షణమ్' అనే పంచ లక్షణాలకు ఒక కొత్త విశ్లేషణ కనిపిస్తుంది. ఇది ఇంతకుముందు చెప్పిన అయిదు లక్షణాలతో పూర్తిగా విభేదిస్తున్నది. కౌటిల్యుని అర్థశాస్త్రానికి చేసిన వ్యాఖ్య (1-5)లో జయమంగళుడు ఒక ప్రాచీన గ్రంథం నుంచి ఉద్ధరించిన.

సృష్టి - ప్రవృత్తి - సంహార - ధర్మ, మోక్ష ప్రయోజనమ్
బ్రహ్మాభిర్వివిధైః ప్రోక్తం పురాణం పంచ లక్షణమ్

అనే శ్లోకం ద్వారా ఈ భేదం తెలుస్తున్నది. ఇందులో ముఖ్యంగా చెప్పుకొన వలసినది ధర్మ విషయం. మొదటి నుంచి 'ధర్మం' అనే అంశం పురాణాలకు అవిభాజ్య విషయం అనేది సర్వాంగీకారమైనదే. అంటే దీనిని బట్టి పురాణాలలో మూల భూతమైన విషయం ధార్మిక విషయాల సమాహారం. అందువలననే కాలం గడిచే కొద్దీ ధర్మ సంబంధ విషయాల వివరణలో సహకాలీన వృత్తాంతాలు, విషయాలు కూడా చోటుచేసుకొని విస్తృతి పొందాయి. ఆధునిక పురాణ విమర్శకులు కూడా అందరూ ఈ విషయాన్ని అంగీక రిస్తున్నారు.

పురాణ దశ లక్షణాలు :

పురాణాల పంచ లక్షణాలను సర్వేసర్వత్ర అంగీకరించినా కాలం గడిచేకొద్దీ ఈ పంచ లక్షణాలనే మరికొంత విస్తృత పరచి దశ లక్షణాలు కలిగినది మహాపురాణమని, కేవలం పంచ లక్షణాలున్నది పురాణమనే వాదం ఒకటి బయలుదేరింది. శ్రీమదాగ్భవతంలో రెండు స్థలాలలోను (2-10-1-7, 12-79) బ్రహ్మవైవర్త పురాణం లోను దశ లక్షణాలతో ఉండేది మహాపురాణమనే నిర్ణయం చేయబడింది. అలాగే కేవలం ఐదు లక్షణాలు గలది సామాన్య పురాణంగా పరిగణించబడింది. భాగవతంలో రెండు స్థలాలలోను చెప్పిన దశ లక్షణాలలోను కొంత విభేదం ఉన్నా, మూలతః అవి ఒకటే. భాగవతంలోని ద్వాదశ స్కంధంలో చెప్పిన దశలక్షణాలు ఇవి :

1. సర్గ 2. విసర్గ 3. వృత్తి 4. రక్షణ 5. అంతరములు 6. వంశము
7. వంశాను చరితము 8. సంస్థా 9. హేతువు 10. అపాశ్రయము.

1. సర్గ : ఇంతకుముందు చెప్పిన సర్గ లక్షణానికి దీనికి భేదం ఏమీ లేదు.

2. విసర్గ : దీని అర్థం జీవుల సృష్టి. పరబ్రహ్మ యొక్క అనుమతితో సృష్టించగలిగిన శక్తిని పొందిన బ్రహ్మ మహత్తత్వము మొదలైన పూర్వ కర్మలను అనుసరించి మంచి చెడు వాసనల ప్రాముఖ్యాన్ని అనుసరించి ఈ చరాచర శరీరాలతో ప్రత్యేక జీవులను సృష్టించిన విధాన వర్ణనమే విసర్గం అనబడుతుంది.

3. వృత్తి : జీవుల జీవన యాత్ర కోసం ఉద్దేశించిన సామాగ్రి అంటే చరముల కోసం అచర వస్తువుల సృష్టి వృత్తి. అంటే జీవులు జీవయాత్రను సాగించటం కోసం ఏవస్తువులను మనుష్యుడు ఉపయోగించుకొంటాడో అదే అతడి వృత్తి. అంటే మనుష్యుడు బ్రతకటానికి

తినే బియ్యం, గోధుమలు మొదలైనవి వృత్తి క్రిందకే వస్తాయి. కొన్ని వృత్తులు అతడు తాను తన ఇచ్ఛ చేత ఏర్పరచుకొన్నవైతే మరికొన్ని జీవునికి ధర్మశాస్త్ర విధి ప్రకారం ఆచరించవలసినవి. కానీ ఏదైనా మానవ జీవనము, రక్షణ కోసం ఉద్దేశించినవే.

4. రక్షణ : ఇది భగవంతునికి సంబంధించినది. యుగయుగాలలోను భగవంతుడు పశు, పక్షి, మనుష్య, ఋషి, దేవుడు మొదలైన రూపాలుగా అవతారం ధరించి అనేక లీలలను ప్రదర్శిస్తాడు. ఈ అవతారాల ద్వారా వేదాలను, వేదధర్మాలను రక్షించి, వాటిని విరోధించే వారిని శిక్షిస్తాడు. సంహరిస్తాడు. అందువలన భగవంతుని అవతార లీలలు విశ్వ రక్షణకు జరిపినట్టివి. అందుకే ఇది రక్షణ అని చెప్పబడుతున్నది.

5. అంతరములు : ఇవే మన్వంతరములని పంచ లక్షణాలో చెప్పబడినట్టివి.

6. వంశము : వివిధ, రాజ, ఋషి వంశాల పుట్టుకను, వృద్ధిని వర్ణించేది.

7. వంశాను చరితము : రాజ, ఋషి వంశాల క్రమాన్ని తరతరాల చరిత్రను తెలిపేవి వంశాను చరితలు. ఇవి కూడా పంచ లక్షణములలో చెప్పిన ధర్మాలు కలవే.

8. సంస్థ : ప్రతి సర్గము అని పంచ లక్షణాలలో చెప్పిన దానికి దీనికి భేదం లేదు.

9. హేతువు : అంటే జీవుడు అనే అర్థాన్ని గ్రహించాలి ఇక్కడ. జీవుడు అవిద్య ద్వారా తాను చేసే, ఆచరించే పనులకు కర్త అవుతున్నాడు. ప్రపంచ సృష్టిలో జీవుడికి ఏం ప్రమేయం ఉందంటే, జీవుని అదృష్టం ద్వారా జరిగే కర్మల వలన సర్గం అంటే సృష్టి విసర్గం అంటే నాశనం జరుగుతున్నాయి. అందుకే ఈ సృష్టి ప్రళయాలకు కారణం లేక హేతువుగా జీవుడు పరిగణింపబడుతున్నాడు. అందువలన పురాణాలలో చెప్పబడిన ఈ విషయానికి సంబంధించిన విస్తృతినే హేతువు అంటున్నారు.

10. అపాశ్రయము : పరబ్రహ్మకే ఇంకొక పేరు. జీవునికి మూడు వృత్తులు లేక అవస్థలు ఉన్నాయి. జాగ్రదవస్థ స్వప్నము సుషుప్తి అనేవి ఆమూడు అవస్థలు. ఈ మూడు దశలలోను జీవునిలో చైతన్యం ఉంటుంది. ఈ చైతన్యమే విశ్వము, తేజస్సు, ప్రజ్ఞా అనేపేర్లతో పిలువబడుతుంది. ఈ మాయామయ వృత్తులలో సాక్షిరూపంగా ఎల్లప్పుడు జీవునిలో ఉండే మహాశక్తే అధిష్ఠాన రూపంలోని అపాశ్రయతత్త్వం. ఆ మహాశక్తే పర బ్రహ్మము లేక అపాశ్రయము అని పిలువబడుతుంది. జీవుని అన్నిస్థితులలోనూ ఈ అపాశ్రయశక్తి ఉంటుంది. ఆశక్తి నామరూపాత్మక పదార్థాలతోపాటుగా ఒకప్పుడు యుతంగా (ప్రత్యక్షంగా) మరొకప్పుడు అయుతంగా (అంటే కనిపించకుండా) ఉండవచ్చు. ఈ అపాశ్రయతత్వాన్ని వివరించటం పురాణం నిర్వర్తించవలసిన పదవ లక్షణము.

భాగవతం ద్వితీయ స్కంధంలో చెప్పిన దశ లక్షణాలు ఇవి.

1. సర్గ 2. ప్రతిసర్గ 3. స్థానం 4. పోషణం 5. ఊతయము
6. మన్వంతరమ్ 7. ఈశానుకథ 8. నిరోధము 9. ముక్తి 10. ఆశ్రయము.

పై వాని శబ్దార్థ, తత్త్వార్థాలను నిశితంగా పరిశీలిస్తే ఇంతకుముందు చెప్పిన – అంటే ద్వాదశ స్కంధంలోని దశలక్షణాలకు వీటికి పెద్దగా భేదం లేదు.

మొత్తం మీద పంచ లక్షణాలైనా, దశ లక్షణాలైనా ఒకదాని కొకటి పరస్పర సంబంధం కలవి. ఒకటి రెండవ దానిలో ఐక్యం చెందేవే. పురాణ సాహిత్యం విస్తృతి చెందటంతో సమగ్ర లక్షణం కల్పించాలనే భావనతో పంచ లక్షణాలు దశ లక్షణాలుగా వికాసం చెందాయని భావించటం సముచితం.

పురాణ వర్గీకరణం

మొత్తం అష్టాదశ పురాణాలు రకరకాల వర్గీకరణ చేయబడ్డాయి. ఆవర్గీకరణ వివిధ పురాణాలలో చెప్పబడిన విషయ ప్రధానంగా ఉన్నది. కానీ ఇవి అంతగా శాస్త్రీయం కాదు.

మొదటి వర్గీకరణ పురాణాలు సత్త్వరజస్తమో పురాణాలని అవి ప్రతిపాదించే గుణాలను ఆధారం చేసుకొని మూడు రకాలుగా విభజించడ్డాయి. వీటిలో

1. విష్ణు, నారదీయ, భాగవత, గరుడ పద్మ వరాహపురాణాలు సత్త్వ గుణం కలవి (విష్ణువు యొక్క పారమ్య కారణమైన సాత్త్విక అంశాలు కలవి) కాబట్టి ఈ ఆరు సాత్త్విక పురాణాలు.
2. మత్స్య, కూర్మ, లింగ, శివస్కంద, అగ్నిపురాణాలు తామస గుణప్రధానం కలవి (పరమ శివుని సంహారక తామస అంశాన్ని అనుసరించి) కాబట్టి ఈ ఆరు తామస పురాణాలు.
3. బ్రహ్మ, బ్రహ్మాండ, బ్రహ్మ వైవర్త, మార్కండేయ, భవిష్య, వామన పురాణాలు రజోగుణ ప్రాధాన్యం కలవి. (బ్రహ్మ ప్రపంచ సృష్టిని చేయటానికి అవసరమైన రజో గుణం కలవి) కాబట్టి ఈ ఆరు రాజస పురాణాలు. వీటిల్లో మొదటి ఆరు విష్ణు పారమ్యాన్ని బోధించేవి అంటే వైష్ణవ మత ప్రతిపాదకాలు రెండవ ఆరు శక్తి శివుని పారమ్యాన్ని బోధించేవి అంటే శైవ, శాక్తేయ ప్రతిపాదకాలు. చివరి ఆరు బ్రహ్మకు ప్రాధాన్యత ఇవ్వబడినవి. బ్రహ్మపారమ్యాలు. అందుచేత అవి బ్రహ్మసంబంధాలు.

ఈ వర్గీకరణ ఇలాగే చేసినా మత్స్య, పద్మ గరుడ పురాణాలలో పురాణాలను పేర్కొనటంలో కొంత భేదాలు ఉన్నాయి. గరుడపురాణంలో, కూర్మపురాణం సాత్త్విక పురాణంగా చేర్చబడింది. గరుడపురాణం సాత్త్విక పురాణాలను తిరిగి మూడు భాగాలుగా

సాత్త్విక ఉత్తమ (విష్ణు, భాగవత గరుడపురాణాలు) సాత్త్విక మధ్యమ – (వాయుపురాణం) సాత్త్విక అధమ (మత్స్యకూర్మ పురాణాలుగా) పేర్కొంటున్నది. ఏదైనా ఈ రకమైన విభాగం ప్రాచీనమేకానీ, అంతశాస్త్రీయం కాదు. స్కాందపురాణం, పురాణాలలో పది శివుడిని, నాల్గింటిలో బ్రహ్మను రెండింటిలో దేవి, రెండింటిలో విష్ణు ఉపాసన చెప్పబడిందని వర్గీకరించింది. దీని ప్రకారం. 1. శివప్రధానం–10 2. బ్రహ్మపారమ్యం–4 3.దేవీ పారమ్యం–2 4.విష్ణు పారమ్యం–2

ఇదే స్కాంద పురాణం శివరహస్య ఖండంలోని సంభవ కాండలో (2–30–38) ఇంకొక వర్గీకరణ కనిపిస్తుంది.

1.	శైవ (శివ విషయక పురాణం) శివ, భవిష్య, మార్కండేయ, లింగ, వరాహ, స్కంధ, మత్స్య, కూర్మ వామన బ్రహ్మాండ	–	10
2.	వైష్ణవ (విష్ణు విషయక పురాణాలు) విష్ణు, భాగవత, నారదగరుడ	–	4
3.	బ్రహ్మ (బ్రహ్మ విషయక పురాణాలు) బ్రహ్మ, పద్మ	–	2
4.	సవిత్రు (సూర్య విషయక పురాణాలు) బ్రహ్మ వైవర్త	–	1
5.	ఆగ్నేయ (అగ్ని విషయక పురాణం) అగ్ని	–	1
			మొత్తం 18

ఆధునికులు కొందరు ఈ అష్టాదశ పురాణాలను వేరొక విధంగా వర్గీకరించారు.

1. విజ్ఞాన కోశీయ పురాణాలు – అగ్ని, గరుడ, నారద పురాణాలు
2. తీర్థ సంబంధ పురాణాలు – పద్మ, స్కంద, భవిష్య పురాణాలు
3. సాంప్రదాయిక విషయ పురాణాలు – లింగ, వామన, మార్కండేయ పురాణాలు
4. ఐతిహాసిక విషయ పురాణాలు – వాయు, బ్రహ్మాండపురాణాలు

ఈ సందర్భంలో వాయు, బ్రహ్మాండ మత్స్య విష్ణు పురాణాలు ఉన్న వాటిలో అతి ప్రాచీనాలని గుర్తుంచుకోవాలి. వీటిలో మొదటి రకానికి చెందినవానిలో విజ్ఞాన సర్వస్వం అంటే మానవ సమాజానికి ఉపయోగపడే సమస్త విద్యలు (ఆధ్యాత్మిక భౌతిక విద్యలు) అన్నింటి సారాంశం ఉన్నది. వీటిల్లో ప్రాచీన కాలంలో వర్తించిన విద్యలు సంక్షేపంగా, చక్కని విధానంలో తెలుపబడ్డాయి.

రెండవ రకానికి చెందిన వానిలో తీర్థాలు, వ్రతాలు, వాని మాహాత్మ్యాలు మొదలైనవి తెలియజేయబడ్డాయి. పద్మ స్కాంద పురాణాలు ఈ కోవకు చెందినవి. వీటిని 'ప్రాధాన్యే వ్యపదేశాభవన్తి' అనే న్యాయంగా అర్థం చేసుకోవాలి.

మూడవ వర్గంలోకి, బ్రహ్మ, బ్రహ్మ వైవర్త, భాగవత పురాణాలు వస్తాయి. ప్రాచీన హైందవ సంప్రదాయిక విషయాలెన్నో వీనిలో ఉంటాయి. ఇవి రెండుసార్లు మార్పులను పొందాయని, దాని కేంద్రంగా ఉన్న భాగమే మూలభాగమని పండితుల నమ్మకం.

చతుర్థ విభాగంలో ఐతిహాసిక విషయాలు చెప్పబడిన పురాణాలు వస్తాయి. అంటే ఆయా పురాణాలలో కలియుగ వంశరాజుల చరిత్రలను, చారిత్రక దృష్టితో చెప్పిన అంశాలు వీటిలో ఉంటాయి. వీటి ఆధారంగానే భారతదేశ చరిత్ర రచింపబడిందనే విషయాన్ని మనం విస్మరించగూడదు. ఈ రకమైన పురాణాల్లో వాయు, బ్రహ్మాండ పురాణాలు ఎక్కువగాను, విష్ణు, మార్కండేయ పురాణాలు కొంతవరకు ఉపయోగిస్తాయి.

ఏ విధంగా వర్గీకరణ చేసినా, అది పూర్తిగా సమర్థనీయంగా చేయటం కుదిరేది కాదు. ఒకే పురాణంలో అనేక విషయాలు కలగాపులగంగా ఉంటాయి గదా. కేవలం దానిని ఒక సూచనగా మాత్రమే గ్రహించాలి.

పురాణ సాహిత్యం - మరోవర్గీకరణ :

కాలక్రమేణా పురాణ సాహిత్యం వృద్ధి పొందిందని భావించటంలో ఎలాంటి అభిప్రాయ భేదము లేదు. అనంతర కాలంలో వివిధ స్థలాలలో దైవ తీర్థ క్షేత్ర ప్రశస్తిని ఇనుమడింపచేయటానికి అష్టాదశ పురాణాలను అనుకరిస్తూ కొన్ని పురాణ ఖండాలు రచింపబడ్డాయి. ఈ రచనలలో అష్టాదశ పురాణాలను అనుకరిస్తూ కొన్ని చోట్ల అందులోని తీర్థక్షేత్ర దైవ మాహాత్మ్యాలను పెంచి కొన్ని సందర్భాలలో హ్రస్వీకరించి, ఏవో కొన్ని కారణాలతో కొంతమార్చి పురాణాలు రచింపబడ్డాయి. వీటినే ఉప పురాణాలన్నారు. ఈ ఉప పురాణాలు కూడా పద్దెనిమిదని చెప్పి వాటికి ప్రామాణ్యతను కల్పించారు.

మహాపురాణాన్యేతానిహ్యష్టా దశమహామునే
తథాచోప పురాణాని మునిభ్యాం కథితానిచ *(వి.పు. 3-624)*

అని అష్టాదశ మహాపురాణ ఉప పురాణాలను మునులే రచించారని విష్ణుపురాణం తెలుపుతున్నది. అయితే మత్స్యపురాణం

అష్టాదశభ్యస్తుపృథక్ పురాణం తత్ర్యదృశ్యతే
విజానీధ్వంద్విజ శ్రేష్ఠాస్తథాతేభ్యో వినిర్గతమ్ **(53-63)**

అని ఈ అష్టాదశ మహాపురాణాలే కాక ఇంకా ఉన్న పురాణాలు వాటి నుండే ఆవిర్భవించాయి అని కూడా తెలుపుతున్నది. ఈ ఉపపురాణాల నుంచి వాటికి మూలాలైన

అసలు పురాణాలను వేరుగా తెలియజేయటానికే అసలైన మూలపురాణాలకు 'మహా' అనే విశేషణం చేర్చి మహాపురాణాలంటున్నారు. అయితే కొన్ని ఉపపురాణాలు కూడా తమ పేర్లకు ముందు 'మహా' చేర్చుకొని ఈ వర్గీకరణనంతా గజిబిజి చేశాయనేది అసలు విషయం. మహాపురాణాల ప్రామాణికతను శంకించ వలసినపనిలేదు. అయితే ఈ ఉప పురాణాల ప్రామాణికత ఎంతఅంటే (అన్యాశ్చ సంహితాః సర్వా మరీచిక పిలాదయః సర్వత్ర ధర్మకథనే తుల్యసామర్థ్యముచ్యతే) మహా పురాణాలకు ధర్మ విషయాలలో ఎంత ప్రామాణికత ఉన్నదో ఉపపురాణాలకు కూడా సమానమైన ప్రామాణ్యత ఉన్నదని చెప్పబడింది.

నిజానికి లభ్యమవుతున్న ఉపపురాణాలు, సంఖ్యలో కొంత ఎక్కువగానే ఉన్నా, వాటి సంఖ్య కూడా పద్దెనిమిదే - అష్టాదశ పురాణా నామేవ విదుర్బుధాః, ఏవంచో ఏ పురాణానామష్టాదశ ప్రకీర్తితాః (131-22) అని బ్రహ్మ వైవర్త పురాణం తెలుపుతున్నది. స్కాంద పురాణం కూడా పారాశరం భాగవతం క్రౌంచ మష్టాదశమ్ మతమ్ (స్కాంద - రేవాఖండం - 1 - 55) అని ఈ విషయాన్ని బలపరుస్తున్నది. ఉపపురాణాలు :

1. ఆదిపురాణం	2. నరసింహ పురాణం	3. స్కాంద పురాణం.
4. శివ ధర్మ పురాణం	5. దూర్వాస పురాణం	6. నారదీయ పురాణం
7. కపిల పురాణం	8. వామన పురాణం	9. ఔశసన పురాణం
10. బ్రహ్మాండ పురాణం	11. వరుణ పురాణం	12. కాళికా పురాణం
13. మాహేశ్వర పురాణం	14. శాంబపురాణం	15. సౌర పురాణము
16. పారాశర పురాణము	17. మారీచ పురాణము	18. భాస్కర పురాణం

ఈ పురాణాల వరుస ఎవరెవరు ఎవరికి చెప్పారనే విషయాన్ని కూర్మ పురాణం (పూ.అ. 1-17-20)

ఆద్యంసనత్కుమారోక్తం నారసింహ మధాపరమ్
తృతీయం స్కాందముద్దిష్టం కుమారేణచ భాషితమ్
చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశ భాషితమ్
దూర్వాస సోక్త మాశ్చర్యం నారదీయమతః పరమ్
కపిలం వామనంచైవ తథైవోశన సేరితమ్
బ్రహ్మాండం వారుణం చాథ కాపిలాహ్వా యమేవచ
మాహేశ్వరం తథా శాంబం సౌరం సర్వార్థ సంచయమ్
పరాశరోక్తమపరం మారీచం భాస్కరాహ్వాయమ్

అని ధృవీకరిస్తున్నది. పై సూచికను పరిశీలిస్తే స్కాందపురాణం, బ్రహ్మాండ పురాణం, వామన పురాణం, నారద పురాణం మహాపురాణాలలోను ఉన్నాయి. అలాగే భాగవతాలు దేవీభాగవతం, విష్ణుభాగవతాలు ఈ సూచికలో లేకపోయినా ఏది మహాపురాణం అనే దానిలో కొంత అభిప్రాయ భేదం ఉన్నది. మహాపురాణాల జాపితాలో ఉన్నది శివపురాణమా వాయుపురాణమా అనేది కూడా సందిగ్ధాంశమే. చాలామంది పండితులు శివపురాణ దేవీ భాగవతాలు ఉపపురాణాలనే వాదాన్ని అంగీకరిస్తున్నారు కానీ ఈ ఉపపురాణాల జాపితాలో అసలు భాగవత ప్రస్తావనే లేదు. అప్పుడు దేవీ భాగవతం ఏ శాఖ క్రిందకు రావాలి ? కానీ ఔప పురాణాలని ఉన్న ఒక శాఖలో భాగవతం ఉన్నది. అదే దేవీభాగవతం అయి ఉండాలి.

అష్టాదశ మహాపురాణాలు, అష్టాదశ ఉపపురాణాలు ఉన్నట్లే అష్టాదశ ఔపపురాణాలు ఉన్నాయి. బృహద్వివేకము అనే గ్రంథం వాటిని గురించి

ఆద్యం సనత్కు మారంచ నారదీయం బృహచ్ఛయత్
ఆదిత్యం భావనం ప్రోక్తం నందికేశ్వర మేవచ
కౌర్మ భాగవతం జ్ఞేయం వాసిష్ఠ భార్గవం తథా
ముద్గలం కల్కిదేవ్యాౘ మహా భాగవతం తతః
బృహద్ధర్మం పరానన్దం వహ్నిం పశుపతిం తథా
హరివంశం తతోజ్ఞేతు మిదమౌపపురాణకమ్

అని చెప్పాడు. అప్పుడు అష్టాదశ ఔప పురాణాలు ఇవి :

1. సనత్కుమార	2. బృహన్నారదీయ
3. ఆదిత్య	4. సౌర (సూర్య)
5. నందికేశ్వర	6. కౌర్మ
7. భాగవత	8. వాసిష్ఠ
9. భార్గవ	10. ముద్గల
11. కల్కి	12. దేవీ
13. మహాభాగవత	14. బృహద్ధర్మ
15. పరానంద	16. వహ్ని
17. పశుపతి	18. హరివంశ పురాణాలు

ఈ జాబితాలోవి కూడా కొన్ని మహాపురాణాలలో ఉన్నాయి. కొన్ని ఉప పురాణాలలో ఉన్నాయి. భారతానికి ఖిలపర్వంగా చెప్పబడే హరివంశం ఇందులో పురాణస్థాయికి చేర్చబడింది. ధర్మ కల్పద్రుమం అనే గ్రంథంలో జ్ఞానానంద సరస్వతి ఇంకా పురాణాలు ఉన్నాయని తెలిపి ఆ పురాణాలను అయిదు విధాలుగా వర్గీకరించాడు. 1. మహాపురాణాలు 2. ఉపపురాణాలు 3. ఔపపురాణాలు 4. ఉపోప పురాణాలు 5. ఉపౌప పురాణాలు

ఇలా రక రకాల అవాంతర భేదాలు పురాణాలలో ఉండగా వీనిని గుర్తించకుండానే కొందరు ముఖ్యంగా మన తెలుగు కవులు కొంత గందరగోళానికి లోనైనారు. ఇది ఆధునిక కాలంలోనే కాదు. ప్రాచీన కాలంలోనే జరిగింది. శ్రీనాథకవి సార్వభౌముడు మహాపురాణాలలోని స్కాందంలో భాగమైన కాశీ ఖండాన్ని తెలుగులోనికి అనువదించేటప్పుడు సప్తఖండాత్మక స్కాందమన్నాడు. గోదావరి ఖండంలోని భీమఖండాన్ని రచిస్తూ పంచాశత్ఖండ మండితస్కాందం అన్నాడు. మహాపురాణమైన స్కాందంలో ఉన్నవే ఏడు ఖండాలు. వాటిల్లో గోదావరీ ఖండం లేనే లేదు. పంచాశత్ఖండమండితమైన స్కాందంలోను గోదావరి ఖండం ఒకటిగాలేదు. ద్రాక్షారామ భీమేశ్వరునికి ప్రసిద్ధి కల్పించటానికి సంస్కృత భీమఖండాన్ని శ్రీనాథుడే రచించాడని ఒక ప్రతీతి. యథార్థం భీమేశ్వరునికే ఎరుక. ఇక పద్దెనిమిదవ శతాబ్దం ప్రథమ పాదానికి చెందిన హంసవింశతి కర్త అయ్యలరాజు నారాయణామాత్యుడు తన హంసవింశతిలో అష్టాదశ పురాణాలను తెలుపుతూ బ్రహ్మోత్తర ఖండం వాటిలో ఒకటి అని తెల్పాడు. నిజానికి సప్తఖండాత్మకమైన స్కాందపురాణంలో మూడవ ఖండమైన బ్రహ్మ ఖండంలో ఉత్తర భాగమే బ్రహ్మోత్తర ఖండం. ఇది తెలుగు దేశంలో విస్తృత ప్రచారం పొందిన స్కాందంలోని భాగం. ప్రాచీన కాలంలోనే దీనికి ఐదు పద్యానువాదాలు వచ్చాయంటే దాని ప్రసిద్ధి అర్థం చేసుకోవచ్చు. అందుకే అయ్యలరాజు నారాయణకవి పొరపాటు పడినట్లున్నాడు.

మహా పురాణాలలో అనేక విషయాలు కలగాపులగంగా ఉన్నాయి. ముఖ్యంగా శివ, విష్ణు, దేవీ, అగ్ని మొదలైన దైవతాల పారమ్యాన్ని తెలిపే విషయంలో ఏ పురాణమూ పూర్తిగా ఒక పక్షమే వహించదు. అసలు హిందూ ధర్మమే అందుకు వ్యతిరేకం గదా. కానీ కాలంగడిచే కొద్దీ ఈ పారమ్య భావం ఎక్కువై ఒక్కొక్క దైవపారమ్యంగా ప్రత్యేక పురాణాలే కనిపిస్తున్నాయి. అందువలననే ఈ ఉపపురాణాలలో కూడా శైవ, వైష్ణవ, సౌర, శాక్తాది భేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పండితులు పురాణ రచనా కాలాలను గురించి చాలా చర్చలు చేశారు. వారి చర్చల సారాంశం ఇవి అన్నీ ఒక కాలంలో రచించటం జరగలేదని మాత్రమే కాకుండా, ఒక పురాణంలోని వివిధ భాగాలు వివిధ కాలాలలో రచింపబడ్డాయనేదే. ఏదైనా ఉపపురాణౌప పురాణాదులలో చాలా వరకు క్రీ.శ. పదవ

శతాబ్దానికి ముందు కాలంలోనే రచించటం జరిగిందనేది ఒక ఊహ. కొన్ని ఉప పురాణాలు. క్రీస్తుకు పూర్వమే పంచమ శతాబ్దంలోనే ఉన్నాయని మరికొన్ని క్రీ.శ. షష్ఠ శతాబ్దం ప్రాంతానికి చెందినవని మరి కొందరు పండితుల అభిప్రాయం. ఇలా పురాణ సాహిత్యం విస్తృతిని పొంది మహాపురాణ ఉపపురాణ ఔపపురాణ ఔపోప పురాణ భేదాలతో విలసిస్తూ వట వృక్షంలాగా విస్తరించి జాతి జీవనంలో నరనరాలా జీర్ణించుకొనిపోయింది. ఇది ఎంత విస్తృతమైనదో దానిని అధ్యయనం చేసినవారికే తప్ప ఇతరులకు ఊహైక గమ్యము.

పురాణాలకు కల్ప సంబంధం

ఇంతకుముందు ఏ పురాణం ఏ కల్పాలలో జరిగిన విషయాలను తెలుపుతున్నదో ఆయా పురాణాలలోని విషయాలను తెలిపేటప్పుడు తెలియజేయబడింది. ఇక్కడ ఆ వివరాలు పట్టికలో ఇవ్వబడ్డాయి చూడండి.

1.	బ్రహ్మపురాణం	బ్రహ్మకల్పం	10,000 శ్లోకాలు
2.	పద్మపురాణం	పద్మకల్పం	55,000 శ్లోకాలు
3.	విష్ణుపురాణం	వరాహ కల్పం	8,000 శ్లోకాలు
4.	శివ/వాయు పురాణం	శ్వేత కల్పం	24,000 శ్లోకాలు
5.	భాగవత పురాణం	సారస్వత కల్పం	18,000 శ్లోకాలు
6.	భవిష్య పురాణం	అఘోరకల్పం	31,000 శ్లోకాలు
7.	నారదపురాణం	బృహత్ కల్పం	25,000 శ్లోకాలు
8.	మార్కండేయ పురాణం	మధురకల్పం	9,000 శ్లోకాలు
9.	అగ్నిపురాణం	ఈశాన కల్పం	8,000 శ్లోకాలు
10.	బ్రహ్మవైవర్తపురాణం	రథంతర కల్పం	12,000 శ్లోకాలు
11.	లింగపురాణం	అగ్నికల్పం	11,000 శ్లోకాలు
12.	వామనపురాణం	కూర్మకల్పం	14,000 శ్లోకాలు
13.	స్కాందపురాణం	తత్పురుష కల్పం	1,00,000 శ్లోకాలు
14.	మత్స్యపురాణం	సత్యకల్పం	6,000 శ్లోకాలు
15.	కూర్మపురాణం	లక్ష్మీకల్పం	24,000 శ్లోకాలు
16.	వరాహపురాణం	మానవ కల్పం	24,000 శ్లోకాలు
17.	గరుడ పురాణం	గారుడ కల్పం	19,000 శ్లోకాలు
18.	బ్రహ్మాండపురాణం	భవిష్యకల్పం	12,000 శ్లోకాలు
		మొత్తం	**4,00,000 శ్లోకాలు**

ఇంతకుముందు చెప్పిన శ్లోక సంఖ్యపైన చూపిన శ్లోక సంఖ్యతో కొంత భేదించ వచ్చు. అది సంహితా భేదం మొదలైన కారణాల వలన కావచ్చునని విష్ణుచిత్తీయ వ్యాఖ్య తెల్పుతున్నది. అలాగే ఆయా పురాణాలలో తరువాత చొరబడిన ప్రక్షిప్తాలు, దొరకని భాగాలు వీటి అన్నింటి కారణాల చేత ఈ భేదం ఏర్పడి ఉండవచ్చు. కానీ వ్యాస ప్రోక్తమైన పద్ధెనిమిది పురాణాలలోని మొత్తం శ్లోక సంఖ్య నాలుగు లక్షలని అన్ని పురాణాలు ముక్తకంఠంతో ఘోషిస్తున్నాయి.

మన్వంతరము

ఒక్కొక్క మన్వంతర కాలమున ఒక్కొక్క మనువు పాలన చేస్తాడు. ఈ మన్వంతరాలు 14. మొత్తం వానికి అధిపతులైన మనువులు 14 మంది. వారు 1. స్వాయంభువుడు 2. స్వారోచిషుడు 3. ఉత్తముడు 4. తామసుడు 5. రైవతుడు 6. చాక్షుషుడు–ఇక్కడి వరకు మన్వంతరములు గడిచిపోయినవి. ప్రస్తుతము ఏడవదైన వైవస్వతమన్వంతరము జరుగు తున్నందువలన 7. వైవస్వతుడు (ఇతడు ఇప్పటి మనువు) 8. సావర్ణి 9. దక్ష సావర్ణి 10. బ్రహ్మసావర్ణి 11. ధర్మసావర్ణి 12. రుద్రసావర్ణి 13. దేవసావర్ణి 14. ఇంద్రసావర్ణి (వీరంతా రాబోయే మనువులు). వివిధ పురాణాల్లో ఈ మనువుల పేర్లతో కూడా కొన్ని భేదాలు కనిపిస్తున్నాయి. అది కల్పభేదముచేత కలిగినదని పురాణ పండితుల ఉద్దేశ్యము.

మన్వంతరాలు, కల్పాల స్వరూపం

చారిత్రక గణనంలో మన్వంతరం చాలా ముఖ్యమైనది. లేకపోతే సృష్టి నుంచి ప్రళయం వరకు సాగే ఈ మహత్తరమైన అంతులేని కాలంలో కనీసం కొంద గుర్తులుగానైనా ఏది ఎప్పుడు జరిగిందో గుర్తించడం ఎలా. అందుకే భాగవతం

మన్వంతరం మనుర్దేవా మనుపుత్రా సురేశ్వరః
ఋషయోఽ౽శాంవతారాశ్చ హరేః షడ్విధముచ్యతే

అనగా మనువు, మనుపుత్రులు, దేవతలు, ఋషులు, అంశావతారాల, ప్రసిద్ధ సంఘటనలు జరిగిన విషయాలు చెప్పినప్పుడు దానిని మన్వంతరం అంటారు.

స్వాయంభువమనువు యొక్క కాలం ఏ ఏ ఋషులు, మహర్షులు, రాజులు ఉన్నారు, స్వారోచిష మనువు కాలంలో ఆయనకు సహాయంగా ఉన్న మహాపురుష లెవరు, ఉత్తమ మనువు కాలంలో ఏయే పురాణాల ప్రాముఖ్యత ఉన్నది, లేకపోతే రైవతక మనువు కాలంలో ఎటువంటి సంఘ నిర్మాణం ఉన్నది. ఇలాంటి విషయాలన్నింటని గురించి తెలుసుకొనటానికి పురాణాలలో తప్పితే వేరు ఆధారభూతమైనవి ఏమున్నాయి.

అలాగే మన్వంతర జ్ఞానం లేకుండా ఏ రాజు యొక్క వంశము యొక్క సరియైన జ్ఞానము, అవగాహనలు అవసరము కదా. ఒక కల్పంలో పధ్నాలుగా మంది మనువులుంటారు. మనుష్య మానానికి కొద్ది ఎక్కువగా ఉండే 71 మహాయుగాలకు అంటే 30,85,71,428 సంవత్సరాల 6 నెలల 25 రోజుల 42 గడియల కాలాన్ని ఒక మన్వంతరం అంటారు. ఇలాంటి మన్వంతరాలు 14 అంటే 432 కోట్ల మనుష్య సంవత్సరాలు – బ్రహ్మదేవునికి ఒక పగలు. దీనికి 'ఉదయ కల్పం' అని పేరు. ఇందులో బ్రహ్మాదుల సృష్టి జరుగుతుంది. తిరిగి ఇంతేకాలం బ్రహ్మదేవునికి రాత్రి. దీనికి 'క్షయ కల్పము' అని పేరు. ఈ సమయంలో సంకర్షణ అగ్ని చేత భూర్భువస్సువర్మహర్లోకాలు దగ్ధం అవుతాయి. దీనిన నైమిత్తిక ప్రళయం అంటారు. ఉదయ కల్పం, క్షయకల్పం రెండూ కలిస్తే బ్రహ్మకు ఒక అహోరాత్రం అవుతుంది. దీనికే కల్పం అని పేరు. 360 కల్పాలు ఇలాంటివి బ్రహ్మదేవునికి ఒక సంవత్సరం. ఇలాంటి సంవత్సరాలు నూరు బ్రహ్మదేవునికి పరమ ఆయుర్దాయము. దీనికి ఒక మహా కల్పం అని పేరు. ఈ మహాకల్పం తరువాత వచ్చే ప్రళయాన్ని ప్రాకృతిక ప్రళయము అంటారు.

ఈ కల్పాలు అనంతం. కొన్ని పేర్లను మాత్రం తెలుసుకొందాం.

1. శ్వేత వరాహ 2. నీలలోహిత 3. వామదేవ 4. వథంతర 5. రౌరవ 6. ప్రాణ(దేవ) 7. బృహత్ 8. కందర్ప 9. సత్య 10. ఈశాన 11. ధాన (తమః) 12. సారస్వత 13. ఉదాన 14. గరుడ 15. కలార్మ 16. నారసింహ 17. సమాధి 18. ఆగ్నేయ 19. విష్ణుజ 20. సౌర 21. సోమ 22. భావన 23. సుప్తమాలి 24. వైకుంఠ 25. ఆర్చిష 26. వల్మీక 27. వైరాజ 28. గేరీ 29. మాహేశ్వర 30. పితృ 31. మానవ 32. తత్పురుష 33. వైకుంఠ 34. లక్ష్మీ 35. సావిత్రీ 36. అఘోర 37. పద్మకల్పం మొదలైనవి. ఈ కల్పాలు అనంతాలు.

పురాణాలలో కథలలో తేడాలు ఎందుకుంటున్నాయి

వివిధ పురాణాలను పరిశీలిస్తే, కొన్ని కథలు ఒక పురాణంలో ఒక విధంగాను, ఇంకొక పురాణంలో ఇంకొక విధంగాను కనిపిస్తున్నాయి. మన పురాణాలపై అంతగా గురిలేనివారు పురాణాలకు ఐక్యతలేదని, పరస్పర విరుద్ధాలని అందుచేత అవి అప్రమాణాలని తీవ్రంగా నిందాపూర్వక విమర్శలు చేస్తున్నారు. ఇలాంటి వారికి వ్యాసుడు ఏకార్థాని పురాణాని వేదాశ్చైకార్థ సమ్మితాః అని మహాభారతంలో వివరించాడు. అలాగే

క్వచిత్క్వచిత్పురాణేషు, విరోధో యది దృశ్యతే
కల్పభేదాది భిస్తత్ర, వ్యవస్థాసద్భిరిష్యతే – (పద్మ పురాణం)

అని పద్మ పురాణంలో చెప్పబడింది. అనగా ప్రతికల్పంలోను సృష్టి జరుగుతుంది. ఈ జరిగే సృష్టిలో రాముడు, కృష్ణుడు మొదలైన అవతారాల, ఇతర మహాపురుషుల సృష్టి జరుగుతుంది. ఆ గాథలలో కల్పభేద ప్రయుక్తాలైన కొద్దిపాటి భేదాలు కలుగవచ్చును. అది దోషం కాదు. అలాంటి విషయాలను కూడా పురాణాలు వదలకుండా తెలియచేస్తాయి అని అర్థం. ఈ విషయం పద్మపురాణం పాతాళఖండంలో పూర్వకల్ప రామాయణ కథ సమ యంలో తెలియజేయబడింది. అందువలననే ప్రతి పురాణంలోనూ, ఈ పురాణం ఈ కల్ప వృత్తాంతాన్ని తెలుపుతుంది అని వ్యాసుడు తెలుపుతున్నాడు.

చివరగా చెప్పాలంటే పురాణంలో స్పృశించని, స్పృశించకూడని విషయాలు ఏమీ ఉండవని చెప్పవచ్చు. ఎందుకంటే ఏ విషయమైనా పురాణ పంచలక్షణాలలోనికి అంతర్భవిస్తాయనటం సరియైనదే. తొమ్మిది రకాల సృష్టులు, నాల్గువిధాల ప్రళయాలు, పద్నాలుగు మన్వంతరాల విశేషాలు, కాలగణనం, వ్రతదాన తీర్థ ధర్మశాస్త్ర విషయాలు, అశ్వ, రత్న, గజవాస్తు జ్యోతిస్సాముద్రిక శాస్త్రాలు, ఆయుర్వేద, ధనుర్వేదాలు, అనులేపన స్వేచ్ఛారూప ధారణాది బహువిచిత్ర విద్యలు, సప్తద్వీప బహునదీనద కులపర్వత సముద్రాది అనేక భౌగోళిక విషయాలు, లోకాంతర గ్రహాంతర బ్రహ్మాండాంతర విశేషాలు, తాంత్రిక విద్య, ఇక్ష్వాకు చంద్ర కలి వంశ వర్ణనలు, భగవత్తత్వం, భక్తకర్మజ్ఞాన వైరాగ్యా ధ్యాత్మిక విషయాలు. వివిధ దేవీ దేవతాతత్త్వస్తోత్ర పూజావతారాది వర్ణనలు, మహిమలు, నీతులు, ప్రపంచ రీతులు, ధర్మాలు, అలంకారం, వ్యాకరణం. ఈ విధంగా పురాణాలలో లేనిది లేదు. అవి విజ్ఞాన సర్వస్వాలు. కనుకనే

యో విద్యాచ్చతురోవేదాన్ సాంగోపనిషదో ద్విజః
న చేత్పురాణం సంవిద్యాన్నైవ సస్యాద్విచక్షణ ః *(వాయుపురాణం 1.1.180)*

(నాల్గు వేదాలు, ఆరు శాస్త్రాలు, అన్ని ఉపనిషత్తులు చదివినా పురాణం తెలియని వాడు విచక్షుణుడు కాదు" అని తెలుపుతున్నది)

ఇదే విషయాన్ని నారదపురాణం **'యాస్మిన్ జ్ఞాతే భవేద్జ్ఞాతం వాఙ్మయం స చరాచరమ్** (1.92.21) పురాణం తెలుసుకొంటే సమస్త వాఙ్మయం తెలుసుకొన్నట్టే అని తెలుపుతుంది.

అందుకే అలాంటి పురాణాలలోని విషయాల గురించి ఇక్కడ తెలుసుకొందాం.

శ్రీ వాయు మహాపురాణ విశేషాలు

ఉపోద్ఘాతం-విషయానుక్రమణిక

వాయుపురాణానికి పురాణ సాహిత్యంలో విశిష్ట స్థానం ఉన్నది. పురాణ పంచలక్షణ నిర్దేశమందలి, ప్రాచీనతలోను, శైలిలోను దీనికి ప్రత్యేకతఉన్నది. సంక్షిప్తముగా అయినా వాయుపురాణంలో సర్గాది పంచ లక్షణములు చక్కగా నిరూపితము అయినాయి. ప్రస్తుతము మూడుమార్లు ముద్రితమై లభ్యమగుచున్న వాయు పురాణమున 112 అధ్యాయములు ఉన్నాయి. దీనిలో పూర్వార్థం ఉత్తరార్థం అని రెండు భాగాలు ఉన్నాయి. పూర్వార్ధం 1 నుంచి 61 అధ్యాయం వరకు ఉండగా ఉత్తరార్థం 62 నుంచి 112 అధ్యాయాల వరకు కల భాగం చివరి తొమ్మిది అధ్యాయాలు 104-112 వైష్ణవ మత ప్రభావ నిరూపణమునకై ప్రయత్నించిరని చెప్పవచ్చును. కానీ 'గయామాహాత్మ్యంగా' కల ఈ భాగం ప్రథమ భాగం మధ్యలో ఉండవలసినది ఇక్కడ కలపబడిందని కూడా భావించే అవకాశం ఉన్నది.

వాయుపురాణము 1.ప్రక్రియాపాదము (1-6 అధ్యాయములు); ఉపోద్ఘాత పాదము (7-64 అధ్యాయములు); అనుషంగపాదము (65-99 అధ్యాయములు) ఉపసంహార పాదము (100-112) అనే భాగచతుష్టయ, పాదాలుగా చేయటం చాలా ప్రాచీనమైన విధానం. ఇది వేద చతుష్టయమును, కాల చతుష్టయమును తలపింపచేస్తున్నది. ఇట్లే ఈ పురాణంలోని శ్లోకముల సంఖ్య పన్నెండు వేల శ్లోకములని తెలుపబడినది. (32-66) కావున నిందలి కొన్నివిషయములు ఇటనట చెదిరిపోయిన ప్రాచీన వాయుపురాణమని చెప్పవచ్చు. ఈ విషయములను నిర్ధారిస్తూ వాయు పురాణము - 32వ అధ్యాయము.

ఏవం ద్వాదశ సాహస్రం పురాణం కవయోవిదుః
యథావేదశ్చతుష్టా దశ్చతుష్పాదం తథాయుగమ్
యథాయుగం చతుష్పాదం విధాత్రా విహితం స్వయమ్
చతుష్పాదం పురాణం తు బ్రహ్మణావిహితం పురా (32-66, 6)

అని చెప్పిన అనేక అంతరంగిక బహిరంగ సాక్ష్యముల ద్వారా ఇది మహాపురాణం అని ఉపపురాణంలో చేరదని, వాయుపురాణమే అష్టాదశ మహాపురాణములలో చేర్చవలసి ఉందని విమర్శకుల అభిప్రాయం. అయితే కొందరు శివపురాణమే మహా పురాణమని భావిస్తున్నారు.

'త్రయోవింశతి సాహస్రమనిలం తద్గతం శుభమ్' (103-6) అని తనను గురించి 23 వేల శ్లోకాలు గలదని చెప్పుకొంటున్నది. ఇదిమరీ విడ్డూరంగా ఉన్నది.

ప్రస్తుతం ముద్రింపబడి ఉన్న ఈ పురాణంలో 10991 శ్లోకములు ఉపలభ్యములు అవుతున్నాయి.

వాయుప్రోక్తం కాబట్టి ఇది వాయుపురాణంగా ప్రసిద్ధిగాంచినా, ఇందులో శివ మాహాత్మ్య విషయాలే అత్యధికంగా ఉండటంవల్ల దీనినే కొందరు శివపురాణంగా పేర్కొనగా, కొందరు వాయు, శివపురాణాలు వేరువేరని భావిస్తున్నారు. కొన్ని వ్రాత ప్రతులలోగల ఇతి వాయుపురాణే లక్ష్మీ సంహితాయామానంద కానన మాహాత్మ్యే అనే విషయాన్ని పరిశీలించినప్పుడు ఈ పురాణంలో కేవలం శివమాహాత్మ్యమే కాక వైష్ణవ మాహాత్మ్య విషయాలు కూడా సందర్భాన్ని అనుసరించి ఉన్నాయని స్పష్టం అవుతున్నది.

వాయుపురాణంలోని విషయాలు

నారదపురాణంలో వాయుపురాణ విషయాను క్రమణిక ఇలా ఉన్నది.

"శృణు వత్స ప్రవక్ష్యామి పురాణం వాయవీయకమ్
తస్మిన్ శృతే లభేద్వామరుద్రస్య పరమాత్మనః
చతుర్వింశతి సాహస్రం తత్ పురాణం ప్రకీర్తితమ్
శ్వేతకల్ప ప్రసంగేన ధర్మాణ్యత్రాహమారుతః
తద్వాయవీయ ముదితం భాగద్వయ సమాచితమ్

(ఓ విప్రా! నేను నీకు వాయవీయపురాణమును వివరించుచున్నాను. దీనిని శ్రద్ధగా వినుము. ఆ పురాణమును వినుటచేత భగవంతుడు రుద్రుని లోకము ప్రాప్తించగలదు.

ఈ పురాణమున శ్వేత కల్పమును గురించివాయుదేవుడు చెప్పుటచే వాయు పురాణమని దీనికి ఆ పేరు వచ్చినది. ఈ పురాణంలో 24 వేల శ్లోకాలు ఉన్నాయి.)

పూర్వభాగే స్వర్గాది లక్షణం యత్రప్రోక్తం విప్ర ! సవిస్తరాత్
మన్వంతరేషు వంశాశ్చ రాజ్ఞాం యే యత్ర కీర్తితాః
గయాసురస్య హననం విస్తరాద్ యత్ర కీర్తితమ్
మాసానాం చైవ మాహాత్మ్యం మాఘస్యోక్తం ఫలాధికమ్
దానధర్మా రాజధర్మా విస్తరేణో ది తాస్తథా
భూమి పాతాళక వ్యోమచారిణాం యత్ర నిర్ణయః
వ్రతాదీనాఞ్చ పూర్వోఽ యం విభాగః సముదాహృతః

తదుత్తర భాగే ఉత్తరేతస్య భాగేతు నర్మదా తీర్థ వర్ణనమ్
శివస్యసంహితాఖ్యా తైవిస్తరేణ మునీశ్వర
యోదేవః సర్వదేవానాం దుర్విజ్ఞేయః సనాతనః
సతుసర్వాత్మనా యస్యాస్తీరే తిష్ఠతి సన్తతమ్
ఇదం బ్రహ్మహరీదం సాక్షాచ్చేదం పరోహరః
ఇదం బ్రహ్మ నిరాకారం కైవల్యం నర్మదా జలమ్
ధ్రువం లోకహితార్థాయ శివేన స్వశరీరతః
శక్తిః కాపి సరిద్రూపా రేవే యమవతారితా
యేవ సన్త్యుత్తరే కూలే రుద్రస్యానుచ రాహితే
వసంతి యామ్యతీరే యేలోకం తేయాన్తి వైష్ణవమ్
ఓంకారేశ్వర మారభ్య యావత్ పశ్చిమ సాగరమ్
సజమాః పంచ చ త్రిశంన్నదీనాం పాపనాశనాః
దశైక ముత్తరే తీరే త్రయోవింశతి దక్షిణే
పంచత్రింశత్తమః ప్రోక్తో రేవాసాగర సఙ్గమః
సఙ్గమే సహితాన్యేవం రేవాతీరేద్యయేపిచ
చతుః శతాని తీర్థాని ప్రసిద్ధాని చసన్తి హి
షష్టి తీర్థసహస్రాణి షష్టికోట్య మునీశ్వర
సన్తి చాన్యాని రేవాయాస్తీర యుగ్మేపదేపదే
సంహితే యం మహాపుణ్యా శివస్య పరమాత్మనః
నర్మదా చరితం యత్ర వాయునా పరికీర్తితమ్.

ఇతి శ్రీ వాయుపురాణే వాయుప్రోక్తే ద్వాదశ సోహస్ర్యాం సంహితాయాం బ్రహ్మాండా వర్తం సమాప్తమ్.

వాయుపురాణము రెండు భాగములుగా ఉన్నది. దీని పూర్వభాగంలో సర్గాది లక్షణము, రాజవంశముల చరిత్ర విస్తరముగా చెప్పబడినది. ఇంకను గయాసురవధ వివిధ మాసముల మాహాత్మ్యము, మాఘమాసము యొక్క ఫలాధిక్యము, దానధర్మ, రాజధర్మ వివరములు భూ, పాతాళాదిశ, ఆకాశచారుల నిర్ణయము, వ్రతాదుల నియమములు చెప్పబడినవి. ఓ మునీశ్వరా! దీని ఉత్తర భాగంలో నర్మదాతీర్థ వర్ణన, శివ సంహితా ఖ్యానము, సర్వదేవతలకును తెలియరానివాడు, సనాతనుడైన భగవంతుడు ఏ నదియొక్క ఒడ్డున వెలసి ఉన్నాడో ఆ నర్మదా జలము సాక్షాత్తు, బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరుల మోక్ష రూపమే. లోకహితంకోసం శివ పరమాత్మ తన శరీరం నుంచి నదీరూపంలో, శక్తి స్వరూపంగా ఈ రేవానదిని అవతరింపచేశాడు. ఆ భగవంతుడు ఈశ్వరుడు. ఈ నది ఉత్తరతటంలో వెలసిఉన్నాడు. ఈ నది యొక్క దక్షిణతీరంలో వెలసిన ఆ రుద్రుని అను చరులు, విష్ణులోకాన్ని చేరుకుంటారు. అలాంటి ఓంకార క్షేత్రం నుంచి ప్రారంభించి పశ్చిమ సాగరపర్యంతం (అరేబియా సముద్రం) ముప్పై అయిదు నదీ సముదాయములు సంగమి స్తున్నాయి. ఉత్తరతటంపై పదకొండు, దక్షిణతటంపై ఇరవైమూడు సంగమములు ఉన్నాయి. వాటిల్లో ఈ రేవాసంగమమే ముప్పై అయిదవదని చెప్పబడింది. రేవానదియొక్క రెండు తటములపై సంగమ సహితాలైన పవిత్రములైన నాలుగు వందల తీర్థ స్థలాలు ఉన్నాయి. ఇది శివుని మహాపుణ్య సంహిత. ఇందులో వాయుప్రోక్తనర్మదా చరితము కీర్తింపబడి ఉన్నది.

ఈ పురాణం తన గురించి

'ఏమ మషాదశోకాన్తి పురాణాని బృహంతిచ పు
పురాణేష్వేషు బహవో ధర్మాస్తే వినిరూపితా
రాగిణాంచ విరాగాణాం యతీనాం బ్రహ్మచారిణమ్
గృహస్థానాం వనస్థానాం స్త్రీ శూద్రాణాం విశేషతః
బ్రాహ్మణక్షత్రియ విశాంచైయేచ సంకరజాత యః
గంగాద్యా యామహనద్యోయజ్ఞ వ్రతతపాంసిచ
అనేక విధదానాని యమాశ్చనియమైః సహ
యోగధర్మా బహువిధాః సంఖ్యా బాగవస్త థా
భక్తి మార్గా జ్ఞానమార్గావైరగ్యా నిల నీరజాః

ఉపాసన విధిశ్చోక్తః కర్మసంశుద్ధి చేతనామ్
ఏతదన్యచ్చ వివిధం పురాణేషు నిరూపితం
అతః పరం కిమస్త్యస్తి నవాం బోద్ధవ్యముత్తమమ్ –(వాయు–103–11–17)

(ఈ పురాణంలో అనేక ధర్మాలు విశేషంగా వివరించబడ్డాయి. రాగులు, విరాగులు, యతులు, బ్రహ్మచారులు, గృహస్థులు, వనస్థులు యొక్క విశేషించి, స్త్రీ, శూద్రుల యొక్క ధర్మాలు తెలియచేయబడ్డాయి. గంగాదిమహానదులు, యజ్ఞాలు, వ్రతాలు, తపస్సులు అనేక విధ దానాలు యమములు, నియయములు, బహువిధ యోగధర్మాలు, సాంఖ్య మతాలు, భాగవత మతాలు, భక్తిమార్గాలు, జ్ఞానమార్గాలు, వైరాగ్యమువలన, వాయువు వల్లను, జలమువల్లను కలిగే పారమార్థిక మార్గాలు తెలుపబడ్డాయి. కర్మ సంశుద్ధచేతస్కుల ఉపాసనా విధికూడా చెప్పబడింది. బ్రహ్మము, శైవము, సారము, శాక్తము ఆర్గతముగా అనగా బౌద్ధము అనే స్వభావానికి యతులైన ఆరు దర్శనాలు వివరించబడ్డాయి' ఇందులో, ఇంకా వివిధాలైన వేరు విషయాలు తెలుపబడ్డాయి. ఇంతకంటే వేరుగా తెలియజేయవలసిన విధాలు ఏమీలేవు) – అని చెప్పుకున్నది.

వాయు పురాణంలో ప్రాచీన రాజవంశాల ప్రస్తావరనలో 66 అధ్యాయంలో 258 శ్లోకంలో శాంశపాయనుడు తనకు సమకాలీనులైన రాజుల గురించి తెలుపుతూ అధిసామకృష్ణుడిని పేర్కొన్నాడు. ఈ అధిసామకృష్ణుడు జనమేజయుని పౌత్రుడు. ఈ అధిసామకృష్ణుని కాలం మహాభారత యుద్ధకాలంనాటికి రెండు వందల సంవత్సరాల తరువాత అని భావించబడుతున్నది. ఈ ఊహ ప్రకారం వాయుపురాణ రచనాకాలం, మహాభారత రచనాకాలానికి రెండు వందల సంవత్సరాల తరువాతది అయి ఉండాలి. ఇంతేకాకుండా వాయుపురాణంలో ఉపయోగించిన రచనా శైలి కూడా చాలా ప్రాచీనంగా కని పిస్తున్నది. తరువాత కాలంలో ఈ పురాణంలో చేర్చబడినవని భావించే భాగాలకు ప్రాచీ నమైనవి అనిపించే భాగాలకు చాలా తేడాకనిపిస్తుంది. చేర్చిన భాగాలశైలి వేరుగా ఉన్నది.

మహాపురాణాలలో వాయుపురాణ స్థానం

పురాణ గణనంలో నాలుగవది వాయుపురాణము. విష్ణు, పద్మ శ్రీమద్భాగవత, మార్కండేయ, బ్రహ్మ వైవర్త, కూర్మ, వారాహ, లింగ, స్కాంద పురాణాలు–నాల్గవ పురాణం శివ పురాణం అని చెప్పుచుండగా, మత్స్య నారదీయ, దేవీ భాగవతములు చతుర్థపురాణము వాయుపురాణమని పేర్కొంటున్నాయి. ప్రాచీనమైన పురాణములలో వాయుపురాణము

ఒకటి. బాణభట్టు కాదంబరిలో 'పురాణే వాయు ప్రలిపితమ్' అని ఈ పురాణం పేర్కొన బడింది. కావున ఈ పురాణము బాణునికంటే చాలా ముందుగానే రచింపబడి ఉండి యుండాలి. ఆధునిక కాలములో శివపురాణము వాయుపురాణము అనే పేర్లతో రెండు గ్రంథములు లభిస్తూ ప్రచారంలో ఉన్నాయి. రెండూ పరిశీలించి చూస్తే ఈ రెండు విభిన్న గ్రంథాలే. ఈనాడు ప్రకటితములై లభ్యములగుచున్న శివపురాణంలో రెండు స్థలములలో, రెండు రకములైన పురాణ సంహితల వివరములు పేర్కొనబడ్డాయి. శివపురాణంలోని విద్యేశ్వర సంహిత (అధ్యాయం 2-49 నుంచి 55)లోను, వాయవీయ సంహిత పూర్వార్థంలోను (1-50 నుంచి 52) పన్నెండు సంహితల పేర్లువాని శ్లోక సంఖ్య ఇవ్వబడింది. ఆ సంహితలు ఇవి : 1. విద్యేశ్వర, 2. రౌద్ర, 3. వినాయక, 4. ఔమ, 5. మాతృ, 6. రుద్రైకాదశ, 7. కైలాస, 8. శత రుద్ర, 9. కోటిరుద్ర, 10. సహస్రకోటి, 11. వాయుప్రోక్త, 12. ధర్మసంహితలు. అయితే ప్రస్తుతం 7 సంహితలే లభ్యం అవుతున్నాయి. మిగిలిన 5 సంహితలు ముద్రితం కాలేదు. అముద్రితాలుగా ఉన్నాయో లేదో తెలియదు. అనేక అంతర్గత బాహిరక సాక్ష్యాలను అనుసరించి వీటిలో వాయుపురాణమే ప్రాచీనమైన రచనమనియు శివ పురాణము క్రీ.శ. 1030కి ముందే రచింపబడి ఉండినను ఇప్పుడు లభ్యమగుచున్న వాయుపురాణమునే మహాపురాణములలో ఒకటిగా పరిగణించాలనీ విమర్శకుల నిర్ణయము. స్కాందపురాణం కూడా వాయువుచేత ప్రవచింపబడిన నాల్గవ పురాణం వాయవీయ పురాణమేనని అది శివపురాణం అనికూడా చెప్పటానికి కారణం అందులో గల శివభక్తికి చెందిన విషయ వివరణమేనని వివరిస్తున్నది.

'చతుర్థం వాయునా ప్రోక్తం వాయవీయం ఇతి స్మృతమ్ శివభక్తి సమాయోగచ చైవమ్ తచ్చ పరాఖ్యయా చతుర్వింశతి సంఖ్యాతం సహస్రాణితు శౌనక' (స్కాందం V - iii రేవాఖండం 33-34) అనేది ఇందుకు ఆధారం.

నారదీయ పురాణము (పూర్వార్ధం-95వ అధ్యాయం); దేవీ భాగవతం; మత్స్య పురాణం (53 అధ్యాయం) లలో చతుర్థపురాణాల లక్షణములు ఇవ్వబడినవి. వీనిలో నారదీయ పురాణము కొంత ప్రాచీనము కావున అందు చెప్పబడిన లక్షణములు పరిగణన లోనికి తీసుకొనబడినవి. నారదీయ పురాణ మతానుసారము (1-95-116) వాయవీయ పురాణము రుద్రుని మాహాత్మ్యమును తెల్పుతున్నది, ఇరవైనాలుగువేల శ్లోకములు గలది. శ్వేతకల్పంలో జరిగిన వృత్తాంతమును తెల్పునది, వాయుప్రోక్తమైనది. ఇందు రెండు భాగములుగలవు. 1.పూర్వభాగము. ఇందు సర్గాది మన్వంతరములందలి రాజవంశములు, గయాసుర హననము, మాఘమాస మాహాత్మ్యము వ్రత, దాన, ధర్మ, రాజధర్మము మొదలైన

విషయముల వివరము గలదు. ఉత్తర భాగమునందు నర్మదానదీ వర్ణన, శివమాహాత్మ్యము ప్రతిపాదింపబడినవి. రేవా మాహాత్మ్యమునందు పూర్వభాగమున శివమాహాత్మ్యము, ఉత్తర భాగమున రేవా (నర్మద) మాహాత్మ్యము వర్ణింపబడినదని చెప్పబడింది. మత్స్య పురాణం కూడా దాదాపు ఇదే విషయమును బలపరచుచున్నది.

అష్టాదశ పురాణసూచికయందు పురాణాల పేర్లనుగురించి ఏకాభిప్రాయము లేదు. ఇది లోతుగా పరిశీలింపవలసిన విషయము, పద్మ, బ్రహ్మవైవర్త, భాగవత, మార్కండేయ, లింగ, వరాహ, విష్ణు పురాణములు నాల్గవపురాణము శివపురాణమని చెప్పుచున్నవి. మత్స్య (53-11-56), స్కాంద (VII-2-21-77) నారదీయ (1-92-109) అగ్ని (272-1-23) పురాణములు ఏ ఏ నెలలలో ఏ ఏ పురాణ వ్రాతప్రతులను దానము చేయుటచే ఏ ఫలమో చెప్పుచు, ఈ నాలుగు పురాణములు అష్టాదశ పురాణములలో నాల్గవదిగా వాయవీయ పురాణమును పేర్కొంటున్నాయి. దేవీ భాగవతము కూడా వాయు పురాణ పక్షాన్నే మొగ్గు చూపుతున్నది. మిగిలిన పురాణములు అన్నియు తమ పురాణ సూచిలో శివపురాణాన్నే పేర్కొనుచున్నవి. ఈ పురాణ వ్రాతప్రతులు దానఫల వృత్తాంతమున లేనివి చతుర్థ పురాణము శైవపురాణమని చెప్పుచున్నవి. కూర్మ పురాణము మాత్రం ప్రత్యేకంగా (1 – 1 – 13 నుంచి 15) నాల్గవ పురాణముగా శైవపురాణమని పేర్కొంటూ పద్ధెనిమిదవ పురాణముగా వాయు పురాణమును 19వ పురాణముగా బ్రహ్మాండ పురాణమును పేర్కొంటున్నది. ఇది ఇంకొక మతం.

నారదీయ పురాణంలో చెప్పిన ప్రకారం వాయుపురాణ విషయాను క్రమణికతో రేవా ఖండంలో వర్ణించబడిన వాయు లేక శైవ విషయంలో పెద్ద తేడాలేదు. కానీ రేవా ఖండంలో గయామాహ్యా ప్రసంగంలేదు. ఇదే భేదం. నారద పురాణం పూర్వ భాగంలోనే గయామాహ్యాం ఉన్నదని చెపుతుండగా ఇందులో పూర్వభాగంలోలేదు. అయితే గయా మాహాత్మ్యం ప్రత్యేక భాగంగా కొన్ని చోట్ల లభ్యం అయింది. బహుశః ఆ భాగమే 104 నుంచి 112 అధ్యాయాలలో చెప్పిన గయా మాహాత్మం కావచ్చు. తరువాత వారెవరో ఆ ప్రత్యేక భాగాన్ని ఈ పురాణం చివరచేర్చి ఉండవచ్చు. నిజానికి పురాణ ఫలశృతితో సహా పూర్తి అయినట్లుగా ఈ పురాణం 103వ అధ్యాయంలో సమాప్త రూపంలో కనిపిస్తుంటే తిరిగి గయామాహ్యాం చెప్పటం అసందర్భం గదా! కాబట్టే కొందరు విద్వాంసులు ఇది ఈ పురాణంలో ప్రక్షిప్తం అయిన భాగమని తరువాత ఎవరో చేర్చారని భావిస్తున్నారు. చేర్చిన విషయం యథార్థమే కావచ్చు కానీ (ప్రథమ భాగంలో ఉండవలసినది ద్వితీయ భాగంలో పురాణం చివర చేర్చటం జరిగి ఉండాలి. ఆ విధంగా ఇది ప్రక్షిప్తంకాక, స్థానభ్రంశం, అయి ఉండాలి.

ఇంతేకాక మొదట 24 వేల శ్లోకాలున్న వాయవీయపురాణంలోని కొన్ని భాగాలు నారదపురాణ రచనా కాలానికే విడివిడిభాగాలై 12 వేల శ్లోకాలుగా కుదింపబడి ప్రస్తుతం పదకొండువేల శ్లోకాలుగా మాత్రం లభ్యం అవుతుండవచ్చు. నారదపురాణ రచనా కాలానికి అందులో ఉన్న విషయాలనే ఆ పురాణం వివరించి ఉండాలి.

వాయుపురాణం-శివపురాణం ఒకటేనా

వాస్తవానికి, వాయవీయ, శైవ పురాణములు అనేది ఒకే పురాణమునకు గల రెండు పేర్లని చెప్పవచ్చును. ఇది రెండు భాగములుగా విభజింపబడియున్నది. 24,000 శ్లోకములు గలవు. అది వాయుప్రోక్తమగుటచే వాయవీయమని చెప్పబడినది. శివపారమ్యమును బోధించునది శివుని వృత్తాంతమును వివరించునది కావున శివపురాణమని చెప్పవచ్చును. వక్తవలన వాయుపురాణమని, అందలి ముఖ్య వృత్తాంతమును బట్టి శివపురాణమని ప్రచారములోనికి వచ్చింది. అత్యధిక సంఖ్యగల పురాణములు శివపురాణ పక్షము వహించినా చతుర్థ పురాణము శివపురాణమేనని చెప్పుటకు సరిపడని అంశము. ప్రామాణికతను నిర్ణయించుట సంఖ్యాబలముపై జరగకూడని పని. కొందరు వంగదేశ పండితులు వాయుపురాణం మొత్తం శివపురాణంలోని భాగమని కూడా విశ్వసిస్తున్నారు. కానీ శివపురాణంలోని వాయవీయ సంహిత వలన వాయు అనుక్రమణికలోనే పోలికలేదు. అందువలన దీనిని శివపురాణంలోని అంతర్గత భాగమని భావించకూడదు.

ప్రస్తుతము శివపురాణము వాయుపురాణమును రెండు గ్రంథములు వ్యాప్తిలో గలవు. వాని వివరములు పరిశీలించి అందేది చతుర్థ పురాణమో పరిశీలింపవచ్చును. శ్రీ వెంకటేశ్వర ముద్రణాలయమువారిచే ముద్రింపబడి ప్రచారమున నున్న శివపురాణమునందు మొత్తము పన్నెండు భాగాలు లేక సంహితలు ఉన్నాయి. అవి 1.విద్యేశ్వర సంహిత; 2.రౌద్ర; 3.వినాయక; 4.ఔమ; 5.మాతృ; 6.రుద్రైకాదశ; 7.కైలాస; 8.శతరుద్ర; 9.కోటిరుద్ర; 10.సహస్రకోటి రుద్ర; 11.వాయుప్రోక్త; 12.ధర్మసంహితలు. వీని శ్లోక సంఖ్య ఒకలక్ష అని చెప్పబడింది. కానీ ఇంత బృహత్కాయంగల శివపురాణము కనీసము వ్రాతప్రతి అయినా ఉన్నదని తెలియరావటం లేదు. దీనిచే మొత్తము పురాణములలోని శ్లోక సంఖ్య చతుర్లక్ష శ్లోక పరిమితం అనే విషయంకూడా అసంబద్ధం అవుతుంది. ఈ విషయం కేవలం శివపురాణమునకు గొప్ప గౌరవము ఆపాదించుటకు మాత్రమే చర్చించబడిందని చెప్పవచ్చును. అతికాయముగల స్కాందమే 81 వేల శ్లోకములకు మించి లేదుగదా. ప్రస్తుతము లభ్యం అవుతున్న శివపురాణం ఏడు సంహితలను మాత్రమే

కలిగియున్నది. అవి 1.విద్యేశ్వర సంహిత (25 అధ్యాయములు); 2.రుద్రసంహిత (197 అధ్యాయములు) ఈ సంహిత 5 ఖండములు గలది. అవి 1.సృష్టిఖండం (20 అధ్యాయములు); 2.సతీఖండం (43 అధ్యాయములు); 3.పార్వతీ ఖండం (55 అధ్యాయములు); 4.మయూరఖండం (20 అధ్యాయములు); 5.యుద్ధఖండం (59 అధ్యాయములు); 3.శతరుద్ర సంహిత (42 అధ్యాయములు); 4.కోటిరుద్ర సంహిత (43 అధ్యాయములు); 4.ఉమాసంహిత (51 అధ్యాయములు); 6.కైలాస సంహిత (23 అధ్యాయములు); 7.వాయవీయ సంహిత (పూర్వభాగం-35) అధ్యాయము ఉత్తరభాగం 41 అధ్యాయములు) వీనిలో చివరి సంహిత వాయుప్రోక్తమగుటచే వాయవీయ సంహిత అనబడినది. ఇట్లు సంపూర్ణ శివపురాణమున 457 అధ్యాయములుగలవు. కానీ వాయవీయ సంహితలో 76 అధ్యాయములు నాలుగువేల శ్లోకములు మాత్రమే ఉన్నాయి.

ఇంతకుముందు చెప్పబడిన శివపురాణమున వర్ణిత విషయములను బట్టి పై లక్షణములు సరిపోవుటలేదు. 1.శివ పురాణములోని చివరి భాగమైన వాయవీయ సంహిత మాత్రమే వాయుప్రోక్తము. మిగిలినవి అన్యప్రోక్తములు. అందు పూర్వభాగం, ఉత్తర భాగములని చెప్పబడినను శ్లోకసంఖ్య 24 వేలు కాదు, కేవలము నాలుగువేలు మాత్రమే శివ మాహాత్మ్య ప్రతిపాదక విషయములున్నను అందలి పూర్వార్ధమున గయాసుర వృత్తాంతము లేదు. ఉత్తరార్ధమున రేవా (నర్మదా)నదీ మాహాత్మ్యమును చెప్పబడలేదు. సమగ్ర శివపురాణ శ్లోక సంఖ్య 14,000లకు మించి ఉన్నది. ఈ కారణములచే శివపురాణమును చతుర్థమహాపురాణమని చెప్పుట పొసగదు.

పైన చెప్పిన అంశములు వాయవీయ పురాణములో పూర్తిగా కాకపోయినను కొంత వరకైనను ఉపలభ్యమానం అగుచున్నవి. ఇప్పటి వాయవీయ పురాణమునందు నేడు ఈ విభాగం కనిపిస్తున్నది. ఏదైనా ఈ విభాగానికి విషయ ప్రత్యేకతలేదు. భాగ ప్రత్యేకత లేదు.

పూర్వ, ఉత్తర భాగములు లేకపోయినను ప్రాచీన కాలమునకు చెందిన లిఖిత ప్రతులలో కొన్నింటిలో ఈ విభాగము గలదు. వ్రాత ప్రతులనుంచి ఇందు 12 వేల శ్లోకములు గలవని గ్రహింపవచ్చును. ఇంకను ఇందలి అనేక మాహాత్మ్య భాగములు ప్రాచీన కాలముననే విడిపోయినవనియు అవి అన్నియు కలిసి ఒకానొక కాలమున 24 వేల శ్లోకములు ఉండిఉండునని భావింపవచ్చును. మూల వాయుపురాణమునగల ఈ సంహితలు పృథక్ భాగములై ప్రత్యేకములుగా లభ్యమగుచున్నట్లు చెప్పవచ్చును. వాయు పురాణంలో కల్ప వృత్తాంతము చెప్పక పోయినా శ్వేతకల్ప వృత్తాంతముగా చెప్పబడినదని

భావించవచ్చును. ముందే గలవని చెప్పబడుచున్న గయా మాహాత్మ్యము నేడు ఈ గ్రంథము నను చివర లభ్యమగుచున్నది. ఇది అంతగా పరిగణింపవలసిన విషయముగాదు. అంతే గాక వాయుపురాణ రచనా కాలము కూడా ఇది మహాపురాణములలో నాల్గవది అని నిరూపించును. వాయుపురాణములో తాంత్రిక పద్ధతుల వివరణములేదు. సాంప్రదాయక సంకీర్ణత లేదు. శివపురాణమున ఇవి అన్నియు గలవు. ఇవి అర్వాచీన లక్షణములే. 6వ శతాబ్దికి చెందిన బాణభట్టు తన హర్ష చరిత్రమందును, కాదంబరి యందును వాయు పురాణమును పేర్కొనెను. 7వ శతాబ్ది ఆదిశంకరాచార్యులు తన బ్రహ్మసూత్ర భాష్యము నందు ఈ పురాణమును పేర్కొనెను. అందుచే క్రీ.శ. 7వ శతాబ్దముననే ఈ పురాణమునకు విస్తృత ప్రచారము ఉన్నదని చెప్పవచ్చును. అప్పటికీ ఇది అత్యంత ప్రచారమునందు ఉండుటచేతకూడా ప్రాచీన మైనదని చెప్పవచ్చును. మహాభారతమున (వనపర్వ-191-16) "వాయు ప్రోక్తమను స్మృత్య పురాణమపి-సంస్తుతమ్' అని చెప్పబడినది. అంతేకాకుండా హరివంశంలో కూడా (1-7, 13, 25 అధ్యాయాలలో వాయుపురాణం ప్రామాణికత ఉల్లేఖించబడింది. అంతేకాకుండా వాయుపురాణం గ్రామాలలో ఆనాడు పఠించబడుతూ ఉండేదని తన హర్షచరిత్రలో 'పవమానం ప్రోక్తం పురాణం పపాథ' అని తాను అలాంటి పురాణ ప్రవచనానికి హాజరు అయినానని తెలిపాడు. అంతేగాక క్రీ.శ.11వ శతాబ్దంలో భారతదేశ యాత్రకు వచ్చిన అరబ్బీయుడు ఆల్బెరూని తన యాత్రా విశేషాలలో తరచుగా ఈ పురాణాన్ని పేర్కొన్నాడు. దాదాపుగా 10, 15 సార్లు ఆయన వాయుపురాణాన్ని పేర్కొన్నాడు. ఈ పురాణము ఆవిధంగా ప్రాచీనం కావున ఇదియే చతుర్థ పురాణము కావలెను. ఈ పురాణమునందలి వివిధ అధ్యాయములలో పురాణ పంచ లక్షణములు నిరూపింపబడినవి. అందుచేతనే ఇది చతుర్థ పురాణమగును. శివ పురాణంలో ఇలాంటి లక్షణములు కానరావు.

ఈ కారణములు అన్నింటిచేతను వాయుపురాణమే చతుర్థ పురాణమనియు శివ పురాణము కేవలము మహాపురాణములలో చేరక ఉపపురాణముగా మిగులుననియు శైవమతాను యాయులు కాలక్రమమున దీనిని చతుర్థ పురాణముగా చేసిరని సిద్ధాంతీక రింపవచ్చును.

వాయుపురాణ రచనా కాలం

మత్స్య పురాణంలో ఈ విషయాన్ని

'యత్ర తద్వాయవీయం స్వాద్రుద్రమాహాత్మ్య సంయుతమ్

చతుర్వింశత్సహస్రాణి పురాణం శైవ ముచ్యతే' అని చెప్పబడింది.

మత్స్యపురాణ శ్లోకంవల్ల శైవపురాణంలో 24,000 శ్లోకాలు ఉన్నట్లు తెలుస్తున్నది. కానీ ప్రస్తుతం ముద్రితమై లభ్యం అవుతున్న వాయుపురాణంలో పదకొండు వేల శ్లోకాలే ఉన్నాయి. శివ, వాయుపురాణాలు ఒకటే అనటానికి, వీలైన ఆధారాలు, శైవ సంజ్ఞ ముద్రితమైన వాయుపురాణంలో ఎక్కడాలేవు. వాఙ్మయ మహోధ్యక్ష శ్రీ వడ్లమూడి గోపాల కృష్ణయ్యగారు అల్లాడ నరసింహకవి నారదీయ పురాణం పీఠికలో ముద్రిత వాయుపురాణం అసలు వాయుపురాణమే కాకపోవచ్చు. ఉపపురాణం అయి ఉండవచ్చు లేకపోతే 24000 శ్లోకాలు కల వాయుపురాణంలో ఇది ఒక భాగం అయి ఉండవచ్చని భావిస్తున్నారు. వాయుపురాణం ముద్రిత వ్రాతప్రతులలో విభిన్నాలైన గద్యలు కనిపిస్తున్నాయి. అవి...

ఇతి శ్రీ వాయుపురాణం శివాపరాహ్వాయం సమాప్తం

ఇతి శ్రీ వాయూక్త చతుర్వింశతి సహస్ర్యాం శివ సంహితాయా ముత్తర ఖండే శ్రీ నర్మదా మాహాత్మ్యే.....

'ఈ పురాణప్రతిలో మాత్రం' శ్రీ మహాపురాణే వాయుప్రోక్తే ప్రజాపతి వంశానుకీర్తనం నామ..... అని ఉన్నది.

ప్రక్రియాపాదం	-	1 నుంచి 6 అధ్యాయాలు
ఉపోద్ఘాతపాదం	-	7 - 64 అధ్యాయాలు
అనుషంగపాదం	-	65 - 99 అధ్యాయాలు
ఉపసంహారపాదం	-	100 - 112 అధ్యాయాలు

I. ప్రక్రియా పాదంలో అనుక్రమణిక (1వ అధ్యా) ద్వాదశవార్షిక సత్ర నిరూపణం (26); సృష్టి ప్రకరణం (3 నుంచి 66) ఉండగా **II.** రెండవదైన ఉపోద్ఘాత పాదంలో ప్రతిసంధి (7 అ.); చతురాశ్రమ విభాగం (8); దేవాది సృష్టి వర్ణనం (9); మన్వంతరాది వర్ణన (10 అ.); పాశుపత యోగం (11); యోగోపసర్గ నిరూపణం (12); యోగైశ్వర్య ర్యాణి (13); పాశుపత యోగం (14, 15అ.); శౌచాచార లక్షణం (16); పరమాశ్రమ కథనం (17); యతి ప్రాయశ్చిత్త విధి (18); అరిష్టాని (19); ఓంకార ప్రాప్తి లక్షణం (20); కల్ప నిరూపణం (21); కల్ప సంఖ్యా నిరూపణం (22); మహేశ్వర అవతార యోగం (23); శార్వస్తవం (24); మధుకైటభోత్పత్తి వినాశన వర్ణనం (25); స్వరోత్పత్తి (26); మహదేవతాను వర్ణనం (27); ఋషివంశానుకీర్తనం (28); అగ్నివంశవర్ణనం; (29); దక్షశాపవర్ణనం (30); దేవవంశవర్ణనం (31); యుగధర్మనిరూపణం (32); స్వాయంభువ వంశానుకీర్తనం (33); జంబూద్వీపవర్ణనం (34, 35); భువన విన్యాసం

(36 నుంచి 49 వరకు); జ్యోతిప్రచారం (50, 51), ధృవచర్య (52); జ్యోతిఃసన్నివేశం (53) నీలకంఠస్తవం (54); లింగోద్భవస్తవం (55); పితృవర్ణనం (56); యజ్ఞప్రవర్తనం (57); చతుర్యుగాఖ్యానం (58); ఋషి లక్షణం (59); మహాస్థానతీర్థ వర్ణనం (60) ప్రజాపతి వంశాలు కీర్తనము (61); పృథివీదోహనం (62); పృధువంశానుకీర్తనం (63); వైవస్వత సర్గ వర్ణనం (64); **III.** మూడవదైన అనుషంగపాదంలో ప్రజాపతి వంశాను కీర్తనం (65); కశ్యపేయ ప్రజాసర్గము (66 నుంచి 69 వరకు); ఋషివంశాను కీర్తనము (70); శ్రాద్ధ ప్రక్రియారంభం (71); శ్రాద్ధ కల్పము (72 నుంచి 75 అధ్యాయం వరకు); తీర్థయాత్ర (76); శ్రాద్ధకల్పం (77); బ్రాహ్మణ పరీక్ష (78); దానఫలం (79); తిథివిశేష శ్రాద్ధఫలం (80) నక్షత్రవిశేష శ్రాద్ధ ఫలం (81); గయాశ్రాద్ధాది ఫలబ్రాహ్మణం (82); వరుణ వంశవర్ణనం (83) వైవస్వతమను సృష్టి కథనం (84); వైవస్వత మన్వంతర వంశ గాంధర్వ మూర్ఛనా లక్షణ కథనం (85); గీతాలంకార నిర్దేశము (86); మను వంశకీర్తనం (87,88); సోమోత్పత్తి వర్ణనం (89) చంద్రవంశకీర్తనం (90); రజియుద్ధం (91); చంద్రవంశ కీర్తనము (92); కార్తవీర్యార్జునోత్పత్తి వివరణము (93); జ్యామఘ వృత్తాంత కథనం (94); విష్ణువంశ వర్ణనం (95); విష్ణుమాహాత్మ్యంలో శంఖాకీర్తనం (96); విష్ణు మాహాత్మ్య కథనం (97); అనుషంగపాద కథనం (98); మన్వంతర కథనం (99);

II. ఇక నాల్గవదైన ఉపసంహార పాదంలో శివపుర వర్ణనం (100, 101); సృష్టి వర్ణనం (102); వ్యాస సంశయాపనోదనం (103); గయా మాహాత్మ్యము (104 నుంచి 111వ అధ్యాయం వరకు)

ఇవి ఇందులో చెప్పబడిన అంశాలు. దీనిని పరిశీలిస్తే నారద పురాణంలోను మత్స్య పురాణం లోను చెప్పిన కొన్ని విషయాలు లోపించాయి అని నిర్ధారణకు రావచ్చు.

వాయుపురాణ విభాగాలు-తెల్పే విశేషాలు

వాయుపురాణమునందు మొత్తము 112 అధ్యాయములు ఉన్నాయి. బ్రహ్మాండ పురాణంవలెనే ఇందులోని విభాగములను పాదములని పిలుస్తున్నారు. దీనితో మొత్తం నాలుగు పాదములున్నాయి. 1.ప్రక్రియాపాదము, 2.ఆనుషంగ పాదము, 3.ఉపోద్ఘాత పాదము, 4.ఉపసంహార పాదము. ఇందు మొత్తము 11,000 శ్లోకములు ఉన్నాయి. దీనియందు సర్గ, ప్రతిసర్గ, వంశ, మన్వంతర, వంశానుచరితములకు పంచపురాణ లక్షణములు దీనియందు నిబంధింపబడియున్నవి. ఇందలి 112 అధ్యాయములలోనూ

చివరి తొమ్మిది అధ్యాయములు (104-112) వైష్ణవ మత ప్రతిపాదనమునకై తరువాత ప్రక్షిప్తము చేయబడి యుండవలెను. ఎట్టి పరిస్థితులలోను ఇందలి 103వ అధ్యాయమే ఈ పురాణపు చివరి అధ్యాయము కావలెను. ఇందలి 50 నుంచి 66 శ్లోకముల వరకు గురు పరంపర, పురాణ ఫలశ్రుతికూడా ఉన్నాయి. ఈ పురాణ ప్రారంభంలో సృష్టి ప్రక్రియ విస్తృతముగా వర్ణింపబడినది. అటుతరువాత నాలుగు ఆశ్రమములు వారి ధర్మములు నిరూపింపబడినవి. ఇందలి భూగోళ వర్ణనము అతి విస్తృతమైనది. 50-53 అధ్యాయము లందు ఖగోళ వర్ణనం ఉన్నది. యాగములు, యజ్ఞములు, తీర్థములు, ఋషులు, ఋషి వంశములు, ప్రాచీన రాజవంశములు ఇందులో సవివరంగా వివరింపబడ్డాయి. 86-87వ అధ్యాయములందు సంగీత శాస్త్రమునకు సంబంధించిన అనేక విషయములు చెప్పబడ్డాయి. ఈ పురాణము ప్రధానముగా శివపారమ్యమును వర్ణించేది అయినా, విష్ణు ప్రశంస, విష్ణ్వవతారములు కూడా సముచితముగా చెప్పబడ్డాయి. పశుపతిఅయిన శివుని యోగము పాశుపత యోగముగా 11-15 అధ్యాయములలో వర్ణింపబడింది. ఈ పాశుపత యోగ వివర ణము మరి ఏ ఇతర పురాణాలలోను లేదు. దీనినుంచి ప్రాచీన యోగశాస్త్రమునకు చెందిన అనేక విషయములు తెలిస్తున్నాయి. ఖగోళ వర్ణనం ఇందులో అతి విస్తృతముగా లభించుచున్నది.

ఇందులో

అనుగంగం ప్రతాగంచ సాకేతంమాగధస్నథం స్తథా
ఏతాన్ జనపదాన్ సర్వాన్ భోక్షన్తే గుప్తవంశజాః – వాయు (99-383)

అని భారతదేశాన్ని పాలించిన ప్రసిద్ధ గుప్త రాజుల రాజ్య సరిహద్దులు చెప్పబడి ఉన్నాయి. అయినా ఇందులో కుమారగుప్త దిగ్విజయ యాత్రాదులు వివరింపబడ లేదు. అందువలన ఈ పురాణము క్రీ.శ. 350 నుంచి 550 లోపుగా రచింపబడి ఉండాలి అని కొందరి భావన. భారతీయ వాఙ్మయంలో ప్రప్రథమముగా షుమారుగా క్రీ.శ. 400 కావచ్చును. మేషాది రాసులను యాజ్ఞవల్క్య స్మృతి (క్రీ.శ. 2వ శతాబ్దం) పేర్కొంటున్నది. ఇవియే పద్మ పురాణంలోను పేర్కొనబడ్డాయి. కాగా ఈ పురాణంలో మేష, తుల, మకర, సింహ రాసులను పేర్కొనుట జరిగింది. ఇలాంటి ఆంతరంగిక ప్రమాణాలచేత ఈ పురాణ రచనాకాలము క్రీ.శ. 400 ప్రాంతముకు చేరియుండవచ్చునని చెప్పవచ్చును. ఈ పురా ణము నందు ప్రస్తుతము ప్రక్షిప్తముగా భావింపబడు చున్న ఎనిమిది అధ్యాయాలలోను గయా మాహాత్మ్యము చెప్పబడినది. గయ యందలి తీర్థదైవము గదాధరుడు విష్ణుమూర్తియే. ఈ గదాధరుని అనుప్రాసపూర్వక స్తుతి ఈ పురాణంలో లభ్యం అవుతున్నది. ఇది ఈ పురాణ సాహిత్య విలువలకొక ఉదాహరణము.

హిందీ సాహిత్య సమ్మేళనం (ప్రయాగ) అలహాబాదు వారి ప్రతిలో 50, 51, 52 అధ్యాయాలు మూడు జ్యోతిష్ప్రచారః అని ఉంటే తెలుగు ప్రతిలో 50, 51 అధ్యాయాలు మాత్రమే జ్యోతిష్ప్రచారః అనే అధ్యాయాల పేర్లుగా ఉన్నాయి. దీనిని బట్టి 52వ అధ్యాయం పేరులోనే తెలుగుప్రతిలో ధ్రువచర్య అని ఉండగా హిందీ ప్రతిలో జ్యోతిష్ప్రచారః అని ఉన్నది. కానీ శ్లోకాల సంఖ్య శ్లోకాలు దాదాపు ఒకటిగి ఉన్నాయి' అయితే 72వ అధ్యాయంలో అలహాబాదు (ప్రయాగ) ప్రతిలో 50 శ్లోకాలే ఉండగా (ప్రమథైర్వి విధైర్దే వైస్థథా .....వరకు); 6 (ఆరు) శ్లోకాలు అధికంగా చేరి ఆ తరువాత తెలుగు ప్రతిలోని స్రాత్వాపశ్య ద్విమానాని నుంచి 73వ అధ్యాయంగా (ప్రీత్యానిత్యం ప్రయచ్ఛన్తి మనుష్యాణాం పితామహః)తో పూర్తి అవుతున్నది దీనికి శ్రాద్ధకల్పం అనే పేరు ఇవ్వబడింది. అందువలన అలహాదుప్రతిలో మొత్తం 112 అధ్యాయాలు ఉండగా తెలుగు ఆర్షభారతి ప్రతిలో 111 అధ్యాయాలే ఉన్నాయి. ఫలితార్థం ప్రయాగ ప్రతిలో 72, 73వ అధ్యాయాలు, ఆర్షభారతి ప్రతిలో 72వ అధ్యాయం మాత్రమే అయింది.

"ఏష త్రిమాత్రో విజ్ఞేయో వ్యంజనం చాత్ర సస్వరమ్"

అని చెప్పడమైనది. అంటే మూడు మాత్రల కాలంలో (ప్లుతంగా) 'ఓ' కారాన్ని ఉచ్చరించి ఆ తరువాత 'మ' కారాన్ని ఉచ్చరించాలని భావం.

ఇత్యేతదక్షరం బ్రహ్మ పరమోంకార సంజ్ఞితమ్ ।
యస్తు వేదయతే సమ్యక్తథా ధ్యాయతి వా పునః ॥
సంసారచక్రముత్సృజ్య ముక్తబంధనబంధనః ।
అచలం నిర్గుణం స్థానం శివం ప్రాప్నోత్య సంశయః ॥

ఎవరైతే ఓంకారమనే అక్షర బ్రహ్మను తెలిసికొంటారో, మరియు ధ్యానం చేస్తారో వారీసంసార బంధాలను తెంచుకొని శాశ్వతమైన శివసాయుజ్యం పొందగలరని భావము. ఈ విధంగా ఓంకారానికి సంబంధించిన వర్ణన ఒక అధ్యాయంలో ఎంతో విపులంగా ఉన్నది. అలాగే గయయొక్క ప్రాముఖ్యతను గూర్చి

గయాం యాస్యతి యః పుత్రః స నస్త్రాతా భవిష్యతి ।
గయాప్రాప్తం సుతం దృష్ట్వా పితౄణాముత్సవో భవేత్ ॥

(తల్లిదండ్రులకెందఱో కొడుకులు ఉండవచ్చు. కాని, ఎవడైతే గయా క్షేత్రం దర్శించి వస్తాడో అతడే తమను ఉద్ధరించేవాడని తలుస్తారు. గయకు వెళ్ళి స్వామిని దర్శించి వచ్చిన పుత్రుణ్ణి చూస్తే తల్లిదండ్రులకు అమితమైన ఆనందం కలుగుతుంది – అని తెలుపుతుంది.

వాయుపురాణ ప్రామాణికత-స్మృతికర్తలపై ప్రభావం

ప్రాచీన కాలంనుంచి పురాణాలు ధర్మాచార ప్రవర్తనను అనుసరించటానికి దిగ్దర్శనాలుగా భావించబడుతున్నాయి. అందువలననే నిబంధ గ్రంథకారులు అనగా స్మృతి గ్రంథాల రచయితలు వారివారి గ్రంథాలలో పురాణ గ్రంథాలను పరమ ప్రామాణి కాలుగా స్వీకరించి తమ గ్రంథాలలో ఆయా సందర్భాలలో ఆయా పురాణాలలోని శ్లోకాలను ఉద్ధరించారు. వారి స్మృతి గ్రంథాలలో ఆ నిబంధనకారులు ఉద్ధరించిన అనేక పురాణాలలోని శ్లోకాల నుంచి ఆయా నిబంధనకారుల కాలంలో ప్రజా జీవితాలు ఏ ఏ మూల సూత్రాలపై నడుస్తుండేవో తెలుసుకోటానికి ఆధారాలుగా ఉన్నాయి. అంతేగాక ఈ శ్లోకాలు ఏ ఏ పురాణ భాగాలు ఏ ఏ కాలాలలో రచింపబడిందో తెలుసుకోటానికి ఆధారాలుగా కూడా పనికి వస్తాయి. అందువలన ఒక్కొక్క నిబంధన కారుడు (స్మృతికర్త) వాయుపురాణం నుంచి ఎన్నెన్ని, శ్లోకాలను తమ స్మృతిగ్రంథంలో ఉద్ధరించాడో వివరంగా ఇవ్వబడింది. దీనిని బట్టి ఆయా కాలాలలో వాయుపురాణానికి భారతీయులు ముఖ్యంగా హిందుజనజీవనంలో దానికి ఇచ్చిన ప్రాముఖ్యతను అర్థం చేసుకొనవచ్చు. ఈనాడు లభ్యం అవుతున్న ఆయా పురాణ గ్రంథాలలో లభ్యంకాని శ్లోకాలు చాలా ఉన్నాయి.

బల్లాల సేనుని దాన సాగరం	(10 శ్లోకాలు)
కుల్లూకభట్టుని మనుస్మృతి వ్యాఖ్యానం	(3 శ్లోకాలు)
3వ అధ్యాయం	(3 శ్లోకాలు)
దేవనభట్టుని స్మృతిచంద్రిక	(18 శ్లోకాలు)
హేమాద్రి చతుర్వర్గ చింతామణి (క్రీ.శ. 1270-1320)	(218 శ్లోకాలు)
శ్రీదత్త ఉపాధ్యాయుని కృత్యాచారచంద్రిక	(8 శ్లోకాలు)
చండేశ్వరుని కృత్యరత్నాకరం	(2 శ్లోకాలు)
పరాశరస్మృతిపై మాధవాచార్యుని వ్యాఖ్యానం	(9 శ్లోకాలు)
మదనపాలుని మదన పారిజాతం	(20 శ్లోకాలు)
శూలపాణి ప్రాయశ్చిత్త వివేకం	(9 శ్లోకాలు)
వాచస్పతి మిశ్రుని తీర్థ చింతామణి	(79 శ్లోకాలు)

మత్స్యపురాణంలోవలె వాయుపురాణము నందును విస్తృతముగా ధర్మశాస్త్రీయ సంబంధమైన వివరణ ఉన్నది. కల్పతరు, అపరార్కము, స్మృతిచంద్రిక మొదలైన ధర్మశాస్త్ర

గ్రంథములు వాయుపురాణమునుంచి వందలకొలది ప్రమాణములను ఉద్ధరించినవి. దీనిని బట్టి ధార్మిక విషయాలలో వాయుపురాణానికిగల ప్రామాణ్యతను తెలుసుకొనవచ్చు. క్రీ.శ. ఏడవ శతాబ్దిలో పురాణాలలో వాయు పురాణానికి ప్రత్యేకస్థానము ఉన్నది. ఈ విషయమును శ్రీ ఆదిశంకరుల రచనచే తెలుసుకోవచ్చును.

వివిధ కాలాలలో స్మృతికారులు వాయు పురాణాన్ని విస్తృతంగా ప్రామాణికంగా స్వీకరించారనటానికి ఈ వివరాలే సాక్ష్యం అని భావించవచ్చు.

వాయుపురాణం గురించి తెలుసుకొన వలసిన విషయాలు

ప్రాచీన భారతీయ సంస్కృతికి, హైందవతత్త్వాన్ని చరిత్ర, సంస్కృతులకు సంబంధించిన అనేక విషయాలను ఎన్నింటినో తనతో నిక్షిప్తం చేసుకొని వెలసిన ప్రాచీనతను పురాణాలలో ఇది ఒకటి. కొందరి అభిప్రాయం ప్రకారం ఇది ఉపపురాణాలలో చేరుతుంది. ఇది శివతత్త్వాన్ని ప్రతిపాదించే పురాణం. అందువలన పురాణ వర్గీకరణలో ఇది తామస పురాణాలలో చేరుతుంది. ఇది శివతత్త్వాన్ని ప్రతిపాదించే పురాణం. అందువలన పురాణ వర్గీకరణలో ఇది తామస పురాణాలలోకి చేరుతుంది. వాయువుచేత చెప్పబడింది కాబట్టి ఇది వాయుపురాణం అయింది.

దీనిలోని శ్లోకాల సంఖ్య స్వయంగా 23 వేలు అని తెలుపుతున్నది. మత్స్య పురాణం ప్రకారం 24 వేలు, కానీ 11 వేల శ్లోకాలు మాత్రమే ముద్రిత పురాణ ప్రతులలో కన బడుతున్నాయి. కొన్ని ముద్రిత ప్రతులలో అధిక పాఠాల కారణంగా 11 వేల నుంచి 12 వేలకు కొద్దిగా తక్కువగా కూడా కనిపిస్తున్నాయి. ఇది పూర్వ, ఉత్తరఅని నాలుగు పాదాలుగాను విభజింపబడింది. అన్ని పాదాలు పూర్తిగా నేడు లభ్యం కావటంలేదని కొందరి భావన. ఈ పాదాల విభజనకు ప్రత్యేక విశిష్టత ఏమీలేదు.

ఇందులోని ప్రకియా పాదంలో పురాణ పంచలక్షణాలు సంగ్రహంగా నిరూపించ బడ్డాయి. ఆ సందర్భంగా కాలస్వరూపం, కాలవిభాగాలు, వర్ష (దేశ), పర్వత వివరాలు సమకూర్చబడ్డాయి. ఈ పురాణంలో 33 కల్పాలు పేర్కొనబడ్డాయి. కానీ వీటిల్లో సుప్రసిద్ధ మైన వరాహకల్పం లేదు. ఇది శ్వేత కల్పం లేక శ్వేత వరాహకల్పంగా నిరూపితం అయిందని భావించవచ్చు. యుగ స్వరూప స్వభావాలను నిరూపించే సందర్భంలో ప్రజల క్రమపరిణితి (మానవ వికాసం) కొంతవరకు నిరూపించబడ్డది. ఈ నిరూపణ మనప్రాచీన సంస్కృతి పరిణామాన్ని గ్రహించటానికి ఉపయోగపడుతుంది.

వాయుపురాణంలోని కొన్ని ముఖ్య విషయాలు

కృతయుగంలోని ప్రజలకు ధర్మాధర్మ, పాపపుణ్య ప్రసక్తి తెలియదు. వారికి గృహాలు లేవు, పర్వత ప్రాంతాలు, సముద్ర తీరాలు వారి నివాసప్రాంతాలు. పశుసంపద ఓషధీ సంపద విశేషంగా లేదు. శీతోష్ణాది పరిస్థితులు సమంగా ఉండేవి. వర్ణాశ్రమ విభాగంలేదు. గుణాలలో గాని స్వభావంలో గానీ, రూపాలలో గానీ భేదాలు లేవు. త్రేతాయుగంలో వర్షాగమంతో ఓషధీ సంపద ప్రారంభం అయింది. విషమంగా ఉన్నభూమిని పృథుచక్రవర్తి సమంగా చేవాడు. పర్వతమధ్య భాగాలలోను, నదీతీరాల వెంట గృహనిర్మాణంచేయటం ప్రారంభం అయింది. ప్రజలు వస్త్రాభరణాలు ధరించటం మొదలుపెట్టారు. క్రమంగా గ్రామ, పట్టణ, నగర, జనపదాలు ఏర్పడ్డాయి. ప్రజలు వర్ణాలుగా విభజింపబడ్డారు. వర్ణా శ్రమధర్మ రక్షణ కోసం బ్రహ్మ విష్ణ్వంశంలో రాజ్యస్థాపనచేశాడు. ఈ యుగంలోనే వేద విభాగం యజ్ఞం ప్రవర్తిల్లాయి.

ద్వాపరయుగంలో అవతారాలు అధికంగా మొదలు అయినాయి. ఈ యుగంలో ధర్మం అంతకుముందు యుగంకంటే క్షీణించింది. తరువాతవచ్చిన కలియుగంలో కాల ప్రభావం చాలాఅధికం. ఈ యుగంలో ఆరాధ్య దైవం పరమశివుడు. శివ అవతారాలు అధికంగా జరిగాయి. ప్రజల ఆయువు శతసంవత్సరపరిమితంగా ఉంటుంది. శివుడు పరతత్వంగా అభివర్ణించవలసిన ఈ పురాణంలో నాకులీశ పాశుపత ధర్మం కనిపిస్తుంది. గణపతి పేరు ఇందులో రాదు. అందువలన ఇది ప్రాచీనమని కొందరు పురాణపండితుల విశ్వాసం. ఈశ్వరుని 28 అవతారాలు ఇందులో అభివర్ణించబడ్డాయి. సృష్టికి శివుడు బీజి అని విష్ణుబు బోజమని, బ్రహ్మ క్షేత్రమని ఈ పురాణం తెలుపుతున్నది. కృతయుగంలో బ్రహ్మ, త్రేతా యుగంలో యజ్ఞం, ద్వాపర యుగంలో విష్ణువు, అన్ని యుగాలలోను శివుడు పూజనీయు లని ఈ పురాణంలో తెలుపబడింది.

ఈ పురాణంలో వంశ భాగంలో వర్ణించిన ప్రాచీన రాజచరిత్రలు, చరిత్ర రచనలో ఉపకరిస్తాయని చారిత్రకుల బావన. ఇందులో రాజవంశవర్ణన సంగ్రహంగా ఇలా ఉంటుంది. వైవస్వత మనువు తన తొమ్మిది మంది కుమారులకు, ఇలాపుత్రుడైన పురూర వునికి, భూమిని పంచి ఇచ్చాడు. వారిలో ఇక్ష్వాకు, పురూరవ వంశాలు ప్రసిద్ధాలు. ఇక్ష్వాకు వంశీయులలో వికుక్షి అయోధ్యను, నిమి విదేహను పాలించారు. పురూరవుని వంశమే చంద్రవంశం. వీరి రాజధాని ప్రతిష్ఠానం. ఈ వంశంలో నహుషుడు, యయాతి ప్రసిద్ధులు. యయాతి తరువాత ఆ రాజ్యం అయిదు భాగాలైంది. ఆయువు కుమారుడు అమావసుకాన్య కుబ్జంలో రాజ్యంస్థాపించాడు. ఈ వంశంలో జహ్ను, గాధి, భార్గవ, విశ్వామిత్రులు ప్రసిద్ధులు.

యయాతి వంశంలో పురువంశం ప్రతిష్ఠానాన్ని (నేటి పాకిస్తాన్‌లోని పెషావర్) పరిపాలించింది. పురువంశంలో భరతుడు, హస్తినాపురిని నిర్మించిన హస్తి ప్రసిద్ధులు. ఈ వంశంలోని వాడే అయిన పాంచాలుడు పాంచాల రాజ్యం స్థాపించాడు. హస్తి కుమారులలో ఋక్షుడు హస్తినా పురాన్ని పాలించాడు. ఇతడి మనుమడు కురువు కురుక్షేత్ర నిర్మాత. కురుని కుమారులలో సుధన్వ వంశస్థులు మగధరాజ్య స్థాపకులు మగధ రాజ్యం ఏలినవారిలో ప్రసిద్ధులు బృహద్రథ, జరాసంధులు, వీరిలో చివరి వాడు ప్రద్యోతుడు. ఆ తరువాత మగధను మహాపద్మనందుడు శూద్రకుడు పాలించారు. హస్తి కుమారుడైన జహ్నువంశంవారే కౌరవులు. వీరిలో అధిగసామకృష్ణుని పాలనలో ఈ వాయుపురాణం చెప్పబడింది. క్షేమకుని పాలనలో ఆ యుగం అంతమై కలియుగం ఆరంభం అయింది.

యయాతికి ఇంకొక పుత్రుడైన యదువువంశంలో సహస్రజిత్తు వంశస్థుడు హైహయుడు. ఈ వంశంలో ప్రసిద్ధుడు కార్తవీర్యార్జునుడు. ఇతడు పురాణాలలో కార్తవీర్యార్జునుని దుర్మార్గునిగా చిత్రించగా వాయుపురాణంలో ఇతడు సద్వర్తనునిగా కనబడతాడు. యదువంశంలో క్రోష్టు వంశస్థుడు జ్యామఘుడు. ఇతడే విదర్భ రాజ్య ప్రతిష్ఠాపకుడు. ఇతని కుమారుడైన విదర్భుని పేరుతోనే ఆ దేశ నామం ప్రచారంలోకి వచ్చింది. ఈ దేశాన్ని విదర్భుని కుమారులై క్రథ, కైశికులపేర్లతో గూడా వ్యవహరించటం జరిగింది. కైశికుడే ఛేది రాజ్యస్థాపకుడు. ఇతడికుమారుడైన ఛేది పేరు ఆ వంశానికి, రాజ్యానికి వచ్చింది. క్రథ వంశస్థులు కృష్ణి, అంధకులు. యయాతి కుమారుడైన అనువు వంశంలోని అంగ, వంగ, కళింగ, సుహ్మ, పుండ్ర నామధేయులైన రాజులు ఆయా పేర్లు గల రాజ్యాలను నెలకొల్పారు.

ఈ పురాణంలో ప్రాసంగికంగా ఊర్వశీ, పురూరవ వృత్తాంతం, కంస, కృష్ణ వృత్తాంతం శ్రీమహావిష్ణువు అవతారాలు చెప్పబడ్డాయి.

ఒక ప్రత్యేక విషయం ఈ పురాణంలో ఉన్నది ఏమిటంటే పూర్వఖండంలో జ్యోతిశ్చారం సమగ్రంగా నిరూపించబడింది. సూర్యమండలవిస్తారం, దాని పరిణామ విష్కంభాలు, ఇతర ఖగోళాలకు సూర్యునికి మధ్యగల దూరాలు, మిగిలిన ఖగోళ గ్రహాల పరిణామ విస్కంభాలు, వాటి గతిక్రమాలు నిర్దేశించబడ్డాయి. అంతేగాకుండా ఉత్తర ఖండంలో (24 అధ్యాయంలో) రేవతీ బలరాముల సమాగమాన్ని వర్ణించిన తరువాత సంగీతాన్ని గురించి కొంతవివరణ ఉన్నది. 7 స్వరాలు, 3 గ్రామాలు, 21 మూర్ఛనలు, 49 తాళాలు, 4 వర్ణాలు, 30 అలంకారాలు ఇందులో పేర్కొనబడ్డాయి. వీటి పేర్లు భరతుని నాట్యశాస్త్రం కంటే కొంతవేరుగా ఉన్నాయి.

శ్రాద్ధ విషయాలు, ప్రాయశ్చిత్త కర్మలు మొదలైన విషయాలను గురించిన వివరాలు కొంత విపులంగానే ఉన్నాయి. ఇవి స్మృతి ప్రసిద్ధాలైనవే. తీర్థమాహాత్మ్య వర్ణన ఇందులో చాలాతక్కువ. గయాక్షేత్ర మాహాత్మ్య వర్ణన ఇందులో దాదాపు 9 అధ్యాయాలలో వివరించ బడింది. కొందరి ఉద్దేశ్యంలో ఇది ప్రక్షిప్తభాగం అంటారు. కానీ ప్రక్షిప్తం అనే దానికంటే అస్థానపతితం అనటం సరి అయినది అనిపిస్తుంది. ఇందులోని 54వ అధ్యా యంలో నీలకంఠస్తవము, 55వ అధ్యాయంలోని లింగోద్భవస్తవం చాలా మహిమగలవని భక్తులు నమ్ముతారు. ఇందులో చాలా నామాలు వేద భాగంలో రుద్ర భాష్యం నమకం చమకం నుంచి గ్రహించి స్తవాలయొక్క విలువపెంచటమేకాక పురాణాలు వేదోపబృంహణం చేస్తాయనే విషయాన్ని నిరూపిస్తున్నాయి.

యస్యాస్య కమల గలితం వాఙ్మయ మమృతం జగత్ పిబతి
ప్రపద్యే దేవమీ శానం శాశ్వతం ధృవమవ్యయమ్
మహాదేవం మహాత్మానం సర్వస్య జగతః పతిమ్
ప్రభుం భూత భవిష్యస్య సాంప్రతస్య సత్పతిమ్

(సర్వతీదేవి యొక్క హృదయానికి ఆనందాన్ని కలిగించునట్టి పరాశర మహర్షి యొక్క కుమారుడు అగు వ్యాసునకు జయము కలుగుతాక. శాశ్వతుడు, నిత్యుడు, నాశము లేనివాడు, దేవతలలో శ్రేష్ఠుడు మహాత్ముడు, జగత్తుకంతకు ప్రభువు అగు ఈశ్వరుని శరణు కోరు చున్నాను. లోకాలను సృజించిన బ్రహ్మ దేవుని, సర్వజ్ఞుడు, పరాజయం లేనివాడు, భూత భవిష్యద్వర్తమానములకు ప్రభువు, సద్రూపుడు అయిన విష్ణువును శరణు వేడుతున్నాను)

వాయుపురాణం-ముద్రణ

వాయుపురాణం మూడు సార్లు ముద్రణపొందింది. మొదటిసారిగా 1880వ సంవత్సరంలో రాజేంద్రలాల్ మిత్రా పండితుని సంపాదకత్వం బెంగాల్ ఎసియాటిక్ సొసైటీ వారిచే ముద్రణ పొందింది. రెండవ ముద్రణ 1905వ సంవత్సరంలో పూనా ఆనందాశ్రమ ముద్రణాలయం వారిచే ముద్రింపబడింది. మూడవసారి హిందీ సాహిత్య సమ్మేళనం వారు 1987లో నాగరిలిపిలో మూలలు హిందీ తాత్పర్యంతో ముద్రించారు.

తెలుగులిపిలో వాయుపురాణం ఇప్పటివరకు ముద్రించినట్లుగా తెలియటంలేదు. కానీ శ్రీవేంకటేశ్వర ఆర్ష పరిషత్‌వారి ఔదార్య ఫలితంగా ఇది 2005 సంవత్సరంలో శ్రీ మూలంపల్లి చంద్రశేఖరశర్మ గారిచేత తెలుగు లిపిలోను, తాత్పర్యంతో ముద్రింపబడి, తెలుగుపాఠకులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుత వచనానుసరణం ఆ ప్రతి

ఆధారంగానే చేయబడింది. శ్రీ వేంకటేశ్వర ఆర్ష భారతి ట్రస్టు వారి ప్రతిలో 112గాక 111 అధ్యాయాలే ఉన్నాయి. ఈ విధంగా జిజ్ఞాసువులకు లభ్యంచేసినందుకు శ్రీ వేంకటేశ్వర ఆర్ష భారతీట్రస్టు వారికి శ్రీ మూలంపల్లి చంద్రశేఖరశర్మ గారికి తెలుగుజాతి ఋణపడి ఉన్నది. ఆ ప్రతినే నేను ఈ వచనానుసరణంలో సంపూర్తిగా వినియోగించు కున్నాను. అందుకు వారికి బహుధాకృతజ్ఞుడను.

వాయుపురాణం వక్తృశ్రోతు పరంపర

సర్వపాపహరము, పుణ్యము, పవిత్రము, కీర్తివంతము శాస్త్రము అయిన ఈ పురాణానికి వక్తలు శ్రోతలు అయిన వారు చాలామంది ఉన్నారు. వారి వరుస ఈ విధంగా ఉన్నది.

మొదటగా ఈ పురాణము బ్రహ్మచేత ప్రవచింప బడింది
తరువాత
↓
వాయుదేవునికి
↓
శుక్రునికి
↓
బృహస్పతి
↓
సవిత (సూర్యుడు)
↓
యముడు
↓
ఇంద్రుడు
↓
వశిష్టుడు
↓
సారస్వతుడు
↓
త్రిధామునికి
↓

శరద్వంతుడు

సోమశుష్మడు

త్రివిష్టునికి

అంతరిక్షునికి

వర్షునికి

త్రయారణ్యుడు

ధనంజయుడు

కృతంజయుడు

తృణంజయుడు

భరద్వాజుడు

గౌతముడు


నిర్యంతరుడు

వాజశ్రవుడు

తృణబిందువు

దక్షుడు

శక్తికి

పరాశరునికి
(తల్లిగర్భంలో ఉన్నప్పుడు)

జాతుకర్ణుడు

వ్యాసుడు

శాంగపాయనుడు

రోమహర్షణుడు


వాయుపురాణం - ప్రక్షిప్తాలు

వివిధ పురాణ శాస్త్రజ్ఞులు వాయు పురాణంలోని అనేక అధ్యాయాలు వివిధ కాలాలలో ప్రక్షిప్తం చేయటం జరిగిందని, ఆ ప్రక్షిప్తం చేసే సమయంలో అంతకుముందు ఉన్న కొన్ని అధ్యాయాలు లేక అధ్యాయాలలోని భాగాలు తొలగించబడి, కొత్తవి చేర్చబడ్డా యని తెలుపుతున్నారు. ప్రక్షిప్తం చేయబడిన అధ్యాయాలు, శ్లోకాలు ఏకాలంలో చేయ బడ్డాయో ఈ క్రిందచూపిన పట్టికలో తెలియజేయబడ్డాయి.

అధ్యాయాలు 57-59	- యుగధర్మాలు	క్రీ.శ.200-275 మధ్య
అధ్యాయాలు 73-83 (82వ అధ్యాయంలోని శ్లోకాలు14-42 తప్ప)	- అశౌచము, శుద్ధి ప్రాయశ్చిత్తము శ్రాద్ధవిషయములు	క్రీ.శ.200-500 మధ్య బహుశః 3వ శతాబ్దం మధ్యన కావచ్చును.
అధ్యాయాలు 16-17	- ఆశ్రమధర్మాలను గురించి	బహుశః క్రీ.శ.400 తరువాత.కానీ క్రీ.శ.1300కంటే ముందే
అధ్యాయం 18	- యతిధర్మాలు తపో ధర్మాలను గురించి	అని నిశ్చయం.
అధ్యాయం 101	- నరకాలు, చేసిన పాపాల ఫలితాల గురించి	నిశ్చితంగా తెలియదు. కానీ 57-59 అధ్యాయాలు చేర్చిన కాలానికి చెంది ఉండాలి
అధ్యాయాలు 105-112	- గయామాహాత్మ్యం గురించి	తరువాత కాలంలో చేర్చి ఉండాలి. కానీ నిశ్చయంగా క్రీ.శ.1400 కంటేముందు
అధ్యాయం 82(14-42)	- పవిత్రస్థలాలైన గయ, బ్రహ్మకుండం మొదలైన ప్రదేశాలలో శ్రాద్ధకృత్యాలు నిర్వహించినందువలన కలిగే ఫలితాలు.	తరువాత చేర్చబడినది (కాలం సునిశ్చితంకాదు)

వాయుపురాణం తెలుగు అనువాదాలు

వాయు పురాణంగా నేడు లభ్యం అవుతున్న గ్రంథంనుంచి పూర్తిగా గానీ, భాగాలుగా గానీ తెలుగు అనువాదం పొందినట్లు కనిపించటంలేదు. అయితే క్రీ.శ.1550 ప్రాంతాలలో రచనచేసిన బడ్డెపూడి పెద్దయ్య అనేకవి వాయుపురాణంలోని మాఘ మాహాత్మ్యాన్ని పద్య గ్రంథంగా వ్రాసినట్లు తెలుస్తున్నది. సమగ్రాంధ్ర సాహిత్యంలో పురాణ కవులగురించి వ్రాస్తూ (6వ భాగం-336) ఈ కవిని గురించి

'బెజవాడ దగ్గర్లో ఉన్న కొండపల్లివద్ద పురుషోత్తమ పట్నం అనేది ఒకటి ఉంది. దీనిని కటకం గజపతులు నిర్మించారు. క్రీ.శ.1550 ప్రాంతాలలో ఈ పట్టణానికల్లా మోతుబరిగా కమ్మచౌదరీ పట్టభద్రుడుగా దాసరి చినగంగన్న ఉండేవాడు. ఆయన బాగా చదువుకొన్నాడు. పురాణాలు విన్నాడు. శాస్త్రేతిహాసాలు, నాటక కావ్య లక్షణాలు, లక్షణ గ్రంథాలు, జ్యోతిషాగమ సంగీత రహస్యాలూ, సమబుద్ధి ప్రతిభతో విమర్శించాడు. కటక గజపతుల సామంతుడు, సైనికోద్యోగి అయిన బాహుబలేంద్ర హరిశ్చంద్రుడు ఈ చినగంగన్నను బహుమతులతో సత్కరించాడు. ఈయన బడ్డెపూడి పెద్దయ కవిని పిలిపించి వాయుపురాణంలో ఉన్నమాఘ మాహాత్మ్యాన్ని చమత్కృతిగా చెప్పించాడు. ఇదే గ్రంథాన్ని ఇంతకుముందు పిల్లలమర్రి పినవీరయ్య రచించాడు. అయితే బహుశః అది పురాణశైలిలో ఉండడంవల్లనేమో చమత్కృతి కృతిగా చెప్పించడానికి మళ్ళీ చినగంగన ప్రయత్నించి ఉంటాడు. పెద్దయ్య చినబడ్డెపూడి గ్రామానికి కరణం. సింహాచల నరసింహస్వామి భక్తుడు కృతి వారకాంతలాగ ఉండాలని భావించే రోజులలో పతివ్రతలాగా శోభించాలని భావించే కవి.

లక్షణ యుక్తమై కనదలంకృతితో నతులార్థ సంగ్రహా
ద్వీక్షణ గల్గి భర్తకు సుదీర్ఘయశంబును గల్గ జేయుచున్
దక్షత తోడుతన్ విని సుదారిత కల్మషయే పతివ్రతా
బ్జాక్షి యనంగ నొప్పువలదా కృతి సర్వ సభాంతరంబులన్

పతివ్రతలాంటి తన కావ్యం సభాంతరాలలో బాగా ఒప్పాలని కవి ఆశించినా, ఈ గ్రంథం ఇంకా వెలుగు చూడలేదు. దీని తాళపత్ర ప్రతి మద్రాసు ప్రాచ్య లిఖిత భాండాగారంలో ఉన్నది. అముద్రితంగా ఉన్నందువలన దీనిని గురించిన ఇతర వివరాలు తెలి యటంలేదు.

పిల్లలమర్రి పినవీరభద్రుడు తన శృంగార శాకుంతలంలో 'చెప్పినాడవు శేముషీ విశేషంబున మాఘమహత్త్వంబు మంజుఫణితి' అని తాను ఒక మాఘ మాహాత్మ్యాన్ని

రచించినానని చెప్పుకొన్నాడు. ఇదే విషయాన్ని తెలుపుతూ పినవీరన వంశీయుడు 'సీమంతినీ కళ్యాణ'మనే కావ్యాన్ని రచించిన పెనుమళ్ళ సోమయ కవికూడా 'మహనీయమగు మాఘమాహాత్మ్యము రచించె' అని తెలిపాడు. అనేక పురాణాలలో మాఘమాహాత్మ్యం ఉన్నది. అందువలన పిల్లలమఱ్ఱి పినవీరన ఏ పురాణం నుంచి మాఘమహాత్మ్యాన్ని అను వదించాడో తెలియటం లేదు. అసలు ఆయన రచించిన ఆ గ్రంథమే అలభ్యం. నా దగ్గర ఉన్న 1928లో వావిళ్ల వారు ప్రకటించిన మాఘమాహాత్మ్యము పద్మపురాణాం తర్గతమని ఉన్నది. ఇది 47 అధ్యాయాల గ్రంథం. అయినా ఈనాడు మేము స్వీకరించి అనుసరణచేసిన వాయు పురాణంలో మాఘ మాహాత్మ్యమే లేదు. ఇందుకై పుస్తకం మొదట్లో ఇచ్చిన విషయాను క్రమణికను చూడండి.

ప్రత్యేక విషయాలు

యో విద్యాచ్చతురోవేదాన్ సాంగోపనిషదో నరః ।
న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥

నాలుగు వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు మొదలైన వాటినన్నిటినీ క్షుణ్ణంగా తెలిసికొన్నప్పటికీ ఎవడైతే పురాణాల గుఱించి ఎఱుగడో అతడు పండితుడు కానేరడని చెబుతున్నది వాయుపురాణం.

మనిషి యోగికావాలంటే ప్రాణాయామం ఒక సాధనం. మరి, ఈ ప్రాణాయామ స్వరూపం, దాని భేదాలు మరియు వైశిష్ట్యం మొదలైన అంశాలెంతో చక్కగా ఇందులో అగుపిస్తాయి. ప్రాణాయామానికి సంబంధించి బహుశ మరే ఏ పురాణమూ ఇంత వివ రంగా చెప్పలేదంటే అతిశయోక్తి కానేరదు.

తస్మాద్యుక్తః సదాయోగీ ప్రాణాయామపరో భవేత్ ।
సర్వపాపవిశుద్ధాత్మా పరం బ్రహ్మాధిగచ్ఛతి ॥

ఎవరైతే నిత్యము ప్రాణాయామము అచరిస్తారో వారు తమ పాపాలను రూపుమాపు కొని యోగులై బ్రహ్మ సాయుజ్యం పొందగలరని భావం.

ప్రాణాయామాన్ని ఆచరిస్తే వచ్చే ప్రయోజనమింకా ఇలా చెప్పడమైనది–

ప్రయోజనాని చత్వారి ప్రాణాయామస్య విద్ధి వై ।
శాంతిః ప్రశాంతిర్దీప్తిశ్చ ప్రసాదశ్చ చతుష్టయమ్ ॥

శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదమనే నాలుగు ప్రయోజనాలు ప్రాణాయామానికి చెప్పబడ్డాయి. శాంతి, ప్రశాంతి ఒకటికాదు. వీటి నిర్వచనం ఎంతో వివరంగా ఉంది.

బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులనే మూర్తి త్రయాత్మకమైనది ఓంకారము. ఈ ఓంకారాన్ని ఉచ్చరిస్తే మనసెంతో ప్రశాంతంగా ఉంటుంది. అయితే దీన్ని ఉచ్చరించేటపుడు పదిమంది పదివిధాలుగ ఉచ్చరిస్తుంటారు. అలా కాకుండ దీని ఉచ్చారనలో ఒక పద్ధతంటూ ఉంది. ఆ రీతిగా ఉచ్చరిస్తేనే సంపూర్ణ ఫలం సిద్ధిస్తుందంటూ- అలాంటి ఓంకారరూప త్రిమూర్తులు ఈ పురాణ పఠనంతో మీకు అభయ ఆయురారోగ్య ఐశ్వర్యాలను ఇచ్చి క్షేమం కల్పించి ప్రోచుదురు గాక !

వాయుపురాణం భారతీయ జీవనము, సంస్కృతుల వికాసాన్ని క్రమంగా తెలిపే కథాక్రమం. ఇతర పురాణాలవలె ఇందులో భావుకతకు స్థానం లేకుండా తార్కికంగా ఉండే రీతిలో విషయాల వివరణ ఉంటుంది. ఈ పురాణం యొక్క విషయవివరణ వర్ణనాత్మకంగా వైదిక కాలంనుంచి బౌద్ధకాలం వరకు భారతీయ రాజనీతిక, సామాజిక, సాంస్కృతిక ఉత్కర్షను గౌరవము అభిమానము కలిగించే విధంగా ఉంటుంది. అందుకే ఈ పురాణం క్రీ.పూ. ఆరవశతాబ్దంనుంచి క్రీ.శ.200 వరకు భారతీయ చరిత్రకు ముకురం అని కొందరిచే ప్రశంసింపబడింది.

వాయుపురాణం-ఫలశృతి

ధన్యం యశస్య మాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।
కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥

(ఈ వాయుపురాణం వినువారు మరియు పఠించువారు కీర్తిమంతులూ, ఆయుష్మం తులై తమ పాపాలను పోగొట్టుకొని పుణ్యాన్ని పొందగలరు.)

ఇలాంటి ఈ పురాణాన్ని శ్రద్ధగా పఠించి ఆ పరమేశ్వరుని దయకు పాత్రులం అవుదాం.

ఈ పురాణాన్ని ఈ రూపంలోకి తీసుకొని రావటానికి ముఖ్యకారకులైన ఇమ్మడిశెట్టి అక్కేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్టు, విజయవాడ మేనేజింగు ట్రస్టీ శ్రీ ఇమ్మడిశెట్టి రామకుమార్‌గారికి, ముద్రణసారథి ఆలపాటి బాలసత్యశాయిరాంగారికి, ట్రస్టు సభ్యులు, కీ.శే.అక్కేశ్వరరావు గారి ఏకైక కుమారుడు శ్రీ ఇమ్మడిశెట్టి నాగవెంకటసంతోష్ చక్రవర్తికి కృతజ్ఞుడను.

ముక్కోటి ఏకాదశి.
విజయవాడ
20.12.2007.

ఆవంచ సత్యనారాయణ

ఓం గణేశాయ నమః
ఓం నమో భగవతే వాసుదేవాయ

శ్రీ వాయు మహాపురాణం

పూర్వార్ధము

ప్రక్రియా పాదము

అనుక్రమణిక

నారాయణం నమస్కృత్యనరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్

నారాయణునకు, మానవులలో శ్రేష్ఠుడగు నరునకు, సరస్వతీ దేవికి, వ్యాసునకు నమస్కరించి, తరువాత జయము (పురాణము)ను చెప్పవలెను.

జయతి పరాశరసూనుః సత్యవతీ హృదయ నందనోవ్యాసః
యస్యాస్య కమల గలితం వాఙ్మయమమృతం జగత్ పిబతి

సరస్వతీదేవి యొక్క హృదయమునకు ఆనందమును కలిగించునట్టి, పరాశరమహర్షి యొక్క కుమారుడు అగు వ్యాసునికి జయము. ఆయన యొక్క ముఖపద్మము నుండి జాలువారిన వాఙ్మయము అనే అమృతమును మానవులు త్రాగుచున్నారు.

శాశ్వతుడు, నిత్యుడు, నాశము లేనివాడు, దేవతలలో కెల్లా గొప్పవాడు, మహాత్ముడు, జగత్తునకంతకు ప్రభువు అగు ఈశ్వరుని నేను శరణు వేడెదను, లోకములను సృజించిన బ్రహ్మదేవుని శరణు వేడెదను. సర్వజ్ఞుడు, పరాజయమును ఎరుగనివాడు, భూత భవిష్యద్వర్తమానములకు ప్రభువు, సద్రూపుడు అగు విష్ణువును శరణు వేడెదను.

జగన్నాథుడగు ఈశ్వరునియందు సాటిలేని జ్ఞానము, వైరాగ్యము, ఐశ్వర్యము అను నాల్గు సిద్ధులతో కూడిన ధర్మము కలవు. ఈశ్వరుడు క్షర (అసత్), అక్షర (సత్) పదార్థము లకు నిత్య సాక్షిగా ఉన్నాడు. క్రియలకు, పదార్థములకు అధిష్ఠానమైన ఈశ్వరుని యందే ఈ లోకములన్నియు ప్రళయ కాలమునందు లీనమగును. ఈశ్వరుడు జగత్తును సృష్టించెను. ఈ జగత్తు యొక్క స్వరూపము ఆయనకే తెలియును. తత్త్వమును ఎరిగిన పరమాత్మ ధ్యాన యోగమునందు ఉన్నవాడై, ఈ చరాచర ప్రాణి వర్గమునంతనూ సృజించెను.

నేను పురాణ గాథలను తెలియగోరి, పుట్టుకలేనివాడు, సర్వకర్మాధ్యక్షుడు, చైతన్యఘనుడు, ముల్లోకములకు సాక్షి, జగన్నాథుడు అగు పరమేశ్వరుని శరణు వేడెదను.

బ్రహ్మకు, వాయుదేవునకు, మహేంద్రునకు, ఋషులలో శ్రేష్ఠుడు మహాత్ముడు అగు వశిష్ఠునికి, ఆయన మనమడు అయిన జాతూకర్ణ మహర్షికి, మరియు పరమ పావనుడగు కృష్ణద్వైపాయనునకు నమస్కరించి, ఏకాగ్రమగు మనస్సు గలవాడనై బ్రహ్మచే చెప్పబడిన పురాణమును చెప్పెదను. ఈ పురాణము వేదములకు అనురూపమైనది. ధర్మార్థ న్యాయ ములతో, యుక్తులతో కూడిన వివిధ శాస్త్రములు దీని యందు అలరారుచున్నవి.

పరాక్రమశాలి, సాటిలేని తేజస్సు గలవాడు, రాజులలో మేటి అగు అసీమకృష్ణ మహారాజు ధర్మబద్ధముగా ఈ భూమిని పాలించుచుండగా, అంతఃకరణము తమకు వశీకృతముగా కలవారు, సత్యమును పలుకుట అనువ్రతమునకు అంకితమైనవారు, కపటము నెరుగనివారు, రజో గుణములేనివారు, అంతరింద్రియ, బాహ్యేంద్రియ నిగ్రహము గలవారు అగు ఋషులు, ధర్మభూమి అయిన కురుక్షేత్రమునందు, స్వచ్ఛమగు ప్రవాహముగల దృషద్వతి అను పుణ్యనదీ తీరమునందు చిరకాలము కొనసాగే సత్ర యాగమును ఆచరించిరి.

నైమిశారణ్యమునందు నివసించే ఆ ఋషులు శాస్త్ర ప్రకారముగా యజ్ఞదీక్షను స్వీకరించిరి. మహాబుద్ధిశాలి, పౌరాణిక శ్రేష్ఠుడు అగు సూతుడు వారిని దర్శించుటకు అచ్చటకు విచ్చేసెను. సూతుడు తన సుభాషితములచే శ్రోతల రోమములు నిక్కబొడుచు కొనునట్లు చేసెడివాడు. ఇట్టి ప్రవచన ప్రభావము వలన ఆయనకు ఈ లోకములో లోమహర్షణుడు (రోమ హర్షణుడు) అనే ప్రసిద్ధి కలిగినది. ముల్లోకములలో కీర్తిపొందిన, బుద్ధిశాలి అగు సూతుడు తపస్సునకు, పాండిత్యమునకు, శీలమునకు నిధి, జ్ఞాని అగు వేదవ్యాసుని వద్ద శిష్యరికము చేసెను. ఆయన యందు పూర్ణమగు పురాణ రూపమైన

వేదమేగాక, విశాలమైన మహాభారత రూపములో వర్ధిల్లిన సరస్వతి కూడా స్థిరముగా ఉండెను. ధర్మార్థ కామమోక్షములను వివరించే గాథలు, సూక్తములు, మరియు సుభాషిత ములు భూమియందు ఔషధులవలె ఆయనయందు విలసిల్లినవి.

సదాచారమును ఎరిగిన ఆ సూత మహర్షి ధీశాలురు అయిన ముని శ్రేష్ఠులను సమీపించి, దోసిలి బట్టి వారికి నమస్కరించెను. ధీమంతుడైన ఆ మహర్షి సాష్టాంగ నమస్కారము చేసి, ఆ ఋషులను సంతోషపరచెను. సత్రయాగము నందున్న మహా తేజశ్శాలురగు ఆ ఋషులు సభాసదులతో కూడి సంతోషించిరి. వారు ఆ మహర్షిని విధి విధానముగా సత్క రించి, ప్రీతికరమగు మాటలను పలికిరి. అపుడు వారికి పురాణమును వినాలనే కోరిక కలిగెను.

మిక్కిలి శ్రద్ధ కలవాడు, విద్వాంసుడు అగు ఆ లోమహర్షణుని సత్రయాగము నందలి యజమాని చూచెను. ఆయన కూడా శాస్త్రములన్నిటిలో దిట్ట. ఆయన ఋషుల ముఖ కవళికలను బట్టి వారి హృదయములోని భావమును తెలుసుకొని, సూతుని ఈ విధముగా ప్రోత్సహించెను. "ఓ సూతా నీవు మహా బుద్ధిశాలివి, బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు అగు వేద వ్యాస భగవానుని, ఇతిహాస పురాణములను తెలుసుకొనుట కొరకై చక్కగా సేవించితివి. నీవు వ్యాసుని బుద్ధి (అనే గోవు) నుండి పురాణ గాథలను పితికితివి. ఓ మహాబుద్ధీ! ధీమంతులగు ఈ ఋషి శ్రేష్ఠులు పురాణమును వినగోరుచున్నారు. కావున, నీవు పురాణమును వినిపింపవలెను. వీరందరు మహాత్ములు, బ్రహ్మవేత్తలు, వివిధ గోత్రములకు చెందినవారు. అట్టి వీరు ఒకచో సమకూడిరి. వీరు తమతమ వంశములను గూర్చి పురాణ వచనముల ద్వారా వినెదరు గాక! దీర్ఘ సత్రయాగములో తమ పుత్రులతో కూడియున్న ఈ మునులకు నీవు పురాణమును వినిపింపుము. మేము యాగమునకు ముందు దీక్షను స్వీకరించబోవు సమయములో నిన్ను స్మరించి ఉంటిమి అని పలికెను.

పూర్వము సత్యవాక్య పాలనా పరాయణులు, పురాణములను ఎరిగిన వారు అగు మునులు పురాణము వినుట కొరకై సూతుని ఈ విధముగా ప్రోత్సహించిరి. ఇది సూతునకు స్వధర్మమని ప్రాచీనులగు ఋషులు భావించిరి. దేవతల యొక్క, ఋషుల యొక్క మరియు గొప్ప తేజశ్శాలురగు రాజుల యొక్క వంశములను సూతుడు గుర్తుంచుకొనవలెను. మరియు, ఇతిహాస పురాణములలో బ్రహ్మవేత్తలచే నిర్దేశింపబడి ప్రఖ్యాతిగాంచిన మహాత్ములను గురించి సూతుడు తెలుసుకొని యుండవలెను.

వేదములయందు సూతునకేమియూ అధికారము లేదు. ఎందుకు అనగా, వేనుని కుమారుడు, మహా పురుషుడు అగు పృథువు యజ్ఞమును చేయుచుండగా, సుత్య (యజ్ఞము

నకు అంగమగు) కర్మ జరుగుచుండగా, మొదటిసారిగా వర్ణ వికృతి కలిగిన సూతుడు జన్మించెను. ఆ యజ్ఞములో బృహస్పతికి ఉద్దేశించిన హవిస్సు, ఇంద్రుని హవిస్సుతో కలిసిపోయెను. దానిని దేవేంద్రుని కొరకు హోమము చేసిరి. అపుడు సూతుడు జన్మించెను. ఆ యజ్ఞములో, ఇట్టి పొరపాటు వలన యజ్ఞాంగకర్మలలో ప్రాయశ్చిత్తము చేయవలసిన అవసరము ఏర్పడెను. గురువునకు ఉద్దేశించిన హవిస్సు శిష్యుని హవిస్సుతో కలిసి, తిరస్కారమునకు గురి అయ్యెను. ఇట్లు నికృష్టమును ఉత్కృష్టముతో కలిపి అనుష్ఠించుట వలన వర్ణ వికృతి కలిగిన సూతుడు జన్మించెను.

బ్రాహ్మణ స్త్రీయందు క్షత్రియుని వలన సూతుడు జన్మించెను. కాని, బ్రాహ్మణత్వ లక్షణములు ఉండుటచే, సూతుని ధర్మము బ్రాహ్మణ సదృశమని చెప్పబడెను. క్షత్రియులను ఆశ్రయించి, రథమును నడుపుట, ఏనుగులను, గుర్రములను సంరక్షించుట సూతునకు మధ్యమ ధర్మము, వైద్యవృత్తి అధమము. కావున బ్రహ్మవేత్తలగు మీరు నన్ను స్వధర్మమునకు చెందిన విషయమును అడిగితిరి. ఋషులచే పూజింపబడే పురాణమును నేను శ్రద్ధగా ప్రవచనమును చేయక ఉందునా?" అని ఇంకను

పితృ దేవతలకు వాసవి అను మానస పుత్రిక జన్మించెను. ఆమె పితృ దేవతలచే మానసికముగా శపింపబడి మత్స్యకన్యగా జన్మించెను. అరణి నుండి అగ్ని ఉద్భవించినట్లు, ఆమె యందు గొప్ప యోగి, వేదవేత్తలలో శ్రేష్ఠుడు అగు వ్యాసుడు జన్మించెను. మహా విద్వాంసుడగు ఆ వ్యాసభగవానునకు నమస్కారము. పురాణ పురుషుడు, జగన్నాథుడు అగు శ్రీ మహావిష్ణువు భృగు మహర్షి వాక్యమును సత్యము చేయగోరి, వేదవ్యాస రూపముగా మనుష్య దేహమును స్వీకరించెను. పుట్టుటతోడనే సంపూర్ణ వేదము సాంగముగా ఆయనకు సాక్షాత్కరించెను. కాని, ఆయన విద్యాధర్మమును పాటించి, జాతూకర్ణుని వద్ద ఆయన వేదమును అధ్యయనము చేసెను.

బుద్ధిని కవ్వముగా చేసి వేదములు అను సముద్రమును, మథించగా, మహాభారతమనే చంద్రుడు ఉదయించి, లోకమును ప్రకాశింప చేసెను. సారవంతమగు నేల యందున్న చెట్టు కొంత కాలములో అనేక శాఖలుగా విస్తరించిన విధముగా వేదమనే వృక్షము ఆయనవలన శాఖలు కలది అయ్యెను. బ్రహ్మవేత్తయగు ఆ వేదవ్యాసుని నుండి నేను పురాణమును వినివుంటిని. ఆయన సర్వజ్ఞుడు. సర్వ వేదములయందు కీర్తింపబడినాడు. మహాతేజశ్శాలి. ఆయననుండి పొందిన పురాణమును నేను ప్రవచించెదను. ఈ పురాణ మును పూర్వము నైమిశారణ్య వాసులు, మహాత్ములు అగు మునులు కోరగా, వారికి వాయుదేవుడు చెప్పి ఉండెను.

మహేశ్వరుడు సర్వోత్కృష్టుడు. ఆయన ఇంద్రియ గోచరుడు కాడు; నాల్గు చేతులు, నాల్గు ముఖములు గలవాడు; మనస్సునకు గోచరము కానివాడు; ప్రత్యక్షాది ప్రమాణ ములచే పొందశక్యము కానివాడు; స్వయం సిద్ధమగు జగత్కారణుడు; మరియు జగన్ని యంత. ఆయనయే అవ్యక్త (మూల ప్రకృతి) రూపముగా జగత్కారణమై ఉన్నాడు. ఈ మూల ప్రకృతి నుండియే మహత్తు మొదలుకొని అణువుల విశేష ధర్మముల వరకు గల జగత్తు పుట్టినది అని శాస్త్ర నిర్ణయము. ఈ జగత్తు అధిష్ఠాన (ఈశ్వరుడు) రూపముగా సత్; జగద్రూపముగా అసత్ (మిథ్య). మూల ప్రకృతి నుండి సాటిలేని, తేజోమయమగు (హిరణ్య) అండము పుట్టినది. ఈ అండము జలము చేతను, జలము తేజస్సు చేతను ఆవరింపబడి ఉన్నవి. తేజస్సు వాయువు చేతను, వాయువు ఆకాశము చేతను ఆవరింపబడి ఉన్నవి. ఆకాశము సమష్టి అహంకారము చేతను, సమష్టి అహంకారము మహత్తు (సమష్టి బుద్ధి) చేతను, మహత్తు మూలప్రకృతి చేతను ఆవరింపబడి ఉన్నవి.

ఈ పురాణమునందు దేవతలందరియొక్క, ఋషులయొక్క, నదులయొక్క, పర్వతములయొక్క ఉత్పత్తి వర్ణింపబడును. అన్ని మన్వంతరములు, కల్పములు కూడా వర్ణింపబడును. బ్రాహ్మణ, క్షత్రియ వంశముల ఉత్పత్తి, బ్రహ్మయొక్క పుట్టుక కూడ కీర్తింపబడును. బ్రహ్మయందు సృష్టి కర్తృత్వము, ప్రజలయొక్క సృష్టి, ఇంకా మూల ప్రకృతి నుండి జన్మించిన బ్రహ్మయొక్క అవస్థలు కూడా దీనియందు కీర్తింపబడును. కల్పములలోని సంవత్సరములు, జగత్తుయొక్క స్థితి, విష్ణువు శయనించుట, భూమిని ఉద్ధరించుట దీని ద్వారా వివరింపబడును.

వర్ణాశ్రమ విభాగ పూర్వకముగ నగరాదులను తీర్చిదిద్దుట, ఇంటిలో ఉండు వృక్షముల అమరిక, సిద్ధపురుషులు నశించుట, బహుదూరము వరకు విస్తరించిన మార్గములు, వాటి నిడివి, వాటి యందలి సంచారము, స్వర్గమునందు స్థానముల విభాగము, భూలోక మందు ఉండు మానవుల స్థానములు వర్ణింపబడును. వృక్షములు, ఔషధులు మరియు లతలు వర్ణింపబడును. మానవులు పాపము వలన పొందే వృక్ష కీటాది జన్మలు వివరింప బడును. దేవతలకు, ఋషులకు సంబంధించిన రెండు మార్గములు, అన్నము, శరీరములు మొదలగు వాని సృష్టి మరియు శరీర త్యాగము ఇందు కీర్తింపబడినవి.

శాస్త్రములన్నింటిలో బ్రహ్మ ముందుగా పురాణమును స్మరించెను. తరువాత, ఆయన ముఖముల నుండి వేదములు బయల్వెడలినవి. వేదాంగములు, ధర్మశాస్త్రము, వ్రతములు, నియమములు, పశువుల ఉత్పత్తి మరియు మానవుల ఉత్పత్తి కూడా ఈ పురాణము నందు వివరింపబడినవి. ఇంకను కల్పము యొక్క మూలము, నిర్వచనము చెప్పబడినవి.

బ్రహ్మ చేసిన తొమ్మండుగురు మానస పుత్రుల సృష్టి చెప్పబడినది. ఇంతే గాక, బ్రహ్మ ముగ్గురు మానస పుత్రులను సృజించి, తరువాత లోకములను సృజించెను. బ్రహ్మయొక్క అవయవముల నుండి ధర్ముడు మొదలగువాని పుట్టుక కూడా వర్ణింపబడెను.

ప్రతి కల్పమునందు మరల జన్మించే ఈ పన్నెండుగురు పురుషులు, కల్పముల మధ్యన ఉండే కాలము, మరియు వాటి సంధి కాలము వర్ణింపబడినవి. తమోగుణముచేత పూర్తిగా ఆవరింపబడిన బ్రహ్మ నుండి అధర్మము పుట్టుట, ఆ తరువాత శతరూప యొక్క జన్మ వర్ణింపబడినవి. తరువాత ప్రియవ్రత, ఉత్తానపాదుడు, ప్రసూతి, ఆకూతి కీర్తింప బడుదురు. వీరియందు పాపక్షాళనము చేయబడిన ప్రజలు ప్రతిష్ఠితులై ఉందురు. తరువాత, రుచిప్రజాపతికి ఆకూతి యందు ఇద్దరు సంతానము కలుగుట, దక్షునకు ప్రసూతి యందు అనేక కన్యలు జన్మించుట, ఆ తరువాత ధర్ముడు మహా పతివ్రతలైన శ్రద్ధ మొదలగు దక్షుని కుమార్తెలయందు గావించిన సుఖదాయకము, సత్త్వగుణ ప్రధానము అగు సృష్టి తెలుపపబడును.

ఇంకను అధర్మునకు హింసయందు కలిగిన తమోగుణ ప్రధానమైన, అమంగళ లక్షణములతో కూడిన ప్రజాసృష్టి వర్ణింపబడెను. ఇంతేగాక, మహేశ్వరునకు సతి యందు కలిగిన ప్రజాసృష్టి కీర్తింపబడినది. దోషరహితుడగు బ్రహ్మ కీర్తింపబడెను. యోగ శాస్త్రమునందు నిధియగు పరమేశ్వరుడు మోక్షమును కోరు ద్విజులకు యోగమును ఉపదేశించెను. రుద్రుని అవతారము, మరియు ఎనలేని సంపద, మూడు వేదములకు సంబంధించిన గాథ, బ్రహ్మ నారాయణులతో రుద్రునకు జరిగిన శ్రేష్ఠమగు సంవాదము వర్ణింపబడును. వారిద్దరు ఆ దేవదేవుని స్తుతించగా, ఆయన ఎంతయో సంతసించెను. ఈ స్తోత్రము కూడా ఆ పురాణములో వర్ణింపబడినది.

తరువాత బ్రహ్మయొక్క అంగము నందు పరమాత్మయగు రుద్రుని ఆవిర్భావము, ఆయన నామములోని వైశిష్ట్యము, మరియు గొప్ప మనస్సుగల రుద్రుడు రోదించుటకు గల కారణము కీర్తింపబడును. స్వయంభువుడు (అనగా సర్వకారణ కారణుడు, పుట్టుక లేనివాడు, స్వయముగా ప్రకాశించు జగత్పిత) అగు శివుడు 'రుద్ర' మొదలగు ఎనిమిది నామములను పొందిన తీరు, స్థావర జంగమాత్మకమగు ఈ ముల్లోకములు శివుని ఆ ఎనిమిది రూపములచే వ్యాప్తమైయున్న విధము వర్ణింపబడును. భృగువు మొదలగు ఋషుల ప్రజా సృష్టి, బ్రహ్మర్షియగు వశిష్టుని గోత్రము ఈ పురాణములో కీర్తింపబడును. అగ్నికి స్వాహాదేవియందు కలిగిన సంతానము వర్ణింపబడును. తరువాత, రెండు రకముల పితృ దేవతలకు స్వధాదేవియందు కలిగిన సంతానము కీర్తింపబడును.

ఈ పితృవంశ ప్రసంగము తరువాత, మహేశ్వరుడు సతీదేవి విషయములో దక్షునకు, భృగుడు మొదలగు ధీమంతులగు ఋషులకు శాపమును ఇచ్చిన ఘట్టము వర్ణింపబడును. విస్మయమును కలిగించు కర్మల నాచరించు దక్షుడు, రుద్రునకు తిరిగి శాపమును ఇచ్చుట, ఆ తరువాత వైరము తొలగుట అను వృత్తాంతము ఈ పురాణములో వివరముగా చెప్ప బడినది. పై విధముగా సృష్టింపబడినవారు వేర్వేరు ద్వీపములలో వేర్వేరు దేశములలో నియోగింపబడిరి. తరువాత స్వాయంభువమనువుయొక్క సృష్టి గానము చేయబడును. మరియు, నాభి యొక్క సృష్టి, మహాత్ముడగురజసుని సృష్టి వర్ణింపబడును. ఇంతేగాక, ద్వీపములు, సముద్రములు, పర్వతములు వివరింపబడును.

కురు, ఇలావతాది దేశములు, నదులు, వాటి ఉపనదులు, సప్త ద్వీపములు, వాటిలోని వేలాది అవాంతర భేదములు, జంబూద్వీప, సముద్రముల మండల విస్తారము, యోజన ములలో వాటి నిడివి, మరియు వాటియందలి పర్వతములు, హిమవంతుడు, హేమ కూటము, నిషధము మేరువు, నీలము, శ్వేతము, శృంగవాన్అను వర్ష (దేశ) పర్వతములు కీర్తింపబడును. ఆ పర్వతముల చుట్టుకొలత, ఎత్తు, వైశాల్యము, విస్తారములు యోజన ప్రమాణములలో చెప్పబడును. ఇంకను ఆ పర్వతములలో నివసించు జనులను ఈ పురాణము వర్ణించును.

భారత మొదలగు దేశములు, వాటిలోని నదులు, పర్వతములు, చలనముగల ప్రాణులు, చలనములేని ప్రాణులు, ఏడు సముద్రములచే చుట్టుకొనబడియున్న జంబూ ద్వీపము మొదలగు ద్వీపములు, ఆ తరువాత జలమయమగు భూమి, లోకాలోక పర్వతము వర్ణింపబడును. ఈ లోకములు, మరియు ఏడు ద్వీపములతో కూడిన భూమి, ఆ హిరణ్యాం డములోపల ఉన్నవి. భూరాది లోకములు, వాటిని చుట్టుకొని ఉన్న పదార్థములు కూడా వర్ణింపబడును. ఇది అంతా ప్రధానము (మూల ప్రకృతి) యొక్క పరిమాణములో ఒక అంశము మాత్రమే. ఇంకను లోకముల పరిమాణము వాని వ్యాసములతో సహా సంక్షేపముగా వివరింపబడును.

సూర్యుడు, చంద్రుడు, భూమి వీటి ప్రమాణము యోజనములలో అశేషముగా వర్ణింపబడును. వీటి అభిమాన దేవతలు కూడ కీర్తింపబడుదురు. మానససరోవరము యొక్క ఊర్ధ్వభాగమునందు మహేంద్రుని పవిత్ర సభ మొదలగునవి, ఆపైన అలాత (అగ్ని) చక్రము స్వర్గమును పొందు మార్గము చెప్పబడినవి. నాగవీధి, అజవీధుల స్వరూపము చెప్పబడినది. ధ్రువములు, అభిమాని దేవతలు వర్ణింపబడిరి. లోకాలోకము (సూర్యకాంతి ప్రసరించని అంతిమ భాగమునందుండు పర్వతము) యొక్క పరిమాణము

యోజనములలో తెలుపబడినది. ఈ భాగమునకు, జగత్తునకు మధ్యగల సంధి వర్ణింప బడినది. మరియు భూమధ్య రేఖవద్ద పగలు వర్ణింపబడును. నాల్గు దిక్కులలో ఊర్ధ్వ భాగమునందు ఉండే లోకపాలురు కీర్తింపబడుదురు.

రజోగుణ ప్రధానులగు గృహస్తులు పొందే దక్షిణ (పితృ) మార్గము, సత్త్వగుణ ప్రధానులగు సన్న్యాసులు పొందే ఉత్తర (దేవ) మార్గము, ధర్మాదులు నిత్య నివాసముచేసే శ్రీమహావిష్ణువు యొక్క ధామము వర్ణింపబడును. సూర్య, చంద్ర, గ్రహ, నక్షత్రముల గతి, ధ్రువునివలన ప్రజలకు కలుగు శుభాశుభములు కీర్తింపబడును. బ్రహ్మ ఒక విశిష్ట ప్రయోజనము కొరకై స్వయముగా సూర్యరథమును నిర్మించెను. భగవానుడు సూర్యరూపుడై స్వయముగా ద్యులోకమునందు సంచరించును. ఆ రథమును దేవతలు, ఆదిత్యులు, ఋషులు, మరియు గంధర్వులు, అప్సరసలు, సర్పములు, మరియు రాక్షసులు అధిష్ఠించిరి. ఇంతేగాక, జలముల యొక్క సారభూతుడైన చంద్రుని రథము కూడా వర్ణింపబడును. సూర్యుని వలన కలుగు చంద్రుని పెరుగుదల, తరుగుదలలు కీర్తింపబడును. సూర్యాదుల రథములు ధ్రువునినుండియే వచ్చునని చెప్పబడెను. శింశుమారుడు (సర్వశక్తిమంతుడగు పరమేశ్వరుడు) దీని యందు వర్ణింపబడును, శింశుమారుని పుచ్ఛములో ధ్రువుడు ఉండును. నక్షత్రముల స్వరూపము, గ్రహముల స్వరూపము వర్ణింపబడును. ఈ పురాణములో దేవతల నివాసములు, పుణ్యాత్ములు నివసించు లోకములు వర్ణించబడును. వర్షమునకు, చలికి, వేడికి ఆధారమగు అనంత సూర్యరశ్మి వర్ణింపబడును. పేరు, కర్మ, స్వరూపము ఆధారముగా సూర్యరశ్ముల విభాగము వర్ణింపబడును. సూర్యుని చుట్టూ తిరుగు గ్రహముల పరిమాణములు, గతులు చెప్పబడును.

బ్రహ్మచే ప్రార్థింపబడిన శివుడు విషమును భక్షించగా, కంఠము నీలవర్ణమును పొందుట, శివుడు విషాదమును పొందుట తెలుపబడును. దేవతలు విష్ణువును ప్రార్థించుట, విష్ణువు మహేశ్వరుని స్తుతించుట, పాపములనన్నిటినీ పోగొట్టే పవిత్రమైన లింగోద్భవ కథ వర్ణింపబడును. రూపములన్నీ ఈశ్వరుని రూపములే. ప్రధానము (మూల ప్రకృతి) యొక్క ఈ లింగాకార పరిణామము గొప్ప అద్భుతము. అదియు దాని తరువాత, ఇలుని కుమారుడగు పురూరవసుని మహిమ, రెండు రకముల పితృ దేవతలకు అమృత రూపమగు తర్ప ణము, తరువాత, పర్వదినములు (చంద్రుని వృద్ధి క్షయములు), వాటి సంధులు వర్ణింపబడును.

స్వర్గలోకమును పొందినవారు, అధోగతిని పొందినవారు అను రెండు రకముల పితరులకు శ్రాద్ధముచే కలిగే గొప్ప అనుగ్రహము, యుగముల సంఖ్య, వాటి పరిమాణము,

కృతయుగ, త్రేతాయుగములలో క్రమముగా ధర్మనిష్ట మహిమ తగ్గి ప్రవర్తిల్లుట, అను విషయములు కీర్తింపబడును. వర్ణాశ్రమముల గణనము, వాటిని ధర్మబద్ధముగా పరిరక్షించుట, యజ్ఞమును చేయుట, దానిలో ఋషులకు, వసువునకు మధ్య సంవాదము, వసువు మరల అధోగతిని పొందుట మొదలగు విషయములు కీర్తింపబడును.

స్వాయంభువమనువు తప్ప ఇతరులు ప్రశ్నలకు సమాధానమును చెప్పలేక పోవుట, తపస్సుయొక్క మహిమ, యుగములలోని స్థితిగతులు సవిస్తరముగా చెప్పబడినవి. ఈ పురాణములో ద్వాపర, కలియుగములు సంక్షేపముగా వర్ణించబడినవి. ప్రతియుగమునందు దేవతలు, పశుపక్ష్యాదులు, మరియు మానవుల ప్రమాణము (ఒడ్డు, పొడవు)లు, యుగ ప్రభావముచే ప్రాణులు విశాల దేహములను కలిగి, గొప్ప ఆయుర్దాయ మును కలిగి ఉండుట, మహాత్ముల ప్రాదుర్భావము మొదలగు విషయములు కీర్తింపబడును. వేదములు, వాటిలోని మంత్రములు, వేదశాఖలు, వాటి పరిమాణము, వేదవ్యాస శబ్దము యొక్క సార్థకత ఇత్యాదులు వర్ణింపబడును.

ప్రళయములో మన్వంతరముల ఉపసంహారము, ప్రళయాంతమునందు దేవతలు, ఋషులు, మనువు, పితృ దేవతలు తిరిగి జన్మించుట. మొదలగు సృష్టిని విస్తరముగా చెప్పుట అసంభవము కాబట్టి, సంక్షేపముగా చెప్పబడును. మనుష్య మానములో మన్వంతర కాలగణనము ఈయబడును. గడచుచున్న మన్వంతరమునకు చెప్పబడిన ఈ గణనము గడచిన, రాబోవు మన్వంతరములకు కూడా వర్తించును. మరియు స్వాయంభువ మన్వంతరమునకు గడచిన, రాబోవు మన్వంతరములతోగల ప్రతిసంధానము (మధ్యలో నుండు కాలము) కూడా తెలియజేయబడినది.

మూడు మన్వంతరములు, కాలజ్ఞానము, మన్వంతరములలోని దేవతలు, మహారాజులు వర్ణింపబడిరి. దక్షుని ప్రియ కుమార్తెకు జన్మించిన కుమారుల వర్ణనకలదు. వారు ఈవిధముగా బ్రహ్మ, దక్షుడు అను పరంపరకు చెందినవారైరి. మేరు పర్వతము నందుండు సావర్ణుడు మొదలగు మనువులు; ధ్రువుడు, ఉత్తానపాదుడు చేసిన ప్రజాసృష్టి వర్ణింపబడినవి. వేనుని కుమారుడగు పృథువు భూమిని గోవుగా చేసి పాలను పితుకుట, ఉపయోగించిన పాత్రలు, పితికిన పాలు వర్ణింపబడుటయేగాక, రాజవంశముల వర్ణన కూడా గలదు.

ఈ భూమిని బ్రహ్మాదులు పూర్వమే పితికియున్నారు. పదిమంది ప్రచేతసుల వలన మారిష యందు, సోముని అంశముతో ధీమంతుడగు దక్షప్రజాపతి జన్మించుట,

భూర్భువస్సువర్లోకములపై మహేంద్రుల ఆధిపత్యము తెలుపబడును. మన్వాదులకు చెందిన అనేక గాథలు వర్ణింపబడును. మరియు, వైవస్వతమనువు యొక్క ప్రజాసృష్టి వివరించబడును. మహాదేవుని యజ్ఞములో వారుణ దేహమును ధరించిన బ్రహ్మయొక్క శుక్రము నుండి భృగువు మొదలగు వారి ఉత్పత్తి తెలుపబడును.

చాక్షుషమనువుయొక్క శుభకరమగు ప్రజాసృష్టి, తరువాత వైవస్వత మన్వంతరములో ధ్యానమునుండి దక్షుడు చేసిన సృష్టి గురించి చెప్పబడును. బ్రహ్మపుత్రుడు, ప్రియముగా మాటలాడువాడు అగు నారదుడు తన శాపము కొరకై మహా బలశాలురగు దక్షుని కుమారులను నశింపజేసెను. అపుడు దక్షుడు వీరిణియందు కీర్తిపొందిన కన్యలను సృజించెను. తరువాత, ధర్ముని సృష్టి, ధీమంతుడగు కాశ్యపుని సృష్టి వర్ణింపబడును. ఆ తరువాత బ్రహ్మ విష్ణు మహేశ్వరుల మధ్యగల ఐక్యము, భిన్నత్వము, మరియు వారిలోని విశేషములు కీర్తింపబడును.

దేవతలకు అధిపతియగు బ్రహ్మ దేవతలను శపించుట, దితి యొక్క అనుగ్రహముచే దేవాంశతో కూడి మరుత్తులు జన్మించుట, ఏడ్గురు చొప్పునగల మరుత్తుల ఏడు, గణములు ఏడు, తండ్రి మాటచే వారికి దేవత్వము, వాయువు యొక్క ఆవహ, ప్రవహ మొదలగు స్కంధములలో ఆశ్రయము లభించుట, దైత్యులు, దానవులు, గంధర్వులు, నాగులు, రాక్షసులు, సర్వభూతములు, పిశాచములు, పశువులు, పక్షులు, లతలు, అప్సరసలు అను వాటి ఉత్పత్తి విస్తరముగా వివరింపబడును. సముద్రము నుండి ఐరావత గజము పుట్టట, గరుత్మంతుని పుట్టుక, అభిషేకము, భృగువుల, అంగిరసుల వివరములు చెప్పబడినవి.

మహాత్ములగు కశ్యప, పులస్త్య, అత్రి, పరాశర మహర్షుల సంతానము ఈ పురాణములో వివరింపబడును. దేవతలకు, ఋషులకు కలిగిన సంతానము గురించి తెలుపబడును. లోకములకు ఆధారమైన ముగ్గురు కన్యల కీర్తి గానము చేయబడును. దేవతలతండ్రులు, మనుమలు, వారి జన్మల గురించి వివరింపబడును. ఐదుగురు మహాత్ముల చరిత్ర వర్ణింపబడును. భూమి విస్తారము, ఆదిత్యుని విస్తారము, తరువాత కుక్షి చరిత్ర, మరియు ధుంధువధ వర్ణింపబడినది.

ఇక్ష్వాకువు నుండి బృహద్బలుని వరకు, నిమి మొదలుకొని జహ్ను గణము వరకుగల చక్రవర్తులు ఇందు కీర్తింపబడిరి. యయాతి మహారాజ చరితము, యదువంశ చరిత్ర, హైహయుని చరిత్ర కీర్తింపబడినది. తరువాత, క్రోష్టువు యొక్క వంశము, జ్యామఘుని మాహాత్మ్యము, ప్రజాసృష్టి కీర్తింపబడును. దేవావృధుడు, అర్కుడు, మహాత్ముడగు వృష్టి

అను మహారాజుల చరిత్ర, అత్రిమిత్ర వంశము, మరియు విష్ణువు యొక్క మహిమ తెలుపబడును. తరువాత, సూర్యుడు శ్రేష్ఠమగు మణిని పొందుట, ధీమంతుడగు యుధాజితుని ప్రజాసృష్టి కీర్తింపబడును.

దేవమీఢుడను రాజర్షి యొక్క శోభాయుతమగు వంశము, ఆ మహాత్ముని చరిత్ర, పునర్జన్మ వర్ణింపబడినవి. కంసుని దుష్టబుద్ధి, దేవకీ వసుదేవులకు జగన్నాథుడగు విష్ణువు రహస్యముగా జన్మించుట, తరువాత ప్రజాసృష్టి తెలుపబడెను. దేవాసుర యుద్ధములో విష్ణువు ఇంద్రుని ప్రాణములను రక్షించుట కొరకై స్త్రీని వధించగా, భృగువు విష్ణువును శపించెను. భృగుమహర్షి శుక్రుని మాతృదేవిని తిరిగి బ్రతికించెను.

ధీరుడగు శుక్రుడు వరదానమును గోరి, శివుని ఆరాధిస్తూ తపస్సు చేయుట, శివస్తుతి, ఆ తరువాత దేవాసురుల వృత్తాంతము వర్ణింపబడినవి. మహాత్ముడగు శుక్రుడు జయంతితో కూడి యుండగా, బుద్ధిశాలియగు బృహస్పతి శుక్రరూపముతో రాక్షసులను మోహపెట్టెను. అపుడు గొప్ప తేజశ్శాలియగు శుక్రుడు వారిని శపించెను. విష్ణు మాహాత్మ్యము, విష్ణువు జన్మించుట వర్ణింపబడినది. యయాతికి శుక్రాచార్యుని కుమార్తెయగు దేవయాని యందు తుర్వసుడు, అనువు, ద్రుహ్యుడు, పూరువు అను కుమారులు కలిగిరి. వారి వంశములో జన్మించిన మహాత్ములగు చక్రవర్తులు ఈ పురాణములో కీర్తింపబడిరి. ఆ చక్రవర్తుల దీర్ఘకాల కీర్తి వారి సంపద, తేజస్సు గానము చేయబడినవి. విప్రర్షియగు కుశికుని ధర్మనిష్ఠ తెలుపబడినది.

సురభి బృహస్పతి శాపమును తొలగించుట, జహ్నువంశము, శంతనుని పరాక్రమము వర్ణింపబడును. భవిష్యత్తులో రాబోవు రాజుల వర్ణనము, రాబోవు ఏడ్గురు మనువుల వర్ణనము ఈ పురాణము నందు కలవు. కలియుగాంతమున ప్రాణి సంహారము, పరార్ధ లక్షణము, పరలక్షణములు కీర్తించబడును. యోజనములలో బ్రహ్మ యొక్క పరిమాణము, నైమిత్తిక, ప్రాకృతిక, ఆత్యంతికములనే, సర్వప్రాణుల యొక్క మూడు రకముల ప్రళయము, అనావృష్టి, సూర్యుని నుండి భయంకరమగు ప్రళయకాలాగ్ని పుట్టుట వర్ణింపబడును.

ప్రళయకాల మేఘము వర్షించగా సర్వము జలమయము అగుట, అప్పటి వాయువు వర్ణింపబడును. అటు తరువాత మహాత్ముడగు బ్రహ్మకు రాత్రి అగుట, ఆ రాత్రి యొక్క కాలమానము నిర్దేశింపబడును. భూరాది ఏడు లోకములు, పాపులు పొందే రౌరవాది నరకములు వర్ణింపబడును. బ్రహ్మ లోకమునకుపైన పవిత్రమగు శివలోకము కలదు. సర్వప్రాణులు ప్రళయములో అచటనే లీనమగుదురు. సర్వప్రాణుల ఉత్తరగతులు అచటనే నిర్ణీతమగును. ప్రళయమునందు సర్వప్రాణుల సంహారము వర్ణింపబడును.

ధర్మాచరణము వలన ఊర్ధ్వగతి, అధర్మాచరణము వలన అధోగతి, ప్రతి కల్పము నందు మహాభూతములు కూడా వినాశము చెందుట, దుఃఖగణనము, సృష్టికర్త కూడా అనిత్యుడేనని నిరూపించుట. భోగములు పరిణామములో హానిని కలిగించునని నిర్ణయించుట, మోక్షము దుర్లభమని ప్రతిపాదించుట, వైరాగ్యముచే భోగములయందు దోషమును దర్శించుట అను విషయములు ఈ పురాణములో వర్ణింపబడినవి. వ్యక్తము (పృథివి, అగ్ని, జలము), అవ్యక్తము (వాయువు, ఆకాశము) అగు జగత్తు నుండి మనస్సును మరలించి, బ్రహ్మమునందు స్థిరముగా ఉంచుట వలన, అది శుద్ధమై ద్వైత దర్శనమును అతిక్రమించ గల్గును.

తరువాత త్రివిధ తాపములకు అతీతము, రూపములేనిది, పుణ్యపాప సంగము లేనిది, ఆనందఘనము, అభయ స్థానము అగు పరబ్రహ్మ వర్ణింపబడును. బ్రహ్మ పూర్వ సృష్టిని పోలిన ఇంకో సృష్టిని చేయుట, పాపములను అన్నిటినీ పోగొట్టు ఋషివంశ వర్ణన మొదలైనవి ఈ పురాణమునకు విషయవస్తువులు. దీనియందు జగత్తుయొక్క సర్వ వికారములు, ప్రళయము కీర్తింపబడును. ప్రాణుల ఉత్పత్తి వినాశములు, కర్మ ఫలములు కూడా వర్ణింపబడును. వశిష్టుని ఉత్పత్తి, మరియు శక్తి యొక్క జన్మ వర్ణింప బడును.

తరువాత విశ్వామిత్రునికి సౌదాసుని వలన కలిగిన అవమానము, అట్లే పరాశరుని ఉత్పత్తి, ఆయన అంతర్ధానము చెప్పబడినది. పితరుల కన్య వలన వ్యాసుని జనన వృత్తాంతము, తరువాత పుత్రునిత సహా శుకుని ఉత్పత్తికి సంబంధించిన విషయములు చెప్పబడినవి. అటు పిమ్మట పరాశరునికి విశ్వామిత్రునితో విరోధము కలిగిన వృత్తాంతము, విశ్వామిత్రుని వధించవలెనను కోరికతో వశిష్ఠుడు అగ్నిని ప్రస్తుతించుట, దైవవశమున విశ్వామిత్రుని హితము కోరిన స్కందుడు సంతాన నమిత్తమై అతడిని రక్షించిన వృత్తాంతము తెలుపబడినది.

వ్యాస భగవానుడు నాల్గు పాదములతో కూడియున్న ఒకే ఒక వేదమును తన బుద్ధితో నాల్గు భాగములుగా విభాగము చేసిన విధానము, ఆయన శిష్యులు, శిష్యుల శిష్యులు, మరల వాటిని శాఖలుగా విభాగముచేయుట తెలుపబడినవి. తరువాత స్వయం భులైన బ్రహ్మదేవుడు పుణ్యప్రదేశమును చేరుకొనవలెనను కోరికగల మనులతో, వారి హితమును కోరి, సుందర నాభి ప్రదేశమును కలది అగు దివ్యరూప అను పేరుగల శుభకరమైన అతిగొప్పదైన వర్తమాన చక్రమును చూపించి దీని వెనుక విడువ కుండా జాగరూకులై వెళ్లుడు. మీకు హితమును కలిగించు దేశమును పొందగలరు. పరుగిడే

ఈ ధర్మ చక్రము యొక్క అంచు ఎక్కడ శిథిలమగునో, ఆ ప్రదేశము పవిత్రమైనదని తెలుసుకొనుడు" అని చెప్పెను. బ్రహ్మ ఋషులను ఉద్దేశించి ఇట్లు పలికి, మరల అంతర్ధా నమయ్యెను.

గంగాదేవి యొక్క గర్భము నుండి జనించిన బంగారమును తీసుకొనివచ్చుట, ఆ ఋషులకు నైమిశీయులు అనుసార్థక నామధేయము ఇవ్వబడినవి. అపుడు ఋషులు నైమిశమునందు సత్రయాగమును అనుష్ఠించిరి. శరద్వంతుడు మరణించగా, ఆతడు పునరుజ్జీవితుడుగా చేయబడెను. నైమిశమునందలి ఋషులు అతిశయించిన శ్రద్ధతో, ఈ సమస్త భూమిని సరిహద్దులు లేకుండా చేసి, రాజును తీసుకొనివచ్చిరి. ఆతనిని శాస్త్రోక్త విధానముగా అతిథి మర్యాదలతో ఆదరించిరి. ఆ విధముగా యథావిధిగా చేయబడిన ఆతిథ్యముచే సంతసిల్లిన రాజును క్రూరుడు, కనబడకుండ సంచరించువాడు అగు స్వర్భానుడు అను రాక్షసుడు అపహరించెను.

ఆ మహారాజు యజ్ఞములో మహర్షులను కలుసుకొనుట, ఆ మహాత్ముల యజ్ఞములోని సామగ్రి అంతా బంగరుదై ఉండుటను చూచుట. నైమిశేయులగు మహర్షులు చేయు పన్నెండు సంవత్సరముల యాగములో ఆ రాజునకు మహర్షులతో వివాదము, ఆతడు, వారిచే సంహరింపబడుట. ఆతని కుమారుడగు ఆయుషుని నైమిశారణ్యములో చక్రవర్తిని చేయుట, తరువాత యాగమును పూర్తిచేసిన ఆ మహారాజును సేవించుట వర్ణించబడినవి. ఓ ద్విజశ్రేష్ఠులారా! ఋషులయొక్క మహిమాన్వితమగు చరితము జరిగినది జరిగినట్లుగా ఈ పురాణమునందు వ్యాఖ్యానింపబడినది.

ఉత్తమ జ్ఞానరాశియగు ఈ పురాణమును పూర్వము బ్రహ్మ చెప్పియుండెను. రుద్రుడు ద్విజులను అనుగ్రహించుట కొరకై అవతరించుట, పాశుపతయోగములు, స్థానములు, లింగోద్భవము, శివుడు నీలకంఠుడు అగుట అను విషయములు కూడా దీని యందు కీర్తింపబడును. ధన్యము, కీర్తిని ఇచ్చునది, ఆయుర్దాయమును ఇచ్చునది అగు ఈ పురాణ మును బ్రహ్మవాదియగు వాయుదేవుడు విప్రులకు చెప్పియుండెను. దీనిని ప్రవచించుట, వినుట, విశేషించి కంఠస్థము చేయుట వలన పాపములు తొలగి, పుణ్యము లభించును. ఈ పురాణములో ఇదే క్రమములో చెప్పబడినది.

విశాలమగు విషయము నైననూ తేలికగా, సంగ్రహముగా చెప్పుటకు వీలుపడును. అందువలన, ముందుగా సంగ్రహముగా చెప్పి, తరువాత విస్తరముగా వివరించబడెను. ఎవరు ఇంద్రియములను జయించి ఈ పురాణములోని మొదటి పాదమును శ్రద్ధగా

అధ్యయనము చేసెదరో, వారు పురాణము నంతనూ అధ్యయనము చేసిన ఫలమును పొందెదరు అనుటలో సందియము లేదు. నాల్గు వేదములను వేదాంగములతో, ఉపనిషత్తు లతో సహా అధ్యయనముచేసిన ద్విజుడైననూ, పురాణమును ఎరుగని వాడైనచో, పండితుడు కాజాలడు. ఇతిహాస, పురాణముల జ్ఞానముతో వేదమును విస్తారముగా వ్యాఖ్యానించ వలెను. వేదము అల్పజ్ఞుడగు వ్యక్తివలన 'ఈతడు నన్ను తప్పుగా వ్యాఖ్యానించునేమో' అని భయపడుచుండును. బ్రహ్మ స్వయముగా చెప్పిన ఈ అధ్యాయమును పునః పునః పఠించే వ్యక్తి ఆపదల నుండి విముక్తుడై, అభీష్టమగు పుణ్యగతిని పొందును.

'పురా' అనితీతి 'పురాణమ్' పూర్వము (సృష్ట్యాదిలో) ప్రవర్తిల్లినది గనుక పురాణము అనబడును. ఈ నిర్వచనమును ఎరిగిన వ్యక్తి పాపములన్నిటి నుండి విముక్తుడగును. నారా యణుడు ఈ జగత్తునంతనూ వ్యాపించియున్నాడు. జగత్తును సృష్టించిన బ్రహ్మను కూడా సృష్టించినవాడు మహేశ్వరుడు. మీరీ పురాణసంగ్రహమును వినుడు. ఈ పురాణము అంతా మహేశ్వరుని స్వరూపము. ఆయన సృష్టి కాలములో ప్రాణులను సృష్టించి, ప్రళయ కాలములో తనలో లీనము చేసుకొనిన వృత్తాంతమంతయు ఇందులో కలదు అని బ్రహ్మ చెప్పెను. (1)

ద్వాదశ వార్షిక యాగము

అటు పిమ్మట శుక్రుడు :

"తపస్సే ధనముగాగల ఆ ఋషులు సూతునితో మరల ఇట్లు పలికిరి : 'ఆశ్చర్యమును గొలిపే కర్మలను ఆచరించు ఆ మహర్షులు సత్రయాగమును ఎచట చేసిరి? ఎంత కాలము చేసిరి? ఆ యాగము జరిగినవిధమెట్టిది? వారికి వాయుదేవుడు పురాణమును చెప్పిన విధమెట్టిది? ఈ విషయములను విస్తరముగా చెప్పుము. మాకు కుతూహలము అధికముగా నున్నది. అని ఇట్లు పలకగా ప్రేరితుడై సూతుడు శుభకరములగు పలుకులతో ఇట్లు పలికెను.

బ్రహ్మవేత్తలగు ఈ ఋషులు శ్రేష్ఠమగు సత్రయాగమును ఆచరించిన స్థలమును, ఆ యాగము జరిగిన కాలమును, జరిగిన విధమును వినుడు. పూర్వము జగత్తును సృష్టించిన ఆ ఋషులు జగత్తును సృష్టించాలనే కోరిక గలవారై, వేయి సంవత్సరములు పవిత్రమగు సత్రయాగమును చేసిరి. దానియందు సూర్యుడు యజమాని, బ్రహ్మ స్వయముగా బ్రహ్మత్వమును చేపట్టెను. భూమి యజమాని పత్ని. మహాత్ములగు ఋషులు నిర్వహించిన ఆ సత్రమునందు బుద్ధిమంతుడు, మహాతేజశ్శాలియగు యముడు శమితగా ఉండెను. వారు ఆ సత్రయాగమును నైమిశారణ్యమునందు వేయి సంవత్సరములు అనుష్ఠించిరి. పరుగిడుచున్న ధర్మచక్రము యొక్క అంచు (నేమి) ఒక ప్రదేశములో

శిథిలమయ్యెను. ఆ స్థానమునకు నైమిశము అను పేరు వచ్చెను. ఆ స్థలమును ఋషులు పవిత్రముగా భావింతురు.

నైమిశమునందు సిద్ధులచేత, చారణులచేత సేవింపబడు పవిత్రమగు గోమతీనది కలదు. రోహిణి అచటనే సౌమ్యుడు అను కుమారుని కనెను. మహాత్ముడగు వసిష్ఠునకు అచటనే జ్యేష్ఠ కుమారుడగు శక్తి జన్మించెను. నైమిశమునందు అరుంధతికి గొప్ప తేజశ్శాలురగు వందమంది కుమారులు జన్మించిరి. అచటనే శక్తి కల్మాష పాదమహారాజును శపించెను. అచటనే విశ్వామిత్ర వసిష్ఠులకు వైరము కలిగెను. ఆ నైమిశమునందే అదృశ్యంతికి పరాశరుడు జన్మించెను. పరాశరుడు జన్మించినప్పటికీ, వసిష్ఠునకు (పుత్ర వినాశ రూపమగు) పరాభవము తప్పలేదు. అట్టి నైమిశమునందు బ్రహ్మావాదులగు ఆ మహర్షులు సత్రయాగమును చేసిరి. నైమిశమునందు సత్రయాగమును అనుష్ఠించుటచే, ఆ మహర్షులకు నైమిశేయులు అను పేరు కలిగెను.

ఆ మహర్షులు సత్రయాగమును జరుపుచుండగా పన్నెండు సంవత్సరములు గడిచెను. అపుడు పరాక్రమ వంతుడగు అగు పూరూరవసుడు భూమిని పాలించుచుండెను. పూరూరవసునకు రత్నములయందు లోభము మెండు. ఆతడు సముద్రములోని పద్దెనిమిది ద్వీపములను తన వశము చేసుకొనెను. అయిననూ, ఆతని రత్నకాంక్ష తీరలేదు. దేవహూతి చేత ప్రేరేపించబడిన ఊర్వశి పురూరవసుని కామించెను. ఆతడు దేవవేశ్య ఊర్వశితో కూడి ఆ సత్రయాగమునకు వచ్చెను.

ఆ మహారాజు సన్నిధిలో నైమిశీయుల సత్రయాగము కొనసాగుచుండెను. పూర్వము అగ్నివలన గంగ గర్భమునుదాల్చి, గర్భమునందలి తేజోమయమగు పిండమును పర్వతమునందు విడువగా, అది బంగారమాయెను. ఆ మహర్షుల యాగవేదిక ఆ బంగారముతో నిర్మింపబడెను. మహాతేజశ్శాలురగు, ఆ ఋషుల యాగము కొరకు నిర్మించెను. ధీమంతుడగు విశ్వకర్మ లోకక్షేమమును గోరి, స్వయముగా ఆ యజ్ఞవాటి కను ఇలా కుమారుడగు పురూరవసుడు అడవిలో వేటాడుతూ, ఆ స్థలమునకు వచ్చి, అచట బంగరు యజ్ఞవాటికను చూచి, గొప్ప ఆశ్చర్యమును పొందెను.

లోభము వలన నశించిన వివేకముగల ఆ పురూరవ మహారాజు, బంగరు యజ్ఞవేదిని తన అధీనము చేసుకొనుటకు యత్నించగా, నైమిశేయులగు ఋషులకు తీవ్రమగు కోపము కలిగెను. క్రుద్ధులగు ఆ మహర్షులు దైవముచే ప్రేరితులై, ఉదయ సమయములో ఆ రాజును దర్భలు అను వజ్రములతో కొట్టిరి. దర్భవజ్రములచే కొట్టబడిన ఆ రాజు దేహ

మును చాలించెను. అపుడు, ఆరాజునకు ఊర్వశియందు జన్మించిన కుమారుని చక్రవర్తిని చేసిరి. ఆ కుమారుడే నహుషుడు. ఆ మహాత్ముడగు రాజు ధర్మబుద్ధి గలవాడై, ఆ మహర్షుల యెడ యోగ్యమగు వర్తనము కలిగియుండెను. ఆతని పేరు ఆయుషుడు. శక్తిశాలియగు ఆ మహారాజును బ్రహ్మవేత్తలగు మునులు ఓదార్చిరి. అపుడా మహర్షులు ధర్మము యొక్క అభివృద్ధి కొరకు యథాశాస్త్రముగా యజ్ఞమును మరల కొనసాగించిరి. వారి ఆ సత్ర యాగము గొప్ప విస్మయమును కలిగించెను. జగత్తును సృష్టించగోరి పూర్వము జగత్ స్రష్టలగు మహర్షుల యాగమువలె అది భాసించెను. ఆ యాగమునందు వారి ప్రియ మిత్రులగు వైఖానస, వాలఖిల్య, మరీచిక మహర్షులు, సూర్యునితో, అగ్నితో సమమగు తేజస్సుగల ఇతర ఋషులు, పితృదేవతలు, దేవతలు, అప్సరసలు, సిద్ధులు, గంధర్వులు, నాగులు, చారణులు కూడా పాల్గొనిరి.

ఆ యాగశాల పవిత్రమగు సంభారములతో ఇంద్రసభవలె విరాజిల్లుచుండెను. మహర్షులు దేవతలను స్తోత్రములతో, గ్రహము (సోమమును నింపే చెక్కపాత్ర)లతో ఆరాధించిరి. పితృకర్మలతో పితృదేవతలను ఆరాధించిరి. గంధర్వులు మొదలగు వారిని శ్రద్ధతో యథావిధిగా ఆరాధించిరి. కర్మల మధ్యలో, గంధర్వులు సామగానము చేసిరి. అప్సరసల గణములు నృత్యము చేసినవి. మునులు చిత్రములగు పదములతో కూడిన మంగళాశీస్సులను పలికిరి. మంత్రములు మొదలగువాటి స్వరూపమును ఎరిగిన విద్వాంసులు పరస్పరము సంభాషించుకొనిరి. వితండవాదులు (స్వీయపక్షము లేకుండగనే వాదించువారు) ప్రతివాదులను ఓడించిరి.

సాంఖ్య, న్యాయాది శాస్త్రములలో పండితులైన మహర్షులు ఆ యాగములో ఉండిరి. అచట బ్రహ్మరాక్షసులు పాపములను ఆచరించుట గాని, దైత్యులు యజ్ఞమునకు హాని చేయుటగాని, అసురులు యజ్ఞసంభారములను అపహరించుట గాని లేదు. ఆ యజ్ఞములో ప్రాయశ్చిత్తముగాని, ఇతరులకు హాని కలిగించే కర్మగాని లేదు. ఈ విధముగా ఆ మహర్షులు తమ శక్తిని, విద్వత్తును, కర్మ సామర్థ్యమును కలబోసి, సత్రయాగమును పన్నెండు సంవత్సరములు యథా విధిగా అనుష్ఠించిరి. జ్ఞానులగు, భృగువు మొదలైన మహర్షులు అయుతము (10,000) దక్షిణగాగల జ్యోతిష్టోమ యాగములను వేర్వేరుగా ఒక దాని తరువాత మరియొకటి అనుష్ఠించిరి.

ఓ ద్విజులారా! మీరు నన్ను కోరిన విధముగనే, ఆ ఋషులందరు యజ్ఞమును పూర్తి చేసుకొని, మహాప్రభువు, అనంత స్వరూపుడు అగు వాయువును కోరిరి. వారిచే పురాణము కొరకు ప్రేరితుడై, వాయుదేవుడు వారికి ఈ పురాణమును చెప్పెను. వాయు

దేవుడు పరమేశ్వరునకు శిష్యుడు, సర్వమును ప్రత్యక్షముగా చూచువాడు; వశి. ఆయన అణిమ మొదలగు ఎనిమిది ఐశ్వర్యములతో కూడినవాడు. పశుపక్ష్యాది సర్వ ప్రాణులను భరించువాడు ఆయనయే. ఆవహ, ప్రవహ, సంవహ, ఉద్వహ, నివహ, పరివహ, పరావహ అనే ఏడు స్కంధములయందు వాయుదేవుడు సదా వేగముగా సంచరించుచుండును. సప్త మరుద్గణములు ఆయన అధీనమునందు ఉండును. మహాబలశాలియగు వాయు దేవుడు పృథివి, జలము, అగ్ని అనే మూడు భూతముల రచనా రూపములగు ప్రాణుల శరీరమునకు ప్రాణముపోసి, ఆహారమును జీర్ణమును చేయుటలో అగ్నికి సహకరించుచూ, ప్రాణులను ధరించు చున్నాడు.

ఇంద్రియముల వ్యాపారములచే ప్రేరితములైన, ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములనే అయిదు వాయువృత్తులు (క్రియలు) ప్రాణుల శరీర ధారణమునకు మూలముగ ఉన్నవి. ఆకాశ గుణమగు శబ్దము, స్పర్శతో కూడి గాలికి గుణములు అగును. ఆకాశము నుండి గాలి పుట్టెను. గాలి నుండి అగ్ని పుట్టెనని విద్వాంసులు చెప్పె దరు. అట్టి గాలికి అభిమాని వాయుదేవుడు. ఆయన క్రియా స్వరూపుడు. వ్యాకరణ శాస్త్ర కోవిదుడు. ఆయన సర్వకాలములయందు వీచుచునే ఉండును. పురాణములను ఎరిగిన అట్టి వాయుదేవుడు పవిత్రమగు మనస్సుగల మునులను అందరినీ సంతోషపెట్టు చున్నవాడై, మధురమగు వాణితో పురాణమును బోధించెను. (2)

సృష్టి ప్రకరణము

తరువాత సూతుడు ఈ విధముగా పలికెను :

సర్వశ్రేష్ఠమగు పరాక్రమము, కర్మ, బుద్ధి మరియు తేజస్సు కలిగినట్టియు, అనంత సూర్యుల వర్చస్సు కలిగినట్టియు, ముల్లోకములను సంహరించి, సృష్టించునట్టియు, దేవదేవుడైన మహేశ్వరునికి నమస్కారము. ముల్లోకములలో పూజింపబడు ప్రజా పతులను, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను, భృగువును, మరీచిని, మనువును మరియు, రజస్తమో ధర్మ ములు గల కశ్యపుని, వసిష్ఠుని, దక్షుని, అత్రిని, పులస్త్యుని, కర్దముని, రుచిని, సూర్యుని, క్రతువును, అంగిరస మహర్షిని, ప్రజాపతిని, మరియు పులహుని మనసా స్మరించి, శిరసా నమస్కరించెదను.

మరియు, ఇరువది ఒకటవ ప్రజాపతియగు చుక్రోధనునికి నమస్కరించెదను. పురా తనులు, శాశ్వతులు, తమ తమ శిష్య గణములతో కూడి ఉన్నవారు. ధైర్యము (జ్ఞానము)తో శోభించువారు అగు ఇతర ఋషులకు నమస్కరించెదను. తపస్సు, సదాచారము, దయలతో

కూడిన బృహస్పతి శుక్రాది మునిపుంగవులకు నమస్కరించి కలి యొక్క పాపమును పోగొట్టే పురాణమును చెప్పెదను వినుడు :

ప్రజాపతియొక్క ఈసృష్టి సర్వశ్రేష్ఠమైనది. దీని యందు ఇంద్రుడు, దేవ గణములు, ఋషి గణములు విరాజిల్లుచున్నవి. తపోధనులు, మహా తేజశ్శాలురు అగు ప్రజాపతులు శుభమైన, సాటిలేని, పుణ్యశాలియగు, ఋషి పూజితమగు సృష్టిని కూడా వర్ణించెదను. బ్రహ్మయొక్క పగలు ప్రారంభమయ్యే వేళలో ఆయన సృష్టి సామర్థ్యము, ఈ జగద్రూపముగా ప్రకటితమయ్యెను. వేదమునందు, స్మృతులయందు వర్ణింపబడి, వాయుదేవునిచే కీర్తింప బడిన ఈ మహామహిమాన్వితమగు సృష్టిని వివరించెదను.

ఈ పురాణము సుందరమగు సమాసములతో, విశిష్టమగు శబ్దములతో మనస్సునకు ఈశ్వరుని సంకల్పముచే ఆహ్లాదమును కలిగించును. దీని యందు ఈశ్వరుని సంకల్పముచే ప్రధానము నుండి బయలుదేరిన ప్రథమ సృష్టి నిబంధింపబడినది. జగత్కారణము, ప్రమాణ గోచరము కానిది, ప్రకృతికి మూలము, ఆత్మరూపముగా హృదయగుహ యందు ప్రకాశించే ద్రష్టయగు పరబ్రహ్మము వర్ణింపబడినది. క్షేత్ర స్వరూపము, మరియు అక్షర శబ్దవాచ్యుడు, అమృత స్వరూపుడు, శుద్ధ జ్ఞానస్వరూపుడు, నిత్యుడు అగు జీవుని స్వరూపము, ముల్లోకములకు పితామహుడగు బ్రహ్మను సృష్టించిన అప్రమేయుడు (ప్రమాణములకు అందనివాడు) అగు పరమాత్మ స్వరూపము నిరూపింప బడినవి.

రజోగుణ ప్రధానుడగు సృష్టికర్త సృష్టి కాలమునందు కర్మఫలానుసారముగా, క్షేత్రజ్ఞుని (జీవుని)తో గూడిన, పాంచ భౌతిక వికారములగు దేహములను సృష్టించి, ఆ ప్రాణుల ద్వారా వాటి వాటి సంతానము వృద్ధియగునట్లు ఏర్పరచెను. జగద్రూపముగా పరిణమించిన ప్రకృతియందు మహేశ్వరుడు సంకల్ప మాత్రముచేతనే, తన ఎనిమిది అవస్థా విశేషములను (మూర్తులను) సృష్టించెను. దేవతలు, అసురులు, పర్వతములు, వృక్షములు, సముద్రములు, మనువులు, మహారాజులు, ఋషులు, పితరులు, ద్విజులు, పిశాచములు, యక్షులు, నాగులు, రాక్షసులు, నక్షత్రములు, గ్రహములు, సూర్యుడు, సప్తర్షి మండలము, నిశాచరులు, మాసములు, ఋతువులు, సంవత్సరములు, రాత్రులు, పగళ్ళు, దిక్కులు, కాలము, యోగములు, యుగములు, అయనములు, వనములు, ఓషధులు, లతలు, సరస్సులు, అప్సరసలు, పశువులు, విద్యుత్తు, వర్షము, మేఘములు, పక్షులు మొదలగు వాటిగతి, విభాగము ఈ పురాణము నందు వర్ణింపబడినవి. భూమి యందు, ఆకాశము నందు ఉండే సూక్ష్మ గమనముగల ప్రాణులు మరియు చెట్లు మొదలగు కదలని ప్రాణులు

(అచేతనములు) ఇత్యాది సర్వప్రాణుల గతి, విభాగముల దీనియందుగలదు, ఛందస్సులు, వేదములు, ఋక్కులు, యజుస్సులు, సామలు, సోమము మరియు యజ్ఞము దీనియందు వర్ణింపబడినవి. ఆ బ్రహ్మ దేవుడు తన అభిమతమును అనుసరించి వివిధ ప్రాణులకు జీవికను కల్పించుటను చెప్పుటకు ముందుగా వైవస్వత మనువుయొక్క పుట్టుక వర్ణింప బడినవి. ముల్లోకములయందు పూజింపబడే ఇంద్ర, బృహస్పతి, మన్వాది ధీశాలుర పుట్టు కచే, ఈ సృష్టి పూర్ణమై ప్రకాశించినది. అట్టి ఆ పుణ్యాత్ముల ఉత్పత్తి కూడా వర్ణింపబడినది.

రుద్రుని శాపముచే దక్షుడు మనుష్య లోకములో జన్మించి, నియమబద్ధముగా జీవించుట, దక్షుడు రుద్రునకు ప్రతిశాపమును ఇచ్చుట. మన్వంతరములు మారుచుండుట, యుగములయందు జరిగు సృష్టి ప్రళయములు, ఋషి ధర్మము, యుగాదుల యందు దానివృద్ధి వర్ణింపబడును. ద్వాపరయుగములందు వేద విభాగముచేసిన వ్యాసుల క్రమము, కల్పములోని సంవత్సరముల సంఖ్య, లోకముల సంఖ్య, బ్రహ్మయొక్క దినములోని కాల మానము అను విషయములు ఈ పురాణములో నిబంధింపబడినవి.

అండజములు (గ్రుడ్డు నుండి పుట్టే పక్ష్యాదులు), ఉద్భిజములు (భూమి నుండి పుట్టే వృక్షాదులు) స్వేదజములు (చెమట నుండి పుట్టే నల్లులు మొదలైనవి), జరా యుజ ములు (గర్భమునుండి పుట్టే మనుష్యాదులు) అను నాల్గురకముల ప్రాణులు, స్వర్గాది లోకములను పొందు ధర్మాత్ములు, నరకములో యాతనలను అనుభవించు జీవుల వివర ములు ఈ పురాణములో సోపపత్తికముగా వర్ణింపబడినవి. ఆత్యంతిక ప్రళయము (జగత్తు ఈశ్వరుని యందు విలీనమగుట), ప్రాకృతిక ప్రళయము (దేహము పతనమగుట), నైమిత్తిక ప్రళయము (నిద్రలోనికి జారుకొనుట), బంధ మోక్షములు, సర్వోత్కృష్టమగు ప్రాజాపత్య స్థానముతో కూడిన సంసారగతి దీనియందు వర్ణింపబడినవి. ప్రళయమునందీ బ్రహ్మాండములు జగత్కారణమగు ప్రకృతియందు విలీనమై ఉండుట, ఇత్యాది విషయము లను అన్నింటిని ధీశాలురగు మీ ముందు నా బుద్ధిశక్తిని అనుసరించి ఆవిష్కరించెదను. ఓ విప్రులారా! వాయుదేవునిచే మహర్షులకు చెప్పబడిన పురాణమును ఉన్నది ఉన్నట్లుగా చెప్పెదను. వినుడు. (3)

సృష్టి ప్రకరణము

నైమిశారణ్యములో నివసించే ఆ మహర్షులందరు సూతుని మాటలను విని, ఉత్కంఠతో నిండిన కన్నులు గలవారై, సూతునితో "నీవు పురాణములో సమర్థుడవు. వ్యాసుని నుండి సాక్షాత్తుగా ఆ జ్ఞానమును పొందినవాడవు. కావున నీవు ఈ లోకముయొక్క

పూర్వస్థితిని వర్ణింపుము. ఏయే వంశములకు చెందిన మహాత్ములు ఎవరెవరు? అను విషయమును, పూర్వ ఋషుల సృష్టిని, ప్రజాపతి యొక్క విచిత్రమగు సృష్టిని తెలియగోరు చున్నాము అని ప్రార్థించగా మహాత్ముడైన లోమహర్షణుడు అనేక పర్యాయములు వారిచే కోరబడినవాడై పురాణమును విస్తరముగా, సరియగు క్రమములో చెప్పెను.

లోమహర్షణుడు ఇట్లు పలికెను :

మీరు దివ్యము, మధురము, పాపనాశనము అగు కథను కోరితిరి. నేను చిత్రము, అనేకార్థములు కలది, వేదసమ్మతము అగు పురాణమును చెప్పెదను. దీనిని నిత్యము ఎవరు తమ బుద్ధిలో ధారణ చేయుదురో; ఎవరు దీనిని మరల మరల విందురో, ఎవరు మనోనిగ్రహముతో శుచిగా ఉండి దీనిని పర్వదినములలో, పుణ్యక్షేత్రములయందు, దేవాలయములయందు విప్రులకు, విశేషించి యతులకు వినిపించెదరో; అట్టివారు దీర్ఘా యుర్దాయమును పొందుదరు. మరియు, ఈ పురాణమును పఠించువారు ఈ లోకములో తమ వంశమును నిలిపి, స్వర్గలోకములో మహిమను పొందెదరు. ఈ పురాణము చాల విశాలమైనది. దీనిని నేను ఉన్నది ఉన్నట్లుగా, విన్నది విన్నట్లుగా వివరించెదను. శ్రద్ధతో విని తెలుసుకొనుడు. ఇది అందరికీ కీర్తిని పెంచి, ధన్యులను చేయును. శత్రువులను నశింపజేసి, ఆయుర్దాయమును పెంపొందించును. స్వర్గఫలమును ఇచ్చును.

శాశ్వతమగు కీర్తిగల పుణ్యాత్ములందరి చరితము దీనియందు వర్ణింపబడును. సృష్టి, అవాంతర సృష్టి లేదా ప్రళయము, దేవాదుల వంశములు, మన్వంతరములు, రాజ వంశములు అను అయిదు విషయములు పురాణములో వర్ణింపబడును. పావనము లగు వాటిలోకెల్లా పావనమైనది. వేదమునకు అనురూపమైనది అగు వాయుపురాణ మును నియమము, శుచిగలవాడనై నేను ప్రవచించెదను. సృష్టి స్థితి ప్రళయములు, పరమాత్మ నిద్రలేచుట అను అంశములు, మొదటిదగు ప్రక్రియా పాదములో వివరింప బడును. ఇదిగాక, ఉపోద్ఘాత, అనుషంగ, ఉపసంహార పాదములు కూడా కలవు. ధర్మ బోధకము, కీర్తిదాయకము, ఆయుర్వర్ధనము, సర్వపాపహరమునగు ఈ పురాణములోని నాల్గు పాదములను నేను సంగ్రహముగా చెప్పితిని.

ఈ పాదములను నేను మరల క్రమములో విస్తారముగా నుడివెదను. పూర్ణ స్వరూ పుడగు ఈశ్వరుని, జగత్ప్రథముడగు హిరణ్యగర్భుని, జగత్తును సంహరించు శివుని, ప్రాణి రూపముగా ప్రకటితమయ్యే పరమాత్మను, జగత్సృష్టికి మూలము, స్వయంభువు అగు బ్రహ్మకు నమస్కరించెదను. మహత్తు (సమష్టిబుద్ధి) ఆదియందు, పరమాణు విశేష ములు అంతమునందు కల్గినట్టియు, వివిధ రూపములు, లక్షణములు కలిగినట్టియు,

పరమాత్మచే అధిష్ఠింపబడియున్న సాటిలేని ప్రాణి సృష్టిని సంశయ నివారణము అగునట్లు ప్రవచించెదను. జగత్కారణము అవ్యక్తము. అది నిత్యము కారణము. అదియే. కార్యము అదియే. తత్త్వవేత్తలు దానిని ప్రధానమని, ప్రకృతి అనియు వ్యవహరించెదరు. మరియు దానియందు రుచి, వాసన, రంగు శబ్దము, స్పర్శలు లేవు. దానికి పుట్టుక, నాశములేవు. అది నిత్యము, స్థిరము, సనాతనము (త్రికాలా బాధితము) అగు ఈ ప్రధానము తనకు తాను ఆశ్రయముగా కలిగియుండును. ఇదియే జగత్కారణము ఈ ప్రధానము కూటస్థ (నిర్వికార) పరబ్రహ్మ యొక్క స్వరూపమే.

ఆద్యంతములు లేనిది, పుట్టుక లేనిది, ఇంద్రియ గోచరము కానిది (సూక్ష్మము), త్రిగుణాత్మకము అగు అవ్యక్తమే సర్వప్రాణుల దేహములుగా పరిణమించినది. అవ్యక్తము బ్రహ్మకంటే ముందు ఉండెను. అప్పుడది ఇప్పటివలె ఇంద్రియ గోచరము కాని సూక్ష్మావస్థలో నుండెడిది. అప్పుడు ఈ జగత్తు అంతా తమోగుణ రూపముగా అవ్యక్తముచే వ్యాప్తమై ఉండినది. సృష్టికాలమునందు ఆ ప్రధానము (అవ్యక్తము) క్షేత్రజ్ఞుని (పురుషుని)చే అధిష్ఠితమై, త్రిగుణముల సామ్య అవస్థారూపములో నుండెను. తమోగుణము ప్రముఖముగా ఉండెడిదికాదు. ప్రధానము గుణముల సామ్యావస్థనుండి వైదొలగుటచే, మహత్తు పుట్టెను. అవ్యక్త పరిణామమగు ఆ మహత్తు సూక్ష్మ రూపములో ఉండెను. మహత్తునందు సత్త్వగుణము అధికముగా ఉండుటచే, అది ప్రకాశ రూపమై ఉండెను. సమష్టి బుద్ధియగు మహత్తు నుండి వ్యష్టిబుద్ధి జనించెను.

క్షేత్రజ్ఞుని (పురుషుని)చే అధిష్ఠింపబడిన ఆ సమష్టి లింగదేహము (మహత్తు) పుట్టెను. జగత్తులోని పదార్థముల సృష్టికి మూలమైన ధర్మము మొదలగు వాటి రూపములు దానియందు నిహితమై ఉండెను. సృష్టించాలనే కోరికచే ప్రేరితమైన మహత్తు సృష్టిని చేయును. 'మనస్సు', 'మహాన్', 'మతి', 'బ్రహ్మ', 'పురము', 'బుద్ధి', 'ఖ్యాతి', 'ఈశ్వరుడు' 'ప్రజ్ఞ', 'చితి', 'స్మృతి', 'సంవిత్', 'విపురము' అను పేర్లతో విద్వాంసులు దానిని వ్యవహరింతురు. సర్వ వ్యాపకమగు మహత్తు సర్వప్రాణుల విస్తారమగు కర్మ ఫలమును తెలుసుకొనగలిగే సూక్ష్మమగు బుద్ధిగలది. కనుక, దానికి మనస్సు అని పేరు వచ్చినది. మహత్తు తత్త్వములు (సాంఖ్య పరిగణిత పదార్థములు) అన్నింటిలో ముందుగా పుట్టెను. మరియు అది మిగిలిన తత్త్వములన్నింటి కంటే పరిమాణములో పెద్దది. అందువలన దానికి 'మహాన్' అని పేరు వచ్చెను.

మహత్తు పురుషునికి లభించే భోగము యొక్క పరిమాణమును, వివిధ పురుషుల భోగములలోని విభాగమును నిరూపించును. కావున అది 'మతి' అనబడును. ఈ మహత్తు

గొప్ప పరిమాణముగలది. మరియు సృష్టికాలములో దానినుండి మహాశబ్దము వెలువడును. అంతేగాక, మహత్తు, సర్వప్రాణుల రూపములో విస్తారము చెందును. కాబట్టి, అది 'బ్రహ్మ' అనబడును. మహత్తు తన అనుగ్రహమును ప్రాణుల దేహములపై ప్రసరింప జేసి, ఆ పాంచభౌతిక శరీరములను వ్యాపించియుండును. కనుక, దానికి పురము (పూరించునది) అని పేరు వచ్చినది. పురుషుడు ఈ 'మహత్తు' నందు తనకు ఇష్టా నిష్టములగు పదార్థములను అన్నిటినీ దర్శించును. పురుషునకు అట్టి బోధను కలిగించును కనుక, మహత్తునకు 'బుద్ధి' అను పేరుగలదు. పురుషుని భోగము జ్ఞానరూపమున ఉండును. పురుషునికి వివేకము, భోగము కూడా మహత్తు నుండి సంప్రాప్తమగును. కావున, మహత్తునకు 'ఖ్యాతి' అను పేరు గలదు. మరియు, మహత్తు అనేక నామములచే, గుణములచే కీర్తింపబడును. ఆ కారణముచేత కూడా, దానికి ఖ్యాతి అను పేరు వచ్చినది.

మహత్తువలననే పరమాత్మ సర్వజ్ఞుడైనాడు. మహత్తునుండి యే గ్రహములు పుట్టినవి. కావున, దానికి 'ప్రజ్ఞ' అని పేరు. పురుషుడు ఆచరించే యజ్ఞాది కర్మలకు ఫలములైన భోగములను, మహత్తు పురుషునకు సంక్రమింపజేయును. మరియు పురుషునకు జ్ఞాన ప్రకాశము నిచ్చును. కావున, మహత్తునకు 'చితి' అని పేరు వచ్చినది. పురుషుడు భూత, వర్తమాన, భవిష్యత్కార్యములను అన్నిటిని స్మరించగల్గుటలో మహత్తు హేతు భూతమైనది. కాన, ఇది 'స్మృతి' అనబడును. పురుషుడు పొందే సర్వ జ్ఞానమునకు మూలము మహత్తు. కాన, దానికి 'మహాత్మ్యము' అని పేరు. పురుషుడు జ్ఞానమును అంతనూ మహత్తునందు పొందుటచే, దానికి 'సంవిత్' అని పేరు వచ్చినది. సర్వము దాని యందు ఉన్నది. అది సర్వమునందు ఉన్నది. ఈ కారణముచేత గూడా పండితులు మహత్తును 'సంవిత్'అని పిలుతురు. 'మహత్తు' జ్ఞాన రూపము. భగవానుడు జ్ఞానమునకు సన్నిధిలో ఉండును. మహత్తు స్త్రీ పురుష ద్వంద్వ రూపములో విపులమగు జగద్రూపముగా విస్తరించుటచే, పండితులు దానిని 'విపుర(ల)ము' అని వర్ణింతురు.

ఈ సర్వజగత్తును శాసించు పరమాత్మ సర్వవ్యాపకుడు. కనుక, బ్రహ్మ అని నిర్దేశింపబడును. ఉనికి ఆయన స్వరూపము గనుక, ఆయన భవుడనబడును. క్షేత్రము (దేహము), క్షేత్రజ్ఞుడు (పురుషుడు) అను వాటి సత్యమును ఎరిగినచో, బ్రహ్మ మొక్కటియే సర్వముగా భాసించుచున్నదని స్పష్టమగును. కావున, ఆ పరమాత్మకు 'కః' (ఒక్కటే) అనిపేరు. దేహము అను నగరమునందు నివసించును గాన, పరమాత్మకు పురుషుడని పేరు. పరమాత్మకు పుట్టుక లేదు; పరమాత్మ సనాతనుడు; కావున, ఆయనకు స్వయంభువు అనిపేరు. ఈ తీరున, సర్వోత్కృష్టము, సర్వాది అగు ఈశ్వరతత్త్వము, తత్త్వజ్ఞులగు

ఋషులచే అనేక పదములతో పిలువబడును. (అట్టి ఈశ్వరునిచే అధిష్ఠింపబడిన) మహత్తు సృష్టించవలెనను కోరికతో ప్రేరితమై, వివిధ రకములుగా సృష్టిని చేసెను.

మహత్తునందు సంకల్పము, అధ్యవసాయము (నిశ్చయము) అను రెండు వృత్తులు కలవు. జగత్తులో పదార్థతత్త్వములకు కారణమైన పదార్థ ధర్మములు, రూపములు మహత్తు నందు గలవు. అది సత్త్వము, రజస్సు, తమస్సు అను మూడు గుణములను కలిగి ఉండును. ఆ త్రిగుణాత్మకమగు మహత్తునందు రజోగుణము అతిశయించి, అహంకారము పుట్టెను. ఈ సృష్టి మహత్తుచే వ్యాప్తమై ఉన్నది. భూతములకు ఆదియగు మహత్తు యొక్క వికారమే అహంకారము. దాని యందు తమోగుణము అతిశయించి భూత తన్మాత్రలు (భూత సూక్ష్మములు) పుట్టినవి. ఈ భూతతన్మాత్రలు భూతాది అగు అహం కారము యొక్క తామస వికారములు. తరువాత శబ్దము గుణముగా కలిగిన, అవకాశాత్మకమగు ఆకాశము అహంకారము నుండి జన్మించెను.

భూతాది అగు అహంకారము శబ్ద గుణకమగు ఆకాశము నందు వ్యాపించెను. అపుడు శబ్దతన్మాత్ర స్పర్శతన్మాత్రను సృజించెను. భూతాది ఇట్లు వికృతిని పొంది శబ్దతన్మాత్ర అయ్యెను. ఆకాశము నుండి స్పర్శ గుణము కలిగిన, క్రియాశక్తి ప్రధానుడగు వాయువు జన్మించెను. శబ్దతన్మాత్ర స్పర్శతన్మాత్ర యందు వ్యాపించెను. రసము గుణముగా కలవి జలములు, వాటియందు రూపతన్మాత్రలు వ్యాపించెను. రసాత్మకమగు జలములు వికారమును పొంది గంధ తన్మాత్రను సృష్టించినవి. జలముల నుండి పుట్టిన ఘన రూపమగు పృథివికి గుణము గంధమని చెప్పబడినది. జలగుణమగు రసతన్మాత్ర గంధతన్మాత్రయందు వ్యాపించెను. ఇట్లు ఆయా తన్మాత్రలు వికారమును పొంది, ఆయా గుణములుగల పంచభూతములు పుట్టెను. ఆయా గుణములు ఆయా భూతములకు అసాధారణములు అగుటచే తన్మాత్రలనబడును.

ఈ తన్మాత్రలయందు శాంత (సుఖానుభవము), ఘోర (దుఃఖానుభవము), మూఢ (అజ్ఞానానుభవము) అను విశేష లక్షణములు లేకపోవుటచే, వాటికి అవిశేషములని పేరు వచ్చెను. ఈవిధముగా భూతములు, భూతతన్మాత్రలు తామస అహంకారము నుండి ఉద్భవించినవి. సత్త్వగుణము అతిశయించిన సాత్త్విక అహంకారము నుండి, ఏకకాలము నందు అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియములు పుట్టినవి. పురుషునకు ఇంద్రియములు కార్యసాధకములు అగుచుండును. జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు పదకొండవది అగు మనస్సు (ప్రకాశరూపములు అగుటచే) 'దేవ' అనబడును. ఈ

విధముగా వికార రూపమగు ఈ జగత్తు ఆవిర్భవించినది. ఇంద్రియములు రాజస అహం కారము నుండియు, తదధిష్ఠాన దేవతలు సాత్త్విక అహంకారము నుండియు పుట్టినవి అని కూడా చెప్పవచ్చును.

చెవులు, చర్మము, కన్నులు, నాలుక మరియు ముక్కు అను అయిదు జ్ఞానేంద్రియ ములు మనస్సుతో కూడి శబ్దాది విషయములను గ్రహించును. పాదములు, పాయువు, ఉపస్థ, హస్తములు, వాక్కు అనునవి అయిదు కర్మేంద్రియములు కలిసి వెరసి పది అయినవి. అవి క్రమముగా గమనము, విసర్జనము, ఆనందము, చేతిపని మరియు మాటలాడుట అను క్రియలను నిర్వర్తించును. ఆకాశములోని శబ్దతన్మాత్ర స్పర్శ మాత్రలో ప్రవేశించుటచే, వాయువునకు శబ్దము, స్పర్శ అను రెండు గుణములు కలిగెను. అటులనే, శబ్దస్పర్శలు రెండు రూపమును ప్రవేశించుటచే, అగ్నికి శబ్ద, స్పర్శ, రూపములనే మూడు గుణములు కలిగెను.

శబ్ద స్పర్శ రూపములు రసతన్మాత్రను ఆవేశించుటచే, రసాత్మకములగు జలముల యందు నాల్గు గుణములు గలవు. ఈ నాల్గు గుణములు గంధమాత్ర యందు సమావేశమై పృథివియందు ఉన్నవి. అందువలన స్థూలభూతములలో పృథివియందు ఐదు గుణములు గలవు. ఈ పంచ భూతములలో శాంత, ఘోర, మూఢములను గుణములు ఉండుటచే వాటికి విశేషములు అనిపేరు. ఈ భూతములు ఒక దానితో మరియొకటి కలిసి, ఒకదానికి మరియొకటి ధారకములు అగుచున్నవి. లోకాలోక పర్వతముతోసహా ఈ సర్వము భూమి యందు అంతర్భాగములై ఉన్నవి.

పంచభూతములలో ప్రతి భూతమునకు ప్రత్యేకముగా తనదైన విశేషము (అసాధారణ గుణము) ఉండును. ఆయా విశేషములు ఇంద్రియములకు గోచరమగును. ఆకాశము నుండి పృథివివరకు క్రమముగా ముందు వాటి గుణములు తరువాతి వాటికి సంక్ర మించును. కాని, ఒక విశిష్ట భూతము తన అసాధారణ గుణముచేతనే గుర్తింప బడును. కొందరు శుచియగు వాయువును పొంది, అవివేకముచే గంధము వాయు గుణమని పొరబడుదురు. వాస్తవములో, పృథివీ గుణమగు గంధము వాయువునకు పృథివీ సంపర్క మువలన కలిగినది. ఈ ఏడింటిలో ప్రతి ఒక్క తత్త్వము గొప్పదియే – కాని, అవి విడివిడిగా ఇతరతత్త్వములతో కలియకుండా ప్రజలను, ఇతరప్రాణులను సృష్టింపలేక పోయినవి. ఈ గొప్ప తత్త్వములు ఒక దానితో మరియొకటి దగ్గరగా వచ్చినవి. మరియు, పురుషునిచే అధిష్ఠింపబడినవై, మహత్తు మొదలుకొని విశేషముల (పంచభూతముల

అసాధారణ గుణములు) వరకుగల ఈ తత్త్వములు అవ్యక్తము (ప్రకృతి) యొక్క అను గ్రహముచే అండమును సృష్టించును.

నీటి నుండి బుడగ పుట్టిన విధముగా, విశేషముల నుండి పెద్ద అండము ఒకటి క్షణ కాలములో పుట్టి మహాజలరాశియందు ఉండెను. ఈ విధముగా సృష్ట్యాదిలో ప్రకృతి నుండి అండము ఉద్భవించగా, పరబ్రహ్మ అని పేరుగాంచిన క్షేత్రజ్ఞునకు జగత్కర్తృ త్వము సిద్ధించెను. క్షేత్రజ్ఞునకు పురుషుడనియు పేరు గలదు. సృష్ట్యాదిలో సర్వజీవులను సృష్టించిన ప్రథమ జీవుడగు బ్రహ్మ మున్ముందుగా జన్మించెను. పరబ్రహ్మమని పిలువబడే క్షేత్రజ్ఞుడు ముందుగా నాల్గు ముఖములు గల హిరణ్య గర్భుని రూపములో ప్రకటమయ్యెను. ప్రాణులు సృష్ట్యాదియందు ఇంద్రియములతో కూడి సృజింపబడుదురు. వారు (ఆత్యంతిక, మరియు ప్రాకృతిక) ప్రళయములో దేహములను విడిచిపెట్టుదురు. నూతన సృష్టియందు, తన్మధ్యకాలమునందు కూడ వారు మరల దేహములను పొందెదరు.

గొప్ప ప్రమాణముగల ఆ అండమునకు బంగరు మేరు పర్వతము పిండముగా ఉండెను. సముద్రములే గర్భములోని నీరు ఆయెను. పర్వతములు ఎముకలాయెను. ఈ ఏడు లోకములు ఆ అండమునందు అంతర్భాగములై ఉండెను. ఏడు ద్వీపములతో, ఏడు సముద్రములతో, మహోన్నతమగు పర్వతములతో, మరియు వేలాది నదులతో కూడిన ఈభూమి, ఈలోకములు, ఈబ్రహ్మాండము సర్వము ఆ అండములోపల ఉండెను. చంద్రుడు, సూర్యుడు, నక్షత్రములు, గ్రహములు, వాయువు, లోకాలోక పర్వతము, ఇతరము సర్వము ఆ అండములోపల ఇమిడి యుండెను.

ఆ అండము చుట్టూ (దానికంటె) పదిరెట్లు నీరు, నీటి చుట్టు పదిరెట్లు అగ్ని ఆవ రించి యుండెను. తేజస్సు చుట్టూ పదిరెట్లు వాయువు, వాయువు చుట్టూ పదిరెట్లు ఆకా శము ఆవరించి ఉండెను. ఆకాశము అహంకారముచేత, అహంకారము మహత్తు చేత, మహత్తు అవ్యక్తముచేత ఆవరింపబడి ఉండెను. ఇట్లు ఆ అండము ఏడు ప్రకృతి వికార ములచే ఆవరించబడి ఉండెను. ఇట్లు ఆ ఎనిమిది (అండముతో సహా) ప్రకృతి వికారములు ఒక దానిని మరియొకటి ఆవరించి ఉండెను.

ఇవి స్థితి కాలమునందు ఈ తీరున ఉండి, ప్రళయములో ఒక దానిని మరి ఒకటిగా కబళించి వేయును. ఇట్లు ఇవి ఒక దాని నుండి మరి ఒకటి పుట్టి, ఒక దానిని మరి ఒకటి ధరించి ఉన్నవి. ప్రకృతి వికారములగు ఈ తత్త్వములు ఈ విధముగా ఒక దానిపై మరియొకటి క్రమముగా ఆధారపడి యున్నవి. అవ్యక్తము (ప్రకృతి) నకు క్షేత్రము

అనియు, బ్రహ్మకు క్షేత్రజ్ఞుడు అనియు పేరు. ఈ విధముగా క్షేత్రజ్ఞునిచే అధిష్ఠింప బడిన జగత్సృష్టి పూర్వము సంకల్పము యొక్క సంబంధము లేకుండగనే మెరుపువలె సంభవించెను. ఈ హిరణ్యగర్భుని జన్మయొక్క తత్త్వమును ఎరిగిన మానవుడు ఆయుర్దాయమును, కీర్తిని, సంతానమును పొంది, ధన్యుడగును. మోక్షకాముడగు మానవుడు కూడా ఈ పురాణమును నిత్యము వినుట వలన, అంతఃకరణ శుద్ధిగలవాడై, సుఖమును, క్షేమమును, పరమగతిని కూడా పొందును. (4)

సృష్టి ప్రకరణము

అని చెప్పి మరల లోమహర్షణుడు ఇట్లు పలికెను :

ఓ విప్రులారా! నేను మరియొక కాలములో చేయబడిన సృష్టిని గురించి వివరించితిని. ఈ కాలము పరమేశ్వరునికి పగలు అని తెలుసుకొనుడు. పరమేశ్వరుని రాత్రి పగటితో సమానమైన వ్యవధిని కలిగియుండును. సృష్టికాలము పరమేశ్వరుని పగలు అనియు, ప్రళయము రాత్రి అనియు చెప్పబడును. సామాన్య జనుల క్షేమమును కోరి, పరమేశ్వరునకు పగలేగాని, రాత్రి ఉండదని, ఉపచారము (కల్పన)గా పండితులు చెప్పుదురు. ప్రజలు, ప్రజాపతులగు ఋషులు, మునులు, బ్రహ్మ లోకమునందు ఉండి సనత్కుమారుడు మొదలగు ఋషులు, ఇంద్రియములు, ఇంద్రియ గోచరములగు పదార్థములు, ఐదు మహాభూతములు, తన్మాత్రలు (సూక్ష్మ భూతములు), మనస్సు, బుద్ధి అనునవి జ్ఞానస్వరూపుడగు పరమేశ్వరుని పగటి యందు ఉన్నవి. పగలు పూర్తికాగానే ఆయన యందు లీనమగును. రాత్రి పూర్తికాగానే మరల జగత్తు సృష్టింపబడును. కార్యరూపమగు జగత్తు ఉపసంహరింపబడును. సమస్త ప్రాణులు తమలో లీనము కాగా, ప్రధాన పురుషులు ఇద్దరు సమాన ధర్మముగలవారై ఉండిరి. ప్రధానము (ప్రకృతి) నందు తమస్సత్త్వ గుణములు సమముగా నుండెను. వాటిలో ఒకటి ఉద్రేకమును పొంది నపుడు మరల సృష్టి కలుగును. గుణములు సమముగా ఉన్న అవస్థ ప్రళయ మనియు, గుణములలో విషమస్థితి కలిగినపుడు సృష్టి అనియు చెప్పుదురు. నువ్వు గింజలలో నూనెవలె, పాలలో నేయివలె, రజోగుణము తమస్సత్త్వ గుణములయందు అవ్యక్తమును ఆశ్రయించి ఉండును. పరమేశ్వరుడు రాత్రి భాగమునంతను గడుపగా పగలు ప్రారంభము అయ్యెను. అపుడు మరల ప్రకృతి నుండి సృష్టి బయలుదేరెను. పరమేశ్వరుడు సర్వోత్కృష్ట మగు యోగము యొక్క ప్రభావము వలన, ప్రధాన పురుషుల యందు అండము నందు తీవ్రమగు కదలికను కలుగజేసెను. ఆ విధముగా క్షుబ్ధము చేయబడిన ప్రధానము నుండి రజోగుణము బయల్వెడలెను.

బీజము నుండి అంకురము వచ్చునట్లు చేయునది జలము. అటులనే, గుణవైషమ్యమును పొందిన ప్రధానము నుండి ప్రాణులు జన్మించునట్లు చేయునది రజోగుణము. ఈ విధముగా గుణములలో క్షోభను కలుగజేయగా, ముగ్గురు దేవతామూర్తులు జన్మించిరి. సర్వ ప్రాణులకు ఆశ్రయమైన ఆ దేవతలు సర్వశ్రేష్ఠులు. వారి తత్త్వము తెలియుట దుష్కరము. వారు శరీరాకారమును ధరించిరి. రజోగుణము బ్రహ్మగను, తమోగుణము అగ్నిగను, సత్త్వగుణము విష్ణువుగను పరిణమించెను. రజోగుణము ప్రముఖముగా గల బ్రహ్మ సృష్టికర్త అయినాడు. తమోగుణము ప్రముఖముగా గల అగ్ని కాలరూపుడైనాడు. సత్త్వము ప్రధానముగా గల విష్ణువు ఉదాసీనుడుగ నున్నాడు. ఈ ముగ్గురు దేవతలు మూడు వేదములుగను, మూడు అగ్నులుగను ప్రకాశించుచున్నారు. వీరు పరస్పర సహకారముతో జగత్కార్యమును నిర్వహించుచున్నారు.

వీరు ఒకరిని మరియొకరు ధరించుచున్నారు. ఒకరికి మరియొకరు ఆధారముగా, ఒకరితో మరియొకరు కూడి, జగత్కార్యమునందు ప్రవర్తిల్లుచున్నారు. వీరు ఒకరినొకరు విడిచి క్షణకాలమైననూ ఉండరు. దేవతలకుకూడా దైవము పరమేశ్వరుడు. మహత్తుకంటె ఉత్కృష్ట మైనవాడు విష్ణువు. రజోగుణముయొక్క ఉద్రేకము గల బ్రహ్మ సృష్టి కార్యమునందు ప్రవర్తిల్లును. పురుషుడు పరుడు (సర్వోత్కృష్టుడు) అనియు, ప్రకృతి పర (సర్వోత్కృష్టమైనది) అనియు చెప్పబడినది. ఈ ప్రకృతి మహేశ్వరునిచే అధిష్ఠితమై, సర్వదా ఆయనచే ప్రేరితమై ప్రవర్తిల్లుచున్నది. బ్రహ్మ మొదలగు మహాత్ములు తదనుసారముగా తమ క్షేత్రములలో తమ ధర్మములను ప్రేమతో నిర్వర్తించుచున్నారు.

గుణములలో విషమస్థితి ఏర్పడుట వలన ప్రధానము (ప్రకృతి, అవ్యక్తము) ఈశ్వరాధిష్ఠితమై జగత్సృష్టియందు ప్రవర్తిల్లుచున్నది. ప్రధానము కారణ రూపములో అసత్ అనియు, కార్యరూపములో సత్ అనియు చెప్పబడుటచే (సత్ + అసత్ ఆత్మకము) సదసదాత్మకమగును. బ్రహ్మ, మహత్తు అను జంట దాని నుండి ఒక్కసారిగా పుట్టెను. పంబ్రహ్మ అనబడు క్షేత్రజ్ఞుడు అవ్యక్తమును వ్యాపించి, దేహేంద్రియములతో కూడి బ్రహ్మ రూపములో సృష్ట్యాదియందు ప్రకటమయ్యెను. ప్రథమ జీవుడగు బ్రహ్మ బుద్ధిశాలియై, తేజశ్శాలియై ప్రకాశించెను.

ఆ ప్రథమ జీవుడు జగత్సృష్టి యందు ప్రవర్తిల్లెను. ఆయన సాటిలేని జ్ఞానముతో, ఈశాన శక్తితో, ధర్మముతో, జ్ఞాన వైరాగ్యములతో ప్రకాశించెను. ప్రథమ శరీరాభిమానియగు బ్రహ్మ బుద్ధి ధర్మముతో, ఈశన శక్తితో నిండియుండెను. ఆయన మనస్సులో

దేనిని సంకల్పించిననూ, అది అవ్యక్తమునుండి పుట్టుచుండెను. ఆయన స్వభావముచేతనే జితేంద్రియుడు, విశేషగుణ సంపన్నుడు, దేవతలకు అధిపతి అగుట వలన ఇది సంభవ మయ్యెను. పురుషుడు చతుర్ముఖ బ్రహ్మ ఆయెను. ఆయనయే సంహారకుడగు కాల స్వరూపుడాయెను. స్వయంభువు (స్వయముగా ఉండువాడు, పుట్టుక లేనివాడు) అనంత శిరస్సులు గలవాడు (సమస్త ప్రాణిరూపుడు) అగు పురుషునకు మూడు అవస్థలు గలవు. సత్త్వరజస్సులు ప్రముఖముగాగల బ్రహ్మ, రజస్తమస్సులు ప్రముఖముగా గల సంహారకుడు, సత్త్వము ప్రముఖముగాగల పురుషుడు అను మూడు గుణ ప్రయుక్తములగు అవస్థలు స్వయం భువు అగు పరమాత్మకు కలవు. ఆయన బ్రహ్మరూపుడై లోకములను సృజించును. సంహా రకుడై లోకములను ఉపసంహరించును. అసంగుడగు పురుషుడు అనునది మూడవ అవస్థ.

బ్రహ్మ పద్మములోపలి భాగమువలె ఉండును. సంహారకుడగు కాలుడు కాటుక కాంతి గలవాడు. పురుషుడు పద్మమువంటి నేత్రములు గలవాడు. పరమాత్మ యొక్క రూపము ఇట్లుండెను. యోగశక్తి సంపన్నుడగు పరమేశ్వరుడు తన లీలచే వివిధ ఆకార ములను ధరించి, వివిధ క్రియలను ఆచరించుచూ, వివిధ నామములతో వివిధ దేహ ములలో ప్రకటమై, మరల వాటిని, అంతర్ధానము ఒనర్చుచుండును. ఆయన మూడు రూపములలో, మూడు వేర్వేరు గుణములతో ప్రకటమగుటచే త్రిగుణుడు అనబడును. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అను నాల్గు రూపములలో విభాగమును పొందుటచే చతుర్వ్యూహుడు అని కీర్తించబడును. జీవదేహమునందు చైతన్య రూపుడుగ ఉండి, సుషుప్తిలో స్వరూపమును పొందును. స్వప్నముతో స్వయంప్రకాశముతో విస్తరిం చును. జాగ్రదవస్థలో విషయ సంస్కారములను అనుభవించును. జీవుని వివిధ అవస్థలలో ఏకరూపము (అహం ప్రత్యయ రూపము)గ ఉండును. కాన, పరమేశ్వరునకు ఆత్మ అను సార్థక నామము కలిగినది. ఆయన సర్వవ్యాపకుడగుటచే ఋషి అనియు, సర్వముపై అధి పతి యగుటచే ప్రభువు అనియు, సర్వమునందు ప్రవేశించుటచే విష్ణువు అనియు కీర్తింప బడును.

సమగ్రమగు ఐశ్వర్యము, కీర్తి, సంపద, జ్ఞానము, వైరాగ్యము అను ఆరు గుణము లకు భగము అని పేరు. అవి కలవాడు గనుక పరమాత్మకు భగవానుడని పేరు. ఆయన రాగమును శాసించువాడు కనుక, 'రాగుడు' అనబడును. ప్రకృతి కంటె ఉత్కృష్టుడు కనుక పరుడు అనియు, రక్షించువాడు గనుక 'ఓం' అనియు కీర్తింపబడును. సర్వమును ఎరిగినవాడు గనుక సర్వజ్ఞుడనియు, సర్వము ఆయన నుండియే ఉద్భవించినది కనుక సర్వుడు అనియు అనబడును. సర్వప్రాణులకు ఆశ్రయము కనుక నారాయణుడు

అనబడును. ఆయన తనను తాను మూడు రూపములుగా విభాగముచేసి, ఒక రూపముతో ముల్లోకముల సృష్టిని, మరియొక రూపముతో స్థితిని, ఇంకొక రూపముతో లయమును చేయుచున్నాడు.

నాల్గుముఖములుగల హిరణ్యగర్భుడు మున్ముందు ఆవిర్భవించెను. ఆయన సర్వమునకు ఆదియందు ఉండుటచే, ఆది దేవుడనబడును. పుట్టుకలేనివాడు గనుక, అజుడు అనబడును. ప్రజలను అందరిని పాలించువాడు గనుక, ప్రజాపతి అనబడును. ఆయన దేవతలందరిలో శ్రేష్ఠుడగు దేవుడు గనుక, మహాదేవుడు అనబడును. సర్వ లోకములకు ప్రభువగుటచే ఈశ్వరుడనియు, మహాపరిమాణము కలవాడు గనుక బ్రహ్మ అనియు, సత్తా (ఉనికి) రూపుడు గనుక 'భూతుడు' అనియు చెప్పబడును. క్షేత్రము (విరాట్ దేహము, లేక ప్రాణి దేహము)ను యెరిగినవాడు గనుక క్షేత్రజ్ఞుడనియు, సర్వ వ్యాపకుడు గనుక విభుడనియు, దేహము (పురము)నందు నివసించువాడు గనుక పురుషుడనియు బ్రహ్మకు నామములుగలవు. పుట్టుక లేనివాడు అగుటచేతను, సర్వమునకు ఆదియందుండుట చేతను పరమేశ్వరునకు స్వయంభువు అని పేరు. యజ్ఞములలో ఆరాధింపబడును గనుక యజ్ఞుడనియు, ఇంద్రియ గోచరము కాని తత్త్వమును దర్శించు వాడు గనుక కవి యనియు ఆయన కీర్తింపబడును.

బ్రహ్మ జ్ఞానముచే ప్రాజాపత్య స్థానమును అతిక్రమించుట సంభవము గనుక ప్రజాపతికి క్రమణుడు అని పేరు. ఈశ్వర స్తుతి రూపములగు వేదములను బ్రహ్మ రక్షించును. ఆయనకు ఆదిత్యుడు, కపిలుడు, అగ్ని, అగ్రజుడు అను నామములు గలవు. బ్రహ్మ యొక్క గర్భమునందు హిరణ్యము (తేజస్సు) ఉండుట వలన, లేదా, ఆయన హిర ణ్యము యొక్క గర్భము నుండి జన్మించుట వలన, హిరణ్యగర్భుడు అయ్యెను. గడచి పోయిన ప్రజాపతుల కాలమును వందల సంవత్సరములలో నైననూ లెక్కించుట సంభ వము కాదు. గడచిపోయిన కల్పముల సంఖ్యను బట్టి బ్రహ్మగారి ఆయుర్దాయము (పరము)లో సగభాగము గడచినది. మరియొక సగము ఆయుష్షు మిగిలినది. ఆ తరువాత ప్రళయము సంభవించును. పరములో అంతర్భాగములుగా ఉండు కల్పములు కోట్లాది సంవత్సరములు గడిచి పోయినవి. ఇంకను అనేక కల్పములు వచ్చుచునే ఉండును.

ఓ ద్విజులారా! ప్రస్తుతములో వారాహ కల్పము గడచుచున్నది అని తెలియుడు. ఇది కల్పములలో మొదటిది. దీనియందు గడచిన, గడచుచున్న, మరియు రాబోవు మనువులు పదునాల్గుమంది కలరు. వీరిలో స్వాయంభువ మనువు ఒకడు. ఆ చక్రవర్తులచే

ఏడు ద్వీపములతో కూడిన, ఈ భూమి అంతా వేయియుగముల కాలము పూర్తిగా పాలింపబడును. వారి ప్రజాపాలనమును వారి తపస్సును విస్తరముగా వివరించెదను వినుడు. ఒక మన్వంతరమును గురించి తెలుసుకున్నచో, రాబోవు మన్వంత రములు అన్నియూ తెలిసినట్లే అగును. గడచిన కల్పములను, వంశములను వర్ణించెదను. వాటిని తెలుసుకొని, రాబోవు వాటి గురించి తదనురూపముగా ఊహించుకొనవలెను. (5)

సృష్టి ప్రకరణము

మరల సూతుడు ఈ విధముగా పలికెను :

జలములు అగ్నినుండి పుట్టినవి. ప్రళయములో అగ్ని నష్టము అయ్యెను. భూమండలము జలములలో మునిగిపోయెను. చరాచరులగు ప్రాణులు నశించెను. అపుడు సర్వము ఒకే జలరాశిగా ఉండి, ఏమియూ తెలియకుండెను. అపుడు అనంతములు అగు నేత్రములు కలిగినట్టియు, అనంతములగు పాదములు కలిగినట్టియు, అనంతము లగు శిరస్సులు కలిగినట్టియు, బ్రహ్మ రూపుడైనట్టి భగవంతుడు నారాయణుడు ఆ జలమునందు నిద్రించెను. ఆయన సత్త్వగుణము యొక్క ఉద్రేకము కలిగి, నిద్రలేచి, సర్వము శూన్యముగ ఉండుటను చూచెను. నారములు అనగా జలములు. జలముల యందు నిద్రించును కనుక, భగవానునకు నారాయణుడు అని పేరు కలిగెను. నరుని (పురుషోత్తముని) నుండి పుట్టుటచే జలములకు నారములని పేరు కలిగెను.

భగవానుడు వేయియుగముల రాత్రి కాలమునందు నిద్రించి, రాత్రి పూర్తి కాగానే సృష్టిని ప్రారంభించుట కొరకై బ్రహ్మను నిర్మించెను. అపుడా బ్రహ్మ ఆ జలమునందు వాయురూపముతో, వర్షాకాలములో రాత్రియందు ఇటునటు తిరుగాడు మిణుగురు పురుగు వలె సంచరించెను. అపుడాయన ఆజలములో భూమి మునిగి ఉన్నదని తెలుసు కొనెను. కాని, ఆ భూమిని పైకి ఎత్తుటకై ఏమి చేయవలెనో ఆయనకు తెలియలేదు. అపుడు పరమేశ్వరుడు తన మనస్సుచే పూర్వకల్పములయందు తాను మరియొక దివ్య దేహమును ధరించిన విధమును స్మరించెను.

సర్వము జలముచే నిండి ఉండుటను, భూమిదాని యందు మునిగి ఉండుటను భగవానుడు చూచి, "నేను ఏ పెద్ద రూపమును ధరించి, ఈ భూమిని పైకి ఎత్తవలెను?" అని ఆలోచించి, నీటిలో ఆడుటయందు అభిరుచిగల వరాహము యొక్క రూపమును స్మరించెను. అపుడు పరమేశ్వరుడు దాల్చిన వరాహమూర్తిని ప్రాణులేవియూ జయించలేవు. అది జ్ఞానరూపమైన, ధర్మము అను పేరుగల వరాహము. అది పదియోజనముల వైశాల్య

మును, వందయోజనముల ఎత్తును కలిగి, నల్లని మేఘమువలె భాసించు చుండెను. దాని, శబ్దము మేఘగర్జనను పోలియుండెను. దాని తెల్లని దేహము పెద్ద పర్వతమును పోలియుండెను. దాని పదునైన దంతములు భయము కొల్పుచుండెను. దాని నేత్రములు మెరుపువలె, అగ్నివలె ప్రకాశించెను. అది సూర్యునితో సమానమైన తేజస్సును కలిగి ఉండెను. దాని భుజస్కంధములు బలిసి, విశాలముగా, గుండ్రముగా ఉండెను. అది సింహమువలె విక్రమముతో నడచెను. దాని కటిభాగము బలిసి ఎత్తుగా ఉండెను. మృదువైన నున్నని దేహముగల ఆ వరాహము శుభ లక్షణములను కలిగి ఉండెను. శ్రీహరి అట్టి విశాలమగు వరాహరూపమును ధరించి, భూమిని పైకి ఎత్తుట కొరకై రసాతలమున ప్రవేశించెను.

వేదవేద్యుడగు పరమాత్మ యజ్ఞ వరాహము యొక్క మూర్తిని తాల్చెను. యజ్ఞము దాని వక్షస్థలము. చితి (యజ్ఞములోని ఇష్టకాచితము) దాని నోరు. అగ్నియే జిహ్వ. దర్భలే రోమములు. బ్రహ్మయే శిరస్సు కాగా, ఆ వరాహము దుర్నిరీక్ష్యముగా ప్రకాశించెను. రాత్రింబగళ్లు కనులు, వేదాంగములు (శిక్షా, వ్యాకరణ, ఛందః, నిరుక్త, కల్ప, జ్యోతిషములు) చెవులకు ఆభరణములు, హోమ ద్రవ్యమగు ఆజ్యము ముక్కు, స్రువము, (హోమము చేయు గరిటె) తుండము కాగా, సామవేద ఘోషయే ఆ వరాహము చేయు పెద్ద శబ్దము అయ్యెను. సత్యము, ధర్మము స్వరూపముగాగల ఆ వరాహము ధర్మము యొక్క పరాక్రమముతో శోభిల్లెను. ప్రాయశ్చిత్త కర్మలు ప్రియముగాగల ఆ యజ్ఞ వరాహము పెద్దఆకారముతో భయమును గొల్పెను. యజ్ఞ పశువు దాని మోకాలు ఆయెను. ఎత్తైన దేహముగల ఆ వరాహమునకు హోమము లింగము కాగా, గొప్ప ఓషధులు బీజము ఆయెను. వేదవేద్యుడగు పరమాత్మ దానిఅంతరాత్మ, మంత్రము దాని పిరుదులు. హోమ ద్రవ్యములగు నేయి, సోమరసము రక్తము అయ్యెను. వేదములు ఆ వరాహము యొక్క స్కంధములాయెను. హోమద్రవ్యముల గంధము కలిగిన ఆ వరాహము హవ్య (దేవతల కర్పింపబడునది), కవ్య (పితృదేవతలకు ఈయబడునది) ముల వేగము కలిగి ఉండెను. యజ్ఞశాలయే దేహము కాగా ఆ వరాహము యజ్ఞీయ దీక్షలతో కూడి విరాజిల్లుచుండెను. యోగశక్తి గల ఆ వరాహము దక్షిణలే హృదయముగా, మహాసత్రయాగము స్వరూపముగా ప్రకాశించెను. ఉపాకర్మేష్టి యొక్క ప్రకాశము గల ఆయజ్ఞ వరాహము ప్రవర్గ్యము (యజ్ఞము లోని ఒక కర్మ) అలంకారముగా కలిగి ఉండెను.

ఆ వరాహము, వైదిక ఛందస్సులు నడిచే మార్గము కాగా, ఛాయయే పత్నికాగా, రహస్యములగు ఉపనిషత్తులు ఆసనముకాగా, మణులు పొదిగిన పర్వత శిఖరమువలె

ఉన్నతమై భాసించెను. జగత్ప్రభువు, ప్రజాపోషకుడు అగు శ్రీహరి ఇట్టి యజ్ఞ వరాహ రూపమును ధరించి, నీటిలో ప్రవేశించి, మునిగి ఉన్న భూమి వద్దకు చేరెను. ఆయన భూమిని సమీపించి, వెంటనే పైకి లేవనెత్తి, దానియందలి సముద్ర జలములను సముద్ర పాతాళములో మునిగియున్న భూమిని లోకహితమునుగోరి శ్రీహరి దంష్ట్రతో పైకి లేవనెత్తెను.

భూమిని సృజించి వహించు భగవానుడు అపుడా భూమిని దాని స్థానమునకు తెచ్చి, మనస్సుతో సంకల్పించి విడిచిపెట్టెను. భూమి ఆ విశాలమగు జలరాశిపై పెద్ద నౌకవలె కన్పట్టెను. భగవానుడు అచట ఉంచుట వలన, భూమి మునిగిపోకుండా ఉండగల్గెను. అపుడు పద్మము వంటి నేత్రములు గల శ్రీహరి జగత్తు స్థితిని కల్పించు ఇచ్ఛగలవాడై, భూమిని విభాగము చేయుటకు నిశ్చయించెను. ఆయన భూమిని సమముగా చేసి, ఆపైన అక్కడక్కడ పర్వతములను సమకూర్చెను. పర్వతములు పూర్వము ప్రళయ కాలాగ్నిచే దహింపబడి, భూమియందు అంతటా చెల్లాచెదురుగా విసిరివేయబడి, క్రుంగిపోయెను. అపుడు ఆచల్లని జలరాశియందు వాయువుచే జలములద్వారా ఒకచోటకు చేర్చబడి రాశులుగా చేయబడి పర్వతములాయెను. ఇట్లు ఒక రాశిగా చేయబడిన తరువాత ఘనీభవించి, కదలిక లేని పెద్ద రాశులుగా అగుట వలన వాటికి అచలములని పేరు వచ్చెను. వాటి నిర్మాణములో వివిధ స్థాయిలలో సంధులు (పర్వలు) ఏర్పడుట వలన పర్వతములని పేరు వచ్చెను.

నీటిలోపల దాగియుండుట వలన గిరులు అనియు, రాశులుగా ఘనీభవించుట వలన శిలోచ్ఛయములనియు పర్వతములకు పేర్లు వచ్చెను. ప్రళయమునందు లోకములు, సముద్రములు, పర్వతములు చెల్లాచెదరు కాగా, కల్పాదియందు మరల మరల విశ్వకర్మ వాటిని యథాభాగముగా విడదీయును. బ్రహ్మ మరల సముద్రములతో, ఏడు ద్వీపములతో పర్వతములతో కూడిన ఈ భూమిని, మరియు భూరాది (భూః, భువః, సువః, మహః) నాల్గు లోకములను సృష్టించెను. ఇట్లు లోకములను సృజించి, ప్రజలను కూడా సృష్టించెను.

స్వయంభువు, భగవంతుడు అగు బ్రహ్మ వివిధ ప్రాణులను సృష్టించగోరెను. ఆయన పూర్వకల్పముల యందలి సృష్టిని పోలిన సృష్టిని చేసెను. ఆయన తన బుద్ధిలో సృష్టిని గురించి ధ్యానము చేయుచుండగా, ప్రధానముతో బాటు అదే కాలములో తమో గుణా త్మకమగు సృష్టి బయల్వెడలెను. ఆ మహాత్ముని నుండి బయల్వెడలిన ఈ అవిద్యా రూపమగు సృష్టియందు తమస్సు, మోహము, మహామోహము, తామిస్రము, అంధము అను ఐదు రకముల శ్రేణులు ఉండెను. సృష్టిని గురించి ధ్యానించగా, ప్రథమ శరీరాభిమానియగు

బ్రహ్మనుండి, కుండచే మూసివేయబడిన దీపమువలె, అన్ని వైపులా తమోగుణముచే (అయిదు విధములుగా) ఆవృతమైన సృష్టి బయలుదేరెను.

ఈశ్వర చైతన్యము లోపల, బయటకూడ వ్యాపించి ఉండును. ఆత్మరూపమగు ఈ చైతన్యము శుద్ధము, నామ రూపములులేనిది. కాని, ప్రథమ సృష్టియగు వృక్ష జాతిలో బుద్ధి, మరియు ముఖమునందు ఉండే ఇంద్రియములు (ముక్కు, నోరు, చెవి, కన్ను), అజ్ఞానముచే కప్పివేయబడినవి. ప్రథమ సృష్టి ఈ విధముగా విఫలమగుటను గాంచి బ్రహ్మ చీకాకుపడెను. అపుడాయన మరియొక సృష్టిని సంకల్పించి మరల ధ్యానము చేయగా, జంతుప్రపంచము సృష్టింపబడెను. జంతువులలో ఆహారగ్రహణము భూమికి సమాంతరముగా ఉండుటచే, జ్ఞానహీనములై అవి తప్పుదారిలో నడుచును (అనగా, ఆజన్మలో ఉన్నతినిపొందలేవు); మరియు విపరీత జ్ఞానమును కలిగి ఉండును.

తత్త్వములలో అహంకారము ఒకటి. ఇది 'నేను' అను రూపములో బుద్ధియందు భాసించును. ఇంద్రియముల అశక్తులు పదకొండు, బుద్ధిలోని దోషములు పదిహేడు. వెరసి ఇరవై ఎనిమిది. తుష్టి తొమ్మిది విధములుగ ఉన్నది. సిద్ధులు ఎనిమిది విధములుగ ఉన్నవి. ఈ తత్త్వములు అన్నియూ సాంఖ్యములో పరిగణింపబడినవి. ఇరువది ఎనిమిది విధముల అశక్తులు (వధలు) జంతు సృష్టియందు ఉండును. పశువులలో అంతరంగము నందు ప్రకాశమున్ననూ, బాహ్యములో అజ్ఞానము యొక్క ఆవరణ గలదు. ఈ విధముగా నిర్మాణమైన రెండవ సృష్టియగు పశుప్రపంచమును చూచి బ్రహ్మ తన అభిప్రాయము వ్యర్థమైనదని భావించెను.

తరువాత తదేకముగా ధ్యానించి, బ్రహ్మ సత్త్వగుణ ప్రధానులగు దేవతలను సృష్టించెను. ఈ మూడవ సృష్టి ఊర్ధ్వ లోకములయందు చేయబడెను. దీనికి ఊర్ధ్వస్రోతస్సు అని పేరు. మానవులు అగ్నిలో వ్రేల్చిన హవిస్సు సూక్ష్మ రూపములో ఊర్ధ్వ లోకమును చేరి, దేవతలకు ఆహారమగును. కావున, దేవ సృష్టికి ఊర్ధ్వ స్రోతస్సు అని పేరు. దేవతలు లోపల, బయట పూర్ణులై, సుఖ సంతోషములతో అలరారుదురు. ఊర్ధ్వ స్రోతస్సులోని దేవతలు లోపల, బయట ప్రకాశము కలిగి ఉందురు. ద్యులోకమునందు సంచరించు దేవతలు సంతుష్టాంతరంగులై ఉందురు. దేవతలతో కూడిన ఈ ఊర్ధ్వస్రోతస్సును సృష్టించి, జగత్ప్రభువగు బ్రహ్మ సంతోషించి, మరల ఇంకొక సృష్టికొరకు నిర్ణయించెను.

జగదీశ్వరుడగు బ్రహ్మ ఇంకనూ ధ్యానించెను. ఆయనది సార్థకమైన ధ్యానము. ఆయన మరియొక సఫలమగు సృష్టిని చేసెను. అవ్యక్తము నుండి శ్రేష్ఠమగు అర్వాక్

స్రోతస్సు ఆవిర్భవించెను. మానవులలో ఆహార గమనముపై నుండి క్రిందకు ఉండుటచే మానవ ప్రపంచమునకు అర్వాక్స్రోతస్సు అని పేరు. మానవులు బుద్ధి ప్రధానులు. వారిలో రజస్తమోగుణములు మూడింటి యొక్క ఆధిక్యము కన్పట్టును. కావున, వారు దుఃఖములను అధికముగా అనుభవిస్తూ, అనేక కర్మలను చేయుచుందురు. వారికి లోపల, బయట కూడా ప్రకాశము కలదు. మానవులు కర్మ ప్రధానులు. వారియందు ఊహ, శబ్దము మొదలగు ఎనిమిది రకముల సిద్ధులు ఉండును. మానవులు ఉన్నతిని పొందగల సమర్థులు. వారు గంధర్వులతో సమమగు లక్షణములను కలిగి ఉందురు. ఈ విధముగా ఈ అర్వాక్స్రోతస్సు తేజోమయమగు సృష్టి అని వర్ణింపబడినది.

అయిదవది అనుగ్రహ సర్గము. ఇది అవిద్య, అశక్తి (ఇంద్రియములకు శక్తి లేక పోవుట), తుష్టి (జ్ఞానము కొరకు శ్రమించాలనే ఆసక్తి లేకపోవుట) మరియు సిద్ధి (అధ్య యనము, దానము ఇత్యాది) అని నాల్గు విధములుగ ఉన్నది. అహంకారము మొదలు సర్వప్రాణుల వరకుగల తత్త్వములకు ఆధారముగా గల మౌలికార్థములు (ఇవి పదిగలవు) ఆరవ సర్గమగును. అవిద్యతోను, అశక్తితోను కూడియున్నది అహంకారము, అవిద్యతోను, అశక్తితోను కూడియున్నది అగు మహత్తు యొక్క సృష్టి మొదటిది, ఆ మహత్తు నుండి పంచ తన్మాత్రల (సూక్ష్మ భూతముల)సృష్టి రెండవది. దీనికి భూత సర్గమని పేరు. ఇంద్రియముల సృష్టి మూడవది. ఈ మూడుకలిసి, సంకల్ప పూర్వకముగా ప్రకృతి నుండి బయల్వెడలిన సృష్టి అగును. నాల్గవది ముఖ్యసర్గము. వృక్ష లతాదులు ముఖ్యములు అనబడును.

తిర్యక్స్రోతస్సు అనబడే పశుపక్ష్యాదుల సర్గము ఐదవది. ఊర్ధ్వ స్రోతస్సులగు దేవతల సృష్టి ఆరవది. దానికే దేవసర్గమని పేరు. ఏడవదియగు అర్వాక్స్రోతస్సుల సృష్టికి మానుష సర్గమని పేరు. ఎనిమిదవది అనుగ్రహ సర్గము. అది సత్త్వ ప్రధానముగను, తమోగుణ ప్రధానముగను కూడ కలదు. ఈ అయిదు వైకృతి సర్గములు అనగా ప్రకృతి నుండి పుట్టిన వికృతుల నుండి పుట్టినవి. ప్రాకృత సర్గములు మూడు. ఈ ప్రాకృత, వైకృత సర్గములు అనగా ప్రకృతి నుండి పుట్టిన వికృతుల నుండి పుట్టినవి. ప్రాకృత సర్గములు మూడు. ఈ ప్రాకృత, వైకృత సర్గములే గాక తొమ్మిదివది అగు కౌమార సర్గముకూడ గలదు. ఇది ప్రాకృతము, వైకృతముకూడా. సంకల్పములేని మూడు ప్రాకృత సర్గములు బయలుదేరగా, బ్రహ్మయొక్క సంకల్పముచే మిగిలిన ఆరు సర్గములు బయలు దేరినవి.

నేను అనుగ్రహ సర్గమును విస్తరముగా వివరించెదను. తెలుసుకొనుడు. అది సర్వ ప్రాణులలో నాల్గు విధములుగా ఉన్నది. విపర్యయము, అశక్తి, తుష్టి మరియు సిద్ధి అను

నాల్గు విధములు దానికి కలవు. వృక్షలతాదులలో విపర్యయము (అజ్ఞానము), పశు పక్ష్యాదులలో అశక్తి, మానవులయందు సిద్ధి, దేవతలయందు తుష్టి కలవు. ఈ తీరున, ప్రాకృత వైకృత సర్గములు తొమ్మిది వర్ణింపబడినవి. ఈ తత్త్వముల పరస్పర సృష్టులు అనేక ప్రకారములుగా ఉన్నవి. మున్ముందుగా బ్రహ్మ తనతో సమానులైన మానస పుత్రు లను సృజించెను. సనందనుడు, సనకుడు, సనాతనుడు అనునవి వారి పేర్లు. వారు గొప్ప జ్ఞానులు, గొప్ప తేజశ్శాలులు. జ్ఞానులు అగు ఆ ముగ్గురు మహాను భావులు తండ్రిచే త్యజింప బడుటచే, సంతానమును కనకుండానే, ప్రళయములో ఈశ్వరుని యందు ఐక్యమును పొందిరి.

వారు అట్లు తొలగిపోగా, బ్రహ్మ వివిధ అధికారములయందు, అభిమానము (నేను, నాది అను ధారణ) గల మానస పుత్రులను మరల సృజించెను. వీరు ప్రళయ కాలములో సర్వ ప్రాణులు నశించువరకు ఉందురు. వీరి నామములను తెలుసుకొనుడు. జలములు, అగ్ని, పృథివి, వాయువు, అంతరిక్షము, దిక్కులు, స్వర్గము, ద్యులోకము, సముద్రములు, నదములు, శైలములు, వృక్షములు, ఓషధులు, లతలు, లవము (సెకను)లు, కాష్ఠ (రెండు సెక నులు)లు కల (నిముషము)లు, ముహూర్తము (48 నిముషములు)లు, సంధ్యలు, రాత్రులు, పగళ్లు, పక్షములు, నెలలు, అయనము (6 నెలలు)లు, సంవత్సరములు, యుగములు అను నవి వాటిపేర్లు. ఈ స్థానాభిమాని దేవతలు ఆయాస్థానముల నామములచే పిలువబడెదరు.

బ్రహ్మముఖము నుండి బ్రాహ్మణులు, వక్షస్థలము నుండి క్షత్రియులు, ఊరువుల నుండి వైశ్యులు, మరియు పాదముల నుండి శూద్రులు జన్మించిరి. ఈ విధముగా వర్ణ ములు అన్నియూ ఆయన దేహము నుండి ఉద్భవించినవి. అవ్యక్తము (ప్రకృతి) కంటే నారాయణుడు ఉత్కృష్టమైనవాడు. అండము అవ్యక్తము నుండి పుట్టినది. అండమునుండి బ్రహ్మ జన్మించెను. ఈలోకములు ఆయనచేత స్వయముగా నిర్మింపబడినవి. ఇంతవరకు నేను మీకు ఈ పురాణములోని ప్రథమ పాదమును విస్తరము కాకుండా, సంగ్రహముగా చెప్పితిని. (6)

ఇంతటితో ప్రక్రియా పాదము సంపూర్ణము

ప్రతిసంధి వివరణ - ఉపోద్ఘాత పాదము

ఇట్లు ప్రక్రియా అను మొదటి పాదము కీర్తింపబడినది. దానిని విని సంతోషముతో నిండిన మనస్సు గలవాడై, కాశ్యపేయ మహర్షి, సూతుని సంబోధించి, తరువాతి గాథను చెప్పుమని కోరెను. కల్పములను ఎరిగిన ఓ మహర్షీ! మాకు ఇప్పుడు గడచిన కల్పమునకు,

గడచుచున్న కల్పమునకు మధ్యగల కాలము (ప్రతిసంధి)ను గూర్చి చెప్పుము. మాకు ఈ ప్రతిసంధినిగూర్చి తెలుసుకొనవలెనను ఇచ్ఛ కలదు నీవు దీనిని వర్ణించుటలో నిపుణుడవు అని వినతి చేయగా....

లోమహర్షణుడు ఇట్లు పలికెను :

ఈ యజ్ఞశాలలో మీకు నేను గడిచిన, గడుచుచున్న కల్పములకు మధ్యగల ప్రతి సంధిని వివరించెదను. గొప్ప యజ్ఞమును చేయుచున్న ఓ ఋషులారా! ఏయే కల్పములలో ఏయే మన్వంతరములు గలవో చెప్పెదను. ప్రస్తుతము గడచుచున్న మంగళ ప్రదమగు వారాహ కల్పమును గురించి కూడా చెప్పెదను. ఈ కల్పమునకు పూర్వమందలి కల్పమును, దానికి దీనికి మధ్యగల కాలమును గురించి తెలుసుకొనుడు.

పూర్వకల్పము పూర్తికాగానే ప్రతిసంధి, మరియు తరువాతి కల్పము జనలోకము నుండి మరల మరల ప్రవర్తిల్లును. ఒక కల్పమునకు మరియొక కల్పముతో సంబంధమును కలుపు కాలము, ప్రతిసంధి అనబడును. కల్పము పూర్తికాగానే సర్వకర్మలు అంతము అగును. ఒక కల్పమునకు మరియొక కల్పముతో సంబంధమును కలిపు ప్రతిసంధియే గాక, మన్వంతరములకు, యుగములకు మధ్యకూడా సంధులు గలవు. వాటి యందు కూడా కర్మలు అంతమగును. ప్రక్రియా పాదములో సంగ్రహముగా చెప్పబడిన కల్పములు మన్వంతరములతో, యుగములతో కూడి ప్రవర్తిల్లుచుండును. బ్రహ్మ యొక్క ఆయుర్దా యము పరము. దానిలో సగము పదార్థము. మొదటి పదార్థములోని అంతిమ కల్పము గడచినది. ఓ ద్విజులారా! ద్వితీయ పదార్థములోని మొదటి కల్పము ప్రస్తుతము నడచు చున్నది. మిగిలిన కల్పములు క్రమముగా రాగలవు. పూర్వ పదార్థము, ద్వితీయ పదార్థము కలిసి పరము అగును. ఇంతవరకు స్థితి కాలము. తరువాత ప్రళయము సంభవించును. వేయి మహాయుగములు, పదునాల్గు మన్వంతరములు కల పూర్వకల్పము గడచిపోయినది.

అప్పుడా కల్పము క్షీణించి దాహకాలము వచ్చినది. అప్పుడా కల్పమున దేవతలు వైమానికులై యుండిరి. నక్షత్ర గ్రహతారలు, చంద్ర సూర్య గ్రహములును, సుకృతాత్ములు (పుణ్యాత్ములు) ఇరువది ఎనిమిది కోటులును ఉండిరి. అట్లే ఒక మన్వంతరమునను పదు నాలుగు మన్వంతరములలోను మూడు వందల కోటులును ఒక కోటి తొంబది రెండును, ఏడు వందల ఎనిమిది వేలును ఉండిరని పూర్వము స్మరింపబడినది. వైమానికు లైన దేవతల కల్పము గడచిన తరువాతగూడ ఒక్కొక్క కల్పమున ఉన్న దేవతలుగూడ వైమానికులుగనే పరిగణింపబడిరి.

అంత పదునాలుగు మన్వంతరములలో స్వర్గమున దేవతలును, పితరులును, మునులును ఉండిరి. వారి సేవకులైన మనుపుత్రులును అట్లే వర్ణాశ్రమ ధర్మములు ఆచరించు వారిచే స్తుతింపదగిన దేవతలు కూడ ఉండిరి. మన్వంతరములలో దేవలోకమున నివసించు దేవతలు వారితో కలిసియున్న వారితో బాటు సంకలనమును (మొత్తముగా లెక్కింపబడిరి) పొందిరి. తుల్యనిష్ఠలుగల ఆ అందరు 'ఆభూత సంప్లవము' (పంచ భూతముల విప్లవము – ప్రళయము) రాగా, ఆ విప్లవములో వారి తంతు గూడ తప్పక జరుగునని తెలిసికొనిరి. ఆ విప్లవము రాగా ముల్లోకములలో ఉండు దేవతలు. ఉత్సాహము వీడిన దుఃఖముతో తాముండు స్థానములను వదిలి కలతచెందిన మనస్సులు గలవారై మహర్లోకమునకు పోవుటకు తలపెట్టిరి. వారు మహస్సులో ఉన్న శరీరములచే (చిన్న శరీరములచే) కూడుకొన్నవారై చక్కగా ఉన్నారు. వారందరు విశుద్ధితో నిండినవారై మానసీ సిద్ధిని పొంది ఉన్నారు. ఆకల్పవాసులతో బాటు మహా(న్) ఫలమును పొందినవారు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, సద్భక్తులైన అపరజనులును. ఆ పదునాలుగు దేవ సంఘములు మహర్లోకమును తలంచి (భావించి) ఉద్వేగము కలవారై జనలోకమునకు పోవుటకై తలపెట్టిరి. విశుద్ధితో నిండినవారై మానసీసిద్ధిని పొంది ఆకల్పవాసులతో బాటు మహా(న్) ఫలమును పొందిరి. పదిమారులు (మంత్రము) ఆవృత్తి చేత జనలోకము నుండి స్వస్తపోలోకమునకు పోవుచున్నారు. అచట పదికల్పములు ఉండి మరల సత్యలోకమునకు పోవుచున్నారు. కల్పవాసులు ఈ క్రమయోగముతో భూలోక, భువర్లోక స్వర్లోక, మహర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకములకు పోవుచున్నారు.

ఈ విధంగా ఒకరొకరి నుండి వేలయుగములు గడచినవి. తిరుగులేని స్థానమైన బ్రహ్మలోకము గూడ పొందబడినది. ఒక ఆధిపత్యముదక్క ఐశ్వర్యములో రూపములో స్థానములో మాత్రము వారు బ్రహ్మతో సమానులగుదురు. అచట వారు సంతోషముతో ఉందురు. బ్రహ్మతో మిక్కిలి కలిసియున్నందున బ్రహ్మానందమును పొంది, తరువాత బ్రహ్మతోసహ వదిలిపెట్టబడుదురు (ముక్తి చెందుదురు). వారు స్వయముగా ముందు ప్రాకృతముగ, తప్పనిసరిగా జరగబోవు అర్థమునందు నానా భావముతో సంబద్ధులైనపుడు తాత్కాల భావులగుదురు. మేలుకొనియున్న వానికి స్వరూపముతో జ్ఞానము బుద్ధి పూర్వము అగును. అట్లే వారి జ్ఞానము తాత్కాలభావియగును.

అభిసూక్ష్మములైన భేదములయొక్క ప్రత్యాహారమునందు (ఉపసంహారమునందు) భిన్నముగా ఉండును. కార్యములు కరణములును వానితోబాటే సృజింపబడును. నానాత్త్వ దర్శనమువలన ఆ బహ్మలోక నివాసులకు వినష్టమైన స్వాధికారము గలవారికి స్వధర్మమున

ఉన్న వారికిని (తాత్కాల భావియైన జ్ఞానము ప్రవర్తించును) వారైతే తుల్య లక్షణులు, సిద్ధులు, శుద్ధాత్ములు, నిరంజనులు. ప్రకృతిలో కారణాతీతులు, స్వాత్మలోనే ఉండువారు. సర్గము (సృష్టి) మరల జరుపబడగా మరల వారికి కారణమగును. తత్త్వదర్శులైన వారు ప్రాకృతమైన (ప్రకృతి సిద్ధమై పామరులు చేయునదైన) సంయోగమున యుక్తులు అగుదురు. ఈ లోకమునకు మరలరాని మోక్షమునందున్నవారు చల్లారిన జ్వాల మరల పుట్టనట్లు, ఇచట మరల పుట్టరు.

అంత ఆ మహాత్ములు త్రైలోక్యము నుండి ఊర్ధ్వమునకు వెళ్లిరి. వారితోబాటు మహర్లోకమునుండి జనులు రారైరి. వారు పోగా మిగిలినవారు కల్పమునకు దేహమును పొందుదురు. గంధర్వులు మొదలు పిశాచుల వరకున్న (దేవయోనులు దేవజాతులు) మనుష్యులు, బ్రాహ్మణులు మొదలగువారు, పశువులు, పక్షులును, కదలలేనివి (పర్వత ములు) ప్రాకునట్టి పాములున్ను, వీరందరు భూమిపై ఉండువారై ఉండగా, ఇచట వేయియై (అనంతములై) భాసించు సూర్య కిరణములు ఏడుగానయి అందొక్కొక్క రవి (సూర్యుడు) పుట్టును.

క్రమముగా ఆ సూర్యులు (ఆకాశముపైకి) లేచుచున్నవారై మూడు లోకములను దహించి వేయుదురు. జంగమమును (తిరుగువానిని) స్థావరమును (కదలక ఉండువారిని), నదులను, సమస్త పర్వతములను (దహించివేయుదురు). అందులో అవి ముందే వర్షము లేనందున ఎండిపోయినవి. సప్త సూర్యులచే (నిప్పంటి) పొగరాజినవి. అపుడు ధర్మా ధర్మాత్మకములైన ఆ సమస్త స్థావర జంగమములు సూర్య కిరణములచే దహించి పోయినవి.

తరువాత పాపయుగము పోయినపుడు దహించిన శరీరములుగలవారు శుభ పాశాను బంధముగల యాయోనిచే వదలిపెట్టబడనివారై (జనలోకమునకు) వెళ్ళిరి.

ఆ తరువాత 'జన' లోకమున జనులు సమానరూపులుగా ఒప్పిరి. వారందరు సర్వ పరిశుద్ధులు, మానసీ సిద్ధిని పొందినవారు. అచట ఒక రాత్రి ఉండి పుట్టుక తెలియని బ్రహ్మయొక్క సృష్టిలో, మరల బ్రహ్మయొక్క మానస ప్రజలుగా పుట్టుదురు. ఆ తరువాత ఆ త్రైలోక్యవాసులు జనలోకములో ఉండగా, సప్త సూర్యులచే ఆ లోకములు దహింపబడగా, వర్షముచే భూమియంతయు వరదలు పారగా ఆలయములు అన్నియు ధ్వంసము కాగా, సముద్రములు మేఘములు భూమిపైన సమస్త జలములు, వీనికి సంబంధించిన జలములు అన్నియు కలిసి ఏక సముద్రముగా అయినవి. పైపైగా వచ్చు ఆ నీరు అధికమై నపుడు ఈ భూమిని అంతయు నీరు కప్పినది. అపుడా భూమి అర్ణవము (సముద్రము) అను పేరుగలదైనది.

ఎందువలననగా వ్యాప్తి దీప్తులలో (సూర్యకాంతులలో) ప్రకాశించుచున్న వైనను, (మనకు) ప్రకాశించుటలేదు. ఆ కాంతులలో గూడ అంతట నీరుపారి వాటిని కప్పివేయు చున్నది. ఆ నీరు భూమి అంతటను వ్యాపించుట వలనను, తనోతి ధాతువు విస్తారము అను అర్థము చెప్పుటచేతను, అవి (కాంతులు) అమ్భస్తనువులని (నీరు శరీరముగా కలవి అని) స్మరింపబడుచున్నవి. 'అర'మన్నది శీఘ్రము అను అర్థమున నిపాతముగా కవులు చెప్పినారు. భూమి ఏకార్ణవమైనపుడు ఆ నీరు శీఘ్రముగా లేదు. కావున అవి నీరములు అయినవి. బ్రహ్మయొక్క ఒక పగలై అది యుగసహస్రాంతముగా, రాత్రి అంతయు నీరు రూపములో ఉండెను. ఆ తరువాత ఆ జలమున భూమిపై అగ్ని నశింపగా, ప్రశాంతమైన వాయువుగా, వెలుగులేని చీకటి అంతట ఉండగా

దీనిని అంతయు అధిష్ఠించినవాడు బ్రహ్మ ఆతడే పురుషుడు, ప్రభువును, ఆతడు ఈ లోకము యొక్క విభాగమును మరల చేయతలచుచున్నాడు. అపుడు ఏకార్ణవమైన దానియందు స్థావర జంగమములు నష్టములు కాగా, ఆ బ్రహ్మపుట్టును. ఆ పురుషుడు సహస్రాక్షులు కలవాడు, సహస్రపాదములు కలవాడు, సహస్ర శిరములు కలవాడు, బంగారు వర్ణములు కలవాడు, ఇంద్రియములకు గోచరము కానివాడు. అపుడు నారా యణుడను బ్రహ్మ జలమున పరుండెను.

సత్త్వోద్రేకము వలన ఆతడు మేలుకొని లోకమును శూన్యముగా చూచెను. ఈ సందర్భమున నారాయణుని గూర్చి ఆపస్సులు అనగా జలముల పేరు విందుము. (ఆ జలములను) నాభిలో నింపి అచట ఉన్నాడు కావున నారాయణుడు అని స్మరింపబడినాడు. వేద మార్గమున నిర్వచింపబడిన ఆ పురుషుడు వేయి తలలు కలవాడు, మంచి మనస్సు గలవాడు, వేయి పాదములు కలవాడు, వేయి కన్నులు ముఖములును కలవాడు, వేయి బాహువులు కలవాడు. ఆతడు మొదటి ప్రజాపతి బ్రహ్మ. సూర్య వర్ణము గలవాడు, భువన మును రక్షించువాడు, ఒక్కడు, పూర్వము లేనివాడు. మొదటి ఇంద్రుడు హిరణ్య గర్భుడైన (బ్రహ్మయైన) మహాత్ముడైన పురుషుడు ఆతడు తమస్సునకు ఆవల ఉండువాడుగా కీర్తింప బడుచున్నాడు. కల్పాదిలో, రజోగుణముచే ఉద్రేకమునందిన బ్రహ్మయై ప్రజలను సృష్టిం చెను. కల్పాంతము వలన తమోగుణముచే ఉద్రేకమును జెందిన కాలుడై మరల ప్రజలను మ్రింగెను.

ఆ నారాయణుడనువాడే సత్త్వ గుణముచే ఉద్రిక్తుడై సముద్రమున పరుండుచు, తనను మూడు విధములుగా విభజించి ముల్లోకములలోను ఉండెను. ఆ మూడింటిచే

(త్రివిధా విభక్త శరీరములచే) వారిని సృష్టించును మ్రింగివేయును, చూచును. అప్పుడు స్థావర జంగమ రూపమైన లోకము ఏకార్ణవము కాగా, నాలుగువేల యుగముల చివర, అంతయు జలముచే ఆవరింపబడగా, నారాయణుడు అను బ్రహ్మ వెలుగులేని సముద్ర మున పరుండుచు, నాలుగు విధములైన ప్రజలను మ్రింగి, బ్రాహ్మీ రాత్రియందు నిద్రించిన కాలుని మహర్లోకము నుండి మహర్షులు చూతురు.

భృగువు మొదలగు ఏడుగురు మహర్షులు ఈ కల్పమున (ఉన్నపుడు) ఉండిరి. ఆ తరువాత ఆ విధముగా ఉండిన సప్తమహర్షులచే పరమైన మహర్లోకము పరిగత మాయెను. మొదట సత్యర్థమైన 'ఋ' ధాతువు నుండి 'ఋషయః' అన్న నామము (పదము) ఏర్పడినది. ఆ కారణమువలన ఋషి పరమైన (ఋషి శబ్దము పరముగా నున్న) మహత్ శబ్దము కావున మహర్షయః అయినది. అపుడు మహర్లోకమున ఉన్న ఆ సప్తర్షులచేత నిద్రించిన కాలము చూడబడినది. కల్పము ముగియగా, ఆ సప్తమహర్షులు సత్యాదులైరి. ఈ విధ ముగా బ్రాహ్మీరాత్రులు (బ్రహ్మమానములోని రాత్రులు) వేలకొలది ముగియగానే, ఇతర మహర్షులు గూడ అట్లే నిద్రించిన కాలమును చూచిరి. కల్పాదిలో పదునాలుగు సంస్థలను అనేక పర్యాయములు బ్రహ్మ కల్పించిన కారణముగా కాలము నిర్వచింప బడినది. ఆ కాలము కల్పాదులలో మరల మరల సర్వ భూతములకు స్రష్ట అగును. ఆ కాలమే వ్యక్తావ్యక్తు డైన మహాదేవుడు (శివుడు) అగును. ఈ జగమంతయు ఆ మహా దేవునిది. ఈ విధముగా రెండు కల్పముల యొక్క ప్రతి సంధి చెప్పబడినది. ఈ ప్రతి సంధి వర్త మాన భూత కాలముల మధ్యన మొదటి (ప్రారంభ) అవస్థ అగును. ప్రతి కల్పమున ఉన్నది ఉండి నట్లు సంగ్రహముగా ప్రతిసంధి చెప్పబడినది. ఇప్పుడీ కల్పమును గూర్చి చెప్పెదను వినుడు. (7)

చతురాశ్రమ విభాగము

సూతుడు ఇట్లు చెప్పెను

ఆతడు (మహాదేవుడు) వేయి యుగములకు సమానమైన రాత్రి కాలమును సాగించి రాత్రి చివర స్వర్గకారణముగా బ్రహ్మత్వమును ధరించు చున్నాడు అపుడు బ్రహ్మయైతే ఆ జలమున బ్రహ్మయై చరించెను. అపుడు ఆ అంధకారమున స్థావరజంగమములు నశించెను. జలము భూమియందు అంతట వ్యాపించెను. భూతములు విభాగములేక ఏకమై అంతట నెలకొన్నవి. ఆ తరువాత వర్షాకాలమున రాత్రియందు మెరుపుతీగవలె, ఆ ఆకాశమున తిరుగాడుచు, ఆ స్వయంభువుడు (బ్రహ్మ) చరించుచుండెను.

మహాదేవుడు నిలచుటకు ఉపాయమును వెదికెను. అంత ఆ జలమునందు భూమి అంతర్గతముగా ఉన్నట్లు తెలిసికొనెను. అనుమానము వలన (ఊహ వలన) భూమిని ఉద్ధరించుటను గూర్చి స్ఫురణకు తెచ్చుకొనెను. పూర్వకల్పములలో ధరించిన వేరొక శరీరమును (వరాహ శరీరమును) అవలంబించెను. ఆ ప్రభువు వరాహ రూపమును ధరించి నీటిలో ప్రవేశించెను. బ్రహ్మ జలములచే కప్పబడిన భూమిని బాగుగా చూచెను. ఆ తరువాత అతడు జలములలో నుండి భూమిని ఉద్ధరించి దానిపైన జలములను ఉంచెను. సముద్ర జలములను సముద్రములలోను, నదీ జలములను నదులలోను పృథివీ జలములను పృథివియందును ఉంచెను. ఆ తరువాత ఆతడు పర్వతములను ఎన్నుకొనెను.

ప్రళయాగ్నిచే పూర్వసృష్టి దహింపబడినప్పుడు ఆ అగ్నిచే భూమి యందంతట ప్రలీనములు అయ్యెను. శైత్యముతో ఏకార్ణవమైన దానియందు (ఏక సముద్రముగా ఉన్న దానియందు) వాయువుచే జలములు హరింపబడినవై, ఎక్కడెక్కడ అంటి పెట్టుకొనబడి ఉండెనో అక్కడక్కడ పర్వతమయ్యెను. అంటుకొని చలింపనందున అచలములైనవి. పర్వములు (కణుపులు పొరలు) ఉన్నందున పర్వతములైనవి. జలములచే నిగీర్ణములగుటచే (మ్రింగబడుటచే) గిరులైనవి. చయనముల వలన (కూర్చుకొన్నందున) శిలోచ్చయములైనవి.

తరువాత ఆ ప్రభువు అంతర్జలముల నుండి భూమిని పైకి లేపి, దానిని తన స్థానమున నిలిపి, మరల దానిని విభాగము జేసెను. ఆ భూమియొక్క ఏడు ద్వీపముల యందు విషయముగా ఉన్న ఏడేడు వర్షములను (భారత వర్షము మొదలగు ఏడు భూ ఖండములను) సమముగాచేసి శిలలచే పర్వతములను కూర్చెను. ఆ ద్వీపములయందు వర్షాంతమున ఇరువదినాలుగు వర్షములు (దేశములును) ఇరువది నాలుగు పర్వతములును నెలకొల్పబడినవి. సృష్ట్యాదిలో అవి సహజముగనే ఉండినవి, కల్పితములుగా ఉండలేదు. సప్త ద్వీపములును సముద్రములును పరస్పరము దగ్గరగా కలిసికొన్నవై, పరస్పరము చుట్టుకొని మండలముగా ఏర్పడినవి.

పూర్వము బ్రహ్మ భూర్లోకము మొదలగు నాలుగు లోకములను అన్ని గ్రహములతో బాటు చంద్ర సూర్యుల స్థానములను అంతట సృష్టించెను. పూర్వము ఈ కల్పము నకు బ్రహ్మ స్థానులను (స్థానముగల వానిని సృష్టించెను). జలమును అగ్నిని, భూమిని వాయువును ఆకాశమును ద్యులోకమును. స్వర్గమును దిక్కులను సముద్రములను, సర్వ పర్వతములను, నదులను, ఓషధులయొక్క బీజములను వృక్షముల యొక్కయు తీవల యొక్కయు ఆత్మను (బీజములను) సృష్టించెను. లవములు, కాష్ఠలు, కలలు, ముహూర్తములు,

సంధులు, రాత్రులు, అహస్సులు, అర్ధమాసములు, మాసములు, అయనములు, అబ్దములు, అను కాలవిభాగములను సృష్టించెను. స్థానాభిమానులను, స్థానములను, స్థానాత్మలను సృష్టించి, యుగావస్థను కూడ నిర్మించెను. కృతయుగమును, త్రేతాయుగమును, ద్వాపర యుగమును, కలియుగమునుగూడ అట్లే సృష్టించెను. కల్పాదిలో మొదటి కృతయుగమున ప్రజలను సృష్టించెను.

నేను మొదట నీకు జెప్పిన పూర్వకాల ప్రజలు ఆ వర్తమాన కల్పమున అప్పుడు అగ్నిచే దహింపబడిరి. వారు తపోలోకమును పొందనివారై జనలోకమును ఆశ్రయించిరి. వారు మరల జరుగు సృష్టికి బీజముల కొరకై ప్రవర్తించియుండిరి. వారచట పునః సృష్టి కారణమున బీజార్థముగా ఉండిరి. ఆ తరువాత సృజింపబడుచున్నవారై, వారు సంతానము కొరకు (ఉపయోగము) అగుచుండిరి. వారిచట ధర్మార్థ కామమోక్షములకు సాధకులుగా తలంపబడిరి. దేవతలు, పితరులును ఋషులును, మనువులును, తపోయుక్తులై వారి స్థానములను నింపుచుండిరి కదా. వారు బ్రహ్మయొక్క మనస్సు నుండి పుట్టినవారై సిద్ధా త్ములు అగుచున్నారు గదా. ద్వేషముతో కూడిన కర్మతో దివమునకు వెళ్లి సృష్టివారు ప్రతియుగమున మరల నిటకు తిరిగి వచ్చి పుట్టుదురు. వారు తమ కర్మఫలవిశేషము వలన తథాత్మకులుగా ప్రసిద్ధి చెంది కర్మ సంశయ బంధన రూపమై జనలోకము నుండి పుట్టుదురు.

కర్మల యొక్క ఆ ఆశయము (అభిప్రాయము) అచట కారణమని తెలిసికొన వలెను. శుభాశుభ రూపములైన ఆకర్మలచేతనే జనలోకమునుండి లోకులు పుట్టుచు ఉన్నారు. యోనులలో వారు నానా రూపములైన శరీరములను గ్రహింతురు. దేవాద్యమై స్థావరాంత మైన దానియందు (గజమున) పరస్పరము పుట్టుదురు. అట్లు మాటిమాటికి సృజింప బడుచున్నవారై వీరు, వారు సృష్టికి పూర్వము చేసిన కర్మలనే పొందుచుండిరి. హింసా హింసలు, మృదుక్రూరములు, ధర్మాధర్మములు, ఋతానృతములు, వీనిచే భావింప బడిన వారై (ఆ కర్మలను) పొందుదురు. కావున అది ఆతనికి రుచించును.

గత కల్పములలో ఉన్న రూపనామములనే రానున్న (భవిష్యత్) కాలమున సామాన్య ముగా వారు పొందిరి. వారు ఆ నామ రూపములతోనే మరల మరల జన్మింతురు. ఆ తరువాత సృష్టిచేయదలచిన బ్రహ్మయొక్క సృష్టి నిలిచిపోగా, ధ్యానము చేయుచున్న ఆ బ్రహ్మయొక్క సత్య స్వరూపమును ఆ ప్రజలు అభిధ్యానించువారైరి. ఆ బ్రహ్మ అపుడు తన ముఖమునుండి వేయి మిథునములను సృజించెను. ఆ జనులు సత్త్వగుణముతో

ఉద్రేకమును చెందినవారు సుచిత్తులుగా ఒప్పియుండిరి. ఆ బ్రహ్మ వక్షస్థలము నుండి మరొక వేయి జంటలను సృజించెను. వారందరు రజోగుణముచే ఉద్రేకమును చెందినవారై శౌర్యతేజము గలవారును, శౌర్యతేజములేనివారును అయిరి. బ్రహ్మ తన ఊరువుల (తొడల) నుండి మరొక వేయి జంటలను సృజించెను. రజస్తమో గుణములచే ఉద్రేకమును చెందినవారై వారందరును ఊహాశీలురుగా తలపబడిరి. బ్రహ్మపాదముల జంట నుండి మరొక వేయి మిథునములను సృజించెను. వారందరు తమోగుణముచే ఉద్రేకమును చెందినవారై నిఃశ్రీకులును (దరిద్రులు, కళాహీనులు) అల్ప తేజస్కులును అయిరి. అంత ఆ జంటల నుండి పుట్టిన ప్రాణులు సంతసించుచున్న వారై పరస్పరము కామావేశము చెందినవారై మైథునమునకు (సంభోగమునకు) పూనుకొనిరి. అప్పటి నుండి ఈ కల్పమున మిథునోత్పత్తి చెప్పబడినది. అపుడు స్త్రీ నుండి ప్రతి మాసమున ఆర్తవము (ఋతుక్రియ) వెలువడుట అనునది జరుగుచున్నది. ఆ కారణమున మైధునము సేవించినను (స్త్రీలు) ప్రసవించకుండిరి. ఆయుష్యము చివరలో ఆ మిథునములే ఒక్కమారు (మాత్రమే) (సంతానమును) ప్రసవించుచుండెడివి. మరణింప కోరినవారుగా చేయబడిన కుటకులును కులికులును పుట్టుచుండిరి. అప్పటి నుండి ఈ కల్పములో గూడ మిథునముల పుట్టుక జరిగినది.

మనస్సుతో ధ్యానము చేసినపుడు (మనసు చింతించినపుడు) ఆ ప్రజలకు ఒక్కమారు సంతానము కలుగుచుండెడిది. అది శబ్దాదులకు విషయమైనది, శుద్ధమైనది, ప్రత్యేకముగా పంచలక్షణములు కలది. ఈ విధముగా పూర్వము బ్రహ్మయొక్క మానస సృష్టి మొదట జరిగెను. దాని వంశముననే పుట్టినవారు ఈ జగమును నింపిరి. నదులు, సరస్సులు,సము ద్రములు పర్వతములను కూడ (ఆ ప్రజలు) సేవించుచుండిరి. అప్పుడు ఆ యుగమున ఎక్కువగా నీరుగాని, అతిశీతలములైన వానిచే అత్యుష్ణములచే గాని అనుభవింపక ఉండిరి.

పృథివీ రసమునుండి పుట్టిన ఆహారమును తినుచుండిరి. ఆ ప్రజలు కామ చారిణులు. మానసీ సిద్ధిని పొందినవారు. వారిలో ధర్మాధర్మములు లేకుండెడివి. వారొక నిర్విశేషులైన (విశేషములు లేని) ప్రజలు. ఆ కృతయుగములో వారికి ఆయువు, సుఖము, రూపమును సమానములు (అనగా తారతమ్య భేదము లేదు).

కల్పాదియందు కృతయుగములో వారికి ధర్మాధర్మములు లేవు. వారు ఆ కృత యుగమున తమతమ అధికారములతో పుట్టిరి. ఆద్యమైన కృతయుగము దివ్య సంఖ్యతో నాలుగు వేలయేండ్లు నాలుగు వందల సంధ్యలని అందురు. అందువలన వేల కొలది

ప్రజలు విస్తరించినను వారికి ప్రతిఘాతము (ఎదురుదెబ్బ) లేదు. యుద్ధము (అనైక్యము) లేదు. క్రమము (ముందువెనుక అను క్రమము) కూడా లేదు. వారు పర్వతములను సముద్రములను సేవించువారు (నివసించువారు). ఇంటి ఆశ్రయము లేనివారు, శోకము లేనివారు, ఎక్కువ కెక్కువ బలవంతులు ఏకాంతమున సుఖించిన సంతానములు కలవారు) కేవలము సుఖించిన (దుఃఖము లేని) ప్రజలు, వారు ఎప్పుడు చరించువారు, నిత్యము సంతముతో కూడిన మనస్సు గలవారు. పశువులు పక్షులు పాములును అప్పుడు లేవు. ఉద్భిజ్జములు (మొక్కలు) లేవు. అవి అధర్మ ప్రసూతులు. మూల ఫలపుష్పములు లేవు. ఆర్తవము లేదు. ఋతువులు గూడ లేవు.

కాలము సర్వకామములకు సుఖముగా ఉండెను. ఉష్ణముగాని, శీతముగాని, ఎక్కువ లేక సమశీతోష్ణముగా ఉండెను. ఆ ప్రజలకు మనస్సు కోరిన కోరికలు ఎల్లప్పుడును ఎల్లెడలను సిద్ధించెడివి. ఆ ప్రజలచే కావలెనని కోరబడినవి ఎల్లను భూమియందు రసోత్థితములైన ధాన్యపు పంటలు మొలకెత్తి పెరుగుచుండెడివిది. వారి ఆ మానసీసిద్ధి ఆ ప్రజలకు బలమును చక్కని ఆకర్షణీయ వర్ణమును కలుగచేసెడి. రోగమును నశింప చేసెడిది కూడా. తైలాది సంస్కారములు అక్కరలేని (సహజ సుందర) శరీరములతో వారు (ముసలితనములేని) స్థిరయౌవనము గలవారు. వారి విశుద్ధమైన సంకల్పము వలన మిధున రూపములైన ప్రజలు పుట్టుచుండిరి. వారిజన్మ రూపమును సమములు. వారు సమముగానే మరణింతురు. భేదము లేదు. అప్పుడు సత్యము, లోభము, లేమి, క్షమ, సంతోషము, సుఖము, దమము–ఇవి అన్నియు వారి రూప ఆయు–శీల–చేష్టితముల చేత సమానముగ చేయబడినవి. ప్రజల వృత్తము నడవడి బుద్ధిపూర్వకము కాకుండగానే అనగా అనుకొనకుండడానే స్వయముగనే సహజముగ ఉండును.

కృతయుగమున శుభపాప కర్మలలో ప్రవృత్తిలేదు. అపుడు వర్ణాశ్రమ వ్యవస్థలు లేవు. సంకరములేదు. వారు అనిచ్ఛతో, అద్వేషముతోను కూడుకొన్నవారై, పరస్పరము నడుచుకొందురు. అందరును సమానమైన రూపము, ఆయుష్యము కలవారు. అధములని ఉత్తములని భేదములేనివారు. సుఖముతో నిండినవారు శోకములేనివారు నిత్యము సంత సించిన మనస్సులు గలవారు. మహాసత్త్వగుణమును మహాబలమును గలవారు వీరు కృతయుగమున పుట్టుదురు. వారికి లాభములు మిత్రామిత్రులును ప్రియాప్రియులును ఉండరు. కోరికలేని ఆ కృతయుగపు వారికి మనస్సునకు విషయమైనదిగానే ప్రతిది ఉండును. అనగా కోరినది లభించును. వారు ఒకరి వస్తువును మరొకరు కోరరు, తీసికొనరు కూడ.

కృత యుగమున ధ్యానము, త్రేతాయుగమున జ్ఞానమును పరమములు ద్వాపరమున చేయబడిన యజ్ఞము, కలియుగమున చేయబడిన దానము శ్రేష్ఠ మైనవి. యుగవృత్త వశముగా కృతయుగము సత్త్వము, త్రేతాయుగము రజస్సు, ద్వాపర యుగము రజస్తమములు, కలియుగము తమస్సు అని తెలియవలెను.

ఇక కృతయుగములో కాలము, దాని సంఖ్యలను వినుడు. నాలుగు వేల యేండ్లు కృతయుగము, దాని సంధి అంశములు ఎనిమిది వందలు. అపుడు ఆ ప్రజల ఆయువు సంపూర్ణముగ ఉండెను. కష్టములుగాని, ఆపదలుగాని ఉండవు.

అంత ఆ కృతయుగమున సంధ్యాంశము గతించిపోగా యుగధర్మమంతటను పాదావశిష్టమగును. యుగము యొక్క చివరి కాలములో సంధ్యగడచిపోగా, యుగము యొక్క సంధ్యాధర్మము పాదమే-1/4 అనగా మాత్రమే మిగిలి నిలుచును. ఈ విధముగా కృతయుగము నిశ్శేషము కాగా, అట్లే సిద్ధి కూడ అంతర్ధానమయ్యెను.

ఆ యుగమున మానసీసిద్ధి భ్రష్టముకాగా, అట నుండి (త్రేతాయుగ) మధ్యమున మరొక సిద్ధి కలిగెను. సృష్ట్యాదిలో నాతో చెప్పబడిన యెనిమిది మానసీ సిద్ధులు క్రమ యోగమున నాశమందును. కల్పాదిలోని ఈ మానసీసిద్ధి కృతయుగమున కలుగును. అన్ని మన్వంతరములలోను చతుర్యుగ విభాగముగా వర్ణాశ్రమాచార కృతమైనది. కర్మ సిద్ధోద్భవముగా తలంపబడినది.

సంధ్య చేయబడిన దానియొక్క పాదము (నాలుగువ వంతు)తోను, సంధ్యయొక్క పాదము (నాలుగవవంతు)తోను అంశములుగా చేయబడిన సంధ్యాంశకములు గల ఇవి పరస్పరము మూడు మూడు పాదములను (1/4) తపము శ్రుతము బలము ఆయుష్యము అను ఈ యుగ ధర్మములచే తగ్గించివేయును.

అంత, ఓ ఋషి సత్తములారా! కృతయుగాంశ క్షీణము కాగా, త్రేతలో మరొక యుగము కృతయుగాంశగా ఏర్పడెను. ఆ కృతయుగాంశ కూడా క్షీణింపగా, దాని నుండి మిగిలిన ప్రజలలో కల్పాదిలో ఏర్పడిన త్రేతాయుగము యొక్క మొదట, కాల యోగమున సిద్ధి ప్రకాశమైనది. వేరు విధమునకాదు. ఆసిద్ధి నశింపగా మరొక సిద్ధి వచ్చినది.

జలముల యొక్కయు సూక్ష్మభావము గడచి పోయినపుడు, వారిద్దరు? మేఘ రూపమున (ప్రకాశమునందిరి). గర్జించుచున్న మేఘముల నుండి వృష్టి జరిగినది. ఆ వర్షముచే ఒక్కమారే కలిసిన (తడిసిన) భూమిపైన వారి (ప్రజల) గృహములలో ఉన్న వృక్షములు

అపుడు ప్రాదుర్భవించెను. ఆ వృక్షముల నుండి ఆ ప్రజల సమస్త ప్రత్యుప భోగము (అనుభవం) జరిగినది. త్రేతాయుగ ప్రారంభమున ఆ ప్రజలు వాని కొరకు (వృక్షముల కొరకు) ప్రయత్నము చేయుదురు. ఆతరువాత చాలా కాలమునకు ఆ ప్రజల వ్యతిరేకత వల్లనే అపుడు రాగ-లోభ రూపమైన భావము ఆకస్మికముగా కలిగెను.

స్త్రీలకు జీవితాంతమున కలుగు (జరుగు) ఆవర్తములు అప్పుడు కలుగలేదు. మరల యుగబలముననైతే, ఆ స్త్రీలకు ఆర్తవము నెల నెలకు మరల మరల కలుగు చుండెను. ఆ తరువాత అపుడు మిధునములు ఆ యోగముతోనే ఉండిరి. ప్రతి నెలలో కలిసికొను ఆ ప్రజలకు, తత్కాలమున జరుగునదిగాన, అకాలమున ఆర్తవోత్పత్తియు గర్భోత్పత్తియు జరిగెను. ఆ కాలముచే జరుగు ప్రజలయొక్క విపర్యము (వ్యత్యాసము)చేత గృహము నందున్న వృక్షములన్నియు నశించినవి. ఆ తరువాత, ఆ వృక్షములు నశింపగా విభ్రాంతులై వ్యాకులత చెందిన ఇంద్రియములు గలవారై అప్పుడు ఆ సత్యమును ధ్యానించు వారు ఆ సిద్ధిని అభిధ్యానించిరి. వారియొక్క గృహములందున్న ఆ వృక్షములు ప్రాదుర్భ వించినవి. వస్త్రములను ఫలములను ఆభరణములను ప్రసవించినవి. వారికి ఆ వృక్షములందే గంధవర్ణ రసములతో కూడినది, మాక్షికముకానిది (తేనెటీగలు పెట్టినదికానిది) మహావీర్య (బల)మైనది అయిన మధువు (తేనె) పుటక, పుటకమున (ప్రతి దొప్పలోను) తేనెపట్టు రంధ్ర ములలోను కలుగుచున్నది. త్రేతాయుగ ప్రారంభమున ఆ మధువుతో ప్రజలు జీవించు మెదలుచుండిరి. ఆ సిద్ధిచేత ప్రజలు హృష్టులు తుష్ఠులును విగతజ్వరులును అయిరి.

దీని తరువాత క్రమ క్రమముగా వారి భావములలో పరివర్తన కలుగుట మొదల య్యెను. మరల ప్రజలు లోభావృత్తులైరి. తరువాత ఆ వృక్షములను, తేనెటీగల తేనెను బలాత్కారముగా పరిగ్రహించిరి. లోకకృతమైన వారి ఆ అపచారముచేత కొన్నికొన్ని చోట్లలో తేనెతోబాటు కల్పవృక్షములు కూడ నష్టము లైనవి. సంధ్యకాల వశమున అప్పుడు అది అల్పశిష్టము కాగా ఆ ప్రజలకు శీతోష్వాది ద్వంద్వ క్లేశములు కూడా కలిగినవి.

వారు తీవ్రమైన చలిగాలి ఎండలచే మిక్కిలి దుఃఖితులైరి. ద్వంద్వము (శీతోష్ణము) లచేత పీడింపబడిన ఆ ప్రజలు శరీర ఆచ్ఛాదులను ఏర్పరచుకొనిరి. శీతోష్ణములకు ప్రతీ కారముగా (కప్పులను) నిర్మించిరి. జంటలకు ప్రతీకారమును జేసి నికేతములు అను ఇండ్లయందు చేరిరి. పూర్వము వారు ఎక్కువగా తిరుగువారు, ఎక్కువగా ఇండ్ల ఆశ్రయము లేనివారుగా ఉండిరి. తమకు తగువిధముగను ప్రీతికరముగను వారు మరల ఇండ్లలో నివసించి సుఖమును అనుభవించిరి. ఆ ఇండ్లు నీరులేని మెట్టలలోను, పల్లపు భూము

లందును, పర్వతములందును, నదులం(తీరముల) దును తమ ఇచ్ఛానుసారము నిర్మించు కొనిరి. వారు దుర్గములను (కోటలను) ఎల్లప్పుడు నీరుండు ఎడారులను ఆశ్రయించిరి.

కూర్పునకు అనుగుణముగా, కోరికలకు అనుగుణముగా, సమస్థలములలోను విషమ స్థలములలోను, శీతోష్ణములను వారించుటకై వారు ఇండ్లను నిర్మింప ప్రారంభించిరి. ఆ తరువాత పల్లెలను, పురములను గ్రామములను సంస్థాపించిరి. అట్లే ఇండ్లలో విభాగాను సారము అంతఃపురములను కూడ నిర్మించిరి.

వాటియొక్క పొడవులను వ్యాసములను, పట్టణములచుట్టుఉండు బయలు ప్రదేశము (నగర పరిసర ఉద్యానము)లను తమ తెలివి తేటలను అనుసరించి నిర్మించిరి. వాని కొలతలను పరిమాణమును నిర్దేశించుటకు అంగుళి యొక్క కొలత ద్వారా వివిధ పరిమాణ ములకు పేర్లు పెట్టబడినవి. చాచిన బోటనవ్రేలికిని చూపుడు వ్రేలికిని ఉన్న మధ్య కొలత ప్రాదేశము అనబడును. అట్లే చాచిన బొటనవ్రేలికి చాచిన నడిమి వ్రేలికి మధ్య ఉన్న కొలత తాలమనబడును. అట్లే బొటన వ్రేలికి ఉంగరపు వ్రేలికిని బొటనవ్రేలి చివర వరకు మధ్య కొలత గోకర్ణము అనబడును. చిటికెన వ్రేలికిని మధ్యనున్న కొలత వితస్తి అనబడును. ఇది పన్నెండు అంగుళములు ఉండును. ఇరువది అంగుళములు రత్ని అన బడును. ఇరువది నాలుగు అంగుళములు హస్తము అనబడును. 24 అంగుళములు కిష్కు అనబడును. నాలుగు హస్తములు ధనుర్దండము. అదియే నాలికాయుగము. రెండు వేల ధనుర్దండములుగ ప్యూతి అనియు ఎనిమిది వేల ధనుర్దండములు యోజనము అనబడును. ఈ యోజనము అను కొలతచేతనే చేతనే ఆనాటివారు తమ తమ నివాస స్థానములను నిర్మించుకొనిరి. ఆనాటి ప్రజలు నాలుగు రకములైన దుర్గములను కూడా నిర్మించుకొనిరి.

నాలుగు దుర్గములలో మూడు స్వయముగా ఉద్భవించినవి. నాలుగవది కృత్రిమ (కట్టబడిన) దుర్గము. కృత్రిమమైన దాని నిర్మాణ విధానమును చెప్పుదును వినుడు. దానియందు మేడలు ఎత్తైన కోటలు చుట్టు గోడలును ఉండును. అంతట బహుజలా పూర్ణమైన పరిఖ (అగడ్త) చే చుట్టబడి సేతువుతో కూడినదిగా ఉండును. ఒక స్వస్తిక ద్వారముగ కుమారీపురమే ఉండును. అగడంతలతోబాటు ఆ ద్వారము త్రవ్వబడినదిగా ఉండి పదునెనిమిది హస్తములు శ్రేష్ఠములని కొందరు, లేదా పందొమ్మిది హస్తములు శ్రేష్ఠములని మరికొందరు చెప్పుదురు. పల్లెలకు, నగరములకు గ్రామములకును అన్ని దిక్కులలో మూడు విధములైన దుర్గము హద్దులు మూడు వైపుల పర్వతములచేగాని

మూడువైపుల సహజ జలములచేతగాని బంధనము జరుగును. పొడవులో సగము వెడల్పుగల దుర్గము శ్రేష్ఠము. ఈశాన్య దిశలోని భాగము కొంత పల్లముగా ఉండవలెను. మూడు విధముల దుర్గముల పొడవు వ్యాసమును యోజనముల విష్కంభము ఎనిమిది భాగములలో సగము పొడవు తూర్పు ఉత్తరములలో పరమార్థామయామముగల పురము మిక్కిలి శ్రేష్ఠమైనది. భిన్నకర్ణమైనది, వికర్ణమైనది, వ్యంజనమైనది, కృశించిఉన్నది, వృత్తమైనది, హీనమైనది, దీర్ఘమైనది అయిన నగరము ప్రశస్తమైనది కాదు. చతురస్రముగా ఉన్నది. చక్కగా ఉన్నది. దిక్కులలో ఉన్నది అయిన పురము ప్రశస్తమైనది. ముందు 24 హస్తములును తరువాతిది 108 హస్తములును గలది. హ్రస్వోత్కృష్టములు (పొట్టి పొడుగులు) లేని మధ్య భాగముగల దానిని పండితులు ప్రశంసింతురు.

108 కిష్కులు పొడవుగల సమచతురస్రము మధ్య భాగము కలది ప్రశంస నీయము. ముఖ్య నివేశనంలో అందురు. నగరము నుండి సగము విష్కంభమున పల్లె, తరువాత గ్రామము, తరువాత బయలు ఉండవలెను. నగరము నుండి యోజన దూరము దూరమున పల్లె, పల్లె నుండి అర్థ యోజనమున గ్రామము ఉండవలెను. పరమసీమ (చివరి హద్దు), రెండు క్రోశములు ఉండవలెను. క్షేత్ర సీమ నాలుగు ధనువులు ఉండవలెను. దిక్కుల యొక్క మార్గటములు ఇరువది ధనువుల విస్తీర్ణముగా ఉండుట. గ్రామ మార్గము 20 ధనువుల వెడల్పు, సీమా మార్గము 10 ధనువుల విస్తీర్ణము, శ్రీమంతమైన రాజ పథము పదిధనువుల విస్తీర్ణము ఉండి, అది మనుష్యులు గుఱ్ఱములు, రథములు, ఏనుగులును, ఏ ఇరుకు లేక సంచారము చేయదగినదిగా ఉండవలెను. దాని శాఖా మార్గములు నాలుగు ధనువుల విస్తీర్ణముగా వారిచే నిర్ణయింపబడినవి. గృహమార్గములు, ఉప మార్గములు, ద్వికములైన ఉపంథ్యక మార్గములును, ఘంటా పథమున్ను నాలుగు పాదముల వెడల్పు, గృహాంతరములోని మార్గములు మూడు పాదములు వెడల్పు. వృత్తి మార్గములు సగ పాదము వెడల్పు, ప్రాగ్వశముల దిక్పథము 20 ధనస్సుల పొడవు ఉండవలెను. మల విసర్జనమునకు (మరుగుదొడ్డికి) జలము పోవు ప్రవాహమునకు (స్నానపు గది)కి అన్ని వైపుల, లేదా నలువైపుల ఒక్క పదము వైశాల్యము మాత్రము ఉండవలెను. ఈ విధముగ ఆయా స్థానములు నిర్మించిన తరువాత మరల గృహములు నిర్మించిరి.

అట్లే ఆ గృహ సంస్థితములైన వృక్షములు పూర్వము ఉండినవి. వాటిని మరల మరల జ్ఞాపకము తెచ్చుకొని పూర్వమున్నట్లే ఆ వృక్షములను గృహసంస్థితములుగా చేయుటకు ప్రారంభించిరి. పూర్వము వృక్షములు పోయినవి. శాఖలు కాదు అవి పైకి పోయినవి. అన్యశాఖలు అంతకంటె పైకి పోయినవి. అట్లే కొన్ని అడ్డముగా పోయినది.

వృక్ష శాఖలు ఎట్లు పోయినవో వెదికి తెలిసికొనుట న్యాయము. ఆ ప్రజలచే ఆ శాఖలు అట్లే (పూర్వమున్నట్లే) నిర్మింపబడినవి. కావున గృహసంస్థిత వృక్షశాఖలు (గృహముగా ఏర్పరచుకొన్న వృక్షశాఖలు) 'శాల'లనబడినవి.

ఈ విధముగా శాఖల నుండి శాలలును గృహములును ప్రసిద్ధము అనగా ఎక్కువగా సిద్ధములైనవి. కావుననే ఆ శాఖలు శాలలని తలంపబడినవి. శాఖలయందు శాలాత్వము గూడ తలపబడినది. ఆ శాఖాశాలలో మనస్సు ప్రసన్నముగా ఉండును. అవి మనస్సును (మేడలుగా జేసి) సంతోషపెట్టును. కావున గృహములు శాలలనియు ప్రాసాదములనియు పిలువబడినవి.

అందు అందు ఉపఘాతములను చేసి జీవనోపాయమును చింతించిరి. మధువు (తేనె)తో బాటు కల్పవృక్షములు నష్టమైనపుడు ఆ ప్రజలు ఆకలిదప్పులు గలవారై దుఃఖ ముతో వ్యాకులము చెందిరి.

ఆ తరువాత త్రేతాయుగములో మరల సిద్ధి ప్రాదుర్భవించెను. జీవనముల కొఱకై ధనములను సాధించునట్టి ఇంకొక వృత్తి వారి ఇష్టప్రకారము ఏర్పడెను. వారికి పల్లములకు ప్రవహించు వర్షోదకములు కలిగెను. వర్షముతో జలములు ప్రవాహములు కలిగిన సరస్సులు నదులును ఏర్పడినవి.

ఈ విధముగా రెండవ సృష్టిలో వృష్టి నదులు ఏర్పడినవి. ఆ తరువాత భూమిపై జలసమూహములు ఏర్పడినవి. భూజల సంయోగము వలన వానిలో ఓషధులు పుట్టినవి. అవి పుష్పమూల ఫలములు గల మరికొన్ని ఓషధులను పుట్టించినవి. కఱ్ఱుతో దున్నకయే పుట్టునవి, ప్రత్యేకముగ నాటకయే పుట్టునవి, గ్రామములో పుట్టినవి, అరణ్యములో పుట్టినవి ఋతువులలో పుష్పించి ఫలించునవి, వృక్ష రూపములు, పొదల రూపములు మొత్తము ఓషధులు 14 విధములు. త్రేతాయుగ జీవనములో ఔషధ ప్రాదుర్భావము జరిగినందును త్రేతాయుగములో ప్రజలు ఆ ఔషధముతోనే జీవించుచుండిరి. అంతట వారిలో రాగలోభములు కలిగినవి. త్రేతాయుగవశమున అవి వారికి తప్పనిసరి అయినవి. అంతట వారు నదీక్షేత్రములను, పర్వతములను, వృక్షములను, పొదలుగా ఉన్న ఓషధులను వారివారి బలానుసారము బలాత్కారముగనే పరిగ్రహించిరి.

పూర్వము నేను ప్రాకృతమున సిద్ధాత్ములని కొందరిని చెప్పితిని. ఆ బ్రాహ్మణులే ఈ మానవులై ఈ త్రేతాయుగమున కూడ యోజనము చేయుట వలన (కలుపుట వలన) పుట్టిరి. వారు శాంతులు వేడిమి కలవారు కర్మిణులు దుఃఖినులు. వీరు కృతయుగము

నుండి వచ్చి త్రేతాయుగమున మరల పుట్టిరి. పూర్వజన్మలలోని శుభాశుభ కర్మలచే భావింప బడినవారై బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అట్లే ద్రోహిజనులని ఏర్పడిరి.

ఇటు వారికంటే బలవంతులు సత్యశీలురు అహింసకులు లోభములేనివారు ఆత్మను జయించినవారు ఉండేవారు. వారినుండి అల్పతేజస్కులైన ఇతరులు పుచ్చుకొనేవారు, పనులు చేసేవారు, అని ఈ విధముగా వారు పరస్పరముగా (తెలియ బడినవారు) విప్రతిపన్నులు (విరుద్ధులు) అయిరి. వారి ఆ దోషమువలన ఓషధులు అప్పుడు కపటత్వము నందినవి. ఇసుకవలె పిడికిళ్లతో గ్రహింపబడినవై నశించినవి. యుగబలమువలన భూమి పదునాలుగు గ్రామ్యారణ్య ఓషధులను గ్రహించెను. ఆ ఓషధులు పత్రములచేత, పుష్పము లను, పుష్పములచేత, ఫలములను గ్రహించెడివి.

ఆ ఓషధులు నష్టములు కాగా ప్రజలప్పుడు విభ్రాంతులైరి. ఆకలితో ఆవేశింప బడిన (బాధింపబడిన) ప్రజలు స్వయంభువులై ప్రభువైన బ్రహ్మకడకు వెళ్లిరి. వారు త్రేతాయుగముయొక్క ఆదిలో తమ జీవనోపాధిని పొందగోరిరి. స్వయంభువ భగవంతు డగు బ్రహ్మ వారి కోరికను తెలుసుకొనెను.

ప్రత్యక్షముగా చూచిన చూపుతో (దివ్యదృష్టితో) చూచి చక్కగా విచారించి తెలిసికొని వానిని భూమినుండి స్వీకరించెను. (అనగా) మరల భూమినుండి వానిని పితికెను. సుమేరు పర్వతమును దూడనుగా జేసి భూమిని పితికెను. అపుడీ ఆవు పృథివీ తలమున బీజములను పితికినది. ఆ బీజములు పుట్టినవి. (మొలకెత్తినవి) అవి గ్రామ్యారణ్యములైన ఓషధులు. ఓషధులు ఫలపాకముతో (వాని ఫలములు పండగనే) నశించునవి. అవి డెబ్బదియేడు. వ్రీహులు, (వడ్లు) యవలు, గోధుమలు, అణువులు (చిఱువడ్లు) తిలలు (నువ్వులు) ప్రియంగవములు (కొఱ్ఱలు, నల్లావాలు), ఉదాహరణములు, కారూషములు, సతీనకములు (లంకలు), మాషములు (మినుములు), ముద్గములు (పెసలు), మసూరములు (చిఱు సెనగలు), నిష్పావములు (అనుములు) కులుత్థములు, ఆఢక్యములు (కందులు), చణకములు (సెనగలు), ఇటువంటివి డెబ్బదిఏడు గలవు.

ఇవి అన్నియు గ్రామ్యములైన ఓషధులయొక్క జాతులు యజ్ఞియము (యజ్ఞ సంబంధము)లైన గ్రామ్యారణ్య ఓషధులు పదునాలుగు. వ్రీహులు (వడ్లు), యవలు, మాషములు (మినుములు), గోధుమలు, అణువులు (చిరువడ్లు), తిలలు ప్రియంగువులు (కొఱ్ఱలు), ఈ ఏడు, ఎనిమిదవ కులుత్థికములు, శ్యామాకములు (చామలు), నీవార ములు (దూసవరి ధాన్యములు), జర్తిలములు (అడవి నువ్వులు), గవేధుకములు (అడవి

గోధుమలు, వట్టివడ్లు), కురువిందములు (ఒక వడ్లజాతి), వేణుయవములు (వెదురు బియ్యము), మర్కటకములు. ఇవి పదునాలుగు గ్రామ్యారణ్యములైన ఓషధులు. ఇవి కృతయుగపు మొదట ఉత్పన్నములైనవి.

కఱ్ఱతో దున్నక, అంతట పండిన ఓషధులు గ్రామ్యారణ్యములు. వృక్షములు, గుల్మములు (పొదలు) లతలు (ప్రాకుతీగలు), వల్లులు (చుట్టుకొనుచు ప్రాకుతీగలు), వీరుధములు (వివిధముగా మొలచు తీగగుంపులు), ఇవి తృణజాతులు (పశువులు తినదగిన గడ్డి జాతికి చెందినవి). ఇవి వేరులతోను, పండ్లతోను పుష్పములతోను బీజశక్తిని గ్రహించి పుట్టునవి. పూర్వము స్వయముగా బ్రహ్మచే ఈ బీజములు భూమి (గోవు) నుండి పితకబడినవి.

ఆ ఓషధులు (భూమిపై) చల్లినప్పుడు మొలవలేదు కాని, తరువాత ఆ ఓషధులు ఋతువును అనుసరించి పుష్పించి ఫలించునవై మొలచినవి అపుడు స్వయంభువుడైన, భగవంతుడైన బ్రహ్మ సిద్ధిని కర్మవల్ల కలుగుదానినిగా పరికించి, ఆ ఓషధుల వృత్తి కొరకు చక్కగా మొలచి బ్రతికి నిలుచుటకు, వాటి జీవనోపాయమును ఉపయోగించెను. అంత బ్రహ్మవలన ఆఓషధులకు జీవనోపాయము సంసిద్ధించగా, అప్పటినుండి ఓషధులు కృష్ణపచ్యములై (దున్నగాపండినవై) జన్మించినవి. అవి ఆరంభింపబడిన విధముగా పరస్పరముగా విధానములు ఏర్పడినవి.

ఆ ప్రజలు విధానములు గలవారై అధికారమును పరిగ్రహించినవారు ఉండిరి. వారితరులకు రక్షణ ఒసగువారు. వారిని క్షత్రియులనుగా బ్రహ్మ నిలిపెను. అట్లే నిర్భయులై ఎంతమంది ఆ క్షత్రియులకు సమీపముగా నిలిచినవారో వారు సత్యమును బ్రహ్మను పూర్వమున్న విధముగా చెప్పువారై బ్రాహ్మణులైరి. తక్కిన వారిలో ఎవరు అబలురో వారు వైశ్యకర్మలో (వ్యాపారముతో) ఉన్నవారు. చురుకైనవారు, భూమిలో దారిద్ర్యమును నశింపజేయువారు. వారిని వృత్తి సాధకులను అనగా జీవనమునకై వ్యాపారము జేయువారు ఈ కృషి చేయువారిని లేదా దారిద్ర్యమును నశింపజేయు వారిని వైశ్యులని అందురు.

దుఃఖించు ద్రవీభావము చెందుచు (పరుగులిడుచు), పరిచర్యలో నిరతులై తేజోహీనులై, అల్పవీర్య (స్వల్ప బలవంతు)లైన వారిని ప్రభువైన బ్రహ్మవారి కర్మలను ధర్మములను విధించెను. ప్రాకృతము (కృతయుగము) ఉండగా అంతట చాతుర్వర్ణ వ్యవస్థ ఉండెను. కాని ఆ ప్రజలు అజ్ఞానము వలన ఆ ధర్మములను పాలించలేదు. వర్ణ ధర్మములతో జీవింపక పరస్పరము విరోధించిరి.

ప్రభువైన బ్రహ్మఉన్నది ఉన్నట్లు ఆ పరస్పర విరోధిత్వమును తెలుసుకొని క్షత్రియు లకు బలమును, దండమును, యుద్ధమును జీవన వృత్తిగా ఆదేశించెను. యాజనము బ్రహ్మ బ్రాహ్మణులకు విధించిన కర్మలు అధ్యాపనము మూడవది పరిగ్రహము (స్వీకారము) పశుపాలనము, వ్యాపారము, కృషి (వ్యవసాయము)ని వైశ్యులకు జీవన వృత్తిగా కల్పించెను. శిల్ప వృత్తిని, కూలిని బ్రహ్మ శూద్రులకు జీవనవృత్తిగా ఏర్పరచెను. బ్రహ్మ క్షత్రియ వైశ్యులకు (యజనము యజ్ఞము చేయుట) వేదములు చదువులు, దానమును సామాన్య కర్మలు. ఆ తరువాతవారికి పరస్పరముగా కర్మాభవమును (పని బ్రతుకు తెరువును) ఇచ్చెను. సిద్ధిచే వారికి లోకాంతరములలో స్థానములనిచ్చెను.

యజ్ఞయాగాది క్రియావంతులగు బ్రాహ్మణులకు ప్రాజాపత్య (బ్రహ్మ) స్థానము. యుద్ధమున పారిపోని క్షత్రియులకు ఇంద్ర స్థానము, స్వధర్మము ననుసరించి జీవించు వైశ్యులకు మరుద్దేవతా స్థానము (వాయుస్థానము), ప్రతిచారమున (సేవలలో) నున్న శూద్రులకు గాంధర్వ (దేవతా స్థానము) లభించును.

స్వయముగా వ్యత్యాచారవంతులైన ఈవర్ణములు (బ్రహ్మ క్షత్రాదులు) స్థానములు. ఆ విధముగా వర్ణములుండగా ఆశ్రమములను ఏర్పరచెను. గార్హస్థ్యము, బ్రహ్మచర్యము, వానప్రస్థము, భిక్షుకము అను ఈ నాలుగు ఆశ్రమములను ఆ ప్రభువగు బ్రహ్మ పూర్వము ఏర్పరచెను.

వారిలోనే కొందరు వర్ణ కర్మలు చేయని వారు ఆశ్రమ స్థానానికి కర్మాక్షితి ఎక్కడిది అని అందురు. బ్రహ్మ ఆ ఆశ్రమములను పేరుపేర నేర్పరచెను. తరువాత నిర్దేశము కొరకై బ్రహ్మ వాని ధర్మములను చెప్పెను. వారి ప్రస్థానములను, యమములను, నియమ ములను చెప్పెను. పూర్వము గృహస్థాశ్రమము బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులు నాలుగు జాతులవారు గూడ ఆచరింపదగినదని చెప్పబడినది. ఇది తక్కిన బ్రహ్మచర్య వానప్రస్థ– భిక్షువుల ఆశ్రమములకు మూలమైనది. వానిని నిలుపునది. దానిని యథా క్రమముగా యమములతో నియమములతో చెప్పెదను.

భార్య – అగ్ని హోత్రములు, అతిథిసత్కారము, ఇజ్య శ్రాద్ధ క్రియలు సంతానములు అనునవి సంగ్రహముగా గృహస్థ ధర్మములు. దండము ధరించుట, మేఖల (మొలనూలు) ధరించుట, భూమిపై పరుండుట, జటలు ధరించుట, గురు శుశ్రూషణము, భిక్షాటనము – ఇవి బ్రహ్మచారి ధర్మములు. కట్టుకొనుటకు, నారచీరలు, పత్రములు (లేడి) చర్మములు తినుటకు ధాన్యములు కందమూలములు ఫలములు ఔషధములు, ప్రాతః సాయం

సంధ్యలలో స్నానములు, హోమములును వానప్రస్థాశ్రమమున ఉన్నవారి ధర్మములు. ఆసన్నముసలమున (రోకలి దంపులతో) భైక్షము, దొంగతనము లేమి, శౌచము ప్రమాదము లేమి, మైథునము లేమి, దయ, భూతములందు సహనము, కోపము లేమి, గురుసేవ, సత్యము. ఇవి పది. బ్రహ్మ ఈ దశ లక్షణికమైన ధర్మమును చెప్పెను.

ఇచట భిక్షువు వ్రతములు ఐదు, ఉపవ్రతములు ఐదు. ఆచారశుద్ధి నియమము, శౌచము, ప్రతికర్మ (అలంకరణము), సమ్యగ్దర్శనము ఇవి వ్రతములు. ఇట్లే ఉపవ్రతములు కూడా ఐదు. ధ్యానము, మనసుతో ఇంద్రియముల సమాధి, సాగరులతో గూడి భిక్షాటనము, మౌనము, పవిత్రోపచితులతో విముక్తి వీనిని పరివ్రాజకుని ధర్మములందురు.

బ్రహ్మచే స్వయముగా ప్రజాశ్రేయస్సు కొఱకే ఆశ్రమములు చెప్పబడినవి. సత్యము ఋజు ప్రవర్తనము (వంకరలేని చక్కని నడవడి) తపము, క్షాంతి యోగము, దమపూర్వికమై ఇజ్య (యాగము). సాంగములైన వేదములు, యజ్ఞములు, వ్రతములు, నియమములు, భావదోష మేర్పడిన దుష్టునకు ఇవి సిద్ధింపవు. పరాక్రమములను ప్రదర్శించుచున్నప్పటికిని అంతర్భావ దుష్టునకు ఒకప్పుడు బహిః కర్మలు బాగుగా సిద్ధించును. కలుషితమైన అంతరాత్మతో సర్వస్వమిచ్చిన దానిచే వాడు ధర్మభాక్కుడు. దానికి కారణము భావము. సద్భావము గలవాడే ధర్మభాక్కగును. ఈ విధముగా పితరులతో గూడ దేవతలు, ఋషులు, మనువులు. వీరికి, ఆశ్రమ జీవనమునందున్న వారికే స్థానముండునని చెప్పుదురు. ఊర్ధ్వరేతస్కులైన ఎనుబది ఎనిమిది వేల ఋషులకు ఆదిస్థానము అదియే గురువాసులకు గూడ. స్థానము సప్తర్షులకు ఏది స్థానమో అదియే స్వర్గవాసులకు స్థానము. గృహస్థులకు ప్రాజాపత్యము స్థానము. న్యాసు లకు (సన్యాసులకు) బ్రహ్మ లోకము స్థానము, యోగులకు అమృతము స్థానము. నానా బుద్ధులు గలవారికి ఏ స్థానమును లేదు.

స్వధర్మమునందు వ్యవస్థితులైన ఆయా ఆశ్రమములందున్న వారికే స్థానములు. ఆద్యమైన మన్వంతరమున భూలోకమునందు లోకతంత్రముగా నాలుగు దేవయాన రూప మార్గములు నిర్మింపబడినవి. దేవయానమునకైన మార్గములకు ద్వారము సూర్యుడు అనబడినాడు. అట్లే పితృయాణులకు చంద్రుడు ద్వారముగా చెప్పబడినాడు. ఈ విధముగా వర్ణాశ్రమముల విభాగము చేయబడినపుడు, ప్రజలు వర్ణాశ్రమాత్మికులై దీనికి వ్యతిరేకముగా వర్తించనపుడు వారికి పై యానములు వాని ద్వారములును చెప్పబడినవి.

ఆ తరువాత బ్రహ్మ త్రేతాయుగము మధ్యమున పూర్వముకంటె ఇతరులైన మానసీ ప్రజలను సృష్టించెను. ఆత్మనుండియు, తన శరీరము నుండియు తనతో పోలిన ప్రజలను

సృష్టించెను. ఈ త్రేతాయుగమున ఆది (భాగము) మధ్య (భాగము)ను పొందగా పూర్వము కంటే వేరైన మానసీ ప్రజలను సృష్టించుటకు ప్రారంభించెను.

అంత ఆ ప్రభువు సత్త్వ రజో గుణములను, ఉద్రేకము చెందిన ప్రజలను సృష్టించెను. వారు ధర్మార్థ కామ మోక్షములను జీవనవృత్తిని సాధించువారు. దేవతలు, పితరులు, ఋషులు, మనువులు, యాగానురూపమైన ధర్మముచేత ఈ ప్రజలను విశేషముగ కూర్చిన వారు. బ్రహ్మయొక్క ఆ ప్రజాధర్మమురాగా (ఆతడు) నానా రూపములైన సమస్త మానసీ ప్రజలను గూర్చి చింతించెను.

నేను నీకు పూర్వము చెప్పిన జనలోకాశ్రితులు, ఆ కల్పము గడవగానే, వారిట దేవాదులైన ప్రజలుగా ఉండిరి. చింతించిన బ్రహ్మ చిత్తములో పుట్టుటకై వచ్చిన వారందరు మన్వంతర క్రమమున ఇట కనిష్ఠులైన ప్రథములుగా సమ్మతులైనవారు. ప్రసిద్ధమైన అనుబంధములు కలవియు. అన్ని ప్రయోజనములు కలవియు, కుశలాకుశల ప్రాయ ములునై, ఆయా కర్మలచేత ఇట ప్రజలెల్లరు భావింపబడిరి. ఆ కర్మఫలశేషముచేత కట్ట బడినవారై వారు విశేషముగ పుట్టిరి. దేవత్వము, అసురత్వము, పితృత్వము వీటిచేతను, పశువులచేతను, పక్షులచేతను, పాములచేతను, వృక్షత్వములచేతను, నరక జంతుత్వము చేతను, కీటకత్వముచేతను, ఆయా భావములచేతను (జన్మించి భూమిలో) ఉండిరి. (8)

సృష్టి వర్ణనము

సూతుడు పలికెను :

ఆ తరువాత ధ్యానము చేయుచున్న బ్రహ్మకు మానసీ ప్రజలు పుట్టిరి. అతని శరీరమున పుట్టిన కారణములతో కూడిన కార్యములతో క్షేత్రజ్ఞులై ఆ బుద్ధిమంతుని బ్రహ్మ యొక్క గాత్రముల నుండి వారు పుట్టియుండిరి. అంత, దేవ, అసుర పితరులను మానవులను, ఈ నాల్గింటిని సృష్టింపదలచి ఈ జలములను తనతో కలియజేసెను. యుక్తాత్ముడైన ఆ బ్రహ్మకు మాత్రలు బుట్టినవి. ఆ సృష్టిని చింతించుచున్న ప్రజాపతి బ్రహ్మకు ప్రయత్నము కలిగెను.

అంత బ్రహ్మయొక్క పిరుదు నుండి మొదలు సుతులుగా అసురులు జన్మించిరి. ఓ విప్రులారా! అసుః అనగా ప్రాణము. దాని నుండి పుట్టిన వారు కావున అసురులు (అన బడినారు) బ్రహ్మ అసురులు పుట్టిన శరీరమును తొలగించెను. తొలగింపబడిన శరీరము చేత వెంటనే రాత్రి జనించెను. అది చీకటితో నిండినది కావున త్రియామిక. ఆ బ్రహ్మ నుండి వచ్చిన ప్రజలు రాత్రియందు తమస్సుతో ఆవృతులైరి.

దేవేశుడైన బ్రహ్మ సురలను చూచి, వేరొక శరీరమును పొందెను. అవ్యక్తమైన సత్త్వము నిండినదైన ఆ శరీరమును ధరించెను. అట్లు ఆ శరీరమును పొందిన ప్రభువునకు సంతసముగా నుండెను.

అంత, క్రీడించుచున్న బ్రహ్మయొక్క ముఖము నుండి దేవతలు పుట్టిరి. దేవనము చేయుచున్న బ్రహ్మ నుండి పుట్టిన వారు గావున దేవతలని పిలువబడిరి. 'దివి' అను ధాతువు క్రీడయందు భావింపబడును. దివ్యమైన (క్రీడించిన) ఆ శరీరమున పుట్టిన వారు కావున దేవతలు.

దేవతలను సృష్టించి దేవేశుడైన బ్రహ్మ వేరొక శరీరమును పొందెను. (అనగా) బ్రహ్మ సత్త్వ మాత్రాత్మకమైన వేరొక శరీరమును పొందెను. ఆ ప్రభువు తనను తండ్రివలె భావించు ఆ పుత్రులను బాగుగా స్మరించెను. రాత్రి పగళ్ల మధ్యన ఉపపక్షముల రెంటిచే పితరులను సృజించెను. కావున ఆ పితరులు దేవతలు అందుచేత వారియందు అ పుత్రత్వము.

పితరులను సృష్టించిన ఆ శరీరమును బ్రహ్మ తొలగించెను. ఆ శరీరము తొలగి నందున వెంటనే సంధ్య పుట్టినది. కావున పగలు దేవతలకు సంబంధించినది, రాత్రి అసురులకు సంబంధించినదని చెప్పబడును. ఆ రాత్రి పగళ్ళ మధ్య సంధ్య పితృ దేవతలకు సంబంధించినదియై శ్రేష్ఠమైనది. కావున దేవాసురులు అందరును ఋషులును మునులును వీరందరు కలిసి బ్రహ్మయొక్క (మధ్యమమైన) శరీరమైన సంధ్యను ఉపాసించుచున్నారు.

అంత, ఆ బ్రహ్మ మరల వేరొక శరీరమును ధరించెను. రజోమాత్రాత్మకమైన ఆ శరీరమునందు ఆ ప్రభువు మనస్సుతో ప్రజలను సృష్టించెను. అనగా బ్రహ్మ మనస్సు నుండి మానస ప్రజలు పుట్టిరి. ఆప్రజలనుచూచి కూడ బ్రహ్మ మరల తన శరీరమును తొలగించెను. ఆ శరీరమును తొలగించుటచే వెంటనే వెన్నెల కలిగెను. వెన్నెల కలుగగా దాని నుండి సంతసించిన ప్రజలు పుట్టిరి. ఈ విధముగ మహాత్ముడగు బ్రహ్మచేత శరీరములు తొలగింపబడినవి.

వెంటనే రాత్రిపగళ్ళు, సంధ్యా జ్యోత్స్నలు పుట్టినవి. జ్యోత్స్న, సంధ్య అట్లే పగలు, ఈ మూడు స్వయముగా సత్త్వ మాత్రాత్మకము. రాత్రితమో మాత్రాత్మిక. అదియే త్రియామిక. అందువలననే దివ్యతత్త్వము గలిగి సంతుష్టులైన దేవతలు బ్రహ్మ ముఖముల నుండి సృష్టింపబడిరి. వారి జన్మ పగలున జరిగినది. కావున వారు పగలు బలవంతులు.

ప్రభువైన బ్రహ్మ తన శరీరము నుండి అసురులను సృష్టించెను. కావున రాత్రి జన్మించిన వారు రాత్రియందు ప్రాణములకంటె కూడ అసహ్యులైరి. అసురులతోబాటు భవిష్యులైన దేవతలకును, భూతభవిష్యములలో పితృదేవతలకును మానవులకును మన్వంతరములలో అందరికిని ఇవియే నిమిత్తములగును. వెన్నెల రాత్రి, పగలు, సంధ్య ఈ నాలుగు భాసితములు (ప్రకాశింపబడినవి) దేనివలన భాసించునో అది వ్యాపించి ప్రకాశించుటలో (అర్థములో) 'భాసి' అని విద్వాంసులచే చెప్పబడినది. ఇంకను ప్రజాపతి ఇట్లు పలికెను.

ఆ బ్రహ్మ ఈ జలములను జూచి, దేవతలను, దానవులను, మానవులను, పితృ దేవతలను, తక్కిన విబుధులను తన ఆత్మనుండి సృజించెను. అంత ఆ శరీరమును మొత్తమును తొలగించి ఆ ప్రభువు మరొక శరీరమును సృజించెను. రజస్తమో గుణములు నిండిన శరీరమును ధరించెను. అంధకారములో ఆకలితో నుండి మరొక శరీరమును సృజించెను. దానిచే సృజింపబడి ఆకలిచే అలమటించినవారు నీటిని తీసుకొనుటకు ప్రయత్నించిరి. వారు ఈ నీటిని రక్షింతుము అనిరి. వారు లోకమున రాక్షసులని తలంపబడిరి. క్రోధాత్ములైన వారు నిశాచరులు.

నీటిని రక్షింతుమన్నవారు పరస్పరముగా సంతసించిరి. ఈ పనిచే వారు క్రూర కర్మలుగల యక్షులు, గుహ్యకులు అయిరి. క్షిధాతువు రక్షణార్థమున పాలించుట అను నర్థమున వర్తిల్లునని భావింపబడినది.

వారిని చూచిన కోపముతో ధీమంతుడైన బ్రహ్మయొక్క కేశములు రాలినవి. అపుడు శీతోష్ణము వలన పైకి లేచినవై (ప్రభువు శిరమున) మొలచినవి. ఆ శిరము నుండి హీనములై (తొలగినవై) వ్యాలములు అయిన కారణమున అవి అపసర్పితములై సర్పములైనవి. విరుద్ధముగా అడ్డినవి కాన వ్యాలాత్మలు హీనములు కావున, అహులు అనబడినవి. పన్నములు (జారిపడు చుండునవి) కావున పన్నగములు. అపసర్పిణులు అనగా వక్రముగా ప్రాకునవి, కావున సర్పములు వాటికి సూర్యచంద్రుల క్రింద భూమియందు నివాసములు (ఉండును). ఆ బ్రహ్మయొక్క కోపమువలన పుట్టినవాడు అగ్నిగర్భుడు, మిక్కిలి భయంకరుడు. అతడు సర్పములతో పాటు పుట్టిన విషాత్మకులను ఆవేశించెను.

అంత, సర్పములనుచూచిన కోపమువలన క్రోధాత్మలను సృజించెను. వారు కపిశ (కోతి) వర్ణముతో ఉగ్రులై భూతములు (కోరినది పొందువారు) మాంసాశను (రాక్షసు) లైరి. పోవుచున్నందు వలన గోవులు గంధర్వులును అపుడా బ్రహ్మకు పుట్టిరి. ధ్యాయతి అను ఈ ధాతువు యాత్రార్థమున పరిపఠింపబడును. త్రాగుచున్నందున గోవులు పుట్టినవి

అందుచేత వారు గంధర్వులు అనబడిరి. ఈ ఎనిమిది దేవయోనులు సృష్టింబడగా ఆ ప్రభువైన బ్రహ్మ తన స్వేచ్ఛతోనే వాయసులను, వయసములను (పక్షిజాతులను) సృజించెను. వానిని వయసులను వయాంసలను కప్పును కాన ఛందాసి అనబడినవి. ఆ బ్రహ్మ దేవుడు పక్షిగణములు లేమిచూచి ఆ పక్షిగణములను సృజించెను.

ఆ తరువాత ఆ బ్రహ్మ ముఖమునుండి మేకపోతులను సృజించెను. వక్షః స్థలము నుండి పక్షులను సృజించెను. కడుపు నుండి గోవులను ప్రక్క భాగముల నుండి ఇతర జంతువులను సృజించెను. పాదములనుండి గుఱ్ఱములను, ఏనుగులను, శరభములను (సింహమునుచంపు మీగండ్లు అను ఎనిమిది కాళ్ళుగల మృగములను), గోవులవలె ఉండు గురుపోతులను, లేళ్ళను, ఒంటెలను, కంచరి గాడిదలను మరియు ఇతరజాతులను సృజించెను. ఆ బ్రహ్మ రోమములనుండి ఫలములు కందమూలములు (గల వృక్షములు) సృజింపబడెను. ఇట్లే పశువులను, ఓషధులను, సృష్టించి ఆ ప్రభువైన బ్రహ్మ వానిని యజ్ఞములతో కలిపెను. (అందుకు ఉపయోగులుగా చేసెను.)

కల్పాదిలో త్రేతాయుగ ప్రారంభమున గోవు, మేక, పురుషుడు, గుఱ్ఱము, కంచర గాడిద, గాడిద వీనిని గ్రామ్యములైన పశువులందురు. ఇక అరణ్య పశువులను వినుడు. వ్యాఘ్రములు(పులులు), రెండు గిట్టలుగలవి. ఏనుగు, వానరము, పక్షులు ఈ అయిదును, ఆరవవి పందికొక్కులు ఏడవవి పాములును సృష్టించబడినవి. ఆ బ్రహ్మ తన మొదటిదైన తూర్పు ముఖము నుండి యజ్ఞములకు సంబంధించిన గాయత్రమును వరుణమును, త్రివృత్సోత్యమును, రథంతరమును, అగ్నిష్టోమమును సృజించెను. ఆ బ్రహ్మ తన దక్షిణ ముఖము నుండి ఛందస్సులను, త్రైష్టుభ కర్మను, పంచదశ స్తోమములను, అట్లే బృహత్సామ మును, తరువాత ఉక్థ్యమును సృజించెను. బ్రహ్మ తనపశ్చిమ ముఖమునుండి సామము లను, జగత్ఛ్చందములను, పంచదశాస్త్రోమములను, అట్లే వైరూప్యమును అతి రాత్రమును సృజించెను. ఉత్తర ముఖమునుండి ఇరువది యొక్క అధర్వాణమును, ఆప్తోర్యామాణ మును, అనుషుభమును, వైరాజమును సృజించెను.

మెరుపులను, పిడుగులను, మేఘములను, చక్కని (ఋజువైన) ఇంద్ర ధనుస్సు లను, వక్రమైన ఇంద్ర ధనస్సులను, పక్షులను కల్పాదిలో భగవంతుడై ప్రభువైన బ్రహ్మ సృజించెను. అనేక ప్రకారములైన భూతములు ఆ బ్రహ్మయొక్క గాత్రముల నుండి పుట్టినవి. ప్రజాపతియైన బ్రహ్మ నుండి ప్రజాసృష్టి జరిగినది. మొదట దేవతలు, అసురులు, పితరులు, ప్రజలు అను ఈ నాల్గింటిని సృష్టించి, తరువాత స్థావరములను చరములను సృష్టించెను.

తరువాత యక్షులను, పిశాచులను, గంధర్వులను, అట్లే అప్సరస గణములను, కిన్నరులను, రక్షస్సులను, పక్షులను, పశువులను, మృగములను, పాములను నశించనివానిని, నశించు వానిని, స్థాణు, జంగములను, వాని కర్మలను పూర్వ సృష్టిలో పొందిరి. అవియే మరల మరల సృష్టింపబడుచున్నవి.

హింస్రా హింస్రములు అనగా (చంపు) స్వభావము గలవారు దానికి విరుద్ధులు మెత్తని స్వభావము గలవారు. క్రూర స్వభావము గలవారును, ధర్మము, అధర్మము, సత్యము, అసత్యమును ఇవి భావింపబడినవై పొందబడును. కావున అవి వానికి రుచించును. మహాభూతములలో వినియోగమును బ్రహ్మయే స్వయముగా చేసెను. కొందరు మానవులు పురుషకారకర్మ (పురుష ప్రయత్నము) యే తమ స్థితికి ముఖ్యమందురు. దైవ చింతకులై విప్రులగు మరొకరు తమ స్థితిని దైవమని (దైవాధీనమని) అందురు. ఈ తమ స్థితికి పురుష ప్రయత్నమున కొందరు దైవ ప్రయత్నమును కొందరు అధికమందురు. పౌరుష-దైవములు వాని సఫలస్వభావమును బట్టి ఒకటిగా గాని, వేరుగా గాని, వానిలో ఒకటి అధికమని గాని ఉండవని పెద్దలు తెలియుదురు. రెంటిలోనే యొకదానికి, అధిక న్యూనతలు లేవు. అనగా సమానములు.

సత్త్వగుణవంతులై సర్వసమతను చూచువారు విషయములను (ఐహిక భోగము లను) పురుష ప్రయత్న రూప కర్మవల్ల పొందదగిన వానిగా చెప్పుదురు. ఆ మహేశ్వరుడు, మొదట నామ రూపాత్మకమును, సృష్టింపబడిన భూతములను విస్తరింపజేయుటను వేదశబ్దముల నుండియే నిర్మించెను. ఋషుల యొక్క నామ ధేయములకు దేవతలలోని దృష్టులను రాత్రి చివరలో ప్రసవించిన వారి యొక్క నామ ధేయములను ఆ బ్రహ్మ ధరించును. ఋతువులో చివర నానారూపములైన ఋతు చిహ్నములు కనబడునట్లే యుగాదులలో గూడ నానా రూపములైన యుగచిహ్నములు ఆ విధముగనే కనబడును. పుట్టుక తెలియని బ్రహ్మచే ఈ విధముగా సృష్టింపబడిన వానిలో రాత్రి చివర మానసీ సిద్ధినాశ్రయించి నామ రూప చిహ్నములు గనబడుచున్నవి. ఈ విధముగ భూతములు చరాచరములు సృష్టింపబడినవి. మహామేధావియైన బ్రహ్మచే సృష్టింపబడిన ఆ ప్రజలు చక్కగా వృద్ధిపొందకుండిరి.

ఆ తరువాత తనను పోలిన మానస పుత్రులను కొందరిని బ్రహ్మ సృష్టించెను. భృగువు పులస్త్యుడు పులహుడు, క్రతువు, ఆఙ్గిరసుడు, అట్లే మరీచి, దక్షుడు, అత్రి (మానసుడైన) వసిష్ఠుడు ఈ వీరు బ్రహ్మాత్మకులుగా బ్రహ్మవాదులు అయిన అందరిలోను నవ బ్రహ్మలని పురాణముచే నిశ్చయముగా తెలియబడినవారు.

తరువాత పూర్వులలో పూర్వుడైన బ్రహ్మ సంకల్పాత్మకుడును ధర్మాత్ముడును, రోషాత్మ వల్ల పుట్టినవాడు అగు రుద్రుని సృజించెను. ముందు బ్రహ్మ తన మనసు నుండి పుట్టిన తనతో సమానులైన సనందనుని, సనకుని విద్వాంసుడైన సనాతనుని, సనత్కుమారుని, ప్రభువగు సనందముని సృజించెను. కాని ఏ కోరికలు (అపేక్షలు) లేని ఆ సనాతనులు లోకమున ఏమియు సృష్టించరైరి. వారందరు చక్కగా జ్ఞానమును పొందినవారు గలవారు విరాగులు, విమత్సరులు. లోకవృత్త కారణమున వారు అపేక్షింపదగిన వారైరి. అపుడు హిరణ్యగర్భుడు భగవంతుడైన బ్రహ్మ యొక్క అతని రోషము వలన పుట్టిన పురుషుడు సూర్యసమాన తేజస్కుడు. సగము స్త్రీ సగము పురుషుడుగల శరీరముగలవాడు. మండుచున్న అగ్నివంటివాడు. సూర్య సమాన తేజస్సుగలదై అంతయు తేజోమయమైనది. 'ఆత్మను (తనను) విభజించుము' అని (రుద్రునికి బ్రహ్మ చెప్పి అచటనే అంతర్ధానమయ్యెను.

ఈ విధముగా చెప్పి ఆ ఈశ్వరుడు స్త్రీ వేరుగా పురుషుడు వేరుగా రెండు విధములు అయ్యెను. ఆ ఈశ్వరుడు తన సగభాగమును పదకొండు విధములుగా పుట్టించెను. ఆ మహాత్మునిచే చెప్పబడిన వారందరు మహాత్ములు జగత్తుయొక్క బహుళీభావమును గురించి హితములను గోరువారు. మీరు లోకము గడచుట కారణముగా సోమరితనము లేనివారై విశ్వము యొక్కయు సమస్త లోకము యొక్కయు స్థాపన కొరకును దాని మంచి కొఱకును ప్రయత్నించుడు అని ఈ విధముగా చెప్పి (ఆ పదకొండు శివార్ధ రూపములు) రోదనము చేసిరి (ఏడ్చిరి). అంతటను పరుగిడిరి. రోదనము వల్లను ద్రావణము వల్లను వారు రుద్రులను పేర్లతో ప్రసిద్ధి చెందిరి.

ఆ రుద్రులే చరాచరములతో నిండిన ఈ సమస్త త్రైలోక్యమున వ్యాపించి ఉండిరి. వారి యొక్క అనుచరులే (ఎప్పుడు వెంబడి ఉండి సేవించువారు) లోకమున సర్వలోక పరాయణులు, పదివేల ఏనుగుల బలముగలవారు,పరాక్రమముగలవారు, అయిన గణేశ్వరులు. వారు గణముల నాయకులుగా ఉన్నారు. నేనీ వరకు చెప్పినదియు మహైశ్వర్యము గలదియు స్వయంభువైన బ్రహ్మయొక్క శరీరము, ముఖమునుండి పుట్టినదియునై, శంకరార్ధ శరీరముదాల్చినదై అర్ధనారియైనది. ఆమె కుడి సగభాగము తెలుపు ఎడమ సగభాగము నలుపు. బ్రహ్మ ఆమెను 'ఆత్మను (తనను) విభజించుకొనుము' అనగానే బ్రహ్మ చెప్పిన విధముగనే, ఆమె రెండుగానై, తెల్లనిదిగను నల్లదిగను అయినది. ఆమె నామములను చెప్పెదను ఏకాగ్రచిత్తులై వినుడు. స్వాహా, స్వధా, మహావిద్యా, మేధా, లక్ష్మీ! సరస్వతీ, అపర్ణా, ఏకవర్ణా, పాటలా, ఉమా హైమవతీ, షష్ఠీ (కాత్యాయనీ), కళ్యాణీ, ఖ్యాతీ, ప్రజ్ఞా, మహైశ్వర్యవతియైన గౌరీ (ఇవి 16 షోడశదుర్గ నామరూపములు). అర్ధనారి తన్నుతాను విభజించుకొన్న 16 రూపముల యొక్క నామములుగా ఈనామములు లోకమున ప్రసిద్ధి చెందినవి.

ఆర్యయొక్క వేర్వేరు దేహములను ధరించుటచే ఆమె విశ్వరూపయైనది. మొదటి నుండి సంగ్రహముగా ఆమె విశ్వ రూపములను వినుడు. ప్రకృతి, నియతా, రౌద్రీ, దుర్గా, భద్రా, ప్రమాథినీ, కాలరాత్రి, మహామాయా, రేవతీ, భూతనాయికా.

ఇటు పిమ్మట ద్వాపర యుగాంతమున చెందిన మార్పు దేవి యొక్క నామములను వినుడు. గౌతమీ, కౌశికీ, ఆర్యా, చండీ, కాత్యాయనీ, సతీ, కుమారీ, యాదవీ, దేవీ, వరదా కృష్ణపింగళా, బర్హిర్ధ్వజా, శూలధరా, పరమ బ్రహ్మచారిణీ, మహేంద్రీ, ఇన్ద్ర భాగినీ, వృషకన్యా, ఏకవాససీ, అపరాజితా, బహుభుజా, ప్రగల్భా సింహవాహినీ, ఏకనాసా, దైత్యహనీ, మాయా, మహిష మర్దినీ, అమోఘా, వింధ్యనిలయా, విక్రాంతా, గణనాయికా, వరుసగా ఇవి దేవీ నామ వికారములు. తత్త్వతః (తాత్త్వికముగా) భద్రకాళీస్తవములో చెప్పబడిన వీనిని చదివిన వారికి అవమానముండదు. అరణ్యమునగాని, దూరమైన ఏడాది త్రోవలో గాని, పురమునగాని, ఇంటగాని దీని రక్షను (ఈ నామములతో మంత్రించిన భస్మమును పెట్టుట ఈ నామములను వ్రాసిన తాయెత్తును ధరింప జేయుటను) ప్రయోగింపవలెను. జలమున గాని స్థలమున గాని పులి నుండిగాని, మొసలినుండి గాని, దొంగల నుండిగాని, ఈ నామములతో రక్షించుకొనవచ్చును. విశేషించి భూతములుండు స్థానమున అన్ని విధములైన రోగముల యందును ఈ నామములను చదువవలెను. బాల గ్రహములు, భూతములు, పూతనా మాతలు తల్లిగా వచ్చునట్టి పూతనాది పిశాచములు వీనిచే పీడింప బడిన వారికి ఈ నామములతో రక్షను ప్రయోగించవలెను.

మహదేవీ కులమునందైతే ప్రజ్ఞా-శ్రీ అను ఇద్దరు చెప్పబడుచున్నారు. ఈ రెంటి నుండి సమస్త జగమును వ్యాపించిన దేవీ సహస్రములను (వేలకొలది దేవీ శక్తులను) ఆమె సృజించినది. వ్యవసాయము పురుష ప్రయత్నము. ధర్మము, భూతముల సుఖాసుఖములు సంకల్పము ఇవి కల్పాదిలో అవ్యక్తజన్ముడైన బ్రహ్మనుండి పుట్టినవి. బ్రహ్మ యొక్క మనస్సు నుండి పుట్టిన పుత్రుడు రుచి అని తెలియవలెను. బ్రహ్మ తన ప్రాణము నుండి దక్షుని సృజించెను. కన్నుల నుండి 'మరీచి' (మహర్షి)ని సృజించెను. బ్రహ్మయొక్క హృదయము నుండి భృగు మహర్షి జనించెను. శిరస్సునుండి అంగిరసుడను మహర్షి, చెవి నుండి అత్రి మహర్షి, అట్లే బ్రహ్మ తనయొక్క ఉదానవాయువు నుండి (కంఠము నుండి) పులస్త్య మహర్షిని, వ్యాన వాయువు నుండి (సర్వ శరీరము నుండి) పులహ మహర్షిని సమాన వాయువు నుండి (నాభి నుండి) వశిష్ఠ మహర్షిని, అపానవాయువు నుండి (గుదము నుండి) వక్రత మహర్షిని, ఈ సప్త ర్షులను సృజించెను. అభిమాన స్వభావముగల వాడును, భద్రుడును (మంగళరూపుడు)అగు శివుని సృజించెను. ఈ వీరందరు బ్రహ్మ యొక్క ప్రాణము నుండి పుట్టిన పంద్రెండుగురు పుత్రులు.

వీరందరు బ్రహ్మ మానసపుత్రులని తెలియవలెను. ఈ విధముగ సృష్టింపబడిన భృగు మహర్షి మొదలగువారు బ్రహ్మవాదులు (పరబ్రహ్మను గురించి చెప్పువారు) భార్యతో గృహస్థాశ్రమమున ఉన్నవారు. చాల ప్రాచీనులు. వారిచేతనే మొట్ట మొదటి ధర్మము లోకమున నడపబడినది. రుద్రునితో కలిపి పండ్రెండుగురు ప్రజలు, ఋభువు సనత్కుమారుడను ఈ ఇద్దరు ఊర్ధ్వరేతస్కులు. వీరు వారి నుండి మొదట జన్మించినవారు. అందరి కంటెను పూర్వులు, పురాణమై (ప్రాచీనమై) వైరాజ్యమైన ప్రథమ కల్పము గడచిపోగా, వారిద్దరు ఆత్మయందు ఆత్మను ఆరోపించుకొని (ఆత్మను ఆత్మలో నిలిపి), యోగ ధర్మమున ఉన్నవారు. తమ మహాతేజశక్తితో ప్రజలలో ధర్మ కామములను చక్కగా ప్రవర్తింప జేయుచుండిరి.

పుట్టినప్పటి రీతిలోనే ఉన్నవాడు కావున కుమారుడు అనబడును. అందువలననే సనత్కుమారుడు అని ఈతని నామము కీర్తింపబడినది. వారి ఆ వంశములు పండ్రెండు. అవి దివ్యములు, దేవగుణములతో కూడినవి. క్రియావంతములు ప్రజావంతములు, మహర్షులచే అలంకరింపబడినవి. ఈ విధముగా ఇది లోకములను సృజించుటకు బ్రహ్మ యొక్క కరణముల నుండి పుట్టినది. మహత్తు మొదలుకొని విశేషము వరకు స్వయముగా ప్రకృతి యొక్క వికారము. చంద్ర సూర్యుల కాంతి యొక్క వెలుగు గ్రహనక్షత్రములచే అలంకరింపబడినది. నదులచేతను, సముద్రములచేతను, పర్వతములచేతను చుట్ట బడినది. అట్లే వివిధ ఆకారములుగల పురముచేత, ప్రీతములైన జనపదముల చేతను అవ్యక్తమైన ఆ బ్రహ్మ వనమున బ్రహ్మ రాత్రిలో చరించెను.

ఈ సనాతన వృక్షము (బ్రహ్మ వృక్షము) అవ్యక్తమను బీజము నుండి పుట్టినది. అవ్యక్తానుగ్రహమున పైకి లేచినది. బుది అను స్కంధముతో (చెట్టు మొదలుతో) నిండినది ఇంద్రియములు అనెడి మొలకలు చెట్టు తొఱ్ఱలు కలది. మహాభూతములను పెద్ద కొమ్మలు కలది. విశేషములచే పత్రములు కలది. అట్లే ధర్మాధర్మములు సుపుష్పము లుగా గలది. సుఖ దుఃఖములు ఫలములుగా కలది. సర్వ ప్రాణులకును జీవనోపాయమైనది. ఇది ఆ బ్రహ్మ వృక్షము యొక్క బ్రహ్మబలము. అవ్యక్తము కారణము అయిన తత్త్వము నిత్యము (నాశనము లేనిది) సదసదాత్మకమును అయినది. బ్రహ్మ యొక్క అనుగ్రహ రూపమై ప్రాకృతమైన ప్రకృతి నుండి వచ్చిన సృష్టి ఈ విధమైనది.

అభిమానియైన బ్రహ్మయొక్క అముఖ్యాదులైన ఆరు సృష్టులు వైకృతములు, బుద్ధి పూర్వకములునై భూతభవిష్యద్వర్తమానరూప త్రికాలములలో చక్కగా జరిగినవి. పండితులు అసృష్టులు పరస్పరము కారణము అగునని చెప్పిరి. దివ్యములైన రెండుపక్షులు చక్కని

రెక్కలు గలవియై జతగూడి ఉన్నవి. అవి కొమ్మలతోను పలువిద్రుమము (తెలుపు ఎరుపు) వర్ణములు కలవిగా నున్నవి. అందులో ఒకటి సర్వాత్ముడైన బ్రహ్మయొక్క వృక్షమును తెలిపును. వేరొకటి తెలుపదు. బ్రహ్మయొక్క మూర్ధము (శిరము)ను స్వర్గ లోకమని విప్రులు స్తుతింతురు. నాభిని ఆకాశమని, నేత్రములు చంద్ర సూర్యులని, చెవులను దిక్కులని, పాదములను భూమి అనియు, ఆ బ్రహ్మ అచిన్త్య స్వరూపుడైన సర్వప్రాణులను పుట్టించిన వాడని బ్రాహ్మణులు స్తుతింతురు. ఆ బ్రహ్మ ముఖము నుండి బ్రాహ్మణులు, రొమ్ము పూర్వ భాగమునుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులును, పాదములనుండి శూద్రులును మొత్తము శరీరమునుండి సర్వవర్ణములు జనించినవి. అవ్యక్తము కంటె మహేశ్వరుడు, పరుడు. అవ్యక్తమునుండి అండము పుట్టినది. అండము నుండి మరల బ్రహ్మ జనించెను. ఆ బ్రహ్మచే ఈ లోకములు జనించినవి. (9)

మన్వంతరాది వర్ణనము

సూతుడు పలికెను :

లోకకర్తయైన బ్రహ్మచే లోకములట్లు సృజింపబడగా ఏ కారణము చేతనో ప్రజలు (ధర్మ మార్గమున) ప్రవర్తింపకుండిరి. అప్పటి నుండి బ్రహ్మ తమోగుణముచే చుట్ట బడెను. తరువాత తన బుద్ధిని విషయములను నిశ్చయించునట్లుగా చేసెను. వెంటనే తనయందు నియమించునదైన తమోగుణ మాత్రముచే నిండిన బుద్ధిని సృష్టించెను. ధార్మికముగా మండుచున్న రాజసగుణమును ఓడించెను. ఆ దుఃఖముచే తపింపబడి, జగత్పతి శోకించెను. దాని వలన తమోగుణము తొలగెను. రజోగుణము తమోగుణమును ఆవరించెను. తొలగించబడిన ఆ తమోగుణము యుద్ధమును కలిగించెను. రణము నుండి అధర్మము జన్మించెను. శోకము నుండి హింస జనించెను. అంత రజోరూపమైన ఆ మిధునము జనింపగా భగవంతుడు సంతసించెను. అట్లు సంతసించినవాడై కాంతిలేని తన శరీరమును ఆశ్రయించెను. ఆ శరీరమును ఒక క్రొత్త విధముగా భావించెను. ఆ దేహమును రెండు విధములుగా చేసెను. అది సగము పురుషుడు సగము స్త్రీ అయ్యెను. ఆ స్త్రీ శతరూప అయ్యెను. ప్రాకృతయై భూతదాత్రి యైన మాయను అనుసరించి ఆ ప్రభువు కామములను సృజించెను. ఆమె తన మహిమచే ఆ స్వర్ణమును భూమిని గూడ వ్యాపించి నిలిచెను. బ్రహ్మ యొక్క మొదటి శరీరమును స్వర్ణ మావరించియున్నది.

తన అర్ధ శరీరము నుండి సృజింపబడిన స్త్రీయగు, శతరూప అతి కష్టమైన లక్ష తపము జేసెను. దీప్తయశస్కుడైన పురుషుని భర్తగా పొందెను. అతడే ఇట స్వాయంభువ

మన్వంతరము వాడైన, మొదటి పురుషుడైన మనువు అనబడుచున్నాడు. ఇచట డెబ్బది యొక్క యుగములు ఆతని మన్వంతరము అనబడును. ఆ పురుషుడు అయోనిజయైన శతరూపను పత్నిగా పొందెను. అతడు ఆమెతో రమించుచుండెను. ఆ కారణమున ఆమె (ఆ రమణ క్రియ) రతి అనబడినది. కల్పాదిలో అదియే మొదటి సంప్రయోగము (స్త్రీ పురుష సంపర్కము) గా జరిగెను.

బ్రహ్మ విరాజుని సృజించెను. ఆతడు విరాట్టయ్యెను. ఆదిదేవుడు బ్రహ్మ మానస రూపుడై వైరాజుడైన విరాట్టు నుండి పుట్టినవాడు, చక్రవర్తియైన మనువు అనబడెను. అది వైరాజమైన ప్రజాసృష్టి. ఆ సృష్టిలో పురుషుడు మనువు. వీరుడైన విరాట్పురుషుని నుండి శతరూప పుట్టెను.

పుత్రవతులలో శ్రేష్ఠులైన ప్రియపుత్రుడు ఉత్తానపాదుడు అను పుత్రులును, ఇద్దరు గొప్ప సౌభాగ్యవతులైన కన్యలును కలిగిరి. ఆ కన్యలనుండి ఈ ప్రజలు పుట్టిరి. దేవీ ఆకూతి, ప్రసూతి అని వారి పేరుతో ప్రభువైన బ్రహ్మ స్వాయంభువుని సంతానమును దక్షునకు ఇచ్చెను.ప్రాణము దక్షుడని సంకల్పము మనువు అని అనబడిరి. ప్రజాపతియైన రుచికి ఆకూతినిచ్చెను. మానసపుత్రుడైన రుచికి ఆకూతియందు శుభమైన మిథునము పుట్టెను. యజ్ఞుడు, దక్షిణ అను (యమకులు) జంట పుట్టినది. ఆ యజ్ఞ–దక్షిణలకు పంద్రెం డుగురు పుత్రులు జనించిరి. వారు స్వాయంభువ మన్వంతరమున యాములు అని అన బడిరి. యజ్ఞ రూపుడైన యమునకు పుత్రులుగాన వారు యాములనబడిరి. అజితులు, శూకులు అను రెండు బ్రహ్మయొక్క గణములనబడినవి.

స్వర్గ నివాసులైన దేవతలకు పేరుగావున పూర్వము యాములు విహరించిరి. స్వాయంభువ మనువు కూతురైన ప్రసూతియందు లోకమాతయు జనించిరి. దక్షునకు ఆ కన్యయందు ఇరువది నలువురు కన్యలను బ్రహ్మ జనియింప చేసెను. వారందరు మహాభాగ్యవంతులు కమలలోచనలు. వారు యోగపత్నులు యోగమాతలు శ్రద్ధా, లక్ష్మీ, ధృతి, తుష్టి, పుష్టి, మేధా, క్రియా అట్లే బుద్ధి, లజ్జా, వపువు, శాంతి, సిద్ధి, కీర్తి, త్రయోదశి అని పేర్లు గలవారు. దాక్షాయణులైన దక్షుని కన్యలను ధర్ముడు భార్యార్థముగా స్వీకరించెను. బ్రహ్మ ఈ కన్యలను ధర్మునకు (సృష్టికి) ద్వారములుగా చేసెను. వారికన్న మిగిలిన సులోచనలు, పిన్నవారును ఐనవారు పదకొండుగురు కన్యలును కలరు. వారు ఖ్యాతి, సతీ, తరువాత సంభూతి, స్మృతి, ప్రీతి, క్షమా అట్లే సన్నతి అనువారు అనసూయా, ఊర్జా, స్వాహా, స్వధా–అనువారు. వారినైతే మహర్షులు (భార్యలుగా) పొందిరి.

రుద్రుడు, భృగువు, మరీచి, ఆంగిరసుడు, పులహుడు, క్రతువు, పులస్త్యుడు, అత్రి, వసిష్ఠుడు, పితరులు, అగ్ని అను వీరు ఆ ఋషులు. సతిని భవునకిచ్చెను. ఖ్యాతిని భృగువునకు, అట్లే, మరీచికి సంభూతిని, ఆంగిరసునకు స్మృతిని ఇచ్చెను. పులస్త్యునకు ప్రీతిని, పులహునకు క్షమను, క్రతువునకు సన్నతిని, అట్లే అత్రికి అనసూయను, వసిష్ఠునకు ఊర్జను, అగ్నికి స్వాహాను, పితురులకు స్వధను, ఇచ్చెను. వారియందు ఆ ఋషులకు కలిగిన సంతానము ముందు చెప్పబడుచున్నది.

అన్ని మన్వంతరములలోను సర్వభూత ప్రళయమగునంత వరకు, ఈ అందరు మహానుభావులును ఉందురు. లౌకికాలౌకిక సూక్ష్మ బుద్ధులు వారి ప్రజ్ఞలను అయిన చక్కగా అనుష్ఠించుచుందురు.

వారిలో శ్రద్ధ కాముని కనెను. దర్పుడు (దర్పము) లక్ష్మీసుతుడు అనబడెను. ధృతికి నియముడు (నియమము) పుత్రుడు తుష్టికి సంతోషుడు పుత్రులు. పుష్టికి లాభుడు సుతుడు. మేధా పుత్రుడు శ్రుతుడు (శ్రుతము) అట్లే, క్రియకు నయుడు (నయము) దణుండు (దండము) సమయుడు (సమయము)ను పుత్రులు. బుద్ధికి బోధుడు అప్రమాదుడు అను ఇద్దరు పుత్రులు, లజ్జకు వినయుడు (వినమయ) పుత్రుడు. వ్యవసాయుడు (వ్యవసాయము) వపువుయొక్క పుత్రుడు. క్షేముడు (క్షేమము) శాంతికి పుత్రుడు. సిద్ధికి సుఖుడు (సుఖము) కలిగెను. కీర్తికి యశుడు (యశము) సుతుడు. ఈ విధముగ వీరందరు ధర్ముని పుత్రులు (ధర్మము యొక్క పుత్రులు) కామునకు, దేవియైన రతి వలన హర్షుడను పుత్రుడు కలిగెను. ఈ విధముగ సుఖమునే ఫలముగా ఇచ్చు ధర్ముని యొక్క సృష్టి చెప్పబడినది.

అధర్మము నుండి హింస జనించెను. నికృతి–అనృతులు ఇద్దరును పుట్టిరి. ఆ నికృతి–అనృతులు ఇద్దరికి, భయము, నరకము జనించినవి. వీరిద్దరికి మాయ–వేదన అను మిథునద్వయము గలిగెను. భయమునుండి, మాయ భూతాపహారిణియగు మృత్యువునుకనెను. తరువాత వేదన నుండి దుఃఖము గలిగెను. తరువాత భయంకరమైన మృత్యువు నుండి వ్యాధి, జ్వర, శోకములు, క్రోధము, అసూయయును కలిగెను. ఇవి అన్నియు దుఃఖముతో నిండినవి. అధర్మలక్షణములు. వారికి, వారికి భార్యగాని పుత్రుడుగాని, వారందరు నిధనులే (మరణములే) అనబడిరి. ఈ విధముగా ధర్మ నియామకమైన తామస సృష్టి కలిగినది.

ప్రజలను సృజింపుమని బ్రహ్మచే నీలలోహితుడైన శివుడు ఆజ్ఞాపింపబడెను. ఆతడు ధ్యానించి ఆత్మసంభవమైన సతిని భార్యగా నిర్మించుకొనెను. తనకు మించకయు తగ్గకయు

సమముగా ఉన్న వేయివేల (10 లక్షల) మానవ సుతులను సృజించెను. వారందరు కృమివాసస్సుతో (పట్టు వస్త్రముతో) రూప–తేజో–బల–శ్రుతములతోను తనకు సమానులు.

ఎఱ్ఱని (గోరోచనపు వర్ణముగల)వారిని, సన్నికర్షులను, జటాజూటము కలవారిని, విలోహితులను (ఎర్రని వారిని) వస్త్రములేని వారిని, కోతిరంగు వెంట్రుకలు గలవారిని, దృష్టులను పోగొట్టువారిని, కపాలములు ధరించువారిని, బహు రూపములు గలవారిని విరూపులను, విశ్వరూపులను, రూపవంతులను, రథములు గలవారిని, కవచములు గల వారిని, ధర్ములను, సేనలను, లక్షబాహువులుగల వారిని, దివ్యులను భౌములను (భూమియందు ఉండువారు) అంతరిక్షగులను (ఆకాశమునందు ఉండు వారు) లావుతల గలవారిని, ఎనిమిది కోరలు గల వారిని, రెండు నాలుకలు కలవారిని, మూడు కన్నులు కల వారిని, అన్నము తినువారిని, మాంసము తినువారిని, నేయి త్రాగువారిని, సోమ రసమును త్రాగు వారిని, మేధస్సును త్రాగువారిని అతికాయులను (లావు శరీరము గలవారు) నల్లని కంఠము, తీవ్రకోపమునుగల వారిని, అమ్ముల పొదులుగల వారిని, తలత్రము (రక్షణ కవచము)పై గలవారిని, ధనుర్ధారులను, ఉపకవచము గలవారిని, కూర్చున్నవారిని, పరిగెత్తుచున్నవారిని, ఆవులింతలు తీయువారిని, ధిష్ఠితులను (నివసించిన వారిని), అధ్యాపకులను, జపము చేయుచున్న వారిని, కలియుచున్న వారిని, ధ్యానము చేయుచున్న వారిని, మండుచున్నవారిని, వర్షించుచున్నవారిని, ప్రకాశించుచున్న వారిని మిక్కిలి పొగ వేయబడినవారిని, బుద్ధులను, బుద్ధతములను, బ్రహ్మలో నిలచిన వారిని, శుభదర్శనులను, నీలకంఠులను, సహస్రాక్షులను, సమస్త రాత్రిచరులైన రాక్షసులను, సర్వభూతములకు కనబడని వారిని, హాహాయోగులను, మహాతేజస్సు గలవారిని, రోదనము చేయుచున్నవారిని, పరుగిడుచున్నవారిని, ఈ విధముగా కలిసి ఉన్న వారిని వేలకు వేలు అపాత యాములను రుద్ర రూపులయిన సురోత్తములను సృజించెను.

బ్రహ్మ వీరిని చూచి ఇటువంటి ప్రజలను సృష్టించవలదనెను. నీకు సమానులైనట్టి వారిని గాని, నీకంటె అధికులైనట్టివారిని గాని ప్రజలను సృష్టింపరాదు. నీవు ఇతరులను సృజింపుము, నీకు భద్రమగును. నేనున్నాను. ప్రజలను సృజింపుము అనెను. "నేను సృష్టించిన వారు విరూపులు, నీలలోహితులు వేయివేలు నాతో సమానులుగా నిశ్చయింప బడినవారు. రుద్రులు అను మహాబలురు దేవతలుగా కలరు. భూమిలోను ఆకాశమునను రుద్ర నామముతో ప్రసిద్ధులు. శతరుద్రులని పిలువబడినవారు కాగలరు. యజ్ఞమునకర్హులు దేవ యుగములతోబాటు యజ్ఞఫలమును పొందువారుగూడ కాగలరు. ఛందజులై స్వేచ్ఛతో పుట్టినవారై మన్వంతరములలో పుట్టబోవువారితో బాటు యాగము

చేయచున్నవారై, యుగక్షయమువరకు ఇచట ఉండగలరు" అని మహాదేవుడు పలుకగా ధీమంతుడైన మహాదేవునిచే ఇట్లు చెప్పబడినవాడై బ్రహ్మ, సంతసించుచున్న ప్రజాపతియై, అపుడు భీముడైన శివునకు ఓ ప్రభూ! ఇట్లు నీవు చెప్పినట్లే అట్లే అగుగాక. నీకు శుభమగు గాక అని మారుపలికెను. అంత బ్రహ్మ సమ్మతించగనే ఎల్లప్పుడు ఎల్ల విషయములు జరిగినవి.

అప్పటినుండి దేవేశుడైన ఈశ్వరుడు ప్రజలను సృష్టించలేదు. ఊర్ధ్వరేతస్కుడై మహా భూతప్రళయము వరకు స్థాణువై, కదలని మొద్దై ఉండెను. ఆతడు నేను కదలక ఉన్నాను. అన్నందువలన స్థాణువు అని పిలువబడును. జ్ఞానము వైరాగ్యము. ఐశ్వర్యము, తపము, సత్యము, క్షమ, ధీతి, సృష్టృత్వము (సృష్టిచేయు తనము), ఆత్మజ్ఞానము, అధిష్టాతృత్వము (అందరకి పైన ఉండువాడు) ఈ ఐదు నిత్యము శంకరునియందుండును. సమస్త దేవతలను ఋషులను అసురులను గూడ తేజస్సుతో అతిశయించును కాన ఆతడు మహాదేవుడన బడినాడు. అందువలన శంకరుడు ఐశ్వర్యము వలన దేవతలను బలముచే రాక్షసులను, జ్ఞానము చేత మునులను అందరిని, యోగమువలన భూతములను అన్ని విధముల మించినవాడు.

ఋషులు :

ఓ మహామునీ! యోగమును, తపమును, సత్యమును, ధర్మమును, మహేశ్వర జ్ఞాన మును సాధనమును మాకు చెప్పుడు. బ్రాహ్మణులు ఏ యే ధర్మమును ఆచరించుటచే సద్గతిని (జ్ఞానమును) పొందగలరు ? ఓ ప్రభో మహేశ్వరయోగమైన దానినంతయు వినగోరు చున్నాము అని పలికిరి.

వాయువు పలికెను :

రుద్రునిచే పురాణములందు ఐదు ధర్మములు చెప్పబడినవి. క్లిష్టకర్ములు గాని రుద్రు లచే అది మాహేశ్వర్యముగా చెప్పబడినది. ఆదిత్యులు, వసువులు, సాధ్యులు, అశ్వినీ దేవతలు, మరుత్తులు, భృగువులు, దేవాలయములు గలవారు. యముడు, శుక్రుడు ముందుగా గల పితరులు కాలాంతకులు. వీరు మరికొందరైన అనేకులచేత ఆ ధర్మములు ఉపాసింపబడినవి. వారు అత్యంతము క్షీణించిన కర్మలను కలిగి, శరత్కాల మేఘమువలె నిర్మలములైన మునిగణములు తమ ఆత్మయందు ఆత్మను సంధానముజేసి (కలిపి) ఉపాసింతురు. గురువులకు ప్రియమును హితమును చేయుటకు పూనుకొన్నవారు. గురువుల ప్రియమును కోరువారు మానుషజన్మను వదిలి దేవతలవలె విహరింతురు.

మహేశ్వరునిచే చెప్పబడిన ఆ ప్రాచీన ధర్మములను అన్నింటిని క్రమయోగమున చెప్పెదను వినుడు. ప్రాణాయామము అట్లే ధ్యానము ప్రత్యాహారము (ఇంద్రియములను

విషయములనుండి మరల్చుట) ధారణ, స్మరణము ఈ అయిదును ఈ యోగమున ఐదు ధర్మములనబడినవి. క్రమ విశేషముతో వాని లక్షణమును కారణమును నిజముగా రుద్రుడు చెప్పిన రీతిగనే చెప్పబోవుచున్నాను వినుడు. ప్రాణము (వాయువు) యొక్క పొడవైన నడక ప్రాణము యొక్క ఆయామ మనబడును. అదియును మందము, మధ్యమము, ఉత్తమము అని మూడు విధములు. ప్రాణముల నిరోధము అనునది ప్రాణ వాయువులను అరికట్టుట ప్రాణాయామము అనబడినది. ప్రాణాయామ ప్రమాణము పంద్రెండు మాత్ర లనబడినది. మంద ప్రాణాయామము పంద్రెండు మాత్రలు, పంద్రెండు ఉద్ఘాతములు ప్రారంభములు. మధ్యమ ప్రాణాయామము రెండు ఉద్ఘాతములు, ఇరువది నాలుగు మాత్రల పరిమాణముకలది ఉత్తమ ప్రాణాయామము మూడు ఉద్ఘాతములు ముప్పది ఆరు మాత్రలు కలది చెమట, కంపము (వణుకు) విషాదములను కలుగజేయునది ఉత్త మము అనబడును. ఈ విధముగ ప్రాణాయామ లక్షణము మూడు విధములు. ఇది ప్రాణాయామము యొక్క ప్రమాణము సంగ్రహ లక్షణము.

సింహముగాని, ఏనుగుగాని అట్లే వేరొక మృగముగాని అరణ్యమున పట్టుకొన బడినదై సేవింపబడుచు క్రూరస్వభావము వదిలి మృదు స్వభావము కలదిఅగును. సమస్త పాపాత్ములకు పట్టుబడని ప్రాణము యోగము వలన సేవింపబడుచున్నదై అభ్యాసము వలన ఆ ప్రాణమే పట్టుబడును. ఆ ప్రాణమే సింహమువలె ఏనుగువలె కాలాంతర వశమువలన, యోగమువలన, పరిమర్దనమువలనను దుర్బల మగును. వాయువు యోగము నందుండి వశ్యత్వమును పొందును. అట్లే మనోదేవుని కప్పివాయువు ప్రాణము జీవించును. వాయువు యోగము నందుండి వశ్యత్వమును పొందినపుడు స్వేచ్ఛగా ప్రాణ మును కోరినచోటికి కొనిపోవును. సింహము గాని, ఏనుగుగాని మనుష్యుల వశమందుండి మనుష్యులను ఇతర మృగముల నుండి ప్రవర్తించును. అభయమునకై అట్లే విశ్వతో ముఖమైన (సర్వవ్యాపియైన) వాయువు పరిచితమై పరిధ్యాయమానమై ప్రాణాయామమున శరీరమందు సంరుద్ధమై పాపమును దహించి వేయును. పెంచిన కుక్క యజమానిని ఇతరుల భయమునుండి రక్షించినట్లే సర్వవ్యాపియైన వాయువు ప్రాణవాయువుగా శరీరమున బంధింపబడి శరీర ఘాతుకములైన దోషముల నన్నింటిని దహించివేయునని భావము. ప్రాణయామముతో యుక్తుడైన నియమబద్ధుడైన బ్రాహ్మణునకు సర్వదోషములు నశించును. అతడు సుస్వస్థుడు కూడ అగును. సర్వ తపములు సర్వయజ్ఞ ఫలములు ప్రాణాయామమునకు సమానము. నూరేండ్లు ప్రతిమాసమున దర్భాగ్రముతో నీటి బిందు వును ఆ దర్భాగ్రముతోపాటు తిని ఉపవాసము చేయుటతో ప్రాణాయామము సమానము.

ప్రాణాయామములతో దోషములను దహింపజేయవలెను. ధారణలచే పాపములను దహింపచేయవలెను. ప్రత్యాహారముచే (ఇంద్రియముల విషయ నివృత్తిచే) విషయ సుఖములను, ధ్యానముచే అనీశ్వరములైన అనగా ఈశ్వరత్వ ప్రాప్తికి విరుద్ధములైన గుణములను దహింపచేయవలెను. కావున సమర్థుడైన యోగి ప్రాణాయామపరుడు కావలెను. వాడు సర్వ పాపములు తొలగి విశుద్ధాత్ముడై పరబ్రహ్మను జేరును. (10)

పాశుపతయోజన

వాయువు పలికెను :

ఒక పూర్తి పగలుగాని, రాత్రి పగలు కలిసిన దినముగాని, సగము నెలగాని, నెలగాని, ఆరు మాసములతో గూడిన అయనముగాని, సంవత్సరము గాని, యుగములు గాని, మహాయుగ సహస్రములు గాని, ఋషులు తపస్సునందు ఉండి మహాత్ములై దివ్య చక్షువుచే ప్రాణమును ఉపాసింతురు. ఆ పైన భగవంతుడైన ప్రభువు చెప్పిన విధముగా ప్రాణాయామ ప్రయోజనమును ఫలమును చెప్పగలను. ప్రాణాయామముయొక్క ప్రయోజనములు నాలుగు అవి శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదము అనునవి.

దేహమును ధరించిన ప్రాణులు ఈ లోకమునను పరలోకమునను స్వయముగా కాలమును అనుసరించి కొన్ని పనులు చేయుదురు. అవి వాని ఫలమును అనుసరించి ఘోరములు అనియు, శాంతములు అనియు రెండు విధములు. బంధు సంబంధమైన సంకరములచే తల్లి దండ్రులు దోషవంతులు అగుదురు. దానిచే వారికి జనించిన సంతానము దుష్టమగును. కషాయ వర్ణముగా అంటిన ఆ పాపములను తపముచే శమింప చేయుట శాంతి అను తపమనబడును. ఇహపరలోక హితమునకై లోభముతోను, అభిమానముతోను చేసిన పాపములను గూడ తపమనబడును. జ్ఞానము, విజ్ఞానము సంపదగా గల ఋషులు ప్రసిద్ధులు. వారికి సూర్యుడు చంద్రుడు తారలును సమానముగా కనబడుదురు. గడిచిన వానిని రాబోవువానిని ప్రస్తుతము వర్తమానమగుచున్న వానిని జ్ఞాని సమానముగా చూడగలుగును అనగా వానియందు జ్ఞానియొక్క జ్ఞానప్రకాశము సమానము కాబడి ప్రత్యక్షము చేయును. అది దీప్తి అనుతపమనబడును. కన్ను మొదలగు ఇంద్రియములు, రూపము మొదలగు ఇంద్రియార్థములు మనస్సును ప్రాణాపానవ్యాన ఉదాన సమానములను ఐదు వాయువులు. వీనిని ఉద్రేకము నందకుండా ప్రసన్నముగా ఉంచు తపము ప్రసాదమనబడును. ఈ విధముగా ప్రాణాయామము నాలుగు విధములుగా ఉండు మొదటి ధర్మము. దీనికి ఫలము అతి సమీపములో ఉండును. ఇది ప్రసన్నమైన కాలమున అప్పటికప్పుడు కలుగును.

ఆపైన ప్రాణాయామ లక్షణమును చెప్పుదును. శరీరతత్త్వమును అనుసరించి తగిన ఆసనములో ఉండవలెను. చిత్తవృత్తులను (మనోవ్యాపారములను) నిరోధింప వలెను. ఓంకారమును ఉచ్చరించి, చంద్ర సూర్యులకు ప్రణమిల్లి, స్వస్తిక ఆసనమును గాని పద్మాసనమునుగాని, అర్థాసనముగాని వేసి ఉండవలెను. సమముగా మోకాళ్లు ఉండు నట్లుగాగాని, ఒకే మోకాలుండునట్లుగగాని, వెల్లికిలనుండిగాని, చక్కగా కూర్చున్నవాడై గూనితో ఒడుదుడుకులుగాకాక సమముగా కూర్చొన్నవాడై, రెండు పాదములు ముడిచి దృఢమైన ఆసనమున ఉండవలెను. తరువాత నోరు మూసుకొని క్రిందుగా అర్థ నిమీలిత నేత్రుడై బొమ్మును ముందుకు నిక్కబొడిచి, కాలిమడమలతో వృషణములను, లింగమును కప్పి కూర్చొనవలెను. తరువాత తలను మెడను కొద్దిగా ఎత్తవలెను, తన ముక్కు చివరకు చూడవలెను. దిక్కులు చూడరాదు. తమోగుణమును, రజోగుణముతో కప్పి, సత్త్వ గుణముతో రజోగుణమును కప్పివేయవలెను. తరువాత సత్త్వగుణములో ఉన్నవాడై చిత్త వృత్తుల నిరోధించుచు సమాధిలో ఉండవలెను. ఇంద్రియములను వాని విషయములైన రూపాదులను, మనస్సును, ప్రాణాదులైన ఐదు వాయువులను అంతర్ముఖముగా లాగి, వానిని వెనుదిరుగునట్లు చేయుటకు ఆరంభింపవలెను. వానిని కరిగి యేకాగ్రముగా చిత్తమున లయమగునట్లు చేయవలెను. తాబేలు తన అంగములనులోనికి ముడుచుకొను నట్లు కోరికలను అన్నింటిని ఉపసంహరించుకొన్నవాడు ఆత్మయందే రతుడై ఆత్మలో పరమాత్మను చూడగలడు. శరీరమును (వాయువుచే) నింపి బాహ్యాంతరముల పరిశుద్ధుడై కంఠమునుండి బొడ్డువరకు కలుపు యోగముచేత ప్రత్యాహారము అను వాయువును పీల్చు కొనుటను ప్రారంభింపవలెను.

కనురెప్పపాటువేసి తెరచునంత కాలము కలామాత్రయని తెలియవలెను. అట్లే ప్రాణాయామము పంన్రెండు మాత్రల కాలము చేయవలెను. పంన్రెండు (మాత్రల) పొడ వైనది ధారణ (చిత్తమునొకచోట నిలుపుట). రెండు ధారణలు యోగము. అట్టి యోగముతో కూడిన వాడు ఐశ్వర్యమును (ఈశ్వరత్వమును) పొందును. తన తేజముతో దీప్యమానుడైన పరమాత్మను చూచును. నియతాత్ముడై ప్రాణాయామయుక్తుడైన బ్రాహ్మణునకు సర్వ దోషములు నశించును. వాడు సత్త్వగుణమునందు ఉన్న వాడగును.

ఈ విధముగా నియతమైన ఆహారము గలవాడై, ప్రాణాయామపరాయణుడై భూమిని ఎప్పుడు జయించి, మునియై, అధిరోహింపవలెను. మహా భూమిని జయింపనిచో అది బహుదోషములను పుట్టించును. సమ్మోహమును కలుగజేయును. కావున జయింపని భూమిని అధిష్ఠింపరాదు. అస్త్రరూపమైన నాళముచే బలముతో కూడినవాడై ప్రయత్నముతో

నీరును సంపూర్ణముగా త్రావిన విధమున, శ్రమను జయించినవాడై వాయువును జయింపవలెను. నాభియందు, హృదయమున, కంఠమున, వక్షః స్థలమున, ముఖమున, నాసాగ్రమున అట్లే నేత్రమున, కనుబొమ్మల మధ్యన, ఆ తరువాత శిరమున దానికి కొంచెము పైనున్న పరమునందు ప్రాణమును మనస్సును నిలిపి ఉంచుట ధారణ అనబడును. ప్రాణపానములను చక్కగా అరికట్టి నిలుపుటచేత అది ప్రాణాయామము అనబడును. మనస్సును నిలుపుట ధారణ అనబడును. విషయములనుండి మనస్సును మరల్చుట ప్రత్యాహారమని చెప్పబడును. అన్నింటియొక్క సమూహమునందైతే అది యోగలక్షణ (రూప)మైన సిద్ధియగును. ఆ సిద్ధిచే కలిగిన యోగము యొక్క ధ్యానము సిద్ధి లక్షణ (రూప)ము ధ్యానయుక్తుడై సూర్యచంద్రులవలె ఎల్లప్పుడు ఆత్మను జూడవలెను.

సత్త్వము కలుగనప్పుడు దర్శనముకలుగదు. తగని దేశమునను తగని కాలమునను జరిపిన యోగమునకు దర్శనముండదు. అగ్ని దగ్గర, వనమున, ఎండిన ఆకుల కుప్ప యందు, అట్లే జంతువులు తిరుగాడు చోట, శ్మశానమున, పాడుబడిన గోశాలయందు, నాలుగు దారులు కలిసిన చోట (చౌరాస్తాలో) శబ్దముల అలజడి ఉన్నచోట, భయమున్న చోట రచ్చమ్రానులు పుట్టలు వీని సమూహము ఉన్నచోట, నీరుత్రావు బావిదగ్గర, అట్లే నదిలో బాధగలుగుచోటను ఎప్పుడును యోగమును పూనరాదు. ఆకలి బాధతో ఉన్నవాడు, సంతోషము లేనివాడు, వ్యాకులములైన కన్నులు గలవాడు, యోగమున పరమధ్యానమును చేయరాదు. కావున ఎల్లప్పుడును యోగి ధ్యానపరుడై ఈ దోషములను నిశ్చయించి తెలిసికొనవలెను. అవి ఉన్నను ప్రమాదమున యోగమును ఆచరించువానికి శరీరములో దోషములు ప్రకోపించి యోగవిఘ్న కారకములు అగును. జడత్వము (చచ్చుపడిపోవుట పక్షవాతము వంటివి) చెవిటితనము, మూగతనమును పొందును. గ్రుడ్డితనమును, స్మృతిలోపమును (మతిచెడుట), జరారోగమును, పొందును. అజ్ఞానమున పై దోషములు ఉండగా యోగమునకు పూనిన వానికి శరీరమున బహుదోషములు ప్రకోపించును. కావున శుద్ధమైన జ్ఞానముతో సమాహితుడై (ఏకాగ్ర చిత్తుడై) యోగి తన యోగమునకు పూనుకొనవలెను. ఎప్పుడును అప్రమత్తుడై (జాగరూకుడై) ఎక్కడగూడ యోగిపై దోషములను ఎంచరాదు. ఇక ఆ ప్రాణాయామము వలన కలిగిన దోషములను పోగొట్టు చికిత్సను యథాక్రమముగా చెప్పుదును.

మిక్కిలి వేడిగా ఉన్న యవల జావను నేయి కలిపి తిని తన యోగమును నిలుప వలెను. ఈ క్రమ యోగముతో వాతమువలన కలిగిన గుల్మవ్యాధి శమించును. గుదావర్త వ్యాధికి తిరుగుడుగా ఈ చికిత్స చేయవలెను. పెరుగుతో కూడిన యవల జావను తిన

వలెను. దాని వలన వాయువు పైకి పోవును. తరువాత వాయు గ్రంథి (ముడి)ని భేదించి వాయు దేశమున (వాయువును)ప్రయోగింపవలెను. అట్లైనను విశేషములేని (కనబడని)చో యోగ ధారణమును శిరస్సున చేయవలెను. ఈ విధముగ శరీరమును యోగముతో పూన్చి స్వస్థుడైన వానికి గుదావర్త ప్రతిఘాతము కలుగగా ఈ చికిత్సను చేయవలెను. యోగమును ప్రారంభించిన యోగికి సమస్త శరీరము ప్రకంపనము చెందినప్పుడు ఈ చికిత్సను చేయవలెను. దానిచేత వాడు సుఖియగును.

వ్రతమేదైన ఉన్న మనస్సుతో దానిని చక్కగా నిలిపి, ధారణ చేయవలెను. ఉరోద్ఘాతము గలిగినచో ఉరః స్థానమును కంఠస్థానమున యోగధారణ చేయవలెను. చర్మమునకు అవఘాతము గలిగినపుడు ఆ చర్మమును వాక్స్థానమున యోగధారణ చేయవలెను. చెవుడు కలిగినపుడు చెవులయందును. దప్పిక కలిగినపుడు నాలుకయందును యోగధారణ చేయవలెను. తంతువులచేత మొదట స్నేహములను ఫలమును యోగి చింతింపవలెను. దానివలన యోగి సుఖియగును. క్షయ, కుష్టు, కిలాసము, (సిబ్బెము) ఈ వ్యాధులు సంభవించినపుడు సర్వసాత్వికిని ధారణ చేయవలెను. ఏయే రజో దేశమున (బాధకలుగునో) ఆయా ప్రదేశమున యోగధారణాయుక్తుడై నిర్దేశింపవలెను. యోగోత్పన్ను డైన విప్రునకు ఈ చికిత్సను చేయవలెను. యోగధారణము చేయుచున్నవానియొక్క శిరస్సును వెదురుకీలము (మేకు)తో గొట్టవలెను. శిరమున (మేకు) కీలమునుంచి కట్టెను కట్టెతో గొట్టవలెను. దాని వల్ల భయభీతునకు పూర్వస్మృతి మరల రాగలదు. లేదా స్మృతిని కోలుపోయిన వానిని చేతులతో పట్టి నిలుపవలెను. ఆ తరువాత స్మృతిని పొంది, శిరమున యోగ ధారణమును చేయవలెను. నేయి కలిపిన దానిని కొద్దిగా భుజింపవలెను. దాని వలన సుఖియగును.

యోగమును తెలిసినవాడు మానవాతీతమైన బలముతో (యోగమునుండి) మేలుకొనినపుడు, స్వర్ణమును, భూమిని, వాయువును అగ్ని యోగ ధారణలో నిలుపవలెను. ప్రాణాయామముచే అదియంతయు దహింపబడుచున్నదై వశమగును. అయినప్పటికిని దేహమున ప్రవేశింపవలెను, తరువాత దానిని (ఆవహ్యా మానమును) నిషేధింపవలెను. తరువాత స్థంభించి యోగముతో శిరమున ధారణ చేయుచున్న ఆతనికి ప్రాణాయామాగ్నిచే దహింపబడిన దంతయు విలయమును పొందును. నల్లనాగు పాముయొక్క అపరాధము నైతే (విషమును) రొమ్మునను కడుపులోను యోగధారణము చేయవలెను. మహో లోకమును, జనలోకమును, తపోలోకమును, సత్య లోకమును, హృదయమునందు ఉంచి యోగధారణ చేయవలెను. విషము యొక్క ఫలమును (జలమును) త్రావి తరువాత

విశల్యను (విషములేని దానిని) ధారణ చేయవలె అంతటను పర్వతములతో గూడిన భూమిని మనస్సున ధారణ చేయవలెను. యోగజ్ఞుడై యోగము నందు ఉన్నవాడు సముద్రలను దేవతలను హృదయమున ధారణతో నిలిపి వేయి కుండలతో స్నానముజేయ వలెను. కంఠమువరకు నీటిలో ఉండి శిరమున యోగధారణ చేయవలెను. విషావిష్టుడైనవాడు ప్రవాహమునకు ఎదురుగా ఉండి సర్వగాత్ర ధారణను చేయవలను. సన్నగిల్లిన (బక్కచిక్కిన) యోగి జిల్లేడాకుల దొప్పలతో పుట్టమన్ను త్రాగవలెను. ఇది విషబాధితుడైన యోగికి చికిత్సా విధానము. ఇది యోగనిర్మితమై ప్రసిద్ధమైనది. యోగదృష్టమైన హేతువుచే సంగ్రహముగా వ్యాఖ్యానింపబడినది. దీనిని ఎక్కడనైనను ఎవడేని చెప్పవచ్చును. ఆ బ్రాహ్మణుని లక్షణమును తెలిసికొనుము (యోగముతో కనుగొన్న రహస్యం చెప్పరాదు). అయినప్పటికిని మోహమువలన చెప్పినచో ఆ విజ్ఞానము నాశనము చెందును కావున యోగ ప్రవృత్తిని ఏమైనను చెప్పరాదు. సత్యము శాంతిపూర్వకమైన బలము, ఆరోగ్యము, ఎక్కువగు కోరిక, రంగుయొక్క కాంతి, మంచిస్వరము, సౌమ్యత, సుగంధము, అల్పమైన మూత్ర పురీషములు–ఇవి శరీరమున యోగమువల్ల మొదటకలుగు లక్షణములు. యోగి తనయోగమున, తనను, భూమిని జ్వలించుచున్నట్లుగా చూచి, తన్ను వేరొకనిగా ప్రవేశించినచో, ఆతనికి సిద్ధి తనకడకు చేరినట్లుగా తెలిసికొనవలెను. (11)

యోగోపసర్గ నిరూపణము

సూతుడు పలికెను :

ఆపైన (యోగముచే) తత్త్వమును దర్శించిన దేహికి (ఉత్పాతము రోగము) విఘ్నములు కలుగు విధమును, దోషములు పుట్టు విధమును చెప్పబోవుచున్నాను. యోగమును తెలిసి యోగ రోగియైన వాడు (యోగమును సరిగా అనుసరించనందున కలిగిన రోగములు గలవాడు) ఉపసృష్టుడు అనబడును. వాడు మనుష్య సంబంధములై వివిధములైన కోరికలను, ఋతువును, స్త్రీలను, విద్యాదాన ఫలమును కోరును. యోగరోగి, అగ్ని హోత్రమును, హవిస్సును, యజ్ఞమును అట్లే వీని యజ్ఞశాలను, మాయాకర్మను, ధనమును, స్వర్గమును కోరును. వీడు కర్మలతో తగులుకొన్నవాడు. అవిద్యకు (అజ్ఞానమునకు) వశమైనవాడు. వానిని ఉపసృష్టుని (విఘ్నవంతుని గాపే వానిని యోగరోగిగాను తెలిసికొని వదిలి వేయవలెను. నిత్యము బ్రహ్మపరుడైన యోగి ఉపసర్గము యోగ విఘ్నము యోగ రోగము నుండి విముక్తుడగును. యోగరోగములను విఘ్నములను జయించినవాడును శ్వాసను జయించిన వాడును అయిన దేహికి గూడ సాత్త్వికములు రాజసములు తామస ములు అయిన రోగములు కలుగుచుండును.

వినుటలో ప్రతిభ, దేవతల దర్శనము, భ్రమావర్తము (భ్రమలేకుండుట) అనునవి సిద్ధి లక్షణముగా గుర్తింపబడినవి. విద్య, కావ్యము, శిల్పము, సమస్తమును వాక్కుచే వరింపబడును. (అతని వాక్కులోనివి అన్నియును కనబడును). విద్యా ప్రయోజనములు గూడ అతనికి సంప్రాప్తించును. ఇది ఆతని ప్రభావమునకు లక్షణము (గుర్తు). నూరు యోజనముల దూరము నుండియైనను వినదగిన శబ్దములను వినును. సర్వజ్ఞుడును, విధిజ్ఞుడు (బ్రహ్మజ్ఞుడు)ను అయిన యోగి పిచ్చివానివలె ఉండును.

మహాయోగియైనవాడు యక్షులను, రాక్షసులను గంధర్వులను, దివ్యులను (దేవతలను) మానుషులను (మనుష్యులను) తెలియును. ఇది ఆతని ఉపసర్గమునకు (రోగమునకు, ఉత్పాతమునకు) గుర్తు. దేవతలను, దానవులను, గంధర్వులను, ఋషులను పితృదేవతలను చూచును. అన్ని విధములుగా ఆతనిని ఉన్మత్తునిగా చెప్పవలెను. అంతరాత్మతో ప్రేరేపింప బడుచున్నవాడై భ్రమతో తిరుగుచుండును. భ్రమతో భ్రాంతి చెందిన బుద్ధిగలవాని యొక్క సమస్త జ్ఞానము నశించును. అంతరాత్మతో ప్రేరేపింపబడిన వానికి జనశ్రుతిగాని జీవనోపాయముగాని చిత్తమును నశింపజేయును. జీవనోపాయ చింతనముచే నిండిన బుద్ధిగలవానికి సమస్త జ్ఞానము నశించును.

మనస్సుతో తెల్లని వస్త్రమునుగాని, గొంగళినిగాని చుట్టుగా కప్పుకొని తరువాత వెంటనే పరమమైన బ్రహ్మను అనుధ్యానింపవలెను. ఆ కారణమువలన ఆత్మసిద్ధిని కోరు వాడు తన యొక్క (ఆత్మ యొక్క) దోషములను, సంభవించిన ఉపసర్గములను యోగ విఘ్నదోష (రోగములను) మేధావియై వదిలివేయవలెను. ఋషులు, దేవతలు, గంధర్వులు, యక్షులు, ఉరగులు మహాసురులును ఉపసర్గలలో రగులుకొని మరల మరల తిరుగు చుందురు. కావున యోగి ఎల్లప్పుడు యోగయుక్తుడై అల్పాహారియై, ఇంద్రియము లను జయించినవాడై, సుప్తుడై శిరమున సూక్ష్మములలో యోగధారణను నిలుపవలెను.

ఆ తరువాత, యోగయుక్తుడు, జతనిద్రుడు అయిన యోగికి చివర మరల ప్రాణ ములను పేరుగల ఉపసర్గలు కలుగును. మొదట యోగముతో సమస్త పృథివిని ధారణ చేయవలెను. ఆ తరువాత జలమును, ఆ తరువాత అగ్నిని, (వాయు రూపమైన ప్రాణముతో చిత్తము ఒకచో నిలుపుట యోగధారణ కావున వాయు భూతము ప్రత్యేకముగ జెప్పబడ లేదు. ఆ తరువాత ఆకాశమును, ఆ తరువాత నందం యొక్క మనస్సును, తరువాత దానికి పరమైన మనస్సుతో కూడిన బుద్ధిని యతి (యమము గలవాడు) అయిన వాడు అతి ప్రయత్నముతో యోగధారణ చేయవలెను. సిద్ధుల యొక్క చిహ్నములను చూచి చూచి వదిలివేయవలెను.

పృథివిని యోగధారణ చేయువానికి పృథివీ మహాభూతము సూక్ష్మమై ప్రవర్తించును. జల (భూత)ములను యోగధారణ చేయువానికి జలమహాభూతము సూక్ష్మమగును. చల్లని రసము (జలము)లు అన్నియు సూక్ష్మములై అమృతముతో సమానమగును. తేజో భూతమును యోగధారణ చేయువానికి తేజో మహాభూతము సూక్ష్మమగును. తనను తేజస్సుగా భావించి, తన్ను తేజముగానే చూచును. తనను వాయువునుగా భావించి, తన్ను వాయువుగల మండలముగా చూచును. ఆకాశమును యోగధారణ చేయు వానికి ఆకాశ మహాభూతము సూక్ష్మమగును తనను వాయువులుగల మండలమైన మహాభూత వాయువునుగా భావించి వాయుమహాభూతము సూక్ష్మముగా అగును. తనను సూక్ష్మ వాయుమండలముగా చూచును. అచటి నుండి దానియొక్క ఘోష (శబ్దము) కూడ బయలు దేరును. అట్లే మనస్సును యోగధారణ చేయువానికి మనస్సు సూక్ష్మమై ప్రవర్తిల్లును. అపుడు వాడు మనస్సుతో సర్వ భూతముల (ప్రాణుల) మనస్సునందును ప్రవేశించును. బుద్ధిచేత బుద్ధిని, యోగధారణ చేసినప్పుడు చక్కగా (అంతయు) తెలిసికొని మేలుకొను యోగజ్ఞుడైనవాడు ఈ ఏడు సూక్ష్మములను తెలిసికొని మేధావియై పరిత్యజించి తన బుద్ధిచే పరమాత్మను పొందును.

యోగ ఐశ్వర్య లక్షణమైన మాయా భూతమునందు యోగధారణయుక్తుడై అచటనే విడువరాని సంగమును పొంది, దాని చేతనే పూర్తిగా నశించును. కావున యోగియైన బ్రాహ్మణుడు సూక్ష్మములను పరస్పర సంసక్తములుగా తెలిసికొని బుద్ధిచేత పరిత్యజించి పరమును పొందును. దివ్య చక్షువులై, ఋషులైన మహాత్ములు గూడ సూక్ష్మ భావములందు సంసంక్తులై కనబడుదురు. అవి దోషములుగా వారియందు గుర్తించబడినను, ఎపుడైనను ఇందు (యోగవిషయమున) సూక్ష్మములందు నిశ్చయమును (ధారణను) చేయరాదు. ఐశ్వర్యము వలన రాగము కలుగును. విరాగము బ్రహ్మ అనబడును. ఏడు సూక్ష్మములను షడంగునిగా మహేశ్వరుని ప్రధానమును తెలిసికొని వినియోగమును తెలిసినవాడు పరబ్రహ్మను పొందును.

సర్వజ్ఞత్వము, తృప్తి, అనాది బోధము, స్వతంత్రత, ఎల్లప్పుడు లోపించు శక్తి, అనంత శక్తి. ఈ ఆరింటిని విధిజ్ఞులు విభువైన మహేశ్వరునియొక్క అంగములందురు. నిత్యము బ్రహ్మయే ధనముగా గల యోగి ఉపసర్గల నుండి విముక్తుడగును. శ్వాసను, ఉపసర్గలను, రాగములను జయించిన యోగికి ఈ బహిఃశరీరమున యోగధారణ చేయుట అన్ని కోరి కలకు సంబంధించినది అగును. యోగయుక్తుడైన బ్రాహ్మణుడు ఆయా చోటులలో ప్రవే శించి మనస్సు వర్ణించిన పంచ భూతములనైన ఆవేశింపగలడు. ముల్లోకములను కూడ కంపింప చేయగలడు. ఈ యోగశక్తిచేత ఈ లోకమున దేహమును వదిలిపెట్టి మరల

దేహమును ప్రవేశించగలడు. యోగులకు సూర్యుణ్ణి మనోద్వారముగా చెప్పవలెను. ఆదా నాది క్రియలకు కూడ సూర్యుడు మనోద్వారమే అగును. ఈ విధానముచే సూక్ష్మవర్జితుడైన యోగి, ప్రకృతిని దాటి రుద్రలోకమున గొప్పవాడై పూజింపబడును.

అతడు ఐశ్వర్య గుణమును పొందినవాడును, బ్రహ్మభూతుడును అయిన ప్రభువునుగా చూడవచ్చును. అతడు సమస్త దేవస్థానములందును తక్కిన అంతటను ఉండక, మరలిపోవును. పైశాచిక స్థానముచేత తస్థాన ప్రయోగ విధారణచే, పిశాచములను, రాక్షస స్థానముచే రాక్షసులను, గంధర్వుల స్థానముచే గంధర్వులను, కుబేర స్థానముచే కుబేరజులను, ఇంద్ర స్థానముచే ఇంద్రుని, సోముని స్థానముచే సౌమ్యుని (చంద్ర సంబంధుని), ప్రజాపతి స్థానముచే ప్రజాపతిని సాధింపవలెను. బ్రహ్మ స్థానముచే తత్‌స్థాన (యోగధారణచే) బ్రహ్మజ్ఞాన రూపియైన ప్రభువును దగ్గరగా పిలుచును. ఆ బ్రహ్మయందు సక్తుడైనవాడు ఉన్మత్తుడు. అతని నుండి సర్వము ప్రవర్తించును. నిత్యము (ఎల్లప్పుడు) బ్రహ్మరూపుడైన యోగి ఈ స్థానములను వదిలి వేయవలెను. స్థానములందు (యోగధారణ స్థానములందు) అంటిపెట్టుకొని ఉండని బ్రాహ్మణుడు సర్వగతుడగును.(12)

యోగైశ్వర్యములు

వాయువు పలికెను :

యోగ విశేషముచేత యోగి సర్వలోకములను అతిక్రమించును. ఇక ముందు ఆ యోగ విశేషము యొక్క ఐశ్వర్యములను చెప్పుచున్నాను. అట యోగుల ఐశ్వర్యము ఎనిమిది గుణములు కలది. అది అంతయు ఒక క్రమ యోగముతో చెప్పుదను వినుడు. అణిమ, లఘిమ, మహిమ, ప్రాప్తి, అంతట ప్రాకామ్యము, అంతట ఈశిత్వము. అంతట వశిత్వము, అంతట యంత్ర కామావసాయిత్వము – ఇవి యెనిమిది ఐశ్వర్య గుణములు. సార్వకామికమైన ఆ ఐశ్వర్యము గూడ అనేక విధములు. అది సావద్యము, నిరవద్యము, సూక్ష్మము అని ప్రవర్తిల్లును. సావద్యమను ఆతత్త్వము పంచ భూతాత్మకము ఇంద్రి యములు, మనస్సు అహంకారమును నిరవద్యముగా చెప్పబడిన. అట సూక్ష్మ ప్రవృత్తము (ఐశ్వర్యము) గూడ పంచభూతాత్మకము, ఇంద్రియములు, మనస్సు బుద్ధి, అహంకారముగా చెప్పబడినది. అట్లే సర్వమయము ఆత్మస్థము, ఖ్యాతి అని ఈ విధముగా సంయోగము మూడు విధములైన సూక్ష్మములందే ప్రవర్తిల్లును. తరువాత అష్టగుణమైన ఐశ్వర్యము గూడ ఆ సూక్ష్మములందే ప్రవర్తించును. ప్రభువైన భగవంతుడు చెప్పినట్లు దానియొక్క రూపమును చెప్పుదును.

త్రైలోక్యమున సర్వభూతములలో జీవునియొక్క (స్థితి) అనియతమని చెప్పబడినది. అంతయు ప్రతిష్ఠితమై వ్యక్తమగునట్టి సూక్ష్మము అణిమ. త్రైలోక్యమున సర్వప్రాణులకు పొందుటకు అలవిగానిదైనను యోగులకు (యోగ) బలమువలన లభించును ఇది మొద టిది అణిమ, యోగమున యోగియొక్క రూపము (ఆకారము) వ్రేలాడునది, తేలి ఉండునది, సర్వప్రాణులలో శీఘ్రముగ పోవునదియు అగును. ఇది రెండవదైన లఘిమ యొక్క స్థానము అనబడినది. త్రైలోక్యమున సర్వభూతము (అంగుల్యముచే చంద్రునిలో కలుగుట) యొక్క ప్రాప్తియున్న యోగము సిద్ధి ప్రాప్తి అనియు, ప్రాకామ్యము (సంకల్పమునకు అడ్డులేమి) ఉన్న యోగసిద్ధి ప్రాకామ్యము. మహిమ మహత్పరిమాణుడుగా కలిగియున్న యోగసిద్ధి మహిమ. ఇది మూడవ యోగసిద్ధి త్రైలోక్య మున సర్వభూతములలో ప్రాణులలో త్రైలోక్యము పొందుటకు అలవి కానిది అగును. ప్రతిరోధముచే అడ్డబడినవాడై ఒకచోట ప్రకామములైన విషయములను అనుభవింపజాలడు. త్రైలోక్యమున సర్వభూతములకు సుఖదుఃఖములు ప్రవర్తిల్లుచున్నవి. (ఇట్టి స్థితిలో త్రైలోక్యమును పొందగల యోగసిద్ధి ప్రాప్తి, అడ్డులేని సంకల్పముతో ప్రకామ విషయ అనుభవము చేయగల యోగసిద్ధి ప్రాకామ్యమే, త్రైలోక్యమున సుఖ దుఃఖములకు అందరాని మహత్పరిమాణమును పొంద గల యోగసిద్ధి మహిమ అని చెప్పబడును. యోగి అంతట ప్రతి భాగముచే భూత భౌతి కముల ఉత్పత్తి స్థితి నాశనము ఒనర్చు శక్తి కలిగి ఉండుట ఈశత్వసిద్ధి. చరాచరములు గల త్రైలోక్యమున భూతములు వశ్యములగును. కాని అవి తమ ఇచ్ఛతో పరవశముకావు గదా. యోగి యొక్క వశిత్వసిద్ధితోనే వశమగును. చరాచరములు నిండిన త్రైలోక్యమున "యత్రకామావసాయిత్వ"మను సిద్ధితో యోగి ఇచ్ఛానుసారమే ఇంద్రియములు పనిచేయు చుండుటయు పనిచేయకుండుటయు, జరుగును. ఈ యోగి ఇచ్ఛానుసారమే శబ్ధము, స్పర్శ, రసము, గంధము, రూపము, మనస్సును, ప్రవర్తించుచుండును. అతని ఇచ్ఛాను సారమే అవి ప్రవర్తింపకగూడ ఉండు ఇంద్రియములైన త్వగాదులును, వాని విషయము లైన స్పర్శాదులును "యత్రకామవసాయిత" అను యోగసిద్ధిగల యోగి యొక్క ఇచ్ఛాను సారమే. ప్రత్యక్షానుకూలమైన పరస్పర సంబంధము కలిగియుండును. అట్లే ఆ సిద్ధయోగి పుట్టడు, చావడు, భేదింపబడడు, పూజింపబడడు, దహింపబడడు, క్షీణింపబడడు. నశింపడు, ఎప్పుడును దుఃఖింపడు, అంతటను వికారము చెందడు. గంధ రసరూపములు లేనివాడై స్పర్శ శబ్దముల వదలినవాడై వర్ణముయొక్క వర్ణములేనివాడై వరుడు గానివాడై ఉండును. తరువాత విషయములు అనుభవించును. విషయములలో తగుల్కొనడు. పరమమైన సూక్ష్మమును తెలిసి సూక్ష్మత్వము వలన అపవర్గకుడు అగును. అపవర్గము నుండి వ్యాపకుడగును. వ్యాపియైనందున పురుషుడనబడును. పురుషుడు సూక్ష్మ భావము

వలన ఐశ్వర్యమువలన పరముగనే ఉండును. ఐశ్వర్యమున గణాంతరము అన్నిటికంటె సూక్ష్మ మనబడును. ఎదురుదెబ్బలేని ఐశ్వర్యమును పొంది అత్యుత్తమమైన యోగమును, ఆ తరువాత సుసూక్ష్మమై పరమపదమైన మోక్షమును పొందవలెను. (13)

పాశుపతయోగము

వాయువు ఇట్లు పలికెను :

ఈ విధముగా జ్ఞానమునుండి వచ్చినవాడు రాగము వలన కర్మను ఆచరింపరాదు. రాజసమైనదిగాని, తామసమైనదిగాని అయిన కర్మను చేసి అనుభవించిన మానవుడు దానిలోనే తగుల్కొనును. అట్లే పుణ్యకర్మను చేసినవాడు స్వర్గములో దాని ఫలమును పొందును. ఆ స్వర్గ స్థానమునుండి (పుణ్యము క్షీణింపగా) మరల భ్రష్టుడై, మానవ లోకమును పొందును. కావున బ్రహ్మపరము, సూక్ష్మము. బ్రహ్మశాశ్వతము అని చెప్పబడును. అందుచే బ్రహ్మనే సేవింపవలెను. బ్రహ్మయే పరమమైన సుఖము. యజ్ఞములలో పరిశ్రమ గొప్ప (స్వర్ణ) ప్రయోజనముతో జరుగును. కాని వాడు క్షణయజ్ఞఫలుడై మరల మర్త్యలోకమునకు వచ్చి మృత్యువశుడగును. కావున మోక్షము పరమసుఖము.

అట్లుగానిచో ధ్యాన సంయుక్తుడు, బ్రహ్మయజ్ఞపరాయణుడు, (జ్ఞానయజ్ఞ పరాయణుడు అగు) వాడు మన్వంతర శతములచేత గూడ వ్యాపించుటకు సాధ్యపడడు. విశ్వరూపుడు విశ్వమే పాదములు శిరము, కంఠములైనవాడు, విశ్వేశుడు, సమస్త భావనలు కలవాడు, సమస్త గంధములు కలవాడు సమస్తమాలలచే అలంకరింపబడినవాడు. విశ్వ మను వస్త్రమును (సమస్త వస్త్రములను) ధరించువాడు ప్రభువు అయిన విశ్వుడను దివ్య పురుషుని చూచి భూమి తన గోవుల (కిరణముల)చేత, రెక్కలుగలవానిని, మహాత్ముని, పరమమతిని, వరింపదగినవానిని, కవిని (బ్రహ్మరూపిని) పురాణుని (ప్రాచీనుని), అను శాసించువానిని, సూక్ష్మమునకన్న సూక్ష్మరూపిని, మహత్తుకన్న మహత్తైనవానిని, బంధించి వేయును. అతడు నిరింద్రియుడు, బంగారు వన్నెగల తేజోమయ పురుషుడు, నిర్గుణుడు, చేతనుడు. ఈతనిని యోగులు యోగముతోనే చూతురు కానీ నేత్రములతో చూడలేరు. ఎల్లప్పుడు సర్వగతుడై శుచియైనవాడు అచలుడై ప్రకాశస్వరూపుడైన ఆతనిని యోగము చేతనే నిత్యము చూతురు. అతడు సత్తుగా పరమాత్మగా భావింపబడిన వాడు, తేజస్సుతో వెలుగుచున్నవాడు, చేతులు, కాళ్ళు, కడుపు, ప్రక్కలు, నాలుకలేని వాడు, ఇంద్రియములకు అతీతుడు. ఇప్పటికి గూడ సుసూక్ష్ముడైన ఒక్కడు. అతడే నేత్రములు లేకయే జూచువాడు, చెవులు లేకయే వినువాడు. ఈతనికి బుద్ధిలేదు. కాని ఆతనికి తెలియనిది లేదు. అతడు

వేదములకుగూడ తెలియనివాడు. కాని తాను సర్వము తెలిసినవాడు. అతని మొట్టమొదటి వానిగా పురుషునిగా మహత్స్వరూపునిగా సచేతనునిగా, సర్వగతునిగా, సుసూక్ష్మనిగా చెప్పుదురు.

సమస్త మునులు ఆమెను లోకమున ప్రసవ ధర్మిణిగా (లోకమును పుట్టించు దానినిగా) చెప్పుదురు. యోగయుక్తులు తమ చిత్తముతో ఆమెను సర్వభూతములకు ప్రకృతిగా చూతురు. అంతట కాలుసేతులు చాచి అందుకొనునది. అంతట జూడగల కన్నులు శిరస్సు ముఖములు గలది. అంతట వినగల చెవులు గలదియునై ఆ ప్రకృతి సర్వమును ఆవరించి ఉండును. యోగముచే యుక్తులై యోగులు, ఈశానుడు అన్ని విధముల సనాతనుడు, సర్వభూతములలో పురుషుడైన వానిని చూతురు. కావున ధ్యాన యోగి మోహమును చెందదు. భూతాత్ముడు, మహాత్ముడు పరమాత్ముడు, అవ్యయుడు, సర్వాత్ముడు అయిన ఆ పరబ్రహ్మను ధ్యానముజేసి మోహము చెందదు.

వాయువు సర్వమూర్తులయందు చరించుచు గ్రహింపదగినదైనట్లే పురమును అట్లే ఆకాశమునను శయనించును కావున పురుషుడు అనబడుచున్నాడు. ఒకవేళ సవిశేషములైన కర్మలచే లోపించిన ధర్మము గలవాడైనందున పురుషుడనబడినట్లైతే, అప్పుడు స్త్రీ పురుషుల ప్రయోగముచేత శుక్రశోణిత సంయుతమైన బ్రహ్మ స్త్రీ యోనియందు మరల మరల పుట్టును. సూక్ష్మ రూపమున జన్మ నొందును. అపుడు గర్భకాలమున (గర్భముగా ఏర్పడు కాలమున) కలన మనునది (శుక్ర శోణితములు కలియుట అన్నది) జనించును. కాలక్రమ మున ఆ కలనము బుద్బుదము (బుడగ) అగును. కుమ్మరి సారె (చక్రము) మీద నున్న మట్టి ముద్ద తిరుగుచున్న చక్రవాయువు (సుడిగాలి)చే పీడింపబడినదై (కుమ్మరి) హస్తము లచే చేయబడుచున్నదై, విశ్వరూపమును (కుండ మొదలగు రూపమును) తాల్చును. ఈ విధముగనే ఆత్మ ఎముకతోగూడినదై వాయువుతో పైకి ప్రేరేపింపబడినదై మానుషాకారము గలవాడగును. అచట రూపము కలిగినట్లే మనస్సు కలుగును. వానిలో వాయువు పుట్టును. వాయువునుండి జలము, జలమునుండి ప్రాణము పుట్టును. ప్రాణము నుండి శుక్రము వృద్ధిజెందును. రక్తభాగములు (శోణితముల యొక్క భాగములు) ముప్పది మూడు. శుక్ర భాగములు పదునాలుగు (మొత్తము 46 భాగములు) ప్రతి భాగము నుండి సగము ఫలము అనగా రెండు కర్షములు లేదా ముప్పదిరెండు మాషముల పరిమాణము గల భాగమును తీసికొని గర్భమున ప్రవేశించును. (గర్భముగా అగును). తరువాత గర్భముతో గూడిన ఆకారము ఐదు ప్రాణ అపాన, సమాన, వ్యాన, ఉదాన వాయువులతో చుట్టబడును. ఈ గర్భమునకు తండ్రి శరీరము నుండి ప్రతి అవయవ రూపము కలుగును. తరువాత

తల్లియొక్క, తల్లి ఆహారమునుండి త్రాగుట ద్వారా నాకుట ద్వారా ప్రవేశించినది బొడ్డు త్రాడులో ప్రవహించి గర్భములో ప్రవేశించుటచే అది దేహులకు (గర్భ ప్రాణులకు) ప్రాణా ధారమగును.

మావితో చుట్టబడిన శిరమును ధరించినవాడై, సర్వావయవములచే చుట్టబడిన వాడై, తొమ్మిది మాసములు చుట్టగా కష్టములను అనుభవించినవాడై తొమ్మిది మాసములు గర్భమందు ఉండి యోనిరంధ్రము నుండి అధోముఖుడై పర్యాయక్రమమును తప్పి ఆవలకు వచ్చును. ఆ తరువాత పాపకర్మలచేత నరకమును పొందును. అసిపత్ర వనమను నరకము, బూరుగు చెట్టుల గొట్టుట పగలగొట్టుట యొక్క భయము. రక్త భోజనము, ఈ భయంకర మైన తీవ్రబాధలను కుంభీపాకముచే సహింప అలవిగానివై ఉండును. నీరు వేరు చేయబడిన రూపమును పొందినట్లు యాతనాస్థానమునకు వచ్చినవాడు ఛిన్నుడు, భిన్నుడు నగును. ఈ విధముగా జీవుడు తానుచేసిన పాపములచేత పరితపింపబడినవాడగును. జీవుడు తన కర్మలచేతనే దుఃఖమునుగాని సుఖమునుగాని పొందును. అన్ని విధముల మృత్యు ప్రవేశము తానొక్కడే చేయును. తోడెవ్వడునూ రారు. చేసిన కర్మఫలమును ఒక్కడే అనుభ వింపవలెను. తోడెవ్వడురాడు. కావున పుణ్యమునే ఆచరించవలెను. ప్రాణావసాన మున శరీరమును వదలి బయలుదేరిపోవుచున్నవాని వెంట ఎవ్వరునురారు. వాడు చేసిన కర్మయే వెంబడివచ్చును.

వారు నిత్యము యమలోకములో వేర్వేరు దేహములు గలవారై యేడ్చుచుందురు. వారికి అనిష్టమైన ప్రయోగములచేత నిండిపోవుచుందురు. అధర్మమువల్ల కలిగిన అనేక యాతనలచే తీవ్ర బాధలచే చుట్టుకొన్న వేదనా శరీరములు గలవారగుదురు. దేహికి పూర్వకృత పాపకర్మల సరిపోవు తామస సంసారము కలుగును. అది ఆరు విధములు. మానుషము. పశుభావమును, పశుభావమువల్ల మృగమగును. మృగభావము వల్ల పక్షి భావము దాని నుండి సర్పమగును. సర్పభావము నుండి నిస్సంశయముగ స్థావరత్వము నందును ఆ స్థావరత్వము నుండి మేలుకొనునంత వరకు వాడు కుమ్మరిసారె చక్రమువలె అక్కడనే తిరుగుచుండునని చెప్పెదరు.

ఈ విధముగా మనుష్యుడు మొదలు స్థావరము వరకు పరివర్తించునది తామస సంసారమని తెలియవలెను. అచటనే, బ్రహ్మ మొదలుకొని పరివర్తనమానమగునది సాత్త్విక సంసారము అని అందురు. స్వర్గ స్థానములతో బ్రహ్మాది పిశాచముల వరకు పరివర్త మానమగు సంసారము సాత్త్వికమని తెలియవలెను. బ్రాహ్మమునందు కేవలము సత్త్వము

ఉండును. స్థావరమున కేవలము తమముండును. ఈ పదునాలుగు స్థానముల మధ్యన విఘ్నముగా నిలచినది రజము. తన మర్మస్థానములు కోయబడుచుండగా వేదనచే పీడితుడైన దేహియైన బ్రాహ్మణుడు పరవశుడైన బ్రహ్మనెట్లు స్మరించగలడు. పూర్వ ధర్మము యొక్క సంస్కారమువలన భావనవల్లను ప్రవేశింపబడినవాడై నిత్యము మానుష్య భావమును పొందును. కావున నిత్యము సమాహితచిత్తుడు బ్రహ్మయందు మాత్రమే లగ్నమైన చిత్తము గలవాడు కావలెను. (14)

పాశుపతయోగము

వాయువు పలికెను :

ఈ పదునాలుగు విధములుగా ఉన్న సంసార మండలమును మనుష్యుడు తెలిసికొనవలెను. అట్లే సంసార భయపీడితుడై కర్మను ప్రారంభింపవలెను. ఆ తరువాత సంసార చక్రముచే త్రిప్పబడినవాడై స్మరించును. కావున తాను ఆత్మను చూచువిధముగా ఎల్లప్పుడు యోగముచే ఆత్మయుక్తుడై ధ్యానతత్పరుడై ఆత్మయందు ధ్యానమును ఉంచువాడై యోగము చక్కగా ఆరంభించవలెను. వీడే ఆద్యుడైన పరంజ్యోతి. వీడే మహోత్తముడైన సేతువు. (బాహిరములను రానీయని పెద్ద అడ్డుకట్ట). వీడు సర్వభూతములలో వృద్ధి పొందినవాడు. సంభేదము లేనివాడు ఏకమైనవాడు శాశ్వతుడు. కావున సేతువై విశ్వతోముఖుడైన అగ్నియై సర్వ భూతముల హృదయమందున్న ఆత్మను విధానమును తెలిసినవాడై ఉపాసించవలెను. ఎనిమిది ఆహుతులను హోమముజేసి, చక్కగా శుచియై తద్గత మనస్కుడై పూర్వ క్రమమున మొదట ఒక్కమారు నీరాచమించి మిన్నకుండి హృదయమందున్న వైశ్వానరుని (అగ్నిని) ఉపాసింపవలెను. ప్రాణాయస్వాహాయని మొదటి ఆహుతి చెప్పబడినది. అపానాయ స్వాహాయని రెండవ ఆహుతి, సమానాయస్వాహా యని మూడవ ఆహుతి, ఉదానాయ స్వాహాయని నాలుగవ ఆహుతి, వ్యానాయస్వాహా అని అయిదవది. ఈ విధముగ స్వాహాకారములచే హోమముచేసి, కోరిన విధముగ భుజింపవలెను. మరల ఒక్కమారు నీరు ఆచమించి మూడుమారులు ఆచమించి హృదయమును స్పృశించవలెను. ఓంకార స్వరూపుడవై రుద్రుడవైన నీవు ప్రాణముల (ప్రాణపానాది పంచ ప్రాణముల) ముడిరూపమైన ఆత్మవు. రుద్రుడవైన నీవే ఆత్మవు. అంతుకుడవై ప్రవేశింపుము. ఆ రుద్రుడే ఆత్మకు ప్రాణము అనుకొనుచు ఈ విధముగ తనను తానే తృప్తిచెందించుకొనవలెను. నీవు దేవతలకు గూడ జ్యేష్ఠుడవు. ఉగ్రుడవు. చతురుడవు. వృషభరూపుడవు. నీవు మాకు నీ మృత్యుఘ్నుడవు. ఈ భద్రమైన హవిస్సు హోమము చేయబడినది. ఈ విధముగా హృదయమును తాకి,

కుడికాలి బొటన వ్రేలియందు విశ్రావము చేయవలెను. కుడిచేతిని నాభిని చేతితో తాకవలెను. ఆ తరువాత మరల (నీటిని) రెండు చేతులతో తాకి (ఆత్మను) తనను తాకవలెను. రెండు కండ్లు, ముక్కు రెండు చెవులు, హృదయము, శిరస్సు వీనిని తాకవలెను. ప్రాణాపానములు అను ఈ రెండు ఆత్మలుగా చెప్పబడినవి. వానిలో మనుష్యుని యొక్క ప్రాణము అంతరాత్మ, అపానము బాహ్యాత్మ అని చెప్పబడును. అన్నము ప్రాణము. అట్లే అపానము మృత్యువు. జీవితము కూడ అన్నము బ్రహ్మయని తెలియవలెను. అది ప్రజలను (సంతానమును) కనునది. అన్నము వలన భూతములు (ప్రాణులు) పుట్టును. అన్నము చేతనే వాని స్థితి (నిలకడ) ఏర్పడుచున్నది. అగ్నియందు హోమముజేసిన ఆ అన్నమును దేవదానవులు భుజింతురు. (15)

శౌచాచారలక్షణము

వాయువు పలికెను :

ఆపైన శౌచాచారము యొక్క లక్షణమును చెప్పబోవుచున్నాను. దానిని ఆచరించి శుద్ధాత్ముడై మరణించిన తరువాత స్వర్గమునే పొందగలడు. జలమును కోరువాడు మునుల యొక్క శౌచములకు (పవిత్రతలకు) ఉత్తమ స్థానమగును. వాడు శౌచముల విషయములలో అప్రమత్తుడుగా ఉండవలెను. అట్టి ముని నాశమును పొందడు. మానావమానములు అను ఈ రెండే విష-అమృతములని అందురు. అందులో అవమానము విషము మానము అమృతము. వానిలో అప్రమత్తుడైన ముని నాశమును పొందడు. గురువునకు ప్రియమై, హితమైన కార్యమునకు పూనుకొన్నవాడు, సంవత్సరము నుండి గురువును సేవింపవలెను. అతడు అహింసా సత్య ఆస్తేయ బ్రహ్మచర్య అపరిగ్రహరూపములైన యమములోను, శౌచ సంతోష, తపస్, స్వాధ్యాయ ఈశ్వర ప్రణిధాన రూపములైన నియమములలోను, ఎల్లప్పుడు అప్రమత్తుడై ఉండవలెను. గురువు దగ్గర ఉత్తమ జ్ఞానమును రాబట్టవలెను. ఆ తరువాత గురువుచే అనుజ్ఞాతుడై అనుమతిని పొందినవాడై ధర్మమునకు విరోధము కాకుండా ఈ భూమినందు అంతయు తిరుగవలెను.

కన్నులు చూచి ఇది పవిత్రమైనది అని చెప్పిన మార్గముననే పోవలెను. వస్త్రముతో వడియ బోసిన పవిత్రమైన నీటినే త్రాగవలెను. అబద్ధము ఏ మాత్రము లేక సత్యముచే పవిత్రమైన మాటనే పలుకవలెను. ఇది ధర్మానుశాసనము. యోగము తెలిసినవాడు ఎక్కడనైనను, శ్రద్ధ యజ్ఞములతో ఆతిథ్యమును స్వీకరింపరాదు. ఈ విధముగా ఆచరించినచో యోగి అహింసకుడగును. విచారము, పొగలేని అగ్ని ఉన్నచోట, పొగులు లేనిచోట,

భక్తజనము ఉన్నచోట అంతటను బుద్ధిమంతుడైన యోగి చలింపవలెను. కాని ప్రతి నిత్యముగా పైచోటులలో చరింపరాదు. సజ్జనుల ధర్మమును నిందింపక, జనులు తనను అవమానింపని విధమున, అట్లే తిరస్కరింపని విధమునను యుక్తుడైన యోగి భిక్షాటనము చేయవలెను. యోగి వేద విహితాచారము గల గృహస్థుల ఇండ్లలో భిక్షాటన చేయవలెను. ఇది యోగ శ్రేష్ఠమైన పరమోత్కృష్టమైన వృత్తి అని ఉపదేశింపబడినది. ఆ పైన మృదు స్వభావము గలవారు, వైదికాచారములందు శ్రద్ధగలవారు, ఇంద్రియ నిగ్రహము గలవారు (కామ క్రోధాలకు వశముకానివారు) వేదశాస్త్రాధ్యయన సంపన్నులు, మహాత్ములు అయిన గృహస్థుల ఇండ్లలో యోగియైన బ్రాహ్మణుడు భిక్షాచరణము చేయవలెను. ఆపైన దుష్టులు గాని పతితులు (భ్రష్టులు) గాని, కానట్టివారి ఇండ్లలో భిక్షాచరణము మిక్కిలి నీచవృత్తి అనబడి యవాగువులు (జవలు), మజ్జిగ, పాలు అలచందలు, ఫలములు కంద మూలములు, వండనివి, తెలకపిండి వీనిని భిక్షలో పొందవలెను. నాచే ఈ పై చెప్పినవి యోగులకు సిద్ధులకు వృద్ధి చేయునట్టి ఆహారము, అది సిద్ధించనిచో భిక్షాచరణము శ్రేష్ఠమైనది.

దర్భ చివరి భాగముతో నీటి బిందువును నెల నెలకు త్రాగినవాడు, న్యాయముగా భిక్షను ఆచరించువాడు పూర్వము చెప్పిన వానికంటె విశిష్టుడు. సమస్త యోగులకును చాంద్రాయణ వ్రతము శ్రేష్ఠము. ఒకటి, రెండు, మూడు నాలుగుగాని యథాశక్తిగా చాంద్రాయణ వ్రతమును చేయవలెను. దొంగతనము చేయకుండుట, బ్రహ్మచర్యము, లోభము లేకుండుట, త్యాగము, ఇవి భిక్షువులకు వ్రతములు, అహింస, పరమార్థమును కోరుట, కోపము లేకుండుట, గురుసేవ, శౌచము, తేలికపాటి ఆహారము (అల్పాహారము) తీసికొనుట, నిత్యము స్వవేదాధ్యయనము ఇవి నియమములు.

మనుష్యుడు బీజము జన్మ కారణమయినవాడు, త్రిగుణములు శరీరమైనవాడు, కర్మలచే బద్ధుడును అగును. అడవిలో ఏనుగునకు వలె మనుష్యులకు సైతము కర్మబంధము విధింపబడును. అంకుశముచేత ఏనుగు తన స్వాతంత్ర్యము నుండి నివారింపబడి మావటి వానికి వశమైననాడు చెప్పిన పనులెల్ల చేయును. అట్లే మనుష్యుడు గూడ కర్మబద్ధుడై స్వాతంత్ర్యము తొలగి వెంటనే ప్రాపంచిక కర్మ చేయుచుండును. కావున శుద్ధమైన జ్ఞానముచే దహింపబడిన జన్మ కారణ బీజము గలవాడై, పాపములు లేనివాడై, బంధములు అన్నియు వదలినవాడై, శాంతుడైన యెడల మనుషుడు ముక్తుడు అనబడును.

వేదములచే స్తుతింపదగినవి సమస్త యజ్ఞక్రియలు. యజ్ఞమునందు జ్ఞానులు జపించినది మిక్కిలి శ్రేష్ఠము. జ్ఞానము వలన సంగరాగములు లేని ధ్యానము గలుగును. అది లభించినచో శాశ్వతుడు లభించును. దమము, శమము, అకల్మషత్వము, సత్యము,

కల్మషము లేమి, మౌనము, అఖిల ప్రాణులయందు కౌటిల్యము లేమి వీనిని జ్ఞానముచే విశుద్ధమైన సత్త్వము (బలము) గలవారు అతీంద్రియ జ్ఞానమునుగాను ఆర్జవముగాను చెప్పుదురు. సమాహితుడు, బ్రహ్మపరుడు, ప్రమాదము చెందనివాడు. శుచి, ఆత్మయందే రతుడైనవాడు, ఇంద్రియముల జయించినవాడు ఈ యోగమును పొందుదురు. అనిందితు లును మలినము లేనివారునైన మునులు గూడ నీ యోగమును పొందుదురు.(16)

పరమాశ్రమ కథనం

వాయువు పలికెను :

మూడు ఆశ్రమములను (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థములను) వదిలి, పరమాశ్రమ మైన 'భిక్షా' ఆశ్రమమును పొంది, తరువాత సంవత్సరాంతమున ఉత్తమోత్తమమైన (దీనికన్న మరొక ఉత్తమములేనిది) జ్ఞానమును పొందవలెను. తరువాత గురువుకు తెలిపి ఈ భూమినంతయు తిరుగవలెను. అసలు జ్ఞేయమైన పరమాత్మను తెలిసి కొనుటకు సాధనమైన సారభూతమైన జ్ఞానమును పాటింపవలెను. ఇది జ్ఞానము. ఇది జ్ఞేయము అని సంతుష్టి చెంది తిరుగువాడు కల్ప సహస్రమైన ఆయువు గలవాడైనను జ్ఞేయమును పొందలేడు. సంగమును త్యజించి, క్రోధమును జయించి, అల్పాహారియై ఇంద్రియములను జయించి, బుద్ధిచే ద్వారములన్నియు మూసివైచి, మనస్సును ధ్యానమున నిలువవలెను. శూన్యములై నిర్జన ప్రదేశములందు, గుహలయందు వనమునందును, నదులయొక్క ఇసుక తిన్నె లందును నిత్యము యోగయుక్తుడు కావలెను. వాక్కు అను దండము, కర్మ అను దండము, మనస్సు అనుదండము-అనునవి మూడు దండములు. ఈమూడు దండములు నియ తముగాగలవాడు త్రిదండిగా పరిగణింపబడును. నిశ్చలముగా ఉన్నవాడు, ధ్యానమునందు ఆసక్తుడైనవాడు, ఇంద్రియములను జయించినవాడు, శుభములును అశుభములునైన రెండు కర్మలను త్యజించి, ఈ శరీరమును ధరించినవాడు శాస్త్ర ప్రకారముగా ఎప్పుడును పుట్టడు చావడు. (17)

యతి ప్రాయశ్చిత్తవిధి

వాయువు ఇట్లు పలికెను :

ఆపైన యతులయొక్క నిజముగా చేసిన అకామకృతములైన పాపకృత్యములకు తెలియక చేసిన పాపకర్మలకు ప్రాయశ్చిత్తములను నిశ్చయముగా చెప్పనున్నాను. ధర్మసూక్ష్మముతెలిసిన వారు కావలెనని తెలిసిచేసిన పాపములకును ప్రాయశ్చిత్తములు

ఉన్నవి అని అందురు. పాపము మూడు విధములు మాటతో కలిగినది, మనస్సుతో కలిగినది, శరీరముతో కలిగినది. ఈ త్రివిధ పాపముచే రాత్రింబవళ్లు ఈ జగము బాధింపబడుచున్నది. కర్మలు ఉండవు, కర్మలు చేయువాడు గూడ ఉండడు అని శ్రేష్ఠమైన వేదము చెప్పినది. ఆయుష్యము స్థిరముగా నిలువనిది, కావున ప్రాయశ్చిత్తము క్షణకాలమే ప్రయో గింపదగినది. ధీరుడై ఉండవలెను. అప్రమత్తుడై ఉండవలెను. యోగమే ఉత్కృష్ట మైన బలము. నరులకు యోగముకన్న వేరైన బలము ఏదియులేదు. కావున ధర్మయుక్తులైన విద్వాంసులు యోగమును ప్రశంసింతురు.

విద్యచే అవిద్యను దాటి, ఉత్తమోత్తమమైన ఐశ్వర్యమును పొంది, పరమును, అపరమును చూచి ధీరులు ఆ పరమపదమును పొందుదురు.

భిక్షువులకు కొన్ని వ్రతములు ఉపవ్రతములు విధింపబడినవి. వానిలో ఒక్కొక్క దానిని పాటించనప్పుడు వానికి ప్రాయశ్చిత్తము విధింపబడును. కామముతో స్త్రీని పొంది నప్పుడు ప్రాయశ్చిత్తముగా అతడు ప్రాణాయామముతో బాటు సాంతపన వ్రతమును ఆచరింపవలెను. అనగా మూడు దినములు పగళ్లును, మూడు దినములు రాత్రులును భుజించి, మూడు దినములు అయాచిత పదార్థములను భుజించి, పిమ్మట మూడు దిన ములు నిత్రుపాసము ఉండెడు వ్రతము. కొందరిమతమున పంచగవ్యమును కుశోదక మును పుచ్చుకొని ఒక రాత్రియు ఉవవాసముండు వ్రతమును చేయవలెను. ఆ తరువాత పై చెప్పిన సాంతపన వ్రతము చివర సమాహితుడై (సమాధి యందు ఉన్నవాడై) ఇంతకు ముందు చెప్పిన దానిని చేయవలెను. తరువాత ఆశ్రమమునకు మరలవచ్చి సోమరితనము వీడి భిక్షువుగా చరింపవలెను. కిటుకులు గల మాటలు హింసింపవని పండితులందురు. ఐనను ఈ ప్రసంగమును దారుణముగా చేయరాదు. అహోరాత్రములు (ఒకదినము ఒకరాత్రి) మించిన అధర్మము లేదు అని శ్రుతి చెప్పినది. అనగా చేసిన అధర్మము ఒక రాత్రింబవళ్ళతో కూడిన దినమునకు మించి ఉండదని వేదము చెప్పినది.

ఈ హింస దేవతలచేతను మునులచేతను సృష్టింపబడి పెద్దదైనది. ఈ డబ్బు అనునది బాహిరమున చరించు ప్రాణములు (పంచప్రాణములు) అని ఈ విధముగా అనుకొని, దుష్టాత్ముడు, భిన్నమైన నడవడిక కలవాడై, వ్రతమునుండి భ్రష్టుడగును. వాడు మరల దుఃఖమును పొంది చాంద్రాయణవ్రతమును జేయవలెను. శాస్త్రము చెప్పిన తీరుగా చాంద్రా యణ వ్రతమును సంవత్సరము పాటు చేయవలెనని శ్రుతి అనుచున్నది. తరువాత సంవత్స రాంతమున మరల క్షీణించిన పాపము గలవాడై మరల వైరాగ్యము చెందినవాడై, సోమరి తనములేక భిక్షువుగా తన ధర్మమున చరింపవలెను.

భిక్షువు మనస్సుతో, మాటతో, శరీరముతోను సర్వప్రాణుల యెడ అహింసను పాటించవలెను. కావలెనని కాక, అబుద్ధి పూర్వకముగనైనను, పశువులను మృగములను హింసించినచో, కృచ్ఛ్రాతి కృచ్ఛ్ర వ్రతమునుగాని, చాంద్రాయణ వ్రతమునుగాని ప్రాయశ్చిత్తముగా చేయవలెను. యతి, స్త్రీని చూచి ఇంద్రియ దౌర్బల్యమున వీర్యస్ఖలనము గావించెనేని ప్రాయశ్చితముగా పదహారు ప్రాణాయామములు చేయవలెను. పగలు వీర్యస్ఖలనము గావించిన యతికి మూడు రాత్రులు ఉపవాసమును, నూరు ప్రాణాయామములును ప్రాయశ్చిత్తముగా విధింపబడినవి. రాత్రియందు వీర్య స్ఖలనము గావించినవాడు స్నానము జేసి శుచియై పన్నెండు ధారణలు (యోగముచే మనస్సును ఆత్మయందు నిలుపుట) ప్రాయశ్చిత్తముగా చేయవలెను. బ్రాహ్మణుడైన యతి ప్రాణాయామముతో శుద్ధాత్ముడును రజోగుణములేని శుద్ధసాత్త్వికుడడు అగును. యతులు ఏకాన్నమును (కేవలము అన్నమును), మధువును, (మద్యమును), మాంసమును, ఆమశ్రాద్ధము నందలి భోజనమును, ప్రత్యేకముగా ఉన్న లవణములను తినరాదు. నిషేధమును దాటి ఒక్కొక్క దానిని భుజించినపుడు ప్రాయశ్చిత్తము విధింపబడినది. ప్రాజాపత్య వ్రతముచేతను కృచ్ఛ్ర వ్రతముచేతను ఆ పాపమునుండి విముక్తుడగును. నియమమును అతిక్రమించి వాక్కు, మనస్సు, శరీరములతో చేసిన పాపములకు సజ్జనులైన విద్వాంసులతో కూడిన వారు నిర్ణయించి చెప్పిన ప్రాయశ్చిత్తమును చేసికొనవలెను. విశుద్ధ బుద్ధియై, మట్టి, బంగారములను సమముగా జూచువాడై, సర్వ భూతములందు చరించు సమాధియందు ఉండువాడు, శాశ్వతము, నాశములేని స్థిరమైన పరమైన స్థానమును పొంది పునర్జన్మ రహితుడగును. (18)

అరిష్టములు

వాయువు పలికెను :

ఆపైన అరిష్టములను వినుడు. వాని జ్ఞానమున మానవుడు తన మరణమును (రాబోవు దానిని) చూడగలడు. అరుంధతీ నక్షత్రమును ధ్రువ నక్షత్రమును, చంద్రకాంతిని, రాజ మార్గమును చూడలేని నరుడు సంవత్సరము దాటి జీవింపడు. సూర్యుని కిరణములు లేని వానిగను, అగ్నిని కిరణములు గల దానిగను చూచువాడు, పదునొకండు మాసములు దాటి జీవింపడు. ప్రత్యక్షముగా గాని, స్వప్నమునగాని, మూత్రమును గాని, పిడకను గాని, వెండినిగాని, బంగారమునుగాని వాంతి జేసికొన్నవాడు పదిమాసములు జీవించును. ధూళియందుగాని, బురదయందుగాని, ముందుగాని, వెనుక భాగమునగాని తన అడుగు తెగిపోయినట్లు కనబడినచో వాడు ఏడు నెలలు మాత్రము జీవించును. కాకిగాని, పావు

రముగాని, గ్రద్దగాని, మాంసము తినుపక్షిగాని, తనతలయందు లీనమయినట్లు చూచిన వాడు ఆరు మాసములు దాటి జీవింపడు. కాకుల పంక్తులతో కట్టివేయబడిన వాడుగాని, ధూళి వర్షముతో చుట్టబడినవాడుగాని, తన నీడను వికారముగా చూచిన వాడుగాని, నాలుగైదునెలలు జీవించును. దక్షిణ దిక్కున మేఘములు లేకయే తెలుపును గాని, జలమున ఇంద్రధనువును గాని చూచినవాడు రెండు మూడు నెలలు జీవించును. నీటిలోగాని, అద్దములోగాని తనను చూడలేనివాడును, చూచినచో తలలేని తనను చూచు వాడును నెలదాటి జీవింపడు. తన శరీరమున శవ గంధముగాని, వసాగంధముగాని వచ్చుచున్న వాడు మరణము సమీపించినవాడు అగును. సగము నెల కూడ జీవింపడు.

ఒక్కసారి భేదించుకొని వచ్చిన వాయువు మర్మస్థానములను కత్తిరించగా నీరు చల్లినను హర్షించనివాడు మృత్యువు సమీపించినవాడు. ఎలుగుగొడ్లతోను, కోతులతోను, లాగబడుచున్న రథములో గానము చేయుచు దక్షిణ దిక్కునకు పోవుచున్నట్లు తనను స్వప్నమున జూచువాడు మృత్యువు సమీపించినవాడని తెలియవలెను. స్వప్నమున నల్లని వస్త్రము ధరించి, నల్లని స్త్రీ గానము చేయుచు దక్షిణ దిక్కునకు పోయినచో వాడు జీవింపడు. స్వప్నమున రంధ్రములుగల నల్లని వస్త్రమును ధరించినవానికిని, చెవి భగ్నమైనట్లు చూచినవానికిని మరణము సమీపించినదని తెలిసికొనవలెను. తలనిండా బురద సముద్రమున తాను మునిగినట్లు స్వప్నమున చూచిన వాడు వెంటనే మరణించును. బూడిదను, నిప్పుకణికలను, వెంట్రుకలను, ఎండినగడ్డిని, పాములను, స్వప్నమున చూచినవాడు పదిరాత్రులుగూడ జీవింపడు. వికటాకారులై ఆయుధములెత్తిన నల్లని పురుషులచే స్వప్నమున రాళ్లచే కొట్టబడిన వాడు వెంటనే మరణించును. సర్యోదయ మున ప్రభాతకాలమున ప్రత్యక్షముగా నక్కకూత పెట్టుచూ ఎదురుగా వచ్చినచో మనుష్యుడు మరణించును. స్నానము చేసినంతమాత్రమున గుండె మిక్కిలి పిండబడి, పండ్లు ఇకిలించిన వానిని మరణించినవానిగా చెప్పవలెను. రాత్రియందుగాని పగటియందుగాని మాటిమాటికి శ్వాసను తీయువాడుగాని దీప (నిర్వాణ) గంధమును వాసన చూడలేని వాడుగాని మరణము సమీపించిన వాడగునని తెలియవలెను.

రాత్రిలో ఇంద్రధనుస్సును (సింగిడిని), పగలు నక్షత్ర మండలమునుగాని ఇతరుల నేత్రములలో తనను చూచినవాడు బ్రతుకడు. ఒక కంటిలో నీరుకారినను, చెవులు తమ స్థానమునుండి జారినను, ముక్కు వంకరయైనను వాడు చచ్చినవాడని తెలియవలెను. నాలుక నల్లనై ఎండిపోయినను, ముఖము బురద రంగు తేలినను, చెక్కిళ్లును, చప్పిడి ముక్కులును ఎఱ్ఱనైనను, వానికి మృత్యువు సమీపించినదని తెలియవలెను. వెంద్రుకలు

విరబోసికొని, నవ్వుచు, గానము చేయుచు, నాట్యము చేయుచు, దక్షిణ దిక్కుగా (స్వప్నమున) బోవువాడువాని జీవితమును చాలించును. మాటిమాటికి తెల్లఆవాలవంటి చెమట బిందువులు వంటినిండ ఏర్పడినవాడు మరణము సమీపించినవాడని తెలియవలెను.

స్వప్నమున తన రథమునకు ఒంటెలుగాని, గాడిదలుగాని కట్టబడియుండిన వాడై, దక్షిణాభి ముఖముగ పోయినవాడు బ్రతుకడు. ఇచట రెండు గొప్ప అరిష్టములు కలవు. వీని రూపము గొప్పదగును. చెవిలో ధ్వని వినలేడు. కంటిలో జ్యోతిని జూడలేడు. స్వప్నమున ద్వారము(దారి)లేని గోతిలోబడి లేవలేకున్నవాడు వెంటనే మరణించును. ఒక వ్యక్తి దృష్టిపైకి పోయినను నిలకడగా లేకున్నను మరియు ఎఱ్ఱనై తిరుగుచుండినను ముఖరంధ్రము నాభి వేడిగా ఉన్నను మూత్రము మిక్కిలివేడియైనను వాడు విషమస్థుడే చచ్చువాడే. (స్వప్నమున) పగలుగాని రాత్రిగాని ప్రత్యక్షముగా చంపబడువాడు తనను చంపువానిని చూచినచో ఆ చంపబడినవాడు బ్రతుకడు. స్వప్నము చివర అగ్నిప్రవేశము చేసి స్మృతిని పొందని మానవుడు అంతటితోనే మరణించును. స్వప్నమున తాను కప్పుకొన్న తెల్లని వస్త్రమును ఎఱ్ఱనిదిగను, నల్లనిదిగను చూచినవానికి మరణము సమీపించును. అరిష్టము సూచింపబడిన దేహమున ఆ కాలము రాగానే భయమును దుఃఖమును వదిలి బుద్ధిమంతుడైన మానవుడు నిద్రనుండి లేవవలెను. తూర్పునకు గాని, ఉత్తరమునకు గాని బయలుదేరి, శుచియై ఎగుడు దిగుడులు లేక సమతలమై ఏకాంతమై నిర్జనమైన, కదలికలేని స్థిరమైన ప్రదేశమున ఉత్తరము వైపుగాని, తూర్పువైపుగాని ముఖముజేసి స్వస్థుడై చక్కగా ఆచమనము చేసిన వాడై, స్వస్తికాసనమున కూర్చొని మహేశ్వరునికి నమస్కరించవలెను. శరీరము కంఠము శిరము సమముగా నిట్టనిలువుగా ఉంచి కన్నులు మూసి చిత్తమును ఆ మహేశ్వరునియందు నిలుపవలెను. ఆతడు నివాతనిష్కంపమైన ప్రదీపంవలె ధారణాసమాధిలో ఉండవలెను. కావున యోగమును తెలిసినవాడు తూర్పు-ఉత్తర దిక్కుల ప్రదేశమున యోగ ధారణము చేయవలెను. ప్రాణమున (ప్రాణస్థానమైన హృదయమున) నిత్యము యోగముతో రమింపవలెను. అట్లే నేత్రములందు, స్పర్శనమునందు, చెవులయందు, మనస్సునందు, బుద్ధియందు, అట్లే వక్షస్థలమందును, యోగధారణము (చిత్తబంధము) చేయవలెను. కాల ధర్మమునుతెలిసి అన్ని విధముల సమూహము, పండ్రెండు విధములైన ఆధ్యాత్మము అనునది యోగధారణము అనబడును. నూరు పర్యాయములుగాని, ఎనిమిదినూరుల పర్యాయ ములుగాని శిరమున యోగధారణము చేయవలెను. ధారణాయోగమువలన వాని వాయువు సర్వము ప్రవర్తింపదు. తరువాత సమాధిలో ఉన్నవాడై దేహమును ఓంకారముతో నింపవలెను. ఆ తరువాత యోగి ఓంకారమయుడగును. నశింపడు అక్షరుడగును. (నశింపనివాడు అగును). (19)

ఓంకార ప్రాప్తి లక్షణం

వాయువు పలికెను :

ఆపైన ఓంకార ప్రాప్తి లక్షణమును చెప్పబోవుచున్నాను. ఓంకారము మూడు మాత్రలు కలది. ఇచట వ్యంజనముగూడ (హల్లుగూడ) సస్వరము. మొదటి మాత్ర విద్యుత్సంబద్ధ మైనది. (వైద్యుతీ) రెండవ మాత్ర తామసీ అనబడును. మూడవ మాత్ర నిర్గుణీ. మాత్రను అక్షరగామినిగా తెలుసుకొనవలెను. గాంధార స్వరమును పుట్టినది గాంధర్వీయము. పిపీలిక అనునది సమాన స్పర్శగలదై ప్రయోగింపబడినది. అది శిరమున కనపడును. ఆ విధముగా ప్రయోగింప బడిన ఓంకారము శిరమున బయలుదేరును. ఆ విధముగా యోగి ఓంకారమయుడై క్షరముకాని ఓంకారమున నాశనములేనివాడగును. ఓంకారము ధనువు. ఆత్మబాణము. బ్రహ్మదానికి లక్ష్యము (గురి). జాగరూకుడైనచో బాణము చేతవలె లక్ష్యము వధ్య మగును. కావున బాణము లక్ష్యమును భేదించి తన్మయమయిన రీతిగా ఆత్మ బ్రహ్మను జేరి బ్రహ్మమయము కావలెను.

ఓం అనునొక్క అక్షరము బ్రహ్మ. దాని పదము గుహారూపమయిన బుద్ధి. ఓం అనునది మూడు లోకములు, మూడు అడెగులు, వామనావతారములోని విష్ణువు యొక్క మూడు పాద విక్షేపములు (భూమ్యాకాశ పాతాళములు). పరమార్థమునకు ఓంకారమున మాత్రలు నాలుగు. ఓంకారమున యోగధారణమును చేసిన యోగి ఓంకార స్వర స్వరూపమును పొందును. 'అ'కారము, అక్షరముగను (నాశనములేని దానిగను వర్ణముగను) తెలియవలెను. 'ఉ'కారము స్వరితముగా చెప్పబడినది. 'మ'కారము ప్లుతము. ఇది త్రిమాత్రాకముగా గుర్తించబడినది. తరువాత అకారము భూర్లోకము. ఉకారము భువర్లోకము. వ్యంజనముతో గూడిన మకారము స్వర్లోకము అగును. 'ఓ'ంకారమైతే మూడు లోకములు. దాని శిరస్సు స్వర్గము. అది అంతయు భువనాంతము. ఆస్థానము బ్రహ్మకు సంబంధించినది. మాత్రాస్థానము రుద్రలోకము. మాత్రలులేనిది శివస్థానము. ఈ విధముగ ధ్యాన విశేషముచే ఓంకార పదమును ఉపాసింతురు. కావున ధ్యానాసక్తు డైనవాడు శాశ్వత పదమునుకోరి నిత్యము అమాత్రకమైన ఆ ఓంకార అక్షరమును ప్రయత్నశీలియై ఉపాసింపవలెను.

హ్రస్వమాత్ర మొదటిది. దీర్ఘమాత్ర రెండవది. ఆ తరువాత ప్లుతవతియైన మాత్ర మూడవది అని పండితులు చెప్పుదురు. మొదటిది రెండవది ఇత్యాది అనుపూర్వ క్రమమున ఇవి (పైజెప్పినవి) మాత్రలని తెలియవలెను. శక్తి ఉన్నంతవరకు ఇవి యోగధారణలో ధరింపబడును. ఆత్మయందు ఇంద్రియములను, మనస్సును, బుద్ధిని, ఎల్లప్పుడు ధ్యానము

చేయుచు ఎనిమిది మాత్రలు కలదానినిగా ఓంకారమును విన్నవాడు ఫలితమును పొందును. ప్రతిమాసమున నూరేండ్లు అశ్వమేధయాగము చేసినంతటి పుణ్యఫలమును ఓంకారములోని ఒకమాత్రను ధ్యానముచేసి పొందగలడు.

ప్రతి మాసమున నూరేండ్లవరకు దర్భకొనతో నీటి బిందువు త్రాగి సంపాదించు నంతటి పుణ్యమును ఓంకారము యొక్క మాత్రను ధ్యానించుటతో పొందును. ఇష్టాపూర్త యజ్ఞమునకు సత్యవాక్యమునకు, మాంస భక్షణము జేయనందుకును, రాగల పుణ్యమును ఓంకార మాత్రధారణచే పొందును. తమ స్వామికొరకు వెనుదిరుగకుండా యుద్ధము చేయువారితో సమానమైన ఫలమును ఓంకార మాత్రధారణతో పొందగలడు. ఉగ్ర తపస్సుచేతను, భూరి దక్షిణలుగల యజ్ఞములచేతను పొందలేనంతటి ఫలమును ఓంకార మాత్రముచే పొందగలడు. అందులో అర్ధమాత్రము ప్లుతముగా ఉపదేశింప బడును. గృహస్థులైన యోగులు దీనినే చేయవలెను.

ఇదియే విశేషముగా ఐశ్వర్యముతో సమలక్షణమైనది. విశేషమగు యోగులకు ఎనిమిది రూపములుగల ఐశ్వర్యమునందు సమముగా గుర్తింపదగినది. అది అణిమాదుల కలది అని తెలియవలెను. కావున బ్రాహ్మణుడు యోగమున మనస్సు నిలిపి యోగి కావలెను. ఈవిధముగ యోగి చక్కగా యోగయుక్తుడై శుచియై, కోరికలను అణచి దాంతుడై ఇంద్రియములను జయించినవాడై, ఆత్మను తెలిసికొన్న బ్రాహ్మణుడు సర్వమును పొందగలడు. బ్రహ్మ ధ్యానము చేయువాడు యోగ జ్ఞానమువలన ఋక్కులను యజుస్సులను సామములను (ఋగ్యజుస్సామ వేదములను) వేదోపనిషత్తులను (జ్ఞానమును) పొందగలడు.

సర్వభూతముల లయము జరిగి జన్మించినవాడు జన్మించును. యోగి సంక్రమణ మును (పరమాత్మతో కలిసి) చేసి శాశ్వతపదమును పొందును. ఇంతియే కాక, ఇచట (ఓంకారమునందు) నాలుగు హస్తములు, నాలుగు ముఖములు కలిగిన ప్రకృతియైన విశ్వ రూపమును ధ్యానించుచున్నవాడై దివ్య చక్షువుతో ఆమెను చూచును.

ఈ ప్రకృతి పుట్టుకలేనిది సామ్యావస్థలో ఉన్న రజస్, సత్త్వ, తమోగుణములు నిండినది. (ఎరుపు, తెలుపు, నలుపు రంగులు నిండినది) అనేక ప్రజలను త్రిగుణము లైన మహదాది వికారములు అనేకములైన సంతానములను సృజించుచున్నది. స్వాత్మ స్వరూపమైనది. జన్మరాహిత్యము చెందిన యొక యోగి ఈ పై ప్రకృతిని అనుభవించిన భోగసుఖముగల ఆ ప్రకృతిని బంధమును పెట్టుకొనక వదలివేసి విముక్తుడగును. ఎనిమిది

అక్షరములు గలది. పదహారుచేతులు, కాళ్ళు గలది. నాలుగు ముఖములు గలది, మూడు సిగలు గలిగి ఒక కొమ్ము గలదియు అందరికన్న మొదటిదియు, పుట్టుక లేనిదియు, విశ్వమును సృష్టించునదియు, ఆత్మ స్వరూపమైన దానినిగా ఆమెను తెలిసి పండితులు జ్ఞానులు అమృతత్వమును పొందు దురు ప్రణవమును తెలిసికొన్న బ్రాహ్మణులు మరల భూలోకమున సంసారమును పొందరు. ఈ విధమైన ఓంకారము అను అక్షర పరబ్రహ్మ రూపమును తెలిసినవాడుగాని లేదా ఆవిధముగ ధ్యానముచేసినవాడుగాని సంసార చక్ర మును వదలి విడిపోయిన బంధనములు, గలవాడై నిస్సంశయముగా అచలమును, నిర్గుణమును అయిన స్థానమగు శివుని పొందును.

లోకేశ్వరునకు నమస్కారము. సృష్టి ప్రళయములకై మహత్స్వరూపముతో వచ్చు వానికి నమస్కారము. మీకు హితమైన ఆ బ్రహ్మకు నమస్కారము. అంతటను స్థానము గలవానికి, నిర్గుణునకు, చక్కగా సేవింపబడిన యోగీశ్వరునకును నమస్కారము. పైను తామరాకుపై నీటిబిందువువలె యోగి విశుద్ధమైన బ్రహ్మను చేరవలెను. అది పవిత్రములలో పవిత్ర మైనది. పవిత్రముతో పవిత్రము చేరవలెను. పవిత్రముతో నిండిన పవిత్రముతో హ్రస్వ దీర్ఘప్లుత రూపమైన ఓంకారమును శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు (పంచ తన్మాత్రలు) లేని దానిని, సంపూర్ణముగా ఉపాసించవలెను. అవిద్య కీశానుడైన వానికిని యోగీశ్వరు నకును నమస్కారము. అతనిచే ద్యులోకము ఉగ్రమైనది. పృథివి దృఢమైనది. అతని చేతనే స్వర్లోకము, నాకలోకము వాని మధ్యనుండు అంతరిక్షమును గర్జితములైనవి. ఇవి శ్రేష్ఠములైనవి. దేవతలకు హృదయము, విశ్వరూపుడు. ఆతనికి ప్రాణాపానములతో పోలికలేదు. ఓంకారము విశ్వమంతయు వ్యాపించిన యజ్ఞము. యజ్ఞమే వేదము. వేదము నకు నమస్కారము. రుద్రునకు నమస్కారము. యోగేశ్వరాధిపతికి నమస్కారము. ఇది సిద్ధి ప్రత్యుపస్థానము. సాయంప్రాతర్మధ్యాహ్నములందు నమస్కారము. సర్వకామ ఫలము రుద్రుడు. పరిపక్వమైన పండు తొడిమనుండి గాలిచే క్రిందబడును. అట్లే రుద్ర నమ స్కారముచే పాపము నశించును.

రుద్ర నమస్కారము నిశ్చయముగా సర్వధర్మ ఫలములను ఇచ్చునది. అన్యదేవ నమస్కారముచేత అట్టి ఫలము లభింపదు. కావున యోగి ప్రాతర్మధ్యాహ్న సాయంకాలము లలో మహేశ్వరుని ఉపాసించవలెను. దశవిస్తారకమైనది బ్రహ్మ, కాగా బ్రహ్మ విస్తరమైనది. ప్రభువు అంతట కాలమున (తగిన కాలమున) మొత్తము ఓంకారమును చెప్పెను. అద్దాని చేతనే మహాయశస్కుడు విష్ణుత్వమును నమస్కారమును పొందును. నమస్కారము లాగుననే ప్రణవము (ఓంకారము) ప్రభువును స్తుతించును. యజ్ఞము ప్రణవమును స్తుతించును.

యజ్ఞమును నమస్కారము స్తుతించును. నమస్కారమును రుద్రుడు స్తుతించును. కావున రుద్ర పదము శివము (శివ రూపము). ఈ చెప్పిన అతి రహస్యములను యథాక్రమముగా తెలిసికొన్నవాడు ధ్యానమును తద్వారా పరమపదమును పొందును. (20)

కల్పనిరూపణము

సూతుడు పలికెను :

అగ్నికల్పులు, నైమిశారణ్య వాసులు అయి ఋషులలో ఋషి, వేదములు చదివి ధారణలో ఉంచుకొన్నవాడు, ప్రాజ్ఞుడు, సావర్ణి అను పేరుగల వాడుండెను. మాట నేర్పరియైన యాతడు వారందరికిని ముందుగానుండి ప్రియము కొరకు ఎల్లప్పుడు సత్ర యాగముచేయునట్టి మహాద్యుతి (తేజో) వంతుడైన వాయువును సవినయముగా సమీపించి ఇట్లడిగెను. సావర్ణి పలికెను. ప్రభో! సర్వదర్శియైన మీ యనుగ్రహమున పురాణ సంబంధమైన వేదసంహితమైన కథను చక్కగా వినదలచుచున్నాము. భగవంతుడైన హిరణ్య గర్భుడు (బ్రహ్మ) తన నుదుటినుండి నీలలోహిత తేజస్కుడై దేవదేవుడైన శివుని తన పుత్రునిగా ఎట్లుపొందెను ? భగవంతుడైన కమలమునుండి బుట్టిన బ్రహ్మ ఎట్లు పుట్టెను. మరి తన కుమారుడైన శర్వునకు (శివునకు) రుద్రత్వమెట్లు వచ్చినది? విష్ణువునకు రుద్రునితో ఉత్తమోత్తమమైన ప్రీతి (స్నేహము) ఎట్లు కలిగినది? సమస్త దేవతలు విష్ణు మయులు. సమస్త గణములును విష్ణుమయములే. విష్ణువునకు సమానమైన దారి ఒకటి లేదు అని ఈవిధముగా దేవతలు గానముచేసి చెప్పుదురు. ఇందు సంశయము లేదు. అట్టి విష్ణువు భవునకు (శివునకు) నిత్యమును ఎందులకు ప్రణామము చేయును. అని ప్రశ్నించగా.

సూతుడు ఈ విధముగా పలికెను :

ఇట్లడుగగా భగవంతుడైన వాయువు సావర్ణితో ఈ విధముగ చెప్పెను. ఓ సజ్జనుడా! నీవు చక్కగా అడిగితివి. నీ ప్రశ్న ఉత్తమోత్తమము. శివుడు పుత్రుడుగా జన్మించుటయు, బ్రహ్మకు ఆతడు పుత్రుడైన విధము, బ్రహ్మ పద్మమున పుట్టుటయు, శంకరునకు రుద్రత్వము, హరిహరులు ఇద్దరికిని చక్కని స్నేహము, విష్ణువు నిత్యము శంకరునకు ప్రణామము చేయుటయు మొదటి నుండి విస్తరముగా చెప్పెదను వినుడు.

ఓ బ్రాహ్మణోత్తమా! మన్వంతరము యొక్క సంహారమునందు పశ్చిముడను మహాత్మునకు పద్మమను ఏడవ కల్పముండెను. ఇప్పుడు వారికి వరాహ కల్పము. ఆ వరాహకల్పము యొక్క విస్తరమును చెప్పుచున్నాను. సావర్ణిపలికెను. ఎంత కాలములో కల్పమెట్లు సంభవించును. కల్పము యొక్క ప్రమాణమేమి? అని అడుగుచున్న మాకు సమాధానము జెప్పుము.

వాయువు పలికెను :

ఏడు మన్వంతరములకు వరుసగా సంగ్రహముగా కాల సంఖ్యను చెప్పెదను వినుడు. రెండువేల కోట్లు (20000000000) ఎనిమిది కోటి నూర్లు (8000000000) అరువది రెండు కోట్లు (620000000000), డెబ్బది లక్షలు (70,00000) కల్పము యొక్క సగమునకు సంఖ్యతో ఈ మొత్తము చెప్పబడినది. పూర్వోక్తములైన గుణచ్ఛేదములు రెండు వర్షాగ్రమ లబ్ధముగా జెప్పవలెను నూరుకోట్లు (100,00,00,000) డెబ్బది ఎనిమిది కోట్లు (78,00,00,000) రెండు లక్షలు (2,00,000) తొంబది లక్షలు (90,00,000). మానుష (లోక) ప్రమాణముతో వైవస్వత మన్వంతరము చివరి వరకు ఉండును. ఇది కల్పము సగముతో ద్విగుణీకృతమైన కల్పము అని తెలియవలెను. రాబోవు ఏడు మన్వంతరములకు గూడ వరుసగా ఇదియే కాల సంఖ్యా ప్రమాణము. ఇది ఐశ్వరమతము. ఏబది యెనిమిది లక్షలు (58,00,000) అట్లే ఎనుబది వేలు) (80,000), ఎనిమిది కోట్ల నలుబది లక్షలు (8,40,00,000) ప్రమాణములు. సప్తర్షులు మనువు. ఇంద్రుడు మొదలుకొని దేవతలును ఈ కాలమునకు ప్రమాణముగ వర్షాగ్రమును తెలియవలెను.

ఈ విధముగా వారికి మన్వంతరము మానుషాంతముగ చెప్పబడినది. ప్రణవము అంతముగా గల దేవతలు, సాధ్యులు, దేవగణములు విశ్వేదేవులు, నిత్యులై గణములుగా జీవింతురు. ఈ జరుగుచున్న కల్పము వారాహ కల్పము అనబడును. ఈ కల్పమున స్వాయంభువు మొదలగు పదునాలుగురు మనువులు గలరు.

ఋషులు అనిరి :

ఇది ఎందులకు వారాహకల్పమనబడినది? ఏ కారణమున భగవానుడు (విష్ణువు) వారాహుడనబడినాడు ? భగవంతుడైన వరాహుడు ఎవరు? ఆతడెవరికి జన్మస్థానము? ఏమి స్వరూపము గలవాడు?

అని ప్రశ్నించగా వాయువు ఇట్లు పలికెను :

వారాహము పుట్టిన విధము, అట్లు వారాహ రూపము కల్పించుటకు ప్రయో జనము, వారాహకల్పము ఏర్పడిన విధము, కల్పత్వము కల్పన, రెండు కల్పముల మధ్య కల్పించిన భేదము మొదలైనది అంతయు విన్నరీతిగను కన్నరీతిగను చెప్పెదను. పూర్వము లోకాదిలో భగవంతుడే (భూమియొక్క) ప్రథమ కల్పమని ప్రసిద్ధిచెందినది. ఇచట స్వయముగా ప్రస్తుతుడై ఆనురూపుడైన భగవంతుడు తెలుసుకొన తగినవాడు. అనగా ఆయనయే సృష్టికర్త. ఇది దివ్యమైన బ్రహ్మస్థానము. ఇది దివ్యము నుండి పుట్టి లభించినది. ఇది భూమి

యొక్క రెండవ కల్పము. మూడవది తప మనబడును. నాలుగవది భవకల్పము. ఐదవది రంభకల్పము. ఆరవది ఋతుకల్పము. అట్లే ఏడవది క్రతుకల్పము. ఎనిమిదవది వహ్ని కల్పము. తొమ్మిదవది హవ్యవాహన కల్పము. పదవది సావిత్రి కల్పము. ఏకాదశ కల్ప మును భువి అందురు. పండ్రెండవది ఉశిక కల్పము. పదమూడవది కుశిక కల్పము. పదునాలుగవది గంధర్వ కల్పము. అచట ఉత్పన్నమైన స్వరము గాంధర్వము. అచట ఉత్పన్నమైన నాదము గంధర్వమైనట్లే అచట పుట్టినవారు గంధర్వులు. ఓ బ్రాహ్మణో త్తముడా! ఆ తరువాత పదునైదవ కల్పము ఋషభ కల్పము. అచట పుట్టినవారు ఋషులు. అచట పుట్టిన ఋషభ స్వరము లోకమనోహరము. పదునారవది షడ్జకల్పము. అచటి షడ్జనులు ఋషులు శిశిరము వసంతము, నిదాఘము, వర్షము, శరత్తు, హేమంతము అనునవి బ్రహ్మ యొక్క మనస్సు నుండి కలిగిన సుతులు. అచట బుట్టినవారు షడ్జ సంసిద్ధులు. వీరు పదునారవ కల్పము నందలి పుత్రులు. దాని నుండి పుట్టిన ఆఱుగురిచే సద్యోజాతుడు మహేశ్వరుడు అతని నుండి బుట్టిన షడ్జస్వరము సముద్రముతో సమానము.

ఆ తరువాత పదునేడవది మార్జాతీయ కల్పము. మార్జాతీయ కర్మ నుండి బ్రాహ్మము కల్పితమైనది. తరువాత పదునెనిమిదవది మధ్యమము అనుకల్పము. దానియందు దైవత పూజితమైన మధ్యమ అనుస్వరము పుట్టినది. సర్వ భూతములలో మధ్యమము స్వయం భువు. తరువాత పంతొమ్మిదవది వైరాజక కల్పము. అటవై రాజుడు బ్రహ్మసుతుడైన భగవంతుడైన మనువు. అతని పుత్రుడు ధర్మాత్ముడైన, దధీచి అనువాడు. అతడు మహా తేజస్కుడైన ప్రజాపతి. అతడు త్రిదశేశ్వరుడయ్యెను. యజ్ఞము చేయుచున్న ప్రజాపతిని గాయత్రి కోరెను. అతని నుండి దట్టమైన స్వరము పుట్టినది. వారి యొక్క పుత్రుడు దధీచి.

ఆ తరువాత ఇరువది నిషాద కల్పము. ప్రజాపతి స్వయంభువు నుండి పుట్టిన అతనిని చూచి, ప్రజలను సృష్టించుట విరమించెను. నిషాదుడు తపము చేసెను. అతడు ఆహారము లేక జితేంద్రియుడై వేయి దివ్యవర్షములు తపముచేసెను. లోక పితామహుడు మహా తేజస్కుడైన బ్రహ్మ ఊర్థ్వముగ బాహువులు లేపి ఉన్నవాడు,తపస్సునందే లగ్నమైనవాడు, దుఃఖితుడు, ఆకలి దప్పులచే పీడింపబడిన వాడు అయిన ఆనిషాదునితో పితామహుడు (బ్రహ్మ) శాంతుడైన ఈ పుత్రుని నిషీద (కూర్చొనుము) అని అనెను. దానివలన నిషాదుడు పుట్టెను. ఆ స్వరము నిషాదవంత మయ్యెను. ఓ బ్రాహ్మణులారా! ఇరువది ఒకటవది పంచమమను కల్పము. ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యానము అనునవి బ్రహ్మయొక్క మానసపుత్రులు. ఈ అయిదుగురు బ్రహ్మతో సమానులు. అర్థమును వచించువానితో కూడిన వాక్కులచే మహేశ్వరుడు ఇష్టార్థముగా చెప్పబడెను. చుట్టుకొనిన

ఆ అయిదుగురు మహాత్ములచే గానము చేయబడిన స్వరము దట్టమైన పంచమమైనది. కావున కల్పముగూడ పంచమ కల్పము.

అట్లే పంద్రెండవ కల్పము మేఘవాహన కల్పము. అచట మహాబాహువైన విష్ణువు మేఘముగా ఏర్పడి చర్మ వస్త్రమును ధరించిన శివుని వేయి దివ్య వర్షములు మోసెను. ఆ బరువుచే ఆక్రాంతుడై ఆయాసపడుచున్న విష్ణువు యొక్క ముఖము నుండి మహా కాయుడు, లోకములను ప్రకాశింప చేయువాడు అయిన నల్లనివాడు (కాలుడు) బయలు వెడలెను. ఆ విష్ణువును విప్రులు కశ్యపాత్మజుడు అని అందురు. పదమూడవ కల్పము చింతకము. ప్రజాపతి సుతుడు శ్రీమంతుడు. చితి అను వీరిద్దరు జంట. ధ్యానము జేయుచున్న బ్రహ్మ నుండి చింత బయలు దేరెను. దానివలన స్వయంభువు ఆ కల్పమును చింతక కల్పమనెను. ఇరువది నాలుగవది ఆకూతి కల్పము అనబడును. ఆకూతియు, అట్లే దేవియును మిధునమైరి.

ఆకూతిని, ప్రజాపతి ప్రజలను సృష్టించుమనెను. అందువలన ఆ పురుషుడు ఆకుతి కల్పమనబడెను. ఇరువది యైదవది విజ్ఞాతియు దేవియు మిథునము అయిరి. పుత్రకాముడై ధ్యానించువానికి యొక్క మనస్సున అధ్యాత్ముడను పేరుగలవాడు, అప్పటి నుండి సంగ్రహముగ విజ్ఞాతి అనబడినాడు. తరువాత పదునారవ కల్పము మనః కల్పము. దేవి శాంకరి అనునామె మిథునమును చూచెను.

ప్రజలను సృష్టింపదలచి చింతించుచున్న అతనికి దేవిశాంకరి మిధునమును ప్రస వించెను. కావున స్వయంభువుడైన బ్రహ్మచే ప్రజాసంభవనము పుట్టెను. ఆ ప్రజా సంభ వమునుండి భావనాసంభవము. ఇరువదియేడవ కల్పము భావకల్ప అనబడెను. అట్లే పౌర్ణమాసియనుదేవి మిధునమును పొందెను. పరమేష్ఠియైన బ్రహ్మ ప్రజాసృష్టి చేయ దలచెను. పరమధ్యానమును చేయుచుండెను. పరమాత్ముడైన ఈశ్వరుని చూచెను. అతడు అగ్నిమండలముగా ఈకిరణజాలముతో చుట్టబడెను. మహాదేహము గలవాడై భూమి యందు స్వర్గమునందు చక్కగానిలిచి వ్యాపించెను. తరువాత వేయివర్షముల చివర ఆ జ్యోతిమండలము సంపూర్ణమయ్యెను. అట్లావేశించుటచే తోడుగానే పుట్టిన సూర్య మండ లమును చూచెను. అతడు భూతములకు కనబడనివాడు. కాని పరమేష్ఠియైన బ్రహ్మచే చూడబడినవాడు. అతడు భగవంతుడు, దేవుడు, సంపూర్ణ మండలుడైన సూర్యుడు. సమస్త యోగములు మంత్రములును ఆ సూర్యమండలముతోబాటే బయల్వెడలినవి. ఈ కల్పము చూడబడినందున ఇది దర్శకల్పమనబడినది.

పరమేష్ఠియైన బ్రహ్మయొక్క మనస్సునందు పూర్వము భగవంతుడైన సోముడు సంపూర్ణుడైనందున పౌర్ణమాసి అనబడినది. కావున పర్వమైన దర్శనమున (అమావాస్య యందు) ఉభయ పక్షములందును తమ హితముగా ఉండును. బ్రహ్మలోకము నుండి ఎప్పుడుగూడ వాటికి పునరావృత్తిలేదు. ఆహితాగ్నికానివాడు, ప్రయతుడు (నియమ ములు గలవాడు) వీర మార్గమును పొందినవాడును మనస్సును ఏకాగ్రసమాధిలో ఉంచి, మెల్లగా ఈ మంత్రమును ఓ అగ్నీ! నీవు రుద్రుడవు, అసురుడవు, మహివి (భూమివి), దివమవు (స్వర్గమవు), నీవు శర్వుడవు, వాయువు తరువాత ప్రేరణా సమర్థుడవు. నీవు సూర్యుడవు మమ్ములను విశేషముగ ధరించి రక్షింతువు అని బ్రాహ్మణుడు ఈ మంత్రమునే చక్కగా ఉచ్చరింపవలెను. అట్లు అగ్నిలో ప్రవేశించినవాడు రుద్ర లోకమును చేరును. సోముడు, అగ్ని, కాలుడు వీరు భగవంతుడైన రుద్రుడే అని శ్రుతి చెప్పుచున్నది. కావున అగ్నిలో ప్రవేశించినవాడు రుద్రుని చేరి నివర్తింపడు (మరలడు)

ఇరువది ఎనిమిదవ కల్పము బృహత్ కల్పము. బ్రహ్మ పుత్రకాముడై ప్రజలను సృష్టింపదలచి మనస్సుచే రథంతరమను బృహత్సామమును ధ్యానము చేసెను. అచట బృహత్తునుండి సర్వతోముఖమై ఉత్పన్నమైనందున తత్త్వచింతకులచే అది బృహత్కల్పమని భావింపబడినది. ఎనుబది ఎనిమిది యోజనముల ప్రమాణ దూరమున ఉన్న సూర్య మండలము ఉత్కృష్టమైన రథంతరముగా దెలియవలెను. కావున సూర్య మండలము ఒక భేదింపనలవిగాని అండమని తెలుసుకొనవలెను. సూర్యమండలము గూడ బృహత్సా మరూపమై ఛేదింపబడును. దీనిని ఛేదించుకొని యోగాత్ములు, దృఢవ్రతులు అయిన బ్రాహ్మణులు (పరమపదము అను స్వాత్మను) పొందుదురు. వారు సంఘముగా ఏర్పడి రథంతరమున వేరు కల్పములగుదురు. అని ఇది నాచే చెప్పబడిన చిత్రమైన అధ్యాత్మ దర్శనము. దీని తరువాత శుభకరమైన కల్పముల విస్తరమును చెప్పుదును.(21)

కల్పసంఖ్యా నిరూపణము

ఋషి పలికెను :

ఓ మహామునీ ఇది అంతయు అత్యద్భుతమైనది. ఈ కల్పముల యొక్క రహస్యము మంత్రముల యొక్క ప్రకల్పమును మీకు చక్కగా చెప్పితివి. ముల్లోకములో నీకు తెలియనిది ఏమియు లేదు. కావున విస్తారముగా మాకు సమస్త కల్ప సంఖ్యలను చెప్పుము.

వాయువు పలికెను :

ఇప్పుడున్నది ఉన్నట్లు కల్పసంఖ్యను చెప్పబోవుచున్నాను. అట్లే పరమేష్ఠియైన బ్రహ్మ

యొక్క యుగాగ్రమును వర్షాగ్రమును చెప్పెదను. వేయి కల్పములు బ్రహ్మయొక్క అబ్దము (సంవత్సరము) అనబడును. ఎనిమిదివేల లబ్దములు బ్రహ్మయొక్క యుగము. వేయి యుగములు బ్రహ్మకు ఒక్క సవనము, వేయి సవనములు ద్విగుణము (రెట్టింపు) అట్లే త్రివృతము (మూడింతలు). ఇది అంతయు బ్రహ్మయొక్క స్థితి కాలమునకు సంబంధించి నది. ముందు వరుసగా దాని సంఖ్యను చెప్పుదును.

పేర్లతో చెప్పబడిన ఇరువది యెనిమిది కల్పములలో ముందుగా వరుసగా ఉన్న సంజ్ఞను (కల్పమను పేరును) చెప్పెదను. రథంతరసామము పైన కల్పాంతమున నామ ధేయములు వాని నుండి పుట్టిన మంత్రోత్పతియు వినుడు. పందొమ్మిదవ కల్పము శ్వేత లోహితము. దానిలో పరమధ్యానమును చేయుచున్న బ్రహ్మను, ప్రార్థించి తెల్లని శిరోవేష్టము (తలపాగా)గలవాడు, తెల్లని పూలమాలలు కలవాడు, తెల్లని వస్త్రములు ధరించిన సిగ కలవాడు, అగ్నితో పోలి మహాతేజోవంతుడైన కుమారుడు పుట్టెను. భయంకరమైన ముఖముగలవాడు. మహారౌద్రుడు, చక్కని ఘోర (భయంకర) రూపుడు, తెలుపు, ఎఱుపు రంగుగలవాడు, ఉజ్జ్వలమైన శరీరముతో మహోజ్జ్వలుడును, విశాలమైన నోరు గలవాడును, తెల్లని కాంతిగలవాడు అయిన ఆతనిని శ్రీమంతుడును, విశ్వమంతటను ముఖములు గలవాడు పురుషుడును అయిన బ్రహ్మ చూచెను ఆతడు లోకస్రష్ట. విశ్వరూపుడు మహేశ్వరుడు, పురాణ పురుషుడు దేవుడు. అట్టి దేవదేవేశుని యోగులకు విశ్వాత్ముడైన వాడు. పితామహుడు అయిన బ్రహ్మ చాలకాలము అనుసరించెను. ఆ తరువాత బ్రహ్మ మహాదేవుడు పరమాత్మ ఈశ్వరుడు సద్యోజాతుడైన పరబ్రహ్మను హృదయమున నిలిపి ధ్యానించెను. దేవేశుడైన జగత్పతి ఈశ్వరుని తెలిసికొని సంతసించి నవ్వెను.

ఆ తరువాత బ్రహ్మయొక్క ప్రక్కభాగమునుండి బ్రహ్మవర్చస్సుగల శ్వేతులు అను ఋషులు పుట్టిరి. ఆ ఋషులు మహాత్ములు, తెల్లని పుష్పమాలలను ధరించినవారు. తెల్లని మైపూత (గంధము) ను పూసుకొన్నవారు, సుందరుడు, నందకుడు, విశ్వనన్దుడు, నందనుడు అనువారు మహాత్ములైన శిష్యులు. వారిచేత బ్రహ్మ జ్ఞానము వరింపబడినది. ఆ బ్రహ్మ ముందర తెల్లని కాంతి గల శ్వేతుడను పేరుగల మహాముని పుట్టెను. అతడు మహాతేజస్కుడు. అతని నుండి ఈ నరుడు పుట్టెను. అచట ఆ ఋషులు అందరు సద్యో జాతుడైన మహేశ్వరునిచూచిరి. కావున దేవుడైన విశ్వేశ్వరుని చూచిన బ్రాహ్మణులు అందరు ప్రాణాయామపరులై యోగధారణ చేసినవారై, పరబ్రహ్మయందు ప్రయత్నశీలురై, పాపనిర్ముక్తులై, మలములేనివారై, బ్రహ్మతేజోవంతులై బ్రహ్మ లోకమును దాటి పరబ్రహ్మ లోకమును చేరుదురు.

మరల వాయువు ఇట్లు పలికెను :

ఆ తరువాత ముప్పదవ కల్పము రక్తమని చెప్పబడినది. అచట రక్తుడు మహాతేజస్కుడై రక్తవర్ణమును ధరించెను. ఆ తరువాత పుత్రునికోరి, పరమేష్ఠియైన బ్రహ్మధానము చేసెను. ధ్యానించుచున్న అతనినుండి రక్త (ఎర్రని)ఆకారముగల మహా తేజస్వియైన కుమారుడు పుట్టెను. అతడు ఎఱ్ఱని మాలలను ఎఱ్ఱని వస్త్రములను ధరించి మిక్కిలి ప్రతాపవంతునిగా ఉండెను.

బ్రహ్మ తన కుమారుడైన, ఎఱ్ఱని వస్త్రములు ధరించిన ఆ రక్తుని చూచెను. వెంటనే పరమ ధ్యానయోగమును పొంది విశ్వమునీశ్వరునిగా తెలిసికొనెను (విశ్వేశ్వరుని తెలిసికొనెను). భగవంతుడైన బ్రహ్మ పరమమునందే మనస్సును నిలిపినవాడై ఆ మహా దేవునకు నమస్కరించెను. తరువాత బ్రహ్మ వామదేవుని (శివుని) బ్రహ్మాత్మకునిగా విశేషించి ధ్యానించెను. ఈ విధముగా పరమేష్ఠియైన బ్రహ్మచేత ధ్యానింపబడిన మహాదేవుడు సంతోష ముతో కూడిన మనస్సుతో, ఓ సత్తమా ! నీకు పితామహుడను (తండ్రియైన తాతను) అయినందున పుత్రినిగోరి పరమభక్తితో ధ్యానయోగముతో చూడబడితిని. కావున పరమ ధ్యానమును పొంది ప్రతికల్పమున, మహాతపస్వివై లోక స్రష్టను, మహాసత్త్వుడను, ఈశ్వరుడను అగునన్ను తెలిసికొనగలవు అని పలికెను. ఈ విధముగా చెప్పిన తరువాత శర్వుడు (శివుడు)పెద్ద నవ్వునవ్వెను. తరువాత ఆశర్వునకు నలుగురు మహాత్ములు కుమా రులు పుట్టిరి. ఆ మహాత్ములు శుద్ధబుద్ధులై ప్రకాశించిరి. వారందరు ఎఱ్ఱని వస్త్రములు ధరించినవారు. ఎఱ్ఱని మాలలు మైపూతలు గలవారు. ఎఱ్ఱని భస్మమును పూసుకొన్న అంగములు గలవారు. ఎఱ్ఱని ముఖము, ఎఱ్ఱని కండ్లు గలవారు.

ఆ తరువాత వేయి సంవత్సరముల చివర బ్రహ్మహితులై ప్రయత్నశీలురైన ఆ మహా త్ములు ఆ వామదేవ (శివ) సంబంధమైన బ్రహ్మను శబ్దములతో చెప్పుచుండిరి. లోకాను గ్రహమునకై శిష్యహితమును గోరి ఆ బ్రాహ్మణులు స్వయముగా సమస్త ధర్మోప దేశములను చేసిరి. తరువాత వెంటనే నాశములేని ఆ రుద్రునిలో ప్రవేశించిరి. తక్కిన బ్రాహ్మణ శ్రేష్ఠులు కూడ వామదేవుడైన ఈశ్వరుని యోగధారణము చేయుచున్న వారై, తద్భక్తులై, తత్పరాయ ణులై, మహాదేవుని (శివుని) పొందుచున్నారు. వారందరు పాపములు వీడినవారై విమలురై, బ్రహ్మ తేజముగలవారై, పునరావృత్తిలేని రుద్రలోకమును పొందగలరు. (22)

మహేశ్వరావతారయోగము

అని చెప్పి తిరిగి వాయువు ఇట్లు పలికెను :

ముప్పది ఒకటవకల్పము పీతవాస కల్పము అనబడినది. అచట మహా తేజుడైన

బ్రహ్మ పీత (పసుపు) వర్ణమును పొందెను. పుత్రకాముడై ధ్యానము చేయుచున్న ఆ పరమేష్ఠిబ్రహ్మకు, మహాతేజస్వి అయిన పసుపు వస్త్రము ధరించిన కుమారుడు పుట్టెను. అతడు పసుపు గంధమును పూసికొన్న అంగములు గలవాడు. పసుపు మాలలు ధరించిన వాడు యువకుడు పసుపు యజ్ఞోపవీతమును ధరించిన వాడు పసుపుతలపాగా గలవాడు, మహాభుజములు గలవాడు.

ప్రభువు అయిన ఆలోకేశ్వరుని చూచి బ్రహ్మ మనస్సుతోనే ఆ లోకస్రష్ట అయిన పరమేశ్వరునికి నమస్కరించెను. తరువాత బ్రహ్మ ధ్యానమునందు ఉండి, పరా స్వరూపిణియు మహేశ్వర ముఖమునుండి వెలువడి, మహేశ్వరియై, విశిష్టరూపముగల గోవును చూచెను. ఆ గోవు నాలుగు పాదములు గలది, నాలుగు నోళ్లు గలది, నాలుగు చేతులు గలది, నాలుగు స్తనములు గలది, నాలుగు నేత్రములు గలది, నాలుగు కొమ్ములు గలది. నాలుగు కోరలుగలది. నాలుగు ముఖములుగలది. ముప్పదిరెండు లోకములతో కూడు కొన్నది. అన్ని వైపుల ముఖములుగలది సర్వాధికారిణియైన ఈశ్వరియైనది.

సర్వ దేవతలచే నమస్కరింపబడినవాడు మహాతేజోవంతుడు అయిన మహాదేవుడు మహేశ్వరియైన ఆ మహాదేవిని చూచి మరలెను. మతిస్మృతి బుద్ధి అని మాటి మాటికి గానము జేయుచుండెను, మరలమరల రారమ్మనెను. ఆ మహాదేవి కూడ చేతులు జోడించి చాలా ఎక్కువగా పైకి లేచెను. యోగముచే విశ్వమును ఆవరించి జగత్తును అంతయు వశము చేసుకొందువు మహాదేవునిచే నీవు రుద్రాణివి (రుద్రుని భార్యవు) అగుదువు. బ్రాహ్మణుల హితము కొఱకు పరమార్థము కలదానవు అనెను.

ఆ తరువాత పుత్రకాముడై ఈమెను ధ్యానము జేయుచున్న పరమేష్ఠికి, దేవదేవేశుడు నాలుగు పాదములు గల మహేశ్వరిని ఇచ్చెను తరువాత ధ్యానయోగముతో ఆమెను పరమేశ్వరిగా తెలిసికొన్న లోకములచేత నమస్కారము బ్రహ్మలు గ్రహించువాడగు ఆ మహేశ్వరిని పొందెను. తరువాత చక్కని నియమబద్ధుడై గాయత్రిని, రౌద్రిని, ధ్యానించెను అని ఈ విధముగా వైదిక విద్యా రూపిణిని దేవదేవేశునిచే అర్పింపబడిన (ఈయబడిన) గాయత్రీ రూపిణియైన రౌద్రీ రూపిణి కావుననే రుద్రలోక నమస్కృతమైన మహాదేవిని జపించెను. తరువాత ధ్యానయుక్తమైన చిత్తముతో మహాదేవుని పొందెను.

అటు పిమ్మట మహాదేవుడు, బ్రహ్మకై మరల తన దివ్యయోగమును స్మరించెను. అట్లు స్మరించి ఐశ్వర్యమును, జ్ఞాన సంపదను వైరాగ్యమును కూడ ఇచ్చెను. ఆ తరువాత ఈశ్వరుడు భయంకరమైన ఉజ్జ్వలమైన అట్టహాసమును (పెద్ద నవ్వును) చేసెను. ఆ

నవ్వు నుండి అన్నివైపుల వెలుగులు విరజిమ్మిన కుమారకులు పుట్టిరి. వారు పసుపుపచ్చని మాలలు, వస్త్రములు ధరించినవారు, పసుపు గంధములు, పై పూతలును పూసికొన్నవారు, పసుపురంగు తలపాగాలు గలిగి పసుపు పచ్చని ముఖములు తల వెంట్రుకలు కలవారు. తరువాత వేయి సంవత్సరముల చివరవరకు ఉండి ఆ విమల తేజోవంతులు, యోగాత్ములైనవారు బ్రాహ్మణుల హితమును కోరిన వారై స్నానము చేసిరి. వారు ధర్మ బలమును యోగబలమును కలవారై, దీర్ఘ సత్రయాగముచేయు ఋషులకు యోగమును ఉపదేశించి, రుద్రుడైన ఈశ్వరునిలో ప్రవేశించిరి. ఈ విధానములతో మహేశ్వరుని పొందినవాడును నియమబద్ధమైన ఆత్మలుగల వారును ధ్యానయుక్తులై ఇంద్రియములను జయించిరి. వారందరు పాపములను వదలి తేజోవంతులై, పునర్జన్మ లేనివారై, రుద్రుడైన మహాదేవునిలో ప్రవేశించిరి.

వాయువు పలికెను :

తరువాత ఆ పసుపుపచ్చని కల్పము గడచిపోగా స్వయంభువుడగు బ్రహ్మనుండి సితకల్పుడను పేరు మరొకడు బయలుదేరెను. అపుడు సమస్తము ఏక సముద్రముగా అయినది. దివ్యములైన వేయియేండ్లు గడచినవి. దుఃఖితుడైన బ్రహ్మ ప్రజలను సృష్టింప దలచి ధ్యానించెను. ఆ విధముగా ధ్యానించుచున్న పుత్రకామియైన బ్రహ్మయొక్క వర్ణము నల్లని వర్ణమయ్యెను. తరువాత ఆ మహాతేజోవంతుడగు బ్రహ్మ ఆవిర్భవించిన ఒక కుమారకుని చూచెను. ఆ కుమారుడు నల్లనివాడు, మహావీర్య (బల)ము గలవాడు. తన తేజముచే వెలుగులు విరజిమ్మువాడు, నల్లని వస్త్రము, తలపాగా, యజ్ఞోపవీతములు కలవాడు, నల్లని తలగలవాడు. నల్లని మాలలు, మైపూతలు కలవాడు.

అమరుడు, ఘోరమైన ఆలోచన గలవాడు, దేవదేవేశుడు, నలుపు గోరోజనము వంటి ఎరుపును కలవాడు అగు విశ్వేశునికి బ్రహ్మ నమస్కరించెను. ప్రాణాయామపరుడైన తేజోవంతుడగు బ్రహ్మ మహేశ్వరుని తన హృదయమునందు నెలకొల్పుకొనె. ధ్యానయోగముతో ఉన్న ఆయతీశ్వరుని మనస్సుతో పొందెను. తరువాత బ్రహ్మ అఘోర అని అనుచు పరబ్రహ్మనే ధ్యానించుచుండెను. ఈ విధముగ ధ్యానించు పరమేష్ఠి బ్రహ్మను గూర్చి, భగవంతుడైన రుద్రుడు మహా శబ్దముతో పెద్దగా నవ్వెను. తరువాత ఆ రుద్రుని ప్రక్కల నుండి నల్లని నలుగురు కుమారకులు జనించిరి. వారు నల్లని మాలలను, లేపనములను ధరించినవారు. మహాత్ములు. నల్లని వస్త్రములు తలపాగాలు ధరించినవారు. నల్లని ముఖములు నల్లని కప్పు వస్త్రములుగలవారు. వారు గూడ పెద్దగా నవ్విరి. గొప్పగా హూంకరించిరి. మాటిమాటికి పెద్దగా నమస్కారములను కూడ చేసిరి.

తరువాత వేయిసంవత్సరముల చివర యోగధారణచేత ఆ పరమేశ్వరుని ఉపాసించి మహాభాగులై శిష్యులకు ఆ యోగమును ఇచ్చిరి. తరువాత వారు ఆ యోగముచే సుసంప న్నులైన మనస్సుతో నిర్మలము, నిర్గుణము, శివము, విశ్వేశ్వరము అగు స్థానమున ప్రవే శించిరి. ఇట్లు ఈ యోగముచే తక్కిన బ్రాహ్మణులు సైతము యోగవిధానమును తెలిసిన వారై, అవ్యయుడైన రుద్రుని స్మరించి ఆతనిని చేరిరి.

ఆ భయంకరమైన కృష్ణ రూపమైన కల్పము గడచిపోగా తరువాత విశ్వరూపమను పేరుగల మరొక కల్పము వచ్చినది. సర్వ సంహారము జరిగి మరల చరాచర (ప్రపంచ)ము సృష్టింపబడినది. పుత్రకామియై ధ్యానము చేయుచున్న పరమేష్ఠియగు బ్రహ్మనుండి మహా నాదము కలిగి విశ్వరూపమైన సరస్వతి ఆవిర్భవించినది.

సమస్త మాలలను, వస్త్రములను ధరించినవాడు, విశ్వమే యజ్ఞోప వీతముగాగల వాడు, విశ్వమే తలపాగగా గలవాడు సమస్త గంధములు గలవాడు, విశ్వమే స్థానముగా గలవాడు మహాభుజములు గలవాడునుఅగు ఆ ఈశ్వరుని యోగయుక్తుడై బ్రహ్మ తన మనస్సుతో ధ్యానించెను. సర్వేశ్వరుడై సర్వమునందున్న ప్రభువగు ఈశాన దేవునికి, ఆ బ్రహ్మ నమస్కరించి ఓం ఈశానుడవగు నీకు నమస్కారము. ఓ మహాదేవ! నీకు నమ స్కారము అని స్తుతించెను. ఈ విధముగా ధ్యానమందుండి నమస్కరించుచున్న బ్రహ్మను గూర్చి ఈశానుడు నేను సంతసించితిని నీకేమి కావలెను అని పలికెను. అప్పుడు బ్రహ్మ మహేశ్వరునకు నమస్కరించి వాక్కులతో స్తుతించెను. అంతట సంతుష్టుడైన బ్రహ్మ "నీ ఈ విశ్వగమైన విశ్వేశ్వరమైన రూపమును తెలుసికొన కోరుచున్నాను. ఈ పరమేశ్వరుడు ఎవరు? ఈ భగవతియైన దేవి ఎవరు? ఈమె నాలుగు పాదములుకలదియు నాలుగు ముఖములు కలదియు, నాలుగు కొమ్ములు కలదియు నాలుగు నోళ్లు కలదియు, నాలుగు దంతములు కలదియు, నాలుగు స్తనములు కలదియు, నాలుగు చేతులు, నాలుగు నేత్ర ములు కలదియునై విశ్వరూపమైనట్లు ఎట్లు తలపబడినది? ఈమె పేరేమి? ఈమె ఆత్మ యెవరు? ఎట్టి క్రియలవలన ఏమి బలముగలది? తెలియగోరుచున్నాను" అని బ్రహ్మ అనెను.

మహేశ్వరుడు అనెను :

ఇది సర్వ మంత్రములలో రహస్యమైనది. పవిత్రమైనది. పుష్టిని వృద్ధి చేయునది. ఆదిసృష్టిలో ఉన్నది ఉన్నట్లుగా, ఉన్న అతి రహస్యమును వినుము. ప్రస్తుతము నడుచుచున్న కల్పమునకునకు విశ్వరూపకల్పము అని పేరు. దీనిలో భవుడు మొదలుగా గల ఇరువది ఆఱుగురు మనువులు చెప్పబడినారు. ఓ విభువైన బ్రహ్మా! నీవు ఈ బ్రహ్మ స్థానమును

పొందినప్పటి నుండి ఇది ముప్పది మూడవ కల్పము. నీ ముందే నూరువేల (కోటి) స్వయంభువులు (బ్రహ్మలు)గడచిపోయిరి ఓ మహామునీ! వారిని గురించి తెలుసుకొనుము. ఇది (ముప్పది మూడవ కల్పము) ఆనందము. ఇదీ నీ యొక్క మహాలయ రూపమైన ఆనందము. గాలవ్యగోత్రము గలవారి తపస్సుచేత నా పుత్రుడవై నీవు వచ్చితివి. నీ యందు యోగము సాంఖ్యము, తపస్సు, విద్యావిధి, క్రియలు భూతము, సత్యము, అహింస, సంతతి క్రమములు, ధ్యానము, శాంతి, విద్య, అవిద్య, ధృతి, కాన్తి, శాన్తి, స్మృతి, మేధ లజ్జ, శుద్ధి, సరస్వతి, తుష్టి, పుష్టి, క్రియ, లజ్జ, క్షాంతి, ప్రతిష్ఠితములై ఉన్నవి. ఈ ప్రకృతిని తెలుసుకొనుము. ఆమె ఇరువది ఆరుతద్గుణములు కలది. ముప్పది రెండక్షరముల పేరుకలది. ఓ బ్రహ్మా, ఈమెకు ప్రకృతిగాను, నిన్ను కన్న మహేశ్వరినిగాను తెలియుము. అట్టి ఆమెను తత్త్వచింతకులు ప్రధానమనియు ప్రకృతి అనియు చెప్పుదురు.

ఈమె అజ అనగా జన్మలేనిది. లోహిత అనగా రజోగుణవతి, శుక్లయు కృష్ణయు, అనగా సత్వగుణవతి, తమోగుణవతి, విశ్వములను చక్కగా సృష్టించుచున్నది. చక్కని రూపము గలది. ఇట్టి ఈ ప్రకృతి రూపము గాయత్రిగా (గానము చేయు వానిని రక్షించు దానినిగా) గోవునుగా, విశ్వరూపనుగా (విశ్వరూపిణిగా) తెలిసికొని నేను అజుడను (జన్మలేనివాడను) అయితిని, అని మహాదేవుడు అనెను.

ఈ విధముగా చెప్పి మహాదేవుడు (శివుడు) చప్పట్లధ్వని కహాకహా అను ధ్వని యునుగల అట్టహాసమును చేసెను. తరువాత మహాదేవుని ప్రక్కనుండి దివ్యులై సర్వ రూపములు గల కుమారకులు జన్మించిరి. జటి (జడలు గలవాడు) ముండి (గొరిగిన తలగలవాడు) శిఖండీ (నెమిలి ఈక తలపైనగలవాడు)అర్ధముండుడు (సగము తలగొరిగి కొన్నవాడు) వీరు మహాదేవుని ప్రక్కల నుండి జన్మించినవారు. అంత వారు శాస్త్రోక్తమైన యోగములతో చక్కని గొప్ప ఓజస్సుగలవారై, దేవయానపు వేయియేండ్లు మహేశ్వరుని ఉపాసించిరి. తరువాత శిష్టులకు యోగపూర్ణమై దృఢమై నియతమైన ధర్మోపదేశము చేసిరి అట్లే నియతాత్మలై ఈశ్వరుడైన రుద్రునిలో ప్రవేశించిరి.

వాయువు పలికెను :

తరువాత ఆశ్చర్యము పొందిన లోకపితామహుడగు బ్రహ్మ భక్తి యుక్తమయిన చిత్తముతో మహాదేవుని శరణు పొంది జేరి, ఓ విభో, మహాదేవ, నీకు అంతట శ్వేతత్వము (తెలుపుదనము) ఎట్లు వచ్చినది? అని అడిగెను. భగవంతుడు శివుడు పలికెను. శ్వేత కల్పము ఉన్నప్పుడు నేను శ్వేతుడను అయితిని, తెల్లని తలపాగా గలవాడను తెల్లని

మాలలు గలవాడను తెల్లని వస్త్రములు గలవాడను, శివుడను, తెల్లని ఎముకలు, మాంసము వెంట్రుకలు కలవాడను. తెల్లని చర్మముగలవాడను. తెలుపు, ఎఱుపు వర్ణము కలవాడను అయితిని. ఆ కారణముననే అప్పుడీ కల్పము శ్వేత కల్పమని ప్రసిద్ధి చెందినది. నా అనుగ్రహముననే దేవేశుడయిన బ్రహ్మ శ్వేతాంగుడు తెలుపు, ఎఱుపు వర్ణము గల వాడయ్యెను. అపుడు గాయత్రి (సరస్వతి) శ్వేతవర్ణమై బ్రహ్మీ అని పేర్కొనబడినది. ఓ ! దేవేశుడవైన బ్రహ్మ ! నీ చేత నేను రహస్య పదమునందు ఉన్నందునను, నా తపస్సుచేతను సద్యోజాతుడైన సనాతనునిగా తెలియబడితిని. సద్యోజాతమను నీ పరబ్రహ్మము రహస్యమని చెప్పబడినది. కావున రహస్యత్వమును పొందిన నన్ను తెలిసిన ద్విజాతులు బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు) పునర్జన్మ లేని శివ సామీప్యమును పొందుదురు.

నేను పేరుతో లోహితుడనై మరల ఉన్నప్పుడు నా వర్ణముచేతనే ఆ కల్పము లోహిత కల్పము అనబడినది. అప్పుడు గాయత్రీ రూపిణియగు గోవు ఎర్రని మాంసము ఎముకలు పాలుకలదై, ఎఱ్ఱని కన్నులు, స్తనములు కలదై కీర్తింపబడినది. ఆ తరువాత లోహితుడు అగుటచే వర్ణము తారుమారు కాగా యోగము వామమయినందున, వామ దేవత్వము పొందబడెను. అయినను ఆత్మను వశీకరించి మహాబలవంతుడను అగుటచే శ్వేతవర్ణము తోనే తెలియబడితిని. కావున వర్ణోత్తముడను అయితిని. ఆ తరువాత భూమిపైన వాయు దేవునిగా ప్రసిద్ధి పొందితిని. నా వామదేవత్వమును తెలిసిన ద్విజాతులు ఈమెను రుద్రా ణియై గాయత్రియైన మాతనుగా తెలుసుకొని సర్వపాపముల నుండి విముక్తులై రజోగుణము వీడిన వారై, బ్రహ్మతేజము గలవారై పునర్జన్మలేని రుద్రలోకమును పొందగలరు.

నేను కృష్ణవరుడనై(నల్లనివాడనై) భయంకరునిగా ఉన్నప్పుడు, నాచే చేయబడిన వర్ణముచేత, నా కల్పము గూడ కృష్ణ కల్పమనబడినది. అచట నేను కాలముతో సమానమైన వాడను. కాలము లోకమును ప్రకాశింపచేయును. ఓ బ్రహ్మ! నేను ఘోరుడను ఆఘోర పరాక్రముడను అని నీవు ఎఱుగుదువు. కావున భూమిపైన నన్ను భయంకరత్వమును పొందినవానిగా తెలిసిన వారికి, నేను అభయంకరుడను, శాంతుడను, అవ్యయుడను అగుదును. కావున భూమిపై నన్ను విశ్వత్వమును పొందిన వానిగా తెలిసిన వారికి నేనెల్లప్పుడు శివుడను సౌమ్యుడను అగుదును. కావున ఈ కల్పము విశ్వరూప కల్పమన బడినది. అట్లే ఈ సావిత్రి కూడ విశ్వరూప అనబడినది. అట్లే సర్వరూపములు గల వీరందరు నీయొక్క పుత్రులైనారు. వారు లోకసమ్మతమై, నాలుగు పాదములుగా చెప్పబడిరి. కావున నాకు సర్వ వర్ణములు గల సంతానము కలిగియుండుట జరుగగలదు. వర్ణములను బట్టి ప్రజ సర్వభక్ష్యములును పవిత్రములు కాగలవు. మోక్షము ధర్మము అర్థము కామము

అను ఈ నాలుగు ఉండగలవు. కావున తెలిసికొనువాడును, తెలియదగినదియు నాలుగు విధములుకాగలదు. భూతసమూహములు (పృథివ్యప్తేజస్సులు) నాలుగు. అట్లే ఆశ్రమ ములు (బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులు)గూడ నాలుగు. ధర్మము యొక్క పాదములు నాలుగు అను నలుగురు పుత్రులు. కావున చరాచరమైన జగము నాలుగు యుగావస్థలు (కృత త్రేతా ద్వాపర కలి రూపములు) కలది. అట్లు నాలుగు విధములుగా ఉన్నదియు (ప్రతిది) నాలుగు పాదులు కలదిగా కలదు. 1.భూర్లోకము; 2.భువర్లోకము; 3.స్వర్లోకము; 4.మహర్లోకము; 5.జనోలోకము; 6.తపోలోకము; 7.శాంతలోకము; 8.రుద్రలోకము. వీనిలో మూడవది స్వర్లోకము, నాలుగవది మహర్లోకము అనబడునవి. అచట లోకము ఉత్కృష్ట మైన స్థానము. అది యోగులకు పరమమైన స్థానము. అచట వారు నిర్మములు (మమకారము లేనివారు) నిరహంకారులు, కామ క్రోధములు లేనివారు, తద్విదులై (పరమాత్మను తెలిసిన వారై) యోగధారణమున ఉన్నవారు, పరబ్రహ్మ ధ్యాన తత్పరులునై కనబడుదురు. నీవు సరస్వతిని నాలుగు పాదములుగల దానినిగా చూచితివి. ఆమె అట్లు ఉన్నందున అన్ని పశువులును నాలుగు పాదములు కలవిగాకలవు. కావుననే వానికి నాలుగు స్థనములుండగలవు. మంత్ర సంయుక్తమైన సోమము నా ముఖమునుండి జారిపడినదై స్థనములనుండి మొత్తము ఘృతమును (నేతిని) త్రాగి, ఓ బ్రహ్మా! ప్రాణులకందరికి జీవమైనందున జగమంతయు సోమ మయముగను అమృతముగను చెప్పబడినది. ఆకారణముననే నాలుగు పాదములు ఉండగలవు. దీనికి ఆశ్వేతత్వము గూడ దానిచేతనే ఉండగలదు. ఈ లోకభావినియై సావిత్రియైన మహేశ్వరి ఈ విధమైన క్రియ గలదై ద్విపాదగా (రెండు పాదములు గలదిగా) చూడబడినందున నరులందరు రెండు పాదములు రెండు స్థనములును గలవారైరి. మహాసత్త్వము గలదై సర్వప్రాణులను ధరించునదై పరారూపిణియైన మహేశ్వరి అజయై (మేకయై జన్మలేనిదై) సర్వవర్ణములు కలదిగా నీచే చూడబడినందున అజములకు (మేకలకు విశ్వరూపత్వము రాగలదు. మహాతేజమైన మేకగూడ మహాతేజము కలది కాగలదు. ఈ మేక ముఖమున అంతటను అగ్నిహోత్రుడు వ్యర్థముగా (నిస్రఫలమైన) రేతస్సు గలవాడగును. కావున అగ్ని పశురూపియై, అంతట ఉన్న వాడై కూడ పవిత్రుడే. తపస్సుచే భావితమైన ఆత్మలు గల ద్విజులు ఈశిత్వముచేత శివత్వము చేత సర్వగతుడై అంతటను స్థిరుడైన వానినిగా, నన్ను (ఈశ్వరుని) చూచినవారు, రజస్తమో గుణములను వదలి భూమిజ మానుష్యక రూపమును గూడ వదలియు, పునరావృత్తిలేని (పునర్జన్మలతో లభ్యముగాని) నా సమీపమును పొందుదురు. ద్విజులారా!” అని ఈ విధ ముగ రుద్రునిచే చెప్పబడగా, బ్రహ్మ నమస్కరించి పరిశుద్ధుడై మరల ఈ విధముగా పల్కెను.

బ్రహ్మ పలికెను :

ఓ భగవన్! ఓ దేవదేవేశ! విశ్వరూపియైన మహేశ్వర! ఓ మహాదేవ! ఈ నీ తనువులు లోకవందితములైనవి. ఓ విశ్వరూప! ఓ మహాసత్త్వ! ఓ మహాభుజములు గలవాడా! ద్విజాతులు ఏ యుగ సంభూతి యందు నిన్ను జూడగలవు? ఓ మహాదేవ! ద్విజాతులకు ఏ తత్త్వయోగముతో లేదా ఏ ధ్యానయోగముతో నీ తనువులను జూడ శక్య మగును?

భగవంతుడు పలికెను :

తపస్సుచేతగాని, యోగముచేతగాని, దానధర్మఫలముచేతగాని, తీర్థ (యాత్రా) ఫలయోగము చేతగాని, దక్షిణలతో గూడిన యజ్ఞములచేతగాని, వేదములను చదివించుట చేతగాని, చిత్తముతోడి నివేదనముల చేతగాని నేను మనుష్యులకు కనబడను. కేవలము ఒక్క ధ్యానము చేతనే గనబడుదును. ముల్లోకములకు ఈశ్వరుడై విష్ణువైన నారాయణుడు గూడ ఈ లోకమున సాధ్యుడు కాగలడు. పేరుతో ఆతడు వారాహుడని ప్రసిద్ధుడు. నాలుగు బాహువులు నాలుగు పాదములు నాలుగు నేత్రములు నాలుగు ముఖములును గల ఆతడు అప్పుడు సంవత్సరము గానయి యజ్ఞరూపుడు అగును. ఆతడు ఆఱంగములు గలవాడు. మూడు శిరములు గలవాడు. మూడు స్థానములలో మూడు శరీరములు గలవాడును అగును.

కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము, కలియుగము – అని నాలుగు యుగములు, దీనియొక్క పాదములు నాలుగు అంగములు, క్రతువులు, భుజములు నాలుగు వేదములు, ఋతువు సంధి ముఖములు (షడంగకములు) రెండు ముఖములు రెండు అయనములు నాలుగు నేత్రములు. ఫాల్గుణ, ఆషాఢ, కార్తిక మాసములు అను మూడు సర్వములు మూడు శిరములు దివ్య అన్తరిక్ష–భౌమములనునవి మూడు స్థానములు సంభవము ప్రళయము అనునవి రెండు ఆశ్రమములు ప్రభువై విష్ణువై నారాయణుడు కాలరూపుడై వరాహత్వమున ఉన్నప్పుడు సాధ్యుడు కాగలడు.

అప్పుడు ఓ దేవేశ ! నీవు నాలుగు ముఖములతో కూడి ఉన్నావు. ప్రభువైన విష్ణువైన నారాయణుడు బ్రహ్మ. లోకమునకు నమస్కరింపదగినవాడు. భూమి అంతయు సముద్రము కాగా దానిలో తెప్పపై పడుకొనుచున్న పురుషుడై దేవేశుడై, ధ్యానయుక్తుడై మహామునియైన హరిని నీవు చూడగలవు. అపుడు మీరు ఇద్దరు నా యోగ శక్తిచే మోహితులై చిత్తమును కోల్పోవుదురు. రాత్రిలో ఒకరినొకరు తెలియక పోటీపడిన వారగుదురు. మానుషులైన బ్రహ్మ, నారాయణులు ధ్యాన(యోగ)ము వలన ఒక్కొకరి కడుపులలో ఉన్న చరాచర లోకములను చూచి తెలిసికొని ఆశ్చర్యము నొందుదురు.

తరువాత నీవు పద్మమున పుట్టినవాడవు. సనాతనుడైన విష్ణువు పద్మము నాభి యందు గలవాడై పద్మనాభుడు అయ్యెను నీవు పద్మాంకితుడవై గొప్ప ప్రసిద్ధిని పొందగలవు.

ఆ తరువాత ప్రభువు యొక్క వరాహ కల్పములో మరల మహాతేజుడైన విష్ణువు కాలుడై లోక ప్రక్షాళణుడు అగును. అప్పుడు వైవస్వతుడను మనువు నీ పుత్రుడు కాగలడు. నాలుగు యుగావస్థలుగల ఆ యుగాంతకమైన కల్పమునందు శిఖతో కూడుకొని శ్వేతుడు అను మునినై ఉండగలను. అపుడు నాకు రమ్యమైన హిమగిరి శిఖరమున మేకలతో నిండిన పర్వత శ్రేష్ఠమున శివయోగ్యులైన నలుగురు శిష్యులుగా ఉందురు. వారు శ్వేతుడు. శిఖుడు, శ్వేతాశ్వుడు. శ్వేతలోహితుడు అనువారు ఆ నలుగురు వేదపారగులు, మహాత్ములు నైన బ్రాహ్మణులు కావున వారు పరబ్రహ్మ మార్గమును చూచి బ్రహ్మమయులై పునరావృత్తి లేని ఆ బ్రహ్మ సమీపమును అనగా నా సమీపమును చేరుకొందురు.

మరల నా దేవేశుడైన ప్రభువు ద్వితీయ ద్వాపరమున బ్రహ్మయైనపుడు సత్యుడను పేరుగల వ్యాసుడు ఉండగలడు. అపుడు లోకహితము కొఱకు లోకమును అనుగ్రహిం చుటకై యా కలియుగములో సుతారుడను పేరుతో ఉండగలను. అచ్చట గూడ నాకు పుత్రులు కలుగగలరు. వారు దుంధుభి, శతరూపుడు, ఋచీకుడు, క్రతుమాన్ – అనువారు. వారు యోగమును, జ్ఞానమును, సనాతనమైన బ్రహ్మను పొంది పునరావృత్తి లేని బహు జన్మలలో లభ్యముగాని రుద్రలోకమును బొందగలరు.

మూడవ ద్వాపరమున భార్గవుడు వ్యాసుడై యుండును. అపుడు యుగాన్తమున దమునుడనై నేను ఉండగలను. అచటగూడ నాకు నలుగురు పుత్రులు ఉందురు. వారు విశోకుడు, వికేశుడు, విశాపుడు శాపనాశనుడు అనువారు. వారు గూడ ఆయోగోక్త మార్గముననే గొప్ప ఓజోవంతులై పునరావృత్తిలేని రుద్రలోకమును బొందగలరు.

నాలుగవ ద్వాపర యుగమున అంగిరసుడు వ్యాసుడనబడును అపుడు నేను సుహో త్రుడు అను పేరుతో నుండగలను. అక్కడ గూడ తపోధనులు దృఢవ్రతులు యోగాత్ములు, బ్రాహ్మణశ్రేష్ఠులునైన నలుగురు నలుగురు సత్పుత్రులు కలుగుదురు. వారు సుముఖుడు, దుర్ముఖుడు, దుర్దముడు, దురతిక్రముడు–అనువారు వారు సూక్ష్మమైన యోగమార్గమును పొంది పాపముల దహించి నిర్మలులు అగుదురు. వారు కూడ ఆ యోగమార్గముననే (పూర్వులవలె) నిశ్చయముగా రుద్ర లోకమును బొందుదురు.

ఐదవ ద్వాపర యుగములో సవిత వ్యాసుడగును. అపుడు లోకానుగ్రహమునకై యోగాత్ముడను మహాతపస్విని అనేక కార్యముల జేయువాడను. అయిన కంగుడను

వాడనుకాగలను. మహాభాగ్యవంతులు, రజోగుణము లేనివారు. పరిశుద్ధ జన్యులు, దృఢ వ్రతులు, యోగాత్ములునైన నలుగురు నాకు పుత్రులు గలుగ గలరు. సనుడు, సనందనుడు, ప్రభువులైన సనాతనుడు, ఋతువు, సనత్కుమారుడు, వీరు మమకారము లేనివారై, అహంకారము లేనివారై అనేక జన్మలచే కూడ పొందరాని నా సమీపమును (రుద్ర లోకమును) పొందగలరు.

తిరిగివచ్చిన యారవ ద్వాపర యుగమున విభువైన మృత్యువు వ్యాసుడగును. అపుడు నేను లోకాక్షి అను పేరున ఉండగలను. దివ్యులు దృఢవ్రతులు యోగాత్ములు లోకసమ్మతులు నైన నలుగురు నాకు శిష్యులు (పుత్రులు) కలుగగలరు. వారు సుధాముడు, విరజుడు, శంఖపాదుడు, రవుడు అనువారు యోగాత్ములైన వారందరు పాపములను దహించి మహాత్ములై యా యోగ మార్గముననే నిస్సంశయముగ నా రుద్ర లోకమును బొందుదురు.

తిరుగుచు వచ్చిన యేడవ ద్వాపర యుగమున మహాతేజస్కుడైన విభువైన శతక్రతువు వ్యాసుడగును. అపుడుగూడ ఆ యుగాన్తకమైన కలిలో సమస్త యోగులలో శ్రేష్ఠుడనై జై గీషవ్యుడని ప్రసిద్ధి జెందిన వాడను గాగలను. అచ్చట గూడ నా యుగములో నాకు నలుగురు పుత్రులు గలుగుదురు. వారు సారస్వతుడు, సుమేధుడు, వసువాహుడు, సువాహనుడు అనువారు. వారు గూడ అదే మార్గమున ధ్యాన యోగమును ఆశ్రయించి మహాత్ములై రుద్రలోక పరాయణులు (చేరినవారు) కాగలరు.

తిరుగుచు వచ్చిన ఎనిమిదవ ద్వాపరయుగమున వసిష్ఠుడు వ్యాసుడగును. కపిలుడు. ఆసురి, మునియైన పంచశిఖుడు, మహాయోగియైన వాగ్బలియు వీరందరు గొప్ప ఓజస్సు గలవారు. వీరు ధ్యానయోగులై పాపముల దహించి మహేశ్వర యోగమును బొంది పునః పునః జన్మలలో గూడ లభింప అలవిగాని నా సమీపమును (రుద్రలోకమును) జేరుదురు.

తరువాత తిరుగుచు వచ్చిన తొమ్మిదవ ద్వాపరమున సారస్వతుడు వ్యాసుడగును. అపుడు నేను ఋషభుడను పేరుతో నుండగలను. అచట గూడ నాకు మహాతేజస్సు గల పుత్రుడు గలుగుదురు. వారు పరాశరుడు గార్గ్యుడు భార్గవుడు, అంగిరుడు అనువారు. వారందరు మహాత్ములు వేదపారగులు, తపోబలముచే గొప్పవారు శాపమిచ్చుటలోను ఉపసంహరించి యనుగ్రహించుటలోను సమర్థులు. వారు గూడ యోగోక్త మార్గమునే తపస్వినులై ధ్యానమార్గమును పొంది నా రుద్రలోకమును జేరుదురు.

పదియవ ద్వాపరమున త్రిధాముడనువాడు వ్యాసుడగును. ఓ బ్రాహ్మణులారా అపుడు మరల నేను రాగలను. హిమాలయ శిఖరమున కొండచరియలతో ఎత్తైన పర్వతము

గలదు. దాని పేరు భృగువుయొక్క శిఖరము. కావున ఆ శిఖరము భృగువైనది. అచటనే దృఢ వ్రతులైన (యా) పుత్రులు నాకు గలుగుదురు. వారు బలబంధువు, నిరామిత్రుడు కేతుశృంగుడు తపోధనువారు. వీరు యోగాత్ములు, మహాత్ములు, ధ్యానయోగముతో గూడిన వారు. వీరు తమతపస్సులచే తప పాపములను దహింపజేసిన వారై రుద్రలోకమును జేరగలరు. పదునొకండవ ద్వాపరమున త్రివృత్ అనువాడు వ్యాసుడుగును అప్పుడుగూడ కలి ఎదుట గంగా ద్వారమున నేనురాగలను. అచటనే ఉగ్రులను వారు మహానాదము గలవారై నాకు పుత్రులు కాగలరు. వారు గొప్ప ఓజస్సుగలవారు మంచినడవడి గలవారు లోక ప్రసిద్ధులు. వారిపేరులు లంబోదరుడు, లంబుడు, లంబాక్షుడు, లంబకేశుడు. వారు మహేశ్వర యోగమునుపొంది రుద్రలోకమునకు బయలుదేరుదురు. వారుగూడ ఆ మార్గ మున (ధ్యాన యోగమార్గమున)నే పరమగతిని (రుద్ర లోకమునకు) బొందుదురు.

పంద్రెండవ ద్వాపరమున శతతేజుడను మహాముని మహాసత్త్వుడై కవివరుడైన వ్యాసుడు కాగలడు. అపుడుగూడ యుగాంతమునవి : అనుపేరుతో హైమక వనమునందు (బంగారు లేక మంచుగల వనమును) బొంది యోగమును బూని భూతలమున నుండ గలను. ఇచట గుణభస్మతో స్నానముజేసి భస్మను బూసికొన్నవారు మహాయోగులు రుద్రలోక పరాయణులైనవారు నాకా పుత్రులు గలుగగలరు. వారు సర్వజ్ఞుడు, సమబుద్ధి, సాధ్యుడు, సర్వుడు అనువారు. వారు ధ్యానయోగపరాయణులై రుద్రలోకమును బొందగలరు.

క్రమముగా పదమూడవ పరిభ్రమణమైన ద్వాపరమురాగా నారాయణుడను ధర్ముడు వ్యాసుడుకాగలడు. అపుడు నేను గంధమాదన పర్వతమున పుణ్యమైన వాలఖల్యాశ్రమమున వాలి అను మహామునిగా రాగలను. అచటగూడ నాకు పూర్వమున కలిగిన తపోధనులు పుత్రులు కాగలరు. వారు సుధాముడు, కాశ్యపుడు, వసిష్ఠుడు, విరజుడు–అనువారు. మహా యోగబలముతో గూడి విమలురై ఊర్ధ్వ రేతస్కులైన వారు గూడ ఆ యోగ ధారణము తోనే రుద్రలోకమును చేరగలరు.

పదునాలుగవ పర్యాయమైన ద్వాపరమున సురక్షణుడనువాడు వ్యాసుడు అగును. అచట కూడ యుగాన్తమున అంగిరస వంశ శ్రేష్ఠుడనై గౌతముడను యోగవేత్తనుగా రాగలను. ఆ గౌతముని నుండియే యా గౌతమ వనము ఏర్పడగలదు. అచట గూడ కలిలో నాకు నలుగురు పుత్రులుకలుగగలరు. వారు అత్రి, ఉగ్రతపుడు, శ్రావనుడు స్రవిష్టుడు – అనువారు. యోగాత్ములు, మహాత్ములు, ధ్యానయోగపరాయణులునైన వారు గూడ ధ్యానయోగ మార్గముననే రుద్రలోకవాసులు అగుదురు.

పర్యాయ క్రమమున వచ్చు పదియైదవ ద్వాపరమున ప్రభువైన ఆరుణియనువాడు వ్యాసుడు కాగలడు. ఓ బ్రాహ్మణులారా అపుడు నేను కూడ వేదశిరుడను పేరు వాడను కాగలను. అచట పరమేశ్వర దేవతాకమైన వేదశిరోనామ కాస్త్రము కలుగగలదు. అది మహావీర్యవంతమైన యస్త్రము. హిమవత్పర్వతపు వెనుకటి బాగమును ఆశ్రయించి సరస్వతీనదీ తీర్థస్థమైన పర్వత శ్రేష్ఠమున (సరస్వతీ పర్వతముకా వచ్చును) వేద శీర్షమను పర్వతము గూడ ఉండును. అపుడు కూడ నాకు ఆ తపోధనులు నలుగురు పుత్రులుగా జన్మింతురు. వారు కుణి, కుణిబాహువు, కుశరీరుడు, కునేత్రకుడు అనువారు. యోగాత్ములై మహాత్ములై బ్రహ్మిష్ఠులై (బ్రహ్మము నందున్న వారై) ఊర్ధ్వ రేతస్కులైన వారు గూడ యోగ ధారణము చేతనే రుద్ర లోకమును జేరిరి.

పర్యాయక్రమమున తిరుగుచు వచ్చు పదునారవ ద్వాపరమున సంజయుడను వ్యాసుడు ప్రభువు కాగలడు. అప్పుడుగూడ గోకర్ణుడను పేరుతో నుండగలను. ఆ గోకర్ణుని నుండియే గోకర్ణమను నా వనము ఏర్పడగలదు. అచట గూడ మహౌజస్కులైన పుత్రులు నలుగురు కలుగగలరు. వారు కశ్యపుడు, ఉశనుడు, చ్యవనుడు, బృహస్పతియను వారు గూడ యోగధారణ మార్గముననే పరమపదమైన రుద్రలోకమును బొందగలరు.

తరువాత పర్యాయ క్రమమున తిరిగి వచ్చు పదునేడవ ద్వాపరమున దేవకృతం జయుడను వాడు వ్యాసుడు కాగలడు. అపుడు గూడ నేను గుహావాసి అనుపేర ఉండ గలను. ఎత్తైన హిమాలయ పర్వత శిఖరమున మహాలయమను దానియందు మహాపుణ్య వంతమైన మహాలయమను సిద్ధి క్షేత్రము ఉండగలదు. అటగూడ బ్రాహ్మణ్యులు యోగమును తెలిసినవారు, మహాత్ములు సర్వజ్ఞులు నిరహంకారులైన యా పుత్రులు నాకు గలుగగలరు. వారు ఉతథ్యుడు, వామదేవుడు, మహాకాలుడు, మహాలయుడు – అనువారు వారికి లక్షమంది శిష్యులు ధ్యానయోగ సాధనము చేయుదురు. అప్పుడా కల్పమున వారందరు ధ్యానయోగులు కాగలరు. వారు ధ్యానయోగధారణమును చక్కగా జేసి హృదయమున మహేశ్వరుని నిలిపి మహాలయమున (అన్ని ప్రాణులు లీనమగు గొప్ప యాలయమైన శివపదము) అడుగిడి నాశరహితుడైన శివునిలో ప్రవేశింతురు. ఇతరులైన మహాత్ములుగూడ నా యుగాన్తమైన కాలమున ధ్యానయుక్తమైన మనస్సుతో నిర్మలులై శుద్ధమైన బుద్ధులు గలవారై మహాలయమును బొంది మహేశ్వర పదము (స్థానమును) చూచి, వెంటనే వేగముగా తమకు పదితరముల పూర్వులను పదితరముల యందు వారిని తరింపజేయుదురు. తనతో కలిపి మొత్తము ఇరువది ఒక్కరిని మహాసముద్రమును తరింపజేసి జ్వరములేనివారై రుద్రలోకమును జేరుదురు.

తరువాత పర్యాయ క్రమమున తిరిగివచ్చు పదునెనిమిదవ ద్వాపరమున ఋతుం జయుడను ముని వ్యాసుడు అగును. అపుడు గూడ నేను శిఖండియను పేరున ఉండగలను. సిద్ధి క్షేత్రమై మహాపుణ్యమై దేవదానవులచే పూజింపబడినదై హిమాలయ శిఖరమున శిఖండియను పర్వతముండును. అచటనే ఋషులచేతను, సిద్ధులచేతను సేవింపబడిన (నివసింపబడిన) శిఖండివనము (నెమలి వనము) ఉండును. అచట గూడ ఆ తపోధనులైన వారు నాకు పుత్రులు కాగలరు. వారు వాచఃశ్రవుడు, ఋతీ(చీ)కుడు, శావాసుడు దృఢ వ్రతుడు అనువారు. యోగాత్ములై మహాశక్తి గలవారైన వారందరు వేదములను అంతముల వరకు చదివి తెలిసికొన్నవారు. వారు మహేశ్వరమైన యోగమును బొంది వారు రుద్ర లోకమును చేరుదురు.

ఆ తరువాత పర్యాయక్రమమున వచ్చు పందొమ్మిదవ ద్వాపరమున భరద్వాజు డను మహాముని వ్యాసుడగును. అటగూడ నేను జటామాలి అను పేర జటాయుపర్వత మున్న రమ్యమైన హిమాలయశిఖరముపైన నుందును. అటగూడ మహౌజస్కులైన యా పుత్రులు నాకు గలుగుదురు. వారు హిరణ్యుడు, కౌశిల్యుడు, కాక్షీవుడు, కుథిముడు, అనువారు. యోగధర్మము గలిగి ఈశ్వరులైన వారందరు ఊర్ధ్వరేతస్కులు. వారు మహేశ్వర యోగమును బొంది రుద్రలోకమును జేరుదురు.

తరువాత పర్యాయక్రమమున తిరిగి వచ్చు ఇరువదియవ ద్వాపరసృష్టిలో మహామతి యైన వాచఃశ్రవుడనువాడు వ్యాసుడుకాగలడు. అప్పుడుగూడ నేనే అట్టహాసి యను పేర ఉండగలను. అపుడు నరులందరు అట్టహాస (పెద్దనవ్వు) ప్రియులగుదురు. సిద్ధులు చారణులు నివసించు ఆ హిమాలయముపైన నాకు మహౌజస్కులైన ఆ నల్గురు పుత్రులు కలుగుదురు. వారు యోగముతోగూడిన ఆత్మలుకలవారు. మహాబలులు, ధ్యానయోగము కలవారు నియతమైన వ్రతములు కలవారు. వారు సుమంతుడు, విద్వాంసుడైన వర్వరి సుబంధువు, కుశికంధరుడు అనువారు. వారు మాహేశ్వర యోగమును బొంది రుద్ర లోకమును చేరుకొందరు.

పర్యాయక్రమమున తిరిగివచ్చు ఇరువది యొకటవ ద్వాపరమున వాచస్పతి అను ఋషి సత్తముడు వ్యాసుడు అగును. అపుడు కూడ నేను దారుకుడను పేర ఉందును. అందు నుండియే గొప్ప నైపుణ్యమైన దేవదారు వనము ఏర్పడగలదు. అటగూడ నాకు నా మహౌజస్కులైన పుత్రులు గలుగగలరు. వారు ప్లక్షుడు, దాక్షాయణి, కేతుమాలి,బకుడు అనువారు. యోగాత్ములు మహాత్ములు నియతులు, ఊర్ధ్వ రేతస్కులు అట్లే అనఘులు (పాపరహితులు) అయిన, వారు పరమయోగమున నుండి రుద్రుని బొందుదురు.

పర్యాయక్రమమున తిరిగివచ్చు ఇరువది రెండవ ద్వాపరమున శుక్లాయనుడనువాడు వ్యాసుడు అగును. అప్పుడుగూడ నేను మహామునినై నాగలి ధరించిన (లాంగలియైన) భీముడను పేర ఉండగలను. అచట ఇంద్రునితో కూడిన దేవతలు కలిలో అవతరించిన హలాయుధుని (భీమునిగా) జూడగలరు. అచటగూడ నాకు సుధార్మికులైన యా పుత్రులు గలుగగలరు. వారుతుల్యార్చి మధువు పింగాక్షుడు, శ్వేతకేతువు అనువారు. వారు గూడ మహేశ్వర యోగమును అవలంబించి ధ్యానపరాయణులై రజోగుణము లేనివారై బ్రహ్మ మయులై రుద్రలోకమునకు వెళ్ళెదరు.

పర్యాయ క్రమమున తిరిగి వచ్చు ఇరువది మూడవ ద్వాపరమున తృణబిందువను ముని వ్యాసుడు అగును. ఆ వ్యాసుడు బ్రహ్మ అపుడు, నేను శ్వేతుడను పేర మహాకాయుడనై, మునిపుత్రుడనై, సుధార్మికుడనై, యుండగలను. అట్టి నేను పర్వత శ్రేష్ఠములలో గూడ ఉత్తమమైన పర్వతమున (హిమాలయమున) కాలమును గడుపగలను. ఆ కారణమున నా పర్వతము కాలంజరమను పర్వతముకా గలదు. అచటగూడ నాకు ఆ మహౌజస్కులైన పుత్రులు గలుగగలరు. వారు ఉషిజుడు, బృహదుక్థుడు, దేవలుడు, కవి అనువారు. వారు మాహేశ్వరయోగమును పొంది రుద్రలోకమును పొందుదురు.

పర్యాయక్రమమున తిరిగివచ్చు ఇరువది నాలుగవ ద్వాపరమున ఋక్షుడను వాడు వ్యాసుడు కాగలడు. ఓ బ్రహ్మ! అచట కలియుగ సమీపమున యోగివందిత మయిన నైమిషమున (నైమిషారణ్యమున), శూలయను పేర మహాయోగినై యుందును. అచటగూడ నాకు తపస్వినులైన యాపుత్రులు కలుగగలరు. వారు శాలిహోత్రుడు, అగ్నివేశ్యుడు, యువనాశ్వుడు, శరద్వసువు అనువారు. వారుగూడ యోగ బలముతో కూడిన వారై సువ్రతులై రుద్రుని చేరుదురు. పర్యాయక్రమమున తిరిగివచ్చు ఇరువది అయిదవ ద్వాపరమున వసిష్ఠుడను వ్యాసుడు శక్తియను పేర నుండగలడు. అపుడు కూడ నేను దండినై (దండధారినై) ముండినై (శిరో ముండనము జేసికొన్నవాడనై), శరుడనై, ప్రభువునై, దేవతలచే పూజింపబడిన కోటి వర్షమను నగరమును బొంది ఉండగలను. అచటగూడ నాకు ఆ క్రమాగతులైన పుత్రులు కలుగగలరు. యోగాత్ములు, మమాత్ములునైన వారందరు ఊర్ధ్వరేతస్కులు. వారు ఛగలుడు, కుంభకర్ణాశ్యుడు (కుంభకర్ణాస్యుడు) కుంభుడు, ప్రబాహుకుడు అనువారు. వారు మాహేశ్వర యోగమును బొంది పూర్వము వారివలెనే రుద్ర లోకమును జేరుదురు.

పర్యాయక్రమమున తిరిగివచ్చు ఇరువదియారవ ద్వాపరమున పరాశరుడను వాడు వ్యాసుడగును. అపుడుగూడ నా కలియుగ సమీపమున రుద్ర వనమును బొంది నేను

సహిష్ణువను పేర నుండగలను. అచటగూడ నాకు సుధార్మికులైన ఆ పుత్రులు గలుగగలరు. వారు ఉలూకుడు, వైద్యుతుడు, సర్వకుడు, ఆశ్వలాయనుడు అనువారు. వారు గూడ మాహేశ్వర యోగమునుపొంది పూర్వము వారివలెనే రుద్రుని జేరగలరు.

పర్యాయక్రమమున తిరిగి వచ్చు ఇరువది యేడవ ద్వాపరమున జాతూకర్ణ్యుడను తపోధనుడు వ్యాసుడగును. అపుడుగూడ నేను సోమశర్మ యను పేర బ్రాహ్మణోత్తముడనై ప్రభాసతీర్థమును జేరి యోగాత్ముడనై లోకప్రసిద్ధుడను కాగలను. అచట గూడ నాకు ఆ తపోధనులైన పుత్రులు కలుగగలరు. వారు అక్షపాదుడు, కణాదుడు, ఉలూకుడు, వత్సుడు, అనువారు, వారు యోగాత్ములు, మహాత్ములు, నిర్మలులు శుద్ధమైన బుద్ధులు గలవారు. వారు గూడ మహేశ్వరయోగమును బొంది రుద్రలోకమును జేరుదురు.

పర్యాయక్రమమున తిరిగివచ్చు ఇరువది ఎనిమిదవ ద్వాపరమున, పరాశరుని కుమారుడు శ్రీమంతుడైన విష్ణువు లోకపితామహుడు (లోకబ్రహ్మయై ద్వైపాయనుడను పేర వ్యాసుడై ప్రభువగును. అపుడు నా ఆరదవ అంశమున కృష్ణుడైన పురుషసత్తముడు (పురుషోత్తము డగు విష్ణువు), వసుదేవుని నుండి యదుశ్రేష్ఠుడై వాసుదేవుడు అవతరింప గలడు. అపుడు గూడ నేను యోగాత్ముడనై యోగమాయచేత లోకమును ఆశ్చర్యపరచుటకై బ్రహ్మచారి శరీరముగలవాడను అగుదును. శ్మశానమున చనిపోయి వదలిపెట్టబడిన యనాథయైన లోకమును చూచి బ్రాహ్మణుల హితముకొరకై విష్ణువుతోను నీతోను సహితముగా యోగమాయచే పుణ్యమై దివ్యమై (దేవ సంబంధమైన) మేరుపర్వతము యొక్క గుహను బ్రవేశింతును. అపుడు ఓ బ్రహ్మ! నకులీయను పేర ఉండగలను. అపుడు భూమి యున్నంతవఱకు ఇది కాయా రోహణమను సిద్ధి క్షేత్రము కాగలదు. అచట గూడ నాకు ఆ తపస్వినులు పుత్రులుకాగలరు. వారు కుశికుడు, గార్గ్యుడు, మిత్రకుడు, రుష్టుడు అను వారు. యోగయుక్తులై మహాత్ములై వేదపారగులైన బ్రాహ్మణులై వారు మాహేశ్వర యోగ మునుపొంది విమలులై యూర్ధ్వరేతస్కులునై పునః పునః జన్మలతో లభింప నలవిగాని రుద్రలోకమును జేరగలరు. అని ఈ విధముగా మనువు మొదలుకొని కృష్ణుని వరకు ఇరువది యెనిమిది యుగములు వరుసగా నాచేత అవతారములలోని లక్షణము జెప్పబడినది. (23)

శార్వస్తవం

వాయువు పలికెను :

భారత వర్షమున మునులు నాలుగు యుగములని తెలిపిరి. అవి కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము తిష్య యుగము – అని నాలుగు యుగములు. వీని

వేయి వరకు బ్రహ్మకు పగలు అగును. యామాదులైన గణములు ఏడు, రోమవంతములు పదునాలుగు. తోడుగా వచ్చునవై సశరీరములై జనోలోకమును ఆశ్రయించుచున్నవి. ఈ విధముగ దేవతలు మహర్లోకమునుండి జనోలోకమును తపోలోకమును దాటగా మన్వంతరములు గడచిపోయినవి. మహౌజస్కులైన దేవతలందరు ఊర్ధ్వలోకమును జేరిరి. ఆ కల్పమునందు ఉన్న వారితో సహయోగమును బొందిరి. అపుడా దేవతలు సంకలన మును (కలయికను) బొందగా ఆ పదునాలుగు గణములు మహర్లోకములను వదలిరి. అపుడు భూతాదులు మిగిలిన స్థావరాన్తములు, భువర్లోకము మొదలుకొని మహర్లోకము వరకున్న లోకములు శూన్యములైనవి. కల్పవాసులైన దేవతలు ఊర్ధ్వ లోకమున జనమును జేరిరి. దాహముతో గూడిన వర్షముచేత యుగము క్షయము కాగా పైవారి సమూహముతో బ్రహ్మను బ్రహ్మర్షిగణములను, దానవుల నందరిని సంస్థాపించును.

నేను ఇదివరకు గడచిపోయినట్లుగా చెప్పిన యేడవ కల్పము ఏడు సముద్రములు గాఢముగాకలిసి యొక్కటైన మహా సముద్రముచే భయంకరమై చీకటి నిండి విభజింప రాని యేకార్ణవము అయ్యెను. (అంతయు ఒకే సముద్రమయ్యెను) మాయతో ఆ విధముగా ఏక సముద్రము దానియందు శంఖము చక్రము గదను ధరించినవాడు, మేఘమువలె నల్లనైనవాడు, కమల నేత్రుండును, కిరీటము, శ్రీపతియు అయిన హరి, నారాయణ ముఖము నుండి వెలువడిన ఎనిమిదవ పురుషోత్తముడై యుండెను. అతడు ఎనిమిది బాహువులు గలవాడు. విశాల వక్షస్థలము గలవాడు. అతడు లోకములకు అంతటికిని కారణభూతుడని చెప్పబడుచున్నాడు. అతడు యోగముతో గూడిన యాత్మ గలవాడు చింతింప అలవిగాని యనిర్వచనీయమైన యోగమునందున్నవాడు. యోగమును తెలిసినవాడు. అతడు ఆది శేషుని విశాలమైన వేయి పడగల నానుకొని బంగారు పాన్పుపై పడుకొనుచున్నాడు. ఆ ఆదిశేషుడు సమస్త మహాఫణములు గల సర్పములకు అధిపతి. సాటిలేని తేజస్సు గలవాడు.

ఈ విధముగా నచట పడుకొనుచున్న సర్వసమర్థుడైన ప్రభువై ఆత్మారాముడైన (తనలో తానే యానందించువాడైన విష్ణువుచేత విలాసమునకై నాభి యందు కమలము సృష్టింపబడినది. ఆ కమలము నూరు యోజనముల వెడల్పయినది. ఉదయించిన సూర్యుని కాంతి గలది. వజ్రము దండము (నాళముగా) గలది. మహోన్నత మయినది. ఇట్టి కమలము ప్రభువైన విష్ణువుచే లీలగా సృష్టింపబడినది.

ఈ విధముగా నాడుచున్న యాదేవ మీఢుషుని యొక్క సమీపమునకు బంగారు బ్రహ్మాండము వలన పుట్టిన బ్రహ్మ స్వేచ్ఛగా వచ్చెను. ఆ బ్రహ్మ బంగారువర్ణము కలవాడు.

ఇంద్రియములకు మించిన (ప్రత్యక్షముకాని) వాడు. నాలుగు ముఖములు కలవాడు. అట్టి బ్రహ్మ మంచిగంధము కాంతిగల క్రొత్త శోభతో గూడిన పద్మముతో నాడుకొను చున్న యా విష్ణువును జూచి ఆశ్చర్యమును బొందెను.

తరువాత నాబ్రహ్మ తన సంపూర్ణవాక్కుతో మీరెవరు ? సముద్రము జలమధ్యము నాశ్రయించి పడుకొనుచున్నారు. అని తరువాత బ్రహ్మయొక్క యా శుభవాక్కును విని అచ్యుతుడు ఆశ్చర్యముతో విప్పారిన కన్నులు గలవాడై పాన్పునుండి లేచి కూర్చుండెను. ప్రత్యుత్తరముగా దివి, అంతరిక్షము, భూతము పరమపదము కూడ ప్రభువైన నేనే అని

ఈ విధముగా భగవంతుడు పలికి మరల నిట్లనెను. ఓ భగవాన్! నీవెవడవు? నా సమీపమునకు ఎందులకు వచ్చితివి? ఇటునుండి యెక్కడికి బోవలసి ఉన్నది? నీ నివాసము ఎక్కడ? విశ్వమూర్తిగా ఉన్న నీవు ఎవ్వడవు? నాతో నీకు పనియేమి? అని ఈ విధముగ బలుకుచున్న వైకుంఠుడైన విష్ణువుతో బ్రహ్మ ప్రతివచనము ఈ విధముగ బలికెను. వారు ఆదికర్త యైనట్లే నేనుగూడ యాదికర్తయైన ప్రజాపతిని (బ్రహ్మ) సర్వము నాయందున్నవి. అని నారాయణునితో చెప్పెను.

విష్ణువు ఆశ్చర్యకరమైన బ్రహ్మమాట విని లోకవర్తనమయిన బ్రహ్మచే అనుమతింప బడినవాడై విశ్వకారణుడైన వైకుంఠుడైన విష్ణువు కుతూహలముతో మహాయోగియై యోగశక్తి గలవాడై బ్రహ్మయొక్క ముఖము నందు ప్రవేశించెను. ఆ విధముగా బ్రవేశించిన మహాతేజస్వియైన విష్ణువు సముద్రముతోను పర్వతములతోను గూడిన ఈ ఎనిమిది ద్వీపములను నాలుగు వర్ణములతో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర వర్ణములతో సమాకుల మైన బ్రహ్మ మొదలుకొని వరి గంట (యొక్క మధ్య భాగము) వరకు గల సనాతనములైన యేడు లోకములను, వీనినన్నింటిని బ్రహ్మ యొక్క కడుపులో జూచెను. తరువాత మహా యశస్కుడైన విష్ణువు. 'ఆశ్చర్యమీతని తపస్సు యొక్క ప్రభావము' అని తనలో మాటిమాటికి బలికెను. ఆ విధముగా విష్ణువు వివిధములైన లోకములను అనేక విధములైన యాశ్రమము లను తిరుగుచుండెను. వేయి యేండ్లైనను విష్ణువు అపుడు దానికి అంతమును జూడలేదు.

అపుడు గరుడధ్వజుడైన విష్ణువు బ్రహ్మదేవుని ముఖమునుండి వెలువడెను. తరువాత శత్రువులే పుట్టని భగవంతుడైన విష్ణువు, భగవాన్, పుణ్యాత్ముడవైన నీ యొక్క కడుపుయొక్క మధ్యమును, చివరను, కాల దిక్కుల యొక్క అన్తములను నేను చూడలేదు. అని ఇట్లు పలికి బ్రహ్మతో "ఓ బ్రహ్మా ! ఇపుడు నీవు గూడ శాశ్వతమైన నా ఉదరము (కడుపు)ను బ్రవే శించి సాటిలేని ఈ లోకములను చూడుము" అని అనెను. తరువాత బ్రహ్మ ఆ విష్ణువు

యొక్క మనోహరమైన వాక్కునువిని యభినందించి లక్ష్మీపతియైన విష్ణువుయొక్క యుదర మును ప్రవేశించెను. గర్భములో ప్రవేశించి ఉండిన యా చింతింప నలవిగాని పరా క్రమముగల బ్రహ్మయాలోకములనే చూచెను. అచట తిరిగి తిరిగి ఆదిదేవుడైన విష్ణువు యొక్క గర్భములో అంతమును చూడలేదు.

సర్వాన్తర్యామియైన విష్ణువు ఆ బ్రహ్మ వెలుపలికి రానున్నాడని తెలిసి అన్ని ద్వారములు మూసి వెంటనే మహాజలసమూహమున సుఖముగా నిద్రింపదలచెను. అంత సమస్త ద్వారములు మూయబడినట్లు కనబడినవి. అంత బ్రహ్మ తన రూపమును సూక్ష్మముగాజేసి (విష్ణువు యొక్క) నాభియందు ద్వారమును తెలిసికొనెను. పద్మ సూత్రమును (తామరతూటి దారమును) అనుసరించిన మార్గములను అనుసరించి వెళ్ళి ఆ బ్రహ్మ నాలుగు ముఖముల ఆతామర దుంపనుండి తన రూపమును పైకిలాగి ప్రకాశింపజేసెను. అపుడు పద్మ గర్భముతో సమానమైన కాంతి గలవాడై, కమలమున ఉన్న బ్రహ్మ ప్రకాశించెను. ఇంతలో (ఈ మధ్యలో) ఆ సముద్ర మధ్యమున వారు ఇరువురికి మొత్తముమీద పరస్పరము చాలా సంతోషము కలుగుచుండెను.

సూతుడు అనెను :

తరువాత ఆదిశేషుని పడగలపైని ప్రభువై (పరుండి)న విష్ణువు ఉన్న ఆచోటికి ఇంతింతయని చెప్పనలవిగాని స్వరూపము గలవాడు, భూతములకు ప్రభువు, ఈశ్వరుడు, శూలము చేత ధరించినవాడు, బంగారు వస్త్రములు ధరించి కప్పుకొన్నవాడును ఐన మహాదేవుడు (శివుడు) వచ్చెను. వేగముగా నడచుచున్న యా శివుని పాదములచే మిక్కిలి పీడింపబడి వెంటనే యాకాశమును ఎత్తుగా లేవగొట్టబడిన లావైన (సముద్ర)జల బిందువులు (కాలివేగపు తాకిడిచే) అత్యుష్ణములై (గాలిచే) అతి శీతలములును ఐనవి. అచట వాయువు మిక్కిలి ఎక్కువగా వీచెను.

ఆ మహాశ్చర్యమును చూచి బ్రహ్మ విష్ణువుతో నీటి బిందువులులావై వేడియైనవి. (వానివలన) కమలము మిక్కిలి కంపించుచున్నది. ఈ నా సంశయమును గూర్చి నీవేమి చేయదలచితివి చెప్పుము అని అడిగెను.

బ్రహ్మ ముఖము నుండి వెలువడిన ఈ విధమయిన మాటలను విని సాటిలేని క్రియాకారియైన రాక్షససంహారకారియై భగవంతుడైన విష్ణువు 'ఇది ఏమిటి? ఇచట నా నాభియందు వేరొక భూతము (ప్రాణి) నివాసము ఏర్పరచికొనినది? నీకు నాచే అనిష్టము చేయబడినప్పటికిని, అది అత్యంతప్రియము(ఇష్టమైనది)గా చెప్పుచున్నారు అని మనస్సులో

అనుకొని ఉత్తమముగా ఈ మాటను పలికెను. ఓ భగవన్ నీవిచట ఆ కమలమునందు ఎందులకు ఆశ్చర్యము జెందితివి. నేను నీకు ఏమి చేసితినని నీవు నాతో మిక్కిలి ప్రేమతో మాటలాడుచున్నావు? ఓ పురుషశ్రేష్ఠ! ఇట్లు ఏల జరిగినది ? నిజము జెప్పుము. ఈ విధముగా జెప్పుచున్న దేవేశుడైన విష్ణువును గూర్చి కమలకాంతిగలవాడు వేదనిధి, ప్రభువు అయిన బ్రహ్మ నిజముగా జరుగు లోకయాత్రను (లోకము నడకను) బదులుగా బలికెను. నీ కోరికతో నేను పూర్వము నీ కడుపులో బ్రవేశించితిని. నీచేత నా కడుపులో సర్వ లోకములు చూడబడినట్లే నాచేతగూడ నీ కడుపులో సమస్త లోకములు జూడబడినవి. వేయి యేండ్ల తరువాత మరలిన నాకు ఓ పుణ్యుడా! నన్ను వశముజేసికొనగోరి నీవు మాత్సర్యముతో వెలుపలికి వచ్చు ద్వారములన్నియు మూసివేసితివి. తరువాత ఓ మహా భాగా! నేను నా మనస్సుతో చింతించగా (యోగధారణ చేయగా) నాభిలో నాకు ప్రవేశము లభించినది. కమలనాళపు దారము నుండి వెలువలికి వచ్చుట జరిగినది. (అది విష్ణువు) ఓ భగవన్ బ్రహ్మా! నీ మనస్సునకిట్టి వ్యాఘాతము (దెబ్బ) ఏ విధముగ అయినను కొద్ది మాత్రముగూడ కలుగకుండుగాక తన పనులు వికటించినపుడు వానిని అనుకూలము చేయుటకు అనుసరించు రీతి నేను ఏపనిని చేయవలసి ఉన్నదో ! ఏపనిని నీయందు నిశ్చితమయి ఉన్నదో! నిన్ను బాధింపకుండుటనుకోరి, ఆ పనిని నా ఇష్టముతోనే, ఒక మాటగా (విలాసముగా) వేగముగా నీవు వెలుపలికి వచ్చుటకు తగియున్న ద్వారములను మూసివేసితిని. కావున నీవు వేరుగా అవమానింప బడినవానిగా దలంపలదు. నీవు నాకు గౌరవింపదగినవాడవు. పూజింప దగినవాడవు. ఓ కల్యాణుడా! నేను నీకు జేసిన అప కారమును అంతయు క్షమింపుము. కావున ఓ ప్రభో! నేనే జెప్పినట్లు పద్మమునుండి క్రిందికి దిగుము. తేజోమయుడవై గురువైన (బరువైన) నిన్ను సహింపలేను. (అని విష్ణువనెను). ఆ బ్రహ్మగూడ వరమును జెప్పుము (ఇమ్ము) నేను పద్మము నుండి దిగెదను అని పలికెను.

విష్ణువు పలికెను :

ఓ శత్రునాశకుడా! నాకు పుత్రుడవు కమ్ము. శోభనమైన ముదమును (సంతస మును) బొందగలవు. నీవు సత్యధనుడవు, మహాయోగివి. (అందరిచే) స్తుతింపదగిన వాడవు. ప్రణవ స్వరూపుడవు. ఇవ్వేళటి నుండి ఓ సర్వేశ! తెల్లని తలపాగా అలంకారముగా కలవాడవు. పేరుతో పద్మయోనివై ప్రసిద్ధుడవుగా గలవు. ఓ బ్రహ్మన్! సర్వలోకాధిపుడవైన ఓ ప్రభో! నాకు పుత్రుడవు కమ్ము అని అటు తరువాత ఆ భగవంతుడైన బ్రహ్మ కిరీటి (విష్ణువు) నుండి వరమును దీసికొని, సంతసించిన యాత్మగలవాడై, యసూయలేని వాడై అట్లే అగుగాక ఈని ఈనెను. ఇంతలో సమీపమునకు వచ్చినదియు బాలసూర్యుని కాంతి గలదియు, అత్యద్భుతమైనదియు నైన భూతమును జూచి బ్రహ్మ నారాయణునితో అనెను.

పరిమితిలేనివాడు పెద్ద ముఖము గలవాడు, కోరలు గలవాడు, విరిసిన తల వెంట్రుకలు కలవాడు, పది బాహువులు కలవాడు, త్రిశూలము (గుర్తుగా) ధరించినవాడు, మూడుకన్నులతో అన్నివైపుల ముఖములుగలవాడు. లోకమునకు ప్రభువు. సాక్షాత్తుగా వికారమయిన యాకారము గలవాడు, ముంజగడ్డితో జేసిన మొలనూలు గలవాడు, పైకి లేచిన పెద్ద పురుషాంగముచేత భయంకరముగ ధ్వని చేయుచున్నవాడు. అయిన ఈపురుషుడు ఎవడు? ఓ విష్ణో! ఈతడు తేజోరాశియై మహాకాంతి గలిగి, అన్ని దిక్కులను ఆకాశమును వ్యాపించి ఇటువైపే వచ్చుచున్నాడు. అని బ్రహ్మ విష్ణువుతో అనెను.

బ్రహ్మతో ఇట్లు చెప్పబడిన భగవంతుడైన విష్ణువు బ్రహ్మతో ఇట్లనెను. ఆతడు అనాదియై ప్రళయమును కల్గించు భగవంతుడైన ఈశ్వరుడు సముద్రమున నడచుచున్న యాతని కాలి అడుగుల తాకిడికి జలాశయములు వేగముతో ఎగిరి పీడింపబడినవి. ఆ నీటి గుంపులచే విష్ణువుకంటె పద్మసంభవుడైన బ్రహ్మ ఎక్కువగా తడిసిపోవుచున్నాడు. ముక్కునుండి వచ్చిన గాలిచే నీతో (బ్రహ్మతో) సహా స్వేచ్ఛగా నా నాభియందు బుట్టిన కమలము కదులుచు ఊగుచున్నది. కావున భగవంతుడైన వృషభధ్వజుని (శివుని) నీవును నేనును స్తోత్రముచే ఉపాసించెదము.

అటు తరువాత కమలకాంతిగల బ్రహ్మ కోపించినవాడై విష్ణువుతో నిట్లనెను. నీవు (నాకన్న) తక్కువైన నిన్ను లోకములకు ఉత్తమమైన యోనిగా కారణముగా) తెలియవు. అట్లే నన్ను లోకకర్తయై సనాతనుడైన బ్రహ్మనుగా గూడ దెలియవు. ఓయి! ఈ శంకరుడును వాడెవడు? మన ఇరువురునకు వ్యతిరేకముగ ఉన్నాడు (అనియెను). విష్ణువా బ్రహ్మయొక్క కోపమువల్ల గలిగిన మాటనువిని ఓ కల్యాణుడా! మహాత్ముడైన శంకరుని యొక్కయు ఏ వాదమును ఇట్లనకుము. కారణమేమనగా ఈతడు మాయాయోగేశ్వరుడు. ధర్ముడు తిరస్కరింప అలవిగానివాడు, వరములను ఇచ్చువాడు ఈ జగమునకు కారణుడు. పురాణమైన పురుషుడు నాశములేనివాడు. జీవులకీతుడు జీవుడు ఒకే జ్యోతి రూపుడై ప్రకాశించును. దేవుడైన శఙ్కరుడు బాలురను ఆట బొమ్మలచేత స్వయముగా ఆడుకొనుచుండును. ఈతడు నాశనములేని ప్రధానము. వ్యక్తముగాని జ్యోతి. తమోరూపమైన ప్రకృతి నిత్యము సృజించుటయే ధర్మముగల ఈతని నామములవి. దుఃఖపీడితులైన యతులచేత శివుడు యః (ఎవడు?) కః (ఎవడు) సః (వాడు) అని పిలువబడును. ఈ శివుడు బీజవంతుడు. బ్రహ్మవైన నీవు బీజము (బీజమవు) నేను సనాతనమైన యోనిని. (బీజము నిక్షేపించు స్థానమును) అని ఈ విధముగా జెప్పబడిన విశ్వాత్ముడైన బ్రహ్మ విష్ణువుతో నీ విధముగ మాటాడెను.

నీవు (విష్ణువు) యోనివి. నేను (బ్రహ్మను) బీజమును మహేశ్వరుడు బీజి (బీజము గలవాడు) ఎట్లు? ఈ సూక్ష్మమై యవ్యక్తమైన సంశయమును దీర్చగోరుచున్నాను (అని బ్రహ్మ విష్ణువును అడిగెను). లోకతంత్రము గలవాడైన బ్రహ్మచే జరుగు ఉత్పత్తిని తెలిసి విష్ణువు బ్రహ్మయొక్క సాటిలేని పై ప్రశ్నకు సమాధానముగా జెప్పెను. ఓ బ్రహ్మన్! ఈ శివుని కంటె మించిన మరొక భూతములేదు. అది మహత్తునకు పరమమైన ధామము (స్థానము) శివము, ఆధ్యాత్మకులకు అవ్యక్తుడు, సకలుడు (సమస్త స్వరూపుడు) అయిన మహేశ్వరుడు. మాయావిధిని దెలిసి ఇతరులకు చేరనలవిగాని గంభీరుడైన ఈ మహేశ్వరుని యొక్క లింగము పూర్వము నీవు ((బ్రహ్మవు)బీజముగాగలది ఆదిసృష్టిగలది. ఆది యోనియైన నాయందు (విష్ణువునందు) చక్కగా సంపూర్ణముగా కలిసినది. (బీజ నిక్షేప చేయబడినది) కాలక్రమమున ఆ బీజము అంతులేని బంగారు (తేజో) మయమై ఆ విష్ణుయోనిలో అండముగా ప్రకాశించెను. వేయియేండ్లు ఆ అండము నీటియందు నిలుప బడినది. వేయేండ్లు చివర వాయువుచే ఆ అండము రెండుగా జేయబడినది. దాని ఒక్క కపాలము (చిప్ప) ఆకాశమయ్యెను. మరొక కపాలము (చిప్ప) భూమి యయ్యెను. దాని యొక్క ఎత్తైన ఉల్బముయొక్క భాగము ఈ బంగారు (మేరు) పర్వతము. తరువాత దాని నుండి మేలుకొన్న ఆత్మగల దేవుడు, దేవవరుడు, ప్రభువు, భగవంతుడైన హిరణ్యగర్భుడు ((బ్రహ్మవైన నీవు) నాలుగు భుజములు గల నేను (విష్ణువును) అయితిమి.

తరువాత వేయి యేండ్ల చివర వాయువుచేత ఆ అండము రెండుగా చేయ బడినది. అపుడు తారలు చంద్రుడు నక్షత్రములులేని లోకమును జూచి ఇక్కడ వీడెవడు ఉండవలెనని (శివుడు) ధ్యానింపగా ప్రియదర్శనులు (సుందరులు)మంచి శరీరము గలవారు. నీకంటె ((బ్రహ్మకంటె) పూర్వమున బుట్టినవారు అయి గడచినవారునైన (యా) కుమారులు బుట్టిరి. మరల వేయేండ్ల చివర ఆ అండము నుండియే నీ యాత్మజులు (పుత్రులు), నీటి వలెను అగ్నివలెను శుద్ధులు, కమలపు రేకులవంటి కన్నులు గలవారును అయిన ఊర్ధ్వరేతస్కులైన శ్రీమంతుడు సనత్కుమారుడు, ఋభువును, సనాతనుడు, సనకుడును సనందనుడు బుట్టిరి. వారు సమకాలముననే బుద్ధిచేత ఇంద్రియములచే ప్రత్యక్షముగాని వానిని (పరమాత్మను) జూచువారైరి. అట్లు పుట్టినవారు ప్రతిఘాత్ములై యప్పుడే మాట్లాడిరి. ఆధిభౌతిక ఆధిదైవిక ఆధ్యాత్మికములు అను తాపత్రయములను వదిలినవారై కర్మలను ప్రారంభింపరైరి.

ఈతని (శంకరుని) శాంతమైన జీవన మరణ పునర్జన్మలు బహుకష్టములు గలవై జరా (ముసలితనము) దుఃఖములతో గూడినవి. పునఃసృష్టిలోనివి స్వప్న(ప్రాయ)ము లైనవి. అట్లే దుఃఖములును నరకములును (స్వప్న ప్రాయములైనవి) ఇది అంతయు

రాబోవునది. తప్పనిసరిగా జరుగబోవునది అని సనకాదులు తెలిసికొనిరి. వారు ఋభువు సనత్కుమారుడును నీ (బ్రహ్మ)వశమున నుండినట్లు చూచిరి. ఆనీ కుమారులైన సనకాదులు ముప్వురు త్రిగుణములను (సత్వరజస్తమో గుణములను) వదిలి వైవర్త జ్ఞానముతో (ఆత్మవైపు తిరిగి జ్ఞానముతో మహాతేజోవంతులై నివృత్తులైరి (తొలగిరి). తరువాత ఆ ముప్వురు సనకాదులు తొలగిపోగా శంకరుని మాయచే నీవు (బ్రహ్మవు) విమూఢుడవు (ఏమి తెలియని వాడువు) అగదువు.

ఈ విధముగా కల్పము వికల్పముకాగా ఓ పాపరహితుడా! నీ పేరు నశించును. సూక్ష్మములు పార్థివము (భూ సంబంధమైన) లైన కల్పశేషములు గతించినవి. జగమునకు సంబంధించినట్టి ఐశ్వరీ (ఈశ్వరసంబంధమైన) మాయ తెలుపబడినది. ఈ కనబడు ఆ పర్వతమే దేవలోకమున మేరువని పిలువబడును. నీ ఈ మహాత్మ్యమును జూచి, తనతో తనను తెలిసికొని ఈశ్వరుని యునికిని దెలిసికొని, కమల నేత్రుడినైన (విష్ణువు) నన్ను తెలిసికొని, మహాయోగి, భూతములకు (ప్రాణులకు)వరము నిచ్చువాడు. ప్రభువు, ప్రణవ (ఓంకార) స్వరూపుడు అయిన మహాదేవునిజేరి, జగద్గురువైన యాతనికి నమస్కరించి కోపించి నచో నీతడు(మహాదేవుడు) ఒక్క నిట్టూర్పుతోనే నిన్ను(బ్రహ్మను), నన్ను(విష్ణువు) దహించును అని తెలిసికొని మహాయోగమున యెత్తుగా నిలుచును. మహాబలుడవై నేను (విష్ణువును) నిన్ను (బ్రహ్మను) ముందిడుకొని అగ్ని తేజస్కుడైన శంకరుని స్తుతింతును.

సూతుడు ఇట్లు పలికెను :

తరువాత ఆ గరుడుడుధ్వజముగాగల విష్ణువు బ్రహ్మను ముందు ఇడుకొని, గడచినవి, రానున్నవి ప్రస్తుతము ఉన్నవియు నైన ఛాందసములగు వైదికములు ఛందోబంధములు నామములతో స్తోత్రమున స్తుతించెను.

భగవంతుడవైన నీకు నమస్కారము సువ్రతుడవైన నీకు నమస్కారము. అనన్త తేజస్కుడవైన నీకు నమస్కారము. క్షేత్రాధిపతి (ధీరాధిపతి)వైన నీకు నమస్కారము. బీజ వంతునకు శూలికి నీకు నమస్కారము. సాటిలేని మేఢ్రము (పురుషాంగము) గలవానికి, మహోన్నతమైన పురుషాంగముగలవానికి, వైకుంఠము రేతస్సుగా గలవానికి నీకు నమ స్కారము. జ్యేష్ఠునకు శ్రేష్ఠునకు మొదలులేని మొదటిదానికి నమస్కారము. హవ్య (హోమము చేయదగిన) రూపమమైన వానికి, పూజ్యునకు సద్యోజాతునకు నీకు నమస్కారము. గుహా రూపునకు కుబేర రూపునకు బంగారు వస్త్రములను ధరించిన వానికి నీకు నమస్కారము. మాబోటి ప్రాణులను బుట్టించువానికి, వేదములు చెప్పిన పరిశుద్ధ కర్మలకును ద్రవ్యము

లకును పుట్టు స్థానమైన వానికి నీకు నమస్కారము. యోగప్రభువునకు సాంఖ్యప్రభువునకు నీకు నమస్కారము. ధ్రువ నీశీధులకు ఋషులకు పతియైన వానికి నీకునమస్కారము. మెరుపులు పిడుగులు మేఘములు గర్జములు వీనికి ప్రభువైన వానికి నీకు నమస్కారము. సముద్ర ప్రభువునకు ద్వీపముల ప్రభువునకు నీకు నమస్కారము. పర్వత ప్రభువు అయిన నీకు వర్ష ప్రభువునకు నీకునమస్కారము. ధర్మాధ్యక్షునకు ధర్మ స్వరూపునకు నీకు స్థితుల ప్రభువునకు నీకో నమస్కారము. రసముల ప్రభువుకు రత్నముల ప్రభువునకు నీకు నమస్కారము క్షణముల ప్రభువునకు క్షణము (కనురెప్పపాటు కాలము) నీకు నమస్కారము. కనురెప్పలపాటు కాలమైన నిమేషమునకు ప్రభువైన వానికి కాష్ఠలకు ప్రభువైన వానికి (కాష్ఠ=18 కనురెప్పపాటు)నీకు నమస్కారము. రాత్రింబగళ్ళకు సగము నెలలకు నెలల కును ప్రభువైన నీకు నమస్కారము. ఋతువుల ప్రభువునకు సంఖ్యయొక్క ప్రభువునకు నమస్కారము. బ్రహ్మ ఆయువులో సగము పరార్థము. అట్టి పరార్థ కాలమునకు ప్రభువైన నీకు నమస్కారము. బ్రహ్మ యాయువుపరము. అట్టి పరమునకు ప్రభువైన నీకు నమ స్కారము. ప్రాచీనముల ప్రభువునకు, యుగముల ప్రభువునకు నీకు నమస్కారము నాలుగు విధములై సృష్టికి ప్రభువైన నీకునమస్కారము. అనన్తములైన నేత్రములుగల నీకు నమస్కారము. కల్ప ప్రారంభమున నేర్పరచిన వృత్తులకు ప్రభువైన నీకు నమస్కారము. విశ్వ ప్రభువునకు నీకు నమస్కారము. కల్ప ప్రారంభమున నేర్పరచిన వృత్తులకు ప్రభువైన నీకు నమస్కారము. విశ్వ ప్రభువునకు నీకు నమస్కారము. విద్య ప్రభువునకు నీకు నమస్కారము. పితృదేవతల పతికి, పశుపతికి నీకు నమస్కారము. వాక్ శ్రేష్ఠ రూపునకు నీకు నమస్కారము. పురాతనమైన బీజములు వర్షించువానికి నీకు నమస్కారము (సర్వ బీజములను వర్షించు పురాణ వృషభ స్వరూపుడని భావము) మిక్కిలి సుందరమైన వెంట్రుకలు గలవానికి ఊర్ధ్వముగా నేత్రములు శిరమును గలవానికి నీకునమస్కారము. పశువులపతికి గోవు వృషభ శ్రేష్ఠము ధ్వజముగా గలవానికి నీకు నమస్కారము. ప్రజాపతుల బ్రహ్మలకు పతికి, సిద్ధుల పతికి నీకు నమస్కారము. గరుడులకు ఉరగములకు సర్పములకు పక్షులకును పతియైన నీకు నమస్కారము. గోకర్ణ స్వరూపునకు, గోవునందు ఉందు వానికి శంకుకర్ణునకు నీకు నమస్కారము. వరాహావతార రూపునకు జ్ఞానాతీతునకు రక్ష స్సుల అధిపతికి నీకు నమస్కారము. అప్సరసల పతికి గణముల పతికి జలములకు తేజస్సులకు పతికి నీకు నమస్కారము. లక్ష్మీపతికి శ్రీమంతునకు హ్రీమంతునకు నీకు నమస్కారము. బలాబల స్వరూపునకు అక్షోభ్యుల క్షోభింప జేయువానికి నీకు నమస్కారము. పొడవైన ఒకే కొమ్ముగలిగి మంచి ఎత్తైన మూపురముగల వృషభ స్వరూపుడవైన నీకు

నమస్కారము. స్థైర్యముగలిగి తేజోవంతమైన మంచికాంతిగల శరీరముగల నీకు నమస్కారము. భూతభవిష్య ద్వర్తమాన స్వరూపునకు నీకు నమస్కారము. మంచి వర్చస్సు కలిగి అందరను అతిక్రమించి వీరశూరతలు గలవానికి నీకునమస్కారము. వరము ఇచ్చువానికి, వరింపదగిన వానికి సర్వమునందున్న వానికి నీకు నమస్కారము. భూత భవిష్యత్కాల స్వరూపునకు మహాదేవుడై భవుడవైన నీకు నమస్కారము. జన స్వరూపునకు తప స్స్వరూపునకు వరదునకు నీకు నమస్కారము. నమస్కరింపదగిన వానికి మోక్ష స్వరూపునకు జనరూపునకు నరక రూపునకు నీకు నమస్కారము. భవునకు అందరిచే సేవింపబడువానికి యజ్ఞ స్వరూపునకు యజ్ఞము చేయించు పురోహిత స్వరూపునకు మహోదార స్వరూపునకు, మిక్కిలి ప్రకాశించిన ప్రకాశ స్వరూపునకు (పరమాత్మ స్వరూపునకు) నిర్గుణ స్వరూపునకు. పాశహస్తునకు తనకు తానే ఆభరణ (అలంకార)మైన వానికి హోమము చేయబడిన ద్రవ్యరూపునకు అపహుతునకు హోమము చేయబడని ద్రవ్య స్వరూపునకు ప్రహుత ప్రశి(సి)తునకు అధికముగా హోమము చేయబడిన హోమ ద్రవ్యమునందు అత్యంతాసక్తిగల నీకు నమస్కారము. ఇష్ట స్వరూపునకు (యజ్ఞ స్వరూపునకు ప్రియ స్వరూపునకు) హోమదానాది క్రియ అంతర్వేదిలో దానము ఈయబడినది ఇష్టము తత్స్వరూపునకు), మూర్తిమత్స్వరూపునకు (చెరువుల దేవాల యములు మొదలగు వాని నిర్మాణముల స్వరూపునకు ఋత స్వరూపునకు సత్య స్వరూపు నకు భూతాధిపతియైన నీకు నమస్కారము. సదస్య (యజ్ఞ సభలోని సభ్యుల) స్వరూపునకు దక్షిణావబృథ స్వరూపునకు లోకుల అహింసా స్వరూపునకు పశుమన్త్ర ఔషధి స్వరూపునకు నీకు నమస్కారము. తుష్టిని ఇచ్చువానికి త్ర్యంబకునకు (మూడు కన్నుల వానికి) మంచి గంధముగలవానికి ఇంద్రియముల అధిపతికిని అన్ని దోషములకు పరిహారమైన వానికి (పూల) మాలలు ధరించిన వానికిని నీకు నమస్కారము. విశ్వుడును, విశ్వరూపుడును. అంతటను నేత్రములు ముఖములు గలవాడును అంతటను చేతులు కాళ్ళు గలవాడును రుద్రుడును ప్రమితుడును (నిజముగా నెరుగబడినవాడు) అగు నీకు నమస్కారము. హవ్య (దేవ యోగ్యమయిన అన్నము) స్వరూపునకు, కవ్య (పితరులకు యోగ్యమయిన అన్నము) స్వరూపునకు హవ్య కవ్య స్వరూపునకు నీకు నమస్కారము. సిద్ధస్వరూపునకు పవిత్రాత్మునకు, చేష్టాస్వరూపునకు నాశములేనివానికి నీకునమస్కారము. చక్కని వీరునకు, చక్కని భయంకరునకు క్షోభింప నలవిగాని వారిని గూడ క్షోభింపచేయు వానికి చక్కని మేధావంతునకు చక్కని సంతానము గలవానికి, ఉజ్జ్వల ప్రకాశవంతునకు, సూర్య స్వరూపునకు నీకు నమస్కారము. చక్కని రెక్కలుగల గరుడస్వరూపునకు, బంగారు కాంతిగల వానికి నీకు మరల మరల నమ

స్కారము. విరూపమయిన కన్నులు గలవానికి మూడు కన్నులు గలవానికి, పింగళ స్వరూపునకు (సూర్య స్వరూపునకు) మహాతేజస్వికి నీకు నమస్కారము. దృష్టిని (కుదృష్టిని) పోగొట్టువానికి, శాంతమైన చూపులు గలవానికి, పొగవర్ణము గలవానికి, తెల్లనైన వానికి, నల్లనైన వానికి ఎఱ్ఱనైన వానికి నీకు నమస్కారము. మాంస స్వరూపునకు, కోతి వర్ణము గలవానికి, పచ్చనైనవానికి, అమ్ములపొది గలవానికి, విశేష స్వరూపములు గలవానికి, ఏ విశేషములు లేనివానికినీకు నమస్కారము. పద్మమువంటి వర్ణముగలవానికి, మృత్యువును (యముని)జంపినవానికి మృత్యు స్వరూపునకు, శ్యామునకు (నల్లనివానికి) గౌరునకు (తెల్లనివానికి) కద్రు (గోరోచన) వర్ణము గలవానికి, ఎఱుపువానికి నీకు నమస్కారము. కాన్తునకు (మనోహరునకు) సంధ్యాకాల మేఘము వంటి వర్ణము గలవానికి, బహు రూపములుగలవానికి, పుఱ్ఱచేతియందు గలవానికి దిక్కులే వస్త్రములుగాగల దిగంబరుడైన వానికి, జటాజూటము గలవానికి నీకు నమస్కారము. జ్ఞానాతీతునకు శర్వునకు, వధింపనలవిగాని వానికి, వరు(శ్రేష్ఠు)నకు, ముందును, వెనుకను స్వరూపములను ధరించినవానికి, అగ్ని స్వరూపునకు నీకు నమస్కారము. చేరనలవి గాని వానికి, మహత్స్వరూపునకు అడ్డైనవానికి, కపిల వర్ణము గలవానికి, సూర్యకాంతి వంటి శరీరము గలవానికి బలవంతునకు, వేగవంతునకు నీకు నమస్కారము. పినాకమను ధనువు ధరించిన వానికి, ప్రసిద్ధునకు స్ఫీతు (విశాలు)నకు, ప్రసరించినవానికి, చక్కని మేధా స్వరూపునకు, దిక్కులే వస్త్రములు గలవానికి శిఖగల వానికి నీకు నమస్కారము. చిత్ర స్వరూపునకు చిత్రమైన వర్ణములు గలవానికి, విచిత్రునకు సర్వము ధరించువానికి, చేకితానునకు, తుష్టునకు, అనిహితునకు (ఎక్కడను ఉంచబడని వానికి) నీకు నమస్కారము. క్షాన్తునకు (క్షమ గలవానికి) శాన్తునకు (శరణుగలవానికి), వజ్రము వంటి శరీరము గలవానికి రాక్షసుల జంపువానికి, దక్ష యజ్ఞమును ధ్వంసము జేసినవానికి, నల్లని కంఠమును ఊర్ధ్వరేతస్సును గలవానికి నీకు నమస్కారము. శత్రువుల సంహరించువానికి యమ స్వరూపునకు తీక్ష్ణమైన ఆయుధముల ధరించినవానికి, మోదము (సంతోషము)తో గూడిన వానికి, అతిసంతోష స్వరూపునకు, శూన్య స్వరూపునకు నీకు నమస్కారము. ఓంకార స్వరూపునకు ఓంకారాధీశ్వరుడవు భక్తులకు సుఖము నిచ్చువాడవు, మృగమును వేటాడువాడవు సమర్థుడవు. దక్షయజ్ఞ ధ్వంసము జేసినవాడవునైన నీకు నమస్కారము. సర్వమైనవాడవు. త్రిపురముల ఛేదించినవాడవు, శాన్తుడవు, సుగంధుడవు పరులకు గూడ ప్రభువైన వాడవునైన నీకు నమస్కారము. పుష్పవన్త స్వరూపుడవు (సూర్య చంద్ర స్వరూపుడవు), భగనేత్రాన్తకుడవు (ఇంద్రాంతకుడవు) కణాదస్వరూపుడవు, వరిష్ఠుడవు. కాముని శరీరము గాల్చినవాడవునైన నీకు నమస్కారము. సూర్యుని భయంకర చక్ర స్వరూపుడవు. నాగరాజు నణచినవాడవు

దైత్యులకు అంతకుడవు, దివ్యులకు రోదనము గలుగజేయువాడవునైన నీకు నమస్కారము. శ్మశాన ప్రియుడవై నిత్యుడవైన నీకు నమస్కారము. మూడు నేత్రములు ధరించువాడవు, ప్రాణములను పాలించువాడవు, కదులుచున్న మాలలను ధరించువాడవునైన నీకు నమస్కారము. శోకము వీడిన యనేక ప్రాణులచే బాగుగా స్తుతింపబడిన వాడవు. నరనారీ శరీరము (అర్ధనారీశ్వర శరీరము) గలవాడవు. పార్వతీదేవికి ప్రియమును జేయువాడవు నైన నీకు నమస్కారము. జటాధారివి ఇష్టమైన వాడవునైన నీకు నమస్కారము. మను (కోప) స్వరూపుడవు, చల్లని శీలము గలవాడవు. చక్కని గీతులను గానము చేయువాడవు. కంకణములు చేతులలో నలంకరించుకొన్న వాడవు. భయంకరుడవు, భయంకర రూపమును ధరించిన వాడవునైన నీకు నమస్కారము. విభీషణుడవు (మిక్కిలి భయంకరు డవు, భయంకరుడవు. సూర్యుని (దక్షయజ్ఞములో) మధించినవాడవు. సిద్ధ సమూహములచే గానము చేయబడినవాడవు మహాభాగుడవు మహాభాగ్యవంతుడవు నైన నీకు నమస్కారము. పెద్ద నవ్వుగలవానికి, సింహనాదము చఱచుట లేక చీల్చుటయు గలవానికి, ధ్వని చేయు చున్నవానికి, దుముకుచున్నవానికి మిక్కిలి సంతసించిన వానికిని నీకు నమస్కారము. అద్భుత రూపునకు, నిద్రించువానికి, పరిగెత్తువానికి, పీడించున్నవానికి పరిగెత్తుచున్న ద్రవీభావము జెందుచున్నవానికి, నీకు నమస్కారము. కదులుచున్నవానికి, ఆడుచున్న వానికి, లావైన కడుపు శరీరముగల వానికి నీకు నమస్కారము. కృతస్వరూపుడు వికార రూపములైన చేతులుగల వానికి, నీకు నమస్కారము. పిచ్చివేషముగలవానికి చిరుగజ్జెలు గలవానికి, వికృత వేషము గలవానికి క్రూరునకు నీకు నమస్కారము. జ్ఞానాతీతునకు ఉజ్జ్వల ప్రభావంతునకు, ప్రభావ స్వరూపునకు, నిర్గుణునకు, ప్రియునకు నాద స్వరూపునకు ముద్రలను మణులను ధరించిన వానికి నీకు నమస్కారము. అపత్య (సంతాన) స్వరూపు నకు సూక్ష్మ శరీరికి, గుణములచే సాటిలేనివానికి, గుణ స్వరూపునకు, యక్ష రహస్య రూపునకు, తెలియనలవిగాని దానినిగూడ దెలిసికొనువానికి నీకు నమస్కారము.

లోకమును ధరించునది (నీకు) భూమి నీ పాదములు సజ్జనులచే సేవింపబడినవి. నీ యుదరము సమస్త సిద్ధ యోగములకు అధిష్ఠానము. నీ నడుము తారా గణములతో నలంకరింప బడినదై విశాలమైన యంతరిక్షము (ఆకాశము)నీ వక్షః స్థలమున తారాపథము (పాలవెల్ల చుక్కల మార్గము)వలె హారము ప్రకాశించుచున్నది. నీ పది భుజములు కేయూ రములతో (భుజకీర్తులతో)అంగదములతో (మరికొన్ని భూజాలంకారములతో) నలంకరింప బడిన పదిదిక్కులు. నీ కంఠము వెడల్పై వైశాల్యము గలదై నల్లని మేఘ సమూహము వంటిదై శ్రీమంతమై (విషము గలదై) బంగారు సూత్రములతో నలంకరింపబడినదై ప్రకాశించు

చున్నది. కోరలచే భయంకరమైన దుర్భరమై తిరస్కరింప అలవి కానిదై సాటి లేనిది నీ ముఖము. కమలమాలలతో తలపాగాగా చుట్టబడిన నీ శిరస్త్రాణము (లేదా నీ విరబోసిన తల వెంట్రుకలు) ఎంత చక్కగా ప్రకాశించుచున్నది. నీ యుజ్జ్వల కాంతి సూర్యుని యందున్నది. నీ శరీరము(కాంతి)చంద్రుని యందున్నది. నీ స్థైర్యమున భూమి యున్నది. నీ బలమున వాయువున్నది. నీ తీక్ష్ణత అగ్నిలో నున్నది. నీ కాంతి చంద్రుని యందు ఉన్నది. నీ శబ్దము ఆకాశమునందు ఉన్నది. నీ చల్లదనము నీటిలోనున్నది. పండితులు ఈ నీ గుణములను అక్షరములై (నాశ రహితము లై) ఉత్తమము లై (అత్యున్నతము లై) నిష్పదములై ఏ మాత్రము కదలిక లేనివైనవిగా స్థిర మైనవిగా తెలియుదురు.

జపస్వరూపుడు, జపింప దగినవాడు, మహాయోగి, మహాదేవుడు, మహేశ్వరుడు పరమునందు శమించువాడు గుహలో (బుద్ధిలో) ఉండువాడు ఆకాశమున చరించువాడు. రాత్రియందు చరించువాడు తపోనిధి. కుమారస్వామి నందనుడు (ఆనందింప జేయువాడు) గుఱ్ఱపుతల గలవాడు (ఐశ్వర్యమును వాహనముగా జేసికొన్నవాడు). తెలియదగినవాడు. తెలియజేయువాడు. నేత (పరమపదమును జేర్చువాడు) ధూళిని వహించువాడు. దుష్టులను కంపింపజేయువాడు.

బృహద్రథుడు (గొప్ప రథము, బృహత్సామము రథముగా గలవాడు) భయంకర మైన పనులుగలవాడు. విశాలమైన కీర్తి గలవాడు. ధనంజయుడు (అగ్ని స్వరూపుడు, సర్వవ్యాపి అయిన ధనంజయ వాయు స్వరూపుడు) ఘంటా ప్రియుడు, ధ్వజముగలవాడు ఛత్రము కలవాడు. జండాగల సేనకు అధిపతియైనవాడు. కవచము కలవాడు పట్టిసము అను ఆయుధ విశేషము కలవాడు. శంఖముకలవాడు. పాశము హస్తమందుకలవాడు. పరశ్వమను ఆయుధము కలవాడు. పొందనలవి కానివాడు. పాపరహితుడు, శూరుడు ఇంద్రశత్రువులైన రాక్షసులను చంపువాడు. అయిన నిన్ను ప్రసన్నుని చేసికొని పూర్వము మాచేత యుద్ధమున శత్రువులు చంపబడిరి. నీవు అగ్నివి, సముద్రుడవు, అన్నింటిని త్రాగుచుగూడ తృప్తిచెందవు. నీవు కోపమునకు నిలయమైన వాడవు. ప్రసన్నమైన ఆత్మగల వాడవు. కాముని చంపినవాడవు. కోరికలను తీర్చువాడవు, ఇష్టమైనవాడవు, బ్రహ్మణ్యుడవు. వైదికకర్మలకు మూలము అయినవాడవు. బ్రహ్మచారివి. గోఘ్నుడవు (ఇంద్రియములను చంపువాడవు)నీవు శిష్టులచే (వేదము చెప్పిన విధముగా నడచుకొను వారిచే) పూజింపబడు వాడవు. వేదములకు తరగని నిధి అయినవాడవు. నీ చేతనే యజ్ఞము కల్పింపబడినది. నీవు వేదమును, వేదోక్తమయిన హవ్యమును, హవ్యవాహను డును. అందుచే మేమందరము ప్రీతులము అగుదుము. నీవు భవానీశుడవు. పుట్టువులేని యశుడవు. లోకములకు నెలవైన

రాశివై కర్తవైన బ్రహ్మవు. నీవు ఆది సృష్టి స్వరూపుడవు. సాంఖ్యులు నిన్ను ప్రకృతులకంటె పరమునిగా తెలిసికొనుటచే క్షీణించిన ధ్యానము గలవారై, మృత్యువులో ప్రవేశింపరు. ధ్యానయోగులు తమ ధ్యానముచే నీతో నిత్యము కూడిన వారై నిన్ను తెలిసికొని ఆ భోగములను పూర్తిగా వదలివేయుదురు. ఇక తదితరులైన మానవులు నిన్ను శరణుపొంది పరిశుద్ధులై కర్మలచే దివ్యభోగములను అనుభవించుచుందురు. జ్ఞానాతీతమైన పరమాత్మవైన నీ తత్త్వము యొక్క అపారమైన మాహాత్మ్యమును మా శక్తి కొలది తెలిసికొన్నంతవరకు మేము కీర్తించితిమి. నీవు ఎవడవైనను అగుదువు గాక అట్టి నీకు నమస్కారము. మాకు మాత్రము అంతటను శివుడవు అగుమని వేడుచున్నాము. (24)

మధుకైటభోత్పత్తి వినాశనము

సూతుడు పలికెను :

తేనేవలె పింగళ (గోరోచన) వర్ణముతో విశాలమైన నేత్రములుగల ఉమాపతి తన కన్నులతో త్రాగుచున్నాడా అన్నట్లు ఆ బ్రహ్మ విష్ణువులను చూచి, తనను స్తుతించినందున మిక్కిలి సంతసించిన ముఖముకలవాడు అయ్యెను. ఆ ఉమాపతి, విరూపాక్షుడు (మూడు కన్నులు గలవాడు), దక్షయజ్ఞ ధ్వంస మొనర్చినవాడు, పినాకమను ధనువును ధరించిన వాడు, ఖండించెడు గండ్రగొడ్డలి కలవాడు, భూతమును వధించువాడు, మూడు కన్నులు గలవాడు, భగవంతుడు అయిన ఆ శివుడు ఆ బ్రహ్మ విష్ణువుల ఇరువురి అమృతము వంటి వాక్యములనువిని, తాను ఎరిగిఉన్నను, ప్రీతిపూర్వకముగా పరస్పర హితమునుగోరు మహాత్ములైన మీరు ఎవరు? ఈ భయంకర ప్రళయ జలమయమైన తెప్పపై కమలాక్షుడు కూడియున్న మీరు ఇరువురు ఎవరు? అని అడిగెను. అంతట ఆ మహాత్ములు ఇరువురును ఒకరి నొకరు చూచుకొని భగవాన్! విభో! నీచే నిజము తెలిసి ఏమి ప్రయోజనము? నీవు లేక స్వేచ్ఛాచార రూపమై అంతములేని నిత్య సుఖము ఎక్కడిది" అని పల్కిరి.

అంతట భగవంతుడైన మహాదేవుడు మాధుర్యమునిండిన మాటలలో ఇట్లనెను. ఓ బ్రహ్మా! ఓ విష్ణూ! మీరిరువురకు నేను చెప్పుచున్నాను. నేను ఈ మీ శాశ్వతాక్షరయుక్తమైన (శాశ్వతమై, నాశనములేని వర్ణమాలలు గల స్తుతితో కూడిన) భక్తిచేత సంతుష్టుడనైతిని. మిక్కిలి పూజినీయులైన మీరు ఇరువురును నాకు గౌరవింపతగిన వారు. ఇప్పుడు మీ ఇరువురికి వరములలో ఉత్తమమైన వరము ఏమి ఈయవలెను?

మహాదేవుడు ఇట్లు అనగానే విష్ణువు బ్రహ్మతో ఓ మహాభాగా! బ్రహ్మా! నీవు అడగ దలచిన వరమేమియో చెప్పుము అని అనెను. అంత బ్రహ్మా భగవంతుడగు ఓ విష్ణూ

"నేను సంతానమును కోరుదును" అని పుత్రప్రాప్తికై వరమును పొందకోరి భారము వహించగల పుత్రునికోరి బ్రహ్మతో ఇట్లనెను. వీరుడు సాటిలేనివాడు భారమును మోయువాడు అయిన పుత్రుని కోరినచో దేవదేవుడైన మహేశ్వరునే పుత్రుని నీవు కోరుము అనెను. బ్రహ్మ ఆ కేశవుని మాటను గౌరవించి "ఈశ్వరుడైన రుద్రునికి చేతులు జోడించి మ్రొక్కి పుత్రకాముడై, విష్ణువుతో సహ" ఇట్లు పలికెను. "భగవంతుడనైన నీవు పుత్ర కాముడనైన నా విషయమున సంతుష్టుడవైనచో ఓ విశ్వాత్ముడా నాకు పుత్రుడవు గమ్ము. వాడు భారము వహించగలిగి నీతో సమానునిగా ఉండవలెను. ఓ మహేశ్వర! నా యందు సంతుష్టుడవైన నిన్ను, న్యాయమైన ఈ వరమును కోరుచున్నాను అని ప్రార్థించెను.

భగనేత్ర హారియైన మహాదేవుడు బ్రహ్మయొక్క ఆ ప్రార్థనమును విని నిష్కల్మషముగా మాయలేకుండా అట్లే అగుగాక అని అనెను. ఓ సువ్రతుడా! బ్రహ్మా! నీవు ఏదేని పనిప్రారం భించగా ఆపని జరుగునపుడు నీకు కోపము కలుగగలదు. ప్రాణహేతువులైన నా పదకొండు రుద్రులతో, ఈ నేను పదకొండవవానిగా శూలము హస్తమునందు గలవానినై వెంట ఉండి ఋషిని మిత్రుడను మహాత్ముడను అయిన నేను నీకు కోపము వచ్చినపుడు నీ లలాటము నుండి జనింపగలను. అని బ్రహ్మకు ఆ విధముగా సాటిలేని వరమునిచ్చి, నీకు గూడ వరమును ఇచ్చెదను అడుగుమని విష్ణువుతో అనెను.

అంత ఆ మహాభాగుడైన విష్ణువు శివునితో ఇట్లనెను. ఓ దేవా! ఈ నీచే చేయబడిన వాగ్దానము మాకు చాలును. నా విషయమున నీవు సంతుష్టుడవైనచో ఓ అంబుదవాహన! మహాదేవా! నీ యందు నా భక్తి సుప్రతిష్ఠిత మగునట్లు చేయుదువు గాక అని అడుగగా ఆ మహాదేవుడు కేశవునితో ఇట్లనెను : ఓ శాశ్వతుడవైన దేవా! విష్ణు! నేను నీ విషయమున ఎంతయు సంతసించితిని. వినుము ఈ కనబడునది కనబడనిదియు అయిన, స్థావర జంగమాత్మకమైన విశ్వరూపమంతయు రుద్రనారాయణాత్మకము. నేను అగ్నిని, నీవు సోముడవు. నీవు రాత్రిని. నేనే పగటిని. నీవు ఋతువు. నేను సత్యమును. నీవు క్రతు స్వరూపుడవు. నేను దాని ఫలమును. నీవు జ్ఞానము. నేను జ్ఞేయమును (జ్ఞానముచే తెలియ దగినవాడను). నిన్ను జపించి జనులు ఎల్లప్పుడు నన్ను ప్రవేశింతురు. నీవు సంతుష్టుడ వైనచో జనులు సుకృతమును చేయువారు అగుదురు. యుగాంత కాలమున మన ఇరు వురితో కూడినదే మార్గము. వేరొక మార్గములేదు. నన్ను ప్రకృతినిగా తెలుసుకొనుము. నన్ను పురుషుడైన శివునిగా తెలియుము. నేను నీకు సగము శరీరమైనట్లే, నీవు నాయొక్క సగము శరీరమవు. ఎడమ ప్రక్క నేను. నాకది నీనల్లనైన శ్రీవత్సలాంఛనముగలది. నీవు కుడి ప్రక్కవు. కాని అది నీలలోహితుడనైన నేను. ఓ విష్ణో నీవు నా హృదయమవు. నీ

హృదయమందే నేనున్నాను. నీవు సమస్త కార్యమునకు కర్తవు. నేను దానికి దైవతమును. కావున ఓ వత్సా! రమ్ము (నాలో కలియుము) నీకు స్వస్తియగు గాక. ఓ మేఘశ్యాముడా! వెళ్లుదును. అని ఇట్లు పలికి సన్నిధినుండి దేవుడైన ఈశ్వరుడు అంతర్ధానమయ్యెను.

ఓ రాజా! ఆ తరువాత మహాదేవుడు అంతర్థానము కాగానే విష్ణువు అంతర్జలమున ప్రవేశించి తన శయనమున పరుండెను. అపుడు పద్మముల వంటి కన్నులు గలవాడును పద్మమునందు పట్టిన వాడును అగు బ్రహ్మ సంతసించిన మనస్సు గలవాడై, విష్ణువుతో కలిసి, సూర్యునితో సమమైన కాంతికలదియు, బ్రహ్మమును (జ్ఞానమయ బ్రహ్మకు సంబంధించినది) అయిన ఆ పద్మమును చేరెను. తరువాత చాలా కాలమునకు, అక్కడ అనగా పద్మమునందు సాటిలేని ఇరువురు మహాబలులు, అన్నదమ్ములు మధు కైటభులు అనువారు బ్రహ్మతో "నీవు మాకు ఆహారము కమ్ము" అనిచెప్పి అచ్చటనే అంతర్ధానమైరి. కమలమున పుట్టిన బ్రహ్మ భయంకరమైన వారి ఉద్దేశ్యమును గ్రహించి తన మాహాత్మ్యమును కూడ తెలుసుకొన కర్తవ్యమును తెలిసికొనుటకు ప్రారంభించెను. తాను మరల కమలనాభి కూర్పును దాని నుండి పైమార్గమును తెలియక ఆ పద్మనాళము గుండా పాతాళమునకు లేదా భూమికి అంతర్జలమున దిగి కృష్ణమృగ చర్మమును ఉత్తరీ యముగా ధరించిన విష్ణువును చూచెను. బ్రహ్మ ఆ హరిని మేలు కొల్పెను. మేలుకొన్న ఆ హరితో ఓ దేవా! భూతములవల్ల నాకు భయము ఏర్పడినది, లెమ్ము రక్షించుము శుభమును కూర్చుము" అని అనెను. అంత శత్రుదమనుడు భగవంతుడు మునిఅయిన విష్ణువు స్వయముగా నవ్వుచూ "భయపడవలదు భయపడవలదు".

నీవు పూర్వము భూతములవల్ల నాకు మిక్కిలి భయముగలదని అంటివి. కావున నీవు భూతాది వాక్యములచేత ఆ ఇరువురుని నశింపజేయవలెను అనెను. అంత, అచటకు వచ్చి కూర్చునియున్న అయోనిజుడైన విష్ణునిలో భూర్లోక, భువర్లోక, స్వర్గలోకములు ప్రవేశించినవి. అట్లు జరుగగా అనంతుడు తన ముఖము నుండి విష్ణువు, జిష్ణువు (విష్ణువు, ఇంద్రుడు) అను సోదరులను వెడలగ్రక్కెను. అంత మరల మధుకైటభుల రాకను తెలిసికొని విష్ణు జిష్ణువులతో "బ్రహ్మను రక్షించుకొనుడు" అని అనెను. గొప్పశక్తిగల మధుకైటభులు విష్ణు-జిష్ణువులతో సమానమై రూపములను ధరించిరి. ఆ విధముగా సమాన రూపములు గలవారికి సమాన రూపములు గలవారే అభిముఖులుగా ఉండిరి. తరువాత (విష్ణు, జిష్ణు రూపమును ధరించిన) మధు కైటభులు అను రాక్షసులు బ్రహ్మతో భయంకరమగు మాటలతో "యుద్ధము చేయుచున్న మమ్ములను గురించి ప్రశ్నించు చున్నావు. ఎవరెవరితో యుద్ధము చేయుచున్నారో తెలియనివానిగా ఉన్నావు" అని పలికిన తరువాత వారు

జలమున ప్రవేశించి తమ మాయచే జలమును స్తంభింపజేసి అపుడు ఎవరికేది ఇష్టమో అట్టి తుముల (దొమ్మి) యుద్ధమును చేసిరి.

ఆ విధముగా యుద్ధము చేయుచున్నవారికి దేవమానముతో నూరు సంవత్స రములు గడచినవి. కాని పరస్పరముచేయు యుద్ధముయొక్క మదము వారికి తరగలేదు. రెండు గుర్తులతో ఉన్నందున (విష్ణు, జిష్ణు) రూపముల ధరించినవారూ నిగూఢ భావ బోధకము లైన చేష్టలు (ఇంగితములు) గలవారైరి. వారికి రూపంలో సాదృశం ఉన్నందున బ్రహ్మ వారిని గుర్తింపలేక వ్యాకులచిత్తుడై ధ్యానమును ఆశ్రయించెను. తరువాత దివ్య దృష్టితో వారిలో భేదమును గుర్తించి, పద్మకేసరము (కింజల్కము)ల నుండి పుట్టిన సూక్ష్మమైన వారి కవచమును భేదించెను. నడుము వరకుఉన్న వారి శరీరమును కూడ బంధించెను. ఈ తరువాత మంత్రమును ఉచ్చరించెను.

ఇట్లు జపము చేయుచున్న బ్రహ్మకు కన్య కలిగెను. ఆమె విశ్వరూపము నుండి బయలు వెడలినదియై, పద్మము చంద్రుల వంటి ముఖముకలదిగా ఉండెను. పద్మముల వంటి చేతులు గలది. శుభకరమైనది అయిన ఆమెను చూచి ఆ ఇరువురు రాక్షసులు భయము వలన బాధింపబడి వివర్ణులైరి. ఆ తరువాత మధురములైన మాటలతో బ్రహ్మ ఆకన్యతో ఓ శ్రేష్ఠురాలా! నీవు ఎవరివని నేను తెలుసుకొనవలెను? "నిజముగా చెప్పుము" అని అడిగెను. అప్పుడు ఆ కన్య సామముతో (శాంతముగా, సామవేదముతోను) బ్రహ్మను పూజించి చేతులు జోడించి 'నన్ను విష్ణువు యొక్క ఆజ్ఞను నెరవేర్చుటకు వచ్చిన మోహినీ మాయగా తెలియుము'. ఓ బ్రహ్మ! నీవు ధ్యానించుటచేత నేను వేగముతో వచ్చితిని" అని అనెను. బ్రహ్మ సంతసించిన మనస్సు కలవాడై ఆమెకు గౌణమైన (గుణము ఆధార ముగా చేయబడిన) పేరునుపెట్టెను. నాచే విశేష ధ్యానమున పిలువబడిన దానవై వచ్చితివి, కావున మహావ్యాహృతి అనియే నీ పేరు ప్రచారమగును. శిరస్సును భేదించి పైకి వచ్చితివి కావున సావిత్రి అని పిలువ బడెదవు. ప్రస్తుతము అంశములులేక ఒక్కతెవె అయినందున అనేకాంశవు అగుదువు. ఇవి నీగుణ ప్రధానములైన నామములు. ఓ శుభాననా! నా అను గ్రహమున నీ క్రియల వలన కలుగు నామములు వేరుగాగలవు అని తెలియచేసెను.

తరువాత మధు, కైటభులు ఆమెచే పీడింపబడినవారై బ్రహ్మను "ఆవరణములేని మరణము మాకు కావలెను. మేము నీకు పుత్రులము గూడ కావలెను" అని వరము అడిగిరి. బ్రహ్మ మీరడిగినట్లే అగుగాక అని వారిని వెంటనే యమలోకమునకు పంపెను. ముందు విష్ణువు కైటభుని, తరువాత జిష్ణువు మధువును యమలోకమునకు పంపిరి.

ఈ విధముగా జిష్ణువు, విష్ణువులతో ఆ ఇరువురు రాక్షసులు చచ్చిరి. ఆ తరువాత సంతసించిన భగవంతుడు బ్రహ్మాలోకముల హితమునుకోరి, ఏ విధముగా పుత్రత్వ రూపమున, తన రూపము ఈయబడినదో వినుడు. ఇట్లు విష్ణు, జిష్ణులతో మధు కైటభులకు యుద్ధము జరుగగా బ్రహ్మ విష్ణువుతో ఇట్లు పలికెను.

ఈ రోజుతో నూరేండ్లు నిండినవి. సమయము ముందుగా వచ్చినది. ఇది సంక్షేపమై భయంకరమైన ప్రళయము నేను నా స్వస్థానమునకు వెళ్ళుచున్నాను అని అనెను. బ్రహ్మమాట విని మహాదేవుడు అపుడు సర్వప్రాణుల సంహారమును చేసెను. భూమిని అంతయు స్థావరములు (చరింపని పర్వత వృక్షాదులు) లేనిదానినిగా చేసెను. జంగమ ములను అనగా చరించువానిని వాని మూలమైన ప్రకృతిలో ఉండునట్లు చేసెను. గోవిందు డైన విష్ణువు యొక్క భద్రత కొరకు సముద్రము ఉంచబడినది. ఓ ! లక్ష్మీ వర్ధనుడవైన విష్ణో! నీకు నేను చేయవలసినది ఏమైన ఉన్నచో చెప్పుము అని అనెను. ఆ మాటలకు విష్ణువు ఇట్లు అనెను. ఓ బ్రహ్మా! బంగారు వన్నెగలవాడా! అది అంతయు సరే! నా మాట వినుము. పుత్రకాంక్షచే పూర్వము ఈశ్వరునినుండి నీకు లభించిన అనుగ్రహమును సఫలముచేసి నా నుండి ఋణ విముక్తుడవైనావు. నాలుగు విధములైన ప్రాణులను నీవు సృష్టించుము అనెను.

గోవిందుని వలన పద్మమున పుట్టిన బ్రహ్మ మేలుకొని ప్రజలను సృష్టించు తలంపు కలవాడై ఉగ్రమైన మహాతపస్సు జేసెను. ఈ విధముగా తపము చేయుచున్న ఆ బ్రహ్మకు ఏమియు జరుగలేదని భావించగా, తరువాత చాలా కాలమునకు దుఃఖము వలన క్రోధము పెరిగెను. ఆ క్రోధముచే నిండిన నేత్రముల నుండి కన్నీటి బిందువులు రాలసాగెను. తరువాత, ఆ కన్నీటి బిందువుల నుండి వాతపిత్త కఫాత్మకులు, మహాభాగులు, గొప్ప యదృష్టము కలవి మహాబలము కలిగినవి, స్వస్తిక చిహ్నములచే అలంకరింప బడినవి, విరియబోసిన వెంట్రుకలు గలవి, మహావిషము కలవియును అగు సర్పములు పుట్టినవి. ఆ విధముగా ముందుగా పుట్టిన సర్పములను చూచి బ్రహ్మ తనను నిందించుకొనెను. అయ్యో! తపస్సుచేత నాకు ఇటువంటి ఫలితము లభించుట న్యాయము కాదు. నాకు మొదటి సంతానమే లోకములను నశింపజేయునదిగా పుట్టినదే అని అనుకొనెను. తరువాత బ్రహ్మకు క్రోధాసహనముల వలన పుట్టిన మూర్ఛ తీవ్రమయ్యెను.

సాటిలేని వీర్యము గల అతని (బ్రహ్మయొక్క) దేహము నుండి కారుణ్య పూర్వకముగా ఏడ్చుచున్న పదకొండుగురు రుద్రులు పుట్టిరి. రోదించుట వలన వారు రుద్రులు. ఆ

కారణముననే వారిలో రుద్రత్వము ఉండినది. ఎవరు రుద్రులో వారు ప్రాణములు గదా! ఏవి ప్రాణములో అవి రుద్రాత్మకములు. అవి సర్వభూతములందున్న ప్రాణుల ప్రాణములుగా తెలియవలసినవి. త్రిశూలియైన నీలలోహితుడు ఏకాదశాత్మకుడైన ప్రభువైన శివుడు అత్యుగ్రుడు మహత్త్వముగలవాడు చక్కగా నడచినవాడునై ఆ బ్రహ్మకు లలాటము నుండి మరల ప్రాణములను ఇచ్చెను. అప్పుడు (బ్రహ్మకు) ఆత్మజుడై ప్రభువైన ఆ శివుడు బ్రహ్మనుచూచి సంతసించిన ముఖము గలవాడై ఆ రుద్రదేవుడు, ఉత్కృష్ట మైన వాక్కులచే ఈ విధముగా పలికెను.

ఓ బ్రహ్మ, నన్ను అడుగుము. నిన్ను నీవు స్మరించుకొనుము. నన్ను నీ ఆత్మజుడనైన రుద్రునిగా తెలియుదువు. హే ప్రభో! నన్ను అనుగ్రహింపుము. అని పల్కిన రుద్రుని వాక్యమును బ్రహ్మ వినెను. ఆయనకు కోరిక ఎక్కువ అయ్యెను. వికసించిన కమలమువలె ప్రకాశించు కన్నులచే బ్రహ్మ ప్రసన్నాత్ముడు అయ్యెను. తరువాత, మరల ప్రాణమును పొందిన బ్రహ్మ, శుద్ధమైన బంగారువన్నె కలవాడై స్నేహముతో కూడిన గంభీరమైన వాక్కులతో ఇట్లనెను. ఓ మహాభాగుడా! నా మనసుకు ఆనందపరచుచున్నావు విశ్వమును భూతి (ఐశ్వర్యమవు)వి. ఏకాదశాత్మకుడవు అయిన నీవు ఎవడవు? చెప్పుము అని అనెను.

అనంత తేజస్కుడై భగవంతుడైన బ్రహ్మ ఇట్లనగానే తనతోపుట్టిన వారితోబాటు అభివాదము (నమస్కారము) చేసి రుద్రుడు బదులు పలికెను. ఓ బ్రహ్మన్! పూర్వము విష్ణువుతో గూడినన్ను పుత్రుడవు గమ్మని లేదా నీతో సమానముగా భారము వహించు పుత్రునిమ్మని వరమడిగితివి. లోకములలో ప్రసిద్ధులైన విశ్వాత్మునివల్ల బుట్టిన యందరి చేతను చేయదగినదిగలదు. ఓ దేవేశ ! దుఃఖమును వదులుము. లోకములను నీవు సృజింపదగి వలసి ఉన్నావు అని అనెను.

ఈ విధముగా చెప్పగానే బ్రహ్మ సంతసించెను. తరువాత లోకాంతమునకు నీల లోహితుడైన రుద్రునితో బ్రహ్మ ఇట్లు మారుపలికెను. "ఓ మహాదేవా! నా పని కొరకై సహాయ పడుము. నాతోగూడి ప్రజలను సృష్టి చేయుము. నీవు సర్వ ప్రాణులకు బీజ వంతుడవు తత్ప్రసన్నుడవై (ఆ బీజములను పొందినవాడవై) బీజవంతుడవు కమ్ము" అని బ్రహ్మ అనెను. శంకరుడుగూడ సరియేఅని ఆ మాటను స్వీకరించెను.

తరువాత, భగవంతుడైన బ్రహ్మ కృష్ణమృగ చర్మముచే అలంకరింపబడినవాడై, మొదట ప్రాణులను ధరించినదైన మనస్సును సృజించెను. తరువాత జిహ్వారూపిణియై, విశ్వ రూపిణియైన ఆ సరస్వతిని సృజించెను. భృగువు, అఙ్గిరసుడు, దక్షుడు, పులస్త్యుడు,

పులహుడు, క్రతువు, వసిష్ఠుడు అను ఏడుగురిని మనస్సున పుట్టిన వారిగా ఆమహాతేజస్వి యైన బ్రహ్మ సృజించెను. ఇంక ఆతడు తనతో సమానులై విశ్వమున పుట్టిన ఇతరులను కూడ సృజించెను. మరల ఆ మార్గమును అనుసరించి వారి ముఖము నుండి గోవులు పుట్టినవి. 'ఓం'కారము మొదలుకొని వేదములను అభిమానింపదగిన దేవతలను సృజించెను. ఈ విధముగా పైన చెప్పబడినవారిని అందరిని లోకపితామహుడైన బ్రహ్మ సృజించెను. తరువాత ఆ భగవంతుడైన ప్రభువు, దక్షుడు మొదలగు మానస పుత్రులతో మహాధీశక్తిగల రుద్రునితో గూడి ప్రజలను సృజింపుడు, మీకు భద్రమగుగాక" అనెను.

అప్పుడు ప్రజాపతులు (దక్షుడు మొ॥వారు) మహాత్ముడైన శంకరుని వెంబడించి, ఓ దేవ! నీతోకూడి మేము ప్రజలను సృజింప కోరుచున్నాము. ఓ మహేశ్వర! ఇది బ్రహ్మ యొక్కయు నీ యొక్కయు ఆజ్ఞ. అని దక్షాదులు అనగానే ప్రభువైన రుద్రుడు వారితో ఇట్లనెను : బ్రహ్మయొక్క కుమారులైన దేవతలు నాకై నా నుండి ప్రాణములను గ్రహించిరి. ఈ నా కుమారులైన బ్రాహ్మణులను అగ్రజుల కంటె అగ్రజులుగా జేసి బ్రహ్మాది స్తంబ పర్యం తములైన అనగా బ్రహ్మమొదలు గడ్డిపరక వరకు నేను ఆత్మగా ఉన్న ఏడు లోకములను మీరు నా మాటవలన సృష్టింపవచ్చును. మీకు శుభము అగుగాక. అని ఈ విధముగా రుద్రుడు చెప్పగానే ఆర్యుడు, త్రిశూలియైన, రుద్రునితో ప్రజాపతులు మీరు ఆజ్ఞాపించినట్లే సృష్టి జరుగ కలదు అనిరి. అపుడు ప్రజాపతులు మహాదేవుని ఒప్పించి మహాత్ముడైన దక్షునితో "నీవు శ్రేష్ఠుడవైన ప్రజాపతివి. నిన్ను ముందు ఉంచుకొని నీకు మేము క్షేమముగా ప్రజలను సృష్టింపగలము అని అనిరి. దక్షుడు అట్లే అగుగాక అని వారి మాటను ఒప్పు కొనెను. ప్రజాకాముడై ఆ ప్రజాపతి వారితో గూడి ప్రజలను సృష్టించుటకు ఆరంభించెను. తరువాత స్థాణువు (శంకరుడు) సర్గమునందు (సృష్టియందు) ఉండగా బ్రహ్మ సర్గమును, సృష్టిజేసెను. ఆ తరువాత బ్రహ్మకు ఏడవ కల్పము గడచిపోగా బ్రహ్మకు ఋభువు, సనత్కుమారుడును పుట్టిరి. వీరు ఇరువురు తపోలోక నివాసులు, ఆ తరువాత ఇతర మహర్షులను మానస జన్ములుగా ఆ ప్రభువు సృష్టించెను. (25)

స్వరోత్పత్తి

అని ఈ విధముగా చెప్పి, అటు పిమ్మట సూతుడు అనెను :

ఓ మహామతియైన వాయుదేవా! నీవు చెప్పిన రహస్యములు లోకానికి అనుగ్రహము కలిగించునవి కావున తత్త్వమును అనుసరించి ఆశ్చర్యకరములు. శూలధారియైన శివుని యొక్క అవతారముల విషయమున నాకు సంశయము గలదు. మహాదేవుడైన శివుడు

మిక్కిలి భయంకరమైన కలియుగమును పొంది, పూర్వములైన యుగములను వదలి అవతారమును పొంది, పూర్వములైన యుగములను వదలి, అవతారమును పరిగ్రహించుటలో కారణమేమి? ఓ ప్రభో ఈ వైవస్వతమన్వంతరము వచ్చినందున శివుడు ఏ విధముగా అవతరించెనో తెలిసికొన గోరుచున్నాను. నీకు ఈ లోకమునగాని, పరలోకమున గాని తెలియనిది ఏమియులేదు. భక్తులకు ఉపదేశించుటకై అడుగు చున్నాను. ఓ ప్రాజ్ఞా! ఆ మహామతము (గొప్ప వారికి ఇష్టమైనది) మేము వినదగినదైనచో చెప్పుము.

లోమశుడు అనెను :

అని ఈ విధముగ అడుగబడిన భగవంతుడు లోకహితము చేయుటలో ఆసక్తుడు, లోకములచే నమస్కరింపబడినవాడు మహాతేజోవంతుడు అయిన వాయువు ఓ గాధేయుడా! నీవు నన్ను అడుగుచున్నది మిక్కిలి రహస్యమైనది. దానిని అంతయు వరుసగా చెప్పెదను వినుము. పూర్వము అంతయు ఒకే సముద్రముగా ఉన్నది. దేవ మానముతో వేయి వర్ష ములు గడచినవి. అపుడు బ్రహ్మ ప్రజలను సృష్టింపగోరి దుఃఖితుడై చింతించెను. అట్లు చింతించు ఆతనికి ఒక కుమారుడు గలిగెను. అతడు దివ్యగంధము గలవాడై సుధను కోరినవాడై, దివ్యమైన శృతివేదమును ఉచ్చరించుచుండెను. శబ్ధము, స్పర్శ, రూపము, గంధము, రసములేని ఆశ్రుతిని ఉచ్చరించుచుండెను. దానిని దేవుడైన చతుర్ముఖుడు తెలిసికొనెను.

తరువాత బ్రహ్మ ధ్యానయుక్తుడై, భైరవుడైన శివుని మనస్సులో నిలిపి, ఈ మూడవ వాడెవ్వడు అని చింతించెను. ఆ విధముగ చింతించు ఆతనికి శబ్ధ, స్పర్శ, రూప, రస, గంధములు లేని ఒక అక్షరము ప్రాదుర్భవించెను. ఆ తరువాత ఆ బ్రహ్మ లోకములలో ఉత్తమమైన తన మూర్తినిగూడ చూచెను. అపుడు ధ్యానము చేయుచు, తరువాత అక్షర పురుషుని గూడ మరలచూచెను. ఈతడు వర్ణమునందు ఉన్నవాడు, తెల్లని వాడు, ఎఱ్ఱని వాడు, పచ్చనివాడు, నల్లనివాడు, స్త్రీ కాదు. పురుషుడును కాడు. అట్టి విధమైన అతనిని చూచెను.

అది అంతయు చాలాకాలము పాటు తెలిసికొని ఆ అక్షరమును గురించి ధ్యానించు చుండెను. ఈ విధముగా ధ్యానించుచున్న (బ్రహ్మయొక్క కంఠమునుండి ఆ అక్షరము పైకి వెలువడెను. కేవలము ఒక్క మాత్ర గలది, గొప్పధ్వని గలది, తెల్లని వర్ణముగలది, చక్కగా నిర్మలమైనది అయిన ఆ ఓంకారం వేదమై ఉండవలెను. నాశములేని (అక్షరమైన) మహేశ్వరుడే అయి ఉండును.

తరువాత అక్షరమును ధ్యానించుచున్న బ్రహ్మనుండి పుట్టిన రక్త వర్ణుడు (ఎఱ్ఱని వాడు) మొదటి దేవుడు. ఋగ్వేదము అగ్నిమీళే పురోహితమ్ (అను మంత్రము మొదట గలది) అని మొదట గలదు. మహాతేజస్వియైన లోకకారకుడైన బ్రహ్మ ఈ ఋక్కును చూచి ఆ అక్షరము ఏమిటని ధ్యానించెను.

అట్లు ధ్యానము చేయుచున్న బ్రహ్మయొక్క ఆ అక్షరమునందు మహేశ్వరుడు రెండు మాత్రలు గల అక్షరముగా పుట్టెను. ఈశ్వరుడు కలిగియుండుటచే అది మూడు మాత్రలు కలదైనది. తరువాత బ్రహ్మ మరల ద్విమాత్రాకమైన అక్షరమునే ధ్యానించెను. దాని (అక్షరము యొక్క) ఛేదనము కలిగిన రక్తమును స్వీకరించి, ఆయజుస్సు 'ఇషేత్వోర్జేత్వా వాయవస్థ దేవో వః సవితా పునః" అను మంత్రము మొదట కలదిగా జనించినది. తరు వాత యజుర్వేదమును ద్విమాత్రకమైన అక్షరమును చూచి, ఈశ్వరుడైన బ్రహ్మ ద్విమాత్ర మైన ఆ అక్షరమును మరల ధ్యానించుచుండెను. అట్లు ధ్యానించుచున్న బ్రహ్మకు ఓంకా రము కలిగెను. తరువాత బ్రహ్మ ఆ అక్షరమైన ఓంకారమును ధ్యానించెను. తరువాత బ్రహ్మ దానినుండి పైకి బయలుదేరిన పచ్చని ఋక్కును చూచెను. అది "అగ్న ఆయా హివీతయే గృణానో హవ్యదాతయే" అనునది.

తరువాత మహాతేజస్వియైన బ్రహ్మ ఆ అక్షరమైన ఓంకారమును ప్రాతః సంధ్యలోను, మధ్యాహ్న సంధ్యలోను సాయం సంధ్యలోను మూడు మారులు ధ్యానించి, తమంతట తాముగా తనకు స్ఫురించిన వేదమును చూచెను. మూడు (అ.ఉ.మ్) వర్ణములు గలది, ప్రాతః కాలమున, మధ్యాహ్న కాలమున, సాయంకాలమునను చేయు యజ్ఞ స్వరూప మైనదియు అయిన ఓంకారము బ్రహ్మఅని గుర్తింపబడినది. మూడింటి సంయో గము వలన త్రివర్ణమైనది ఆ అక్షరము. లక్ష్యమై కనబడినదై, అలక్ష్యమై (కనబడనిదై) ప్రదృశ్యమై అనగా ఎక్కువగా కనబడినదై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కలిసి విహరించునదై మూడైనది. మూడు మాత్రలుకలది. మూడు పదములు కలది. మూడు యోగములు కలదియై ఆ అక్షరము శాశ్వతమైనది. కావుననే స్వయంభువైన బ్రహ్మ ఆ అక్షరమును ధ్యానించెను. కావుననే ఆ అక్షరము బ్రహ్మ. బ్రహ్మ యొక్క బ్రహ్మ రూపము పదునాలుగు ముఖములు గల దేవునిగా చూడబడును. కావుననే బ్రహ్మయొక్క ముందు ఓంకారమును చేర్చి పలుకుటచేత బ్రహ్మ తెలిసికొనబడును. ఆ బ్రహ్మ ముఖమునుండి పదునాలుగైన వివిధ స్వర వర్ణములు అగు (అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ, ౡ , ఏ, ఐ, ఓ. ఔ అను అచ్చులు) ద్వివ్యమై, మొదటిదైన ఆ ఓంకార అక్షరమున పుట్టినవి. ఆ ముఖము నుండియే అకారమునుండి పుట్టినవి. అరువది మూడు వర్ణములుగా చెప్పబడినవి.

తరువాత వర్ణముల యొక్క సాధారణ అర్థము కొఱకు, బ్రహ్మనుండి మొట్టమొదట 'అ'కార రూపము నిలిచెను. అది మొదటి స్వరము (అచ్చు). తరువాత మన్వన్తరమున ఆ స్వరముల నుండి పదునాలుగు మహా ముఖములుగల మనువులు దివ్యములైన స్వరములును పుట్టినవి. పదునాలుగు ముఖములుగల 'అ' కారం బ్రహ్మ అను పేర పిలువబడినది. అన్ని వర్ణములుగల ప్రజాపతి (బ్రహ్మ) బ్రహ్మ కల్పముగా చెప్పబడెను. ఆతని మొదటి ముఖమునుండి స్వాయంభువ మనువు వచ్చినట్లు స్మరింపబడెను. అతడు బ్రహ్మయొక్క తెల్లనివర్ణముగల వాడని తెలియవలెను. ఆ బ్రహ్మ రెండవ ముఖము నుండి 'ఆ' కారము పుట్టినట్లు స్మరింపబడెను. అది పేరుతో స్వారోషమనువు రంగు తెలుపు మూడవముఖము నుండి యజుస్సులకు శ్రేష్ఠమైన 'ఇ' కారం బుట్టినది. 'యజు' అనగా ఆదిత్యుడు అతని నుండి యజుర్వేదము వచ్చినట్లు స్మరింపబడినది. 'ఈ' కారము రక్తవర్ణుడై ప్రతాపవంతుడైన మనువు. అతని నుండి క్షత్రియజాతి బయలుదేరెను. కావున క్షత్రియుడు రక్తవర్ణుడు. బ్రహ్మ నాలుగవ ముఖమునుండి 'ఉ'కార స్వరము వచ్చినది. దాని రంగు తామ్రము (రాగివర్ణము) కావున (దాని నుండి పుట్టిన) మనువు తామసుడు అనబడెను. బ్రహ్మ ఐదవ ముఖము నుండి 'ఊ' కారము పుట్టెను. రంగుతో అది పచ్చనిది (అందు పుట్టిన) మనువుగూడ చరిష్ణవుడు (అనువాడు) తరువాత బ్రహ్మ ఆరవ ముఖము నుండి 'ఓం' కారము పుట్టినది. అది కపిలవర్ణము కలది. దానినుండి వరిష్టుడు మహాతపస్వియు అయిన విజయుడు పుట్టెను. బ్రహ్మ ఏడవ ముఖమునుండి 'ఋ' కార స్వరము, వైవస్వత మనువును పుట్టిరి. అచట రంగు నలుపునపడినది. బ్రహ్మ ఎనిమిదవ ముఖమునుండి 'ఋ' కారము పుట్టినది. రంగు నలుపు, శ్యామాక్షరముతో సమానమైన వర్ణము గలవాడు అగుటచే దానినుండి సావర్ణి అను మనువు పుట్టినట్లు చెప్పబడినది. బ్రహ్మ తొమ్మిదవ ముఖమునుండి తొమ్మిదవ వర్ణమైన 'ౡ ' కారము పుట్టినది. దాని రంగు ధూమ్ర వర్ణము. అందుపుట్టిన మనువుగూడ ధూమ్రుడు అనబడెను. బ్రహ్మ పదియవ ముఖమునుండి ప్రభువైన 'ఇ'కారము పుట్టినది. దానినుండి సముడైన సవర్ణుడైన సావర్ణికుడు అను మనువు ప్రకాశించెను. బ్రహ్మ పదునొకండవ ముఖము నుండి 'ఏ' కారము. దాని రంగు పిశంగవర్ణము, మనువు పిశంగుడు. బ్రహ్మ పన్నెండవ ముఖము నుండి'ఐ' కారము వెడలుటచేత అది పిశంగము అనగా భస్మముతో సమానమైన కాంతిగల పిశంగుడను వాడు మనువు (బట్టిరి). బ్రహ్మ పదమూడవ ముఖము నుండి 'ఓ' కారము అది పంచవర్ణ సమాయుక్తము (ఐదు రంగులు గలది) ఉత్తమము. తరువాత బ్రహ్మయొక్క పదునాలుగవ ముఖము నుండి 'ఔ' కారము బుట్టినది. దాని వర్ణము కర్బూర (చిత్ర) వర్ణము సావర్ణి

మనువు కల్పమును బట్టి ఈ వీరు మనువులు సర్పములు వాని రంగులును–అని స్వరము నుండియు వర్ణము నుండియు తత్త్వమును అనుసరించినవి అని తెలియవలెను. ఏ కారణమువలన పరస్పరము సవర్ణములైన వర్ణములు వరింపబడినవో ఆ కారణము వలననే సవర్ణమగుట వలన అన్వయము చెప్పబడినది. కల్పమున పుట్టినవి సవర్ణములును, సమానములును అయినందున ఈ లోకమున సర్వసంధులు సవర్ణములు అగును. న్యాయ మును బట్టియు అర్థమును బట్టియు, వర్ణములు శిలల సమూహమువలె (యథాశైలం) ఏకము అగును. అందువలననే అభ్యాసమునుబట్టి సంధులు (వర్ణసంధులు) గూడ స్వరములే అని తెలియవలెను. (26)

మహాదేవ తనువర్ణనం

అంతట ఋషులు :

"ఈ కల్పమున సాధకులైన మునులతో బాటు మహాత్ముడు మహాదేవుడు అయిన రుద్రుని యొక్క ప్రాదుర్భావము నీచే చెప్పబడినది". అని పలుకగా!

సూతుడు :

మొదటి సృష్టియొక్క ఉత్పత్తి నాచేత సంగ్రహముగా చెప్పబడినది. దీని యొక్క నామములను వాని శరీరములతోబాటు విస్తరముగా చెప్పెదను వినుడు అని పల్కెను. ఎనిమిదవ కల్పము గడచిపోగా తొమ్మిదవ కల్పమున)మహాదేవుడు తన భార్యల యందు అనేకులగు పుత్రులను పుట్టించెను. కల్పాదిలో తనతో సమానమైన పుత్రుని ధ్యానించుచున్న ప్రభువు శంకరుని తొడనుండి నీలలోహితుడైన (నలుపు ఎఱుపుగల) కుమారుడు పుట్టెను. మంచి స్వరము గలిగి తేజస్సుతో మండుచున్నట్లున్న ఆతనిని ధరించెను. అకస్మాత్తుగా ఏడ్చు చున్న కుమారుడైన నీలలోహితుని చూచి "బ్రహ్మకుమార ఏడ్చుచుంటివి ఏమి"? అని అనెను. అందుకు ఆ నీలలోహితుడు "ఓ బ్రహ్మా! నాకు మొదటి పేరు పెట్టుము అనెను. బ్రహ్మ "నీవు పేరుతో రుద్రుడవు" అనెను. ఆ కుమారుడు మరల ఏడ్చెను. ఏడ్చు చున్న అతనిని బ్రహ్మ ఎందులకు ఏడ్చుచుంటివి అనెను. కుమారుడు తనకు రెండవ పేరు చెప్పుమని బ్రహ్మను అడిగెను. "ఓ దేవా! నీ పేరు భవుడు అగును" అనెను. కుమా రుడు మరల ఏడ్చెను. బ్రహ్మ ఏల మరల ఏడ్చుచుంటివి అనెను. శివుడు నాకు నాల్గవ పేరు చెప్పుమనెను. బ్రహ్మ నీవు పశుపతివి అనెను. కుమారుడు మరల ఏడ్చెను. బ్రహ్మ ఏల ఏడ్చుచుంటివి అనెను. శివుడు నాకు ఐదవ పేరును చెప్పుమనెను. బ్రహ్మ నీ పేరు ఈశుడు అగును అనెను. కుమారుడు మరల ఏడ్చెను. బ్రహ్మ మరల ఏడ్చుచుంటివి ఏల

అనెను. కుమారుడు నాకు ఆఱవ పేరు చెప్పుమని, ఆ ప్రభువైన బ్రహ్మను అడిగెను. బ్రహ్మ నీపేరు భీముడు అగును అనెను. కుమారుడు మరల ఏడ్చెను. బ్రహ్మ ఏల మరల ఏడ్చుచుంటివనెను. కుమారుడు నాకు ఏడవ పేరును చెప్పుమనెను. బ్రహ్మ నీ పేరు ఉగ్రుడు అనెను. కుమారుడు మరల ఏడ్చెను. బ్రహ్మ ఏల మరల ఏడ్చుచుంటివి అనెను. కుమారుడు నాకు ఎనిమిదవ పేరును చెప్పుమనెను. బ్రహ్మ నీవు పేరుతో మహాదేవుడవు అగుదువు అనెను.

బ్రహ్మ నుండి శివుడు ఈ నామములను పొంది, ఈ నామములకు సరియైన భౌతిక శరీరముల (భూతములను)ను చెప్పుమని బ్రహ్మను అడిగెను. దానివలన బ్రహ్మచే పై నామములకు శరీరములు సృష్టింపబడినవి. సూర్యుడు, భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, దీక్షితుడైన బ్రాహ్మణుడు, చంద్రుడు–ఇవి బ్రహ్మ ధాతువులు. వానిలో రుద్రుడు పూజ్యుడును, వంద్యుడును అగును. కావున రుద్రుడు వారిని బాధించడు అని చెప్పి.

తరువాత బ్రహ్మ రుద్రునితో మరల ఇట్లనెను. నీ రెండవ పేరు భవుడు అంటిని. దీనికి జలరూపమైన శరీరము కలుగగలదు అని అనగానే ఆ రుద్రుని యొక్క స్థిరమైన, రసాత్మకమైన శరీరము ఆ జలమున ప్రవేశించెను. కావున జలములు భవుడు అని పిలువబడెను. జలములవలన పుట్టి భూతములు (శరీరములు) జలములనే భవించు భవన భావనముల వలన (ఉండుట భావించుట వలన) భూతముల సంభవము చెప్ప బడినది. శివుడు జలములలోనుండి జలములను భావించుటచే జలములు శివుడయ్యెను. కావున జలములలో మూత్ర మల విసర్జనములు విడువరాదు. నగ్నముగా స్నానము చేయరాదు. ఉమ్మివేయరాదు. స్త్రీ సంభోగము జేయరాదు. తలస్నానము జేయరాదు. సంతుష్టుడై కాని, మోయుచున్నవాడై కాని, సరిగా ఉండని వాడై కాని నీళ్లను వదలరాదు. పవిత్ర, అపవిత్ర శరీరములగుట వలన జలములు దుష్టములు కావు. రంగుమారినవి, వాసన కలవియు, అల్పములైనవియు అయిన జలములను వదలి వేయవలెను. నీటి పుట్టుకకు కారణము అగు సముద్రమును చేరి పవిత్రములును అమృతములును అగును. కావున జలములను అడ్డుకొనరాదు. అవి సముద్రమును చేరగోరును. ఈ విధముగా నీటి విషయమై ఎవడు ప్రవర్తించునో వానిని శివదేవుడు హింసించడు.

తరువాత బ్రహ్మ శివునితో అనెను. ఓ శివదేవ నీ మూడవ పేరుగా ఇడబడిన శర్వ అను పేరునకు మూడవ శరీరముగా ఈ భూమి అగును అని అనగానే శివుని యొక్క స్థిరమైన (శరీర) భాగమైన ఎముక భూమిలో ప్రవేశించెను. కావున భూమి శర్వుడు అన

బడును. కావున విద్వాంసుడు (తెలిసినవాడు) నీడలోగాని, మెట్ట పైనగాని, తన నీడయందు గాని మలమూత్రములు వదలరాదు. తలపై వస్త్రము కప్పుకొని భూమిని గడ్డితో గప్పి మలమూత్రములు చేయవలెను. ఈ విధముగా నడుచుకొన్న వానిని శర్వుడు హింసించడు.

తరువాత బ్రహ్మ శివదేవునితో ఇట్లనెను. నేను నీ నాల్గవ పేరు ఈశానుడు అని అంటిని. ఆ నామమునకు నాల్గవ శరీరము వాయువగును అని అనగానే శివుని శరీరమున ఐదు విధములుగా ప్రాణమను పేరనున్న (ప్రాణ) వాయువు, ఆ వాయువులో చేరెను. అపుడు వాయువు ఈశానుడు అనబడెను. కావున విశాలముగా వ్యాపించిన మీ వాయువును ఈశ్వరునిగా జెప్పవలెను. ఈ విధముగా ఉన్న వానిని ఈశానుడు హింసింపడు.

తరువాత మరల బ్రహ్మ ధూమ్రలోహితుడగు శివునితో అనెను. నేను నీ ఐదవ పేరు పశుపతి అని అంటిని ఆ ఐదవ పేరునకు ఐదవ శరీరము అగ్ని అగును అని అన గనే శివుని శరీరమున నుండి ఆతని చిహ్నముగా ఉన్న తేజస్సు అగ్నిలో ప్రవేశించెను. కావున అగ్ని పశుపతియై పతియయ్యెను. చంద్రుడు సోముడు అనబడెను. ఆతని ఆత్మ ఓషధీ గుణము ఈ విధముగా తెలిసియే విద్వాంసుడు ప్రతిపర్వమున (పూర్ణిమ యందు) ఉండునో ఆతనిని మహాదేవుడు చంపడు. ఈ విధముగ ఆ ప్రభువునకు (శివుని) నమస్కరింపవలెను. ప్రజలను సూర్యుడు పగలు రక్షించును. రాత్రియందు చంద్రుడు రక్షించును. ఒక్క అమావాస్య రాత్రియందు చంద్రుడు ఎల్లప్పుడు సూర్యునితో కలిసి ఉండును. అక్కడ ఇదంతయు (శివ శరీరమంతయు) తన పేరులతో శరీరములతోను ప్రవేశించి ఆవరించి ఉండును. కావున ఈ ఒక్కడుగా (ఆకాశమున) చరించుచున్న సూర్యుడే చంద్రుడు అనబడును. సూర్యుని కాంతితో ప్రజలు చూడ గలుగుచున్నారు. అది శుక్ల (తెల్లని) స్వరూపమున ఉన్న రుద్రుడు. అతడు కిరణములచే నీటిని త్రాగును. అన్నపానాత్మకములను తిని త్రాగుచున్నాడు. శివాత్మనుండి పుట్టిన శరీరములలోనే అభివృద్ధినొందును. స్థిరమైన చిత్తముతో సమస్త ప్రజలను ధరించుచున్నది శివుని యొక్క శార్వీ అను వర్ధితమైన శరీరము, ప్రజలను ధరించును.

ప్రాణ వ్యాపారములచేత ప్రాణుల శరీరములలో ఎంతవరకు వాయురూపమే ఉండునో, అది ఐశానియై ప్రాణితోపాటు ప్రాణముల రూపమును పొవును. జఠరములందు (జీర్ణకోశములందు) త్రాగినవానిని, తిన్నవానిని పక్వము (జీర్ణము) చేయునది ఆ శివుని యొక్క పాశుపతి అను పాచిక శక్తి.దేహములలో వాయు సంచారము కొఱకై అంతర్గతములై ఉన్న రంధ్రములు శివుని భీమ అను శరీరము అనబడును. బ్రహ్మావాదులై, వైతాన

(వ్రత) దీక్షితులయొక్క స్థితి శివుని ఉగ్రరూపమైన శరీరము అనబడును. కావున దీక్షితుడు ఉగ్రుడు అనబడును. ఇది ప్రజలలో సమముగా నున్న శివుని సంకల్పము ఆ శివుని మానసీ తనువైన చంద్రుడు. అతడు ప్రాణులలో ఉండును. మరల మరల పుట్టుచున్నవాడై క్రొంగొత్త వాడగును. అతడు దేవతలతోను, పితృ దేవతలతోను కూడ కోరినట్లుగా స్వేచ్ఛగా తీసికొని పోబడును. మహాదేవుడు అమృతాత్ముడు. అట్టి ఈ శివుడు జలమయుడైన చంద్రుడు అనబడెను.

ఆ శివుని యొక్క మొదటి శరీరము రౌద్రియను పేర చెప్పబడినది. అట్టి రుద్రుని యొక్క భార్య సువర్చల ఆతనికి ఆమెకును పుట్టిన పుత్రుడు శనైశ్చరుడు. శివుని రెండవ శరీరము జలము అనబడినది. అట్టి శివ జలతనువునకు భార్య 'ఉష'. వారి పుత్రుడు ఉశనుడు (శుక్రుడు). శివుని మూడవ తనువు భూమి. అట్టి శివ భూతనువునకు భార్య 'వికేశి'. వారి పుత్రుడు 'అంగారకుడు' . శివుని నాల్గవది స్వర్గతమైన ఈశాన తనువునకు శివ అను పత్ని ద్వారా పుత్రుడు అయినవాడు మనోజవుడు. పశుపతికి అయిదవ తనువు అగ్నియని ద్విజులచే చెప్పబడును. ఆ(శివ) అగ్నికి భార్య స్వాహాదేవి. వారి పుత్రుడు స్కందుడు. శివుని ఆరవదియైన భీమఅను తనువు ఆకాశము. ఆ శివాకాశ తనువునకు దిక్కులు భార్యలు స్వర్గము పుత్రుడు. దీక్షిత బ్రాహ్మణులచే శివుని ఏడవ తనువు ఉగ్రయ. ఆ ఉగ్రతనువునకు భార్య దీక్ష 'భార్య వారిరువురి పుత్రుడు 'సంతాన'ము (కల్పవృక్షము). శివుని అష్టమతనువైన చంద్రునకు పత్ని రోహిణి. వారి పుత్రుడు బుధుడు అనబడెను.

అని శివుని యొక్క నామములతో తనువులు చెప్పబడినవి. ప్రతి నామ తనువులలో చక్కగా వందనము జేయతగినవి. నమస్కరింప తగినవి కూడ. శివునియొక్క తనువులతోను నామములతోబాటు శివ తనువులైన సూర్యునియందు, జలములందు, భూమియందు, వాయువునందు, అగ్నియందు, ఆకాశమునందు, దీక్షితునియందు, చంద్రుని యందును, భక్తివలన నరుడు ప్రజావంతుడై ఈశ్వరునితో సాయుజ్యమును పొందును. భీముడైన శివుని యొక్క ఈ రహస్యమైన యశము మీకు చెప్పబడినది. ద్విపదులైన నరులకు సుఖము గలుగుగాక. చతుష్పదులైన మృగములకును సుఖము కలుగుగాక. ఓ ప్రజలారా! దేవుడై మహాదేవుడైన శివునియొక్క (భృగువుయొక్క) నామములతోబాటు తనువులయొక్క మూలకారణము ఇది. మీకు జెప్పబడినది. వినుడు. (27)

ఋషివంశానుకీర్తనము

అటు పిమ్మట సూతుడు అనెను :

భృగువునకు ఖ్యాతి పుట్టెను. ఆ తరువాత సుఖ దుఃఖములకు ఈశ్వరులును, సమస్త

ప్రాణులకు శుభాశుభములను ఇచ్చువారును, మన్వంతర విచారిణులును దేవతలైన ధాత విధాత అనువారలు పుట్టిరి. వారిలో పెద్దది. అక్క అయినది. లోకభావినియైనది దేవియైన 'శ్రీ' అనునామె. ఆమె సుందరుడై దేవుడైన నారాయణుని పతిగా పొందెను. ఆ సాధ్వియైన లక్ష్మీదేవి, నారాయణుని పుత్రులుగా, బల-ఉత్సాహులు అను వారలను కనెను. పుణ్యకర్ములైన దేవతలకు విమానములు నడుపువారును, దివ్యులై చరించువారును ఆమెకు మానస పుత్రులు జనించిరి. విధాతకును ధాతకును ఆయతి నియతి అనువారలు ఇరువురు కన్యలు భార్యలైరి. వారి ఇరువురికి దృఢవ్రతులగు పుత్రులిరువురు, పాండువు మృకండుడు అనువారు కలిగిరి. వారు బ్రహ్మకు (జ్ఞానమునకు) నిధి అయినవారు సనాతనులు. మృకండునకు మనస్వినియందు మార్కండేయుడు పుట్టెను. మార్కండేయునకు మూర్ధన్య అను భార్య యందు వేదశిరుడనువాడు జన్మించెను. వేద శిరునకు పేవరి అను భార్య యందు గోత్ర కర్తలైన పుత్రులు పుట్టిరి. వీరందరు వేదపారగులైన ఋషులై మార్కండేయులె అని ప్రసిద్ధి జెందిరి.

పాండువునకు పుండరీకయందు కుమారుడుగా ద్యుతిమంతుడు సృజవానుడు అను ఇరువురు పుట్టిరి. వారిరువురికిని పుత్రులును మనుమలునుకలిగిరి. భార్గవులకు (భృగు సంతానములకు) పరస్పరముగా సంతానములు కలిగినవి. స్వాయంభువమన్వం తరము గడచిపోగా, మరీచి (ప్రజాపతికి) కలిగిన సంతానమును చెప్పుచున్నాను. వినుడు మరీచి భార్య సంభూతి పూర్ణమాసుడను కుమారుని కనెను. వారి కన్యలు కృష్టి, పుష్టి, త్విషా, అపచితి, శుభా అనువారు. పూర్ణమాసుడు సరస్వతి అను, తన భార్యయందు ఇరువురు పుత్రులను కనెను. వారు ధర్మిష్ఠుడైన విరజుడు, పర్వసుడు అనువారు. విరజునకు కుమారుడు విద్వాంసుడైన సుధాముడు అనువాడు ప్రసిద్ధి చెందెను. సుధామసుతుడైన వైరాజుడు తూరుపు దిక్కున (నెలకొనెను) ఆశ్రితుడు అయ్యెను. లోకపాలుడు, చక్కని ధర్మాత్ముడు, గౌరీపుత్రుడై, ప్రతాపవంతుడు అయిన పర్వసుడు సర్వగణములకు ప్రవిష్టుడైన (వారితత్త్వము తెలిసిన) మహాశయుడు. పర్వసుడు పర్వస అను ఆమెయందు ఇరువురు సుతులను కనెను. వారు శ్రీమంతుడైన యజ్ఞకాముడు కాశ్యపుడును వారిరువురికి పుట్టిన పుత్రులు గోత్రకర్తలు, ధర్మపరులుగా నిశ్చయింపబడినవారు. ఆంగిరసుని భార్య స్మృతి. ఆ ఇరువురు కుమారులను పుణ్యాత్ములు లోకప్రసిద్ధురాండ్రు అయిన నలుగురు కన్యకలను గూడ కనెను. వారు సినీవాలి, కుహు, రాకా, అనుమతి అనువారు, అట్లే వారు ఇరువురును భరతాగ్ని, కీర్తిమంతుడు-అను ఇరువురిని కనిరి.

అగ్ని పుత్రుడైన పర్జన్య ప్రభువు సంహూతి అను ఆమెను కనెను. బంగారు రోమములు గల పర్జన్యుడు మారీచియందు ఒకనిని పుట్టించెను. ఆతడు భూత ప్రళయము వరకుండు

లోకపాలుడుగా స్మరింపబడెను. కీర్తిమంతుని వల్ల ధేనుక అను ఆమె ఇరువురిని కనినది. వారు వరిష్ఠుడు ధృతిమంతుడు, వీరు ఆంగిరస వంశీయులలో శ్రేష్ఠులు. వారు ఇరువురికిని అనగా వరిష్ఠ ధృతిమంతులకు పుత్రులు, పౌత్రులును కలిగిరి. వారు వేలకొలదిగా మించిరి. అనసూయకూడ అత్రి పుత్రులనుగా పాపరహితులైన ఐదుగురిని కనెను.

అనసూయ శ్రుతియను కన్యను కూడ కనెను. ఆమె శంఖపదునకు తల్లి. పులిహ ప్రజాపతియైన కర్దముని యొక్క భార్య. సత్యనేత్రుడు, హవ్యుడు, ఆపోమూర్తి, శనీవరుడు, సోముడు అను ఐదుగురు. స్వాయంభువ మన్వంతరములో ఒక యామము గడచిపోగా, అనసూయ అత్రి మునులకు పుట్టి ఆత్రేయులుగా ప్రసిద్ధిజెందిరి. స్వాయంభువ మన్వంతర మున యామము గడవగా మహాత్ముడైన అత్రి అనుగ్రహమున పై అయిదుగురికి పుత్రులు, పౌత్రులును నూర్లకొలదియు, వేలకొలదియు జనించిరి.

పులస్త్య భార్యయైన ప్రీతిఅను ఆమె యందు దత్తాలి అనువాడు వారి కుమారుడుగా పుట్టెను. పూర్వజన్మలో ఆతడు స్వాయంభువ మన్వంతరమున అగస్త్యుడు అనబడెను. మధ్యముడు, దేవబాహువు, వినీతుడు–అను ఈ ముగ్గురు వారి పుత్రులు. వారి చిన్న చెల్లెలు సద్వతి అను నామె ప్రసిద్ధి చెందినది. పర్జన్య జననియైన శుభ్ర అనునది పౌలస్త్య ఋషికి పత్నియై, మొదట శుభ అనబడినది. ప్రీతికి పుత్రుడై ధీమంతుడైన దత్తాలియొక్క భార్య సుజంఘుడు మొదలగు అనేక పుత్రులనుకనెను. వారందరు స్వాయంభువ మన్వం తమున పౌలస్త్యులు పిలువబడి ప్రసిద్ధి చెందిరి.

పులహ ప్రజాపతియొక్క పుత్రులను క్షమ. అను ఆమె కనెను. వారు అగ్ని తేజస్కులు. వారి కీర్తి సుప్రతిష్ఠితము. కర్దముడు, అంబరీషుడు, సహిష్టుడు అనువారు ఆ ముప్పరు. ఋషియైన ధనకపీవానుడు శుభయైన కన్యపీఠి అను ఆమెయు వారికి జనించిరి. కర్దము నకు శ్రుతి అనునది భార్య ఆత్రేయి అను నామె సుతులను గనెను. పుత్రుడు శంఖపదుడు అనువాడు. కన్యకామ్య అను ఆమె అతడి భార్య. ఆ శంఖపదుడే శ్రీమంతుడై లోకపాలుడై ప్రజాపతి అయ్యెను. దక్షిణ దిక్కునందు ఆసక్తుడై ప్రియవ్రతునకు కామ్యను ఇచ్చెను. ఆ కామ్య ప్రియవ్రతునివల్ల స్వయంభువు అయిన బ్రహ్మతో సమానులగు పదుగురు పుత్రులను, ఇద్దరు కన్యలను కనెను. వారిచేత క్షత్రియజాతి చక్కగా వ్యాపించెను.

పుత్రుడైన ధనకపీవానుడు సహిష్ణువని పేరుపొందెను. యశోధారియైన ఆతడు సుమధ్యముడైన కామదేవుని కనెను. ఋతువునకు, క్రతుసముడైన పుత్రుడు కలిగెను. ఆ సంతతి శుభమైనది. వీరందరికి భార్యగాని పుత్రుడుగాని లేరు. వారందరు

ఊర్ధ్వరేతస్కులు. ఈ అఋవది వేల మంది వాలఖిల్యులని ప్రసిద్ధి చెందిరి. వీరు సూర్యుని చుట్టుకొని అరుణుని ముందుగా బోవుచుందురు. మహాభూత ప్రళయము వరకు వీరు సూర్యుని తోడుగా నడుచువారే.

పుణ్యాత్మ, సుమతి అను చిన్న చెల్లెండ్రు పూర్ణ మాససుతుడైన పర్వసునకు కోడండ్రు. వసిష్ఠునకు ఊర్జఅను ఆమెయందు ఏడుగురు పుట్టిరి. వారికి పెద్దచెల్లెలు సుమధ్యమయైన పుండరీక అనునామె. ఆమె పాండువైన ద్యుతిమంతుని యొక్క ప్రియ పట్టపురాణి, ఆమె యందు వసిష్ఠ వంశీకులైన ప్రసిద్ధి చెందిన ఏడుగురు జనించిరి. రజసుడు. పుత్రుడు, అర్థబాహువు, సవనుడు, అదనుడు, సుతపుడు, శుక్లుడు–అను వీరందరు సప్తర్షులు అని పిలువబడిరి. రజసుని నుండి మార్కండేయుడు యశస్విని కనెను. ప్రతీచి దిక్కునందు క్షత్రియుడైన ప్రజాపతియైన కేతుమంతునికనెను. ఆవాసిష్ఠులైన మహాత్ముల యొక్క పేర్లతోబాటు గోత్రములు స్వాయంభువ మన్వంతరమున గడిచిపోయినవి. అగ్నియొక్క సంతతిని వినుడు అనిచెప్పి ఈ ఋషిసృష్టి సానుబంధముగా చెప్పబడినది. ఆనుపూర్వితో విస్తరముగా అగ్ని సంతతిని వినుడు. అనెను. (28)

అగ్నివంశవర్ణనం

అభిమానుడైన అగ్ని స్వాయంభువమన్వంతరమున బ్రహ్మయొక్క మానస పుత్రుడు. ఆతని నుండియే స్వాహా జన్మించినది. పావకుడు, పవమానుడు (ఈతడే పావమానుడు) శౌరుడు అనబడు శుచియు ఈ ముగ్గురు స్వాహా పుత్రులు. నిర్మథనమున వచ్చిన పవమానుడు శుచియైనవాడు. అతడు శౌరుడు అనబడును. పావకములు వైద్యుతములు వానికి స్థానములు. పవమానాత్మజుడు కవ్యవాహనుడనబడును. పావకుని నుండి వచ్చిన వాడు సహరక్షుడు. శుచియొక్క సుతుడు హవ్యవాహుడు. అగ్ని దేవతలకు హవ్యమును మోయు వాడు. పితరులకు కవ్యమును మోయువాడు. అసురులకు హుతమును మోయువాడు సహరక్షకుడు. ముప్వురికి మూడగ్నులు.

వీరియొక్క పుత్ర పౌత్రులు ఇరువది నాలుగు మంది మరియు తొమ్మిది మంది. వేరువేరుగా వారి నామములను చెప్పెదను. విద్యుత్సంబంధమైన లౌకికాగ్నియైతే బ్రహ్మ యొక్క మొదటి పుత్రుడు అనబడెను. అతని పుత్రుడు బ్రహ్మౌదనాగ్ని. అతడు భరతుడని ప్రసిద్ధి చెందెను. అతని అగ్నిముఖము నీటియొక్క రసరూపమైన శుక్ర సంబంధమైన తేజము పూర్వము, జల సముద్రమునందు అమృతము అథర్వునిచే మథింపబడినది. ఆ అథర్వుడు లౌకికాగ్ని దధ్యంచుడు. ఆథర్వుణుని కుమారుడు.

ఇక నిర్మంథుడని శుక్రులచే తలపబడిన పవమానుడు అను అగ్నిని గార్హపత్యాగ్నిగా తెలియవలెను. ఆ అగ్నినుండి ఇద్దరు పుత్రులు మొదటి వాడు హవ్యవాహనుడు అనబడు ఆహవనీయాగ్ని. ఈతడు ప్రశంసింప తగినవాడు. రెండవవాడు యజ్ఞములో ప్రణీయ మానుడు (కుండమునకు దీసికొనిపోబడువాడు) అగు శుక్రుడు అను అగ్ని అట్లే శంస్యుడు అను అగ్నికి సభ్యాగ్ని, ఆవసధ్యాగ్ని అను ఇరువురు పుత్రులు. బ్రాహ్మణులచే ఆహవనీ యాగ్నియని అభిమానింపబడిన శంస్యుడుఅను హవ్యవాహనాగ్ని పదునాఱు నదులను కామించెను.

ఆనదులు ఇవి : కావేరి, కృష్ణవేణి, నర్మద, యమున, గోదావరి, వితస్త, చంద్రభాగ, ఇరావతి, విపాశ, కౌశికి, శతద్రు, సరయు, సీత, సరస్వతి, హ్రాదిని, పావని ఈ నదులను శంస్యుడను ఆహవనీయాగ్ని కామించెను. ఆ అగ్ని ఈ పదునారు నదుల ధిష్ణీల యందు (ధిష్ణీలు, నదులలోనే ఒక విశిష్టమైన గర్భస్థానము) వేఱువేఱుగా తనను విభజించి ఉంచెను. తరువాత ఆ ధిష్ణీలలో అగ్ని జనించెను. ఆ ధిష్ణీలు, వ్యభిచారిణులు, వారిలో పుట్టినవారు ధిష్ణులు (ధిష్ణయః) (ఆపేర వెలసిన అగ్నులు) దిష్ణీలలో పుట్టినందున ఆ అగ్నులు ధిష్ణులు అని చెప్పబడినవి. ఈ విధముగ ఈ నదీపుత్రులు ధిష్ణులలోనే పుట్టిరి. ఆ అగ్నులలో (హోమ కుండములలో) విహరణీయములు (వెడల్పుగా పరుచదగినవి)గా ఉంచదగినవి (ఒకచోట ఉంచదగినవియు) ఏవో, అవి ఏవని అనబడునో సంగ్రహముగా చెప్పెదను వినుడు.

ఋతువు ప్రవాహణము అగ్నీధ్రము తక్కిన ధిష్ణీలు ధ్రిష్ణి నామకములు ఈ అగ్నులు సుత్య సంబంధమైన దినమున సవన క్రమమును అనుసరించి వాని స్థానములలో విధింపబడును. ఇక చూపరానివియు, చెప్పరానివియు అయిన అగ్నుల క్రమమును వినుడు. సమ్రాట్ అను అగ్ని మొదటిది. ఉత్తరవేదికి సంబంధించిన కృశానువు అను అగ్ని రెండవది-సమ్రాడగ్నిని ఎనమండుగురు బ్రాహ్మణులు సమీపమున ఉండి ఉపాసింతురు. దాని క్రింద పర్షత్ అను వేరొక రెండవ అగ్ని ఇచ్చట కన్పడును. దానిని 'నభస్' అని అందురు. అది నాలుగుగ భావింపబడును. వానిలో బ్రహ్మజ్యోతి వసువు అనునది. బ్రహ్మస్థానమున ఉండునని చెప్పబడును. హవ్యనూ అనునది మొదట సృష్టింపబడినది. అది యాగమున భావింపబడును. తరువాత విశ్వము యొక్క అగ్ని సముద్రము. అది బ్రహ్మ స్థానమున ఉండును. ఋతుధామము అన్నది జ్యోతిర్వంతమైన అగ్ని. అది యౌదుంబరియందు (మేడియందు లేక రాగియందు) ఉండును. బ్రహ్మజ్యోతి యైనది వసువుఅను అగ్ని అది బ్రహ్మస్థానమున ఉండునని చెప్పబడును.

అజైకపాద్ అను అగ్ని ఉపాసింపతగినది. అది శాలాముఖములో ఉండును. ఉద్దేశింప తగనిదైనను అహిర్బుధ్న్య మనబడును. ఆ అగ్ని గృహపతి అని పిలువబడినది. ఈ అన్ని అగ్నులును శంస్యము యొక్క సుతులే. అవి బ్రాహ్మణులచే ఉపాసింప తగినవి. ఆ తరు వాత పరువదగిన అగ్నులను, వాని ఎనమండుగురు సుతులను చెప్పుదును. క్రతు ప్రవా హణము, ఆగ్నీధ్రము అచ్చటనుండు తక్కిన ధిష్ణులును, అగ్నులును సుత్యాదినపు అగ్నిలో సవనక్రమమున వానివాని స్థానములలో పరువబడును.

ఆ తరువాత హవ్యవాహనుడనబడు అగ్ని పౌత్రేయాగ్ని ప్రచేతసుడనబడు అగ్ని శాస్త్ర్యగ్ని మొదటిది. సత్యమనుఅగ్ని రెండవది. అట్లే విశ్వదేవమను అగ్ని బ్రహ్మ స్థానమున ఉండును. అవక్షురచ్చావకము అను అగ్ని భూస్థానమున ఉండునని భావింపబడును. సవీర్యమైన ఉశీరాగ్ని నైష్ఠీయముగా సంభావింపబడును. ఎనిమిదవదియైన వ్యరత్తి అను అగ్ని మార్జారీయమనబడును. సౌమ్యము (సోమ సంబంధమైన) దానిచేత గాని వేరొకదాని చేతగాని పరువతగిన అగ్నులు. రెండింటిలోని పావకుడు అను అగ్ని నీటికి గర్భము. ఆ అగ్నిని ఆవబృథమని తెలియవలెను. అది చక్కగా చేరి నీటిలో హోమము జేయబడును. ఆతని సుతుడు హచ్ఛయుడను అగ్ని (హృదయమున పండుకొను వాడైన అగ్ని) అతడు మానవుల జఠరములో ఉన్నాడు. జఠరాగ్నికి మన్యుమంతుడను విద్వాంసుడైన అగ్ని సుతుడు. అన్యోన్యముగా పైకి విజృంభించిన ఆ అగ్ని భూతములకు (ప్రాణులకు) మహా ప్రభువు, ఆ మన్యుమంతు డను అగ్నికి పుత్రుడు అతడు భయంకరుడైన సంవర్తకుడన బడినాడు. అతడు నీటిని త్రాగుచు, ఆడగుఱ్ఱపు ముఖము గలవాడై సముద్రమున నివ సించును. సముద్రవాసియైన సంవర్తకాగ్నియొక్క పుత్రుడు సహరక్షుడనబడును. సహరక్షాగ్ని సుతుడు కాముడు అనుఅగ్ని. అతడు మనుష్యుల ఇండ్లను దహించును. కాముడను అగ్నికి సుతుడు క్రవ్యాదుడు అను అగ్ని. ఈ క్రవ్యాదుడను అగ్ని మరణించిన పురుసులను తినును. ఈ అగ్నులు అన్నియు ఈ విధముగా పాతకము అను అగ్నియొక్క పుత్రులుగా జెప్పబడిరి.

ఆ తరువాత శౌర్యాగ్నినుండి అసురులచే ఆవరింపబడిన గంధర్వులచే అరణి యందు మథింపబడిన అగ్ని. అగ్నిఅని చక్కగా ప్రజ్వలింపజేయబడును. పశుయాగమున తీసికొనిరాబడు అగ్ని, భగవంతుడైన ఆయువు అను అగ్ని. ఆయువుఅను అగ్నియొక్క పుత్రుడు మహిమాన్ అనువాడు. ఆయన పేరుతో 'శావాన్' అను సుతుడు కలడు. పాక యజ్ఞముల యందు అభిమానియైన అగ్ని సవనుడు. సవనుడు అను అగ్నియొక్క పుత్రుడు మహాయశుడైన అద్భుతుడు. అద్భుతాగ్ని యొక్క పుత్రుడు వివిచి. ఆతడు గొప్పవాడు. అతడు ప్రాయశ్చిత్తమున (అగ్ని యందు) ఎల్లప్పుడు భీముల యొక్క హోమము చేయబడిన

హవిస్సును భుజించును. వివిచి అను అగ్నికి సుతుడు అర్కుడు అను అగ్ని. అర్కాగ్నికి సుతులు వీరు–అనీకవానుడు, వాసృజవానుడు, రక్షోహుడు, పితృకృత్. అట్లే సురభి, వసురత్నాదులలో ప్రవేశించియున్న రుక్మవానుడు అనువారు, శుచిఅను అగ్నికి ఇది సంతానము. అగ్నులైతే పదునాలుగు. ఇవి అన్నియు యజ్ఞములలో తీసికొనిరాబడు అగ్నులుగా చెప్పబడినవి.

ఆది సృష్టిలో యామములతో (జాములతో) బాటు సురోత్తములచే గడచిన అగ్నులు స్వాయంభువమన్వంతరమున ముందు అవి అభిమానులు అను అగ్నులు. ఇవి : ఇచట చేతనాచేతనులలో విహరణీయములై పరువదగినవైన అగ్నులు. లోకమున ఆ అగ్నులు ముందు స్థానాభిమానులుగా ఉండినవి. మనువుయొక్క ప్రథమ మన్వంతరమైన పూర్వ మన్వంతరము పుణ్యులై మహాత్ములైన దేవతలతోబాటు శుక్లములైన జాములతో సుతులతో గడచిపోగా, కామ్యములు, నైమిత్తికములు, అజస్రములు (మాటిమాటికి చేయబడునవి) అయిన కర్మలందు (యజ్ఞములందు) ఇవి ఉండినవి. ఇవి నాచే చెప్పబడిన స్థానములు కలవియును అగును. భూతభవిష్యత్కాలము లందలి అన్ని మన్వంతరములలో గూడ అగ్నుల లక్షణము. వానిచేతనే (పై అగ్నులచేతనే) ప్రకటముగా చక్కగా చెప్పబడినది. ఈ అగ్నులన్నియు తపస్వినులు. అట్లే ఇవి అన్నియు అవబృథములు, ఇవి అన్నియు ప్రజాపతులు, జ్యోతిష్మంతములు కూడా –స్వారోచిషము మొదలగు ఏడు మన్వం తరములలో సావర్ణ్యములు తెలియదగినవి. సమస్త మన్వంతరములలోను అచట ఉండు దేవతలతో బాటు ఈ అగ్నులు నానారూపములైన ప్రయోజనములతో ఉండును. అనాగతు లైన దేవతలతోబాటు అనాగతాగ్నులు ఉండును. అని ఈ అగ్నుల విషయము (యజ్ఞ కుండమునకు తీకొనివచ్చుట) ఉన్నది ఉన్నట్లుగా నాచే చెప్పబడినది. తరువాత విస్తరము గను ఆనుపూర్వితోను పితరులకు సంబంధించినది చెప్పబడును. (29)

దక్షశాపవర్ణనము

సూతుడు అనెను :

పూర్వపుదైన స్వాయంభువ మన్వంతరమున పుత్రులను సృజించు బ్రహ్మ నుండి ఆ జలములు పుట్టినవి. మనుష్యులు, అసురులు, దేవతలు కూడ పుట్టిరి. ఈ విధముగ తండ్రివలె భావింపబడుచున్న ఈ బ్రహ్మకే పితరులు జనించిరి. వారియొక్క స్వభావము ఇంతకు పూర్వము చెప్పబడినది. దాని విస్తరము కూడా చెప్పబడినది. ఇప్పుడు విస్తరముగా అది తిరిగి చెప్పబడును. దేవాసుర మనుష్యులను చూచి దేవుడు (బ్రహ్మ) పలికెను.

తండ్రివలె భావింపబడుచున్న ఆతనికి (బ్రహ్మకు) ఉపలక్షితులైన మధువు (వసంతుడు) మొదలగు ఆఱు (వసంత, గ్రీష్మ, వర్షా,శరత్, హేమంత, శిశిరములు) ఋతువులు పుట్టినవి. ఆ ఋతువులను పితరులుగా చెప్పుదురు. ఋతవః, పితరో దేవాః, ఋతువులు పితృ దేవ తలు అను అర్థముగల ఇది వేదనిబద్ధమైన శ్రుతి వాక్యము. గడచినట్టియు, రానున్నట్టియు, అన్ని మన్వంతరములలోని ఈ స్వాయంభువ మన్వంతరమున వీరందరు ముందు పుట్టిరి.

వారే (ఋతువులైన పితరులు) అగ్నిష్వాత్తులు అనియు, బర్హిషదులనియు వారికి పేర్లు. అగ్నిష్వాత్తులు అనబడువారు అనాహితాగ్నులైన పితరులు. వారిలో యజ్వానులు సోమపీథులైన పితరులు. బర్హిషదులు అనబడువారు అగ్నిహోత్రులైన పితృదేవతలని నిశ్చ యమైన మతము.

చైత్రవైశాఖ మాసములు (వసంత) రసరూపములుగా తెలియవలెను. జ్యేష్ఠాషాఢ మాసములు (గ్రీష్మ) అగ్ని రూపములు. శ్రావణ, భాద్రపద మాసములు రెండవ వర్ష జీవ రూపములు అనబడినవి. ఆశ్వయుజ, కార్తీక మాసములు శరత్ సుధా (అమృతము) వంతములుగా చెప్పబడినవి. మార్గశీర్ష పుష్య మాసములు హేమంత మన్యు (కోపము) మంతములుగా జెప్పబడినవి. మాఘ ఫాల్గుణ మాసములు శిశిర ఋతు సంబంధములై ఘోరములైనవి. పైన చెప్పిన రెండేసి మాసములతో కూడిన ఆరు ఋతువులు, కాలము యొక్క దశలు. వీనిని ఋతువులు అందురు. ఇవి చేతనములును, అచేతనములును కూడా. ఋతువులు బ్రహ్మయొక్క పుత్రులు. అవి నెలల యొక్కయు నెలలోని సగము భాగముల యొక్కయు స్థానములందు అభిమానముగలవి. ఆ స్థానముగూడ ఋతువులు, ఋతుసంబద్ధములును. స్థానములయొక్క వ్యతిరేక సంబంధముచే వానిని స్థానాభిమాను లుగా తెలుసుకొనవలెను. పగళ్ళు, రాత్రులు, నెలలు, ఋతువులు, అయనములు, సంవత్స రములు కాలావస్థాభిమానియొక్క స్థానములు. నిమేషములు (రెప్పపాటు కాలములు), కలలు (కల=540 రెప్పపాట్ల కాలము) కాష్ఠములు (కాష్ఠము-18 రెప్పపాట్ల కాలము), ముహూర్తములు (ముహూర్తము = రెండు గడియలు అనగా 48 నిమిషముల కాలము), పగళ్లు, రాత్రుళ్లు వీనియందు అభిమానులై కాలావస్థ (దశ) యందు అభిమానులై కాలావస్థల యందుండువారు అనగా దేవతలు తన్మయులై ఉండుటచేత తదాత్మలయిన వారిని గురించి చెప్పబోవుచున్నాను వినుడు.

పర్వణియొక్క తిథులు, సంధ్యలు, పక్షములు, నెలలోని సగము భాగములు. రెండు సగము నెలలు నెల. రెండు నెలలు ఋతువనబడును. మూడు ఋతువులు అయనము ఆయనములు రెండు. దక్షిణాయనము ఉత్తరాయణము. సంవత్సరము సుమేకుడు. ఇవి

స్థానులయొక్క స్థానాభిమానులగు దేవతల యొక్క స్థానములు. ఋతువులను సుమేక పుత్రులను ఎనిమిది విధములు. ఆఱుగురు ఋతు పుత్రులు (వసంత గ్రీష్మ వర్షా, శరత్, హేమంత, శిశిరములు). ఋతుసుతులు ఐదుగురు. ఋతు సంతానములు ఆర్తవ లక్షణము గలవారు. కారణము, స్థాణువులు (వృక్షములు) జంగమములు (పశుపక్ష్యాదులు) ఆర్త వేయువులు (వృక్షములు) జంగమములు (పశు పక్ష్యాదులు) ఆర్తవేయములుగనే (ఋతు సంబంధములు గలవిగనే) పుట్టుచున్నవి. (కావున) పితరులు ఆర్తవులు (ఋతు సంబం ధము గలవారు) ఇక పితామహులు (తండ్రి తండ్రి) ఋతురూపులే. సుమేకుని నుండి ప్రజాతులు పుట్టుచున్నారు, చచ్చుచున్నారు. కావున సంతానములకు సుమేకుడు ప్రపితా మహుడు (తాతకు, తండ్రి) స్థానములయందు వీరు స్థానికులై (స్థానముగలవారై) స్థానా త్ములుగా చెప్పబడినారు. ఆ స్థానము పేరుగా గలవారై తన్మయులగుట వలన తదాత్ములుగా తలపబడిరి. ప్రజాపతిఅని తలపబడినవాడే సంవత్సరుడుగా సమ్మతింపబడిన వాడు. సంవత్స రుడే అగ్నియని తలపబడినాడు. ద్విజులచే అతడు ఋతమనబడినాడు. ఋతువులు, ఋతమునుండి పుట్టినందున ఋతువులనుండి మాసములు ఆ ఋతువు లును, వానికి పుట్టినవని తెలియవలెను. ఐదుగురు ఆర్తవులైన (ఋతు సంబంధముగల) సుతులును, రెండు పాదములుగల మనుష్యాదులకు, నాలుగు పాదములుగల గవాదులకును, అనగా ఆవులు మొదలగు జంతువులకు, పక్షులకును, ప్రాకునట్టి పాములకును, ఐదు స్థావరము లకును కాలమును అనుసరించి వచ్చు ఆర్తవము (ఋతు రసము) పుష్పముగా తలప బడినది. ఋతుత్వము, ఆర్తవత్వము, పితృత్వము అనియు చెప్పబడినది. ఋతువులు ఆర్తవులు అయిన వీరందరు పితరులని తెలియవలెను. తరువాత వారినుండి సర్వభూత ములు ఋతుకాలము వలన పుట్టిరి. కావున ఈ పితరులుగూడ ఆర్తవములని మేము వింటిమి. అన్ని మన్వంతరములలోను, కాలాభి మానులు (దేవతలు) ఉన్నారు. స్థానాభి మానులైన వీరు అతిసంయమముతో ఉన్నారు.

అగ్నిష్వాత్తులు బర్హిషదులు అని పితరులు రెండు విధములని చెప్పబడిరి. ఆ పితరుల నుండి లోకప్రసిద్ధులైన ఇరువురు కన్యలు జనించిరి. వారు మేనా, ధారిణీ-అనువారు. వారిచేత ఈ విశ్వము ధరింపబడినది. శుభస్వరూపులైన తమ కన్యలను ఆ పితరులు వివాహ ధర్మార్థముగా ఇచ్చిరి. వారు ఇరువురు బ్రహ్మవాదినులు (బ్రహ్మను తెలిసి చెప్పు వారు) యోగినులుకూడా.

అగ్నిష్వాత్తులు అనబడు వారికి 'మేన' మానసీకన్య అనియు, బర్హిషదులకు 'ధారిణి' మానసీకన్య. శుభస్వరూపమైన ధారిణిని మేరువునకు భార్యగా ఇచ్చిరి. ధారిణిని ఇచ్చిన

వారు సోమపీథులైన బర్హిషదులును పితరులుగా తలపబడిరి. ఇక అగ్నిష్వాత్తులు మేనను హిమవంతునకు భార్యగా ఇచ్చిరి. వారికి అనగా ధారిణీ మేనలకు పుట్టినవారు దౌహిత్రులు. ఆ దౌహిత్రులను చెప్పెద వినుడు. హిమవంతుని భార్య మేన మైనాకుని కనెను. నదీ శ్రేష్ఠమైన గంగ లవణసముద్రునకు భార్య. మైనాకునకు తమ్ముడు క్రౌంచుడు. ఆతడే క్రౌంచద్వీపము అనబడెను. మేరువుయొక్క భార్యయైన ధారిణి దివ్యౌషధులతో కూడిన మందరుడు అను పర్వతమును పుత్రుని గాను ప్రసిద్ధులైన మువ్వురు కన్యలను కనెను. వారు వేల, నియతి, ఆయతి–అనువారు. ఆయతి ధాతయొక్క భార్య. నియతి విధాతయొక్క భార్య. పూర్వము స్వాయంభువ మన్వంతరమున, వారియొక్క సంతానముగూడ చెప్పబడినది. సాగరునివల్ల 'వేల' ఒక అనిందితయైన కన్యను కనెను.

సావర్ణిచేత సాముద్రి కలిగినది. సాముద్రి ప్రాచీనబర్హిషుని భార్య. తరువాత సవర్ణయైన సాముద్రి ప్రాచీనబర్హిషునివల్ల పదుగురిని కనినది. వారందరు ప్రచేతసులను పేరుగలవారు. ధనుర్వేదమును సొంతముగా తెలిసినవారు. వారిలో ప్రభువై, స్వయంభువు పుత్రుడైన దక్షుడు చాక్షుష మన్వంతరమున త్ర్యంబకుని (శివుని) అభిశాపముచే పుత్రుడుగా పుట్టెను.

ఇది అంతయు విని, తరువాత శాంశపాయనుడు ఈ విధముగ సూతుని ప్రశ్నించెను. పూర్వము చాక్షుషమను వంశమున శివుని అభిశాపమువల్ల దక్షుడు ఎట్లు పుట్టెను? మాకు చెప్పుము. అని ఋషులు అడిగిరి. అప్పుడు సూతుడు శాంశపాయనుని పిలిచి శివుని శాపకారణ రూపమయిన దక్షుని కథను చెప్పదొడగెను. దక్షునకు ఎనమండుగురు కూతురులు ఉండిరని ఇంతకుముందే చెప్పితిని. తండ్రి వారిని వారివారి ఇండ్లనుండి తీసికొని వచ్చి తన ఇంట పూజించెను. వారిలో పెద్దది సతి, శివునియొక్క భార్య. రుద్రుని ద్వేషించుచు తన కూతురైన ఆ సతిని దక్షుడు పిలువలేదు. అల్లుడైన మహేశ్వరుడు మామయైన ఆ దక్షునియెడ ఎప్పు డును నమస్కరించలేదు. స్వభావసిద్ధమైన తేజస్సులో ఉండెను. తరువాత 'సతి' తన చెల్లెండ్రం దరు తండ్రి ఇంటికి వచ్చిరని తెలిసి తండ్రి పిలువ కుండానే తన తండ్రి ఇంటికి వెళ్ళినది. తరువాత కోపముచే సహనము లేనిదై తండ్రితో ఇట్లనినది : ప్రభో! ఈ చిన్న వారందరిలో పెద్దదానినైన నన్ను అనిష్టురాలిగా అవమానించితివి. ఇక కూతురిపూజనే నిందితముగ చేసితివి. నేను అందరిలో పెద్దదానిని అట్టినాకు సత్కారము చేయుటకు నీవు అనర్హుడవు అని అనెను. ఇట్లనగనే దక్షుడు కండ్లెఱ్ఱ జేసినవాడై సతితో ఇట్లు అనెను. నీవు శ్రేష్ఠురాలవు వరిష్టురాలవు. ఎల్లప్పుడును నాకు పూజింపదగిన దానవు. కాని వారి భర్తలు నాకు ఎల్లప్పుడు మిక్కిలి ఇష్టులు. ఓ సతి వారందరు బ్రహ్మిష్టులు (వేదజ్ఞులు), తపమునందున్న వారు, మహా యోగులు,చక్కని ధార్మికులు. గుణములతో గూడ ముక్కంటి కన్న గొప్పవారై కొనియాడదగినవారు.

వసిష్ఠుడు, పులస్త్యుడు, అంగిరసుడు, పులహుడు, క్రతువు, భృగువు, మరీచి–వీరు శ్రేష్ఠులైన నా అల్లుండ్రు ఆతనికాతడే ఆత్మ (ఆతడెవ్వరిని గొప్పగా భావింపడు) నీకు ఆతడు శర్వుడు (నాశకుడు) అట్టివానిని నీవు ఎల్లప్పుడు సేవించు భక్తురాలవు. కావున నిన్ను పూజింపదలపను. శివుడు నాకు ప్రతికూలుడు అని దక్షుడు మిక్కిలి మూఢమైన చిత్తముతో పలికెను. ఆ విధముగ చెప్పబడినదై కోపించిన సతీదేవి ఇట్లనెను. "మాటలో, మనస్సులో, చేతలోను దోషములేని నన్ను నిందించితివి. కావున తండ్రీ నీ ఆత్మనుండి పుట్టిన ఈ దేహమును నేను త్యజించుచున్నాను అని చెప్పి, ఆ తరువాత, ఆ దేవి అవ మానము దుఃఖము సహింపనిదై మహేశ్వరునకు నమస్కరించి "ఎచ్చట నేను మరల ప్రకాశించు దేహముతో పుట్టుదునో, అచ్చట గూడ అజ్ఞానము లేని ధార్మికురాలనై మరల ధర్మప్రకారము ముక్కంటికి (శివునకు) ధర్మ పత్నీత్వమునే పొందుదును. ఆ శివునియందే యోగముచే కలిసి కూర్చున్న దాననై సమాధినందెదను" అని పలికి మనస్సుతో తనయొక్క యోగాగ్ని ధారణను ఆగ్నేయ దిక్కునకు సంబంధించిన అగ్నిధారణను ధరించెను. వెంటనే ఆగ్నేయ దిక్కు నుండి లేచిన వాయువుచే ప్రేరేపింపబడినదై అగ్ని సర్వాంగముల నుండి బయలువెడలి ఆమెను భస్మము జేసెను.

తరువాత శూలధారియై శంకర భగవానుడు సతియొక్క మరణమును విని, అట్లే దక్ష, సతులయొక్క సంవాదమును జరిగినది జరిగినట్లుగా తెలిసికొనెను. వెంటనే ప్రభువైన ఆ భగవంతుడు దక్షునియెడను ఋషులయెడను కోపించెను. ఓ దక్ష ! ఏ కారణమున నా కొఱకై నాసతి అవమానింపబడినదో, తక్కిన కూతుళ్లు అందరు తమ భర్తలతో బాటు ప్రశంసింపబడిరో, ఆ కారణమున వైవస్వత మన్వంతరమున మరల మహర్షులు ఆ రెండవ యజ్ఞమున అయోనిజులై జన్మింపగలరు. చాక్షుష మన్వంతరమున బ్రహ్మచేత పవిత్రమైన హోమము చేయబడగా, దానిని భగ్నము చేయుదును అని శపించెను. చాక్షుష మన్వంతరమున చాక్షుషడను వాడు రాజుగా కలడు. ఇతడు ప్రాచీన బర్హిషుని పౌత్రుడు. ప్రచేతసుని పుత్రుడు. చాక్షుష మన్వంతరము రాగా శాఖులయొక్క కన్యయైన మార్షయందు దక్షుడను పేరుతోనే నీవు జన్మింపగలవు. అని శపించెను. ఓ దుర్మతీ! ఇంకను నేను అక్కడ గూడ నీకు విఘ్నమును చేయగలను. ఇచట ధర్మార్థ కామ పురుషార్థములతో గూడిన యజ్ఞాది కర్మలందు మాటిమాటికి విఘ్నము చేయుదును. నా కారణముగా నీవు ఋషులను క్రూర ముగ పలికినందున, ద్విజులు దేవతలతో బాటు నిన్ను యజ్ఞమున బూజింపరు. తరువాత ఆహుతిని హోమము చేసి క్రూరులై యజ్ఞ కర్మలలో నీరును వదు లుదురు. అట్లే నీవు యుగక్షయమువలన యాగక్షయమువరకు స్వర్గమును వదిలి ఇచటనే ఉండగలవు.

రుద్రుడు అనెను :

అన్ని లోకములలో భూలోకము మొదటిది. బ్రహ్మ ఆజ్ఞచే నేను దానిని ధరింతును. ఈ భూమియందు చుట్టియున్న లోకములు అన్నియు తేజస్సు కలవై ఉన్నవి. నేను వానిని ఎల్లప్పుడు ధరింతును. నీ ఆజ్ఞతో కాదు. దేవతలకు చాతుర్వర్ణ్యము కలదు. వారు కూడ ఒక్కచోట భుజింతురు. నేను వారితో కలిసి భుజింపను కావుననే భుజింప జేయు హోతలు వేరుగా హవిస్సులను ఇత్తురు. కావుననే అతడు అనగా రుద్రుడు దేవతలతో బాటు పూజింపబడడు వేరుగా హవిస్సీయబడి పూజింపబడును.

తరువాత అంతులేని తేజస్సుగల రుద్రునిచే అభివ్యాహృతుడైన (శపింపబడిన) దక్షుడు స్వాయంభువ మన్వంతరమున పూర్వపు ప్రజాపతిత్వమును వదిలి భూలోకమున మనుష లలో పుట్టెను. గృహపతియైన దక్షుడు జ్ఞానములకు ఈశ్వరుడైన భగవంతుని (శివుని) తెలిసికొనెను. ఆ దక్షుడను వాడు దేవతలతో గూడి మహాయజ్ఞములతో శివుని పూజించెను. ఆ తఱువాత సతీదేవిని వైవస్వతమన్వంతరమురాగానే, శైలరాజైన హిమవంతుడు మేన యందు ఉమాదేవిగా జనింపజేసెను. ఆమె పూర్వము సతీదేవి, ఆ తఱువాత ఉమ అయినది. ఈమె భవునకు (శివునకు) సహచారిణీ వ్రతము చేయుటచే భార్యయైనది. ఈ భూలోకమున మన్వంతరములలో ఉండదలచినంత వఱకు ఆ శివుడు ఆమెచే విడువబడడు అనగా అర్ధనారీశ్వరుడగును. మరీచి పుత్రుడైన కశ్యపుని అనువ్రతయైన అదితిదేవివలె, సాధ్యుడైన నారాయణుని శ్రీ(లక్ష్మి)వలె, ఇంద్రుని శచీదేవివలె, విష్ణువును కీర్తివలె, సూర్యుని రుచివలె, వసిష్ఠుని అరుంధతివలె, మహేశ్వరుని ఉమ విడువలేదు. పైన చెప్పిన స్త్రీలందరు ఏమైనను తమ భర్తలను విడువలేదు. తరువాత తిరిగివచ్చు కల్ప ములలో గూడ వారు తమ భర్తలతోబాటు మరల జన్మింతురు. ఈ విధముగా ప్రాచేత దక్షుడు, చాక్షుష మన్వంతరమున ప్రాచీన బర్హిషుని పౌత్రుడుగను, ప్రచేతసుని పుత్రుడుగను పుట్టెను.

ఈ రెండవ మన్వంతరమున రుద్రుని శాపముచే పదుగురు ప్రచేతసుల వలన మార్షయందు మరల దక్షుడు పుట్టెను అని వినికిడి. మొదటి త్రేతాయుగమున పూర్వము వైవస్వతమనువునకు భృగువు-మొదలగు మహర్షులందరు పుట్టిరి. ఈ విధముగ ధీమం తుడైన ముక్కంటికిని ప్రజాపతియైన దక్షునకును జాత్యంతరమువల్ల అనుబంధ ద్వేషము కలిగెను. కావున జాత్యంతరగతుడైనను, శుభాశుభములచే భావితుడైన వానికి ఇట ఎప్పుడు శత్రువుల ఎడ బాంధవ్యమును చేయరాదు. అనగా వైరులకు ఎప్పుడు వైరము విడువదు, అది ప్రాణిని విడువక నశింపజేయును అని ప్రసిద్ధి, శతృత్వము ప్రాణిని విడువదు. అది సహ జము కావున చక్కని తెలివితో నడుచుకొనవలెను. అని సూతుడు మహర్షులతో చెప్పెను.

ఋషులు అనిరి :

ప్రజాపతియై ప్రాచేతసుడైన దక్షునియొక్క హయమేధ యజ్ఞము ఎట్లు వినాశ మంది నది. దేవి స్వయముగా మరణించినదని కోపించిన సర్వాత్మకుడు ప్రభువైనశివుని దక్షుడు ఎట్లు శాంతింపజేసి అనుగ్రహింప చేసికొనెను? ఆ యజ్ఞము చివరకు ఎట్లు సాధింప బడెను? అని అడిగిరి.

సూతుడు అనెను :

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! పూర్వము జ్యోతిష్కమను పేరుగలిగి సూర్య సంబంధము కలిగి, సకల రత్నములచే అలంకరింపబడి ముల్లోకములందు ప్రసిద్ధిచెందిన మేరు పర్వ తము యొక్క శిఖరము కలదు. అది ఇంతయని తెలియనలవి కానిది, దేని చేతను భిన్నముకానిది. సర్వలోకులచే నమస్కరింపబడినది. అన్ని ధాతువులచే అలంకరింపబడిన ఆ పర్వతరాజమందు పాన్పునందువలె మహాదేవుడు ప్రకాశించుచు కూర్చుని యుండెను. పర్వత రాజు కూతురు పార్వతియు ఎల్లప్పుడు ఆయన ప్రక్కనే ఉండెను. (మహాత్ములైన ఆదిత్యులును (ద్వాదశ సూర్యులు), అంతులేని ఓజస్సు (బలము) గల వసువులును, అట్లే మహాత్ములైన వైద్యులలో శ్రేష్ఠులైన అశ్వినులును, అట్లే గుహ్యకుల పరివారముగలవాడై యక్షులకు ఈశ్వరుడై, కైలాసనిలయుడై, ప్రభువై, రాజైన కుబేరుడును, మహామునియైన శుక్రుడును ఆ మహాత్ముడైన శివుని ఉపాసింతురు. సనత్కుమారుడు మొదలగు మహర్షు లును అంగిరసుడు మొదలగు తక్కిన దేవర్షులును, విశ్వావసువు (సూర్యుడు)ను, గంధర్వు డును, అట్లే నారద, పర్వతులును, అప్సరోగణ సంఘములును అనేక పర్యాయములు ఇటకు వచ్చిరి. మంగళకరమై సుఖకరమైన అనేక సుగంధములతో నిండి పవిత్రమైన వాయువు వీచెను. అట్లే అన్ని ఋతువులలో పూయు పూవులతో పుష్పవంతములుగా వృక్షములు శోభించెను. అట్లే విద్యాధరులు, సిద్ధులు, తపోధనులును అచట పశుపతియైన మహాదేవుని చుట్టుగా ఉండి సేవింతురు. తరువాత నానా రూపములు ధరించిన భూత ములు సేవించును. అనేక రూపములు ధరించి సంతుష్టులైన వారు, అనేక ఆయుధములను ఎత్తి బయలు దేరిన వారు మహాబలులు మహాకోపిష్టులు అయి రాక్షసులు, పిశాచులును శివుని యొక్క అనుచరులై అగ్నితో సమానులైన వారచట ఉండిరి. భగవంతుడైన నందికూడ మండుచు స్వతేజముతో ప్రకాశించుచున్న శూలమును పట్టుకొని ఆ శివుని ఇష్టప్రకారమే ప్రవర్తించుచుండెను. సమస్త తీర్థ జలముల నుండి పుట్టినదియు, నదులన్నింటిలో శ్రేష్ఠమై దేవ రూపిణియైన, గంగగూడ ఆ దేవుడైన శివుని సేవించెను. ఈ విధముగా అచ్చట మహా భాగులైన దేవతలచేతను దేవర్షులచేతను బ్రకాశించుచున్నవాడై ఆ మహాదేవుడు ఉండెను.

పూర్వము దక్షుడు హిమాలయముపైన ఋషులు సిద్ధులు సేవించిన శుభదేశమైన గంగాద్వారమున యజ్ఞమును చేయుటకు ఆరంభించెను. తరువాత ఇంద్రుడు మొదలగు దేవతలు ఒకచో కలిసి ఆ దక్షుని యజ్ఞమునకు వెళ్లదలచిరి. అగ్నివంటి తేజముగల మహాత్ములైన ఆ దేవతలు ప్రకాశించుచున్న తమ తమ విమానములతో శివసంకల్పముతో గంగా ద్వారమునకు వెళ్లిరని వినికిడి. ఆ ప్రదేశము గంధర్వులతోను, అప్సరసలతోను, నిండినది. అనేక వృక్షములతోను, తీగలతోను చుట్టబడినది. ఋషి సంఘములతో చుట్టబడిన దక్షుడు ధర్మధారులలో శ్రేష్ఠుడు. భూమ్యాకాశములలోను స్వర్గలోకమునను ఉన్న అందరును ప్రజాపతియైన దక్షునికి చేతులు జోడించి, సమీపమునకు చేరిరి. ఆదిత్యులు, వసువులు, మరుద్గణములతోబాటు రుద్రులు ఇంద్రునితో సహ అందరును యజ్ఞభాగులై అటకు వచ్చిరి. ఊష్మపులు (ఆవిరిని పీల్చువారు) సోమపులు (సోమరసమును (త్రాగువారు) ఆజ్యపులు (నేతిని త్రాగువారు) అట్లే అశ్వినీదేవతలు, పితృదేవతలును, బ్రహ్మతోబాటు అచటికి వచ్చిరి. వీరును, తక్కిన అనేక భూతసమూహములును, అట్లే జరాయుజులును (మావినుండి పుట్టువారు) అండజములును ((గుడ్డు నుండి పుట్టువారు), స్వేదజులును (చెమటనుండి పుట్టు నవియు), అందరు దేవతలును తమతమ వాహనములతో గూడ వేద మంత్రములతో పిలువబడిన వారై, మండుచున్న అగ్నులవలె వెలుగుచున్నవారై, విమానములందున్నవారై ప్రకాశించుచున్నారు. వారిని జూచిన దధీచ మహాముని కోపావిష్టుడై పూజింపతగని వానిని పూజించుట చేతను, పూజింపతగిన వానిని పూజింపకుండుటచేతను నరుడు మహాపాపమందును. ఇందు సంశయము లేదు అని పలికెను. ఇట్లు పలికి బ్రహ్మర్షి (దధీచుడు) మరల దక్షునితో పూజింపదగిన ప్రభువైన పశుపతిని ఎందులకు ఇట ఆహ్వానింపవైతివి? అని ప్రశ్నించెను. ఆ వాక్యములను వినిన

దక్షుడు :

"శూలమును ధరించి, జటలు గలిగిన రుద్రులు నాకు చాలమంది కలరు. వారు ఏకాదశ (పదునొకండు) అవస్థలలో ఉందురు. అంతకంటే వేరైన మహేశ్వరుని నేను ఎఱుగను. అని అనగా, దధీచుడు దేవతలందరును ఆహ్వానింపబడిరి. ఏ కారణముచేత శివుడు పిలువబడలేదు? శంకరుని కన్న మించిన వేరైన దైవమును నేనెఱుగను. కావున దక్షుని ఈ విశాల యజ్ఞము జరుగదని అనిపించుచున్నది అని పలికెను. అంతట

దక్షుడు :

ఓ శూరుడవైన దధీచా! ఈ యజ్ఞమున సువర్ణపాత్రమున మంత్రపూతమై ఆహవనీయాగ్ని యందు నిత్యమైన హవిస్సునంతయు ప్రభువై సర్వవ్యాపియై సాటిలేని విష్ణువునకే

చేరునట్లు ఇత్తును. అని జవాబు ఇచ్చెను ఆసమయమున సాధ్యయైన సతీదేవి దేవతలు అందరు దక్షుని యజ్ఞమునకు వెళ్లినట్లు తెలిసికొని, పశుపతియైన శివునితో

ఉమ :

"భగవన్! ఇంద్రుడు మొదలైన దేవతలు ఎక్కడకు వెళ్లిరి? నాకు గొప్ప సంశయము కలుగుచున్నది. నిజముగా నిజమును చెప్పుము" అని అడుగగా.....

మహేశ్వరుడు :

ఉత్తమ ప్రజాపతియైన దక్షుడుఅను మహాభాగుడు హయమేధయాగము చేయుచున్నాడు. దేవతలందరు అక్కడికి వెళ్లిరి అని జవాబిచ్చెను. ఆ మాటలకు

సతీదేవి :

ఓ మహాభాగ్యవంతుడా! ఈ యజ్ఞమునకు నీవేల వెళ్ళవైతివి? ఏ కారణముచే నీవచటికి వెళ్ళుట నిషేధింపబడినది అని ప్రశ్నించెను. అందుకు

మహేశ్వరుడు :

ఓ మహాభాగ్యవంతురాలా! ఈ యజ్ఞములు అన్నింటిలోను నాకు భాగము కల్పింపబడలేదు. ఓ ఉత్తమురాలా! పూర్వాచారముచే ఏర్పడిన మార్గమున బుద్ధిమంతుడైన దక్షుని యొక్క యజ్ఞమున దేవతలు నాకు భాగమును ఈయరు. అనగా

సతీదేవి :

ఓ భగవంతుడా! నీవు సర్వదేవతలలో అధికగుణములచే విశిష్ఠ కాంతిమంతుడవు. తేజస్సుతోను, కీర్తితోను, సంపదచేతను జయించుటకు తిరస్కరించుటకు అలవిగానివాడవు. ఓ మహాభాగుడా! ఈ పేరును ప్రతిషేధించుటచే నేను మిక్కిలి దుఃఖమును పొందితిని. ఓ పాపరహితుడా నాకు కంపము కూడ కలిగినది. అచ్యుతుడు, భగవంతుడు అయిన నా భర్త ఇవ్వేళ యజ్ఞము యొక్క సగభాగమును గాని లేదా మూడవ భాగమునుగాని పొందునట్టి ఏ దానమును ఏ నియమ వ్రతమును ఏ తపమును నేను చేయవలయును? అని విచారముతో చెప్పగా అచింత్యుడైన శివుడు ఈ విధముగ మాట్లాడుచు క్షోభజెందిన తన భార్యతో చిరునవ్వుతో ఓ! దేవతలకు ఈశ్వరురాలా! సన్నని నడుముగలదానా! నీకు తెలియదు. నీకు ఈ విధముగ పలుకుట తగదు? ఓ విశాలాక్షి సత్పురుషులు నేను ధ్యానముచే సర్వమును తెలియుదునని అందురు. ఈనాడు లోకత్రయము మోహముచే అన్ని విధములుగా విజ్ఞాన హీనముగా లేదు. యజ్ఞమున నన్ను స్తుతించువారు స్తుతింతురు. రథంతరమున (రథన్తర సామమున) గానము చేయదగిన సామమును (నాకై) గానము

చేయుదురు. బ్రహ్మ సత్రమను యాగమున బ్రాహ్మణులు నన్ను పూజింతురు. అధ్వర్యులు యజ్ఞమునందు యజుర్వేద మంత్రములను చదువువారు నాకు భాగమును కల్పింతురు. అని ఆమెను ఓదార్చెను. అప్పుడు.....

సతీదేవి :

భగవంతుడా! పండితుడైనను సమస్త స్త్రీజనుల సభలలో తనను తాను స్తుతించు కొనును. రక్షించుకొనును. ఇందు సంశయములేదు. అనగా భగవంతుడైన శివుడు... ఓ దేవతలకు ఈశ్వరియైన దానా! నన్ను నేను స్తుతించుటలేదు. ఓ ఉత్తమురాలా! యజ్ఞ భాగము కొఱకు ఎవనిని సృష్టింతునో చూడుము, తెలిసికొనుము అనెను. భగవంతుడు శివుడు ప్రాణప్రియురాలైన భార్యతో ఇట్లు పనికి తన ముఖమునుండి పుట్టి కోపాగ్నిని పోలిన వానిని సృష్టించెను. ఆతడు వేయితలలుగలవాడు భగవంతుడు. వేయికాళ్లు, కండ్లు కలవాడు. వేయి ముద్గరములను (ఇనుపగుదియలు) ధరించినవాడు, బాణములుగ వేయి చేతులు గలవాడు, శంఖము, చక్రము, గద వీనిని చేతులలో ధరించిన వాడు. ఉజ్జ్వలముగ ప్రకాశించు ధనస్సులు గలవాడు. గండ్రగొడ్డలి కత్తి వీనిని ధరించిన దేవుడు మహాకోపముతో భయంకరుడు. భయంకరరూపముతో మండుచున్నవాడు. చంద్రరేఖ అలంకారముగా గలవాడు. పులిచర్మమును ధరించినవాడు. గొప్ప రక్తమును స్రవించునట్టి కోరలతో, క్రూరమైన పెద్ద ముఖమును ధరించినవాడు. పెద్ద కడుపు గలవాడు. మెఱుపు నాలుక గలవాడు. పెద్దగా వ్రేలాడు పెదవులు గలవాడు. వ్రేలాడు పెద్ద చెవులు కలవాడు. దగ్గరకు పోవుటకు అలవిగానివాడు. వజ్రాయుధముతో మెఱయు చేతులు గలవాడు. కాంతులతో మండుచున్నట్లున్న తలవెంట్రుకలు గలవాడు. జ్వాలల మాలలచే కప్పబడిన ట్లున్నవాడు. ముత్యాలహారములతో అలంకరింపబడినవాడు. ప్రళయ కాలాగ్నివలె తేజ స్సుతో మండుచున్నవాడు. చెవులవరకు చీల్చినట్లున్న నోటి ఇరుచివరలు కలవాడు. నలుదెసలకు భయంకరుడు. మహాబలుడు. మహాతేజుడు. మహాపురుషుడునైన ఈశ్వరుడు. విశ్వమును హరించు గొప్ప శరీరముగలవాడు గొప్ప మఱ్ఱిచెట్టు మండలమువలె ఉన్నవాడు. ఒకే మారు నూరు చంద్రులవలెను, మన్మథాగ్నివలెను ఉండి ఒక్క మారు మండుచున్నవాడు. తెల్లని వాడికోరలుగల నాలుగు పెద్ద ముఖములు గలవాడు. గొప్ప భయంకరమైన తేజముతోను బలముతోను సంతోషముతోను ఒప్పిన వాడు. ప్రళయకాల మందలి వేల సూర్యాగ్నుల కాంతిగలవాడు. వేల చంద్రుల నిర్మల కాంతిచే మనోహరుడు ఎక్కువగా ప్రకాశించిన ఔషధులుగల మంధర పర్వతమువలె ఉన్నవాడు. సుమేరు పర్వతముతోను, హిమాలయముతోను, కైలాస పర్వతముతోను సమానమైన కాంతి గలవాడు. ప్రళయకాల

సూర్యునివలె ఉన్న వాడు. మహాబలవంతుడు. చక్కని ముక్కు కలవాడు. పెద్దముఖము కలవాడు. భయంకరమైన చెక్కిళ్లు కలవాడు. మండుచున్న కండ్లుకలవాడు. అగ్నిజ్వాలల చేతులచే కలుషమైన ముఖము కలవాడు. సింహచర్మము వస్త్రముగా గలవాడు. మహా సర్పములతో చుట్టబడినవాడు. తలపాగా కలవాడు. చంద్రుని ధరించినవాడు ఒకప్పుడు భయంకరుడు. ఒకప్పుడు సమముగా ఉండువాడు. అనేక విధములైన పుష్పములు ధరించిన శిరస్సుగలవాడు. బహువిధములైన గంధములను పూసికొన్నవాడు. అనేక రత్నములచే విచిత్రమైన శరీరముగలవాడు. అనేక ఆభరణములను అలంకరించుకొన్నవాడు. కొండ గోగు పూలమాలచే ప్రకాశించు చున్నవాడు. కోపముచే పైకితిరిగిన కండ్లు గలవాడు. అతడు ఒకచోట చిత్రమైన శరీరము ఉండునట్లుగా నాట్యము జేయును. ఒకచోట చక్కని స్వరముతో పలుకును. ఒకచోట ఆత్మయోగముతో ధ్యానముచేయును. ఒకచోట ఘనముగ మృదంగమును వాయించును. ఒకచోట విశ్వాత్ముడై గానము చేయును. ఒకచోట మాటి మాటికి ధ్వనిచేయును. జ్ఞానము, వైరాగ్యము, ఐశ్వర్యము, తపము, సత్యము, క్షమ, ధైర్యము, ప్రభుత్వము, ఆత్మజ్ఞానము (మొదలగు) అన్నిటిని ఆక్రమించు గుణములతో కూడినవాడు. ఆతడు మోకాళ్లతో భూమిని ఆనుకొని నమస్కరించినవాడై చేతులు జోడించి నిలబడెను. ఓ దేవేశుడా! నేను నీకొఱకు ఏమి చేయవలెనో నీవు ఆజ్ఞాపింపుము అనెను.

మహేశ్వరుడు “దక్షుని యజ్ఞమును ఆవరించి ధ్వంసముచేసివేయుము” అని ఆ వీరభద్రునితో అనెను. ఆ శివుని ఆజ్ఞ విని, మహాబలుడైన వీరభద్రుడు దేవేశుడైన ఉమాపతి పాదములకు నమస్కరించి బోనులో నుండి వదలిన సింహమువలె, సతీదేవి తనకోపముతో యోగాగ్ని యందు దగ్ధయగుట తలచి ఆ దక్షుని యజ్ఞము ధ్వంసము చేసెను. కోపముచే మహాభయంకరురాలు, మహేశ్వరియైన భద్రకాళి తన (వీరభద్రుని యొక్క) సర్వసాక్షిగా వీరభద్రుని వెంబడించి వెళ్లినది.

ఇతడు కోపించిన భగవంతుడగు శ్మశానవాసియైన శివుడు వీరభద్రుడని ప్రసిద్ధిచెందిన వాడు. దేవియైన సతియొక్క కోపమును చల్లార్చువాడు. ఆతడు తన రోమ కూపముల నుండి (వెంట్రుకల మొదళ్ళ నుండి) రౌద్రులను, గణేశ్వరులను సృష్టించెను. వారు రుద్రుని అనుసరించి వచ్చువారు, మహాబలవంతులు. రుద్రునితో సమానమైన బలపరాక్రమములు గలవారు. వారందరు రుద్రసేవకులు. వారందరు రుద్రునితో సమానముగ కాంతిగలవారు. అట్టివారు వేగముగా నూర్లకొలది వేలకొలది వచ్చిపడిరి. అంత కిలకిలఅను శబ్దము ఆకాశమును నింపుచున్నట్లు వ్యాపించెను. ఆ గొప్ప శబ్దముతో ఆ దేవతలు అందరును తిరుగుచుండిరి. వరుణలోకమున ఉండు బ్రాహ్మణులు గూడ కలతజెందిరి. అగ్నులు

మండలేదు. సూర్యులు ప్రకాశింపలేదు. గ్రహములు కూడ ప్రకాశింపలేదు. నక్షత్రములు తారకలును వెలుగలేదు. గ్రహములు కూడ ప్రకాశింపలేదు. ఋషులు దేవతలును, దానవులును మాట్లాడలేకుండిరి. అవమానింపబడిన గణేశులు గణములును ఈ విధముగ చీకటినిండిన యజ్ఞమును నిశ్శేషముగ దహించుచుండిరి. భయంకరరూపులై మహాబలులైన ప్రమథ గణవీరులు సింహనాదము చేయుచుండిరి. భయంకరులైన మరికొందరు (యజ్ఞ మంటప వస్తువును) పగలగొట్టుచుండిరి. యూపస్తంభములను పెరికి వేయుచుండిరి. మరికొందరు అచటి వారిని మర్దించుచుండిరి. మరికొందరు వికటనృత్యము చేయు చుండిరి. యజ్ఞములోనివారు వాయువేగ మనోవేగములతో పరుగులెత్తి పోవుచుండిరి. యజ్ఞ పాత్రములను ముక్కలుగాను చూర్ణముగను చేయుచుండిరి. అప్పుడు యాగస్థలము లందు ఆకాశమునుండి రాలిన చుక్కలవలె యజ్ఞవస్తువులు తుత్తునియలై చెల్లా చెదరుగ బడి కనబడుచుండెను. దివ్యములైన అన్నములు పానీయములు భక్ష్యములు వీని యొక్క రాసులు పర్వతములవలె ఉండెను. పాలనదులు ప్రవహించుచుండెను. తక్కిన నేయి పాయసములు బురుదలుగా అయ్యెను. తేనె మీగడల పానీయములు దివ్యముగా ఉండెను. ఖండశర్కరలు ఇసుకకుప్పలవలె పడియుండెను. మనోహరములైన బెల్లపు కాలువలు షడ్రసములను ప్రవహించు చుండెను. ఉత్తర దక్షిణములను అంటి పడియున్న మాంస ములు, వివిధములైన భక్ష్యములు ఇంక ననేక దివ్య భోజ్యములు పడి ఉండెను. లేహ్యములు (నాకి తినునవి) చోష్యములు (జుఱ్ఱి త్రాగునవి)ను ఉండెను. వీనిని అన్నింటిని తక్కిన ప్రమథ గణములు అనేక విధములైన ముఖములచే భుజించుచుండిరి. తరువాత అన్ని విధములుగా పొర్లాడుచుండిరి. క్రీడించుచుండిరి. వివిధ ఆకారములు గలవారై దేవతా స్త్రీలను ఒకచో ఉంచిరి.

రుద్రకోపముచే ప్రయోగింపబడిన రుద్రకల్పులైన ప్రమథులు సర్వ దేవతలచేత సురక్షితమైనను, దక్షయజ్ఞమును శీఘ్రముగా ధ్వంసము చేసిరి. అట్లే తక్కిన కొందరు సర్వభూత భయంకరమైన నాదములను చేసిరి. మరికొందరు యజ్ఞము యొక్క శిరమును ఖండించి భయంకరముగ గర్జించుచుండిరి. యజ్ఞపతియై దక్షుడైన దక్షప్రజాపతి మృగ(లేడి) రూపమున ఆకాశమున పరుగులిడ ప్రారంభించెను. తెలియరాని ఆత్మ స్వరూపముగల వీరభద్రుడు దక్షుని బలమును తెలిసికొని, ఆకాశమంతట వ్యాపించు మహత్స్వరూపుడై వెంటనే ఆకాశముననున్న దక్షుని శిరమును ఖండించెను. ప్రజాపతియైన దక్షుడు గూడ నశించిన ప్రాణము కలవాడయ్యెను. కోపించిన వీరభద్రుని పాదముచే దక్షుని శిరము పిండిగా చేయబడెను. ముసలితనముచే తిరస్కరింపబడిన తీవ్రమైన ఆత్మగలవాడై భూమిపై

బడెను. విమలాత్మకులైన ముప్పది మూడు కోట్ల దేవతలు సింహబలుడై అగ్నిబలుడైన వీరభద్రునిచే పాశముచే బంధింపబడిరి. తరువాత ఆ సర్వదేవతలు మహాబలుడు మహాత్ము డైన వీరభద్రుని కడకువచ్చిరి. ఓ ప్రభో, రుద్రదేవా, సేవకులయెడ అనుగ్రహించి ప్రసన్ను డవు అగుము. కోపింపకుము. అని ప్రార్థించిరి. అంతట...

బ్రహాది దేవతలు ప్రజాపతియైన దక్షుడును, చేతులు జోడించినవారై మీరెవరో చెప్పుడనిరి. వీరభద్రుడు వారితో నేను దేవుడను కాదు. ఆదిత్యుడను కాదు. ఇచట భుజించుటకును రాలేదు. కుతూహలముతో కూడినవాడనై దేవేంద్రులను తిలకించుటకును కూడ రాలేదు. దక్షయజ్ఞ వినాశము కొఱకు ఇచటికి వచ్చిన వానినిగా నన్ను తెలుసు కొనుడు. ఈమెను రుద్రకోపమువలన బయలు వెడలిన భద్రకాళిగా తెలియుడు. దేవదేవుడైన శివునిచే పంపబడినదై ఇచటి యజ్ఞ సమీపమునకు వచ్చినది. ఓ రాజేంద్ర నీవు దేవుడైన ఉమాపతిని శరణు పొందుము. రుద్రుని కోపమైనను మేలు. రుద్రసేవకులకోపమునకు హద్దులు ఉండవు అని పల్కెను.

వీరభద్రుని మాటను విని ధర్మమును ధరించువారిలో శ్రేష్ఠుడైన దక్షుడు దేవేశుడై శూలముచేత ధరించిన మహేశ్వరుని సంతోషపెట్టసాగెను. యజ్ఞవాటిక అంతయు చెడిపోయినది. బ్రాహ్మణులు అందరు పారిపోయిరి. రుద్ర సంబంధమైన భయంకరమైన మహాగ్ని ఆకాశమున మృగశీర్షా నక్షత్ర రాశిని ఆవరించి మండినది. పరిచారకులు శూలములతో బిగిసిన ముఖములతో కూతలు పెట్టుచున్నారు. యూపములు తవ్వి పెఱికి వేయబడినవి. విరువబడి, ఇటు అటు వేయబడినవి. మాంసమును కోరిన గ్రద్దలు ఎగురు చున్నవి, వ్రాలుచున్నవి. తమరెక్కలు విదుల్చుటచే వచ్చిన ధ్వనులు అచటి నూర్లకొలది నక్కల కూతలతో కలిసి వ్యాపించినవి. ఈ విధముగ యజ్ఞవాటిక అంతయు దూషితమైనది.

ఆ తఱువాత బహుదృష్టులు గలవాడును, శత్రువుల జయించువాడునైన దేవదేవేశుడైన శివుడు ప్రయత్నముతోడ నిలకడతో ప్రాణాపాన వాయువులను నిరోధించి అంతట దృష్టిని విశేషముగా ప్రసారించి అకస్మాత్తుగా అగ్నికుండము నుండి (వెలుపలికి) వచ్చెను. వేల కొలది చంద్రసూర్యుల యొక్క తేజము ప్రళయమువలె ఉండెను. భగవానుడు నవ్వి దక్షునితో ఇట్లు పలికెను. నీ అజ్ఞానము వలన యజ్ఞము నష్టమైనది. ఇప్పుడు నీకు నా యందు ప్రీతికలిగినది. దేవతల గురువుతో గూడ వినిపించిన విషయమును చక్కగా చెప్పి చిరునవ్వు నవ్వి, నీకేమి చేయవలెనో చెప్పుమని అనెను. ప్రజాపతియైన దక్షుడు భయముచెంది శంకతో మిక్కిలి భయపడినవాడై కన్నీరు నిండిన ముఖము కన్నులు

గలవాడునై, చేతులు జోడించి ఆ దేవదేవునితో భగవంతుడవైన నీవు ప్రసన్నుడవైనచో, నేను నీకు ప్రియుడనైనచో, నేను నీకు అనుగ్రహింప దగినవాడనైనచో, నాకు వరమీయతగినదైనచో, ఏది తినబడినదో నమల బడినదో, త్రాగబడినదో భుజింపబడినదో ఏది నశింపచేయబడినదో, చూర్ణము చేయబడినదో, విరిచి తొలగింప బడినదో అట్టి యజ్ఞసంభార మంతయు చాలాకాలముగా మహాప్రయత్నముతో కూర్చుకొనబడినది. అది నాకు మిథ్య (సత్యములేనిది. శూన్యము) కారాదు. నేనీ వరమును కోరుచున్నాను" అనెను.

"అట్లే అగుగాక" అని భగవంతుడై భగనేత్రహరుడైన హరుడు అనెను. ప్రజాపతియైన దక్షుడు మోకాళ్లతో భూమిపైకి వంగి ధర్మాధ్యక్షుడు మహాదేవుడు ముక్కంటియు అయిన శివునకు నమస్కరించి, ఆ శివునిచేత వరమును పొంది, వేయి ఎనిమిది (అష్టోత్తర సహస్ర) నామములచే ఆ వృషభధ్వజుడైన శివుని స్తుతించెను.

దక్షకృతోష్ట సహస్రనామ స్తుతి

దక్షుడు పలికెను :

దక్షుడు శివాష్టోత్తర సహస్ర నామ స్తుతితో స్తోత్రము చేయుచు పలికెను. దేవాయ(తే) నమస్కారము=దేవునకు నమస్కారము, జగన్నిర్మాణ పరుడవై ప్రత్యక్షాది ప్రమాణ గోచరుడవై జ్ఞేయుడవైన నీకు నమస్కారము; దేవేశాయ నమస్కారము= దేవతలకు ఈశ్వరుడవైన నీకు నమస్కారము. ఇంద్రియాత్మకుడవును బుద్ధ్యాత్మకుడవును అయిన నీకు నమస్కారము. జ్ఞాన, జ్ఞాతృరూపుడవైన నీకు నమస్కారము; దేవాది బలసూద నాయ నమః=దేవతల శత్రువులైన రాక్షసుల బలమును నశింపచేయు నీకు నమస్కారము. ఇంద్రియవృత్తులైన శమాది దేవతలకు శత్రువులైన కామాదుల బలమును నశింపజేయు నీకు నమస్కారము. (దేవా! ఇంద్రియములు శమాదులును) ఈశః=అసురాః కామాదులు; దేవేంద్రాయ నమః=దేవేంద్ర స్వరూపుడవైన నీకు నమస్కారము. ఇంద్రియములకు సమస్త జ్ఞాన ప్రకాశక దీప్తినిచ్చు (ఆత్మ స్వరూపుడవగు) నీకు నమస్కారము; అమర శ్రేష్ఠాయ నమః=మృతిచెందని దేవతలలో శ్రేష్ఠుడవైన నీకు నమస్కారము. దేవదానవ పూజితాయ నమః=దేవతలచేతను (ఇంద్రాదుల చేతను), రాక్షసులచేతను (బాణాదుల చేతను) పూజింప బడిన నీకు నమస్కారము; సహస్రాక్షాయ నమః =వేయి కన్నులు కలవాడవగు నీకు నమస్కారము. ఒకే మారు అన్ని విషయములను తెలియజేయు ఇంద్రియములు కలిగి సర్వజ్ఞుడవగు నీకు నమస్కారము, విరూపాక్షాయ నమః =మన ఇంద్రియములవలె గాక వ్యవధానమున (అడ్డంకులున్నను) కూడ విషయములను గ్రహించు విశిష్ట రూపమైన ఇంద్రియములుగల

నీకు నమస్కారము; త్ర్యక్షాయ నమః = మూడు (సోమ, సూర్య, అగ్ని రూపములైన కన్నులు గల నీకు నమస్కారము. యక్షులకు రాజైన ప్రియ మిత్రుడవైన నీకు నమస్కారము; సర్వతః పాణి పాదాయ నమ ః = అన్నివైపుల చేతులు, కాళ్ళు సర్వకర్తయు, సర్వగన్తయు అయిన నీకు నమస్కారము; సర్వతోఽ క్షిశిరో ముఖాయ నమ ః =అన్నివైపుల నేత్రములు, తల, ముఖముగల నీకు నమస్కారము. (ముఖ మంతయు అంతేకాక తల యంతయు కన్నులు గలవాడు); లోకే సర్వతః శ్రుతిమతే నమ ః = లోకమున అన్నివైపుల వినగల చెవిగల నీకు నమః; సర్వానావృత్య తిష్ఠతే నమస్కారము= అందరిని ఆవరించియున్న నీకు నమస్కారము

శంకుకర్ణాయ నమ ః = శంకువు వంటి చెవులుగల గుణ స్వరూపునకు నమస్కారము; (శంకుకర్ణాదులు ఈశ్వరగణములు సర్వాభిఽన్నుడగు శివుడు వారితో గూడ అభిన్నుడే); మహాకర్ణాయ నమ ః =పెద్ద చెవులుగల గణ స్వరూపునకు నమస్కారము, కుంభకర్ణాయ నమ ః =కుండవంటి చెవులుగల గణస్వరూపునకు నమస్కారము అర్ణవాలాయ నమ ః =సముద్రంలో నివసించు గణ స్వరూపునకు నమస్కారము; గజేంద్ర కర్ణాయ నమ ః = గజరాజు చెవులవంటి చెవులుగల గణ స్వరూపునకు నమస్కారము; గోకర్ణాయ నమ ః =గోవుల వంటి చెవులుగల గణ స్వరూపునకు నమస్కారము; పాణి కర్ణాయ తే నమ ః =చేతులవంటి చెవులుగల గణ స్వరూపునకు నమస్కారము;

శతోదరాయ నమః =అనంతములైన కడుపులతో విశ్వరూపుడవైన నీకు నమస్కారము; శతావర్తాయ నమః=అనంతములైన తేజో(రాశి) సుళ్ళు (galaxies) గలిగి విశ్వరూపుడవైన నీకు నమస్కారము; శతజిహ్వాయ నమః = అనంతము లైన నాలుకలుకలిగి కాలవిశ్వరూపుడవైన నీకు నమస్కారము; శతాననాయ నమః = అనంత ముఖములతో విశ్వరూపుడవైన నీకు నమస్కారము; త్రిసంధ్యాసు గాయత్రీ జపగీతాయ నమః =మూడు సంధ్యలలో గాయత్రీ జపపరులచే గానము జేయబడు నీకు నమస్కారము; త్రిసంధ్య గాయత్రీ త్రిసంధ్యలలో అర్చింపబడు (సూర్య రూపునకు) నీకు నమస్కారము

దేవదానవ గోప్త్రే నమః =రాక్షసబాధలనుండి దేవతలను, పాపఫలితముగా సంహారము నిచ్చి కైవల్యము నిచ్చుటచే దానవులను రక్షించు నీకు నమః; బ్రహ్మణే నమః = బ్రహ్మాత్ముడవైన నీకు నమస్కారము; శతక్రతవే నమః = ఇంద్రాత్మునకు నీకు నమస్కారము; మూర్తీశాయ నమః = పృథివి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, యజమాని అను అష్టమూర్తులతో ఈశుడవగు నీకు నమస్కారము; మహామూర్తయే నమః =

లింగాకారమున (క్రిందపైన) విశ్వమంతయు వ్యాపించిన ఆకారముగల నీకు నమస్కారము; సముద్రాంబు ధరాయ నమః = సముద్ర జలమును, తేజోరూపమున ధరించు నీకు నమస్కారము (ఆగ్నే రాపః అని వేదము)

గవా గోష్ఠ ఇవ సర్వ దేవతానాం నివాసాయ నమః =గోవులకు గోశాలవలె సమస్త దేవతలకు నివాసమైన నీకు నమస్కారము; సోమ శరీరాయ నమః = చంద్రుడు శరీరమైన వానికి నమస్కారము; అగ్ని శరీరాయ నమః =అగ్ని శరీరమైన వానికి నమస్కారము; వరుణ శరీరాయ నమః = వరుణుడు శరీరమైన వానికి నమస్కారము; ఆదిత్య శరీరాయ నమః =సూర్యుడు శరీరమైన వానికి నమస్కారము; విష్ణు శరీరాయ నమః =విష్ణువు శరీరమైన వానికి నమస్కారము; బ్రహ్మ శరీరాయ నమః =బ్రహ్మ శరీరమైన వానికి నమస్కారము; బృహస్పతి శరీరాయ నమః = బృహస్పతి శరీరమైన వానికి నమస్కారము (సోమాదులకు ఆత్మ అయిన వాడని భావము)

క్రియా స్వరూపాయ నమః = సర్వక్రియా స్వరూపునకు నమస్కారము; కార్యాయ నమః = సర్వకార్య స్వరూపునకు నమస్కారము; కారణాయ నమః =సర్వకారణ స్వరూపునకు నమస్కారము; కర్త్రే నమః =సర్వకర్తకు నమస్కారము; కరణాయ నమః = సర్వకరణ (సాధన) స్వరూపునకు నమస్కారము;

అసతే నమః = సత్తాస్ఫూర్తి శూన్యునకు నమస్కారము (మాయా శబలిత సగుణ బ్రహ్మ స్వరూపునకు నమస్కారము అని భావము); సదసదే నమః =సదసత్స్వరూపునకు నమస్కారము; ప్రభవాప్యయాయ నమస్కారము=జన్మమృత్యు స్వరూపునకు నమస్కారము; భవాయ నమః=సర్వోత్పత్తి స్థాన రూపునకు నమస్కారము; శర్వాయ నమః =దుష్టులను చంపువానికి నమస్కారము; రుద్రాయ నమః =పాపములను ద్రవింప (కరుగ) చేయువానికి నమః ; వరదాయ నమః = భక్తులకువరముల నిచ్చువానికి నమస్కారము

పశూనాం పతయే నమః =బ్రహ్మాది స్థావరాంత జీవులైన పశువులను రక్షించు పతియైన వానికి నమస్కారము; అంధక ఘాతినే నమః =అంధకుడను రాక్షసుని సంహరించిన వానికి నమస్కారము; త్రిజటాయ నమః =మూడు జడలుగల రూపము గలవానికి నమస్కారము; త్రిశీర్షాయ నమః =మూడు తలల రూపము గలవానికి బ్రహ్మాత్మ స్వరూపునకు నమస్కారము; త్రిశూలవర ధారిణే నమః =త్రిశూలము అను ఆయుధ శ్రేష్ఠమును ధరించిన వానికి నమస్కారము; త్ర్యంబకాయ నమః = శాస్త్రాచార్యాధ్యయన రూపములైన మూడు నేత్రములు గలవానికి నమస్కారము; త్రినేత్రాయ నమః = సోమ

సూర్యాగ్ని రూపములైన మూడు నేత్రములు గలవానికి నమస్కారము; త్రిపురఘ్నాయ నమః =ఆకాశమున లోహ రజతకనక పురములను నిర్మించుకొని, అజేయులైన కమాలాక్ష విద్యున్మాలిలను త్రిపురాసురుల పురములను మూడవ నేత్రముతో ధ్వంసముజేసిన నీకు నమస్కారము; చండాయ నమః =కోపముచే అందరిని చంపుటకు సమర్థుడైన వానికి నమస్కారము; (చడి–కోపే); ముండాయ నమః = అందరిని శోధింపజేయువానికి నమస్కారము (ముడి మార్జనే); ప్రచండాయ నమః =పాపులను నిశ్శేషముగా ఖండించువానికి నమస్కారము (ముండి ఖండనే); ధరాయ నమః =సర్వమును ధరించువానికి నమస్కారము

డిండిమాసక్త కర్ణాయ నమః =డిండిమము అను వాద్యవిశేష ధ్వనియందు తాండవ సమయమున లగ్నమైన కర్ణేంద్రియములుగల నీకు నమస్కారము; దండినే నమః = దండములను ధరించిన నీకు నమస్కారము; సమకర్ణాయ నమః = సమమైన కర్ణములు గల నీకు నమస్కారము; దండి ముండాయ నమస్కారము దండము ధరించిన ముండనము జేసికొన్న పరివ్రాజక రూపునకు నమస్కారము; అర్ధదండ కేశాయ నమః =సగము దండముతో సమానముగా పొడవైన తలవెంట్రుకలుగల నీకు నమస్కారము; నిష్కాయ నమః =బంగారు రూపము గలవారికి నమస్కారము; వికృతాయ నమః =వికార రూపము జెందిన నీకు నమస్కారము; విలోహితాయ నమః =మిక్కిలి ఎఱ్ఱనైన నీకు నమస్కారము; ధూమ్రాయ నమః = పొగవర్ణముగల నీకు నమస్కారము; నీలగ్రీవాయ తే నమః = కాలకూట విషము త్రాగుటచే నల్లని కంఠముగల నీకు నమస్కారము; అప్రతిరూపాయ నమః = ప్రతిరూపము (సాటిరూపము)లేని నీకునమస్కారము; శివాయ తే నమః =మంగళ కళా స్వరూపుడ వైన నీకు నమస్కారము; సూర్యాయ నమః = సూర్య స్వరూపుడవైననీకు నమస్కారము; సూర్యధ్వజ పతాకినే నమః = సూర్యుడు ధ్వజము నందును జెండా యందునుగల నీకు నమస్కారము; ప్రమథనాథాయ నమః =ప్రమథులకు (సర్వులను మథించగల బలము గలవారికి) ప్రభువైన నీకు నమస్కారము; వృష స్కంధాయ నమః = ఆబోతు వంటి భుజములుగల నీకు నమస్కారము; ధన్వినే నమః =ధనుస్సు ధరించిన నీకు నమస్కారము

హిరణ్య గర్భాయ నమః =సువర్ణమయమైన, తేజోమయమైన గర్భముగల నీకు నమస్కారము; హిరణ్య కవచాయ నమః =జ్ఞాన తేజోమయమైన (బంగారు మయమైన) కవచముగల నీకు నమస్కారము; హిరణ్యకృత చూడాయ నమః = బంగారము (సొమ్ములు) నిండిన కొప్పుగల జ్ఞానతేజోమయమైన జటాజూటముగల నీకు నమస్కారము; సత్రఘాతాయ నమః = దక్షయజ్ఞ ధ్వంసము చేసిన నీకు నమస్కారము; దండాయ

నమః = దండనీతి స్వరూపుడవగు నీకు నమస్కారము; వర్ణపాన పుటాయ నమః = ఇష్టమైన పానపాత్ర (ద్రోణి) గల నీకు నమస్కారము; స్తుతాయ నమః =స్తోత్రము చేయబడిన నీకు నమస్కారము. స్తుత్యాయ నమః = స్తోత్రము చేయదగిన నీకు నమస్కారము; స్తూయమానాయ నమః =అందరిచే స్తుతింపబడుచున్న నీకు నమస్కారము; సర్వాయ నమః =సర్వ స్వరూపుడవగు నీకు నమస్కారము; అభక్ష్య భక్ష్యాయ నమః =యముడు భక్షించుటకు అవిగాని వానినైన భక్షించగల నీకు నమస్కారము; సర్వ భూతాన్తరాత్మనే నమః = సర్వ భూతములకు అంతరాత్మవైన నీకు నమస్కారము; హోత్రాయ నమః =హోమము చేయదగిన హవిస్సు (నేయి) మొదలగువాని స్వరూపుడవగు నీకు నమస్కారము; మన్త్రాయ నమః =హోమమన్త్ర స్వరూపుడవగు నీకు నమస్కారము; శుక్ల ధ్వజ పతాకినే నమః=తెల్లని ధ్వజము (జెండా) కల నీకు నమస్కారము

నమాయ నమః =నమస్కార స్వరూపుడవగు నీకు నమస్కారము; నమ్యాయ నమః =నమస్కరింపదగిన స్వరూపముగల నీకు నమస్కారము; కిలికిలాయ నమః =కిలికిలియను హర్షానంద సూచక విశిష్ట శబ్ద స్వరూపునకు నమస్కారము; శయమానాయ నమః =సుఖముగా యోగనిద్రను అనుభవించుచున్న నీకు నమస్కారము; శయితాయ నమః =నిద్రించిన వాని స్వరూపుడవగు నీకు నమస్కారము; ఉత్థితాయ నమః = నిద్రమేలుకొన్న స్వరూపునకు నమస్కారము

స్థితాయ నమః =నిలకడగానున్న నీకు నమస్కారము; చలమానాయ నమః =కదులు (నడుచు) చున్న నీకు నమస్కారము; ముద్రాయ నమః =అంతట సంతోషము నిచ్చు నీకు నమస్కారము (ముదం రాతి ఆదత్తే ఇతి ముద్రః); కుటిలాయ నమః = నాట్యము చేయు స్వభావముగల నీకు నమస్కారము; ముఖవాదిత్రకారిణే నమః =ముఖముతో వీణా వేణు మృదంగతాళ వాద్యనాదముల జేయు నీకు నమస్కారము; నాట్యోపహార లుబ్ధాయ నమః = నాట్యపు కానుకలందు ఆసక్తిగల నీకు నమస్కారము; గీత వాద్య రతాయ నమః = దుష్టులకు కుటిల స్వరూపుడవైన నీకు నమస్కారము; నర్తన శీలాయ నమః = పాటలయందును వానికి తగిన వాద్య ధ్వనులయందును ఆసక్తుడైన నీకు నమస్కారము; జ్యేష్ఠాయ నమః = అందరి కంటెను పూర్వుడవైన (పెద్దవైన) నీకు నమ స్కారము; శ్రేష్ఠాయ నమః = అందరికంటెను గుణాధికుడవైన నీకు నమస్కారము; బల ప్రమథనాయ నమః = బలాభిమానియగు దేవుడు ఇంద్రుని మథించి ఓడించిన నీకు నమస్కారము; కలనాయ నమః = సర్వమును తెలిసికొను నీకు నమస్కారము; కల్పాయ నమః =వేదాంగవిధి స్వరూపుడవగు నీకు నమస్కారము; క్షయాయ నమః =మహాప్రళయ

స్వరూపుడవగు నీకు నమస్కారము; ఉపక్షయాయ నమః = అవాంతర ప్రళయ స్వరూపుడవగు నీకు నమస్కారము; భీమదుందుభిహాసాయ నమః= భయంకరమైన భేరి ధ్వనివంటి నవ్వుగల నీకు నమస్కారము; భీమసేన ప్రియాయ నమః = భీమసేన ప్రియుడవైన నీకు నమస్కారము; ఉగ్రాయ నమః = భయంకర స్వరూపుడవగు నీకు నమస్కారము; దశబాహవే నమః =పదిచేతులుగల నీకు నమస్కారము; కపాలహస్తాయ నమః = మనిషి పుఱ్ఱె చేతి యందుగల నీకు నమస్కారము; చితాభస్మ ప్రియాయ నమః = కాటిబూడిద ఇష్టమైన నీకు నమస్కారము

విభీషణాయ నమః =నిర్భయునకు నీకు నమస్కారము; భీష్మాయ నమః = భయంకరుడవగు నీకు నమస్కారము; భీష్మవ్రత ధరాయ నమః = భయంకరములైన నిరాహారాది వ్రతముల ధరించిన నీకు నమస్కారము; వికృత వక్షాయ నమః = విశాలముగా చేయబడిన వక్షస్థలముగల నీకు నమస్కారము; ఖడ్గజిహ్వాగ్రదంష్ట్రిణే నమః = ఖడ్గమువంటి నాలుకయు కోరలనుగల నీకు నమస్కారము;

పక్వాయ మాంసలుబ్ధాయ నమః =యజ్ఞమున పక్వమైన, శ్మశానమున ఆమమై (అపక్వమైన) మాంసములయందు ఆసక్తిగల నీకు నమః; తుంబవీణా ప్రియాయ నమస్కారము; ఎండిన సొరకాయతో చేసిన వీణను ఇష్టపడు నీకు నమస్కారము; వృషాయ నమః =వృష్టికర్తవగు నీకు నమస్కారము; వృష్యాయ నమః =ధర్మవృద్ధి కర్తయగు నీకు నమస్కారము; వృష్ణయే నమః =యాదవ కృష్ణ స్వరూపునకు నీకు నమస్కారము; వృషణాయ నమః =విశ్వప్రాణి తేజో రూపమయిన రేతస్సును వర్షించు నీకు నమస్కారము; కటింకటాయ నమః =వాయ్వాది రూపమున నిత్యము గమన శీలుడవగు నీకు నమస్కారము; చండాయ నమః =మిక్కిలి కోపియైన నీకు నమస్కారము; సావయవాయ నమః =అవయవములుగల యవయవి స్వరూపుడవగు నీకు నమస్కారము; వరకృష్ణాయ నమః =పుత్రవరదానాదుల వలన కృష్ణుడెవని వలన వరుడుగా జేయబడెనో (వరః శ్రేష్ఠః యస్మాత్సః) అట్టి పరమేశ్వరునకు నీకు నమస్కారము; వరాయ నమః = వర స్వరూపుడవగు నీకు నమస్కారము; వరదాయ నమః = ఈప్సితవర స్వరూపుడవగు నిన్ను భక్తులకు స్వాత్మగా ఇచ్చు నీకు నమస్కారము; వరగంధమాల్య వస్త్రాయ నమః = ఇష్టమై శ్రేష్ఠములైన పుష్ప మాలలు వస్త్రములునుగల నీకు నమస్కారము; వరాతివరయే నమః = కోరిన దానికన్న అధికముగ ఇచ్చు నీకు నమస్కారము; వర్షాయ నమః = వర్ష స్వరూపుడ వగు నీకు నమస్కారము; వాతాయ నమః = వాయు స్వరూపుడవగు నీకు నమస్కా రము; ఛాయాయై నమః = నీడరూపుడవైన నీకు నమస్కారము; ఆతపాయ నమః = ఎండ

రూపుడవైన నీకు నమస్కారము; రక్త విరక్తాయ నమః = రాగవిరాగ భయాత్మకుడవగు నీకు నమస్కారము; శోభనాయ నమః = సుందర స్వరూపుడవగు నీకు నమస్కారము; అక్షమాలినే నమః = అకారాది క్షకారాన్త వర్ణమాలా రూపమైన జపమాలగల నీకు నమస్కారము; సంభిన్నాయ నమః = కారణ రూపమున అంతట వెన్నంటియున్న నీకు నమస్కారము; విభిన్నాయ నమః = కార్య రూపమున వేరైన ఆవరింపబడిన రూపముగల నీకు నమస్కారము; వివిక్త వికటాయ నమః = ఏకాంతముచే వక్ర స్వభావముగల నీకు నమస్కారము; అఘోర రూపరూపాయ నమః =అంతకంటె భయంకర రూపములేని శాంతరూపమైన ఆకారముగల నీకు నమస్కారము; ఘోరఘోరతరాయ నమః =భయంకరుడవును మిక్కిలి భయంకరుడవు నైన నీకు నమస్కారము; శివాయ నమః =సజ్జన మనస్సులందు ఉండు నీకు నమస్కారము; శాన్తాతారాయ నమః =మనస్సం యమముగల నీకు నమస్కారము; శాన్తతరాయ నమస్కారము=మిక్కిలి మనస్సంయముగల నీకు నమస్కారము; ఏక పదే నమః =ఇతరులకు లేని మహిమతో ముఖ్యమైన పాదములు గల నీకు నమస్కారము; బహునేత్రాయ నమః =సర్వమును చూడగల బహు నేత్రములుగల నీకు నమస్కారము; ఏకశీర్ష్ణే నమః =సర్వాతి శయముతో సాటిలేని శిరస్సుగల నీకు నమస్కారము; కృద్ధాయ నమః = కోపరూపుడైన నీకు నమస్కారము; లుబ్ధాయ నమః = అన్ని విధముల సర్వోత్తమముగా వృద్ధిచెందిన నీకు నమస్కారము; లబ్ధాయ నమః =భక్తజన సుఖమును గోరు నీకు నమస్కారము; సంవిభాగ ప్రియాయ నమః =సర్వసుఖ సాధన మైన చక్కని విభాగమును ఇష్టపడు నీకు నమస్కారము;

పంచమాలార్చితాంగాయ నమః =రెండు పాదములు రెండు చేతులు ఒక శిరము ఐదు పుష్ప మాలలచే పై ఐదు అంగములు పూజింపబడిన నీకు నమస్కారము; పాశు పతాయ నమః =పశుపతి అధి దైవతముగల అస్త్ర స్వరూపుడవగు నీకు నమస్కారము; చండాయ నమః =తీవ్ర స్వరూపుడవైన నీకు నమస్కారము; ఘంటాయ నమః =ఘంటా స్వరూపుడవగు నీకు నమస్కారము; ఘంటాజగ్ధరంధ్రిణే నమః =ఘంటచేత ఆవరింపబడిన చెవి రంధ్రములుగల నీకు నమస్కారము; సహస్ర శతఘంటాయ నమః =లక్ష ఘంటా నాదములుగల నీకు నమస్కారము; ఘంటామాలా ప్రియాయ నమః =ఘంటమాలలను ధరింప ఇష్టపడు నీకు నమస్కారము; ప్రాణదండాయ నమః =హృదయగత ప్రాణమే యోగ దండముగా గల నీకు నమస్కారము; త్యాగాయ నమః =కోరినవన్ని ఇచ్చు త్యాగ స్వరూపునకు నమస్కారము; హిలిహిలాయ నమః =హిలిహిలాఅని (సంతోషముననో మాంత్రికముగనో) పలుకు నీకు నమస్కారము; హూంహూంకారాయ నమః = దూషణుని

'హూం' అను ప్రళయ హూంకారముతో జంట అవన్తీ క్షేత్రమున మహాకాళ రూపమున వెలసిన నీకును, (అవన్తీ క్షేత్ర మాహాత్మ్యము) అణిమాద్యష్టైశ్వర్యములతో గూడి హైమీ సహితుడవై సర్వవ్యాధి నివారకుడవైన నీకును నమస్కారము; హ్=అణి మాద్యష్టై శ్వర్యయుత శివుని ఊమ్ హైమక బీజము పార్వతిని చెప్పునది సర్వవ్యాధి నివారణము (శ్రీ గరుడ తంత్రము); పారాయ నమస్కారము=భూరాది లోకముల కంటెపరమై శాంతమైన పరబ్రహ్మ స్వరూపుడవగు నీకు నమస్కారము; హూంహూంకార ప్రియాయ నమః =ఛిన్న మస్తాశక్తి ప్రియుడవైన నీకు నమస్కారము; హూం=ఛిన్న మస్తా బీజము (మంత్ర సిద్ధి) ఆకాశ రూపమున సర్వవ్యాపివైన శివుడవై పృథివియందు అంతట నెలకొని దుష్టులకు కాల రుద్రుడవై సర్వలక్ష్మిని జయము నిచ్చు ఆకారమే ప్రియ మైన నీకు నమస్కారము; హ్=శివ ఆకాశ బీజము; ఊ=పృథివీ బీజము; మ్=కాల రుద్ర (లక్ష్మీ) రమా బీజమై జయప్రదము (మంత్ర సిద్ధి); శంభవే నమః=సుఖమును రక్షించి ఇచ్చు హరిహర స్వరూపునకు నమ స్కారము. (శంభుః శివుడు విష్ణువు బ్రహ్మ గు.బా.ప్ర.); నిత్యం గిరి వృక్ష కలాయ నమః =ఎల్లప్పుడును పర్వతములకును వృక్షముల కును కళాస్వరూపుడవైన నీకు నమస్కారము; గర్భమాంస శృగాలాయ నమః =యజ్ఞేశ్వరుడ వై వసా మాంసము నందు లోభము గల వాడవైన నీకు నమస్కారము; తారణాయ నమః = యజ్ఞభోక్తృత్వముచే పాపమోచకుడవైన నీకు నమస్కారము; తరాయ నమః = సంసారసాగరమును తరింపజేయు సాధనమైన నీకు నమస్కారము; యజ్ఞాధిపతయే నమః =యజ్ఞేశ్వరుడవైన నీకు నమస్కారము; ద్రుతాయ నమః =వేగ స్వరూపుడు కరిగిన రస స్వరూపుడును ఐన నీకు నమస్కారము; ఉపద్రుతాయ నమః =అనుకూల వేగవంతుడవైన నీకు నమస్కారము; యజ్ఞవాహాయ నమః =ఋత్విక్కులు మొదలగువాని రూపమున యజ్ఞ నిర్వాహకుడవైన నీకు నమస్కారము; దానాయ నమః =హవిర్దాన స్వరూపుడవైన నీకు నమస్కారము; తప్యాయనమః = సత్త్వమయుడవై తపోయ ముడవైన నీకు నమస్కారము; తపనాయ నమః =సూర్య స్వరూపుడవై తపింపజేయువాడవైన రజో రూపుడవైన నీకు నమస్కారము; తటాయ నమః =సంసార సాగరమునకు తర స్వరూపుడవైన నీకు నమస్కారము; భవ్యాయనమః = క్షేమ స్వరూపుడవైన నీకు నమ స్కారము; తడితాంపతయే నమః =మెఱుపులకు పతియైన నీకు నమస్కారము.

అన్నదాయ నమః =అన్నము నిచ్చువాడవగు నీకు నమస్కారము; అన్నపతయే నమః =అన్నమునకు సర్వాధికారపతివైన నీకు నమస్కారము; అన్నభవాయ నమః = అన్నమువలన పుట్టిన మానవమనః స్వరూపుడవగు నీకు నమస్కారము (అన్నము సూక్ష్మ రూపము మనస్సని ఛాం.ఉప); సహస్ర శీర్షే నమః = అనంత శిరస్సులుగల దివ్య

పురుష స్వరూపుడవగు నీకు నమస్కారము; సహస్రచరణాయ నమః =అనంత పాదములు గల దివ్య పురుషోత్తమ స్వరూపుడవగు నీకు నమస్కారము; సహస్రాద్యత శూలాయ నమః =అనంత శూలముల నెత్తి ధరించిన అనంత హస్తములు గల దివ్య పురుషోత్తమ స్వరూపుడవగు నీకు నమస్కారము; సహస్ర నయనాయ నమః = అనంతములయిన కన్నులుగల దివ్య స్వరూపుడవగు నీకు నమస్కారము; బాలరూపాయ నమః = బాల స్వరూపుడవగు నీకు నమస్కారము; బాలరూపధరాయ నమః = బాలుడగు కృష్ణాది దివ్యరూపముల ధరించినవాడవగు నీకు నమస్కారము; బాలానాంచైవ గోప్త్రే నమః = బాలురను గూడ రక్షించు కృష్ణుడవైనట్టి నీకు నమస్కా రము; బాలక్రీడనకాయ నమః = బాలభక్తులకు లింగరూపమున క్రీడాస్వరూపమైన నీకు నమస్కారము; శుద్ధాయ నమః =ఏకల్మషములేని శుద్ధస్వరూపుడవగు నీకు నమస్కారము; బుద్ధాయ నమః =ఆత్మజ్ఞాన స్వరూపుడవైన నీకు నమస్కారము; క్షోభణాయ నమః =శత్రువులను క్షోభింపజేయువాడవైన నీకు నమస్కారము; క్షతాయ నమః = దుష్టులకు దెబ్బవంటివాడవైన నీకు నమస్కారము; తరంగాంకిత కేశాయ నమః = గంగాతరంగములతో ఒప్పిన తలవెంట్రుకలుగల నీకు నమస్కారము; ముక్త కేశాయ నమః = ఆకాశగంగను జటాబద్ధము జేయుటకై విరబోసిన తల వెంట్రుకలు గల నీకు నమస్కారము; షట్కర్మనిష్ఠాయ నమః =యజ్ఞము జేయుట–యజ్ఞమును జేయించుట వేదశాస్త్రాదులను జదువుట వానిని జదివించుట దానము ధర్మములు చేయుట దానము స్వీకరించుట అను ఈ ఆఱు కర్మలయందు ఉండు వాడవగు నీకు నమస్కారము; త్రికర్మ నిరతాయ నమః = యజన–అధ్యయన దానకర్మలందు మిక్కిలి ఆసక్తిగల నీకు నమస్కారము; వర్ణాశ్రమాణాం విధివత్ పృథక్కర్మ ప్రవర్తినే నమః = బ్రాహ్మణాది వర్ణములకును బ్రహ్మచర్యాది ఆశ్రమములకును శాస్త్రీయముగను వేరువేరుగను తగిన ధార్మిక కర్మలను ప్రవర్తిల్లజేయు నీకు నమస్కారము; ఘోష్యాయ నమః =నాదముచే ధ్వనింపదగిన నీకు నమస్కారము; కలకలాయ నమః =కోలాహల స్వరూపుడవగు నీకు నమస్కారము; శ్వేత పింగళ నేత్రాయ నమః = ఎఱుపును గోరోచన వర్ణమును కలిగిన కన్నులుగల నీకు నమస్కారము; కృష్ణరక్తేక్షణాయ నమః =నలుపు, ఎఱుపుగల చూపులు గలవాడవైన నీకు నమస్కారము; ధర్మార్థ కామమోక్షాయ నమః = నాలుగు విధములగు ధర్మాది పురుషార్థముల స్వరూపముగల నీకు నమస్కారము; క్రథాయ నమః =శత్రువులకు హింసా స్వరూపుడవగు నీకు సమస్కారము; క్రథనాయ నమః =శత్రువులను హింసించునట్టి నీకు నమస్కారము. సాంఖ్యాయ నమః =నిరీశ్వరవాదియై సాంఖ్య సిద్ధాన్త వర్తకుడైన కపిలముని స్వరూపుడవగు నీకు నమస్కారము; సాంఖ్యము

ఖ్యాయ నమః =సేశ్వర పాతంజల స్వరూపుడవగు నీకు నమస్కారము. సాంఖ్యమన వేదాన్త విచారము వేదాంత విచార ముఖ్యస్వరూపుడు పరమేశ్వరుడని భావము; యోగాధి పతయే నమః = పాతంజల యోగమునకు అధిపతుడవైన నీకు నమస్కారము. నిధిద్యాసన రూపమైన యోగమునకు అనుగ్రహముద్వారా వీనియందు సర్వ ప్రవర్తకుడవగు నీకు నమస్కారము; రథ్యవిరథ్యాయ నమః = రథమునకు రథభిన్నమునకును తగినవాడవగు నీకు నమస్కారము; రథమార్గ మందును రథభిన్నములైన అశ్వాది మార్గములందును ప్రవీణుడని భావము; చతుష్పథ రతాయ నమః =జల, అగ్ని, వాయు, ఆకాశ మార్గముల సంచరించుటలో మిక్కిలి ఆసక్తిగల నీకు నమస్కారము; కృష్ణాజినోత్తరీయాయ నమస్కా రము=కృష్ణ మృగచర్మము ఉత్తరీయముగా ధరించిన నీకు నమస్కారము; వ్యాళ యజ్ఞోప వీతినే నమః =సర్పము యజ్ఞోపవీతము (జందెము)గా గల నీకు నమస్కారము; ఈశానాయ నమః =సర్వ ప్రాణులకు ఈశ్వరుడవైన నీకు నమస్కారము; వజ్ర సంహాయ నమః = వజ్ర శరీరముగలనీకు నమస్కారము; హరికేశాయ నమః =గోరోచన వర్ణముగల వెంట్రు కలుగల నీకు నమస్కారము; అవివేకైక నాథాయ నమః =అజ్ఞానులకు జ్ఞానాతీతులకును ముఖ్య ప్రభువైన నీకు నమస్కారము; వ్యక్తావ్యక్తాయనమః = కార్యరూపుడవును కారణ రూపుడవగు నీకు నమస్కారము; కామాయ నమః = కామరూపుడవగు నీకు నమస్కారము; కామదాయ నమః=కోరిన కోరికలను ఇచ్చు నీకు నమస్కారము; కామ ఘ్నాయ నమ స్కారము = కాముని సంహరించిన నీకు నమస్కారము; ధృష్టాయ నమః = దిట్టతనముగల నీకు నమస్కారము; దృప్త నిషూదనాయ నమః =మదించిన వానిని సంహరించు నీకు నమస్కారము; సర్వాయ నమః =సర్వస్వరూపుడవైన నీకు నమస్కారము; సర్వదాయ నమః = అన్ని ఇచ్చు నీకు నమస్కారము; సంధ్యారాగాయ నమః = సంధ్యా కాలమువల్ల ఎఱ్ఱనైన నీకు నమస్కారము; మహాబలాయ నమః = మహాబలవంతుడవగు (మహా బలేశ్వరుడవగు) నీకు నమస్కారము; మహాబాహవే=గొప్ప బాహువులు గల నీకు నమ స్కారము; మహాసత్త్వాయ నమః =మహాప్రాణి స్వరూపుడవగు నీకు నమస్కారము; మహా ద్యుతయే నమః = గొప్ప కాంతిగల నీకు నమస్కా రము; మహామేఘవర ప్రేక్షాయ నమ స్కారము గొప్ప మేఘశ్రేష్టునివలె నల్లనైన చూపులుగల నీకు నమస్కారము; మహా కాలాయ నమః = ఉజ్జయినీ మహాకాల స్వరూపునకు నీకు నమస్కారము; స్థూలాయ నమః =మిక్కిలి లావైన ఆకారముగల నీకు నమస్కా రము; జీర్ణాంగాయ నమః=సన్నని అవయవములుగల నీకు నమస్కారము; జటినే నమః = జటలుగల నీకు నమస్కారము; వల్కలాజినధారిణే నమః =నారవస్త్రములు కృష్ణ మృగ చర్మములను ధరించిన నీకు నమస్కారము; దీప్త

సూర్యాగ్ని జటినే = మండుచున్న సూర్య అగ్నుల వంటి జటలుగల నీకు నమస్కారము; వల్కలాజినవాససే నమః = నార చీరలు కృష్ణ మృగ చర్మములు వస్త్రములుగా గల నీకు నమస్కారము; సహస్ర సూర్య ప్రతిమాయ నమః=వేయి సూర్యులతో సమానమైన నీకు నమస్కారము; తపోనిత్యాయ నమః =నిత్యము తపముగల నీకు నమస్కారము; ఉన్మాదనాయ నమః = వ్యామోహక స్వరూపుడవగు నీకు నమస్కారము; శతావర్త గంగాతో యార్ద్ర జాయ నమః = నూరు పొరలికలచే ఆక్రమించబడి గంగా జలముచే తడిసిన సగము తలవెంద్రుకలుగల నీకునమస్కారము. తక్కినసగభాగము అర్థనారీశ్వరుడు అయి నందున పార్వతీ శిరోజములలో గంగ ఉండదు. పార్వతి తనసవతి గంగను తనతలలో ధరింపదుగదా అని భావము, చంద్రా వర్తాయ నమః =చంద్రుని మాటి మాటికి తన శిరమున త్రిప్పు నీకు నమస్కారము; మేఘావర్తాయ నమః =మేఘములను కాల స్వరూపుడవై మాటిమాటికిని త్రిప్పు నీకు నమస్కారము; అన్నాయ నమః = అన్న స్వరూపుడవైన నీకు నమస్కారము; అన్న కర్త్రేనమః =అన్నమును చేయు నీకు నమస్కారము; అన్నదాయ నమః = అన్నమును ఇచ్చు నీకు నమస్కారము; అన్నస్రష్టే నమః =అన్నమును సృష్టించు నీకు నమస్కారము; అన్నపక్త్రే నమః =అన్నమును వండు నీకు నమస్కారము; పక్వభుక్తపచే నమః = వండి తినిన అన్నము జీర్ణము చేయు జఠరాగ్ని రూపునకు నీకు నమస్కారము; జరాయుజే నమః = మావితో పుట్టిన స్వరూపుడవగు నీకు నమస్కారము; అండజాయ నమః = అండమువల్ల పుట్టి ప్రాణి స్వరూపుడవగు నీకు నమస్కారము; స్వేదజాయ నమః = చెమటవలన పుట్టు ప్రాణి స్వరూపుడవగు నీకు నమస్కారము; ఉద్భిజ్జాయ నమస్కా రము=భూమిని ఛేదించుకొని మొలకెత్తు ప్రాణి స్వరూపుడవగు నీకు నమస్కారము; దేవాయ నమః =సర్వదేవ స్వరూపుడవగు నీకు నమస్కారము; దేవేశాయ నమః =ఇంద్ర స్వరూపుడవగు నీకు నమస్కారము; చతుర్విధ భూతగ్రామాయ నమః = జరాయుజ అండజ స్వేదజ ఉద్భిజ్జ రూపములైన నాలుగు విధములైన ప్రాణుల యొక్క సమూహ స్వరూపునకు నీకు నమస్కారము; చరాచర బ్రహ్మణే నమః = చరాచర ప్రపంచ సృష్టికర్తయైన బ్రహ్మవగు నీకు నమస్కారము; ప్రతిహర్త్రే నమః = ఆచరాచరమును ప్రతిహరించు నీకు నమస్కారము; విదుషాం బ్రహ్మణే నమః = విద్వాంసులకు, బ్రహ్మ స్వరూపుడవగు నీకు నమస్కారము; బ్రహ్మవిదాం వరాయ నమః =బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడవగు నీకు నమస్కారము; సత్త్వస్య పరమయోనయే నమః =బలమునకు సత్త్వ గుణమునకు మూలకారణ స్వరూపుడవగు నీకు నమస్కారము; అబ్నిధయే నమః =నీటికి నిధానమైన నీకు నమస్కారము; వాయు నిధయే నమః =వాయువునకు నిధివైన నీకు నమస్కారము; జ్యోతిర్నిధయే నమః = తేజస్సునకు నిధివైన నీకు నమస్కారము; రుగ్రూపాయ నమః =ఋక్కుల స్వరూపముగల నీకు నమస్కారము.

సామరూపాయ నమః =సామముల (సామవేదమంత్రముల) స్వరూపముగల నీకు నమస్కారము; ఓంకార రూపాయ నమ ః =ఓంకార స్వరూపుడ వగు నీకు నమస్కారము; హవిర్హావినే నమ ః =హవిస్సే (హోమము చేయు నేయి మొదలగునవి) విలాసముగాగల నీకు నమస్కారము; హూవాం వాచాహుతయై నమస్కా రము=హోమము చేయు పదార్థ ములకు వాగ్రూపమైన ఆహుతివైన నీకు నమస్కారము; హవిర్హ నీయనియు, హవోహావా అనియు, హూవావాచాహుతి అనియు చేయు సామ గీతి స్వరూపునకు నీకు నమస్కారము; సురశ్రేష్ఠాయ నమః =దేవతా శ్రేష్ఠుడవగు నీకు నమస్కారము; బ్రహ్మ వాదిభిః = సామభిర్గీయమానాయ నమస్కారము వేదనాదుల చేతను తత్త్వ బ్రహ్మావాదుల చేతను సామములచే గానము జేయబడుచున్న నీకు నమస్కా రము; యజుర్మయాయ నమ ః = యజుర్వేదమంతయు నిండియున్న నీకు నమస్కారము; ఋఙ్మయాయ నమ ః = ఋగ్వేద మంతయు నిండిన నీకు నమస్కారము; సామమయాయ నమ ః = సామవేదమంతయు నిండియున్న నీకు నమస్కారము; అథర్వ మయాయ నమ ః = అథర్వవేద మంతయు నిండియున్న నీకు నమస్కారము; బ్రహ్మవిద్భిః, కల్పోని షదాంగణైః పఠ్యమానాయ నమస్కారము; బ్రహ్మవేత్తలచే కల్ప శాస్త్రము చేత ఉపనిషత్తుల సమూహము చేతను పఠింపబడుచున్న నీకు నమస్కారము.

బ్రాహ్మణాత్మనే నమ ః =బ్రాహ్మణ రూపుడవగు నీకు నమస్కారము; క్షత్రియాత్మనే నమ ః =క్షత్రియ స్వరూపుడవగు నీకు నమస్కారము; వైశ్యాత్మనే నమ ః =వైశ్య స్వరూపుడవగు నీకు నమస్కారము. శూద్రాత్మనే నమ ః =శూద్రాత్మ స్వరూపుడవగు నీకు నమస్కారము; వర్ణావరాత్మనే నమ ః =నాలుగు వర్ణములకన్న తక్కువైన వర్ణము సంకర (జాతి) కాత్మ స్వరూపుడవగు నీకు నమస్కారము; మేఘ సంఘాత్మనే నమ ః =సృష్టిని ఇచ్చు మేఘసంఘ స్వరూపుడవగు నీకు నమస్కారము; విశ్వస్మై నమ ః =విశ్వ స్వరూపుడవగు నీకు నమస్కారము; స్తనితాయ నమ ః =మేఘము యొక్క దివ్య శబ్ద స్వరూపుడవగు నీకు నమస్కారము, గర్జితాయ నమ ః =మేఘగర్జన స్వరూపుడవగు నీకు నమస్కారము; సంవత్సరాయ నమ ః = కాలావయవమైన సంవత్సర స్వరూపుడవగు నీకు నమస్కారము; ఋతాత్మనే నమ ః = షడృతు స్వరూపుడవగు నీకు నమస్కారము. మాసాయ నమ ః = మాస స్వరూపుడవగు నీకు నమస్కారము. మాసార్ధాయ నమ ః = పక్ష స్వరూపుడవగు నీకు నమస్కారము; కలాత్మనే నమ ః = ముప్పది కాష్టల కాలావయవ స్వరూపుడవగు నీకు నమస్కారము; కాష్ఠాత్మనే నమ ః = పదునెనిమిది కనురెప్ప పాటు కాలావయవ స్వరూపుడవగు నీకు నమస్కారము; నిమేషాత్మనే నమ ః = ఒక్క కనురెప్ప

పాటు కాలావయ స్వరూపునకు నీకు నమస్కారము; నక్షత్రాత్మనే నమ ః = నాశములేక స్థిరమైన చుక్కల స్వరూపుడవగు నీకు నమస్కారము; యుగాత్మనే నమ ః = కృతాది యుగ స్వరూపుడవగు నీకు నమస్కారము; గ్రహాత్మనే నమ ః = సూర్యాది నవగ్రహ స్వరూపుడవగు నీకు నమస్కారము; వృషాణాం కకుదే నమ ః = వృషభ ప్రధానుడైన నందీశ్వర స్వరూపుడవైన నీకు నమస్కారము; గిరీణాం శిఖరాత్మనే నమ ః = హిమాలయ పర్వతములలో సమస్త శిఖర స్వరూపుడవగు నీకు నమస్కారము; మృగాణాం సింహాత్మనే నమ ః =మృగరాజసింహ స్వరూపుడవగు నీకు నమస్కారము; పతతాం తార్క్ష్యాయ నమ ః = పక్షిరాజ గరుడ స్వరూపుడవగు నీకు నమస్కారము; భోగినామనన్తాయ నమ ః =సర్పరాజాది శేష స్వరూపుడవగు నీకు నమస్కారము; ఉదధీనాం క్షిరోదాయ నమస్కారము సముద్ర శ్రేష్ఠ క్షీరసముద్ర స్వరూపుడవగు నీకు నమస్కారము. యంత్రాణాం ధనుషే నమ ః = యంత్రశ్రేష్ఠములలో ధనుః = స్వరూపుడవగు నీకు నమస్కారము; ప్రహరణానాం వజ్రాయ నమ ః = ఆయుధములలో వజ్ర యాయుధ స్వరూపుడవగు నీకు నమస్కారము, వ్రతానాంసత్యాయ నమ ః = వ్రతములలో సత్యనారాయణ వ్రత స్వరూపుడవగు నీకు నమస్కారము; ద్వేషాయ నమ ః =ద్వేష స్వరూపుడవగు నీకు నమస్కారము; రాగాయ నమ ః =ప్రేమ స్వరూపుడవగు నీకు నమస్కారము; మోహాయ నమ ః = మోహ స్వరూపు డవగు నీకు నమస్కారము; క్షామాయ నమస్కారము=క్షమా స్వరూపుడవగు (సహనము) నీకు నమస్కారము; దమాయ నమ ః =అనుచిత విషయముల ప్రర్తించ కుండునట్లు ఇంద్రియాదుల అణచు రూపమైన దమముయొక్క రూపము నందిన నీకు నమస్కారము; శమాయ నమ ః = సర్వేంద్రియ శాంత స్వరూపుడవగు నీకు నమస్కారము; వ్యవసాయాయ నమ ః = పురుష ప్రయత్న స్వరూపుడవగు నీకు నమస్కా రము; ధృతయే నమ ః = ఆత్మ స్థిరస్థితి కారణమైన ధైర్యము నీ స్వరూపము. అట్టి నీకు నమస్కారము; లోభాయ నమ ః = సద్గుణలోభ స్వరూపుడవగు నీకు నమస్కారము; కామాయ నమ ః =కామ స్వరూపు డవగు నీకు నమస్కారము; క్రోధాయ నమస్కారము =కోప స్వరూపుడవగు నీకు నమ స్కారము, జయాయ నమ ః =సర్వజయ స్వరూపుడవగు నీకు నమస్కారము; అజయాయ నమ ః =గదాధరుడవగు నీకు నమస్కారము; శరిణే నమ ః =శరములు బూనిన నీకు నమస్కారము; చాపినే నమ ః =ధనుర్ధారివగు నీకు నమస్కారము; ఖట్వాంగినే నమ ః =మంచము ఆయుధముగా ధరించిన నీకు నమస్కారము; ఝర్ఝరిణే నమ ః = కైముడి అను వాద్య విశేషమును చేతిలో ధరించిన నీకు నమస్కారము; ఛేత్రే నమః=ఛేదించు (కోయు) నీకు నమస్కారము, ఛేత్రే నమస్కారము=ఛేదించు (పగుల గొట్టు) నీకు నమ స్కారము; నేత్రే నమ ః = సర్వజయమును గూర్చుచు నీ సారూప్యమునకు గొనిపోవు

నీకు నమస్కారము, అంతకాయ నమ ః = నీస్వాత్మ లయమునకై భక్తులయైహిక జీవనము అంతమొందించు నీకు నమస్కారము; దశలక్షణ సంయుక్త ధర్మాయ నమ ః = హింసించ కుండుట, సత్యము బలుకుట, దొంగిలించ కుండుట, బ్రహ్మచర్యము, ఇతరుల నుండి దానము ఏదియు స్వీకరింపకుండుట, అనే అయిదు యమములు, శౌచము, సంతోషము, తపము, స్వాధ్యా యము (వేదాదులను చదువుట), ఈశ్వర ప్రణిధానము (ఈశ్వర ధ్యానము) అను నీ అయిదు నియమములు ఈ యోగోక్తములైన ఈ పది లక్షణములతో గూడియున్న ధర్మ స్వరూపుడవగు నీకు నమస్కారము. లేదా మనువు జెప్పిన క్షమా సత్యాదులతో గూడిన వాడవైన నీకు నమస్కారము; దశల లక్షణ సంయుక్తార్థాయ నమ ః =పై జెప్పిన పది లక్షణములు గల యర్థ(ధన) స్వరూపుడవగు నీకు నమస్కారము; దశలలక్షణ సంయుక్త కామాయ నమస్కారము=పై విధముగ పది లక్షణములుగల కామ స్వరూపుడ వగు నీకు నమస్కారము; ఇంద్రాయ నమస్కారము=ఇంద్ర స్వరూపుడవగు నీకు నమస్కారము; సముద్రాత్మనే నమ ః =సముద్ర స్వరూపుడవగు నీకు నమస్కారము; సరిదాత్మనే నమః=నదీ స్వరూపుడవగు నీకు నమస్కారము, పల్వలాత్మనే నమ ః = నదీ స్వరూపుడవగు నీకు నమస్కారము; సరోరూపిణే నమ ః = సరస్సుల రూపమునందిన నీకు నమస్కారము; లతాత్మనే నమః =స్తంభాదులను పట్టుకొను తీగరూప మున ఉన్న నీకు నమస్కారము; వల్ల్యాత్మనే నమ ః =చుట్టుకొను తీగ రూపమున ఉన్న నీకు నమస్కారము; తృణాయ నమ ః =పశువులు మొదలగునవి తినదగిన గడ్డి రూపమునఉన్న నీకు నమస్కారము; ఓషధ్యాయ నమ ః =ఫలపాకాంత జీవనముగల అరటి వరి గోధుమ జొన్న మొదలగు నోషధీ వృక్ష స్వరూపుడవగు నీకు నమస్కారము; పశ్యాత్మనే నమ ః =పశు స్వరూపుడవగు నీకు నమస్కారము; మృగాత్మనే నమః =మృగ స్వరూపుడవగు నీకు నమస్కారము; పక్షిణే నమ ః =పక్షి స్వరూపుడవగు నీకు నమస్కారము; ద్రవ్యకర్మ గుణారంభాయ నమ ః =పృథివ్యాదుల యొక్కయు, ఎత్తులదించుట, ముడుచుట, చూచుట, నడచుట మొదలగు కర్మల యొక్కయు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాది గుణముల యొక్కయు ప్రారంభకుడవైన నీకు నమస్కా రము; కాలాయ నమ ః = కాల స్వరూపునకు నీకు నమస్కారము; పుష్ప ఫల ప్రదాయ నమ ః =సుగంధములై అత్యంత సమీప భవిష్యత్తు కలుగబోవు ఫలమును సూచించుచు పుష్పములను, తరువాత ఫలములను ఇచ్చు నీకు నమస్కారము; ఆదయే నమ ః =జగదాది స్వరూపునకు నీకునమస్కారము; అంతాయ నమస్కారము= మహాప్రళయ రూపమున జగదంత స్వరూపునకు నీకునమస్కారము; మధ్యాయ నమ ః = ప్రవృద్ధ మైన జగన్మధ్య స్వరూపునకు నీకు నమస్కారము; గాయత్ర్యోం కారాయనమ ః = గాయత్రి

మంత్రాత్మకుడ వైన ఓంకార స్వరూపుడవైన నీకు నమస్కారము. గాయత్రీ మంత్రమున భర్గ శబ్దము శివునే జెప్పును గదా!; హరితాయ నమ ః = ఆకుపచ్చని వర్ణముగల నీకు నమస్కారము; కృష్ణాయ నమ ః =కృష్ణ వర్ణుడవగు నీకు నమస్కారము; నీలాయ నమ స్కారము=నీలవర్ణునకు నీకు నమస్కారము; పీతాయ నమ ః =పసుపు వర్ణముగల నీకు నమస్కారము; అరుణాయ నమ ః = కొద్ది ఎఱుపు వర్ణముగల నీకు నమస్కారము; కద్రవే నమ ః =గోరోచనము వంటి వర్ణముగల నీకు నమస్కారము; కపిలాయ నమః= కపిల వర్ణముగల నీకు నమస్కారము; కపోతాయ నమ ః = బూడిద వర్ణముగల నీకు నమస్కారము; మేచకాయ నమ ః = నెమలిపురి వర్ణముగల నీకు నమస్కారము; సువర్ణ రేతసే నమ ః = సువర్ణము రేతస్సుగాగల నీకు నమస్కారము; విఖ్యాతాయ నమ ః = జగత్ప్రసిద్ధుడవైన నీకు నమస్కారము; సుపర్ణాయనమ ః = గరుడ స్వరూపునకు నీకు నమ స్కారము.

సువర్ణ నామ్నే నమ ః = సువర్ణము (తేజము) నామము (పేరు)గా గల నీకు నమ స్కారము; సువర్ణ ప్రియాయ నమ ః =సువర్ణము తేజము ప్రియమైన వాడవగు నీకు నమస్కారము; ఇంద్రాయ నమ ః =ఇంద్ర స్వరూపుడవగు నీకు నమస్కారము; యమాయ నమ ః = యమ స్వరూపుడవగు నీకు నమస్కారము, వరుణాయ నమ ః = వరుణ స్వరూపుడవగు నీకునమస్కారము; ధనదాయ నమ ః = కుబేర స్వరూపుడవగు నీకు నమస్కారము. (ఇంద్రాదులు తూర్పు మొదలుకొని ఉత్తరము వరకు ఉన్న నాలుగు దిక్కులకు అధిపతులు. వారి స్వరూపమున ఉన్న వాడు ఈశ్వరుడే అని భావము); అనలాయ నమ ః =అగ్ని స్వరూపుడవగు నీకు నమస్కారము; ఉత్ఫుల్లాయ నమ ః =వికసించిన (పుష్ప) స్వరూపముగల నీకునమస్కారము; చిత్రభావనే నమ ః =జ్ఞాన ప్రకాశములైన అనేక విధములగు కిరణములుగల సూర్యుని స్వరూపమున నున్న నీకు నమస్కారము; స్వర్భానవే నమ ః = స్వర్లోకమున భాసించు రాహు స్వరూపునకు నీకు నమస్కారము; హోత్రాయ నమ ః =హవిస్సు మొదలగునవి హోమము చేయబడు యజ్ఞాగ్ని హోత్ర స్వరూపుడవగు నీకు నమస్కారము; హోత్రే నమ ః = హోమము జేయు యజమాని స్వరూపుడవగు నీకు నమస్కారము; హోమాయ నమ ః =హోమ స్వరూపుడవగు నీకు నమస్కారము; హుతాయ నమ ః = హోమము చేయబడిన ద్రవ్య స్వరూపుడవగు నీకు నమస్కారము; ప్రహుతాయ నమ ః =విశిష్టముగా హోమము చేయబడిన ద్రవ్య (సోమ) స్వరూపుడవగు నీకు నమస్కారము; ప్రభవే నమ ః =యజ్ఞ ఫలములను ఇచ్చు ప్రభు స్వరూపునకు నీకు నమస్కారము; సుపర్ణాయ నమ ః =మంచి రెక్కలుగల గరుడస్వరూపుడవు

మంచి యాకులుగల వృక్ష స్వరూపుడవుగాని యైన నీకు నమస్కారము; బ్రహ్మణే నమ ః = పరబ్రహ్మ స్వరూపుడవు, వేద స్వరూపుడవు అయిన నీకు నమస్కారము; యజుషాం శతరుద్రియాయ నమ ః = యజుర్వేద యజుస్సులకు సంబంధించిన శత రుద్ర(నమక)ము నందున్న నామ సమూహములుగల నీకు నమస్కారము; పవిత్రాణాం పవిత్రాయ నమ ః = పవిత్రులైన వారికెల్ల పవిత్రుడవైన నీకు నమస్కారము; మంగళానాం మంగళాయ నమ ః =సర్వ మంగళములకు మంగళ స్వరూపుడవగు నీకు నమస్కారము; గిరయే నమ ః =పర్వత స్వరూపునకు నీకు నమస్కారము; స్తోకాయ నమ ః =పర్వత సమూహ స్వరూపునకు నీకు నమస్కారము; వృక్షాయ నమ ః = వృక్ష స్వరూపుడవైన నీకు నమ స్కారము; జీవాయ నమ ః =ఎల్లప్పుడు జీవించు జీవ స్వరూపునకు నీకు స్వరూపునకు నీకు నమస్కారము; పుర్గలాయ నమ ః = పరమాణు స్వరూపునకు దేహస్వరూపునకు నీకునమస్కారము; సత్త్వాయ నమ ః = భూత భవిష్యద్వర్తమాన కాలత్రయముచే బాధింప అలవిగా నట్టియు, వికారహేతువు ఉన్నను వికారము జెందనట్టియు నీకు నమస్కారము; రజసే నమస్కారము = ప్రేరకమైన సక్రియమై దుఃఖహేతువైన రజోగుణ స్వరూపుడవగు నీకు నమస్కారము; (ధూళి స్వరూపుడ వైన నీకు నమస్కారము); తమసే నమ ః = భారముగలదైన సత్యమును ఆవరించునదై మోహింపజేయు గుణమైన తమోగుణ స్వరూ పునకు, చీకటి రూపునకు, నీకు నమస్కా రము; ప్రజననాయ నమ ః = సంతానమును కలుగజేయు నీకు నమస్కారము, ప్రాణాయ నమ ః = ప్రాణి హృదయమున నడుచు ప్రాణవాయు స్వరూపునకు నీకు నమస్కారము; అపానాయ నమ ః = గుదస్థానమందుండి అశుద్ధమును వెడలజేయు అపాన వాయు స్వరూపునకు నీకు నమస్కారము. సమానాయ నమ ః = కంఠమున నుండి వాగాదులను వెలువరింపజేయు నీకు నమస్కారము, వ్యానాయ నమ ః = సమస్త శరీరమున ఉండి శరీరమునంతయు సచేతనముగ చేయు నీకు నమస్కారము; ఉన్మేషాయనమ ః = నేత్రములను విప్పారచేయు కూర్మవాయు స్వరూపు డవగు నీకు నమస్కారము; నిమేషాయనమః = కన్నులు మూయజేయ వాయు స్వరూపుడ వగు నీకు నమస్కారము; జృంభితాయ నమ ః = ఆవులింత కలుగజేయు దేవదత్తవాయు స్వరూ పునకు నీకు నమస్కారము; క్షుతాయ నమ ః = తుమ్మును కలుగజేయు క్రుకర వాయు రూపునకు నీకు నమస్కారము; లోహితాంగాయ నమ ః =ఎఱ్ఱని శరీరము కల నీకు నమస్కారము; గినే నమ ః = గదాధరునకు నీకు నమస్కారము; దంష్ట్రిణే నమ ః =కోరలు గలిగిన నీకు నమస్కారము; మహావక్త్రాయ నమ ః =విశాల మైన గొప్పనోరు గలిగిన నీకు నమస్కారము; మహోదరాయ నమస్కారము=గొప్పకడుపు గలిగిన నీకు

నమస్కారము; శుచిరోమ్ణే నమ ః = పవిత్రమైన వెంట్రుకలుగల నీకు నమస్కారము; హరిచ్ఛ్రవే నమ ః =పచ్చని మీసములు గలిగిన నీకు నమస్కారము; ఊర్ధ్వకేశాయ నమ ః =పైకి ఆకాశమునకు ఎగసిన తల వెంట్రుకలుకల నీకు నమస్కారము; త్రిలోచనాయ నమ ః =మూడు కన్నులు గలిగిన నీకు నమస్కారము, గ్రీతావాదిత్ర నృత్యాంగాయ నమ ః =గీతము, వాద్యము, నృత్యము వీనికి దగిన దేహముగల నీకు నమస్కారము; గీత వాదనక ప్రియాయ నమ ః = గీతములు, వాద్యములు ఇష్టమైన నీకు నమస్కారము; మత్స్యాయ నమ ః = మత్స్యమువంటి జీవ స్వరూపుడ వైన నీకు నమస్కారము. జలినే నమ ః = జలమువంటి సంసారము కలిగిన నీకు నమస్కారము; జలాయ నమ ః =జలమువంటి సంసారస్వరూపునకు నీకు నమస్కారము; జల్యాయ నమ ః =జలాభిషేక యోగ్య (లింగ) స్వరూపునకు నీకు నమస్కారము; జవాయ నమ ః = వేగ స్వరూపునకు నీకు నమస్కారము; కాలాయ నమ ః = కాల స్వరూపునకు నీకు నమస్కారము; కలినే నమ ః =ధరణ రూపమైన ధర్మమును ధరించిన నీకు నమస్కారము (కలనం=ధరణం); కలాయ నమ ః =ధర్మ స్వరూపునకు నీకు నమస్కారము; వికారాయ నమ ః =విగతమైన కాల స్వరూపునకు నీకు నమస్కారము, సుకాలాయ నమ ః = మంచి కాలము యొక్క రూపమున ఉన్న నీకు నమస్కారము; దుష్కాలాయ నమ ః = చెడు కాలముయొక్క స్వరూపమున ఉన్న నీకునమస్కారము; క(కా)లనాశనాయ నమ ః =బంధహేతువైన ధర్మమును, కాలమును నశింపజేయు నీకు నమస్కారము; మృత్యువే నమ ః =జీవులకు మృత్యు స్వరూపుడవైన నీకు నమస్కారము; క్షయాయ నమ ః =విశ్వక్షయ స్వరూపునకు నీకు నమస్కారము; అంతాయ నమ ః = విశ్వాంత స్వరూపునకు నీకు నమస్కారము; క్షమాకరాయ నమ ః = భక్తులను క్షమించు నీకు నమస్కారము; అపాయకరాయ నమ ః = అపాయమును కలుగజేయు నీకు నమస్కారము; హరాయ నమ ః =భక్తుల పాపముల హరించు నీకు నమస్కారము; సంవర్తకాయ నమ ః =ప్రళయకారక స్వరూపునకు నీకు నమస్కారము; అన్తకాయ నమ ః = సర్వమును అంతమొనరించు నీకు నమస్కారము; సంవర్తక బలాహకాయ నమ ః = ప్రళయకాల మేఘ స్వరూపునకు నీకు నమస్కారము; నమస్కా రములు; అన్తకాయ నమ ః = సర్వమును అంతమొనరించు నీకు నమస్కారము, సంవర్తక బలాహకాయ నమ ః = ప్రళయకాల మేఘ స్వరూపుడవైన నీకు నమస్కా రము; ఘటాయ నమ ః = ఇష్టరూపమున భక్తులకు ఘటించు నీకు నమస్కారము; ఘటి కాయ నమ ః = జనులకు కర్మఫలములను ఘటింపజేయు నీకు నమస్కారము; ఘంటీ కాయ నమ ః = వాద్యఘంటను కలిగియున్న నీకు నమస్కారము; చూడాలోలాయ నమ ః

= జటాజూటముతో ప్రకాశించు నీకు నమస్కారము, బలాయ నమః =సర్వబల సంపన్నుడవైన నీకు నమస్కారము; అబలాయ నమః = బలాతీతుడవగు నీకు నమస్కారము; బ్రహ్మకాలాయ నమః =బ్రహ్మయొక్క కాలముగల నీకు నమస్కారము; అగ్ని వక్త్రాయ నమః =యజ్ఞ స్వరూపుడవై అగ్నియే ముఖముగాగల నీకు నమస్కారము; దండినే నమః = దండధారి పార్వతీ తపః పరీక్షలో కపటవటు దండధారివైన నీకు నమస్కారము; ముండినే నమస్కారము= పరమ హంస స్వరూపుడవైన నీకు నమస్కారము. దండధృగ్రూపాయ నమః = అపరాధ శిక్షారూప దండధారివగు నీకు నమస్కారము. చతుర్యుగాయ నమః = కృతాది చతుర్యుగ స్వరూపునకు నీకు నమస్కారము. చతుర్వేదాయ నమః = ఋగ్వేదాది చతుర్వేద స్వరూపునకు నీకు నమస్కారము. చతుర్హోత్రాయ నమః = నలుగురు హోతలుకలిపి తీసుకొన్న హవిస్స్వరూపుడవైన నీకునమస్కారము. చతుష్పథాయ నమః =చతుష్పథ బ్రాహ్మణ వేద స్వరూపునకు నీకు నమస్కారము.

చతురాశ్రమ వేత్రే నమః =బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ (భిక్షు) సన్యాసములను నాలుగు ఆశ్రమములు తత్త్వమును తెలిసిన నీకు నమస్కారము; చాతుర్వర్ణ్య కరాయ నమః =బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను నాలుగు వర్ణములను లోక కల్యాణమునకై ఏర్పరచిన నీకు నమస్కారము; క్షరాక్షర ప్రియాయ నమః = నశించుదాని యందు ఇది ఎట్లైనను నశించునదనియు, వాస్తవికతను చూపకయు, ఇది నశింపనిదని దీనిని చూడనవసరం లేదని వాస్తవికతను చూపక క్షరము నందు ఉద్భవించు బుద్ధితోను అక్షరము నందు క్షరాపత్తి లేకుండునట్లు చూచుటతోను అవి తనకు ప్రియములైనట్లుచూచు నీకు నమస్కారము. ధూర్తాయ నమః =క్రూరు లను వంచించు నీకు నమస్కారము. అగణాయ నమః =గణాతీతుడవైన నీకు నమస్కారము. అగణ్యాయ నమః =లెక్కకు మించిన వాడవైన నీకు నమస్కారము; గణాధి పాయనమః =ప్రమథ గణములకు అధిపతియైన నీకు నమస్కారము; రుద్రాక్ష మాల్యాంబర ధరాయ నమః =రుద్రాక్షలయొక్క మాలలను, రుద్రాక్ష యొక్క వస్త్రమును (కవచమును)ధరించిన నీకు నమస్కారము; గిరికాయ నమః = కాషాయ వర్ణము కలిగిన నీకు నమస్కారము; గిరిక ప్రియాయ నమః =కాషాయ వస్త్రములు ప్రియమైన వాడవైన నీకు నమస్కారము; శిల్పీశాయ నమః =చిత్రముల వ్రాయుట చెక్కుట మొదలగు శిల్పకళగల శిల్పులకు అధిపతియైన నీకు నమస్కారము; శిల్పినాం శ్రేష్ఠాయ నమః =విశ్వము అను శిల్పమును సృష్టించు బ్రహ్మాదులలో శ్రేష్ఠుడవైన నీకు నమస్కారము; సర్వ శిల్ప ప్రవర్తకాయ నమః =అన్ని శిల్పకళలను ప్రవర్తింపజేయు (నడపు) నీకు నమస్కారము; భగనేత్రాంతకాయ నమః =దక్షాధ్వర ధ్వంస మున సూర్యుని

నేత్రములను పెరికివేసిన నీకు నమస్కారము. చంద్రాయ నమ ః =షోడశ కళాత్మక చంద్రుని ధరించి చంద్రాత్ముడవైన నీకు నమస్కారము; పూష్ణోదన్త వినాశనాయ నమ ః =దక్షాధ్వరధ్వంసము వలన సూర్యుని దంతములను పెరికి వేసిన నీకు నమస్కారము. గూఢావర్తాయ నమ ః =రహస్యమైన పరిభ్రమణముగల నీకు నమస్కారము; గూఢాయ నమ ః =అభేద్యమై రహస్య స్వరూపునకు నీకు నమస్కారము; గూఢప్రతి నిషేవిత్రే నమ ః =గూఢముగా వాంఛిత ఫలదానముతో భక్తులను సేవించు నీకు నమస్కారము; తరణాయ నమ ః =సంసారమును తరింప చేయు నావవైన నీకు నమస్కారము; తారకాయ నమ ః =ప్రణవ స్వరూపుడవైన నీకు నమస్కారము; సర్వ భూతసుతా రణానాయ నమ ః =సర్వ ప్రాణులను సంసారము నుండి సులభముగా తరింపచేయు నీకు నమస్కారము; ధాత్రే నమ ః = ఆదికర్త యైన విష్ణువగు నీకు నమస్కారము; విధాత్రే నమ ః =భౌతిక స్రష్టయైన చతుర్ముఖ స్వరూపునకు నీకు నమస్కారము; సత్త్వానాం విధాత్రే నమ ః =ప్రాణులను చక్కగా పాడుచు ఉండజేయు నీకు నమస్కారము; ధారణాయ నమ ః =సర్వాధిష్ఠాన భూత కారణాత్మ రూపునకు నీకు నమస్కారము; అధరాయ నమ ః =నిన్ను ధరించు వాడు లేనట్టి నీకు నమస్కారము; సర్వబాధావధి భూత శుద్ధాత్ముడైన నీకు నమస్కారము; తపసే నమ ః = బ్రహ్మ విద్యాసాధనమైన తపోరూపునకు నమస్కారము; బ్రహ్మణే నమ ః =వేద స్వరూపునకు బ్రహ్మ స్వరూపునకు నమస్కారము; సత్యాయ నమః =బ్రహ్మ విద్యాసాధనమైన సత్యరూపునకు నీకు నమస్కారము; బ్రహ్మచర్యాయ నమః =బ్రహ్మ విద్యాసాధనమైన బ్రహ్మచర్య రూపునకు నమస్కారము; ఆర్జవాయ నమః =బ్రహ్మ విద్యాసాధనమైన ఋజుభావ (వంకర ప్రవర్తన లేక చక్కని ప్రవర్తన) ము గల నీకు నమస్కారము; భూతాత్మనే నమః =జరాయుజ అండజ ఉద్భిజ్జములైన సర్వప్రాణులకు ఆత్మయైన నీకు నమస్కారము; భూతకృతే నమస్కారము=ఆకాశ, వాయు, అగ్ని, జల, పృథివీ అను పంచ భూతముల పుట్టించు నీకు నమస్కారము; భూతాయ నమః = నిత్య సిద్ధ స్వరూపుడవగు నీకు నమస్కారము; భూతభవ్యభవోద్భవాయ నమ ః = భూత వర్తమాన భవిష్యత్ కాలములకు ఉత్పత్తి స్థానమైన ఆ శబల బ్రహ్మకుగూడ ఉత్పత్తి స్థానమైన నీకు నమస్కారము; భూలోకాయ నమః = భూలోక స్వరూపుడ వైన నీకు నమస్కారము; భువర్లోకాయ నమ ః = భువర్లోక స్వరూపునకు నీకు నమస్కారము; స్వర్లోకాయ నమ ః =స్వర్లోక స్వరూపునకు నీకు నమస్కారము. ఇతాయ నమః = సర్వగత స్వరూపునకు నీకు నమస్కారము. ఉత్పత్తయే నమః = సర్వమునకు ఉత్పత్తి స్వరూపుడవైన నీకు నమ స్కారము; మహేశ్వరాయ నమః = ఇతరులైన బ్రహ్మాదులకంటెను గొప్పవాడవైన నీకు నమస్కారము; ఈశానాయ నమ ః

=సర్వ భూతములకు సర్వాధిపతివైన నీకు నమస్కారము; వీక్షణాయ నమ ః = సర్వ దేవతల కంటె విశిష్టమైన చూపుగల నీకు సాక్షివైన, నీకు నమస్కారము, శాన్తాయ నమ ః =శాన్త స్వరూపుడవైన నీకు నమస్కారము; దుర్దాన్తాయ నమ ః =దుష్టులను దమింపజేయు (అణుచు) నీకు నమస్కారము; అదాన్త నాశనాయ నమ ః = ఇంద్రియములకు వశవర్తుడై వానిని నశింప చేయు నీకు నమస్కారము; బ్రహ్మా వర్తాయ నమ ః = నవబ్రహ్మలు నావర్తింప (త్రిప్ప)చేయు కాల స్వరూపునకు నీకు నమస్కారము; సురావర్తాయ నమ ః =దేవతలను (పుణ్యము క్షీణింపగా) మర్త్య లోకమునకు చేర్చి భూ స్వర్గములకు త్రిప్పు కాడవగు యజ్ఞ పుణ్యఫలమగుటచే నీకు నమస్కారము; కామావర్తాయ నమ ః =సంసారమునందు బంధించి కోరికలలో మానవులను త్రిప్పు నీకు నమస్కారము; కామబింబనిహర్త్రే నమ ః = కాముని యొక్క ఆకరమును దహింపచేసిన నీకు నమస్కారము; కర్ణికార రజః ప్రియాయ నమ ః = కొండగోగు పుప్పొడి ప్రియమైన నీకు నమస్కారము; ముఖ చంద్రాయ నమ ః = చంద్రాభిన్న ముఖ స్వరూపునకు నీకు నమస్కారము; భీమ ముఖాయ నమ ః = భయంకరమైన ముఖముగల నీకు నమస్కారము; సుముఖాయ నమ ః =చక్కని మంగళకరమైన ముఖముగల నీకు నమస్కారము; దుష్టులకు దుష్టమైన ముఖములుగల నీకు నమస్కారము; అముఖాయ నమ ః = ముఖములకు అతీతుడవైన (హృదయ సన్నిహితుడవైన) నీకు నమస్కారము; చతుర్ముఖాయ నమ ః = నాలుగు ముఖములు గల బ్రహ్మ స్వరూపునకు నమస్కారము; బహుముఖాయ నమ ః = ప్రాణులతో ఏకమై ఉన్నందున అనేక ముఖములుగల నీకు నమస్కారము; రణేసదా అభిముఖాయ నమ ః = యుద్ధమున ఎల్లప్పుడు శత్రువులకు ఎదురు ముఖము గలవాడై ఉండు నీకు నమస్కారము; హిరణ్యగర్భాయ నమః=తేజస్సు గర్భమున గల బ్రహ్మ స్వరూపుడవగు నీకు నమస్కారము; శకునయే నమః=పక్షివలె భూసంగము లేక ఆకాశమున విహరించు నీకు నమస్కారము; మహోదధయే నమ ః = మహాసముద్ర స్వరూపుడవగు నీకు నమస్కారము; పరాయ నమ ః =అందరికన్న మించిన నీకు నమస్కారము; విరాజే నమః=విరాట్ స్వరూపునకు నమస్కారము;(సమిష్ఠి స్థూల సూక్ష్మ కారణ శరీరోపహిత చైతన్య స్వరూపునకు నమస్కారము); అధర్మహన్త్రే నమః = అధర్మమును నశింపచేయు నీకు నమస్కారము; మహాదండాయ నమ ః = గొప్ప దండముగల నీకు నమస్కారము; దండ ధరాయ నమ ః =శిక్షాదండమును ధరించు నీకు నమస్కారము; రణప్రియాయ నమ ః = రణము ప్రియమైన నీకు నమస్కారము; గోతమాయ నమ ః =ఉత్తమ గో స్వరూపునకు నమస్కారము (గో=ఆవు) ఇంద్రియము, వాక్కు కావున గోశ్రేష్ఠ స్వరూపునకు నమస్కారమని భావము.

ఉత్తమ వాక్ స్వరూపునకు నమస్కారము; గోప్రతారాయ నమ ః = గోవులను విష జలమునుండియు, శిలావృష్టి నుండియు గోవర్ధన పర్వతమును ఎత్తుటచే వానిని ఆపద నుండి తరింపజేసిన శ్రీకృష్ణ స్వరూపుడవైన నీకు నమస్కారము; గోవృషేశ్వర వాహనాయ నమస్కారము=గో వృషములకు ఈశ్వరుడవైన నందీశ్వ రుడు వాహనముగా గలిగిననీకు నమస్కారము; ధర్మకృతే నమ ః =ధర్మకర్త యైన నీకు నమస్కారము; ధర్మస్రష్టే నమ ః =ధర్మమును సృష్టించి (నిర్మించిన) నీకు నమస్కారము; ధర్మాయ నమ ః =ధర్మ స్వరూపుడవగు నీకు నమస్కారము; ధర్మవిదే నమ ః =సత్యమైన ధర్మము తెలిసిన నీకు నమస్కారము; ఉత్తమాయ నమ ః = అత్యంత మహోన్నత స్వరూపునకు నీకు నమస్కారము.

త్రైలోక్య గోప్త్రే నమ ః = ముల్లోకములను రక్షించు నీకు నమస్కారము; గోవిందాయ నమ ః =భూమిని గోవులను సువాక్కులను ఇంద్రియములను రక్షించు నీకు నమస్కారము; మానదాయ నమ ః = దుష్టుల దురభిమానమును ఖండించు నీకు నమస్కారము; మానాయ నమ ః = పూజింపదగిన చిత్త సమున్నతి స్వరూపునకు నీకు నమస్కారము; తిష్ఠతే నమ ః = యోగాసనమున కూర్చుండు నీకు నమస్కారము; స్థిరాయ నమ ః = కావుననే చలనము లేకుండు నీకు నమస్కారము; స్థాణవే నమ ః = త్రైలోక్యధారణ స్తంభమైన నీకు నమస్కారము; నిష్కంపాయ నమ ః = ఏమాత్రము కదలికలులేని నీకు నమస్కారము; కంపాయ నమ ః = కాలానుగుణమైన భూకంపాది స్వరూపునకు నీకు నమస్కారము; దుర్వారణాయ నమ ః = మృత్యు రూపమువచ్చి దుఃఖముతో అతికష్టముతో కూడ వారింపఅలవి గాని నీకు నమస్కారము; దుర్విషదాయ నమః =అమృత స్వరూపుడవై దుష్టవిషమునైనను హరించు నీకు నమస్కారము; దుఃసహాయ నమ ః =యుద్ధమున ఎదిరించి సహింప అలవిగాని నీకు నమస్కారము; దురతిక్రమాయ నమ ః =యుద్ధమున అతి కష్టమున నైనను శత్రువు మించి పోవుటకు అలవి కాని నీకు నమస్కారము; దుర్ధరాయ నమ ః =యుద్ధమున శత్రువులచే అతికష్టమున గూడ ధరింపఅలవి గాని నీకు నమస్కారము;

దుష్టకంపాయ నమ ః =అతి కష్టమున గూడ శత్రువుచే భయపెట్ట నలవిగాని నీకు నమస్కారము; దుర్విదాయ నమ ః =దుష్ట ప్రక్రియలతోగూడ జయింప నలవి గాని నీకు నమస్కారము; జయాయ నమ ః = రణమున కేవల జయస్వరూపివగు నీకు నమస్కారము; శశాయ నమ ః =శీఘ్ర గమనముగల కుందేలువగు నీకు నమస్కారము; శశాంకాయ నమ ః =శీఘ్రగమనముగా గల చంద్ర స్వరూపుడవగు నీకు నమస్కారము;

శమనాయ నమ ః = యమధర్మరాజ స్వరూపుడవగు నీకు నమస్కారము; శీతోష్ణాయ నమః=శీత స్వరూపుడవై, దుష్టులకు ఉష్ణమైన అగ్ని స్వరూపుడవై, ఉభయ స్వరూపుడ వైన నీకు నమస్కారము; దుర్జరసే నమః= దుష్టులకు దుష్టమై తొందరలో మరణదాయియైన ముసలి తనపు స్వరూపముగల నీకు నమస్కారము; తృషే నమః=సంసారబద్ధులకు దప్పిక మరియు ఇచ్ఛా స్వరూపము దాల్చిన నీకు నమస్కారము, ఆధయే నమ ః =మానసీ వృధారూపునకు నీకు నమస్కారము; వ్యాధయే నమ ః =పాపులకు వ్యాధి స్వరూపుడవైన నీకు నమస్కా రము; వ్యాధి హన్త్రే నమ ః = భక్తులైన సజ్జనుల వ్యాధులను నశింపజేయు నీకు నమస్కారము; వ్యాధిగాయ నమ ః =వ్యాధిని హెచ్చించుటకును తగ్గించుటకును వ్యాధిలో అంతర్గతుడుగాఉన్న నీకునమస్కారము; సహ్యాయ నమః = ఆరోగ్య సుఖ స్వరూపు డవగు నీకునమస్కారము; యజ్ఞాయ నమ ః =యజ్ఞ స్వరూపుడవగు నీకు నమస్కారము, మృగవ్యాధినే నమ ః =యజ్ఞ మృగమునకు వ్యాధునివలె సంహరించు వాడవగు నీకు నమస్కారము; వ్యాధనామాకరాయ నమ ః = వ్యాధులకు నిధలై దుష్టుల బాధించు నీకు నమస్కారము; అకారాయ నమ ః =సద్భక్తులకు వ్యాధులను కలుగజేయని నీకు నమ స్కారము; శిఖండినే నమ ః = వ్యాధరూపమున నెమలి ఈకను ధరించిన నీకు నమ స్కారము; పుండరీకాక్షాయ నమ ః = కమలముల వంటి నేత్రములు గలిగి విష్ణు స్వరూపుడ వైన నీకు నమస్కారము; పుండరీక అవలోకనాయ నమ ః =తెల్లని కమలముల వంటి నేత్రములుగల నీకు, లేక బెబ్బులి చూపులునుగల నీకు నమస్కారము, దండధరాయ నమ ః = యమ స్వరూపునకు నీకు నమస్కారము; సదండాయ నమ ః =కపటవటువై పలాశదండమును ధరించిన నీకు నమస్కారము. శ్మశానవాసియై కాల దండమును ధరించిన నీకు నమస్కారము; దండముండ విభూషి తాయ నమ ః = చేతిలో కాలదండము చేతను, గోరిగిన తలచేతను లేక, కంఠమున తల పుఱ్ఱెల మాలచేతను అలంకరింపబడిన నీకు నమస్కారము; విషపాయ నమ ః = కాలకూట విషమును (సముద్ర మథనమున పుట్టిన దానిని) పానము చేసిన నీకు నమస్కారము; అమృతపాయ నమ ః =కాలకూట విషపానము జేసి దేవతలకై యమృతమును రక్షించిన నీకు నమస్కారము; సురాపాయ నమః =తాత్త్వికానంద రసమును త్రాగు నీకు, రక్షించు నీకు నమస్కారము; క్షీర సమపాయ నమస్కారము =క్షీరము వంటి సోమరసమును త్రాగు నీకు నమస్కారము; మధుపాయ నవః = తేనెను పానముజేయు నీకు నమస్కారము, ఆజ్యపాయ నమ ః =హోమ ద్రవ్యమైన నేతిని త్రావు నీకు నమస్కారము; సర్వపాయ నమస్కారము=ప్రళయ కాలమున సర్వము పానముచేయు నీకు నమస్కారము; మహా బలాయ నమస్కారము=మహాబలేశ్వర స్వరూపు

నకు నీకు నమస్కారము; వృషాశ్వవాహ్యాయ నమస్కారము= వేగమున అశ్వము వంటి వృషభముచే (ఆబోతుచే నందించే) మోయదగిన నీకు నమస్కారము; వృషభాయ నమ ః =నందీశ్వర స్వరూపునకు నీకు నమస్కారము. వృషభ లోచనాయనమ ః = కామముల వర్షించు కన్నులుగల నీకు వృషభము యొక్క కన్నులవలె విశాలములైన కన్నులుగల నీకు నమస్కారము. వృషభాయ నమ ః = వర్షించునట్టి మేఘ స్వరూపునకు నీకు నమ స్కారము; లోకానాం విఖ్యాతాయ నమ ః = లోకములకు విశిష్టముగా ప్రసిద్ధి చెందిన నీకు నమస్కారము; లోకసత్కృతాయ నమః = లోకములచే సత్కరింపబడిన నీకు నమ స్కారము; చంద్రాదిత్య చక్షుష్కాయ నమ ః = చంద్ర సూర్యులు నేత్రములుగా గల నీకు నమస్కారము; పితామహ హృత్కాయ నమ ః = బ్రహ్మయే హృదయముగా గల నీకు నమస్కారము; అగ్నయే నమ ః =అగ్ని స్వరూపునకు నీకు నమస్కారము; అపాం స్వరూ పాయ నమ ః = జల స్వరూపునకు నీకు నమస్కారము; దేవాయ నమస్కారము=దివ్య లీలల నోలలాడు నీకు నమస్కారము; ధర్మకర్మ ప్రసాది తాయ నమ ః =ధర్మ కర్మలచే అలంకరింపబడిన నీకునమస్కారము, బ్రాహ్మణోఽప్య వేద్య మహిమ్నే నమ ః = బ్రహ్మకు గూడ దెలియ అలవిగాని మహిమగల నీకు నమస్కారము; గోవిందస్యాప్య వేద్యమహిమ్నే నమ ః = ఉపనిష ద్వాక్కులచే తెలియబడు గోవిందునకు గూడ తెలియుటకు అలవిగాని మహిమగల నీకు నమస్కారము. పురాణ ఋషీణామప్య వేద్య మహిమ్నే నమః =పురాణ ఋషులకు గూడ తెలియ అలవిగాని మహిమగల నీకు నమస్కారము, అదృశ్య సూక్ష్మ మూర్తిభిః అస్మద్రక్షిత్రే నమ ః = చూడ అలవిగాని సూక్ష్మ మూర్తులచే మమ్ములను నీ పుత్రులను వలె రక్షించు నీకు నమస్కారము; భవద్రక్ష్యాస్మ ద్రక్షిత్రే నమ ః = రక్షింపదగిన మమ్ముల రక్షించు నీకు నమస్కారము; భక్తానుకంపినే నమ ః = భక్తుల దయదలచు నీకు నమస్కారము, భగవతే=సర్వైశ్వర్యముగల భగవంతునకు నీకు నమస్కారము.

పుంసాని కాని సహస్రాణి సమాహృత్య దుర్దశాయ నమః =వేలకొలది పురుషులను అజ్ఞానులను ఒక్కచోచేర్చి వారిని బాగుచేయుటకు అతి కష్టస్థితి నొందిన నీకు నమస్కారము. సముద్రాన్తే తిష్ఠతే ఏకస్మై నమః = కామముల చివర జ్ఞేయ–జ్ఞాన–జ్ఞాతృ భావ శూన్యుడగు ఒక్కనిగా ప్రకాశించిన నీకు నమస్కారము (సముద్రములు–కామములు); నిత్యం మద్గోప్త్రే నమస్కారము=ఎల్లప్పుడు నన్ను రక్షించు నీకు నమస్కారము; వినిద్రైః జితశ్వాసైః సత్త్వస్థైః సమదర్శిభిః స్వాత్మయోగేన దృశ్యమానాయ జ్యోతిషే నమ ః = నిద్ర వీడి ప్రాణాయామములచే శ్వాసను జయించి సత్త్వముతో సమదర్శనులైన వారిచే స్వాత్మ యోగమున చూడబడుచున్న జ్యోతిః స్వరూపుడవగు నీకు నమస్కారము; యోగాత్మనే

నమ ః = సాక్షాత్ యోగ స్వరూపుడవగు నీకు నమస్కారము; యుగాన్త సర్వభూత సంభక్షకాయ నమ ః = యుగాన్త ప్రళయమున సర్వభూతములను చక్కగా దిను నీకు నమస్కారము. తతో జలశాయినే నమ ః = ఆ తరువాత సముద్ర జలమున శయనించిన విష్ణు స్వరూపునకు నీకు నమస్కారము, రాహువదనే ప్రవిశ్యనిశి సోమంగ్రసతే నమ ః = రాహు ముఖమున ప్రవేశించి చంద్ర గ్రహణమును జేయు రాహు స్వరూపుడవగు నీకు నమస్కారము; రాహువదనే ప్రవిశ్య దివి అర్కంగ్రసతే నమ ః = రాహు ముఖమున ప్రవేశించి పగలు సూర్యుని గ్రహణము జేయు రాహు స్వరూపుడవగు నీకు నమస్కారము, సోమాగ్నయే నమ ః = సోమ చంద్ర స్వరూపునకు నీకు అగ్ని స్వరూపునకు నీకు నమ స్కారము; సర్వదేహి దేహస్థాంగుష్ఠ మాత్ర పురుషాయ నమ ః = సమస్త శరీరధారుల శరీరమందు బొటనవ్రేలు అంతటి పురుషుని రూపమున నున్న నీకు నమస్కారము; గర్భాదుత్పత్తి స్వరూపాయ నమ ః =గర్భము నుండి పైకి ఎగిరి వెలువడి స్వాహాకారమును బొందు రూపమున ఉన్న నీకు నమస్కారము; గర్భాదధోభాగ గన్తృ స్వరూపాయ నమ ః = గర్భమునుండి క్రిందుగా వెలువడి స్వధను పొందువారి రూపమున నున్న నీకు నమస్కారము. ప్రాణినాం రోదన కారణాయ నమ ః = ప్రాణులు ఏడ్చుటకు కారణుడవైన నీకు నమస్కారము; ప్రాణినాం రోదన ప్రేరకాయ నమస్కారము= ప్రాణులను ఏడ్పింప చేయు నీకు నమస్కారము; ప్రాణినాం హర్షకారణాయ నమ ః = ప్రాణులు సంతసించుటకు కారణమగు నీకు నమస్కారము; ప్రాణినాం హర్షణ ప్రేరకాయ నమః = ప్రాణులు ఇతరులను హర్షింపజేయుటకు ప్రేరకుడవైన నీకు నమస్కారము; సముద్రగత ప్రాణి స్వరూపాయ నమ ః = సముద్రమున నున్న ప్రాణుల స్వరూపుడవగు నీకు నమస్కారము. నదీ దుర్గగత ప్రాణి స్వరూపాయ నమ ః = నదీ దుర్గములందున్న ప్రాణు(రుద్రు)ల స్వరూపుడవగు నీకు నమస్కారము; పర్వతగత స్వరూపాయ నమ ః = పర్వతమున ఉన్న ప్రాణు(రుద్రుల) స్వరూపుడవగు నీకు నమస్కారము, గుహాగత ప్రాణి స్వరూపాయ నమ ః = గుహలోనున్న (రుద్ర) స్వరూపునకు నీకు నమస్కారము; వృక్షమూలగత ప్రాణి స్వరూపాయ నమ ః =వృక్షమూలమున ఉన్న ప్రాణు(రుద్రు)ల; స్వరూపాయ నమ ః = గోవుల కొట్టము నను‌న్న ప్రాణుల(రుద్రు)ల స్వరూపుడవగు నీకు నమస్కారము; కాన్తారగహ గతప్రాణి స్వరూపాయ నమ ః = దట్టమైన అడవులలో ఉన్న ప్రాణు(రుద్రు)ల స్వరూపుడవగు నీకు నమస్కారము; చతుష్పథగత ప్రాణి స్వరూపాయ నమ ః = నాలుగు త్రోవలు కల సినచోట ఉన్న ప్రాణు(రుద్రు)ల స్వరూపుడవగు నీకు నమస్కారము; రథ్యాగతప్రాణి స్వరూపాయ నమస్కారము = రాజ మార్గమున ఉన్న ప్రాణు(రుద్రు)ల స్వరూపుడవగు

నీకు నమస్కారము; చత్వరగత ప్రాణి స్వరూపాయ నమ ః = అగ్నిహోత్ర గృహమున ముంగిటలో ఉన్న ప్రాణు (రుద్రు)ల స్వరూపుడవగు నీకు నమస్కారము, సభాగత ప్రాణి స్వరూపాయ నమ ః = సభలో ఉన్న ప్రాణు(రుద్రు) ల స్వరూపుడవగు నీకు నమస్కారము, చంద్రార్క మధ్యగత వ్యక్తి స్వరూపాయ నమస్కా రము = చంద్ర సూర్యులమధ్యనున్న (రుద్రు)ల స్వరూపుడవగు నీకు నమస్కారము, చంద్రార్క రశ్మిగత వ్యక్తి స్వరూపాయ నమ ః = చంద్ర సూర్యుల కిరణములలో ఉన్న (రుద్రు)ల స్వరూపుడవగు నీకు నమ స్కారము; రసాతలగత వ్యక్తి స్వరూపాయ నమ ః = పాతాళ లోకమున ఉన్న రుద్రుల స్వరూపుడవగు నీకు నమస్కారము; రసాతలా త్పారంగత వ్యక్తి స్వరూపాయ నమ ః =పాతాళ లోకమున కంటె ఇంకనులోతుగా వెళ్ళిన రుద్రుల స్వరూపుడవగు నీకు నమ స్కారము, సూక్ష్మగత వ్యక్తి స్వరూపాయ నమః = సూక్ష్మములోనున్న రుద్రుల స్వరూపు డవగు నీకునమస్కారము, స్థూలగత వ్యక్తి స్వరూపాయ నమ ః =స్థూలములలో ఉన్న రుద్రుల స్వరూపుడవగు నీకు నమస్కారము. కృశగత వ్యక్తి స్వరూపాయ నమ ః = కృశించి నీ వారిలోనున్న రుద్రుల స్వరూపముగల నీకు నమస్కారము, హ్రస్వగత వ్యక్తి స్వరూపాయ నమ ః = పొట్టిగా ఉన్న వారిలో ఉన్న రుద్రుల స్వరూపుడవగు నీకు నమస్కారము.

సర్వస్మై తే నమ ః = అంతటనున్న దేవుడవు అగు నీకు నమస్కారము; సర్వగాయ దేవాయతే నమః = అంతటనున్న దేవుడవు అగు నీకు నమస్కా రము; సర్వభూతపతయే భవతే నమః = సర్వప్రాణులకు పతివైన నీకు నమస్కారము; సర్వ భూతాంతరాత్మనే నమ ః = సర్వ ప్రాణులయందు ఆత్మవైన నీకు నమస్కారము; కావున నీవు యజ్ఞమునకు పిలువబడలేదు; వివిధ దక్షిణైః యజ్ఞైః ఇజ్య మానాయ తే నమ ః = అనేకవిధ దక్షిణలు గల యజ్ఞములచే యజ్ఞము చేయు (యజ్ఞముచే పూజింప) బడు నీకు నమస్కారము; సర్వస్య కర్త్రే తే నమ ః = సమస్తము నకు కర్తయైన నీకునమస్కారము. కావుననే నీవు ప్రత్యేకముగా నా యజ్ఞమునకు పిలువబడ లేదు; స్వసూక్ష్మమాయా మోహకాయతే నమ ః = నీ సూక్ష్మమాయచే నన్ను మోహింపజేయు నీకు నమస్కారము. ఈ కారణము వలననే నీవు నా యజ్ఞమునకు పిలువబడలేదు; శరణాగత ప్రసన్నాయ నమ ః = రక్షింపుమని వచ్చిన వారిని అనుగ్రహించు నీకు నమస్కారము. దేవదేవేశాయ నమ ః = దేవతల దేవతలకు ఈశ్వరుడవైన నీకు నమస్కారము. మద్గతయేతే నమ ః = నాకు గమ్యస్థానమై జ్ఞాన స్వరూపుడవగు నీకు నమస్కారము; మత్ర్పతిష్ఠాయ నమ ః = నాయొక్క ప్రతిష్ఠాత్మకుడవగు నీకు నమస్కారము, మదేకైక గతయే నమ ః = నాకు వేరొక గతిలేని ఒకే గతివైన నీకు నమస్కారము; దక్షప్రజాపతి ఈ పైవిధముగా మహాదేవుడగు శివుని

స్తుతించి విరమించెను. (ఆగెను) భగవంతుడైన శివుడుగూడ మిక్కిలిసంతసించెను. తరువాత మరల దక్ష ప్రజా పతితో ఇట్లు పలికెను.

ఓ ! దక్ష ! ఓ ! సువ్రత! ఈ నీ స్తుతిచేత నేను సంతుష్టుడ నైతిని. ఇట పెక్కు మాటలు చెప్పనేల? నీవు నా సమీపమునకు చేరగలవు అని పలికి త్రైలోక్యాధిపతియైన భవుడు వాక్య నైపుణ్యముతో తిరుగులేని విధముగాను ఓదార్పు రీతిలో ఈ విధముగా అనెను–ఓ దక్షా! జరిగిన యజ్ఞ విఘ్నమును గూర్చి కోపింపవలదు. యజ్ఞమును ధ్వంసము జేయగల శక్తి నా కొక్కనికే గలదు. మరెవ్వరికిని లేదు. పూర్వము గూడ ఎవ్వరికిని ఈ శక్తి ఉన్నట్లు కనబడదు.

ఓ సువ్రతుడా! దక్షా! నా నుండి బహుళమైన ఈవరమును గ్రహింపుము. ప్రసన్న ముఖము గలవాడవై ఏకాగ్రమైన చిత్తముతో వినుము. ఓ దక్షప్రజాపతీ! నా అనుగ్రహ మున నీవు వేయి అశ్వమేధ యాగముల యొక్కయు, నూరు వాజపేయ యాగముల యొక్కయు ఫలములను పొందగలవు. నేను, అంగములతో గూడిన వేదములను, సాంఖ్యములను, యోగములను సంపూర్ణముగా ఉద్ధరించియు, దేవ దానవులచేత గూడ చేయుటకు అలవిగాని విపులమైన తపమును చేసియు, సర్వపాప విమోక్షణమై శుభమైన ఒక పాశుపత వ్రతమును. ఏర్పరచితిని ఐదు విధములైన అర్థములతో (సద్యో జాతానికి పంచబ్రహ్మ మంత్రములతో ఆగ్నేయ భస్మను గ్రహించి త్రియంబక మంత్రమున జలముతో తడిపి పూసుకొనుట) గూఢమైనది. ప్రాజ్ఞులను మించినవారిచే నిర్మింపబడినది. బ్రాహ్మణుడి వర్ణములచేతను బ్రహ్మచర్యాది ఆశ్రమముల చేతను చేయ బడినదై ఒకచోట విపరీత మైనది(విరుద్ధమైనది) ఒకచోట సమమైనది. వేదార్థములచేతనే నిశ్చయింపబడినది. పశువులయొక్క (జీవులయొక్క) పాశమును, (అవిద్యా సాంసారికాది బంధమున) వదిలింప జేయునది ఓ దక్షా నా చేత పాశుపత వ్రతము అన్ని ఆశ్రమముల వారికిని (సన్యాసులకు గూడ) ఆచరణీయమైనదిగా నిర్మింపబడినది. శుద్ధమైనది, సర్వ పాపములను తొలగించు నది, దీనిని ఆచరించి నందు వలననే చక్కని అనంతమైన ఫలము ఓ మహాభాగ్యుడ వైన దక్షా! నీకు కలుగుగాక! మానసికమైన జ్వరమును వదిలిపెట్టుము.

అపరిమిత పరాక్రమియైన మహాదేవుడు ఈ విధముగా పలికి, భార్యతోను, తన పరివారముతోను అదృశ్యుడయ్యెను. తరువాత భవుడు (శివుడు) బ్రహ్మచే యజ్ఞ భాగమును పొంది, సర్వ ధర్మములు తెలిసినవాడై (అంతకు పూర్వము దక్షయజ్ఞము లేడియై రుద్ర భయమున పరుగిడగా దానిని వెంబడించినపుడు రాలిన తన చమట బిందువునుండి

పుట్టిన జ్వరము యజ్ఞమును దహించివైచెను) ఆ జ్వరమును సర్వ ప్రాణుల శాంతికై అచట అనేక విధములుగా విభజించెను. ఆ విధమును ఓ బ్రాహ్మణులారా! వినుడు–

ఏనుగులకు తలనొప్పి, పర్వతములకు శిలారుజము (శిలాజిత్తు అను ఖనిజము), నీటికి నాలిక (నాచువంటిది), పాములకు కుబుసము. ఎద్దులకు కుంటితనము కాలి రోగము, భూమికిచౌడు, ఏనుగులకు (పశువులకు)గూడ కనుచూపు అడ్డుకొనుట, గుఱ్ఱము లకు కంధరంధ్రములో మొలచిన మాంస ఖండము, నెమళ్లకు పింఛములు రాలుట, కోకిలలకు కంటి రోగము–ఇవి ఒక్కటిగా ఉన్న జ్వరము అనేక విధముగా విభజింపబడి అనేక స్థానములలో తన్నాశకముగా ఉంచబడినది అని మహాత్ములచే చెప్పబడినది. అన్ని మేకలకు ఒక విధమైన పిత్తము జ్వరము అని వినికిడి. అన్ని చిలుకలకును మంచు జ్వరమని చెప్పబడినది. మనుష్యులయందు మాత్రము ఓ సర్వజ్ఞుడా! ఈ జ్వరము మరణ మున పుట్టుకలోను, ఈ రెంటి మధ్యను ఎల్లప్పుడు ప్రవేశించునని చెప్పబడినది. ఈ జ్వరము అనునది మిక్కిలి భయంకరమైన తేజము. ఇది సర్వ ప్రాణులకు ఈశ్వరుడుగా నమస్క రింపదగినది, గౌరవింపదగినది.

దీనమయిన మనస్సులేక, ఏకాగ్రచిత్తుడై ఎవడు ఈ జ్వరఉత్పత్తిని చదువునో వాడు సర్వరోగ విముక్తుడై సంతోషముతో గూడి తానుకోరిన కోరికలను పొందును. దక్షుడు చెప్పిన ఈస్తోత్రమును ఎవడు వినునో, పఠించునో, వానికి ఎట్టి అపయశమును కలుగదు. దీర్ఘాయువును కూడ పొందగలడు. సర్వదేవులలో యోగవంతుడై హరుడు వరిష్ఠు డైనట్లే ఈ సహస్ర నామ స్తుతియు అన్ని స్తుతులలో బ్రహ్మ నిర్మితమైన వరిష్ఠము. కీర్తి, రాజ్య సుఖైశ్వర్యములు, లాభముగా పొందబడిన విత్తము, ఆయువు, ధనము–వీనిని కోరువారికి శివుడే స్తుతిచే స్తోత్రము చేయతగినవాడు. విద్యను కోరినవారికి విశేషముగా భక్తితో అతిప్రయత్నమున ఈ స్తుతిచే స్తుతింపదగినవాడు. రోగము నందిన వాడు, దుఃఖమునంది నవాడు, దొంగలచే భయము చెందినవాడు, తక్కిన భయములచే పీడింప బడినవాడు, రాజ్యకార్య నియుక్తుడైనవాడును, మహాభయముచే విముక్తుడగును. ఈ దేహము చేతనే వాడు గణములకు పతి అగును. ఈ లోకమున సుఖమును పొంది గణమునందే ఉండును. ఏ గృహమున శివుడు స్తుతింపబడునో ఆ గృహమున యక్షులు, పిశాచులు, నాగులు, వినాయకులును ఎట్టి విఘ్నములను కలుగచేయజాలరు. ఈ స్తుతిని భక్తితో బ్రహ్మచారిణియై విన్నగాని, చదివిన గాని, స్త్రీ తన తండ్రి పక్షమువారిచేతను భర్త పక్షమువారిచేతను దేవునివలె పూజ్యురాలు అగును.

ఈ మొత్తము స్తోత్రము విన్నవారికిని మాటి మాటికి చెప్పినవారికిని వారి సమస్త కార్యములు నిర్విఘ్నముగా సిద్ధించును. ఈ స్తోత్రమును పలువురితోబాటు చదివినచో మనస్సులో అనుకొన్నదియు, మాటతో చెప్పినదియు సర్వమును సుసంపన్నమగును. కుమారస్వామితో కూడుకొనియున్న శివుని యొక్కయు, దేవియైన పార్వతి యొక్కయు, వాహనమైన నందీశ్వరుని యొక్కయు, నిగ్రహ నియమములతో తన వైభవము కొలది పూజ జేసి, ఏకాగ్రచిత్తమైన యోగమునందున్న వాడై వెంటనే వరసగా ఈ నామములను పఠింపవలెను. అట్లుచేసిన మానవుడుకోరిన కోరికలను సుఖములను పొందును. మరణించినపుడు వేల స్త్రీలతో చుట్ట బడినవాడై స్వర్గమునందును, సాంసారిక సర్వకర్మలతో వదిలిపెట్టినంతగా అంటిపెట్టుకొన్నను, సమస్త పాపములతో కూడియున్నను, దక్షుడు చేసిన ఈ స్తుతిని పఠించినచో ఆ పాపముల నుండియు, బంధముల నుండియు పూర్తిగా విముక్తుడగును. మరణించిన తరువాత శివగణ సాలోక్యమును పొందును. సురాసురులచే పూజింపబడును. ఇంద్రునివలె శాస్త్రవిధితో కూర్చిన విమానమున విరాజిల్లును. పంచ భూతప్రళయము జరుగువరకు ఉండువాడై, రుద్రునకు సేవకుడు అగును అని ప్రభువైన పరాశర సుతుడైన వ్యాసుడు అనెను. దీనిని ఎవ్వడు తెలియడు. దీనిని ఎవ్వరికిని (అయోగ్యునకు) వినిపించరాదు. పరమ రహస్యమైన ఈ స్తోత్రమును విని పాపకారులైనను వైశ్యులు, స్త్రీలు, శూద్రులును రుద్ర లోకమును పొందుదురు. బ్రాహ్మణుడు ఈస్తోత్రమును ప్రతి పర్వములందు బ్రాహ్మణులకు వినిపించిన రుద్ర లోకమును పొందును. ఇందులో సందియము లేదు. (30)

దేవవంశవర్ణనము

సూతుడు ఇట్లు చెప్పెను :

దక్షుని విషయమై శివునివల్ల ఇచట నడచిన మీ కథ పాప ప్రణాశినిగ అంగీకరింపబడినది. పితృవంశ ప్రసంగమున ఈ కథ చెప్పబడినది. ఆ తరువాత పితరుల అనుక్రమమున దేవతలను గురించి చెప్పబోవుచున్నాను. పూర్వము త్రేతాయుగ ప్రారంభమున స్వాయంభువ మన్వంతరమున దేవతలుండిరి. యజ్ఞమున పుట్టిన ఆ దేవతలు 'యాగములు' అని అనబడిరి. జితులు, జిదజితులు అనువారు బ్రహ్మయొక్క పుత్రులైన అజితులు. వీరు స్వాయంభువునకు మానస పుత్రులు శుక్రులను పేరుగలవారు.

వీరు తృప్తిమంతులై దేవతల మూడో గణములుగా తలపబడిరి. ఛందోగులైన ముప్పది ముప్వురుందరు స్వాయంభువునివారు. యదువు, యయాతి, అను ఇద్దరు దేవతలు,

దీధయుడు, స్రవసుడు, మతి, విభాసుడు, క్రతువు, ప్రజాతి, విశతుడు, ద్యుతి, వాయసుడు, మంగలుడు అను ఈ 12 గురుయాములు (యాములును దేవతలే)గా చెప్పబడిరి. అభి మన్యువు, ఉగ్రదృష్టి, సమయుడు, శుచివ్రతుడు, కేవలుడు, విశ్వరూపుడు, సుపక్షుడు, మధు పుడు, తురీయుడు, నిర్హపుడు, యుక్తుడు, గ్రావజినుడు–అనువారు, యమినుడు, విశ్వుడు, దేవాద్యుడు, యవిష్ఠుడు, అమృతవంతుడు, అజిరుడు, విభువు, విభావుడు, మృలికుడు, దిదేహకుడు, శ్రుతి శృణుడు, బృహచ్ఛక్రుడు అను వారును పంద్రెండుగురు దేవతలు.

వీరు స్వాయంభువ మన్వంతరమున సోమపాయులై (సోమ రసమును త్రాగువారుగా ఉండిరి. వీరు వెలుగు విరజిమ్ము గణములు. వీరవంతులు, మహాబలులును కూడా. వారికి ఎల్లప్పుడు మొదటి విభువు విశ్వపాలకుడునునై ఇంద్రుడు ఉండెను. అప్పుడు అసురులు అనువారు, వారికి దాయాదులైన బాంధవులు (ఆస్తిని పంచుకొనదగిన సోదరులు). సుపర్ణయక్ష, గంధర్వులు, పిశాచ, ఉరగ–రాక్షసులు, అశ్వినీ దేవతలు ఇరువురును కలిసి ఎనమండుగురును పితృదేవతలతో గలిపి దేవయోనులు (దేవజాతిలో పుట్టినవారు). స్వాయంభువమన్వంతరమున వీరి సంతానము వేలకొలది గతించిరి. వారు ఆయుష్యము, బలము, ప్రభావము, రూపము వీనితో చక్కగా గూడుకొన్న వారు. ఇచట అనవసర ప్రసంగము జరగగూడదని వారిని గూర్చి విస్తరముగా జెప్పబడుట లేదు. ప్రస్తుత స్వాయంభువ మనువు సృష్టి కాలమని తెలుసుకొనవలెను. స్వాయంభువ మనువు కాలము గడవగా వైవస్వతమనువు సృష్టి కాలము ప్రజలచేతను, దేవతలచేతను, ఋషులచేతను, పితరులచేతను వర్తమానముగా చూడబడినది.

వారిలో పూర్వము సప్తర్షులుగా ఉన్నవారిని వినుడు. భృగ్వంగిరుడు, మరీచి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అత్రి, వసిష్ఠుడు. వీరు స్వాయంభువ మన్వంతరమున ఏడుగురు ఋషులు. అగ్నీధ్రుడు, అతిబాహుడు, మేధుడు, మేధాతిథి, వసువు, జ్యోతి ష్మంతుడు, ద్యుతిమంతుడు, హవ్యుడు, సవనుడు, పుత్రుడు అను ఈ మహాతేజస్వులు పదిమంది స్వాయంభువమనువు యొక్క పుత్రులు.

వాయువుచే చెప్పబడిన వీరు, మహాబలవంతులై స్వాయంభువ ప్రథమాంతర మున ఉండిన రాజులు. అసురులతోను, గంధర్వులతోను, యక్ష, ఉరగ, రాక్షసులతోను; పిశాచ, మనుష్యులతోను; సుపర్ణ, అప్సరో గణములతోను వీరి అనుక్రమము నూరేండ్లలో కూడ చెప్పతరము గాదు. అట్లే బహుత్వమువలన వీరి కులమునందు వీరి నామధేయముల సంఖ్యయు చెప్పవలనుపడదు. స్వాయంభువమన్వంతరమున ఏయే పేరిట కులములు

ఉండెనో అవి అన్నియు దక్షిణ, ఉత్తర అయనముల యొక్కయు, ప్రభవాది సంవత్సరముల యొక్కయు, కృతాది యుగముల యొక్కయు క్రమములతో బహుళమైన కాలముతో గతించినవి అని చెప్పెను. అంతట.....

"సర్వ భూతములను అపహరించు భగవంతుడైన కాలుడు ఎవరు. ఆతని వల్ల ఏమి సంభవించును? ఆతనికి మూలమేమి? ఆతని తత్త్వము (నిజస్వరూపము) ఏమి? ఆతని జనకుడు కుమారుడు ఎవరు? ఆతనికి ఏది కన్ను? ఏది మూర్తి? ఆతని అవయవము లేవి? ఆతని పేరేమి? ఆతని ఆత్మ యెవరు? మాకు ఇదంతయు చెప్పుడు" అని ఋషులు అడిగిరి.

సూతుడు చెప్పెను :

కాలము యొక్క ఉనికి ఎట్టిదో వినుడు. విని చక్కగా బుద్ధియందు నిలుపు కొనుడు. కాలమునకు సూర్యుడు యోని (పుట్టు స్థానము) అది నిమేషము (కనురెప్ప పాటు కాలము) సంఖ్య కన్ను. ఆకారము రాత్రిపగలును. అవయవములు నిమేషములు. నూరేండ్లు ఈతని నామము, ఆత్మకళ (30 కాష్టల కాలము=540 కనురెప్ప పాట్ల కాలము) భూత, భవిష్యత్, వర్తమానకాలరూపమైనది ఆత్మ. ప్రజాపతి (బ్రహ్మ), ఐదుగా విభజించిన కాలావస్థను (స్థితిని)వినుడు. దినములు, పక్షములు, నెలలు, రెండేసి నెలలతో ఏర్పడిన ఋతువులు, ఆరేసి మాసములతో ఏర్పడిన ఆయనములు. ఇవి కాలము యొక్క అయిదు దశలు. మొదటి మొత్తము సంవత్సరము. రెండవది పరివత్సరము, మూడవది ఇద్వత్సరము, నాలుగవది అనువత్సరము. ఐదవది (అనగా ఐదేండ్లకాలము) కాలము. అది యుగము అను పేరుగలది. వానియొక్క తత్త్వమును చెప్పెద వినుడు.

ఋతువు అగ్ని అని చెప్పబడినది సంవత్సరముగా సమ్మతమైనది. సూర్యునిలో సారభూతమైనది కాలాగ్ని పరివత్సరము. ఆతని గతి (నడక)యు శుక్లపక్ష, కృష్ణపక్ష రూపమైనది. జలసారముతో నిండినవాడు ఖగుడు (సూర్యుడు, చంద్రుడు) ఆతడు ఇడా వత్సరము, సోముడు (చంద్రుడు), అని పురాణమున నిశ్చయమైన మతము. ఏడు గుఱ్ఱము (కిరణము)ల రూపమున ఉన్న శరీరములచేత లోకములను తపింపజేయువాడు, లోకములను వేగముగా సృష్టించువాడు అయిన వాయువు ఆ సంవత్సరము అహంకారం వలన బ్రహ్మనుండి రోదించుచు పుట్టినవాడు రుద్రుడు అనువత్సరమువానికి ఐదేండ్లు. యధిపతులకు, (అగ్ని, సూర్య, సోమ, వాయు, రుద్రులకు) నీలలోహితుడు (నలుపు, ఎరుపు వర్ణముగల) శివుడు కలిగెను. వారితత్త్వమును చెప్పెదను వినుడు. అంగ ప్రత్యంగ

సంయోగము వలన కాల స్వరూపుడు బ్రహ్మ, ఆతడు ఋగ్వేద, సామవేద, యజుర్వేదములు పుట్టినచోటు. పై అయిదు విధములైన వత్సరములకు పతియైన ఈశ్వరుడు. ఆతడు అగ్ని, యజుస్సు, సోముడు. ఆతడు భూతము, ఆతడు ప్రజాపతి(బ్రహ్మ). ఆతడే సంవత్స రము అనియు, సూర్యుడనియు, అగ్నిఅనియు విద్వాంసులచే చెప్పబడెను. ఈ విధముగ కాలవిభాగములైన మాస, ఋతు, ఆయనములకును అట్లే గ్రహ నక్షత్ర శీత, ఉష్ణ, వర్ష, ఆయుః కర్మలకును, కాలప్ర విభాగములైన దివసములకును జోడింపబడినవాడు సూర్యుడు. అతడు వైకారికుడు (కాలమునుబట్టి వికారమును జెందువాడు) నిర్మలాత్ముడు. బ్రహ్మ పుత్రుడు. బ్రహ్మయును, ఒక్కడయ్యును అనేక స్వరూపములు గలవాడు. దినము, మాసము, ఋతువు–వీని స్వరూపములుగలవాడు పితామహుడు (తండ్రులను పుట్టించిన వాడు). అదితికి పుట్టినవాడు విశ్వమును కన్నవాడు, కాంతితో ప్రకాశించువాడు, ప్రాణులను జీవింప చేయువాడు, బ్రహ్మచే సత్కరింపబడినవాడు, ప్రాణులకు పుట్టుకయైన వాడు, నాశనమైన వాడును. కావున భాస్కరుడు (కాంతి కలుగజేయువాడు). తారాభిమానియై సోముడు (చంద్రుడు) మూడవ పరివత్సరముగా తెలియదగినవాడు. అతడు అన్ని ఓషధులకు పతి కావున ప్రపితామహుడు (బ్రహ్మ). సర్వ ప్రాణులకు జీవనాధారము, యోగక్షేమములు కలుగ జేయువాడు (కోరినది కూర్చి రక్షించువాడు). తన కిరణములచే చూచుచున్నవాడై జగమును ఎల్లప్పుడు రక్షించును. తిథులకును, పర్వసంధులకును పూర్ణిమ, అమావాస్యలకును కారణభూతుడు. నిశాకరుడు (రాత్రి అంతయు తన కాంతిచేత సుఖకరముగ చేయువాడు) అమృత స్వరూపుడు (సముద్రము నుండి అమృతం తోడబుట్టిన వాడు). కావున ప్రజాపతి (బ్రహ్మ). కావున ఆ సోముడు పితృమంతుడు, ఋగ్యజుర్వేదాత్మ కుడు. ప్రాణ, అపాన, సమాన, వ్యాన, ఉదాన రూపములైన పంచ ప్రాణ వాయువుల క్రియలచేత లోకమున ప్రాణుల సర్వ చేష్టలను చేయించువాడు, ప్రాణ, అపాన, మాన వాయువులను కూడ నడిపించువాడు. మనోబుద్ధిస్మృతి (జల) స్వరూపములైన పంచేంద్రి యముల యొక్క (త్వక్, చక్షు, శ్రోత, జిహ్వా, ఘ్రాణముల యొక్క) క్రియలను చేయించు దానివలె సమాన కాలమునకు సాధనమైనవాడును, సర్వాత్ముడును సర్వ లోకముల తను ఆవహవాయువుతో ఆవహించి ఉండువాడు. (ఆవాహ) ప్రవహ, సంవహ, ఉద్వహ, వివహ, పరివహ, పరావహములను ఏడు వాయువులచే సర్వ ప్రాణులను సృష్టించువాడు, నిత్యము సర్వసామ్య ప్రతిపత్తితో జగముయొక్క స్థితిని నిర్వహించువాడు, ప్రభంజనుడు (విజృంభించి నపుడు సర్వమును ధ్వంసము చేయువాడును), అగ్నికిని (దానినుండి పుట్టినందున) జలమునకును (దానినుండి పుట్టినందున)భూమికిని, సూర్యునకు చంద్రునకును పుట్టు స్థానమైన వాయువు ప్రజాపతియే (బ్రహ్మ). పంచభూతములలో ఒకటి. వాయు రూపమున

లోకమంత నిండిలోకస్వరూపమైనది. కావున ప్రపితామహుడు (బ్రహ్మ). భూమిలో ఓషధులు క్షీణించినపుడు చక్కగా ఇష్ట ఫలములను కోరిన బ్రహ్మ మొదలగు దేవతలచే మూడేమూడు కపాలములచేతను అంబకములచేతను భగవంతుడు హోమము చేసి పూజింపబడుటచే త్ర్యంబకుడు అనబడెను. గాయత్రి, త్రిష్టుప్, జగతి అని ఉన్న ఛందస్సులే త్ర్యంబకములను పేరులతో ఆసవనమునకు (యజ్ఞమునకు) యోనులుగా (నిర్వహణ సాధనములుగా) ఉండును. తమ శక్తితో ఏకత్వమును పొందినవియై త్రివిధములైన ఆ గాయత్రి, త్రిష్టుప్, జగతీ ఛందస్సులచే మూడు సాధనములుగల పురోడాశము కలదిగను, మూడు కపాల ములు కలదిగను ఆ సవనము తలంపబడినది.

ఈ విధముగా విద్వాంసులచే ఐదేండ్ల యుగము చెప్పబడినది. దానినే ద్విజులు (బ్రాహ్మణులు) ఐదు విధముల స్వరూపముగల సంవత్సరము అనిరి. అది వసంత, గ్రీష్మ, వర్ష, శరత్, హేమంత, శిశిరములను ఋతువులను ఆరింటిని జనింపజేసెనట. ఋతువులు పుత్రులుగా గలవి యైదేడులు. ఇది సంగ్రహముగా సృష్టి–అని ఈ విధముగా ఈవాయువు ప్రాణులకు జీవితప్రాయుడు. నది తన వేగముతోగూడిన దానిని సంహ రించుచు పరుగిడినట్లే, కాలము (వాయువు) కూడ తన వేగముతో కలిపికొని సర్వమును సంహరించుచు పరుగిడును. కావున కాలవాయువు అహోరాత్రములు చేతులుగా గలద య్యెను. ఈ వాయువులే ప్రజలకు పతులై సర్వప్రాణులకు ప్రధానులుగను, సర్వలోకములకు పితరులుగను లోకాత్ములుగను కీర్తింపబడిరి. భవుడు (శివుడు) ధ్యానము చేయుచున్న బ్రహ్మ యొక్క ముఖమునుండి పైకి వెడలుచు పుట్టెను. అతడు ఋషి, విప్రుడు, మహాదేవుడు, ప్రాణులకు ఏకాత్మ, బ్రహ్మ. అతడు సర్వప్రాణులకు ఈశ్వరుడు. ప్రణవమునకు తగిన అర్థమగును. తన ప్రవేశముతో ప్రాణుల అంగ ప్రత్యంగములలో చక్కగా నుండువాడు. అతడు అగ్ని సంవత్సరము, సూర్యుడు, చంద్రుడు, వాయువు గూడను. అతడు యుగాభి మాని, కాలస్వరూపుడు, నిత్యము జగమును ఉపసంహరించువాడు, విభువు. అతడు పిచ్చెత్తింపచేయువాడు (మత్తిల్ల చేయువాడు), అనుగ్రహించువాడు, ఇద్వత్సరుడని గూడ చెప్పబడును. ఈ జగము భగవంతుని చేతన తేజముతో (వత్సరము) రుద్రావిష్టమైనది. తన శరీరముల (అష్టమూర్తులచేతను అనంత నామములచేతను ఆశ్రయా శ్రయి భావ సంయోగమున గూడ వత్సరము రుద్రావిష్ట మైనది. తరువాత ఆతని (శివుని) వీర్యముచే (బలముచే) లోకానుగ్రహము చేయునదియై రెండవదియైన మంగళ సంయోగము విశాలముగ వ్యాపించిన దానిని ఏకము చేయును. దేవత్వము, పితృత్వము, కాలత్వము, దీని కంటెను పరమైన (ఉత్కృష్టమైన)ది. దాని కంటెను అన్ని విధములుగా భద్రమైనవాడుగా

తద్వేత్తలచే శివుడు పూజింపబడును. ఆ భగవంతుడు నీలలోహితుడు పతులకుపతి, ప్రజాపతులకు ప్రజాపతి, సర్వ ప్రాణులకును సర్వులకును భవనము. ఆ రుద్రుడు క్షీణించిన ఓషధులను మరల మరల నాటి పోషించి పెంచును. ఈ విధముగ ఈ దేవతల సంతానము ఇంతఅని చెప్ప అలవికాదు. అది బహువిధమై అనంతమైన పుత్ర పౌత్రులు కలది అగుట దానిని లెక్కించుటకు అలవి కాదు. పుణ్యకర్ములు, స్థిరమైన కీర్తిగల వారు, మహాత్ములునైన ప్రజాపతులయొక్క ఈ వంశమును కీర్తించినవాడు మహా సిద్ధిని బొందును. (31)

యుగ ధర్మ నిరూపణము

వాయువు పలికెను :

ఆపైన ప్రణవము (ఓంకారము) యొక్క నిశ్చయ స్వరూపమును చెప్పబోవుచున్నాను. ఓంకారము అక్షర రూపమై నశింపని బ్రహ్మము. మొదటినుండియు అది మూడు వర్ణములు గలది అని చెప్పబడినది. 'ఓం' కారమునకు సంబంధించినదిగా ఏ యే వర్ణము ఎట్లు జన్మించినదో చెప్పబడినదో అట్లే దేవతలు, ఋక్కులు, యజస్సులు, సామములు (ఋగ్యజుస్సామ వేదములు మూడు), వాయువు, అగ్ని, జలము (అను మూడు భూతములు). ఆ అక్షరమైన ఓంకారము నుండియే పుట్టినవి. అట్లే మరికొందరు దేవతలకును దేవతలైన పదునాలుగురు మహాత్ములు కూడ పుట్టిరి. వారి అందరిలో ఉన్నవాడు తక్కిన అంతట ఉన్నవాడు సమస్త యోగములను తెలిసినను ఆ మహాదేవుడు లోకములను అనుగ్రహించుటకై ఆదియైనవాడు అనియు, మధ్యయైన వాడు అనియు, అంతమైన వాడు అనియు జెప్పబడుచున్నాడు. దేవదేవుడైన మహేశ్వరాత్మకమై నశింపని ఆ 'ఓం' కార అక్షరమునుండి సప్తర్షులు, పితృ దేవతలతో కూడిన దేవతలును బయలు వెడలిరి.

ఇహపరలోకముల హితము కొఱకే పరమపదమును చెప్పుదురు. యుగముల పేర్లతో పేరిడబడిన కాలముగురించి పూర్వమే నాతోచెప్పబడినది. చక్రమువలె తిరుగుచున్నవానియందు తిరుగుచుండు కృత, త్రేతా, ద్వాపర, కలియుగములచే కాలము గుర్తింపబడినది. అపుడు దేవతలు కాలమునకు వశులై భయము చెందిరి. తమతో కాలమును కొలువలేకపోయిరి. మన్వంతరాదిలో వారు మౌనము వహించిరి. కాలమునకు భయపడిన వారై ఋషులు, దేవతలు, మహాతపస్వియైన ఇంద్రుడును, వేయి సంపూర్ణసంవత్సరములు మనస్సును తీవ్రముగా సమాధిలో ఉంచి మహాదేవుని శరణుపొందిరి. ఈ కాలుడు దేవేశుడు నాలుగు ఆకారములు కలిగి నాలుగు ముఖములు గలవాడు. ఓ మహాదేవ! ఓ మహేశ్వర! లోతైన ఈ కాలమును ఎవరును తెలియ లేరు?

ఆ తరువాత మహాదేవుడు ఆ నాలుగు ముఖములుగల కాలుని చూచెను. “భయపడ వలదనెను. మీ కోరిక యేమియో తీరును అనెను.

“దానిని అంతయు నెరవేర్తును ఈ పరిశ్రమ వ్యర్థముగాదు. అని భగవంతుడైన మహా దేవుడనెను. “కాలుడు(కాలము)జయించుటకు అలవికానివాడు. ఈతని ముఖము తెల్లనిదై నాలుగు నాలుకలు కలదియైకనబడును. కృతయుగము అన్నది ఇది. ఇది ఆ కాలునియొక్క ముఖము. (ప్రారంభము) ఈతడు దేవతాశ్రేష్ఠుడైన బ్రహ్మ, యముని ముఖము. ఎఱ్ఱని కాంతిగల మూడవదిగా మీకు చెప్పబడినది. మూడు నాలుకలు గలిగి పెదవులు కనబడునది త్రేతాయుగము. ఇచట మహేశ్వరునివలన యజ్ఞ ప్రవృత్తి జరుగును. అందువలన ఇచట యజ్ఞము నిర్వహింపబడును. ఓ బ్రాహ్మణులారా! మూడు నాలుకలు, మూడు అగ్నులు వ్రేల్వబడి కాలజిహ్వ ప్రవర్తించును. ఈ భయంకరమైన, రెండు నాలుకలు కలిగిన, ఎరుపు గోరోచనము వంటి రంగుకలిగిన ముఖమునందు రెండు పాదములు గలవాడనై నేను ఉందును. కావున అది ద్వాప(ద)రము అను యుగము. ఈ నల్లనై, ఎఱ్ఱని కన్నులుగలిగి, ఒక నాలుక కలిగి, విశాలమై శ్యామమై మాటిమాటికి పెదవుల నాకుకొనుచున్న, ముఖమునుండి ఘోరమై సర్వలోక భయంకరమైన కలియుగము ఏర్పడినది. ఈ కలియుగ కల్పమునకు ఇది నాల్గవదియై, భయంకరమైన ముఖము కలిగి ఉండును. ఆ యుగమున ప్రారంభముగాని అంతముగాని ఉండదు. ఆ యుగమున ప్రజ గూడ కాలగ్రస్త అగును.

కృతయుగమున బ్రహ్మ పూజ్యుడు. త్రేతాయుగమున యజ్ఞము పూజ్యము, ద్వాపర యుగమున విష్ణువు పూజ్యుడు. నాలుగు యుగములలోను నేను పూజ్యుడను. బ్రహ్మ, విష్ణువు, యజ్ఞము ఇవి కాలము యొక్క మూడు కళలు. అన్ని కాలములందును చతు ర్మూర్తియై మహేశ్వరుడను నేను ఉందును, నేను జనుడను (జనించినవాడను) పుట్టించు వాడను, కాలస్వరూపుడను. కాలమును ప్రవర్తింప చేయువాడను. అట్లే యుగకర్తను. అన్నిటి కంటె పరుడైన పరాత్పరస్వరూపుడను. అన్నిటికంటె ఉత్కృష్టులైన వారియందు సక్తుడను.

కావున ఓ సురోత్తములారా! కలియుగమును పొంది లోకముల హితమును కారణముగా చేసికొని, దేవతల అభయము కొఱకు దేవమానవలోకముల యందు రెంటికి భవ్యుడను (శుభమైన వాడను) పూజింప దగినవాడను కూడ అగుదును. ఓ మహాతేజో వంతులారా కలియుగమును పొంది భయపడరాదు అని ఈ విధముగా చెప్పబడిన ఆ దేవతలు అందరును ఋషులతో గూడి తలలువంచి నమస్కరించి ఆ జగత్పతియైన మహా దేవునితో ఇట్లనిరి.

దేవతలును ఋషులును అనిరి :

మహాతేజుడు, మహాకాయుడు, మహావీర్య(బలు)డు, మహాకాంతిమంతుడు, సర్వ భూతములకు భయంకరుడు అయిన కాలుడు (సమయము) నాలుగు ముఖములు గల వాడెట్లు అయ్యెను?

మహాదేవుడు అనెను :

"ఈ కాలస్వరూపుడు నాలుగు ఆకారములు గలవాడు. నాలుగు కోరలు గలవాడు. నాలుగు ముఖములు గలవాడు. లోకసంరక్షణము కొఱకు అంతటా సంచరించును. చరాచరమైన ఈ ప్రపంచము అంతటను ఈతనికి అసాధ్యము లేదు. కాలము భూతము లను సృజించును. మరల క్రమముగా సంహరించును. అందరును కాలమునకు వశులై నడుచుకొందురు. కాలము ఎవ్వరివశమున ఉండదు. కావున ఎల్లప్పుడు కాలము సమస్త భూతములను తమ తమ పనులలో ప్రవర్తింపజేయును.

ఈతని వీరోచితమైన నడకలో పూర్వము చెప్పబడిన పదములు డెబ్బది యొక్కటి. కాలము నడచుచు గడచినప్పుడు మన్వంతర క్షయమగును.

అని భగవంతుడు ఈ విధముగా దేవర్షి పితృ దానవులకు చెప్పి, వారందరిచే నమస్కరింపబడి అచటనే అంతర్ధానమందెను. ఈ విధముగా ఆ భగవంతుడు కాలమున దేవర్షి, పితృ, దానవులను మరల మరల సంహరించును. మరల మరల పుట్టించును. అందువలన మన్వంతరమున గూడ భగవంతుడైన ఈశుడు కాలభయమున దేవర్షి, పితృ, దానవులచే పూజింపబడును.

కావున బ్రాహ్మణుడు అన్ని విధముల ప్రయత్నముతో మహాదేవుని గూర్చి తపము చేయవలెను. మహాదేవుని శరణు పొందిన వానికి గొప్పపుణ్య ఫలము లభించును. కావున దేవతలు ఋషులును స్వర్గమునకు వెళ్ళి భూతలమున దిగి, అతి భయంకరమైన కలిని పొంది ధర్మ పరాయణులై మిక్కిలి తపము చేయగోరుదురు. కలిని పొంది మరల మరల అవతారములను ధరింతురు.

ఈ విధముగా కాలాంతరమున వేలకొలది గతించినవారందరు వైవస్వత మన్వం తరమున దేవర్షులు, రాజర్షులును అగుదురు. ఆ విధముగనే పురువంశరాజైన దేవాపియు, ఇక్ష్వాకువంశమున పుట్టిన మనువును మహాయోగబలముతో కూడిన వారై కాలాంతరమును చేరియుండిరి. ఆ కలియుగము క్షీణింపగా, కలియుగము కృతయుగముగా చేయబడగా, మరల సప్తర్షులతో బాటు త్రేతాయుగము తప్పక రానుండగా, క్షత్రియ వంశములకు

చెందినవారు(మరల) రాగలరని చెప్పబడిరి. (కృత త్రేతల ప్రతిష్ఠాంత మైన ద్వాపరాంత మునను ఋషులతో పాటు క్షత్రియులుకూడారాగలరు. కృతయుగము, త్రేతా యుగము, ద్వాపర యుగమును గడచిపోగా కలియుగమున వారందరు పాతకులైన నరులుగానే ఉందురు.

ఏడు మన్వంతరములయొక్క సంతానమే శ్రుతికి స్మృతికిని అర్థము. ఈ విధముగా ఈ అన్నింటి యందును యుగములు అక్షయ క్రమములుగా ఉండును అట్లే పరస్పరముగా యుగములలో బ్రహ్మ, క్షత్రియుల పుట్టుక జరుగును. క్షయము ననుసరించి వారినుండి ప్రవర్తిల్లిన ప్రకృతి, స్త్రీలు మొదలగువారి ప్రకృతి ఎట్లుండునో తెలియును. జమదగ్ని పుత్రుడైన పరశురామునిచే క్షత్రము (జాతి) నిశ్శేషముగా వసుధాధిపులైన (రాజులైన) క్షత్రియులచేత (వారు చంపబడుటచేత) వారి స్త్రీలందరు కులటలు (వ్యభిచారిణులు)గా చేయ బడిరి. ఆ విధముగా స్వర్గమును పొందిన (చనిపోయిన) వారిని నేను మీకు చెప్పెదను వినుడు.

ఇక్ష్వాకు వంశమునకు ఐడుడను వానిని మూలముగా చెప్పుదురు. వరుస కట్టుట వలన భూలోకమున ఇతర క్షత్రియులు రాజులుగా ఉండిరి. తరువాత ఐడుని వంశమున పుట్టినవారు ఇక్ష్వాకు రాజులు. వంద కులములు వారినుండి వచ్చినవే రాజ్యాభిషేకము చేయబడినవి. భోజులు అను వందరాజవంశములు కూడ రాజ్యమునందు అభిషేకింప బడినవి. వాని విస్తారము రెండింతలైనవి. భోజ క్షత్రియ వంశములు మూడు వందలైనవి. అవి దిక్కులను అనుసరించి నాలుగు విధములైనవి. వారిలో గతించిన రాజులను చెప్పెదను వినుడు. ప్రతివింధ్యులకు సంబంధించినవారు వంద మంది గతించిరి అట్లే హైహయులు వంద (గతించిరి) ధృతరాష్ట్రునకు సంబంధించిన వారు నూట ఒక్కటి (గతించిరి) జనమే జయులు ఎనుబది బ్రహ్మదత్తులకు సంబంధించినవారు వంద. వీర్యవంతులైన వారికి సంబం ధించిన కులములు వందయు గతించిరి. తరువాత పౌలులకు సంబంధించినవారు వంద, కాశికుశాదులు (కాశీ-కుశ దేశమునకు సంబంధించినవారు) వందగతించిరి. అట్లే గతిం చిన శశ బిందువులు వేయికిమించిఉండిరి. వారందరు లక్షదక్షిణలతో కూడిన యశ్వమేధ యజ్ఞములు చేయుచుండిన వారే.

ఈ విధముగ యుగములతో బాటు గతించిన రాజర్షులను గురించి సంక్షేపముగ జెప్పబడినది. వారిని పూర్తిగా చెప్పుట సాధ్యము గాదు. వీరు యయాతి వంశ వర్ధనులుగా ఉండిరి. లోకములను ధరించిన వీరు ద్యుతిమంతులుగ కీర్తింపబడిరి. వీరు దుర్లభములై బ్రహ్మ లోకమునకు సంబంధించిన ఐదువరములు పొందిరి. అవి-ఆయువు, పుత్రులు, ధనము, కీర్తి, ఈశ్వర సంబంధమైన భూతి (ఐశ్వర్యము). ఈ పంచ వర్గమును ధరించుట వల్లను, వినుట వల్లను బుద్ధిమంతులు బ్రహ్మలౌకికులై బ్రహ్మలోకమును పొందుదురు.

కృత యుగము నాలుగు వేల యేండ్లు. దానికి అన్నివందలే (నాలుగువేలే) సంధ్యలు సంధ్యాంశమును గూడ ఆనారీతిగానే ఉండును. కృతయుగమున ప్రక్రియాపాదము నాలు వేలు. కావున నాలుగు వందలు సంధ్యలు. సంధ్యాంశము గూడ అంతియే. త్రేతాది యుగములు ఏడు వేలయేండ్లు. దానికిగూడ మూడువందల సంధ్యలు. సంధ్యాంశములు గూడ మూడు వందలు అనబడినవి. త్రేతాయుగమున అనుషంగ పాదము మూడువేల యేండ్లు. ద్వాపరమున రెండువేల యేండ్లని చెప్పబడినవి. దానికి గూడ సంధ్యలు, రెండు వందలు సంధ్యాంశములు గూడ రెండువందలే. ద్వాపరమున ఉపోద్ఘాతము అనునది మూడవ పాదము అనబడును. సంఖ్యావేత్తలగు జనులుకలిని వేయి ఏండ్లుగనే చెప్పుదురు. దానికి కూడ సంధ్యలు నూరు సంధ్యాంశములు గూడ నూరే. కలియుగమున సంహార పాదము నాలుగవదిగా చెప్పబడినది. సంధ్యలతోను సంధ్యాంశలతోను గూడినవి నాలుగు యుగములు. ఇది పంౘ్రెండు వేలయేండ్లు కలది నాలుగు యుగముల సమూహము అని చెప్పబడినది. ఈ విధముగ పాదములతో శ్లోకముల సంఖ్య ఐదు ఐదు వేలు. అట్లే సంధ్యా సంధ్యాంశకములతోనే తక్కినవి రెండు వేలు. ఈ విధముగ కవులు పురాణమును పంౘ్రెండు వేలు కలదిగా చెప్పుదురు. వేదము నాలుగు పాదములు గలదైనట్లే యుగము గూడ నాలుగు పాదములు కలది. యుగము నాలుగు పాదములు గలదిగా బ్రహ్మ స్వయముగా నిర్మించినట్లే దేవతలకు గూడ పూర్వము బ్రహ్మచే నాలుగు పాదములు గలదిగా యుగము చెప్పబడినది. (32)

స్వాయంభువ వంశానుకీర్తనము

సూతుడు అనెను :

"భూత భవిష్యత్కాలపు మన్వంతరములు అన్నింటిలోను ఇచట నామ, రూపములతో సమాన అభిమానములు కలిగి, అనేక విధములైన ఏ యే దేవతలు ఎందరు పుట్టిరో, వారు ఆ మన్వంతరమున అధిపులు. ఋషులును మానవులు కూడ అందరును (దేవతల వలెనే) సమానముగా (నామ రూపములలో) అభిమానులు. మహర్షుల సృష్టి చెప్పబడినది. ఇక స్వాయంభువ మనువుయొక్క వంశమును అనుక్రమముగా విస్తారముగా చెప్పెద వినుడు".

స్వాయంభువ మనువునకు అతనితో సమానులైన పదుగురు పుత్రులు ఉండిరి. వారు సప్త ద్వీపములు కలిగి, సముద్రములు నిధులుగల ఈ భూమి అంతటను ప్రతి సంవత్సరము వ్యాపించి నివాసముగా చేసికొనిరి. అపుడు స్వాయంభువ మన్వంతరమున మొదటి త్రేతాయుగము.

ప్రజాసృష్టికి తగిన తపము యోగముగలవారును, స్వాయంభువునకు పౌత్రులును (మనుమలును) అయిన ప్రియవ్రతుని పుత్రులచే ఈ భూమి అంతయు నివాసభూమిగా చేసికొనబడినది. వీరుడైన ప్రియవ్రతునివలన సంతానవంతులైనారు. స్వాయంభువ మనువునకు కన్య (దేవహూతి) కలిగెను. ఆ మహాభాగ్యవంతురాలు కర్దమ ప్రజాపతికి భార్యయైనది. ప్రియవ్రతునకు సమ్రాట్, కుక్షి అను వారలు ఇరువురు కన్యలును, నూరుగురు పుత్రులును కలిగిరి. ఆ ఇరువురి కన్యల సోదరులైన పదుగురు శూరులు ప్రజాపతితో సమానులు. వారు (1) అగ్నీధ్రుడు (2) వపుష్మంతుడు (3) మేధుడు (4) మేధాతిథి (5) విభువు (6) జ్యోతిష్మంతుడు (7) ద్యుతిమంతుడు (8) హవ్యుడు (9) సవనుడు (10) సర్వుడు అనువారు. ప్రియవ్రతుడు ధర్మ ప్రకారముగా ఈ ఏడుగురిని ఏడు ద్వీపములందు పట్టాభిషిక్తులను చేసెను. ఆ ద్వీపములను గురించి వినుడు.

ప్రియవ్రతుడు మహాబలుడైన అగ్నీధ్రుని జంబూ ద్వీపమునకు రాజుగా చేసెను. మేధాతిథిని ప్లక్ష ద్వీపమునకు, వపుష్మంతుని శాల్మల ద్వీపమునకు, జ్యోతిష్మంతుని కుశ ద్వీపమునకు, ద్యుతిమంతుని క్రౌంచ ద్వీపమునకు, హవ్యుని శాక ద్వీపమునకు, సవనుని పుష్కర ద్వీపమునకు రాజుగా చేసెను.

పుష్కర ద్వీపమున సవనునకు మహవీతుడను పుత్రుడు కలిగెను. (మహావీతుడు) ధాతకియును అను ఈ ఇరువురు పుత్రులు, శ్రేష్ఠులైనపుత్రులు. మహాత్ముడైన ఆతని పేర ఆ దేశము మహావీతవర్ధమని పిలువబడినది. ధాతకి అను పేర ధాతకీ ఖండమని కూడ ఆ దేశమును పిలిచెదరు.

ప్రభువైన హవ్యుడు శాకద్వీపరాజులైన పుత్రులనుకనెను. వారు జలదుడు, కుమారుడు, సుకుమారుడు, మణీచకుడు, వసుమోదుడు, సుమోదాకుడు, మహాద్రుముడు అను ఏడుగురు. జలదునిది జలదవర్షము (దేశము) మొదటిది. కుమారునిది కౌమార వర్షము రెండవది. సుకుమారునిది సుకుమార వర్షము మూడవది, మనీచకునిది మణీచక వర్షము నాల్గవది, వసుమోద వర్షము ఐదవది, మోదాకునిది మోదాక వర్షము ఆరవది, మహాద్రుమునిది మహాద్రుమ వర్షము ఏడవది. వీరియొక్క నామములతోనే ఈ ఏడు దేశములు ప్రసిద్ధి పొందినవి.

క్రౌంచ ద్వీపరాజైన ద్యుతిమంతునకు గూడ ఏడుగురు పుత్రులు ఉన్నారు. వారు కుశలుడు, మనుగుడు, ఉష్ణుడు, పీవరుడు, అంధకారుడు, ముని దుందుభి-అనువారు వారి స్వనామములతో వెలసి క్రౌంచద్వీపాశ్రయములైన దేశములు శుభములు. ఉష్ణుని

దేశము ఉష్ణము అనబడినది. పీవరునిది పీవరమనియు, అంధకారకుని దేశము అంధ కారమనియు, మునియొక్క దేశము ముని అనియు, దుందుభిది దుందుభి అనియు అనబడినవి. క్రౌంచ ద్వీపములోని ఈ ఏడు దేశములు భాస్వరములు, ప్రకాశవంతములు.

కుశద్వీపమున జ్యోతిష్మంతునకు చక్కని మహాతేజస్సులైన ఏడుగురు పుత్రులు కలరు. వీరు–ఉద్భిదుడు, వేణుమంతుడు, స్వైరథుడు, లవణుడు, ధృతి, ఆరవవాడు ప్రభాకరుడు, ఏడవ వాడు కపిలుడు. మొదటి వర్షము (దేశము) ఉద్భిదము, రెండవది వేణు మండలము. మూడవది స్వైరథాకారము. నాలుగవది లవణము. ఐదవది ధ్రుతి మద్వర్షము ఆఱవది ప్రభాకర వర్షము, ఏడవది కపిలునిది కపిలము. కుశ ద్వీపములో ఉన్న వారి ద్వీపములు వారి పేరులతోనే వెలసినవి. అవి బ్రహ్మచర్యాది ఆశ్రమములతోనూ, ఆచారములతోను కూడిన ప్రజలచే అలంకరింప బడినవి.

(శాల్మలరాజైన) వపుష్మంతుని పుత్రులు ఏడుగురు. వారు శాల్మల ద్వీపాధిపతులు వారు–శ్వేతుడు, హరితుడు, జీమూతుడు, రోహితుడు, వైద్యుతుడు, మానసుడు, ఏడవవాడు సుప్రభుడు అనువారు. శ్వేతునిది శ్వేతదేశము రోహితునిది రోహితము, జీమూతునిది జీమూతము, హరితునిది హారితము, వైద్యుతునిది వైద్యుతము, మానసునిది మానసము, సుప్రభునిది సుప్రభము. ఈ ఏడుగురు ఈ దేశములకు పాలకులు.

జంబు ద్వీపము తరువాత సప్తద్వీప సముదాయమున జరిగిన విషయమును చెప్పెదను. ప్లక్ష ద్వీపాధిపతియైన మేధాతిథి యొక్క పుత్రులు ఏడుగురు ప్లక్ష ద్వీప రాజులైరి. వారిలో జ్యేష్ఠుడు శాంతభయుడు ఆ ఏడు వర్షములను (దేశములను) ఏలెను. ఆ శాంత భయుని తఱువాత శిశిరుడు, సుఖోదయుడు, ఆనందుడు, ధ్రువుడు, క్షేమకుడు, శివుడు అనువారు ఆ ఏడు వర్షములను ఏలిరి. ఆ యేడు వర్షములు ఏడు భాగములుగా వారి వారి పేరులతోనే పూర్వము స్వాయంభువ మన్వంతరమున పరిపాలింపబడినవి.

ప్లక్ష ద్వీపమున సప్త ద్వీపనివాసులైన మేధాతిథి పుత్రులచేత ప్రజలు వర్ణాశ్రమా చారములు కలవారుగా పాలింపబడిరి. ప్లక్ష, శాల్మల, కుశ, క్రౌంచ, శాక ద్వీపములు అయిదింటిలోనే వర్ణాశ్రమ విభాగము ప్రకారము ధర్మము ఉండెనని తెలుసుకొనవలెను. సుఖము, ఆయువు, రూపము, బలము, ధర్మమున్ను ఈ ఐదు ద్వీపము లందు నిత్యము సర్వ సాధారణముగా ఉండెడివి.

ఏడు ద్వీపములతో చుట్టియున్న జంబూద్వీపమును గూర్చి వినుడు. ఆగ్నీధ్రుడు జ్యేష్ఠదాయాదుడు, కన్యాపుత్రుడు, మహాబలుడు, ప్రియవ్రతుడు. అతనిని జంబూ ద్వీపము

నకు అధిపతియైన రాజునుగా పట్టాభిషిక్తుని చేసెను. ఆతనికి తొమ్మండుగురు పుత్రులు ఉండిరి. వారు బ్రహ్మతో సమానమైన తేజము గలవారు. వారిలో జ్యేష్ఠుడు నాభి అను వాడుగా ప్రసిద్ధిజెందెను. అతని తమ్ముడు కింపురుషుడు అనువాడు. మూడవ వాడు హరివర్షుడు. నాలుగవవాడు ఇలావతుడు. ఐదవ కుమారుడు రమ్యుడు. ఆరవవాడు హరిన్మంతుడు. ఏడవవాడు కురువు. ఎనిమిదవ వాడు భద్రాశ్వుడు. తొమ్మిదవ వాడు కేతుమాలుడు–అనువారు. వారి వారి దేశములను గురించి వినుడు.

అగ్నీధ్రుడు తన మొదటి కుమారుడైన 'నాభి'కి హిమమను పేరుగల దక్షిణ వర్షము నిచ్చెను. కింపురుషునకు హేమకూట వర్షము నిచ్చెను. హరివర్షునకు నైషధము అను వరదేశము ఇచ్చెను. ఇలావృతునకు మేరువుయొక్క మధ్యదేశమును ఇచ్చెను. రమ్యునకు నీలము అను దేశము ఇచ్చెను. హరిన్మంతునకు ఉత్తరమునగల శ్వేతము అను వర్షము ఇచ్చెను. కురువునకు శృంగవంతమునకు ఉత్తరదేశమును ఇచ్చెను. భద్రాశ్వునకు మాల్యవంత దేశము నిచ్చెను. కేతుమాలునకు గంధమాదన వర్షము ఇచ్చెను. ఇవి గొప్పవైన తొమ్మిది వర్షములు ఇవి. ధర్మాత్ముడైన ఆగ్నీధ్రుడు పైన జెప్పిన అన్ని (తొమ్మిది) వరుసగా తన పుత్రులను దేశములలో అభిషేకించి తాను తపమున ఉండెను. ఈ విధముగా స్వాయంభువుని పౌత్రులైన ప్రియవ్రతుని ఈ ఏడుగురి పుత్రులచే సమస్తములైన సప్తద్వీపములు రాజ్యము చేయబడినవి. కింపురుషాదులైన ఎనిమిది శుభవర్ష(దేశ)ములు స్వభావ సిద్ధముగనే యత్నము లేకుండగనే సుఖముతో నిండినవి. ఆదేశములలో సుఖ వ్యతిరేకమైన దుఃఖము లేదు. ముసలితనము మరణముల భయము లేదు. ఆ క్షేత్రములలో ధర్మాధర్మములు ఉత్తమ, అధమ, మధ్యమములును యుగావస్థయును లేవు.

హిమవర్షమున నాభిఅను నాతని సృష్టిని చెప్పుదును. దానిని వినుడు. మహాద్యుతి యైన 'నాభి' మేరుదేవియందు ఋషభుని కనెను. ఋషభుడు సమస్త క్షత్రియజాతికి మొదటివాడైన రాజశ్రేష్ఠుడు. ఋషభునివలన భరతుడు పుట్టెను. అతడు వీరుడు, నూరుగురు కుమారులలో మొదటివాడు. భరతుడు తనపుత్రునకు రాజ్యాభిషేకము జేసి సన్యాసమును స్వీకరించెను. ఋషభుడు దక్షిణ హిమవర్షమును భరతునకు ఇచ్చినందున దీనిని భారతమను పేర పండితులు పిలిచిరి. భరతుని కుమారుడు విద్వాంసుడు ధార్మికుడు అయిన సుమతి అనువాడు, భరతుడు తన రాజ్యమును అతనికి ఇచ్చెను. పుత్రునకు రాజ్యమును సంక్రమింపజేసి, భరతుడు వనమునకు వెళ్లెను అతని కుమారుడు తేజసుడు. తేజసునకు పుత్రుడు శత్రుజేత అయిన ప్రజాపతి. తేజసుని మనుమడు (ప్రజాపతి పుత్రుడు) విద్వాంసుడైన ఇంద్రద్యుమ్నుడు. తండ్రి మరణానంతరము ఇంద్రద్యుమ్నుడు అందరికిని

ఇష్టమైన వాడుగా ఉండెను. అతనికి ప్రతీహార కులమున 'ప్రతిహర్త'యను పేర పుత్రుడు కలిగెను. ప్రతిహర్తకు భూమినుండి ఉన్నేత అను పుత్రుడు కలిగెను. ఉన్నేతకు ఉద్గీథుడు, ఉద్గీథునకు ప్రతావి అనువాడును కలిగిరి. ప్రతావికి విభువు, విభువునకు పృథువు, పృథువునకు నక్తుడు, నక్తునకు గయుడు, గయునకు నరుడు, నరునకు విరాట్టు, విరాట్టునకు మహావీర్యుడు, మహావీర్యునకు ధీమంతుడు పుట్టిరి. ధీమంతునకు మహానుడు, మహానునకు భౌవనుడు, భౌవనునకు త్వష్ట, త్వష్టకు అరిజుడును పుట్టిరి. అరిజునకు రజుడు, రజునకు శతజిత్తు పుట్టిరి. శతజిత్తునకు నూరుగురు పుత్రులు గలిగిరి. వారందరును రాజులే అయిరి. ఎవరిచేత ఈ ప్రజలు విశ్వజ్యోతిని వెలిగించుటయే ప్రధాన లక్ష్యము గలవారుగా వర్ధిల్లజేయబడిరో, వారిచేత ఈ భారత వర్ష(దేశ)ము ఏడు ఖండములు గలదిగా పూర్వము చేయబడినది. వారి వంశమున పుట్టిన వారి చేతనే ఈ భారతభూమి కృత త్రేతాదులతో గూడిన డెబ్బది యొక్క యుగములు పరిపాలింపబడినది. ఆయుగములతో గతించిన రాజులు పూర్వము స్వాయంభువ మన్వంతరమున వందలు, వేలుగా ఉండి ఆ వంశము నకు చెందినవారే. ఇది స్వాయంభువ సృష్టి. దీనిచే జగము నిండినది. ఈ ఋషులచేతను, దేవతలచేతను, పితరులచేతను, గంధర్వులచేతను రాక్షసులచేతను, యక్ష-భూత-పిశాచుల చేతను, మనుష్య-మృగ-పక్షుల చేతను వారి ఈ సృష్టి లోకమున యుగములతో పాటు మారుచుండును. (33)

జంబూ ద్వీపవర్ణనము

ఋషులు అనిరి :

ఈ విధముగా ప్రజా సన్నివేశమునువిని నిపుణ ఋషి శ్రేష్ఠులు. పృథ్వి యొక్క పొడవు వెడల్పులను గూర్చి సూతుని అడిగెను. ద్వీపములు ఎన్ని; సముద్రములు ఎన్ని? పర్వతములు గూడ ఎన్ని? ఓ ప్రభో! వర్షములు (దేశములు) ఎన్ని? వానిలోని నదులు ఏవి? మహాభూతముల ప్రమాణమేమి? లోకా లోకములు అను పర్వతములు ఏవి? వాని యొక్క క్రమ పరిమాణమేమి? అట్లే చంద్ర-సూర్యుల గతియు వాని క్రమపరిణా మమును ఎట్టివి? అని ప్రశ్నించిరి. అందుకు

సూతుడు వారికి ఇట్లు చెప్పెను :

ఇటు పిమ్మట పృథివి యొక్క పొడవు వెడల్పులను, సముద్రముల సంఖ్యలను, ద్వీపముల యొక్క విస్తరమును దేశములు ఎన్నియో? వానిలోని నదులు ఎన్నియో? మహా భూతముల ప్రమాణము, లోకాలోక(పర్వత)ములు వాని క్రమ పరిమాణము,

అట్లే చంద్రసూర్యుల గమనములు-వీటిని అన్నింటిని చెప్పెదను. సప్త ద్వీపములలో ఉన్న వేల ద్వీపముల భేదములను ప్రమాణముతో నూరేండ్లకైనను చెప్పనలవి కాదు. మనుష్యులు తర్కముతో (ఊహతో) ప్రమాణములను చెప్పునట్టి సప్త ద్వీపములను గూర్చి చంద్రసూర్య గ్రహములతో బాటుచెప్పెదను. చింతింపరాని భావములను ఊహించి భావింపరాదు. ప్రకృతుల కంటె పరమైనది! దానిని నిత్యము అనెదరు?

జంబూ ద్వీపమును గురించి ఉన్నది ఉన్నట్లుగా జెప్పెదను. అట్లే ఎన్ని యోజనముల విస్తారమున్నదో! ఎన్ని యోజనముల మండలాకారము ఉన్నదో చెప్పెదను వినుడు. ప్రమాణమును బట్టి అది నూట ఒక్క యోజనములు గలది. అనేక జనపదముల గ్రామ సమూహములతోను, సిద్ధచారణ గంధర్వులుగల పర్వతములతోను, వివిధములైన శుభము లైన పట్టణములతోను కూడినది. అన్ని ధాతువులతో కట్టబడినట్లున్న శిలల గుంపుల నుండి ఏర్పడిన పర్వతముల చేతను, నదుల చేతను ప్రకాశించునది. జంబూ ద్వీపము విశాలమైనది. చక్కని శోభాసంపదలచే చుట్టబడిన బ్రహ్మ, (విష్ణు) స్వరూపములైన తొమ్మిది భువనములచే (జలములచే) చుట్టబడినది. అట్లే ఉప్పు సముద్రముచే అంతటను చుట్టబడిఉన్నది.

జంబూ ద్వీపము అంతట సమానముగా విస్తరించినది. అందులో తూర్పునకు విస్తరించిన ఆఱు వర్షపర్వతములుగలవు. తూర్పు పడమర సముద్రములందు రెండు వైపులకు ఇవి చొచ్చుకొని పోయినవి. హిమవత్పర్వతము మంచుతో నిండినది. హేమకూట పర్వతము బంగారము గలది. బాలసూర్యునివలె లేతయెఱుపు గలిగి బంగారు నిండినది నిషధ పర్వతమని చెప్పబడును. నాలుగు వర్ణములు గలిగి సువర్ణ(బంగార)మైన మేరు పర్వతము అన్నింటికన్న ఎత్తైనది, గుఱ్ఱపుగంతు వేయు ఆకారము గలది. పొడవు వెడల్పు సమముగా ఉండి మిక్కిలి ఎత్తైనది. ప్రక్కలయందు అనేక జాతిరంగులు గలదై బ్రహ్మయొక్క సృష్టి (చాతుర్వర్ణ్య సృష్టి) గుణముగలది. అవ్యక్త జన్ముడైన బ్రహ్మయొక్క (పుట్టుకకు స్థానమైన విష్ణువుయొక్క) నాభి(కమల) బంధనము నుండి ఈ నానావర్ణ సమూహము పుట్టినది. తూర్పువైపున ఈ మేరువు శ్వేత (తెలుపు) వర్ణముగలది. దానిచేత అది (మేరు పర్వతము) బ్రహ్మణ్యము (బ్రాహ్మణజాతికి చెందినది) అయినది. అట్లే ఈ మేరువు దక్షిణము వైపున పీతము పసుపు పచ్చనిది. దానిచేత వైశ్యవర్ణము మేరువునకు చెప్పబడినది. ఈ మేరువు పశ్చిమపు వైపున ఆకు పచ్చని వర్ణముతో మహా బలిష్ఠమైనది. దానిచేత మేరువు యొక్క శూద్రజాతిత్వము కనబడినది. దీనికి అనేక ప్రయోజనములు కారణములు. మేరువుయొక్క ఉత్తరపువైపున సహజముగానే ఎరుపు వర్ణముగలదు. దానిచేత మేరు పర్వతమునకు

క్షత్రియత్వము వ్యక్తమగును. ఈ విధముగా మేరు పర్వతము బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర వర్ణములు కలదని చెప్పబడినవి. అవి మేరుపర్వతము యొక్క ఆయా వైపుల స్వభావమును బట్టి రంగును బట్టియు, పరిమాణమును బట్టియు వ్యక్తమైనవి. నీలము అను పర్వతము వైఢూర్యమణి శిలామయము. శ్వేతశృంగ పర్వతము బంగారు నిండినది. నెమలిపింఛపు రంగుగలిగి బంగారం నిండినది శృంగపర్వతము.

ఈ పర్వతరాజములందు సిద్ధులు, చారణులు నివసించుచుందురు. వీని యొక్క మధ్యశ్వాసము తొమ్మిదివేలు యోజనములు. ఇది మహామేరువుయొక్క శిరము మధ్యన, పొగలేని అగ్నివలె ఉండును. మేరువునకు దక్షిణమున వేది సగభాగము, ఉత్తర భాగమున తక్కిన సగభాగమున గలవు. ఇచట ఏడు వర్షములు (దేశములు) గలవు. వానియొక్క పర్వతములే వర్షపర్వతములు. అవి ఎత్తులో రెండేసి వేల యోజనముల విస్తీర్ణము కలవి.

జంబూ ద్వీపముయొక్క విస్తారము వలన పర్వతముల పొడవు ఇప్పుడు చెప్ప బడు చున్నది. వేయి రెండు వందల (1200) యోజనములుగల మధ్యనున్న రెండు పర్వతములు నీల పర్వతము మరియు నిషధపర్వతము అనునవి. వాని కన్న మిగిలినవి శ్వేతము, హేమ కూటము, హిమవంతము, శృంగవంతము-అనునవి (నాలుగు నీల నిషధములతో గూడినచో ఆఱు) అనగా అవి తొంబదిరెండు ఎనుబది రెండు వేల యోజనముల పొడవు గలవి వాని మధ్యలో జనపదములు (జనావాస దేశములు) కలవు. ఆ వర్షములు (దేశములు) ఏడు.

ఒకచో గుమిగూడినట్లు ఉండుటచే ఎగుడు దిగుడులుగా ఉన్న పర్వతములచే చుట్ట బడినవి. నదులయొక్క కోతలచే వ్యాపించి పరస్పరముగా (ఒకదాని నుండి మరొక దాని పైకి) పోనలవిగానివి. వానిలో భాగములుగా చేసికొని అనేకములైన ప్రాణులు నివసించును.

హైమవతమను వర్షము (పర్వతము, దేశము) భారత వర్షము అని ప్రసిద్ధి చెందినది. దానితరువాత పైది హేమకూటము. దానిని కింపురుష వర్షమందురు. హేమ కూటము కంటె పైది నైషధము. అది హరివర్షమని అనబడును. హరివర్షము తరువాత మేరువుపైది ఇలావృతము. ఇలావృతముపైది, నీలము. అది రమ్యకమని ప్రసిద్ధి చెందినది. రమ్యకము నుండి ఇంకను పైది శ్వేతము (పర్వతము) అది హిరణ్యకమని పేరుగాంచినది. హిరణ్యకము కంటె తరువాత శృంగవంతము. అది 'కురు' అనబడినది. ధనువువలె ఉనందువి, రెండు వర్షములు. ఒకటి దక్షిణమున రెండవది ఉత్తరమున ఉన్నవి. అక్కడ పొడవుగా ఉన్నవి నాలుగు వర్షములు. మధ్య ఉన్నది ఇలా వృతవర్షము నిషధమునకు పడమటి క్రిందన

నున్న సగము వేది (వేదిచదునై చతురస్రమైన భూమి-దానిలో సగము) దక్షిణము (వేది) అనబడినది. నీలవంతమునకు పైగా ఉన్న సగము వేది ఉత్తరము (వేది) అనబడినది. దక్షిణ వేద్యర్ధమున మూడు వర్షములు, ఉత్తర వేద్యర్ధమున మూడు వర్షములును కలవు. ఆ రెంటి మధ్యన మేరు మధ్యమైన ఇలావృతము కలదు. అది నీలవర్షమునకు దక్షిణముగను నిషధ వర్షమునకు ఉత్తరముగను ఉన్నది.

మాల్యవంతమను పర్వతము ఉత్తరముగా విశాలమైన మహాపర్వతము. వేయి యోజనముల విశాలమైనది. పూర్తిగా నల్లనిది. నిషధపర్వతమువలె పొడవైనది. దాని పొడవు ముప్పదినాలుగు యోజనములు. దాని పడమట వైపున గంధ మాదన పర్వతము కలదు. పొడవువల్లను విస్తారమువల్లను మాల్యవంత మనియే ప్రసిద్ధమైనది. పరిమళములుగా (అంతటను గుండ్రము, గోళము)గా ఉన్న రెండు, పర్వతముల మధ్య నున్న మేరువు మిక్కిలి ఎత్తైన పర్వతము. నాలుగు వర్ణములు గలది. మంచి బంగారువన్నె గలది. చతురస్ర (నాలుగు వైపుల) సమముగా ఉన్నది. చక్కగా ఉన్నతమైనది. జలము మొదలగు ధాతువులు అన్నియు అట అవ్యక్తములై పైకి కనబడనివై ఉత్పన్న మైనవి. ఆ అవ్యక్తమునుండి మేరుపర్వతము కర్ణిక (నడిబొడ్డు బీజము గలది)గాగల పృథివి అనెడు పద్మము పుట్టినది. అది నాలుగు మార్గములు గలది. ఐదు గుణములు గలది. (సూక్ష్మము గాక) మహత్తైనది. ఓ ద్విజసత్తములారా! అక్కడినుండి సమస్తములైనవృత్తులు (కృషి, పశుపాలనము, వాణిజ్యము, సేవ మొదలగునవి) పుట్టినవి. పూర్వము అనేక కల్పముల నుండి ఉపార్జితములై అనేక విధములైన పుణ్యములు గలిగి ఆత్మనిగ్రహము గలవారిచే చక్కగా పొందింపబడిన ఒక స్థూలస్వరూపము కలవాడు, సర్వవ్యాపియైన ఆత్మగలవాడు, సర్వపురుషులకు ఆదిపురుషుడై, పురుషశ్రేష్టుడైన విష్ణు స్వరూపుడు, మహాదేవుడు, మహాయోగి, జగత్తునకు జ్యేష్ఠుడు, సర్వలోకము లందుండువాడు, నాశము లేనివాడును ఐన మహేశ్వరుడు అవ్యక్తుడై అంతట ఉన్నను, వ్యక్తముగా ఒకమూర్తి గలవాడై పుట్టెను. ఆతని యొక్క ప్రాకృతికమైన మూర్తిమానవులవలె మాంసము. మేధస్సు, ఎముకలు, వీనివలన బుట్టినదికాదు. యోగము వలనను, ఈశ్వరుడై నందువలనను, ఆతడు సర్వాత్మలలో ఉన్నవాడే ఈతని కారణముగా కల్పశేషము మొదట సనాతనమైన (భూ)లోకమనెడి పద్మము పుట్టినది. కాలగతి ఇట్టిది. ఆ పద్మమున దేవదేవుడైన నాలుగు ముఖములుగల దేవుడు పుట్టెను. ఆతడు ప్రజాపతి, బ్రహ్మ, జగమునకు ఈశ్వరుడైన ప్రభువు. కమలమునకువలె ఆ పద్మోద్భవుని బీజములు సర్గము (సృష్టి)ను, సర్గ (సహజ)మైన మొత్తము ప్రజాసృష్టి ఇట విస్తరముగా చెప్పబడు చున్నది. విష్ణు సంబద్ధమై, కార్యరూపమై విష్ణునాభినుండి కమల నాళము పుట్టినది.

దాని నుండి వన వృక్షములతో గూడి పద్మాకారమైన పృథివి పుట్టినది. ఓ ద్విజులారా! ఆ లోక పద్మము యొక్క విస్తార ప్రకాశమును నేను చెప్పెద వినుడు. అది విభాగములతో క్రమముగా వర్ణింపబడును.

దళములందు ఉన్న నాలుగు, మహాద్వీపములని ప్రసిద్ధి చెందినవి. తరువాత కర్ణిక యందు ఉన్నది మహాబలిష్ఠమైన మేరు పర్వతము. అనేక వర్ణములుగల దాని ప్రక్క భాగములలో తూర్పువైపున (శృంగము) శ్వేతము అనబడును. దక్షిణపు వైపున శృంగము పసుపువర్ణము, పశ్చిమపు వైపున ఉన్నది. శృంగము నల్లనిది. ఉత్తరపు వైపున ఉన్నది శోభించు ఎఱుపు వర్ణముతో కూడినది. ఆ మేరువు, శుభ్రమై రాజువలె నిలచి ప్రకాశించును. లేత సూర్యుని వర్ణమువంటి కాంతికలదై, పొగలేని అగ్నివలె ఉండును. ఎనుబది నాలుగువేల యోజనములఎత్తుగలది. క్రింద పదునారు(యోజనములు) లోతుగా భూమిలో ప్రవేశించినది. అంతే 16 యోజనములు విస్తరించినది. దీనియొక్క చుట్టు వైశాల్యము 16 వేల యోజనముల కంటె మూడింతలు. అనగా 48 వేల యోజనములు మండల ప్రమాణముతో అది త్రికోణములో సగముండును. త్రికోణమానము నందది చుట్టును. నలుబది ఎనిమిదివేల యోజనములు కలిగినట్టిది. చతురస్ర మానముతో అంతటి (మొత్తం) వైశాల్యము అఱువదినాలుగువేల యోజనములు కలదు. ఆ పర్వతము గొప్పది, దివ్యమైనది. దేవశక్తిగలది దివ్యౌషధులతో గూడినది. అది మొత్తము బంగారుతో నిండిన శుభములైన లోకములతో చుట్టబడినది. అక్కడ గంధర్వులు, ఉరగులు, రాక్షసులు మొదలగు సమస్త దేవగణములు ఉన్నవి. మంగళకరములైన అప్సరోగణములు అనేక పర్వత రాజములతోబాటు కనబడును.

ఆ మేరువు భువనములతో (లోకములతో) చుట్టబడినది. భూతములను పుట్టించి పెంచునది. దాని అనేక పార్శ్వములలో నాలుగు దేశములు నెలకొని ఉన్నవి. భద్రాశ్వ దేశము (తూరుపు) భరత దేశము, (దక్షిణము) పశ్చిమమైన కేతుమాల దేశము, చేసిన పుణ్యములకు ఆశ్రయములై ఉత్తరములైన కురు దేశములు. అంతట గుండ్రముగా ఉన్న ఆ (భూ) పద్మముయొక్క నడిబొడ్డు (దుద్దు) తొంబది యాఱువేల యోజనములు కలదు. దాని లోపలి వైశాల్యములు ఎనుబది నాలుగువేల యోజనములు. చుట్టు వ్యాపించిన దాని కేసరములు లేక కింజల్కముల సమూహములు మున్నూరు వేల ప్రమాణము కలవి. నూరు వేల యోజనముల పొడవుగలది. ఎనుబదివేల యోజనముల వెడల్పుగలది. ఆకర్ణిక, దాని యొక్క నాలుగు దళములు నాలుగు దిక్కులకు యోజనముల కొలది వ్యాపించినవి. అక్కడ పూర్వము నేను కర్ణిక అని చెప్పితిని. దానిని సంగ్రహముగా వర్ణించెదను ఏకాగ్ర చిత్తులై వినుడు.

ఈ మేరువునకు అత్రిమహర్షి నూఱు అంచులు కలవు అనిచెప్పెను. భృగుమహర్షి వేయి అంచులుగలవు అనెను. సావర్ణి ఎనిమిది అంచులు గలది అనెను. భాగురి నాలుగు వైపుల సమముగా ఉండు సమతలము అనికాని, నాలుగంచులు కలదనికాని భావించెను. వార్ష్యాయణి సముద్రమువలె తరగలు తరగలు ఉన్నది అనెను. గాలవుడు మూకుడువలె ఉన్నది అనెను. క్రోష్టుకి అన్నివైపుల గుండ్రముగా (గోళముగా) ఉన్నది అని చెప్పెను. ఈ మేరువు యొక్క ఏ ఏ ప్రక్క ఏ ఋషి (పై జెప్పిన ఋషులు) చూచెనో, ఆ ప్రక్క భాగ మును మాత్రమే ఆఋషి ఆవిధముగా తెలిసికొనెను. ఒక బ్రహ్మకు మాత్రమే మేరు పర్వతము మొత్తము తెలియును. ఆ మేరు పర్వత శ్రేష్ఠము మణిరత్న మయమైనది. చిత్రమైనది. కావుననే అనేక వర్ణ కాంతులచే కూడినది. అనేక వర్ణముల సమూహము ఒక్కచోట చేరినట్లున్నది. బంగారు మయమైనది. ఎఱ్ఱనికాంతి గలది. మనోహరమైనది. వేయి పర్వత సంధులు (పర్వతములు)కలది. వేయి నీటిగుహలు కలది, వేయి కమలములు కలది. ఇట్టి దానినిగా మేరు పర్వతమును దెలిసికొనుము. మణిరత్నములు పొదిగిన స్తంభములచేతను, మణులతో చిత్రింపబడిన వేదికలతోను, బంగారముతోను మణుల తోను, పగడముల తోరణములతోను, చిత్రమైనది మేరువు. స్వర్గవాసులైన దేవతలయొక్క సిరులుగల నూర్లకొలది విమానయానములచేతను, వారి కాంతులచేతను, ప్రతి పర్వతము ప్రసిద్ధిని పొందును. ప్రకాశింపజేయబడిన చుట్టు ప్రక్కలు గలది మేరువు. ఆ మేరువుయొక్క వేయి పర్వతసంధులందు అనేకములైన నివాసభవనములు అలంకరించి ఉండును. వానిలో సమస్త దేవ సమూహములు అనేకులుగా నివసించి ఉన్నారు.

దేవతలకు వరిష్ఠుడు, దేవతలకే దేవుడైన వాడును, నాలుగు ముఖములు గలవాడును. బ్రహ్మవేత్తలలో శ్రేష్టుడు అయిన బ్రహ్మ ఆ మేరు పర్వతమున నివసించి ఉండెను. గొప్ప లోకములతో నిండి, కోరిన ఫలమును ఇచ్చు వేలకొలది సమస్త రాక్షసులచేతను, దిక్కులందు అనేకముగా వ్యాకులమైన, అచ్చుటగల బ్రహ్మసభ బహు రమ్యముగాఉండును. బ్రహ్మర్షి గణములచే సేవింపబడుచు మనోవతిఅను పేరుతో సర్వ లోకములందు ప్రసిద్ధిచెందినది. ఇచట ఈశాన మహావిమానము (భవనము)కలదు. అది నూరుగురు సూర్యులతో సమాన మైన తేజస్సుగలది. మహిమ గలది. అచట ఋషి గణములతో కూడిన దేవతలు ఉన్నారు. వారు బ్రహ్మకు సంబంధించినవారే. బ్రహ్మకున్న తేజోరాశి అచట దేవతలకు కూడ ఉన్నట్లు చెప్పబడినది. అచట లక్ష్మీపతియైన విష్ణువు గలడు. సిరిగలిగి సహస్రాక్షుడైన ఇంద్రుడు దేవతలచేతను మహాయోగముగల దేవర్షుల చేతను ఉపాసింపబడుచుండును. అచట లోకపతియు, సూర్యునితో సమానమైన కాంతి కలిగిన, మహారాజైన మహేంద్రుని

స్థానముగలదు. అది సర్వసిద్ధులచే నమస్కరింప బడినది. అది లోకమున క్రిందలోకము. ఉత్కృష్ట మైన సంపదతో కూడినది. దేవశ్రేష్ఠులైన దేవతలచే సేవింపబడినదై ప్రకాశించు చుండును. తూరుపు దక్షిణముల మధ్యన ఆగ్నేయ మున ఉన్న రెండవ అంతర (లోపలి) తటమున చిత్రములై నూర్లకొలది అనేక ధాతువులతో చక్కగా మనోహరమై ఉండును. మిక్కిలి తేజస్సు కలది, అనేక రత్నములు పొదిగిన ఉపరితలము గలది, అనేక స్తంభములతో కూడినది, బంగారముతో చేయబడిన ఉద్యానవనము అనేక రత్నములచే కట్టబడిన వేదికలు గలది, రహస్య మందిరములు కలిగి ఉత్తమములైన భవనములు వెలసియున్నది, ప్రసిద్ధమై నదిగా ఉండును. అచట భాస్కరమనియు జాతవేదస మనియు (అగ్ని) ప్రసిద్ధమైన మహా విమానము కలదు.

అది తేజోవతి అను అగ్నియొక్కసభ. అక్కడ సుర శ్రేష్ఠుడైన సర్వదేవతల ముఖమైన అగ్ని ఉండును. అతడు వేయి జ్వాలలతో ఒప్పుచుండును. జ్వాలలే మాలలుగా గలవాడు. ప్రభయే ధనముగా గలవాడును అగు అగ్ని యచలఋషి గణముతో కూడిన దేవతలచే స్తుతింపబడుచుండును. దేవతా ప్రధానముగా జేయబడినది. (హవిస్సు) బ్రాహ్మణులచే హోమము జేయబడును. అది విశేషముగా చెప్పబడును. అనేక విభాగములతో కూడిన తేజస్సు, నిస్సంశయముగా సమస్తము అనుభవములోనికి చేరి, ఏక తేజస్కుడైన ప్రభువు అచ్చట కలడు. యుక్తిచేత కార్యకారణ మిశ్రితమై పృథక్త్వము గూడ (అతనిలో) ఉండును. సమస్త లోకములు తెలిసినవారు, అగ్నియే వీర్యముగా గలవారు. అగ్ని పరాక్రమములు అయిన మహాత్ములు మహాసిద్ధులు మహాభాగ్యవంతులును ఆ అగ్నికి నమస్కరింతురు.

మూడవ అంతరతటమున ఇట్లే మహాసభ ఉండును. అది వైవస్వతుడైన యమునిసభ. అది లోకమున మంచి నిగ్రహము గలదిగా ప్రసిద్ధిచెందినది. అట్లే నాల్గవ దిగ్దేశమున నైరృత్యధిపతి యొక్క సభ ఉన్నది. పేరు కృష్ణాంగన. అది ధీమంతుడైన విరూపాక్షునిది. ఐదవయంతర తటమున గూడ ఇట్లే మహాసభ కలదు. అది వైవస్వతు నిది. దాని పేరు శుభవతి. అది జలాధిపతి మహాత్ముడైన వరుణునిదని ప్రసిద్ధి చెందినది. మిక్కిలి ఉత్తమ దేశమై మంగళకరమైన ఆఱవ అంతరతటమున గంధవతి అను పేరు గలిగి సమస్త గుణములచే మిక్కిలి శ్రేష్ఠమైన సభగలదు. ఏడవ అంతర తటమున నక్షత్రాధిపతి (చంద్రుని) యొక్క సభగలదు. పేరు మహోదయ, శుద్ధమైన వైడూర్యమణులతో నిర్మించిన వేదికలు గలది. అట్లే ఎనిమిదవ అంతరతటమున మహాత్ముడైన ఈశానుని యొక్క యశోవతి అను సభకలదు. అది కాచిన బంగారువంటి మంచి వన్నెగలది.

ఏడంతస్తులు గల ఈ మహాభవనములు ఎనిమిది దిక్కులలో మంగళకరములై ఉన్నవి. ఇవి దేవతలలో ముఖ్యులై మహాత్ములైన ఇంద్రుడు మొదలుగాగల ఎనమండు గురికి చెందినవి. ఎల్లప్పుడు, ఋషుల చేతను, దేవగంధర్వుల చేతను, అప్సరసల చేతను మహోరగులచేతను ఇంకను పై స్థానములలో ఉన్న మహాభాగుల చేతను సేవింప బడినవి. వేద వేదాంగములు తెలిసిన వారు నాకపృష్ఠమనియు, దివమనియు, స్వర్గమనియు పర్యాయవాచక శబ్దములచే దేనిని పిలుతురో అదే మేరు పర్వతము. ఇది పుణ్యాత్ములైన సర్వ దేవతలకు నివాస స్థానము. అనాక అదే ఈ మేరు పర్వతము. ఇది పుణ్యాత్ములైన సర్వ దేవతలకు నివాస స్థానము, ఆనాక. పృష్ఠాదిశబ్దములతో జెప్పబడు స్వర్గము దేవతలకు లోకముగా ఉన్న ఈ మేరు పర్వతమున కలదని సర్వశ్రుతులయందు చెప్పబడినది. అనేక విధములైన నియమముల చేతను, బహు యజ్ఞముల చేతను, ఆత్మనిగ్రహము గలవారి చేతను పెక్కు నూర్ల కొలది జన్మలలో సంపాదించిన పుణ్యముల చేతను మరి ఇతర సత్కార్యముల చేతను మానవులు ఈ దేవలోకమును పొందుదురు. దానిని స్వర్గమని కూడ అందురు. (34)

జంబూద్వీప వర్ణనము

సూతుడు అనెను :

కర్ణికా మూలమని పూర్వము చెప్పబడినట్టిది డెబ్బదివేల యోజనములు క్రిందుగా ఉండును. దాని మండలము అనగా చుట్టుకొలత నలుబది ఎనిమిది వేలు యోజనములు. శైలరాజములచే చుట్టబడి కడురమ్యమైనది ఆ దేశము. మేరు మూలమని వేదము పల్కు చున్నది. ఆ పర్వత సహస్రములలో అనేక పర్వతములందు మిక్కిలి ఎత్తైనవి అయిన పర్వతములు సమస్త దిక్కులయందు చివర ఉండుటచే మర్యాదపర్వతములు లేక సరిహద్దు పర్వతములు అనబడినవి. అవి పొదలచేతను, గుహలచేతను సెలయేళ్ల చేతను శోభించు చున్నవి. అనేక దేవతామందిరములు రాజభవనములచేతను, నగరములచేతను, పూవులతో ఉజ్జ్వలములైన కొండచఱియలచేతను శోభించినవి. కొండనడుమనున్న పుష్పమాలా సమూహముల చేతను, ధాతువులతో అలంకరింపబడిన చఱియలచేతను, అనేకములైన సెలయేరులచే చుట్టబడి బంగారు వన్నెతోను, గోరోచనము వంటివన్నెతోను ఒప్పిన శిఖరములచే ప్రకాశించినవి. అనేక రత్నములు పొదిగిన బలిష్ఠులచే ఆ పర్వతములు అన్ని శోభించినవి. నూర్లకొలది పక్షులచే కూడుకొన్నవి, సాటిలేని పొదరిండ్లచే ఒప్పినది, సింహములు, పులులు, శరభ మృగములు (ఎనిమిది కాళ్లు గలిగి సింహమును గూడ

చంపు మృగములు శరభములు), చామరమృగములు ఏనుగులు వీనిచే ఒప్పుచున్నవి. అనేక వర్ణములు, ఆకారములుగల అనేక విధములైన పర్వతములచే ఒప్పినవి. అందులో నొక్కొక్కటి పది పర్వతములుగలది. నల్లని ఆకారము కలిగియున్నను ఏడు రంగులు కలిసిన కిరణములు గల సూర్యుని ప్రకాశముగలది. బాహ్యములోను అభ్యంతరములోను అవి సమానముగా త్రివాహములుగా (మూడు వాహనములు కలవిగా తలంప బడు చున్నవి). తూర్పు దిక్కున జఠరము, దేవకూటము అను పర్వతములు రెండు. అవి దక్షి ణోత్తర దిక్కుగా పొడవైనవి. (దక్షిణమువైపు) నీల పర్వతమువరకును, ఉత్తరమున నిషధ పర్వతము వరకును వ్యాపించి ఉన్నాయి. కైలాస పర్వతము, హిమవత్పర్వతమును దక్షిణోత్తరముల ఉన్న పర్వతములు రెండు. ఇవి తూర్పు వైపునకును పశ్చిమపు వైపునకును పొడవై వ్యాపించిన సముద్రము చివరను వెలసియున్నవి.

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! పొడవైన బంగారు పర్వతము అను మేరువు యొక్క విష్కంభము (వ్యాసము Diametre)ను చెప్పెద వినుడు. మేరువు యొక్క క్రింద నాలుగు దిక్కులు గొప్ప పాదములు (ప్రత్యంత పర్వతములు=పెద్ద కొండచేరువన ఉన్న చిన్న కొండలు) గలవు. వానిచేత ధరింపబడినదై ఏడు ద్వీపములుగల భూమి చలింపదు (చక్కగా తిరుగును) వానియందు (పాదములందు)పదివేల యోజనముల పొడవని చెప్ప బడినది. అవి దేవ, గంధర్వ, యక్షులకు నివాసములు. అనేక రత్నములతో శోభితములు. అనేకములైన సెలయేరులతోను కొండ నెత్తములతోను ఒప్పినవి. మనోహర గుహలతో నిర్మింపబడినవి. కొండనడుమన పుష్ప సమూహములతో మనోహరములైనవి. చిత్రములైన చఱియలుకలవి. మణిశిలతో ఉన్న గుహలచేతను, హరిదళపు ఉపరి తలములచేతను శోభించినవి. అంతటను సువర్ణమణులచే చిత్రములైనగుహలచే ఒప్పినవి. శుద్ధమైన ఇంగిలీకపు రంగుతోను ధాతువులచే అలంకరింపబడిన బంగారు వన్నెలచే నిండినవి, శ్రేష్ఠమైన బంగారమున చిత్రములైన పగడములచే నలంకరింపబడినవి. కాంతి గలవి. నూరు పర్వత సంధులుగలవి, సిద్ధులకు ఆవాసమైనవి, ఆనంద నిలయములైనవి. సిరులు గల గొప్ప (యేడు అంతస్తుల) భవనములచే అంతటను బాగుగా ప్రకాశింపబడినవి.

తూర్పున మందరమను పర్వతము, దక్షిణమున గంధమాదనమను పర్వతము, పశ్చిమమున విపులమను పర్వతము, ఉత్తరమున సుపార్శ్వమను పర్వతమును గలవు. వానియొక్క వేయి శిఖరములయందు వజ్ర వైడూర్యమణుల వేదికలు గలవు. వానియందు (నాలుగింటియందు) నాలుగు మహావృక్షములు ఉత్పన్నము లైనవి. అవి వేయి కొమ్మలు గలవి. చక్కని బలమైన వేరులతో చక్కగా నిలదొక్కుకొని ఉన్నవి. దట్టమై నల్లనై గుంపుగా

ఉన్న ఆకులచే కప్పబడినవై అనేక విధములుగా ప్రాణులకు ఆశ్రయమిచ్చునవి. అనేకము లైన మొక్కలచే ఎత్తైనవి. ప్రాణులచే అనుభవింపబడు మహా పుష్ప-ఫలములు గలవి. యక్ష-గంధర్వులచే సేవింపదగినవి. సిద్ధులచే చారణుల చేతను సేవింపబడినవి. ఈ నాలుగు మహావృక్షములు ద్వీపమునకు ధ్వజము వంటివి.

మందర పర్వతపు శిఖరమున కేతురాజమను మహావృక్షము గలదు. అది పొడవైన కొమ్మలు శిఖరములు కలది. అది సర్వకాలములలో పూయునట్టి పెద్ద కడవలంతటి పుష్పములు గలది. ఆ పూవులు వికసించిన కేసరములుగలవి. గొప్ప సువాసనలు కలవి. మనో హరములైనవి. అట్టి పూవులచే ఆ వృక్షము శోభించినది. ఆ వృక్షము పిల్లవాయువుచే వీచబడి నదై వేయి యోజనములకు మించి అంతటను తనపూవుల సుగంధముచే దిక్కులు నింపును.

ఓ ద్విజులారా! వరకేతువే భద్రాశ్వముఅను పేరుతో ప్రసిద్ధి చెందినది. అచట సాక్షాత్తుగా హృషీకేశుడు (విష్ణువు) సిద్ధ సంఘములతో పూజింపబడును. పూర్వము రుద్రుల సమూహముయొక్క తెలుపును హరించు దేవతాశ్రేష్ఠుడైన విష్ణువు సపరివారముగా అచటికి వచ్చెను. ఓ మానవ నాయకులారా! ఆ సమస్త ద్వీపము ఆ విష్ణువుచే చూడబడినది. అతని పేరనే భద్రాశ్వము అను పేర ఈ ద్వీపము పిలువబడినది.

దక్షిణమున ఉన్న పర్వతము యొక్క శిఖరమున, దేవసేవితమై ఎల్లప్పుడు పుష్ప ఫలములతోను మాలలతోను ఒప్పినదై, గొప్పవైన వ్రేళ్లు బోదెలునుగలదై, దట్టమైన రంగు లతో నలంకరింపబడినదై 'జంబువు'అను మహావృక్షము ఉండును. అది ఎల్లప్పుడును నూతనములైన పుష్ప-ఫలములుగల శాఖలతో ప్రకాశించును. మిక్కిలి లావై, మెత్తనివై తీయనివై అమృతముతో సమానమైన ఆ వృక్షము యొక్క ఫలములు ఆ పర్వత శిఖరమున పడును. ఆ గిరి శ్రేష్ఠము యొక్క నెత్తమునుండి స్రవించు ప్రవాహమై తేనెలు ప్రవహించు జంబూనది అనెడి నది బయలుదేరినది. అచట జాంబూనదమను బంగారము పుట్టును. అది అగ్నికాంతి కలది. దేవతలకు అలంకారమైనట్టిది. సాటిలేనిది. పాపనాశన మైనది. దేవ, దానవ, గంధర్వ, యక్ష, రాక్షస, పన్నగులు, అమృతముతో సమానమైన తీయని ఆ జాంబూనద ధారను త్రాగుదురు. అది దక్షిణ ద్వీపమున ధ్వజము వంటిది. జంబువని లోకములలో ప్రసిద్ధిచెందినది. ఈ జంబూవృక్షము పేరనే అతిప్రాచీనమైన జంబూ ద్వీపము ప్రసిద్ధి జెందినది.

పశ్చిమ దిక్కున ఉన్న విశాలమైన గొప్పదైన పర్వతముయొక్క శిఖరమున మిక్కిలిగా గొప్ప అశ్వత్థ (రావి) వృక్షము జన్మించెను. అది వ్రేలాడునట్టి శ్రేష్ఠమైన మాలలుగలది.

బంగారముతోను, మణులతోను నిర్మించిన వేదికలుగలది. మిక్కిలి ఎత్తైన బోదెలు శాఖలు గలది. అనేక ప్రాణులకు నివాసమైనది అది కేతుమూల పర్వతము. కడవవలె లావైనవియు, తమరుచులతో సుఖమునుఇచ్చునవియు, అన్ని ఋతువులలో ఫలించునవియు, శుభకరము లైన ఫలములతో కూడిన వృక్షములు అందు కలవు. కేతుమాల పర్వతము దేశీయులకు (విజయ) ధ్వజమువలె ఉన్నది. దేవతలచేతను, గంధర్వుల చేతను సేవింపబడినది ఆ కేతుమూల పర్వతము. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! కేతమాల అనుపేరు దాని నామకర్మలను అనుసరించి ఎట్లు వచ్చినదో నిర్వచనమును వినుడు. సముద్ర మథనము జరిగిన తరువాత, రాక్షస పక్షము ఓడిపోయెను, దేవేంద్రునిచే రచింపబడినదియు, అంతకు ముందు ఎవ్వరిని పొందనిదియునైన దేవేంద్రుని సుతప్రాయమైన పుష్పమాల ఒకటి, ఆ మహాయుద్ధ సమ్మర్ద మున కలిగిన వృక్షముయొక్క పూలు లేకయే ఫలించు వృక్షమైన యశ్వత్థము (రావిచెట్టు) యొక్క బోదెయందు అంటుకొని యుండెను.

అదియట్లైనను గొప్ప సువాసన గలిగి, వాడనిదై అన్ని కోరికలు ఇచ్చునదై అనేకులైన సిద్ధులచేతను చారణులచేతను పూజింప బడుచున్నది. ఆ రావిచెట్టు యొక్క ధ్వజము నుండి దేవదత్తమైన గాలితో ప్రేరేపింపబడినదై ప్రకాశించును. మనోహరమైన దివ్య గంధమును వీచును. ఆ కేతు మాలలు గుర్తుగాగల ద్వీపము పశ్చిమమున చాల విస్తారముగా ఉన్నది. ఈ భూమిలోను స్వర్గముననను అంతట 'కేతుమాల' అని ప్రసిద్ధి చెందినది.

దాని ప్రక్కన ఉన్న ఉత్తర శిఖరమున కూడ ఒక మహావృక్షము ఉద్భవించినది. అది మఱ్ఱిచెట్టు. విశాలమైన బోదెగలది. అనేక యోజనముల చుట్టు వైశాల్యముగలది. అనేక సుగంధములతో ఒప్పిన పూలమాలల సమూహముగలది. ఊడలు వ్రేలాడు కొమ్మలు గలిగి సిద్ధ-చారణులతో సేవింపబడినదై ప్రకాశించెను. పగడపు కుండలవంటివియు తేనె తీపితో నిండినవియు అయిన ఫలములతో ఎల్లప్పుడు నిండిఉండును. అది ఉత్తర కురుదేశములకు ధ్వజము వంటి వృక్షముగా ప్రకాశించును. సనత్కుమారులకు తరువాత పుట్టిన వారును, మహాభాగ్యవంతులును అయిన కురువులు అను ఏడుగురు బ్రహ్మ మానసపుత్రులు ప్రసిద్ధులుండిరి. వారు అచట జ్ఞానమును పొందిరి. సాత్త్వికులైరి. పవిత్ర కీర్తిని పొందిరి. చివరకువారు అక్షయమై, క్షేమకరమై, సనాతనమైన పరాత్పరమైన లోక మును పొందిరి. మహాత్ములైన ఆ ఏడుగురి పేరుతో పిలువబడు నదీద్వీపము అది. దేవ లోకముననను, భూలోకముననను అవి ఉత్తర కురువులని ప్రసిద్ధిపొందినవి. (35)

భువనవిన్యాసము-1

సూతుడు అనెను :

వరుసగా ఆ నాలుగుపర్వత రాజములయొక్క మనోహరములైన అనుబంధ ప్రదేశమును గురించి చెప్పెదను. అవి సర్వకాలములు (భూత, భవత్, భవిష్య) సర్వ ఋతువులు సమముగా గలవి. అనగా ఆ యా ఋతుచిహ్నములగు పూవులు గలవి. గోరువంకలు, నెమళ్ళు, చకోరములు, మదించిన చిలుకలు, గండుతుమ్మెదలు, చిత్రములైన ఇతర పక్షులు వీనిచే అంతట ప్రకాశించుచుండును. వెన్నెలపులుగుల నాదములు, బంగారు వన్నె పక్షుల నాదములు, మదించిన కోకిల నాదములు, మేకపోతుల నాదములు. చక్కని కంఠములుగల కాంచనపక్షుల నాదములు, ఊరపిచ్చుకల నాదములు, తక్కిన ప్రాణుల కూతల నాదములు-వీనిచే అంతట మనోహరమైనవై ఉండును. ఒక్కొక్కచోట మదముచే విజృంభించి, మధురములై అలసతతోఉన్న తుమ్మెదల యొక్కయు, ఒక్కొక్కచోట కిన్నెరుల యొక్కయుగానములచే నిండి వనాంతములు ఉపగానము చేసినవి. అందమైన చిగురాకు లతో ఒప్పిన తరువులు పిల్లవాయువులతో కదల్చబడి పుష్పవర్షమును కురియు చున్నవి. పిల్లవాయువులతో కదలుచు, ఊగుచున్న ఎఱ్ఱని చిగురాకులతోను, పూలగుత్తుల తోను ఆ వృక్షములు కూడి ఉన్నవి. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! ఒకచోట అనేక ధాతువులచే చిత్రమై మనోహరముగా ఉంచబడిన నూర్లకొలది శిలలచే శోభితములై ఉన్నవి. దేవ, దానవ, గంధర్వ, యక్ష, రాక్షస, పన్నగులచేతను, అప్సరో గణములచేతను సేవింపబడినవి.

తరువాత అచ్చట మనోహరములైన నాలుగు దేవతల ఉద్యానవనములు ఉన్నవి. అవి నాలుగు దిక్కులలో విశాలముగా వ్యాపించి ఉన్నవి. వాని పేర్లు. తూర్పు దిక్కున ఉన్నది చైత్ర రథము. దక్షిణపుది నందన వనము, పశ్చిమపుది వైభ్రాజము, ఉత్తరపుది సావిత్రి (సూర్యునిది) అనునది, ఈ మహావనములలో ఉన్న మనోహరములైన అనుబంధ ములు. పక్షుల కూతలు, వనములచే విస్తీర్ణములైన తీర్థములు, మహాపుణ్యములైన వనములు, గొప్ప ఏనుగులు, పాములు-వీనికి స్థానములు. మహాత్ములచే సేవింపబడిన ప్రదేశములు, మంచి రుచిగల నిర్మల జలములు, మంగళములు సుఖకరములు. ఉత్తము లైన సిద్ధుల చేతను దేవతలచేతను, అసురులచేతను స్నానము చేయబడినవి. ఛత్రములు అంతటి ప్రమాణములు కలిగి, గొప్ప సువాసనలు కలిగి వికసించి విశాలదళములుగల మనోహరములైన కమలములచేతను కలువలచేతను ఆ జలములు శోభిల్లుచుండును. అట్టి జలములుగల మహా సరస్సులు నాలుగుకలవు.

తూర్పున అరుణోదయ (ఎఱ్ఱని నీరుగలది), దక్షిణమున మానసము, పశ్చిమమున సితోదము (తెల్లనీరుగలది), ఉత్తరమున మహాభద్రము అనునవి ఆ సరస్సులు. తూర్పున ఉన్న అరుణోదయ సరస్సునుండి ఏర్పడిన పర్వతములు ఎవ్వియో విస్తరముగా జెప్పెద వినుడు. సీతాంతము (చల్లని స్వభావము గలదియు) కుముంజము (గజిబిజిగా నున్న ముంజ గడ్డి గలదియు), సువీరము) (చక్కని వీరులుగలదియై సంవీరమను) ఒక పర్వత శ్రేష్ఠము కలదు. వికంకము (రాపులుగులు లేనిదియు) మణిశీలము (మణులే స్వభావ మైనదియు) అయిన వృషభమును తరువాత నీలము (నల్లనిదియు) రుచకము (మంగళ ద్రవ్యము గలదియు) సబిందువు (నీటిబొట్లు కలదియు) (మందరము వేణమంతము) వెదురు వృక్షములు గలదియు) సేమేధము (మంచి మేధాశక్తిగలవారుండు నదియు) దేవపర్వత నిషధమను కలదు. పర్వతము ఈ పర్వత శ్రేష్ఠములును, తక్కిన పర్వతములును మందరమునకు తూర్పున కలవు. అవి సిద్ధులకు ఆవాసములుగా ఉన్నవి.

మానస సరోవరము యొక్క దక్షిణపు వైపున ఉన్న మహా పర్వతముల పేరులను వినుడు. మూడు శిఖరములుగల పర్వతము(త్రిశిఖరము) శిశిరము అను పర్వత శ్రేష్ఠము, కల్దింగము, పతంగము, రుచకము, సానుమంతము, తామ్రాభము (రాగి యొక్క కాంతి గలది), విశాఖము, శ్వేతోదరము, సమూలము, విషధారము, రత్నధారము, ఏకశృంగము, మహా మూలము, గజశైలము, పిశాచకము, పంచశైలము, కైలాసము, పర్వతశ్రేష్ఠమైన హిమ వంతము. అనునవి దేవతలు నడచిన ఉత్కృష్టములైన పర్వత శ్రేష్ఠములు దివ్య తేజముగల మేరుపర్వతము యొక్క దక్షిణ దిగ్భాగమున ఉన్నవి. ఓ బ్రాహ్మణోత్తములారా! సితోదర సరస్సుయొక్క పశ్చిమమున ఉన్న ఉత్తమములైన మహాశైలములు. సువక్షము, శిఖిశైలము, కాలము, వైదూర్యము, కపిలము, పింగలము, రుద్రము, సురసము, కుము దము, మధుమంతము అనునవి.-అంజనీ మకుటము, కృష్ణము, పాండరము, సహస్ర శిఖరము, పారియాత్రము, త్రిశృంగము అనునవి పశ్చిమ పర్వతోత్తమములుగా చెప్ప బడినవి. శోభావంతమైన మహాభద్ర సరస్సుకు ఉత్తరమున ఉన్న పర్వతములను పూర్వము చెప్పిన వానిని వరుసగా చెప్పెదను. శంకుకూటము, మహాశైలము, వృషభము, హంస పర్వతము, నాగము కపిలము, ఇంద్రశైలము, సానుమంతము, నీలము, కనక శృంగము, శతశృంగము, పుష్పకము, మేఘశైలము, విరాజము, జారుధి, అనునవి పర్వత శ్రేష్ఠములు. ఇవి ఉత్తర పర్వతములు అనబడినవి. ఈ ప్రధాన శైలముల మధ్యనున్న స్థలులు (మెట్టు నేలలు), ద్రోణులు (పసులుమేయు కంచెలు-కొండ పల్లములు) సరస్సుల గురించి చెప్పుచున్నాను వరుసగావినుడు. (36)

భువన విన్యాసము -2

అటు పిమ్మట సూతుడు మునులతో అనెను :

ఇట్లు శీతాంత్యపర్వత శ్రేష్ఠమునకును, కుముంజ పర్వతమునకును మధ్యనున్న కొండ పల్లములు పసులు మేయు కంచెలును, అనేక పక్షుల నాదములచే ధ్వనించినవి. అనేక ప్రాణులచే సేవింపబడినవి. మూడువందల యోజనముల పొడవైనవి. నూరు యోజనములు విశాలములైనవి. అచట చక్కని రసవంతమైన స్వచ్ఛమైన త్రాగు నీటిచే సుందరమైన సరోవరము ఉన్నది. అది మంచి సుగంధము గలిగి, ఓడలంతటి తెల్ల కమలములచేతను లక్షదళములుగల మహాపద్మములచే అలంకరింపబడినది. పెద్ద పడగలచే సమీపించుటకు అలవికాని మహాసర్పములు నివసించినది, అందలి జలము దేవదానవ గంధర్వులచే స్నానాదులచే స్పృశింపబడి పవిత్రమైనది. అది శ్రీసరస్సు అను పేరుగల సరోవరము. భూమియందును దివియందును ప్రకాశించినది. నిర్మల జలములతో నిండినది. సర్వ ప్రాణులకు రక్షణనిచ్చు గృహము వంటిది.

అచట పద్మవనమధ్యమున ఒక మహాపద్మముగలదు. అది కోటి దళములతో బాగుగా కదలాడుచుండును. ఉదయించు సూర్యుని తేజముగలది. నిత్యము వికసించునది. వాడి రాలిపోనిది. కదలాడుటచే పెద్ద మండలముగలది. చక్కని కింజల్కములతో ఒప్పినది, మదించిన తుమ్మెదలతో ధ్వనింపబడినది. ఆ పద్మమున నిత్యమును సాక్షాత్తుగా భగవతి యైన లక్ష్మీదేవియే ఉండును. (ఈ విధముగా) ఈ పద్మము ఆకారము దాల్చిన లక్ష్మీదేవికి ఆవాసము. ఇందు సంశయము లేదు.

ఆ సరస్సుయొక్క తూర్పు తీరము సిద్ధులునివసించినట్టిది. అచట నిత్యము పుష్ప ఫలములతో మనోహరమైన గొప్ప బిల్వవనముగలదు. అది నూరు యోజనముల వెడల్పై మూడు యోజనముల పొడవైనది. అర్ధక్రోశము ఎత్తైన శిఖరములు గలిగి వేల శాఖలతో గొప్ప బోదెలతో కూడిన వేలకొలది మహావృక్షములతో వ్యాకులమైనది. బంగారము వలె పచ్చనివియు, తెల్లనివియునై అమృతము వంటి రుచిగలవియు, దుందుభ లంతటి లావైనవియు, సువాసనగలవియు, క్షీణించిపోవుచున్నవియు, రాలిపోవు చున్నవియు అయిన మారేడు పండ్లచే ఆ భూమి అంతయు వెదజల్లబడినట్లు ఉండును. ఆ వనము శ్రీవనమని సర్వలోకములలో ప్రసిద్ధిచెందినది. గంధర్వులు, కిన్నరులు, యక్షులు, మహానాగులు, వీరిచేత సేవితమైనది. (నివసింపబడినది) ప్రతినిత్యము బిల్వ ఫలముల నుతిను సిద్ధులచే వ్యాపించియున్నది. అనేక భూత (ప్రాణి) సంఘముల చేతను నిత్యము

సేవింపబడినది. ఆ వనమున నిత్యము భగవతియైన సాక్షాత్తు లక్ష్మియే ఉండును. ఆమె సిద్ధ సంఘములచే నమస్కరింపబడినదై సన్నిహితురాలై ఉండును.

విశంకమను పర్వత శ్రేష్ఠమునకును మణిశైలమునకును మధ్యన నూరు యోజనముల వెడల్పు రెండుయోజనముల పొడవుగల ఒక విశాలమైన చంపక (సంపెంగ) వనము గలదు. అందు సిద్ధులును, చారణులును నివసింతురు. అది పుష్పలక్ష్మి (శోభ)తో చుట్టబడి ఎల్లప్పుడు తేజస్సుతో మండుచున్న దానివలె ఉండును. ఆ వనము అర్ధక్రోశ సమున్నతమైన శిఖరములతోను, పెద్ద బోదెలతోను ఆకులు గలిగి వికసించిన కొమ్మలు గల వృక్షములు ఉన్న శిఖరములచే ఎరుపు మించిన పసుపు (బంగారు) వర్ణముగలది. రెండు చేతుల వైశాల్యము గలిగి మూడు చేతుల పొడవు కలిగి, మణిశిలా చూర్ణమువలె ఎఱ్ఱనై తెల్లని కింజల్కములతో ఒప్పి, వికసించి సుగంధముగల మనోహరపుష్పములచే వ్యాపించి ఉండును. ఆ వనము అంతయు తుమ్మెదల నాదముచే నిండిఉండును. ఆ వనమునందు దానవులు, దేవ గంధర్వులు, కిన్నరులు, అప్సరసలు, మహానాగులు నివసించుచుందురు.

అచట భగవంతుడైన కశ్యప ప్రజాపతియొక్క ఆశ్రమముగలదు. అది సిద్ధసాధ్య గణములతో వ్యాపించినది. అనేక వేదనాదములచే అలంకరింపబడినది. తరువాత రెండు పర్వతముల మధ్యన ఇంద్రనీలమణులచేతను, సన్నని ముంజగడ్డిచేతను ఒప్పినది. అచ్చట సిద్ధులు నివసించిన మహానదియైన 'సుఖ' అను నదియొక్క తీరమున, ఏబది యోజనముల పొడవై ముప్పదియోజనముల వెడల్పైన, అర్ధక్రోశము ఉన్నతమైన, తలలుగల మనోహర మైన తాటివనముగలదు. పెద్ద మూలములు(వేళ్ళు)గలిగి, మహాబలముగలిగి, స్థిరములై, దట్టమై, శుభములై, కలువలవలెను కాటుకవలెను ఉండి గుండ్రముగా ఉన్న పెద్ద (తాటి) పండ్లచే నిండిన వాసనయు రసమునుగల తాటిచెట్లతో ఒపి ఉండును. అది సిద్ధులు నివసించిన స్థలము.

అచట మహేంద్రుని గజశ్రేష్ఠమైన ఐరావతము యొక్క నివాసము కలదు. ఆ భద్రము అను ఏనుగు అచట నివసించుననియు, సర్వలోకములలో ప్రసిద్ధము. వేణుమంతము నకును సుమేధమను శైలమునకును ఉత్తరదిక్కున వేయి యోజనముల పొడవై నూరు యోజనముల వెడల్పైన, చెట్ల గుంపులతోను, తీగల గుత్తులతోను, అల్లిబిల్లిగ అల్లుకొన్న తీగలతోను ఒప్పినది. తరువాత గరిక వ్యాపించిన భూమి పచ్చిక బయలు ఏ జంతువులు లేనిదిగా కన్పడును. నిషధ పర్వతమునకును దేవ పర్వతమునకును ఉత్తరమున వేయి యోజనముల పొడవై, నూరు యోజనములు వెడల్పై, ఏకశిలామయమైన భూమి కలదు.

అది వృక్షములు తీవపొదలునులేనిది. పాదమాత్రమైన నీటితో అంతటనిండి ఉన్నది. అవి మేరువునకు తూర్పుగా కొండపల్లములలో ఉండు కంచెలు, ఇవి అనేకఆకారములు గలవి. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! పూర్వ పూర్వ క్రమముగా ఉన్నవి ఉన్నట్లు వానిని గురించి ఇప్పటి వరకును నాచే చెప్పబడినది. (37)

భువన విన్యాసము - 3

సూతుడు పలికెను :

ఆ తఋవాత దక్షిణ దిక్కున ఉన్నవియు సిద్ధులు చరించినవియు అయిన ద్రోణులు అనగా కొండపల్లములు, పసులు మేయు కంచెలు ఉన్నవి. ఆనుపూర్వముగా వానిని వినుడు. శిశిరమను పర్వతశ్రేష్ఠమునకును పతంగపర్వతమునకును మధ్యన గొప్ప వస్తువులు కలిగియున్న భూమి సంపదచే కూడియున్నదియు, తీగలు అల్లుకొన్న వృక్షములు గలదియు, విశాలముగా దూసుకొని పోయినట్లున్న ఉన్నత శిఖరములు గల వృక్షములతో ప్రకాశించి నదియు, పక్షి సంఘములు నివసించినదియునై మనోహరమైన ఉదుంబర (మేడిచెట్ల) వనముగలదు. ఆ వనము పగడపు వన్నెతో పండి, తేనెలు నిండినట్లు తీయనై మనోహరములై, పెద్దకడవల వంటి పండ్లతో మండు చున్నట్లు ప్రకాశించును. సిద్ధులు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు, ఉరగులు, అట్లే విద్యాధరులును సంతసించినవారై ఆ వనమును ఆశ్రయించి జీవింతురు.

అచట నిర్మలమై, తీయనైన జలములుగల నదులు ఉన్నవి. బహు జలములు గలవై సరసస్వచ్ఛ జలములుగల ఆ సరస్సులు అచట అంతటనుగలవు. అచట కర్దమ ప్రజాపతి యొక్క ఆశ్రమము గలదు. అది రమ్యమైనది. దేవగణముచే నిండినది. దాని అంతట చిత్రమైన వనముకలదు. ఆ వనము ఆశ్రమము చుట్టుగా నూరు యోజనములు వ్యాపించినది. తామ్రవర్ణ పర్వతమునకును, పతంగ పర్వతమునకును మధ్యన నూరు యోజనముల విశాలమై రెండు యోజనముల పొడవైన మహాపుణ్య సరోవరము కలదు. అచట లేతనై, విశాలమై చక్కనికాంతిగల తెల్లకమలముల చేతను, వేయిదళములు గల వికసించిన మహాపద్మముల చేతను, అంతట అలంకరింప బడినదియు, అట్లే తుమ్మెదలు నిండి సుగంధముగల నూరు దళముల కమలములచేతను, ఎరుపు, నలుపు రంగులు కలిగి వికసించిన పెద్ద కలువలచేతను ప్రకాశింపబడినదియు అయిన మహాపుణ్యవంతమై దేవ దానవ సేవితమై మహోరగులు నివసించినదియు నల్లని జాలములతో (జల జంతువులతో) ప్రకాశించినదియు అయిన ఒక సరోవరముకలదు.

ఆ సరోవరము మధ్యన ఒక జనపదముకలదు. అది నూరుయోజనముల పొడవై ముప్పది యోజనముల వెడల్పుగలది. ఎఱ్ఱని ధాతువులచే శిలావికారములచే అలంకరింప బడినది. దానిపైన గొప్ప మనోహరమై పొడవైన కోటగోడయు పెద్ద స్తంభములచే నేర్పడిన ద్వారమును గలది. నరనారీగణములు నిండినది. విస్తార వైభవములచే బలిసినది. కొణిగెల తోడను, రహస్య వ్యూహములచేతను, మణుల పట్టీలచే విచిత్రముగా ఉన్నవియు, రత్నము లచే బొమ్మలు చిత్రించిన నేలలు గలవియు, ఆకర్షణీయ చిత్రములు గల కప్పులుగలవియు అయిన గొప్ప భవన పంక్తులచే పొడవై మంగళమును ప్రకాశింపచేయుచు శోభిల్లినది.

అచట విద్యాధరపతి పులోముడు ప్రసిద్ధుడు, చిత్రవేషములు ధరించువాడు, మాలలు ధరించువాడు, మహేంద్రునితో సమానమైన తేజము కలవాడు. దీప్తులు, చిత్ర వేషములు గలవారు. సూర్యునితో సమానమైన తేజము గలవారును అయిన వేలకొలది అనేక విద్యాధరులకు అతడు రాజరాజు.

విశాఖ పర్వతశ్రేష్ఠమునకును పతంగ పర్వతమునకును మధ్యన తామ్రవర్ణ సరస్సు యొక్క పూర్వ తీరమున ప్రసిద్ధిజెందిన గొప్ప ఆమ్రవనము (మామిడితోట) గలదు. అది పంచబాణుని (మన్మథుని) బాణములైన మామిడి పూలచే గుచ్చబడినదా! అన్నట్లు (విరగ బూసిన మామిడి పూతగల)చక్కనిమామిడి పూగొమ్మలుగలది. అందమైన మామిడి పూల వర్ణముగలది. వసంత కాలములోనేకాక అన్ని కాలములలోను మామిడి పండ్లను ఇచ్చునది. ఆ పండ్లు బంగారువన్నె గలవి. మిక్కిలి రుచిగలవి. సువాసనగలవి, పెద్దకుండ లంతటివి, ఆమామిడి చెట్లకొమ్మలు విశాలములై అంతట వ్యాపించి ఉండును. గంధర్వులు, కిన్నరులు, యక్షులు, నాగులు, విద్యాధరులు అమృతము వంటి తీయని ఆ మామిడి పండ్లరసమును అచట త్రాగుదురు. మామిడిపండ్ల రసమును త్రాగి హృష్టపుష్టులైన మహాత్ముల నాదములు ఆ మామిడి వనములో వినబడుచుండును.

ఓ విప్రులారా! సుమూల పర్వత శ్రేష్ఠమునకును, వసుధార పర్వతమునకును మధ్యన బిల్వస్థలి కలదు. అది సమముగా, సుగంధము నిండినదై పక్షులతో కూడుకొన్నదై ముప్పది యోజనముల విస్తీర్ణము ఏబది యోజనముల పొడవైనదై ఒప్పినది. అచట బిల్వ వృక్షములు క్రిందికి అందుబాటులో ఉన్న ఫలశాఖలుగలవి. వాని పండ్లు రుచిగలిగి పగడపు వన్నె కలవి. అందులో కొన్ని పగులుచున్నవి. కొన్నిపగిలినవి. అట్టి బిల్వఫలముల చేత అచటి భూమి పైభాగము అంతయు తడిసినది. యక్ష, గంధర్వ, కిన్నర, సిద్ధ, నాగులు నిత్యము ఆ బిల్వఫలములు తినుచు ఆ బిల్వస్థలిని ఆశ్రయించి జీవింతురు.

వసుధార పర్వతమునకు, రత్నధార పర్వతమునకును మధ్యన ముప్పది యోజనములు విస్తీర్ణము, నూరుయోజనముల పొడవునుగల కింశుక (మోదుగు) వనము గలదు. అది నిత్యము పుష్పించిన వృక్షములు గలదై చక్కని సుగంధముతో ఒప్పారుచుండును. పుష్పలక్ష్మిచే ఆవరింపబడినదై అంతటను మంటలచే మండుచున్నట్లు ఉండును. దాని దివ్య గంధముచే చుట్టునుగల ప్రదేశము అంతయు సువాసితముగా ఉండును. పూర్తి నూరుయోజనముల అడవులందంతట దాని సువాసన నిండును. అది సిద్ధచారణ గణములకు, అప్సరసలకు నివాసిత భూమి, ఆ రమ్యమైన కింశుకవనము జలాశయములచే అందముగా అలంకరింపబడినట్లు ఉండును. అచట ఆదిత్య భగవానుని పెద్ద మందిరము కలదు. అచట ప్రతి మాసమునను ప్రజాపతియైన సూర్యుడు అవతరించును. కాలమునకు కర్తయు, వేయికిరణములుకలవాడు, దేవోత్తముడు, సర్వలోకములచే నమస్కరింపబడువాడు అయి సూర్యునకు అచట సిద్ధసంఘములు నమస్కరించును. పంచకూట పర్వతమునకును, కైలాస పర్వతమునకును మధ్యన ముప్పది ఆఱు యోజనముల విస్తీర్ణము కలదియు నూరు యోజనముల పొడవుగలదియు అగు ఒక సరస్సు కలదు. అది క్షుద్ర జీవులకు చేరరానిది. ఆ సరస్సు అంతటను హంసలతో తెల్లగా ఉండును. సర్వ ప్రాణులకును దాటరాకుండ ప్రవేశించుటకు అలవి కానిదిగా ఉండును. ఆ సరస్సు చూచిన వెంటనే సంభ్రమాశ్చర్యాదులచే గగుర్పాటు కలుగును.

ఈ విధముగా దక్షిణమున ఉన్న ఈ ప్రదేశములు పూర్వదిక్కును అనుసరించిన అంతరద్రోణులు (కొండపల్లములు). అందు సిద్ధ సంఘములు నివసించు చుందురు. అట్లే పశ్చిమ దిక్కునకూడ అంతర ద్రోణుల విస్తరములు గలవు. ఓ ద్విజోత్తములారా! వానిని వర్ణించెదను వినుడు. సువర్ణ శిఖిశైలముల మధ్యన అంతటను నూరు యోజనములు కలిగిన ఒకే విశాలమైన రాతినేలకలదు. అది ఎల్లప్పుడు తపించ(కాచ)బడి మిక్కిలి భయంకరమై, తాకుటకు అలవి కానిదై భయముతో ఒళ్లు జలదరింప చేయునట్టిదై ఉండును. అచటికి ఏ ప్రాణులుగాని, ప్రభువులుగానిపోలేరు. ఆ రాతినేలమధ్యన ముప్పది యోజనముల విశాల మండలము కలదు. అది వేల కొలది అగ్ని జ్వాలలచే చొరరాని మిక్కిలి భయంకరమైన అగ్నియొక్క స్థానము. అచట అగ్నిదేవుడు మండు సాధనములైన కట్టెలు మొదలగునవి ఏవియు లేకయే ఎడతెగని మంటల వరుసలతో ఎల్లప్పుడును మండుచునే ఉండును. బ్రహ్మచే అధిదేవతగా అగ్నియొక్క ఏ విభాగము విధింపబడెనో ఆ భాగరూపమైన అగ్నియే సంవర్తకాగ్నియై(ప్రళయాగ్నియై) అచట నిత్యము మండు చుండును.

ఆ రెండు పర్వత శ్రేష్ఠముల మధ్యనున్న దేవతలుగూడ శుభులు. అచట పది యోజనముల వైశాల్యముగల మాతులుంగ (మాదీఫల) వృక్షములుగల స్థలము కలదు. ఆధరువుగా తినదగిన తేనెలకు నెలవైనవి, మంచి రసముగలవియు, బంగారు వన్నెగలవి యునై బాగుగా పండిన ఫలములచేత ఆమహాస్థలి అంతయు శోభించుచుండును. మహా పుణ్యమై, సిద్ధ సంఘములకు నివాసమై సర్వకామగుణములతో కూడినదై ఆనందమైన బృహస్పతి ఆశ్రమము అచ్చట కలదు.

అట్లే శైల శ్రేష్ఠములైన కుముద-అంజన పర్వతముల మధ్యన కేసర ద్రోణిఅను కొండపల్లము గలదు. అది అనేక యోజనముల పొడవుగలది. రెండు చేతుల వైశాల్యము (వెడల్పు)తో మూడు చేతుల పొడవుతో విస్తరించినదియు, చంద్రకిరణములవలె తెల్లనై నవియు, గొప్ప సువాసనగలవియు, మనోహరము లైనవియు, అన్నికాలములలోను పూయు నవియు అయిన పూవులచే ఆ వనము చిత్రవర్ణముగలదై ప్రకాశించుచుండును. అచట దేవగురువైన విష్ణువు యొక్క గొప్పమందిరముగలదు. అది ముల్లోకములలో ప్రసిద్ధి చెందినది. సర్వలోకములకును నమస్కరింప తగినట్టిది.

కృష్ణ-పాండుర(నలుపు, తెలుపు)శైలముల రెంటి మధ్యనగూడ ముప్పది యోజన ముల వెడల్పు, తొంబది యోజనముల పొడవునుగల దట్టమైన ఒకేరాతి నేలగల ప్రదేశము కలదు. అచట వృక్షములు తీగలును లేవు. అందు సుఖముగా కాలినడకతో సంచరింప వచ్చును. ఎగుడుదిగుడు లేనిది. ఆ సరస్సు మధ్యన మనోహరమైన స్థలపద్మిని (నీరులేక పద్మములు పూయు) ప్రదేశము గలదు. అది ఛత్రములంతటి ప్రమాణముగల వికసించిన నూరుదళములుగల కుశేశయములచేతను, నీళదళములుగల కలువలచేతను, మృదువై గద్గదములైన కంఠములుగల కిన్నరులయొక్క గాననాదములచేతను, మదముతో విజృంభించిన తేనెటీగలచేతను, గానము చేయబడెడి తుమ్మెదలచేతను, పద్మ సమూహము లతోను ఒప్పినదై ఆ స్థలపద్మిని, (మెట్టతామర వనము) వ్యాపించి ఉన్నది. యక్ష గంధర్వు లచే రచింపబడి సిద్ధచారణులచే సేవింపబడినది. ఆ మెట్టతామర (స్థలపద్మిని) ప్రదేశము యొక్క మధ్యన ఐదు యోజనముల మండలము చుట్టు గలదియు, అనేకములైన బోదెలు కలదియు, అనేకములైన చెట్టుకొమ్మల చివరల వరకు ప్రాకు తీగలచేతను, జంతువుల చేతను అలంకరింపబడిన మఱ్ఱిచెట్టు గలదు. అచట చంద్రకాంతి కలిగి, పూర్ణ చంద్రుని బోలు ముఖము కలిగి, లక్ష్మీయుతుడై (శ్రీమంతుడై) వేయిముఖములు కలిగిన దేవుడును, నీలవస్త్రము ధరించినవాడును, దేవ శత్రువులైన రాక్షసులను చంపువాడును, పద్మమాలలు ధరించిన వాడును, పరాజయములేని మహాభాగుడు అయిన హరి ఎల్లప్పుడు ఆ స్థలములో

యక్షగంధర్వుల చేతను, విద్యాధర గణముల చేతను పూజింపబడును. ఆ మందిరమున ఆద్యంతములు లేని, హరి సిద్ధ చారణులచే అనేక విధములైన పద్మమాలలచే సాక్షాత్తుగా పూజింపబడును. అది అనంతసదమని సర్వలోకములలో ప్రసిద్ధి చెందినది. అది పద్మ మాలలచే వ్రేలాడు పొడవైన దండలచే ప్రకాశించుచుండును.

అట్లే సహస్ర శిఖర–కుముద పర్వతముల మధ్యన, ఏబది యోజనముల పొడవు ముప్పది యోజనముల వెడల్పును ఉండి బాణక్షేపమునకు మాత్రమే చోటుగల వాడియైన ఎత్తైన శిఖరము గలదియు, అనేక పక్షులు నివసించినదియు. గొప్ప గంధపు రుచి కలిగి ఏనుగులంతటి పండ్లచేత ఒప్పినదై, తేనెలుగారు మహావృక్షములచేత అంతట నిండియున్న పర్వతము గలదు. అచట మహాపుణ్యమై, దేవర్షి గణములు నివసించునట్టి దివ్య ప్రకాశము కల పుణ్యకర్ముడుగా ప్రసిద్ధిగాంచిన శుక్రుని ఆశ్రమము గలదు.

శంకుకూట, వృషభపర్వతముల మధ్యన పురూషకస్థలిఅను ఒక పల్లపు భూమి స్థలముకలదు. అది రమ్యము. అనేక యోజనముల పొడవైనది. బిల్వఫలములంత టివియు, శుభములైనవియు, గొప్ప రుచిగలవియు, సువాసనగలవియు, తొడిమెల నుండి జారిపడినవియు అగు పరుషములైన పండ్లచే అచటి భూమి అంతయు తడుపబడు చుండును. కిన్నరులు, నాగులు, సాధువులును మానాఢ్యులగు చారణులును పురూషక ఫల రసములచే ఉన్మత్తులై మానాఢ్యులై ఆ పురూషకస్థలి ఆశ్రయించి జీవింతురు.

కపింజల–నాగ శైలముల మధ్యన రెండు యోజనముల పొడవు నూరు యోజనముల వెడల్పుగల ప్రదేశము కలదు. అది మనోహరము అనేక వనములతో అలంకరింపబడినది. అనేక పుష్పఫలములుగలది. కిన్నరులచేతను, ఉరగులచేతను నివసింపబడినది. సుందర ద్రాక్షవనములు, నాగవనములు, ఖర్జూరవన ఖండములును, నల్లని అశోకవనములును, అగిసె తిలక కదళీ వనములును, రుచ్యములైన రేగుచెట్ల వనములును అచటగలవు. అంతటను తీయని చల్లని నీటితో నిండిన నదులచేత ఆ వనములు ప్రకాశించును.

ఓ బ్రాహ్మణోత్తములారా! అట్లే పుష్పక–మహామేష పర్వతముల మధ్యన అఱువది యోజనముల వెడల్పు నూరు యోజనముల పొడవైన భూమి కలదు. అది సమమైనది. పాణితలముతో సమానమైనది. చక్కని ఆకారముగలది, కఠినమైనది. తెల్లనైనది. గొప్పనై నది. చెట్లపొదలు, తీవపొదలును గడ్డియును లేనిది. ఇచట వివిధములైన ప్రాణులు లేవు. ఇది నిరాశ్రయము. ఎవరికిని ఆశ్రయము కానిది. ఆ కాననస్థలి భయంకరమై గగుర్పాటు కలుగజేయునది. మహాసరస్సులును, మహావృక్షములును, మహావనములు

అన్నియు అంతట ఆకర్షణీయ నామములుకలవి. సరస్సుల యొక్కయు వనముల యొక్కయు ఆ స్థలము ప్రజాపతికి సంబంధించినది. అచట చిన్నసరస్సుల సంఖ్య ఇంత అని లేదు. లెక్కకు మించినవి. పది, పంద్రెండు, ఏడు, ఎనిమిది, ఇరువది ముప్పదియు యోజనములు గల స్థలములును, కొండపల్లపు భూములును, సరస్సులు, వనములును ప్రసిద్ధములైనవి. కొన్ని మహాభయంకరములైన, నల్లనైన పర్వతగర్భములైన గుహలు గలవు. అవి సూర్యకిరణములు చొరనివి. నిత్యము చల్లనైనవి. చేరఅలవికానివి. శైల గర్భ ములలో ఉన్న వేల, నూర్ల సరస్సులు అగ్నితప్తములవలె సలసల మసలుచుండును. (38)

భువన విన్యాసము - 4

సూతుడు అనెను :

అటు తఱువాత ఏ ఏ పర్వతమునందు వివిధములైన ఏ ఏ దేవతలయొక్క ఏ ఏ గృహరాజములు చక్కగా నెలకొన్నవో చెప్పుదును వినుడు. అందులో ఈమహాశైలము ప్రాణులకు శీతలమే మరణమైనట్టి విస్తారములుగలదై, చిధాత్రములైన అనేక శత ధాతువులచే చిత్రమై, అనేక సముద్రములకు నిధానమై, అనేక ప్రాణులకును గుణముల కును నెలవైనదై, గొప్పదైన మణులచే, చిత్రములైన బంగారు, వెదురు వృక్షములతో అలంకరింప బడినదై ఉండును. ఆ పర్వతము యొక్క నితంబములు (కొండనడిమి ప్రదేశములు) తుమ్మెదల ఝుంకారముల శబ్దము నాదమువలె వినబడుచుండును. పగడపు రంగు ధాతువుల చేతను, బంగారు ధాతువులచేతను చిత్రవర్ణములు గలవి, తటములు మదించిన తుమ్మెదలధ్వనిగల పూవులతో వ్యాపించినవి, వ్రేలాడు తీగలుగలవి, చిత్రములచే చిత్రములైనవి. వందలకొలది ధాతువులచే పూజింపబడినవి, పూవులతో ఒప్పి రత్నచరి యలచే అలంకరింపబడినవి, నిర్మలమై తీయనైన పానీయములైన నీరుగల అనేకములైన కాలువలతో కూడినది, అనేకములైన పూపొదలతో అలంకరింపబడినవి, పూలతెప్పలను వహింపజేయు నదులచే అలంకరింపబడినవి. అంతటా కిన్నరులు తిరుగుగుహలు కలదిగా ఉండును. దాని గుహాగర్భములు యక్షులు గంధర్వులు తిరుగాడు నవి. సుఖముగా సేవింపదగిన చిత్రములైన, లోతైన గుహలచే శోభితమైనది. అనేక ప్రాణిగణములు (పక్ష్యా దులు) వ్యాపించి సుఖాశ్రయములై మంచి పానీయములు గలది. అనేక పుష్ప ఫలములతో గూడిన వృక్షములతో అలంకరింపబడినది.

ఆ పర్వతము అనేక గర్భములుగల గుహలు కలిగి ఆ గుహను ఆశ్రయించి ఉన్న వారితో నిండిన ఆ పర్వతమునందు మహేంద్రుని క్రీడావనము కలదు. అది అన్ని కోరి

కలకు తగిన గుణములతో కూడినది. అచట దేవరాజైన ఇంద్రునియొక్క పారిజాత వనము లను మహావనము గలదు. అది వేద ప్రామాణ్యమున ముల్లోకములలో ప్రకాశమైనదిగా కీర్తింప బడును. లేత సూర్యునితో సమానమైన యెఱ్ఱనై మహాగంధము గలిగి మనోహరము లైన పూవులతో నా పర్వతశ్రేష్ఠము చక్కగా అంతట ప్రకాశించును. మహేంద్ర వనము నుండి బయలుదేరిన పారిజాతపుష్పముల గంధమును వాయువు పూర్తి నూరు యోజన ముల వరకు గొనిపోయి వ్యాపింపజేయును. అచటి దిగుడు బావులు కమలములతో అలంకరింప బడినవి. ఆ కమలములు సువర్ణములు వైడూర్య నాళములు గలవి. వజ్రపు కింజల్కములుగలవి. సమస్తము సుగంధముతో కూడినవి. మదించిన తుమ్మెదల ఝుంకా రములు గలవి. విశాల కోశములుగలిగి బాగా వికసించినవి. ఇట్టి మనోహరములైన కమలములుగలవి. ఆ బావులలో నీటి మధ్యలో బంగారముచేతను, మణులచేతను అలంకరింపబడి కదలని కన్నులుగల వేలకొలది చేపల గుంపులు ప్రకాశించును. అనేక సంస్థానములు కలిగి, సౌవర్ణమణి భూషణములచే అలంకరింపబడి ఎగజిమ్ముచున్న నీరు గలిగిన తాబేళ్ళచే అంతట చిత్రముగా ప్రకాశించుచుండును. అనేక విధములైన రత్నములు వెంట్రుకలు (రెక్కలు) గల పలురంగుల పక్షులచే ప్రకాశించు చుండును. పలుబంగారు పూవులచేతను మణుల తుండములుగల ఏనుగులచేతను ప్రకాశించు చుండును. అంతటను వాలుచున్నవియు చక్కని స్వరములుగలిగి మదోన్మత్తములైన పక్షులచే మేధావియైన ఇంద్రుని యొక్క ఆ క్రీడావనము రమ్యమై ప్రకాశించు చుండును.

ఆ క్రీడావనము మదించిన తుమ్మెదల చక్కని నాదములతోను, పక్షుల కూతలతోను నిత్యము ఆనందవంతముగా చేయబడిన ఆ క్రీడావనము గొప్పది. అది బంగారు ప్రక్క భాగములుగల పర్వతములచేతను, మణులచేతను, ముత్యములచేతను, మణులతో కూడిన పర్వత శిఖరములచేతను ఒప్పినది. అంతట ఎగురుచున్నవియు. చిత్రమైన శరీరములు కలవియు, అనేక రత్నములవంటి శరీర రోమములు కలవియు అయిన కోతుల చేత కూడినది. అనేక వర్ణములుగల తక్కిన ప్రాణులచేత వ్యాకులముగా ఉన్నది, అచట లతలును, పారిజాత (పుష్పముల) వృక్షములును, పిల్ల వాయువులచే కదల్చ బడినవై పుష్ప వర్షములు కురియును. అచట విశాలములై రత్నములచే అలంకరింపబడిన శయన ములు, ఆసనములు, ద్వారములు–వీనిచే నలంకరింపబడిన విహార భూములును కలవు. అచట ఇంద్ర క్రీడావనములో మంగళకరములైన పక్షులుగలవు. అచట సూర్యుడు మిక్కిలి వేడిగాగాని, శీతలముగాగాని లేక ఎల్లప్పుడు సమశీతోష్ణముగా ఉండును. అచట చైత్ర మాసమున వసంత ఋతువున అనేక పుష్పములతో సువాసితమై వాయువు వీచును.

అది నిత్యము కామోన్మాదమును కలుగజేయును. నిత్యము శరీరమును సంగసుఖముచే ఆనందింపజేయును. శ్రమను క్లేశమును నశింపచేయును.

ఆ శుభ్రమైన ఇంద్రవనమున, దేవతలు, దానవులు, పన్నగులు, యక్షులు, రాక్షసులు, గుహకులు, అమిత తేజస్కులైన గంధర్వులు, విద్యాధరులు, సిద్ధులు, కిన్నరు లును సంతోషముతోకూడి ఉందురు. ఆ తరువాత అప్సరోగణములుకూడ అచట నిత్యము క్రీడాపరాయణులై ఉందురు. ఆ పర్వత శ్రేష్ఠము యొక్క తూరుపు ప్రక్కన మహోచితమైన కుముంజమను పర్వతశ్రేష్ఠము కలదు. దానిపై అనేక నదీ ప్రవాహములు, గుహలును కలవు. దానియొక్క ధాతువిచిత్రమైన శిఖరముల యందు మహాపరాక్రములైన రాక్షసుల యొక్క బహువిస్తారములైన ఎనిమిది నగరములు ఉన్నవి.

వజ్రక పర్వతమునకూడ అనేక శిఖరములచేతను గర్భములచేతను పైకి వెలసిన రాక్షస నివాసములు గలవు. అవి పురుషులతోను, స్త్రీలతోను వ్యాకులమైనవి. నీలకులను ఆ రాక్షసులు భయంకరులు, కామరూపులు అనగా కోరిన రూపమును ధరించగలుగు వారు వారు బలపరాక్రమవంతులై అచట నిత్యముఆసక్తులై ఉందురు. మహా నీలపర్వత రాజమున కూడ పదియైదు పురములుకలవు. అవి గుఱ్ఱపు ముఖముకలిగి కిన్నరులని ప్రసిద్ధిజెందిన మహాత్ములవి. మహాబాహువైన దేవసేనుడు అట్లే ఇంద్రుడు మొదలగువారు ఆపురములకు బలము. అచట కిన్నర రాజులు పదియైదుగురు గర్వితులు, బంగారు ప్రక్క భాగములు గలవారు. సామాన్యముగా అనేక వర్ణజాతులతో వ్యాకులములై బల ప్రవేశములుగల నగరములచే ఆ శైలేంద్రము బాగుగా అలంకరింపబడినది.

అచట మిక్కిలి భయంకరులు, విషపు చూపులు కలవారు, అగ్నివంటి కోపము గలవారు, సమీపింప అలవికానివారు, బంగారమునకు వశమై నడచుకొనువారు అయిన మహోరగులు నూరుగురుగలరు. ఆ పర్వతము నాగులు కలదైనను అచట రాక్షసా వాసములు వేలకొలది కలవు. ధనికుల మేడలు రాజమందిరములు దేవాలయములును పొడవైన ప్రాకారము, తోరణద్వారములను కలిగి ఉండును.వేణువంతమను మహాశైలమున విద్యాధరులవి మూడు పురములున్నవి. అవి ముప్పది యోజనములు వెడల్పు, ఏబది యోజనముల పొడవును గలవి. అచట దేవేంద్రు నితో సమానమైన పరాక్రమములుగల ఉలూకుడు, రోమశుడు, వీర్యవంతుడైన మహా నేత్రుడు-అను విద్యాధరులు వసింతురు.

వైకంకమను శైలము కలదు. దానిలో గుహలు సెలయేరులును కలవు. అందు మహోన్నతమై అందమైన శిఖరములు కలవు. అది అనేక రత్నములచేతను, ధాతువుల

చేతను చిత్రింపబడినట్లు ఉండును. అచట నిత్యము గరుడుని కుమారుడైన సుగ్రీవుడను పరాక్రమవంతుడు నివసించుచును. ఆతడు ఉరగుల శత్రువు. దరి చేరనలవి కాని వాడు. మహా వాయువు అంతటి వేగము గలవాడు. మహాప్రమాణములు గలవై, పరాక్రమ వంతములై మహాబల పరాక్రమములు గల సర్పశత్రువులైన పక్షులచే ఆ పర్వతమంతయు ఆవరింపబడి ఉండును.

కరంజ పర్వతమున ఎల్లప్పుడును సాక్ష్యాద్భూతపతియై, ప్రభుడై, వృషభధ్వజుడై, యోగులకు ప్రభువై మహాదేవుడైన శంకరుడు ఉండును. ఆ కరంజ పర్వతమున చరియలు అన్నియును అనేక వేషములు ధరించి భూతములైనను దరిజేర నలవిగాని ప్రమథ గణముల చేత అంతట వ్యాపించబడి ఉండును.

వసుధారమను పర్వతమున వసువుల యొక్క ఎనిమిది పుణ్య వంతములైన నివాసములు కలవందురు. వారు వసు(ధన)మంతులు. అమిత తేజస్కులు. మహాత్ములు. రత్నధాతువను పర్వత శ్రేష్ఠమున మహాత్ములైన (సప్త) ఋషులయొక్క ఏడు ఆశ్రమములు కలవు. అవి సిద్ధావాసములతో కూడి ఉండును. హేమశృంగమను పర్వతశ్రేష్ఠమున నాలుగు ముఖములుగల ప్రజాపతి(బ్రహ్మ)యొక్క స్థానముకలదు. అది సర్వ భూతములచే నమస్క రింపతగినది. గజశైలమున భగవంతుని నానాభూతగణములతో చుట్టబడిన శూద్రులు గలరు. వారు నిత్య సంతుష్టులు. సర్వభూతములచే నమస్కరింపబడినవారు.

అట సుమేధమను పర్వతము ధాతుచిత్రములతో కూడినది. మేఘముతో సమముగా నల్లనైనది. అనేకములైన గుహలు, ధాన్యములు వాటి క్షేత్రములు పొదలు-మొదలగు వానిచే ప్రకాశించు చుండును. ఆదిత్యుల యొక్కయు, వసువుల యొక్కయు, అమిత తేజస్కులైన రుద్రుల యొక్కయు, అశ్వినీదేవతలయొక్కయు మనోహరములైన గృహ విన్యాసములు గలవు. ఆ నగోత్తమమున సిద్ధులచేత దేవతలయొక్క స్థానములు అచ్చట స్థాపింపబడినవి. అచట యక్ష గంధర్వ కిన్నరులు నిత్యము పూజాపరులై ఉందురు.

హేమకక్షమను పర్వత శ్రేష్ఠమున విశాలమైన గంధర్వనగరి కలదు. అది ఎనుబది (క్రోశముల) పొడవుగల పురివంటిది. గొప్ప ప్రాకారతోరణములు కలది. సిద్ధులు, అపత్తనులను గంధర్వులును యుద్ధమున శోభించువారు అందువలసింతురు. వారి అధిపతి రాజరాజై, దేవుడైన కపింజలుడు. అనల పర్వతమున రాక్షస వాసములుగలవు. పంచ కూటమున గూడ దానవులుగలరు. వారు ఉత్సాహవంతులు మహాబల పరాక్రమములు గల దేవశత్రువులు.

రాగికాంతిగల పర్వతమున అమిత తేజస్కులైన యక్షులకు సంబంధించిన నూరు శిఖరములు గల నూరు పురములు గలవు. అటకద్రువ పుత్రుడైన తక్షకునియొక్క పుర శ్రేష్ఠము కూడకలదు. అనేక వస్త్రములచేతను, గుహలచేతను శుభకరమైన విశాఖమను పర్వత శ్రేష్ఠమున ఎల్లప్పుడు గుహలోనే నివాసముండు గుహుని (కుమారస్వామి) యొక్క గొప్ప భవనము కలదు. మహాభవనములతో అలంకరింపబడిన శ్వేతోదరమను మహా శైలమున మహాత్ముడు, గరుడపుత్రుడు అయిన సునాభుని యొక్క పురముగలదు. పిశాచక మను పర్వత శ్రేష్ఠమున ధనికులైన దేవరాజులయొక్క గొప్ప మేడలచే అలంకరింపబడి నదియు, యక్ష గంధర్వులు తిరుగునదియునై, గొప్పదైన కుబేర భవనముగలదు. హరికూట పర్వతమున దేవుడు సర్వభూత నమస్కృతుడైన హరి ఉండును. ఆయన ప్రభావమువల్ల ఈ పర్వతము మహానాభమై ప్రకాశించును. కుముద పర్వతమున కిన్నరుల నివాసములు ఉండును, అంజన పర్వతమున మహోరగులును వారి నివాసములును కలవు. కృష్ణ పర్వతమునమహాభవన పంక్తులుగల విద్యాధరులయొక్క పురముకలదు. సహస్ర శిఖరమను పర్వతమున ఉగ్రకర్ములు, బాగుగ పైకి ఎదిగినవారు, బంగారు మాలలుగల రాక్షసులయొక్క వేయిపురములుగలవు. ముకుట పర్వతమున నాగులకు ఆవాసములైన అనేక పర్వత శ్రేష్ఠములుగలవు. పుష్పక పర్వతమున నిత్యసంతుష్టులైన మునిగణములు వసింతురు. సుపక్షమను పర్వత శ్రేష్ఠమున వైవస్వతుని యొక్కయు, సోముడు, వాయువు, నాగాధిపుడు ఈ నలువురియొక్క నివాసములు గలవు. అచ్చట గంధర్వులచేతను, కిన్నరులచేతను, యక్షులచేతను, నాగులచేతను, విద్యాధరశ్రేష్ఠులచేతను వారి స్థానములలో నిత్యము హోమ ములచే ఎక్కువగా పూజలు జరుగుచుండును. (39)

భువన విన్యాసము - 5

సూతుడు పలికెను :

సరిహద్దు పర్వతమై శుభ్రమైన దేవకూట పర్వతము కలదు. విశాలమైన శిఖరముగల ఆ పర్వత శ్రేష్ఠపు శిఖరము అంతట నూరుయోజనములు ఉండి, మహాభవనములచే అలంకరింపబడి, బుద్ధిమంతుడైన, సుపర్ణుడైన, వినతాసుతుడైన గరుడునియొక్క జన్మక్షేత్రము గలదు. వేగవిక్రమము కలిగి, సంపూర్ణ వీర్యసంపద కలిగి, శత్రువులను దమింపజేయగలిగి, సర్పశత్రువులైన గరుడవంశ సంభవములైన అనేక మహాపక్షి గణము లచే కూడియున్న ఆ మహాత్ముడైన పక్షిరాజు గరుడుని యొక్క భవనము అచట గలదు. ఆ పక్షిరాజు మహావాయువేగము గలవాడు, శాల్మలి ద్వీప నివాసి, ఆ దేవకూట పర్వ

తము యొక్క శిరోభాగము సుందరముగా ఉండును. దాని మహాసంపన్నమైన దక్షిణ(కుడి) శిఖరములు విచిత్రముగా ఉండునవి, ఏడు కలవు. అచట ఏడు గంధర్వ నగరములు కలవు. అవి సంధ్యారాగము వలె ఎఱ్ఱని కాంతిగలవి. గుమికూడి పైకెగసి నట్లుండును. బంగారు ప్రాకారములతోను తోరణములతోను కూడినవి. వనమాలలచే గొప్పకాంతిగలిగి శోభించినవి. దేవతలచే నిర్మింపబడినవి. ముప్పది యోజనముల విశాలములైనవి. నలుబది యోజనముల పొడవుగలవి. ఆగ్నేయులను గంధర్వులు మహాబల పరాక్రమము గలవారు, కుబేర సేవకులు, వారి ఆ భవన రాజములు మిక్కిలి ప్రకాశించుచుండును.

ఆ భువనపు మహాగిరియొక్క ఉత్తర శిఖరములందు ధనిక భవనములచేతను దేవబ్రాహ్మణ నివాసములైన మేడలచేతను చుట్టబడినదియు ఉద్యానవనములతో శోభిత మైనదియు అగు పురముగలదు. అది ఆశీవిషములచే (సర్పములచే) నిండినది. గొప్ప కోటగోడలు, తోరణములునుకలది. నూర్లకొలది వాద్యముల ధ్వనులచే ఆనందింప చేయు వనమధ్య ప్రదేశములుగలది, శత్రువులకు సహింపఅలవి కానిది, ముప్పది యోజనముల మండలముగలది, ఎత్తుగా పెరిగినది, అది దేవశత్రువులైన రాహు సంతాన ముల నగ రము, ఓ బ్రాహ్మణ శ్రేష్ఠ! ఇక దేవ కూటము నందలి సిద్ధ దేవర్షుల చరితము వినుడు.

రెండవదియై శుభమైన సరిహద్దు పర్వతమున కాలకేయులను రాక్షసుల నగరము కలదు. అది అనేక వర్ణములుగల మహాభవనముల పంక్తులతో చుట్టబడినది. ఆ భవనములు బంగారము చేతను మణులచేతను నిర్మింపబడిన చిత్రములచే అలంకరింప బడినవి. ఆ నగరము విశాలమైన రథమార్గములుకలవి. శత్రువులచే నశింపజేయ అలవి కానిది, నిత్య సంతోషము కలది, శివమైనది, స్త్రీ పురుష గణములచే నిండినది. పొడవైన కోటగోడలు, ద్వారతోరణములును కలది. అఱువది యోజనముల వెడల్పు, నూరు యోజనముల పొడవును కలది. శత్రువులకు ఎవ్వరికిని చొరరానిది. రమ్యమైన దేవకూటపు తటమున కూర్చొని ఉన్నట్లు ఉన్నది. జయింప అలవికానిది. గొప్ప మేఘముల సమూహ మును పోలినది. 'సునాసత్' అని ప్రసిద్ధి గాంచినది.

ఆ దేవకూటము యొక్క దక్షిణ శిఖరమున ఇరువది యోజనముల వెడల్పు, అఱువది రెండు యోజనముల పొడవును గలదియై, బంగారు కోట గోడలు గలదియై, ఔత్కచులైన (పైకి నిక్కబొడుచుకొన్న తలవెంట్రుకలుగల) రాక్షసుల మహాపురము కలదు. ఆ రాక్షసులు కామరూపులు, సంతుష్టులు, బలిష్ఠులు మదించిన వారు, వారి నివాస భవనములు అచట గలవు.

దేవకూట పర్వతముయొక్క మధ్య మహాశిఖరమున, మహాత్ముడై మహాదేవుడైన ముక్కంటి యొక్క అనేక భూతగణములకు నిలయమైన భూతవటమను ఒక మహావట వృక్షముగలదు. అది ముక్కంటి యొక్క ప్రకాశవంతమైన నివాసము. సర్వలోక ప్రసిద్ధ మైనది. అది బంగారంచేతను, మణులచేతను, రాళ్లచేతను దట్టముగా ఉన్న చిత్రములు గలిగి శుభకరములైన నూరు శాఖలచేతను, వాని పైనున్న అనేక పక్ష్యాదులచే సమ కూలమైనది. దట్టమైన ఆకులతోను గొప్పవేళ్ళతోను అనేక శాఖలను మోయుచున్నది. రమ్యమైనది. దట్టమైన నీడకలది. పది యోజనముల మండలము గలది. పంది, ఏనుగు, సింహము, ఎలుగుబంటి, పులి, ఒంటెపిల్ల, గద్ద, గుడ్లగూబ, గొఱ్ఱె, మేకల విశాల ముఖములు కలిగి, గుబురుగాను, వికటముగాను, లావుగాను, పొడవుగానుఉన్న తలవెంట్రుకలు ఒడలిపై వెంట్రుకలునుగలిగి, అనేక వర్ణములు ఆకారములును ధరించి, అనేక స్థితుల లో ఉండి ఉగ్రులై ఉగ్రముఖులై, ఉగ్రపరాక్రములై, ఉజ్జ్వలులైన భూతముల చేతను, అట్లే మహాపారిషదులచే చండీశ్వరాది ప్రమథగణముఖ్యులచేతను, (ఆ వట వృక్షము) ఎల్లప్పుడు నిండిఉండును. అచట భూతములు, భూతపతి అయిన శివుని నిత్యము పూజింతురు. ఝర్ఝరములు శంఖములు, పటహములు (తప్పెటలు), భేరులు (దుందు భులు), డిండిమములు(రాయరిగిడిగిళ్ళు), గోముఖములు (ఆవు ముఖమువంటి వాద్య విశేషములు) మొదలైన వాద్యముల యొక్క రకరకములైన ధ్వనులతో కూడి గానములచేత భ్రమణములు లేని నూర్ల విస్ఫూర్జితముల చేతను శివగణ నాథులు శివపూజా యుక్తులు, సంతుష్టులు, క్రీడాపరులు అగుదురు. సిద్ధులచేతను, దేవతలచేతను, ఋషుల చేతను, గంధర్వులచేతను, యక్షులచేతను నాగేంద్రులచేతను పూజితుడై సాక్షాత్తు లోకశివంకరుడై మహాదేవుడైన శివుడు ఆ స్థానమున పూజితుడు అగుచుండును. (40)

భువనవినాసము - 6

సూతుడు అనెను :

ఏకాంతమైన సుందర శిఖరము కలదియు, కొండలతో నిండినదియు, శంఖము వలె తెల్లనిదియు పుణ్యాత్ములయిన దేవతలకును, భక్తులకును నివాసము అయినదియు నగు కైలాసముగలదు. మల్లెపూవువలె రమ్యమైన ఆ కైలాస శిఖరముపైన నూరు యోజనముల పొడవై, యేబది యోజనముల వెడల్పు కలిగి అనేకములైన బంగారు మణులచేత చిత్రములచేత అలంకరింపబడిన గొప్ప భవనపంక్తులతో భూషితమై విస్తారమైన నగరము గలదు. అది ధనాధ్యక్షుడై మహాత్ముడైన దేవుడగు కుబేరుని నగరము.

అది శత్రువులు ఆక్రమింప అలవికానిది, మంచి సంపదలతో కూడినది, ఆనందముతో అలరారినది. ఆ నగరమధ్యమున ఒకసభ కలదు. అది రమ్యము, బంగారముచే అలంక రింపబడినది, విశాలములైన స్తంభములతోను తోరణములతోను విపులా అను పేర ప్రసిద్ధి చెందినది. అచట పుష్పకమను విమానముగలదు. అది అనేక రత్నములతో అలంకరింపబడినది. అందమైన గొప్ప విమానము అన్ని కామ, గుణములతో కూడినది, మనస్సుతో సమానమైన వేగముకలది. బంగారు కిటికీలతో అలంకరింపబడి ఉండును. ఇది యక్షరాజై మహాత్ముడైన కుబేరుని వాహనము. అచట కేవలము గోరోజనము వంటి వర్ణముగల్గి దేవుడై స్వయముగా మహాదేవుని (శివుని) సఖుడైన కుబేరుడు నివసించు చుండును. ఆ యక్షరాజు సర్వభూతములచే నమస్కరింపబడినవాడు. అచట ఈ దేవతలలో మిక్కిలి మంచివాడై మహాత్ముడైన కుబేరుడు అప్సరోగణములతోను, యక్షులతోను, గంధర్వులతోను, చారణులతోను నివసించుచుండును.

అచట పద్మము, మహాపద్మము, మకరము, కచ్ఛపము, కుముదము. శంఖము, నీలము, నందనము అను ఎనిమిది నిధిశ్రేష్ఠములు గలవు. ఇవి ధనాధిపతి అయిన మహాత్ముడు కుబేరుని అక్షయములైన ఎనిమిది నిధులు. రత్నములచే సంపాదింపబడిన మహానిధానములై ఆ సభలో ఉండును. ప్రభువైన యక్షరాజైన కుబేరుడున్న కైలాసముననే ఇంద్ర, అగ్ని, యమ, దేవతలు అప్సరోగణములతో ఉందురు. అచట నియమింప బడిన పరిచారకులు మొదట యక్షరాజైన కుబేరుని కొలువుచేసి తరువాత వారి వారి పనులకై వెళ్ళుదురు.

అచట మందాకిని అను నడబావి (చిన్న పద్మ సరస్సు) కలదు. అది సుందరమైన విశాల జలములుగలది. బంగారముతోను మణులతోను నిర్మించినమెట్లు గలది. అనేక పుష్పముల గుంపులతో గొప్పనైనది. సుగంధము మెత్తని స్పర్శయుగల బంగారు పద్మముల తోను, నీలము వైడూర్యమణుల ఆకులతోను, సుగంధముగల పెద్ద కలువలతోను, చిన్న కలువలతోను విశాలమైన పెద్ద పద్మములతోను అలంకరింపబడినది. యక్ష గంధర్వ స్త్రీల చేతను అప్సరసలచేతను ప్రకాశించునది. దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, పన్నగులు స్నానము చేయు జలములు కలిగిన సుందరమైన నడబావి ఆ మందాకిని.

అట్లే అలకనంద నదీ శ్రేష్ఠమైన 'నంద'పై మందాకిని గుణములతోనే కూడు కొనిన నదులు, దేవతల చేతను ఋషులచేతను స్నానాది క్రియలచే సేవింపబడినవి. ఆ కైలాస పర్వతశ్రేష్ఠము యొక్క తూర్పు శిఖరమున ప్రసిద్ధములై వేయి యోజనముల పొడవై ముప్పది యోజనముల వెడల్పైన పది గంధర్వ నగరములు గలవు. అవి మిక్కిలి సమృద్ధితో

నిండినవి. అనేకములైన గొప్ప భవన పంక్తులచే అలంకరింపబడినవి. సుబాహువు, హరికేశుడు మొదలైనవారు, చిత్రసేనుడు, జరుడు మొదలైన వారును, జ్వలించిన అగ్నితో సమానమైన పరాక్రమముగల పదిమంది గంధర్వ రాజులు ఆ నగరమునకు పాలకులుగా కలరు.

మల్లెపూవు వలెను, చంద్రుని వలెను తెల్లనైన ఆ కైలాస పర్వతపు పడమటి శిఖరము అనేక ధాతువులచేత, చిత్రించిన నూర్లకొలది చిత్రములు గలది. సిద్ధులు-దేవతలు ఋషులు వీరిచే సేవింపబడినది. అట్టి పడమటి శిఖరమున ఒక్కొక్క యక్ష భవనము ఎనుబది యోజనములు పొడవు, నలుబది యోజనముల వెడల్పుగలదై మహా భవన పంక్తులు కలిగి ఉండును. ఇచట ఆఢ్యములై (మహాధనికములై)న ముప్పది మహా యక్షాలయములు ఉన్నవి. వానిని గురించే చెప్పుచున్నాను వినుడు. అవి అంతటను సంతోషముతోను మహా సంపదతోను కూడియున్నవి. మహామాల, సునేత్రుడు మొదలగు వారును అట్లే మణివరుడు మొదలగు మిక్కిలి పెంపొందిన యక్షరాజులు ముప్పదుగురు అచట ఎల్లప్పుడును ప్రకాశించుచుందురు.

అని ఈ విధముగా వాయ్వగ్నులతో సమానమైన తేజస్సులుగల యక్షుల గురించి చెప్పబడెను. శ్రీమంతుడైన ప్రభువైన కుబేరుడు వారి అధిపతి. ఆ కైలాసము యొక్క కుడిప్రక్క హిమవత్పర్వత శ్రేష్ఠముకలదు. దాని తటమున పొదరిండ్లు సెలయేరుల గుహలు, అనేకములైన చరియలును గలవు. అది తూరుపు సముద్రము నుండి పశ్చిమ సముద్రము వరకును (మానదండకమువలె పొడవై) వ్యాపించియున్న పర్వతము. అనేక శిఖర సమూహములు గల ఆ హిమవత్పర్వత శ్రేష్ఠము యొక్క కక్ష్యలలో (మధ్య భాగములలో) అచ్చటచ్చట, నరనారీ సంతోష భరితమును, హృష్టులు పుష్టులు పటిష్టులు అయిన జనులచే కలకలలాడు కిన్నరుల నూరు పురములుగలవు. ద్రుమ, సుగ్రీవసైన్యము మొదలగు వారును, భగదత్తుడు మొదలగువారును అచ్చట ఉండిరి. తేజస్వులై బలశాలురైన పై వారి రాజులు నూరుగురు అచట ఉండిరి. దేవియైన ఉమతో రుద్రుని వివాహయు ఇచటనే జరిగినది. వరాంగనయైన ఆ ఉమాదేవి ఇచటనే ఈశ్వరునికై తపము చేసినది. కిరాత రూపమున రుద్రుడు ఇచటనే ఓడించెను. కిరాత రూపులైన నయుమారుద్రులచే ఇచటనే జంబూద్వీపావలోకనము జేయబడినది. మిక్కిలి సంతోషించిన నానా భూత గణములతో రుద్రుడుక్రీడించిన భూములు ఇవియే. చిత్ర పుష్ప ఫలములతో కూడి ఉన్నవి. గిరిగుహలలో ఉన్న సన్నని నడుములు కలిగి, చక్కని కన్నులు కలిగి, మనోహర సుందరులైన కిన్నర స్త్రీలు ఇచటనే సంతోషముతో క్రీడించిరి. విశాలాక్షులైన యక్షులు, తక్కిన అప్సరోగణములు చక్కని అంగసౌష్టవముగల గంధర్వులును ఇచటనే ముదముతో

మెదలిరి. శంకరుడు అర్థనారీనరమైన రూపము ధరించినట్టి సర్వలోక ప్రసిద్ధమైన ఉమా వనమ అను వనము ఇచ్చుటనే కలదు. షణ్ముఖుడైన కుమారస్వామి జనించిన శరవణము ఇచ్చుటనే ఉన్నది, కుమార స్వామి క్రౌంచ శైలవన ధనుః క్రీడలో ఉత్సాహము చూపినది, క్రౌంచ పర్వతమునకు తన బాణముతో రంధ్రము జేసినది ఇచటనే. మహా ధీశాలియైన కృత్తికాపుత్రుడైన కుమారస్వామికి ధ్వజము పతాకము చిరుగంటలు మాలలును గల సింహరథమును పూన్చుట ఇచటనే జరిగినది. చిత్రముగా పుష్పించిన పొదరిండ్లుగల క్రౌంచపర్వతము యొక్క తటమున, దేవశత్రువులైన రాక్షసులను ధ్వంసము చేయునట్టి స్కందుడు (కుమారస్వామి) ఇచటనే తన శక్తి బాణమును ప్రయోగించెను. పంద్రెండుగురు సూర్యులతో సమానమైన ప్రతాపము గలిగి రాక్షస శత్రువైన విష్ణువు, ఇంద్ర, ఉపేంద్రులు మొదలైన దేవశ్రేష్ఠులు, గుహుడు (కుమారస్వామి)ని ఇచటనే దేవసేనాధిపతిగ అభిషేకించిరి. ఓ బ్రాహ్మణులారా! భూతసంఘములతో వ్యాపించిన ఈ స్థానములును మరికొన్ని స్థానములును, కుమారస్వామి యొక్క నివాస స్థానములైనవి. అట్లే అనేక భూతగణములు వ్యాపించి హిమవత్పర్వతము యొక్క ఉపరితలమున క్రౌంచ పర్వతమునకు తన బాణముచే రంధ్రము చేసిన కుమారస్వామి యొక్క క్రీడాస్థానమైన పాండుశిల అనునది ఇచటనే కలదు.

ఆ హిమవత్పర్వతపు రమ్యమైన తూర్పు తటమున కలాపగ్రామము అను పేర విద్వాంసులచే పిలువబడిన యొక సిద్ధావాసముగలదు. ఈ హిమవంతమును మృకండుడు, వసిష్ఠుడు, భరతుడు, నలుడు, బ్రహ్మర్షియైన విశ్వామిత్రుడు, ఉద్దాలకుడును, తక్కిన ఉగ్ర తపస్వులు ఆత్మభావనగల ఋషులును మొదలగువారు తమ తమ ఆశ్రమములను ఏర్పరచుకొనిరి. ఆ ఆశ్రమములు లక్షకలవు. అది అనేక సిద్ధ గణముల నివాసము. అనేకములైన మానవుల ఉనికిపట్టులచేతను, యజ్ఞశాలలచేతను, శోభాయమానమైనది. యక్షులు, గంధర్వులు చరించినది. అనేక మ్లేచ్ఛగణములచే కూడియున్నది. అనేక రత్న నిధులచే నిండినది. అనేక ప్రాణులచే సేవింపడినది. అనేక నదీ సహస్రములకు ఈ హిమవత్పర్వతము శ్రేష్ఠము పుట్టు స్థానము. ఓ ద్విజులారా! పడమటి పర్వతమై యదార్థ ముగా సంపూర్ణముగా కీర్తింపబడు విశేషమును నిషధ పర్వతము యొక్క కీర్తిని వినుడు. దానికి విశాలమైన మధ్య శిఖరము కలదు. అది బంగారు ధాతువులచే విభూషితము. దానియందు సిద్ధ, ఋషి, గణసేవితమై ఉజ్జ్వలముగా ప్రకాశించిన విష్ణువుయొక్క మందిరము గలదు. అది యక్షులచేతను అప్సరసల చేతను సేవింపబడుచు ఉన్నది. గంధర్వ గణములచే సేవింపబడినది. అచట సాక్షాత్తుగా మహదేవుడు (శివుడు)ను, లోకకర్తయై సనాతనుడై పీతాంబరమును ధరించి వరదుడైన హరియును సిద్ధులచే నిత్యము సేవింపబడుచుందురు.

ఆ నిషధపర్వత శిఖరమునకు అభ్యంతరశిఖరముగలదు. అది అనేక ధాతువులచే అలంకరింపబడినది. దట్టమై సుందరమైన శిలాతలముగల ఆ శిఖరమున ఉల్లంఘులను రాక్షసుల రాక్షసమను పురము కలదు. అది లోహములతోను, బంగారముతోను చేయబడిన నాగ వాసములు గలది. కాచిన బంగారు తోరణములు గలది. అనేకములైన చంద్రశాలల గుంపులతోను నూరు పెద్ద వీధులతోను గజిబిజిగా ఉండును. ధనిక భవనములచేతను, మందిరములచేతను సాటిలేనిది. కాచిన బంగారముచే నలంకరింపబడినది. ధనిక భవనములచేతను దేవళములచేతను బంధింపబడినట్లున్నది. నిత్య సంతుష్టమైనది. మిక్కిలి విస్తారమైనది. ఉద్యాన పంక్తులతో ఒప్పినది. ముప్పది యోజనముల పొడవైనది. విష సర్పముల వంటి శత్రువులకు ప్రవేశింప అలవి కానిది. నిండైనది.

దానియొక్క కుడిపక్కనే అనేక రాక్షస గణముకు నిలయము. అచట పర్వత గర్భమున ఇతరులు పోవుటకు అలవిగాని గుహలద్వారా ప్రవేశింపదగిన నగరము గలదు.

అట్లే పశ్చిమ శిఖరము పారిజాత వృక్షములు గల శిలలతో ఎత్తైనది. దానియందు దేవతలయొక్క దానవుల యొక్కయు సుసంపన్నములైన పురములు గలవు. అచట ఆ పర్వతపు మహాతటమున ప్రతిపర్వము నందును (పూర్ణిమ) సోముడు (చంద్రుడు) అవత రించు సోమశిల కలదు. ఇచట ఋషి, కిన్నర, గంధర్వులు చీకటిని బారద్రోలు సాక్షాత్తు దేవుడై అనిందితుడై శ్రీమంతుడైన తారాపతిని (చంద్రుని) ఉపాసింతురు.

దాని ఉత్తరకూటముననే బ్రహ్మపార్శ్వము అను ప్రసిద్ధ స్థానముగలదు. అది సురేశ్వరుడైన బ్రహ్మయొక్క స్థానమని స్వర్గమున ప్రసిద్ధము. అచట సిద్ధులు యక్ష గంధర్వ దానవులును ఆ స్వయంభువై మహాత్ముడైన బ్రహ్మను యజ్ఞ, పూజలతో ఉపాసింతురు. అట్లే అచట సర్వలోక ప్రసిద్ధమైన అగ్నిదేవునియొక్క స్థానము గలదు. అచట సిద్ధచారణులచే మూర్తి మంతుడైన అగ్ని సేవింపబడును.

అట్లే రమ్యమైన ఉత్తరమున త్రిశృంగమను పర్వతశ్రేష్ఠము గలదు. అది ఋషుల చేతను సిద్ధులచేతను సేవింపబడినది. అనేక భూతగణములకు ఆలయము. అచట ఉన్న పురము బంగారు చిత్రములుగలదై, ముల్లోకములలో ప్రసిద్ధిచెందినది. అచట దేవ ముఖ్యులైన (బ్రహ్మ, విష్ణు మహేశులకు) ముప్పురికి మూడే స్థానములు గలవు. ఓ బ్రాహ్మణోత్తములారా! తూర్పు శిఖరమున నారాయణుని మందిరము గలదు. మధ్యమ శిఖరమున బ్రహ్మయొక్క మందిరము గలదు. పడమటి శిఖరమున శంకరుని మందిరము కలదు. దైత్యులు, దానవులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, పన్నగులు వీరిచే ఆ

మహాబలులైన దేవదేవులు యజ్ఞములుచేయుచు పూజింపబడుదురు. అట్లే త్రిశృంగ పర్వతమున అచటచట యక్షగంధర్వ నాగుల రమ్యములైన పురములు గలవు.

అట్లే ఉత్తర ప్రదేశమున జారుధిఅను దేవపర్వతము కలదు. అది అనేక శిఖరములతో ఒప్పినది. సిద్ధులు సాధువులును నివసించునది. యక్షుల యొక్కయు, కిన్నరులయొక్కయు, గంధర్వులయొక్కయు, వేలకొలది నాగుల యొక్కయు, రాక్షసుల యొక్కయు, దైత్యులయొక్కయు గొప్పబలముగలది. దాని మధ్య శిఖరము సిద్ధ సంఘములకు ఆవాసము, రమ్యమైనది, దేవతలును, ఋషులును సంచరించునది. రత్నములచేతను, ధాతువులచేతను అలంకరింపబడినది. వికసించిన కమలముల యొక్కయు వనములచే ప్రకాశించినది. అట్టి శిఖరమునందు పక్షులు గూళ్ళచే వాని నాదములచే మ్రోగినదియు, అనేక ప్రాణులు నివసించినదియు, హంసలచే, కారండవ పక్షులచే వ్యాపించినదియు, మదించిన తుమ్మెదలు గలదియు, అనేక ప్రాణిగణములు వ్యాపించినదియు, పక్షులచే శోభించినదియు, సుందరములైన నదులచేతను వాని యొడ్డున వెలసిన పుణ్యక్షేత్రముల చేత క్రిక్కిరిసినదియు, ముప్పది యోజనముల మండలాకారము గలదియు, సిద్ధులు ఆచమనము చేసిన పవిత్ర జలములు గలదియు, జలదోషములు లేనిదియు, మహా పుణ్యజలములుగల 'ఆనంద జల'మను సరస్సు గలదు. అచట చండుడను నాగపతి కలడు. అతడు శత్రువులకు సమీపింప అలవికానివాడు. వేయి తలలు గలవాడు. మహాభాగ్యవంతుడు. విష్ణుచక్రపు గుర్తులు గలవాడు.

ఈ విధముగా విచిత్రములైన ఎనిమిది దేవపర్వతములు అచ్చట కలవు. ఇవి పురములు. పుణ్యములైన మందిరములు, పుణ్య జలములుగల సరోవరములు అనేకములైన బంగారుపర్వతములు అట్లే వెండి పర్వతములు, అనేక రత్నకాంతులుగల మణిపర్వతములు, హరిత పర్వతములు, ఇంగిలీకపురంగు, బంగారురంగును గల, శుద్ధములైన మణిశిలా సమూహములతో కూడి మిక్కిలి ప్రకాశించు ఎఱ్ఱని కాంతిగల అనేక ధాతువులచే చిత్రములైన అనేకమణి పర్వతములు వీనిచే ఒప్పినవి. దానికి తూర్పుభూమి యంతయు అనేక విస్తారములుగల గిరులచే ఒప్పినది. అనేకములైన నదులు, గుహలు, శైలములు మొదలగువాని చేతను చిత్రములైన చరియల చేతను ఒప్పినది. ఈ విధముగా పర్వతములతో గూడి, దైత్యులు, రాక్షసులు, సాధువులు, కిన్నరులు, ఉరగులు, గంధర్వులు, సిద్ధచారణులు, గంధర్వాప్సరసలు వీరందరిచే కూడియు, అనేక విస్తారములు కలిగి పుణ్యాత్ములచే వ్యాపింపబడి వెంట్రుకలు (లేక సింహపు జూలు) ఆకారములలో ఉన్న పర్వతములు గలవు.

ఆ మేరువుయొక్క గిరి సమూహమంతయు సిద్ధలోకమున స్మరింపబడినది. అది చిత్రము. అనేకములైన ఆశ్రమములతో కూడినది. పుణ్యాత్ములు ఎక్కువగా సంచరించునది. అది స్వర్గమని చెప్పబడినది. అట్టి ఈ భూమి నాలుగు మహాద్వీపములు కలది. అనేక వర్ణములు (రంగులు), ప్రమాణము (ఎత్తులు–పొడవులు) వెడల్పులు అనేక జాతుల బల ములు, అనేకములైన భక్ష్యములు (నమిలితినునవి), అన్నములు, పానములు అనేక విధములైన కప్పుకొను వస్త్రములు, సొమ్ములు, అచటనున్న అనేక విధములైన ప్రజలతో కూడియున్న నాలుగు మహాద్వీపములు ప్రసిద్ధములు. ఇవి అనేక వర్ణాదులు (జాత్యాదులు) గలవి. భద్రములు భరతములు, కేతు మాలములును పశ్చిమములు (పడమటివి). నిర్మింప బడిన పుణ్యాత్ముల గృహములుగల కురువులు ఉత్తరపువి. ఓ బ్రాహ్మణులారా! అట్టి ఈ నాలుగు మహాద్వీపములు గలదియు అనేక ద్వీపములతో కలకలలాడుచున్నదియు నైన సమస్త భూమి పద్మాకార అని చెప్పబడినది. ఆయా అంతర ద్వీపములతోను, శైలముల తోను, వనములతోను, సెలయేరులతోను, అడవులతోను బహువిస్తరమైన సమస్త భూమి 'పద్మ'అని పిలువబడును. ఆ బ్రహ్మ నివాసమైన (పద్మమైన) లోకము దేవతలతోను, అసురులతోను, మానుషులతోను కూడినదై త్రిలోకమని ప్రసిద్ధి చెందినదై అచ్చటి ప్రాణులచే పిలువబడినది. చంద్ర, సూర్యులచే (క్రిందుగా) తపింప బడినదై అది జగత్తని గానము చేయబడినది. శబ్దస్పర్శ రూప రస గంధములు అను గుణములచే గూడిన ఆ లోకపద్మము శ్రుతులచే పద్మమని చెప్పబడినది. ఈక్రమము సర్వపురాణములందును చక్కగా నిశ్చయింపబడినది. (41)

భువన విన్యాసము - 7

సూతుడు అనెను :

సరోవరముల నుండి పుణ్య జలములుగల నదులు బయలువెడలినవి. అవి పెల్లుబికిన మహాజలములు కలవి. వరసగా ఆ నదులనుగూర్చి వినుడు. ఆకాశమను (వంటి) సముద్రమునుండి వెలువడి సోముడు అని పిలువబడు ఈ చంద్రుడు సర్వభూతములకు ఆధారమై దేవతల అమృతమునకు నిధివంటివాడు. అతనినుండి బయలువెడలి నదియు, పుణ్యజలములుకలదియు, అయిన ఆనది ఆకాశగామిని అయినది. అది ఏడవ వాయు మార్గమున విమలజలయై బయలుదేరినది. ఆ నది జ్యోతిస్సునందు మరలుచున్నదై జ్యోతిర్గణములచే సేవింపబడినది. కోటివేల తారలుగల ఆకాశము నుండి మిక్కిలి పొడవై నదై ఆకాశ మార్గమున వెడలు, మహేంద్రుని గజమైన ఐరావతము ఆకాశ మధ్యముననే

ఆనది యందు జలక్రీడలు సలుపును. విక్షోభితమైన జలములుగల ఆ నదియందు ఆకాశతలమున అనేక విమాన సమూహములలో ఎరిగిపోవుచున్న సిద్ధులు దాని జలము లందు ఆచమింతురు. అది మహాపుణ్య జలములు గలదై మంగళ స్వరూప మైనది. వాయువుచే ప్రేరేపింపబడుచుండును. అనేక విస్తారములలో పయనించుచు–సూర్యునివలె ప్రతిదినము భ్రమణము చేయును. అది వేగముగా మేరువుకు ప్రదక్షిణముగా చుట్టివైచి అంతటను ఎనుబది నాలుగు యోజనములు విస్తరించి ఉండును.

తరువాత నీటిచేతను, తైజసమైన వాయువుచేతను బ్రద్దలగుచు మేరువుయొక్క ఉత్తర కూటముల నాల్గింటిపై పడినది. అంత ఎత్తైన మేరు శిఖరముల ఒడ్డుల చివరల నుండి మరలినదై, నీటిని వెదజల్లుచూ, నాలుగు విధములుగా ప్రవించు జలములు కల్గి, అఱువదివేల యోజనములు నిరాధారమైన ఆకాశమున మేరువుయొక్క నలుదెసల పడును. ఆ మంగళకరమైన, పుణ్యమైన, మహానది ఆ పర్వత మహాపాదములు నాల్గింటి యందు అంతట మందర పర్వతమునకు పూర్వదిశలో పడును. దేవతలయొక్క పూర్వాం శగా సర్వసిద్ధ గణములకు నిలయమైన, చక్కని చిత్రములైన మధ్యప్రదేశములుకలదియు, అనేకములైన సెలయేరులు, గుహలుకలదియు, పర్వత శ్రేష్ఠమైన సుందర గుహలుకల మందర పర్వతమును చుట్టి, కొండనెత్తముల ప్రతాపమును చల్లార్చు స్ఫటికమువలె తెల్లని నిర్మల జలములచే ఆ ఆకాశమహానది ప్రవహించుచుండును.

అట్లే రమ్యమైన కుబేరునికి చెందినచైత్రరథము అను తోటను ప్రదక్షిణముగా చుట్టి ప్రవహించుచు, ఆ ఆకాశ మహానది అరుణోద (ఎఱ్ఱని జలములుగల) సరోవరమును ప్రవేశించినది. ఆ తరువాత అరుణోదసరోవరము నుండి మరలి, చలికాలము చివర, మనోహరములైన ప్రవాహములు కలిగి సిద్ధగణములకు ఆలవాలమైన శైలమునందు చక్కని నడకతో పడుచుండును.

సీతఅను నది మహాపుణ్యయుతమై, నదులలో శ్రేష్ఠమైనది. అది అనేకములైన పొదలతో అడ్డుకొనబడినదై, అనేకములైన విశాల స్థలముల మీదుగా పోవునదై, శీతమంత్ర ముగా కలదై, శిఖరమునుండి జారినదై, సుకుంజమను శ్రేష్ఠపర్వతమునందు పడును. మహాభాగ్య వంతమైన ఆనది యాసుకుంజ పర్వతము నుండి, సమంజ పర్వతము నుండి మాల్యవంత పర్వతమును తగులుచున్నదై, వైకంకము అను పర్వతమును చేరి దాని నుండి మణిపర్వతమును, దాని నుండి అనేక గుహలుగల ఋషభ పర్వతమును చేరుచున్నది.

ఈ విధముగా వేల పర్వతములను చీల్చుకొనుచు మహానది మహాశైలమున సిద్ధ సేవితమైన జఠర భాగమున పడినది. అటనుండి కూడ ఆ నది దేవకూటమైన మహా శైలమును చేరి, సముద్రము చివరగలదై క్రమముగా పృథివిని చేరినది. ఈ విధముగా ఆ నది వేయి స్థలములను నూర్ల పర్వత శ్రేష్ఠముల మీదుగా, విచిత్ర వనముల మీదుగా, వివిధము లైన సరస్సుల మీదుగా, మహాభాగ్యవంతమైన విశాల ప్రదేశములలో ఒడుదుడు కులు లేక ప్రవహించునదై వేల నదులను కలుపుకొన్నదై మహానదియైనది. ఆ శ్రేష్ఠనది భద్రాశ్వమను మహాద్వీపమున ప్రవహించుచు తూర్పు సముద్రమున ప్రవహించి తూర్పు ద్వీపమును చేరును.

దక్షిణమును చేరిన ఆ నది గంధమాదన పర్వత శ్రేష్ఠమును చేరును. అచట జల పాతములలో అనేక విధముగ విస్ఫారి ప్రవహించు నీరు గలదై, దేవతలకు ఆనందము నిచ్చు గంధమాదన పర్వత వనమైన నందన వనమున ప్రవహించుచు, మహాభాగ్యవంతమై దక్షిణముగా ప్రవహించినది. దానిపేరు అలకనంద అని అన్ని లోకములలో ప్రసిద్ధము. అది అట నుండి దేవతల మనస్సువంటిదైన మానససరోవరమున ప్రవేశించును. మానస సరస్సు నుండి శైలశ్రేష్ఠమై, సుందరమైన మూడు శిఖరములు గల త్రికూట పర్వతమును చేరును. త్రికూటమునుండి కలింగ శిఖరమునుచేరును. కలింగ శిఖరము నుండి జారినదై, రుచక పర్వతమున పడును. రుచకమునుండి రాగి కాంతిగల నిషధ పర్వతమును చేరును. నిషధ పర్వతము నుండి కూడ జారినదై, శ్వేతోదరగిరిని చేరును. అటనుండి చక్కని మూలముగల వసుధార పర్వత శ్రేష్ఠమును చేరును. అట నుండి హేమ కూట పర్వతమును చేరినదై, అక్కడ నుండి దేవ శృంగమును చేరును. అక్కడనుండి పిశాచకము అను మహా శైలమును చేరును. ఆ పిశాచక పర్వతమునుండి పంచకూట పర్వతము జేరును. పంచ కూటము నుండి దేవనివాసమైన కైలాస పర్వతమును జేరును. దాని గర్భములో అనేకము లైన గుహలలోను చరియలలోను తిరుగుచు పర్వతశ్రేష్ఠమైన హిమవత్పర్వతమున పడును.

ఆ నది ఈ విధముగా వేల పర్వతములను చీల్చుచు మహానదియై వేగముగా ప్రవ హించునదై నూర్ల స్థలముల మీదుగా ప్రవహించుచు, వేల వనముల మీదుగా, నూర్ల కొలది గుహలలో నుండియు ప్రవహించుచు, మహాభాగ్యవంతురాలై దక్షిణ సముద్రమును చేరును. సుందరమైన, ఒక యోజనము వెడల్పుకలదై, పర్వత గర్భములలో తిరుగు చున్నదైన ఆ గంగామహానది, మహాత్ముడైన శంకరునిచేత ధరింపబడినది. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠ ! శంకరునిచేత ధరింపబడిన ఆ నది భయంకరములైన పాపములను పవిత్రము చేయును. శంకర శరీర స్పర్శచే రెట్టింపుగా పవిత్రమైన జలములుకలదై, సర్వలోకములలో

ప్రసిద్ధి చెందినది. పర్వతమును అనుసరించి అనేక ముఖములుగా అంతటను బయలు వెడలినదై, క్రింద ఇతర పర్వతములచే కొట్టబడుటచే వేల నదులు ప్రసిద్ధి చెందినవి. ఆ మహానదియైన గంగ హిమవత్పర్వతము నుండి 'గంగా' అనుపేరుతో మొదట ప్రకాశించి నదై, సిద్ధులచే సేవింపబడినది. మహానదియైన గంగ ప్రవహించిన దేశములన్నియు ధన్యములు. అది రుద్రునిచేతను, సాధ్యులచేతను, అనిలులచేతను ఆదిత్యులచేతను సేవింప బడిన జలములుగలదై, తాను ప్రవహించిన దేశములను ధన్యములు చేయును.

ఇక మేరు పర్వతము యొక్క పశ్చిమమైన మహాపాదమును చెప్పెదను. అది అనేక రత్నములకు నెలవైనది. పుణ్యమైనది. పుణ్యము చేసినవారిచే సేవింపబడినది. విశాలమైన పర్వతరాజము. విశాలమైన గర్భము గుహలును కలది. మధ్య ప్రదేశములలో పొదలచేతను, స్వచ్ఛమైన కటకములచేతను (నడిమి భాగములచేతను) అలంకరింపబడిన గర్భముగలది. అది ముక్కంటి యొక్క నది. దేవతలచే సేవింపబడిన జలములుకలది. వాయు వేగము కలది. వైశాల్యము లేక సన్ననైనది. కావున తీగవలె మలుపులు తిరిగినది. మేరుకూట తటము నుండి జారిపడినది. జారిపడునప్పుడు కలుగుదెబ్బలచే వ్యాపించుచున్న తీయనైన జల ములుగలది. నిర్మలమైన కొంగువలె తెల్లనైనది.

మేరు కూటమున ఆ ఆకాశగంగా నది సిద్ధచారణులచే సేవింపబడును. తరువాత ఆ నది ప్రదక్షిణముగా తిరిగి పడినదై ప్రవహించుచు, మహాకాంతిగలదై, దేవతలతో ప్రకాశించునదియు, దేవవనమును తన నీటిచే తడుపుచు మహాభాగ్యవంతురాలై అనేక పుష్పఫల ఉదకములు గలదై, ప్రదక్షిణముగానే తిరుగుచు నానా వనములచే అలంకరింపబడినదై, తెల్లని విమలజలముగల పశ్చిమ సరస్సును ప్రవేశించును. తరువాత నది సితోద సరస్సునుండి వెలువడి సుపక్షమను పర్వతమును చేరును. పుణ్యోదకముగల సుపక్షమునుండి దేవర్షులచే సేవింపబడినదై సుపక్షకూట తటమును జేరును. దానినుండి స్తుతింపబడిన జలముగలదై రమ్యమైన శిఖిపర్వతముపై పడును. శిఖి (నెమళ్ళ) పర్వతము నుండి కంక (కొంగ(రాపులుగు)ల) పర్వతమును, కంకపర్వతమునుండి వైడూర్య పర్వత మును, వైడూర్య పర్వతమునుండి కంపిల పర్వతమును, దానినుండి గంధమాదన పర్వత మును దాని నుండి శ్రేష్ఠమైన పింజర పర్వతమును, పింజర పర్వతము నుండి సరస్సును చేరును. దానినుండి కుముదాచలమును, అటనుండి మధుమంతము, జన ముకుటము- అను పర్వతములను చేరును. ఆముకుట పర్వతమునుండి మహాపర్వతమైన కృష్ణ పర్వతమును చేరును.

ఆ కృష్ణ పర్వతమునుండి మహానగములచే సేవింపబడిన శ్వేత మహాపర్వతమును, ఆ శ్వేత పర్వతమునుండి వేయి శిఖరములు గల పర్వతరాజమునందు పడును. అనేక నదులచే నిండారిన జలములుగలిగి మంగళకరమై, ఈ విధముగా వేయి పర్వతముల మీదుగా వేగముగా ప్రవహించుచు ఆ మహానది పారిజాతము అను మహాపర్వతమున పడును. ఆ మహానది పారిజాత పర్వతముపైన అనేకములగు సెలయేళ్ళు, నదులుగల గుహలలోను, చరియలలోను ప్రకాశించును. ఆ పర్వతముయొక్క అనేక కుక్షులలో భ్రమించిన జలములుకలదై, వేగముకలదై, అనేక గండ శిలలచే అనేక పర్యాయములు భేదింపబడుచున్న జలములతో భూతలమునకు చేరును.

బంగారు వర్ణముచే చిత్రమై చక్కని ప్రక్కలు గలదియు గొప్ప కొండ తిప్పలు కలదియు, అనేక ప్రాణులచే సేవింపబడినదియు అయిన ఉత్తరగిరియందు మేరుకూట తటమునుండి జారిన ఆ మహానది వాయువుచే ప్రేరేపింపబడిన జలములు విరజిమ్ముటచే ఆకాశమున వంకరలుతిరిగి పడుచున్నదై, అఱువది వేలయోజనముల పొడవున నిరాధార మై, శుభమైన ఆకాశమున వెదజల్లబడుచున్నదై ఒక మాలవలె మహాజలపాతముగా పడెను.

ఈ విధముగా, అనేక దేవర్షులచే సేవింపబడు శిఖర తటములనుండి జారినదై, వెదజల్లబడుచున్న జలములు గలదియు, అనేకములైన పూలతెప్పలనెడి యూర్ధ్వ కేశములు కలదియై, అనేక రత్న, వన ప్రదేశములుగల అడవియై సూర్యుని మహావనమున ప్రదక్షిణముగా ప్రవహించును. గొప్పవారిచే సేవింపబడి మహాపుణ్యవంతమైన ఆ మహానది అటనుండి బయలుదేరి అనేకములైన సెలయేరులతో కొండనెత్తములతో ఒప్పి, వేగముగా బ్రవహించుచు శంఖకూటమను గిరితటమున పడెను. శంఖకూట తటము నుండి జారినదై వృషపర్వతమునను, వృషపర్వతము నుండి నాగశైల పర్వతమును అట నుండి వర్ష పర్వతమైన నీలపర్వతమును, నీలపర్వతము నుండి ఆనది కపింజల పర్వతమును తరువాత ఇంద్రనీల పర్వతమును చేరును. ఆ తరువాత, మహానీలమును హేమశృంగమును, చేరుకొనును. హేమశృంగము నుండి శ్వేతపర్వతమును, శ్వేతము నుండి సునగమను పర్వతమును చేరును. ఆ మహానది సునగము నుండి శతశృంగమును శతశృంగమునుండి పుష్పాలంకృతమైన పుష్కరమహాశైలమును చేరును. పుష్కరమునుండి బలిష్ఠమైన విరాజమను మహా పర్వతమును, వరాహపర్వతమును అటనుండి మయూర పర్వతమును, అటనుండి గుహా గర్భముతో అలంకృతమైన ఏక శిఖరమును, అటనుండి జారుధియను శైలశిఖరమున వేగముగాపడును.

ఈ విధముగా ఆ మహానది వేయి పర్వతములను చీల్చుచు మర్యాదాపర్వతమై మూడు శిఖరములతో ఒప్పిన త్రిశృంగ పర్వతమును చేరును. త్రిశృంగతటమునుండి జారినదై, గొప్పవారిచే సేవింపబడినదై, మేరు కూటతటము నుండి జారినదై స్వచ్ఛమైన జలములుకలదై విరుద్ధమను పర్వతశ్రేష్ఠమున పడును. అటనుండి భూములపై ప్రవహించుచు, ఆ మహానది పశ్చిమ సముద్రమును చేరును.

ప్రక్కన సువర్ణ భూములు కలిగి, చక్కని పార్శ్వ భాగములు కలిగి, మహాప్రాణులచే సేవింపబడి, చిత్రమైన ప్రత్యంత పర్వతములు గల మేరువుయొక్క ఉత్తర గిరియందు, గుహాగర్భము నుండి జాలువారి, బహు వైశాల్యముగలదై, చిత్రమైన పూలతెప్పలు అనెడి ఊర్ధ్వ కేశములుగలదియై భూమినిప్రవేశించును. అటనుండి ప్రవహించుచు, సంతోషముతో మంగళకరమై ఉత్తర కురుదేశములను ప్రవేశించినదై మహాద్వీపమున మధ్యముగా ఉత్తర సముద్రమును చేరును. ఈవిధముగా ఆ నాలుగు మహానదులు నిర్మల జలములు గలవై, మహాగిరి తటములనుండి జారిపడినవై, నలుదెసలను చేరినవి. కావున, బహువిశాలమైన పృథివి పైవిధముగా పూర్తిగాచెప్పబడినట్లే. ఆ భూమి మేరుపర్వతమును చుట్టి వెదజల్లి నట్లుగా, అన్ని దిక్కులకు వ్యాపించి ప్రవేశించినది. అది నాలుగు మహాద్వీపములు గలది. నాలుగు ఉద్యానవనముల వంటి వనములు గలది. నాలుగు ధ్వజముల వంటి మహా వృక్షములు గలది. నాలుగు శ్రేష్ఠములైన సరోవరములు గలది. నాలుగు మహాపర్వతములు గలది. నాలుగు మహాసర్పములకు ఆశ్రయమైనది.ఎనిమిది ఉత్తర మహాపర్వతములు గలది. ఎనిమిది శ్రేష్ఠ పర్వతములు గలది. (42)

భువనవిన్యాసము - 8

సూతుడు పలికెను :

గంధమాదన పర్వతము ప్రక్కన ఒక విశాలమైన పై సందు గలదు. అదితూర్పు, పడమరలకు ముప్పది రెండువేల యోజనములు గలది. దీని పొడవు ముప్పది నాలుగువేల యోజనములు. అచట ఉండు శుభకర్మలు చేయువారు కేతుమాలు లని ప్రసిద్ధి చెందిరి. అచట మానవులందరు నల్లనివారు. గొప్పతేజము, బలము కలవారు. స్త్రీలుకూడ నల్ల కలువ రేకుల కాంతి కలవారు. వారందరు చూడ చక్కని అందగత్తెలు. అచట షడ్రసములకు ఆశ్రయమైన, ఒక గొప్ప పనసచెట్టు కలదు. బ్రహ్మ కుమా రురులు ఈశ్వరుని కుమారులు దాని ఫలరసమును త్రాగి మనోవేగము కలిగి స్వేచ్ఛగా చరించు వారయి పదికాల సంవత్సరములు జీవించుదురు. దాని ఫలరసమును ద్రాగి వారు కలిసి జీవింతురు.

మాల్యవత్పర్వతము యొక్క ప్రక్కనగూడ తూర్పునసందు కలదు. దాని పొడవు వెడల్పులు పడమటి సందునకు ఉన్నంతటివే, అచట ఉండు వారు భద్రాశ్వులు అని పిలువబడుదురు. వారు నిత్యము సంతుష్టమనస్కులు. అచట భద్రమను సాల(మద్ది) వృక్షములవనము గలదు. నల్లని మామిళ్ళు అచటి మహావృక్షములు. అటనుండు పురుషులు శ్వేత (తెలుపు) వర్ణము గలవారు. మహాతేజో బలసంపన్నులు. స్త్రీలు తెల్ల కలువల కాంతి కలవారు. సుందరులు చూడదగినవారు. చంద్రకాంతి గలిగి చంద్ర వర్ణములు కలిగి చంద్రునివంటి ముఖము కలవారు, చంద్రునివలె చల్లనైన ఆ స్త్రీలు కలువ వాసనలు గలవారు. వారి ఆయువు పదివేల ఏండ్లు. నల్లమామిడి పండ్ల రసమును త్రాగి, తవారు ఎప్పుడును ముసలితనములేని యౌవనము గలవారుగా ఉందురు.

ఋషులు అనిరి :

నాలుగు ద్వీపములయొక్క ప్రమాణము, వర్ణము ఆయువు, సంగ్రహముగానే గానీ, విస్తరముగా కాకుండా ఉన్నది ఉన్నట్లుగా చెప్పబడినది.

సూతుడు అనెను :

ఓ కీర్తివర్ధనులారా! పూర్వ సిద్ధులచేత కీర్తింపబడి ఉదాహరింప బడిన ఆ భద్రాశ్వుల చిహ్నములను సంగ్రహముగా వినుడు. అది భద్రాశ్వ దేశము ప్రసిద్ధమైన సమస్త దేవకూట పర్వతమునకు పరముగా తూరుపు దిక్కుగా అన్ని దిక్కుల యందు ఉన్నట్లు చెప్పబడినది. కులాచలములయొక్కయు, విశేషించి నదుల యొక్కయు, జనపదములు (దేశముల) యొక్కయు, స్వరూపము చూచిన రీతిగను, విన్న రీతిగను నాచే మీకు చెప్పబడినది. శైవాలము, వర్ణమాలాగ్రము, కోరంజము, శ్వేతవర్ణము, నీలము అను ఈ అయిదు కులపర్వతములు, వాని(నుండి పుట్టిన) సంతానమైన ఇతర పర్వతములు బహు విస్తరములై నూర్ల కొలదియు, వేలకొలదియు అయిన కోటికోటుల భూమియందు కలవు. అవి జనావాస దేశములలో (జనపదములలో) కలసి అనేక ప్రాణులతో వ్యాకులమై అనేక విధముల జాతులుగలవై, అనేక రాజులచే పరిపాలింపబడినవి. పరాక్రమ వంతులు శ్రీమంతులైన పురుష శ్రేష్ఠులచే నివసింపబడిన ఆ జనపదములు కీర్తనీయములుగా తేజరిల్లినవి.

సమస్థానములయందును, విషమ స్థానములందును, గిరుల మధ్యలో నివేశించిన వివిధములైన రాష్ట్రములు వానియొక్క పేరులనువినుడు. అట్లే సుమంగళములు, శుద్ధములు, చంద్రకాంతములు, సునందనములు, వజ్రకములు, నీలశైలేయములు, సావీరములు, విజయస్థలములు, మహాస్థలములు, సుకామములు, మహాకేశములు, సుమార్ధ జములు, వాంతరంహములు, సోపసంగములు, పరివాయములు, పరావాచకములు, సంభాష

కములు, మహానేత్రములు, శైవాలములు, స్తనపములు, కుముదములు, శాకముండములు, ఉరః సంకీర్ణ భౌమకములు, శంఖాఖ్యములు, భావిసంద్రములు, ఉత్తరములు, హైమ భౌమకములు, కృష్ణ భౌమములు, సుభౌమములు, మహా భౌమములు అని ఇవియు, మరి ఇతరములు అయిన జనపదములు అనేకములగురించి నేను చెప్పితిని.

ఆ జన పదవాసులు మహాపుణ్యులై మహాగంగయైన మహానది యొక్క జలమును త్రాగుదురు. మొదట ముల్లోకములలోను ప్రసిద్ధిచెందిననదియు, ఆ మహానది చల్లని నీటిని ప్రవహించు నదియు అయినది. అట్లే హంసవసతి, మహాచక్ర, వక్రకాంచీ, సురస (అను నదులు), శాఖావతీ, ఇంద్రానదీ, మేఘా, మంగారవాహినీ, కావేరీ, హరితోయా, సోమ వార్తా, శతప్రదా, వనమాలా, వసుమతీ, పంపా, పంపావతీ, సువర్ణా, పంచవర్ణా పుణ్యా, వపుష్మతీ, మణివ్రతా, సువప్రా, బ్రహ్మభాగా, శిలాశినీ, కృష్ణతోయా, పుణ్యోదా, నాగపదీ, శైవాలినీ, మణితలూ, క్షారోదా, అరుణావతీ, విష్ణుపదీ, మహాపుణ్యా, హిరణ్యావాహీ, నీలా స్కందకూలా, సురావతీ, వామోదా, పతాకా, వేతాలీ అను ఈ గంగా మహానదులు నాయికలుగా పరిగణింప బడినవి. చిన్న నదులు, పుణ్యవతులుగా చెప్పబడినవి. ఈ నదులను కీర్తించుట (పలుకుట) చేతగూడ మానవుడు పవిత్రుడగునని నా తలంపు.

అది సమృద్ధమైన రాష్ట్రము. విశాలమైనది. అనేక జనపదములు ఉండు దేశములచే వ్యాకులమైనది. అనేక వృక్షములు వనములును గల ఉన్నత దేశము. అనేక పర్వతములతో చక్కగా చుట్టబడినది. పురుష, స్త్రీ గుణములచే వ్యాపించినది. నిత్యము సంతుష్టమైనది. మంగళమైనది. అనేక ధాన్యములచేత, ధనములచేతను కూడినది. అనేక రాజులచే పరి పాలింపబడినది. అట్టి దేశమున బంగారు వర్ణము గలవారును, శంఖపు చిప్పలవలె తెల్లని వర్ణముగలవారును, మహాకాయులును, మహావీర్యులును అయిన పురుషులు పురుష శ్రేష్ఠ లుగా చెప్పబడిరి. అచట ప్రజలు మహాభాగ్యవంతులై దేవతలతో గూడ సంభాషణమును దర్శన మును, సమస్థానమున కూర్చుండుట మొదలగు గౌరవములను పొందుచుండిరి. వారి ఆయువు పదివేలయేండ్లు. ఆ మహాత్ములయందు ధర్మాధర్మ భేదము లేదు. అహింస, సత్యవచనము వారిలో సహజముగనే ఉండును. వారు దేవుడగు శంకరునకును పరమ వైష్ణవియగు (విష్ణు సహో దరియగు) గౌరికిని నిత్యమును యాగ పూజా నమస్కారములను చేయుదురు. (43)

భువనవిన్యాసము - 9

సూతుడు అనెను :

భద్రాశ్వుల నిజమైన స్వభావమును ఇప్పటి వరకును వర్ణింపబడినది. ఇక కేతు

మాలుల స్వభావమును విస్తరముగా వినుడు. పశ్చిమమందుగల నిషధాచల శ్రేష్ఠము యొక్క పశ్చిమముగా సర్వదిక్కులయందు చెప్పబడిన ఏడు కులాచలముల గురించి, నదులను గురించి, విశేషించి జనపదములను గురించి విస్తరమును చెప్పుచున్నాను. వినుడు. విశాలము, కంబలము, కృష్ణము, జయంతము, హరిపర్వతము, అశోకము, వర్ధమానము అను ఈ ఏడు కులపర్వతములు, వాని సంతానము బహువిస్తారములైన ఇతర పర్వతములు, నూర్లకొలదియు వేలకొలదియు అయిన కోటి కోటి శతములని తెలియవలెను. వానితో గలిసిన జనపదములు నానాజాతి వ్యాకులములు, నానా ప్రకారములునై అనేక రాజులచే పరిపాలింపబడినవి.

భూమిలో అవి వాని వాని పేర్లతో విక్రమించినవై వివిధములుగా చెప్పబడినవి. జనపదములు నెలకొన్నవై అవి కీర్తనములతో నలంకరింపబడినవి.

వాటికి సమానమైన పేరుగల రాష్ట్రములు అనేకములు. అవి గిరుల మధ్యలో సమ స్థానముల లోనువిషమ (ఎగుడు దిగుడు) స్థానములలోను ప్రవేశించినవి. ఇచట పురమున నివసించు పౌరులు, గోవులు, మనుష్యులు, పావురములు. వాని ముఖములు గలవారు. భ్రమరులు, యూధులు, మాహేయాచల కూటకులు (శిఖరమున ఉండువారు) కూటకంబల (కూటముగ ఉండువారు) మౌషీయులు, గొంగళ్లు ధరించువారు. ఎలుకలతో ఉండువారు), సముద్రాంతరకులు (సముద్రాంతర్భాగమున ఉండువారు) కరంభవులు, కుచులు, శ్వేతులు, శుభులైన సువర్ణకంకణములుగలవారు, శ్వేతాంగులు, కృష్ణపాదులు, విహులు, కపిల కర్షకులు, అత్యాకరాలగోజ్వాలులు, హీనాదులు, వనపాతకులు, మహిషులు, కుముదా భులు, కరవాటులు, సహనత్కచులు, శుకవాసులు, మహావాసులు, వనాసులు, గజభూమి కులు, కుబేరులు (మిడిగ్రుడ్లు గలవారు) ధూమజులు, జంగులు, పంగులు, రాజీవులు, కోకిలలు, వాచాంగులు, మహాంగులు, మధౌరేయులు, సురేచకులు, పిత్తలులు, కాచలులు, శ్రవణులు, మత్తకాసికోలు, గోదావులు, బకులులు, వాంగులు, వంగకులు, మోదకులు, కలులు అను వీరు కేతుమాల దేశమున ఉండువారు పై పేరులలో యౌగికార్థములతో వారి స్వభావములు తెలియవచ్చును). ఆపై మహాభాగులు (గొప్ప అదృష్టవంతులు) మొదటిదియు, మంచి ప్రాకారము కలదియు, పుణ్యజలము కలదియు, మహాసర్పజము లతో సేవింపబడినదియు అయిన మహానది జలములను త్రాగుదురు. కంబలా తామసీ, శ్యామా, సుమేధా, వకులా, భీమా, ప్రభంజనా, కాంచీ, కుశావతి, దక్ష, శాకవతీ, పుణ్యోదీ అను మహానదీ చంద్రావతీ, సుమూలా, ఋషభా అను నదీశ్రేష్ఠము, సముద్రమాలా, చంపావతీ, ఏకాక్షా, పుష్కలా, వాహాసువర్ణా నందినీ, కాళిందీ, పుణ్యజలములుగల

మహానదియైన భారతీ, శీతలజలములుగల పాతికా, బ్రాహ్మీ, మహానదియైన విశాలా, పీవరీ, కుంభకారీ, నదీశ్రేష్ఠమైన రుషా, మహిషీ, మానుషీ, దండానదనదీ ఈ పై చెప్పిన నదులను (జలములను) ఇతరములైన ఉత్తమ నదుల జలములను కేతుమాల దేశవాసులు త్రాగుదురు. ఆ దేశమున ఉన్న ఉత్తమ నదులు అనేకములు. వానియందు దేవర్షులు, సిద్ధులు సంచరింతురు. అవి పుణ్య జలములు గలవి. పాపములను పోగొట్టు నవి. ఈ విధముగా కేతుమాల ద్వీపము అనేక జనపదములచే మిక్కిలి ప్రసిద్ధమైనది. గొప్పనదులచే అలంకరింపబడినది. అనేక రత్నసమూహములచే అలంక రింపబడినది. నిండైనది. నిత్యము సంతుష్టమైనది. మంగళమైనది. ధనములచే ధాన్యములచే తక్కిన పదార్థముల చేతను మిక్కిలి సమృద్ధమైనది. జనావాసములచేత మిక్కిలి గొప్పగా సమృద్ధమైనది. మహానదుల చేత విభూషితమైనది. (44)

భువనవిన్యాసము - 10

శాంశపాయనుడు :

"ఓ ప్రభో! సూత! తూర్పు-పడమరలందు కలవని పేర్కొన బడిన రెండు దేశములను గూర్చి మాకు చక్కగా చెప్పితివి. ఇటు తరువాత ఉత్తర-దక్షిణ దేశములను గురించి అచటి పర్వత నివాసులను గురించి విశదముగా మాకు చెప్పుదు.

సూతుడు శాంశపాయునితో ఇట్లు అనెను :

"శ్వేత పర్వతమునకు దక్షిణమున నీలపర్వతమునకు ఉత్తరమున రమణకమను దేశము ఉండును. అచట మానవులు పుట్టుచుందురు. వారు అన్ని ఋతువుల లోను కామమును ఇచ్చువారు. ముసలితనము(పు) దుర్గంధములేనివారు తమ తెల్లని జాతి జనముతో కూడియున్నవారు. అందరును అందమైనవారు. అచటగూడ రోహణమను గొప్ప వటవృక్షము గలదు. వారు దాని ఫలరసములను త్రావుచుందురు. ఆ మహాభాగ్య వంతులు పదకొండువేల అయిదు వందల సంవత్సరముల పాటు నిత్యసంతుష్టులై, మానవ శ్రేష్టులై జీవింతురు.

శ్వేత పర్వతమునకు ఉత్తరమున శృంగ సాహ్వ పర్వతమునకు దక్షిణమున హిరణ్యతమను దేశముకలదు. అచట హైరణ్యతీ అను నదికలదు. అచట మహాబలులు, మంచి తేజస్కులు అయిన మానవులు పుట్టుచుందురు. అచ్చటి ప్రాణులు అన్ని ఋతువుల లోను కామమును అనుభవింతురు. వారు ధనికులు, అందమైనవారు. అమితౌజస్కులైనట్టి వారు పంద్రెండువేల అయిదు సంవత్సరముల ఆయువు ప్రమాణముగా కలవారు. ఆ

దేశమున ఆఱు రసములకు నెలవైన మహావృక్షము గజనిమ్మచెట్టు కలదు. దాని ఫల రసమును త్రావి అచటి మానవులు జీవింతురు. అచటి పర్వతమునకు మూడు ఉన్నత శిఖరములు గలవు. అందులో ఒకటి మణిమయము. మరొకటి బంగారముతో నిండినది. మూడవది సర్వరత్నమయమై మేడలతో ప్రకాశించునది.

ఉత్తర సముద్రముపు చివర 'కురులు' ఉందురు. ఆ కురుదేశము పుణ్యమై సిద్ధులచే సేవింపబడినది. అచట వృక్షములు తీయని ఫలములు గలవి. నిత్యము పుష్ప-ఫలములను ఇచ్చునవి. ఫలములందు వస్త్రములను, ఆభరణములను ప్రసవించును. కొన్నిచోట్ల అచటి వృక్షములు సర్వకామములను ఫలములుగా ఇచ్చునవై, మనోహరములు గంధవర్ణముతో, రసముతో కూడిన ఉత్తమమైన మధువును స్రవించును. అచటగల మరొక వృక్షములు, క్షీరవృక్షములు, అవి మనోహరములు. అవి ఆఱు రసములు కలిగి అమృతముతో పోలిన క్షీరమును స్రవించును. అచటి భూమియంతయు మణిమయమై సన్నని బంగారు ఇసుక కలదిగా ఉండును. ఆనదీ తీరము అంతయును సుఖస్పర్శగలది. బురుద లేనిదై రోగములు లేనిదై శుభకరమైనది. అచట దేవలోకమునుండి జారిన వారు మానవులై జన్మింతురు. శుభకరులు. తెల్లని శుద్ధమైన తనజాతి బంధుజనముతో కూడినవారు. వారందరు స్థిరమైన యౌవనము గలవారు. స్త్రీ, పురుషుల జంటలను ప్రసవింతురు. స్త్రీలుగూడ మిక్కిలి మనోహరులు వారు అందరు అమృతముతో సమానమైన క్షీరవృక్షము యొక్క క్షీరమును త్రాగుదురు. వెంటనే జంట జనించును. సమముగనే పెద్ద వారగుదురు. శీలము రూపము సమమే. సమముగనే మరణింతురు. చక్రవాక పక్షులవలె అన్యోన్యము అనురక్తులు ఆరోగ్యవంతులు, దుఃఖము లేనివారుగా ఉండి నిత్యము సుఖములచే సేవింప బడుదురు. పదునాలుగు వేలయైదు సంవత్సరములు మహావీర్యులై అన్య స్త్రీలను సేవింపనివారై జీవింతురు.

ఈ కురువుల విషయమును గూడ విస్తరముగా వినుడు. ఉత్తరపుదైన జారుధి అను పర్వతరాజమునకు ఉత్తరముగాగల కురువుల విషయమును చెప్పుచున్నాను వినుడు. చంద్రకాంత శైలము, సూర్యకాంత శైలము-అను మిక్కిలి గొప్ప మహోన్నతములైన రెండు కులపర్వతములు అచటఉన్నవి. అవి అనేకకందరములు (నీటితో చీల్చబడి ఏర్పడిన గుహలు)దరులు (స్వయముగా అలంకరింపబడినవి. అనేకములైన పొదలచేతను, వనముల చేతను కూడినవి. చిత్రములైన ధాతువులచే అలంకరింపబడినవి. పుష్పములు, కంద మూలములు, ఫలములతో కూడినవి. సిద్ధులచేతను చారణులచేతను సేవింప బడినవి. (నివసింపబడినవి). ఆ రెండు కులపర్వతముల చేతను అనేకములైన వందల శిఖరముల

చేతను, ఆ ద్వీపము దగ్గరగా ఉండి సేవింపబడినది. ఆ చంద్రకాంత–సూర్య కాంత పర్వతముల మధ్యగా భద్రసామ అను మహానది ప్రవహించుచున్నది. ఇతరములైన వేలకొలది నదులు నిర్మలములై, సురసములైన జలములు కలవై, కురుదేశవాసులు అందరి స్నాన పానములకే కాక ఈదుటకును సరిపోవునట్లుగా జలముతో ప్రవహించినవి. అట్లే మరికొన్ని వేల మహానదులు క్షీరములను ప్రవహించును. తేనెలను, మైరేయమును, నేతిని ప్రవహించినవి. అచట పెరుగు మడుగులు వేలుగలవు. తీయని రుచ్యమైన అన్న పర్వతము కలదు. అమృతమువలె తీయని పండ్లు అనేకములు గలవు. గంధవర్ణ రసముతో ఒప్పిన కంద మూలములు ఫలములు కలవు. అవి అయిదు యోజనముల వరకంతటా గంధముల విరజిమ్మును. పలురంగుల, పూవులు వేలకొలదియు, గొప్పనైన భోగ్య వస్తువులు మంగళములును వేలకొలది కలవు.గంధము, రంగు, రసము వీనిచే ఒప్పినవై సుఖస్పర్శగల తమాల, అగురు, గంధ, చందనవనములు కలవు. అచట వనములు వికసించిన పూవు లతో, వానిలో తిరుగాడు తుమ్మెదలతో కూడిన వృక్షములు పొదలు తీగలును గలవు. ఓ బ్రాహ్మణోత్తములారా! తుమ్మెద గీతులతోను పక్షులతోను నిండిన కమలములతో, కలువల తోను ఒప్పిన వేలకొలది సరస్సులు అచ్చట కలవు. భక్ష్యముల తోను, పూవులు మొదలగు వాని మాలలతోను, సమృద్ధములు ఆ పర్వతములు అనేకములైన మాలలు పూసికొను గంధాదులును కలవి. అందమైన ముఖములతో చిత్రమైనవి. పక్షి సంఘముల కూతలచే ధ్వనింపబడినవి. పడుకొను పరుపులు కూర్చొను ఆసనములు మొదలగు భోగములు గలవియు అనేక గుణవిస్తారములు కలవియునుగల రమ్యమైన విహార భూములు అందు కలవు. అవియన్ని ఋతువులలో సుఖప్రదములు. ఉద్యానవనములు అంతటను ఎక్కువగా కలవు. మణులతోను, బంగారముతోను అలంకరింపబడిన శిలాగృహములు వృక్ష గృహ ములు శ్రేష్ఠములైన అరటి చెట్ల గృహములునుగలవు. అంతటను వేలకొలది సుఖదములైన తీవపొదరిండ్లు, శుద్ధ శంఖపు చిప్పవలె తెల్లనైన నూర్లకొలది భూ గృహములును కలవు. మణుల జాలాంతరములుగల బంగారు గవాక్షములుఅను కిటికీలుగలవు. అంతటకూడ విశాల సువర్ణమణి చిత్రములుకలవు. వేలకొలది శ్రేష్ఠములైన మహావృక్షము అంతటను గలవు. సన్నని యనేక ఆకారములుగల సుఖకరములైన వస్త్రములు గలవు. మృదంగములు, వేణువులు, చేతి వాద్యములైన (డక్కీ) పణవములు, చాలవిస్తారముగా ఉన్నవి. లక్షలకొలది కల్ప వృక్షములు ఫలించుచుండును. అట్లే అంతటను గల ఉద్యానములు ఆ పురము అంతట వ్యాపించినట్లు ఉండును. సర్వ ద్వీపములలోను ఆ కురుదేశం మిక్కిలి సంతుష్ట మైనది. స్త్రీ, పురుషులతో వ్యాకులమైనది. అచట వాయువు అనేక పుష్ప సుగంధముగలదై

బాగుగా వీచును. శ్రమను పోగొట్టునా ద్వీపమున నిత్యము సంగ సుఖసంతోషము ఉండును. స్వర్గమునుండి భ్రష్టులైన నరులు ఎల్లప్పుడు అచట జన్మించుచుందురు. అది భూతల స్వర్గము. అది సుగుణములలో సర్వోత్తమమైనది.

అచటివారు చంద్రునివంటి కాంతిగల (తెల్లని)వారు నరశ్రేష్ఠులు. తూర్పు తీరమున పుట్టినవారు నల్లని అంకములు (చుక్కలు)గలవారు. నలుపు, తెలుపువారు సుఖవంతులు. సూర్యుని వంటి కాంతిగల (ఎఱ్ఱని) శ్రేష్ఠులైన ప్రజలు. ఆ దేశములోని నరులు శ్రేష్ఠులు, దేవతలతో సమానమైన బలపరాక్రమములు గలవారు. ఎల్లప్పుడు విహరించువారు. అందరును స్వేచ్ఛావృత్తిచే మంచి తేజస్సు గలవారు. కంకణములు, చేతులు మొదలగు అవయవములందును, భుజములందును ధరించు భుజకీర్తులు మొదలగునవి. కంఠ హారములు, చెవి కుండలములు–వీనిచే అలంకరింపబడినవారు. పూలమాలలు ధరించిన వారు. చిత్రములైన కిరీటములు ధరించినవారు. చిత్రమైన కప్పు వస్త్రములు గలవారు. తరగని యౌవనము గలవారు. ప్రియమైన సుందరులు. ఇట్టి ప్రజలు పెక్కువేల యేండ్లు జీవింతురు. వారు ప్రసవించుట అనెడి ధర్మము కలవారుకారు. వంశమును క్షీణింపజేయు విధానము లేదు. వృక్షము నుండి మిథునము(లు) పుట్టును. అందరును సామాన్యమైన సంపదలు గలవారు. మమత్వమును వదలినవారు. అచట ధర్మములేదు. దుర్బుద్ధిలేదు. శ్రమలేదు. కాలము నిండగనే వారు నీటి బుడగలవలె నశింతురు. ఈ విధముగవారు అత్యంత సుఖవంతులు, సర్వదుఃఖములు వదలినవారు. రాగులై (ప్రేమగలవారై) ధర్మమును చూడరు. దుఃఖము వలననే అధర్మము పుట్టును.

ఉత్తర కురుదేశములకు ప్రక్కన దక్షిణమున సముద్రము కలదు. అది తరంగ మాలలతో ఒప్పినది. కావున అనేక స్వరములతో అలంకరింపబడినది. ఐదువేల యోజన ములు దాటి దేవతలకు నిలయమైన చంద్రద్వీపమని పేరొంది, చంద్రమండల మందు ఉన్న(ట్లున్న) ద్వీపము కలదు. దాని పరిమండలము వేయి యోజనములు. అనేక పుష్ప–ఫలములతో కూడినది. గొప్ప సమృద్ధితో కూడినది. నూరు యోజనముల విస్తీర్ణము గలది. నూరు యోజనముల ఔన్నత్యము కలది. దాని మధ్యన గిరి శ్రేష్ఠము గలదు. అది సిద్ధుల చేతను, చారణులచేతను సేవింపబడినది. చంద్రసమాన కాంతులుకలవియు, మనోహరము లైనవియు, చంద్రాకారమున ఉన్నవియు, మంచి లక్షణములు (చిహ్నములు) కలవియు. తెల్లనివియు వైడూర్య వర్ణము గలవియు అయిన కలువలతో ఈ పర్వతము కుముద ప్రభయై (కలువల కాంతి నిండినదై) ఉండెను. అది అనేక చిత్రముల ఉద్యాన వనములు కలది. అనేకములైన సెలయేరులుగల గుహలుకలది. రకరకములైన గొప్ప

చరియలు గుహలు పొదరిండ్లచే చక్కగా అలంకరింపబడినది. ఆ శైలమునుండి మహా పుణ్యకరమైనది, చంద్ర కిరణములవలె నిర్మలములైన జలములు కలదియు అత్యుత్తమ మైన చంద్రావర్త అనునది కలదు. అది నక్షత్రాధిపతియైన చంద్రునియొక్క ఉత్తమ స్థానము. అచట గ్రహనాయకుడైన చంద్రుడు ఎప్పుడు అవతరించును. అచట చంద్రుని పేర పర్వతము కీర్తిని పొందినది. చంద్రద్వీపము అను మహాద్వీపము స్వర్గమునను ఇచటను ప్రకాశమైనది. అచట అందరు చంద్రునితో సమానమైనవారు, నిండు చందురుని మోము గలవారు, చంద్రకాంతిగల ప్రజలు నిర్మలులు, చంద్రుడే దైవముగా గలవారు, అత్యంత ధార్మికులు, సౌమ్యులు, సత్యసంధులు, మహాతేజస్కులును అయిన ప్రజలు అచట సదా చారులు, వేయి ఏండ్ల ఆయువు గలవారు.

పశ్చిమ ద్వీపమునకు పశ్చిమముగా, నాలుగువేల యోజనముల మహోదధిని దాటి, అంతటను పదివేల యోజనముల పరిమండలముగల భద్రాకరమను ద్వీపము కలదు. అది అనేక పుష్పములతో ప్రకాశించినది. మిక్కిలి ధనధాన్యములతో నొప్పినది. అనేక రాజులతో పాలింపబడినది. నిత్యసంతుష్టమై ఉబ్బినది. మహాశైలము లతో ప్రకాశించినది. అచట వాయువు యొక్క భద్రాసనము గలదు. అది నానారత్నములచే అలంకరింపబడినది. అచట ఆకారము దాల్చిన వాయువు ఎల్లప్పుడు పర్వదినములలో పూజింపబడును. అచటి ప్రజలు మంచి బంగారు వన్నెగలవారు, బంగారుతో అలంక రింపబడిన వారు దేవతలతో సమానులై చిత్రమైన వస్త్రములు పూలమాలలు గలవారై, వీర్య వంతులై, మహాభాగ్యవంతులై, ఐదువేలయేండ్ల ఆయువు గలవారై, సత్యసంధులై, సంతుష్టులై, వాయువు దైవముగా గలవారునై ఉందురు" అని చెప్పి

"భారత యుగమున ఈ సృష్టి ఈ విధముగనే పరమ తత్త్వజ్ఞులచే చూడబడినది. నేను ఇంకేమి చెప్పవలెను?" అని ఈ విధముగా బుద్ధిమంతుడగు సూతుడు అడుగగనే మరల ప్రత్యుత్తరమును వినుటకై ఋషులు

ఇది భారత వర్షము. దీనియందు స్వాయంభువు మొదలగు పదునలుగురు మనువులు ప్రజాసృష్టికై జన్మింతురు. ఆ వృత్తాంతమును తెలిసికొన గోరుచున్నాము. కావున దానిని మాకు వివరింపవలెను" అని సూతుని వేడుకొనిరి. సూత పౌరాణికుడు భావితాత్ములైన ఋషుల వచనములు విని సమాహిత మనస్కుడై మరల వారితో ఇట్లు పలికెను.

సూతుడు ఇట్లు అనెను :

ఈ పైన కురుదేశముల యథార్థ స్వభావస్థితి, భారతము యొక్క యథార్థమైన

స్వభావస్థితిని చెప్పబోవుచున్నాను వినుడు. ఓ బ్రాహ్మణోత్తములారా! పూర్వ పశ్చిమ సముద్రములవరకు పొడవైన దక్షిణ హిమాచల పుణ్య క్షేత్రమున దక్షిణముగా వ్యాపించి యున్న జానపదముల (జనావాస దేశముల) విస్తరమును గూడ వినుడు. ఈ భారత దేశమున వసించు ప్రజలను మీకు వర్ణించి చెప్పుదును. ఇది హిమవత్పర్వతమునకు దక్షిణముగను సముద్రమునకు ఉత్తరముగను వ్యాపించి ఉన్న శుభాశుభ ఫలములు లభించు స్థానము. ఇది భారతము అను దేశము. ఇచటి ప్రజలు భారతీయులు. ప్రజలను భరించుటచే మనువు భరతుడు అనబడుచున్నాడు. ఈ నిరుక్త వచనమువలన ఈ దేశము భారతము అనబడినది. అక్కడి నుండియే స్వర్గము, మోక్షము, మధ్య శ్రాంతమును స్వర్గ మోక్షములకు మధ్య విశ్రాన్తి మార్గము లేదా జీవన్మోక్షము పొంద బడును. ఇచట తప్ప వేరొకచోట భూమిలో మర్త్యులకు (మరణ స్వభావులగు మానవులు మొదలగు వారికి) కర్మ చెప్పబడ లేదు. ఒక్క భారతదేశమునకు ఎనిమిది భేదములు చెప్పబడినవి. అవి సముద్రములో మునిగినవై, పరస్పరము తెలియరానివి. ఇంద్రద్వీపము కసేరు ద్వీపము, తామ్రద్వీపము, సూర్యద్వీపము, నాగద్వీపము, సౌమ్య (సోమ) ద్వీపము, గంధర్వ ద్వీపము, వారుణద్వీపము. ఈ భారత ద్వీపమనునది తొమ్మిదవది. ఇది పూర్వపశ్చిమ దక్షిణ సముద్రములచే చుట్టబడినది. ఇది దక్షిణోత్తరముగా వేయి యోజనములు గలది. కుమారీ నది వరకుగాని గంగోత్పత్తి స్థానమువరకుగాని అడ్డముగా తొమ్మిదివేల యోజనములు విస్తీర్ణము కలది. ఈ ద్వీపము చివరలలో మ్లేచ్ఛులు నిత్యము నివసింతురు. ఈ ద్వీపము యొక్క తూర్పు చివరలో కిరాతులు పశ్చిమముచివర యవను లును ఉన్నట్లు చెప్పబడినది. ఇక మధ్యన బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు క్రమముగా యుగములచే, యుద్ధములచే, వ్యాపారములచేతను వృత్తులను నిర్వహించువారై యుండిరి. వారిలో పరస్పర తగవు-న్యాయము జరుగుచుండును. వర్ణములవారు తమ కర్మలలో ధర్మార్థకామ సంయుక్తులుగా ఉండిరి. సంకల్పమే అయిదవ ఆశ్రమముగా గల బ్రహ్మచర్య గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమములు యథావిధిగా జరుగుచుండును. ఇచటి స్వర్గ-మోక్షముల కొరకై మానవుల ప్రవృత్తి (ఆచరణము) ఉండెడిది. అడ్డముగా పొడవుగా ఉన్న తొమ్మిదవదైన ఈ ద్వీపమును అంతయు జయించినవాడు సమ్రాట్ అనబడును. ఈ లోకము సమ్రాట్ట నియు (ఈ లోకమును జయించినవాడు సమ్రాట్టు అనియు) అంతరిక్షలోకము విరాట్టనియు (అంతరిక్షమును జయించినవాడు విరాట్టనియు), వీరిరువురి కంటె వేరొక స్వరాట్టు అను లోకము కలదు. విస్తరమును మరల చెప్పెదను (స్వరాట్టు అనగా ఆత్మను జయించిన వాడు : పర బ్రహ్మము).

ఈ భారతదేశమున గొప్ప చరిత్రలుగల ఏడు కులపర్వతములు గలవు. మహేంద్ర పర్వతము, మలయపర్వతము, సహ్యాపర్వతము, శుక్తిమత్పర్వతము, ఋక్షపర్వతము, వింధ్యపర్వతము, పారియాత్రపర్వతము–ఇవి ఏడును కులపర్వతముల పేర్లు. వాని సమీప ములలో తక్కిన పర్వతములు వేలకొలది కలవు. అవి ఉత్తమ వంశమున పుట్టినవి. అన్ని గుణములు గలవి. విశాలములైనవి. చిత్రమైన చరియలు గలవి. పర్వత శ్రేష్టమైన మందరము, విహారయోగ్యమైన దర్దుర పర్వతము, కోలాహల పర్వతము, నాగమాతతో గూడిన మైనాక పర్వతము, వైద్యుత పర్వతము, పాతంధమ పర్వతము, పాండుర పర్వతము, గంతుప్రస్థ పర్వతము, కృష్ణగిరి, గోధనగిరి, పుష్పగిరి, ఉజ్జయన్త పర్వతము, రైవతక పర్వతము, శ్రీపర్వతము, కారుపర్వతము, కూటశైల పర్వతము, వీనికంటే వేరైనవి. చిన్నవి ఆశ్రయించిన ప్రాణులు స్వల్పముగా ఉన్నవియు అయిన పర్వతములు మరికొన్ని కలవు. వానితో కలిసిన జనపదములు నిత్యము ఆర్య, మ్లేచ్ఛులుకలవి. వారు ఈ నదుల నీటిని త్రాగుదురు. గంగ, సింధు, సరస్వతి, శతద్రు, చంద్రభాగ, యమున, సరయూ, ఇరావతీ, వితస్త, విపాశ, దేవిక, కుహు, గోమతి, ధుతపాప, బాహుద, దృషద్వతి, కౌశికి, నిశ్చీర, గండకి, ఇక్షు, లోహిత–ఇవి హిమవత్పర్వత (పాద) ప్రత్యంత పర్వతముల నుండి బయలుపడి స్రవించినవి. వేదస్మృతి, వేదవతి, వృత్రఘ్ని, సింధు, వర్ణాశ, చందన తీరములతో గూడిన మహతి, పరా, చర్మణ్వతి, విశద, వేత్రవతి, శిప్ర, అవంతి–ఇవి పారియాత్ర కులపర్వతమును ఆశ్రయించిన నదులు. మహానదమైన శోణ, మహావృక్షములు గల నర్మద, మందాకిని, దశార్ణ, చిత్రకూట, తమస, పిప్పల, శ్రోణి కరతోయ, పిశాచిక, నీలోత్పల, విపాశ, జంబుల, వాలువాహినీ, సితేరజ, శుక్తిమతి, మక్రుణ, త్రిదివ–ఇవి నక్షత్రపాతము వలన బయలుదేరిన మణిసమాన జలములుగల నదులు. తాపి, పయోష్ణి, నిర్వింధ్య, మద్ర, నిషద, పేన్వ, వైతరణి, శితిబాహు, కుముద్వతి, తోయ, మహాగౌరి, దుర్గ, అంతశిల, వింధ్యపాదములైన ప్రత్యంత పర్వతముల నుండి బయలువెడలిన పుణ్యజలములు గలిగిన శుభనదులు, గోదావరి, భీమరథి, కృష్ణవేణి, వంజుల, తుంగభద్ర, సుప్రయోగ, కావేరి–ఇవి దక్షిణాపథ నదులు. సహ్యాపర్వత పాద ప్రత్యంత పర్వతములనుండి బయలుదేరినవి. కృతమాల, తామ్రవర్ణ, పుష్పజాతి, ఉత్పలా వతి–ఇవి మలయపర్వతము నుండి పుట్టిన నదులు, ఇవి అన్నియు శీతజలములు గలవి. మంగళములు. త్రిసామ, ఋతుకుల్య, ఇక్షుకుల్య, త్రిదివ, లాంగులిని, వంశధార–ఇవి మహేంద్ర పర్వతమునుండి పుట్టిన నదులు. ఋషీక, సుకుమారి, మందగ, మందవాహిని, కూప్ర పలాశిని–ఇవి శుక్తి మత్పర్వతమున పుట్టిన నదులు. అన్ని నదులును పుణ్య వంతములు, సరస్సులు కలవి,

అన్నియు గంగలే సముద్రమునకు చేరబోవునవి. అవి అన్నియు విశ్వమునకు తల్లులు. అంతేకాక ఉపనదులును నూర్ల కొలదియు, వేల కొలదియును కలవు. ఇవి కురు పాంచాలదేశములు జాంగల దేశముతో కూడినవి. సేన దేశము, భద్రకారము, బోధము, శతపథేశ్వరులతో గూడిన వత్సదేశము, కిసష్ణము, కుల్యము, కున్తలము, కాశికోశములు ఈ దేశముల ప్రక్కన తిలింగదేశము వృక దేశముతో కూడిన మగధ దేశమును–గలవు. ఈ విధముగా మధ్య దేశములోని జనపదముల గురించి చాలవరకు తెలుపబడినవి.

సహ్యా పర్వతమునకు ఉత్తరమున గోదావరిఉన్న ప్రదేశము మొత్తము భూమిలో రమ్యమైన ప్రదేశము. అచట గోవర్ధన పర్వతము గలదు. అది ఇంద్రునిచే నిర్మింపబడినది. పరశురాముని సంతోషమునకై ఇది స్వర్గముగా చేయబడినది. భరద్వాజ మునిచేత శ్రీరాముని సంతోషమునకై వృక్షములు ఓషధులును, అవతరింపజేయబడినవి. ఆయన చేత అంతఃపుర వనప్రదేశము మనోహరముగా సృష్టింపబడినది. వాహ్లీకులు, వాఢధామములు, ఆభీరులు, కాలతోయకములు, అపరీతములు, శూద్రములు, పహ్నావ ములు, చర్మఖండికములు, గాంధారములు, యవనములు, సింధు, సావేరీ, భద్రకములు, శకములు, వ్రాదములు, కులిందములు, పరితములు, హర్షపూరికములు రమటములు, రద్ధకటకములు, కేయులు, దశమానికములు, క్షత్రియోప నివేశములు, వైశ్యశూద్ర కులములును, కాంభోజములు, దరదములు, బర్బరములు, ప్రియకౌశికములు, పీనములు, తుషారములు, పహ్లవములు, బాహ్యతోదరములు, ఆత్రేయములు, భరద్వాజ ములు, ప్రస్థలములు కేసరకములు, లంపాకములు, స్తనపములు, జహుడములతో గూడిన పీడికములును, అపగములు, అలియచూలికములు, ఆహుకములు, పూర్ణదర్వులును– అను ప్రదేశములు ఉదీచ్యదేశము. ఇక ప్రాచ్యదేశములను వినుడు. ఆంధ్రవాకములు, సుజరకములు, అంతర్గిరి–బహిర్గిరులు, ప్రవంగ–వంగేయములు, మాలదములు, మాలవర్తి దేశములు. బ్రహ్మోత్తరములు, ప్రవిజయులు, భార్గవములు, గేయమర్థకములు, ప్రాగ్ జ్యోతిషములు, ముండములు, విదేహములు, తామ్ర(త్రు)లిప్తకములు, ఆలములు, మగధ ములు, గోవిందములు ఇవి ప్రాచ్య దేశములు అనబడినవి. ఇక దక్షిణాపథమున ఉన్న ఇతర దేశములు పాండ్యము, కేరళములు, చౌల్యములు, కుల్యములు, సేతుకములు, మూషికములు, కుమనములు వనవాసికములు, మహారాష్ట్రములు, మాహిషకములు, కళింగములు, చౌషికములతోడి అభీరములు, వరములైన ఆటవ్యములు, పులింగములు, వింధ్యమూలికములు, దండకములతోడి వైదర్భములు, పౌనికములు, మౌనికములు, అస్మకములు, భోగవర్ధన ములు, నైర్ణికములు, కుంతలములు, ఆంధ్రములు, ఉద్భిదములు,

నీలికాలికములు, ఇవి ప్రాచ్యదేశములు, ఇక తక్కిన దాక్షిణాత్య దేశములను వినుడు. శూర్పకారములు, కోలవనములు, కాలీతకములతోడి దుర్గములు, పురేయములు, సురాలములు, తాపసములతోడి రూపసములు, సురసితములు, సమస్తపర క్షరములు, నాసిక్యములు, అంతర నర్మదములు, భానుకచ్ఛములు, సమములు, హేయములు, శాశ్వ తముల తోడి సహసములు, కచ్ఛీయములు, సురాష్ట్రములు, అర్బుదములతోడి అనర్థములు, అనునవి చక్కగా చుట్టి ఉన్న దేశములు. వింధ్యవాసి దేశములను వినుడు. మాలవములు, కరూషములు, ఉత్కలములతోడి వేకలములు, ఉత్తమర్ణములు, దశార్ణములు, కిష్కింధముల తోడి భోజములు, తోసలములు, కోసలములు, త్రైపురములు, వైదికములు, తుమురములు, తుంబురములు, నిషధములతోడి షట్సురములు, అనుపములు, తుండికేరములు, వీతి హోత్రములు, అవంతులు, ఇవి మొత్తము వింధ్య పృష్ఠమున ఉన్న దేశములు. తరువాత పర్వతాశ్రయి దేశములను చెప్పెదను. నిగర్హరములు, హంసమార్గములు, క్షుపణములు, తరంగణములు, ఖసములు, కుశప్రావరణములు, హూణములు, బహూదకములతో కూడిన దర్వములు, త్రిగర్తములు, మాలవములు, తామసములతో గూడిన కిరాతములు. భారత దేశమున నాలుగు యుగములని పండితులు తెలియుదురు. అవి కృతయుగము, త్రేతా యుగము, ద్వాపరయుగము, కలియుగము-అని నాలుగింటిని గురించి. వాని యొక్క స్వభావమును ముందు చెప్పెదను వినుడు. (45)

భువన విన్యాసము - 11

సూతుడు అనెను :

ఇది విని ఆ ఋషులు సమాధానమును వినగోరినవారై సంతసముతో లోమహర్షుణుని ఋషులు ఈ విధముగా అడిగిరి :

భారతవర్షమును గూర్చి ఉన్నది ఉన్నట్లు చెప్పినట్లే ఓసూతా మాకు కింపురుష వర్షమును గూర్చియు హరివర్షమును గూర్చియు తత్త్వస్థితిని చెప్పుము అనగా ఈ విధముగా బ్రాహ్మణులుచే అడుగబడిన సూతుడు మునులు పూర్వము అడిగినట్లుగా విశేషించి ప్రశ్నానుగుణముగా ఈ విధముగా చెప్పెను. ఓ బ్రాహ్మణులారా! మీరు విన గోరినది సంతోషముతో వినుడు. ప్లక్ష ఖండము అను కింపురుష దేశము చాల గొప్పది. అది నందనవనమును పోలి ఉండును. కింపురుష దేశమున మానవుల స్థితి పదివేల యేండ్లు. అచటి మానవులు బంగారువన్నెగలవారు. స్త్రీలు అప్సరసలవలె అందగత్తెలు. వారు అందరు రోగములులేని వారు. దుఃఖములేనివారు. నిర్మలమైన మనస్సు గలవారు.

అట మానవులు కాచిన బంగారు కాంతిగలవారై పుట్టుదురు. ఆ పుణ్యమైన కింపురుష దేశమున తేనెలువహించు మంగళకరమైన ప్లక్ష (జువ్వి)చెట్టుగలదు. కింపురుష దేశవాసులు అందరు దాని ఉత్తమ రసమును త్రావుదురు. కింపురుష దేశము తరువాత హరివర్షము దేశముగూర్చి చెప్పెదను. అచట మానవులు బంగారుకాంతిగలవారై పుట్టుదురు. అంతటను వారు దేవలోకమునుండి జారినవారై దేవరూపులుగా ఉందురు. హరివర్ష దేశమున మానవులు అందరు శుభమైన చెరుకురసం త్రాగుదురు హరివర్ధము అను మానవులు సంతుష్ట మనస్కులై పదునొకండు వేల యేండ్లు జీవింతురు. అచట నరులను ముదిమి బాధింపదు. వారు క్షీణింపరు నాతో ఇంతకు ముందు

ఇలావృత వర్ష(ము) దేశము చెప్పబడినది. అచట సూర్యుదు ప్రకాశింపడు. మానవులు క్షీణింపరు. ఇలావృత దేశమున చంద్రసూర్యుల ప్రకాశము ఉండదు. అచటి మానవులు పద్మపు రంగుగలవారు. పద్మకాంతిగలవారు, పద్మదళములవంటి కన్నులు కలవారు. జంబూరస, ఫలములు ఆహారము కలవారు. కంపములేనివారు. సువాసనగలవారు. మానవంతులు. సుఖములను అనుభవించినవారు. సత్కర్మ ఫలములను అనుభవించు వారు. వీరు అందరు దేవలోకమునుండి జారివచ్చి, యిచ్చట అజరామరులై (ముదిమి చావును లేనివారై) పుట్టుదురు. ఆ నరశ్రేష్ఠులయొక్క ఆయుః ప్రమాణము పదమూడు వేలయేండ్లు. ఇలా వృతము మేరువు యొక్క ప్రతి దిక్కున తొమ్మిదివేల (యోజనముల) విస్తారముగల దేశము. ఇచట మానవులు. వేలయేండ్లు జీవింతురు. దాని విస్తారము ఇరువది ఆరు యోజనములు. అంతట చతురస్రముగను అదే ప్రమాణములో ఉన్నది. అది మూకుదువలె ఉండును.

మేరువుయొక్క తొమ్మిదివేల యోజనముల పరిమితమైన పశ్చిమభాగమున గంధ మాదన పర్వతముగలదు. అది ఉత్తర, దక్షిణములుగా నీలనిషధ పర్వతముల వరకు ముప్పది నాలుగువేల యోజనముల పొడవుకలదు. భూతలమునుండి నలుబదివేల యోజన ముల ఎత్తు పెరిగినది. వేయి యోజనముల వరకు భూమిలో మునిగి ఉన్నది. అది వేయి యోజనము వరకే ? విస్తారములో నిలచియున్నది.

తూర్పు వైపుగా ఉన్న మాల్యవత్పర్వతము అంతే అనగా గంధమాదనమంతే ప్రమాణము కలది. అది నీల పర్వతమునకు దక్షిణముగా నిషధ పర్వతమునకు ఉత్తరముగా గలదు. వాటి మధ్యలో మహామేరుపర్వతము మంచి ప్రమాణము కలదిగా చెప్పబడినది. అది అన్ని శైలములకు లోతుగా ఉన్నట్లుండును. దాని విస్తారము గూడ అంతే ప్రమాణము

కలదు. పొడవున లక్షప్రమాణము కలదని చెప్పబడినది. సముద్రము చుట్టుగా గుండ్రముగా ఉండుట వలన భూమండలమని భావము గలదు. మొత్తముగా పొడవులు చతురస్రము లుగా తగ్గను. చదుకముచే చుట్టబడనివై మధ్యనున్నవి వేరు అగును.

అచట మర్దించిన కాటుకవలె నల్లనైన జంబూఫల రసముగల నది (జంబూనది) కలదు. మేరు పర్వతమునకు దక్షిణప్రక్కగా నిషధపర్వత(దేశ)మునకు ఉత్తరముగా ప్రాచీన మైన సుదర్శనము అను ఒక పెద్ద జంబూవృక్షము కలదు. అది నిత్యము పుష్ప ఫలములతో కూడియుండును. సిద్ధులచేతను చారణులచేతను సేవింపబడును. ఆ జంబూవృక్షము పేరుతోనే పిలువబడు జంబూద్వీపమున జంబూవృక్షము వృక్షరాజము. ఈ మహావృక్షము ఎత్తు లక్ష యోజనములు. అది అంతట ఆకాశమును తాకును. తత్త్వద్రష్టలైన మునులు ఆ జంబూఫల ప్రమాణమును ఎనిమిది వందల అఱువదియొక్క మూరలు(861) లెక్కించి చెప్పిరి. భూమిపై పడుచుండు ఆ జంబూ ఫలములు విశాలమైన ధ్వనిని కలుగజేయును. ఆ భూమియందు జంబూఫల రసము నదిగా ప్రవహించును. మేరువును ప్రదక్షిణము చేసి క్రింది జంబూవృక్షమును ప్రవేశించును. అచటివారు జంబూరసఫలములచే చుట్ట బడినవారై ఆ రసమును సంతుష్టులై త్రాగుదురు. వారు జంబూఫల రసమును త్రాగి ముదిమిని పొందరు. గుబ్బపు సుడిని పొందరు. రోగమును పొందరు. మరణమునుకూడ పొందరు. అచట జాంబూనదమున బంగారము దేవభూషణమై ఉండును. అది ఆరుద్ర పురుగువలె ఎఱ్ఱనిదై ప్రకాశవంతమగును. అది అన్ని వర్ష(దేశ) వృక్షముల యొక్క శుభమైన ఫలరసము. అది స్ఖలితమై శుక్రమగును. అది దేవభూషణమై బంగారము. వారి మూత్ర పురీషములను అన్ని దిక్కులలో భాగములుగా భూమి గ్రసించును. మృతులైన వారినిగూడ (భూమి) గ్రసించును. రాక్షసులు, పిశాచులు, యక్షులు అందరు హైమవతు లుగా జెప్ప బడిరి. హేమకూటమున ఉన్నవారు అప్సరోగణములతో గూడిన గంధర్వులుగా తెలియ వలెను. నిషధమున శేష-వాసుకి తక్షకులైన సమస్త నాగులు గలరు. మహా మేరువున ముగ్గురు యాజ్ఞికులు తిరుగుచుందురు. వైడూర్యమయమైన నీల పర్వతమున సిద్ధ బ్రహ్మర్షులు తిరుగుదురని తెలుసుకొనవలెను. దైత్యులకు, దానవులకును శ్వేత పర్వతము తిరుగు స్థానమని చెప్పబడినది. పర్వత శ్రేష్ఠమైన శృంగవత్పర్వతము పితృ దేవతలు సంచరించు స్థానము, ఒక విభాగముగా ఉన్న ఈ అన్ని, తొమ్మిదింటిలో నివసించియున్న భూతములు గమనము గలవియు స్థిరముగా ఉండినవియుగా ఉన్నవి. వారిలో దేవ, మనుష్యుల వివృద్ధి ఎక్కువగా కనబడును. అనుభవింపగోరు వానిచేత చక్కగా లెక్కించుట సాధ్యపడదని విశ్వసింపవలెను. (46)

భువన విన్యాసము - 12

సూతుడు ఇట్లు అనెను :

హిమవత్పర్వతము యొక్క ఎడమ ప్రక్కన కైలాసము అను పర్వతము గలదు. దాని యందు శ్రీమంతుడైన కుబేరుడు రాక్షసులతోపాటు నివసించును. అప్సరోగణముతో కూడి అలకాధిపుడైన కుబేరుడు ఆనందించుచుండును. కైలాసము యొక్క పాదమునుండి పుట్టిన మందమను నొక కలువలతోనిండి ఉండి, పుణ్యమై శీతజలము గల శుభమైనసరస్సు గలదు. అది శరత్కాల మేఘమువలె తెల్లనైనది. దానినుండి పుట్టి ప్రవహించినది శుభమైన మందాకినీ నది. దాని తీరమున దేవ సంబంధమైన నందనమను గొప్ప వనము గలదు.

కైలాసమునకు తూర్పు దక్షిణములుగా (ఆగ్నేయముగా) దివ్యప్రాణులు ఓషధు లును గలిగి దివ్య ధాతువులతో నిండిన చిత్రమై చక్కని వెన్నెలగల (బంగారు) పర్వతమును గూర్చి వినుడు. అది చంద్రప్రభ అను పర్వతము. శుద్ధమైనది, రత్నమువలె ఉన్నది. దాని పాదమున గొప్పనై దివ్యమైన అచ్ఛోదము అను సరస్సుకలదు. దాని నుండి దివ్యమైన అచ్ఛోదయము అను 'నది'పుట్టును. దాని ఒడ్డున దివ్యమై పెద్దదైన చైత్రరథము అను ఉద్యానవనము కలదు. ఆ చంద్రప్రభ గిరియందు మణిభద్రుడను కుబేరుని సేనాపతి క్రూరులైన యక్షులతో చుట్టబడి ఉండును. పవిత్రములైన మందాకినీ, అచ్ఛోదా నదులు భూమండల మధ్యగా ప్రవహించుచు మహాసముద్రమున కలియును.

కైలాసమునకు దక్షిణ పూర్వముగా (ఆగ్నేయముగా) శుభములైన సత్త్వములు ఓషధులుగలదియు, మిక్కిలి గొప్పనైనదియు, మనఃశిలతో (ఎఱ్ఱని శిలతో) నిండి దివ్యమైన పిశంగము అను పర్వతమునుగురించి (వినుడు). అదిఎఱ్ఱనిదై బంగారుశిఖరములు గల్గి సూర్య కాంతిగల గొప్ప పర్వతము. దాని పాదమున దివ్యమై గొప్పదైన లోహితమతఅను సరస్సు గలదు దాని నుండి లోక భావినియగు పుణ్యమైన సరయూనది గలదు. ప్రహేతృ తనయుడైన కుబేర సేవకుడై ఇంద్రియములను తన వశమునందుంచుకొని గ్రహవంతుడై అనంత పరాక్రమవంతుడైన బ్రహ్మపాతుడను రాక్షసుడు అట ఉండును. వాడు ఆకాశమున చరించువాడును భయంకరులైన వందల రాక్షసులతో కూడి ఉండును.

కైలాసమునకు పశ్చిమమున ముఖ్యప్రాణులు ఓషధులు కలదియు, బంగారు ధాతువుతో నిండినదియు, పర్వత శ్రేష్ఠమైన అరుణగిరి శ్రీమంతమై మేఘమువలె ఉన్న పర్వతము శివునకు ప్రియమైనది. అది బంగారు నిండిన మంగళములైన శిలాజాలము లతో చుట్టబడినది. దాని నూర్ల శిఖరములు బంగారముతో కూడినవై ఆకాశమును

రాయుచున్నట్లు ఉండును. అది మంచుతో చుట్టబడి దివ్యమై ఎక్కరాని ముంజనవంత మను శైలము. ఆ పర్వతమున దుమ్ముబారిన ఎఱ్ఱని వర్ణముగల గిరీశుడు (శివుడు) నివసించును. దాని పాదమునుండి శూలోదము అను సరస్సు పుట్టును. దాని నుండియే శైలోద అను దివ్యమైన 'నది' పుట్టును. అది చక్షుఃశతముల మధ్యగా లవణ (ఉప్పు) సముద్ర మును ప్రవేశించును. దాని తీరమున సురభి అను ప్రసిద్ధమైన దివ్యవనము కలదు.

కైలాసమునకు ఉత్తరముగా శివబలమును ఓషధులును గల గిరి కలదు. అచట గౌరమ అను గిరిగలదు. అది పసుపుపచ్చని వన్నెగల హరిత దళముఅను ఖనిజముతో నిండినది. శుభమైనది. బంగారు శిఖరము కలది. గొప్ప దివ్యమైన మణిమయమైన పర్వతము. దాని పాదమున గొప్పదియు, దివ్యమైనదియు, శుభమైనదియు, బంగారు ఇసుక కలదియు, సుందరమైనదియు అయిన బిందు సరస్సను సరస్సు కలదు. అచటికే భగీరథుడు వెళ్ళెను. రాజర్షియైన భగీరథుడు గంగనిమిత్తమై అచట పెక్కు ఏండ్లు ఉండెను. "గంగాజలమున తడిసి పవిత్రులై నా పూర్వపితరులు (ముత్తాతలు 1000 మంది) స్వర్గము నకు పోగలరు. అని అనుకొని అచట (త్రిపథగాదేవి) (గంగాదేవిని అతడు ప్రతిష్ఠింప చేసెను. చంద్రకిరణముల నుండి పుట్టిన ఆ గంగ ఏడు భాగములైనది. అచట మణి మయములైన యజ్ఞయూప స్తంభములును, బంగారు పొదలునుగలవు. ఇంద్రుడు సమస్త దేవతలతో గూడి అచ్చట యజ్ఞముతో శివుని పూజించి కాంతిమార్గుడై నక్షత్ర మండలము వెంట ఆకాశమున వెళ్ళెను. దేవియైన (త్రిపథగ గంగ) రాత్రిలో తెల్లగా ప్రకాశించును. ఆ గంగ నక్షత్ర మండలములు ఆకాశమును (స్వర్గమును) భావించు చున్నదై భూమిని జేరునదై శివుని యొక్క శిరమునబడినదై యోగమాయచే శిరమున బంధింపబడినది. కోపించిన ఆ గంగ యొక్క కొన్ని బిందువులు భూమిపైబడి అచట సరస్సు ఏర్పడినది. దానిని బిందు సరస్సందురు. చిరునవ్వు నవ్వుచు శిరమున బంధించ బడిన ఆ గంగ మనమున శంకరుని పడద్రోయుటకై ఆలోచించు చుండెను. ఈ శంకరుని ఆ ప్రవాహముచే కబళించి ఛేదించి పాతాళమున ప్రవేశింతును అనుకొనెను. గంగాదేవి యొక్క ఆ క్రూర చేష్టితములను తెలిసికొని ఆ నదిని శివుడు గంగ యొక్క మదమును తెలిసి కోపించి తన అంగములలోనే వెనుతిరుగ జేయదలిచి, వేగముగా భూమిపై పడబోయిన గంగను తన శిరముననే బంధించెను. ఈ సమయముననే తన యెదుటరాజైన భరతుని జూచెను. అతని శరీరము కేవలము (మాంసము లేక) ధమనుల నాడులతో మాత్రము వ్యాపించి క్షీణమై ఇంద్రియములు గూడ పనిచేయని స్థితిలోఉండెను. అది చూచి 'ఈతడు పూర్వమే గంగానది విషయమై నన్ను సంతసింప జేసెను అని స్మరించి ఆతనికి ఇచ్చిన వరదానమును

గూడ స్మరించి శివుడు తన కోపమును నిగ్రహించెను. ప్రతిజ్ఞా నిర్వహణమునుగూర్చి బ్రహ్మయొక్క మాటకూడ విని, తన తేజస్సుతో కట్టివేయబడిన గంగానదిని భగీరథుని ఉగ్రతపముచే సంతుష్టుడై యా భగీరథుని కొరకై వదిలిపెట్టెను. ఆ విధముగా వదిలి పెట్టబడుచున్న గంగానది యొక్క ప్రవాహము ఏడు విభాగములను బొందెను. అందులో మూడు తూర్పు వైపునకును, మూడు పశ్చిమ వైపునకు బోయినవి. గంగానదీ ప్రవాహము ఏడుభాగములుగా అయ్యెను. నలినీ, హ్రాదినీ, పావనీ, అమనీ అను మూడు తూర్పునకు పోయిన భాగములు. సీతా, చక్షువు, సింధువు అను ఈ మూడు పశ్చిమ దిక్కునకు పోయినవి. వానిలో ఏడవది దక్షిణముగా అనుసరించినదై భగీరథియైనది. అందువలన భాగీరథి అనునది లవణ సముద్రమును ప్రవేశించెను. ఈ యేడును ఈ లోకమున హిమమను దేశమున ప్రవహించును.

బిందు సరస్సున పుట్టి శుభములైన ఆ ఏడు నదులు స్రవించుచు మ్లేచ్ఛ ప్రాయములైన నానా దేశములందును పారుచు ఇంద్రుడు వర్షించు దేశముల చేరును. సిరింధ్రములు, కుంతలములు, చీనాదేశములు, బర్బరములు, యవనులు, ద్రుహములు, రుషాణములు, కుణిందములు, అంగలోకవరములు ఈ దేశములలో ప్రవహించుచు సీతానది సింధు మరుభూమిని రెండుగాజేసి పశ్చిమ సముద్రమును చేరును. ఆ తరువాత చీనమరు దేశములు, నంగణములు, సర్వ మూలకములు ఆంధ్రములతో పాటు తుషారములు, తంపాకములు, పహ్నవములు, దరదములు, శకములు ఈ దేశములలో ప్రవహించుచు 'చక్షు' నది సముద్రమును చేరును. కాశ్మీరములతో బాటు దరదములు, గాంధార ములు, వరపములు, హ్రదములు, శివపౌరములు, ఇంద్రహాసములు, వదాతులు, సర్జయములు, సైంధవములు, రంధ్రకరములు, భ్రమరములు, ఆభీరములు, రోహకములు, శునాముఖములు సిద్ధచారణ సేవితములైన ఊర్ధ్వ మనువులు, గంధర్వులు, కిన్నరులు, యక్షులు, రాక్షసులు, విద్యాధరులు, ఉరగులు, కలాపగ్రామకులు, పారదులు, సీగణులు, ఖసులు, కిరాతులు, పులిందులు, భరతులతోడి కురులు, పంచాలులు, కాశీయులు, మాత్స్యులు, మగధులు, అంగులు, బ్రహ్మోత్తరులు, వంగులు తామ్ర లిప్తులు అను ఈ జనపదములను గంగ శుభములుగా పవిత్రము చేయును. ఆ తరువాత వింధ్యచే అడ్డగింపబడి దక్షిణ సముద్రమున ప్రవేశించును. తరువాత 'హ్లాదిని' పవిత్రయై తూర్పు ముఖమై వెళ్లెను. నిషాద జాతులుండు దేశములు ధీరులు, ఋషికులు నీలముఖులు, కేరళులు, ఉష్ట్రకర్ణులు (ఒంటిచెవులుగలవారు) కిరాతులు, కాలోదరులు, వివర్ణులు, స్వర్ణ భూషితులగు కుమారులు. వీరు ఉండు దేశములలో గంగ సముద్రము యొక్క మండల

మున తూర్పు ముఖముగ మరలినదై ప్రవహించినది. తరువాత 'పావని' తూర్పు దిక్కునకే ప్రవహించినదై, అపథములను ఇంద్రద్యుమ్న సరస్సును అట్లే ఖరపదములను (గాడిదల మార్గములు గలవి), ఇంద్ర శంకుపథములను బ్రవహించుచున్నదై, మధ్యగాలేచి నమస్కా రము లేనివారై బొంతల కప్పుకొను వారిని (దేశమును) చేరెను. ఇంద్రద్వీప సముద్రమున లవణ సముద్రమును ప్రవేశించెను.

తరువాత 'నలిని' వేగముగా తూర్పు దిక్కునకు వెళ్ళెను (ప్రవహించెను) ఇచట నది హంస మార్గములై (భూ మార్గములేని) హుహుకముల తోడి తోమర దేశములో ప్రవ హించిరి. అది తూర్పు దేశములను సేవించుచు పర్వతములను బహువిధముల బ్రద్దలు గొట్టి కర్ణప్రావరణములను అశ్వముఖములను పొంది ఇసుక పర్వతపు మరు ప్రదేశములను చేరి విద్యాధర దేశములకు వెళ్ళెను. నేమి మండల కోష్టమున (అథః చక్రపు అంచుతో ఏర్పడిన) మండల ప్రదేశమున అది మహాసముద్రమున కలిసెను.

ఆ పెద్ద నదులయొక్క నదులును ఉపనదులును నూర్లకొలదియు వేల కొలదియు ఉన్నవి. అవి అన్నియు ఇంద్రుడు వర్షించిన వైపునకు వచ్చి చేరును. వస్వోకసా నదీ తీరమున నీటి పరిమళముతో ప్రసిద్ధిజెందిన హరిశృంగమున విద్వాంసుడైన కుబేరుడు వశియై ఇంద్రియనిగ్రహము కలవాడై నివసించును. ఆ మహాత్ముడు యజ్ఞములతో కూడిన వాడు, అమిత తేజస్వి, మంచి పరాక్రమము కలవాడు. అచట కుబేరుడు అగస్త్యునిచేతను విద్వాంసులచేతను బ్రహ్మారాక్షసులచేతను చుట్టబడియుండును. ఈ నలుగురు కుబేరుని సేవకులై కుబేరునితో సమానులుగా తలంపబడినవారు.

ఈ విధముగనే పర్వతదాసులయొక్క పరస్పరముగా ధర్మముతోను కామముతోను అర్థముతోను రెండింతలైనదిగా తెలియవలెను.

హేమకూటము యొక్క వెనుక భాగమున సాయనమను సరస్సు కలదు. దాని నుండి మనస్విని, జ్యోతిష్మతి అను నదులు పుట్టును. నిషధమను పర్వతోత్తమమున తూర్పు, పడమరల సముద్రములను ఇరువైపుల ప్రవేశించిన విష్ణుపదము అను సరస్సు గలదు. దానినుండి గాంధర్వి నన్వలిఅను నదులు పుట్టినవి. మేరువు వెనుక భాగమున చంద్ర ప్రభ అను ఒక గొప్ప సరస్సుపుట్టినది. అచట శుభమైన బంగారము కలిగి పుణ్య మైన జంబూనది కలదు. నీలపర్వతమున తెల్లకమలమువలె శుభ్రమైన పయోదముఅను సరస్సు కలదు. దానినుండి పుండరీక, పయోద అను రెండునదులు బయలు వెడలినవి. శ్వేత పర్వతము నుండి పుణ్యమైన ఉత్తరమానస సరస్సు పుట్టినది. జ్యోత్స్న మృగకాంత

అను రెండు నదులు దానినుండి బుట్టినవి. మధుమత్ అను పుణ్యమైన సరస్సుగూడ కలదు. అది భవునిచే నిర్మింపబడినది. కల్పవృక్షములతో నిండినది తేనెలు గలది. అంతట సుఖము గలది, రుద్ర కాంతమని ప్రసిద్ధిచెందినది. ఇచట ఇతరమైనవి గూడ ప్రసిద్ధములైన సరస్సులు కలవు. అవి పద్మములతోను, మీనములతోను, పక్షులతోను నిండినవి. పేరున రుద్రములు జయములు. ఇవి పండ్రెండు. సముద్రముల వంటివి. వానినుండి శాంత, మాధ్వీ అను రెండు నదులు పుట్టినవి. ఇచట భూమిని భేదించుకొని వచ్చిన (బుగ్గ) జలములు నదులై ప్రవహించు వాని జలములు కింపురుషులచే త్రాగదగినవి. ఋషభము అను భేరి ఆకారములో పొగనిండియున్న గొప్ప పర్వతము గలదు. తూర్పు నుండి వచ్చిన సంపన్నములైన నదులు ఉప్పు సముద్రములో గలియును. చంద్రకంకము ప్రాణము, మహాన్, అగ్ని, శిలోచ్చయము అను ఈ పర్వతములు ఉత్తరమువైపు పోయినవై ఉత్తరము వైపున పొడవై దక్షిణ సముద్రమున ప్రవేశించినవి. చంద్ర మైనాక పర్వతముల మధ్యన ఏ దిక్కైన ఆగ్నేయ దిక్కున సంవర్తకుడు అను అగ్ని కలడు. ఆతడు ఆ జలమును త్రాగును. ఆతని పేరు సముద్రమును ద్రావు శ్రీమంతుడైన ఆడగుఱ్ఱపు ముఖము ఆకారము గల 'ఔర్వుడు', మహేంద్రుడు తమ రెక్కలను ఛేదించును అను భయముచేత అప్పుడీ (పై జెప్పిన) పండ్రెండు పర్వతములు లవణ సముద్రమున బ్రవేశించినవి కదా! ఇదియే తెల్లని చంద్రునిలో కనబడు నల్ల కుందేలు ఆకారము, భారతదేశము యొక్క భేదములు తొమ్మిది అని చెప్పబడినవి. ఇక్కడ చెప్పబడిన భారతదేశమునకు ఇతర పురాణాదులలో జెప్పబడిన కొన్ని భేదములు కనబడుచున్నవి. ఆరోగ్య, ఆయుః ప్రమాణములచేత ధార్మికముగను, కామికముగను, ఆర్థికముగను గుణములచే వీనికి వర్ష పదము ఉద్దేశింప బడినది. భాగములుగా ఈ గుణములతో కూడిన ప్రాణులు కలవు. అవి నానాజాతులు. ఆయా జాతులు ఆయా వర్షములలో నివసించినవి. (47)

భువన విన్యాసము - 13

సూతుడు అనెను :

భారత దేశమునకు దక్షిణము వైపున గూడ పదివేల యోజనముల వైశాల్యముగల సముద్రమును దాటిన తరువాత ఉన్న భూమి విశేషమును వినుడు. అచట మూడువేల యోజనముల పొడవు గలిగి ఒక వేయి యోజనముల వెడల్పు గల్గి నానా పుష్ప-ఫల ముల వృద్ధిగలిగి, మెఱుపులు గలిగి మహాశైలమైన ఒక కుల పర్వతము గలదు. ఆ పర్వతము యొక్క అనేక శిఖరములచేత ఆ ద్వీపము చక్కగా అలంకరింపబడినది. అచట నిర్మలములై తీయనైన జలములుగల వేల నదులు కలవు. ఆ ద్వీపముయొక్క బావులు

గూడ నిర్మల జలములుగలవి. ఆ పర్వతము యొక్క పొడవు, వెడల్పుతో విశాలములై అనేక ఛిద్రములు (నిర్మితములైన గుహా రంధ్రములు) కలవు. వానియందు అంతటను నరనారులచే సంతుష్టములై ఒప్పి సమృద్ధములైన అనేక ఆకారములు (చెక్కిన మూర్తులు చిత్రించిన చిత్రములు) గలవు.ఆ ఆకారములున్న వాని పై భాగములకు ప్రవేశించు మార్గములే ద్వారములు వేలు నూర్లు గలవు. పర్వతాం తర్గతముగా పురములు చక్కగా కూర్పబడినవి. ఒకే ద్వారములు గలవైనను, పరస్పరము సుసంబద్ధములుగా చేయబడినవి. అచటి ప్రజలు పొడవైన మీసములు, గడ్డములునుగల వారు. జన్మించిన వారందరును ఎనుబదియేండ్ల పరమ ఆయుష్యము గలవారు. నల్లనై మేఘములతో సమానమైన కాంతి గలవారు. కోతులతో సమానమైన ధర్మము (ఆచరణము) గల వారు, ఫలములు, మూలములను తినువారు. ఎడ్లవంటివారై శౌచాచారములను వదిలినవారు. చెప్పుచేతలు లేనివారు. ఆ ద్వీపము క్షుద్ర మానుషులైన మనుజులచే నిండినది. ఈ విధముగా ఈ అంతర ద్వీపములు ఆనుపూర్వకముగా వివరింపబడినవి.

ఇరువది, ముప్పది, ఏబది, అఱువది, ఎనుబది, నూరు, వేయి యోజనములలో అంతటను వెడల్పు పొడవైనవియునై అనేక ప్రాణులతో నిండినవై నెమళ్ళ ద్వీప భాగములు గల క్షుద్ర ద్వీపములు వేలకొలది కలవు.

జంబుద్వీప ప్రదేశమున కంటె వేరుగా వివిధాశ్రయములై నానారత్నములకు గనులై, భూమిపై మరి ఆరు ద్వీపములు గలవు. అవి అంగద్వీపము, యమద్వీపము, మలయ ద్వీపము, శంఖద్వీపము, కుశద్వీపము, వరాహద్వీపము అనునవి. అంగ ద్వీపమును గూర్చి వినుడు. అది అనేక సంఘములతో నిండినది. అనేక మ్లేచ్ఛ గణములతో వ్యాపిం చినది. అది మహావిశాలమైనది. భూమిలో బంగారము పగడములును నిండిన రత్నముల కును నెలవు అయినట్టిది. నదీ శైలవనములతో చిత్రమైనది. ఉప్పు సముద్రముతో సమానమైనది. అందు చటచక్రగిరి అను పర్వతము కలదు. అది అనేకములైన సెలయేరు లను, గుహలునుకలది. దాని గుహ పెక్కు మృగ జీవనములకు ఆశ్రయమైనది. అది నాగదేశ మధ్యమున ఉన్న అనేక ప్రదేశములుగల మహాపర్వతము. దాని శిఖరములు నాగములకు నిలయములు. అది నదనదీపతియగు సముద్రము వరకు వ్యాపించినది.

యమ ద్వీపము అను ద్వీపము పెక్కు రత్నముల గనులతో వ్యాపించినది. అచట గూడ ధాతువులతో అలంకరింపబడిన 'ద్యుతిమాన్' అను పర్వతము గలదు. అది నదులకు ఉత్పత్తి స్థానము. బంగారమునకుకూడ పుట్టు స్థానము.

మలయ ద్వీపముకూడ ఇట్లే చక్కగా చుట్టబడి ఉన్నది. అది మణిరత్నములకు నెలవైనది. విశాలమైనది, బంగారమునకుకూడ నెలవు, చందన వృక్షములకు నిలయము. అట్లే సముద్రములకును నిధి. పెక్కు మ్లేచ్ఛ గణములతో వ్యాపించినది. నదులు, పర్వత ములు వీనిచే అలంకరింపబడినది. అచట శ్రీమంతమైన సుమలయ పర్వతము కలదు. అది వెండికి నెలవు. మహామలయమని ప్రసిద్ధి జెందిన శ్రేష్ఠమైన పర్వతము. భూమిలో రెండవ మందర పర్వతమని పేరొందినది. అచట దేవ రాక్షసులచే నమస్కరింప బడిన అగస్త్యుని భవనముకలదు. అట్లే బంగారు పాదము (ప్రత్యంత పర్వతము)గల మరొక మలయపర్వతము, గడ్డిచే తెల్లనైన పొదలకు ఆశ్రయమై, పుణ్యాత్ములతో సేవింపబడి ఉండును. అనేక పుష్పఫలములతో కూడినదై స్వర్గమున కంటె మిన్నయైనది. అచట రవి సంక్రాంతులు మొదలగు ప్రతి పండుగలందును ఎల్లప్పుడు స్వర్గమే దిగివచ్చును. అట్లే మూడు శిఖరములకు నెలవై అనేక ధాతువులచే అలంకరింపబడి, అనేక యోజనముల ఎత్తు కలిగి, చిత్రములైన చరియలు, గుహాగృహములును కలిగి, రమ్యమైన సుమలయ పర్వతము యొక్క శిఖర భాగమున, బంగారు కోటగోడలును, బురుజులును కలిగిన భవనములు ఉండును. దాని నాగవాసములందును, గోడలయందును చిత్రములు గలవు, ధనిక భవనముల, రాజభవనముల వరుసలు గలదై నూరుయోజనముల విస్తీర్ణము, ముప్పది యోజనముల పొడవుతో ఉండి నిత్య సంతోషము కలిగించుచు, విశాలముగా ఉండు లంక అను పురి కలదు. అది కామరూపులై, మహాత్ములైన రాక్షసులకు స్థానము. బలముచే మదించిన వారికి నివాసస్థానము. అది దేవ శత్రువులు అగు రాక్షసులకు నివాసము. సంకుచితములుకాక విశాలముగా ఉండు ఆ మహాపురి మానుషులకు చేర అలవికానిది, సముద్రమునకు తూర్పున, ఆ ద్వీపము యొక్క తీరమున గోకర్ణుడు అను పేరుగల శంకరుని గొప్ప ఆలయముకలదు.

అట్లే ఒకే రాజ్యముగా ఉన్నది శంఖద్వీపము అని పిలువబడును. అది నూరు యోజనముల విస్తీర్ణము కలది. అనేక మ్లేచ్ఛ గణములకు నివాసము. అచట శంకర గిరియను పేరుగల పర్వతము కలదు. అది కడిగిన శంఖపు చిప్పవంటి కాంతిగలది. అనేక రత్నములకు నిధి. పుణ్యమైనది ఆ పర్వతము పుణ్యముచేసిన వారిచేత సేవింప బడినది. దానినుండి శంఖనాగ అనునది పుట్టి ప్రవహించినది. శంఖముఖుడు అను ఆ రాజు దానిని నివాసముగా చేసికొనెను.

అట్లే కుముద ద్వీపము అనేక పుణ్యములతో ప్రకాశించుచుండును. అనేక గ్రామముల వరకు అది వ్యాపించినది. అనేక రత్నములకు నెలవై, మంగళమైనది. అచట కుముదా

అను మహాదేవి దుష్ట చిత్తములను పోగొట్టుచు, మహాదేవుని సోదరిగను, ఆ (మహాదేవ) కాంతులతో పూజింపడును.

అట్లే వరాహద్వీపము అనేక మ్లేచ్ఛ గణములతో నిండినది. నానా జాతులతో వ్యాపించినది. అనేక ప్రభుత్వములు పట్టణములును కలది. ధనధాన్యములతో గూడి వృద్ధి చెందినది. ధర్మిష్టులైన జనులచే గజిబిజిగా ఉన్నది. దానియందు చిత్రములైన పెక్కు పుష్ప, ఫలములతో గూడిన, నదీపర్వత వనములచే ప్రకాశించు వరాహపర్వతము అను ఒక పర్వతముగలదు. అది రమ్యమైన పర్వతము. అనేకములైన కందకములు దరులు, గుహలు, సెలయేరులచేత ప్రకాశించినది. ఆవరాహ పర్వతమునుండి చక్కని రసవంత మైన జలములు కలిగి 'వారాహి' అను మహానది పుణ్యతీర్థ నదియై బయలు దేరినది. అది భక్తులకు వరములు ఇచ్చును. అచట బ్రాహ్మణ జన్ములు వరాహావతార రూపియై సర్వప్రభువుగా సమర్థుడైన విష్ణువునకు తదేక దేవతా భక్తులై నమస్కరింతురు. ఈ ఏడు ద్వీపముల గురించి సంపూర్ణముగా చెప్పబడినది. భారత ద్వీపదేశము దక్షిణ దిశగా బహు విస్తరము. ఒక్కటైన ఈ దేశము ఇచట ఈ విధమైన బహు ద్వీపములు కలది. ఈ విధముగా చతుర్మహాద్వీపము తనలోని ద్వీపములచే అలంకరింప బడినదైన జంబూ ద్వీపము యొక్క విస్తరము అను ద్వీపములతో పాటు ఈ విధముగ ఉండును. (48)

భువన విన్యాసము - 14

సూతుడు అనెను :

ఓ బ్రాహ్మణోత్తములారా! ప్లక్ష ద్వీపమును గూర్చి ఉన్నదివున్నట్లు సంగ్రహముగా చెప్పెదను వినుడు. జంబుద్వీప విస్తారమునకన్న దీని విస్తారము రెండింతలు. ఆ విస్తారమున కన్న మూడింతలు దీని అంతటి వైశాల్యము. అచటి గ్రామములు పుణ్యములు. ప్రజలు చిరకాలమునకు చచ్చుదురు. అట కరువు లేదు. ముదిమి యొక్కయు, రోగముల యొక్కయు భయము లేదు. అచటగల సముద్రములు, నదులు వాని పేర్లను చెప్పెదను వినుడు. ప్లక్ష ద్వీపాదులైన వానిలో ప్రతి ఏడింటి యందును పర్వతములు చక్కగా పొడవైనవై ప్రతి దిశలోను ప్రవేశించినవి.

ప్లక్ష ద్వీపమునందలి సప్త ద్వీపములను సప్త మహాచలములను గురించి కూడ వివరించి చెప్పెదను. ఇచట మొదటి పర్వతము గోమేదకము. అది రంగులో మేఘముతో సమానమైనది. ఆ వర్షము (దేశము) గూడ గోమేదకమను పేరనే పిలువబడుచున్నది. రెండవ పర్వతము చంద్ర పర్వతము. అది సమస్త ఔషధులతో కూడిఉన్నది. అశ్వినీ

దేవతలచేత అమృతము కొరకై అచట ఓషధులు ఉంచబడినవి. మూడవది నారదము అనుపర్వతము. అది మహోన్నతమై పోవుటకు అనువుకానిది. ఆ పర్వతముననే పూర్వము నారద, పర్వతులు ఇద్దరును పుట్టిరి. అచట నాల్గవ పర్వతము దుందుభి అను పేరుగలది. ఇచట శబ్దమృత్యువైన దుందుభి రాక్షసుడు పూర్వము దేవతలచే చావగొట్టబడెను. ఐదవది సోమకమను పర్వతము. ఇచట పూర్వము దేవతలచే అమృతము సంపాదింపబడినది. అది మాతృదాస్య విముక్తికై గరుడునిచే అపహరింపబడినది. ఆరవది సుమనా అను పర్వతము. అదియే ఋషభము అని చెప్పబడినది. దీనియందు పూర్వము వరాహావ తారము ఎత్తిన విష్ణువుచే హిరణ్యాక్షుడు అను రాక్షసుడు చంపబడెను. ఏడవ పర్వతము వైభ్రాజము అనునది. అది బాగుగా ప్రకాశించునట్టి స్ఫటికమణిమయమైన మహా పర్వతము. జ్వాలలచే అది ప్రకాశించినది కావున వైభ్రాజము అనబడినది.

ఇప్పుడు యథాక్రమముగా పేరులతో వానియొక్క వర్షములను (దేశములను) చెప్పెదను. అందులో గోమేదము అన్నది మొదటిదేశము. అది భయము శమించిన దేశము. చంద్రమునకు శిఖరము అనునది దేశము. నారద ద్వీపమునకు సుఖోదయము దేశము. ఆనందమన్నది దుందుభియొక్క దేశము. సోమకమునకు శివము అనునది దేశము. ఋషభమునకు క్షేమకము అన్నది దేశము. వైభ్రాజమునకు ధ్రువము అన్నది దేశము. ఈ దేశములందు దేవ గంధర్వులు, చారణులతోడి సిద్ధులును విహరింతురు. వారితోగూడి సిద్ధులు కూడ కనబడుచున్నవారై క్రీడింతురు. వానియొక్క నదులు కూడ ప్రతి దేశమునకును ఏడే! అవి సముద్రమును చేరునవి. వాటిని సప్త గంగయైన మహానది అని చెప్పబడు ఆ నదులు ప్రవహించును. వాటి నుండి వేల కొలది ఇతర నదులు ప్రవహించును. అవి బహూదకములు, సమూహములుగలవి. ఇంద్రుడు వర్షించు వైపునకు ప్రవహించునవి. ఆ గ్రామములందలి ప్రజలు మాత్రము సంతుష్టములై ఎల్లప్పుడు ఆ నదీజలములనే త్రావుదురు. అవి (జనపదములు) శుభములు, శాంతవహములు, ప్రమోదములు, అవియే శివములు. ఆనందములు ధ్రువములు శివములతో గలపి క్షేమకములు (ఇందలి జనులు ఆ నదీ జలముల త్రాగుదురు) వీని అందలి ప్రజలంతటను వర్ణాశ్రమాచార ధర్మములు కలిగినవారు. ఈ అన్నింటి యందును ప్రజలు అరోగులు, సుబలులు. ఏ అనారోగ్యములు లేనివారు. వారిలో అధోగతి లేదు అట్లే ఉద్గతియును లేదు. అచట ఎక్కడగూడ కృతత్రేతాది చతుర్యుగ కృతమైన యుగదశలేదు. ఎల్లప్పుడు త్రేతాయుగముతో సమానమైన కాలమే ఉండును. ప్లక్ష ద్వీపము మొదలు ఈ ఐదు ద్వీపములలో అంతటను త్రేతాయుగ సమమగు కాలమే ఉండును. దేశముయొక్క అనువిధానమునుబట్టి కాలము యొక్క అనువిధులు

కూడ ఉండునని చెప్పుదురు. ఆ దేశములలో మానవులు సురూపులై, సువేషములుగలవారై, అరోగులై, బలవంతులై, ఐదువేల ఏండ్లు జీవింతురు. సుఖము, ఆయువు, బలము, రూపము, ఆరోగ్యము, ధర్మమును ప్లక్ష ద్వీపము మొదలు శాకద్వీపము వరకు చక్కగా వర్తిల్లును. ప్లక్ష ద్వీపము విశాలమైనది, శ్రీమంతము, అంతట ధనధాన్యములు గలది, దివ్య ఓషధి ఫలములతో గూడినది. సర్వ ఓషధి వనస్పతులు గలది. వేలకొలది పశువుల చేతను, గ్రామములచేతను, అరణ్యముల చేతను చుట్టబడినది. ఓ బ్రాహ్మణోత్తములారా! ఆ ద్వీపమధ్యమున జంబూ వృక్షముచే పిలువబడిన ప్లక్షమను (జువ్విచెట్టు) మహావృక్షము గలదు. కావున ఆ వృక్షము పేరనే ప్లక్షద్వీపమని పిలువబడినది. ఆ జనపదము యొక్క మధ్యన రుద్రుడు పూజింపబడును. అదియును చెఱకురసముగల ప్రదేశము. అది ప్లక్ష ద్వీపముచే చుట్టబడినది. ప్లక్ష ద్వీపము యొక్క వైపుల్యము విస్తరముగా ఇచ్చట చెప్పబడినది. అని, ఆనుపూర్వితోను, సంగ్రహముగను ఈ ప్లక్ష ద్వీపము యొక్క సన్నివేశము చెప్పబడినది. తఱువాత శాల్మల ద్వీపమునకు సంబంధించిన ఆ సన్నివేశము వినుడు. తరువాతగల ద్వీపములలో మూడవదైన శాల్మల ద్వీపము ఉత్తమమైనది. శాల్మల ద్వీపముతో సముద్రము చెఱకు రసము జలముగా కలది అయినది. ప్లక్ష ద్వీపమునకన్న రెండింతలైన విస్తారముతో చుట్టబడినది. అవి కూడ రత్నములు పుట్టుస్థానములై పర్వతములు గూడను ఏడేయని తెలియవలెను. మొదటిది సూర్యునితో సమానమైన కుముదము అను పర్వతము అన్ని ధాతువులతో నిండి శిలాజలముల నుండి పైకి లేచిన శిఖరములతో అలంకరింపబడినది. దానియొక్క రెండవ పర్వతము ఉన్నతమని ప్రసిద్ధి జెందినది. హరిదళము నిండిన శిఖర ములతో ఆకాశమును ఆవరించి ఉన్నది. దానియొక్క మూడవ పర్వతము బలహాకమని ప్రసిద్ధమైనది. గాఢనీలమైన ఆ శిఖరములతో ఆకాశము ఆవరించి నిలచి ఉన్నది. దాని నాలుగవ పర్వతము ద్రోణ పర్వతము. దానియందు మహాబలములైన ఓషధులు గలవు. విశల్యకరణి (తీసివేయ దగిన) ఎముకను దీసివేయు ఓషధియు, అట్లే మృతసంజీవని (చచ్చినవానిని బ్రతికించునది) అగు ఓషధియు దానియందుగలవు. అచట కంకమన్నది ఐదవ పర్వతము. గొప్ప ఎత్తైనది. దివ్యపుష్ప-ఫలములతో కూడినది. చెట్లతో తీగలతో చుట్టబడినది. అచట ఆరవ పర్వతము పేరు మహిషము. అది మేఘమువలె నల్లనైనది. అచట నీట పుట్టిన మహిషమను అగ్ని కలదు. అట కకుద్మాక అను పర్వతము ఏడవదిగా చెప్పబడును. ఇచట ఇంద్రుడు స్వయముగా అనేక రత్నములను వర్షించును. ప్రజాపతిని (బ్రహ్మను) తీసికొని వచ్చి ప్రాజాపత్య యాగమును చేయించును. ఈ ఏడు పర్వతములు శాల్మల ద్వీపమున మణులచే అలంకరింపబడినవి. ఆ పర్వతములకున్న ఏడు శుభములైన

వర్షములను (దేశములను) చెప్పెదను. కుముద పర్వతము నుండి మొదటిది శ్వేతదేశము. 'ఉన్నతము'నకు లోహిత దేశము, బలాహకమునకు జీమూతదేశము. ద్రోణమునకు హరితదేశము. కంకమునకు వైద్యుత దేశము, మహిషమునకు మానసదేశము, కకుద్మంతమునకు సుప్రభ అను దేశము అను ఈ పర్వతములు ఏడింటికి ఏడు దేశములు గలవు. వానిలో నదులను వినుడు. అచటి నదులు పాని, తోయా, వితృష్ణ, చంద్ర, శక్ర, విమోచనీ, ఏడవది నివృత్తి అని ప్రతి దేశమునకు ఒకటిగా నదులు చెప్పబడినవి. ఆ నదులకు సమీపముగా పోవు ఇతర నదులు నూర్లు వేలును కలవు. వాని లెక్కించుటకు అలవికాదు. అచట ఉండతలచినవాని చేత శ్రద్ధగా తెలిసికొనదగినవి అని శాల్మల ద్వీపము యొక్క సన్నివేశము కూడ చెప్పబడినది. ప్లక్ష వృక్షముతో సంఖ్యలో సమానముగా శాల్మలద్వీప మధ్యమున మహాశాల్మలి (బూరుగు) వృక్షము కలదు. అది విశాలమైన స్కంధములుకలది. ఆ శాల్మలి వృక్షరాజము సురాజలముతోగల సముద్రమునంతట చుట్టబడి ఆ సురాసముద్రము శాల్మల వృక్ష విస్తారమునకు అంతట సమముగా ఉన్నది.

ఉత్తర ద్వీపములలో ప్రజలు ధర్మజ్ఞులు. నేను విన్నట్లుగా న్యాయమును గుణముగా చెప్పెద వినుడు. నాలుగవదైన ఆకుశ ద్వీపమును గురించి సంగ్రహముగా చెప్పెదను వినుడు. కుశ ద్వీపముచేత సురాజల మంతట చుట్టబడినది. అచట ఏడే పర్వతములు. కుశ ద్వీపమందు శాల్మల ద్వీప విస్తారముకంటె అంతటను రెండింతలు గలదు. కుశద్వీపమున పగడముల యెత్తైనరాశిగా ఉన్న పర్వతము, కుశ ద్వీపము యొక్క మొదటి పర్వతము. రెండవది హేమ పర్వతము. మూడవది ద్యుతిమాన్ అను పర్వతము. అది మేఘమువంటి పర్వతము. నాలుగవది పుష్పవాన్ అను పర్వతము. ఐదవది కుశేశయమను పర్వతము. ఆరవది హరిగిరి అన్నది ఏడవది మందరము. మందా అనగా నీరు. ఆ నీటిని చీల్చుటచే మందరమైనది. వానియొక్క లోపలి విరివి రెండింతలుగా చుట్టబడినది. మొదటి వర్షము (దేశము) ఉద్భిదమన్నది. రెండవది వేణుమండలము, మూడవది స్వైరథాకారము. నాలుగవది లవణము అనబడినది. ఐదవ దేశము ధృతిమాన్. ఆఱవది ప్రభాకరము అను దేశము. ఏడవది కపిలము అనునది. ఈ ఏడువర్ష పర్వతములు, వీనిలో దేవ గంధర్వులు జగదీశ్వరులై, కాంతిమయములై చూడబడుచు ప్రతి దేశక్రమమున విహరింతురు, క్రీడింతురు. ఆ దేశములందు దొంగలులేరు. అట్లే మ్లేచ్ఛ జాతీయులు లేరు. జనమంతయు తెల్లని వర్ణములో ఉందురు. అట్లే ఒక క్రమమున చత్తురు. ఆచట నదులు కూడ ఏడే! అవి స్వేతర పాపముల కడిగివేసినవి. మంగళకరము లైనవి. అచటి సంతతి పవిత్రమైనది. అట్లే భూమి కాంతి గర్భిత. ఆ నదుల నుండి బయలు దేరినవి

నూర్లు, వేలు, అవి అన్నియు ఇంద్రుడు వర్షించు చోట్లకు జేరును. కుశద్వీపము వెలుపల నేతినీటితో చుట్టబడినది. ఆ ఘృతోదము విస్తారమున కుశద్వీప ముతో సమానము. ఇది కుశ ద్వీపము యొక్క సన్నివేశము. ఆ తరువాత నేను క్రౌంచ ద్వీపముయొక్క విస్తారమును చెప్పెదను.

ఆ క్రౌంచ ద్వీపము కుశద్వీప విస్తారమునకన్న రెండింతలుగా ఉండును. నేతి జల సముద్రము క్రౌంచ ద్వీపముతో చుట్టబడినది. ఆ ద్వీపమున శ్రేష్ఠపర్వతమైన మొదటి పర్వతము క్రౌంచస్థము. క్రౌంచమునకు పరమైనది వామనకము. వామనముకన్న పరమై నది అంధకారము. అంధకారమున కన్న పరమైనది దివావృత్ అనునది. దివావృత్తుకన్న పరమైనది గోవిందగిరి. గోవిందమునకన్న పరమైనది పుండరీకమను మహాగిరి. పుండరీకమునకు కన్న పరమైనది దుందుభి స్వనము. ఈ రత్నమయములైన క్రౌంచ ద్వీపము యొక్క ఏడు పర్వతములు బహువృక్షములతో కూడినవి. అనేక వృక్ష-ఫలములతో చుట్టబడినవి. వర్ష పర్వతము విష్కంభము నుండి ఒండొరులకు రెండింతలైనవి. అచటి దేశములను పేర్లతో చెప్పెదను క్రౌంచమునకు కుశలిఅను దేశము, వామనమునకు మనోగమఅను దేశము, మనోనుగమునకంటె పరమైన దేశము ఉష్ణదేశము. ఇది మూడవ దేశము. ఉష్ణమునకన్న పరమైనది ప్రావరకము, ప్రావరముకన్న పరము అంధకారకము. అంధకారక దేశమునకన్న పరమైనది మునిదేశము. మునిదేశమునకన్న పరమైనది దుందుభి స్వనము. సిద్ధచారణు లతో సంకీర్ణమైన అచటి జనము సామాన్యమగు వర్ణము కలది. అచట కూడ త్రిదేశమున నదులు శుభములై ఏడే ఉండును. అనబడినవి. గౌరీ, కుముద్వతి, సంధ్య రాత్రి, మనోజవా, ఖ్యాతి, పుండరీక అను గంగ ఏడు విధములు. వానిలో సమీపముగా పోవునవై సముద్రమున చేరు నదులు వేరుగాఉన్నవి. అవి అన్నియు విశాలములై, బహుజలములు గలవై తోడుగా పోవును. క్రౌంచ ద్వీపము పెరుగు, మీగడవంటి జలము గలిగి, క్రౌంచ ద్వీప సమముగా ఉన్న సముద్రముచేత శ్రీమంతమగు క్రౌంచ పర్వతము చుట్టబడినది. ప్లక్షద్వీపము మొదలగు ఈ ద్వీపములు సంగ్రహముగా చెప్పబడినవి. ఆ ద్వీపములయొక్క స్వభావముగూడ మొదటి నుండియు వరుసగా మొత్తముగా చెప్పబడినది. ఇచటి ప్రజల సృష్టి సంహారములు వివరముగా నూరేండ్లలో గూడ చెప్పుటకు అలవిగానివి.

ఆ తరువాత శాక ద్వీపము ఉన్న విధానమును, దాని యథార్థతత్త్వమును నిశ్చయ ముగా చెప్పెదను. ఆ వృత్తాంతమును నా నుండి వినుడు. దాని విస్తారము క్రౌంచ ద్వీపము విస్తారమునకన్న రెండింతలు అది పెరుగు, మీగడ వంటి నీరుగల సముద్రమును

చుట్టి ఉన్నది. అచటి జనపదములు, గ్రామములు పుణ్యములు. జనులు చాల కాలము జీవించి మరణింతురు. అచట కరువు ఎక్కడిది? రోగ భయములు లేవు? అచట గూడ పర్వతములు ఏడే! అవి శుభ్రములు మణులచే అలంకరింప బడినవి. అట్లే సముద్రము లును, నదులును కలవు. అందులో మొదటిది దేవర్షులతోను, గంధర్వులతోను కూడినదై మేరువని చెప్పబడును. తూర్పునకు పొడవై బంగారు వర్ణముగల అది ఉదయము అను పర్వతము. అచట మేఘములు వర్షము కొరకైపుట్టును. పోవును. దానికి పైగా గొప్పదైన జలధార అను మహాగిరి కలదు. దానినుండి ఇంద్రుడు ఉత్తమమైన జలమును స్వీకరిం చును. తరువాత వర్షాకాలమున ప్రజలకు ఇచట వర్షము కలుగును. దానికి పైగా రైవతకమను పర్వతము కలదు. అచట రేవతీదేవి అను నక్షత్రము నిత్యము ప్రతిష్ఠితమై ఉన్నది. ఆగిరి బ్రహ్మచేచేయబడినది. దానికిపైగా గొప్పనైన శ్యామముఅను మహాపర్వతము కలదు. పూర్వము ఈ ప్రజలు దానివల్లనే నలుపుదనమును పొందిరట. దానికిపైగా ఆంబికేయమను పర్వతము కలదు. అది మంచుచే కప్పబడి పోవుటకు అలవికాని శైలము. ఆంబికేయ పర్వతమునకు పైగా రమ్యమై, సర్వ ఔషధులతో గూడిన కేశరియను పర్వతము గలదు. దానినుండి వాయువు వీచును. ఇక యథాపూర్వకముగా వాని దేశనామములను వినుడు. ఉదయపర్వతమునకు ఉదయదేశము జలదము అని ప్రసిద్ధిగాంచినది. రెండవ జలధారపర్వతమునకు సుకుమము అను రెండవదేశము చెప్పబడినది. రైవతకమునకు కౌమార దేశము, శ్యామపర్వతమునకు మణీచకము అను దేశము, అస్తపర్వతమునకు శుభము అను దేశము కలవు. అది పూవులతో ఉండి మిక్కిలి యెత్తైనదిగా ఉండును. ఆంబికేయ పర్వతమునకు మోదాకము అనుదేశము. కేశరములలో మహాద్రుమము అను దేశముకలదు. ఈ ద్వీపముము యొక్క పరిమాణము శాక ద్వీపముతో సమానముగా పొట్ట పొడుగుగా ఉండును. దానియొక్క మధ్యన శాకమను మహావృక్షము కలదు. అచట జనులు దానికి పూజలు చేయుదురు. దీనితోనే దేవగంధర్వులు చారణులతో సిద్ధులును విహరింతురు. వారితో సహాచూడబడుచున్న వారై క్రీడింతురు. అచట పుణ్యములైన జనపదములు (గ్రామ నగరములు) చతుర్వర్ణములతో కూడి ఉందురు. వానిలో గూడ నదులు ఏడే! ప్రతి వర్షము (ఏడు) సముద్రమును చేరునవి. వాని నామములను తెలిసి కొనుము అవి అన్నియు గంగలే. అవి ఏడు. మొదటిది సుకుమారి అనునది. ఇది గంగ, శివజల, అనుతప్త, అను పేర్లతో ఉన్న నది. కుమారియను పేరుగల గంగ రెండవది. అది మరల సతి అనబడినది నంద అనియు పార్వతి అనియు పేరు గలది మూడవది. శివేతిక అనునది నాల్గవది. అది త్రి అని కూడ అనబడినది. 'ఇక్షు' అనునది అయిదవది.

అది మరల క్రతువు అనబడినది. ధేనుక అని, మృతఅని ఆరవ ఏడవ గంగ చెప్పబడినవి. ఇవి యేడు మహాగంగలు, శివములైన (మంగళములైన) జలములు గలవి. ఇవి శాక ద్వీప నివాసులైన జనమును అందరిని సేవించును. ఆ నదులను వేలకొలది ఇతర నదులు అనుసరించును. ఇంద్రుడు వర్షించిన వైపున ఎక్కువ జలముతో స్రవించును. వానిపేర్లను పరిమాణములను పరిగణించి చెప్పుటకు సాధ్యము గాదు. అవి నదీ శ్రేష్ఠములు ఆ జనపదములు (తద్వాసులు) సంతుష్టులై, ఆ నదుల జలములనే త్రాగుదురు. ఓ శంశపాయన! ఈ ద్వీపము విస్తీర్ణము చక్రమునందు ఉన్నది. నదీ జలములచే కప్పబడినది. మేఘములవంటివియు, సమస్త ధాతువులచే చిత్రములైనవియు, మణులచేతను, పగడములచేతను అలంకరింపబడినవియు అయిన పర్వతములచే కప్పబడినది. అనేక ఆకారములు కలవియు, విశాలము లైనవియు అయిన జనపదములచేతను అంతట ఫలములతో గూడిన వృక్షములచేతను ఆ పర్వతము ధనధాన్య వంతమైనది. పాలవంటి జలములుగల సముద్రముచేత అంతటను చుట్టబడినది. శాక ద్వీపము విస్తారమువలన, పైవానిచే అంతటను సమానముగా చుట్టబడినది. పర్వతాంత రాళమైన ఆ ద్వీపమున జనపదములు పుణ్యములు, శుభములు, వర్ణాశ్రమములతో నిండిన ఆ దేశములు ఏడుగానే చెప్పుదురు. జనులలో వర్ణాశ్రమములవల్ల వచ్చిన సాంకర్య మెక్కడను కూడ లేదు. అచ్చట ధర్మమునకు విరోధ ప్రవృత్తి లేనందున ప్రజలు దుఃఖములేశములేని సుఖములను అనుభవించిరి. వారిలో లోభముగాని, మాయగాని లేదు. ఈర్ష్యా, అసూయ, అధైర్యము ఇవి అసలే లేవు. వారిలో విపర్యయము ధర్మాది వ్యతిరేకముగా పోవుట లేదు. అది వారిలో స్వాభావికముగా తలపబడినది. వారికి పన్నులవేత లేదు. శిక్షగాని శిక్షించువాడు గాని లేరు. ధర్మజ్ఞులైన ఆ జనులు తమ ధర్మముచేతనే ఒండొరులను రక్షించుచుండిరి. ఆ ద్వీపమున ఉండు వారికి సంబంధించినది ఇంత మాత్రమే చెప్పసాధ్యము. ఏడవదైన పుష్కరమును గూర్చి చెప్పెదను వినుడు.

పుష్కర ద్వీపమును వెలుపల క్షీరోదక సముద్రము చుట్టబడినది. అది శాకద్వీప విస్తారమునకన్న అంతటను రెండింతలు. పుష్కర ద్వీపమున శ్రీమంతమైన పర్వతము ఒకటే. అది మహాశిలామయము. మణిమయములైన శిలలచేతను, ఉన్నతములైన శిఖరములచేతను, చిత్రమైన ఆ ద్వీపముయొక్క పూర్వార్థమున ఒక గొప్ప చిత్రమైన చరియకలదు. అది ఇరువది అయిదు పరిమండల(అంతట గుండ్రనితనము) సహస్రముల విస్తీర్ణము ఉన్నది. ముప్పది నాలుగు వేల (పరిమండలముల) ఎత్తుగలదై ఆ పర్వతము ఏర్పడినది. ద్వీప సగభాగమునకు ఆ పర్వతము ఏనుగుకు కప్పు బొంతవలె ఉన్నది.

అది మానసోత్తమము. అది సముద్రవేలా సమీపమున ఉదయించిన నూతన చంద్రునివలె ఉన్నది. ఏబది అయిదు వేల యోజనముల పైకి ఎత్తుగా వ్యాపించినది. అంతట అంతే గుండ్రని తనముతో విశాలమైనది. ఇట్లు ద్వీపముయొక్క పడమటి సగ భాగమున మానసము అను పర్వతము గలదు. ఒకే మహాసానువు (చరియ) అచట నుండుటచే రెండుగా చేయబడినది. తీయని నీరుగల సముద్రముచే అంతట చుట్టబడినది. పుష్కర ద్వీప విస్తారమువలన ఇది (పర్వతము) అంతటను వ్యాపించినది. ఆ ద్వీపమున రెండు శుభములైన జనపదములు కలవు. అవి మానస పర్వతము చుట్టును అనుసరించిన మండలాకారములై ఉన్నవి. మానస పర్వతముయొక్క వెలుపల కనబడు వర్ణము మహావీతము. దానియొక్క లోపలిది ధాతకీ ఖండము అనబడును. (ధాతకీ కుసుమ ఖండము) (అరెగ్రాకు) అచట మానవులు పదివేల ఏండ్లు జీవింతురు. ఆరోగ్య సుఖములతో నిండినవారై మానసీ సిద్ధిని పొందియుందురు. ఆ రెండు దేశములలోను ఆయువు రూపము సమానములు. వారిలో అధమోత్తములు లేరు. రూపశీలములో వారు సమానులు. అచట మోసగాడు లేడు. ఈర్ష్య లేదు. దొంగలు లేరు. భయము లేదు. రాజనిర్బంధము లేదు. దండములేదు. లోభము లేదు. దానము తీసికొనుట లేదు. అచట సత్య, అనృతములు లేవు. అట్లే ధర్మాధర్మములు లేవు. వర్ణాశ్రమముల వార్త (ఉనికి) లేదు. పశుపాలన వృత్తియు, వైశ్యవృత్తియు లేవు. ధర్మాధర్మములు తెలియజేయు త్రయీ విద్య, నయానయములు తెలియజేయు దండనీతి విద్య, సేవనము, బాణవిద్య అనగా వైద్యములోని ఎముకలను గూర్చిన విద్య, ఇవి అన్నియు పుష్కరద్వీపము నందలి రెండు దేశములలో లేవు. అచట నదులు, వర్షము, శీతోష్ణములును లేవు. భూమిని భేదించుకొని పుట్టు వృక్ష లతాదులు, జలములు కొండసెలయేరులును లేవు. జనము ఎల్లప్పుడు ఉత్తరకురు దేశవాసులకు సమానమైన కాలము గలవారు. అచట అంతట మంచి సుఖము గలవారు. ముసలితనము అలసటయు (శ్రమయు) లేనివారు. అని ఇది మహావీతమున ధాతకీ ఖండము. మొత్తము పుష్కరము యొక్క విధానము ఆనుపూర్వితో చక్కగా జెప్పబడినది. పుష్కరద్వీపము తీయని జలముగల సముద్రముచే చుట్టబడినది.

ఈ విధముగ ద్వీపములు ఏడేడు సముద్రములచే చుట్టబడినవి. ద్వీపమునకు ఎడములేని సముద్రము అంతట ఉండును. ఈ విధముగ బండారుల వలన ద్వీప సముద్రముల వృద్ధిని తెలియజేయవలెను. నీటియొక్క సముద్రేకము వలన సముద్రములని పిలువబడినవి. దీనియందు ఋషులు నివసింతురు. ఏ కారణమున ప్రజలు నాలుగు విధములో, ఆ కారణమున వర్షమని చెప్పబడినది. ఆ వర్షము ప్రజలకు సుఖము నిచ్చునది.

ఋష మంటేనే ఋషులు, వృషధాతువు శక్తి ప్రబంధమను అర్థమున ప్రయోగించబడును. ఈ విధముగ (మానవాదులను) ప్రబంధించుట వలన దేశమునకు వర్షత్వము సిద్ధించినది. దానివలన ఆ దేశములందు వర్షత్వము సిద్ధించినది. శుక్ల పక్షమున చంద్రుడు వృద్ధి చెందునపుడు సముద్రము నింపబడును. (ఉప్పొత్తము) బహుళ పక్షమున చంద్రుడు క్షీణించు నపుడును అస్తమించినపుడును (సూర్యునిలో గలిసి అగుపించనపుడు), సముద్రము క్షీణించును. సముద్రము నింపబడుచున్నపుడు తనంతట తానే నింపబడును. తరువాత క్షీణించునపుడు తనంతట తానే క్షీణించును. వంటకుండలోని జలము అగ్ని సంయోగ మున ఉద్రేకమును అందినట్లు (మసలి ఉప్పొంగునట్లు) మహాసముద్రములోని జలము గూడ (చంద్ర కాంతికి) ఉద్రేకము చెందును (ఉప్పొంగును). శుక్ల కృష్ణ పక్షములలో (పూర్ణిమ అమావాస్యలలో చంద్రుని యొక్క ఉదయ అస్తమయములచేత సముద్రజలము తగ్గ కుండను హెచ్చుకుండను ఉప్పొంగును. చల్లారును. (సముద్రపు ఆటుపోటులలో సముద్ర జలముల హెచ్చు తగ్గులు లేకయే పొందిచల్లారును). ఈ విధముగ చంద్రుని వృద్ధి క్షయములవలన సముద్రముయొక్క వృద్ధి క్షయములు ఏర్పడును. పూర్ణిమ అవాస్య పర్వములందు సముద్ర జలముల యొక్క వృద్ధి క్షయములు ఐదువందలపది అంగుళ ములుగా కనుగొనబడినది. రెండు వైపుల జలములు ఉన్నవి కాన ద్వీపములైనవి. అంతట జలములచే చుట్టబడినవిగూడ ద్వీపములు అనబడును. ఉదకము యొక్క ఉనికి ఉన్నందున ఉదధిఅనబడినది. పర్వములు (కణుపులు)లేనివి గిరులు. పర్వములు ఉన్నవి పర్వతములు. ప్లక్ష ద్వీపమున గోమేదము పర్వములు కలదిగాన పర్వతము అనబడినది. శాల్మల ద్వీపమున శాల్మలి అను (బూరుగ) మహావృక్షము పూజింపబడును. కాన ఆ నామముచే ఆ ద్వీపము పిలువబడినది. క్రౌంచద్వీపమున జనపద మధ్యమున క్రౌంచగిరి ఉన్నందున క్రౌంచద్వీపము అయినది. శాక ద్వీపమున శాకము అను వృక్షముకలదు. కాన శాక ద్వీపము అనబడినది. పుష్కర ద్వీపమున మఱ్ఱిచెట్టు మహావృక్షముగ అచటివారిచే పూజింప బడినది. ఆ పుష్కర ద్వీపమున మహాదేవుడై ముల్లోకములకు ఈశ్వరుడైన బ్రహ్మ ఉండును. ప్రజాపతియైన బ్రహ్మ తన సాధ్యదేవతలతో కూడి ఉండును. అచట దేవతలు ముప్పది ముగ్గురైన మహర్షులతో కూడి బ్రహ్మను ఉపాసింతురు. దేవోత్తమోత్తముడైన ఆ బ్రహ్మ అచట దేవతలచేత పూజింపబడును.

జంబూ ద్వీపమునుండి అనేక విధములైన రత్నములు బయలుదేరును. ఆ ద్వీపములు అన్నింటిలోను ప్రజలయొక్క క్రమములు ఇట చెప్పబడుచున్నవి. అంతటను బ్రహ్మచర్యముతోను, సత్యముతోను, దమముతోను ప్రజలు ఉందురు. ఆరోగ్యము ఆయుః

ప్రమాణములు అంతటను రెండింతలు. ఈ పుష్కర ద్వీపమున రెండు దేశములు ఉన్నవి. వానిని, అచటి సజ్జనాలంకృతులైన ప్రజలను ఈశ్వరుడు దండమును ఎత్తి రక్షించును. త్రిభువనములకు ఈశ్వరుడైన బ్రహ్మయు రక్షించును. విష్ణువుతో కూడియు, శివునితో కూడియు ఉన్న ఆ దేవుడైన బ్రహ్మ వారికి తండ్రి ప్రయత్నము లేకయే వచ్చినదియు, షడ్రసములు కలదై మహాబలమైన భోజనమును అచటి ప్రజలు ఎల్లప్పుడు భుజింతురు.

తరువాత పుష్కర ద్వీపమునకు పైగా ఆవరించి ఉన్న మహాసముద్రము కలదు. అది తీయని నీరుగలది. అంతట చుట్టి ఉన్నది. దానికిపైన గొప్పలోక స్థితి కలదు. అచటి భూమి బంగారపుదై రెండింతలైనది. భూమి అంతయు ఏకశిలవలె ఉండును. దానికంటె పైన పర్వతము దాని పొలిమేర చివర ఒక మండలమును కలవు. ఆ పర్వత ప్రకాశమును (కాంతిమంతమై కనబడునదియు) ఆ ప్రకాశమును (కాంతిలేక కనబడ నిదియు) పైలోకాలోక పర్వతము అను పేర చెప్పబడును. ఆ పర్వతము క్రిందివైపున వెలుగు, దానికి చీకటియు ఉండును. దానియెత్తు పదివేల యోజనములు. అంతే (పదివేల యోజనములె) దాని విస్తారము. అది భూమిపైన ఇష్టము వచ్చినట్లు పోవునది కూడ. ఆలోకమున కనబడునది అను అర్థముగల లోకశబ్దము ఉన్నది. నిరాలోకమున కనబడు వారితో కూడ ఇదియను అర్థమును ఇచ్చు అసలోకత ఉన్నది (ఆలోకమనగా కనబడునది నిరాలోకమనగా కనబడనిది)చూడబడు జనముగల మానవాదిలోకము కొరకై అంతఃకాంతిగల లోకము (పర్వతము) సమ్మతమైనది. నిరాలోకమన్నదో కనబడని (కాంతి లేని) విధముగా బహిర్భాగమున చీకటిగల అదే పర్వతము (అలోక పర్వతము)గా సమ్మతమైనది. (లోకాలోక పర్వతము అంతర్భాగమున సూర్యకిరణములచే ప్రకాశించు ననియు, బహిర్భాగమున చీకటితో ఉండుననియు తెలుసుకొనవలెను. లోకపర్వతపు సమస్త విస్తారము (అంతర్భాగము) వెలుగు నిండినది. వెలుపల అంతటను పరిచ్ఛిన్నమై అది (పర్వతము) నీటితో ఆవరింపబడి ఉన్నది. అది నిరాలోకము (వెలుగులేనిది) ఆ వెలుగులేని అలోక పర్వతమునకు పై భాగమున ఒక అండము ఆవరించి ఉన్నది. ఆ అండము లోపల ఈ లోకములును, ఏడు ద్వీపములుకల భూమియుకలదు. లోకములు భూర్లోకము, భువర్లోకము, స్వర్లోకము, మహర్లోకము, జనోలోకము, తపోలోకము, సత్యలోకము అనునవి సంగ్రహముగా ఏడు దానిపైన లోకాంతము గూడ ఇంతయని తెలియవలెను. శుక్లపక్షము మొదటి నుండి పడమటి దిశలో కుంభమున ఉన్న చంద్రునివలె ఆ గ్రుడ్డు శరీరము తెల్లగా ఉండెను. సృష్టికారణభూతుడైన అవ్యయాత్ముని నుండి (బ్రహ్మ నుండి) వచ్చిన ఇటువంటి అండములు అడ్డముగను, ఊర్ధ్వ భాగమునను అధోభాగమునను

వేలకోట్లు కలవు. ఏడు ప్రాకృత కారణముల చేత అది ఆవరింపబడినది. పదికన్న మించియే అన్నియు, ఒకటి నుండి ఒకటి పుట్టినవై ఒక దానిని ఒకటి చుట్టినవై ఒండొరు లను ధరించుచున్నవి. ఈ అండమంతటను గొప్ప సముద్రము ప్రవేశించినది. ఆ సముద్ర జలముచే ధరింపబడు చున్నదై నిలచి ఉన్నది.

ఘనజలముయొక్క వెలుపల, అడ్డముగను నిలువునను ఉన్న మండలములకు అనుగుణముగా అంతటను, ఘనతేజస్సుచే ధరింపబడుచు అది నిలిచియున్నది. ఇనుము, బెల్లములవలె ఉన్న అగ్ని మండలాకారమును దాల్చినదై అంతటను ఘన వాయువుచే ధరింపబడుచున్నదై అది (అండము) నిలచి ఉన్నది. పంచ భూతములలో ఆదియైనది ఆకాశము. పంచభూతములకుఆదియైనది మహాన్. ఈ మహాన్ అనంతమైన అవ్యక్తముచే వ్యాపింపబడినదై, ధరింపబడుచున్నది. ఈ అనంతమైన అపరివ్యక్తము లేక అవ్యక్తము పది విధములై సూక్ష్మమైనది. అంతములేనిది, ఆత్మనిగ్రహము గలది, చావు పుట్టుకలు లేనిది, ఆపైన మించి, భయంకరమైనదియు, ఆధారములేనిదియు, అరోగ మైనదియు, అనేక సహస్ర యోజనముల ఎడము గలిగినదై, చీకటితో ఆవరింపబడి చీకటియే నిరా లోకము (వెలుగులేమితనము) అది పొలిమేరలు లేనిది, దేశ విభాగము లేనిది, దేవతలకు కూడ తెలియనిది, ఏ వ్యవహారములు లేనిది.

చీకటి చివరను ఆకాశము చివరను సమ్మాన్యమై ప్రసిద్ధమై ప్రకాశించు ఒక గొప్ప శివాలయము కలదు. ఆ దివ్యస్థానము దేవతలకుగూడ పోవుటకు అలవిగానిది అని వేదము. అది మహాదేవునియొక్క మర్యాదలో స్థాపింపబడినది. చంద్ర సూర్యులచే తపింప బడినవిగానే లోకములు ప్రసిద్ధిజెందినచో ఇవి జగత్తుయొక్క లోకములు. సంశయము లేదు. పాతాళ ప్రదేశము నుండియు అట్లే భూమిపై నుండియు వాయువునకు ఏడేడు స్కంధ ములు (అంతరములు) గలవు. ఓ ద్విజులారా! అవి బ్రహ్మనివాసములతో కూడినవి. పాతాళమునుండి స్వర్గమువరకు ఐదు విధముల మార్గముగలదు. ఇది జగత్తు యొక్క ప్రమాణము. ఇది సంసార సాగరము.

ఈ విధముగా జగత్తుయొక్క ప్రవృత్తి ఆద్యంతములు లేనిదై అనేక జాతులు పుట్టునట్టిదై నడచును. అది విచిత్రమై, ఒకచోట నిలచునదిగా ఉండదు. ఈ భౌతిక మనునది సహజముగా బహు విస్తారమైనది. అతీంద్రియులై మహాభాగ్యవంతులైన సిద్ధులచేత గూడ చూడబడదు. భూమిపైన అగ్ని వాయువులకును అట్లే మహాతమస్సు నకును అనంతుడైన ఈశ్వరునకు ఓ ద్విజోత్తములారా! క్షయముగాని, పరిమాణముగాని, అంతముగాని ఉండదు.

ఈతడు అంతట అనంతుడు, అన్ని స్థానములయందును అనంతుడని పఠింపబడును. పూర్వము ఈ నామము అను కీర్తనమున నాచే అతనిని గూర్చి చెప్పబడినది. అట్టి ఇతడు శివనామముతో మీకు పూర్తిగా జెప్పబడినాడు. అట్టి ఇతడు(శివుడు) అంతట ఉండువాడుగా అన్ని చోట్లలోను పూజింపబడును. భూమి యందును, పాతాళము నందును, ఆకాశముననను, వాయువునందును, అగ్నియందును సమస్త సముద్రములు అందును, స్వర్గములందును, అట్లే తపస్సునందుననను ఈశివుడే మహాద్యుతి గలవాడుగా ఉండును. అట్లే అనేక విధముల విభజింపబడిన అంగము గలవాడై మహాయోగియైన మహేశ్వరుడు సర్వలోకములలో లోకేశ్వరుడైన శివుడు అనేక విధములుగా పూజింపబడును.

ఈవిధముగా పరస్పరముగా పుట్టిన (వారు) పరస్పరముగా ధరింపబడుదురు. ఆధారాధేయ భావమున వారు వికారియొక్క వికారములు. వీరివి మొదలైనవి వికారములు. అవి పరస్పరముగా పరిచ్ఛిన్నములు (భాగములైనవి) పరస్పరము అధికములైనవి. పరస్పరములలో ప్రవేశించినవి. పరస్పరములో ప్రవేశించినందున అవి స్థైర్యమును పొందినవి. విశేషములుగా అన్యోన్య ప్రవేశమువలన పూర్వము అవి శేషములు ఉండెడివి. పృథివి మొదలు వాయువు వరకు మూడు పరిచ్ఛిన్నములు. గుణములు (5, 4, 3, 2 పృథివ్యాది భూతములలో) తగ్గుటచే పరిచ్ఛేదము (భేదము) విశేషించి కలదు. తక్కినవానిలో భేదము సూక్ష్మము అగుటచే ఇచట విశేషముగ భావింపబడుటలేదు. ఆ పృథివ్యాది భూతములకంటె పరముగా ఆలోకము అనబడినది. భూతములు ఆలోకమగు ఆకాశమున అంతట పరిచ్ఛిన్నములు. పెద్ద గిన్నెలో చిన్న గిన్నె అంతర్గతమై ఇముడు నట్లు (పెద్ద గిన్నెలో చిన్న గిన్నె ఇమిడినట్లు) పరస్పర సమాశ్రయము వలన పరస్పరముగా తగ్గినవి (లేనివి) అగును. (1టి 2లో కలిసినచో 1టి ఉండదు అట్లే 2డు 1లో కలిసినచో రెండు ఉండదు. ఈ విధము ఒండొరుల ఒండొరులు కలసినచో ఒండొరులు గూడ ఉండరు) అట్లే ఆ లోకమగు ఆకాశమున భేదములు అంతర్గతములై పోవును. కనబడవు అని (పెద్దలచే) అంగీకరింపబడినవి. పృథివి మొదలు వాయువు వరకుగల మొత్తము నాలుగు భూతములు పరస్పరముగా అధికములు. ఈ భూతములు ఉన్నంతవరకు ఉత్పత్తి జరుగుచుండును. జంతువులకు (ప్రాణులకు) ఇట సంస్కారము భూతము లలో అంతర్గతమైనదిగా సమ్మతమైనది. భూతములను వదిలి కార్యోత్పత్తి ఉండదు. కావున కార్యాత్మక భేదములు కూడఅట్లే పరిమితములు అని సప్తద్వీప సముద్రయగు భూమియొక్క సన్నివేశము విభాగములతో బాటు నాచే ఓ ద్విజులారా! మీకు ఉన్నది ఉన్నట్లు చెప్పబడినది. ప్రధానము యొక్క (ప్రకృతి యొక్క) విశ్వరూపత్వము విస్తారము వల్లను, మండలము వల్లను, చక్కగా

లెక్కింపబడుటచేతను, పరిమాణములో ఏకదేశికమే. (ఒక భాగమే). ఈ జగమంతయు ఆ భగవంతుని యొక్క అధిష్ఠానమైనది. ఈ విధముగా ఏడు భూతగణములు పరస్పరముగా చక్కగా ప్రవేశించినది. ఇంతటి సన్నివేశమైతే నాచే భావించుటకు శక్యమైనది. ఓ రాజా! సన్నివేశ విషయమున ఇంతయే వినదగినది. ఈ యేడు ప్రకృతులు పరస్పరము ధరించును. ఆ అల్ప ప్రకృతులలో అల్ప పరిమాణముతోనే లెక్కించుటకు ఇచట చెప్పబడుచున్నది. అడ్డముగను, నిలువుగను, క్రిందుగను ఉన్న ప్రకృతులు లెక్కింప అలవిగానివి. తారకల (చుక్కల) సన్నివేశమైతే దివ్యమైన (స్వర్గమైన) మండలము వరకు ఉన్నది. భూమియొక్క మర్యాదా సన్నివేశమైతే మండలము అనుసరించి ఉన్నది. ఓ ద్విజోత్తములారా! ఆ తరువాత భూమియందున్న పైవానిని గూర్చి చెప్పెదను. (49)

జ్యోతిష్ప్రచారము

సూతుడు అనెను :

క్రింది ప్రమాణమును పైని ప్రమాణమును నాచే వర్ణింపబడు దానిని వినుడు. పృథివి, వాయువు, ఆకాశము, జలము, తేజస్సు-అని ఇవి (పంచ భూతములు) ఐదు. ఇవి అనంత (లెక్కలేని-ఆకాశముయొక్క) ధాతువులు. ఇవి వ్యాపించు నవి సర్వప్రాణులను సర్వభూతములను (పంచ భూతములను) ధరించునది పృథివి. ఇది అనేక జనపదములతో నిండినది. అనేక అధిష్ఠానములు పట్టణములు (బహుజనా వాసములు వ్యాపార నగరములు) కలది. అనేక నదులు (తూర్పు సముద్రములో కలియు నవి) నదములు (పశ్చిమ సముద్రములో కలియునవి), పర్వతములును కలది. అనేక జాతులతో నిండినది. ఈ విధముగా భూదేవి బహు విస్తరయై అనంతముగా (అనంతము లేనిదిగా, ఆకాశము కన్నుకలదిగా) కీర్తింపబడును. నదనదీ సముద్రములలో ఉన్నవియు, అట్లే చిన్న చెరువులను గుంటలను ఆశ్రయించి ఉన్నవియు, పర్వతము నందును ఆకాశమున మేఘములతోను ఉన్నవియు, భూమి లోపల ఉన్నవియునైన జలములు అనంతముగానే తెలియవలెను. అట్లే అగ్నియు సర్వలోక నివాసియై, అనంతమని చెప్పబడుచున్నది. అది వ్యాపించినది, అన్నింటికిని పుట్టుకకు కారణము అట్లే ఆకాశము నిరాధారమై రమ్యమై అనేకములు ఆశ్రయముగా కలది. అది అంతయు అనంతమని ప్రసిద్ధిచెందినది. ఆకాశమునుండి పుట్టిన వాయువుకూడ అట్టిదే. జలము భూమియందు (పైన-లోపల) జలమునందు పైన భూమియు ఉన్నవి. ఆకాశము మీదను క్రిందను కలదు. మరల భూమి మరల జలము. ఈ విధముగ భౌతికమైన ఆకాశమునకు అంతములేదు. ఇది పూర్వము దేవతలచే

నిశ్చితముగా చెప్పబడినది. వినుడు. భూమి, జలము తరువాత ఆకాశము అని వరుస క్రమము. ఈ ఏడవ రసా తలమున (పాతాళ భాగమున) స్థితి ఈ విధముగా ఉండును.

పదివేల యోజనములు కలది ఒకే భూమికి సంబంధించిన రసాతలము (పాతాళము) అని, ఒక్కొక్కటి బహు విస్తరమైనదిగా సజ్జనులు అందురు. మొదటిది అతలము, తఱువాతిది సుతలము. ఆ తఱువాతది బహువిస్తరమైన వితలము. ఆ తఱువాతది నభస్తలము అనునది. దాని తఱువాతది మహాతలము. ఆ తఱువాతిది శ్రీతలము. ఆ తఱువాత పాతాళమును ఏడవదిగా చెప్పుదురు. అందులో కృష్ణ భౌమము మొదటి భూమిభాగము పాండుభౌమము రెండవది. మూడవది మృత్తికము. నాలుగవది పీత భౌమము. ఐదవది శర్కరాతలము (ఇసుకఏరు). ఆఱవది శిలామయము. ఏడవది సౌవర్ణ (బంగారు) తలము. మొదటి తలమున రాక్షసరాజ భవనము, ఇంద్రశత్రువైన నముచి యొక్క, మహానాథుని యొక్క భువనములుకలవు. శంకుకర్ణుని పురమును, కబంధుని భవనమునుకలవు. సంతుష్ట జనముతో నిండిన నిష్కులాదుని పురము కూడ కలదు. రాక్షసుడైన భీముని యొక్క శూలదంతుని యొక్క భవనములు కలవు. లోహితాక్ష కళింగులయొక్క నగరము కలదు శ్వాపదునికి, ధనంజయునికి, మహాత్ముడైన మహేంద్రునికి చెందిన నగరములు కలవు. ఈ విధముగా కృష్ణ భౌమతలమున నాగ, దానవ, రాక్షసుల యొక్క వేరుపురములు కలవు.

ఓ విప్రులారా! రెండవదైన పాండు భౌమతలమున కూడ, దైత్యరాజైన సురక్షసునికి మహాజంభునికి చెందిన భవనములు కలవు. అట్లే మొదటి హయగ్రీవుని, కృష్ణుని (రెండవ హయగ్రీవుడు కృష్ణుడు), నికుంభుని భవనములు కలవు. శంఖుడును వానియొక్క పురము, గోముఖునియొక్క నగరమును కలవు. రాక్షసుడైన నీలునికి, మేఘునికి, క్రథునికి చెందిన పురము కలదు. కురుపాదుని, మహోష్ణీషుని భవనములు కలవు. కంబలునికి, నాగునికి, అశ్వతరునికి చెందినవి, కద్రువ పుత్రుడై మహాత్ముడైన తక్షకుని పురము కూడ కలదు. ఈ విధముగా రెండవదైన పాండు భౌమమునందు నాగ, దానవ, రాక్షసుల యొక్క వేల పురములు గలవు.

రక్త మృత్తిక (పీతభౌమ)మను మూడవ తలమున మహాత్ముడైన ప్రహ్లాదుని యొక్కయు, దైత్యరాజైన మహాత్ముడు ప్రహ్లాదుని యొక్కయు ప్రసిద్ధమైన పురముగలదు. తారకుడు అనువాని పురమును అట్లే త్రిశిరస్సుని పురమునుకలవు. హృష్ఠ పుష్ట జనులతో నిండిన శింశుమారునియొక్క పురముగూడ గలదు. చ్యవనుడు అను రాక్షసుని యొక్క భవనము

కూడా అందే ఉన్నది. రాక్షసరాజైన కుంభిలుని, ఖరుని పురముకూడా కలదు. క్రూరుడైన విరాధుని యొక్కయు, ఉల్కాముఖుని యొక్కయు పురముగలదు. హేమకుని, నాగుని అట్లే పాండురకులపురములు కలవు. మణిమంత్రునిపురము. కపిలుని భవనమును, నందుని, ఉరగపతియైన విశాలుని భవనములు కలవు. ఓ విప్రులారా! ఈ విధముగా మూడవదగు రక్త మృత్తికము అను తలమున నాగ దానవ రక్షస్సుల యొక్క వేల పురములుగలవు.

నాలగవ (పీతభౌమము అను) తలమున దైత్య శ్రేష్ఠుడైన కాలనేమి, గజకర్ణుని పురములు కలవు. కుంజరుని నగరము కూడ కలదు. రాక్షసేంద్రుడైన సుమాలియొక్క బహువిస్తరమైన పురము కలదు. లోకనాథుడైన మంజుని యొక్కయు వృకవక్త్రుని భవనములు కలవు. అనేక వేల యోజనములు కలదియు, అనేక పక్షులతో నిండినది అయిన, వైనతేయు (గరుడు)ని నగరము ఈ నాలుగవ రసాతలమున కలదు. బహు యోజనములు విస్తరించిన ఐదవ శర్కరాభౌమమున దైత్య శ్రేష్ఠుడై ధీమంతుడైన విరోచనుని నగరముగలదు. వైదూర్యునికి, అగ్నిజిహ్వునికి, హిరణ్యాక్షునికి చెందిన భవనములు గలవు. రాక్షసుడై, బుద్ధిమంతుడైన విద్యుజ్జిహ్వునియొక్క పురముగలదు. మహామేఘునికి, రాక్షసేంద్రుడైన శాలి, కర్మారుడు, నాగుడు, స్వస్తికుడు, జయులకు చెందిన పురములు కలవు. ఈ విధముగానే ఐదువది అయిన శర్కరానిలయమున నాగ, దానవ, రక్షస్సుల యొక్క వేల ఇండ్లు ఎల్లప్పుడునుగలవు.

ఆఱవదైన శిలాభౌమతలమున దైత్యపతియైన కేసరి యొక్క నగర శ్రేష్ఠము కలదు. సుపర్వణుని, సులోముని, మహిషుని నగరములు కలవు. రాక్షసరాజై మహాత్ముడైన ఉత్క్రోశుని పురము కలదు. అచట సంతోషముతో కూడిన సురసాపుత్రుడగు శతశీర్షుడు కలదు. కశ్యపమహర్షి సుతుడై, శ్రీమంతుడైన, వాసుకి అను నాగరాజుకలడు. ఈ విధముగ ప్రఖ్యాతమై ఆఱవదైన శిలాభౌమమున, పాతాళమున నాగ, దానవ, రక్షస్సుల యొక్క వేల పురములుకలవు.

అన్నింటికిని పశ్చిమముగా ఉండి ఏడవదైన పాతాళమున (సౌవర్ణ భౌమమున) మిక్కిలి సంతుష్టమైనదియు స్త్రీ పురుషులతో నిండిఉండు బలియొక్క పురముగలదు. విజృంభించిన దేవశత్రువులైన రాక్షస సర్పములచే నిండినదై, రాక్షసుడైన ముచుకుందుని యొక్క మహానగరము అచ్చటనేకలదు. దితిపుత్రులైన రాక్షసులయొక్క విశాలములైన అనేక మహాపురములచేతను, అట్లే సుసంపన్నములైన వేలకొలది నాగనగరములచేతను, దైత్యుల యొక్కయు, దానవులయొక్కయు విశాలములైన మహాపురములచేతను, విశాలము లైన అనేక రాక్షస భవనములచేతను ఆ సౌవర్ణభౌమ పాతాళతలము నిండియున్నది.

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! బహుయోజన విస్తారముగల పాతాళము అనంతరమున జరామరణములులేని మహాత్ముడైన ఎఱ్ఱకమలముల వంటి కన్నులుగల శ్రీమహావిష్ణువు ఉండును. కడిగిన శంఖమధ్య భాగమువలె తెల్లని శరీరముకలవాడును, నల్లని వస్త్రము కలవాడును, పెద్దభుజములు కలవాడును, విశాలమైన పడగలు కలవాడును, చక్కని కాంతి కలవాడును, చిత్రమైన మాలలను ధరించినవాడును, బలుడును అయిన శేషుడు అచటనే ఉండును. బంగారుకొమ్మలచే పచ్చనై వెలిగిన ముఖముచే ప్రకాశించుండు ప్రభువైన ఆ కుండలి (శేషుడు) వేయి ముఖములతో ప్రకాశించును. చంచలమైన అగ్ని యొక్క మంటలుగల నాలుక వరుసతో, (రుద్రుని) జ్వాలామాలలచే వ్యాపించిన కైలాస పర్వతమువలె ఆశేషుడు కనబడును. ఆ శేషుడు, బాలసూర్యునివలె ఎఱ్ఱనైన రెండు వేల కన్నులతో ప్రకాశించుచు దట్టముగా దేహముతో చుట్టుకొన్న మండలము కలవాడై వెలుగుచుండును. మల్లెలవలెను, చంద్రునివలెను, తెల్లనైన ఆతని యొక్క అక్షమాల (అకారాది క్షకారాంత వర్ణమాల) హిమాలయపర్వత శిరస్సులపై ప్రతిబింబించి ఉన్న ప్రాతఃకాలోదిత సూర్యుల పంక్తివలె ఉన్నది. జటలతో భయంకరుడుగా ఉన్న ఆశేషుడు శయనాసనమున (పడుకొని ఉండు యోగాసనము) కనబడును. అప్పుడు ఆతడు సహస్ర శిఖరములుగల పర్వతము భూమిపై విస్తరించినదా అన్నట్లుండును. మహాతేజస్వియై మహానాగులకు పతియైన శేషుడు గొప్పపడగలు కలిగి, మహాభాగ్యవంతులైన మహా బలవంతులైన మహానాగులచే స్వయముగా ఉపాసింపబడును. ఆతడు సర్వ నాగులకును రాజు. మహాతేజస్సుగలవాడు. శేషుడుఅను పేరుగలవాడు. ఆతని ఆ సర్పశరీరము మహావిష్ణువునకు సంబంధించినదై మర్యాదలో అందరిచే గౌరవింప బడి ఉన్నది. ఈ విధముగా ఏడు పాతాళ లోకములు ఉన్నవి. అవి దేవ, అసుర, మహానాగ, రాక్షసులకు ఎల్లప్పుడును నివాసముగా ఉండును.

ఓ బ్రాహ్మణోత్తములారా! సిద్ధ సాధువులకుగూడ చూచుటకు అలవికానిది, పోవుటకు అలవికానిది, దేవతలకు కూడ తెలియనిది, ఏ వ్యవహారములు లేనిది అగు చేత ఇట్లే పృథివి, అగ్ని, జల, వాయు, ఆకాశముల గొప్పతనము ఋషులచేత వర్ణింపబడును.

ఆ పైన సూర్య చంద్రుల గతిని చెప్పెదను. ఈ సూర్య చంద్రులు ఎంతవరకు తిరుగుచుందురో, అంతవరకు మండలాకారములతో ఉండి తమ కాంతులతో ప్రకాశింతురు. సప్తసముద్రముల యొక్కయు, ద్వీపముల యొక్కయు విస్తరము పూర్వము చెప్పబడినదే భూమియొక్క విస్తరమునకై వెలుపలగా మరొకచోట విస్తరము ఉండును. చంద్ర సూర్యులు పర్యాసపారిమాణ్యమునుబట్టి (భ్రమణ, పరిభ్రమణముల పరిమాణమును బట్టి)

ప్రకాశింతురు. ఈ భ్రమణ పరిభ్రమణముల పరిమాణము భూమికి ఆకాశము సమానము అని చెప్పబడినది. పరిభ్రమించుచు మూడు లోకములను సూర్యుడు ప్రకాశింపచేయును.

ఆ తరువాత చంద్ర సూర్యుల ప్రమాణమును చెప్పెదను. ఈ భారతవర్ష (దేశ)ము యొక్క విరివి మిక్కిలి విస్తారమైన మండలము. తరువాత సూర్యుని యొక్క యోజనముల విస్తారమును వినుడు. సూర్యుని యొక్క విస్తారము తొమ్మిదివేల యోజనములు. ఈ విస్తారమునకన్న మూడింతలు వైశాల్యము విష్కంభము మండలమునకు ఉన్నంతటిదే. చంద్రుడు సూర్యునికన్న రెండింతలవాడు. తరువాత భూమియందలి ప్రమాణములను యోజనములతో సహా చెప్పెదను. సప్తద్వీప సముద్రములుగల భూమియొక్క విస్తారము మండలమును, పరిమాణముగా ఇది ఇట్లు అని ఇచట లెక్కించి చెప్పబడిన దానిని అభిమానులచే సాంప్రతులచే లెక్కించి చెప్పెదరు. ఇచట అభిమాన వ్యతీతులు ఎవరో వారు సాంప్రతులతో సమానులు. రూపనామములచే అతీతులైన దేవతలు కూడ సాంప్ర తులతో సమానులు. కావున సాంప్రతులైన దేవతలచే వసుధాతలమును చెప్పుదురు. ఆకాశము యొక్క సన్నివేశము అంతటను సాంప్రతుల చేతనే యేర్పడినను, భూమి మొత్తము ఏబది కోట్ల విస్తారముకలదని చెప్పబడినది. మేరువు యొక్క చాతురంతరము ఇరువది అయిదు కోట్ల ప్రమాణముతో ఉండును. లేదా భూమియొక్క సగము విస్తారము యోజనము యొక్క అగ్రమునుండి ఉండును. మేరువు మధ్యనుండి ప్రతి దిక్కున పదు నొకండు కోట్లు (విస్తారము) చెప్పబడినవి. లేదా అట్లే నూరువేలును మరల ఎనుబది తొమ్మిదియు, ఏబదివేలును, పృథివియొక్క సగము విస్తారము, భూమియొక్క మొత్తము విస్తారము యోజనములలో మూడుకోట్లు విస్తారము కలదు. అది నాలుగు దిక్కులది. అట్లే నూరువేల ఎనుబది తొమ్మిది అని చెప్పబడును. సప్తద్వీప సముద్రములుగల భూమి యొక్క విస్తారము చెప్పబడినది. పృథివ్యంతముయొక్క మండలముపై విస్తారమునకన్న మూడింతలుగలది. యోజనాగ్రము గణింపబడినది పదునొకండు కోట్లని చెప్పబడినది. అట్లే నూరువేల ముప్పది ఏడును. ఈ విధముగ పృథివ్యంతముయొక్క మండలము లెక్కించి చెప్పబడినది. ఆకాశమున తారకల సన్నివేశము మండలముగా ఎంత వరకు ఉండునో, భూమి సన్నివేశము యొక్క పర్యాసము (చుట్టుఉనికి) అంతవఱకు మండలము పర్యాసపారిమాణ్యముచేత భూమికి సమానము ఆకాశము అని చెప్పబడినది. ఏడు లోకము లకుగూడ ఇదియే పరిమాణము కలదు. మండలాను గతమైన పర్యాసపారి మాణ్యము చేతపైపై లోకములయొక్క మండలము ఛత్రమువలె ఉండును. ఈ విధముగా ప్రాణులుండు లోకములయొక్క స్థితి అంతయు చెప్పబడినది. ఇది అండ కటాహముయొక్క బ్రహ్మాండము

అను కడవ (తాబేటిచిప్ప) యొక్క ప్రమాణము. ఆ మండలము యొక్క లోపల సప్త ద్వీపములుకల భూమి అంతయు ఉన్నది. భూలోకము, భువర్లోకము, మూడవదైన స్వర్లోకము, మహర్లోకము, జనోలోకము, తపోలోకము, ఏడవది అయిన సత్యలోకము ఈ యేడు లోకములు సృష్టింపబడి (భూమికి) ఛత్రాకారములుగా (పైపైన) నిర్మింపబడినవి. అవి తమ తమ ఆవరణములచే వేరువేరుగా ధరింపబడుచున్నవి. పది భాగములు అధికముగాకల ప్రకృతులచేతను వెలుపల ఉత్పన్నములైన విశేషముల చేతను పరస్పరము ధరింపబడుచున్నవై ఉండును.

ఈ అండము అంతటను గొప్ప సముద్రము ప్రవేశించి ఉన్నది. భూమండలము అంతయు మహాజలములతో ధరింపబడుచున్నది. ఆతరువాత మహాజలమునకు పరముగా (పైగా) గొప్ప తేజస్సుచే (భూమి ధరింపబడును. తరువాత గొప్ప వాయువుచే (మండలముచే) ధరింపబడుచున్న భూమిని నిలుపుటకు ఆ గొప్ప వాయువు మండలము తరువాత ఆకాశము మహాత్మయై భూతాదిచే మొత్తము ఆవరింపబడినది. మహత్తు నాశములేని స్వరూపము కలిగి, అనంతమైన ప్రధానముచేత (ప్రకృతిచేత) ఆవరింపబడినది. ఇక లోకపాలురయొక్క పురములను క్రమముగాను, జ్యోతిర్గణ ప్రచారము యొక్క (నక్షత్ర, తారాగ్రహ సంచారము యొక్క) ప్రమాణమును చెప్పెదను.

మేరువునకు తూర్పుదిక్కునను, అట్లే మానస సరోవరముయొక్క శిరమున నుండి మహేంద్రునకు సంబంధించినదియు పుణ్యమై బంగారుచే అలంకరింపబడిన వస్వోకసార (బంగారు నిధులసారము గలది అమరావతి) అను పురము కలదు. తరువాత మేరువునకు దక్షిణముగా మానససరస్సుయొక్క శిరస్సుననే సంయమనము అను పురమున సూర్య పుత్రుడైన యముడు నివసించును. మేరువునకు పశ్చిమమున మానససరస్సు యొక్క శిరముననే సుఖము అను పేరుగలది బుద్ధిమంతుడైన వరుణునియొక్క పురము కలదు. తరువాత మేరువు యొక్క ఉత్తరదిక్కున మానస సరస్సుయొక్క శరీరముననే మహేంద్ర పురితో (అమరావతితో) సమానమైన సోమునియొక్క పురి విభావరి అనునదికలదు. ధర్మ వ్యవస్థ కొరకును లోకసంరక్షణము కొరకును మానస సరస్సు యొక్క ఉత్తర పృష్టి (వెనుక) భాగమున నాలుగు దిక్కులలో లోకపాలురు ఉన్నారు. దక్షిణాయనమున అంతటను కాష్ఠాగతుడైన (ఆ దిక్కు నందున్న) లోకపాలకులైన సూర్యుని యొక్క గమనమును చెప్పెద వినుడు.

సూర్యుడు దక్షిణాయనమున వేసిన బాణమువలె పోవును. ఆ విధముగా సూర్యుడు జ్యోతిస్సులయొక్క నక్షత్రతారాగ్రహముల చక్రమును వెంటబెట్టుకొని ఎల్లప్పుడు తిరుగుచునే

ఉండును. సూర్యుడు మధ్యన నుండి అమరావతియందు ఎప్పుడూ ఉండునో, అప్పుడు యమపురియైన సంయమనమున సూర్యోదయముఅని చెప్పబడును. అట్లే ఎప్పుడు సూర్యుడు మధ్యగుడు అగునో, వరుణపురియైన సుఖమునందు అర్ధరాత్రము అగును. ఆతరువాత వరుణపురియైన సుఖయందు ఉదయించుచు సూర్యుడు కనబడును. సోమపురి యైన విభా(వరి) యందు అర్ధరాత్రి అగును. మహేంద్రియైన అమరాతి యందు సూర్యో దయము అగును. అప్పుడు ఆగ్నేయ దేశములకు అర్ధరాత్రి అగును అట్లే నైఋత్య దేశవాసులకు పూర్వాహ్ణము అగును. ఉత్తరాపథమున ఉండువారికి అపరరాత్రి అగును. ఈశాన్య దేశవాసులకు పూర్వరాత్రి అగును. ఈ విధముగనే ఉత్తర దేశములందలి భవనములపై సూర్యుడు విరాజిల్లుచుండును. ఆతరువాత, వారుణ్య పురియైన 'సుఖ' యందు సూర్యుడు ఉదయించును. అపుడు అమరావతియందు అర్ధ రాత్రియు, యమపురి యైన సంయమనమున సూర్యుడు ఉండును. సూర్యుడు మహేంద్రుని అమరావతిలో ఉదయించునపుడు యమపురి అర్ధరాత్రియు, వరుణపురి యైన 'సుఖ' సూర్య అస్తమయము జరుగును. ఆ సూర్య కొలువులతో చేయబడిన చక్రమువలె వేగముగా పోవును, వేగముగా చుట్టిపోవుచు భ్రమించును (పరిభ్రమించును) ఆకాశమున సూర్యుడు తిరుగుచునే తిరుగుచున్న నక్షత్రములను చుట్టివచ్చును. ఈ విధముగా దక్షిణ దిక్కు చివరగా సూర్యుడు (దక్షిణాయనమున) నాలుగు ద్వీపములలో తిరుగును. ఈ సూర్యుడు తన ఉదయము అస్తమయములచే మరల మరల పైకి లేచును. సూర్యుడు పూర్వాహ్ణము నను, అపరాహ్ణము నను రెండేసి దేవాలయములను ప్రకాశింపజేయును. ఆ కిరణములతోనే సూర్యుడు మధ్యాహ్నమున ఒక దేవాలయమును తపింపజేయును. ఉదయించిన సూర్యుడు మధ్యా హ్నము వరకు వృద్ధి చెందుచున్న తన కిరణములచేత తపింపచేయుచు పోవును. అట్లే ఆతరువాత తన క్షీణించు కిరణములచేత తపింపజేయుచు, అస్తమయము చెందును. సూర్యుని ఉదయమున పూర్వదిక్కు అనియు, అస్తమయము అగు దిక్కును పశ్చిమదిక్కు అని పిలువబడును. సూర్యుడు ఎంతవరకు ముందు ప్రకాశించునో, అంతియే వెనుకను, ఇరు ప్రక్కలను ప్రకాశించును. ఎచట సూర్యుడు ఉదయించుచు కనబడునో వారికి అది సూర్యోదయము అనబడును. ఎచట సూర్యుడు కనపడకుండ పోవునో వారికి అది సూర్యఅస్తమయము అనబడును. అందరికిని ఉత్తరమున మేరువు ఉండును దక్షిణమున లోకాలోక పర్వతము ఉండును. సూర్యుడు మిక్కిలి దూరముగా ఉండుటచేతను, భూమి యొక్క మండల రేఖచే ఆవరింపబడిన సూర్యుని యొక్క కిరణములు హరింపబడినందున రాత్రియందు సూర్యుడు కనబడడు. గ్రహనక్షత్ర తారల యొక్కయు సూర్యుని యొక్కయు

దర్శనము, వాని యెత్తుయొక్క ప్రమాణమును బట్టి సూర్యోదయము అస్తమయములును తెలుసుకొనవలెను. అగ్నియును, జలమును తెల్లని కాంతిగలవి. భూమి నల్లని ఛాయ (కాంతి) గలది. మిక్కిలి దూరము ఉండుటచే సూర్యునకు కిరణములు లేమి ఏర్పడును. కిరణములు లేనందున ఎఱుపు లేక పోవుటయు, ఎఱుపు కలిగియుండుట వలన వేడి లేక పోవుటయు కలిగినవి. ఒక వరుసరేఖలో ఉన్న సూర్యుడు ఎచట కనబడునో వేయి యోజనములపైకి వెళ్ళినను ఆతడు అచటనే కనబడు చుండును. సూర్యుడు అస్తమించగానే సూర్యునియొక్క కాంతిలో పావుభాగము రాత్రియందు అగ్నిలో ప్రవేశించును. కావున అగ్నియు దూరమునుండి ప్రకాశించును.

ఉదయించిన సూర్యుడు మరల అస్తమాన రూపమున అగ్నిని ప్రవేశించును. తరువాత అగ్నితోకలిసిన సూర్యుడు పగలు ఎండకాయును. క్రమముగా ప్రకాశ రూపమై అదియు వేడిరూపమైనదియు అయిన సూర్య, ఆగ్నేయ తేజస్సులు పరస్పరముగా అనుప్రవే శించుటచే పగటిని, రాత్రిని తృప్తిచెందించెదరు. ఉత్తరమున భూమియొక్క సగభాగము నను, అట్లే దక్షిణముననను సూర్యుడు ఉదయించుచుండగా త్రిజలములలో ప్రవేశించును. అందువలన పగలు రాత్రియందు ప్రవేశించుటచే జలములు రాగివలె ఎఱ్ఱన అగును. మరల సూర్యుడు అస్తమించగా పగలు జలములయందు ప్రవేశించును. అందువలన రాత్రియందు పగటి ప్రవేశము వలన జలములు తెల్లనివి అగును. ఈ క్రమయోగముచే దక్షిణ, ఉత్తరముల భూమి సగభాగములందు సూర్యునియొక్క ఉదయము, అస్తమయము లలో అహోరాత్రములు (పగలును, రాత్రియును) క్రమముగా జలములలో ప్రవేశించును. పగలు సూర్య ప్రకాశము అను పేరుగలది. రాత్రి చీకటిది అనబడును. ఆ కారణమున సూర్యుడు లేనిది రాత్రి అనియు, సూర్యునితో చూడదగినది పగలు అనబడును.

ఈ విధముగా సూర్యుడు ఆకాశ మధ్యమున పోవుచున్నపుడు భూమిపైన ముప్పది అంశకములను (30/100) ఒక ముహూర్తకాలముననే (రెండు గడియలలో=48 నిమిషములలో) దాటిపోవును. యోజనాగ్రము నుండి ముహూర్తమునకు ఈ సంఖ్యను వినుడు. అది ఒక లక్ష ముప్పది ఒకటి. ముహూర్త (రెండు గడియల కాలమున) గమనము ఇంక ఏబది వేలు అధికమని సూర్యుని విధింపబడినది. ఈ గతియోగముచే సూర్యుడు దక్షిణదిక్కును తిరిగి చేరునపుడు ఆ సూర్యుడు మాఘ మాసమునకే చేరును. దక్షిణ దిక్కునందు యోజనములచే (పరిమండలము) మండలము చుట్టు తొమ్మిది కోట్లని లెక్కింపబడినది. అట్లే అహోరాత్రముల నుండి సూర్యుని ఈ గతి ఒక లక్ష నలుబదియైదని విధింపబడినది.

దక్షిణమునుండి మరల ఈ సూర్యుడు రాత్రి, పగలు సమముగా నుండు కాలమైన విషువత్తులో ఎప్పుడుఉండునో(అప్పుడు)క్షీర సముద్రముయొక్క ఉత్తరాంతములైన దిక్కులను చరించుచు ఉండును. సూర్యుని భ్రమణమండలము. విషువన్మార్గము మూడు కోట్లు యోజనముల విస్తీర్ణము కలది. అట్లే మరల ఒకకోటి ఎనుబదియొకటి అధికమైనది. శ్రవణానక్షత్రమున ఉత్తరదిక్కున సూర్యుడు ఉన్నప్పుడు ఆఅవదైన కాశద్వీపము యొక్క ఉత్తరాంతములైన దిక్కుల అందు చరించుచుండును. ఉత్తరదిక్కున మండలముయొక్క ప్రమాణము యోజనాగ్రమునుండి ఒక కోటి. ఇచట ఎనుబది లక్షల ఏబది ఎనిమిది యోజనము. నాగవీథి, ఉత్తరావీథి, అజవీథి, దక్షిణావీథి(వీనిలో) (ఉత్తర)ఆషాఢ నక్షత్రమున అజవీథి ఉదయముగా గలవి మూడును మూలము. అభిజిన్నక్షత్రమునకు పూర్వముగా స్వాతినక్షత్రమున నాగవీథి ఉదయముగా గలవి మూడును మూలము. దిక్కులయొక్క మధ్య దూరమును యోజనములతో చెప్పెదను. ఇది ఒక కోటి ముప్పది యొక్క యోజనములు. ఇతరములు ముప్పది మూడు అధికముగాగలవి. ఈ దిక్కులయొక్క మధ్య దూరము యోజనాగ్రమునుండి ముప్పదిమూడు యోజనములచే ప్రతిష్ఠితమైనది. దిక్కులకును లేఖలకును దక్షిణోత్తరములు అంతరములు (ఎడమ) వానిని యోజనములతో లెక్కించి చెప్పెదను. దానిని వినుడు. ఆ దిక్కుయొక్కయు బాహ్యము అభ్యంతరముల మధ్య దూరము అనబడును. ఉత్తరాయణమున మండలముల అభ్యంతరమును(రవి) చుట్టివచ్చును.

వెలుపల దక్షిణమునను ఎల్లప్పుడు క్రమమును తప్పక రవిచరించును. నూట ఎనుబది మండలముల మొత్తము ఉత్తరమున రవి చరించును. దక్షిణమున గూడ సూర్యుడు అంతవరకే తిరుగును. తరువాత మండలము యొక్క ప్రమాణము యోజనాగ్రము నుండి వినుడు. అది ఇరువది యొక్క వేల రెండు వందల ఇరువది యొక్క యోజనములు. ఈ ప్రమాణము యోజనములలో చెప్పబడినది. అది మండలము, మండలము యొక్క విష్కంభము ఇది. అది అడ్డముగా విధింపబడుచున్నది. ప్రతిదినము మండల క్రమముగా అన్ని యోజనములు రవిచరించును. కుమ్మరివాని చక్రము, చివరకు శీఘ్రముగ మరలివచ్చునట్లే, దక్షిణాయనమున సూర్యుడు శీఘ్రముగ తిరిగివచ్చును. అందువలననే ఎక్కువ భూమిని కొద్దికాలములోనే పయనించును. సూర్యుడు పండ్రెండు ముహూర్తములతో (24 గడియలు) దక్షిణోత్తర భాగములలో చరించును. ఒక పగటితో సూర్యుడు పదమూడున్నర నక్షత్రములు తిరుగును. పదునెనిమిది ముహూర్తములలో ఒక రాత్రిని చరించును. కుమ్మరి చక్రము యొక్క మధ్యభాగము మెల్లగా తిరిగినట్లే ఉత్తరాయణమున సూర్యుడు మెల్లని నడకగలవాడై, చరించును. సగము దినముతో పదమూడున్నర

నక్షత్రములను చరించును. కావున ఎక్కువ కాలముచే తక్కువ భూమిని సూర్యుడు పయనించును. పదునెనిమిది ముహూర్తములతో ఉత్తరాయణము పశ్చిమదినము అగును. రవి దానిని మెల్లని నడకతో చరించును. అర్ధదినముతో పదమూడున్నర నక్షత్రములను రవి చరించును. పదునెనిమిది ముహూర్తములతో రాత్రియందు అన్నియే నక్షత్రములను $\left(13\frac{1}{2}\right)$ చరించును. కుమ్మరి చక్రము మధ్యనున్న మట్టిముద్ద ధ్రువమై (చలింపనిదై) ఎట్లు తిరుగునో, అట్లే అహోరాత్రలచేత సూర్యచక్రము మిక్కిలి మెల్లగా తిరుగును. రెండు దిక్కుల మధ్యన ముప్పది ముహూర్తములలో ఒక అహోరాత్రకాలమును ధ్రువుడు స్థిరుడై తిరుగును. కుమ్మరి చక్రపునాభి అచ్చటనే అనగా ఉన్నచోటనే తిరుగునట్లు ధ్రువుడు కూడఉన్న చోటనే తన చుట్టు తాను తిరుగును. రెండు దిక్కులమధ్యన మండలముల తిరుగు సూర్యునకు పగలును, రాత్రియును మందగతియు, శీఘ్రగతియు కలుగును. ఉత్తరాయణమున పగలు చంద్రునిగతి మందము అట్లే రాత్రియందు సూర్యుని గతి శీఘ్రమైనది. దక్షిణాయనమున పగలు (చంద్రగతి) శీఘ్రముగా ఉండును. అట్లే రాత్రి సూర్యగతి మందమని కూడ అనబడినది. ఈ విధముగ చంద్ర సూర్యగతి విశేషముచే రాత్రి, పగళ్లను విభజించి చంద్రసూర్యులు సమయముగను విస్మయముగను మార్గమును చరింతురు.

లోకాలోకమున నలుదిక్కుల ఉన్న లోకపాలుర కన్న పైననే ఈ విధముగ గతి విశేషములచేత అగస్త్యుడు (నక్షత్రము) వేగముగా తిరుగును. దక్షిణమున నాగవీథి యందు లోకాలోకమునకు ఉత్తరముగా వైశ్వానర (అగ్ని) మార్గము వెలుపల లోకసంచారకుడై, ఈతడు (అగస్త్యుడు) చరించుచుండును. లోకాలోకము (పర్వతము) యొక్క వెనుక ఎంత కాలము సూర్యకాంతి ప్రకాశించుచుండునో అంతవరకు లోకాలోక (పర్వత)ము యొక్క ఇరు ప్రక్కలను వెనుకను అంతట(అగస్త్య నక్షత్రము)ప్రకాశించును. ఆ గిరి పదివేల యోజనముల ఎత్తు పది మండలములుగా ఉన్నదై అంతటను ప్రకాశముగను, అప్రకాశముగను ఉండును. ఆ లోకాలోక గిరియొక్క లోపలనే నక్షత్ర, చంద్ర, సూర్యులు తమ తారా గణములతో కూడి ప్రకాశింతురు. ఇంతవరకే లోకము (లోకపర్వతము). ఆ తరువాతది నిరాలోక (ఆలోకపర్వత)ము. లోకాలోకము ఒకేవిధము. నిరాలోకము అనేక విధములు. ఏ కారణమున సూర్యుడు లోకాలోకములను పరిగ్రహ ముగా (చుట్టివచ్చు దానినిగా) సంధించునో, ఆ కారణముననే ఉషా-వ్యుష్టుల (రేయి-పగలుల) మధ్య కాలమును సంధ్య అని అందురు. ఉషఅనగా రాత్రి, వ్యుష్టిఅనగా పగలు. సంధ్యా కాలములలో రాక్షసులు సూర్యుని మ్రింగబోవుదురు. ఈ దురాత్ములకు బ్రహ్మ నియోగముతో (ఆజ్ఞతో)

శాపముగలదు. వారి దేహమునకు నాశము లేమియు చావులేమియు వరముగా పొందిరి. ప్రసిద్ధులైన మందేహులు అను మూడు కోట్ల రాక్షసులు వారు. వారు ప్రతిదినమున సూర్యుని ప్రార్థింతురు, ఉదయింతురు. ఆ దురాత్ములు తపింపజేయుచు సూర్యుని తినివేయ తలంతురు. ఆ తరువాత, సూర్యునకును, ఆ రాక్షసులకును భయంకర యుద్ధము అగును. అంతలో దేవతలు, బ్రాహ్మణులు, మహాసజ్జనులు (మునులు) సంధ్యని ఉపాసించుచు మహా జలమును విడుతురు. ఆ మహాజలము ఓంకార బ్రహ్మతో కూడినది, గాయత్రీ మంత్రముతో అభిమంత్రింపబడినది. మంత్రముతో వజ్రముగా అగు ఆ జలముతో ఆ రాక్షసులు దహింపబడుదురు.

ఆ తరువాత మరల తేజస్వియై మహాకాంతి పరాక్రమములుగల సూర్యుడు, లక్ష యోజనములపైకి లేచును. ఆ తరువాత సూర్యభగవానుడు బ్రాహ్మణులచేతను కృతార్థులై కిరణములతో కూడిన వాలఖిల్య మునులచే చుట్టబడినవాడై ఆకాశమున పోవును. పదునైదు నిమేషములు (కనురెప్పపాట్లు) ఒక కాష్ఠ. ముప్పదికాష్ఠలు ఒక కల(ళ). ముప్పది కలలు ఒక ముహూర్తము. ముప్పది ముహూర్తములు రాత్రింబవళ్లు కలిసి ఏర్పడిన కాలము. అహర్భాగములతో దివసములయొక్క క్షయవృద్ధులు వరుసగా ఇట్లుండును. సంధ్యయొక్క ముహూర్తపరిమాణము (రాత్రింబవళ్ళ) క్షయవృద్ధులలో గూడ సమానముగనే ఉండును (మారదు). తరువాత, సూర్యుడు తన బింబములోని రేఖ మాత్రోదయము మొదలుకొని మూడు ముహూర్తములవరకు ఆకాశమున పైకివచ్చు కాలము ప్రాతఃకాలము. అది పగటిలో అయిదవ భాగము ఉండును. (15ముహూర్తములు పగలు 15/5=3వ భాగము). దానినుండి (ప్రాతఃకాలము) మూడు ముహూర్తముల కాలము సంగమకాలము (3 నుండి 6 ముహూర్తకాలము). సంగమమునుండి మూడు ముహూర్తముల కాలము మధ్యాహ్నము. మధ్యాహ్నము నుండి మూడు ముహూర్తముల కాలము అపరాహ్ణము. దానినుండి మూడు ముహూర్తముల కాలము సాయాహ్నము. పదియైదు ముహూర్తములలో మూడేసి ముహూర్తములు ప్రాతస్సంగమ మధ్యాహ్న, అపరాహ్ణ, సాయంకాలములు విషువత్తునందు పదునైదు ముహూర్తముల పగలు ఉండును. పదునైదు ముహూర్తములు కలిపిన రాత్రితో గలిపి పగలు రాత్రి సమముగా విషువత్తునందు ఉండును. దక్షిణ ఉత్తరాయణములు రాత్రి, పగళ్లు వృద్ధి, క్షయమును పొందుచుండును. రాత్రి పగటిని, పగలు రాత్రిని గ్రసించు (ఆక్రమించు) చుండును. విషువత్కాల (సమరాత్రి దినకాల)ము నుండి శరత్-వసంత ఋతువుల మధ్యన చంద్రుడు అహోరాత్రములలో ఏడు కల(ళ)లను తినును.

అట్లే పదునైదు దినములు పక్షము అనబడును. రెండు పక్షములు మాసము. రెండు (లోపలి) మాసములు ఋతువు. మూడు ఋతువులు అయనము. రెండు అయనములు

వర్షము లేక సంవత్సరము అనబడును. కనురెప్పపాటు కాలమైన నిమేషాదు లతో ఏర్పడునది కాలము. కాష్ఠలో పదునైదు కాలములు ఉండును. కళలో ముప్పదియవది కాష్ఠ. అది నూట అఱువది మాత్రల (చిటుకల)కాలము. ఇరువది తొమ్మిది మాత్రల కాలము శతఘ్న. ముప్పది యారు మాత్రలదియు, అరువది రెండు మాత్రల కాలము గలదియు, ముప్పది మూడు మాత్రల కాలము గలదియు చల అగును. నలుబది వేల ఎనిమిది వందలు విద్యుతి. అక్కడనే నిశ్చయముగా డెబ్బదియు, తొంబదియు అని తెలిసికొనుము. (7108, లేక 9108 కావచ్చును) వైధసంయుగమున నాలుగే వందలని అందురు. ఇది చరాంశగా తెలియగవలెను. ఇచట నాళిక కారణము. సంవత్సరము మొదలైన అయిదు నాలుగు మాసములతో విడివిడిగా కల్పింపబడినవి. మొత్తము కాలము యొక్క నిశ్చయము యుగము అనబడును. మొదటి సంవత్సరము ప్రథమము అనబడును. రెండవది పరివత్సరము, మూడవది ఇద్వత్సరము, నాలుగవది అనువత్సరము. వానిలో అయిదవ వత్సరమునకు కాలమని పేరు. పూర్తిగా రెండువేల పర్వముల కాలము రవియొక్క యుగము, (పర్వము అమావాస్యా ప్రతిపత్తుల సంధి, విషువదాది, పూర్ణిమ). నలుబది ఎనిమిది పర్వములు భాస్కరునియొక్క ఉదయము. సూర్య సంబద్ధములైన ఋతువులు ముప్పది, పది అయనములు. నూటతొంబదియైదు మాసములును. ముప్పది అహో రాత్రములు (30 దినములు) భాస్కర మాసము. అఱువదియొక్క అహోరాత్రములు ఒక అనువు అని భావింపబడును. నూట ఎనుబదిమూడు పగళ్లు (ఒక ఏడుగా) అగును. సూర్యుని యొక్కయు భువనము యొక్కయు మాసమును (పరిమాణమును) తెలియవలెను. సౌరము అనియు, సౌమ్యము అనియు, (చాంద్రము), న(నా)క్షత్రము అనియు, సావనము అనియు మానము జ్యోతిషమానము నాలుగు విధములని పురాణము తెలుపుచున్నది.

ఆకాశమున దాని ఉత్తరముగా 'శృంగవాన్" అను పర్వతము గలదు. దాని మూడు శిఖరములు ఆకాశమును అంటుచున్నవా అన్నట్లుండును. వానిచేత గూడ 'శృంగ వాన్' అని అంతట ప్రసిద్ధి చెందినది. దాని విస్తారము, విష్కంభము ఒకే మార్గమున ఉండును. దానికి అంతట శృంగములుగలవు. మధ్యది బంగారపుది. దక్షిణపుది శృంగము స్ఫటిక కాంతిగలదైన వెండిది. ఉత్తమమైన ఉత్తర శృంగము ఒకటి సమస్త రత్నములతో నిండినది. ఈ విధముగా పర్వతమునకు సంబంధించిన మూడు శృంగములచేత ఆ పర్వతము 'శృంగవాన్' అని ప్రసిద్ధిచెందినది. శరత్-వసంత ఋతువుల మధ్యన ఆకాశమధ్య గతియందున్నవాడై, సూర్యుడు విషువంతమయిన శృంగమును చేరును. చీకటి పోద్రోలు సూర్యుడు రాత్రిని పగటితో సమముగా చేయును. మహారథమున కట్టబడిన పసుపు

పచ్చనివైన దివ్యములైన గుబ్బములు పద్మములవలె ఎఱ్ఱని కిరణములచే అప్పుడే పూయ బడినవా అన్నట్లు ప్రకాశించును. మేషరాశి అంతమునకు తులారాశి అంతమునను సూర్యోదయమువలన పగలును రాత్రియు పదునైదు ముహూర్తములుగలవే అగును. కృత్తికా నక్షత్ర ప్రథమ పాదమునను సూర్యుడు ఉన్నప్పుడు, చంద్రుడు విశాఖా నక్షత్ర చతుర్థపాదమున ఉండునని గ్రహింపవలెను. సూర్యుడు విశాఖానక్షత్ర తృతీయ పాదమున ఉన్నప్పుడు, చంద్రుడు కృత్తికా శిరస్సున ఉండును. అపుడు విషువంతమును తెలుసుకొనవలెను. సూర్యునితో విషువమును తెలియవలెను. సోముని(చంద్రుని)చే కాలమును తెలుసుకొనవలెను. రాత్రి–పగలు సమానములైనప్పుడు విషువత్తము అగును. విషువత్తులో పితృ దేవతలకై దానములను చేయవలెను. విశేషించి బ్రాహ్మణులకు దానము చేయవలెను. బ్రాహ్మణులు దేవతలకు ముఖముతో సమానులు. ఊనరాత్ర అధిక మాసములు, కలా, కాష్ఠా, ముహూర్తములు, పౌర్ణమాసీ, అమావాస్యా, సినీవాలీ (చంద్రకళ కనబడిన అమావాస్య) కుహూ (చంద్రకళ కనబడని అమావాస్య) రాకా (పూర్ణచంద్రుడు గలపూర్ణిమ), అనుమతి (ఒక చంద్రకళ తగ్గిన పూర్ణిమ) వీనిని అన్నింటిని తెలుసుకొన వలెను. మాఘ, ఫాల్గుణ మాసములు, చైత్ర వైశాఖ మాసములు, జ్యేష్ఠము ఆషాఢ మాసములును కలిసి ఉత్తరాయణము అగును. శ్రావణ, భాద్రపద మాసములు, ఆశ్వయుజ, కార్తీక మాసములు, మార్గశీర్ష పుష్య మాసములును కలిసి దక్షిణాయనము. తరువాత సంవత్సరములను బాగుగా తెలుసుకొనవలెను. ఐదు సంవత్సరములు బ్రహ్మయొక్క పుత్రులు తరువాత ఋతువులు తెలుసుకొనతగినవి. ఋతువులు అంతరములు అనబడినవి. దాని తరువాత పర్వమునకు అనుముఖయైన అమావాస్యను తెలుసుకొన వలెను. తరువాత పితృదేవతలకు హితమైన విషువమును ఎల్లప్పుడును తెలుసుకొనవలెను. ఈవిధముగా తెలిసిన మానవుడు దైవ కార్యముల విషయములోను పితృకార్య విషయములోను మఱపుజెందదు. అందు వలననే విషువత్తు ప్రజలకు అందరికి ఎల్లప్పుడును తెలియ వలసినదిగా చెప్పబడినది.

ఆలోకాన్తము (ఆలోకపర్వతము చివరివరకు) లోకము అనియు, (లోకపర్వతము అనియు), లోకాంతము (లోకపర్వతము) చివరివరకు, లోకము అనియు (భూలోకము అనియు) చెప్పబడును. లోకాలోక(పర్వత)ముల మధ్యగా లోకపాలురు ఉన్నారు. మహా త్ములైన ఆ నలుగురు భూత ప్రళయమునుండి ఉందురు. వారు వైరాజైన సుధాముడు, శంకృపుడైన కర్దముడు, పర్జన్యుడైన హిరణ్యలోముడు, జాత నిశ్చయుడైన కేతుమంతుడు అనువారలు. వారు సాటిలేనివారు, నిరభిమానులు, నిస్తంత్రులు (ఏ సిద్ధాంతములేనివారు), నిష్పరిగ్రహులు (దానమును స్వీకరింపనివారు) అయినవీరు లోకాలోక పర్వతమున

నాలుగు దిక్కులకు లోకపాలురుగా ఉన్నారు. అగస్త్యునకు (నక్షత్రమునకు) ఉత్తరముగను, అజవీథికి దక్షిణముగను, వైశ్వానర (అగ్ని) మార్గమునకు వెలుపలను ఉన్న మార్గము పితృయాణము (పితరుల మార్గము) అచట అగ్నిహోత్ర హోమము చేయువారును సంతాన వంతులైన మునులు ఉందురు. పితృయాన మార్గమున ఉన్నట్టివారు, లోకమునకు సంతాన మును కలుగజేయువారు భూతముల ప్రారంభమునకై చేసినది కర్మ. ఆశీస్సుచే 'ఋత్విక్' అనబడును. లోకకాములై వారు ప్రారంభింతురు. వారియొక్క మార్గము ఆదక్షిణము.

వారు చలితమైన ధర్మమును మరల ప్రతి యుగమున సంతతిచేతను, తపస్సు చేతను, మర్యాదలచేతను, వేదపాండిత్యముల చేతను స్థాపింతురు. ముందు వారు తరువాతి వారి ఇండ్లలో జనియింతురు అపూర్వులు చావగా మరల తరువాతి (పశ్చిమములు) జనింతురు. ఇట్లు జనన, మరణములచే తిరుగుచున్నవారై వారు భూత ప్రళయము నుండి భూత ప్రళయము వరకు ఉందురు. క్రియావంతుల యుద్ధములో శ్మశానములకు పంపబడిన వారు! ఆ గృహమేథు (గృహస్థాశ్రమ)వాసులైన ఎనుబది ఎనిమిది వేల మునులు సూర్యునియొక్క దక్షిణ మార్గమును ఆచంద్రతారకము ఆశ్రయించిరి. పంచ భూతముల ప్రారంభముచే కలిగిన లోకసంబంధ వ్యవహారముతోను, ఇచ్ఛాద్వేష ప్రకృతితోను, శరీరకృతమైన మైథునమును పొందుట చేతను, విషయ సుఖములను సేవించుటచేతను ఇటువంటి అకారణములచేత సిద్ధులు శ్మశానములను పొందిరి. నాగవీథికి ఉత్తరమునను, సప్తర్షులకు (నక్షత్రములకు) దక్షిణముగను, సూర్యునియొక్క ఉత్తర (దిక్కు) మార్గమును దేవయానము అందురు. అక్కడున్న సిద్ధులు విమలురు, బ్రహ్మచారులు. వారెప్పుడును దయ చూపుదురు. దానివలన వారిచే మృత్యువు జయింప బడినది. ఊర్ధ్వరేతస్కులైన ఆ ఎనుబది ఎనిమిదివేల సిద్ధులు సూర్యునియొక్క ఉత్తమ మార్గమును భూత ప్రళయము వరకు ఆశ్రయించిరి. ఇట్టి ఆశుద్ధ కారణములచే వారు అమృతత్త్వమును పొందిరి. పంచమహాభూత ప్రళయము వరకు ఉండుట అమృతత్వమని భావింపబడినది. ఇది పునర్జన్మతో మరల ఉత్తరరాయణ మున పోని వానియొక్క ముల్లోకముల ఉండు కాలము. బ్రహ్మహత్య అశ్వమేధములచే పుణ్య–పాపములజేసినవానికి వేఱొకటి. ఊర్ధ్వరేతస్కులుగూడ పంచమహాభూత ప్రళయము తరువాత నశింతురు. సప్తర్షులకు ఊర్ధ్వముగా పైకి ఉత్తరముగా ధ్రువుడు నక్షత్రము ఉన్న పథము దివ్యమైన విష్ణు పదము. అది మూడవది. ఆకాశమున ప్రకాశించునది. అచటికి పోయినవారు దుఃఖమును పొందరు. అది విష్ణువు యొక్క పరమ పదము. అచట ధర్ముడు, ధ్రువుడు మొదలగు లోకసాధకులు ఉందురు. (50)

జ్యోతిష్ప్రచారము

సూతుడు అనెను :

స్వాయంభువ మన్వంతర సృష్టిలో ఉత్తర విషయములు అన్నియు వ్యాఖ్యానింప బడినవి. వాని యొక్క సమస్త భవిష్య విషయములను క్రమముగా చెప్పెదను. అనగా ఆ మాటలను వినిమునులు లోమహర్షణుని (సూతుని) సూర్యచంద్రులయొక్క సంచారమును, అంతట గ్రహములయొక్క సంచారమునుగూర్చి అడిగిరి. ఆకాశమున ఈ జ్యోతిస్సులు (కాంతిగల నక్షత్రము) ఎట్లు మండలముగా తిరుగుచున్నవి? అడ్డముగను సమూహముగను కలియకుండను ఎట్లు తిరుగుచున్నవి? వానిని ఎవ్వడు త్రిప్పుచున్నాడు? లేదా అవి స్వయముగనే తిరుగుచున్నవా? ఓ మహాజ్ఞానవంతుడా ఇది మేము తెలియ దలచితిమి. దానిని మాకు చెప్పుడు. ఇది ప్రాణులందరిని ఆశ్చర్యమున ముంచునది. కావున దీనిని తెలుసుకొనవలెనను కోరిక కలుగుచున్నది అని మునులు ప్రార్థించిరి.

సూతుడు అనెను :

ఇది ప్రాణులకు ఆశ్చర్యకరము. దీనిని చెప్పెద వినుడు. ప్రత్యక్షముగా కనబడుచునే ప్రజలను ఆశ్చర్యపరచును. శింశుమారచక్రము యొక్క తోకయందు నాలుగు దిక్కుల (ప్రకాశించుచు) చక్కగా స్థిరపడి ఉన్నావాడు ఉత్తానపాదుని పుత్రుడై ఆకాశమున మేఢీభూతుడై ఉన్న ధ్రువుడు (గొట్టె ఆకారమున ఉన్నవాడు). అతడు తన చుట్టు తాను తిరుగుచు గ్రహములతోబాటు చంద్రసూర్యులను త్రిప్పుచున్నాడు. తిరుగుచున్న ఆ ధ్రువుని అనుసరించి నక్షత్రములు చక్రమువలె తిరుగును. ధ్రువుని యొక్క మనస్సుతోనే ఈ నక్షత్రగణము స్వయముగ కదలిపోవును. గ్రహములతో పాటు చంద్రసూర్యులు తారా నక్షత్రములును స్వయముగా కదిలిపోవుచున్నవి. వాయువను సేనతో నిండిన బంధములచే గ్రహములతో గూడిన తార నక్షత్రములు కట్టబడినవి. వానియొక్క యోగములు, భేదములు, అట్లే కాలచారములు, అట్లే అస్తోదయములు, ఉత్పాతములు, దక్షిణోత్తరాయణములు, విషువత్తులు, గ్రహముల వర్ణములను మొత్తము ధ్రువుని నుండియే ప్రవర్తిల్లును. వర్షములు, ఎండ, మంచు, రాత్రి సంధ్యదినము, అట్లే ప్రజల శుభాశుభులు, సమస్తము ధ్రువుని నుండియే ప్రవర్తిల్లును. ధ్రువునిచే అధికృతులైన వారిని తొలగి సూర్యుడు ఉండును. కావున అట్టి ఈ సూర్యుడు మండిన కిరణములు కలిగిన కాలాగ్నివలె ఉండును. ఓ మహాజ్ఞానులైన బ్రాహ్మణులారా తిరుగునట్టి క్రమమున తన కాంతులతో దిక్కులను వెలిగించుచు, వాయువుతో కూడిన కిరణజాలముచే సమస్త జగము అంతటను జలమును లాగును.

సూర్యునిచే త్రాగబడిన జలము సూర్యుడు అగ్నినుండి చంద్రునికి సంక్రమించును. వాయవుతో కూడిన (సూర్య) నాడులచే లోకముల ఉనికి జరుగును. సూర్యుడు చంద్రుడి నుండి స్రవించిన జలమును మేఘముల చివరలలో ఉంచును. వాయువు తాకిడిచే మేఘములు జలమును భూమిపై కురియును. ఈ విధముగా జలముపైకి లేపబడును. మరల క్రింద భూమిపైపడును. అదే జలము అనేక విధములుగా మారుచుండును. భూతములను నిలుపుటకు ఈ మాయ విశ్వమంతయు విశ్వునిచే నిర్మింపబడినది. ఈ మాయచేతనే చరాచరములతో కూడిన మూడులోకములు వ్యాపించబడినవి.

విశ్వేశుడును, లోకకారకుడును, దేవుడును, వేయికిరణములు గలవాడును, ప్రజాపతియు, బ్రహ్మయును, సమస్త లోకమునకు ప్రభువును, విష్ణువు అయినవాడు దివాకరుడు (సూర్యుడు). సర్వలోకములలోని జలము ఆకాశమున చంద్రుడినుండి స్రవించి నందున ఈ జగమంతయు చంద్రుడు ఆధారముగా గలది. సూర్యునినుండి జలము వేడియై స్రవించును. చంద్రునినుండి అది చల్లన అగును. శీతోష్ణవీర్యులైన ఈ చంద్ర సూర్యులు ఇరువురును కలిసి జగత్తును ధరించుచున్నారు. చంద్రుడు ఆధారముగా గల నదియైన గంగ పవిత్రయై, స్వచ్ఛమైన జలములుగలది. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! మహానదులు చంద్రపుత్రులు మొదలైనవి. సర్వ ప్రాణుల శరీరముల జలములు అనుగత ములై ఉన్నవి. స్థావరజంగమ ప్రాణులైన అవి కాల్చబడుచుండగా ఇట ఆ జలములు పొగరూపములై అంతట వెలువడును. దానిచేత ఆయా చోట్లలో నిలిచి ఉన్న జలముల యొక్క మేఘములు ఏర్పడును. సూర్యతేజస్సు తన కిరణములచేత ప్రాణుల నుండి జలమును లాగుకొనును. సూర్యకిరణములు వాయుసంయోగమున సముద్రము నుండి జలములను ధరించును. ఋతువశమున వర్షాకాలమున సూర్యుడు తిరిగినవాడై తన తెల్లని కిరణములచేత తెల్లని నీటిని మేఘములకు ఇచ్చును. మేఘములందున్న జలములు వాయుప్రేరితములై సర్వ ప్రాణుల హితమునకై (వర్షముగా)పడును. ఆ వాయువుల చేతనే సర్వ ప్రాణుల వృద్ధికొరకు ఆఱు మాసములంతట వర్షించును. అపుడు వాయువ్య దిక్కున మెఋపు వలన వచ్చిన అగ్నితో పుట్టిన గర్జనము కలుగును. తడుపుట అను అర్థముగల 'మిహ'ధాతువు నుండి 'మేఘ'శబ్దము పుట్టినది. మేహనము (తడుపుటను) చేయుట వలన మేఘమయినదని వ్యాకర్తలు వ్యంజింపజేసిరి. వీనినుండి మేఘశబ్దము పుట్టినది. వీనినుండి జలములు జారిపడవు కావున (న భ్రశ్యంతీతి) మేఘములు అభ్రము లైనవి అని కవులు వ్యుత్పత్తిని చూపుదురు. మేఘములు పుట్టు కారణములు మూడు అని చెప్పబడినది. ఆగ్నేయములు, బ్రహ్మజములు, పక్షజములు–అని మూడు విధములు.

వాని పుట్టుకనుగూర్చి చెప్పెదను. ఆగ్నేయములు (అగ్నినుండి పుట్టినవి) అయిన మేఘములు సముద్రమున పుట్టినవి కావున ఆగ్నేయ మేఘములు సముద్రమునుండి పుట్టును. చల్లదనము, మేఘములు ఆకాశము నిండకప్పి ఉండుట, వాయువులు వీచుట ఇవి వాని స్వగుణములు. దున్నపోతులు, పందులు, మదపుటేనుగుల పై బోవువానిగా అయి, భూమి మీదికి వచ్చి చరించును. జీమూతములను మేఘములు ఈ ప్రాణులనుండి పుట్టినవి. మెఱుపులు లేనివి. జలధారలవలె ఆకాశమునుండి నల్లగా వ్రేలాడునవి. ఇవి గర్జింపనివి ఘనములు (దట్టమైనవి) ఆకాశమంతయు వ్యాపించినవి, జల ప్రవాహమునకు వశమైపోవునవి. ఒక క్రోశము ఎత్తునుండిగాని ఒకటిన్నర క్రోశము ఎత్తునుండిగాని వర్షించును. పర్వత అగ్రములందును పర్వతమధ్యములందును వర్షించును క్రీడించును. ఆ సమయమున కొంగలు గాడిదలును క్రీడించును. కొంగలు, గర్భము ధరించును. ఇక బ్రహ్మజములు అను మేఘములు బ్రహ్మ నిట్టూర్పుల వల్ల పుట్టినవి. అవి మెఱుపు తీగలతో కూడియుండును. ధ్వనిప్రియములై గర్జించుచుండును. ఆ మేఘముల శబ్దధ్వనిచే భూమి తన శరీరముపై వృక్షాదుల అలంకారములు కలది అగును. రాజుచే పట్టాబి షిక్తురాలైన రాణివలె మరల యౌవనవతి అగును. భూతముల (ప్రాణుల) జీవన ఉత్పత్తికి కారణమై భూమి ఆ మేఘములందు ప్రేమాసక్త అగును. జీమూతములను ఆ మేఘముల నుండి జీవము పుట్టును. ఆ మేఘము రెండవదైన ప్రవహమను వాయువును ఆశ్రయించి ఉండును. ఇవి ఒక యోజనము (ఎత్తు) నుండిగాని, సార్థార్థమునుండిగాని, నిష్కృతము నుండిగాని వర్షమును కురియును. వాని వర్షధారలు జడివానలుగా ఉండును. పుష్కరా వర్తకములను మేఘములు పక్షము (ఱెక్క)లనుండి పుట్టినవి. మహాబలము కలిగి, స్వేచ్ఛా గమనము కలిగి బాగా పెరిగిన పర్వతముల ఱెక్కలు, ప్రాణులయొక్క మంగళమును కోరి ఇంద్రునిచే తన వజ్రాయుధముతో ఖండింపబడినవి. పుష్కరావర్తకములు ఆ పక్షము (ఱెక్క)లనుండి పుట్టినవి. పుష్కరములను ఆమేఘములు చాలపెద్దవి. జలముతో మాత్స్యర్యమును చెందినవి. ఆ కారణముచేతనే అచట అవి పుష్కరావర్తక (జలము చుట్టి ఉన్నవి) శబ్దముతో పిలువబడినవి. అవి అనేక రూపముల ధరించినవి. మిక్కిలి భయంకరము లైనవి. కల్పప్రళయవర్షమును కురియకలవి. సంవర్తమను ప్రళయాగ్నిని చల్లార్పగలవి. ఇవి యుగాంతములలో వర్షించును. ఇవి మూడవవిగా చెప్పబడినవి. అనేక రూపములు, అనేక స్థావరములును గలవై భూతలమును అంతయు జలముతో నింపుచున్నవై, పరమను వాయువును కల్పసాధకములై ఆశ్రయించును. ప్రాకృతికమైన అండము నుండి బ్రహ్మ పుట్టెను. అతడు నాలుగు ముఖములు గలవాడు. స్వయంభువు

(తనకుతానే పుట్టినవాడు). ఆ పగిలిన బ్రహ్మాండకపాలము నుండి పుట్టిన జలములు అన్నియు మేఘములే. ఆ జలములకు తృప్తికరమైన నివాసము ధూమము. ఇది అన్ని మేఘములకు సామాన్యము. వానిలో శ్రేష్టమైనది పర్జన్యము. నాలుగు దిగ్గజములు అను ఏనుగులకును, పర్వతములకును, మేఘములకును, పాములకును వేరుగా అయిన కులము ఒక్కటే. వానికి పుట్టు స్థానము ఒక్కటే. అది జలము అనబడినది. పర్జన్యుడు, దిగ్గజము లును, హేమంతమున శీతమునుండి పుట్టినవి. అవి సర్వసస్యముల వృద్ధికొఱకు మంచు వర్షమును కుఱిపించును. శ్రేష్ఠమైన పరివహము అను వాయువు వానికి ఉపాశ్రయము. ఈ భగవత్ స్వరూపుడైన పరివహవాయువు ఆకాశమున కనబడు గంగను భరించును. ఆ గంగ దివ్యమైనది. బహుజలములుకలది. పుణ్యమైనది. ఆ గంగయొక్క కదలికలవలన కలిగిన జలమును దిగ్గజములు తమ విశాలములైన తొండములచే తుంపరగా ఎగ జిమ్మును. హిమాలయమునకు ఉత్తరమున దక్షిణముగా ఉన్న గిరి హేమకూటము అనబడును. ఉత్తర హిమాలయము నుండి దక్షిణమున పుండ్రము అగును నగరమున్నది. దానిపై బడిన వర్షము మంచు నుండి పుట్టినది. తరువాత ఆవహమను వాయువు హిమశైలమునుండి వీచుచు తన తాకిడిచే ఆ మహాగిరిని తడుపుచు ఆ వర్షమును దీనికొనివచ్చును. హిమవన్తమును దాటి తరువాతి ప్రదేశమున మిగిలిన వర్షము పడును. రెండు మేఘములు ఈ విధముగ తమ వర్షములతో తృప్తిని కలిగించును. చివరకు సూర్యుడే వర్షములను సృష్ఠించువాడని చెప్పబడుచున్నది.

ధ్రువునిచే సూర్యుడు చుట్టబడును వారి ఇరువురిచేత వర్షము కలుగును. ధ్రువునిచే చుట్టబడిన వాయువు మరల వర్షమును ఉపసంహరించును. సూర్యగ్రహమునుండి బయలు వెడలి సమస్తమైన నక్షత్రమండలమున వారము చివర ధ్రువునిచే చుట్టబడిన సూర్యుని (జలము)ప్రవేశించును. అందువల్ల ఇక సూర్యరథముయొక్క సన్నివేశమును వినుడు. భగవంతుడైన సూర్యుడు ప్రకాశించు ఒకే చక్రముగల రథముచేత ఆకాశమున కదలిపోవును. ఆ చక్రము ఒంటిది, చక్కగా అమర్చబడినది. ఐదుఆకులు కలది. మూడు నాభులు (బండికంటి తూములు) గలది. బంగారముతో నిర్మింపబడినది. అమావాస్యాది పర్వముతో గొప్ప ఓజస్సు అనగా తేజోబలము గలది. నశించిన దారిచీకటిగలది, ఆఱు విధములుగా ఉన్న ఒక్క చక్రపుటంచు (పట్టా) గలది. ఇట్టి చక్రముగల రథముతో ఆకా శమున సూర్యుడు కదలిపోవును. ఈ రథముతో పదివేలయోజనముల విస్తారమును దాటి పోవును. రథమునందున్న ఈషాదండము యొక్క (నాగటికోలయొక్క ప్రమాణమును బట్టి) రెండింతలుగా రథముండును. సూర్యుని ఆ రథము ప్రయోజనవశమున బ్రహ్మచే

సృష్టింపబడినది. అది సంగములేనిది. బంగారు మయమైనది. దివ్యమైనది. మిక్కిలి వేగముగా పోవు గుఱ్ఱములు పూన్చినది. గుఱ్ఱముల రూపమున ఉన్న ఛందస్సులతో శుక్రుడు ఉన్నవైపున ఉన్నది. అది వరుణుని రథముయొక్క లక్షణములతో మింట సమానముగా ఉన్నది. అట్టి ప్రకాశించు రథములతో సూర్యుడు ఆకాశమున కదలిపోవును. తరువాత ఇవి సూర్యుని రథముయొక్క ప్రత్యంగములు అనగా అవయవములు వరుసగా సంవత్సరము యొక్క అవయవములతో కల్పింపబడినవి. అహస్సు(పగలు) సూర్యుని యొక్క నాభి. అదియే ఏకచక్రము అనబడినది. ఆ చక్రము యొక్క ఐదు ఆకులు, ఐదు ఋతువులు. రథము యొక్క నీడము (చోటు–గూడు)ను సంవత్సరము అందురు. రెండు కూబరములు (నొగళ్ళు) దక్షిణోత్తరాయణములు. దాని (రథము) బంధురుములు (ఎత్తు తంతులు) ముహూర్తములు, దాని కంటిచీలలు కళలు. (ముప్పది కాష్ఠల కాలములు).దానిముక్కు కాష్ఠలు (పదునెనిమిది రెప్పపాట్ల కాలములు) దాని ఈషాదండము క్షణములు. దాని అనుకర్షము (నొగచివరి మానితుండు) నిమేషములు. దాని ఈష (నాగటికోల) లవములు అనబడును. వరూథము (చక్రపుటాకులలో చొప్పించు ఎమ్ము లేదా కప్పుతోలు) రాత్రి ఎత్తుగా లేపబడిన ధ్వజము ఎండాకాలము. దాని యొక్క కాడి చివరలు (బండికన్ను చివరలను) అర్థకామములు రెండు. ఏడు గుఱ్ఱముల రూపములైన ఛందస్సులు భూమికి ఎడుమగా లాగుకొనిపోవును. ఆ ఛందస్సులు గాయత్రి, త్రిష్టుప్, అనుష్టుప్, జగతి, పంక్తి, బృహత్, ఏడవది ఉష్ణిక్. ఇవి అక్షమున (ఇరుసున) చక్రము బంధింపబడినవి. ధ్రువునియందు ఇరుసు చొప్పింపబడినది. చక్రముతో పాటు ఇరుసు తిరుగును. ఇరుసుతో బాటు ధ్రువుడు తిరుగును. ఈ ఇరుసు ధ్రువునిచే ప్రేరేపింపబడినదై చక్రముతో బాటు తిరుగును. ఈ విధముగా ప్రయోజనము వలన సూర్యుని రథముయొక్క సన్నివేశము అగును. ఆ విధముగా సంయోగ భావముతో ప్రకాశమైన సూర్యుని రథము సంసిద్ధము అగును. దానిచేత సూర్యదేవుడు ఆకాశమున వేగముగా కదలిపోవును. రథముయొక్క నాగలి రంధ్రముల చివరలకు కట్టబడిన రెండు పగ్గములవంటి రెండు కిరణములు. ధ్రువునితో తిరుగుచున్న చక్రములు లేని నొగల యందలి రెండు పగ్గములు ఆకాశమున చరించుచున్న సూర్యుని రథముయొక్క మండలములు ఉండును. అవి రథము యొక్క దక్షిణముగా ఉన్న నాగలి బండి కన్నుల చివరలు. అవి రెండు చక్రముల తెల్ల త్రాడువలె ధ్రువునిచే చక్కగా పట్టుకొనబడినవి. ఆ రెండు పగ్గములు (తనచుట్టుతాను) తిరుగుచున్న ధ్రువుని వెంబడించి తిరుగును. అవి సూర్య రథముయొక్క దక్షిణము వైపుగా ఉన్న నొగలిబండి కన్నుల చివరలు మేకునకు బిగించిన త్రాడు అన్ని దిక్కుల తిరిగినట్లే,

ఉత్తరాయణమున మండలములందు ఆ రథము యొక్క కిరణములను (పగ్గములను) తగ్గించును. దక్షిణమున మండలములను దిరుగుచు ఆ రశ్ములే వృద్ధి చెందును. ధ్రువునిచే సంగ్రహింపబడిన ఆ రశ్ములు ఆకర్షింపబడును. అపుడు సూర్యుడు అభ్యంతరమున మండలములను తిరుగును. ధ్రువునిచే విడువబడుచున్న రెండు రశ్ములతో రెండు కాష్ఠల కాలముతో (ముప్పది ఆఱు రెప్పపాట్ల కాలములో) ఎనుబది నూర్ల మండలములను (సూర్యుడు) తిరుగును. అట్లే వెలుపల గూడ మండలములను తిరుగును. వేగముగా పైన చుట్టుచు మండలములలోను తిరుగును.(51)

ధ్రువచర్య

సూతుడు అనెను :

దేవతలైన ఆదిత్యులచేతను, ఋషులచేతను, అట్లే గంధర్వులచేతను, అప్సరసల చేతను, గ్రామీణులచేతను, అట్లే గ్రామాధిపతులచేత, సర్పములచేతను, రాక్షసులచేతను, ఆ సూర్యుడు అధిష్ఠితుడై ఉండును. వీరు సూర్యునియందు రెండేసి మాసములు వరుసగా నివసింతురు. ధాత, ఆర్యముడు, పులస్త్యుడు, పులముడు, ప్రజాపతి, ఉరగుడైన వాసుకియు, సంకీర్ణారుడను ఇద్దరు, గాయకవరులైన గంధర్వులైన తుంబురు నారదులును, క్రతుస్థలి, అప్సరయైన పుంజికస్థలి, గ్రామణియైన కృచ్ఛ్రుడును, తాపోర్యుడును, అను ఇద్దరును రక్షోహేతి, ప్రహేతిఅను రాక్షసులు ఇద్దరునుగల ఈ గణము చైత్ర వైశాఖ మాసములలో భాస్కరుని యందుండును. పైవి వసంత ఋతువునకు సంబంధించిన మాసములు, ఇక గ్రీష్మ ఋతువునకు సంబంధించిన మాసములు ఋషు లైన అత్రి, వసిష్ఠుడు, తక్షకుడు, రంభుడు, మేనక సహజన్య, హాహూహూహువులను గంధర్వులును, గ్రామణ్యుడైన రథస్వనుడును, రథచిత్రుడను ఇర్వురును, పౌరుషేయుడు ధవుడు అను రాక్షసులును వీరు జ్యేష్ఠ, ఆషాఢ మాసములలో సూర్యునిలో నివసింతురు. ఆతరువాత ఇంకను ఇతర దేవతలు సూర్యునిలో నివసింతురు. ఇంద్రుడు, వివస్వంతుడు, అంగీరసుడు, భృగువు సర్పమైన ఏలాపర్ణుడు శంకపాలుడును అను ఇరువురును, విశ్వావసువు, ఉగ్రసేనుడు ప్రాతస్సున అరుణుడును ప్రమ్లోచ, నిమ్లోచ అని ప్రసిద్ధి చెందిన స్త్రీలును, సర్పమైన రాక్షసుడును, వ్యాఘ్రుడు, శ్వేతుడు అను ఇరువురుగల ఈ గణము శ్రావణ భాద్రపద మాసములలో భాస్కరునిలో నివసింతురు. శరదృతువు నందైతే పర్జన్యుడు, పూష, భర ద్వాజుడు, గౌతముడు, మునులు, దేవతలు వసింతురు. విశ్వావసువు, గంధర్వులు, సురభి, శుభలక్షణులైన విశ్వాచి, ఘృతాచి అను ఇరువురు అప్సరలును, ఐరావతమను

ఏనుగును, ప్రసిద్ధుడైన అగ్నియు, సేనజిత్తైన సుషేణుడును, సేనానియైన గ్రామణి అను ఇరువురును, రాక్షసులు అనబడిన జలమును, వాయువును వీరందరు ఆశ్వయుజ కార్తీక మాసములలో సూర్యునిలో నివసింతురు. హేమంత ఋతువునకు సంబంధించిన మాసములలో సూర్యునియందు వీరు ఉండుదురు. అంశుడు భగుడను ఈ ఇరువురు, కశ్యపుడును, ఋతువును భుజంగుడైన మహాపద్ముడును, కర్కోటక సర్పమును, గంధర్వుడైన చిత్రసేనుడును, ఉర్ణాయువు, అను ఇరువురును శుభాప్సరసలైన ఊర్వశియు, విప్రచిత్తి అంతార్యుడైన అరిష్టనేమియు, గ్రామణియైన సేనాని అను ఇరువురును విద్యుత్ స్ఫూర్జుడు అను రాక్షసులును వీరు మార్గశీర్ష పుష్యమాసములలో దివాకరునిలో నివసింతురు. ఆత శిశిర ఋతు మాసములలో గూడ ఈ క్రిందివారు నివసింతురు. త్వష్ట, విష్ణువు, జమదగ్ని, విశ్వామిత్రుడు, కద్రుపుత్రులైన కంబల, అశ్వతరులను ఇరువును నాగులును, గంధర్వుడైన ధృతరాష్ట్రుడును, సూర్యవర్చస్కుడును, అప్సరసలైన తిలోత్తమయు, మనోరమయైన రంభాదేవియు, లోకప్రసిద్ధులైన గ్రామాధిపతులైన (గ్రామణ్యులు) ఋతజిత్తును, సత్యజిత్తును బ్రహ్మతోకూడి యజ్ఞముతో కూడిన దక్షుడు అనబడువాడు అను ఈ దేవతలు వరుసగా మాఘ ఫాల్గుణమాసములలో సూర్యునిలో నివసింతురు.

ఈ పంద్రెండైన ఏడేసి గణములు స్థానాభిమానము కలవి. ఇవి తమ తేజస్సుచే ఉత్తమతేజమైన సూర్యుని వెంబడించి సంతోషపెట్టును. మునులు ప్రసిద్ధమైన వాక్కులతో రవిని స్తుతింతురు. గంధర్వాప్సరసలు గీత నృత్యములతో ఉపాసింతురు. గ్రామణీ యక్ష-భూతములు భయసంగ్రహమును చేయుదురు. సర్పములు సూర్యుని మోయును. యాతుధానులు (రాక్షసులు) వెంబడింతురు. వాలఖిల్యులు ఉదయము నుండి రవిని సేవించి అస్తమింతురు.

ఈ దేవతలయొక్క వీర్యమును అనుసరించి, తపస్సును అనుసరించి, యోగమును అనుసరించి, సత్యమును అనుసరించి, ధర్మమును అనుసరించి, బలమును అనుసరించియు ఈ సూర్యుడు ఎట్లు తపించునో అట్లే వారియొక్క తేజస్సుచే సిద్ధుడు అగును. ఈ విధముగా వీరు రెండేసి మాసములు సూర్యునిలో నివసింతురు. ఋషులు, దేవగంధర్వులు పన్నగ అప్సరసల గణములు, గ్రామీణులు, యక్షులు, ఎక్కువ రాక్షసులు వీరు తపింతురు. వర్షింతురు. ప్రకాశింతురు. వీచెదరు, సృజింతురు. ఈ లోకములో ప్రాణుల శుభకర్మను తొలగింతురు. పాపాత్ములైన మానవులు శుభమును వీరు హరింతురు. అక్కడక్కడ ప్రచారముల చాలామంది పాపమును తొలగింతురు. వాయువేగము గలవారై యధేచ్ఛాగమనముగల వీరు దివ్యమైన విమానమున ఉండి, పగలును అనుసరించి

సూర్యునితో పాటు తిరుగుదురు. వర్షించుచున్నవారై తపించుచున్నవారై ప్రజలను సంతోషపెట్టుచున్నవారై, ఈ లోకమున మన్వంతరము చివరినుండియు ఈ ప్రాణులను అందరిని రక్షింతురు. భూతభవిష్యద్వర్తమానములో ఎవరుందురో, మన్వంతరములలో అట్టి స్థానాభిమానులకు ఇది స్థానము. ఈ విధముగా పదునాలుగు మన్వంతర సృష్టులలో ఆసప్తకులు నలుదెసల సూర్యునిలో నివసింతురు. రాత్రింబవళ్ళు గ్రీష్మ ఋతువున ఘుర్మమును (వేడిని), హేమంత ఋతువున హిమమును, వర్ష ఋతువున వర్షమును కురియుచు, కాలమును అనుసరించి ఋతువశమున చుట్టు తిరిగిన కిరణములు గలవాడై, సూర్యుడు దేవతలను పితరులను మనుష్యును సంతోషపెట్టును. సూర్యుడు తన సుషు మ్నము అను కిరణముచేత చంద్రుని పెంపొందజేసి అమృతముతో దేవతలను సంతోషపెట్టును. శుక్లపక్షమున దివసక్రమమున నిండుగా అయిన చంద్రుని కృష్ణపక్షమున దేవతలు త్రాగుదురు. కృష్ణ పక్షములో క్షీణావస్థలో ఆ విధముగా త్రాగబడి రెండు కళలు మిగిలిన వాడై కిరణములతో క్షీణించును. అట్టి చంద్రునిలోని ఆ సుధామృతమును సౌమ్యులైన (సోమ సంబంధులైన) దేవతలు త్రాగుదురు. అట్లే పితరులు దానిని కవ్యముగా త్రాగుదురు. సూర్యుడు తన కిరణములచే భూమిపైని జలములను పైకి తీసికొనిపోవును. తరువాత వర్షించిన వృష్టిచే ఫలపాకాంతములైన వరి గోధుమ మొదలగు ధాన్యౌషధులు వృద్ధి చెందును. వానివలన లభించు అన్నపానములచే మానవులు ఆకలిని జయింతురు. దేవతలకు అమృతముతో సగము నెల (15 దినములు) తృప్తి కలుగును. పితరులకు స్వధచేత నలువది అయిదు దినములు తృప్తి కలుగును. సూర్యుడు అన్నముతో మర్త్యులను ఎల్లప్పుడు ధరించును. అదియును తన కిరణములతో ధరించును. సూర్యుడు తన పచ్చని గుఱ్ఱములతో (కిరణములతో) పోవుచు, కిరణములతో జలమును హరించును. విసర్గ (సృష్టి) కాలమున మరల ఆ జలములను వదలును. ఈ విధముగా సూర్యుడు స్థావర జంగమాత్మకమైన జగములను ఎల్లప్పుడు భరించును. సూర్యుడు తన పచ్చని గుఱ్ఱములచే (కిరణములచే) జలములను హరించును. ఆ తరువాత కిరణములచే వేయి (అనంత) ఔషధములుగా జలములను త్రాగును. తరువాత కిరణములు అను గుఱ్ఱములచే మోయబడుచున్నవాడై, సూర్యుడు జలములను వర్షరూపమున వదులును.

ఈ విధముగా సూర్యుడు ఏకచక్రరథముతోను, భద్రములై నాశములేని గుఱ్ఱముల తోను పగటి చివరి వరకు కదలుచు పోవును. సప్తద్వీప సముద్రముల చివరగల భూమిని ఏడు గుఱ్ఱములతోను ఏక చక్రముతోను గూడిన రథముతో అహోరాత్రము సూర్యుడు తిరుగుచుండును. సూర్యుని రథాశ్వములు అశ్వరూపములైన ఛందస్సులు చక్రము వైపుననే

ఉన్నవి. కోరిన రూపమును ధరింప గలవి. ఒక్కమారే రథమునకు పూన్చబడినవి. ఒక పరిమితి (కొలత) లేనివి. మనోవేగము కలవి. పచ్చనివి, నాశనము లేనివి, గోరోచన వర్ణముగలవి, ఈశ్వర స్వరూపము లైనవి. వేదమును పలుకునవి, ఇట్టి ఆ గుఱ్ఱములు సంవత్సరమున ఎనుబది నూర్ల మండలములను తిరుగును. కల్పాది యందు రథమునకు పూన్చబడిన ఆ గుఱ్ఱములు భూతప్రళయము వరకు దివసక్రమమున బాహ్యామండలమును అభ్యంతరమండలమును చుట్టినవై వాలఖిల్యులతో బాటు రాత్రిం బవళ్లు తిరుగును. పక్షులవలె ఆకాశమున వేగముగా పోవు గుఱ్ఱములచే తిరుగుచున్న దినపతియైన సూర్యుడు, వేదాది ప్రసిద్ధములైన శ్రేష్ఠములైన వాక్కులచే మహర్షులచే స్తుతింపబడుచు, గంధర్వులచేతను అప్సరోగణములచేతను గీత నృత్యములచేత సేవింప బడుచుండును.

అట్లే చంద్రుడు వీధిని ఆశ్రయించియున్న నక్షత్రములందు చరించును. అట్లే చంద్రుని కిరణములయొక్క వృద్ధి-క్షయములు సూర్యునివలెను ఉండునని చెప్పుదురు. చంద్రుని రథము మూడు చక్రములుకలది. రెండు చక్రముల ప్రక్కన (మధ్యన) ఉండును. ఆ రథము గుఱ్ఱములతోను, సారథితోను, జలగర్భమునుండి పుట్టినది. నూరు ఆకులుగల మూడు చక్రములతోను, తెల్లని శ్రేష్ఠములైన గుఱ్ఱములతోను కూడి ఉన్నది. సన్ననైనవియు, దివ్యములైనవియు, సంగములేనివియు, మనోవేగము గలవియు అయిన పది గుఱ్ఱములను ఒక్కమారే పూన్చిన ఆ రథము ఆ గుఱ్ఱములు యుగక్షయము వరకును మోసికొని పోవుచుండును. ఆరథము అట్లు సంగ్రహింపబడగా, తెల్ల సర్పము, ఒకేవర్ణముగల ఆ గుఱ్ఱములును శంఖమువలె తెల్లనైన రథమును మోసికొని పోవును. మయువు, త్రిమనము, వృషము, రాజీవలము, హయము, అశ్వము, వామము, తురణ్యము, హంసము, వ్యోమి, మృగము అనునవి. చంద్రుని పది గుఱ్ఱముల పేరులు. అవి పగలు నశించినప్పటి నుండి దేవుడైన చంద్రుని మోసికొనిపోవును. భాస్కరుడు ముందు ఉండగా శుక్లపక్ష ప్రారంభమున చంద్రుడు పితృదేవతలచే చుట్టబడి వెళ్ళు చుండును. దివసక్రమమున ఎల్లప్పుడు తన పురముయొక్క లోపల నింపబడును. కృష్ణ పక్షమున దేవతలచే త్రాగబడిన చంద్రుని పదియైదు దినములు. సూర్యుడు ఒకే కిరణముచే సుషుమ్న అను కిరణములచే ఎల్లప్పుడు నింపి సంతసింపజేయును. సుషుమ్న కిరణములచే దినక్రమమును అనుసరించి చంద్రుని ప్రతిభాగమును సూర్యుడు నింపుచుండును. సూర్యుని సుషుమ్న కిరణముచే శుక్ల పక్షమున నింపి సంతసింపబడుచున్న చంద్రుని కళలు వృద్ధి చెందును. కావున కృష్ణ పక్షమున చంద్రకళలు తగ్గును. శుక్ల పక్షమున చంద్రకళలు వృద్ధిచెంది నిండును. ఈ విధముగా సూర్యుని బలముచే చంద్రుని శరీరము నిండును. ఈ విధముగ శుక్ల

పక్షమున దినక్రమమున చంద్రుడు కళలచే నింపబడుటచే సంతుష్టి చెందింపబడిన వాడై పూర్ణిమయందు తెల్లనివాడై నిండిన మండలముగలవాడై కనబడును. తరువాత బహుళ పక్షమున ద్వితీయ నుండి చతుర్దశివరకు, జలసారమై రసమే, ఆత్మగా కలిగిన జలమయమై సౌమ్యమై సుధామయమైన చంద్రునియొక్క మధువును దేవతలు త్రాగుదురు. సూర్యతేజస్సు చేత అర్ధమాసములో దేవతల భోజనమునకై సౌమ్యమైన (చంద్రసంబంధి యైన) అమృతము సంపాదింపబడును. దానిని పూర్ణిమయందు దేవతలు ఉపాసింతురు. కృష్ణ పక్ష ప్రారంభమున, సూర్యుని ఎదురుగా ఉన్న చంద్రుని యొక్క కళలు ఒక రాత్రిలో సమస్తదేవతల చేతను, పితృదేవతలచేతను మహర్షులచేతను, త్రాగబడుచున్నవై క్రమముగా పురములోపల క్షీణించును. కావున కృష్ణపక్షమున క్షీణించుకళలు శుక్లపక్షమున ఆ కళలను నింపును. ఈ విధముగా దినక్రమము గడవగా దేవతలు చంద్రుని అర్ధమాసం వరకు త్రాగి ఆదేవోత్తములే అమావాస్యను చేరుదురు. పితరులు గూడ అమావాస్యయందు చంద్రుని ఉపాసింతురు. ఆ తరువాత కళాత్మకమైన పదియైదవ భాగము కొద్దిగ మిగలగా అపరాహ్ణమున పితృ గణములచే ఆ మిగిలిన చివరి కళయే ఉపాసింపబడును. చంద్రునిలో చివరగా మిగిలిన కళను రెండు కళల కాలము (60 కాష్టల కాలము) త్రాగుదురు. అది అమావాస్యలో కిరణముల ద్వారా బయలువెడలిన స్వధామృతము. నెలతృప్తికై వారు ఆ స్వధను త్రాగి అమృతమును పొందుదురు. సౌమ్యులు (సోమ సంబంధులు), బర్హిషదులు (దర్భలపై కూర్చొనువారు) అగ్నిష్వాత్తులు, కవ్యులు అనబడువారు వారందరును పితరులే. సంవత్సరములు కవ్యములు. వారు బ్రాహ్మణులచే పంచాబ్దులు అని అనబడిరి. సౌమ్యములు ఋతువులు. మాసములు బర్హిషదులు అనబడిరి. పితృ దేవతలచే త్రాగబడుచున్న చంద్రుని యొక్క పదియైదవ కళ క్షీణము చెందనంతవరకు అది చంద్రుని పదియైదవ భాగము. అప్పుడు అమావాస్యలో చంద్రుని యొక్క చిట్టచివరి భాగము పూరించబడును. పక్ష ప్రారంభమున షోడశి (పదునాఱవ) కళయందు చంద్రుని యొక్క వృద్ధిక్షయము ఉండును. ఈ విధముగా చంద్రుని యందలి క్షయవృద్ధులు సూర్యుని కారణమున కలిగినవి. ఇక తారా గ్రహముల యొక్కయు, రాహువు యొక్కయు రథమును గురించి వినుడు.

చంద్రపుత్రుడైన బుధుని యొక్క రథము జలతేజోమయమై శుభ్రమైనది. గోరోజన వర్ణముగలిగి వాయువేగముగల ఎనిమిది గుఱ్ఱములతో బుధరథము పూన్చబడినది. ఆ రథమున మేఘముతో సమానమై గొప్పవాడైన సారథి ఉండును. ఆ సారథి కవచముతో గూడినవాడు. ఆకర్షణము గలవాడు. దివ్యుడు. అమ్ముల పొదియు, ధ్వజమును ధ్వజ

స్థంభమును గలవాడు. శుక్రుని యొక్క రథము చక్కని శోభగలది. తేజస్సుతో సూర్యునితో సమానమైనది. భూమిలో పుట్టిన అనేక వర్ణములు గల శ్రేష్ఠమైన గుఱ్ఱములతో పూన్చ బడినది. శ్వేతము, పిశంగము, సారంగము, నీలము, పీతము, విలోహితము, కృష్ణము, మరితము, పృషతము, వృష్టి-అను ఈ పది చంద్రుని గుఱ్ఱములు. చంద్రుని యొక్క రథముకూడ ఎనిమిది గుఱ్ఱములు కలదై, బంగారు మయమై శోభించునది. అసంగము లును, ఎఱుపైనవియు, అంతటను పోగలవియు అయిన అగ్నినుండి పుట్టిన గుఱ్ఱములచే చక్కగను వంకరగను చక్రమును అనుసరించి పోవువాడై చంద్రసారథి కదలిపోవు చుండును. తరువాత అంగిరసుడును, విద్వాంసుడును, దేవాచార్యుడును అయిన బృహస్పతి ఎఱ్ఱని గుఱ్ఱములతో బంగారు రథముతో (ఆకాశమున) కదలిపోవును. దివ్యములు, వాయువేగములు అయిన ఎనిమిది గుఱ్ఱములచే పూన్చబడినదై నక్షత్రమున సంవత్సర ముండును. వేగముగలదై ఆ నక్షత్రముతోనే వెళ్ళును. తరువాత శనైశ్చరుడు గూడ, ఆకాశమున పుట్టి చిత్రవర్ణములుగల గుఱ్ఱములతో నల్ల ఇనుప రథమును ఎక్కి మెల్లగా వెళ్ళును. అట్లే రాహువుయొక్క గుఱ్ఱములు మనోవేగము కలిగిన నల్లనైన ఎనిమిది గుఱ్ఱములు అవి తమోమయమైన రాహు రథమునకు ఒక్కమారు పూన్చబడినవై, రథమును లాగికొని పోవును. సూర్యునినుండి బయలు వెడలిన రాహువు పర్వదినములందు (పూర్ణిమ, అమావాశ్యలందు) చంద్రుని చేరును. మరల చంద్రుని నుండి సౌర పర్వములందు (అమావాస్య పర్వదినములందు) సూర్యుని చేరును. ఇక కేతువుయొక్క రథము నకుగల ఎనిమిది గుఱ్ఱములు వాయువేగముగల గింజలులేని వరిపోచ వర్ణముగలవి, పొగవర్ణము గలవి, చిత్రవర్ణముగలవి అనగా కంచర గాడిద ఎరుపుగలవి. ఇవి గ్రహములయొక్క గుఱ్ఱములు రథములతోబాటు నాచే చెప్పబడినవి. అవి అన్నియు వాయువులచేతను కిరణములచేతను బాగుగా కట్టబడినవై ధ్రువుని యందు నిబంధింప బడినవి.

ఇవి వాయవ్యములైన వాయు, కిరణములచేత బాగుగా కట్టబడినవై త్రిప్పబడుచు యోగమును అనుసరించి (తమ చుట్టు తామును) తిరుగును. ఆకాశమున ధ్రువునిచే బద్ధములై చంద్ర-సూర్య గ్రహములు చుట్టు తిరుగును. ఆ జ్యోతిర్గణములు (తన చుట్టు తాను) తిరుగుచున్న ధ్రువుని అనుసరించి తిరుగుచున్నవి. నదియొక్క జలమున నావ నీటితోపాటు మోయబడినట్లు, ఈ దేవాలయములు (గ్రహాదులు) వాయు-కిరణము లచే మోయబడును. ఆకాశమున దేవగణములు అందరిచే చూడబడుచున్నవి. ఎన్ని నక్షత్రములు ఉన్నవో? అన్ని వాయు కిరణములు ఉన్నవి. అవి అన్నియు ధ్రువుని కేంద్రము జేసికొని కట్టబడినవై తాము దిరుగుచు ఆతనిని (ధ్రువుని) గూడ త్రిప్పును. తైలమును

(కందెనను) పీడించు చక్రము తాను తిరుగుచు ఇతరమును (రథాదులను) త్రిప్పునట్లు వాయుబద్ధములైన జ్యోతిస్సులను (చుక్కలను) అంతటను త్రిప్పును. అందువలన జ్యోతి రూపములైన గ్రహనక్షత్రాదులు వాయు చక్రముచే ప్రేరేపింబడినవై కొఱవి చక్రమువలె తాను పరుగెత్తుచునే గ్రహ, నక్షత్రాదులను పరుగెత్తింప జేయునని చెప్పబడినది. ఈ విధముగా జ్యోతి రూపములైన నక్షత్ర తారాగ్రహణములు ధ్రువునియందు నిబద్ధమై యున్నవి. ఆ ధ్రువుడుగ ఆకాశమున తారా ఏ (నక్షత్రమయమైన శింశుమార రూపమని (మొసలి) తెలియతగినది. పగలుచేసిన పాపము రాత్రి ఆ ధ్రువుని చూచిన వదలి పోవును. ఆకాశమున ఈ శింశుమారము (మొసలి)ను ఆశ్రయించిన తారలు ఎన్ని కలవో అన్ని వర్షములు (సంవత్సరములు)అంతకంటే ఎక్కువే, శింశుమారాశ్రితములైన తారలు జీవించును. ఈ శింశుమారము (మొసలి) శాశ్వతమైనది. ఇక విభాగ ప్రకారమైతే శింశుమార రూపధ్రువునకు చెక్కిలిపై భాగము (ఉత్తరాహనువు) ఉత్తానపాదుడు అని చెప్పుదురు. యజ్ఞము క్రింది చెక్కిలి భాగము అనియు ధర్మము శిరస్సు ఆశ్రయించిన దనియు, హృదయమున నారాయణుడు సాధ్యుడై ఉండుననియు, పూర్వ పాదములయందు అశ్వినీ దేవతలు ఇరువురును వరుణుడును సూర్యుడును (ధ్రువ శింశుమారము యొక్క తొడలయందును ఆశ్రయించి ఉందురు అనియు చెప్పబడును. సంవత్సరము దాని శిశ్నము. అవసానమును మిత్రుడు (సూర్యుడు) ఆశ్రయించును. తోకయందు అగ్నియు మహేంద్రుడును ఆశ్రయించి ఉందురు. మరీచి, కశ్యపుడు, తారకలును, శింశుమార రూపుడైన ధ్రువుడును ఈ నాలుగును అస్తమించవు. నక్షత్ర, చంద్ర, సూర్యులును తారాగణములతోగూడిన గ్రహములు అన్నియు ఆకాశమున చక్రీభూతమును (మండలమును) ఆశ్రయించినవై ఉన్ముఖములుగను అభిముఖములుగను (పైకి ముఖములు ఉంచిగాని ఎదురెదురుగ ముఖములు ఉంచిగాని) ఉండును. ధ్రువునిచే (ఆకాశమున) నిలుపబడినవై అన్ని గ్రహ, నక్షత్రములును ధ్రువునికే ప్రదక్షిణము చేయును. ఆ ధ్రువుడు వరుడు, శ్రేష్ఠుడు అందరికంటె పైనున్నవాడు. ఆకాశమున మిక్కిలి పైకి వృద్ధి చెందినవాడు. ధ్రువ అగ్ని కశ్యపులలో ధ్రువుడే శ్రేష్టుడు. ఈతడు ఒక్కడే మేరు పర్వత శిరస్సున తిరుగును. ఈతడు అవాఙ్ముఖుడై (క్రిందు ముఖము గలవాడై) ఈ జ్యోతిశ్చక్రము నంతయు ఎల్లప్పుడు ఆకర్షించును. ఈతడు (ధ్రువుడు) మేరువునకు ప్రదక్షిణముగా పోవును. మేరువును చూచును. (52)

జ్యోతిః సన్నివేశము

శాంశపాయనుడు ఇట్లు చెప్పెను :

ఇది విని మునులు మరల సంశయము గలవారైరి. అపుడు వారు (తమ ప్రశ్నకు)

లోమహర్షణుని మరల సమాధానము అడిగిరి. ఋషులనిరి మీరు ఈ గృహములు ప్రసిద్ధము అనిచెప్పితిరి. అవి ఏవిధముగ దేవగృహములగును. అవి జ్యోతిస్సులు ఎట్లు అగును. తెలుపుడు. ఇది అంతయును జ్యోతిస్సుల యొక్క నిశ్చయ(స్వరూప)మును చెప్పుడు అని అడిగిరి. అపుడు వారి మాటలను విని సూతుడు ఏకాగ్రచిత్తుడు అయ్యెను. ఈ విషయములో జ్ఞాన బుద్ధులైన మహాప్రాజ్ఞులచే చెప్పబడిన సూర్య చంద్రుల పుట్టుకను నేను మీకు చెప్పబోవుచున్నాను. ఇచట దేవగృహములు సూర్యచంద్రుల గృహము ఎట్లు అయ్యెను అను విషయము చెప్పబోవుచున్నాను. తరువాత, ఆకాశమునకు సంబం ధించి నట్టియు, భూతములకు సంబంధించినట్టియు, పృథివికి సంబంధించి నదియునై మూడు విధములైన అగ్నియొక్క పుట్టుకను చెప్పెదను. రాత్రి తెల్లవారగనే అవ్యక్తజన్ముడైన బ్రహ్మ యొక్క మూలప్రకృతిగా ఉన్న ఈ జగము రాత్రి చీకటిచే ఆవరింపబడినది. ఆకాశాదులైన నాలుగు భూతములకు మిగిలినదైన ఈ భూమియందలి అగ్ని పార్థివాగ్ని అనబడును. మొదటిది సూర్యునియందు తపించునది. శుచి అను అగ్ని. వైద్యుతమును (విద్యుత్తు, మెఱుపు) వల్లవచ్చు అగ్నిని కూడ తెలుసుకొనవలెను. వైద్యుతము (మెఱుపువల్ల వచ్చునది) జాఠరము (అన్నజీర్ణకారియై కడుపులో ఉన్న అగ్ని), సౌరము సూర్యునినుండి వచ్చు అగ్ని)అని జలగర్భములైన అగ్నులు మూడు కావుననే నీరు త్రావుచు ఈ సూర్యుడు ఆకాశమున వెలుగుచున్నాడు. విద్యుత్తుతో ఆవేశింపబడిన వృక్ష సంబంధమైన అగ్ని నీటితో చల్లారదు. మానవుల కడుపులో ఉన్న జఠరాగ్నియు నీటితో చల్లారదు. మంటలతో గాని వెలుగుతోకాని ఉన్న అగ్ని (సౌరాగ్ని) పరమమైనది. జాఠరాగ్ని ప్రభావము కలది. మండలాకారమున వేడిలేనిది శుక్లమై (తెల్లనై) ప్రకాశించును.

సూర్యుడు అస్తమించగనే–సూర్యకాంతియొక్క పావు భాగము అగ్నిని ఆవేశించును. కావున రాత్రియందు అది దూరమునుండి ప్రకాశించును. అగ్నియొక్క వేడి మరల ఉదయించు సూర్యుని ఆవేశించును. ఆకారణమున పార్థివాగ్నియొక్క పావుభాగముచే ఈ అగ్ని తపించును. కాంతియు వేడియును సూర్య అగ్నుల తేజస్సులు, అవి పరస్పరముగా ప్రవేశించుటచే పగటిని రాత్రిని సంతసింప చేయును. ఉత్తరపుదైన భూమి సగభాగమునను, దానినుండి ఈ దక్షిణ(అర్ధ) భాగమునను మరల సూర్యుడు ఉదయించుచుండగా, జలము లందు రాత్రి ప్రవేశించును. రాత్రి ప్రవేశమువలన జలములు తామ్ర (ఎఱుపు) వర్ణముకలవి అగును. సూర్యుడు మరల అస్తమించుచుండగా పగలు జలములలో ప్రవేశించును. ఆ కారణమున రాత్రియందైతే తెల్లని జలములు సూర్యునిలో ప్రవేశించును. ఈ క్రమ యోగముతో భూమియొక్క దక్షిణోత్తర అర్ధభాగములందు ఉదయము అస్తమయములలో

నిత్యము పగలు రాత్రియు జలములందు ప్రవేశించును. తపించు (ఎండకాయు)చున్న సూర్యుని అందు కిరణములచే జలమును త్రాగుచున్న పార్థివాగ్ని దివ్యమై విమిశ్రమై శుచి అనబడును. వేయి కిరణములుగల ఆ అగ్ని గుండ్రనిదై కుండవంటిదై శుచి అనుపేరుకలది. అది తన వేయికిరణములచే అంతట (జలమును) తీసికొనును. ఆ శుచి అను దివ్యాగ్ని నదీ జలములను, సముద్ర జలములను, కూప జలములను మెట్టనేల లోని జలములను తీసికొనును. సూర్యుడు హిరణ్య (తేజో) మయుడు. ఆతని వేయి కిరణములు వర్షమును, చలిని, వేడిని స్రవింపజేయును. ఆ రశ్మలలో నాలుగువందల నాడులు చిత్రమూర్తులై వర్షించును. వందనములు (నమస్కార రూపములు) వంద్యములు (నమస్కరింపదగినవి) ఋతువములు (ప్రాచీనములు) నూతనములు, అమృతములు - ఈ పేరులుగల సమస్త కిరణములును వృష్టిని కలుగ చేయునట్టివి. మంచును ప్రవహింప చేయునవి ఆ రశ్మలకంటె వేరైనవి. అవి మూడువందలు. అవి చూడదగినవి, పవిత్రమైనవి, ప్రవహింప చేయునవి. గర్జనములు మెఱుపులు-ప్రవాహములునుకలవి, మంచును సృష్టించునవి, చంద్రులను పేరనున్న రశ్మలు అన్నియు పచ్చని కాంతిగల కిరణములు, శుక్లములు, కకుభములు, గోవులు, విశ్వభృత్తులు అను కిరణములు అన్నియు పేరునకు శుక్లములు. అవి మూడు వందలు. వేడిని సృష్టించునట్టివి. ఆ కిరణములచే (ఆశుచిఅను అగ్ని మనుష్య-పితృ దేవతలను సమానముగా భరించును) ఔషధములచే మనుష్యులను, స్వధచేత పితరులను, అమృతముచేత దేవతలను ముగ్గురిని మూటిచేత సూర్యుడు తృప్తి పొందచేయును. వసంత గ్రీష్మ ఋతువులలో ఆ మూడు రకముల కిరణములచేత సూర్యుడు తపించును. వర్ష ఋతువు నందును శరదృతువు నందును నాలుగింటిచే లాగును. హేమంత శిశిర-ఋతువులలో మూటిచే హిమమును సృజించును. ఓషధులందు బలమును కలుగ చేయును. స్వధచేత పితరులను తృప్తిపరచుచు సూర్యుడు అమరత్వమును, అమృత త్రయమును మూడింటిలో నియమించును. ఈ విధముగా సూర్య సంబంధమైన ఆ వేయి కిరణములు లోకార్థ సాధకములు. ఋతువునుపొంది జలము నందలి శీతోష్ణ ప్రవాహమును కలుగజేయును. ఈ విధముగ తెల్లనై ప్రకాశించు మండలము నకు సూర్య మండలము అని పేరు. నక్షత్రములకు, గ్రహములకు, చంద్రునకును నిలచుటకు కారణమైనది. నక్షత్రములు, చంద్రుడును, గ్రహములును సూర్యుని నుండి పుట్టినవని తెలియవలెను.

చంద్రుడు, నక్షత్రాధిపతి సూర్యుడు గ్రహములకు రాజు, తక్కిన ఐదు గ్రహములు కామరూపులగు ఈశ్వరులు. అగ్ని, ఆదిత్యుడు. (అదితి పుత్రుడు) జలసంభవుడు చంద్రుడు

అనబడినాడు. నారాయణుని బుధగ్రహముగా చెప్పుదురు. జ్ఞానవిదులు ఆతనిని దేవునిగా భావింతురు. రుద్రుని శనిగను తెలియవలెను. అతడు సాక్షాత్తు ధర్మస్వరూపుడు. లోకమున స్వయముగా ప్రభువు శనైశ్చరుడు. మహాగ్రహమై ద్విజశ్రేష్ఠుడై, మెల్లగా పోవువాడు, దేవ-అసురులకు గురువులైన గురు-శుక్రులు. కాంతి కిరణములు కలవారైన మహాగ్రహములు ఈ శుక్ర గురువులు. బ్రహ్మయొక్క పుత్రులు ఆ శుక్ర, గురువులు, దైత్యుడు (దితి పుత్రుడైన రాక్షసుడు) మహేంద్రుడును ఆ శుక్ర, గురులకు అధిపతులుగా నిర్ణయింపబడిరి. సమస్త త్రిలోకములు సూర్యుడు మూలముగాగలవి. ఇందు సందేహము లేదు. దేవ-రాక్షస మనుష్యాత్మకమైన జగమంతయు ఈ సూర్యునిదే అగును.

సర్వలోకములలో వ్యాపించియున్న రవి తేజము రుద్ర, ఇంద్ర, ఉపేంద్ర (విష్ణువు), చంద్రుల యొక్కయు, స్వర్గవాసులైన దేవతలయొక్కయు, కాంతివంతములైన మరి ఇతరముల యొక్కయు సమస్తమైన కాంతియే. సూర్యుడు, సర్వాత్ముడు, సర్వలోకములకు ఈశుడు, సర్వమునకును మూలమైన పరమదైవతమూ ఆతని నుండియే బయలువెడలినది. ఓ బ్రాహ్మణులారా! జపముచే తెలియదగినవాడు, కాంతిమంతమైన గ్రహము, సుగ్రహమైన రవియే. ప్రాణులు సూర్యునియందు మృతి చెందుదురు. మరల మరల పుట్టుదురు. క్షణములు, ముహూర్తములు, దివసములు, (పగళ్ళు), రాత్రులు, పక్షములు, మొత్తమును, నెలలు, సంవత్సరములు, ఋతువులు, యుగములును వీనికి సూర్యుడులేనిచో కాల గణనము ఉండదు. కాలము లేకున్న, వేదములేదు, దీక్షలేదు, ఆహ్నికక్రమము లేదు. ఋతువుల నామవిభాగమును లేదు. ఇక ఫలములకు మూలమైన పుష్పములను ఉండవు. పంటలు పండుటయును ఉండదు. గుణవంతములైన ఓషధిగణములు మొదలైనవి ఉండవు. జలమును ఎండజేసి జగమును తపింపజేయు సూర్యుడులేకున్న స్వర్గమర్త్య లోకములలో దేవతల వ్యవహారములే ఉండవు.

ఆ సూర్యుడే కాలము, అగ్ని, ద్వాదశాత్ముడు (పండ్రెండు రూపములు గలవాడు), ప్రజాపతి (బ్రహ్మ). ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! చరాచరములతో ఉన్న స్వర్గ మర్త్య పాతాళములు అను ఈ మూడు లోకములను ఎండగాసి తపింపజేయును. ఆ ఈ రవియే సర్వ లోకములకు సంబంధించిన తేజస్సులరాశి. వాయువుయొక్క కాంతులచే జగత్తునను, ఉత్తమమైన స్వర్గమునను నిలిచి, ప్రక్కభాగమును, పై భాగమును, క్రింది భాగమును అంతట తపింపచేయును. నేను ఇదివరకే సూర్యుని వేయి కిరణములను గూర్చి చెప్పితిని. వానిలో ఇంకను శ్రేష్ఠములైన సుషుమ్నము, హరికేశము, విశ్వకర్మ, విశ్వశ్రవము, సంపద్వసువు, ఆర్వావసువు, (స్వరాట్) అను ఏడు కిరణములు గ్రహముల జన్మలకు

కారణములు. సూర్యరశ్మి క్షీణించిన చంద్రుని వృద్ధి చెందించుచు, తిర్యక్ (అడ్డముగను) ఊర్ధ్వ (పై భాగమునను) ప్రభావముగలదై సుషమ్న మనబడును. హరికేశమను సూర్యరశ్మి ముందుగనే అనగా తూర్పున ఉండి నక్షత్రము పుట్టుకలకు కారణము అనబడినది. దక్షిణమున విశ్వకర్మ అను సూర్య కిరణము బుధుని వృద్ధి పొందించును. పశ్చిమమున విశ్వశ్రవముఅను సూర్యకిరణము శుక్రగ్రహ జన్మకు కారణమని పండితులు చెప్పుదురు. సంపద్వసువు అను సూర్యరశ్మి అంగారక గ్రహజన్మకు కారణము. ఆరవదైన అర్వావసువను సూర్యరశ్మి గురుగ్రహజన్మకు కారణము. స్వరాట్ అను సూర్యరశ్మి శనిగ్రహమును తృప్తిపరచును. ఈ విధముగ సూర్య ప్రభావమున అనగా సూర్య కాంతిచే గ్రహములు, నక్షత్రములు, తారకలు అన్నియు వృద్ధి చెందును. ఈ విశ్వమును, ఈ జగమును వృద్ధి చెందించును. మరిఅవి క్షీణింపవు. కావున వానిని నక్షత్రములు అందురు.

పూర్వము కిరణములచేత ఈ క్షేత్రములు పడిపోవును. తరువాత సూర్యుడు నక్షత్రత్వ మును పొంది వారి క్షేత్రములను స్వీకరించును. ఈ లోకమున, పుణ్యముచేత తరించిన తారలు పుణ్యము క్షీణింపగా, గ్రహమును ఆశ్రయించుట వలనను, తెల్లవైనందు నను తారలను చీకటినుండి తరింప జేయునవైనందునను తారకలైనవి. దివ్యములైనవియు (ఆకాశమున ఉన్నవియు), భూమిపై ఉన్నవియు రాత్రికిసంబంధించినవియుగా చీకటులను, తేజస్సులను ప్రతినిత్యము ఆదానముచే చీకటుల ఖండించుటను, తేజస్సులను స్వీకరించుటను చేయుటచే సూర్యుడు ఆదిత్యుడైనాడు. తేజస్సును నీటిని (ఎండచే) కదిలింప చేయుటవలన సూర్యుడు సవిత అనబడును. 'చంద్ర' అను శబ్దము బహ్వార్థకము, 'ఛది' 'ధాతువు' 'హ్లాదనము' అనగా సంతోషమును తెలుపుతనము అమృతత్వము శీతత్వము. ఈ అర్థములలో భావింపబడును. సూర్యచంద్రుల యొక్క మండలములు దివ్యములు అనగా ఆకాశమున ఉండునవి, ప్రకాశవంతములు, ఆకాశమున పోవునవి. మండుచున్న తేజముతో నిండినవి. తెల్లనివి, గుండ్రని కుండతో పోలినవి, మంగళకరము లైనవి. అందులో చంద్రుని మండలము ఘనీభూతమైన జలరూపము అని చెప్పబడును. సూర్యుని మండలము ఘనీభూత తేజోరూపము. తెల్లనిది. సమస్త దేవతలు ఈ స్థానములందు అంతటను ప్రవేశింతురు. అన్ని మన్వంతరములలోను నక్షత్ర సూర్యగ్రహములను ఆశ్రయిం తురు. అవి దేవగృహములే. ఆయా దేవతల పేరులుకలవి అగును. సౌరమండలము సూర్యుడు ప్రవేశించిన స్థానము. చంద్ర మండలము, చంద్రుడు ప్రవేశించిన స్థానము. శుక్రమండలము శుక్రుడు ప్రవేశించిన స్థానము. ఆతడు పదునాఱు వెలుగులుగలవాడైన ప్రతాపవంతుడు. గురుమండలము గురువు ప్రవేశించిన స్థానము. అంగారక మండలము

అంగారకుడు ప్రవేశించిన స్థానము, శని మండలము శనిదేవుని స్థానము. సూర్య కిరణ సంయోగముల వలన తక్కిన గ్రహములు అన్నియు వెలుగుగలవి అగును. సూర్యుని విష్కంభము (విరివి) (వృత్త వ్యాసము) తొమ్మిదివేల యోజనములు అని చెప్పబడినది. ఆ సూర్యుని విస్తారము, మండలమున్ను పైదానికి మూడింతలు. సూర్యుని విస్తారమున కన్న చంద్రుని విస్తారము రెండింతలు. రాహువు యొక్క విశాలమైన స్థానము చీకటి మయముగా నిర్మింపబడినది. అది పర్వములలో సూర్యుని నుండి వెడలి చంద్రుని చేరును. చంద్రుని నుండి సూర్యుని చేరును. మరల ఇంకొక వరుసలో చంద్రుని చేరును. ఆకాశ కాంతిచే ప్రేరేపించును గాన స్వర్భానువు అని రాహువు పిలువ బడుచున్నాడు. చంద్రుని యొక్క పదునారవ భాగము శుక్రుడని విధింపబడినది. ఈ పదునారవ భాగము వ్యాసము నుండిగాని, మండలమునుండిగాని, యోజనము చివరినుండిగాని ప్రామాణికమని తెలుసు కొనవలెను. శుక్రునికంటె గురువు పావుతక్కువవాడు. గురువుకంటె కుజ, శనులు ఇద్దరును పావుతక్కువవారు. విస్తారము నుండిగాని, మండలము నుండిగాని, కుజ శనులకంటె పావుతక్కువవాడు. బుధుడు, తారా నక్షత్ర రూపములై శరీరము (ఆకారము) దాల్చిన వన్నియు విస్తారము ఉండిగాని, మండలము నుండిగాని బుధునితో సమతుల్యములు. తత్త్వజ్ఞాని సామాన్యముగా చంద్రయోగములును, విద్యా వృక్షములును, తారా నక్షత్రరూపములును పరస్పరము తక్కువగా చెప్పును. రెండువేల మూడు వందల నలుబది ఐదు వందల (2,34,500) యోజనములు పరస్పరముగ పూర్వాప నికృష్టములైనవి (తక్కువైనవి) మండలములు. సగము యోజనములు తక్కువవి కూడ గలవు. అంతకు తక్కువవి లేవు. వానికి పైననుండి దూరముగా పోవునట్టి మూడు గ్రహములు శని, గురువు, వక్రగ్రహమున్ను ఇవి మెల్లగా చరించునవి. వాని కంటె క్రింద వేరైనవి నాలుగు మహాగ్రహములు. అవి సూర్యుడు, చంద్రుడు, బుధుడు, శుక్రుడును అనునవి. ఇవి శీఘ్రముగా(తొందరగా)చరించు గ్రహములు. ఎన్నికోట్ల తారకలు ఉన్నవో అన్ని కోట్ల నక్షత్రములు అంతటను కలవు. వానికి వీధుల నియమముగలదు. ఈ రీతిగ నక్షత్రమార్గము వ్యవస్థీకరింపబడినది. సూర్యుని యొక్క నీచ–ఉచ్చభావములలో అయన క్రమమును అనుసరించి, ఆ నక్షత్ర వీధులందే గమనముండును. పర్వములందు చంద్రుడు ఉత్తరాయణ మార్గమునందు ఉన్నపుడు, బుధుడు బుధ స్థానమును, రాహువు రాహు స్థానమును పట్టుకొని యుందురు. పుణ్యాత్ములయొక్క నక్షత్రములు అన్ని నక్షత్రములలో ప్రవేశించును. పుణ్యాత్ములయొక్క గ్రహములన్నియు ఈ అన్ని జ్యోతిస్సులందును ప్రవేశించును. బ్రహ్మచే నిర్మింపబడి, కల్పాదియందు ఏర్పడిన ఈ స్థానములు భూత ప్రళయము వరకును ఉండును. అన్ని మన్వంతరములలోను, దేవాలయములును, అభిమానులు, భూతప్రళయము వరకు ఉందురు.

భావ్యాభావ్యులై (ఉండతగినవారు, ఉండతగనివారునై) గడచిపోయిన సురా సురులతో పాటు దేవతలు గడచిన వారగుదురు. వర్తమానులైన తమ సురులతో పాటు దేవతలు గడిచిన వారగుదురు. వర్తమానులైన తమ సురులతోబాటు వారి స్థానములును (దేవ స్థానములు) ఉండును. ఈ మన్వంతరమున గ్రహములు వైమానికులు అనబడినవి. వైవస్వత మన్వంతరమున అదితి పుత్రుడైన వివస్వంతుడు సూర్యుడు. త్విషిమంతుడై (కాంతి మంతుడై) ధర్మపుత్రుడైన సోమదేవుడు వసువనబడినాడు. భృగువంశీయుడై దేవుడైన శుక్రుడు రాక్షసరాజ గురువు. గొప్ప తేజస్సుగలిగి దేవుడైన అంగిరసుని పుత్రుడగు ఆంగిరసుడు (గురువు) దేవగురువు అనబడినాడు. మనోహరుడైన బుధుడు త్విషి (కాంతి కిరణ) పుత్రుడు అనబడినాడు. వికల్పము నుండి అగ్ని పుట్టెను. యువకుడైన ఈ అగ్ని అంగారకుడు. నక్షత్ర–ఋక్షములతో పోవువారు దాక్షాయణులు అనబడిరి. సింహికా పుత్రుడైన రాహువు భూతములను సంతసింపజేయు రాక్షసుడు. వీరందరు చంద్ర ఋక్ష గ్రహసూర్యులందు అభిమానులుగా చెప్పబడిరి.

ఇక పై స్థానములు చెప్పబడినవి. ఆ స్థానములు గల దేవతలు గూడ చెప్పబడిరి. సహస్ర కిరణుడైన వివస్వంతుని యొక్క (సూర్యుని యొక్క) స్థానము శుక్లము (తెల్లనిది) అగ్నిమయము. వేయి కిరణములుగల సూర్యుని కాంతియొక్క స్థానము జలమయము. తెల్లనిదిగా ఉండును. తరువాత నల్లనిది, మనోహరుడైన పంచరశ్మియొక్క గృహము (ఐదు కిరణములయొక్క గృహము)అని చెప్పబడును. శుక్రునియొక్క స్థానముకూడ జల మయము. అది షోడశరశ్మి అనగా పదునాఱు కిరణములు కలది. తొమ్మిది కిరణములుగల యువకుడైన అంగారకునియొక్క స్థానము జలమయము. తొమ్మిది కిరణములుగలది. పండ్రెండు కిరణములుగల బృహస్పతి (గురువు) యొక్క స్థానము జలమయము, విశాల మైనది, పచ్చనైనదియుగా ఉండును. ఎనిమిది కిరణములుగల బుదుని యొక్క గృహము (స్థానము) జలమయమై, నల్లనైనది. రాహువు యొక్క స్థానము చీకటినిండినదై, ప్రాణులను పీడించు స్థానము. తారకలు అన్నియు జలమయములై, ఒకే కిరణముకలవి. పుణ్యకీర్తులకు ఆశ్రయమైనవి, రంగులో ఎక్కువ తెల్లనివి. ఘనీభవించి జలరూపములుగా ఉండును. కల్పాదిలో వేదములచే నిర్మింపబడినవి. ఎత్తైనందున ప్రకాశించు కిరణములచే తొందరగా కనబడును. అట్లే దక్షిణమార్గమునందున్న వాడై వీధిని ఆశ్రయించినవాడు. అట్లే కనబడును.

భూమియొక్క రేఖతో ఆవరింపబడిన సూర్యుడు పూర్ణిమ అమావాస్యలందు కనబడడు. కాలానుగుణముగా అస్తమించును. అందువలన ఉత్తర మార్గమందున్న చంద్రుడు అమా వాస్యలనాడు కనడబడడు. కాని దక్షిణ మార్గమందు ఉన్న చంద్రుడు నియమముగా

కనబడడు. విషువద్దినములందు (రాత్రి, పగలు సమముగా నున్న దినములందు) సూర్య చంద్రులు ఇద్దరును, నక్షత్రముల గతియోగముచే సమాన కాలమున అస్తమయమును సమానకాలమున ఉదయమును కలవారు అగుదురు. ఉత్తర మార్గములందు అస్తమ ఉదయములందు భేదములు లేక జ్యోతిశ్చక్రము (నక్షత్ర చక్రమును) అనుసరించుదురు. దక్షిణాయన మార్గమందున్నప్పుడు సూర్యుడు అన్ని గ్రహములకంటె క్రిందుగా చరించును. చంద్రుడు విశాల మండలము చేసికొని సూర్యునకు పైనచరించును. సమస్త నక్షత్ర మండలము చంద్రుని కంటె పైగా చరించును. నక్షత్రముల కంటె పైన బుధుడు, బుధుని కంటె పైన గురువును, గురున కంటె పైన శనియు, శనికంటె పైన సప్తర్షి మండలమును, ఆ సప్తర్షి మండలమునకంటె పైన, ధ్రువుడును నిలువరింపబడి ఉన్నారు. ఊర్ధ్వభాగమున తారాగ్రహముల అంతరములు (మధ్య దూరములు)రెండులక్షల యోజనములలో యథాక్రమముగ ఉండును. చంద్ర సూర్యులను ఆకాశమున గ్రహములు, దివ్య తేజస్సుతో, నియమక్రమము అనుసరించి నిత్య నక్షత్రములతో కూడును. అచటికి వెడలును. గ్రహములు నక్షత్రములు సూర్యుడును నీచలోను, ఉచ్ఛలోను, మార్దవములోను ఉన్నవారై వారి కలయికలోను విడువడినప్పుడును ప్రజలను ఒక మారుచూతురు. వీరు పరస్పరముగా (ఒకరి స్థానమున మరొకరుగా) ఉందురు. పరస్పరముగా కలిసి ఉందురు. పండితులు వారి సంయోగమును సంకరముగ భావింపరాదు. సహయోగము అనియే తెలియవలెను అని ఓ ముని బ్రాహ్మణులారా! ఈ విధముగా భూమిపై గ్రహనక్షత్ర సూర్యులున్న జ్యోతిస్సుల యొక్కయు, ద్వీపముల యొక్కయు, సముద్రముల యొక్కయు, నదులయొక్కయు, పర్వతముల యొక్కయు అట్లే వర్షములయొక్కయు, సన్నివేశము మీకు నాచే చెప్పబడినది. ఈ గ్రహములే పూర్వము నక్షత్రములందు ఉండి ఉదయించిరి. చాక్షుష మన్వంతరమున వివస్వంతుడును. అదితి పుత్రుడును, గ్రహములలో మొదట గ్రహమైన, సూర్యుడు విశాఖా నక్షత్ర గణమున పుట్టెను. త్విషిమంతుడు (కిరణవంతుడు) ధర్మ పుత్రుడును. సోముడును, విశ్వావసువును, శీతరశ్మియు అయిన చంద్రుడు, కృత్తికా నక్షత్ర గణమున పుట్టెను. పదునారు కిరణములు గలవాడును, భృగు పుత్రుడును, సూర్యుని తరువాత తారా గ్రహములలో శ్రేష్ఠుడును అయిన శుక్రుడు పుష్యమి నక్షత్రమున పుట్టెను. ఆంగిరస పుత్రుడును. పంద్రెండు కిరణములు గలవాడును. జగద్గురువైన బృహస్పతి గ్రహము, ఫల్గునీ నక్షత్ర గణములు అన్నింటను బుట్టినాడు. అంగారక గ్రహము తొమ్మిది కిరణములు గలిగి, ప్రజాపతిసుతుడై, పూర్వాషాఢా నక్షత్ర గణమందుబుట్టెను. సూర్యపుత్రుడైన శనేశ్వరుడు ఏడు కిరణములు గలిగి, రేవతీ నక్షత్ర గణమందుపుట్టెను. రోహిణీ నక్షత్ర గణమందు

రాహుకేతు గ్రహములు పుట్టిరి. వీనిని తారలుగను (నక్షత్రములుగను) గ్రహములుగను తెలుసుకొనవలెను. శుక్రాది గ్రహములు జన్మ నక్షత్ర పీడలందు పై గుణమును పొంది నందున గ్రహభక్తులగువారు ఆ దోషముతో స్పృశింపబడుదురు.

ఈ గ్రహములు అన్నింటికిని ఆదియైనవాడు ఆదిత్యుడు. తారాగ్రహములకు శుక్రుడు మొదటివాడు. కేతువులకు ధూమకేతువు మొదటివాడు. నలుదిక్కుల విభజింపబడిన గ్రహములకు కాలరూపుడైన ధ్రువుడే మొదటివాడు. నక్షత్రములకు ధనిష్ఠా నక్షత్రము మొదటిది. అయనములకు ఉత్తరాయణము మొదటిది. ఐదేండ్లకు సంవత్సరము మొదటిది. ఋతువులకు శిశిరఋుతువు మొదటిది. మాసములకు మాఘమాసము మొదటిది. పక్షములకు శుక్ల పక్షము. తిథులకు ప్రతిపత్తు అనగా పాడ్యమి మొదటిది. రాత్రింబగళ్లకు పగలును మొదటివిగా చెప్పబడినవి. ముహూర్తములలో రుద్రదేవతాక మైన ముహూర్తము మొదటిది. కనుల రెప్పపాటు కాలము కాలమునకు మొదటిదని కాలవేత్తకు సమ్మతమైనది. ధనిష్టా నక్షత్రము మొదలు, శ్రవణా నక్షత్రము వరకు జంట పంచవార్షికము అగును. అది సూర్యుని గతి విశేషముతో చక్రమువలె తిరుగును. కావున సూర్యుడు కాలము అనబడినాడు. అందుచే సూర్యుని ఈశ్వరునిగా తెలుసుకొనవలెను. సూర్యుడు నాలుగు విధములైన (పృథివి, జల, అగ్ని, వాయు రూపములైన) భూతములను పనులలో ఉంచు వాడును పనుల నుండి తీసివేయువాడును అగును. ప్రయోజన నిశ్చయమువలన ఈ జ్యోతిస్సుల సన్నివేశమే లోక వ్యవహారమునకై, ఈశ్వరునిచే నిశ్చయింపబడినది. శ్రవణముచే పుట్టిన ఇతడు ధ్రువునిలో సంక్షిప్తుడైనాడు. చివరలలో అంతట వ్యాపించినవాడై వృక్షకారునిగా ఉన్నవాడు. బుద్ధిపూర్వకముగా భగవంతునిచే కల్పాదిలో ఈ విధముగా చెప్పబడినాడు. ఆతడు ఆశ్రయము కలవాడు. అభిమాని, అందరికిని జ్యోతిః స్వరూపుడు. విశ్వరూపుడు, వీడు ప్రధానము (ప్రకృతి) యొక్క అద్భుత పరిణామ రూపమైనవాడు. మను ష్యులకు గ్రహనక్షత్రాదుల రాకపోకలను నిజముగా మాంస నేత్రములతో చూచి లెక్కించి చెప్పు టకు సాధ్యపడదు.

పండితుడు వేద ప్రమాణము వల్లను, ప్రత్యక్ష ప్రమాణము వల్లను, అను మాన ప్రమాణము వల్లను, హేతువువల్లను నిపుణముగా భక్తితోను పరీక్షించి శ్రద్ధవహించి లెక్కిం పవలెను. జ్యోతిర్గణమును విచారించునపుడు, కన్ను శాస్త్రము, జలము, వ్రాయ తగినది, గణితములను ఈ అయిదింటిని బుద్ధి సత్తములు హేతువులుగా తెలియవలెను. (53)

నీలకంఠస్తవము

ఋషులు అనిరి :

ఓ మహాకాంతివంతుడా! సూతా! బ్రహ్మ నుండి ఏకాలములోను, ఏ దేశములోను ఇట్టి పుణ్యమైన ఆఖ్యానము జరిగినది. దీనిని జరిగినది జరిగినట్లు మాకు చక్కగా జెప్పుడు.

సూతుడు అనెను :

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! వేయియేండ్ల యాగమందు జగత్తునకు ఆయువైన వాయువుచే చెప్పబడుచుండగా పూర్వము నేను విన్నది విన్నట్లు చెప్పెదను వినుడు. దేవదేవుడైన శివుని కంఠమునకు నలుపు ఎందులకో నేను చెప్పెదనువినుడు. శైలరాజైన హిమాలయము యొక్క ఉత్తరమున సరస్సులును, నదులును, మడుగులును కలవు. పవిత్రమైన ఉద్యాన ములలోను, తీర్థములతోను, దేవాలయములతోను ఎత్తైన పర్వత శిఖరములలోను గుహల లోను వాని ఉపవనములలోను, దేవభక్తులు, మహాత్ములు స్తుతింపబడిన వ్రతములుచేయు మునులు అచ్చటచ్చట యథావిధిగా మహాదేవుని స్తుతింతురు. ఋగ్వేద, యజుర్వేద, సామవేదములతోను, నృత్యములతోను, గీతములు, మొదలగు పూజలతోను, 'ఓం'కారము తోను నమస్కారములతోను సదాశివుని అర్చింతురు. జ్యోతిశ్చక్రము బాగుగా తిరుగగా సూర్యుడు మధ్యమున వ్యాపించినవాడు నిశ్చయాత్ములై దేవతలందరు ఆ కథను వినుటకై కూర్చుందురు. తరువాత నియమముతో ఉండుటచే ప్రాణశేషులై ఉండిరి. వాయువు 'నమస్తే నీలకంఠాయ' అనెను. అదివినిన వారిలో ఆత్మభావము గలవారును, గొప్ప వ్రతములు చేయువారును, సూర్యునితోడుగా చరించువారును వాలఖిల్యులు అను ప్రసిద్ధి చెందిన మునులు ఉండిరి. వారు ఎనుబది ఎనిమిది వేలమంది. ఊర్ధ్వ రేతస్కులు కావున ఆకులు, జలము, వాయువులను మాత్రమే భుజించువారై వాయువును ఇట్లు ప్రశ్నించిరి.

ఋషులు పలికిరి :

ఓ వాయు పండితోత్తమా! ఓ పుణ్యకార శ్రేష్టులారా! నీవు 'నీలకంఠ' అన్నది రహస్యమైనదియు, పవిత్రమైన వానిలో పుణ్యమైనది. కావున, ఓ వాయుదేవా! పార్వతీ పతియైన శివుని యొక్క కంఠమందలి నలుపునకు కారణమేమో! నీ అనుగ్రహమున వినదలచితిమి' విశేషించి నీముఖము నుండియే చక్కగా తెలుసుకొనతలచితిమి. నీవు చెప్పిన మాటలు సారముతో కూడిన అర్థములు గలవై వెలువడినంత వరకు వినదలచితిమి. వాయువు మానవుని వర్ణోత్పత్తి స్థానములందు ఉండగా మాటల ప్రక్రియ చక్కగా నడుచు చుండును. ఓ వాయుదేవా! మానవులలో నీ వల్లనే మొదట జ్ఞానము, తరువాత ఉత్సాహ

మును కలుగును. నీవు కదులుచుండగనే తక్కిన వర్ణముల ఉచ్చారణలు జరుగును. వాక్కులు బయలువెడలక, వెనుకకే వెళ్ళినప్పుడు దేహబంధములు (దేహమునకున్న అవయవ బంధములు) దుర్లభములు అగును. ఓ వాయుదేవా! అచటగూడ నీ చక్కని ఉనికిగలదు. నీవు అంతట ఉండువాడవు గదా! నీవుతప్ప అంతటవుండు దేవుడు మరొకడు లేడు. ఈ నీవు జీవలోక మంతటను ప్రత్యక్షముగా ఉన్నావు. నీవు బ్రహ్మదేవుని తెలిసిన వాడవు. మనోనాయకుడైన ఈశ్వరుడు గూడ నీకు తెలియును. కావున ఈశ్వరుని కంఠదేశ మున కలిగిన రూపవికారమైన నలుపుతనము దేనివల్ల జరిగినది? అని అడిగిన భావి తాత్ములైన ఆ ఋషుల మాటవినిన తరువాత లోకనమస్కృతుడు, మహాతేజస్వి అయిన వాయువు ఇట్లు మారుపలికెను.

పూర్వము కృతయుగమున బ్రహ్మ మానసపుత్రుడును, బ్రాహ్మణుడును, వేద నిర్ణయతత్పరుడును, ధర్మాత్ముడు అయిన వసిష్ఠుడను మహర్షి ఉండెను. ఆతడు మయూర వాహనుడును, మహిషాసురుని భార్యల మాంగల్యచిహ్నమైన కంటికాటుకను దొంగిలించిన వాడును, కృత్తికా పుత్రుడైన కుమారస్వామిని. (దేవ) మహాసేనుడు, మహాత్ముడు మేఘ గర్జనమువంటి కంఠధ్వని గలవాడును, ఉమాదేవియొక్క మనస్సుకు సంతోషము కలిగించు బాలక రూపమును ధరించినవాడును, క్రౌంచ పర్వత జీవితమును హరించువాడును. పార్వతీ హృదయనందనుడును, మహాబలుడును అయిన కార్తికేయుని (కుమారస్వామి) తో అడుగుచున్నాడు.

వసిష్ఠుడు భక్తితో :

"హరుని కుమారుడవగు నీకు నమస్కారము. ఉమాదేవి యొక్క గర్భస్వరూపుడవైన నీకు నమస్కారము. అగ్నియొక్క గర్భస్వరూపుడవైన నీకు నమస్కారము. గంగాగర్భ స్వరూపుడవైన నీకు నమస్కారము. రెల్లుగడ్డిగర్భస్వరూపుడవైన నీకు నమస్కారము. కృత్తికానక్షత్ర గణస్వరూపులైన షట్కృత్తికల సుతుడవైన నీకు నమస్కారము. పంద్రెండు నేత్రములు గల నీకు, ఆరు ముఖములుగల నీకు నమస్కారము. శక్తిఅను ఆయుధమును చేత ధరించిన నీకు నమస్కారము. దివ్యమై ఘంటధ్వజముగాగల నీకు నమస్కారము" అని ఈ విధముగా మహాసేనుడగు కుమారస్వామిని స్తుతించి ఆ నెమలి వాహనగాగల కుమారస్వామిని వసిష్టుడు. "శుభ్రమైన కాటుక కాంతిగలిగి కనబడుచున్న ఈ (నల్లని) వర్ణము, మల్లెపూవుతోను చంద్రునితోను సమానమైన శివుని కంఠమున ఎందుకు పుట్టినది? ఈ విషయములకును ఆప్తుడును, భక్తుడును, ఇంద్రియదమనశక్తి కలవాడనై నిన్ను అడుగుచున్న నాకు తెలియచేయుము మంగళముతో కూడినదియు, పవిత్ర మైనదియు,

పాపముల నశింప జేయునదియు అయిన ఈ నీలకంఠ కథను పూర్తిగా నా ప్రీతికై నీవే చెప్పగల సమర్థుడవు" అని అడిగెను. అటు తరువాత, మహాత్ముడైన వసిష్ఠుని యొక్క మాటనువిని మహాతేజస్వియై, రాక్షస బలముల చంపిన కుమారస్వామి ఓ ప్రవక్తలలో శ్రేష్ఠా (వశిష్ఠ) నేను చెప్పు మాటలు వినుము. మహాత్ముడైన శివునకు పార్వతితో జరిగిన సంవాదమును పూర్వము ఉమాదేవియొక్క ఒడిలో కూర్చొని నేను విన్నది విన్నట్లుగా చెప్పెదను వినుము" అని పలికెను. ఇంకను చెప్పుచు...

కైలాస శిఖరము రమ్యమైనది. అనేక ధాతువులచే విచిత్రమైనది. అనేక వృక్షల తలచే వ్యాపించినది, చక్రవాక పక్షులతో ప్రకాశించినది, తుమ్మెదల గానములతో నిండినది. జడివానల చప్పుడులతోను, జలధారా పాతములతోను ప్రతిధ్వనితమైనది, మదించిన క్రౌంచపక్షుల యొక్కయు, నెమళ్ళయొక్కయు నాదములతో ప్రతిధ్వనించిన గుహలు గలది, అప్సరోగణములతో వ్యాపించినది, కిన్నరులతో ప్రకాశించినది, జీవం జీవకములు అనెడు వృక్షముల యొక్కయు, జాజి వృక్షముల యొక్కయు తీగలచే ప్రకాశించినది, కోకిల ధ్వనులచే మధురమైనది, సిద్ధ-చారణులు నివసించినది, గోవుల అంబారవములచే ఒప్పనది, క్రిందిగా మేఘగర్జన ధ్వనులు కలది? వినాయకుని భయముచే ఉద్విగ్నమైనది. ఏనుగులతో కూడిన గుహలు కలది, వినసొంపైన వీణావాదన ధ్వనులతో కూడినది, ఊయలలో ఊగు జనసమూహము గలది, స్త్రీ సంఘములు నివసించినది, ధ్వజములతో వ్రేలాడిన గంటల నాదములునిండినది. ముఖములతోను, మద్దెలలతోను, వాద్యవిశేషముల తోను, బలవంతులు చేతులు చఱచుటలతోను, ఆటలలో చరించు ధ్వనులతోను నిండిన భవనములు గలది. నవ్వులతోను, భయము పుట్టించు వికటములైన ముఖములతోను, విచిత్రములైన దేహ గంధములతో పీడింపబడిన గణపతులతోను, వజ్రములు, స్ఫటికముతో నిర్మింపబడిన మెట్లపైని, చిత్రములైన పట్టికలుగల శిలల పై భాగములతోను చుట్టబడినది, పులిముఖములు గలవారితోను, సింహముఖములు కలవారితోను, ఇంకను ఇతరములైన ఏనుగు గుఱ్ఱముల ముఖములు గలవారితోను, పిల్లి ముఖము గలవారితోను, క్రూరములైన నక్కల ఆకారముగల వారితోను, పొట్టి వారితోను, పొడుగు వారితోను బక్కచిక్కిన వారి తోను, బలిసిన వారితోను, వ్రేలాడు పెద్ద పొట్టలుగల వారితోను, పొట్టి పిక్కలుగలవారి తోను, వ్రేలాడు పెద్ద పెదవులుగలవారితోను, తాడిచెట్టువంటి పెద్దవైన పిక్కలుగలవారి తోను, గోవు చెవులవారితోను, ఒక చెవిగలవారితోను, పెద్ద చెవులు గలవారితోను, చెవులే లేనివారి తోను, అనేక పాదములు గలవారితోను, పెద్ద పాదములు గలవారితోను, పాద ములే లేనివారితోను, పెక్కుతలలు గలవారితోను, పెద్దతలలు గలవారితోను, ఒకే

తలగలవారితోను, తలయేలేని వారితోను, పెక్కు కన్నులు గలవారి తోను, పెద్ద కన్నులుగల వారితోను, ఒకే కన్నుగలవారితోను, కన్నులేలేని వారితోను, ఈ విధముగా ఉన్న మహా యోగి భూతులైన వారిచే భూతపతియైన శివుడు చుట్టబడి ఉన్నాడు. అపుడు, పరిశుద్ధము లైన ముత్యములు, మణులు వీనిచే అలంకరింపబడి బంగారు మయమైన మనోహరమైన శిలాతలమున సుఖముగా కూర్చొని ఉండి మన్మథ శరీరమును దహించిన శివునితో గిరిరాజపుత్రియైన...

పార్వతి :

"భూతభవిష్యత్తులకు ప్రభువై, వృషభధ్వజుడవైన ఓ భగవంతుడవైన మహాదేవా! నీ కంఠమున కమలముతో సమానమైనదియు, అంతగా మసకగానిదియునై, అంతగా స్పష్టము గానిదియు, నల్ల కాటుక సమూహముతో పోలినదియు కాని ఓ సంహారకా! దేవా! నీ కంఠమున ప్రకాశించుచున్నది. ఇది యేమి ? ఓ ఈశ్వర! నీ కంఠమునందుగల నలుపునకు కారణమేమి? ఇది అంతయు న్యాయానుసారముగ చెప్పుడు. నాకు చాలా కుతూహలముగా ఉన్నది" అని అడుగగా అంత పార్వతిప్రియుడైన శివుడు ఆపార్వతి మాటను విని మంగళముతో కూడిన కథను చెప్పసాగెను. "పూర్వము దేవదానవులచేత పాల సముద్రము మథింపబడుచుండగా దానిలో మొదట ప్రళయకాలాగ్నితో సమానమగు కాంతిగల విషము బయలువెడలినది. దానిని చూచి, దేవసంఘములును, రాక్షసులును విషాదముతో కూడిన ముఖములు గలవారై, అందరును బ్రహ్మ సమీపమునకు వెళ్ళిరి. మహాతేజస్వియైన బ్రహ్మ, భయపడిన దేవగణములను చూచి, "ఓ మహాభాగులారా! మీరెందుకు భయపడి ఉద్వేగము చెందిన చిత్తములు గలవారైతిరి? నేను మీకు ఎనిమిదింతల ఐశ్వర్యమును కల్పించి ఇచ్చితిని. మీరే కారణముచేత ఐశ్వర్యములు పోయిన వారైతిరి! మీరు ముల్లోకములకు ఈశ్వరులు. మీరందరు జ్వరము లేనివారు నేను సృజించిన సృష్టిలో నా ఆజ్ఞను తిరస్కరించిన వాడులేడు. అందరు విమానములలో పోవువారు. అందఱును స్వేచ్ఛగా చరించువారు. ఆధ్యాత్మికమునందును, ఆత్మకు సంబంధించిన విషయమునందును) ఆధిభౌతికమునందును (పాంచభౌతికముగా శరీరమునకు సంబం ధించిన విషయము నందును, ఆధి దైవికమునందును (దైవవశమున తటస్థించిన విషయమునందును) మీరు కర్మ విపాకముతో ప్రజలను ప్రవర్తింపజేయుదురు. కావున, సింహముతో పీడింపబడిన లేళ్ళవలె మీరెందులకు భయపీడితులు అగుచున్నారు? మీ దుఃఖమేమి? దేనిచేత మీకు సంతాపము గలిగినది? మీకు భయము ఎక్కడి నుండి వచ్చినది? ఇది అంతయు న్యాయమును అనుసరించి శీఘ్రముగా తెల్పుడు" అనెను.

తరువాత మహాత్ముడైన బ్రహ్మయొక్క మాటను విని ఋషులతోబాటు దేవతలు దైత్యేంద్రులు, దానవులును "ఓ మహాత్మా ! దేవదానవులచే పాల సముద్రము మథింపబడు చుండగా కాలసర్పముతోను, తుమ్మెదలతోను సమానమైనదియు నీలమేఘముతో సమాన మైనదియు, ప్రళయకాల సంవర్తాగ్నితో సమానమైన కాంతిగలదియునై ఘోరమైనదైన విషము బయలు వెడలినది. అది కాలమృత్యువువలె బయటకు వచ్చినది. యుగాంతకాల సూర్యకాంతి గలది. ముల్లోకముల నశింపజేయు సూర్యుని వంటిది. అంతటను వెలుగులను విరజిమ్ముచున్నది. ఆ విధముగా కాలాగ్నికాంతితో పైకి లేచుచున్న విషముచే తెల్లని శరీరముగల జనార్దనుడైన విష్ణువు దహింపబడి నల్లని వాడయ్యెను. ఎఱుపు, తెలుపు శరీరముగల ఆ విష్ణువును నల్లనైనవానిగా చూచి దేవతలము అందరము భయపడిన వారమై నిన్నే శరణుచొచ్చితిమి" అనిచెప్పగా దేవరాక్షసుల మాటలను విని మహాతేజస్వియైన బ్రహ్మలోకముల హితమును గోరి బ్రహ్మ ఇట్లని మారుపలికెను. ఓ సమస్త దేవతలారా! ఋషులారా! మునులారా! వినుడు. పాల సముద్రము మథింప బడుచుండగా మొదట పుట్టిన ప్రళయకాలాగ్ని సమమై, కాలకూటమని ప్రసిద్ధి చెందినది. అది పుట్టినంత మాత్రముననే దానిచే, విష్ణువు నల్లగా మారినాడు. ఆ విషమును విష్ణువు, నేనును, ఆ సమస్త దేవతా శ్రేష్ఠులును ఒక్క శంకరుడు దక్క తక్కిన ఎవ్వరును సహింపలేరు అని చెప్పి పద్మగర్భమువంటి పసిడికాంతి గలవాడును, పద్మమున పుట్టి అయోనిజుడైన లోకపితామహుడైన బ్రహ్మ శివుని ఈ విధముగా స్తుతింప మొదలిడెను.

"ఓ విరూపాక్షా (మూడు కన్నులు గలవాడా!) నీకు నమస్కారము. అనేక నేత్రములు గల నీకు నమస్కారము. పినాక ధనువు చేతియందు గలవానికి నమస్కారము. వజ్రము చేతియందు గలవానికి నమస్కారము. ముల్లోకముల అధిపతికి నమస్కారము. భూతముల పతికి నమస్కారము. రాక్షస సంహారకునకు నమస్కారము. తాపసునకు నమస్కారము. ముక్కంటికి నమస్కారము. బ్రహ్మవైన నీకు నమస్కారము. రుద్రుడవైన నీకు నమస్కారము. విష్ణువైన నీకు నమస్కారము. సాంఖ్యతత్త్వరూపుడవైన నీకు నమస్కారము. యోగతత్త్వ రూపునకు నమస్కారము. భూతములకు శిలారూపుడవైన నీకు నమస్కారము. మన్మథ శరీరమును భస్మము జేసినవానికి నమస్కారము. మార్కండేయ రక్షణకై యమునకుగూడ యముడవైన నీకు నమస్కారము. రుద్ర రూపునకు నీకు నమస్కారము. దేవేంద్రరూపునకు నీకు నమస్కారము. దేవతల దేవునకు నమస్కారము. జటాజూటముగల నీకు నమ స్కారము. ఏకరూపుడవైన నీకు నమస్కారము. శివునకు నమస్కారము. వరదునకు నమస్కారము. త్రిపురాసురుల త్రిపురములను భస్మము జేసిన నీకు నమస్కారము. అందరూ

వందనము జేయతగిన వాడవైన నీకు నమస్కారము. సప్తమాతృదేవతల పతికి నమస్కారము. జ్ఞానస్వరూపునకు నమస్కారము. శుద్ధస్వరూపునకు నమస్కారము. ముక్తస్వరూపునకు నమస్కారము కేవల ఏకస్వరూపునకు నమస్కారము. కమలము వంటి హస్తములుగల నీకు నమస్కారము. దిగంబరునకు నమస్కారము. నెమిలిపింఛము (మాయాకిరాతడై) ధరించినవానికి నమస్కారము. వరుణస్వరూపునకు నీకు నమస్కారము. అగ్రునకు అందరికన్న ముందుండు వానికి నమస్కారము. ఉగ్రస్వరూపునకు నమస్కారము. విప్రస్వరూపునకు నమస్కారము. అనేకములైన కండ్లు గలవానికి నమస్కారము. రజోగుణ స్వరూపునకు నమస్కారము. సత్త్వగుణ స్వరూపునకు, తమస్స్వరూపునకు నమస్కారము. జన్మములేనివానికి నమస్కారము. పరమాత్మగా నిత్య స్వరూపునకు నమస్కారము. జీవాత్మగా అనిత్యస్వరూపునకు నమస్కారము. నిత్యానిత్య స్వరూపుడవైన నీకు నమస్కారము. (జగముగా) వ్యక్తస్వరూపునకు నీకు నమస్కారము. (జగదతీతముగా) అవ్యక్తస్వరూపునకు నమస్కారము. (విశ్వవ్యాప్తుడుగా) చింతింప (ధ్యానింప) తగినవానికి నమస్కారము. (విశ్వాతీతుడుగా) ధ్యానమునకు మించిన వానికి నమస్కారము. చింత్యాచింత్య స్వరూపునకు నమస్కారము. భక్తుల బాధలను నశింప చేయువానికి నమస్కారము. నరనారాయణ స్వరూపునకు నమస్కారము. ఉమాదేవీ ప్రియునకు నమస్కారము. శర్వునకు, ప్రళయమున భూతలములను నశింపచేయువానికి నమస్కారము. నంది చక్రములు చిహ్నములుగాగల హరిహర స్వరూపునకు నమస్కారము. పక్షము, ఒకటిన్నర మాసము, మాసము వీని స్వరూపునకు నమస్కారము. సంవత్సర స్వరూపునకు నమస్కారము. బహురూపములు గలవానికి నమస్కారము. బోడితలగలవానికి నమస్కారము. దండముగలవానికి నమస్కారము. కవచము గలవానికి నమస్కారము. కపాలము చేతగల వానికి నమస్కారము. దిగంబర స్వరూపునకు నమస్కారము. నెమిలి పింఛము ధరించినవానికి నమస్కారము. ధ్వజము గలవానికి నమస్కారము. రథముగలవానికి నమస్కారము. బ్రహ్మచారికి (ఆత్మ బ్రహ్మయందు చరించు వానికి) నమస్కారము. ఋగ్వేదస్వరూపునకును, యజుర్వేద స్వరూపునకును సామవేద స్వరూపునకును నమస్కారము. సాంఖ్య పురుష స్వరూపునకు నమస్కారము. ఈశ్వర సాంఖ్య స్వరూపునకు నమస్కారము" ఈ మొదలగు నీ చరితములుగల ఓ దేవా! నీకు నమస్కారము" బ్రహ్మ చేసిన స్తుతిన వినిన

మహేశ్వరుడు :

"ఓ పార్వతీ! ఈ విధముగా దేవతలచే నమస్కారమునందిన నేను స్తుతింపబడితిని. బ్రహ్మనగు నా భక్తిని తెలిసి దేవదేవుడైన శివుడు గంగాజలముతో స్నానముచేసి శివము

గలవాడును, మిక్కిలి యోగాతిశయముచే సూక్ష్ముడును ధ్యానాతీతుడు అయ్యెను. శిరమున తడిసిన చంద్రుడుగూడ కనబడుటలేదు. ఈ రీతిగా పూర్వము భగవంతుడై లోకకర్తయైన బ్రహ్మచే వేదముల నుండియు వేదాంగములైన శిక్షాదులనుండియు పుట్టిన వివిధ స్తోత్రములచే స్తుతింపబడిన నేను ఆ మహాత్ముడైన బ్రహ్మనుగూర్చి సంతసించినవాడనైతిని. తరువాత నేను చిన్న మాటతో బ్రహ్మతో "ఓ భగవంతుడా! భూత భవిష్యత్ కాలములకు ప్రభువైన వాడా! లోకనాథా! జగత్పతే! బ్రహ్మ! నీ కొరకు నేనేమి జేయవలెను. సువ్రతుడా! చెప్పుము" అని అంటిని. ఈ మాటవిని కమలముల వంటి కన్నులుగల బ్రహ్మ మారుపలికెను. భూత భవిష్యత్ వర్తమాన కాలములకు అధిపతియై జగత్కారణుడవైన ఈశ్వరా! వినుము. అంబు జేక్షణుడవైన ఓ భగవంతుడా! దేవదానవులచే సముద్రము మథింపబడు చుండగా నల్లనిమేఘమువంటిదియు. ప్రళయాగ్ని వంటిదియు అయిన భయంకరమైన విషము ఉద్భవించినది. అది అకాలమృత్యువువలె పుట్టినది. యుగాంత సూర్యునివలె ప్రకాశించునది. ముల్లోకములను నశింపజేయు సూర్యునివలె వెలుగుచున్నది. అన్నివైపులా ప్రకాశించున్నది. దాని కొసలో కాలాగ్ని కాంతిగల విషము బయలువెడలినది. దానిని చూచి మేము భయపడి ఆశ్చర్యము చెందితిమి. కావున ఓ మహాదేవ! లోకహితమును కోరి ఈ విషమును త్రాగుము. నీవే ఆ మొదటి సముద్ర ఫలమును భుజించువాడవు. నీవే దానికి శ్రేష్ఠమైన సమర్థుడవు. ఓ మహాదేవా! నీవు దక్క ఆ విషమును సహించువారు ఎవ్వరూ లేరు. ముల్లోకములలో దీనికి సమర్థుడైన పురుషుడు ఎవ్వడును లేడు అని ప్రార్థించెను.

పరమేష్ఠియైన బ్రహ్మయొక్క మాటవిని, ఓ శ్రేష్ఠమైన ముఖము గలదానా పార్వతీ! సరియే అని ఆ బ్రహ్మ వాక్యమును స్వీకరించితిని. తరువాత యమునితో సమానమైన విషమును త్రాగుటకు ప్రారంభించితిని. ఓ ఉత్తమురాలా! దేవభయంకరమైన ఆ ఘోరవిషము త్రాగుచున్న నా కంఠము వెంటనే నల్లనైనది. కలువరేకువలె ఉన్నదియు, కంఠమున అంటియున్న సర్పమువలె ఉన్నదియు, నాగరాజైనతక్షకుని నాకుచున్నట్లున్న ఆ విషమును జూచి లోకపితామహుడైన బ్రహ్మ ఓ సువ్రతుడవైన మహాదేవా! ఈ కంఠముతో శోభించుచున్నావు అని అనెను.

బ్రహ్మమాటనువిని ఓ హిమాలయ పుత్రీ! యక్షులు, గంధర్వులు, భూతములు, పిశాచులు, ఉరగులు, రాక్షసులు, వీరందరు చూచుచుండగా భయంకరమైన ఆ విషమును నేను కంఠములో ధరించితిని. కావున, ఓ పర్వతరాజ పుత్రి! ఉగ్రతేజమైన కాలకూట విషమును కంఠములో ప్రవేశపెట్టుచుండగా చూచి దేవదానవ సంఘము మిక్కిలి ఆశ్చర్యము చెందెను.

ఓ మదించిన ఏనుగ నడకలవంటి నడకలుగల పార్వతీ! "తరువాత దేవగణము లందరు, దైత్యులు ఉరగులు, రాక్షసులు చేతులు జోడించినవారై గంగాజలముచే కొట్టబడి విడివడిన తల వెంట్రుకలుగల ఓ దేవదేవా! నీ యొక్క బలము వీర్యము పరాక్రమమును ఆశ్చర్యకరములైనవి. మఱి నీ యోగబలము కూడ ఆశ్చర్యకరమైనది. నీవే విష్ణువు నీవే బ్రహ్మవు, నీవే మృత్యువు, నీవే వరదుడవు, నీవే సూర్యుడవు, నీవే చంద్రుడవు, నీవే భూమివి, నీవే జలము, నీవే యజ్ఞము, నీవే నియమము, నీవే భూతకాలము, భవిష్యత్కాలమును నీవే. అన్నిటికిని ఆదివి (మొదలు) నీవే మరణము. నీవే స్థూలుడవు. నీవే సూక్ష్మడవు. నీవే అగ్నివి. నీవే వాయువు, నీవే చరాచరమైన లోకమునకు కర్తవు. ప్రళయమున రక్షించువాడవు అని ఈ విధముగా చెప్పి దేవేంద్రులు అందరును ఉమాసహితుడనైన నాకు శిరస్సుతో నమస్కరించి, అడ్డరాని వేగములతో మేరువు దరికి వెళ్ళిరి". అని శంకరుడు పార్వతితో చెప్పెను.

ఇది పరమ రహస్యము పుణ్యములు అన్నింటికన్న మహాపుణ్యము. నీలకంఠుని గురించిన విషయమును చెప్పినది ప్రఖ్యాతమై లోకప్రసిద్ధమైనది. స్వయముగా బ్రహ్మచే చెప్పబడినదియు, పుణ్యమై పాపముల నశింపజేయునది అయిన బ్రహ్మనుండి పుట్టిన కథను విని జ్ఞప్తియందు ఉంచుకొన్నవానికి లభించు మహాఫలమును గూర్చి విపులముగా చెప్పెదను. ఓ పార్వతీ! ఈ కథను విని ధారణచేసిన వాని శరీరమును స్థావరమైనదిగా జంగమమైనదిగాని అయిన విషము చేరిన వెంటనే ప్రభావము చూపక నశించిపోవును. భయంకరమైన అశుభము శాంతించును. చెడుస్వప్నములను పోగొట్టును. స్త్రీలకును, సభలో రాజునకును, ప్రేమ పాత్రుడగును. వివాదములో జయమును పొందును. యుద్ధమున శౌర్యమునందును. దారిలో పోవువాడు క్షేమమును, ఇంటనున్నవాడు నిత్య సంపదలను పొందును. ఓ శ్రేష్ఠ ముఖముగల పార్వతీ! జన్మాంతరమున గూడ ఆతని ప్రాప్తిని చెప్పెదను. వాడు నీలకంఠుడు, పచ్చని మీసములు గలవాడును. చంద్రుడు అలంకరించిన శరీరము గలవాడును. ముక్కంటియు, త్రిశూలము చేతగలవాడును, ఎద్దు వాహనము గలవాడును, పినాక ధనువును చేతబూనినవాడును, నందితో సమ బలుడు, శ్రీమంతుడును, నందితో సమానమైన పరాక్రమము గలవాడునునై తొందరలోనే నా ఆజ్ఞచే సమస్త లోకములందు చరించును. ఆకాశమున వాయువునకువలె ఆతని గమనమునకు అడ్డుండదు. నాతో సమబలుడై భూత ప్రళయము వరకు ఉండును. ఈ కథను విన్న నామానసభక్తుల ఈ లోకములోనిగతిని, పరలోకములోని గతిని ఓ పార్వతీ చెప్పెదను. బ్రాహ్మణుడు వేదమును పొందును. క్షత్రియుడు భూమిని జయించును.

వైశ్యుడు (తన వ్యాపారమున) లాభమును పొందును. శూద్రుడు సుఖమును పొందును. వ్యాధితో బాధింపబడిన వాడు ఆ వ్యాధినుండి ముక్తుడగును. కారాగార బద్ధుడు బంధనము నుండి విముక్తుడగును. గర్భవతి పుత్రుని పొందును. కన్య మంచి భర్తను పొందును. ఇహపర లోకముల రెండింటను నష్టపోయిన సమస్తమును తిరిగి పొందును. లక్ష గోవులను చక్కగా దానముచేసిన వాని కలుగు ఫలము ఈ ప్రభువైన నీలకంఠుని దివ్యకథను విన్న వానికి లభించును. పావుభాగముగాని, సగభాగమునుగాని, ఒక శ్లోకమునుగాని, శ్లోక సగ భాగమునుగాని నిత్యము పఠించువాడు రుద్రలోకమును చేరును. కుమారస్వామికి ప్రియుడైన, ప్రభువైన చంద్రశేఖరుడైన శివుడు పుణ్య ఫలములు మొదలగు నవిగల ఈ కథను తన దేవియైన పార్వతికి చెప్పి, పార్వతీదేవితో పాటు తన వాహనమైన వృషభముపై కిష్కింధగుహకు వెళ్ళెను. నాచేత దాటబడిన పాపహారమైన మహాపదమును చెప్పి వారికి వాయువు ఆ స్థానము ఇచ్చెను. తరువాత బ్రాహ్మణోత్తముడైన సూతుడు అఖిల సులక్షణ ములుగల సమస్తము అధ్యయనముతో పొంది సూర్యమార్గమును చేరెను. (54)

లింగోద్భవము

ఋషులు అనిరి :

"గుణ–కర్మల ప్రభావముతో ఎవడు అధికుడు, వక్తలలో శ్రేష్ఠుడును అగునో ఆయనను గురించి చక్కగా తెలియదలచితిమి. ఆతని ఆశ్చర్యకరమైన గుణ విస్తరమును గూడ తెలియదలచితిమి. ఆ వృత్తాంతమును మాకు ఎఱింగింపుడు" అని అడిగిరి.

సూతుడు అనెను :

ఈ విషయమున కూడ పెద్దలు ఈ పురాతనమైన ఇతిహాసమును మహాదేవుడైన శివుని మాహాత్మ్యమును, ఆ మహాత్ముని యొక్క సర్వవ్యాపియైన శక్తిని చెప్పెదరు. పూర్వము త్రైలోక్య విజయము తరువాత విష్ణువుచే ఈ విషయము చెప్పబడినది. పూర్వము మహా తేజస్వియై త్రైలోక్యాధిపతియైన విష్ణువు బలిచక్రవర్తిని పాతాళమున బంధించెను. అపుడు దైత్యులు నశించి, ఇంద్రుడు సంతసింపగా, ఇంద్రునితోబాటు దేవతలందరును ప్రభువైన విష్ణువును చూచుటకు పోయిరి. విశ్వస్వరూపుడైన, విష్ణువు క్షీరసముద్ర సమీపమున ఉండెను. సిద్ధులు, బ్రహ్మర్షులు, యక్షులు, గంధర్వులు, అప్సరోగణములు, నాగులు, దేవర్షులును, నదులు, సమస్త పర్వతములును, మహాత్ముడును, పరమ పురుషుడును అయిన హరిని చేరి ఈ విధముగ స్తుతింతురు. నీవు బ్రహ్మవు, నీవు కర్తవు, నీవు సత్త్వ స్వరూపుడవు, ప్రభో! నీవు లోకములను సృజింతువు. నీ అనుగ్రహముననే నాశములేక

ముల్లోకములకు కల్యాణము లభించినది. సమస్త రాక్షసులు జయింపబడిరి. నీ రూపమైన వామన మూర్తిచేతనే బలిచక్రవర్తి పాతాళమున బద్ధుడు అయ్యెను" అని ప్రార్థించిరి. ఈ రీతిగా దేవతలచేతను, సిద్ధులచేతను, పరమ ఋషులచేతను స్తుతింపబడినవాడై పురుషోత్త ముడైన విష్ణువు దేవతలందఱితో ఇట్లు మారుపలికెను. "దేవోత్తములారా! కారణమును చెప్పెదనువినుడు. కారణ స్వరూపుడు సర్వభూతముల స్రష్ట, కాలస్వరూపుడు, కాలకారకుడు ప్రభువును, ఆతనిచేతనే బ్రహ్మతో కూడి మాయచేత లోకములు సృజింపబడినవి. ఆతని అనుగ్రహముననే మొదట సిద్ధత్వము వచ్చినది. పూర్వము నేను వ్యక్తముగాని చీకటిలో ముల్లోకములను మ్రింగగా, భూతములన్నియు కడుపులో నిండినపుడు లోకమున నేను నిద్రించితిని. అనంత శిరములు గలవాడనై లెక్కలేనన్ని కన్నులు కలవాడనై, లెక్కలేని పాదములు గలవాడనై, శంఖ, చక్ర, గదలు చేతులలో గలవాడనై విమలజలమున నిద్రించితిని. ఇంతలో దూరమున నూరు సూర్యుల కాంతిగలిగి తన తేజముతో నిండుచున్న యొక్క అంతులేని కాంతిగలవానిని జూచితిని. ఆతడు నాలుగు ముఖములు కలవాడు మహాయోగము పూనినవాడు, పురుషుడు, బంగారువన్నెగల వాడు, కృష్ణమృగచర్మమును ధరించినవాడు. కమండలువుచే అలంకరింపబడినవాడు, దేవుడు ఆతనిని ఈ పురుషోత్తముడు ఒక కన్నురెప్పపాటు కాలములోనే పొందెను.

ఆ తరువాత సర్వలోకములచే నమస్కరింపబడిన బ్రహ్మ నాతో ఈ విధముగా అనెను. నీవెవ్వడవు? ఎక్కడినుండి వచ్చితివి? ఓ సర్వవ్యాపియైనవాడా! ఇక్కడ ఎందులకు ఉన్నావు. నేను లోకములకు కర్తను. స్వయముగా పుట్టినవానిని. నలువైపుల ముఖములు గలవానిని అని ఈరీతిగా బ్రహ్మచే అడుగబడి నేను ఆతనితో ఇట్లంటిని. నేను లోకములకు కర్తను. ఆ లోకములను మరలమరల సంహరించువాడను కూడ నేనే! ఈ విధముగ పరస్పర జయమునుగోరి మాట్లాడుచున్న ఆ ఇరువురికి ఉత్తర దిక్కుగా నిలిచి ఒక జ్వాల కనబడినది. అది అధిష్ఠితమై కూడనున్నది. తరువాత ఆజ్వాలను చూచి వారిరువురు ఆశ్చర్యము చెందిరి. ఆ జ్వాలచేతను ఈ ఇరువురి (బ్రహ్మ విష్ణువుల) తేజముచేతను జలమంతయు జ్యోతిర్మయముగ చేయబడినది. అప్పుడు ఆ పరమాశ్చర్య కరమైన అగ్ని (వృద్ధిజెందు) పెరుగుచుండగా నేను, బ్రహ్మయును ఆ జ్వాలనుండి చాలా దూరము పరుగెత్తితిమి. భూమ్యాకాశములను వ్యాపించియున్న జ్వాలలమండలమును చూచితిమి. ఆ జ్వాలయొక్క మధ్యన విశాలప్రభ గలదియు, ప్రాదేశ మాత్రముగా (చిటికెడు కొలత అంత) ఉన్నదియు, మిక్కిలి ప్రకాశించినదియునై అవ్యక్తమైన లింగమును చూచితిమి. ఆ మధ్యగల లింగము బంగారుది గాని, వెండిదిగాని కాదు. అది ఇట్టిది! అని చూపరానిది.

ఇట్టిదిఅని ధ్యానింపరానిది, మాటిమాటికి కనబడి కనబడనది, మహాతేజముగలది, మహాభయంకరమైనది, అప్పుడు మిక్కిలి పెరుగుచున్నది, జ్వాలామాలలచే పొడవైనది, సర్వభూతములకు భయంకరముగా ఉంచబడినది. మంత్రకారణమై, భయంకర రూపముగలదై భూమ్యాకాశములను భేదించుచున్నట్లున్న ఈ లింగముయొక్క చివరకు ఎవడుపోవును? తరువాత బ్రహ్మ 'మీరు చురుకుగా క్రిందకు వెళ్లుడు. ఈ మహాత్ముని లింగముయొక్క అంతమును తెలిసికొందుము. నేను ఈలింగము యొక్క అంతము కనబడు వరకు పైకి వెళ్లెదను' అని నాతో అనెను. అపుడు వారిరువురు ఈ విధముగా నియమము నేర్పరచుకొని బ్రహ్మ విష్ణువులు ఊర్ధ్వాధస్సులకు వెళ్ళిరి. తరువాత వేయి యేండ్లు ఆ లింగముయొక్క అధోభాగమునకు వెళ్లితిని. కాని అంతుచిక్కలేదు. భయము జెందితిని, అట్లే బ్రహ్మయు ఆ లింగముయొక్క అంతమును జూడలేదు. అసలట చెందెను. చివరకు నాతో బాటు ఆ మహాజల ప్రదేశమునకు వచ్చెను. తరువాత ఆశ్చర్యముచెంది ఆ మహాత్ముని యొక్క (శివునియొక్క) మాయచే మోహితులై మూర్ఛచెంది ఉండిరి. తరువాత అచట నారీశ్వరుని జూచిరి. ఆతడు ధ్యానగతుడై ఉండెను. అన్ని వైపుల ముఖ ములు (పంచ ముఖములు) గలవాడై ఉండెను. ఆతడు లోకముల జనన మరణములకు కారకుడు, ప్రభువు అవ్యయుడు (నాశము లేనివాడు), బ్రహ్మ చేతులు జోడించి ఆయనను ఈ విధముగా స్తుతించెను. శర్వునకు ప్రళయమున భూతనాశకునకు నమస్కారము శూలికి, మహాభయంకర ధ్వనిగలవానికి, భయంకరరూపునకు, కోరలుగల వానికి, అవ్యక్తునకు, మహత్తునకే అంతకుడైన వానికిని నమస్కారము చేయుచున్నాము.

లోకములకును దేవతలకును ఈశ్వరుడవైన ఓ దేవా! నీకు నమస్కారము. గొప్పవాడవై భూతపతివైన నీకు నమస్కారము. శాశ్వతుడవును అష్టసిద్ధులకు కారణుడవు అయిన నీకు నమస్కారము. సమస్త జగత్తున ప్రతిష్ఠాకరుడవైన నీకు నమస్కారము. పరమేష్ఠివి, పరబ్రహ్మవు, అక్షర స్వరూపుడవు, పరమపదస్వరూపుడవు, శివుడవు, ప్రభుడవు, యజ్ఞ స్వరూపుడవు, వషట్కార స్వరూపుడవు, ఓంకార స్వరూపుడవు, ఉత్కృష్టపద స్వరూపుడవు, స్వాహాకారమవు, నమస్కారమవు, సర్వకర్మల సంస్కారమవు, స్వధాకారుడవు, జపింపదగిన వాడవు, వ్రతరూపుడవు, నియమరూపుడవు, వేదరూపుడవు, లోక స్వరూపుడవు, దేవరూపుడవు, అంతట నీవే అయిన భగవంతుడవు, ఆకాశభూతమునకు సూక్ష్మతన్మాత్ర రూపమైన శబ్ద స్వరూపుడవు. భూతములకు నాశములేని కారణ స్వరూపుడవు, భూమికి గంధస్వరూపుడవు, జలమునకు రసస్వరూపుడవు, తేజస్సునకు రూపమవు, ఓ మహేశ్వరా, వాయువునకు స్పర్శరూపుడవు. చంద్రునకు శరీరమవు, జ్ఞానివి, జ్ఞానస్వరూపుడవు, ఓ

దేవేశ! ప్రకృతియందు బీజ రూపుడవు. భూతములకు నీవు కర్తవు, కాలస్వరూపుడవు, మృత్యుస్వరూపుడవు, యముడవు, అంతకుడవు అనగా నాశము చేయువాడవు ఓ ప్రభూ! ముల్లోకములను నీవే సృజింతువు. నీవే భరింతువు. నీవు తూర్పువైపు ముఖముచే ఇంద్రత్వమును ప్రకాశింప జేయుదువు, ఓ ప్రభో! దక్షిణ ముఖముతో లోకములను క్షీణింప జేయుదువు. పశ్చిమ ముఖముతో వరుణత్వమును చేయుదువు. నీచే ఉత్తర ముఖముతో సౌమ్యత్వము (ఉమా సహితత్వము) వ్యవస్థితమైనది. లోకములకు నాశములేని కారణుడవై అనేక విధముల ప్రకాశింతువు. ఆదిత్యులు, వసువులు, రుద్రులు, మరుత్తులు, అశ్వినీదేవతలు, సాధ్యులు, విద్యాధరులు, నాగులు, చారణులు, తపోధనులు, మహాత్ములైన వాలఖిల్యులు, తపఃసిద్ధులు, సువ్రతులు. తక్కిన నియత వ్రతులును ఓ దేవేశ నీ నుండియే జనించిరి. ఉమయు, సీతయు (ఆకాశగంగయు), సినీవాలి (చంద్రకళతో కూడిన అమావాస్య), కుహువు (చంద్రకళలేని అమావాస్య), గాయత్రియు, లక్ష్మియు, కీర్తి, ధృతి, మేధ, లజ్జ, క్షాంతి, క్షమ, వసువు (శరీరము), తుష్టి, పుష్టి, క్రియ, వాగ్దేవియైన సరస్వతియును సంధ్యారాత్రులును వీరందరు నీనుండియే జనించిరి. పదివేల సూర్యుల యొక్క పదివేల కాంతియు నీనుండియే పుట్టినది. వేల చంద్రులవలె కనబడు వాడా! నీకు నమస్కారము. పర్వత రూపమును ధరించిన నీకు నమస్కారము. సర్వ గుణములకు నెలవైన నీకు నమస్కారము. అడ్డకత్తి రూపమును ధరించిన నీకు నమస్కారము. గజ చర్మమును, విభూతిని ధరించిన నీకు నమస్కారము. ఓ రుద్రదేవా! పినాకధనువు చేతి యందుగల నీకు నమస్కారము. బాణమును చక్రమును ధరించిన నీకు నమస్కారము. భస్మాలంకృత శరీరుడవైన నీకు నమస్కారము. కాముని దహించిన నీకు నమస్కారము. బంగారు వస్త్రముల ధరించిన దేవా! నీకు నమస్కారము. తేజోవంతమైన బంగారు బాహువులుగల నీకు నమస్కారము. తేజోరూపుడ వైన దేవా! నీకు నమస్కారము. అగ్ని స్వరూపుడవైన దేవా! నీకు నమస్కారము. హిరణ్యవర్ణుడ వైన దేవా! నీకు నమస్కారము. బ్రహ్మ స్వరూపుడవైన దేవా నీకు నమస్కారము. బంగారు చీర వస్త్రములు ధరించిన దేవా నీకు నమస్కారము. బంగారమును ఇచ్చు దేవా నీకు నమస్కారము. బంగారు మాలలు ధరించిన దేవా! నీకు నమస్కారము. హిరణ్యమును వహించు దేవా! నీకు నమస్కారము. బంగారు మార్గము (తేజో మార్గము)గల ఓ దేవా! నీకు నమస్కారము. భయంకర ధ్వనిచే ధ్వనించు ఓ దేవా! నీకు నమస్కారము. భయంకరమైన భైరవుని వేగమువంటి వేగముగల ఓ దేవా! నీకు నమస్కారము. ఓ శంకరా! నీలకంఠా! నీకు నమస్కారము. ఓ దివ్యమైన వేయి బాహువులు గలవాడా! నీకు నమస్కారము. నర్తనము వేణు వీణా వాదనములు ప్రియమైన వాడా! నీకు నమస్కారము" అని స్తుతించిరి.

ఈ విధముగా సంస్తుతికి మహామతియైన శివుడు బయల్పడి, మహాయోగియైన దేవుడై, కోటి సూర్యకాంతులతో సమానమైన కాంతితో ప్రకాశించెను. అంతట మహాదేవుడైన మహేశ్వరుడు సంతుష్టుడై తన సహస్రకోటి ముఖములతో తక్కిన వానిని మ్రింగుచున్నాడా అన్నట్లు మహిమాన్వితుడయ్యెను. ఒక కంఠము గలవాడు, ఒక జటగలవాడు, అనేక అలంకారములతో అలంకరింపబడినవాడు, అనేక చిత్రవిచిత్ర ములగు అలంకారములతో కూడిన శరీరముగలవాడు, అనేక పుష్పమాలలు గంధాది లేపనములు గలవాడు. పినాకము అను ధనువు చేతగలవాడు, భగవంతుడు (అష్టైశ్వర్య వంతుడు) శూలధారి, దండమును కృష్ణమృగ చర్మమును ధరించినవాడు, కపాలధారి, భయంకర రూపమును ధరించినవాడు. సర్పములు యజ్ఞోపవీతములుగా కలవాడు, దేవతలకు అభయమిచ్చు వాడు అయిన పరమ శివుడు దుందుభిఅను వాద్యపు ధ్వనితోను, మేఘధ్వనితోను సమానమగు ఒక వికటాట్ట హాసమును చేసెను. ఆ హాసధ్వనిచే ఆకాశమంతయు నిండిపోయెను. ఆ మహాత్ముని మహా ధ్వనితో మేము భయపడితిమి. అపుడు ఆ మహాయోగి "ఓ దేవతలలోని మహా శ్రేష్ఠులారా! నేను సంతసించితిని. నా మహామాయను చూడుడు, భయమంతయు వదలి వేయుడు. నా శరీరభాగములలోనే పూర్వము సనాతనులైన మీరు ఇరువురు పుట్టితిరి. ఈ లోక పితామహుడైన బ్రహ్మ నా కుడిభుజము. నా యెడమ భుజము విష్ణువు. నిత్యము యుద్ధములందు ఉండును. సంతసించిన నేను మీకు కోరిన మంచి వరమును ఇచ్చెదను అని పల్కగా, అంత మహాత్ములైన పుణ్యాత్ములు బ్రహ్మ, విష్ణువులు సంతుష్టచిత్తులై మరల మహాదేవుని పాదములకు నమస్కరించి ఆ మరల పలికిరి. "మీకు మా వలన సంతసము కలిగె నేని, మాకు వరమీయ దగినదేని ఓదేవేశ్వరా! దేవా నీయందు మాకు ఎల్లప్పుడును భక్తియుండు గాక"! అనిరి.

భగవంతుడు అనెను :

ఓ మహైశ్వర్యవంతులారా! బ్రహ్మ విష్ణులారా! మీరు కోరినట్లే అగుగాక. ఇక అనేక విధములైన ప్రజలను సృష్టించుడు. అని ఇట్లు పలికి ఆ భగవంతుడు అచటనే అంతర్ధాన మయ్యెను. ఇట్లు ఆ యోగియైన శివుని ప్రభావమును నేను మీకు తెల్పితిని శివుని చేతనే ఈ జగమంతయు సృష్టింబడినది. మేమిట నిమిత్త మాత్రులము. ఈ రూపము తెలియనిది, బయల్పడనిది, శివుడను పేరుగలది. చింతింప అలవికానిది, చూచుటకు అలవి కానిది, అయిన దీనిని జ్ఞాన నేత్రులే చూడగలరు. ఆ దేవాధిపత్యముగల శివునకునమ స్కారము చేసెదము. దానివలన సూక్ష్ముడును అచింత్యుడును అయిన శివుని జ్ఞాన నేత్రులు చూతురు. ఓ మహాదేవా! నీకు నమస్కారము. ఓ మహేశ్వరా! నీకు నమస్కారము. ఓ సురాసురవరులలో శ్రేష్ఠమైన వాడా! నీకు నమస్కారము.

సూతుడు అనెను :

ఇది విని దేవతలందరును మహాత్ముడైన శంకరునకు నమస్కారము చేయుచు తమతమ స్థానముల కరిగిరి. మహాత్ముడైన ఈశ్వరుని ఈస్తుతిని పఠించినవాడు సమస్తములైన కోరికలను పొందును. పాపములనుండి విముక్తుడగును. ఇది అంతయు నిత్యము, సమర్థ ప్రభువైన విష్ణువుచే మహాదేవుని అనుగ్రహముచే చెప్పబడినది. ఇదియే సనాతనమైన బ్రహ్మము. ఇది అంతయు సూతుడనగు నాచేత చెప్పబడినది. ఇట్లు చెప్పుటకు వలసిన శక్తి మహేశ్వరుని చేత నాకుప్రసాదింపబడిన బలమే. (55)

పితృవర్ణనము

ఓ సూతా! ఇలాపుత్రుడైన పురూరవుడను రాజు ప్రతినెలలో అమావాస్యను ఎట్లు పొందెను? అప్పుడు అతడు పితరులకు ఎట్లు తర్పణము జేసెను? ఈ విషయములను మాకు సవిస్తరముగా తెలియజేయుడు అని శాంశపాయనుడు అనెను.

సూతుడు అనెను :

ఓ శాంశపాయనా! ఆ పురూరవుని ప్రభావమును చెప్పెదను. అట్లే ఇలా పుత్రుడైన పురూరవుని ఆదిత్యుని యొక్క ప్రభావమును అట్లే పురూరవుని యొక్కయు మహాత్ముడైన సోముని(చంద్రుని) యొక్కయు యోగమును తెలిపెదను. నీటిసారమై అమృ తమునుండి చంద్రుని వృద్ధులు, కృష్ణ, శుక్ల పక్షములు, పితృ పక్ష నిర్ణయము. చంద్రుని నుండి అమృ తము లభించుట పితరుల తర్పణము. అట్లే కావ్యాగ్ని నుండి (శుక్రాగ్నినుండి) పొందిన సోమరసముగల పితరుల దర్శనము. ఇలా పుత్రుడైన పురూరవుడు పితృతర్పణము చేసిన విధము మొదలైన వృత్తాంతమును అంతటని చెప్పెదను. వరుసగా ఆ పర్వములను కూడ చెప్పెదను. చంద్రసూర్యులు ఒకే నక్షత్రమున (తో) ఒక రాత్రి-ఒక మండలము నందు కలిసియున్నపుడు అమావాస్యలో నివసింతురు. అపుడు ఆ పురూరవుడు సూర్య చంద్రులను చూచుటకు పోవును. అపుడు అచట అభివాదనము చేసి (నమస్కరించి) కాలమును అపేక్షించినవాడై వేచి ఉండును. ఇలాపుత్రుడును, విద్వాంసుడును అయిన పురూరవుడు పితృదేవతలకై అమృతమును పరిస్రవించుచు క్షీణించుచున్న చంద్రుని నుండి (కృష్ణపక్షమున) అమృతము స్రవించుట వలన పితృమంతుడైన చంద్రుని, పురూరవుడు పగటిలో ఉన్నవాడై ప్రతిమాసమున ఉపాసించును. రెండు లవముల కాలము (లవము అనగా కనురెప్పపాటు కాలములో ఆఅవవంతు) చంద్రకళలేని (కుహువు) అమావాస్య నంతయు ఆ చంద్రసూర్యులను ఇద్దరిని విచారించి ఆతడు (పురూరవుడు) సినీవాలి

(చంద్రకళతో గూడిన అమావాస్య) ప్రమాణముతో సినీవాలిని ఉపాసించు వాడయ్యెను. కుహువు విషయమున అయిన యెడల చంద్రకళలేని అమావాస్యనుగా దెలిసికొని కుహువునే ఉపాసించును. అపుడు ఆతడు (పురూరవుడు) సూర్యుని యందే (చంద్ర సూర్యులను) ఏక కాలమున చూడదలచి బాగుగా చూచును. చంద్రుని నుండి పదియైదు (శుక్లపక్ష దినముల) సుధామృత పరిస్రవములచే మాస తృప్తికొరకు సుధామృతము ఎందులకు (ఎక్కడి నుండి ప్రసవించును? కృష్ణ పక్షమున ఆ విధముగా (సూర్య) కిరణములచే పితుకబడుచున్న చంద్ర సుధామృతమును త్రాగి వెంటనే ఆ చంద్ర సంబంధమైన మధువుచే ఆ శుక్ల పక్షమునందు కుడియుటకు ఆసక్తి గలుగును కావున సుధామృతము ప్రసవించును. ఆ రాజశ్రేష్ఠుడు నిర్వాపణమునకై పైతృక విధితో ఈయబడిన సుధామృతముతో పితరులను తర్పణములతో సంతృప్తిపరచు చుండును. సోమసంబద్ధులైన బర్హిషదులను (దర్భలపై గూర్చుండువారిని) కావ్యాగ్ని ష్వాత్తులను కూడ అట్లే తృప్తిపరచు చుండెను. అగ్నియని చెప్పబడిన ఋతువు సంవత్సరముగా సమ్మతమైనది. దానినుండి ఋతువులు జనించినవి. ఋతువులనుండి ఆర్తవములు పుట్టినవి. ఆర్తవములు అర్ధమాసములు అనబడినవి. పితరులు సంవత్సర పుత్రులు. ఋతువు పితామహులైన మాసములు ఋతువే సంవత్సర పుత్రులు, ప్రపితా మహులు దేవతలు. ఐదు సంవత్సరములు బ్రహ్మయొక్క కుమారులు సోమునకు పుట్టిన వారు సౌమ్యులు. కవి కుమారులు కావ్యులు, ఉపహూతులు దేవతలు అనబడిరి. ఆజ్యవులు (నేయిత్రావువారు) కావ్యులు అనబడిరి. ఈ పితృజాతులు అందరును తృప్తి పొందుదురు. ఆ పితృజాతులు కావ్యులు అనియు బర్హిషదులు అనియు అగ్నిష్వాత్తులు అనియు మూడు విధములుగా ఉన్నారు. యజ్వానులైన గృహస్థులు ఋతువయి నిశ్చయముగా బర్హిషదులు అగుదురు. యజ్వానులైన గృహస్థులు, అగ్నిష్వాత్తులు, అట్లే ఆర్తవులు, అష్టకాపతులు, కావ్యులును పంచాబ్దులు అనబడిరి. వారిని గూర్చి వినుడు. వీటికి అగ్ని సంవత్సరము సూర్యుడు పరివత్సరము. సోముడు ఇద్వత్సరము. వాయువు అనువత్సరము అనబడురు. యుగాత్మకములైన అయిదు అబ్దములకు రుద్రుడు వత్సరము. వారు లేఖులు (దేవతలు), అగ్నులును దివాకీర్త్యులు (పగలు కీర్తింపదగినవారు) అనబడినారు. వీరు ప్రతి మాసమున ఆకాశమునందు అమావాస్యగా అమృతము త్రాగుదురు. ఆ కారణముచేత పురూరవుడు తాను ఉన్నంత కాలము వారిని అమృతము చేత తృప్తి చెందచేయుచుండెను.

ప్రతి మాసమున సోముని (చంద్రుని) నుండి స్రవించుట వలన అది సోమపాయులైన పితరులకు సుధామృతమైనది. ఈ విధముగా సోమసంబంధియైన ఆ అమృతమును

సుధా, మధువును కృష్ణపక్షమున పదియైదు చంద్రకళలవలె వరుసగా చంద్రమున పుట్టి జలమయములైన ముప్పది ముగ్గురు దేవతలు త్రాగుదురు. ఆ విధముగా నెలరోజులు సుధామృతమును త్రావి చతుర్దశినాడు వెళ్లుదురు. ఈ విధముగా దేవతలచే త్రాగబడుచు చంద్రుడు పదియైదవ భాగమున ఉన్నవాడై అమావాస్యను చేరును. ఆ పితరులు సుషుమ్న అను సూర్య కిరణములచే తనివి చెందిన (నిండిన) సుధామృతమును యథాక్రమముగా అమావాస్యయందు (గా) ముప్పది ఆరు రెప్పపాట్ల కాలము త్రావుదురు. తరువాత చంద్రుడు త్రాగబడి క్షీణింపగా, ఈ సూర్యుడు సోమపాయులుగా (చంద్రుని త్రాగు) పితరులకై సుషుమ్నము అను ఒకకిరణముచేత సుధను నింపి సంతృప్తి పరచెను. (చంద్ర) కళనిశ్శేషముగా, మరల చంద్రుని (సుధాకళలతో) నింపి సంతృప్తి పరచెను. దినక్రమమును బట్టి ప్రతిభాగము సుషుమ్నమను సూర్య కిరణములతో అమృత కళలు నింపబడుచున్న చంద్రుని శుక్ల పక్ష కళలు నింపబడుచున్నవి. కృష్ణపక్ష కళలు క్షీణించుచున్నవి. ఈ విధముగా సూర్యుని వీర్య (బల)ముచే చంద్రుని శరీరము (సుధాకళలతో) నిండి సంతృప్తి చెందబడినదగును. కావున పూర్ణిమయందు తెల్లనివాడై సంపూర్తిగా ఉన్న మండలము (బింబము) కలవాడై కనబడును. శుక్ల, కృష్ణ పక్షములలో చంద్రుని సంసిద్ధి ఈ విధముగా ఉండును. అని ఈచంద్రుడు పితృమంతుడుగా (పితృదేవతలు గల వాడుగా) చెప్పబడినాడు. పదియైదు సుధామృత పరిస్రవములచేత క్రమముగా జేరినవాడై ఇద్వత్సరముగ కూడ చెప్పబడినాడు.

ఇక, చెఱకును వెదురునకును గ్రంథులు (ముడులు)గల సర్వములు (కణుపులు) ఉండినట్లు, పర్వములను అట్లే పర్వసంధులను చెప్పెదను. అర్థమాస పర్వములు శుక్ల, కృష్ణ పక్షములుగా పెద్దలు తెలుపుదురు. పూర్ణిమా, అమావాస్య అనునవి గ్రంథులు సంధులును అనబడును. అర్ధమాసములు పర్వములు. అవి తృతీయా తిథి మొదలుకొని (పూర్ణిమ, అమావాస్యల వరకుఉన్న భాగము) ఉండును. సాయంకాలమునను ప్రతిపత్తిథి యందును పర్వసంధులందు అగ్న్యాధాన క్రియ చేయబడును కావున ఆ కాలము పౌర్ణ మాసికము. వ్యతిపాతమున సూర్యుడు ఉండగా యుగాంతరమున చంద్రునకు లేఖోర్ధ్వ మగును. సూర్యుడు యుగాంత రోదితుడైనను చంద్రునకు లేఖోర్ధ్వము అగును. వ్యతీ పాతమున పూర్ణిమయందు చంద్ర సూర్యులు పరస్పరము చూచుకొన్నప్పుడు ఆ కాలము సీమాంతమున వ్యతీపాతమే అగును. సూర్యుని చెప్పు కాలమానమును చూచి సంఖ్య ముందుకు పోవును. అది క్రియా కాలము. అది కాలమువలన వెంటనే విధింపబడును. పూర్ణ (శుక్ల) పక్షమున పూర్ణచంద్రుని రాత్రి సంధులలో పూర్ణిమ ఉండును. పితరులు

దేవతలతో పాటు ఆ పూర్ణిమను చూతురు. కావుననే మొదటి పూర్ణిమ అనుమతి అన బడినది. (చతుర్దశితో గూడిన పూర్ణిమ అనుమతి) పూర్ణిమయందు చంద్రుడు మిక్కిలి ప్రకాశించును. చంద్రునియొక్క రంజనమువలన (కళలచే పూర్ణముగా ఉండి పూసినట్టుగా నుండి నందున కవులు ఈ సర్వ కళాసంపూర్ణుడైన చంద్రుడు గల పూర్ణిమ 'రాకా' అని వర్ణింతురు. చంద్ర సూర్యులు కూడి ఒకే నక్షత్రమందు పదియైదవ (పంచదశి) రాత్రి అంతయు ఉన్నందున అది అమావాస్య అనబడినది. ఇక తరువాతి (శుక్ల) పక్షము యొక్క పూర్ణిమయందు (అన్ని) కళలతో చంద్రుడు వ్యక్తుడు అగును. వ్యతీపాతమున పగటియందు పూర్ణమై ఉన్నప్పుడును, అపరాహ్ణమునందును, చంద్రసూర్యులు పూర్ణాత్ములై పరస్పరము చూచుకొన్నప్పుడు పూర్ణిమ అగును. చంద్రసూర్యులు ఒకచోట చేరి పరస్పరముగా విచ్ఛిన్నమైన ఆ అమావాస్యను చూచినపుడు అది 'దర్వ' (సూర్యేందు సంగమము) అనబడును. పర్వసంధుల అమావాస్యలో రెండేసి లవముల (ముప్పది ఆఱు కనురెప్పపాట్లు) కాలము రెండు అక్షరములుగా 'కుహు' (చంద్రకళలేని అమావాస్య)గా చెప్పబడినది. చంద్రుడులేని అమావాస్య (కుహువు) మధ్య సూర్యునితో కలిసి ఉండును.

చంద్రుడు రాత్రి సగముతో కూడిన పగటితో సూర్యునిపొంది, వెంటనే సూర్యునితో విముక్తిని పొంది, ప్రాతఃకాలోత్సవము కలవారు అగుదురు. వారి సంగమము రెండు కాలములు. రవి మధ్యాహ్నమున పడును. శుక్లపక్షము యొక్క ప్రతిపత్తు (తిథి) సూర్య మండలము నుండి విడిపడుచున్న మొదటి మండలముల మధ్యనున్న చంద్రుడు అగును. అప్పుడు అది సూర్యేందు సంగమరూపమైన దర్శ (అమావాస్య) యొక్క కాలము. వషట్కి యయు అగుచున్నవి. దీనిని ఋతువు యొక్క ముఖము (ప్రారంభము)గా తెలియవలెను. అది ఈ పర్వదినము యొక్క అమావాస్యారూపమైనది. క్షీణచంద్రుడుగల బహుళ పక్షమున పగటి పర్వమునందు అమావాస్యను గ్రహింతురు. కావుననే సూర్యుడు పగలే అమావాస్యను గ్రహించును. ఇందువలననే దేవతలచేత అమావాస్యనుగూర్చి పగలే గ్రహింపబడుచున్నది. ఆ కళలయొక్క స్థితి బహుమానింపదగినది. అజడాత్మకులైన పండితులచే తిథులయొక్క నామధేయములు కూడ చెప్పబడినవి. సూర్యచంద్రులు ఇద్దరు పరస్పరము చూచుకొందురు. తరువాత క్రమముగా చంద్రుడు సూర్యమండలము నుండి బయల్వెడ లును. చంద్రుడు రాత్రింబవళ్లు ద్విలవముతో సూర్యుని స్పృశించును. ఆకాలము దర్శ (అమావాస్య) యొక్క ఆహుతికాలము. వషట్క్రియయును కోకిల కూతకు సమానమైన కాలముతో గుర్తింపబడినందున అమావాస్య కుహు అనబడినది. సినీవాలీ ప్రమాణముతో చంద్రుడు క్షీణశేషుడుగా ఉండి అమావాస్యలో సూర్యుని ప్రవేశించుటచే సినీవాలి అనబడినది.

పర్వముయొక్క పర్వకాలము వషట్క్రియయు సమానులు. చంద్ర సూర్యవ్యతీపాతములు రెండును పూర్ణిమలు అనబడినవి. ప్రతిపత్పంచదశులలో ద్విమాత్రి కాలము పర్వకాలము. కుహూసినీవాలుల సముద్రకాలము రెండులవములు గలది. అర్కాగ్ని మండలమైన సోమునందు పర్వకాలము కలాశ్రయమైనది. ఈ విధముగా రాత్రియొక్క పర్వసంధులలో శుక్లపక్షము. దీనిలో చంద్రుడు సంపూర్ణమండలుడై రాహువుచే గ్రహింప బడును (గ్రహణమేర్పడును). శుక్ల పక్షపు పదియైదవ దినమున దివసక్రమమున పదియైదు కళలచే చంద్రుడు సంపూర్ణ కళామంతుడుగా జేయబడును గాన పూర్ణిమ అనబడినది. కావున పదియైదవ కళ చంద్రుని యందుఉండును. పదియాఱవ కళ ఉండును. కావుననే పంచదశి (అమావాస్యయందు చంద్రునకు మహాక్షయముగలుగును. ఈవిధముగా పితృ దేవతలు సోమ(చంద్రు)ని త్రాగుదురు. సోముని వృద్ధిచెందించువారును అగుదురు కావున ఆ పితృదేవతలే ఋతువులును ఋతువులకు సంబంధించిన వారును అని ఈ విధముగా ఆ దేవతలు భావింతురు.

ఇక మాసశ్రాద్ధమును భుజించువారైన పితరులను గూర్చియు, వారి గతిని గూర్చియు, బలమును గూర్చియు, శ్రాద్ధ మార్గమును (విధిని) గూర్చియు చెప్పెదను. మరణించిన వారి పోకయును, మరల రాకయును ప్రసిద్ధమైన తపస్సుతోగూడ తెలియుటకు అలవికాదు. మాంసముతో ఏర్పడిన కన్నుతో తెలియుట సాధ్యమగునా? ఈ పితరులను శ్రాద్ధదేవులనుగా తెలియవలెను. పితరులు లౌకికులుగా చెప్పబడినారు. సౌమ్యులు, యాగము చేయువారు, యోని నుండి జనించని అందరు దేవతలు పితరులు. దేవతలందఱు పితరులను భావింతురు. మనుష్యులు పితరులను వారికంటే వేరైనవారును లౌకికులు అనబడిరి. పితయు, పితామహుడును, ప్రపితామహుడును సోమునితో యాగము చేయువారును సోమవంతులు అనబడినారు. యాజ్వానులు అనబడినవారు బర్హిషదులు అనబడినారు. వారీకర్మలందు పూనుకొనినవారై, దేహము పుట్టినప్పటి నుండి సంతుష్టి చెందుదురు. వారిలో హోమము చేయువారును యాగము చేయింపతగిన వారిని యాగము చేయించు వారును అగ్నిష్వాత్తులు అనబడినారు. వీరు ఆశ్రమ ధర్మమును అనుసరించి ప్రస్థానము నందున్నవారు. వీరుచివరకు శ్రాద్ధకర్మతో నశింపరు. బ్రహ్మచర్యము చేతను, తపస్సుచేతను, యజ్ఞముచేతను, సంతానముచేతను, శ్రద్ధచేతను, విద్యచేతను, దానము చేతను ఏడు విధములుగా దేహపతనమగునంత వరకును కర్మలలో పూని యుందురు. పితరులతో బాటు సూక్ష్మకులై, సోమపాయకులై స్వర్గమును పొందినవారై దేవతలతో స్వర్గమున సంతసింతురు. పితృమంతుని (తండ్రిగలవానిని) ఉపాసింతురు. శ్రాద్ధ క్రియగల

సంతానవంతులకు ప్రశంసయే సిద్ధమనబడినది. వారి కులమువారి చేతను, బంధువుల చేతను, వారికి నివాసముగా ఈయబడిన అన్నముగూడ ప్రశంసింప బడినది. సోమ లౌకికులు ఒకనెల శ్రాద్ధమును భుజించువారై తృప్తిని పొందుదురు. వీరు మనుష్యులైన పితరులు. వారు మాసశ్రాద్ధభుజులు. వారికంటే వేరైన వారు తక్కిన కర్మయోనులలో సంకీర్ణులైనవారును, ఆశ్రమధర్మముల నుండి భ్రష్ఠులైన వారును, స్వధాస్వాహలు లేనివారును, భిన్నదేహులును దురాత్ములును యముని ఇంటిలో ప్రేతులైనవారును, యాతనాస్థానమును (తీవ్రవేదనా స్థానమును) చేరి తాము చేసిన కర్మలకు దుఃఖింతురు. దీర్ఘాయుష్యము గలవారును, మిక్కిలి ఎండి క్షీణించిన వారును, వర్ణము మారినవారును, వస్త్రములు లేనివారును ఆకలిదప్పులనుకొన్నవారునునై, ఇటునటు పరుగెత్తుదురు. ఆ తరువాత, నదులు, సరస్సులు, చెఱువులు, బావి – వీనిలో నీటిని కోరువారు అగుదురు. వణుకుచున్న వారై ఇతరుల అన్నములను పొందగోరుదురు. రాకపోకలుగల యా స్థానములలో వండబడుదురు. శాల్మలి (ముండ్ల బూరుగు) చెట్టునందు వైతరణి (నరకము నందలి నిప్పుల ఏటి) అందు, కుంభీపాకములందును, కరంభవాలుక (పేల పిండివంటి వేడి ఇసుక) యందును, అసిపత్రవనము (కత్తి ఆకుల వనము) నందును, శిలలను పిండిచేయుట యందును, వారి వారి పాపకర్మలను అనుసరించి పడవేయ బడుదురు. అచట వారికి స్వర్గ భిన్నమైన నరకము నందువలె దుఃఖ స్థానములు ఉండును. అవి లోకాంతరమున ఉన్న వారియొక్క వివిధములైన నామ, గోత్రములను బట్టి ఉండును. ప్రేత స్థానములలో అధిష్ఠించిన వారై భూమిపై అపసవ్యదర్భలందు మూడు పిండములిడి పతితులను తృప్తి పొందచేయుదురు. యాతనా (తీవ్రవేదనా) స్థానమును పొందలేక ఏడు విధములుగా సృజింపబడినవారు భూతము(ప్రాణు)లలో పశువులు మొదలుకొని స్థానముల వరకున్న వారియందును, వారి కర్మలందును అనేక రూపములైన జాతులందును, తిర్యగ్యోని జాతులందును. ఏ ఆహారములవారు అగుదురో, ఇచట ఆయా యోనులందు ఆయా చోటునందు ఆయా ఆహారమును శ్రాద్ధదాత చేకూర్చును. బంధువున్నచోట సకాలమున న్యాయముగా వచ్చిన పాత్రను, శాస్త్రీయముగా సమర్పింప బడిన అన్నమును ఇచ్చినది ఇచ్చినట్లుగా పొందును. ఆవుల మందలో కనబడకుండా తిరుగుచున్న తల్లి ఆవును పిల్లదూడ తెలిసికొనునట్లు మంత్రము, శ్రాద్ధమున ఈయబడిన పదార్థములను కర్తకు ఇష్టులుగా సంకల్పించిన పితరులకు చేర్చును.

ఈ విధముగా శ్రాద్ధము, శ్రాద్ధములో ఈయబడినదియు మంత్రముతో ఏ లోపము లేక సంపూర్ణమగును. అని సనత్కుమారుడు తన దివ్య దృష్టితో చూచి చెప్పెను. సనత్కు

మారుడు ప్రేతలయొక్క గమనాగమనముల తెలిసినవాడు, శ్రాద్ధము ప్రాప్తించినవాని గమనాగమనములను తెలిసినవాడు. వారు (పితరులు) బహీ్వకులనియు, ఊష్మపులనియు, దివాకీర్త్యులనియు అనబడినారు. ఈ విధముగా పితరులు దేవతలు, దేవతలు పితరులు, ఋతార్తవులైన అనేకులు అన్యోన్యముగా పితరులనబడినారు. వీరు పితృదేవతలు శ్రాద్ధకర్మతో వారు సంతుష్టి చెందినపుడు మనుష్యులైన పితరులు సంతుష్టి చెందుదురు అని ఈ విధముగా పితరులు చెప్పబడినారు. సోమపాయులైన పితరులయొక్క పితృ మతత్వము ఇదియే నిశ్చయము. పురాణమున నిశ్చయమైనది. అని ఈ విధముగా పితృ సోముల యొక్కయు ఇలాపుత్రుని యొక్కయు సమాగమము, సుధామృతప్రాప్తియు, పితరుల సంతృప్తి పరచుటయు, పూర్ణిమ, అమావాస్యల కాలమును, పితరుల స్థానమును మీకు సంగ్రహముగా జెప్పబడినవి. ఇది సనాతనమైన సృష్టి. ఈ మొత్తము విశ్వ రూపత్వం ఒక్క చోటనుండినదిగా చెప్పబడినది. దీనిని లెక్కించుటకు సాధ్యముగాదు. ఐశ్వర్యమును కోరినవాడు దీని విషయమై శ్రద్ధ వహింపవలెను. అను ఈ స్వాయంభువ సృష్టి ఇచట నాచేత విస్తరముతోను ఆనుపూర్వితోను చెప్పుట ముగించబడినది. ఇంక నేనేమి వర్ణింప వలెను? అని సూతుడు ప్రశ్నించగా..... (56)

యజ్ఞప్రవర్తనము

"పూర్వము స్వాయంభువ మన్వంతరమున ఉన్న నాలుగు యుగములను వాని స్వభావమును, తత్త్వమును విస్తరముగా వినదలచితిమి" అని ఋషులు అడుగగా...

సూతుడు "పృథివి మొదలగువాని ప్రసంగమున నేను పూర్వము చెప్పినవారి చతుర్యుగమిది. దానిని చెప్పెదను వినుడు. ఇచట విస్తారముగా అంతట సంఖ్యచే చక్కగా లెక్కించి, యుగము, యుగభేదము, యుగధర్మము, యుగాంశకము, సంధ్యాంశకము, యుగ సంధానము – అను ఆఱు విధముల యుగనామములను వాని తత్త్వములతో ఇప్పుడు చెప్పెదను. లౌకిక ప్రమాణముతో తెలియబడిన సంవత్సరము మానుషము. ఆ సంవత్సరములతో లెక్కించి చతుర్యుగములను చెప్పెదను.

నిమేషకాలము (కనురెప్పపాటు కాలము) కాష్ఠ, కళలు, ముహూర్తకములు ఇవి కాలగణనలో కొన్ని (ఏకమాత్రకమై హ్రస్వమైన) లఘ్వక్షరము నిమేషకాల తుల్యమైనది. పదియైదు నిముషములు కాష్ఠ. ముప్పది కాష్ఠలు కళయని లెక్కింపవలెను. ముప్పది ముహూర్త ములు ఒకరాత్రి పగలు గలిగినదియు, అహోరాత్రములను మానుషములు, దైవికములు అని సూర్యుడు రెండు విధములుగా విభజించిరి. అందులో పనిచేతలందు

అహస్సు, పడుకొనుటకు రాత్రియు కల్పింపబడుచున్నవి. పితరుల రాత్రి, పగలు కలిసిన దినము అదే మానవుల ఒక మాసము. ఆ రాత్రి, పగలు విభాగము మానవుల కృష్ణ పక్షము, పితరులకు ఒక పగలు. అట్లే శుక్ల పక్షము వారికి పడుకొనుటకు రాత్రి. ముప్పది మానుష మాసములు పితరులకు ఒక్క మాసము. మూడువందల అఱువది మానుష మాసములు పితరులకు ఒక సంవత్సరము. మానుషమాసమున నూరేండ్లు పితృ మాసమున మూడేండ్లుగా లెక్కింపబడినవి. పితృమానమున నాలుగు మాసములు అధికములు అన బడినవి. లౌకిక మానమున మానుషమైన సంవత్సరము దేవమానమున ఒక రాత్రి పగలు కలసిన దినము. ఈ శాస్త్రమున నిశ్చయము, ఇష్టము. దేవతల రాత్రి, పగళ్ళు, వర్షము మరి వారియొక్క విభాగము ఇట్లుండును. పైన చెప్పబడిన దేవతల రాత్రి పగళ్ళలో ఉత్తరాయణము పగలు దక్షిణాయనము రాత్రియు అగును. ఆ ముప్పది మాసములు దేవతల మాసము అనబడినది. నూరు మానుష మాసములు మూడు దివ్యమాసములు మరియు పది దినములును. ఇది దివ్యవిధి అనబడినది. మూడు వందల అఱువది ఏండ్లు దివ్య సంవత్సరము. ఇది మానుష మానముతో చెప్పబడినది. మానుష మానముతో మూడువేల ముప్పది వర్షములు సప్తర్షుల సంవత్సరము. మానుషములైన తొమ్మిదివేల తొంబదియేండ్లు క్రౌంచ సంవత్సరము అనబడును. మానుషమానముతో ముప్పదిఆరువేల వత్సరములు. దివ్యములైన నూరు సంవత్సరములు, ఇది దివ్యవిధి అనబడినది. మూడు మానవుల మాసములు లెక్కించిన నియుత (లక్ష) సంవత్సరములు మరియు అరువదివేల సంవత్సరములు (60,000) దేవమానమున వేయి సంవత్సరములు అని సాంఖ్యాదులైన జనులు చెప్పుదురు. ఈ విధముగ దేవమాన సంఖ్యతో కూడినది ఋషులతో చెప్పబడినది. యుగసంఖ్యా ప్రకల్పనము గూడ దేవమానముతోనే చూడవలెను.

భారత వర్షమున యుగములు నాలుగని పండితులు చెప్పుదురు. మొదట కృతయుగము తరువాత త్రేతాయుగము. ద్వాపరము కలియుగము అని ఈ యుగములను లెక్కింపవలెను. నాలుగువేల సంవత్సరములు కృతయుగము అందురు. అచటనైతే సంధ్య(లు) నూరే సంధ్యాంశములు అట్లే (నూరె). ఇతర సంధ్యలలోను మూడు సంధ్యాంశములలోను వేయి తొంబది తొమ్మిది (1099) ఉండును. త్రేతాయుగము మూడు వేలయేండ్లు అని సంఖ్య. దానికి మూడు వందల సంధ్యలు సంధ్యాంశములు అంతే (300). ద్వాపర యుగము రెండువేల యేండ్లని విద్వాంసులు అందురు. దానికిగూడ రెండు వందల సంధ్యము. సంధ్యాంశములు గూడ సంధ్యలతో సమానము (200). కలియుగము వేయి యేండ్లని విద్వాంసులు అందురు. దానికిగూడ ఒక నూరు సంధ్యలు

సంధ్యాంశములు సంధ్యలతో సమానము (100). ఇది పన్నెండు వేలది అని యుగసంఖ్య చెప్పబడినది. అవి కృతయుగము, త్రేతాయుగము, ద్వాపర యుగము, కలియుగము.

ఈ విధముగా సంధ్యాంశములు లేకుండా, నాలుగుయుగముల కాలము చెప్పబడినది. సంధ్యాంశములతో గూడిన చతుర్యుగసంఖ్య నలుబది మూడు లక్షల ఇరువదివేలు. ఈ విధముగా చతుర్యుగముల పేర్లు సాధిక, అకృత, త్రేతాది యుక్తమై అది డెబ్బది ఒక్కటి అయినచో మనువుయొక్క అంతరము అనబడును. మన్వంతరము యొక్క సంఖ్యను వర్షాగ్రముతో వినుడు. అవి మానుష మానమున ముప్పది కోట్ల సంవత్సరములు. సాధికను వదిలి అరువదిఏడు లక్షల ఇరువది వేలసంవత్సరములు. ఇది మన్వంతరము యొక్క సంఖ్య అని పండితులచే చెప్పబడినది. ఈ మన్వంతరము యొక్క కాలము యుగములతో బాటు చెప్పబడినది. నాలుగువేల ఏండ్లతో కూడినది. మొదటి కృతయుగము త్రేతా యుగమును ద్వాపర యుగమును కలియుగమును చెప్పెదను. ఒకేసారి కలిసిన అర్థము (వస్తువు విషయమును) రెండు విధముల చెప్పరాదు. క్రమముగా వచ్చిన ఈ యుగ ద్వయము ఋషివంశ ప్రసంగముననను అట్లే వ్యాకులుడు అగుటచేతను నాచే నీకు చెప్ప బడినది. అందులో త్రేతాయుగ ప్రారంభమున మనువు ఆ సప్తర్షులును శ్రుతి ప్రోక్తమైన ధర్మము, స్మృతి ప్రోక్తమైన ధర్మమున్ను బ్రహ్మచే ప్రేరేపింపబడినవి. ఋగ్, యజ్, సామవేదములందు చెప్పబడిన దారాగ్నిహోత్ర సంయోగము మొదలగు లక్షణములుగల శ్రౌతమగు (శ్రుతిప్రోక్తమగు) ధర్మమును సప్తర్షులు చెప్పిరి. పరస్పరముగా వచ్చిన ధర్మము ఆచారరూపమై స్మార్తధర్మమైనది. వర్ణాచార ఆశ్రమాచారములతో గూడిన దాని స్వాయం భువ మనువు ధర్మముగా చెప్పును. సత్యముతోను, బ్రహ్మచర్యముతోను, వేదముతోను, తపస్సుతోను బాగుగా తపస్సుగల తపస్వుల ఆర్షేయ (ఋషిసంబంధమైన) క్రమముతోను, సప్తర్షులయొక్కయు, మనువుయొక్కయు త్రేతాయుగ ప్రారంభమున అబుద్ధి పూర్వకముగా మానవమాన ప్రకారముగా సంవత్సరములు సృష్టించబడినవి. ఆ ప్రమాణముతోనే కృతయుగ వర్ష(సంవత్సర) మానమును చెప్పెదను. అవి అంకెలలో పదునాలుగు లక్షలు కలికాలయుగమునకు నలుబది నాలుగు వేలు. ఈ విధముగ లెక్కించిన కాలము. విశేషించి కాలములలో లెక్కించిన కాలము. అక్రియా పూర్వకముగా తారకాది నిదర్శనములతో వెలువడిన మంత్రములు. ఆదికల్పమునందైతే దేవతల నుండియే స్వయముగా బయలు వెడలినవి. నాశమందైనను ఈ సిద్ధులు ప్రవర్తిల్లును. గడచిన కల్పములలో వేలకొలది మంత్రములు ఉండినవి. ఆ మంత్రములు వారి ప్రతిభాసము నుండి పుట్టినవి. సప్తర్షులచే ఋక్కులు (ఋగ్వేదము) యజుస్సులు (యజుర్వేదము) సామములు (సామ వేదమును) చెప్పబడినవి. మనువు స్మార్తధర్మమును చెప్పెను.

త్రేతాయుగ ప్రారంభమున కేవలము ధర్మ విశేషముగా వేదములు కూర్చబడినవి. ద్వాపరయుగమున ఆయువును సంరోధించుటవలన విశేషముగా వ్యాపించి ఉంచ బడినవి. పూర్వము కలియందును ద్వాపరమునందును ఋషులును దేవతలును స్వయం భువుడైన బ్రహ్మచే జనన మరణములు లేనివారుగా దివ్యులుగాను సృష్టించబడిరి. ఆ యుగమున వారు యుగమును అనుసరించి ధార్మికులుగను, ప్రజలతో కూడిన వారుగను రాజ్యాంగములతో కూడిన వారుగను, వేదమును జెప్పువారుగను సమానమైన (సుఖ) ప్రయోజనము గలవారునుగా ఉండి, విశేషముగ క్రీడించుచుండిరి. క్షత్రియ జాతియొక్క కార్యారంభము యజ్ఞముగా గలవారు ఋషులు. రాజుయొక్క (యజ్ఞములలో ఈయబడిన) హవిస్సే యజ్ఞముగా కలవారు దేవతలు. పరిచారమే(ఉన్నత జాతుల సేవయే) యజ్ఞముగా గలవారు శూద్రులు. జపమే యజ్ఞముగా కలవారు బ్రాహ్మణోత్తములు. ఆ విధముగా త్రేతాయుగములో నాలుగు వర్ణములును (జాతులు) మిక్కిలి సంతుష్టులై ధర్మముచే రక్షింపబడినవారై నిత్యము క్రియావంతులై ప్రజా (సంతాన) వంతులై ఐశ్వర్యవంతులై సుఖులునై ఉండిరి. క్షత్రియులు బ్రాహ్మణులను అనుసరించి మెలగుచుండిరి. క్షత్రియులను వైశ్యులు, వైశ్యులను శూద్రులు అనుసరించి మెలగుచుండిరి. ఈ విధముగా అందరును పరస్పరముగా నియమబద్ధులై పెద్దలను అనుసరించుచుండిరి. వారి ప్రవృత్తులు (నడవడులు) శుభములు, ధర్మములు వర్ణాశ్రమానుగుణములు మనసుచే సంకల్పించిన దానిని వాక్కుతో పలికిన దానిని వారు తమ క్రియలతో ఆచరించెడివారు త్రేతాయుగమున కర్మ ఆరంభము వికలముగాకుండా సిద్ధించెడిది. త్రేతాయుగమున ఆయువు మేధ, బలము, రూపము, ఆరోగ్యము, ధర్మశీలత – ఇవి సర్వ సాధారణములై అందరియందు ఉండెడివి.

బ్రహ్మ వారికి వర్ణాశ్రమ వ్యవస్థానములను ఆ విధముగానే చేసెను. కాని మరల ఆ ప్రజలు అజ్ఞానమువలన ఆ ధర్మములను పాలించలేదు. ఆ ప్రజలు పరస్పర విరోధముతో మనువును అనుసరించిరి. స్వాయంభువమనువు ఉన్నది ఉన్నట్లున్న నిజమును చూచెను. బ్రహ్మపురుషుడై శతరూపనుండి ప్రియవ్రత–ఉత్తానపాదులను పుట్టించెను. వారు మొదటి రాజులు. అది మొదలు దండధారులైన రాజులు పుట్టిరి. ప్రజలను రంజింప చేయుటవల్ల ఆ నరపాలురు రాజులైరి. వారు కప్పిపుచ్చుకొన్న పాపములు కలిగి, జయించుటకు అలవిగానివారు. ధర్మసంస్థాపనమునకై వారిని శాసించు శాస్త్రము నాచేత చేయబడినది. ఋషులైన బ్రాహ్మణులచే త్రేతాయుగమున వర్ణముల విభాగములు చక్కగా చెప్పబడినవి, తరువాత వేదసంహితలు మంత్రములును చెప్పబడినవి. అపుడు దేవతలచేత ఈ విధముగా యజ్ఞము ప్రవర్తింప చేయబడినది. అప్పుడు ఈవిధముగ శుక్లపక్ష యామముల

సర్వసంభారములతోను జపములచే దేవతలు యజ్ఞమును నిర్వహింపజేసిరి. విశ్వభుక్కైన విష్ణువుతోబాటు మహౌజస్వియైన దేవేంద్రునిచే స్వాయంభువ మన్వంతరమున పూర్వము ఆ యజ్ఞములు ప్రవర్తింపబడినవి. సత్యము, జపము, తపము, దానములు త్రేతా యుగములో ధర్మమని చెప్పబడినది. క్రియా ధర్మము తగ్గును. సత్య ధర్మము ప్రవర్తించును.

తరువాత శూరులు, ఆయుష్మంతులు, మహాబలులు ప్రజలను శిక్షించు దండనీతి గలవారు, మహాభాగులు (అదృష్టవంతులు), యజ్ఞములను జేయువారు. బ్రహ్మను (వేదము లను పరబ్రహ్మను) చెప్పువారును, పద్మపత్రములవలె విశాలమైన కన్నులుకలవారు, విశాలవక్షము కలవారు చక్కని శరీర అవయవముల కూర్పుగలవారు, సింహములను గూడ చంపు శౌర్యముగలవారు, మహాప్రాణశక్తి గలవారు, మదపుటేనుగువలె ఠీవిగా నడచువారును, మహాధనుస్సును ధరించినవారునైన చక్రవర్తులు త్రేతాయుగమున ఉందురు. వారు సర్వలక్షణ సంపన్నులు, మఱ్ఱిచెట్టువంటి పరిమండలము కలవారు. ఆ బాహువులు న్యగ్రోధములు (మఱ్ఱిచెట్టువలె విశాలము) అయినవి. వారి బాహ్యాంతరము గూడ న్యగ్రోధము అనబడినది. దేహికి ఎడమవైపుగా సమోన్నతమైనది సముచ్ఛ్రయ మగును. ఆవిధముగా సమోన్నతమైన వైశాల్యము న్యగ్రోధమండలమని తెలియ వలెను. చక్రము, రథము, మణి, భార్య, విధి, అశ్వములు, ఖగములు–ఈ యేడు సమస్త చక్రవర్తు లకును మహారత్నములు. చక్రము, రథము, మణి, ఖడ్గము, ధనుః శ్రేష్ఠము, ధ్వజము (జెండా) నిధియు – ఈ ఏడును ప్రాణహీనములు (రత్నములు). భార్య పురోహితుడు, సేనాని, రథకారుడు, మంత్రి, అశ్వము, గున్నయేనుగును ఈ ఏడును ప్రాణముతో కూడినవి (రత్నములు). ఈ రత్నములు దివ్యములు మహాత్ములకు సిద్ధించును. చక్రవర్తులు అందరికిని ఈ పదునాలుగు రత్నములు విధిగా ఉండదగినవి.

భూత భవిష్యత్ కాలములలోని మన్వంతరముల అన్నింటిలోను భూలోకమున చక్రవర్తులు విష్ణువుయొక్క అంశతో పుట్టుదురు. భూత, భవిష్యత్తులలోను, వర్తమానము నందును, త్రేతాయుగాదులలోను ఇచట చక్రవర్తులు విష్ణ్వంశతోనే పుట్టుదురు. ఆ రాజులకు ఇచట ఇవి క్షేమకరములు. బలము, ధర్మము, సుఖము, ధనము అను ఈ నాలుగు అద్భుతములు. ఇవి పరస్పర విరోధము లేకుండా సమముగా రాజులను చేరును. అణి మాదులైన యైశ్వర్యముతోను, ప్రభుశక్తితోను, వీనికి వేరైన తపస్సుచేతను, వీరు ఋషులను అవమానింతురు. బలముచేతను, తపముచేతను, దేవదానవ, మానవులను తిరస్కరింతురు. వీరి శరీరమున మానుషేతరములైన చిహ్నములతో కూడ జన్మింతురు. వెంట్రుకలతో ఫాలభాగమున కనుబొమల మధ్య సుడిగలవారు, చీపురు వంటి నాలుక గలవారు,

ఎఱ్ఱని పెదవులు దంతములు గలవారు, రొమ్మునందు (విష్ణువునకు వలె) మచ్చ గలవారు పైకి నిక్కబొడిచిన వెంట్రుకలు గలవారు, మోకాళ్ళ వరకు బాహువులు గలవారు, జాలము వలెనుండు చేతులు గలవారు (అరచేతి వేళ్లు) సందులుగా ఉన్నవారు, వృషభ చిహ్నము గలవారు, మఱ్ఱిచెట్టువలె విశాలమైనవారు, సింహము వంటి భుజస్కంధము గలవారు, చక్కని జననాంగముగలవారు, గజరాజువలె గంభీరముగ నడచువారు, గొప్ప చెక్కిలి పైభాగము కలవారు, పాదములలో చక్రమత్స్యములు, చేతులలో శంఖ పద్మములును గలవారుగా ఉందురు. ఆ రాజులు ఎనుబదియైదు సంవత్సరముల వరకు ముసలితనము లేనివారై ఉందురు. వారియొక్క గమనములు సంగము లేనివి. అవి నాలుగు : అంతరిక్ష గమనము, సముద్రగమనము, పాతాళగమనము, పర్వత గమనము. త్రేతాయుగములో ఇజ్యా (యాగము)దానము, తపము, సత్యమును ధర్మముగా చెప్పబడినవి. అపుడు ధర్మము వర్ణాశ్రమ విభాగమును బట్టి నడుచుచుండెను. దండనీతి మర్యాదా స్థాపనమునకే ప్రవర్తిల్లు చుండెను. సమస్త ప్రజలు సంతుష్టులై పుష్టిగాను, రోగములేనివారుగను, పూర్ణమైన మనస్సు గలవారుగను ఉండిరి. త్రేతాయుగ విధిలో నాలుగు పాదములతో కూడిన ఒక్క వేదము చెప్పబడినది. అపుడు మానవులు మూడు వేలయేండ్లు జీవించి ఉందురు. పుత్రులతోను, మనుమలతోను వ్యాపించినవారై క్రమముగా వారు మరణింతురు. ఇది త్రేతాయుగములోని ధర్మము త్రేతాసంధిలో దానినివినుడు. త్రేతాయుగ విభాగము సంధ్యాపాదముతో ఉండును. సంధ్య యందలి స్వభావము యుగపాదముతో ఉండును. అని చెప్పగా, శాంశపాయనుడు సూతునితో పూర్వము స్వాయంభువ మను సృష్టిలో త్రేతాయుగ ప్రారంభమున యజ్ఞము యొక్క ప్రవర్తనము (జరుపుట) ఎట్లుండెనో! దానిని నాకు చెప్పుము అని అడిగెను. అప్పుడు సూతుడు కృతయుగముతో బాటు సంధ్యకూడ గడచిపోగా, త్రేతాయుగము వచ్చినపుడు కళఅన్నది ప్రవర్తిల్లగా మరల వర్ణాశ్రమ వ్యవస్థను ఏర్పరచిరి. ఓ శాంశ పాయన! ఆ సంభారములు అన్నియు సంపాదించి యజ్ఞము ఎట్లు నిర్వహింపచేయబడినదో వినుమని సూతుడు చెప్పెను.

త్రేతాయుగ ప్రారంభమున వర్ష సృష్టి జరిగి ఓషధులు పుట్టగనే, గృహములలోను, ఆశ్రమములలోను, పురములలోను, జీవనోపాయములైన వృత్తులు స్థిరముగ ఏర్పడగనే యజ్ఞము ప్రవర్తిల్ల చేయబడినది. వర్ణ–ఆశ్రమముల వ్యవస్థను ఏర్పరచి, వేద మంత్రములను సంహితను రచించి, లౌకికాలౌకిక కర్మలందు ఆ మంత్రములను జోడించియు, విశ్వాపాలకుడైన ఇంద్రుడు అపుడు సమస్త దేవతలతో గూడి సర్వ సంభారములతో సంపాదించిన యజ్ఞమును ప్రవర్తిల్ల చేసెను.

ఆ తరువాత అశ్వమేధయాగ విస్తారము జరుగగా, మహర్షులు వచ్చిరి. అందరు వచ్చి పవిత్రములైన పశువులతో హోమముచేసి యజ్ఞము చేయుచుండిరి. నిరంతరము జరుగు యజ్ఞకర్మయందు ఋత్విజులు వారి పనులలో నిమగ్నమైరి. ఆ తరువాత వెంటనే వేదములు(ఆగమములు)గానము చేయబడినవి. యజ్ఞమున యజుర్వేదమును చదువు (అధ్వర్యు శ్రేష్ఠులు తొందరగా తిరుగుచుండిరి. పవిత్రములైన పశుగణములు లభింప కుండినవి. యజ్ఞాహుతికై కోయబడినవి. దేవతలను యజ్ఞభాక్కులైన మహాత్ములను దేవ హోతలు దేవతలకై హోమము జేయువారు పిలువగానే దేవతలకై హవిస్సు హోమము చేయబడినది. ఇంద్రియాత్మకులు, యజ్ఞభాక్కులైనట్టియు కల్పాదిలో ఉన్నవారు అయిన దేవతలను, కల్పాదులలో యజ్ఞముతో పూజింతురు. ప్రేషకాలమున లేచిన అధ్వర్యులైన మహర్షులు అందఱుకూడి దీనములై ఉన్న పశుగణములను చూచి ఈ యజ్ఞ విధి ఏమిటని ఇంద్రుని అడిగిరి. నీవు ధర్మమును పొందగోరి హింసచేయుట నీకు బలీయమైన ధర్మము. ఓ దేవ శ్రేష్ఠుడా! నీ యజ్ఞమున పశువధ అనిష్టము. ధర్మమును పడగొట్టుటకై పశువులతో నీచే అధర్మము ప్రారంభింపబడినది. ఇది ధర్మముగాదు. ఇది అధర్మము, హింస ధర్మమని చెప్పబడదు. నీవు కోరినచో వేదముతో యజ్ఞమును చేయుము. అవినాశ కారణమైన వేదశాస్త్రదృష్టమైన విధానముగల యజ్ఞముతో ధర్మమును నిర్వహింపుము. ఓ దేవేంద్ర! హింసకు తావులేనివియు, మూడేండ్ల ఉత్కృష్ట కాలముండి మొలవనట్టి యజ్ఞ బీజములతో యజ్ఞమును నిర్వహింపుము. ఓ ఇంద్రా! ఇది స్వయంభువైన బ్రహ్మచే పూర్వము చెప్పబడిన గొప్ప ధర్మము అని చెప్పగా.....

ఋషులు పలికిరి :

జంగమములచేతనా? లేక స్థావరములచేతనా? ఎవరిచే ఈ లోకమున యజ్ఞము చేయదగినది అని జెప్పబడినది? అని ఈ విధముగా తత్త్వదర్శనులైన మునులతో ఇంద్రుడు చర్చించెను. ఋషులు మహా ప్రాజ్ఞుడవైన ఓ రాజా! ఉత్తానపాదు నందు యజ్ఞవిధిని నీవు ఏ రీతిగా చూచితివి? తెలుపుము ఓ ప్రభూ! మా సంశయమును పోగొట్టుము. అని ఆ వివాదముతో ఖిన్నులై తత్త్వయుక్తులైన మునులుకూడ ఇంద్రునితో మాట్లాడి ఈశ్వరుడైన వసువును ఈ విధముగా అడిగిరి.

వారి మాటను విని, బలాబలమును విచారింపక, వేదశాస్త్రములను స్మరించి యజ్ఞ తత్త్వమును వసువు వారికి రాజు ఉపదేశించిన విధానములతో యజ్ఞము చేయవలసి ఉన్నదని పలికెను. యజ్ఞబీజములు ఫలములు అయిన, పవిత్రములైన పశువులతో యజ్ఞము చేయవలెను. యజ్ఞము యొక్క హింసా స్వభావమును గూర్చి కూడ ఈ విధముగ

నాకు ఇతడు చెప్పుచున్నాడు. దీర్ఘమైన తపస్సుతో గూడిన తారకాదుల దర్శనముతో మహర్షులచేత హింసాలింగ (లక్షణ)ము గల మంత్రములు చూడబడినవి. ఆ ప్రామాణ్యము తోనే నాతో కూడ చెప్పబడినది. అందువలన దానిని భావింపతగదు. ఓ బ్రాహ్మణులారా! ఆ మంత్రములే ప్రమాణములైనచో అట్లే యజ్ఞము జరుగుగాక, కానిచో మా మాట అసత్యమగును అని పలుకగా, ఈ విధముగా యుక్తాత్ములై తపోధనులైన మునులు ప్రత్యుత్తరములేని వారైరి. అబద్ధములాడిన రాజు పాతాళమును ప్రవేశించినందున, పాతాళమున అతని యొక్క భవనమును చూచి మాటాడక మిన్నకుండుము".

అని చెప్పిన వెంటనే రాజు పాతాళమును ప్రవేశించి ఊర్ధ్వమున చరించువాడై వసువయి పాతాళమున చరించువాడు అయ్యెను. ఆ మాటతోనే అతడు భూతలమున నుండువాడు గూడ అయ్యెను. తరువాత ధర్మసంశయములను ఛేదించు రాజైన వసువు వచ్చెను. కావున బహుజ్ఞానియైనను ఒక్కడు సంశయము చెప్పరాదు. ద్వారములు గల ధర్మము సూక్ష్మము అయినందున దానిని దగ్గరగా తెలిసికొనుట అలవి కానిది. కావున దేవతలను ఋషులను దగ్గర చేర్చుకొని, స్వాయంభువమనువు తప్ప తక్కిన వారికి ధర్మము నిశ్చయముగ చెప్పసాధ్యముకానిది. కావున అహింస ధర్మమునకు ద్వారముగా మహర్షులు చెప్పిరి. కోటి సహస్ర ఋషులు తమ (అహింసా) కర్మచేత స్వర్గమునకు వెళ్ళిరి. కావున మహర్షులు దానమునుగాని, యజ్ఞమునుగాని ప్రశంసింపరు. తపోధనులు స్వల్పముగా తమ వైభవమును అనుసరించి కందమూలమును, ఫలమును, శాకమును, జలపాత్రమును ఈ విధముగ (హింసలేక) దానము చేసి స్వర్గ లోకమున సుప్రతిష్ఠితులు అగుదురు. ద్రోహము చేయకుండుట, లోభములేమి, ఇంద్రియ నిగ్రహము, ప్రాణులయెడ దయాభావము, తపము, బ్రహ్మచర్యము, సత్యము, కనికరము, క్షమ, ధైర్యము అను – ఇవి సనాతన ధర్మమునకు మూలము. ఇది సామాన్యముగా అబ్బదు. ధర్మము మంత్రాత్మక మైనది. యజ్ఞము, భుజింపకుండుట, తపము, యజ్ఞముతో దేవతలను చేరును. మరి, తపముతో వైరాగ్యమును చెందును. కర్మ సన్యాసమున బ్రాహ్మణ్యమునందును వైరాగ్యమున లయమును జూచును. జ్ఞానము వలన కైవల్యమును (పరమేశ్వ రైక్యమును) పొందును. ఈ అయిదును గతులు అనబడినవి. ఈ విధముగ పూర్వము స్వాయంభువ మన్వంత రమున ఋషులకును దేవతలకును యజ్ఞమును ప్రవర్తిల్లచేయుటలో గొప్ప వివాదము జరిగినది. తరువాత ఆ ఋషులు అద్భుతమైన మార్గమును చూచి, ఆ బలముతో వసువు (రాజు) యొక్క మాటను తిరస్కరించి, వచ్చిన దారిన వెడలిరి. దేవ సంఘములు పోవగనే దేవతలు యజ్ఞమును పొందుదురు. బ్రహ్మ నక్షత్రమయులైన రాజులు తపః సిద్ధులుగా

చెప్పబడినారు. ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు, ధ్రువుడు, మేధాతిథి, వసువు, సుమేధనుడు, విరజుడు, శంఖపాదుడు, రజుడు, ప్రాచీనబర్హి, పర్జన్యుడు, హర్ధానుడు మొదలగువారు రాజులు. వీరును, మరికొందరును రాజులు సిద్ధులై స్వర్గమునకు ఏగిరి. రాజర్షులు మహాసత్త్వులు అయిన వీరి కీర్తి సుప్రతిష్ఠితమైనది. కావున యజ్ఞమున కంటె తపము అన్నింటిలో బహుకారణములచే విశిష్టమైనది. పూర్వము బ్రహ్మచేత తపముచేత ఈ గమన శీలమైన విశ్వము సృష్టించబడినది. కావున ఆ యజ్ఞము అతిశయింపదు. ఇది తపోమూలకము. అందువలన స్వాయంభువ మన్వంతరమున యజ్ఞ ప్రవర్తనము ఈ విధముగ ఉండెడిది. అప్పటి నుండి ఈ యజ్ఞము యుగములతో బాటు ప్రవర్తిల్లెను. (57)

చతుర్యుగాఖ్యానము

సూతుడు అటు పిమ్మట :

"ఆ తరువాత మరల ద్వాపరయుగము యొక్క విధిని చెప్పెదను. అచట త్రేతా యుగము క్షీణింపగా ద్వాపరయుగము వచ్చును. ద్వాపరయుగము ప్రారంభమున, ప్రజలకు త్రేతాయుగమునందున్న సిద్ధి, యుగముమారుటవలన నశించును. తరువాత ద్వాపరము నందు ప్రజలకు లోభము, అధైర్యము, (వ్యాపార) వైశ్య యుద్ధము, తత్త్వములు నిశ్చయము. వర్ణముల సాంకర్యము, కార్యముల నిర్ణయము లేమి, యజ్ఞౌషధియైన పశువునకు దండము, మదము, దంభము, ఓపిక లేమి బలము–వీనియొక్క రజస్తమో గుణములతో కూడిన ప్రవృత్తి ద్వాపరయుగమున ఏర్పడును. మొదటి కృతయుగమున ధర్మము ఉండును. త్రేతాయుగమున అది చక్కగా ప్రవర్తిల్లును. ద్వాపరయుగమున అది వ్యాకులమై, కలియుగమున నశించును. వర్ణములయొక్క విశిష్టమైన సర్వనాశము చక్కగా కీర్తింప బడును. అట్లే శ్రమయు ప్రశంసింపబడును. ఆ యుగమున శ్రుతియందును స్మృతి యందును ద్వైధీభావము ఏకీభావము లేకపోవుట జరుగును. ద్వైధీభావమును శ్రుతినుండి గాని, స్మృతినుండిగాని నిశ్చయముగా తెలియుటకు వీలుకాదు. అనిశ్చయము వలన ధర్మతత్త్వము నిక్కముగా చెప్పబడదు. ధర్మతత్త్వమున భేదము కలుగుటచే మానవులకు మతి భేదము గలుగును. దృష్టులయొక్క పరస్పర భేదముచేతను, భ్రమచేతను, ఇది ధర్మము, ఇది అధర్మము అని నిశ్చయము కలుగదు. కారణముల వికలత్వము వలనను, కారణము నిశ్చయముకానందునను వారి దృష్టులలో మతిభేదము కలుగుటచే విభ్రమము కలుగును. తరువాత దృష్టిలో విభిన్నులైన వారిచే ఈ శాస్త్ర నిర్ణయము చేయబడును. త్రేతాయుగమున నాలుగు పాదములుగల ఒక్క వేధ విధింపబడినది. ఆయువు యొక్క

సంరోధము (అరికట్టుట) వలన ఆకారము ద్వాపరయుగములో గూడ కనబడును. ద్వాపరాదులలో వేదవ్యాసులచేత నాలుగు విధములుగా (వేదము) వేరుచేయబడినది. దృష్టి విభ్రమముగల ఋషి పుత్రులచేత, మంత్ర బ్రాహ్మణముల విన్యాసములచేతను స్వరవర్ణ (అచ్చుల)ములు తారుమారగుటచేతను వేదములు భేదములు చెందును. సామాన్యముగను వికారము చెందుటవల్లను, ఒక్కొక్కచోట వేదములచే ఋక్, యజుస్, సామవేదముల యొక్క సంహితలు ధ్వంసము చేయబడినవి. బ్రాహ్మణము, కల్పసూత్రములును, మంత్ర ప్రవచనములును, ఇతరులును తీర్థములచే పంపబడిరి. కొందరు వారికై నిలబడిరి. ద్విజులు భిన్నములైన వృత్తములు (పనులు) ఆశ్రమములు గలవారై, ద్వాపర యుగములో ప్రవర్తింతురు. పూర్వమొకే ఆధ్వర్యవము (యజ్ఞములోని యజుర్వేద ప్రక్రియ) ఉండెడిది. తరువాత అది రెండు విధములైనది. సామాన్య విపరీతార్థములచేత ఈ శాస్త్రవిధములు చేయబడినవి. ఆధ్వర్యవ ప్రస్తావములచే అనేక విధములుగా. అట్లే వికల్పములేని అథర్వ-ఋక్-సామముల యొక్క వికల్పములచేత వ్యాకులము చేయబడినది. ద్వాపరము భేదింపగా అది భిన్న దర్శనములచే చేయబడును. వికల్పముల చేత కూడ నశింపని ఆ వేదముల యొక్క భేదములను, ప్రభేదములను, ద్వాపరమున చక్కగా ప్రవర్తిల్ల చేయుదురు. మరల కలియుగమున నశించును. ద్వాపరమున వేదములయొక్క వ్యత్యాసములు కలుగును. అవి వర్షములేమి, మరణము, వ్యాధులు, ఉపద్రవములును అగును. మాట, మనస్సు, కర్మ, వీనివల్ల గలిగిన దుఃఖములచే మరల నిర్వేదము (వైరాగ్యము) కలుగును. నిర్వేదము వలన వానియొక్క దుఃఖ మోక్షముల విచారణ కలుగును. ఆ విచారణవల్ల వైరాగ్యము, వైరాగ్యమువల్ల దోషదర్శనము, దోష దర్శనము వలన ద్వాపరమున జ్ఞానోత్పత్తియు జరుగును. పూర్వము మొదటి స్వాయంభువ మన్వంతరమున ద్వాపర యుగములో ఆ మానవంతుల యొక్క శాస్త్రములకు శత్రువులు పుట్టుదురు. ఆయుర్వేద వికల్పములును, వేదాంగములయొక్కయు, జ్యోతిషముయొక్కయు వికల్పములును అర్థశాస్త్ర వికల్పమును, హేతు శాస్త్ర వికల్పమును, స్మృతిశాస్త్ర భేదములును వేరువేరు ప్రస్థానములును ద్వాపరమున ప్రవర్తిల్లుచుండును. అట్లే మానవులకు మతిభేదములు గూడ ద్వాపరమున సర్వ ప్రాణులకును కాయకష్టముతో గూడినదై మనోవాక్ కాయ కర్మలతో కష్టముగా వృత్తి అనగా అర్థానర్థ విచారవిద్య సిద్ధించును. లోభము, ధైర్యము, వ్యాపారుల యుద్ధము, తత్త్వముల అనిశ్చయ స్థితి, వేద శాస్త్రములను తీసికొనిపోవుట, ధర్మముల సంకరము, రోగము, లోభము, వధయు, వర్ణాశ్రమధ్వంసము, కామద్వేషములును ద్వాపర యుగమున ప్రవర్తిల్లును. అట్లే మానవుల పరమాయువు నిండు రెండువేలు, ఆ ద్వాపరము నిశ్శేషముగా

దాని సంధ్య పాద(పావుభాగ) ముగా ఉండును. గుణములతో హీనమైనది ద్వాపరము యొక్క ధర్మము. అట్లే దానియొక్క అంశము సంధ్యా పాదముగా ఉండును. ద్వాపర యుగములోని సంవత్సరముయొక్క ప్రతిపత్తి అనగా జ్ఞానమును వినుడు. ద్వాపరాంశము మిగులు నందే కలియుగము యొక్క ప్రతిపత్తి కలుగును. హింస, అసూయ, అసత్య మాడుట, మోసము, తపముచేయు మునులను చంపుట- ఇవి కలియుగము యొక్క స్వభావములు. ప్రజలు వీనిని సాధింతురు. ఇదియే ధర్మముగా చేయబడినది. నిజమైన ధర్మము అంతయు క్షీణించును. వృత్తి (జీవనము) మనస్సుతోను, క్రియతోను, పొగడ్తల రూపమైన మాటతోను సిద్ధించునో లేదో పందిగ్ధార్థమే కలియుగమున బహుళముగా చంపునది రోగము. ఎల్లప్పుడు ఆకలి భయములు ఉండును. వర్షములేని కాటకముయొక్క భయము ఘోరము అగును. దర్శనము వ్యత్యాసము అగును. కలియుగమున లోకమందు స్మృతికి ప్రామాణ్యము ఉండదు. ఒకడు గర్భమున ఉండియే మరణింపగా మరొకడు యౌవనమున ఉండియే మరణించును. కలియుగమున ప్రజలు వృద్ధాప్యమున అధా ర్మికులు, అనాచారులు, తీక్ష్ణకోపులు, అల్పతేజము అనగా అల్పవీర్యము గలవారు, ఎప్పుడు అసత్యముఆడు వారును అయిన ప్రజలు పుట్టుదురు. బ్రాహ్మణుల యొక్క దుష్టమైన కోరికలచేతను దుష్టమైన యజ్ఞకర్మలచేతను, దుష్టమైన అధ్యయనముల చేతను, ఆగమము (వేదశాస్త్రము) లచేతను, ఈ విధములైన అనేక దుష్టకర్మలచేతను ప్రజలకు భయము కలుగును. కలియుగములో ప్రాణుల కంతటను హింస, మాయ, అసూయ, కోపము, ఈర్ష్య, ఓపికలేమి సహనములేమి అబద్ధమాడుట, రాగము, లోభము-ఇవి కలుగు చుండును. కలియుగము వచ్చినందున మిక్కిలి సంక్షోభము కలుగును. బ్రాహ్మణులు వేదములు చదువరు. యజ్ఞములు చేయరు. క్రమముగా నరులు వైశ్యులతో పాటు క్షత్రియు లును నశింతురు. కలియుగమున క్షుద్రులకును అంత్యజులకును పడక-కూర్చొనుట, భోజనము-వీనిలో బ్రాహ్మణులతో సంబంధములు కలుగుచుండును. శూద్రజాతులువారు రాజులు అగుదురు. వారు పాషండులకు (వేద బాహ్యులకు) ప్రవర్తకులు అగుదురు. ప్రజలు భ్రూణ (గర్భశిశువు) హత్యలు చేయుదురు. ఈ విధముగ ప్రజ ప్రవర్తించును. ఆయువు, మేధా బలములు, రూపము,కులము-ఇవి క్షీణించును. శూద్రులు బ్రాహ్మణా చారములు చేయగా బ్రాహ్మణులు శూద్రాచారములు చేయుదురు. దొంగలు రాజవృత్తిలో ఉండగా రాజులు చోరవృత్తిని (దొంగతనము) చేయుదురు. సేవకులు తమమిత్రులను కోల్పోవుదురు. కలియుగమురాగా ఇది జరుగును. కలియుగము రాగా స్త్రీలు శీలములేని వారు, వ్రతములేనివారును, మాంసప్రియులునునై మాయమాత్రమే తమలో మిగిలిన

వారుగా అగుదురు. కలియుగమున పులులు ప్రబలమగును. గోవులు క్షీణించును. సాధువులు మరలిపోవుదురు. అపుడు భోగులకు సూక్ష్మమున రాగల మహాఫలము, అట్లే బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ ఆశ్రమములు శిథిలములు అగుటచే ధర్మము మిక్కిలి చలించిపోవును. విశాలమై గొప్పనైన భూదేవి స్వల్పఫలము ఇచ్చునదిగా అగును. కలియుగము రాగానే శూద్రులు తపము చేయుదురు. త్రేతాయుగమున సంవత్సరకాలముండు ధర్మము ద్వాపరయుగమున నెలవరకు ఉండు ధర్మము. అది కలియుగమున ఒక దినపు ధర్మము అగును. కాని అది (కాల ప్రభావము) ఒక దినముకన్న మించిపోవును. కలియుగములో ప్రజలను రక్షింపనివారై రాజులు, ప్రజలు ఇచ్చిన పన్నులను హరించినవారై రాజులు స్వరక్షణ పరాయణులు అగుదురు. కలియుగమున క్షత్రియులుగానివారు రాజులు అగుదురు. వైశ్యులు శూద్రులను ఆశ్రయించి జీవింతురు. సమస్త బ్రాహ్మణులును శూద్రులకు నమస్కరించు వారగుదురు. ఈ కలియుగమున ఒక్క స్త్రీకి పెక్కురు పతులు ఉందురు. కలియుగము చివర దేవుడు (వరుణుడు) చిత్రముగా వర్షించును. కలియుగమున అందరు వ్యాపారము చేయువారు కూడ అగుదురు. మిక్కిలి మోసపు కొలతలచే సరకులను అమ్ముదురు. కలియుగము వచ్చినపుడు నాట్యచర్య వ్యాపించును. వ్యర్థ రూపము (వేషము)లు గలిగిన వేదబాహ్యులచే ఆవరింపబడును. పురుషులు అల్పమై స్త్రీలు అధికమై ఉందురు. లోకము బహుభిక్షుకులతో నిండిపోవును. పరస్పరముగా జనము మాంసభక్షకమై, క్రూరవాక్కుగలదై, కుటిలమై, అసూయ కలది అగును. చేసిన (చెడు) పనికి ప్రతికర్త ఉండకుండుటచే, లోకము క్షీణించును. పతితుడైనను శంకించదు-ఇది కలియుగ లక్షణము. భూమి నరులు లేక శూన్యము అగును. ఇచట దేశములలోను, నగరములలోను మండలములు ఏర్పడును. భూమి అల్పజలముగలదై అల్పఫలమును ఇచ్చునది అగును. రక్షించువారు రక్షింపనివారై శాసనములేక ప్రభువులు అగుదురు. జనులు పరుల సంపదలను హరించువారును. పరస్త్రీలను చెఱచువారును, కాముకులును, దురాత్ములును, అధర్మమువలన సాహసప్రియులును అగుదురు. కలియుగమున నష్టచేతసులుగాని పురుషులు, విదిలించిన వెంట్రుకలుగల పిలక జుట్టులు, పదిహేనేండ్ల వయస్సుగల వారునుఅయి ప్రజలు జన్మింతురు. కలియుగము వచ్చినపుడు శూద్రులు తెల్లని శుభ్రమైన దంతములుగల వారును, ఇంద్రియములను జయించిన వారును, తల గొరగించుకొన్నవారును, కాషాయ వస్త్రములు ధరించిన వారునునై ధర్మమును ఆచరింతురు. పంటలు దొంగిలించువారు పుట్టగలరు. అట్లే బట్టలను ఊడదీయువారును పుట్టగలరు. దొంగలను అపహరించు దొంగలు, అపహరించువారినే అపహరించువారును

కలుగగలరు. జ్ఞానకర్మ నశింపగా లోకము నిష్క్రియముగా పురుగులు, ఎలుకలు, సర్పములును, మానవులను మట్టుబెట్టగలవు. సుభిక్షము, క్షేమము, ఆరోగ్యము, సామర్థ్యము–ఇవి దుర్బలము అగును. ఆకలి భయములతో పీడింపబడిన దేశములలో గుడ్లగూబలు వికసించును. దుఃఖములతో ఆవరింపబడినవారికి పరమాయువు నూరేండ్లు మాత్రమే ఉండును. కలియుగమున సమస్త వేదములు కనబడి కనబడకుండ పోవును. అట్లే యజ్ఞములు కేవలము అధర్మముచే పీడింపబడినవై నశించును. కాపాలికులు కాషాయ వస్త్రములు ధరించి గ్రంథములు లేనివారు అగుదురు. వేదబాహ్యులైన ఇతరులు వర్ణాశ్రమములకు శత్రువులు అగుదురు. కొందఱు వేదములను అమ్మెదురు. మఱికొందఱు తీర్థ (పవిత్ర దేవాలయాది) స్థలములను అమ్మెదురు. కలియుగము రాగానే పై విధములైన జనులు పుట్టుదురు. వేదములను చదువరు. శూద్రులు ధర్మార్థములలో పండితులు అగుదురు. శూద్రజన్ములైన రాజులు అశ్వమేధ యాగము చేయరు. ప్రజలు స్త్రీవధను, గోవధను చేసి పరస్పరము చంపుకొందురు. ప్రజలు ఒండొరుల చంపుకొని పోవుదురు. దుఃఖప్రచారము వలన అల్పాయువు, దేశనాశము, రోగములతో నిండి ఉండుట, మోహము, బాధ, అట్లే అసౌఖ్యము తామస ప్రవృత్తి–ఇవి కలియుగమున ఉండును. ప్రజ అంతయు భ్రూణహత్యలకు పూనుకొనును. కావున కలియుగమున ఉన్న వారికి ఆయువు, బలము, రూపము విశేషముగ క్షీణించును. దుఃఖము ఆవరించిన మానవులకు పరమాయువు నూరేండ్లు. కలియుగమున వేదములు అన్నియు కనబడియు కనబడవు. యజ్ఞములు కేవలము ధర్మపీడితములై నశించును. కలియుగ కాలమున మానవులు అల్పకాలముననే సిద్ధిని పొందుదురు. కలియుగము అంతమున బ్రాహ్మణ సజ్జన ఉత్తములు ధన్యులై ధర్మము ఆచరింతురు. వారు శ్రుతిస్మృతులు చెప్పిన ధర్మమున అసూయలేక నడుచుకొందురు. త్రేతాయుగమున సంవత్సరము ఆచరించు ధర్మము ద్వాపరమున ఒక నెలలో ఆచరింపబడినది. కలియుగమున దానిని తన శక్త్యానుసారము ఒక దినము ఆచరించిన ఫలమునందును.

ఇది కలియుగము యొక్క స్థితి. ఇక సంధ్యాంశమును గూర్చి వినుడు. యుగ యుగమున సిద్ధులు మూడు. మూడు పాదములను పాద (1/4) భాగము పోగొట్టుకొనును. యుగప్రభావమువలన ఈ పాదములు పాదపాదముగ ఉండును. సంధ్యా స్వభావము వలన అంశములందు సంధ్య పాదములుగా నిలిచి ఉండును. కలియుగమున ఈ విధముగా సంధ్యాంశ కాలము రాగా భృగువంశీయుల మరణమున పుట్టినవాడును, అసాధువులను శాసించువాడును, చంద్రుని గోత్రమునకు సంబంధించిన వాడును పేరున

ప్రమతి అని పిలువబడును. ఆతడు పూర్వము స్వాయంభువమన్వంత రమున మాధవుని అంశమున పుట్టినవాడు. ఆతడు ఇరువది నిండు సంవత్సరములు భూమియందు తిరుగుచు గుఱ్ఱములు, రథములు, ఏనుగులునుగల సేనను కూర్చును. విశేషముగా ఆయుధములను గ్రహించిన నూర్ల కొలది వేలకొలది ద్విజులచే ఎల్లప్పుడును చుట్టబడిన వాడై అతడు (ప్రమతి), వేలకొలది మ్లేచ్ఛులను చంపును. ఆ ప్రభువు అంతట ఉండువాడై శూద్రజన్ములైన ఆ రాజులను జంపి, తరువాత వేద బాహ్యులను అందరిని తుదముట్టించును. మిక్కిలి ధార్మికులుగానివారిని గూడ అంతట చంపును. వర్ణ వ్యత్యాసము వలన పుట్టినవారిని, వారిని అనుసరించి జీవించువారిని అంతట చంపివేయును. ఉత్తర దేశములను, మధ్యదేశములను, పర్వతప్రాంతములను, అట్లే తూర్పుదేశములను, పశ్చిమదేశములను, వింధ్య వెనుకటి అపరాంతిక దేశములను దాక్షిణాత్య దేశములను, సింహళములతో బాటు ద్రవిడదేశములను, గాంధార దేశములను పారదదేశములను, పహ్నవదేశములను, యవనదేశములను, తుషారదేశములను, బర్బరదేశములను, చీనదేశములను, శూలికదేశములను, దరదదేశములను, ఖసదేశములను, లంపాక దేశములను – వీనిలోని ప్రజలను కేతులను కిరాత జాతులను గూర్చుకొని వీరితో రాజ్యచక్రమును ఏర్పరచుకొని (చక్రవర్తియై) మ్లేచ్ఛులను జంపి ప్రభువై, సర్వ ప్రాణులకు అజేయుడై భూమిని తిరిగెను. ఆతడు దేవుడైన విష్ణువు యొక్క అంశమున పుట్టినవాడు. పూర్వజన్మవిధులను తెలిసినవారిచే వీర్యవంతుడైన ప్రమతి అనియు, చంద్రవంశజుడైన ప్రభువు అనియు పిలువబడెను. ముప్పది రెండేండ్ల అభ్యుదయ వర్షము ప్రారంభముకాగా, ఇరువదియేండ్లు సర్వప్రాణులను వేలకొలది మానవులను చంపుచు తన రూఢమైన కర్మచే భూమిని తన పరాక్రమము మాత్రమే మిగిలినదానిగా చేసెను. పరస్పర నిమిత్తకమైన ఆకస్మిక కోపముచేతను, సామా న్యముగాన ధార్మికులైన నీచులగు శూద్రులను వశము చేసికొనెను. తరువాత గంగా యమునల మధ్యమున తన సేవకులతో గూడి నిష్ఠను (సమాధిని) పొందెను. అంత, సమస్త రాజులను, వేలకొలది మ్లేచ్ఛులను పెఱికివైచి సత్యసైనికుడైన ఆ అమాత్యుడు (రాజును) గడచిపోయెను. అచట కలియుగమున సంధ్యాంశ కాలమురాగా ఇచ్చటచట ప్రజలు అల్పావశిష్టులైరి (కొద్దిగా మిగిలినవారులైరి.) పగ్గములులేని వారై గుంపులు గుంపులుగా లోకచేష్టలు చేయువారై పరస్పరము హింసించుకొనుచుండిరి. రక్షణము కోరుచుండిరి. (కలి) యుగవశమున అరాజకము వచ్చి జీవిత సంశయ మేర్పడినది. ఆ సమస్త ప్రజలు పరస్పర భయములచే పీడింపబడిరి. వారు భార్యలను ఇండ్లను వదిలి వ్యాకులులై అలిసిపోయిరి. తమ ప్రాణములను చూచుకొనుచు మిక్కిలి దుఃఖితులై చేటును

పొందిరి. శ్రుతి స్మృతులు చెప్పిన ధర్మము నశించినది. అపుడు మర్యాద, పిలుపు, స్నేహము, సిగ్గు, ఇవి ఏవియు లేనివారైరి. భార్యా పుత్రులను వదలి దుఃఖముతో కలతజెందిన ఇంద్రియములు కలవారైరి. వర్షము లేమిచే చచ్చిరి. జీవన వృత్తులు వదిలి దుఃఖితులైరి. తమ పల్లెలను వదలి సమీపములోని నగరదేశములను సేవించిరి. అపుడు జనులు నదులను, సముద్రములను, బావులను, పర్వతములను చేరిరి. మిక్కిలి దుఃఖించినవారై మధుమాంసములతోను, మూలఫలముల తోను జీవించుచుండిరి. నారచీరలను చర్మములను ధరించిరి. వారికి ఆకులు గూడ లభించలేదు. ఏ దానములు కూడ లేవు. వర్ణాశ్రమములనుండి భ్రష్టులై ఘోరమైన సంకరము పొందిరి. ప్రజలు ఈ దశకుచేరి కొద్దిమాత్రమే మిగిలిరి. ముసలితనము, వ్యాధి, ఆకలి – వీనిచే అలమటించి దుఃఖమును వైరాగ్యమును పొందిరి. నిర్వేదము నుండి విచారమును, విచారమునుండి సామ్యావస్థను, సామ్యావస్థలలో సంబోధము (జ్ఞానము)ను, సంబోధమునుండి ధర్మశీలతను మానవుడు పొందును. కలి శిష్టములైన పైని చెప్పబడిన ఉపద్రవములు రాత్రింబవళ్లు ఉపగమము (అంగీకారము) తో కూడిన వైనపుడు వానియొక్క యుగము మారును. వానికి (1.నిర్వేద, 2.విచారణ, 3.సామ్య, 4.సంబోధ, 5.ధర్మశీలత, 6.ఉపగమము) ఏడవదిగా చిత్తసమ్మోహనమును గూర్చి రాబోవు అర్థము యొక్క బలమువలన తరువాత కృతయుగము ఏర్పడెను.

తరువాత మరల కృతయుగము ప్రవర్తిల్లగనే కలియుగమున మిగిలినవారు కృతయుగపువారుగా ప్రజలు పుట్టిరి. ఇచట సిద్ధులుగా ఉన్నవారును చక్కగా కనబడి తిరుగుచుండిరి. ఆ సప్తర్షులుకూడ అచట చక్కగా నివసించి ఉండిరి. ఇచట బీజ ప్రాయులుగా చెప్పబడిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు కలిలోపుట్టినవారును అప్పుడు సమానముగా ఉండిరి. సప్తర్షులు వారియొక్క ధర్మమును ఇతరుల విషయమున కూడ చెప్పుచుండిరి. వర్ణాశ్రమాచారయుక్తుడు శ్రౌతుడు అనియు స్మార్తుడు అనియు రెండు విధములు. తఱువాత, కృతయుగమున ఆ క్రియావంతులలో ప్రజలు ఉండిరి. శ్రౌతస్మార్త క్రియలు కృతములైనందున కృతయుగమను పేరు వచ్చినది. కృతయుగపువారికి శ్రౌతము (వేదోక్తము) స్మార్తము (స్మృతులలో చెప్పబడినది) అయిన ధర్మము సప్తర్షులచే చెప్పబడినది. (శ్రుతి, స్మృత్యుక్త ధర్మమే కృతయుగ ధర్మము). ప్రజలలో ఆ ధర్మమును వ్యవస్థాపించుటకై మునులు యుగాంతము వరకు మన్వంతరాధికారములలో ఉండిరి.

ఈ లోకమున ఎండకాలములో కారుచిచ్చుతో, భూమిపైన గడ్డి అంతయు తగులబడి పోవును. మరల వర్షకాలమున మొదట ఆ కాలిన గడ్డిమూలముననే క్రొత్తగడ్డి మొలకలు పుట్టును. అట్లే యుగమునుండి యుగమునకు ఎడతెగకుండా మన్వంతర క్షయమగువఱకు

పరస్పరము సంతాన సంక్రమము జరుగుచుండును. సుఖము, ఆయువు, బలము, రూపము, ధర్మము, అర్థము, కామములును – ఈ మూడును యుగములలో పాదక్రమముగా క్షీణించును. యుగములయొక్క ధర్మ సిద్ధులు సంధ్యంశలలో క్షీణించును. ఓ ద్విజులారా! ఈ విధమైనది ప్రతిసంధి విధానము.

పై చెప్పిన లక్షణములతోనే నాలుగు యుగముల అన్నింటి యొక్క క్రమ నిర్మాణము. ఈ నాలుగు యుగముల ఆవృత్తి వేయి వఱకు జరుగుచుండును. ఆ వేయి యుగములు బ్రహ్మకు ఒక పగలు. అట్టిమరొక వేయి యుగములు బ్రహ్మ యొక్క రాత్రి అనబడినది. ఇదియే సమస్త యుగములకు లక్షణము. ఈ నాలుగు యుగములు డెబ్బదియొక్క మారులు తిరిగినచో మన్వంతరము అనబడును. నాలుగు యుగములలో (ప్రతి) ఒకదాని యందు పూర్వము విన్న విధముగ జరుగును. అట్లే అన్ని చతుర్యుగములలో గూడ వరుసగా ప్రతియుగము జరుగును. ప్రతిసర్గమున (సృష్టియందు) భేదములు ఉత్పన్నమైన విధముననే (యుగములు) ఇరువదియైదు విధములు. అంతకు తక్కువగాని ఎక్కువగాని లేవు. అట్లే కల్పయుగములతో గూడ సమాన లక్షణములు కలవి అగును. సమస్త మన్వంతరమునకు ఇదియే లక్షణము. అట్లే యుగస్వభావము వలన పరివర్తనములు చాలకాలము నుండియే జరిగినవి. ఆ విధముగా జీవలోకము క్షయ–అభివృద్ధులతో తిరుగుచు ఉండును అని ఈవిధముగా సంగ్రహముగా ఇచట మన్వంతరములలో భూత–భవిష్యత్ యుగముల లక్షణము తెలియచేయబడినది. ఆ విధముగనే విజ్ఞాని భవిష్యత్ యుగముల విషయమై తర్కింపవలెను. సమస్త మన్వంతరములోను భూత–భవిష్యత్ యుగములను గూర్చి ఊహింపవలెను. ప్రతి కల్పమునను ఒక్క మన్వంతర (వివరణ)ముతో సమస్త మన్వంతరములు వివరింపబడినట్లు తెలియవలెను. నామరూపము లతో అందరు ఈ యుగ అభిమానులు అగుదురు. ఇచట ఎనిమిది విధములైన దేవతలు మన్వంతరాధిపులు. ప్రయోజనములతో ఋషులు, మనువులు, అందఱును సమానులే. యుగ యుగమున వర్ణాశ్రమముల విభాగము. ఈ విధముగ ప్రభువు ఉండును. అతడు ఎల్లప్పుడు యుగ స్వభాగమును అనుసరించును. ఇట్లు అనుషంగము చెప్పబడినది. ఇచట ఆనుపూర్వితో విస్తరముగా యుగములలోని స్థితిని జెప్పెదను, సృష్టి సర్గమును వినుడు. (58)

ఋషిలక్షణము

సూతుడు అనెను :

యుగములలో పుట్టు ప్రజలను వినుడు. ఏ యుగమున అసురజాతి పుట్టుకయు,

సర్ప, గో, పక్షి, పిశాచ జాతి పుట్టుకయు, యక్ష, రాక్షస జాతి పుట్టుకయు కలుగునో వారి జీవితము మొత్తము (నిండు)గా ఉండును. పిశాచులు, అసురులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, సర్పములు–వీరు మృత్యు వధలు లేకుండా ఒక్క యుగము అంతయు జీవింతురు. స్థావరములతోబాటు మనుష్యులయొక్కయు, పశువుల యొక్కయు, పక్షుల యొక్కయు ఆయువు యుగధర్మములలో అంతటను వ్యాపించినది. కలియుగమునందు ప్రాణుల ఆయుష్యమునకు ఒక స్థితి కనబడదు. కలియందు మనుష్యులకు పరమాయువు నూరేండ్లు. దేవాసురుల ప్రమాణమునుండి ఏడంగుళములు తగ్గుచు (మానవుల ఎత్తు) నిండుగా నూటయేబది ఎనిమిది అంగుళములైనది. కలియందు పుట్టినవారిచే దేవ–అసురుల ఎత్తుల ప్రమాణము వారి ఎనుబది నాలుగు అంగుళములు. మనుష్యుని పాద ములనుండి తలవరకుగల ఎత్తు తనఅంగుళ ప్రమాణముతో చెప్పబడినది. ఈ మనుష్యుని ఎత్తు ఇచట కలియుగమున తగ్గుచుండును. అన్ని యుగముల కాలములలోను, భూత భవిష్యత్ కాలములలోను తన అంగుళ ప్రమాణముతో నరుడు ఎనిమిది తాలముల ప్రమాణము కలవాడుగా ఉండును. (తాలము=బొటన వ్రేలు నడిమి వ్రేలు ఇవి రెండును చాచగా ఏర్పడిన నడిమికొలత) పాదమునుండి తలవఱకు తొమ్మిది తాలముల ప్రమాణము ఎత్తు కలవాడును, శరీర మధ్యమునకు సందులు లేక యాను కొనగలిగి మోకాళ్లవఱకు పొడవుగా ఉన్న బాహువులు (చేతులు) కలవాడు అసురులచేత గూడ పూజింపబడును. గోవులు, ఏనుగులు, దున్నపోతులు, కదలక స్థిరముగా ఉండు వృక్షాదులు వీనికి పై కాలయోగముచేత యుగయుగమున తరగుట పెఱుగుటయును కలుగుచుండును. పశువుల (యెద్దుల) మూపురము డెబ్బదిఆరు అంగుళముల ఎత్తు ఉండుననియు, ఏనుగల ఎత్తు సంపూర్ణముగా, ఎనిమిది వందల అంగుళములు ఉండుననియు గుఱ్ఱములకు ఐదువందల అంగుళములు ఉండును. తత్త్వదర్శనము చేసినందున మనుష్య శరీర సన్నివేశము వంటిదే దేవతల శరీర సన్నివేశము (కూర్పు) ఉండును. దేవతల శరీరము బుద్ధి అతిశయముతో కూడినదనియు, దేవతలను మించని మనుష్య శరీరమనియు చెప్పబడినది. ఇవి దేవ మనుష్యులను చుట్టియున్న భావములు. పశువులయొక్క, పక్షులయొక్కయు, స్థావరములైన వృక్షాదులయొక్కయు భావములను వినుడు. గోవులు, మేకలు, దున్నలు, గుఱ్ఱములు, ఏనుగులు, పక్షులు, పర్వతములు ఇవి ఇచ్చట (భూలోక మున) యజ్ఞ క్రియలలో అంతట ఉపయుక్తము లైనవి. ఆ రూపములలో ఉండియే అవి మరల దైవ స్థానములలో పుట్టును. దేవతలయొక్క శుభమూర్తులు వారి ఆశయమును అనుసరించిన ఉపభోగములు అగును. వాని యొక్క రూపములకు తగిన ప్రమాణములు

కలిగిన, మనోహరములైన, సత్త్వభావములను తెలిసిన స్థావర జంగమములచే సుఖ వంతులుగా అయిరి.

అందువలన శిష్టులను గూర్చియు, సత్పురుషులను గూర్చియు, సాధువులను గూర్చియు చెప్పెదను. 'సత్' అనునది బ్రహ్మయొక్క (వాచక)శబ్దం. బ్రహ్మవంతులు బ్రహ్మ సాయుజ్యమున ఉందురు. కావున వారు సంతులు అనబడుదురు. దశాత్మకమైన విషయ మైనను అష్ట లక్షణములుగల కారణమునను కోపింపక సంతసించి ఉండువారు జితాత్ములు అనబడుదురు. సామాన్య ధర్మములందును, వైశేషిక (విశేష) ధర్మములందును బ్రాహ్మణ-క్షత్రియ వైశ్యులు యుక్తులై ఉందురు. కావున వారు ద్విజాతులు అనబడిరి. శ్రౌత-స్మార్త ధర్మముయొక్క జ్ఞానమువలన వర్ణాశ్రమములందు ఉన్నదియు స్వర్గమార్గము నందు ఆచరించునదియు ధర్మము అనబడును. విద్యను సాధించుట వలన సాధువు అనబడు చున్నాడు. బ్రహ్మచారియై గురువునకు హితుడై క్రియలను సాధించుట వలన గృహస్థుడు, సాధువు అనబడుచున్నాడు. అరణ్యమున తపస్సును సాధించుట వలన వైఖానసుడు సాధువు అనబడుచున్నాడు. ప్రయత్నము చేయుచున్న యతి గూడ యోగమును సాధించుట వలన సాధువు అనబడుచున్నాడు. గృహస్థుడును, బ్రహ్మచారియు, వానప్రస్థుడును, భిక్షుకు డును, ఈ విధముగ ఆశ్రమ ధర్మములను సాధించుటవలన సాధువులు ఇది ధర్మము, ఇది అధర్మము-అని చెప్పువారు అనబడినారు. అభిన్న దర్శనులు (జీవాత్మ పరమాత్మ ఐక్యమును చూచువారు దేవతలుకారు, పితరులు కారు, మునులునుకారు, మానవులును కారు, మానవులుగూడ (అభేదము జూచువారు) కారు.

ఇచట ధర్మాధర్మ శబ్ధములు క్రియాత్మకముగా చెప్పబడినవి. కుశలాకుశల కర్మలు ధర్మాధర్మములు అనబడినవి. ధారణ అనగా ధృతి అను అర్థముగల (ధృ) ధాతువు వలన ధర్మముఅను శబ్దముచెప్పబడినది. ధరింపనపుడు, మహత్త్వము లేనపుడు, అధర్మము అని చెప్పబడును. ఇచట ఇష్టములను(కోరిన వానిని)పొందించు ధర్మములు ఆచార్యులచే ఉపదేశింపబడును. వృద్ధులు, లోభము లేనివారు, ఆత్మవంతులు, దంభములు లేనివారు మంచి వినయము గలవారు. ఏవంకరలు లేక చక్కగా నడచుకొనువారును-వీరిని ఆచార్యు లుగా చెప్పుదురు. ఆచార్యుడు తాను ఆచరించినందున, ఆచారమును స్థాపించినందున, యమములతోను, మంచి నియమములతోను కూడినవాడై శాస్త్రార్థములను పరిశీలించియు చేయదగిన వానిని సమకూర్చుకొన్నందునను-అవి ఆచారములైనవి. సప్తర్షులు పూర్వుల నుండి తెలిసికొని, ఇచట (భూలోకమున) శ్రౌతమును (వేద ధర్మమును) చెప్పిరి. ఋక్కులు (ఋగ్వేదము), యజుస్సులు (యజుర్వేదము), సామములు (సామవేదములు), వేదాంగ

ములును (శిక్షా, వ్యాకరణ, ఛందస్, నిరుక్త, జ్యోతిషములు) ఇవి శ్రుతి అనబడును. వీనిచే చెప్పబడిన ధర్మము శ్రౌతము. గడచిన మన్వంతరము యొక్క ఆచారమును స్మరించి ఆచారమును మరల ఋష్యాదులు చెప్పిరి. కావున వర్ణాశ్రమ విభాగమువలన పుట్టి స్మరింపబడి ధర్మము స్మార్తమైనది. ఈ రెండు విధములైన (శ్రౌతస్మార్త) ధర్మము ఇచట శిష్టాచారము అనబడును. శేష శబ్దమువలన శిష్ట శబ్దము ఏర్పడినది. శిష్టమయిన ఆచారము శిష్టాచారము. మన్వంతరములలో మిగిలి ఉన్న వారు ఇట ధార్మికులుగా ఉందురు. లోకసంతాన కారణమువలన ధర్మార్థముగా మిగిలిన మనువు, సప్తర్షులును ఉన్నది ఉన్నట్లుగా ఆచారమును చెప్పుదురు. పూర్వయుగమునుండి మిగిలి ఈ యుగమునఉన్న వారును ఇంతకు పూర్వము నాచే చెప్పబడినవారును అయిన శిష్టులచే ప్రతి యుగమున చక్కగాఆచరింప బడినది ధర్మము. త్రయీ, వార్తా, దండనీతి, ఇజ్యా, వర్ణాశ్రమములును శిష్టులచేతను మనువుచేతను, పూర్వులచేతను మరల మరల ఆచరింప బడినవై పూర్వగత మైనందునను ఆ శిష్టాచారము (ధర్మము) శాశ్వతము. దానము, సత్యము, తపస్సు, లోభము, లేమి, విద్య, ఇజ్యా (యాగము చేయుట), ప్రజనీ(సంతానము) దయ–అను ఈ ఎనిమిదింటి ఆచరణములును, ఆచారము యొక్క లక్షణము. సమస్త మన్వంతరములలో శిష్టులును, మనువు సప్తర్షులును ఈ ఆచారము ఆచరించుటచే శిష్టాచారము అనబడినది. చెవులతో వినుటచే తెలిసినది శ్రౌతము స్మరించుట వల్ల వచ్చినది స్మార్తము–అనబడినవి. వేదాత్మమైన యజ్ఞము శ్రౌతము. వర్ణాశ్రమాత్మకమైనది. స్మార్తము. వాని ప్రత్యంగములను ధర్మముయొక్క లక్షణముగా చెప్పెదరు.

అధిక ధనమును చూచియు ఇతరులు అడిగినప్పుడు దాచకుండుట, జరిగినది జరిగినట్లు చెప్పుటయు–అనునిది సత్యము యొక్క లక్షణము. బ్రహ్మచర్యము, తపము, మౌనము, ఆహారములేమియు అనునవి తపస్సునకు మూలము. అవి భయంకరమై పొందుటకు అలవి గానివి. పశువులయొక్కయు, ద్రవ్య–హవిస్సుల యొక్కయు, ఋక్సామ, యజుర్వేదములయొక్కయు, ఋత్విక్కులయొక్కయు, దక్షిణలయొక్కయు సంయోగము యోగము అనబడును. తనయందువలనే సర్వ ప్రాణులయందును హితాహితములై సమముగా ప్రవర్తించిన దృష్టి అంతయు దయ అనబడినది. లాగబడినను, కొట్టబడినను ఏడువక, కొట్టక మనో, వాక్, కర్మలతో ఓర్పువహించి ఉండుట క్షమ అనబడును. మట్టిలో స్వామిచే (ధనస్వామిచే)రక్షింపబడుచున్నవి గాని, ఇతరుల సొమ్ములను దానము చేయకుండుట అలోభమని చెప్పబడును. మైథునము ఆచరింపకుండుట (స్త్రీ సంభోగము చేయకుండుట) దానిని చింతింపకుండుట, దానిని కల్పించుకొనకుండుట ఈ విధముగా

దాని నుండి నివర్తించుట బ్రహ్మచర్యము. అది రంధ్రములేని దమము అనబడును. తనకైగాని, పరులకైగాని ఇంద్రియములను అసత్యముగా ప్రవర్తింపజేయ కుండుట శమముయొక్క లక్షణము. దశాత్మకమైన విషయమున ఎనిమిది లక్షణములుగల కారణముండగా ఎట్టఎదుట కొట్టబడియు కోపింపనివాడు జితాత్ముడని విశిష్టముగ భావింపబడును. న్యాయముగా వచ్చినదియు తనకు మిక్కిలి ఇష్టమైనదియునైన ద్రవ్యమును గుణవంతునకు ఈయవలెనని ఇచ్చుట దానలక్షణము. దానము అన్నది కనిష్ఠము, జ్యేష్ఠము, మధ్యమమని మూడు విధములు. అందులో సర్వమంగళమునకై (మోక్షమునకై చేయు దానము జ్యేష్ఠము. స్వార్థసిద్ధికై చేయు దానము కనిష్టము. సర్వ భూతములకు కారుణ్యముతో ఇచ్చునదియు బంధువులలో చక్కగా విభాగముజేసి ఇచ్చునది అధమము.

శృతి స్మృతులచే చెప్పబడినది వర్ణాశ్రమాత్మకమైనది ధర్మము, శిష్టాచారమునకు విరుద్ధము కానిది, సత్సాధువులను అంటి ఉన్నది ధర్మము. ఇష్టముగానివారిని ద్వేషింప కుండుట ఇష్టమైనవారిని అభినందింపకుండుట, ప్రీతి, తాపము, విషాదము – వీని నుండి మఱలి పోవుట, విరక్తత అనబడును. చేసిన వానిని చేయనివానిని చేర్చియుంచుట (చేయనట్లుగ భావించుట)సన్యాసము కుశలమును, అకుశలమును రెంటిని వదలుట త్యాగము అనబడును. ఈ అచేతనమున అవ్యక్తమునుండియు, అవిశేషమునుండియు వికారము కలుగును. చేతన–అచేతనత్వముల విజ్ఞానమే జ్ఞానము అనబడును. పూర్వము స్వాయంభువ మన్వంతరమున ధర్మతత్త్వజ్ఞులచేత చెప్పబడిన ఇది ధర్మముయొక్క ప్రత్యంగముల లక్షణము.

ఇచట మీకు మన్వంతర విధిని ఇతరేతర విధిని, చాతుర్వర్ణ్య విధిని వివరింతును. ప్రతి మన్వంతరమున వేరు శ్రుతి విధింపబడును. ఋక్కులు, యజుస్సులు, సామములు, భూతప్రళయము వఱకును ఒక శతరుద్రీయమును వదిలి ప్రతి దేవతను గూర్చి ఉన్నది ఉన్నట్లే ఉపయోగింపవలెను. విధియు, హోత్రమును, స్తోత్రమును పూర్వము వలెనే ప్రవర్తి ల్లును, ద్రవ్యస్తోత్రము, గుణస్తోత్రము, కర్మస్తోత్రము ఆభిజనిక స్తోత్రము అని ఈ స్తోత్రము నాలుగు విధములు. మన్వంతరములు అన్నింటిలోనున్న దేవతలకు నాలుగు విధములగు బ్రహ్మస్తోత్రము ప్రవర్తింప చేయబడును. ఈ విధముగ మంత్ర గుణముల ఉత్పత్తియు నాలుగు విధములు. అథర్వ, యజుస్, సామ వేదములలో వేరు వేరుగా ఈ లోకమున ఆచరింప అలవికాని ఉగ్రతపమును ఋషులు ఆచరించుచుందురు. పూర్వ మన్వంతరము లలో ఇచ్చుట తపమాచరించు మునుల యొక్క సంతోషము వలనను, భయమువలనను, దుఃఖమువలనను, సుఖమువలనను, శోకమువలనను, మంత్రములు ఐదు విధములుగా

పుట్టినవి. స్వేచ్ఛగా ఋషుల తపమును పూర్తిగా చూచుటచేత ఋషుల ఋషిత్వమును లక్షణములతో చెప్పెదను.

భూత భవిష్యత్కాలములలోని ఋషులు ఐదు విధములు. అందువలన ఋషుల పుట్టుకను, ఋషిసంబంధముల పుట్టుకను చెప్పెదను. ఏ ఎక్కువ తక్కువలు లేక సత్త్వ, రజస్, తమో గుణములు సమోము లైనపుడు సర్వ సంప్రళయము ఏర్పడును. దేవతలకు ఇంద్రియములకు అతిచారము వచ్చినపుడును అతిదేశము వచ్చినపుడును, జరిగినట్లే ఆత్మతత్త్వము చేతనమునకై ప్రవర్తించును. అందుచేత అబుద్ధి పూర్వకము కాకుండానే ఆత్మతత్త్వము చేతనతో అధిష్టింపబడును. చేప, నీరును కలిసి ఉన్నట్లే చేతనాధిష్ఠితమైన తత్త్వము గుణస్వరూపమై ప్రవర్తించును. కరణమగుట వలన దానికి కారణము గూడ ప్రవర్తించును. విషయమున విషయందగుట వలనను అర్థమున అర్థి అగుటవలన, కాలమును బట్టి పొందదగిన భేదములు కారణాత్మకములగను పుట్టినవి. ఆ భూతముల యొక్క భేదములు వాని పరస్పర భేదములవలన పుట్టినవి. సంసిద్ధికారణమైన కార్యము అప్పటికప్పుడే మారును. కొఱవి విఱుగుచు నొక్కమారుగ పైకి బోవును. అట్లే క్షేత్రజ్ఞుడు, (జీవుడు) ఒకే కర్మతో వివృత్తుడగును. (మార్పుచెందును) చీకటిలో మిణుగురుపురుగు అకస్మాత్తుగా కనబడినట్లే క్షేత్రజ్ఞుడు (జీవుడు) అవ్యక్తము నుండి మార్పుచెంది (వెలిగిన) మిణుగురు పురుగువలెనే స్పష్టమయి కనిపించును. ఆ మహాన్ (గొప్పవాడు, మహ ద్రూపుడు) సశరీరుడై ఎదుట ఉన్నచోటనే ద్వారశాలా ముఖమున ఉన్నవాడై విద్వాంసుడు ఉండును. మహానుడు తమస్సునకు బయట వైలక్షణ్యము వలన భావింపబడును. అచటనే తమస్సునకు చివర విద్వాంసుడు ఉండునని వేదము చెప్పును. పరిభ్రమించుచు మారుచున్న వాని నాలుగు విధములైన బుద్ధి పుట్టినది. జ్ఞానము, వైరాగ్యము, ఐశ్వర్యము, ధర్మం అనునవి–ఆ నాలుగు విధములు. ఇక, ఈ సావయవ స్పష్టములైన సాంసిద్ధికములు ఆ మహత్స్వరూపుని సశరీరుడైన మహత్స్వరూపుడు తిరిగి వచ్చుటవలన సిద్ధికలుగును. ఇచట పురము(శరీరము)నందు శయనించుటచేత గాని జీవులయొక్క శరీరమున శయనించుట చేతగాని, పురమున శయనించుట వల్లను, క్షేత్ర జ్ఞానము వల్లను పురుషుడు అనబడుచున్నాడు. క్షేత్రజ్ఞుడు (జీవుడు) తన క్షేత్రమగు శరీరమును తెలిసికొనుటచే భగవంతుడైన మతి అనబడుచున్నాడు. బుద్ధితో శయనించుట వల్ల ఆతడు బోధాత్మకు డైనాడు. సంసిద్ధి కొఱకే వ్యక్తావ్యక్తము అచేతన మైనది. ఈ విధముగా క్షేత్రజ్ఞ (జీవ) రూపమైన నివృత్తి క్షేత్రజ్ఞు(జీవు)ని చే అభిసంహితమై (కూడినదై)నది. క్షేత్రజ్ఞు(జీవు)నిచే పూర్తిగా తెలియబడినవీడు భోగ్యమైన విషయము అని చెప్పబడినది.

'ఋషి'అను ధాతువుగతియందును, శ్రుతి యందును, సత్యమునందును తరువాత తపస్సునందును వర్తించును. ఇది (గత్యాద్యర్థము) ఋష ధాతువున సన్నియతము కాగా బ్రహ్మచేత ఆ ఋషి ఆ అర్థముననే స్మరింపబడెను. నివృత్తికి సమకాలముననే బుద్ధిచే స్వయముగా ఋషి వ్యక్తమయ్యెను. పరమీతనిచే పొందబడును గాన పరమర్షి అనబడి నాడు. మొదటినుండియు గత్యర్థకమైన ఋషధాతువు నుండి ఋషినామ నిర్వృత్తి జరిగి నందునను, ఋషి స్వయంభూతుడగుట వల్లను, ఆత్మర్షి అనబడినాడు. ఈశ్వరులు బ్రహ్మయొక్క మానసము నుండి స్వయముగా పుట్టిన వారు. గొప్పవాడు ఎదుట అందరితో ప్రశంసింపబడినవాడై, తక్కువగా లెక్కింపబడడు. ధీరులు అంతటను గుణములచే గొప్ప వానిని చేరుదురు. అందువలన మహర్షులుబుద్ధికంటె పరమమునుచూచువారు. ఆ ఋషులు ఆ ఈశ్వరులకును శుభస్వరూపులు. వారు అహంకారమును తమస్సును వదిలి ఋషిత్వమును పొందిరి. అందువలన ఆ ఋషులు (పంచ) భూతములకు ముందే తత్త్వ దర్శనులు (తత్త్వమును జూచువారు)ఋషి పుత్రులైన ఋషీకులు మైధునము వలన గర్భం నుండి పుట్టిన వారు. ఈ మహౌజస్కులు తన్మాత్ర (శబ్ద స్పర్శ రూప రసగంధము) లను, సత్యమును పొందుదురు. అంత వారు సత్యర్షులై పరములై సత్యదర్శనులు అగుదురు. ఋషులయొక్క పుత్రులైనవారు ఋషి పుత్రకులు, శ్రుతమును (వేదమును) దాని విశేషములను నిజముగా పొందుచున్నారు. కావున శ్రుతమును పూర్తిగా చూచువారై వారు శ్రుతర్షులు అగుదురు. అవ్యక్తాత్మ, మహాత్మ, అహంకారాత్మ, భూతాత్మ, ఇంద్రియాత్మ – అని ఆ ఋషులు జ్ఞానముగా చెప్పబడిరి. ఈ విధముగా ఋషుల జాతులు పేరులతో ఐదు – వానిని వినుడు.

భృగువు, మరీచి, అత్రి, అంగిరసుడు, పులహుడు, క్రతువు, మనువు, దక్షుడు, వసిష్ఠుడు, పులస్త్యుడు–అని వారు పదుగురు. మహాత్ములై ప్రవర్తించినందున ఆ ఋషులు మహర్షులు అనబడినారు. ఈ ఋషులు ఈశ్వరులయొక్క సుతులు. వారినిగూర్చి వినుడు. కావ్యుడు, బృహస్పతి, కశ్యపుడు, ఉశనసుడు, ఉతథ్యుడు, వామదేవుడు, అపోజ్యుడు, ఐశిజుడు, కర్దముడు, విశ్రవసుడు, శక్తి, వాలఖిల్యులు, ధరులు–అను వీరు జ్ఞానమున ఋషిత్వము పొందిన ఋషులుగా జెప్పబడినారు. ఋషిపుత్రులై గర్భమున పుట్టిన ఋషికు లను గూర్చి వినుడు. వత్సరుడు, నగ్రహుడు, భారద్వాజుడు, బృహదుక్థుడు, శరద్వతుడు, అగస్త్యుడు, ఔశిజుడు, దీర్ఘతమర్షి, బృహదుక్థుడు, శరద్వతుడు, వాజశ్రవసుడు, సువిత్తుడు, సువాక్కు వేషపారాయణుడు, దధీచుడు, శంఖమంతుడు, వైశ్రవణరాజు–అను వీరు సత్యము వలన ఋషిత్వమును పొందిన ఋషికులుగా జెప్పబడినారు.

ఈశ్వరులు, ఋషికులు, అట్లే చెప్పబడిన తక్కినవారును–వీరందరు మంత్రకర్తలు. వారిని గురించి పూర్తిగా వినుడు–భృగువు, కావ్యుడు, ప్రచేతసుడు, దధీచి, ఆత్మవంతుడు, ఔర్వుడు, జమదగ్ని, విదుడు, సారస్వతుడు, అద్విషేణుడు, అరూపుడు, వీతహవ్యుడు, సుమేధసుడు, వైన్యుడు, పృథువు, దివోదాసుడు, ప్రశ్వారుడు, గృత్సమదుడు, నభుడు–ఈ పంతొమ్మండ్రు ఋషులు మంత్రవాదులు. అంగిరసుడు, వేధసుడు, భారద్వాజుడు, బాష్కలి, అమృతుడు, గార్గ్యుడు, శౌని, సంహృతి, పురుకుత్సుడు, మాంధాత, అంబరీషుడు, ఆహార్యుడు, అజామీఢుడు, ఋషభుడు, బలి, పృషదశ్వుడు, విరూపుడు, కణ్వుడు, ముద్గలుడు, యువనాశ్వుడు, పౌరుకుత్సుడు, త్రాసదస్యుడు, దస్యుమంతుడు, ఉతథ్యుడు, భరద్వాజుడు, వాజశ్రవసుడు, ఆయాప్యుడు, సువిత్తి, వామదేవుడు, ఔగజుడు, బృహదుక్థుడు, దీర్ఘతపుడు, కక్షీవంతుడు–ఈ ముప్పది ముగ్గురు అంగిరస సోదరులు. వీరందరు మంత్రకర్తలు. ఇక కాశ్యపులను వినుడు.

కాశ్యపుడు, వత్సారుడు, విభ్రముడు, రైభ్యుడు, అసితుడు, దేవలుడు ఈ ఆఱుగురు బ్రహ్మవాదులు. అత్రి, అర్చిసనుడు, శ్యామావంతుడు, నిష్ఠురుడు, వల్గూతకుడు, ముని ధీమంతుడు, పూర్వాతిథి–వీరు అత్రులుఅనబడిరి. వీరు మంత్రకారులైన మహర్షులు. వసిష్ఠుడు, శక్తి, పరాశరుడు, నాల్గవవాడు ఇంద్రప్రమతి, ఐదవవాడు భరద్వసువు, ఆఱవవాడు మూత్రావరుణుడు, ఏడవవాడు కుండినుడు, ఎనిమిదవవాడు సుద్యుమ్నుడు, తొమ్మిదవవాడు బృహస్పతి, పదవవాడు భరద్వాజుడు. వీరు మంత్ర బ్రాహ్మణ కారకులు. వీరు కర్తలు, విధర్మధ్వంసకారులు. సర్వ శాఖీయుల బ్రహ్మకు (వేదమునకు) ఇది లక్షణముగా జెప్పబడినది.

హేతు శబ్దము హననార్థకమైన 'హి' ధాతువునుండి ఏర్పడిన ఇతరులచే లేవనెత్తిన వాదమును ధ్వంసము చేయునది. ఇతరులచే లేవనెత్తిన వాదమును ధ్వంసము చేయునది అను అర్థమున హేతుశబ్దము ఏర్పడినది లేదా గతి కర్మకమైన 'హి' ధాతువు వలన కార్య రూపమైన అర్థమును పొందును అను అర్థమున హేతుశబ్దము ఏర్పడినది వాక్యార్థ మును నిశ్చయించునట్లుగా నిర్వచనమును చెప్పవలయును. ఏ దోషము వలన వాక్కు (మాట) నిందింపబడునో దానిని నిందగా ఆచార్యులు చెప్పుదురు. ప్రపూర్వ మైన 'శంసు' ధాతువునుండి ప్రశంసాపదము ఏర్పడినది. గుణవంతమని చెప్పుట ప్రశంస. ఇది ఇదికాదు అని నిశ్చయింపలేమి సంశయము. ఇదియే చేయతగినది. అనునది విధి అనబడును. ఇతరులకు చెప్పబడుట వలన బుధులచే పరకృతి అనబడును. అతి మిక్కిలిగా చెప్పబడినది పురాకల్పము అనబడును. పూర్వపు పరాక్ర మించుటను చెప్పుట వలన పురాకల్పముయొక్క

కల్పన జరుగును. మంత్ర బ్రాహ్మణ కల్పములచేతను. శుద్ధమై విస్తరమైన నిగమముల లేక వేదములచేతను నిశ్చయింపక చేయబడిన దానిని వ్యవధారణ కల్పనము అందురు. ఇదిఎట్లో అదిఅట్లే 'ఇదికూడ ఎట్లో అదికూడ అట్లే–అని ఈ విధమగు బ్రాహ్మణుని యొక్క ఉపదేశము పదవది. అనునది బుధుడు బ్రాహ్మణునకు మొదట చెప్పిన లక్షణము. ఆ బ్రాహ్మణునకు ఆ వృత్తి ఉద్దేశింపబడినది. బ్రాహ్మణులచే వెంటనే వ్యాఖ్యగూడ ఉద్దేశించం బడినది. వేదవిధిచే చూడబడిన కర్మలలో మంత్రముల కల్పనము కూడ ఉద్దేశింపబడినది. 'మంత్ర' అను ధాతువునుండి మంత్రము (శబ్దము) వచ్చినది. బ్రహ్మ (వేదము)యొక్క రక్షణమువలన బ్రాహ్మణుడు అయినాడు. (వేద రక్షణము బ్రాహ్మణ లక్షణము). అల్పాక్ష రములు కలదియు, సందేహములేనిదియు, సారవంత మైనదియు, విశ్వతోముఖ మైన దియు (అంతట ప్రవర్తిల్లు నదియు) ఆపు లేనిదియు, నిందలేనిదియు సూత్రమని సూత్ర వేత్తలు చెప్పుదురు. (59)

మహాస్థానతీర్థవర్ణనము

దుస్తరమైన ఆ మాటను విని ఋషులు సూతునితో ఓ మహామతీ! పూర్వము వేదములు ఎట్లు విశాలములై వ్యాకులత నొందినవి? దానిని మాకు చెప్పుము అని అడిగిరి. సూతుడు వారితో స్వాయంభువమన్వంతరమున ద్వాపరయుగము జరిగిపోగా బ్రహ్మ మనువుతో ఇట్లనెను. ఓ మహామతీ! దానిని చెప్పెదను. యుగము జరిగిపోగా, ఓయీ! యుగ దోష ముచే చుట్టబడినవాడై వరుసగా ద్విజాతులు అనగా బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు అందరు స్వల్పవీర్యులు అగుదురు. యుగవశమున, కృతయుగమునుండి నశించుచు పదివేల భాగమున కలి మిగిలినదై అల్పశిష్టముగా కనబడును. వీర్యము, తేజము, బలము, మాటయును సర్వమును నశించును. వేదముల నుండి వేదములు (అధ్యయనముతో) వచ్చునట్లుగా చేయవలయును. వేదవినాశనము కారాదు. వేదనాశము కలిగిన యజ్ఞము నాశమందును. యజ్ఞము నశింపగా దేవతల నాశము, దానివలన సర్వనాశము సంభవింప గలదు. మొదట వేదము చతుష్పాదము. లక్ష సంఖ్య గలది. మరల అది పదిరెట్లు అధికమైనది. మొత్తము యజ్ఞము సమస్త వాంఛలను తీర్చునది.

లోకహితమునందు ఆసక్తి గల మనుప్రభువు ఈ విధముగా అడుగబడి, అట్లే చెప్పెదనని నాలుగు పాదములు గల ఒకే వేదమును నాలుగు విధములుగా విభజించెను. ఓయీ! బ్రహ్మ ఆజ్ఞవలన లోకహితమును కోరి ప్రస్తుత కాలముతో మీకు వేదకల్పనము చెప్పెదను. ఓ సత్తములారా! (ఓ మిక్కిలి జ్ఞానులారా!) ప్రత్యక్షముగ గాని, పరోక్షముగ

గాని దానిని వినుడు. ఈ యుగమున పరమతపస్వియైన పరాశర పుత్రుడు వ్యాసుడు. అతడు ద్వైపాయనుడని ప్రసిద్ధి చెందినవాడు. విష్ణువు యొక్క అంశము. బ్రహ్మచే ప్రేరేపింపబడినవాడై ఆతడు ఈ యుగమున వేదమును విభజించుటకు పూనుకొనెను. తరువాత ఆతడు వేదకారణమున నలుగురును శిష్యులను గ్రహించెను. వారు జైమిని, సుమంతుడు, వైశంపాయనుడు నాల్గవవాడు పైలుడు, ఐదవవాడు లోమహర్షణుడును. ఋగ్వేద శ్రావకునిగా ద్విజుడైన పైలుని స్వీకరించెను. యజుర్వేద ప్రవక్తగా వైశంపాయనుని స్వీకరించెను. సామవేదార్థ శ్రావకునిగా జైమినిని స్వీకరించెను. అట్లే అథర్వవేద శ్రావకునిగా ఋషిసత్తముడైన సుమంతుని స్వీకరించెను. భగవంతుడై ఈశ్వరుడైన ప్రభువైన ఆ పారాశర్యవ్యాసుడు ఇతిహాస పురాణములకు చక్కని వక్తనుగా నన్ను (సూతుని) స్వీకరించెను. యజుర్వేదము ఒక్కటే ఉండును. దానిని (వ్యాసుడు) నాలుగు విధములుగా విభజించెను. దానియందు చతుర్హోత్రము పుట్టెను. దానితో యజ్ఞమును కల్పించెను. యజుస్సులతో ఆధ్వర్యమును, ఋక్కులతో హోత్రమును, సామములతో ఉద్గాత్రమును, అధర్వములతో బ్రహ్మత్వమును చేసెను. యజ్ఞమున అధర్వణ వేదముతో బ్రహ్మత్వమును చేసెను. దాని నుండి ఋక్కును ఉద్ధరించి ఋగ్వేదమును కల్పించెను. దానిచేత యజ్ఞవాహమై జగద్ధితమైన హోతృకము కల్పింపబడును. సామములతో సామవేదమును, దానితో ఉద్గాత్రమును ప్రకాశింపజేసెను. అధర్వణ వేదముతో రాజుయొక్క అన్ని కార్యములను చేయించెను. పురాణార్థ విశారదు (పండితు)డు ఆఖ్యానములతోను, ఉపాఖ్యానములతోను, గాథలచేతను, కులకర్మల చేతను పురాణసంహితలను చేసెను. యజుర్వేదమున మిగిలిన దానితో యజ్ఞమును కూర్చెను. ఆ విధముగా యజుర్వేదమున యజ్ఞమును కూర్చుచున్నవాడు అయ్యెనని శాస్త్ర నిర్ణయము.

పదములు ఎత్తి తీసికొనుట వలన యజుస్సులు విషయములు. ఆ కారణముచేత వేదసారమును తెలిసిన ఋత్విక్కులచేత ఆతడు ఉద్ధృతవీర్యుడు అయ్యెను. ఆతనిచేత అశ్వమేధయాగము ప్రయోగింపబడెను. దానిచే ఆతడు యోగ్యుడు అయ్యెను. పైలుడు ఋక్కులను గ్రహించి మరల వానిని రెండు విధములుగ విభజించెను. ఆ ప్రభువైన పైలుడు ఆ విధముగా రెండుగాచేసి సంయుగమున (పోరున) ఇద్దరు శిష్యులకు ఇచ్చెను. ఒకదానిని ఇంద్రప్రమతికి, రెండవ దానిని బాష్కలునకును ఇచ్చెను. బ్రాహ్మణ విద్వాంస శ్రేష్ఠుడైన బాష్కలి ఋగ్వేదమును నాలుగు సంహితలుగా జేసి వానిని సేవా పరాయణులై హితులు అయిన శిష్యులకు నేర్పించెను. బోధుని ప్రథమశాఖను, అగ్నిమాఠరునికి ద్వితీయ శాఖను, పారాశరునికి తృతీయశాఖను, యాజ్ఞవల్క్యునికి నాలుగవ శాఖను చదివించెను.

బ్రాహ్మణ పండితోత్తముడైన ఇంద్రప్రమతి మహాభాగ్యుడై, కీర్తి మంతుడైన మార్కండేయుని, ఒక సంహితను చదివించెను. మహాయశస్వియైన ఇంద్రప్రమతి తన జ్యేష్ఠపుత్రుడైన సత్యశ్రవసుని చేత చదివించెను. ద్విజుడైన సత్య శ్రవసుడు మరల సత్యహితుని చదివించెను. విభువైన సత్యహితుడు తన పుత్రుడైన సత్యతరుని చదివించెను. ఈ సత్యతరుడు చేత సత్యశ్రీ కలవాడు, మహాత్ముడు సత్యధర్మ పరాయణుడును. ఆ సత్యతరునకు మహాతేజస్వులైన ముగ్గురు శిష్యులు గలరు. వారు సత్యమైన సిరిగలవారు, విద్వాంసులు, శాస్త్ర గ్రహణమున తత్పరులును వారిలో శాకల్యుడు మొదటి వాడు. మరొకడు రథంతరుడు, తరువాతివాడు బాష్కలి. ఆ తరువాతివాడు భరద్వాజులు అను వీరు శాఖా ప్రవర్తకులు. దేవమిత్రుడైన శాకల్యుడు జ్ఞానము, అహంకారముచే గర్వితుడు. ఆ బ్రాహ్మణుడు జనకుని యజ్ఞమున వినాశమును పొందెను.

శాంశపాయనుడు అనెను :

జ్ఞానగర్వితుడైన ఆ ముని ఎట్లు వినాశ మందెను? జనకుని యొక్క అశ్వమేధముతో వాదము ఎట్లు జరిగెను. వాదము ఎందులకు జరిగెను? ఎవరితో జరిగెను? ఇది అంతయు ఉన్నది ఉన్నట్లు నీకు తెలిసినది పూర్తిగా చెప్పుము. ఋషుల ఈ మాటను వినిన తరువాత దానికి సమాధానముగా సూతుడు ఇట్లు చెప్పెను.

జనకుని యొక్క అశ్వమేధ యాగమున గొప్ప పండిత సమావేశము జరిగెను. అచట అనేక విధములుగా వేలకొలది ఋషులు రాజర్షియైన జనకుని యజ్ఞమును చూడగోరి వచ్చిరి. వీరిలో బ్రాహ్మణ శ్రేష్ఠుడు ఎవడు? ఈ విషయమున నిశ్చయము ఎట్లు కలుగును? అని అనుకొని జనకమహారాజు మనసులో ఆలోచించెను. తరువాత వేయిగోవులను అధికమైన బంగారమును, రత్నములను, దాసులను, గ్రామములను (వాని దానపత్రములను) తెప్పించి ఆ ములతో జనకుడు ఇట్లు పలికెను. ఓ బ్రాహ్మణోత్తములారా! సభలో శ్రేష్ఠభాగులైన మీ అందరికిని శిరస్సుతో ప్రణమిల్లుచున్నాను. మీలో మిక్కిలి శ్రేష్ఠుడైనవానికై ఈ ధనము అంతయు విద్యాధనముగా ఇవ్వబడును అని అనెను. ఆ వేదార్థులైన మునులు జనకుని మాటనువిని, మహాసారమైన ధనమును చూచి, ధనాతిశయ కారణమున దానిని పొందదలచినవారై, వేదజ్ఞానమదముచే పొంగినవారై, పరస్పరముగా ఆ ధనమును పొందుటకై శ్రద్ధ వహించిరి. మనస్సుతో ఆ ధనమును పొంది – ఈ ధనము నాదియనియు, మరొకడు ఈ ధనము నాదేనా కాదా? అనియు ఎందులకు సంశయించుచున్నారో చెప్పుము. (నాదే అనుట నిశ్చయము) అనియు ధన దోషముతో అనేక విధములుగా వాదములు చేసిరి. అట్లే అచట విద్వాంసుడు, బ్రహ్మ వాహుని

(వేదములను పూర్తిగా చదివినవాని) పుత్రుడును, కవియు మహాతేజస్వియై బ్రహ్మ వేత్తలలో అత్యుత్తముడైన బ్రహ్మయొక్క అంగమునుండి పుట్టి బ్రహ్మవేత్తలలో శ్రేష్టుడైన యాజ్ఞ వల్క్యుడు శిష్యునితో సుస్వరముగా ఇట్లు పలికెను. ఓయి ఈ ధనము అంతయు తీసికొని వెళ్ళుము. ఈ ధనము నాదే, సంశయము లేదు. అన్ని వేదములలో నేను వక్తను. నాతో సముడు మరొకడు ఎవ్వడు లేడు. దీనికి ఇష్టపడని బ్రాహ్మణుడు వెంటనే ఆలసింపక నన్ను వాదమునకు పిలుచుగాక" అనెను. అంత బ్రహ్మసముద్రము బ్రాహ్మణ మునులను (సముద్రము) మహా ప్రళయములోవలె అల్లకల్లోల మయ్యేను. యాజ్ఞవల్క్యుడు నవ్వుచున్నవాని వలె ఆ మునులతో ఇట్లనెను. ఓ విద్వాంసు లారా! కోపింపకుడు. మీరు సత్యవాదులు. యుక్తాయుక్తమును తెలుసుకొనదలచుచున్న వారమై పరస్పరము వాదించు కొందము. అంత వారెదురుకు చేరిరి. సూక్ష్మదర్శనమువలన కలిగిన శుభార్థములతో వారి వాదములు అనేక విధముల నడచినవి. లోకమునను, వేదమునను, ఆధ్యాత్మమునను విద్యా స్థానములతో అలంకరింపబడినవియు, శపింపగల ఉత్తమగుణములతో కూడి నవియు, రాజసమూహములకు దూరమైనవియునైన ఆ మహాత్ముల వాదములు ధనకారణ ముగా అచట జరిగినవి. ఋషులు అందఱు ఒకవైపును యాజ్ఞవల్క్యుడు ఒక వైపును అయిరి. ధీశాలియైన బ్రహ్మరాశియు (జ్ఞానరాశియు) మహాతేజస్వియైన యాజ్ఞవల్క్యుడు ఆ మునులందరిని జయించి వెంటనే వాదము చేయనున్న శాకల్యునితో ఇట్లు అనెను. "ఓ శాకల్య! చెప్పదలచిన దానిని చెప్పుము. చింతించుచు ఎందులకు ఊరకున్నావు? గాలి ఊదిన తిత్తివలె స్తబ్ధమైన అభిమానముతో నిండినవాడవు" ఈ విధముగ యాజ్ఞ వల్క్యునితో తిరస్కరింపబడినవాడైన, శాకల్యుడు కోపమువలన ఎఱ్ఱని మోము, కన్నులు కలవాడై మునుల సన్నిధిలో పురుషుడైన ఆ యాజ్ఞవల్క్యునితో ఇట్లనెను. ఓ యాజ్ఞవల్క్యా నీవు మమ్ములను గడ్డిపోచగా వదిలి ఈ మునులను గూడ అట్లే వదిలి మహాసారమైన విద్యాధనమును నీ అంతట నీవే గ్రహింప తలచితివి అని అడిగెను. శాకల్యుడు ఈ విధ ముగా అడుగగా వారితో యాజ్ఞవల్క్యుడు "బ్రహ్మిష్ఠ (జ్ఞాననిష్ఠు)ల యొక్క బలము విద్య యొక్క తత్త్వార్థదర్శనము అని తెలియుము. కామము అర్థముతో సంబద్ధమైనది. కావున అర్థమును (ధనమును) కోరుకొనుచున్నాము. కామప్రశ్నయే ధనముగా గలవారు బ్రాహ్మణులు కావున కామ ప్రశ్నలనే చెప్పుచున్నాము. ఈ రాజర్షి యొక్క పందెముకూడ ఇదియే. కావుననే నాచే ధనము తీసికొనిపోబడినది అని పల్కెను. యాజ్ఞవల్క్యుని ఈ మాటను విని కోపముతో యాజ్ఞవల్క్యునితో ఇపుడు నాచే ఉద్దేశింపబడిన కామ ప్రశ్నలను యథార్థముగా చెప్పుము అని కామ ప్రశ్నార్థముగల వాక్కులను పలికెను. తరువాత

బ్రహ్మవేత్తలైన వారిరువురికి గొప్పవాదము జరిగెను. శాకల్యుడు యాజ్ఞవల్క్యుని తీక్ష్ణమైన వేయి ప్రశ్నలను అడిగెను. అపుడు ఋషులు వినుచుండగా అన్ని ప్రశ్నలకు సమాధానము చెప్పెను. శాకల్యుడు వాద ప్రశ్నలు లేనివాడు కాగా యాజ్ఞవల్కుడు ఆతనిని ఓ శాకల్యా నీవు నాయొక్క కామికమైన ప్రశ్నకు సమాధానము చెప్పుమనెను. ఈ వాదమునకు పందెము ప్రశ్నకు సమాధానము చెప్పనివాడు మరణము నొందవలెను. తరువాత ధీశాలియైన యాజ్ఞవల్క్య నిచే ప్రశ్న అడుగబడినది. శాకల్యుడు దానికి సమాధానము తెలియక వెంటనే మరణము నొందెను. ఈ విధముగ ప్రశ్న వ్యాఖ్యానముచే పీడింపబడిన వాడై శాకల్యుడు మరణించెను. ఋషులకును, యాజ్ఞ వల్క్యునకు ధనార్థులైన మునులతో గొప్పవాదము జరిగెను. ఓ మునీ! అందరిచేత అడుగబడిన నూర్లకొలది, వేలకొలది ప్రశ్నలను వానిసారమును మహాజ్ఞానియు ఇంద్రియాదులను వశమందుంచుకొన్న వాడునై యాజ్ఞవల్క్యుడు వ్యాఖ్యానించి, ధనమును తీసికొని, కీర్తిని వ్యాపింపజేసి స్వస్థుడై శిష్యునితో కూడుకొని గృహమునకు వెళ్ళెను.

దేవమిత్రుడైన శాకల్యుడు మహాత్ముడు. బ్రాహ్మణ పండితోత్తముడు, పదవేత్తలలో ఉత్తముడైన ఆ బుద్ధిమంతుడు, ఐదు సంహితలను చేసెను. ఆతనికి ఐదుగురు శిష్యులు ఉండిరి. ముద్గలుడు, గోలకుడు, ఖాతీయుడు, మత్స్యుడు ఐదవవాడు శైశిరేయుడు, శాకపూర్ణరథీతరుడు మూడు సంహితలను చెప్పెను. బ్రాహ్మణ పండితోత్తముడైన నిరుక్తుడు నాల్గవ సంహితను చెప్పెను. ఆతని శిష్యులు నలుగురు కేతవుడు, దాలకి, ధర్మశర్మ, దేవశర్మ వీరందరును వ్రతమును ధరించిన ద్విజులు. శాకల్యుడు మరణింపగనే వారందరు బ్రహ్మహత్యజేసినవారైరి. అపుడు మిక్కిలి చింతను పొంది వారందరు బ్రహ్మ సమీపమునకు వెళ్ళిరి. బ్రహ్మ మనస్సుతోనే వారిని దెలిసికొని పవన పురమునకు పంపెను. మీరు వెంటనే పవనపురమునకు పొందు మీ పాపము వెంటనే నశించును అనెను. అచట ద్వాదశార్కునకు, వాలుకేశ్వరునకు నమస్కరించి పదకొండు మంది రుద్రులను, విశేషించి వాయుపుత్రునికి గూడ నమస్కరించియు నాలుగు కుండములలో స్నానము చేసి బ్రహ్మహత్య నుండి తరించుడు అనెను. అంత అందరును మిక్కిలి వేగము గలవారై ఆ పవనపురమునకు వచ్చిరి. చెప్పినట్లు విధివిధానముగా స్నానము ఆచరించిరి. చేయబడినది. దేవతలదర్శనము కూడ చేయబడినది. ఉత్తరేశ్వరునకు నమస్కరించి బ్రాహ్మణుల అనుగ్రహమున వారు అందరును పాపముక్తులై సూర్యమండలము చేరిరి. అది మొదలు ఆ తీర్థము పాతకనాశన తీర్థమయినది. పూర్వము వాయువుచే నిర్మింపబడినదిగాన పవిత్రమైన వాయువు యొక్క పురము. అంజనాదేవి గర్భమున పుట్టిన హనుమంతుడైన పవనపుత్రుడు, సత్యపరాక్రముడు

నులయిన మహాదేవ హనుమంతుడు పుట్టినపుడు బ్రహ్మ నుండి పుట్టిన వాయువుచే ఆ తీర్థము ఇట్లు నిర్మింపబడినది. భూమిలో జనించిన శూద్రులు, బ్రాహ్మణులకు నివేదింపబడిరి. వృత్తి కొరకును బ్రహ్మయజ్ఞము కొఱకును వారిలో గొప్ప పన్ను విధింప బడినది. ఈ విధానముతో విప్రుల యొక్క బ్రాహ్మణుల శాసనము పెద్దది అయ్యెను. గోవును చంపినవాడుగాని, చేసిన మేలు మరచినవాడుగాని, సురాపానము చేసినవాడుగాని, గురుభార్యను పొందినవాడుగాని, వాడు ఆదిత్యునికి నమస్కరించి సర్వపాముల నుండి విముక్తుడు అగుచున్నాడు. (60)

ప్రజాపతివంశానుకీర్తనము

ఋషులు పలికిరి :

భారద్వాజుడు, యాజ్ఞవల్క్యుడు, గాలకి, సాలకి, ధీశాలియైన శతబలాకుడు, బ్రాహ్మణోత్తముడైన నైగముడును ఉండిరి. వారిలో బాష్కలియైన భరద్వాజుడు మూడు సంహితలను చెప్పెను. రథీతరుడు నిరుక్తుడును నాలుగవ సంహితను చేసిరి. అచట మహాత్ములై గుణాన్వితులైన ముగ్గురు శిష్యులు ఉండిరి. బుద్ధిశాలియైన, నందాయ నీయుడు, మతిమందుడైన పన్నగారియు, మూడవవాడు ఆర్యవస్తేయనుడు అనువారు వీరు తపస్సు చేత సంపూర్ణము చెందిన వ్రతములు కలవారు. రాగము లేనివారు, మహా తేజస్వులు, సంహితా జ్ఞానముయొక్క సారమును గ్రహించిన వారును అగు వీరు సంహితలను ప్రర్తింపజేసిన బహ్వృచులని చెప్పబడినారు. వైశంపాయనగోత్రుడైన ఈతడు యజుర్వేదమును విశేషముగ వికల్పించెను. ఈతనిచే శుభకరములైన ఎనుబది ఆఱు (86) యజుస్సుల సంహితలు చెప్పబడినవి. వానిని విధివిధానముతో శిష్యులకు ఇచ్చెను. వారుగూడ విధివిధానముతో స్వీకరించిరి. అక్కడ మహాతపస్వియైన యాజ్ఞ వల్క్యుడు వదిలివేయబడెను. ఆతని యొక్క ఎనుబది ఆఱు సంహితలు గూడ వికల్పములు. వాటికి అన్నింటికిని మూడు విధములుగా భేదములు చెప్పబడినవి. ఈ శుభకరమైన తొమ్మిదవ భేదమున గూడ ఆ మూడు విధములైన భేదములు చెప్పబడినవి. ఉత్తర సంబద్ధములైన దేశములును మధ్య దేశములును, తూర్పు దేశములును వేరు విధములైనవి. ఉదీచ్యులకు శ్యామాయని ప్రధానుడు అయ్యెను. మధ్య దేశమున ప్రతిష్ఠితులైనవారిలో ఆరుణి ప్రథముడుగా స్తుతింపబడెను. ప్రాచ్యులకు ఆలంబియను వాడు మూలము. వారు త్రయోదశాద్యులు. ఈ వీరందరు చరకులుగా చెప్పబడిరి. వీరు సంహితులను జెప్పిన బ్రాహ్మణులు. ఋషులు ఆ మాటలనువిని తెలిసికొను కోరికతో సూతునితో అనిరి.

ఏకారణమున చరకులు అధ్వర్యులు (యజ్ఞములో యజుర్వేద మంత్రములు చదువువారు) అయిరి చెప్పుము. ఏమి జరిగినది? వారు ఏ కారణమున అధ్వర్య వాచకత్వమును పొందిరి" అని అడుగబడిన వాడై సూతుడు వారికి చరకత్వము వచ్చిన విధమును చెప్పెను.

సూతుడు అనెను :

ఓ బ్రాహ్మణ పండితోత్తములారా! మునుల యొక్క ఒక పని ఉండినది. మేరువు వీపు భాగమునచేరి వారు ఒకటిఅని మంత్రించిరి. ఓ బ్రాహ్మణోత్తములారా! ఎవడు ఏడు రాత్రులలో ఇచటికి రాడో! వాడు బ్రహ్మ హత్యచేసినవాడగును. ఇది మా పందెము" అని చెప్పిరి. తఉువాత, వారు వైశంపాయనుడు తక్క తక్కిన గణముతో కూడినవారై పందెము గట్టిన చోటికి ఏడు రాత్రులలో వెళ్ళిరి. బ్రాహ్మణ వచనమును అనుసరించి వైశంపాయనుడు బ్రహ్మహత్య చేసినవాడయ్యెను. తరువాత వైశంపాయనుడు తన శిష్యులను తనకడకు రప్పించి, ఓ బ్రాహ్మణోత్తములారా! నా కొరకుగాను మీరు బ్రహ్మ హత్యను చేయుడు. మీరు అందరు నాకడకు కూడి వచ్చి దానికి తగిన మాటను చెప్పుడు" అని పలుకగా.

యాజ్ఞవల్క్యుడు :

"నేనే ఆ బ్రహ్మహత్యను చరింతును. ఈ మునులు ఊరకుదురు గాక! నా తపముతో భావింపబడినవాడనై బలమును పైకి రప్పించెదను" అని ఈ విధముగ పలుకగనే వైశంపాయనుడు కోపించి యాజ్ఞవల్క్యునితో "నీవు చదివినదంతయు మరల నాకిచ్చి వేయుము అని అనెను. ఇట్లు అనగనే బ్రహ్మవిత్తముడైన యాజ్ఞవల్క్యుడు రక్తసిక్తములైన రూపముదాల్చిన యజుస్సులను వమనముజేసి గురువునకు ఇచ్చెను. తరువాత ఓ ద్విజులారా! యాజ్ఞవల్క్యుడు ధ్యానయోగమున నిలచి సూర్యుని ఆరాధించెను. యాజ్ఞ వల్క్యుని నుండి వెలువడిన యజుర్వేదమంతయు ఆకాశమునకు పోయి వేదాత్మకుడగు సూర్యునిచేరి నిలిచినది. తరువాత సూర్యమండలమును చేరిన యజుస్సులను అన్నింటిని సంతుష్టుడైన సూర్యుడు, వేదమునకు విధానరూపుడైనట్టియు, ధీశాలియైనట్టియు, తన అశ్వరూపుడైనట్టి యాజ్ఞవల్క్యునకు ఇచ్చెను. బ్రహ్మచేతగాని, మరెవ్వరిచేతగాని, అశ్వరూపుడగు యాజ్ఞవల్క్యునిచే ఇవ్వబడిన యజుస్సుచే అధ్యయనము చేయబడును. అందువలన అవి వాజులు (గుఱ్ఱములు) అనబడినవి. బ్రహ్మహత్య ఎవ్వరిచే చరింపబడినదో అనగా చేయబడినదో వారు చరించుట వలన చరకులు అనబడినారు. అనగా వైశంపాయన శిష్యులైనట్టి వారు చరకులని చెప్పబడిరి.

వాజులైన వారినిగూర్చి వినుడు. వారు యాజ్ఞవల్క్యుని యొక్క శిష్యులు. వారు కణ్వ వైధేయలు, శాలులు, మధ్యందినుడు, శాపేయి, విదిగ్ధుడు, ఆప్యుడు, ఉద్దలుడు,

తామ్రాయణుడు, వాత్స్యుడు, గాలవుడు, శైశిరి, ఆటవి, పర్ణి, వీరణీపరాయణుడు అను వీరు పదియైదుగురు వాజులని చెప్పబడిరి. యజుస్సుల యొక్క వికల్పములు మొత్తము నూట ఒక్కటి.

తఱువాత జైమిని తన పుత్రుని సుమంతుని చదివించెను. ప్రభువైన సుమంతుడు కూడ పుత్రుడైన సుత్వానుని చదివించెను. సుకర్ముడు సైతము సహస్రుని వేగముగా చదివించి, సుకర్మ సూర్యవర్చస్వియైన సహస్రునకు సంహితలను చెప్పెను. ఇంద్రుడు అనధ్యాయ దినములలో చదువుచున్నవారిని చంపెను. తరువాత సుకర్ముడు శిష్యుల కారణముగా ప్రాయోపవేశము (నిరాహారదీక్ష) చేసెను. తరువాత ఇంద్రుడు కోపించిన సుకర్ముని చూచి అతనితో "నీకు మహావీర్యవంతులు, అగ్నితేజస్కులు అయిన శిష్యులు కలుగనున్నారు. వీరు మహా ప్రజ్ఞాశాలురు అయి ఈ ఇద్దరును చక్కగా చదువువారు. వీరిరువురు దేవతలు, మహాభాగులు. "ఓ బ్రాహ్మణోత్తమా! కోపింపకుము" అని అనిరి. ఈ విధముగా ఇంద్రుడు సుకర్మునకు చెప్పి ఆ సుకర్మను శాంతక్రోధునిగా చూచి అచటనే అంతర్ధానమునుందెను. ద్విజులారా! ఆ సుకర్ముని శిష్యుడు బుద్ధిశాలియైన పౌష్యంజియ కుశిక వంశజుడైన హిరణ్యనాభుడు అను రాజు రెండవ శిష్యుడు అయ్యెను. పౌష్యంజి వేయిన్నర (ఏబది) సంహితలను (శిష్యులకు) చదివించెను. దానిచేత పౌష్యంజి శిష్యులు అన్యోదీచ్య (ఇతరులైన ఉత్తరదిక్కువారు) సామాన్యులై శుభులైరి. వీర్యవంతుడైన కౌశిక్య హిరణ్యనాభుడు ఐదువందల సంహితలను చదివించెను. హిరణ్యనాభుని శిష్యులు ప్రాచ్య సామగులుగా చెప్పబడినారు. లోకాక్షి, కుథుమి, కుశలి, లాంగలి అను నలుగురు పౌష్యంజి శిష్యులు, వారి భేదములను వినుడు. రాణాయనీయుడు ఆతడు తండ్రి పుత్రుడు, వానికంటె వేరైనవాడు మూలచారి. మంచివిద్వాంసుడు. సతిపుత్రుడు, సహసాత్యని పుత్రుడు వీరి లోకాక్షి యొక్క భేదములుగా తెలిసికొనుడు. కుథుమి యొక్క పుత్రులు ముగ్గురు, ఔరసుడైన రసపాసరుడు, భాగవిత్త, తేజస్వీ శౌంద్యుర్యుడు, శృంగిపుత్రుడు (శౌర్జుడు) వీరిద్దరును చక్కగా వ్రతమాచరించిన వారు. రాణాయనీయుడు, సౌమిత్రియు సామవేద పండితులు. మహాతపస్వియైన శృంగి పుత్రుడు మూడు సంహితలను చెప్పెను. చైలుడు, ప్రాచీన యోగుడు, సురాలుడును సంహితలను చెప్పిరి. పారాశర్యుడైన కౌథుముడు ఆఱు సంహితలను చెప్పెను. ఆ సురాయణుడు, వైశ్యాఖ్యుడును వేదవృద్ధులందు ఆసక్తిగలవారు ప్రాచీన యోగపుత్రుడును బుద్ధిమంతుడు అయిన వాడు పతంజలి. కౌథుముని ఆ భేదములు పారాశర్యుని యొక్క ఆఱు (భేదములు)గా చెప్పబడినవి. లాంగలియు శాలిహోత్రుడును చెరియొక యాఱు సంహితలను చెప్పిరి. భాలుకి, కామహాని, జైమిని,

లోమగాయి, కుండుడు, కోహలుడు, ఈ ఆఱుగురును లాంగలు. ఈ లాంగలులైన శిష్యులు సంహితలను ప్రసాదించిరి. ఆ తరువాత హిరణ్యనాభునకు శిష్యుడై, మానవ శ్రేష్ఠుడై రాజకుమారుడు ఇరువది నాలుగు సంహితలను చేసెను. ఆ సంహితలు శిష్యులకు చెప్పెను. ఆ శిష్యులను వినుడు. వారు రాడుడు, మహావీర్యుడు, రోదవహుడు, వాహనుడును, తాలకుడు, పాండవకుడు, కాలికుడు, రాజికుడు, గౌతముడు, అజబస్తుడు, తఱువాత సోమరాజు వచ్చెను. పృష్ఠఘ్నుడు, పరికృష్ఠుడు, ఉలూఖలకుడు, యవీయసుడు, వైశాలుడు, అంగులీయుడు, కౌశికుడు, సాలిమంజరి, సత్యుడు, కాపీయుడు, కానికుడు ధర్మాత్ముడైన పారాశరుడు అని క్రాంతులైనవారు సామగులు. సామగులందరిలో శ్రేష్ఠులు ఇద్దరని చెప్పబడిరి. వారు పౌష్యంజియు కృతియును వీరు సంహితల వికల్పకులు. ఓ బ్రాహ్మణులారా! సుమంతుడు అధర్వములను రెండు విధములుగాచేసి కబంధునకు ఇచ్చెను. ఆతడు గూడ యథా క్రమముగా మొత్తము తెలిసికొనెను. కబంధుడు రెండుగాచేసి ఒకదానిని పథ్యునకు ఇచ్చెను. రెండవదానిని వేదస్పర్శునకు ఇచ్చెను. ఆతడు దానిని నాలుగు విధములుగ చేసెను. వేదస్పర్శునకు దృఢవ్రతలైన నలుగురు శిష్యులు బ్రహ్మబలుడైన మోదుడు, పిప్పలాదుడు, ధర్మజ్ఞుడైన శాక్వాయనియు నాలుగవవాడు తపనుడు అనబడెను. పథ్యులయొక్క ఉత్తమ భేదమును మరల మూడు విధములని తెలిసికొనుము. జాబాలి, కుముదాది, మూడవవాడు శౌనకుడు అనబడెను. శౌనకుడు సంహితను రెండుగాచేసి ఒకదానిని ప్రభువునకు ఇచ్చెను. ధీమంతుడైన శౌనకుడు రెండవదానిని సైంధవాయనుడను పేరుగల వానికి ఇచ్చెను. సైంధవుడు మంజకేశునకు ఇచ్చెను. ఆ సంహిత మరల రెండుగా భిన్నము అయ్యెను. నక్షత్ర కల్పము, వైతానము, మూడవది సంహితావిధి, నాలుగవది అంగిర సంకల్పము, ఐదవది శాంతి కల్పము. ఆధర్వణము శ్రేష్ఠము. ఇవి సంహితలయొక్క వికల్పనములు. ఓ ఋషి సత్తములారా! ఆఱుగాచేసి నాచేత గూడ పురాణము చెప్పబడినది. ఆత్రేయుడు, సుమతి, ధీమంతుడు, కాశ్యపుడు, ఆకృతవ్రణుడు, భారద్వాజుడు, అగ్నివర్ణుడు, వసిష్ఠుడు, మిత్రయుడు, సావర్ణి, సోమదత్తి, సుశర్మ శాంశపాయనుడు అను వీరు నా శిష్యులు, పురాణములలో దృఢవ్రతులు. మూడు సంహితలు ముప్వరిచే మరల మూడుగా చేయబడినవి. కాశ్యపుడు సంహితాకర్త. సావర్ణి శాంశ పాయనుడును (సంహితాకర్తలు). సామికా అనునది నాలుగవ సంహిత. ఆ ఇది పూర్వ సంహిత. ఆ సంహితలన్నియు నాలుగు పాదములుగలవి. అన్నియు ఒకే అర్థమును చెప్పునవి. పాఠాంతరమున వేదశాఖలవలె వేరుగా అయినవి. అన్ని సంహితలును శాంశపాయనిక సంహితను విడిచి నాలుగువేలు. లోమహర్షణికులు

మూలములైనవారు. అటు తరువాత వారు కాశ్యపికులు, మూడవవారు సావర్ణికులు యజుర్వాక్యార్థ పండితులు ఇతరులు ప్రేరణార్థముతో అలంకరింపబడిన శాంశ పాయనులు. వీరి ఋక్కులు ఎనిమిది వేల యాఱువందలు. ఇవియు, మఱిపదియైదును మరి వందయును వాలఖిల్యులు సమాన ప్రైషలు గలవారై ససావర్ణులుగా జెప్పబడిరి. సామవేద గాయకులు ఎనిమిదివేల పదునాలుగు సామములను ఆరణ్యకముగా హోమముతోబాటు గానము చేయుదురు. వ్యాసుడు వికల్పించిన ప్రకారము యజుస్సుల యొక్కయు, బ్రాహ్మణుల యొక్కయు పంద్రెండువేలే కలవు. ఛందము ఆధ్వర్యము అనబడినది. అది సంగ్రామ్యారణ్యక మగును. అట్లే సమంత్ర కరణముగూడ అగును. దీనికి తరువాతి కథలకు పూర్వములు అను విశేషణము ఉండును. సమంత్రమైన గ్రామ్యారణ్యము – ఋగ్బ్రాహ్మణము అనబడినది. అట్లే హరిద్రవీయుల యొక్కయు, తైత్తిరీయుల యొక్కయుఖిలములైనవియు ఉపఖిలములైనవియును పరక్షుద్రములు అనబడినవి.

వాజసనేయ వేదమున ఒక వేయి తొమ్మిది వందలు ఋగ్గణము (ఋక్, గణములు) లెక్కింపబడినది. బ్రాహ్మణము మాత్రము నాలుగింతలు. ఎనిమిది వేల ఎనిమిది వందల ఎనుబది వాని సంఖ్యకు ఋకు అధికమైనది పాదము. ఇది ఋక్కుల యొక్కయు, యజుస్సుల యొక్కయు ప్రమాణము. అది శుక్ల యజుస్సుతోను అఖిల యాజ్ఞవల్క్యముతోను కూడినది.

అట్లే చరణ విద్యలయొక్క ప్రమాణము (అయిన) సంహితను వినుము. అందు ఆఱువేల ఋక్కులు కలవు. మఱియు పదినాల్గుగూడ అధికముగా చెప్పబడినవి. ఈ ఋక్కులకు ఇంతయే అధికము. యజుస్సును ఇష్టము వచ్చినట్లు చెప్పవచ్చును. పదునొకండు వేలు మఱి పదియైదు పదివేల ఋక్కులు, మూడు వందల ఎనుబదియు, ఒక వేయి మంత్రములు ప్రమాణముగా గలవి. భృగుల విస్తారమంతయు ఇతరమైన ఆథర్వికవేదము చాల ఉన్నది. ఐదువేల ఋక్కులు, ఐదువేలు అథర్వములు అని వాని సంఖ్య. ఇరువదిని విడిచివేయి మరొక్కటిఅని ఋషులు తెలిపిరి. ఇది అంగిరసునిచే చెప్పబడినది. ఇది వారి ఆరణ్యకముఅని ఈ విధముగ (ఋక్కులు) లెక్కింపబడును. అట్లే శాఖా భేదములు కూడగలవు. శాఖలయొక్క కర్తలును, వారిభేదములలో కారణములునుసమస్త మన్వంతరము లలో గూడ ఇట్లే ఉండును. శాఖా భేదములు గూడ సమానము.

ప్రాజాపత్యమైన శ్రుతి నిత్యమైనది. ఇవి దాని వికల్పము (భేదము)లు అనబడినవి. దేవతలయొక్క నిత్య భావము వలన మరల మరల మంత్రోత్పత్తి జరిగినది. మన్వంత రముల యొక్కయు, సురలయొక్కయు నామ నిశ్చయము చేయబడినది. ద్వాపరయుగము లందు వినబడిన వేదములకు మరల భేదములు కలవు.

ఈ విధముగ భగవద్రూపుడైన ఋషి శ్రేష్ఠుడు వేదమును ఇతర శిష్యులకు ఇచ్చి మరల తపము చేయుటకు వెళ్ళెను. ఆతని శిష్యుల ప్రశిష్యులచేత ఈ శాఖా భేదములు ప్రవర్తింప జేయబడినవి. శిక్షాదులైన ఆయా అంగములు (వేదాంగములు) నాలుగు. వేదములు, మీమాంస, న్యాయము, ధర్మశాస్త్రము, పురాణము ఇవి చతుర్దశ (14) విద్యలు, ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వ వేదము అను ఈ మూడితోపాటు, నాలుగవది అర్థ శాస్త్రము ఇవి అష్టాదశ (18) విద్యలు. మొదటివారు బ్రహ్మర్షులు. వారి నుండి దేవర్షులు వారి నుండి రాజర్షులు, వారి నుండి మూడు ఋషి ప్రకృతులును వచ్చిరి. అని తీక్ష్ణవ్రతులైన మునులు తెలియచెప్పిరి. కశ్యప గోత్రము లందును, వసిష్ఠ గోత్రము లందును, భృగు, అంగీరస గోత్రములందును ఈ అయిదు గోత్రములందు బ్రహ్మ వాదులు జన్మింతురు. బ్రహ్మను పొందుదురు కావున బ్రహ్మర్షులు అనబడినారు. ధర్మునకును, పులస్త్యునకును, క్రతువునకును, పలహునకును, ప్రత్యూషు నకును, ప్రభాసునకును, కశ్యపునకును, సుతులు. దేవర్షుల పేర్లతో వారిని గురించి వినుడు. ధర్మపుత్రులైన దేవర్షులు నరనారాయణులు ఇరువురు. క్రతువుయొక్క పుత్రులు వాలఖిల్యులు, పులహునకుపుత్రుడు కర్దముడు, పులస్త్యునకుపుత్రుడు కుబేరుడు, ప్రత్యూషునకు పుత్రుడు అచలుడు. కశ్యపునిపుత్రులు పర్వతుడును నారదుడును అను ఇరువురు. వీరు దేవతలను పొందుదురు కావున దేవర్షులు అనబడినారు. మానవ వంశమునను, వైషయ వంశమునను, ఐల వంశమునను పుట్టిన రాజులు ఐలులనియు, ఐక్ష్వాకులు అనియు నాభాగులనియు చెప్పబడిరి. వారు రాజర్షులు. రంజింప చేయుట వలన ప్రజలు రాజులను పొందుదురు కావున రాజర్షులు అనబడినారు. బ్రహ్మలోకమున సుప్రతిష్ఠితులైన వారందరిని బ్రహ్మర్షులుగా చెప్పుదురు. ఇంద్రలోకమున సుప్రతిష్టితులైన వారిని అందరిని రాజర్షులుగా చెప్పుదురు. వంశముతోను, తపస్సుతోను, మంత్రో చ్చారణములతోను బ్రహ్మర్షులుగా చెప్పబడదు. దివ్యులైన రాజర్షులు దేవర్షులు.

దేవర్షులయొక్క లక్షణమును చెప్పెదను. భూత, భవిష్యత్, వర్తమాన కాలముల జ్ఞానము, సత్యము పలుకుట అట్లే స్వయముగా జ్ఞానులైనవారును, తపస్సుచే జ్ఞానులైన ప్రసిద్ధులైన వారును, గర్భమునందు ఉండగనే జ్ఞాన ప్రేరణ కలవారును, మంత్రములను పలుకువారును, ఈశ్వర భావమువలన సర్వము తెలిసికొన్నవారును, అను వీరు దేవర్షులు, బ్రహ్మర్షులు, రాజర్షులు అగుదురు.

ఈ భావములను అధ్యయనము చేయువారు ఋషులని చెప్పుదురు. వీరు ఏడుగురు. ఏడు గుణములచే సప్తర్షులు అనబడినారు. వీరు దీర్ఘాయుష్కులు, మంత్రకర్తలు, ఈశ్వరులు,

దివ్యచక్షువులుగలవారు, జ్ఞానులు, ప్రత్యక్షమైన ధర్మము కలవారు. గోత్ర ప్రవర్తకులు. షట్కర్మలయందు ఆసక్తి గలవారు. (యజన, యాజన, అధ్యయన, అధ్యాపన, దాన, ప్రతిగ్రహములు – షట్కర్మలు.) నిత్యమును ప్రకాశించువారు, గృహస్థులు. సమానములై కనబడని కర్మహేతువులచే వీరు వ్యవహరించుచుందురు. స్వయంకృతములై మైథునాది గ్రామ్యములుకాని ఆనందములతో వర్తింతురు. వారు కుటుంబము గలవారు. బుద్ధి మంతులు. బాహ్యములోను, అంతరములోను నివసించువారు. వీరు కృతయుగాదు లన్నింటిలోను మరల మరల మొదట వర్ణాశ్రమ వ్యవస్థాపనమును చేయుదురు. త్రేతా యుగమురాగా మరల సప్తర్షులు ఇచట అంతటను ఈ బ్రాహ్మణాది వర్గములను బ్రహ్మ చర్యాది ఆశ్రమములను ప్రవర్తింపజేయుదురు. వారియొక్క వంశమునందే మరల మరల వీరలు పుట్టుదురు. పుత్రుడు కలుగుచుండగా తండ్రియు, తండ్రి ఉండగా తన పుత్రుడును ఈ విధముగా నొక్కచోచేరి (వంశపారంపర్యము) ఎడతెగకుండా, యుగాంతము వరకును ఈ సప్తర్షులు ప్రవర్తింపచేయుదురు. గృహమేధులగు వీరు ఎనుబది ఎనిమిది వేలు అని చెప్పబడిరి. సూర్యునకు దక్షిణమున ఉన్నవారు పితృయాణమును సమాశ్రయింతురు. భార్యతో సహా అగ్నిహోత్రము చేయువారై (పితృ దేవతలై) సంతాన హేతువులు అనబడి నారు. గృహమేధుల సంఖ్యలతో లెక్కింపబడినవారై శ్మశానములను ఆశ్రయించిన వారు ఎనుబది ఎనిమిది వేలు. ఉత్తరాయణమునందు ఉంచబడుదురు. స్వర్గమును పొందిన ఊర్ధ్వ రేతస్కులైన ఋషులు మంత్ర బ్రాహ్మణకర్తలై యుగాంతమున జన్మింతురు.

ఈ విధముగా ద్వాపర యుగమున కల్పముల, భాష్య విద్యల, శాస్త్రకారుల నాశనము జరుగగా ఆ ఋషులు మరల మరల పరిభ్రమించుచుందురు. రాబోవు ద్వాపరమున ద్రోణి ద్వైపాయను (వ్యాసు)డు అయ్యెను. గడచిన ద్వాపరమున చక్కని గొప్ప తపస్సుగల వేదవ్యాసుడు వ్యాసుడు అగును. భవిష్యత్కాలములందు శాఖాప్రణయానము (శాఖలను చేర్చుట) జరుగగలదు. తపస్సుచే కర్మ పొందబడినది. కర్మచేత కీర్తి పొందబడినది. కీర్తిచేత సత్యమును పొందబడును. సత్యముచేత అవ్యయుడు (నాశము లేనివాడు) పొందబడును. అవ్యయమువలన అమృతమును, అమృతమువలన సమస్తమును పొందును. ఇది ధ్రువమైన (స్థిరము) ఏకాక్షరము స్వాత్మయందే నిలచి ఉన్నది. అది బృహత్తైనందునను (విశాలమైనందునను) బృంహణమైనందునను (విజృంభించినది, వ్యాపించునది అగుట చేతను) బ్రహ్మ అనబడుచున్నది.

మరల అది ప్రణవమునందు (ఓంకారమునందు) ఉండినదై భూర్భువస్వ అనువ్యా హృతుల రూపమున ఉండును. ఋగ్, యజు, స్సామ రూపియైన బ్రహ్మకు అనగా

వేదమునకు నమస్కారము. జగత్తు యొక్క ప్రళయ ఉత్పత్తులందు కారణమని గుర్తింప బడినదియు మహత్తు కంటె పరమైనదియు, రహస్యమైనదియునైన ఆ సుబ్రహ్మకు నమ స్కారము. అగాధమై అపరమై అక్షయ్యుడును, జగత్తును సమ్మోహింప జేయుటకు నిలయమైనవాడును ప్రకాశ ప్రవృత్తులతో పురుషార్థముల ప్రయోజనము గలవాడునైన ఆ సుబ్రహ్మకు నమస్కారము. దేహ విలక్షణమైన ఆత్మజ్ఞానము గలవారికి ఒక ఉనికి రూపమైన ప్రాప్తిస్థానము, ఆత్మకు సంగమును ఇచ్చునదియు అవ్యక్తమైనదియు, అమృత మైనదియు, శాశ్వతమైనది ప్రకృతి బ్రహ్మ. అది ప్రధానము, ఆత్మయోని, గుహ్యము, సత్త్వమని పిలువబడును. అట్లే విభాగములేనిది, శుక్ర స్వరూపము, అక్షరము, బహు వాచకమును (అనేకమును చెప్పునది) నైన ఆపరబ్రహ్మకు నిత్యము నమస్కారములు చేయుదును. పని చేయబడగా క్రియ ఉండదు. చేయనప్పుడు కూడ క్రియ ఉండదు. (చేయని క్రియ ఉండదు). క్రియ భూతకాలమై నప్పుడు వర్తమానమున క్రియ ఉండదు. అట్లే క్రియ భవిష్యమైనప్పుడు కూడ వర్తమానమున ఉండదు. ఒక్కమారే అంతయు చేయబడినది. కావున అది భూతకాల దృష్టితో కృతము భవిష్యత్కాల దృష్టితో అకృతమును అగుచున్నది. వినదగినది (భవిష్యత్)గాని, వినబడినది (భూతము)గాని, అట్లే సాధువుగాని, తెలియదగినదిగాని, మననము చేయతగినదిగాని, తాకతగినదిగాని, భుజింపతగినదిగాని, చూడతగినదిగాని, వినతగినదిగాని, తెలియతగినదిగాని యేదైన ఉండినచో ఆ బ్రహ్మర్షుల జ్ఞానము మాత్రమే. చూపబడిన ఆజ్ఞానమును మరల ఎవ్వడు వెదకును? భగవంతుడైన వాడే పుం-స్త్రీ వస్తు రూపమైన (అన్నింటిని అందరిని) చెప్పెను. ఒకదానిచే ఒకపని చేయబడినపుడు దానిని వాడు అభిమానించును. ఒకనిచే పూర్వము చేయబడినది మరొకనిచే భావింపబడును. ఒకానొకచోట ఒకనిచే ఒక వాఙ్మయము రచింపబడినపుడు పూర్వము అది ఆతనిచేత చేయబడి ఉండినదై, ఆ కర్తకు సంబంధించినదిగానే ప్రకాశించును. విరక్తమును, అవిరక్తమును, జ్ఞానాజ్ఞానములును, ప్రియాప్రియములును, ధర్మాధర్మములును, సుఖ దుఃఖములును, మృత్యువుఅమృతమును, పైన అడ్డము, క్రిందయును ఆతనికో సంబంధించిన అదృష్టమే (కనబడనిది) కారణముగా కలది అగును.

స్వయంభువుడును, జ్యేష్ఠుడును, పరమేష్ఠియునైన బ్రహ్మ (స్వాయంభువ బ్రహ్మకు) ఇచట త్రేతాయుగమున మరల మరల ప్రత్యేక విద్యకలది కలుగును. ఆ ఏక విద్యగలది ద్వాపరయుగమున మరల మరల వేర్వేరు చేయబడును. ఈ విషయమును వైవస్వత మన్వంతరమున బ్రహ్మకూడ చెప్పెను. ఆయా పేర్లుగల యుగములలో మరల మరల తిరుగుచు పుట్టుచున్నవారై, వీరిచే పరస్పరముగా సంహితలను చేయుదురు. బ్రహ్మర్షుల

సంహితలు ఎనుబది ఎనిమిది వేలు. వీరు (బ్రహ్మర్షులు) ఆ సంహితలనే మరల మరల త్రిప్పి ప్రవర్తింప జేయుదురు. దక్షిణ మార్గమును ఆశ్రయించి శ్మశానములను పొందినవారు యుగయుగమున మరల ఆ వేద శాఖలను వేరు వేరుచేసి ప్రవర్తింప చేయుదురు. ద్వాపర యుగమందువలె అన్ని యుగములందును బ్రహ్మర్షులచే సంహితలు ప్రవర్తింప చేయబడును. వారి గోత్రములలో ఈ శాఖలు మరలమరల ప్రవర్తిల్లును. ఆశాఖలును వాని కర్తలును యుగక్షయము వఱకు ఉందురు. భూత భవిష్యములగు మన్వంతరములలో గూడ ఈ విధముగనే శాఖా ప్రణయనములు (శాఖల ప్రవర్తనలు) జరుగును. భూత కాలములలో గడచినవి, వర్తమాన కాలములలో ప్రవర్తిల్లు చుండును. భవిష్యత్కాలములలో గూడ కలుగబోవునవి వర్ణింపబడును. పూర్వముతో (భూతకాలముతో) పశ్చిమమును (భవిష్యమును) వర్తమానముతో భూత భవిష్యముల రెంటిని తెలియవలెను. ఈ క్రమ యోగముతో మన్వంతరముల నిశ్చయము జరుగును. ఈ విధముగ దేవతలు, పితృ దేవతలు, ఋషులు మంత్రములతోబాటు పై లోకమునకు వెళ్ళుదురు. ఆ మంత్రములతో బాటే తిరిగివత్తురు. పశుకల్పమైన జనలోకము నుండి దేవతలందరును ఊర్ధ్వ లోకమునకు పోవుదురు. తిరిగి వత్తురు. కాని సమాప్తి కాలము వచ్చినప్పుడు వారెవ్వరికిని జన్మింపరు. అపుడు వారు తప్పనిసరిగా కలుగబోవు ఒక విషయముతో సంబంధింపబడి ఉందురు. అందువలన వారు దోషములతో కూడిన జన్మను రాగ పూర్వకముగ చూతురు. అపుడు వారి ప్రవృత్తి జన్మదోష దర్శనమగు నంతవరకు మరలును. ఈ విధముగ ఇచ్చట పదిదేవ యుగములను చేసి (వారివృత్తి) మరలును. వారు జనలోకము నందు ఉండి తపోలోకమును తిరుగులేక చేరుదురు. ఈ విధముగ ఇట వేలకొలది దేవయుగములు గడచిపోవును. యుగములు మునులతో పాటు బ్రహ్మలోకమున నిధనమును(మృత్యువును) పొందును. వాని విస్తరములను ఆనుపూర్వికముగా చెప్పశక్యము గాదు. కాలము అనాది అగుటయు, అంతటను లెక్కింప అలవి గాకుండుటయు దానికి కారణము. ఇట్లు పురాకల్పములతోబాటు మన్వంతరములు గడచి పోయినవి. పితృదేవతలతోను, మునులతోను, దేవతలతోను, సప్తర్షులతోనుగూడ కాలముతో ప్రతిసృష్టములైన యుగముల నివర్తనము జరుగును. ఈ క్రమయోగముతో ప్రజలతోగూడిన కల్ప మన్వంతరములు నూర్లకొలది, వేలకొలది గడచిపోయినవి. మన్వంతరముల చివర దేవతల యొక్కయు, ఋషుల యొక్కయు, మనువు యొక్కయు, పితృగణము యొక్కయు సంహారము జరుగును. ఆ సంహారము చివరవారి పుట్టుకయు జరుగును. సృష్టియొక్కగాని, సంహారముయొక్కగాని అన్ని విధముల విస్తరమును ఆను పూర్వితో నూరేండ్లలోగూడ చెప్పుట సాధ్యముగాదు. మానుష రీతిలో మన్వంతర సంఖ్యను చెప్పెద వినుడు.

దేవతలను, ఋషులను లెక్కించుటలో, నిష్ణాతులైన బ్రాహ్మణులు ఆ సంఖ్యలు నిండు ముప్పదికోట్లుగా లెక్కించిరి. అట్లే తక్కినవి లెక్కలో అఱువది ఏడు లక్షల ఇరువది వేలు. ఈ కాలము అధికములను విడిచి లెక్కింపబడినది. ఈ మన్వంతర సంఖ్య మానుష గణనలో చెప్పబడినది. దివ్యవత్సరముతో మనువు యొక్క అంతరమును చెప్పెదను. దివ్యసంఖ్యలో ఎనిమిది వందలు అని చెప్పబడినది. అట్లే తక్కినవి ఏబది రెండువేలు అధికములు. ఈ కాలము నాలుగింతలైనచో అది ఆ భూత సంప్లవము. (భూతముల ప్రళయము). అది నిండుగా వేయియుగములు అగును. అది బ్రహ్మకు ఒక దినము. అధిభూత సంప్లవమున సూర్య కిరణములతో అన్ని భూతములు కాలిపోయినవై బ్రహ్మను ముందిడుకొని దేవ, ఋషి, దానవులతో పాటు, దేవశ్రేష్ఠుడు దేవదేవుడు అయిన మహేశ్వరునిలో ప్రవేశించును. ఆతడు (మహేశ్వరుడు) కల్పాదులలో, మరల మరల సర్వ భూతములను సృష్టించువాడు. అని ఇది దేవర్షులతో బాటు మనువు యొక్క స్థితి కాలము. సర్వ మన్వంతరముల త్రిసంధిని వినుడు. ఈ విషయమున నాచే యుగమను పేరుతో పూర్వమే చెప్పబడినది. కృత త్రేతాదులతో కూడినది చతుర్యుగము అనబడినది. అది ఇరువదియొక్క మారులు తిరుగుతు వచ్చినది. సాధికము ప్రభువైన భగవంతుడు (దీనిని) మనువుయొక్క అధికారముగా చెప్పెను. ఈ విధముగా భూత, భవిష్యత్తులైన మన్వంతరముల లక్షణము వర్తమానముతో చెప్పబడిన ఇది స్వాయంభువ మనువుయొక్క సృష్టి. దానియొక్కయు, వేరొకదాని త్రిసంధిని చెప్పెదను. మన్వంతరము యథాపూర్వము గనే ఋషులతోను, దేవతలతోను గూడ అవశ్యంభావి (తప్పని సరిగా జరుగు) విషయముతో సంబద్ధమై నివర్తించును. ఈ మన్వంతరమున పూర్వము త్రైలోక్యమునకు ఈశ్వరులైన సప్తర్షులు, దేవతలు, పితరులు, మనువులును మన్వంతర కాలము సంపూర్ణముగా గానే సాధకులును, క్షీణాధికారులై ఆత్మయొక్క ప్రతిరూపమును తెలిసినవారై; వారు అందరును మహర్లోకమునకు ఉన్ముఖులై గమనమునకు పూనుకొందురు. తఱువాత ఆమన్వంతరమున ప్రక్షీణులైన ఆదేవతలు స్థితికాలము సంపూర్ణముగా ఒక కృతయుగము (వరకు) ఉందురు. మన్వంతరేశ్వరులు ఉన్నంతవరకు దేవతలు, పితరులు, ఋషులు మనువును పుట్టుచుందురు. పుట్టబోవుచుందురు మన్వంతరము సంపూర్ణమైనప్పుడు మఱొక కలియుగము వచ్చినచో (చివర కలియుగము ఏర్పడినచో) అప్పుడు కలితో మిగిలియున్న (కలి శేషించియున్న) యుగములో (చివరి కలియుగములో) కృతయుగ (లక్షణ)ము సంపన్నమగును. బుధులు కృతయుగము యొక్క సంతానమును కలి పూర్వకముగా (కలియుగము తనకు పూర్వయుగమైనట్లుగా చెప్పుదురు. అట్లే మన్వంతరముల చివరలలో

(కలి ఉన్నదై రానున్న మన్వంతరములకు ఆదియగును పూర్వ మన్వంతరము క్షీణించి మరొకమన్వంతరము రాగా పూర్వమన్వంతరపు చివరి కలియుగమున మిగిలియున్న సప్తర్షులు, మునులు మన్వంతర సమాప్తి కాలమును చూచుచున్నవారై మరొక మన్వంతరమునకై ప్రతీక్షించుచు తపస్సులో ఉండి క్షీణింతురు. మరొక మన్వంతర ప్రారంభమున మన్వంతర వ్యవస్థ కొఱకును అంతట సంతతికొఱకును పూర్వమువలెనే (పూర్వయుగములో వలెనే) సృష్టిలో ప్రవర్తింతురు. వృష్టి, సృష్టి ప్రవర్తింపగా, జంటలు సృష్టింపబడగా, ఓషధులు పుట్టగా, అచ్చటచట ప్రజలు వారి గృహములను నెలకొల్పుకొనగా, జీవనోపాయములు ఏర్పడగా, ఋషులు భావించిన సద్ధర్మములు ప్రవర్తిల్లినవి. అంతకు ముందు లోకము నిరానందమై పోయినది. స్థావర జంగమములు నష్టమైనవి. గ్రామ నగరములు లేవు. వర్ణాశ్రమములు వదిలివేయబడినవి. ఇట్టి పూర్వ మన్వంతరము శేషించినపుడు (చివర ఉన్నపుడు) ఉన్నటువంటి ధార్మికులు, సప్తర్షులు, మనువును సంతానార్థముగా నెలకొని ఉండిరి. సంతానమునకై మిక్కిలి సాధ్యమైన తపము నాచరించు వారందరికిని మరణములందు ఇట అంతటను దేవాసురులు, పితృగణములు, మునులు, మనువులు, అట్లే సర్పములు, భూతములు, పిశాచములు, గంధర్వులు, యక్షులు, రాక్షసులును పుట్టుదురు. తరువాత వారికి, మిగిలిన శిష్టులు శిష్టాచారములను చెప్పుదురు. మన్వంతరము యొక్క ప్రారంభమున సప్తర్షులు మనువును కర్మలను ఆరంభింతురు. మనుష్యులు దేవతలతోబాటు కర్మలు చేయుదురు. మన్వంతరాదిలో ముందే త్రేతాయుగ ప్రారంభమున మొదట దేవతలు, తరువాత మనుష్యులును అన్ని విధముల ధర్మములును ఉండినవి–బ్రహ్మచర్యము (వేదాధ్యయనము)చే ఋషుల ఋణమును తీర్చుచుండిరి. సంతానముతో పితరుల ఋణమును తీర్చుచూ ఉండిరి. యాగముతో దేవతల ఋణమును తీర్చుచుండిరి. పూర్వము స్వర్గము కొరకు ప్రముఖులైన దేవతలలోను, మనుష్యులలోను ముందు దేవతలును, తరువాత మనుష్యులును ధర్మముతోనే అంతటను ఉండిరి. మన్వంతరము తిరిగిపోగా వారు అంతటను స్థానములను వదిలి, మంత్రములతో గూడ ఆరోగ్యవంతమైన ఊర్ధ్వలోకమైన మహర్లోకమునకు పోవుదురు. వికారములు పోయిన వారై వారు మానససిద్ధియందున్నవారై, ముందును ఎదిరి చూచుచున్నవారై, తమ ఇంద్రియములను తమను వశమునందు ఉంచుకొన్నవారై వారు భూత ప్రళయము వరకు ఉంటున్నారు.

తరువాత ఆ యుగములు గడచిపోగా, వానిలోని వారందరును గడచిపోగా, త్రైలోక్యమున అంతటను ఆ దేవస్థానములు శూన్యములు కాగా, స్వర్గవాసులైన దేవతలు

ఇతరులును ఇచటనే అనగా భూలోకమునను ఉన్నారు. తరువాత వారు తపస్సుతో కూడినవారై సత్యముతోను, బ్రహ్మచర్యముతోను, వేదముతోను కూడినవారై ఆ స్థానములను పూరింతురు. పూర్వులైన సప్తర్షులకును, మనువునకును, పితరులతో బాటు దేవతలకును భూతకాలముచేతను భవిష్యత్కాలముచేతను ఇచ్చట మరణములు గలుగును. మన్వంతర క్షయమువలన వారికి ఇచ్చట మరణము కలుగును. ఈ విధముగ పూర్వమును అనుస రించిన వానియొక్క స్థితి స్థిరమైనది కాదు. ఇది అన్ని మన్వంతరములలోను భూతప్ర ళయము వరకు ఉండును. ఈ విధముగా స్వాయంభువమనువుచేత భూత భవిష్య త్కాలములలోని మన్వంతరముల ప్రతిసంధాన (కలయిక) లక్షణము చెప్పబడినది. మన్వం తరములు గడచిపోవగనే భవిష్య మన్వంతరములకు సాధనము (రప్పించు సాధనము) భూత ప్రళయము వరకు పూర్తిగా విచ్ఛిన్నమయి ఉండును. మన్వంతరముల పరివర్తన ములు (మార్పులు), ఏకాంతముగా (రహస్యముగా), మహర్గతములు అగును అనగా మహాలోకమున నుండును. మహస్సు (మహాలోకమును), జననము (జనోలోకము), తపస్సును (తపోలోకమును) సత్యమున (సత్య లోకమున) ఏకాంతముగ చేరి ఉండును. ఏడు లోకములు పూర్వపూర్వములు ఉత్తరోత్తర లోకములలో ఏకాంతముగ ఉండును. వానిని అనగా లోకములను భావించువారు వానిని అచట చూచుట చేతను, నానాత్వము చేత చూడబడిన జ్ఞానము మన్వాది సృష్టి ప్రతిసర్గ కాలమున వికారము ప్రాప్తింపగా ఆలోకములు, అపుడు సత్యలోకమునందు ఉండును. పరాంత కాలమున మన్వంతర పరివర్తన ములు సత్య(లోక)మును వదిలివేయును. తరువాత అభియోగము వలన విషమ ప్రమాణుడైన నారాయణదేవునిలోనే ప్రవేశించును. విధిస్వభావము వలన మన్వంతర పరివర్తనములు చాలకాలమునకు ప్రవర్తిల్లగా జీవలోకము క్షయ–అభివృద్ధులతో తిరుగుచు క్షణకాలము ఆనందముగాఉండును. అనుఇవి ఋషులచేస్తుతింపబడిన ధర్మాత్ములై దివ్య దృష్టి గల మనువులయొక్క సమాధానములు. వాయుదేవునిచే విస్తార సంగ్రహములుగా రచింపబడిన ఈ సమాధానములు దివ్య తేజస్సుతో చూడదగినవి. అవి అన్నియు యుగములు రాజర్షులతోను, దేవర్షులతోను, బ్రహ్మర్షులతోను, దేవతలతోను, ఉరగులతోను ఇంద్రుని చేతను, సప్తర్షులచేతను, పితృదేవతల చేతను, రాజుల చేతను కూడినవి. చక్కని పరివర్తనములు గలవి. ఇది (వాయు పురాణము) గొప్ప వంశము, కులము, కాంతియు కలవారును, గొప్పనైన మేధాశక్తితో వృద్ధిచెందినవారును, కీర్తి, కాంతి, ఖ్యాతులతోగూడిన వారును ఈశ్వరుల (ప్రభువుల) యొక్కయు ప్రవచనము పుణ్యమైనది గదా! ఇది స్వర్గమును ఇచ్చును. పవిత్రమైనది, పుత్రులను ఇచ్చునది. మిక్కిలి పరబ్రహ్మమే

రహస్యములుగా గలది. మహాపర్వము లలో జపించదగినది శ్రేష్ఠమైనది. దుఃస్వప్న శాంతి కమైనది. పరమాయుష్యము ఇచ్చునది. రాజులు, దేవర్షులు, మనువు ప్రధానముగా కలిగి ప్రసిద్ధమైన బ్రహ్మయొక్క పుణ్య ప్రసూతిని అనగా సృష్టిని ఈ వాయు పురాణము చెప్పినది. దీని ప్రవచన వ్రతమునకై నాయొక్క సిద్ధిరూప మైన చక్కని మహేశ్వరతత్త్వమును ఓ మునులారా! మీరు పొందుడు. అని ఈ విధముగ ఆనుపూర్వితో విస్తరముగ స్వాయం భువ మన్వంతరమును చెప్పితిని. ఇకముందు నేనేమి చెప్పవలెను? (61)

ఇది శ్రీమద్వాయుపురాణమున పూర్వార్థము సమాప్తము

ఓం గణేశాయ నమః
ఓం నమో భగవతే వాసుదేవాయ

శ్రీ వాయు మహాపురాణం

ఉత్తరార్థమ్

పృథివీదోహనము

శాంశపాయనుడు సూతునితో :

మన్వంతరములను యథార్థముగా తెలియకోరుచున్నాను. మన్వంతరములో ఉన్న దేవతలు అందరి క్రమమును కూడ తెలియచేయ ప్రార్థన అని ప్రశ్నించగా...

సూతుడు :

భూత-భవిష్య మన్వంతరములు ఎన్ని ఉండునో వానిని విస్తరముగను సంగ్రహము గను చెప్పెదను వినుడు. మొత్తం పద్నాలుగు మంది మనువులలో ఇంతకు పూర్వము స్వాయంభువమనువు, స్వారోచిషమనువు, ఔత్తమమనువు, తామసమనువు, రైవతమనువు, చాక్షుషమనువు-అను ఆరుగురుమనువులు గడచిపోయిరి. ఇక రాబోవు మనువుల ఎనమండుగురిని గూర్చి చెప్పెదను.

సావర్ణ మనువులు ఐదుగురు. రౌచ్యమనువు, భౌత్య మనువు, వైవస్వతమనువు అని వారు ఎనమండుగురు. ముందు గతించిన వైవస్వత మనువులను ఐదుగురిని గూర్చి ఆ మానవులను (మనువునుండి పుట్టిన వారిని) గూర్చి సమగ్రముగా వినుడు. నాచే చెప్పబడిన స్వాయంభువ మన్వంతరము గడచిపోయినది.

ఆ తరువాత రెండవ స్వారోచిష మన్వంతరముయొక్క ప్రజాసృష్టిని గురించి చెప్పబోవుచున్నాను. స్వారోచిష మన్వంతరమున తుషితులు, విద్వాంసులైన పారావతులు.

వీరు రెండే గణములు. క్రతువునకు తుషితయందు పుట్టినవారు స్వరోచిషులు పారావతులును, తక్కినవారును పంద్రెండుగల రెండు గణములు. ఛందమున (స్వేచ్ఛగా) పుట్టినవారు ఇరువది నాలుగు. అపుడు వారు దేవతలు అనబడిరి. వారు థైవస్యశుడు, వామాన్యుడు, గోపుడు, దేవాయతుడు, మహాబలుడు, మహాబాహువు, ఆపుడు, వీర్యవంతుడైన మహాబలుడు, చికిత్వంతుడు, నిభృతోయుడు, అంశోయుడు అను పంద్రెండుగురు. వీరు క్రతువు యొక్క పుత్రులుగా వారు సోమపాయులు సోమమును త్రాగువారు దేవుడైన ప్రచేతసుడు, విశ్వేదేవులు, ప్రసిద్ధుడైన సమంజుడు, అరిమర్దుడైన యజిహ్ముడు, విద్యావంతులైన అజిహ్మనుడును, మహీయానుడును, మహాభాగులైన యజోషులు ఇరువురును, యవీయుడు, మహాబలుడు, హోతయు, యజ్వ. వీరందరు పరాక్రమించిన పరావతులు. వీరు స్వారోచిష మన్వంతరమున దేవతలుగా నుండిరి. అపుడు ఇరువది నలుగురు దేవతలు సోమపానము చేయువారు. అపుడు వారిలో ఇంద్రుడు కూడా ఉండెను. లోకప్రసిద్ధుడైన వైధుడు (విధికి సంబంధించినవాడు) గూడ వారిలో ఉండెను. వసిష్ఠపుత్రు డైన ఊర్జుడు, కాశ్యపుడైన స్తంభుడు, భార్గవుడైన ద్రోణుడు, ఋషభుడైన అంగిరసుడు, పౌలస్త్యుడైన దత్తాత్రి, ఆత్రేయుడైన నిశ్చలుడు, పౌలహుడైన నిధావంతుడును వీరు సప్తర్షులు. చైత్రుడు, కవి, ఉతుడు, కృతాంతుడు, విభృతుడు, రవి, బృహత్తు, గుహుడు, నవుడు–వీరు తొమ్మండుగురు కుమారులు. వీరు స్వారోచిష మనువు యొక్క వంశకరులైన పుత్రులు. వీరు పురాణమున లెక్కింపబడినారు. ఇది రెండవ మన్వంతరము. సప్తర్షులు, మనువు, దేవతలు, పితరులును ఈ నలుగురు మన్వంతరమునకు మూలము. వారియొక్క మధ్యన ప్రజలు ఉందురు. ఋషులకు పుత్రులు దేవతలు, పితరులు దేవపుత్రులు, ఋషులు దేవపుత్రులు–అని శాస్త్ర నిశ్చయము. మనువునుండి క్షత్రియులు వైశ్యులును పుట్టిరి. సప్తర్షులనుండి బ్రాహ్మణులు పుట్టిరి. ఇది సంగ్రహమన్వంతరమని చెప్పుదురు.

స్వాయంభువముతో స్వారోచిషము యొక్క విస్తారము తెలుసుకొనవలెను. స్వారోచిషముయొక్క విస్తారము వందయేండ్లలో గూడ చెప్ప సాధ్యముకాదు. దానికి కారణము–ప్రతికులమున సంతానము యొక్క పునరుక్తి ఎక్కువగా ఉండుట. తరువాత ఔత్తమ మనువు యొక్క పర్యాయము మూడవది. అందు ఐదే గణములు చెప్పబడినవి. వానిని చెపెదను వినుడు.

సుధాములు, దేవతలు, వశవర్తులైన మరికొందరు, ప్రతర్దనులు, శివులు, సత్యులు పంద్రెండుగణములని చెప్పబడిరి. సత్యుడు, ధృతి, దముడు, దాంతుడు, క్షముడు, క్షాముడు, ధృతి, శుచి, ఈషుడు, ఊర్జుడు, జ్యేష్ఠుడు, వపుష్మంతుడును ఈ పంద్రెండుగురు. వీరు

పేరులతో చెప్పబడినవారు. సుధాములైతే పం(డెండుగురు. సహ(స్రధారుడు, విశ్వాత్ముడు, శమితారుడు, బృహద్వసువు, విశ్వధుడు, విశ్వకర్మ, మనస్వంతుడు, విరాట్టు, యశుడు, జ్యోతి, విభావ్యుడు, కీర్తిమంతుడు, అన్యానారాధితుడగు దేవుడు, వసుధిష్ణుడు, వివస్వనుడు, దినక్రతువు, సుధర్ముడు, ధృతవరుడు, యశస్వినులు, కేతుమంతుడు–అను వీరు ప్రమర్దను అని చెప్పబడిరి. హంసస్వరుడు, అహిహుడు, ప్రతర్దనుడు, యశస్కరుడు, సుదానుడు, వసుదానుడు, సుమంజనుడు, విషుడు, జంతువాహుడు, యతి, సువిత్తుడు, సునయుడు–శివులైన వీరు యజ్ఞియులైన పం(డెండుగురు.

సత్యులయొక్క పేరులను గూడ నిష్ఠాపూర్వకముగా వినుడు. దిక్పతి, వాక్పతి, విశ్వుడు, శంభువు, స్వమృడీకుడు, అధిపుడు, వర్చోధుడు, ముహ్యాసర్వశుడు, వాసవుడు, సదాశ్వుడు, క్షేముడు, ఆనందుడు అను వీరు మరొక పం(డెండుగురైన సత్యులుగా చెప్ప బడినారు. వీరే ఔత్తమ మన్వంతరమున దేవతలై ఉండిరి.

మహాత్ముడైన ఔత్తమమనువు యొక్క పు(త్రులు పదముగ్గురు . వారు అజుడు, పరశుడు, దివ్యుడు, దివ్యౌషధి, నయుడు, అప్రతిముడగు దేవానుజుడు, మహోత్సాహుడు, ఔశిజుడు, వినీతుడు, సుకేతుడు, సుమిత్రుడు, సుబలుడు, శుచి–వీరు క్షత్రమును (క్షత్రియ జాతిని) సృష్టించువారు. ఇది రెండవ అంతరము. ఔత్తమ మన్వంతరమున స్వారోచిషునిచే జరిగిన సృష్టి పరిగణింపబడినది. విస్తరముగను అనుపూర్వితోను తామసమన్వంతరము లోని వారలనుగురించి వినుడు. అటు తరువాత నాలుగవ పర్యాయమైన తామస మన్వంతర మునసత్యులు, స్వరూపులు, సుధీలు, హరులు–అను నాలుగు గణములు ఉండినవి. తామసమన్వంతరమున పులస్త్య పు(త్రుని పు(త్రులు ఉండిరి. ఒక్కొక్కటి ఇరువది యైదు ఆ దేవతల గణము గలవు. నూరు ఇం(ద్రియములు తెలిసిన మునులు సత్యప్రాణులు, శీర్షణ్యులు (శిరస్థ్సా నీయులు). తమస్సు అను మనువు ఎనిమిదవవాడు. ఆ మన్వంతరమున (తామస మన్వంతరమున) ఇం(ద్రియములు దేవతలు అనబడినారు. ప్రభుదేవులైన వారిలో శిబి ప్రతాప వంతుడైన ఇం(ద్రుడు. ఆ తామస మన్వంతరమున సప్తర్షులు ఉన్నారు. ఓ ఉత్తమ పండితులారా! వారి పేర్లను వినుడు. కాశ్యపుడైన హర్షుడు, కాశ్యపుడైన పృథువు, ఆత్రేయుడైన అగ్ని, భార్గవుడైన జ్యోతిర్ధాముడు, పౌలహుడైన వనపీరుడు, వాసిష్ఠుడైన గోత్రుడు, పౌలస్త్యుడైన చైత్రుడును తామసమన్వంతరమున ఋషులు. ఇంతకు జనువందుడు, శాంతి, నరుడు, ఖ్యాతి, భయుడు, ప్రియభృత్యుడు, అవక్షి, పృష్టలోధుడు, దృఢోద్యతుడు, ఋతుడు, ఋత బంధువును–వీరు తామస మనువు యొక్క సుతులు. ఐదవ పర్యాయమున చారిష్ణవ మన్వంతరమున దేవతలయొక్క గణములను వినుడు.

అమృతాభులు, భూతరాజులు, వికుంఠులు, సుమేధసులు-వీరు నాలుగు గణములుగా ఉన్నవారు. చరిష్ణు మనువుయొక్క మంగళకరులైన పుత్రులు. వశిష్ఠ ప్రజాపతియొక్క పుత్రులు పదునాలుగురు. వారి గణములు నాల్గు. అవి మిక్కిలి ప్రకాశవంతములు. స్వత్రవిప్రుడు, అగ్ని భాసుడు, అమృతుడు, సుమతి, వారుడు, విరావుడు, వాచినోదుడు, స్రవుడు, ప్రశిరాశి, వాదుడు, ప్రాశుడు ప్రకాశ వంతములు. అను నీ పదునలుగురు చారిష్ణవ మన్వంతరమున అమృతాభులుగను దేవతలు గను చెప్పబడిరి. మతి, సుమతి, ఋతుడు, సత్యుడు, ఆవృతి, వివృతి, మదుడు, వినయుడు, జేత, జిష్ణువు, సహుడు, ధ్యుతిమంతుడు, స్రవసుడు-ఈ పేరులు ఆభూత రజసులవని అందురు. వృషభేత్త, జయుడు, భీముడు, శుచి, దాంతుడు, యశోదముడు, నాథుడు, విద్వాంసుడు, అజేయుడు, కృశుడు, గౌరుడు, ధ్రువుడు-వీరు వికుంఠులు అనబడినారు. ఇక సుమేధసులను వినుడు. మేధాః, మేధాతిథి, సత్యమేధుడు, పృశ్నిమేధుడు, అల్పమేధుడు, భూయోమేధుడు మొదలగువారును, ప్రభువు, దీప్తిమేధుడు, యశోమేధుడు, స్థిరమేధుడు, సర్వమేధుడు, అశ్వమేధుడు, ప్రతిమేధుడు, మేధావంతుడు, మేధాహర్త-వీరు సుమేధసులు అపుడు విక్రమించిన పౌరుషముగల ఇంద్రుడు వారికి ప్రభువుగా ఉండెను. పౌలస్త్యుడైన వేద బాహుడును, కాశ్యపుడైన యజువనువాడును, అంగిరసుడైన హిరణ్యరోముడును, భార్గ వుడైన వేదశ్రీయు, వాసిష్ఠుడైన ఊర్ధ్వబాహువును, పౌలహుడైనపర్జన్యుడును, ఆత్రేయుడైన సత్యనేత్రుడును - వీరు రైవత మన్వంతరమున ఋషులు. మహాపురాణ సంభావ్యుడు, ప్రత్యంగపరహుడు, శుచి, బలబంధువు, నిరామిత్రుడు, కేతుభృంగుడు, దృఢవ్రతుడు- వీరు చరిష్ణువుని యొక్క పుత్రులు. ఇది అయిదవ అంతరము.

స్వారోచిషుడు, ఉత్తముడు, తామసుడు, రైవతుడు-అను నలుగురు ప్రియవ్రత వంశమునకు చెందిన మనువులు. ఆరవ పర్యాయమున చాక్షుష మన్వంతరమున వీరు దేవతలు. ఆద్యులు, ప్రసూతులు, భావ్యులు, పృథుకులు-మహానుభావులైన లేఖులును- అను అయిదుగురు దేవగణములు. దేవతల ఈ సర్గము మాతృనామములచే చెప్పబడును. అత్రియొక్క పుత్రుని మనుమలును, ఆరణ్య ప్రజాపతి యొక్క గణములును, వానియొక్క దేవతలలో ఒక్కొక్కడును అష్టకుడు (ఎనిమిది గలవాడు) అనబడినాడు. అంతరిక్షుడు, వసుహయుడు, అతిథియు, ప్రియవ్రతుడును, శ్రోతయు, మంతయు (మననము చేయు వాడు), సుమంతయు-వీరు ఆద్యులు అనబడినారు. శ్యేనభద్రుడు, పశ్యుడు, పథ్యనేత్రుడు, మహాయశుడు, సుమనుడు, సువేతుడు, రైవతుడు, సుప్రచేతనుడు, ద్యుతి, మహాసత్త్వుడు- వీరు ప్రసూతులు. విజయుడు, సుజయుడు, మనుడు, ఉద్యానుడు, సుమతి, సుపరి,

అర్థపతియని చెప్పబడిన వాడును–వీరు భావ్యులు అను దేవతలు (గణము)గా జెప్ప బడినారు. ఇక పృథుకులను గురించి వినుడు. అజిష్టుడు, శాక్యనుడు, దేవుడు, వానపృష్టుడును, శాంకరుడు, సత్య దృష్టుడు, విష్ణువు, విజయుడు, మహాభాగ్యుడైన యజితుడునని – వీరు పృథుకులను దేవతలు. అట్లే లేఖులను గూర్చి చెప్పెదను వినుడు. మనోజవుడు, ప్రవాసుడు, మహాయశస్కుడైన ప్రచేతసుడు, వాతుడు, ధ్రువక్షితి, అద్భుతుడు, వీర్యవంతుడు, అవనుడు, బృహస్పతియు – వీరు లేఖులు అనబడినారు.

అపుడు మహావీర్యుడైన మనోజవుడు వారికి ఇంద్రుడు అయ్యెను. భార్గవుడైన ఉన్నతుడు, అంగిరసునిసుతుడైన హవిష్మంతుడు, కాశ్యపుడైన సుధామ, వాసిష్ఠుడైన విరజుడు, పౌలస్త్యుడైన అతిమానుడు, పౌలహుడైన సహిష్ణువు, ఆత్రేయుడైన మధువు–ఈ యేడుగురును చాక్షుష మన్వంతరములోని వారు. ఊరువు, పూరువు, శతద్యుమ్నుడు, తపస్వి, సత్యవాక్కు, కృతి, అగ్నిష్టుత్, అతిరాత్రుడు, సుద్యుమ్నుడును–అను ఈ తొమ్మందు గురు. పదియవవాడగు అభిమన్యుడును వీరు నాద్వలేయులైన చాక్షుష మనువు యొక్క సుతులు. ఇది ఆరవ మన్వంతరము. ఓ బ్రాహ్మణులారా! వైవస్వత మన్వంతరములోని ఆ మహాత్ముడగు వైవస్వతమనువు యొక్క సృష్టి ఆనుపూర్వితోడను విస్తరముగను నేను చెప్పితిని అని పలికెను.

అప్పుడు ఋషులు :

కశ్యపాన్వయమున చాక్షుషునకు దాయాదుడు పుట్టెను అని చెప్పితివి గదా! ఆతనియొక్క వంశమున పుట్టిన ఇతరులను గురించి కూడ ఉన్నది ఉన్నట్లు మాకు చెప్పుము అని అడిగిరి. దానికి సూతుడు : చాక్షుషుని సృష్టిని సంగ్రహముగా మీకు వినిపింతును. అతని వంశమున ప్రతాపవంతుడైన వేనపుత్రుడైన పృథువు పుట్టెను. ఇతర ప్రజాపతులు దక్షుడును ప్రాచేతసుడును కూడ పుట్టిరి. అత్రి ప్రజాపతి ఉత్తానపాదుని (తన) పుత్రునిగా స్వీకరించెను. ఈ దక్ష ప్రజాపతియొక్క పుత్రుడు రాజు అయ్యెను. స్వాయంభువ మనువుచేత ఒక కారణమున అత్రికి ఈయబడెను. ఓ బ్రాహ్మణులారా! చాక్షుషుని యొక్క రాబోవు మన్వంతరమును, దాని వెంటనే ఆరవదాని ఉపోద్ఘాతముతో బాటు చెప్పెదను. ధర్మునితో ధర్ముని పత్నియైన లక్ష్మియందు సూనృతురాలు, చతుర విత్తభావిని, శుభయు అయిన శుచిస్మితయు, ధ్రువుని తల్లి జన్మించినది. ఆమె ఉత్తానపాదుని వలన ధ్రువుని, కీర్తిమంతుని, అయస్మంతుని కనెను. అట్లే శుచిస్మితులైన మనస్విని స్వర–అను కన్యలను గూడ ఉత్తానపాదుడు కనెను. వారిరువురి పుత్రులు విశేషమైన కీర్తిని పొందిరి. వీర్యవంతుడైన ధ్రువుడు పదివేల దివ్యవర్షములు, విపుల యశస్సును

కోరుచు, నిరాహారుడై తపము చేసెను. మొదటి త్రేతాయుగమున స్వాయంభువ మనువు యొక్క పుత్రుడైన ఆతడు సుమహాయశమును కోరుచు యోగముతో ఆత్మను ధరించెను. బ్రహ్మ ఆతనికి (ధ్రువునకు) జ్యోతిస్సులలో (వెలుగునట్టి నక్షత్రములలో) ఉత్తమ స్థానము ఇచ్చెను. అది మహాభూత ప్రళయము వరకైనను మనోహరమైనది. అస్తమయముగాని, ఉదయముగాని లేనిది. మిక్కిలి అతిశయించిన ఆతని యొక్క సంపదను, మహిమను బాగుగా చూచి, దితి సుతులైన రాక్షసుల ఆచార్యుడు శుక్రాచార్యుడు ఏమి! ఈతని (ధ్రువుని) తపము యొక్క బలము. ఏమి ఈతని శ్రుతము! వైదిక పాండిత్యము! ఏమి ఈతని హుతము! (హోమము జేసిన గొప్పతనము! యజ్ఞముచేసిన ప్రభావము!) సప్తర్షులు ఈ ధ్రువుని తమపైన ఉంచుకొని ఉన్నారు. ధ్రువుని యందు స్వర్గ (ఆకాశ) మంటియున్నది. ఆతడు ఈశ్వరుడు స్వర్గాధిపతియైన ఇంద్రుడును. ఈ శ్లోకమును గానము జేసెను. ధ్రువుని వలన నాభూమి పుష్టిని, 'భవ్యుని' గనెను. వారిరువురు రాజులు. విభువైన 'పుష్టి' తన ఛాయను స్త్రీవి కమ్మనెను. ఆతని సత్య వచనమున అపుడు ఆమె (ఛాయ నీడ) వెంటనే స్త్రీ అయ్యెను. ఆమె దివ్యమైన శరీరచ్ఛాయ గలదియు, దివ్యమైన ఆభరణములచే అలంకరింప బడినదిగా ఉండెను. 'పుష్టి' ఛాయయందు అకల్మషులైన అయిదుగురు పుత్రులనుకనెను. వారు ప్రాచీన గర్భుడు, వృషకుడు, వృకలుడు, ధృతి-అనువారు. ప్రాచీన గర్భుని భార్య 'వర్చ' ఆమె ఒక రాజును కనెను. ఆతడు పూర్వ జన్మలో ఇంద్రుడు. ఉదారధీ అనిపేరు. వేయి సంవత్సరముల చివర, ఆతడు ఒక్కమారు ఆహారమును తీసి కొనెను. ఈ విధముగ ఆవిభుడు మన్వంతరము గూడిన ఇంద్రత్వమును పొందెను. భద్రయను ఆమె 'ఉదారధీ' వలన 'దివంజయు'ని గనెను. వరాంగి అను ఆమె దివంజయుని వలన రిపుని, రిపుంజయుని కనెను. 'బృహతి' అనుఆమె రిపుని వలన సర్వతేజోవంతుడైన చాక్షుషుని కనెను. చాక్షుషుడు వారుణ్యయైన 'పుష్కరిణి' యందు 'మనువు'ను కనెను. పుష్కరిణి మహాత్ముడైన అరణ్య ప్రజాపతియొక్క పుత్రిక. ఓ మహాభాగా! మనువునకు వైరాజ ప్రజాపతి యొక్క కన్యయైన నడ్వలయందు మంగళకరులైన పుత్రులు పదుగురు కలిగిరి. ఊరువు, పూరువు, శతద్యుమ్నుడు, తపస్వి, సత్యవాక్కు, కవి, అగ్నిష్టుత్తు, అతి రాత్రుడు, సుద్యుమ్ను డును-అను తొమ్మండుగురును, అభిమన్యుడను పదవవాడును నడ్వలయందు మనువునకు గలిగిన పుత్రులు. ఆగ్నేయి ఊరువు వలన మహాప్రభావ వంతులగు పుత్రులను కనెను. వారు అంగుడు, సుమసుడు, స్వాతి, క్రతువు, అంగిరసుడు, శివుడు అనువారు. అంగుని వలన సునీథ తమ సంతానముగా వేనుడను వానిని కనెను. వేనుని యొక్క అపచారము వలన సుమహత్తైన ప్రకోపము(జనులలో) గలిగెను. ఋషులు ప్రజ కొఱకై ఆవేనుని కుడి చేతిని మథించిరి. ఆ విధముగ వేనునిచేయి మథింపబడగా

దానినుండి ఒక గొప్ప రాజు పుట్టెను. అతడు వైన్యుడను రాజు. ఆతడు పృథువని కూడ పిలువబడెను. ఆతడు తేజస్సుతో మండుచున్న వానివలెనుండి ధనువును, ధరించినవాడై కవచమును ధరించినవాడై పుట్టెను. క్షత్రియ జాతికే మొదట పుట్టిన ఆ వైన్యుడైన పృథువు సర్వ లోకములను రక్షించెను. రాజసూయ యాగముతో అభిషిక్తులైన వారిలో ఆతడు మొదటి రాజు. ఆతనిని స్తుతించుట కై పుట్టిన నిపుణులు సూత–మాగధులు. వృత్తికాములైన (జీవన వ్యాపారకాములైన) ప్రజల యొక్క భూమి అను ఈ గోవు ఆధీమంతుడైన మహారాజు చేతను, దేవతలచేతను, ఋషి గణములచేతను గూడి పంటలు పితుకబడినది. పితరుల చేతను, దానవులచేతను, గంధర్వుల చేతను, అప్సరోగణముల చేతను, యక్షులచేతను, తీగల చేతను, పర్వతములచేతను ఆయా పాత్రలలో పితుకబడుచున్న భూమి కోరినంతగా పాలను ఇచ్చెను. దానిచేత లోకములను ధరించెను అని చెప్పగా

ఋషులు :

"ఓ మహామతీ! పృథుని జన్మను విస్తరముగా చెప్పుము. ఆ మహాత్మునిచే వసుంధర (భూమి) ఏ విధముగా పితుకబడినది? దేవతలచేతను, నాగులచేతను, బ్రహ్మర్షులచేతను, యక్షులచేతను,గంధర్వులచేతను, అప్సరులచేతను పూర్వము భూమి ఏ విధముగా పితుక బడినది? వారియొక్క పాత్ర విశేషములను, పితుకువారిని, పితికినపాలను, అట్లే వత్స (దూడ) విశేషములను అడుగుచున్న మాకు చెప్పుము. పూర్వము కోపించిన మహర్షుల చేత ఏ కారణమున వేనుని చేయి మథింపబడినదో, అది అంతయు మాకు జెప్పుము అని అనిరి.

సూతుడు :

ఓ విప్రులారా! వైన్యుడైన పృథువు యొక్క జననమును మీకు వర్ణించి చెప్పెదను. ఏకాగ్రచిత్తులై పరిశుద్ధులై వినుడు. అపవిత్రునకును, పాపికిని, శిష్యుడుగాని వానికిని, అహితునకును, వ్రతము లేనివానికిని పుణ్యమైన పృథు జన్మమును ఏవిధముగనైనను, వర్ణించి చెప్పగలను. స్వర్గము ఒసగు నట్టిదియు, కీర్తినిచ్చు నదియు, ఆయువు నొసంగు నదియు, పుణ్యమై వేదములచే సమ్మతింపబడినదియు, రహస్యముగా ఋషులచే చెప్పబడి నదియు అయిన, ఈపృథు జన్మను అసూయ లేక యెవడు వినునో! ఏ మానవుడు బ్రాహ్మణులకు నమస్కరించి ఈ పృథు జన్మను(ఇతరులకు) వినిపించునో! వారు చేసిన పాపములను చేయని పుణ్యములను గూర్చి దుఃఖింపడు. ధర్మరక్షకుడైన ఈ రాజు అత్రితో సముడైన ప్రభువు. అత్రి వంశమున అంగుడు అను ప్రజాపతి జన్మించెను. వేనుడు ఆతనికి పుత్రుడు. ఆతడు తండ్రివలె మిక్కిలి ధార్మికుడు కాకుండెను. ఆ వేన ప్రజాపతి

మృత్యు (యముని) సుతయైన సునీథ యందు మాతామహ (తల్లియొక్క తండ్రి) దోషముతో యముని పుత్రికి పుత్రుడు అయ్యెను. ఆతడు ధర్మమును వెనుకకు నెట్టి కామము వలన, లోభముతో ప్రవర్తించెను. ఆ రాజు ధర్మము వీడిన నియమమును స్థాపించెను. వేదశాస్త్రములను అతిక్రమించి అధర్మము నందు అత్యాసక్తుడయ్యెను. ఆతడు పరిపాలించు చుండగా ప్రజలు స్వాధ్యాయ వషట్కారములు లేనివారు (వేదాధ్యయనము లేనివారై యజ్ఞయాగములు చేయనివారు) అయిరి. సోమయాగములు లేనందున దేవతలు యజ్ఞము లలో సోమపానము చేయలేకపోయి, వేనప్రజాపతికి తన వినాశము దగ్గరకు రాగా 'యజ్ఞము చేయరాదు, హోమము చేయరాదు' అను క్రూర శాసనమునుచేసెను. బ్రాహ్మణులచే నేనే యజ్ఞముతో అన్ని యజ్ఞములలోను పూజింపదగినవాడను, (నా కొరకే యజ్ఞముల జేయవలెను) పూజింప తగినవాడను నేనే, నా విషయముగనే యజ్ఞము, హోమమును చేయయజాలను. అని శాసించెను. ఈ విధముగ మర్యాదను అతిక్రమించి అయుక్తమైన వాని స్వీకరించుచున్న వేనునితో అపుడు మరీచి మొదలగు మహర్షులందరు నిట్లనిరి. మేము అనేక సంవత్సరములు దీక్షలో ప్రవేశించెదము. ఓ వేనరాజా! అధర్మము ఆచరింపకుము. ఇది సనాతనమైన ధర్మము కాదు. నిస్సంశయముగా నీవు చావునకే పుట్టిన ప్రజాపతివి. పూర్వము నీవు ప్రజలను చక్కగా పాలించెదనని ప్రతిజ్ఞ చేసితివి అని ఈ విధముగ చెప్పుచున్న బ్రహ్మర్షులు అందరితో దుర్బుద్ధియై వచన కోవిదుడైన వేనుడు ఆ మాటలకు నవ్వి నేనుకాక మరొక ధర్మ స్రష్ట ఎక్కడ ఉన్నాడు? నాకు బోధ చేయగలవారు ఎవరు? వీర్యమునను, వైదిక జ్ఞానమునను, తపమునను, సత్యమునను, భూమిలో నాకు సమానులు ఎవ్వరును లేరు. నిజముగా నన్ను మీరు గొప్ప మహాత్మునిగా తెలిసికొనుడు. సమస్త లోకములకును విశేషించి ధర్మములకును నేనే కారణభూతుడను. నేను కోరినచో భూమినే కాల్చివేయగలను. నీటిలో కొట్టుకొని పోవునట్లు చేయగలను. మరల సృష్టింపగలను, మ్రింగివేయగలను. ఈ విషయమున ఆలోచింప పనిలేదు అని వేనుడు అనెను. ఈ విధముగ వేనుడు గర్వముతో స్తంభించుట వలన మిక్కిలి మోహితుడై ఋషులకు అనునయింప సాధ్యుడు కానప్పుడు ఆ మహర్షులు క్రుద్ధులై ఆ మహాబాహువులు గలిగి అగ్నివలె మండిపడుచున్న ఆ వేనుని నిగ్రహించిరి. తరువాత వారు మిక్కిలి కోపించిన వారై ఆ వేనుని ఎడమచేతిని మథించిరి. ఓ బ్రాహ్మణులారా! ఆ మథింపబడుచున్న వేనుని హస్తమునుండి పూర్వము ఒక అభిశ్రుతుడను, చక్కని వేదవిజ్ఞానియు, మిక్కిలి పొట్టివాడును, నల్లనివాడును నైన పురుషుడు ఉద్భవించెను. ఆతడు భయము చెంది, వ్యాకులము చెందిన ఇంద్రియములు గలిగి, చేతులు జోడించినవాడై నిలిచెను. ఆ విధముగ

బాధ చెంది వివశుడైన అతనిని జూచి ఋషులు 'నిషీద' (కూర్చొనుము) అని అనిరి. అందువలన అతడు అనంత విక్రమము గలవాడై నిషాద వంశకర్త అయ్యెను. అతడు కూడ వేనుని పాపము వలన పుట్టిన ధీవరులను (జాలరులను) సృజించెను. తక్కిన వింధ్యవాసు లగు తుంబురులు, తువరులు, ఖసులు ఇంకను అధర్మము నందు అభిరుచి గలవారును వేనుని పాపము వలన పుట్టిరి.

పృథివీ దోహనం

కోపించిన మహర్షులు అరణిని మథించినట్లుగా మరల సంరంభముతో ఆ వేనుని కుడిచేతినిని మథించిరి. దాని నుండి పృథువు పుట్టెను. తేజస్సుగల పృథువు యొక్క అర చేతి నుండి, చేయిచఱపున పుట్టినందున ఆతడు పృథువయ్యెను. తరువాత అతడు తన శరీరముతో ప్రకాశించుచున్నవాడై, సాక్షాత్తు అగ్నివలె మండుచుండెను. మహాధ్వనిగలిగి మొట్టమొదటిదై ఆజగవమను పేరుగల శివధనువును, బాణములను, రక్షణ కొరకు మహాకాంతివంతమైన కవచమును ధరించి ఉండెను. ఆతడు పుట్టగనే అంతటను సమస్త భూతములు చక్కగా సంతసించెను. ఆ మహారాజు పుట్టగనే, వేనుడు గూడ స్వర్గమునకు పోయెను. ఆ విధముగ పుట్టిన ధీరుడైన సత్పుత్రునిచే రాజర్షియై పురుష శ్రేష్ఠుడైన ఆ వేనుడు పున్నామక నరకము నుండి రక్షింపబడెను. తరువాత నదులును సముద్రములును గలిసి మహాద్యుతిమంతుడును, మహారాజునుఅయిన వేనపుత్రుని (పృథువును) మహారాజ రాజ్యముతో అభిషేకించినవి. అంగిరసుని కుమారులైన దేవతలచే ఆ మహారాజు అభిషిక్తు డయ్యెను. ప్రతాపవంతుడును వేనపుత్రుడు అయిన పృథువు మొట్టమొదటి రాజైన మహా రాజు. ఆతని తండ్రిచే అపరంజితులైన (దుఃఖింప చేయబడిన) ప్రజలు ఆ పృథువుచే ఆనందింపజేయబడిరి. కావున ప్రజానురాగమును బట్టి ఆతనికి 'రాజు' అను పేరు కలిగెను. సముద్రమునకు ఎదురుగా విజయ యాత్రకు బయలుదేరిన, ఆ పృథువునకు దారి ఇచ్చుటకై జలములు అలలు లేక స్తంభించిపోయెను. పర్వతములు బ్రద్దలు అగుట మొదలు అయ్యెను. ఆతనికి విజయధ్వజ భంగము కలుగదాయెను. ఆతని సంకల్ప మాత్రముననే దున్నకయే, భూమి పంటలు పండించి ఇచ్చెను. అన్నములు స్వయం సిద్ధమగుచుండెను. గోవులుపాలతో సర్వకామములను పిదుకునవి అయ్యెను. దొప్పల కొలది తేనెలను (వృక్ష పుష్పములు) ఇచ్చుచుండెను. ఈ కాలముననే పవిత్రమైన బ్రహ్మయొక్క ప్రాజాపత్య యజ్ఞమున సౌత్యదినమున సుత్యయందు (సోమలతను దంచి పిండుట యందు)సూతుడు పుట్టెను. ఆతడు మహామేధావి. ఆ మహాయజ్ఞముననే ప్రాజ్ఞుడైన

మాగధుడు బుట్టెను. ఇంద్రహవిస్సుతో బృహస్పతి హవిస్సు కలిసెను. అది ఇంద్రునకై హోమము చేయబడెను. దానిచే సూతుడు జన్మించెను. అచట ప్రమాదము కలిగెను. కర్మలలో ప్రాయశ్చిత్తముకూడ జరిగెను. శిష్యహవ్యముతో కలిసిన గురువుయొక్క హవిస్సు తిరస్కరింపబడెను. ఈ తలక్రిందుల ఆచరణమున అది వర్ణవికారమును చెందినది. క్షత్రము వలన బ్రాహ్మణ స్త్రీ యందు హీన యోని నుండి పుట్టిన సూతుడు (క్షత్రియునితో) సమానధర్మము గలవాడుగా అయ్యెను. క్షత్రోపజీవనమైన, అది మధ్యమమైన సూతధర్మము, రథనాగులు ఈ చరితమును నీచముగా చికిత్సితముగా చేయదలచినట్లుగా చేయబడినది. దేవర్షులు అచట పృథుని స్తుతించుటకై ఆ సూత మాగధులను పిలిచి మీరు పృథురాజును స్తుతింపుడు అనిరి. ఈ స్తుతించుట మీకు తగినపని. ఈ పృథువు కూడ మీ స్తుతికి తగినవాడు కూడ అగును అని పలుకగా, అపుడు ఆ సూతమాగధులు ఆ ఋషులు అందరితో 'మేము దేవతలను ఋషులను వారి పనులతో స్తుతించి సంతోషపెట్ట గల వారము. మేమీతడు చేసిన పని ఎఱుగము. ఈతని లక్షణమును కీర్తిని ఎఱుగము. ఓ బ్రాహ్మణులారా! ఈతడు చేసిన ఏపనిని ఆధారముగా ఈ తేజస్వియైన రాజును స్తుతింపవలెనో సెలవిందు" అనిరి. ఓయి! ఆతడు భవిష్యత్కాలమున చేయబోవు సత్కర్మలతో స్తుతింపుడని ఋషులు ఆ సూతమాగధులను నియోగింపగా "పృథువు నిత్యము దాన ధర్మములందు నిరతుడు, సత్యవంతుడు, ఇంద్రియములను జయించిన వాడు, జ్ఞానశీలుడు, యుద్ధములలో అపజయమును పొందనివాడు. అని ఈ విధముగ మహాబలుడైన పృథువు చేసిన పనులను అన్నింటిని ఆతని శీలముతో జోడించి సూతమాగధులు పృథువును స్తుతించిరి. తరువాత స్తోత్రము ముగియగానే ప్రజా నాథుడైన పృథువు మిక్కిలి సంతసించినవాడై సూతునకు అనూపదేశమును (జలప్రాయమైన దేశము), మాగధునకు మగధ దేశమును ఇచ్చెను. అప్పటినుండి రాజులు సూతమాగధులచే స్తుతింపబడుచుండిరి. సూతమాగధ-వందులచే ఆశీర్వాదములతో మేలుకొల్పబడుచుండిరి. ఆ పృథువును జూచి మహర్షులు సంతసించినవారై ప్రజలనుగూర్చి "ఈ రాజైన వేనపుత్రుడగు పృథువు మీకు వృత్తినిచ్చువాడు (జీవనమిచ్చువాడు) అగుగాక'-అని అనిరి. అంత ప్రజలు మహాభాగుడైన వేనపుత్రుని వెంటబడి, "ఓ రాజా! మహర్షి వచనమువలన మాకు నీవు వృత్తిని కల్పింపుము" అని అడిగిరి. ఆ విధముగ ప్రజలతో వెంబడింపబడిన పృథువు ప్రజాహితము జేయగోరి, ధనుర్బాణములను తీసికొని బలవంతుడై భూమిని పీడించెను. ఈతని పీడన భయమున భయపడినదై భూమి 'గో' రూపమును ధరించి పరుగెత్తెను. పరుగెత్తుచున్న ఆ గోవును ధనువుతో వెంబడించెను. ఆ గోవు పృథువు భయమున బ్రహ్మలోకము మొదలగు లోకము

లకు వెళ్లి, ధనువెక్కు పెట్టి ఎదుట నిలిచిన పృథువును చూచెను. ఆతడు మండుచున్న జ్వాలలుగల బాణములతో దీప్తమైన తేజస్సు గలిగినవాడై అచ్యుతుడుగా ఉన్నాడు, మహా యోగము గలవాడు దేవతలకు కూడ జయింప అలవికాని వాడు మహాత్ముడు. ఎల్లప్పుడు త్రిలోక పూజ్యయైన గోరూప ధారిణియగు భూదేవి ఎక్కడను రక్షణము లభించనిదై చేతులు జోడించినదై, పృథువునే చేరినది. తరువాత ఆతనితో ఇట్లనినది, "ఓ రాజా! స్త్రీ వధలో అధర్మమును చూడవా? నేను లేక ప్రజలను ఎట్లు ధరింపగలవు? ఓ రాజా! నా యందు లోకములున్నవి. నాచేతనే ఈ జగము ధరింపబడు చున్నది. ఓ రాజోత్తమా! నేను లేకున్న ప్రజలు వినాశము చెందుదురు. నీవు ప్రజల శ్రేయస్సును చేయగోరినచో నన్ను చంపకూడదు. నా ఈ మాటనువినుము. ఉపాయముతో ప్రారంభించిన అన్ని కార్య ప్రారంభములు సిద్ధించును. నన్ను చంపికూడ ప్రజాపాలనము చేయజాలవు. నేను అన్నమై ఉండగలను. ఓ మహాద్యుతీ! కోపమును త్యజింపుము. అనేక జంతు జాతులలో గూడ స్త్రీలు వధింపదగిన వారు కారు అని చెప్పుదురు. దీనిని దలంచి ఓ రాజా! నీవు ధర్మమును విడనాడరాదు" అని పలికెను. మహామనస్సు గల ఆ రాజు (పృథువు) ఈ అనేక విధములైన గోరూప ధారిణియగు భూవాక్యమును విని కోపమును అణచికొని ధర్మాత్ముడై, ఆ భూమితో ఇట్లనెను. "ఒక్కని కొఱకు తనకు సంబంధించిన వారినికాని, పరులకు సంబంధించిన వారినికాని, ఒక్కరినికాని, అనేకులను గాని చంపిన వానికి పాపము కలిగిన కలుగునుగాక! కాని ఓ భద్రురాలా! ఏ ఒక్కనిని చంపినచో అనేకులు సుఖమును పొందుదురో ఒక్కనిని చంపినచో, చంపినవానికి పాతకముగాని, ఉపపాతకముగాని కలుగదు. ఓ వసుంధరా! జగత్తునకు హితమైన నామాటను ఆచరింపనిచో ప్రజానిమిత్తముగా నిన్ను వధించగలను. నా మాటను తిరస్కరించిన నిన్ను ఇపుడు నా బాణముతో చంపి విస్తరించి నేను ప్రజలను రక్షింతును. ఓ ధర్మధారణ శ్రేష్ఠ రాలా! నా మంచి శాంతమైన మాటనువిని ప్రజలను ఎల్లప్పుడు బ్రతికింపుము. నీవు దానికి సమర్థురాలవు. సంశయము లేదు. నాకు దుహితవు (పుత్రివి) కమ్ము. ఈ విధముగ నాకు ఈ గొప్ప వరమును ప్రసాదింపుము. ఓ భయంకర దర్శనము గలదానా! ధర్మమునకై ఉపయుక్తమగు దానివి కావలయునని, నిన్ను ఆజ్ఞాపించుచున్నాను. అని ఇట్లు పృథువుచే చెప్పబడినదై భూదేవి "నేను అట్లే చేయుదును ఓ రాజా! సంశయము లేదు. కాని, నేను వాత్సల్యము గలదానినై ద్రవింపజేయ దగినట్టి దూడను ఇమ్ము. ఓ ధర్మధారులలో శ్రేష్ఠుడా! నేను అంతటను క్షీరము కలుగునట్లు స్రవించుటకు నన్ను అంతట సమురాలనుగా చేయుము. ఇట్లు మారు పలికెను. అంతట పృథువు అంతటను శిలాసమూహములను

ధనువు యొక్క అంచుతో (కొనతో) పైకి ప్రసరింపజేయసాగెను. దానివలన శైలములు వర్ధిల్లినవి. మన్వంతరములు గడవగా భూమి ఎత్తు పల్లములు కలది అయ్యెను. భూమికి సహజముగనే సమములు విషములును ఏర్పడెను. పూర్వ సృష్టిలో విషమమగు భూమి పైన పురముల, గ్రామముల విభాగములేదు. సస్యములు లేవు. 'గో' రక్షణములేదు. వ్యవసాయము లేదు. వైశ్యుల మార్గములేదు. ఇట్టి స్థితి చాక్షుష మన్వంతరమునకు పూర్వము ఉండెనట. కాని వైవస్వత మన్వంతరమున ఈ పురగ్రామ సస్య గోరక్షా కృషి వ్యాపారముల యొక్క ఏర్పాటు జరిగినది. భూమిపైన సమతలము ఉన్నచోటులను ఎల్ల ప్రజలు ఎల్లప్పుడు నివసించుచుండిరి. ప్రజలకు ఫలములు ఆహారము అయ్యెను. పృథువు నుండి మొదలు లోకములో ఇది అంతయు సంభవించినది. ఓషధులు అన్నియు నశించి పోగా, ప్రభువైన పృథువు అతికష్టముతో చాక్షుష మనువును వత్సము (దూడ)గా చేసి భూమిభాగమున భూమి నుండి సస్యములను (పంటలను) పితికెను. పృథువుచేత చాక్షుష మనువును దూడనుగాచేసి భూమయమైన పాత్రయందు సస్యములు (క్షీరములు) పితుక బడినవి. ఆ అన్నముచేత అపుడు ప్రజలు ఎల్లప్పుడును జీవనము గడుపుచుండిరి. ఋషుల చేత మరల స్తుతించి భూమిపితుకబడినది. వారికి దూడ సోముడు అయ్యెను. బృహస్పతి పితుకువాడు అయ్యెను. గాయత్రి మొదలగు ఛందములు పాత్ర (పాలు పితుకు ముంత) అయ్యెను. వారు పితికిన పాలు తపస్సు శాశ్వతమైన బ్రహ్మయు (వేదము) అయ్యెను. ఇంద్రుడు మొదలగు దేవతలు బ్రహ్మను స్తుతించి సువర్ణ పాత్రను తీసికొని వచ్చి అమృతమును పితికిరి. దానిచేతనే ఇంద్రుడు మొదలగు దేవతలు ఆ అమృతముతోనే జీవించుచుండిరి. నాగులచే స్తుతింపబడిన భూమి అపుడు విషము క్షీరముగా పితికెను. వారిలో వాసుకి పితుకు వాడయ్యెను. దానివలన కాద్రవేయులు (కుద్రువ కుమారులు నాగులు) మహాతేజస్వులైరి. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా! నాగులకుగాని, సర్పములకుగాని ఆ విషముతోనే జీవనము, దానిచే పెద్ద శరీరములు గలవారై గొప్పగాను ఉప్పొంగినవారై, విషాహారులై, విషాచారులై, విషబలులై, విషాశ్రయులై ఉండిరి. అట్లే యక్షులచేతను, పుణ్యజనులచేతను (రాక్షసుల చేతను) వైశ్రవణుని దూడగా చేసి శ్రామపాత్రలో మరల పితుకబడినదై భూమి అంతర్ధానమందెను. పితుకువాడు జతు నాభుడు, ఆతడు మణివరుని తండ్రి, యక్షుని కుమారుడు, మహాతేజస్వి. ఇంద్రియములను తన వశమందు ఉంచు కొన్నవాడు. చక్కని మహాబలుడు, ఆ క్షీరముతో జీవనము గడుపు చున్నారని పరమర్షి చెప్పెనట. రాక్షసుల చేతను పిశాచుల చేతను మరల భూమి పితుకబడినది. వారికి బ్రహ్మతో గూడిన కుబేరుడు పితుకువాడుగా అయ్యెను. బలవంతుడైన సుమాలి అను రాక్షసుడు

పితుకువాడై, క్షీరమును రక్తమును కపాల పాత్రలో పితుకగా అంతర్ధానమైనది. ఆ క్షీరముతోనే భూలోకమున అంతట రాక్షసులు జీవనము గలవారు అగుచున్నారు. గంధర్వుల చేతను అప్సరోగణములచేతను చిత్రరథుని దూడగాజేసి ఆ భూమి నుండి పవిత్రములైన గంధములు పద్మపాత్రలో పితుకబడినవి. వారికి విశ్వావసువు పితుకువాడు అయ్యెను. ఆతడు మునికి పుత్రుడై పవిత్రమైనవాడు, గంధర్వరాజు, అతిబలుడు, మహాత్ముడు, సూర్యునితో సమానుడు. శైలములచే స్తుతింపబడినదై భూదేవి మరల పితుకబడెను. అపుడు పితుకబడినవి. ఆకారము దాల్చిన మహౌషధులు, వివిధములైన రత్నములును, వారికి దూడ హిమవంతుడు, పితుకువాడు మేరుమహా పర్వతము. పాత్రము శైలమే అయ్యెను. దానివలన శైలము ప్రతిష్ఠిత మయ్యెను. వృక్షముల చేతను తీగలచేతను స్తుతింపబడినదై భూమిమరల పితుకబడెను. మోదుగు ఆకును పాత్రముగా తీసికొని ఛేదించినను మరల మొలచు తత్త్వము పిండబడినది. కామములను పితుకువాడు పుష్పించిన శైలము, వటవృక్షము దూడ. కీర్తి మంతమైనది, సర్వ కామములను పితుకునది, త్రికాలములను ఉండునదియు అయిన ఆవు భూదేవి. అట్టి ఈ భూదేవి సృష్టికర్తయై, ధరించునదై, వసువుల (ధనముల) ధరించునదై లోకముల హితమునకై పృథువుచేత పితుకబడినది అని మాచే వినబడినది. అది చరాచరమైన ఈ లోకమునకు ప్రతిష్టా కారణముకూడా అయినది. (1)

పృథువంశాను కీర్తనమ్

సూతుడు ఇట్లు అనెను :

సముద్రాంతమైన ఈ భూమి మేదిని అని ప్రసిద్ధముగా చెప్పబడుచున్నది. వసువును (ధనమును) ధరించుటచేత వసుధఅని చెప్పబడెను. పూర్వము మధుకైటభుల మేధస్సుతో అంతటను ప్రవాహితమైన భూమి ధీమంతుడై రాజైన పృథువును చేరెను. కావున ఈ సముద్రాంతమైన భూమి మేదినియని ప్రసిద్ధి చెందినదై, పుత్రత్వమును పొందినదై పృథివి అని పిలువబడినది. ఈ విధముగ పేరు గాంచినది. అట్లే విభజింప బడినదై, వసుంధరయై రాజుచే శోభిల్లినది. అట్లే పంటలకు నిధానమైనదై పట్టణ సమూ హములు మాలగాగలదై, నాలుగు వర్ణములతో బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులతో నిండినదై బుద్ధిశాలి అయిన ఆ పృథువుచే రక్షింపబడినది.

ఆ వైన్యరాజు రాజులలో కెల్ల మంచి శ్రేష్ఠుడై ఇట్టి ప్రభావముగల వాడుఅయ్యెను. ప్రాణి సమూహముచే అంతట ఆతడు నమస్కరింపదగిన వాడును, పూజింప తగినవాడును అయ్యెను. బ్రహ్మయోనియై సనాతనుడైన పృథువే వేద వేదాంగముల సారము నెరిగిన

మహాభాగులైన బ్రాహ్మణులచే నమస్కరింపదగినవాడు. మహాకీర్తిని పొందగోరిన మహా భాగులైన రాజులచేతకూడ ఆదిరాజై ప్రతాపవంతుడై వైన్యుడైన పృథువే నమస్కరింప తగినవాడు. యుద్ధమున జయముకోరు యోధులచేతగూడ నరులకు ఆదికర్త అయిన పృథువే నమస్కరింప తగినవాడు. పృథురాజును కీర్తించి రణమునకు ఏగిన యోధుడు భయంకర యుద్ధమున గూడ జయమంది క్షేమముతో కీర్తిమంతుడై తరించును. వైశ్య వృత్తిలో ఉన్న వైశ్యులచేత గూడ తమకు వృత్తి (వ్యాపార జీవనము) నిచ్చు మహాకీర్తి మంతుడైన పృథువే నమస్కరింపతగినవాడు. వీరు (ఈ క్రిందివారు) వత్స విశేషములు (ప్రత్యేకమైన దూడలు), పాలు పితుకువారును, సమస్తములైన పాలు పితుకు పాత్రలును– క్రమముగా నాతో చెప్పబడినవి. మొదట వాయువును దూడగాచేసి మహాత్ముడైన బ్రహ్మ పృథివి (అను ఆవు) నుండి భూతలమున బీజములను పితికెను. తరువాత స్వాయం భువమన్వంతరమున స్వాయంభువ మనువును దూడగా జేసి గ్రీష్మునిచే భూమి పితుక బడినది. పూర్వము స్వారోచిష మన్వంతరమున స్వారోచిష మనువును దూడగా జేసి బుద్ధిశాలియైన చైత్రవునిచే భూమి నుండి సస్యములు పితుకబడినవి. ఉత్తమ మన్వం తరమున ఉత్తమ మనువును దూడగా జేసి బుద్ధిమంతుడై ఉత్తముడైన దేవభుజునిచే భూమి నుండి సర్వసస్యములు పితుకబడినవి. పంచమమగు తామస మన్వంతరమున తామస మనువును దూడగాజేసి మరల ఈ భూమినుండియే బల బంధువుచే (సర్వ సస్యములు) పితుకబడినవి. చారిష్ణవ దేవుని మన్వంతరమున చారిష్ణవుని వత్సమునుగాచేసి ఈ భూమి పురాణునిచే పితుక బడినది. చాక్షుష మన్వంతరము రాగానే చాక్షుష మనువును దూడనుగా జేసి పురాణునిచే ఈ భూమి పితుకబడినది. నేను పూర్వము చెప్పినట్లే వైవస్వ తమున చాక్షుష మన్వంతరము గడచి వైవస్వతము రాగా వైన్యునిచే మరల ఈ భూమి పితుకబడినది. గడచిన మన్వంతరములలో గూడ పూర్వము ఈ భూమి ఈ దేవాదుల చేతను, మనుష్యులచేతను, భూతాదులచేతను పై జెప్పిన వారిచే గూడ పితుకబడినది.

ఈ విధముగనే ఇచట భూత, భవిష్య మన్వంతరములలో తెలియవలెను. ఈ మన్వం తరములో పృథువు యొక్క సంతానమును దేవతలను గురించి వినుడు. పృథువు నుండి అంతర్ధిపాలురు పరాక్రమవంతులు అయిన ఇరువురు పుత్రులు జనించిరి. అంతర్ధానుని నుండి శిఖండిని హవిర్ధానుని గనెను. హవిర్ధానుని నుండి షడాగ్నేయియైన ధిషణ సుతులను కనెను. వారు ప్రాచీన బర్హి, శుక్రుడు, గయుడు, కృష్ణుడు, వ్రజాజినులు అనువారు, భగవంతుడైన ప్రాచీన బర్హి గొప్ప ప్రజాపతి అయ్యెను. ఈతడు బలము చేతను, పాండిత్యముచేతను, తపముచేతను, వీర్యము (పరాక్రమము) చేతను భూమిలో అందరిని

పాలించు ఒకే ఒక రాజుగాఅయ్యెను. అతని దర్భలు ప్రాచీనాగ్రములు (తూరుపు వైపు కొసలు గలవి). కావున అతడు ప్రాచీనబర్హి అయ్యెను. ఆ ప్రభువు సముద్ర తనయను భార్యగా చేసికొనెను. ఆమె మహాతమస్సుయొక్క పాతమున సవర్ణయైనది. తఱువాత సాముద్రి (సముద్ర తనయ) యైన సవర్ణ ప్రజాపతి వలన పదుగురను ప్రాచీన బర్హిషులను గర్భము ధరించి కనెను. వారందరు ప్రచేతసులనువారు, ధనుర్వేదపారగులు. ఏకధర్మము ఆచరించునట్టి వారు. సముద్ర జలమున పరుండినవారై పదివేల యేండ్లు మహాతపమును చేసిరి. ఆ ప్రజేతసులు తపము చేయుచుండగా, వృక్షములు రక్షణములేని భూమిని చుట్టివైచినవి. అంత ప్రజాక్షయము జరిగినది. చాక్షుష మన్వంతరము ఈ విధముగ గొట్టబడగా, వాయువు వీచలేకపోయినది. ఆకాశము వృక్షములతో చుట్టబడినది. పదివేలయేండ్లు ప్రజలు కదలజాలకపోయిరి. అది విని తపములతో గూడిన ప్రచేతసులు అందరు కోపించినవారై ముఖముల నుండి వాయువును అగ్నిని సృష్టించిరి. ఆ వాయువు పెకిలి పడిన వృక్షములను అన్నింటిని శోషింప జేసెను. వానిని ఆ భయంకరమైన అగ్ని దహించివైచెను. ఈ విధముగ వృక్షముల నాశము జరిగినది. తరువాత రాజైన సోముడు వృక్షనాశమును తెలిసి, అందులో కొన్ని మిగిలిఉండగా, సమీపించి ఈ ప్రచేతసులతో ఇట్లనెను. లోకముల సంతానమునకు కారణమైనందున వృక్షముల సమస్త ప్రయోజనమును చూచి ఓ రాజరూపులైన ప్రాచీన బర్హిషులారా! (అగ్ని స్వరూపులారా!) కోపమును వదలుడు. వృక్షములు భూమిలో (ప్రాణులను) జన్మింపజేయ గలవు. ఓ అగ్ని-వాయువులారా! శమించుడు. రత్నము వంటిదై ఉత్తమురాలైనది ఈ వృక్షముల యొక్క కన్య. భవిష్య త్కాలమును తెలిసిన నేను గోవులతో పెంచితిని. ఈమె మారిషయను కన్య వృక్షముల చేతనే నిర్మింపబడినది. సోమగర్భముతో వృద్ధిజెందిన ఈ కన్య మీకు భార్యఅగుగాక. మీ సగము తేజముచేతను, నా సగము తేజముతోను ఈ మారిష యందు విద్వాంసుడైన దక్షుడను ప్రజాపతి జనించును. ఆ దక్షప్రజాపతి మిక్కిలి దగ్ధమైన భూమిని మీ తేజముతో నిండిన అగ్నితో అగ్నిసముడై ప్రజలను వృద్ధి చెందింపగలడు. తరువాత సోమునిమాట వలన ఆ ప్రచేతసులు కోపమును ఉపసంహరించి, వృక్షముల కొఱకై వాటికన్యయైన మారిషఅను కన్యను పత్నిగా గ్రహించిరి. తరువాత వారు మారిషయందు గర్భమును ధరింపజేసిరి. పదుగురైన ప్రచేతసులవలన మారిషయందు సోముని యొక్క అంశచే వీర్యవంతుడును, మహాతేజస్వియునైన దక్షుడను ప్రజాపతి జనించెను. దక్షుడు మొదట మానస సృష్టిగా కొందరిని సృష్టించి తరువాత మైథునముతో సృష్టించెను. దక్షుడు అచరులను (నడవలేనివారిని), చరులను (నడువగలవారిని), రెండు కాళ్లుగల మాన

వాదులను, నాలుగు కాళ్లుగల పశ్వాదులను, మనస్సుతో సృష్టించెను. తరువాత (వాని) స్త్రీలను సృష్టించెను. ఆ దక్షుడు యమధర్మరాజునకు పదిమంది స్త్రీలను, కాశ్యపునకు పదముగ్గురు స్త్రీలను, కాలమును నడుపుటలో సమర్థులైన ఇరువది ఏడుగురు స్త్రీలను చంద్రునకును ఇచ్చి, తక్కిన నలుగురు స్త్రీలను అరిష్టనేమికిని ఇద్దరిని బాహుపుత్రునకును, ఇద్దరిని అంగిరసునకును, ఒక్కరితను కృశాశ్వునకును భార్యలుగా ఇచ్చెను. వారివల్ల గలిగిన సంతానమును చెప్పుచున్నాను వినుడు. ఇచట ఆఱవదియైన చాక్షుష మన్వంతరము క్షీణించును. ఏడవదైన వైవస్వత మన్వంతరములోని యేడవ ప్రజాపతికి సంబంధించినది ప్రారంభమగును. ఆ దక్ష కన్యలందు, దేవతలు, ఖగములు, గోవులు, నాగులు, దితిజులైన దైత్యులు, దనువునకు బుట్టిన దానవులు, గంధర్వులు, అప్సరసలు పుట్టిరి. ఇతరములైన జాతులు కూడ పుట్టినవి. అప్పటి నుండి ఈ లోకమున సంతానము మైథునము వల్ల కలిగినది అయ్యెను. పూర్వులయొక్క సృష్టి సంకల్పము వల్లను, దృష్టివల్లను, స్పర్శవల్లను కలుగు చుండెడిదని చెప్పబడినది.

ఋషులు అనిరి :

"పూర్వము దేవతల యొక్కయు, దానవుల యొక్కయు, దేవర్షుల యొక్కయు, నీ యొక్కయు మహాత్ముడైన, దక్షుడైన, దక్షుని యొక్కయు సంభవము (పుట్టుక) నీచే చెప్ప బడినది. ప్రాణము నుండి దక్షప్రజాపతి పుట్టుక అని నీచేత ఈ వరకు చెప్పబడినది. మహాతపస్వియైన అతడు మరల ప్రచేతస పుత్రత్వము ఎట్లు పొందెను? ఇది మా సందే హము. ఓ సూతా! ఈ విషయమున వివరించి చెప్ప మనవి. ఆ పుత్రి పుత్రుడైన సోముడు మామ ఎట్లు అయ్యెను?" అని అడుగగా

సూతుడు ఇట్లు అనెను :

ఓ మంచి పండితోత్తములారా! ప్రాణులయందు ఉత్పత్తియు, వాని నిరోధమును, (మరణమును) నిత్యము జరుగుచుండును. ఈ విషయమున ఋషులును విద్యావంతులైన నరులును మోహము చెందరు. దక్షాదులైన ద్విజులు వీరందరును ప్రతి యుగమున పుట్టు దురు. మరల గిట్టుదురు. విద్వాంసులు ఆ విషయమునను మోహము చెందరు. ఓ ద్విజో త్తములారా! పూర్వమువారిలో పెద్ద చిన్నల భేదము లేదు. ఇచట గొప్ప తపస్సు ప్రభావ మును కారణముగా ఉండెను. చాక్షుష మన్వంతరముయొక్క ఈ చరాచర సృష్టిని దెలిసిన వానికి ప్రజలకును ఆయువు తన అంతమును దాటును. అతడు స్వర్గలోకమున గొప్పవాడై పూజింపబడును. చాక్షుష మన్వంతరము యొక్క ఈ సృష్టి సంగ్రహముగా చెప్పబడినది. ఈ విధముగా గడచిన మన్వంతరాత్మకములైన విసర్గలు (విసృష్టులు) ఆఱు–స్వాయంభువ

మన్వంతరము మొదలు చాక్షుష మన్వంతరము వఱకు వరుసగా సంక్షేపముగా చెప్ప బడినవి. ఓ బ్రాహ్మణ పండితోత్తము లారా! నా ప్రజ్ఞను అనుసరించి ఈ సృష్టులు చెప్ప బడినవి. వైవస్వత మన్వంతర సృష్టితో వాని విస్తరము తెలియదగును. వివస్వతుని యొక్క సృష్టులన్నియు అనంతములు అతిరిక్తములు కానివియు (వేరుగా ఉండనివియు) అయినవి. అసూయ లేక వీనిని పఠించువాడు ఆరోగ్యాయుః ప్రమాణమును బట్టి ధర్మార్థ కామములతో ఈ గుణములనే పొందును. ఇక ఇప్పటివాడైన, గొప్పవాడైన వైవస్వతుని యొక్క సర్గమును (సృష్టిని) సంగ్రహముగను, విస్తారముగను చెప్పెదను. నా నుండి వినుడు. (2)

వైవస్వత సర్గ వర్ణనము

సూతుడు ఇట్లు అనెను :

ఆ తరువాత ఏడవ పర్యాయమున వైవస్వత మన్వంతరమున మరీచి పుత్రుడైన కశ్యపునివలన దేవతలు పరమర్షులును పుట్టిరి. ఆదిత్యులు, వసువులు, రుద్రులు, సాధ్యులు, విశ్వేదేవులు, మరుద్గణములు, భృగువులు, అంగీరసులు. ఈ ఎనమండుగురు దేవ గణములు అనబడుదురు. ఆదిత్యులు, మరుతులు, రుద్రులు వీరిని కశ్యపాత్మజులు. సాధ్యులు, విశ్వేదేవులు ధర్మపుత్రులు అను మూడు గణములు. భృగువు నుండి బుట్టినవాడు భార్గవదేవుడు. అంగిరుడు అంగిరసుని పుత్రుడు. ఈ వైవస్వత మన్వంతరమున వారు నిత్యస్వేచ్ఛతో జనించిన దేవతలు. ఈ సృష్టి మారీచముగా (మరీచ మహర్షి నుండి పుట్టి నదిగా) తెలియవలెను. వీడు సాంప్రతుడు, శుభుడు. వారిలో తేజస్వి సాంప్రతుడు. ఇంద్రుడు పేరుతో మహాబలుడు. భూత, భవిష్యత్, వర్తమానములందు ఉన్న మన్వం తరేంద్రులు అందఱును సమాన లక్షణములుగలవారే. భూత, భవిష్యత్, వర్తమాన కాల ముల ప్రభువైనవాడు, సహస్రాక్షుడైన పురందరుడు (ఇంద్రుడు). ఆ ఇంద్రులు అందఱును శృంగములు గలవారై వజ్రమునుచేత ధరించినవారు. వారందరు వేరు వేరుగా నూరు యాగములను చేసిరి. ముల్లోకములలో నడకగలిగి దుర్బలములైన ప్రాణులను ధర్మాది కారణములచే తిరస్కరించి నిలుతురు. వారు తేజము చేతను, తపము చేతను, బుద్ధిచేతను, బల పాండితీ–పరాక్రమముల చేతను భూత, భవిష్య, వర్తమానములకు ప్రభువులై ఏ విధముగ సమర్థులైరో దానిని అంతయు చెప్పెదను. నేను చెప్పువిషయములను వినుడు.

భూతము, భవ్యము, భవిష్యము అనునవి పండితులచే లోకత్రయముగా చెప్ప బడినవి. భూర్లోక అను ఇది భూమి (భూతము) అనబడినది. అంతరిక్షం (ఆకాశము) భువము అనబడినది. భవ్యమే అనునది దివము అనబడినది. వానికి సాధనమును చెప్పెదను.

పూర్వము పుత్రునికోరిన బ్రహ్మ ముందు 'భూః' అని ఉచ్చరించెను. అప్పుడు ఇది భూర్లోకము అయ్యెను. 'భూ సత్తాయాం' అని భూ ధాతువు సత్తార్థమున (ఉండు అను అర్థమున) చెప్పబడినది. అట్లే ఇది లోక దర్శనార్థమున కూడ చెప్పబడినది. అంతకూప్పుడు భూతమై నందునను, దర్శనమైనందునను ఇది భూలోకమైనది. కావున ఇది మొదటి లోకము. భూతమైనది (మొదట ఏర్పడి ఉన్నది)కాన పండితులచే 'భూమి' అనబడినది. ఇది ఇట్లు జరుగగా బ్రహ్మచే మరల రెండవదిగా 'భవత్' అనబడినది. పుట్టు చుండుటచే 'భవతి' అనునది కాలశబ్దముగా చెప్పబడినది. భవనాత్ భువర్లోకః= ఉండుట వలన భువర్లోకమని నిరుక్తము తెలిసిన వారిచే చెప్పబడినది. అందువలన ఆకాశము, భూమికంటె వేరుగా రెండవలోకముగా చెప్పబడినది. భువర్లోకము ఈ విధముగ పుట్టగా మరల బ్రహ్మ మూడవదిగా 'భవ్య' అని ఉచ్చరించెను. అందువలన అపుడు భవ్యము అను లోకము ఏర్పడెను. భవిష్యకాలమున 'భవ్య' అను శబ్దము సంభావింపబడు చున్నది. కావున భవ్యము అను ఈ లోకము పేరుతో స్వర్గము అని చెప్పబడినది. స్వర్గమని వేరుగా చెప్ప బడిన మూడవది అపుడు 'భావ్య' అనబడినది. 'భావ్య' అను ఈ ధాతువు భవిష్యత్కాలార్థమున విశేషముగ భావింపబడుచున్నది. 'భూః' అను ఇది భూమి అనబడినది. భువము అను ఇది అంతరిక్షము అనబడినది. అట్లే దివము భావ్యము అనబడినది. ముల్లోకమున ఇది సంగ్రహము. ముల్లోకముతో కూడిన వ్యాహారములచే (ఉచ్చారణ మాటలచే)మూడు వ్యాహృతులైనవి. ధాతువులు తెలిసిన పండితులు 'నాథ' ధాతువును పాలించుట అను అర్థము గలదిగా చెప్పిరి. భూత, భవిష్య, వర్తమాన లోక త్రయమునకు నాథులైన (పాలకులైన) వారుగా ఇంద్రాదులు చెప్పబడిరి. దేవేంద్రులు ప్రధానులుగాను అప్రధానులుగాను ఉందురు. మన్వంతరములలోని దేవతలు యజ్ఞములు పొందువారు అగుదురు. యక్షులు, గంధర్వులు, రక్షస్సులు, పిశాచులు, ఉరగులు, దానవులు-వీరు అంతటను దేవేంద్రుల మహిమలు గలవారు. ఈ లోకమున దేవేంద్రులు, గురువులు, పాలకులైన రాజులు, ఆ దేవతాశ్రేష్ఠులును ఈ ప్రజలు అందరిని ధర్మముగా రక్షింతురు. అని ఈదేవేంద్రుల లక్షణము సంగ్రహముగా చెప్పబడినది. ఇపుడు ఆకాశమున ఉన్న సప్తర్షులను చెప్పెదను. గాధి పుత్రుడును కౌశికుడును, ధీమంతుడును మహా తపస్వియు అయిన విశ్వామిత్రుడు అగు భృగు పుత్రుడును, ఊరువు నుండి పుట్టిన వాడును, ప్రతాప వంతుడునైన జమదగ్ని, బృహస్పతి కుమారుడును, మహాతపస్వియునైన భారద్వాజుడు, ఉతథ్య పుత్రుడును, విద్వాంసుడును, శరద్వంతుడు, ధార్మికుడు అయిన గౌతముడు, స్వాయంభువుడు, భగవంతుడు, బ్రహ్మకోశుడు అయిన అత్రి ఐదవవాడు, ఆఱవవాడును,

వసుమంతుడును, లోక ప్రసిద్ధుడు అయిన వాసిష్ఠ పుత్రుడు (వసిష్ఠుడు), వత్సారుడైన కాశ్యపుడు (కశ్యపుడు) ఈ ఏడుగురు సాధుసమ్మతులు. సిద్ధులైన సప్తర్షులు. ఇప్పటి మన్వంతరమున ఉందురు. ఇక్ష్వాకువు, నాభాగుడు, ధృష్టుడైన శర్యాతి, విఖ్యాతుడైన నరిష్యంతుడు, నాభుడు, ఉద్దిష్టుడు, కరుషుడు, పృషధ్రుడు, వసుమంతుడు–అను వీరు వైవస్వతమనువు యొక్క తొమ్మండుగురు పుత్రులుగా చెప్పబడినారు. నాచేతగూడ వీరు చెప్పబడినారు. ఇది ఏడవ మన్వంతరము. ఓ ద్విజులారా! ఈ విధముగా రెండవ పాదము విస్తరముగను ఆనుపూర్వితోను నేను చెప్పితిని. మరల నేను ఇంకేమి నేను వర్ణించి చెప్పవలెను? (3) అని అడుగగా

ప్రజాపతి వంశానుకీర్తనము

ఋషులు అనిరి :

బుద్ధిమంతుడైన సూతుడు చెప్పి రెండవ పాదమును విని, శాంశపాయనుడు అను క్రమముగా నీవు రెండవ పాదమును చెప్పితివి. మూడవ పాదమును ఉపోద్ఘాతముతో వివరించుము అని అడిగెను. ఈ విధముగా అడుగబడిన సూతుడు సంతుష్టాంతరంగుడై ఉపోద్ఘాతముతో బాటు విస్తరముగా మూడవ పాదమును మొదటి నుండి చెప్పెదను వినుడు. ఓ ద్విజులారా! మహాత్ముడైన ఇప్పటి వైవస్వతమనువు యొక్క సృష్టిని పూర్వాను క్రమముగా విస్తరముగా చెప్పుచున్నాను వినుడు. డెబ్బది యొక్క చతుర్యుగముల (కృతాది కల్యంత యుగముల) పూర్వమే దేవ గణములతోను, ఋషులతోను, దానవుల తోను, పితృ, గంధర్వ, యక్షులను దేవగణములతోను, రాక్షస, భూతగణములతోను, మనుష్యుల తోను, పశువులతోను, పక్షులతోను చెట్లు మొదలగు స్థావరములతోను, మనువు మొదలు భవిష్యము వరకుగల ఆఖ్యానములతో (కథా ప్రవచనములతో)ను, వైవస్వత (మన్వంతర) సృష్టిని సూర్యునకు నమస్కరించి చెప్పెదను.

మొదట మన్వంతరమున గడచిన సృష్టలును, వానిని ప్రవర్తింప చేయువారును స్వాయంభువమన్వంతరమున ఏడుగురు మహర్షులుగా ఉండిరి. చాక్షుస మన్వంతరము గడచి మరల వైవస్వతమన్వంతరమురాగా, మహేశ్వరుని శాపమువలన దక్షుని యొక్కయు, మహౌజస్కులై, మహాత్ములైన భృగువు మొదలగు ఋషులయొక్కయు ప్రాదుర్భావము జరిగినది. మరల ఆ సప్తర్షులు మానసస్పృష్టిగా పుట్టిరి. స్వయంభువుడైన బ్రహ్మచే తన పుత్రులుగా చేయబడిరి. ప్రజాసంతాన కారులై పుట్టుచున్న ఆ మహాత్ములచే గ్రహ, నక్షత్ర ములతో అలంకరింపబడిన సృష్టి మరల ప్రవర్తింపబడినది. విశుద్ధమైన జ్ఞానము కర్మలును

కల్గిన వారియొక్క (సప్తర్షుల యొక్క) సంతానమును సంగ్రహ విస్తరములతో అను క్రమ ముగ చెప్పెదను.

ఆ ఋషుల వంశములచేత పుట్టిన సృష్టి ఈ చరాచరములతో నిండినదై గ్రహ నక్షత్రములతో అలంకరింపబడినదై మరల ఆవిర్భవించినది. అతని ఈ వచనమును విని మునులకు సంశయము కలిగెను. తరువాత సంశయముతో గూడిన వారై ప్రశంసింప బడిన వ్రతములుగల ఆ మునులు సూతుని సత్కరించి పూర్వము సప్తర్షులు మానస సృష్టిగా ఎట్లు పుట్టిరి? బ్రహ్మచే వారు పుత్రులుగా ఎట్లు చేయబడిరి? ఓ పండితశ్రేష్ఠా! మాకు చెప్పుము అనిరి. తరువాత మహాతేజస్వియైన సూత పౌరాణికుడు శుభముగా ఇట్లుచెప్పెను. స్వాయంభువమన్వంతరము నందలి సప్తర్షులు మరల వైవస్వత మన్వం తరమునచేరి సిద్ధులైరట. వారు అప్పుడు శివుని శాపమునకుగురి అయిన వారై తపో లోకమును చేరలేదు. తరువాత వారు 'జన' లోకమునకు మరలి వచ్చిచేరిరి. అటు పిమ్మట ఆ మహర్షులు అందరు ఆ 'జన' లోకమున దారుణమైన క్రతువు ఏర్పడగా పరస్పరముగా ఇట్లనుకొనిరి. చాక్షుష మన్వంతరమున మనమందరము బ్రహ్మ (మానస) పుత్రులమై జన్మించెదము. దాని వలన శ్రేయస్సు కలుగును. స్వాయంభువమన్వంతరమున సప్తార్థ ముగా శపింపబడినవారై, ఈ లోకమున మరల జనించిరి. తరువాత జనలోకము నుండి దివమునకు (స్వర్గమునకు) వెడలిరి. మహాదేవుని యజ్ఞమున బ్రహ్మ వరుణ శరీరమును ధరించెను. సంతానేచ్ఛతో అగ్నిలో ఆతని శుక్రమును హోమము చేయుచుండగా దాని నుండి ఈ ఋషులు పూర్వము రెండవ మారుగా జన్మించిరి అని వినికిడి, భృగువు, అంగిరసుడు, మరీచి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అత్రి, వసిష్ఠుడును ఈ ఎనమం డుగురు ఆ బ్రహ్మపుత్రులు.

అట్లే ఈతని (బ్రహ్మ) యొక్క విశాలమైన యజ్ఞమున దేవతలు అందరును వచ్చిరి. సమస్తములైన యజ్ఞాంగములును, వషట్కారమును, వేలకొలది సామములును, యజు స్సులును మూర్తిమంతములైనవి. ఆకారములను దాల్చినవి. పద క్రమములతో అలం కరింపబడిన ఋగ్వేదముగూడ అట మూర్తిమంతము అయ్యెను. వృత్తములతో గూడిన యజుర్వేదము, ఓంకారమే ముఖముగా ఉజ్జ్వలముగా వెలిగినదై, యజ్ఞమునకై జోడించిన సూక్తములు-బ్రాహ్మణములు, మంత్రములునుగలదై ఉండెను. సామవేదము గూడ వృత్తము లతో ఒప్పినదై, సమస్త గేయములు ముందుగా ఉన్నదై, విశ్వావస్వాదుల తోను, గంధర్వుల తోను సంపాదింపబడి ఉండెను. బ్రహ్మ వేదము, అట్లే అది ఘోరములైన కృత్యావిధులతో కూడినదై, ప్రత్యంగిరస యోగములతోను గూడినదై రెండు శరీర-శిరములు గలది

అయ్యెను. లక్షణములు, స్వరములు, స్తోభములు, నిరుక్త స్వరభక్తులును, ఆశ్రయమైన వషట్కారమును, నిగ్రహ–ప్రగ్రహములును (లక్షణములు). దీప్తమైన (మండిన) దీప్తి (వెలుగు) గల ఇలాదేవియు (భూదేవియు), పూర్వాది దిక్కులును, ఆగ్నేయాది కోణ దిక్కులును, వాక్పతులును, దేవకన్యలును, పత్నులును, అట్లే మాతృ దేవతలును, ఆయువును–వీరందరును యజ్ఞము చేయుచున్న దేవుని (అగ్నిదేవుని) ఎదుట అంతటను ఆకారముగలవారై శరీరము దాల్చిన వరుణుని స్వరూపముతో ఆవిర్భవించిరి. వారందరిని జూచి స్వయంభువున (బ్రహ్మ)కు భూమిపై రేతఃపతనము అయ్యెను. అది బ్రహ్మర్షి భావనా విధానము వల్లనే జరిగినది. బ్రహ్మ దానిని స్రువముతో పరిగ్రహించి స్రుక్కులతో ఆజ్యము వలె మంత్రవంతముగా హోమము చేసెను.

దాని నుండి ఆ ప్రజాపతి (బ్రహ్మ) భూత సమూహమును సృష్టించెను. దానికి ముందుగనే యజ్ఞమందలి ఆ తేజస్సునకు లోకములలోని తైజసము ఆవిర్భవించినది. తమస్సుతో భావవ్యాపృత్వ రూపమైన తమస్సు, అట్లే సత్త్వము, అట్లే రజస్సును జనించినవి. సగుణమైన తేజస్సు వలన ఆకాశమున తమమున నిత్యము (భూత గ్రామము) ఉన్నది. తమస్సు తేజస్సగుట వలన సర్వభూతములు జనించినవి. కర్మజులైన పుత్రులు దానియందు పుట్టినపుడు బ్రహ్మ తన శుక్రమును ఆజ్యస్థాలిలో (యజ్ఞపు నేతిపాత్రలో) తీసికొని హోమము చేసెనట. ఆ శుక్రము హోమము చేయబడగా దాని నుండి ప్రసవగుణముతో గూడినవారై శరీరములతో మిక్కిలి (అగ్నులవలె) ప్రకాశించినవారై సప్తమహర్షులు పుట్టిరి. అగ్నిలో శుక్రము ఒక్కమారు హోమము చేయగనే ఆజ్వాలతోనే కవి (శుక్రుడు) బయలు వెడలెను. ఆ తీరుగా మంటను భేదించుకొని బయలువెడలిన అతనిని బ్రహ్మచూచి, నీవు భగృగుడవు అని పలికెనట. అందువలన అతడు భృగువు అయ్యెను. మహాదేవుడు శివుడు ఆ విధముగా జ్వాల నుండి బయలువెడలిన బ్రాహ్మణుని చూచి బ్రహ్మతో ఇట్లు అనెను. ఓ ప్రభూ! బ్రహ్మ! పుత్ర కాముడనై, దీక్షితుడనైన నాకు ఈ భృగువు అను దేవుడు జనించెను. వీడు నా పుత్రుడు అగుగాక అని అనెను. బ్రహ్మదేవుడు అంగీకరించగనే మహాదేవుడు ఆ 'భృగు'వును తన పుత్రునిగా చేసికొనెను. కావున వారుణులు భృగువులు ఆప్రభువైన భృగువు యొక్క సంతానము.

తరువాత రెండవ శుక్రము అగ్నిలో పడెను. ఆ అంగారములలో (శుక్రము) అంగములను కూర్చుకొని ప్రభువగు అంగిరసుడు అయ్యెను. ఆ విధముగ అంగిరసుని ఉత్పత్తిని చూచి అగ్ని బ్రహ్మతో ఇట్లనెను. ఓ బ్రహ్మ! నీ కొరకే నేను రేతస్సును ధరించితిని. ఈ రెండవవాడు నాకు పుత్రుడు అగు గాక–అని అడిగెను. అట్లే అగుగాక అని బ్రహ్మ సదసస్పతియైన అగ్నితో అనెను. కావున అంగిరసులు ఆగ్నేయులు అని మేమువింటిమి.

లోకకారియైన బ్రహ్మచే మరల ఆఱుమారులు శుక్రము హోమము చేయబడగా అందుండి ఆఱుగురు బ్రహ్మలు పుట్టిరి. అందులో మొదటివాడు మరీచి. మరీచుల (కిరణముల) నుండి పుట్టినవాడు. ఆ క్రతువునందు ఒక కొడుకు పుట్టెను. దానివలన ఆతడు క్రతువు అనబడెను. నేను మూడవ వానిని-అను అర్థముతో మూడవవాడు అత్రి (అహంత్రిః) అని కీర్తింపబడెను. నిశితములైన (వాడియైన) కేశములతో పుట్టినందున (తరువాతివాడు) పులస్త్యుడు అనబడెను. పొడవైన వెంట్రుకలతో పుట్టినందున (తరువాతి వాడు) పులహుడు అనబడెను. వసు(ధన)మధ్యము నుండి పుట్టిన (తరువాతి వాడు) వసుమంతుడై వసుధకు (భూమికి) ఆశ్రయుడై, తత్త్వజ్ఞులు అయిన బ్రహ్మవాదులచే వసి
౨ ష్ఠుడు అనబడెను. ఈ ఆఱుగురు మహర్షులు బ్రహ్మ మానసపుత్రులు. లోకమునకు సంతాన కారులు, వీరిచే ప్రజలు వృద్ధి చేయబడిరి. బ్రహ్మ పుత్రులైన వీరు ప్రజాపతులు అనబడుదురు.

ఈ మహర్షుల చేతనే జనించిన పితరులు అను వేఱొక ఋషి గణములు ఏడు. లోకములలో ప్రసిద్ధములు. మారీచగణములు, భార్గవగణములు, ఆంగిరసగణములు, పౌలస్త్యగణములు, పౌలహ గణములు, వాసిష్ఠ గణములు, ఆత్రేయ గణములు-అనునవి లోక ప్రసిద్ధములైన పితృగణములు. ఓయి! వీరు సంగ్రహముగా పూర్వమే మూడు గణములుగా చెప్పబడిరి. అవి అపూర్వములు, ప్రకాశములు, జ్యోతిష్మంతములును - అని మూడుగా ప్రసిద్ధి జెందినవి.

వారికి రాజు యమదేవుడు. అహింసాది నియమములతో వీడిన పాపములు కల ఇతరులు ప్రజాపతులు. వారిని గూర్చి చెప్పెదను మీరు ఏమరుపాటులేక వినుడు. కర్దముడు, కశ్యపుడు, శేషుడు, విక్రాంతుడు, సుశ్రువుడు, బహుపుత్రుడు, కుమారుడు, వివస్వంతుడు, శుచిశ్రవుడు, ప్రచేతసుడు, అరిష్టనేమి, బహులుడు, ప్రజాపతి - అను ఈ మొదలగువారు ఇతరులును అనేకులు ప్రజాపతులు. దర్భలంత ఎత్తు గలవారును, మనోవేగము కలవారును, సర్వము అందుండువారును-ఐన వాలఖిల్యులను వారు పరమర్షులు సార్వభౌములునునై జన్మించిరి. భస్మవ్యపోహిని యందు (భస్మమును దూరము చేయుదానియందు) పుట్టినవారై బ్రహ్మర్షి గణముచే సమ్మతులై తపోవేదములందు పరాయణులైనవారు, వైఖానసులను ముని గణమువారు, ఆతని (బ్రహ్మ, అగ్ని) ఇంద్రియముల నుండి పుట్టిన అశ్వినీ దేవతలు చక్కని రూపములతో కూడినవారు. జన్మాక్షర జనులు విమలురై నేత్రములనుండి పుట్టినవారు ఆతని (బ్రహ్మ, అగ్ని) ఇంద్రియముల నుండి జ్యేష్ఠులైన ప్రజాపతులు పుట్టిరి. రోమకూపముల నుండియు అట్లే స్వేద (చెమట) మలము నుండియు ఋషులు పుట్టిరి. ఋతమున మాసములు, చిగురులు, పక్ష

సంధులును, వత్సరములును, అహోరాత్రములును, దారుణములు (భయంకరములు) పుట్టినవి. రౌద్రమును లోహితము అందురు. లోహితము కనకము అనబడినది. అది మైత్రము అని (సూర్య సంబంధమని) తెలియవలెను. ధూమము పశువులు అనబడినవి. ఆ అగ్నిజ్వాలలు రుద్రులు అట్లే జనించిన ఆదిత్యులు (సూర్యులు). అంగారములనుండి పుట్టిన జ్యోతిస్సులు దివ్యమానుష రూపములు (దేవతలు మనుష్యులును) వేదమునుండి పుట్టిన బ్రహ్మ ఈ లోకమునకు మొదటివాడు. దీనిని సర్వకామదము అని అందురు. అచట కన్యను ఉదాహరించిరి. అచట దేవగురువైన బ్రహ్మ దేవతలచే ప్రసన్నుడు అగును. ఈ ప్రజాపతులు అందరు ప్రజలను పుట్టింతురు. వారు అందరు ప్రజాపతులు. వారు అందరును తపస్వులు, వారి అనుగ్రహమున ఈ లోకముల ఈక్రియలు ధరించును. బ్రహ్మ అగ్ని తేజమును వర్ధిల్లచేయు జంటను వర్ధిల్లచేసెను. అట్లే దేవతలలో వేద విద్వాంసులు అందరు రాజర్షులైరి. అందరును వేదమంత్ర పరులును, ప్రజాపతి గుణములతో పుట్టినవారును అయిరి. భూమిలో తపము అనంతమై బ్రహ్మస్వరూపమై, సత్య స్వరూపమై పరమమైనది అగును. ఓ ప్రభూ! ఈ మేము అందరము నీ సంతానరూపులమే. బ్రహ్మయు, బ్రాహ్మణులును, చరాచరములైన లోకములును నీ సంతానమే. మరీచి మహర్షిని మొదట ఉంచుకొని ఋషులతో బాటు దేవతలు-మేము నీ అపత్యములను (సంతానములను) కోరుచున్నామని సంతానమును కోరిరి. ఆ యజ్ఞమున మహాభాగులైన దేవతలు ఋషులతో గూడ నీ వంశమున పుట్టినవారై స్థానకాలాభిమానులు అయిరి. వారు ఈ ప్రజలను ఆ రూపముతోనే నిలుపరు. యుగాద్యంతముల దాక ఈ ప్రజలను నిలుపుదురు.

తరువాత లోకగురుడైన బ్రహ్మ పరుడని విచారింపక ఇట్లు పలికెను. ఈ విధముగా నిశ్చయించి, నాచేత దేవతలు సృష్టింపబడిరి. సంశయము లేదు. ఈ మహర్షులు మీ యొక్క వంశమున పుట్టిరి. వారిలో ప్రథమ ప్రజాపతి పూర్వమహాత్ముడైన ఆ భృగువుయొక్క వంశమును విస్తరముగను ఆనుపూర్వితోను చెప్పెదను. భృగువుయొక్క భార్యలు సాటిలేని వారు, ఉత్తమురాంద్రు, బాంధవ్యముకలవారు, శుభకరులైన వారు అయిన ఇరువురు ఉండిరి. అందులో ఒకటి హిరణ్యకశిపుని యొక్క కన్య 'దివ్య' అని ప్రసిద్ధి చెందినది. రెండవది పులోముని పుత్రిక పౌలోమి. శ్రేష్ఠురాలు, ఆమె భృగువు వలన దివ్యవేదవేత్తలలో శ్రేష్ఠుడైన కావ్యుని (శుక్రుని) కనెను. ఆతడు దేవాసురులకు ఆచార్యుడు, కవిసుతుడు, గ్రహరూపుడు అయిన శుక్రుడు. ఆ శుక్రుడు ఉశనుడు అని ప్రసిద్ధుడు. కావ్యుడు అను పేరుచేత అని పిలువబడినవాడు, సోమపులైన పితరుల మానసీ కన్యయు యశస్వినియు అయిన 'అంగి' అను శుక్రుని భార్య నలుగురు పుత్రులనుకనెను. భృగు-దివ్యల వల్ల

పుట్టిన శుక్రుడు బ్రహ్మ తేజముతో కూడినవాడు. బ్రహ్మవేత్తలలో ఉత్తముడు. ఆ శుక్రునకు భార్య అయిన అంగియందు నలుగురు పుత్రులు పుట్టిరి. త్వష్ట, వరూత్రి అను ఇరువురును, శండుడు, అమర్కుడు, అనువారు ఇరువురును. వారు ఆ సూర్యునితో సమానమైన కాంతి గలవారు. ప్రభావమున బ్రహ్మతో సమానులు. రంజనుడు, పృథురశ్మి, విద్వాంసుడైన బృహద్గిరుడును-వీరు వరూత్రియొక్క సుతులు. బ్రహ్మిష్ఠులు, సురులకు యాజకులు (యజ్ఞముల చేయించువారు). వారు ఇజ్యా (యాగ) ధర్మ వినాశముకొరకు మనువును చేరి కలిసిరి. ఆ విధముగా నిరసింపబడుచున్న ధర్మమును జూచి మనువు అనెను. వీరిచేతనే స్వేచ్ఛగా నిన్ను యాజనమును (యజ్ఞము జేయుటను) పొందించగలను (అని అనెను). ఇంద్రుని ఆ వాక్యమునువిని ఆ ప్రదేశమునుండి వారు తొలగిరి. వారు తొలగి కనబడకపోగా, ఇంద్రుడు ధర్మపత్నియైన చేతన అనుగ్రహముతో ముక్తురాలినిగా చేయించి, తరువాత అతడు ఆమెను అనుసరించెను. తరువాత ఇంద్ర వినాశనమునకై యత్నించు చున్న నాయకులను అక్కడికి వచ్చినవారిని, మరల ఇంద్రుడు చూచెను. చూచి ఇంద్రుడు ఆ దుష్టుల జంపి, తరువాత దక్షిణమునందు దేవదేవునియొక్క వేదియందు పరుండెను. అప్పుడు శాలవృకములతో (శాలలోని తోడేళ్ళతో) తినబడుచున్న వారియొక్క శిరములు పడినవి. అవి తరువాత ఖర్జూరములు అయినవి. ఈ విధముగ వరూత్రియొక్క పుత్రులు పూర్వము ఇంద్రునిచే హతులైరి. శుక్రునకు యజనియందు దేవయాని పుత్రికగా జనించెను. త్రిశరుడై మహాత్ముడైన విశ్వరూపుడు త్వష్టయొక్క పుత్రుడు అయ్యెను. విశ్వరూపుని తోబుట్టువుకూడ విశ్వకర్మయై యముడు అనబడెను. భృగువు వలన దేవతలైన భృగువులు పండ్రెండుగురు పుత్రులుగా జన్మించిరి. ప్రభువైన కావ్యుడు దేవియందు వారందరిని పుత్రులుగాకనెను. వారు భువనుడు, భావనుడు, అన్యుడు, అన్యాయతుడు, క్రతువు, శ్రవుడు, మూర్ధుడు, వ్యజయుడు, వ్యశ్రుషుడు, ప్రసవుడు, అజుడు, పండ్రెండవవాడు అధిపతియు అనబడిరి. వీరు దేవతలైన భృగువులు, పండ్రెండుగురు, యాజ్ఞికులును. (భృగువు వలన) పౌలోమి బ్రహ్మిష్ఠుడు వశియు విభుడు అయిన పుత్రునికనెను. ఆతడు ఎనిమిదవనెలలో గర్భ క్రూరమైన కర్మచే చ్యవనమగుట (జారిన వాడగుట) వలన చ్యవనుడు అనబడెను. తరువాత ప్రచేతసుని నుండి చేతనుడు చ్యవనుడు క్రోధుడైన ప్రాచేతసు (చేతను) నుండి అధ్వానుడు, పురుషుని నుండి యజుడును జనించిరి. భార్గవుడైన చ్యవనుడు సుకన్యయందు ఆత్మ వానుడు, దధీచుడు అను ఇరువురు పుత్రులను కనెను. వారు ఇరు వురు సాధుసమ్మతులు. దధీచివలన సరస్వతియందు సారస్వతుడు పుట్టెను. నహుష పుత్రి యైన 'రుచి' అను మహాభాగ్యవతి ఆత్మవానుని పత్నియైనది. ఆ ఆత్మవానుని యొక్క

తొడలనుండి, ఆ తొడలను భేదించుకొని ఋషియైన 'ఔర్వుడు' పుట్టెను. ఆతడు మహా యశస్వి, ఔర్వునకు మండుటగ్నివలె ప్రకాశించు ఋచీకుడు పుట్టెను. ఋచీకునకు సత్యవతి యందు జమదగ్ని పుట్టెను. భృగువునకు రుచి పర్యాయమున రౌద్ర-వైష్ణవములలో వైష్ణవాగ్ని యొక్క జమనము వలన (భుజించుట వలన) జమదగ్ని జనించెను. రేణుక జమదగ్ని వలన ఇంద్రునితో సమానమైన పరాక్రమము గలవాడును, బ్రహ్మ-క్షత్ర తేజముల నిండిన వాడును, అమిత తేజస్కుడైన పరశురాముని కనెను. ఔర్వునకు జమదగ్ని మొదలుగా గల పుత్రశతము కలిగెను. ఆ భార్గవులకు పరస్పరముగా వేల పుత్రులు కలిగిరి. ఋష్యంత రులలోను బాహులుగా అనేకులు భార్గవులు అనబడిరి. వారు-వత్సుడు, విశ్వుడు, అశ్వి షేణుడు, పాండుడు, పథ్యుడు, శౌనకుడును. గోత్రముతో వీరు ఏడవవారు ఈ పక్షములు భార్గవ పక్షములుగా తెలియదగినవి.

అగ్నిపుత్రుడై ధీమంతుడైన అంగిరసుని యొక్క వంశమును వినుడు. ఆతని వంశమున గౌతమునితో పాటు భారద్వాజులు పుట్టిరి. దేవతలైన ఆంగిరసులు మహౌ జస్కులై ఇషు మంతులై (బాణములు కలవారై) ముఖ్యులైనవారు. మరీచిమహర్షి పుత్రి మారీచియైన సురూపయు, స్వరాట్టైన కర్దమ ప్రజాపతి పుత్రియైన కార్దమియు, మనుపుత్రి మానవియైన పథ్యయు-అను ఈ ముప్వురు అధర్వణుని (అంగిరసుని) భార్యలు. వీరు అంగిరసుని భార్యలు. వారియందలి సంతతిని చెప్పెదను. ఆ పత్నులందు అధర్వణునకు అంగిరసునకు కులోద్వహులైన దాయాదులు (పుత్రులు) పుట్టిరి. మహాతపస్సుతో భావించిన ఆత్మలు గలవారికి మహాతపస్సుతో పుత్రులు పుట్టిరి. సురూపయందు (అంగిరసుడు) స్వరాట్టైన గౌతముని బృహస్పతిని అవంధ్యుని వామదేవుని ఉతథ్యుని ఉశిజుని కనెను. పథ్యయందు ధిష్ణువను పుత్రుడు కలిగెను. మానసుడైన సంవర్తుడు ఆయస్యుడైన (నల్లని వాడైన) విచిత్తుడును కలిగిరి. ఉతథ్యుని పుత్రుడు శరద్వంతుడు, అశిజుడు (ఉశిజుడు) దీర్ఘతముడు. వామదేవజుడు బృహదుత్థుడు. ధిష్ణువు యొక్క పుత్రుడు సుధన్వానుడు. సుధన్వుని పుత్రుడు ఋషభుడు. ఋషులు అని ప్రసిద్ధి చెందినవారు. రథకారులైన దేవతలుగా జెప్పబడిరి. బృహస్పతికి ప్రసిద్ధుడును మహాయశస్కుడు అయిన భరద్వాజుడు కలిగెను. అంగిరసునకు సంవర్తుడు కలిగెను. ఇక అంగిరసులైన దేవతలను వినుడు. దేవతలైన అంగిరసులు బృహస్పతి కన్న చిన్నవారు. సురూపయందు ఔరసులైన అంగిరసుని పుత్రులు పుట్టిరి. వారు-ఔదార్యుడు, ఆయువు, దనువు, దక్షుడు, దర్భుడు, ప్రాణుడు, హవిష్మంతుడు, హవిష్ణుడు, క్రతువు, సత్యుడు-అను వారు పదుగురు. అయస్యుడు, ఉతథ్యుడు, వామ దేవుడు, ఉశిజుడు, భారద్వాజులు, శాంకృతికులు, గార్గ్యులు, కాణ్వులు, రథీతరులు,

ముద్గలులు, విష్ణు వృద్ధులు, హరితులు, వాయువులు, భాక్షులు, భరద్వాజులు, ఆర్షభులు, కింభయులు – ఈ పదియైదుగురిని అంగిరసుని పక్షము వారుగా గ్రహింప వలెను. ఋష్యంతరులలో బాహ్యులైన అంగిరసులు అనేకులు కలరు.

ఇక ఉత్తమ పురుషులుగల మారీచవంశమును చెప్పెదను. ఆ వంశమున స్థావర జంగమాత్మకమయమైన జగము పుట్టినది. మరీచి, ఆపోదేవతలను (నీటి దేవతలను) కామించెను. సంతానేచ్ఛతో వారినే ధ్యానించుచుండెను. ప్రజావంతుడై సర్వ గుణములతో గూడిన పుత్రుడుగూడ కలిగెను. చక్కని కాంతిగల దితి మనస్సుచే భావింపబడి నదై ఉండెను. ప్రభువైన మరీచి ప్రశస్తురాలైన ఆమె యందు పూజింపబడుచుండెను. తరువాత సమస్త జలములు (జలస్త్రీలు) పిలువబడిరి. మరీచి వారియందు నివసించెను. ప్రభువైన మరీచి తాను ఉంచిన ఆత్మకల వానిని ఒక పుత్రుని వారికి జనింపజేసెను. ఆ పుత్రుడు సాటిలేనివాడు. అరిష్టనేమి అను (రెండవ) పేరుగల కశ్యప ప్రజాపతి. వధావేశుడు సూర్యకాంతిగల మరీచుని పుత్రునిగా జనింపజేసెను. సత్పురుషుల వాక్యమును ధ్యానించుచు పుత్రార్థియై జలమందు ఏడువేల యేండ్లుండి ఆ మరీచి సాటిలేని వాడు అయ్యెను. కశ్యపుడు సూర్యునివలన విద్వాంసుడు అయ్యెను. ఆకారణమున ఆతడు బ్రహ్మతో సమానుడు. అన్ని మన్వంతరములలోను బ్రాహ్మణ అంశతో కన్యా నిమిత్తముగా జనించును అని చెప్పగనే ప్రజలు (సంతానములు) దక్షునిచే కోపింపబడిరి. అపుడు మరీచి పుత్రుడు కశ్యమును త్రాగెను. (ఇచట కశ్యము అనగా మద్యము.) బ్రహ్మ సంబంధము కశయని తెలియవలెను. బ్రహ్మనుండి వచ్చినది కశ్యము అనబడును. విప్రులు కశ్యమును మద్యమందురు. కశ్యమును (మద్యమును) పానము చేయుట వలన కశ్యపుడు అయినాడు. దక్షునిచే శపింపబడి కోపించినవాడై క్రూరముగా పలుకబడిన వాక్కులను నిర్వర్తించుటచే ఆతడు కశ్యపుడు అయ్యెను. కావుననే పరమేష్టియు బ్రహ్మయు అయి కశ్యపునిచే పలుకబడినది. కావుననే దక్షుడు తన కన్యలను కశ్యపునకు పెండ్లి చేసి ఇచ్చెను. ఆ కన్యలు అందరును బ్రహ్మవాదినులు. వారు అందరును లోకమాతలును అయిరి. ఈ వారుణమై పుణ్యమైన ఋషి సృష్టిని తెలిసినవాడు ఆయుష్మంతుడును, పుణ్యవంతుడును, శుద్ధుడును అయి ఉత్తమ సుఖమును పొందును. ఈ కథను బుద్ధియందు ధారణ చేయుటవలన, వినుటవల్లను సర్వపాపముల నుండి ముక్తుడగును.

ఆ తరువాత మునులు అందరు రోమహర్షునితో (సూతునితో) ఇట్లు అనిరి. ఆఱవదైన చాక్షుషమన్వంతర ప్రజాసృష్టి జరిగిపోగా ఈ వైవస్వత సృష్టి జరిగినది.

సూతుడు ఇట్లు అనెను :

స్వయంభువైన బ్రహ్మచేత 'స్వయముగా ప్రజలను సృష్టింపుము' అని ఆదేశింప బడినవాడై దక్షుడు జంగమములను స్థావరములును అగు ప్రాణులను సృష్టించెను. వైవస్వత మన్వంతరము వచ్చిన తరువాత ఇది జరిగినది. తరువాత దక్షుడు నాలుగువిధములైన ప్రజలను సృష్టింప మొదలిడెను. వారు–జరాయుజులు (మావి వల్ల పుట్టినవారు), అండ జులు (గ్రుడ్లనుండి పుట్టినవారు), ఉద్భిజ్జులు భూమిని ఛేదించు కొని పుట్టిన తరులతాదులు, స్వేదజులు (చెమట వల్ల పుట్టినవారు) అను నాలుగు విధములైన వారు. పదివేల యేండ్లు ఘోరమైన, గొప్పదైన తపమునుచేసి, యోగఫలముల చేతను, విశేషించి అణిమాది సిద్ధుల చేతను సంభావింపబడి, శ్రీమంతుడైన దక్షుడు తనను విభజించి మనుష్యులను, ఉరగులను, రాక్షసులను, దేవతలను, అసురులను, గంధర్వులను దివ్యవిగ్రహములు (ఆకారములు)గల ప్రజలను, ఈశ్వరులైనవారిని రూపములోను, ద్రవ్య ములోను, తేజములోను తనతో సమానులైనవారిని, అట్లే ఇతరులను స్థావరములును జంగమములును అయిన ప్రాణులను మానసికముగనే సృష్టింపదలచి అనేక విధములైన ప్రజలను, ఋషులను, దేవతలను, గంధర్వులను, మనుష్యులను, ఉరగులను, రాక్షసులను, యక్ష–భూత–పిశాచులను, పక్షు లను, పశువులను, మృగములను సృష్టించెను. మనస్సుతో సృష్టించిన ఆప్రజలు చక్కగా వర్ధిల్లకుండిరి. అపుడు బుద్ధిమంతుడై మహాదేవుడైన భగవంతునిచే వేరుగా ధ్యానింప (చింతింప) బడినది. వివిధ ప్రజలను మైథున భావముతో సృష్టింప తలచెను. వీరణ ప్రజాపతియొక్క పుత్రియైన 'అసిక్ని' అను ఆమెను వహించెను (వివాహమై భార్యనుగా చేసికొనెను) ఆమె గొప్పతపముతో కూడినది. లోకమును ధరించునది. ఆమెచే ఈ సమస్త స్థావరజంగమాత్మకమైన జగత్తు ధరింపబడినది. ఇట కూడ ఉత్కృష్టురాలై వీరణ ప్రజాపతి పుత్రియైన 'అసిక్ని'ని భార్యగా పెండ్లాడుచున్న ప్రాచేతసుని (దక్షుని) గూర్చి ఈ రెండు శ్లోకములను చెప్పుదురు. ప్రభువైన దక్షుడు నదీగిరులలో లక్షబావులను, అభిమాన వంతులకు సర్పిణిని (ప్రవహించుదానిని) సృజించుచు వాని వెనుకనే అనుసరించి వెడలెను. ఆతనిని జూచి ఋషులు ఇట మొదటిది ప్రజలను ప్రతిష్ఠాపించగలదు అని అనిరి. రెండవది (అసిక్ని) దక్షప్రజాపతి యొక్క ప్రజలను (సంతానమును) ప్రతిష్ఠాపించగలదు అని అనిరి. ప్రాచేతసుడైన దక్షుడు ఇచట వీరిణి పుత్రి అగు అసిక్నిని భార్యగా పెండ్లాడెనో అచట అతడు కాలానుగుణముగా లక్షబావులచేరెను. ఆ తరువాత ప్రాచేతస ప్రభువు (దక్షుడు) తన అమితమైన యోజస్సుచే వీరిణి పుత్రియైన 'అసిక్ని' యందు వేవురు పుత్రులను జనింపజేసెను. వారిని చూచి ప్రజలను (సంతానమును) వృద్ధిపొందింపతలచెను. మహా

తేజస్వియు, దేవర్షియు, ప్రియముగ మాట్లాడినవాడును బ్రహ్మపుత్రుడైన నారదుడు వారి నాశము కొరకును ఆత్మశాపమునకును వచనమును పలికెను. ఎవ్వడు విప్రుడు అని చెప్పబడునో అతడు కశ్యపునివాడు అనుట కృత్రిమము, ఆ పనిచేత బ్రహ్మర్షి నారదుడు దక్షశాపమున భయము చెందెను. తరువాత, ఎవ్వడు కశ్యపసుతునకు పరమేష్ఠియై (బ్రహ్మయై) పుట్టెనో, ఆతడే ఇట దక్షశాపభయమున మరల కశ్యపునకు మానసపుత్రుడుగా జనించెను. ఆకారణమున ఆతడు (నారదుడు) రెండవ మానస పుత్రుడు అయ్యెను. ఆతడు (నారదుడు బ్రహ్మకు మొదట (మానసుడు)గా పుట్టినవాడు. ఆతనిచేతనే ఆ దక్షుని పుత్రులు అందరు హర్యశ్వులు అని ప్రసిద్ధులైరి. నిందకొరకై వారు అందరు నశింపజేయబడిరి. కావున దష్టులైరి. సంశయము లేదు. దానికి ప్రభువైన దక్షుడు కోపించినవాడై వాని నాశనమునకు బయలుదేరెను. కాని, బ్రహ్మర్షులను ముందిడు కొని బ్రహ్మచే యాచింపబడెను. దాని వల్ల దక్షుడు బ్రహ్మతో ఒప్పందమును చేసికొనెను. ఆ కన్యయందు నీ యొక్క (బ్రహ్మయొక్క) పుత్రుడు నా కొఱకు జనించు గాక–అని ఆ ఒప్పందము. తరువాత దక్షుడు తన ప్రియ పుత్రిని పరమేష్ఠికి (బ్రహ్మకు) ఇచ్చెను. ఆ బ్రహ్మవల్ల నారదుడు మరల జనించెను. ఆ నారద ఋషియు భయము నుండి శాంతించెను అనగా భయము వీడిపోయెను. అది విని ఆ విప్రులు మరల కుతూహలము కలిగినవారై ప్రవక్తలలో శ్రేష్ఠుడును తత్త్వార్థమును దర్శించు వాడును అయిన సూతుని అడిగిరి.

ఋషులు ఇట్లు అనెను :

దక్షప్రజాపతి పుత్రులును ప్రాచేతసాత్మజులునైన దక్షపుత్రులు మహాత్ముడైన నారదునిచే ఎట్లు నశింపచేయబడిరి–అని ఋషులు అడిగిరి. సూతుడు ఆ నిజమైన వాక్యమును తెలిసికొను కోరికతో బయలు వెడలి మధురమైన సర్వ గుణములతో కూడిన వచనమును పలికెను. దక్షపుత్రులు హర్యశ్వులనువారు. వారు వృద్ధి పొందగోరిన (దక్షుని) సంతానము. మహావీర్యులైన వారు నారదుని కడకు వచ్చిరి. నారదుడు వారితో ఇట్లనెను.

అయ్యో! మీరు చిన్న పిల్లవాండ్రు. భూతలమును తెలియరు. దాని అంతమును, ఊర్ధ్వమును, క్రింది భాగమును తెలియరు. ప్రజలను ఎట్లు సృష్టించగలరు. భూమియొక్క ప్రమాణము ఎంత? సృష్టింపదగిన వారు ఎంతటివారు? సృష్టింపతగిన దానిని తెలియకయే వేరొక విధముగా మీరు ఏమి సృష్టింతురు? అది కొద్దిదైనను అచట దోషము కనబడు చున్నది.

ఆహర్యశ్వులు నారదుని మాటనువిని వాయువుతో చేరి అన్ని దిక్కులకు చెల్లా చెదరుగా వెడలిపోయిరి. ఆ విధముగ వారు పరాభవము పొందిరి. వాయువుతో కలిసి

తిరుగుచున్నవారు ఇప్పటికి మరలిరాలేదు. ఈవిధముగా ఆ మహర్షులు వాయు మార్గ మును చేరి తిరుగుచునే ఉన్నారు. ఈ విధముగా తన పుత్రులు నష్టులు (కనబడనివారు) కాగా, ప్రాచేతసుడైన ప్రభువైన దక్షుడు మరల వీరిణియందు వేయిమంది పుత్రులను సృజించెను. ప్రజలను వృద్ధిచేయదలచినవారు శబలాశ్వులు అనబడిరి. మహౌజసులైన ఆ కుమారులందరును నారదుడు హర్యశ్వులు అన్నమాటను వినిరి, నారద మహర్షి చక్కగా అనెను, అని పరస్పరము అనుకొనిరి. మనముగూడ మన అన్నల మార్గముననే పోవలసియున్నది. సంశయము లేదు అనిరి. భూమి యొక్క ప్రమాణమును తెలిసికొని సుఖముగా ప్రజలను సృజింతము అని అనుకొని వారుగూడ ఆ(వాయు) మార్గముననే అన్ని దెసలకు వెడలిపోయిరి. సముద్రమునుండి నదులవలె ఇప్పటికిని వారు మరలిరారైరి. అప్పటినుండి అన్నలను వెదకుటలో ఆసక్తుడై పోవువాడు నశించును. తెలిసి ఆ పనిని చేయరాదు అనుకొనిరి. ఈశ బలాశ్వులు నష్టులు కాగా విభువైన దక్షుడు కుపితుడు అయ్యెను. నారదుని నాశమును పొందుము అనియు గర్భవాసమున ఉండుము అనియును శపించెను. ఆవిధముగ మహాత్ములైన శబలాశ్వులు పూర్వము నష్టులు కాగా దక్షుడు వీరణ పుత్రియైన వీరిణియందు ప్రసిద్ధలైన అఱువది కన్యలను సృజించెను. అపుడు ప్రభువైన కశ్యపుడు వారిని తన భార్యలుగా స్వీకరించెను. ధర్ముడు, భగవంతుడైన సోముడు, అట్లే ఇతర మహర్షులను కన్యలను స్వీకరించిరి. ఈ దక్షుని సమస్తసృష్టిని తెలిసినవాడు ఆయుష్మంతుడు, కీర్తిమంతుడు, ధన్యుడు, ప్రజా (సంతాన) వంతుడును అగును. (4)

కశ్యపీయ ప్రజాసర్గము

ఋషులు అనెను :

వైవస్వత మన్వంతరమున దేవతలయొక్కయు, దానవులయొక్కయు, దైత్యుల యొక్కయు అంతట జరిగిన ఉత్పత్తిని విస్తరముగా చెప్పుము.

సూతుడు అనెను :

ఇపుడు ధర్మునియొక్క సృష్టిని చెప్పెదను. దానిని వినుడు. అరుంధతి, వసువు, యామి, లంబ, భానువు, మరుత్వతి, సంకల్ప, ముహూర్త, సాధ్య, విశ్వ–అను ఈ పదుగురు ధర్ముని ధర్మపత్నులు. ప్రాచేతనుడైన దక్షుడు వీరిని ధర్మునకు ఇచ్చెను. అందులో 'సాధ్య' పండ్రెండుగురు సాధ్యులను ధర్మునకు పుత్రులనుగా కనెను. ఈ సాధ్యులనువారు మహాభాగ్యవంతులు, స్వేచ్ఛగా జన్మించినవారు, యజ్ఞములో భాగము గలవారు. వారిని దేవతల కంటె ఉత్కృష్టులని దేవతలను గురించి తెలిసినవారు చెప్పిరి. వారు బ్రహ్మ

ముఖమునుండి సంతానపు కోరికతో సృజింపబడిన జయులను దేవతలు. ఇట మన్వంత రములలో వారందరు మంత్ర శరీరులు. వారు దర్శుడును, పౌర్ణమాసుడును, బృహద్రథం తరుడును, చిత్తి, విచిత్తి, ఆకూతి, కూతి, విజ్ఞాత, విజ్ఞాతుడు, మనుమడు, యజ్ఞుడు- అనువారు. ఆ జయులయొక్క ఈ నామములు ప్రసిద్ధములు. బ్రహ్మశాపమున మరల స్వాయంభువమన్వంతరమున వారు పుట్టిరి. వారు జితులు. స్వారోచిషమన్వంతరమున వారు తుషితులు, మరల ఉత్తమమన్వంతరమున వారు సత్యులు. తామసమన్వంతరమున హరులనువారు. రైవతమన్వంతరమున వారు వైకుంఠులు. చాక్షుష మన్వంతరమున సాధ్యులనువారు. వారు దేవతలు. స్వేచ్ఛగా జన్మించినవారు.

ధర్మ పుత్రులై మహాభాగులైన ఆ సాధ్యులు దేవతలు. పూర్వము చాక్షుష మన్వం తరమున వారలను అనుసరించి జనింతురు. స్వారోచిష మన్వంతరమున గడచిన మహౌ జస్కులైన దేవతలు తుషితులనువారై చాక్షుష మన్వంతరమున పరస్పరము మాటాడిరి. ఆ చాక్షుషమన్వంతరము కొద్దిగా మిగులగా తుషితులను దేవతలు ఇట్లనిరి. "మనము పరస్పరముగా మహాభాగులైన సాధ్యులను ప్రవేశించి (మరొక) మన్వంతరమున జనించె దము. అది మనకు శ్రేయము కలుగగలదు" వారందరు ఈ విధముగా అని, మరల ఆ స్వాయంభువమనువు నుండి పుట్టిన పండ్రెండుగురు ధర్ములను ప్రవేశించి జనించిరి.

విద్వాంసుడైన ఇంద్రుడున్న చోట మరల నరనారాయణులు పుట్టిరి. వారు సత్యుడు, హరియు అనువారు. వారు పూర్వము స్వారోచిషమన్వంతరమున తుషితులను దేవతలుగా ఉండిరి. తుషితులు సాధ్యులైనపుడు వారి ఈ నామములు చెప్పబడుచున్నవి-'మనుడు, అనుమంత, ప్రాణుడు, నరుడు, వీర్యవంతుడైన యానుడు, చిత్తి, హయుడు, నయుడు, హంసుడు, నారాయణుడు, ప్రభవుడు, విభువు-అని సాధ్యులు పండ్రెండుగురు జనించిరి. మొదట స్వాయంభువమన్వంతరమున ఈ నామములు ఉండినవి. తరువాత స్వారోచిష మన్వంతరమున తుషితులైనవారి నామములు వినుడు. ప్రాణుడు, అపానుడు, ఉదానుడు, సమానుడు, వ్యానుడు, చక్షువు, శ్రోత్రము, ప్రాణము, స్పర్శ, బుద్ధి, మనస్సు ప్రాణాపాన ములును, ఉదానము, సమానము, వ్యానము-ఈ నామములు పూర్వము తుషితులవిగా చెప్పబడినవి.

వసువునకు వసువులు పుత్రులు. వారు సాధ్యులకు అనుజులు(తమ్ములు). ధరుడు, ధ్రువుడు, సోముడు, ఆపుడు, అనలుడు, అనిలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు-వీరు ఎన మండుగురు వసువులు. ధరునకు హుతమైన హవ్యమును వహించు ద్రవిణుడు పుత్రుడు-

ధ్రువుని పుత్రుడు భవుడు పేరుతో కాలుడు. లోకములను విశేషముగా శిక్షించి కాలనము (సుఖము) చేయువాడు కాలుడు. సోమునకు భగవంతుడు వర్చస్వి, గ్రహముల మేలు కొలుపు బుధుడును పుత్రులు. వారు రోహిణియందు పుట్టినవారు లోకములలో ప్రసిద్ధులు. తరువాత ధారోర్మికలలు (ధార, ఊర్మి, కలలు) అనువారు ముప్వురును గూడ చంద్రుని పుత్రులు. ఆపునియొక్క పుత్రుడు వైతండ్యుడు, శముడు, శాంతుడు, స్కందుడు, సనత్కు మారుడు పాదతేజస్సుతో పుట్టిరి. అగ్నిపుత్రుడైన కుమారుడు శర స్తంభమున (రెల్లు గడ్డిపొదలో) పుట్టెను. ఆతని తరువాత ఆతని అనుసరించి పుట్టినవారు–శాఖుడు, విశా ఖుడు, నైగమేయుడును. అనిలు(వాయువు)నకుభార్య శివ. వారికి మనోజవుడు, అవిజ్ఞాత గతి అను ఇరువురు పుత్రులు. ప్రత్యూషునకు ఋషి దేవలుడు–అను ఇరువురు పుత్రులు. దేవలునకు సౌతము ఇరువురు పుత్రులు క్షమ (ఓపిక) గలవారు, విద్వాంసులును బృహస్పతి యొక్క అక్క బ్రహ్మచారిణి, యోగసిద్ధయైన పరస్త్రీ. అనాసక్తయై జగమంతయు తిరుగును. వసువులలో ఎనిమిదవవాడైన ప్రభాసుని యొక్క భార్యకు పుత్రుడు విశ్వకర్మకలిగెను. ఆతడుశిల్పిబ్రహ్మ, సర్వ శిల్పములను నిర్మించువాడు. దేవతలను వర్ధిల్లజేయువాడు. సమస్త భూషణములను నిర్మించువాడు, ఇతరులచే నిర్మింపచేయువాడు. ఆతడు సమస్త దేవతలయొక్క విమానములను (మేడలను, ఆకాశయానములను, జలయానములను) నిర్మించును. ఆ శిల్పి యొక్క శిల్పములను అనుసరించి మానవులు కూడ జీవింతురు.

విశ్వకుపుట్టిన విశ్వేదేవులు పదుగురు ప్రసిద్ధులు. క్రతువు, దక్షుడు, శ్రవుడు, సత్యుడు, కాలుడు, కాముడు, ధుని, కురువంతుడు, ప్రభవంతుడు, రోచహనుడు–అని వారు పదు గురు. ధర్మపుత్రులుఅనబడు ఈ శుభులు విశ్వయందుపుట్టిరి. మరుత్వతియందు మరు త్వంతులు పుట్టిరి. భానవులు అనువారు భానువునకు పుట్టినవారు. ముహూర్తులు ముహూ ర్తయందు పుట్టిరి. ఆమె లంబఘోషునికనెను. సంకల్పయందు విద్వాంసుడు సంకల్పుడు పుట్టెను. జామియందు పథత్రయమును ఆశ్రయించిన నాగవీథులు పుట్టిరి. సమస్తమైన పృథివీ విషయము అరుంధతియందుపుట్టెను. ఈ శాశ్వతమైన విద్వాంసమైన సృష్టి ధర్ము నిదిగా చెప్పబడినది. ముహూర్తులును తిథులును పతులతోబాటు సువ్రతులు. వారిని పేర్లతో చెప్పెదను. రాత్రి, పగళ్ళయొక్క విభాగమును, సంగ్రహనక్షత్రములను కూడా చెప్పెదను వినుడు. ముహూర్తములు, సర్వనక్షత్రములును, అహోరాత్రములను తెలిసిన వారు (పగటిలోను రాత్రిలోను ఉండునవి). అన్నిటియందును తన (సం)గతి విశేషముచే ఋతువు (కాలము)ను కోరు రవి వలన అహోరాత్రకలలు ఆఋవందలకు మించినవి. అందువలననే వేదవేత్తలు పర్వములందు తిథిని కోరుదురు. అవిశేషములైన కాలములందు

పితృదానమును బట్టి కలుపదగినది. రౌద్రము, సార్వము, మైత్రము, పిండ్యము, వాసవము, ఆప్యము, వైశ్వదేవము, బ్రాహ్మము, మధ్యాహ్న సంశ్రితము, ప్రాజాపత్యము, ఐంద్రము, ఇంద్రము, నిర్ఋతి, వారుణము–అనునవి పితృ దేవతలలో ఒకడైన అర్యముని యొక్క (సూర్యుని యొక్క) దినమును ఆశ్రయించిన (పగటిని ఆశ్ర యించిన) భాగములు, ఇవి దినమునందలి ముహూర్తములు. సూర్యునిచే వినిర్మితములైనవి. శంకుచ్ఛాయా విశేషముతో (శంకువు యొక్క నీడలలోని భేదములను బట్టి) ప్రామాణికముగా తెలియ దగినవి. అజులు, అహిర్బుధ్న్యులు, పూష, అహి, యమ దేవతలు, ఆగ్నేయము, ప్రాజా పత్యము, బ్రహ్మము, సౌమ్యము, ఆదిత్యము, బార్హస్పత్యము, వైష్ణవము, సావిత్రము, త్వాష్ట్రము, వాయవ్యము–అని సంగ్రహము. క్రమముగా చెప్పబడిన పదునైదు ఏకరాత్ర ముహూర్తములు. చంద్రునిగతిని అనుసరించి ఉదయములు గలవి, నాలికలు పాదికలును. కాలావస్థలలోని ఈ ముహూర్తములు దేవతలు అనబడినవి. అన్ని గ్రహములకును, మూడే స్థానములు చెప్పబడినవి. అవి క్రమముగా దక్షిణ, ఉత్తర, మధ్యములు. మధ్యన జారద్గవ స్థానము, ఐరావత స్థానము ఉత్తరము. వైశ్వానర స్థానము దక్షిణము–అని ఇచట యథార్థముగా నిర్దిష్టమైనది. అశ్విని, కృత్తిక, యామ్య (భరణి)–నాగవీథి అనబడినది. రోహిణి, మృగశీర్ష, ఆర్ద్రవీథి అనబడినది. పుష్యమి, ఆశ్లేష, పునర్వసువు–ఐరావతీ వీథి అనబడినది. మూడు వీథులు. ఇవి ఉత్తర మార్గము నందలివి. పూర్వ ఫల్గుని, ఉత్తర ఫల్గుని, మఘ–అర్యమీ (వీథి) అనబడినది. హస్త, చిత్ర, స్వాతి–గోవీథి అనబడినవి. జ్యేష్ఠా, విశాఖా, అనూరాధ, జారద్గవీ వీథి అనబడినది. ఈ వీథులు మూడు మధ్యమ మార్గము నందలివి. మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, అజవీథి అనబడును. శ్రవణం, ధనిష్ఠ, శతభిష–మార్గీవీథి. పూర్వాభాద్రపద, ఉత్తరాభాద్రపద, రేవతి–వైశ్వానరీవీథి అన బడినది. ఆ మూడువీథులు దక్షిణ మార్గము నందలివని బుధులు చెప్పుదురు. దక్షుడు తన ఇరువది ఏడుగురు కన్యలను సోమునకు (చంద్రునకు) ఇచ్చెను. నక్షత్ర నామములుగల ఆకన్యలు జ్యోతిస్సు(చంద్రుని) కొఱకే అని అందురు. వారియొక్క సంతానములు కూడ అమితమైన తేజస్సుతో ప్రకాశించినవి. మిగిలిన కన్యకలనైతే కశ్యపుడు స్వీకరించెను. మహాభాగ్యవతులైన ఆ పదునలుగురు కన్యకలందరును లోకమాతలైరి. అదితి, దితి, దనువు, కాలా, అరిష్ట, సురసా, సురభి, వినత, తామ్ర, క్రోధవశ, ఇర, కద్రువ, ముని, ధర్మజ్ఞ అను వారు వీరు. వారియొక్క సంతానమును వినుడు. చారిష్ణ మన్వంతరము గడచిపోగా, పండ్రెండుగురు పురోగములై వైకుంఠులను వారు ఉండిరి. వారు చాక్షుష మన్వంతరమున సాత్ర్యులుగా అయిరి. మరల ఈ వైవస్వత మన్వంతరము రాగా, అదితిచే

ఆరాధింపబడిన వారు పరస్పరము ఒకచోట కలసికొని పరస్పరముగా "ఈ వైవస్వత మన్వంతరమున, యోగమువలన సగము చిత్తముతో ఈ మహాభాగ్యవతియైన అదితినే ప్రవేశించెదము. అట్లు ప్రవేశించి ఈమెకు పుత్రులము అగుదుము. దాన మనకు శ్రేయస్సు రాగలదు. అదితి నుండి ప్రసవించిన మనకు ఆదిత్యత్వము గూడ కలుగగలదు. అని ఈ విధముగా అనుకొని వారందరు చాక్షుష మన్వంతరమున మరల మారీచుడైన కశ్యపుని వలన (అదితికి) పండ్రెండుగురు ఆదిత్యులుగ పుట్టిరి. శత క్రతువును, విష్ణువును, మరల వైవస్వత మన్వంతరమున నర నారాయణులుగా దేవతలుగా పుట్టిరి. సూర్యునకు ఉదయా స్తమయములు రెండున్నట్లు, ఆ దేవతలకు కూడ చావు పుట్టుకలు ఉన్నవి. బ్రహ్మకును, విష్ణువునకును, మహాత్ముడైన భవునకును అవి కలవు. ఏ కారణమున శబ్దాది లక్షణమైన శ్రేష్ఠానుశ్రవికమున (సురలు) సమర్థులైరో! ఆ కారణముననే ఎనిమిది రూపములైన అణిమాదు లందు (సిద్ధులందు) సమర్థులై ఆదేవతలు పుట్టిరి అని ఈ విషయమునందలి ఐహిక విషయములందలి రాగము సంభూతికి (జన్మకు) కారణము బ్రహ్మ శాపముచే పుట్టిన జయులు స్వాయంభువ మన్వంతరమున జితులైరి. స్వారోచిష మన్వంతరమున తుషితులు అయిరి. ఉత్తమ మన్వంతరమున సత్యులైరి. తామస మన్వంతరమున హరులైరి. చారిష్ణవ మన్వంతరమున దేవతలైరి. చాక్షుష మన్వంతరమున వైకుంఠులైరి. ఇప్పటి మన్వంతరమగు వైవస్వతమున మరల సాధ్యులును ఆదిత్యులును అయిరి. ధాత, అర్య ముడు, మిత్రుడు, వరుణుడు, అంశుడు, భగుడు, ఇంద్రుడు, వివస్వంతుడు, పూష, పదవవాడు పర్జన్యుడు అనబడును. తరువాత త్వష్ట, అజఘన్యుడు (నీచుడుగానివాడు) అజఘన్యజుడు శ్రేష్ఠుడుగా బుట్టినవాడు అయిన విష్ణువు అని ఈ పండ్రెండుగురు ఆదిత్యులు కశ్యపునకు సుతులు. సురభి కశ్యపుని వలన పదునొకండ్ర రుద్రులను కనెను. మహాదేవు (శివు)ని అనుగ్రహమున తపముచేత 'సతి' కలుగనున్నది. అంగారకుడు, సర్పుడు, నిర్ ఋతి, సదసస్పతి, అజుడై ఏక పాదుడైన అహిర్బుధ్న్యుడు, ఊర్ధ్వకేతువు, జ్వరుడు, భువనుడు, ఈశ్వరుడు, మృత్యువు, ప్రసిద్ధిజెందిన కపాలి–అను ఈ త్రిభువనేశ్వరులైన పదునొకండు రుద్రులను సురభి (ఆ) మహాతపముతో జనింపజేసెను. తరువాత సురభి వేరుగా ఇద్దరు కూతులను కనెను. వారు రుద్రకాంతిగల రోహిణియు, యశస్వినియైన గాంధారి. రోహిణియందు ప్రసిద్ధులైన నలుగురు కన్యలు కలిగిరి. వారు–సురూప, హంస కీల, భద్ర, కామదుఘ అనువారు, కామదుఘ సురూప పుత్రీ ద్వయమును కనినది. హంసకీల నృపుని కనెను. భద్ర ఋషులను కనెను. మహాభాగ్యవంతులై ప్రసిద్ధులైన గంధర్వులు వాజియొక్క పుత్రులు. అపుడు పైకి నిక్కపొడుచుకొన్న చెవులుగల ఉచ్చైశ్ర

వములు (గుఱ్ఱములు)పుట్టినవి. అవి మనోవేగము గలవి, ఆకాశమున చరించునవి, తెల్లనివి, శ్యేనములు అనగా డేగవలె ఎగురునవి, పిశంగములు (కపిల వర్ణము కలవి), సారంగములు (చిత్రవర్ణము కలవి), హరితార్జున ములు (పసుపు, తెలుపు వర్ణము కలవి). రుద్రుని వల్లనే వెలుపలికి వచ్చినట్టివి గంధర్వ యోనులైన గుఱ్ఱములు. మరల సురభినుండి శ్రీమంతము (శోభావంతము), చంద్రకాంతి వంటి చక్కని కాంతి కలది, పూలదండలు కలది, మూపురముకలది, కాంతికలది, సముద్రము నుండి పుట్టినదియు అయిన వృషభము పుట్టినది. అది సురభి అనుమతితో ఇచ్చిన మహేశ్వరుని ధ్వజము. ఇవ్వీరు కశ్యపసుతులైన రుద్రాదిత్యులుగా చెప్పబడిరి. అట్లే ధర్మపుత్రులు సాధ్యులు, విశ్వులు వసువులు అనబడిరి. ఇట అరిష్టనేమి పత్నుల సంతానములు పదునాఱు. బహుపుత్రుడై విద్వాంసుడైన విద్యుత్తునకు నలుగురు సుతులు కలరు. ప్రత్యంగిరసునకు పుట్టిన వారు శ్రేష్ఠులైన ఋక్కులు బ్రహ్మర్షి సత్కృతములు. దేవర్షియైన కృశాశ్వునకు పుత్రులు దేవ ప్రహరణులు అందురు. వీరు యుగ సహస్రము చివర మరల పుట్టుదురు. అన్ని దేవగణములు, విప్రములు (బ్రాహ్మణ జాతివి). ముప్పదిమూడు స్వేచ్ఛగా జనించిన వారు. ఈ దేవతలకుగూడ హద్దుతో కూడిన జననము ఉండును. ఈ లోకమున సూర్యునకు ఉదయాస్తమయములు రెండును ఉండునట్లే ఈ దేవసమూహములు గూడ ప్రతి యుగమున పుట్టుదురు.

ఋషులు ఇట్లు అనిరి :

సాధ్యులు, వసువులు, విశ్వేదేవతలు, రుద్రాదిత్యులును మంచి వంశముతోను, ప్రభావ ములతోను, వారి పనులతోను ప్రసిద్ధులు. బ్రహ్మయొక్కయు, విష్ణువుయొక్కయు, మహా త్ముడైన శివునియొక్కయు అంతరమును (భేదమును) తెలియగోరు చున్నాము. వారిలో ఎవ్వడు ఎవ్వనికంటె గొప్పవాడు? ఎవ్వడు ఎవ్వని కంటె సమర్థుడు? ఎవ్వడు ఎవ్వని యందు ప్రతిష్ఠితుడు? వారిలో ఎవ్వడు మిక్కిలి శ్రేష్ఠుడు? మధ్యముడు ఎవ్వడు? కనిష్టుడు ఎవ్వడు? వారిలో ప్రధానమైన వాడు ఎవడు? అప్రధానుడు ఎవడు? కర్మలచేతను, మంచి వంశము చేతను, ప్రభావముచేతను గొప్పవాడు ఎవడు. నీవు తెలిసిన వాడవు. ఇదంతయు ఉన్నది యున్నట్లు మాకు చెప్పుము అనిరి.

వారితో సూతుడు ఇట్లు అనెను :

ఇట మీకు బ్రహ్మ, విష్ణు, రుద్రులలో అనుకొనబడిన అంతరమును నేను చెప్పెదను వినుడు. ప్రతి కాలమున పుట్టునవై రాజస, తామస, సాత్త్విక రూపములైన ఆ బ్రహ్మ, రుద్ర, విష్ణువుల శరీరములు బ్రహ్మకు సంబంధించినవిగనే చెప్పబడినవి. ఓ బ్రాహ్మణోత్త

ములారా! వీనిలో భేదమును చెప్పుట సాధ్యము గాదు. సత్త్వ, రజస్, తమో గుణముల వృద్ధిచే బ్రహ్మ దేహములు నిబంధింపబడి ఉండుటయే, కారణము రజస్తమో గుణములు రెండు అనుగ్రహరూపమైన సత్త్వముతో బంధముగలిగి ఉండుటయు, ఆ తనువుల (శరీరముల) ప్రవృత్తిని నివృత్తిని గుణవృద్ధిని వినుడు. వానిలో ఒకటి రాజసీతనువు. అది అంతట ప్రజాసృష్టిని చేయును. మరొకటి సాత్త్వికి. అది సముద్రమున ఉన్నదై, సృష్టించిన ప్రజను అనుగ్రహించును (పాలించును). మరొకటి తామసి. అది ప్రజలను కప్పివేసి మ్రింగివేయును. ఇవి ఆ పరబ్రహ్మయొక్క తనువులే. అపుడు రజో గుణముతో ఉద్రిక్తుడై బ్రహ్మ పుట్టును. అప్పుడు ఆతని పురుషుడు అను పేరుగల సాత్త్విక శరీరము మరలిపోవును. తామసగుణము ఉద్రిక్తమైనపుడు కాలాత్మక రుద్రతనువు పుట్టినపుడు బ్రహ్మ అను పేరొందిన రాజసశరీరము మరలిపోవును. సత్త్వగుణము ఉద్రిక్తమై (పురాణ) పురుషతనువు పుట్టినపుడు కాలరూప తనువు ఉండదు. అది నివర్తించును. సర్వానుగ్రహ నిగ్రహములతో ముల్లోకమున ఉండు పరబ్రహ్మయొక్క రూపము నామమును పనియును క్రమముగా నివర్తించుచుండును (రాజస బ్రహ్మ పుట్టగా సాత్త్విక పురాణ పురుషుడు నివర్తించును తామస రుద్రుడుపుట్టగా రాజసబ్రహ్మ నివర్తించుచుండును (రాజస బ్రహ్మ పుట్టగా సాత్విక పురాణ పురుషుడు నివర్తించును. తామస రుద్రుడు పుట్టగా రాజస బ్రహ్మ నివర్తించును. సాత్త్విక పురాణపురుషుడు (విష్ణువు) పుట్టగా తామస రుద్రుడు నివర్తించును). బ్రహ్మ నిజముగా పుట్టినపుడు వారి భేదము చెప్పబడగలదు. కాని బ్రహ్మ పుట్టడు. పురుషుడు (విష్ణువు) బ్రహ్మయైనపుడు ఆతడు నిజముగా పురుషుడు గాడు. మణిశుద్ధ స్ఫటికమున తెల్లనిదైనను ఆశ్రయవశమున రంగును స్వీకరించినదై చిత్రమైన వర్ణములను (రంగులను) వేర్వేరుగా చూపును. అట్లే రజస్, తమస్, సత్త్వ గుణ వశము వలన బ్రహ్మ తత్తద్గుణవంతుడై బ్రహ్మాది తనువులనుచూపును. ఇది బ్రహ్మ ఒక్కటి అనుటలోను భిన్నమనుటలోను ఉదాహరణముగా చూపబడినది. మేఘము ఒక్కటయ్యు వేరువేరుగా ఉండును. అట్లే బ్రహ్మగుణ వశమున రూపముతోను, వర్ణముతోను భిన్నుడుగా బ్రహ్మ రుద్ర విష్ణువులుగా కనబడును. ఒక్కడే రెండుగను, మూడుగను తన మూర్తియొక్క (క్రమముగా విష్ణు, బ్రహ్మ, రుద్రమూర్తులు) నశించుటచేత అగుదురు. ఒక్కడే బ్రహ్మయు, రుద్రుడును, విష్ణువును అని ముగ్గురు అగును. బ్రహ్మ, పౌరుషీ, అంతకారీ అను ఈమూడు మూర్తులు ఒక్కడైన బ్రహ్మవే కాని అన్యము కాదు. అందులో రాజసీమూర్తి ప్రజలను సృష్టించునది. తామసీమూర్తి కాలాఖ్యము. అది ప్రజాక్షయము చేయునది. సాత్త్వికీమూర్తి పురుషాఖ్యము. అది ప్రజలను అనుగ్రహించి పాలించునది బ్రహ్మయొక్క రాజసీ

మూర్త్యంశతో మరీచి కశ్యపుడై పుట్టెను. అంతకారియైన బ్రహ్మయొక్క తామసీమూర్త్యంశతో భవుడు (రుద్రుడు) పుట్టెను. బ్రహ్మయొక్క సాత్త్వికీ పౌరుషీ మూర్త్యంశతో విష్ణువు పుట్టెను. ముల్లోకమున ఆ మూర్తులు మూడు బ్రహ్మవే అని చెప్పబడును. కాలము అనునది అనేక ప్రయోజనములుగల అవస్థ ఏర్పరచును. పరబ్రహ్మ బ్రహ్మగా ప్రజలను సృష్టించి, విష్ణువుగా వారి ననుగ్రహించి పాలించి, రుద్రునిగా ఆ ప్రజలను మరల సంహరించును. స్వయంభువైన బ్రహ్మ యొక్క ఒక్కే కాలుడు (కాల స్వరూపుడు) మూటితో బ్రహ్మ, విష్ణు, రుద్ర మూర్తులతో, సృష్టి, అనుగ్రహ, సంహారము లను చేయును ఆతడే ప్రజలను సృష్టించును, అనుగ్రహించును, సంహరించును. అని పరబ్రహ్మయొక్క ఈ ప్రజాపత్యా, రౌద్రీ, వైష్ణవీ అనబడు మూడు మూర్తులు చెప్పబడినవి. సాంఖ్య-యోగపరమైన వేదమునను పురాతన ధర్మ శాస్త్రమునను, భగవంతుని భిన్నత్వ మును ఏకత్వమును దర్శించు వీరులచేత చక్కని వంశ ప్రభావమును తెలిసిన వారిచేతను, తత్త్వదర్శనులైన ఋషులచేతను ఆ పరబ్రహ్మమూర్తి ఒక్కటిగనే చెప్పబడినది. ఇచట బ్రహ్మ ఏకత్వమును, భిన్నత్వమునను ప్రజలు భిన్నులైరి (వేరుగా అయిరి). "ఇది గొప్పది ఇది కాదు"-అని చెప్పువారు భిన్న దర్శనులు. (భేదమును చూచువారు). అవిజ్ఞానముతో గూడి విషయాసక్తులై రత్యాదులు నిండిన చిత్తముతో కొందరు బ్రహ్మను కారణునిగాను, మరికొందరు ప్రజాపతిని కారణుని గాను, కొందరు శివుని ఉత్కృష్ణునిగను, మరికొందరు విష్ణువును ఉత్కృష్టునిగను చెప్పు దురు. ఇచట తత్త్వమును, కాలమును, దేశమును, కార్యములను వాని కారణమును నిజముగా వీక్షించి ప్రయోజనములలో ఈ దేవతలు ఏర్పడిన వారుగా జెప్పబడినారు (కాని వారు అందఱు ఒక్కరే). వారిలో ఒక్కరిని నిందించినవాడు అందరిని నిందించిన వాడు అగును. ఒక్కరిని స్తుతించినవాడు అందరిని స్తుతించిన వాడగును. పురాణ పురుషుని ఒక్కని ఎవ్వడు తెలియునో వానిని బ్రహ్మవాది. (బ్రహ్మను చెప్పువాడు) అని అందురు. విజ్ఞాన దేవతలలో ద్వేషము పూనరాదు. సర్వైశ్వర్యముతో నిండి ఉన్న ఈశ్వరుని తెలియుట సాధ్యముగాదు. బ్రహ్మ విష్ణు రుద్ర రూపముల మూడుగానై ప్రజలను మోహింపజేయువాడు ఒక్కడే (సర్వాత్ముడు). జనులు ఈ ముప్పురిలోను అంతరముతో ప్రవర్తింతురు. నైజమును తెలియగోరుదురు-పరీక్షింతురు. రూపమున భ్రాంతి చెంది విషయాసక్తులు అగుదురు. ఇది గొప్పది. ఇదికాదు - అని చెప్పుదురు. వారు బ్రహ్మలో భేదము చూచువారు. వీరు రాక్షసులను, నరపిశాచు లను ప్రవేశింతురు. గుణ-మాత్రాత్మికములైన మూర్తులతో ప్రజ లను మోహింపచేయుచు స్వయంభువు పరబ్రహ్మ ఒక్కడుగను వేర్వేరుగను ఉంటున్నాడు. వారిలో ఒక్కరిని పూజించువాడుకూడ ముప్పురిని పూజించువాడగును. ఈ ముగ్గురు దేవతలు భేదములేక ఉండువారు. కావున ఇచట పృథక్త్వము తత్త్వజ్ఞానమునుండి దూరము

వెడలి మరల వచ్చిన యేకత్వసంఖ్యారూపము. వారిలో ఏకత్వమును గాని, బహుత్వమును గాని ఎవరు తెలిసికొనగలరు? ప్రజను సృష్టించినందునను, అనుగ్రహించినందునను, సంహరించి నందునను భూత, భవిష్య, వర్తమానములలో రజస్సత్త్వతమోగుణాత్మక మైనందునను ఆతడు ఒక్కడే అనబడుచున్నాడు. పండితులు ఆ ఒకే దేవుడైన నారాయణుని రుద్రునిగను, బ్రహ్మగను, ఇంద్రునిగను, లోకపాలురుగను, ఋషులుగను, దనువులుగను, బహు విధముగా చెప్పుదురు. ప్రాజాపత్యఅను మూర్తియు, వైష్ణవీ మూర్తియు, మన్వంత రమునను కల్పమునను మరల మరల తిరిగి వచ్చుచుండును. తేజమునను, యశమునను, బుద్ధి యందును, శ్రుతమునను, బలమునను త్రిమూర్తులతో సమానముగా పుట్టుదురు. వారిని గూడ వినుడు.

రాజసికి బ్రహ్మయొక్క అంశతో మరీచియైన కశ్యపుడు పుట్టెను. తామసికి ఆ బ్రహ్మయొక్క అంశతో కాలాత్ముడైన రుద్రుడు పుట్టెనని చెప్పబడినది. సాత్త్వికికి పురుష అంశతో యజ్ఞమున అపుడు విష్ణువు కలిగెను. మూడు కాలములలో ఈ తనువులు బ్రహ్మ అంశమున పుట్టినవి. ఈతడు కాలుడైన రుద్రుడై ప్రజలను సంహరించును. కల్పాంతము రాగా సప్తరశ్మి (ఏడు కిరణములు గల) సూర్యుడు ప్రళయ ఆదిత్యుడై అపుడు ముల్లోకము లను దహించును. నామ రూపముల మార్పు జరిగినపుడు విష్ణువు ప్రజలను అనుగ్ర హించును, పాలించును. ఆయా అవస్థలో (దశలో) ఆయా ఉత్పత్తికి కారణమగును. సత్త్వగుణ ఉద్రిక్తమైన బ్రహ్మయొక్క పౌరుషీ తనువు అంశతో ఇట మొదటి స్వాయంభువ మన్వంతరమున ఆకూతియందు మనస్సు నుండి విభువై దేవుడైన విష్ణువు పుట్టెను. తరువాత మరల ఆ దేవుడే స్వారోచిష మన్వంతరము రాగా తుషితయందు పుట్టినవాడై తుసితులతో బాటు గతించెను. ఉత్తమమన్వంతరమున ఆతడు తుషితుడని తెలుసు కుందురు. వశవర్తులతో పుట్టి వశవర్తియైన హరి మరల సత్యయందు సత్యుడై సత్యులు అయిన సురోత్తముతో బాటు పుట్టెను. తామస మన్వంతరము రాగానే మరల భార్యయందు హరులతో పాటు హరియే పుట్టెనట. చారిష్ణవమన్వంతరమున గూడ మరల ఆతడు హరిదేవుడు. ఈతడు వైకుంఠమందు ఆ భూతరజసులతో బాటు జన్మించెను. చాక్షుష మన్వంతరము రాగానే ఆ వైకుంఠుడే మరల దేవుడు. ధర్ముడైన నారాయణుడు సాధ్యుడు. సాధ్యులైన సురలతోబాటు పుట్టెను. వైవస్వత మన్వంతరము రాగా ఆ నారాయణుడే సాధ్యుడు (దేవజాతివాడు). మారీచుడైన కశ్యపుని వలన అదితి యందు విష్ణువు జన్మించెను. ఆవరించు పాదవిక్షేపము గలుగునట్లుగా విష్ణువు తన మూడు అడుగులతో ఈ లోకములను జయించెను. తరువాత ఆ ప్రభువు (విష్ణువు) వానిని ఇంద్రునకును దేవతలకును ఇచ్చెను-

అను ఆతని తనువులు గతించిన ఏడు మన్వంత రములలో గడచినవి. ఆ తనువులచేత అప్పటి ప్రజలు రక్షింపబడిరి. అందువలననే ఈ లోకమున పుట్టుచున్న వామనునిచేత ఈ సర్వము ప్రవేశింపబడినది. అందువలననే ప్రవేశార్థకమైన 'విశ్' ధాతువుతో నేర్పడిన విష్ణు శబ్దముతో పిలువబడెను. అను వీరు అందరు బ్రహ్మకు సంబంధించినవారే. మహాత్ముడైన వామనునకు ఏకత్వము, పృథక్త్వము (వేరుతనము) విశిష్టత్వమును చెప్పబడినవి.

ఈ లోకములో దేవత అంశతో జన్మించు దేవతలకు ఆ దేవతలు బుద్ధిచేతను, శ్రుతముచేతను, బలముచేతను వారి అనుగ్రహమున సమానులై జన్మింతురు. ఏయే ప్రాణి విభూతి (మహైశ్వర్యము) కలదియు, సిరికలదియు దృఢమైనదియు అగునో ఆ ప్రాణి యంతయు విష్ణువుయొక్క తేజ అంశముచేతనే పుట్టినదని తెలియవలెను. ఆతడు (విష్ణువు) ఈ విధముగా కొద్ది అంశతో పుట్టునని కొందరు మానవులు తలంతురు. మరికొందరు ఈతనిని అన్యోన్య అంశతో పుట్టినవానిగా చెప్పుదురు. ఈ విధముగా వివాదపడుచునే వారిని చూచి-మనస్సుకును చిత్తమునకును భేదము లేనందున వారికి అనుగ్రహము గలుగునుకాన వారు క్షేత్రజ్ఞులు అగుదురు. ఒక్కడే ఈశ్వరుడు ప్రభుశక్తిచే బహువిధములుగా అగును. అట్లు బహువిధములుగా మారినను, మరల అతడు ఒక్కడే అగును. ఆ దేవతల భేదము వలన తేజము నుండి అన్ని మన్వంతరములలోను స్థావరజంగమ రూపులైన ప్రజలు జన్మింతురు. వారు సృష్టి ఆదిలో ఒక్కమారు పుట్టినవారై ప్రశంసతో నిలుతురు. కల్పము అంతము వచ్చిన ప్రతిమారును రుద్రుడు ఆ ప్రజలను సంహరించును. యోగమాయచే ఇతరులను మోహింపజేయుచు ఈశ్వరులు పుట్టుదురు. ఆ ఈశ్వరులు ఐశ్వర్యముతో చరించుచు అనీశ్వరులై మోహింప చేయుదురు. కావున దోషప్రచారములలో యుక్తాయుక్తములు ఉండవు. భూతమును గురించి చెడుగా చెప్పువారు దుష్టులు. భూతమును భావించువారు మధ్యస్థులు. భూతమును చెడుగా చెప్పువారు శక్తులు. ఇవి ప్రవాదులకు(ఎక్కువగా చెప్పువారికి)మూడువేదములు. దృఢమయి నందువల్లను, పూర్వమైనందునను (ప్రాచీనమైనందునను) శ్రుతువైనందునను (వినబడి నందునను), లౌకిక ప్రవాదము అయినందునను ఈ నాలుగు కారణములచేత మానవుడు ఒక దానిని ఉన్నదున్నట్లు తెలిసికొనలేడు. పూర్వము మరొక అర్థమున ఉంచబడినవియు, కాలము అంతరమున ఉన్నవియు, యథార్థముగా తెలియవు. దాని వలన ఉన్న మరియొక అర్థమును గూడ ద్వేషము వలన తెలియడు. ధర్మములకు ద్రవ్య భూతుడను, వానిలో గుణభూతుడును, కర్మలకును మనస్సునకును గూడ ద్వేషమువలన తెలియడు. ధర్మములకు ద్రవ్యభూతుడను, వానిలో గుణభూతుడును, కర్మలకును మనస్సుకును కర్తయైన వాడును,

ఉత్తమ వంశముతో గొప్పవాడైనవాడును శ్రుతమును తెలిసిన ఈ నాలుగు కారణములచేత బాగుగా కీర్తింపబడుదురు. అశక్తుడై కోపించినవాడు దేవతలను విభాగ పూర్వకముగా తెలియును. ఈ విషయమున యోగేశ్వరునిగూర్చి యోగ బలమును పొంది తన ప్రతి రూపములను ఇతరులకు వేల ప్రతిరూపములుగాజేసి వాటి అన్నింటితో గూడి ప్రవర్తింప వలెను. విషయములను (రూప, రస, గంధ, స్పర్శల సుఖములను) పొంద వలెను. అట్లే ఉగ్రమైన తపము చేయుచు సూర్యతేజము గుణములను వలె సంచరింపవలెను. (5)

కశ్యపీయ ప్రజాసర్గము

ఋషులు ఇట్లు అనిరి :

ఆ సూతుని ఈ మాటలను విని నైమిశారణ్యవాసులైన మునులు "యథాక్రమ వచనమునకు శ్రేష్ఠుడై ఈ లోకమున ఏడు మన్వంతరములలో ఇంద్ర–విష్ణు ప్రధానులైన మహౌజస్సులైన ఆదిత్యులు (అదితి పుత్రులు) ఎట్లు పుట్టిరి? ఓ రోమ హర్షణ! సూత! ఇది అంతయు మాకు విస్తరముగా చెప్పుము" అని సూతుని అడిగిరి. బ్రహ్మవాదులైన మహర్షులతో అడుగబడిన వినయవంతుడు ప్రవక్తలలో శ్రేష్ఠుడును అయిన సూతుడు అప్పుడు ఇట్లనెను.

"సంతానేచ్ఛతో బ్రహ్మముఖము నుండి సృష్టింపబడిన ఆ దేవతలు అందరును మన్వంతరములలో ఈ లోకమున మంత్ర శరీరులు (మంత్రము శరీరముగా గలవారు). దర్శుడు, పౌర్ణమాసుడు, బృహత్తైన, రథంతరము, వారిలో ప్రథముడైన ఆకూతుడు, తరువాత అకూతియు, తరువాత అధీష్టుడును, తరువాత విత్తి, సువిత్తి, అధీతియు, విజ్ఞాతియు, విజ్ఞాతుడును, మానవుడును – వీరు పండ్రెండుగురు. ఇట్లు ద్వాదశ పుత్రులు కలవాడని పన్నెండు మాసములు గల సంవత్సరముతో సమానుడు అనియు తెలియవలెను. ఆతనిని చూచి బ్రహ్మ–'జయ' దేవతలను కనెనని అనెను. దారాగ్నిహోత్ర (గార్హస్థ్యాగ్ని) సంయోగమున మిథ్యను (మిథున భావమును) మొదలిడుడు అని. ఈ విధముగా పలికి బ్రహ్మ అచటనే అంతర్ధానమందెను.

తరువాత వారు (ఋషులు) బ్రహ్మయొక్క ఆ మాటను అభినందించలేదు. వాక్కు, మనస్సు, కర్మలు, వీనివల్ల ఈ లోకములో పుట్టిన కర్మలు సత్యస్వరూపునకు సంబంధించినవే. దోషమును చూచి కర్మలందు నిలచి ఉండు వారు కర్మలయొక్క ఫలమును క్షయాతిశయయుక్తముగా చూచి, సంతానమును ఏవగించుచు అలసటలేని వారును, మమకారము లేనివారును అయిరి. మాటిమాటికి కోరికలను కోరుచున్నవారై (అందులో)

దోషము జూచి విరక్తులై అర్థమును, ధర్మమును, కామమును వదిలి చక్కగా ఉండిరి. పౌరుషమైన (విష్ణు సంబంధమైన) జ్ఞానమును పొంది తేజమును సంక్షేపించి కూడ ఉండిరి. వారియొక్క ఆ అభిప్రాయమును తెలిసి బ్రహ్మ కోపించెనట. అపుడు నిరుత్సాహులగు ఆ సురలతో ప్రజ కొఱకే మీరు ఉద్దేశింపబడితిరి. నేను ప్రజను సృష్టించు వానిని వేరుకాదు. "నేను పూర్వము సంతానమును కనుడు, జయింపుడు" అని చెప్పియే ఉంటిని. నా మాటను తిరస్కరించి వైరాగ్యము పొందిన కారణమున మీ స్వజన్మను ఏవగించువారై సంతతిని అభినందింపకుందురు గాక. అమరణమును కోరి కర్మలయొక్క సన్యాసము గూడ చేయబడినది. కావున మీరు ఏడు మారులు అనాదరించి తరువాత (సంతతిని) పొందుదురు. బ్రహ్మచేత శపింపబడి ఆ జయులు ఆ బ్రహ్మను శాంతింపచేసిరి. "ఓ ప్రభో! ఓ దేవ! ఓ మహాదేవ! అజ్ఞానము వలన చేసిన మా పనిని క్షమింపుము" అని నమస్కరించి సానునయముగా పలికిరి. బ్రహ్మ వారితో మరలఇట్లనెను. ఈ లోకమున నాచే అనుమతింపబడని వాడు ఎవడు స్వాతంత్ర్యమునకు అర్హుడు కాడు. నాకు అంతయు తెలియును. శుభముకాని, అశుభముకాని, నా ఇష్టములేక భూతములు తెలుసుకొనలేవు. పొందలేవు. లోకమున సత్త్వము అసత్త్వము–అని వ్యవస్థితమైనది అంతయు బుద్ధ్యాత్ముడనైన నాచే వ్యాపింపబడినది. లోకమున నన్ను ఎవ్వడును వంచింపలేడు. భూతములు తర్కించినదియు ధరించినదియు, విచారించి నదియు అంతయును నాకు తెలియును. నాచేత సుస్థితమైన ఈ స్థావర జంగమాత్మకమైన జగము అంతయు ఆశామయమైన తత్త్వముతో ఇట ఏ విధముగను ఛేదింప ఉత్సహించను. నేను సృష్టికొఱకై వివృత్తుడనైతిని (అవతారములతో మార్పు చెందితిని) వేరుకాదు కావుననే లోకమున ఎవడు కర్మలను ఆరంభింపక నా ఇష్టము నుండి విడివడగలడు? అని పలికి, తరువాత బ్రహ్మ నష్టచేతస్కులై దేవతలై దండమున నిలచిన యాజయలను గూర్చి ఏ కారణమున పూర్వము నన్ను వంచించి సన్యాసము చేయబడినదో! ఏ కారణమున అంతులేని ఈ విఫలము చేయ బడినదో! ఆ కారణమున సుఖమైన భవిష్యత్ఫలము కలుగును. దేవతలు భావములలో (మనస్సులలో) జన్మింతురు గాక. ఓ సురోత్తములారా! మీ స్వేష్ట ప్రకారమున మీ జన్మలు కలుగగలవు. మీరందరు ఆఱు మన్వంతరములలోనికి వెళ్లగలరు. స్వాయంభువముతో మొదలై వైవస్వత మన్వంతరముతో ముగియు మన్వంతరములలో దేవతలు అట్లే జన్మింతురు. వారిని తెలిసి అచట బ్రహ్మ పురాతనమైన శ్లోకమును గానముచేసెను. త్రయిని (ఋగ్యజస్సామ వేదములును) విద్యను, బ్రహ్మచర్యమును, సంతానమును, శ్రాద్ధమును, యజ్ఞమును, దానమును చేయు వీరిలో ఆ బ్రహ్మ విరజుడై (రజోగుణము లేనివాడై) ఇతరుల ప్రశంసతో

ఉండును. బ్రహ్మ ఈ విధముగా శ్లోకమును చూచి జయులను దేవతలతో వైవస్వత మన్వం తరము గడవగనే ఇట నా సమీపమునకు రండు అని పలికెను. తరువాత మీరు నాతోబాటు శాశ్వతమైన సిద్ధిని పొందగలరు. ఈ విధముగ వారితో చెప్పి బ్రహ్మ అచటనే అంతర్ధాన మొందెను.

ఈశ్వరుడైన బ్రహ్మ అంతర్ధానము చెందగా, ఎక్కడినుండి కూడ భయము లేని వారై దేవతలు, అణిమాది సిద్ధులతో కూడినవారును, యోగబలముతో కూడినవారును అయిరి. తరువాత వారిశరీరములు పండ్రెండు మడుగులైనవి. అవి జయములని చక్కగా పిలువబడినవియు, సముద్రముతో సమానమైనవియు అయినవి. తరువాత స్వాయంభువ మన్వంతరమున నా సృష్టిలో సురలు పుట్టిరి. రుచికి అజితయందు పుట్టిన పుత్రులు పండ్రెండుగురు అజితులు అనబడిరి. విధి, మునయుడు, క్షముడు, నందుడు, అవ్యయుడు, ప్రాణుడు, అపానుడు, సుధాముడు, క్రతు, శక్తి, వ్యవస్థితుడు, అజితుడు ఈ పండ్రెండుగురు అజితులు అనబడిరి. వీరందరు మానస పుత్రులు. వారు యజ్ఞమున దేవతలతో పాటు యజ్ఞభాగమును పొందువారు. స్వాయంభువ మన్వంతరమునను పూర్వము స్వారోచిష మన్వంతరమునను మరల స్వరోచికి తుషితయందు పుత్రులు పుట్టిరి. వారు తుషితులను పేర ప్రసిద్ధిచెందిరి. వారు ప్రాణులను పేరుగల యాజ్ఞకులు. మరల వారు ఉత్తమ మన్వం తరమున తుషితులను దేవతలు. వారు స్వయముగా ఉత్తమునకు సత్యయందు పుట్టిన శుభులైన పుత్రులు. కావున ఉత్తమ మన్వంతరమున సత్యులని పిలువబడిరి. మూడవ ద్వాపరాంతరమున వారు యజ్ఞభాగమును పొందువారైరి. తామస మన్వంతరము రాగా ఆ సత్యులు మరల దేవతలైరి. హర్షులు పండ్రెండుగురు తమసునకు పుత్రులుగా జన్మించిరి. వారు హరులు అనుపేర దేవతలు యజ్ఞ భాగమును పొందువారుగా అయిరి. తరువాత ఆ హరులను దేవతలు చారిష్ణవ మన్వంతరము రాగా వైకుంఠమందు చరిష్ణువు నకు సురలై జన్మించిరి. పంచమ మన్వంతరమున వారు వైకుంఠులు అను దేవతలు. తరువాత ఆ వైకుంఠ దేవతలు చాక్షుష మన్వంతరమును చేరి సాధ్యయందు ధర్మపుత్రులుగా పండ్రెండుగురు పుత్రులై జన్మించిరి. తరువాత మరల వారు చాక్షుష మన్వంతరము క్షీణింపగా, వైవస్వత మన్వంతర సృష్టి రాగా సాధ్యులైరి. వైవస్వత మన్వంతరమున మొదటి త్రేతాయుగ ప్రారంభము రాగా మారీచుడైన కశ్యపుని వలన అదితియందు ఆ సాధ్యులే అంశముగా పుట్టిరి. వీరు వర్తమాన చాక్షుష మన్వంతరమున ద్వాదశాదిత్యులు. తరువాత స్వాయంభువ మన్వంతరమున ఆసాధ్యులు పండ్రెండుగురు దేవతలుగా జన్మించిరి. ఈ మొదలుగాగల జయులు అపుడు శాపముతో పుట్టిరి. దేవశాసనమున,

ఈ దేవతల సప్త సంభూతిని (ఏడు జన్మలను) శ్రద్ధాయుక్తుడై పఠించునో, వాడు ప్రత్య వాయమును (పాపమును) పొందడు అని ఈ జయులయొక్క ఏడు లక్షణములు గల ఏడు జన్మలు సంపూర్ణముగా ఇప్పుడు చెప్పబడినవి. మరల ఇంకేమి వినగోరుచున్నారు అని మునులను సూతుడు అడిగెను.

దైత్యుల యొక్కయు, దానవుల యొక్కయు, గంధర్వ, ఉరగ, రక్షస్సుల యొక్కయు, సమస్త భూత పిశాచముల యొక్కయు, పశువుల యొక్కయు, పక్షులయొక్కయు, తీగల యొక్కయు జననమును మరణమును విస్తరముగా మాకు చెప్పుము అని...

ఋషులు అనిరి :

ఈ విధముగా అడుగబడిన సూతుడు ఋషి సత్తములతో ఇట్లు అనెను. కశ్యపుని వలన దితికి పుత్ర ద్వయము కలిగెనని మాచే చెప్పబడినది. కశ్యప పుత్రులైన వారు ఇరువురు కశ్యపుని ఆశ్వమేధిక యజ్ఞమునందు అతిరాత్రముయొక్క సూత్య దినమున అందరికన్న మొదటివారుగా పుట్టినవారని అనబడిరి. హిరణ్యకశిపుడు అనగా మొదటి ఋత్విజుని యాసనము, దితియొక్క గర్భము నుండి బయల్వెడలి ఉన్నతమైన ఆ వేదసభ అందు కూర్చుండెను. ఆ కారణమున ఆ పనిచేత ఆతడు హిరణ్యకశిపుడు అనబడెను.

ఋషులు ఇట్లు అనిరి :

మహాత్ముడైన హిరణ్యకశిపుడు అను రాక్షసునియొక్క పుట్టుకను ప్రభావమును ఓ ప్రభూ! మాకు విస్తరముగా చెప్పుము.

సూతుడు ఇట్లు అనెను :

పూర్వము పుష్కర ప్రదేశమున కశ్యపుని అశ్వమేధయాగము జరిగెను. అది ఋషులతోను, దేవతలతోను, గంధర్వులతోను ప్రకాశించినది. అచట ఉత్కృష్టమైన విధానముచేత శాస్త్రీయముగా ఆఖ్యాన ప్రారంభమున ఐదు బంగారు ఆసనములు చక్కగా కల్పించబడినవి. ఇచట కుశలచే పవిత్రములైన మూడు ఆసనములు, కూర్చము ఒక ఫలకమున్ను కల్పింపబడినవి. నలగురు ముఖ్యులైన ఋత్విక్కులు. ఆ ఋత్విక్కులకు ఆ ఆసనములను కల్పింవలెను. అచట శుభమైన ఆసనము హోత కొఱకు ప్రకల్పింప బడినది. అది బంగారుమయమైనది. అట్లే దివ్యమైనది. దివ్యమైన చిత్రాసనము పరచినది. గర్భవతియైన దితి భార్యగా ఉండెను. ఆమె గర్భము పదివేల సంవత్సరములు ఉండెను. ఆ హిరణ్యకశిపుడు తల్లియొక్క గర్భమునుండి బయలువెడలి హోతకొఱకై ప్రకల్పింపబడిన బంగారు ఆసనమున కూర్చొనెను. అచట అట్లు కూర్చున్న గర్భము (గర్భమున ఉన్న

హిరణ్యకశిపుడు). ఆఖ్యాన పంచమములైన వేదములను కాశ్యపుడు చెప్పిన విధముగనే చెప్పెను. అతనిని జూచిన మునులు అతనికి ఆపేరు (హిరణ్యకశిపుడు అని) పెట్టిరి. దానివలన హిరణ్యకశిపుడు పనిచేత ప్రసిద్ధుడు అయ్యెను. ఆతని తమ్ముడు (తరువాత పుట్టినవాడు) హిరణ్యాక్షుడు. ఆతని చెల్లెలు సింహిక విప్రచిత్తిని పెండ్లాడినందున రాహువునకు జన్మను ఇచ్చిన తల్లి అయ్యెను. హిరణ్యకశిపుడు అను రాక్షసుడు నూరువేలయేండ్లు నిరాహారుడై తలక్రిందులుగాఉండి గొప్ప తపముచేసెను. బ్రహ్మ అతనిని వరముతో అనుగ్రహించెను. బ్రాహ్మణుల నుండియు, సర్వభూతముల నుండియు చావులేక అమరత్వమును పొంది యోగమువలన దేవతలను అందరిని జయించి సర్వదేవుడై నిలిచెను. దానవులును, అసురులును, దేవతలును, హెచ్చుతగ్గులు లేక సమానులు అగుదురుగాక, మారుతియొక్క మహైశ్వర్యము నాకు వరముగా ఈయబడు గాక! (అని హిరణ్యకశిపుడు బ్రహ్మనుండి వరమును కోరెను). ఈ విధముగా అడుగబడిన బ్రహ్మ ఆతనికి కోరినది ఇచ్చి ఇంకను ఆతనికి దివ్యములైన వరములను కూడ ఇచ్చి అచటనే అంతర్ధానము పొందెను. రాక్షస హిరణ్యకశిపుని గురించి 'రాజైన హిరణ్య కశిపుడు ఏ దిక్కునకు పోవునో ఆయా దిక్కునకు ఎల్ల దేవతలు మహర్షులతో పాటు నమస్కరింతురు. ఓ బ్రాహ్మణులారా! రాక్షసరాజైన హిరణ్యకశిపుడు ఇటువంటి ప్రభావము గలవాడు. పూర్వము ఆతనికి నరసింహరూపుడైన విష్ణువు మృత్యువు అయ్యెనట. ఆ నరసింహ విష్ణువుచే గోళ్లతో ఆ హిరణ్యకశిపుడు చీల్చబడినాడు అని శ్లోకములతో ఇట్లు గానము చేయబడును. దానివలన నఖములు శుద్ధములు అనబడినవి. హిరణ్యాక్షుని పుత్రులు ఐదుగురు విక్రమము, బలమును కలవారు–ఉత్కరుడు, శకుని, కాలనాభుడు, విక్రమించిన మహానాభుడు, భూతసంతాపనుడును–హిరణ్యాక్షసుతులైన వీరు దేవతలకుకూడ జయింప అలవికాని వారు. వారియొక్క పుత్రులు పౌత్రులును సగణుడైన బాడేయుడు అనబడెను. నూరువేలున్నవారు తారకా మయమున నిహతులైరి. హిరణ్యకశిపుని పుత్రులు నలుగురు మహాబలులు. వారిలో మొదటివాడు ప్రహ్లాదుడు, తరువాతివారు అనుహ్లాదుడు, సంహ్రాదుడును, హ్రదుడును. హ్రదుని పుత్రులను వినుడు హ్రాదుడు నిసుందుడును – వీరు హ్రదపుత్రులైరి. విక్రమించిన సుందోపసుందులు ఇరువురు నిసుందుని తనయులు. బ్రహ్మఘ్నుడు, మహావీర్యుడు, మూకుడును–వీరు హ్రదుని కుమారులు. మారీచుడైన సుందపుత్రుడు తాడకను చేరెను. ఆ తాడక బలవంతుడైన రామునిచే చంపబడినది. మూకుడు కిరాతమున సవ్యసాచియైన అర్జుననిచే చంపబడెను. స్వయంభావితులై మహాతపముతో పుట్టినవారును మణివర్తమున నివసించువారును దేవతలచేత గూడ వధింప నలవిగాని వారును అయిన

మూడు కోట్ల రాక్షసులు సవ్యసాచిచే చంపబడిరి. అనుహ్లాదుని సుతుడు వాయువు శినీ లాలియును. వారియొక్క లక్ష హాలాహాలము అనుగణము. ప్రహ్లాద పుత్రుడు వైరోచనుడు. ఆతనికి ఐదుగురు పుత్రులు. వారు–గనేష్ఠీ, కాలనేమి, జంభుడు, భాష్కలుడు, శంభుడు. పై నలువురి తమ్ముడు–వీరందరు ప్రహ్లాదపుత్రులు. ప్రాధాన్యమును బట్టి శత్రువులకు జయింప అలవిగాని ఆ ప్రహ్లాదపుత్రులను తెల్పెదను. శంభుడు, నిశుంభుడు, విష్వక్సేనుడు–అనువారు మహోజస్వియైన గవేష్ఠి పుత్రులు. జంభునకు శతదుందుభి, దక్షుడు, ఖండుడు–అను ముప్వురు పుత్రుల విరోధుడు, మనువు, వృక్షాయువు, కుశలీ ముఖుడు–వీరు బాష్కలుని పుత్రులు. కాలనేమి సుతులను గురించి వినుడు. బ్రహ్మజిత్తు, క్షత్రజిత్తు, దేవాంతకుడు, నరాంతకుడు–వీరు కాలనేమి పుత్రులు. శంభుని పుత్రులను వినుడు. ధనుకుడు. అసిలోముడు, నాబలుడు, గోముఖుడు, గవాక్షుడు, గోమంతుడు–వీరు శంభుని పుత్రులు. విరోచనునకు బలి ఒక్కడే ప్రతాపవంతుడైన పుత్రుడు. బలికి నూరుగురు పుత్రులు పుట్టిరి. వారందఱును రాజులే. వారిలో ప్రధానులు నలుగురు విక్రమము బలమును కలవారు. వారిలో జ్యేష్ఠుడు వేయి బాహువులు కలిగి ద్రవిణ సమ్మతుడైన బాణుడు. కుంభనాభుడు, గర్దభాక్షుడు, కుశి –అను మొదలగువారు తక్కిన పుత్రులు. కుశినీ, పూతన–అను ఇరువురు బలికి పుత్రికలైన కన్యలు. బలియొక్క పుత్రులును, పౌత్రులును నూర్ల కొలదియు వేలకొలదియు ఉన్నారు. బలి అను పేర ప్రసిద్ధమైన గణము. విక్రమము పౌరుషమును కలది. చంద్రమనస్సుగల బాణునకు ఎఱుపుదనము తగియుండును.

ఎక్కువమంది పుత్రులు నశించిన దితి తన భర్తయైన కశ్యపుని తన సేవతో సంతోష పెట్టెను. ఆ కాశ్యపుడు ఆమెయెడ ప్రసన్నమైన మనసుగలవాడై, ఆమెచే చక్కగా సేవలను పొంది, వరముతో ఆమెను అనుగ్రహించెను. తరువాత ఆమె కూడ వరమును కోరుకొనెను. భగవత్స్వరూపుడై, ఆమెకు భర్తయైన కశ్యపుడు ఆమెకు కోరిన వరము ఇచ్చుటకు సంసిద్ధుడై ఓ మంగళకరురాలా! నా నుంచి నీవు ఏమి కోరుచున్నావు–అని అడిగెను. ఆమె తన చేతులు జోడించి సంతుష్టిచెందిన మారీచ వంశజుడైన కశ్యపమహా మునిని ఓ భగవత్స్వరూపుడా! అదితికి పుట్టిన నీ కుమారులచేతిలో నేను గర్భశోకమును పొందితిని. కావున దీర్ఘతపముతో గూడి ఇంద్రుని చంపగలిగిన వాడైన పుత్రుని పొందగోరుచున్నాను. నేను తపము ఆచరించెదను. నాకు గర్భమును కలుగ జేయుము అని అడిగెను. ఆమెయొక్క ఆమాటను విని కశ్యపుడు మహాతేజస్వియై మిక్కిలి దుఃఖితురాలైన, దితితో "అట్లే అగుగాక! నీకు క్షేమము అగుగాక! ఓ తపోధనురాలా! పవిత్రురాలవు కమ్ము. యుద్ధమున ఇంద్రుని చంపగలుగు సత్పుత్రుని కనగలవు అని చెప్పెను. నిండునూరేండ్లు పవిత్రురాలుగా ఉన్నచో

ముల్లోకములను అధిపతిగా చరించు పుత్రుని నీవు కనగలవు" అనిపలికి ప్రభువైన ఆ మహాతేజస్వి ఆమెతో సంగమించెను. ఆమెను ఆలింగనము చేసికొని భగవంతుడైన ఆ కశ్యపమహర్షి ముల్లోకములలో సంచారము చేయుటకు పోయెను. ఆ విధముగా భర్త వెడలిపోగా ఆ దేవియైన దితి మిక్కిలి సంతసించినదై కుశలమైన (దర్భలు నిండిన) వనమును చేరి మిక్కిలి దారుణమైన తపముచేసెను. సహస్రాక్షుడై దేవశ్రేష్ఠుడైన ఇంద్రుడు తపము జేయుచున్న ఆ దితికి ఉత్తమగుణ సంపదతో పరిచర్య చేసెను. అగ్నిని, సమిధలను, దర్భలను, కట్టెలను, ఫలములను, కందమూలములను, ఇంకను కావలసిన అన్నింటిని ఇంద్రుడు తెచ్చి ఇచ్చెను. శ్రమను పోగొట్టునట్టి ఒడలు పట్టుటవంటి చర్యలచేత ఇంద్రుడు సర్వ కాలములందు ఆ దితిని సేవించెను. ఇట్లు ఇంద్రునిచేత ఆరాధింపబడిన దితి సంతోషముతో ఇంద్రునితో ఇట్లనెను.

"ఓ సుర శ్రేష్ఠుడా! ఓ ప్రియ పుత్ర! నీవు చేసిన సేవలచేత సంతుష్టురాలనైతిని. ఇంకను పదియేండ్లు మిగిలియున్నవి. నీకు భద్రమగుగాక. ఆ తరువాత నీవు తమ్ముని చూడగలవు. నిన్ను జయించు పుత్రుడు కావలెనను వాంఛను మనమున ఉంచుకొన్నాను. ఆ జయమును ఇచ్చునట్టి పుత్రుని త్వరలో పొందనున్నాను. ఓ పుత్రుడా! ఆతనితో ముల్లోకముల విజయమును పొందగలను" అని ఈ విధముగా ఇంద్రునితో పలికి, సూర్యుడు మధ్యాహ్నమునకు రాగా, మోకాళ్లపై తల ఉంచి నిద్రావశురాలు అయ్యెను. పాదములపై బడిన తల వెంట్రుకలు కలది అగుటచే అశుచి అయిన ఆ దితిని చూచి, ఇంద్రుడు ఆమెను వంచించు ఒక అవకాశమును పొంది, మనసులో సంతోషపడెను. అపుడు ఇంద్రుడు తెరచుకొన్న ఆమె శరీరమున ప్రవేశించెను. ప్రవేశించి మహా తేజస్సులతో అమితమైన గర్భమును చూచెను. మహాయశస్వియైన ఇంద్రుడు ఆ ప్రధానమైన గర్భమును వజ్రముతో భిన్నముచేసెను. నూరు కణుపులుగల ఆవజ్రముతో భేదింపబడుచున్న ఆగర్భము కంపించుచు, సస్వరముగా, భయంకరముగా రోదనము చేసెను. అప్పుడు ఇంద్రుడు– 'ఏడవకుము' అని ఆ గర్భముతో పలికెను. ఏడు విధములుగా అయిన ఆ గర్భమును, మరల ఒక్కొక్కటి ఏడు విధములు అగునట్లు ఇంద్రుడు వజ్రముతో భిన్నము చేసెను. అంత దితి మేలుకొనెను. "చంపరాదు ! చంపరాదు! " అని దితి పలికెను. తల్లి మాటపై గౌరవము వలన వజ్రము ధరించిన ఇంద్రుడు దితి కడుపునుండి కింద పడెను. వజ్రముతోనే ఇంద్రుడు చేతులు జోడించి దితితో ఇట్లనెను. "ఓ యమ్మా! పాదములపై తలవెంట్రుకలు పడునట్లు అపవిత్రురాలవై నిద్రించితివి. ఆ అవకాశమును తీసికొని యుద్ధమున ఇంద్రుని జంపగల నీ ఈ గర్భమును భిన్నము జేసితిని. నన్ను క్షమింపుము అనెను" ఆ విధముగా

ఆ గర్భము విఫలము కాగా దితి మిక్కిలి దుఃఖితురాలై తన తల్లికి కంటివంటి వాడయిన ఇంద్రునితో ఇట్లు అనెను. "నా అపరాధముననే ఈ గర్భము విఫలముచేయ బడినది. ఓ దేవరాజా! ఋషిపుత్ర! మహాబల! నీ అపరాధము ఏమియులేదు. నీ శత్రువును చంపుటలో నీకు దోషము లేదు. అందువలన నిన్ను నేను శపింపను. నీకు ప్రియమునే చేయకోరుదును. నా గర్భమునకు శ్రేయమును గూర్చుము. నా పుత్రులకు ఆకాశమున ఏడు స్థానములు ఏర్పడుగాక !" నా పుత్రులు ఈ యేడు వాత స్కంధములను చరింతురు గాక. సప్తసప్తకులైన నలుబది తొమ్మిదిమంది నా పుత్రులు మరుద్గణములని ప్రసిద్ధి చెందుదురుగాక ! పృథివి యందు మొదటి స్కంధము, భాస్కరునియందు రెండవ స్కంధము, సోమునియందు మూడవస్కంధము, జ్యోతిర్గణము నందు నాలుగవ స్కంధము, గ్రహములందు ఐదవ స్కంధము, సప్తర్షి మండలమున ఆరవ స్కంధము ఏర్పడునుగాక ! ధ్రువునియందు ఏడవ స్కంధము. నా ఈ పుత్రులు పై స్కంధముల చుట్టు ఇపుడు ప్రతికాలమున ఈ వాత స్కంధములయందు తిరుగుదురు గాక! అందలి మొదటి స్కంధము భూమి-అపవిత్రముల నుండి ప్రవహించు ఆవహము (ఆవహవాయు స్థానము) మొదటిదైన చరించు గణముగా నా పుత్రకులు ఇందు చరింతురు గాక! రెండవది కూడ పవిత్ర ప్రదేశముల నుండి సూర్యుని వరకు ప్రవహించునది. ప్రవాహవాయుస్థానము. ఈ వాత స్కంధమున రెండవ 'చరించుగణము చరించుగాక. సూర్యునకు పైన చంద్రుని నుండి ప్రవహించు వాయు ఉద్వహమే అనబడును. దానిని మూడవ వాత స్కంధము అందురు. దీని యందు మూడవ చరించు గుణము చరించుగాక. సోమునకు పైన నక్షత్రముల నుండి ప్రవహించు వాయువు నాలుగవది అయిన సువహ అనునది. నా పుత్రులగు నాలుగవ చరించుగణము అచట చరించుగాక. యక్షులకు (నక్షత్రములకు)పైన గ్రహములవరకు ప్రవహించు వాయువు నివహము ఐదవది. ఈ అయిదవ దానియందు యైదవ స్కంధమున చరించు గణము చరించుగాక. గ్రహములకంటె పైన ఋషుల వరకు చరించు వాయువు ఆరవది 'పరాహతము' (పరావహము). అచట ఆరవగణపు నా పుత్రులు చరింతురు గాక. సప్తర్షులకునుపైన ధ్రువ నక్షత్రమువరకు చరించు ఏడవ వాయుస్కంధము పరివహము అచట నాపుత్రులు ఉందురుగాక. ఈ నా పుత్రులు దీనిని అంతయు ప్రతికాలమున చరింతురుగాక! అచట ఆపేరుతో మరుత్తులగుదురు గాక.

తరువాత ఆ తల్లికొడుకులు (దితి-ఇంద్రులు) వారికి పేరులను పెట్టిరి. దానికై మరుత్తులు తమ కర్మలతో వేరువేరుగా అయిరి. సత్త్వజ్యోతి, దిత్యుడు, సత్యజ్యోతి, తిర్యగ్జ్యోతి, సజ్యోతి, జ్యోతిష్మంతుడు, ఇది ప్రథమ గణము. రెండవ గణమును వినుడు.

ఋతజిత్తు, సత్యజిత్తు, సుషేణుడు, సేనజిత్తు, సత్యమిత్రుడు, అభి మిత్రుడు, హరిమిత్రుడు– ఇది రెండవ గణము. మూడవ గణమును వినుడు. కృతుడు, సత్యుడు, ధ్రువుడు, ధర్త, విధారయుడు, ధ్వాంతుడు, ధుని, ఉగ్రుడు, భీముడు, అభియువు, సాక్షిపుడు, ఆహ్వాయుడు– ఇది మూడవ గణము. ఈదృక్కు, అన్యాదృక్కు, యాదృక్కు, ప్రతికృత్తు, సమితి, సంరంభుడు– ఇది నాల్గవ గణము. ఈదృక్కును, పురుషుడును, అన్యాదృక్షమైన (ఇతరులతో సమానమైన) చిత్తము నుండి వెలసిన వారును, సమితా సమితులతో సమానమైన చిత్తమునుండి వెలసిన వారును, విరోధితో సమానమైన చిత్తమునుండి వెలసినవారును–గణములవారు. వీరు నలుబది తొమ్మండుగురు వీరు మరుత్తులు అను పేరులతో పిలువబడిరి. దితి–ఇంద్రులు ఇద్దరిచేత అట్లు చక్కగా లెక్కింపబడిరి గదా! ఆ మరుత్తుల పేర్లను విని దితి ఇంద్రునితో ఇట్లనెను. "ఓ పుత్రక ! ఇంద్రా ! ఈ నా పుత్రులు వాత స్కంధమును చరింతురుగాక. నా పుత్రులు దేవతలతో కలిసి చరింతురు గాక! నీకు భద్రమగుగాక! ఆమెయొక్క ఆ మాటలనువిని సహస్రాక్షుడైన ఇంద్రుడు చేతులు జోడించినవాడై" తల్లీ! అట్లే అగుగాక" – అనెను. నీకు నేను చెప్పినట్లు అంతయు జరుగగలదు. సంశయము లేదు. మహాత్ములైన నీ కుమారులు దేవసమ్మతులైన దేవతలు అగుదురు. అట్లే పుత్రులు దేవతలతోపాటు యజ్ఞభాగమును అందుకొనువారును కాగలరు. కావున ఈ మరుత్తులైన దేవతలు అందరును ఇంద్రుని తమ్ములైన అమరులు. కశ్యపముని వల్ల దితికి పుత్రులైన వారందరు అమరులుగా తెలియవలెను. ఈ విధముగ తపోధనులైన తల్లి–కొడుకులు (దితి–ఇంద్రులు) ఇరువురు నిర్ణయమును తెలిసికొనినవారై స్వర్గమునకు వెళ్లిరి. ఈ మరుత్తులయొక్క మంగళకరమైన జన్మను విన్నవాడును, చదివిన వాడును అనావృష్టి వల్ల కలుగు భయమును పొందడు. తరువాత దీర్ఘమైన ఆయువు కలవాడును అగును. (6)

కశ్యపుని యొక్క ప్రజా సర్గము

అనిచెప్పి సూతుడు ఇట్లు అనెను : ఆ తరువాత దనువు యొక్క పుత్రులను గురించి చెప్పెదను వినుడు. దనువు పుత్రులు తమ వంశమున పేరుగాంచిన మహాసురులుగా ఉండిరి. వారు విప్రచిత్తి ప్రధానులైన నూరుగురు. తీవ్రమైన పరాక్రమము కలవారు. వారందరును చక్కగా తపము చేసినవారును వరములు పొందినవారును, సత్యసంధులు, పరాక్రమించిన వారు, క్రూరులు, మాయావులును, మహాబలులు, యాగము చేయనివారు, అబ్రహ్మణ్యులును బ్రాహ్మణ హితము కోరనివారు, చంపదగనివారును–అయిన వారు దను పుత్రులైన దానవులు. ప్రాధాన్యమును అనుసరించి వీరిని చెప్పెద వినుడు. ద్వి మూర్ధుడు,

శంకువర్ణుడు, శంకు నిరామయుడు, శంకుకర్ణుడు, మహావిశ్వుడు, గవేష్ఠి, దుంధుభి, అజాముఖుడు, భగవంతుడు, శిలుడు, వామనుడు, మరీచి, అక్షకుడు, మహా గార్గ్యుడు, అంగిరావృతుడు, విక్షోభ్యుడు, సుకేతువు, సువీర్యుడు, సుహృదుడు, ఇంద్రజిత్తు, విశ్వజిత్తు, సురవిమర్దనుడు, ఏకచక్రుడు, సుబాహువు, తారకుడు, మహాబలుడు, వైశ్వానరుడు, పులోముడు, ప్రవీణుడు, మహాశిరుడు, స్వర్భానువు, వృషపర్వుడు, ముండకుడు, మహాసురుడు, ధృతరాష్ట్రుడు, సూర్యుడు, చంద్రుడు, ఇంద్రుడు, తాపిసుడు, సూక్ష్ముడు, నిచంద్రుడు, ఊర్ణనాభుడు, మహాగిరి, అసిలోముడు, సుకేశుడు, బలకుడు, దశుడు, గగనమూర్ధుడు, కుంభనాభుడు, మహోదరుడు, ప్రమోదాహుడు, కుపథుడు, హయగ్రీవుడు, వీర్యవంతుడు, అసురుడైన విరూపాక్షుడు, మహాసురుడైన సుపథుడు, అజుడు, హిరణ్మ యుడు, శతమాయుడు, శంబరుడు, శరభుడు, శలభుడు, సూర్యచంద్రులు ఇద్దరును. ఈ ఇద్దరు అసురులలో సురులు. సురలలో సాంప్రతులు (ఇప్పటికి ఉన్నవారు) అని దనువు యొక్క వంశమువారైన పుత్రులు ప్రధానులు. వారికి గూడ పుత్రపౌత్రాదులు లెక్కకు మిక్కుటము అనంతము అని దితిపుత్రులై దనుపుత్రులైన రాక్షసులు. స్వర్భానువు దితిసుతుడుగ చెప్పబడినాడు. అనుభానువు దనుపుత్రుడు. వీరు దనువు యొక్క వంశాను గతులైన పుత్రులు. ఏకాక్షుడు, ఋషభుడు, అరిష్టుడు, ప్రబంధనకరులు ఇద్దరును, ఇంద్రబాధన కేశియు, మేరువు, శంబుడు, ధేనుకుడును, గవేష్టి, గవాక్షుడు, వీర్యవంతుడైన తాలకేతువును, వీరు మనుష్యధర్ములైన దనుపుత్రులు. దైత్యదానవులు కలిసిన సంతోషమున పుట్టినవారును, భయంకర పరాక్రమముకలవారును, సింహికయందు విప్రచిత్తికి జనించిన పుత్రులు వీరు. వీరు సైంహికేయులని ప్రసిద్ధి చెందిన పదునలుగురు మహాసురులు. శతగాలుడు, బలవంతుడు, న్యాసుడు, శాంబుడు, అసులోముడు, శుచి, వాతాపి, సితాంశుకుడు, హరుడు, కల్పుడు, కాలనాభుడు, భౌముడు, నరకుడు–వీరందరికి జ్యేష్టుడు రాహువు. ఈతడు చంద్రసూర్యులను విమర్శించు (మ్రింగు) వాడు. –అను వీరు సింహికా పుత్రులు. దేవ తలకు గూడ జయింప అలవికానివారు. భయంకరులైన బంధువులు కలవారు, క్రూరులు. వారందరును బ్రహ్మను ద్వేషించువారు మరి పదివేలు సైంహికేయ గణమును కలరు.

ఈ గణము జమదగ్నిపుత్రుడై, మహాబలశాలియైన భార్గవునిచేతిలో (పరశు రామునిచే) చచ్చిరి. స్వర్భానువునకు ప్రభఅను కన్య కలదు. అట్లే పులోమునకు శచిఅను కన్యయు గలదు. ఈమె ఉపదానవి, ఈమెకు వృషపర్వుని కూతురుగా శర్మిష్ఠ జన్మించినది. పులోమయు, కాలికయు ఇద్దరు, వైశ్వానరుని పుత్రికలు. ప్రభయొక్క పుత్రుడు నహుషుడు. శచియొక్క పుత్రుడు జయంతుడు. తరువాత, శర్మిష్ట పురువును కనెను. ఉపదానవి

దుష్యంతుని కనెను. ఈ పులోమ, కాలికలు ఇరువురును వైశ్వానర పుత్రికలు. ఆ ఇద్దరు కన్యలును మారీచుని వివాహము ఆడిరి. వారిరువురివలన హిరణ్యపురవాసులకు వేల పుత్రులును, అఱువది దానవశ్రేష్ఠులును ఇతరులు పదునలుగురును కలిగిరి. పౌలోములు అను కాలకేయులు అయిన దానవులు గొప్ప బలము గలవారు. వారు దానవులకు వధింప అలవిగాని వారు. సవ్యసాచియైన అర్జునునిచే చంపబడిరి. మయునకు పుట్టిన పుత్రులు అందరును వీరులు, పరాక్రమవంతులును. వారు మాయావి, దుందుభి, వృషుడు, మహిషుడు, బాలికుడు, వజ్రకర్ణుడు, మందోదరిఅను కన్యయును (మయ సంతానము). ఇది దైత్యులయొక్కయు దానవుల యొక్క సృష్టి అని చెప్పబడినది. దనాయుష యొక్క పుత్రులు అయిదుగురు. వారు మహాబలులు. వారు అరూరువు, బలి, జంభుడు, విరక్షుడు, విసుడు–అనువారు. అరూరువుయొక్క పుత్రుడు క్రూరుడైన ధుంధువు అను మహాసురుడు. ఆతడు ఉత్తంకుని మాటచే కువయాశ్వునిచే చంపబడెనట. బలియొక్క పుత్రులు ఇరువురు మహా వీర్యవంతులు. ఆ ఇరువురును పరాక్రమములో సాటిలేనివారు. వారు కుభిలుడు, వర్మ్మడు అనువారు. ఈ వర్మ్మడు పూర్వజన్మలో కర్ణుడు విరక్షునకు గూడ కాలకుడు వరుడు –అను ఇరువురు పుత్రులు. విషునకు నలుగురు పుత్రులు కలిగిరి. వారు క్రూర కర్మ్మలు. వారు శ్రాద్ధహంత, యజ్ఞహంత, బ్రహ్మహంత, పశుహంత అనువారు. వృత్రునకు కలిగిన దనాయుషా పుత్రులు పరాక్రమవంతులు. వారిని గురించి తెల్పుచున్నాను, వినుడు. వారు ఇంద్రునితో యుద్ధము చేయుచున్న వృత్రునియొక్క భయంకరమైన ఊపిరి నుండి పుట్టిరి. మహా బలవంతులైన రాక్షసులు (తమ మనస్సుతో) తాము భర్తలుగా చెప్పబడిరి. లక్షల కొలదిగా ఆ రాక్షసులు మహేంద్రుని అనుచరులు కలరు. వారందరు బ్రహ్మవేత్తలు, సౌమ్యులు, ధార్మికులు, సూక్ష్మ మూర్తులును. ప్రజలలో అంతర్గతులై ధార్మికులై వారందరు నివసింతురు. ఇది దైత్యుల యొక్కయు దానవుల యొక్కయు సృష్టిఅని చెప్ప బడినది. యజ్ఞమున ప్రవాహిఅను ఆమె ఉత్తమ గాయకులైన పుత్రులనుకనెను. వారు సత్త్వనుడు, సత్త్వాత్మకుడు, కలాపుడు, వీర్యవంతుడు, కృతవీర్యుడు, బ్రహ్మచారి, ఏడవవాడు సుపాండువు. పనుడు, తరణ్యుడు పదవవాడు సుచంద్రుడు. ఈ చెప్పబడిన వీరు గంధర్వులుగా తెలుసుకొనవలెను. (7)

కశ్యపీయ ప్రజాసర్గము

సూతుడు ఇట్లు అనెను :

మునిపుత్రులైన గంధర్వులు, అప్సరసులును పుణ్యులు. చిత్రసేనుడు, ఉగ్రసేనుడు, ఊర్ణాయువు, అనఘుడు, ధృతరాష్ట్రుడు, పులోముడు, సూర్యవర్చుడు, యుగపత్తు, తృణపత్తు,

కాలి, దితి, చిత్రరథుడు, పదమూడవ వాడు భ్రమశిరుడు, పదునాల్గవవాడు పర్జన్యుడు, పదియైదవవాడు కలి, పదునారవవాడు నారదుడును-అను వీరు ముని పుత్రులైన దేవ గంధర్వులు. వారికి చెల్లెండ్రైన మంగళకరలైన ముప్పది నలుగురు అప్సరసలు కూడ కలరు. వారు అంతర, ద్వారవత్య, ప్రియముఖ్య, సురోత్తమ, మిశ్రకేశి, శాచి, పర్ణిని, అలంబుష, మారీచి, పుత్రిక, విద్యుద్వర్ణ, తిలోత్తమ, అద్రిక, లక్షణ, దేవి, రంభ, మనోరమ, సువర, సుబాహువు, పూర్ణిత, సుప్రతిష్ఠిత, పుండరీక, సుగంధ, సుదంత, సురస, హేమసార, సుతి, సువృత్త, కమల, సుభుజ, హంసపాద అనువారు. అట్లే లౌకికలైన అప్సరసలును- వీరు మునికి పుత్రులును, పుత్రికలు అయిన గంధర్వాప్సరసలు. గంధర్వుల యొక్క కూతుళ్లు మయనుండి పుట్టినవారు. వారందరి గురించి నేనుచెప్పెద వినుడు. వారిలో మొదటిది సుయశ, తరువాతది గాంధశ్వి, విద్యావతి, చారుముఖి, సుముఖి, వరానన, అనునవి ఆతరువాతి వారి పేరులు. అట్టి వీరు సుయశ యొక్క పుత్రులు మహాబలపరాక్రములు. ప్రచేతసునికి పుట్టినవారు. వారు యక్షులు, వారి పేరులను వినుడు. కంబలుడు, హరి కేశుడు, కపిలుడు, కాంచనుడు, మేఘమాలి ఇది యక్షులగణము. సుయశ యొక్క కూతుళ్లు నలుగురు అప్సరసలు. వారి పేరులను చెప్పెద వినుడు. వారిలో లౌహేయి జ్యేష్ఠరాలు. ఆమె తరువాతిది భరత, తరువాత వారు కృశాంగి, విశాల. ఈమె రూపమున సాటిలేనిది. వారి కంటె వేరైనవారు నలుగురు యక్షగణములు కలరు. వీరు విక్రాంతునికి విశాలునికి జన్మించినవారు. అవి లౌహేయ గణము, భరతేయ గణము, కృశాంగేయగణము, విశాలేయ గణము-అని పురాణమున యక్షుల యొక్క గణములు ప్రసిద్ధములు. ఇట్టి భయంకరులై, మహా బలపరాక్రమవంతులైన, అసురులచేతను, యక్షగణలోకములచేతను, లోకాలోక వేత్తలలో శ్రేష్ఠులైనవారు కలిసిరి. గంధర్వులును, తరువాత వాలేయులును మహాత్ముడైన విక్రాంతునికి జన్మించినవారు. మహావీర్యవంతులు, మహాగంధర్వ నాయకు లును, విక్రమ- ఔదార్య దానశీల గుణములతో సంపన్నులు, మహాబలపరాక్రమ వంతులును, వారి పేరులను మొదటి నుండి యథాతథముగా చెప్పెదను. మహావీర్యుడైన చిత్రాంగదుడు, చిత్రవర్మ, మహాభాగుడైన చిత్రకేతువు, వీర్యవంతుడైన సోమదత్తుడు-అనువారు, ఆతనికి ముప్పురు పుత్రికలును. మొదటిది అగ్నిక, తరువాతిది కంబల, చివరిది వసుమతి. వీరు రూపమున సాటిలేని ఓజస్సుగలవారు. వారికంటె వేరుగాగల కుమారునిచేత ఈ గణములు పుట్టింపబడినవి. అవి గంధర్వముఖ్యుల యొక్క విక్రాంతములై, యుద్ధదుర్మదములైన మూడు గణములు. ఆగ్నేయగణము, కాలేయగణము, వసుమతీసుత గణము అనునవి. తరువాత వివిధములైన గణములచేత ఈ చరాచరమైన లోకము వ్యాపించినది. ఆ మహా

త్ముడైన విక్రాంతునివలన విద్యావంతులును, మహాభాగ్యులైన విద్యాధనేశ్వరు లును పుట్టిరి. పైకి విజృంభించిన తేజము గలిగి, మహాత్ములైన ఆ గంధర్వుల యొక్క నామములను నేను చెప్పదలచితిని. చెప్పెదనువినుడు. హిరణ్యరోముడు, కపిలుడు, సులోముడు, మాగ ధుడు, చంద్రకేతువు, గాంగుడు, గోదుడు, మహాబలుడు అను వారు మొదలుగా గల మహావిద్యా వంతులును విక్రాంతులు అయిన తపస్వులయొక్క గణము. చక్కని కన్నులుగల మరి ఇద్దరు (స్త్రీలు) గలరు. వారి పేర్లు శివ, సుమన. వారియందు మహాత్ముడైన విశ్రవ సునిచే పుట్టినవారు విద్యాచరణ గోచరులు. విక్రాంతులైన శైవేయులు, అట్లే సౌమనసులు అను గణములు. ఈ మూడు విద్యాధర గణములతో ఈ లోకము వ్యాపించినది. విద్యా ధరుల యొక్క విచేష్టితము వలన ఈ పై గణముల నుండి లోకమున ఆకాశాంతరమున చరించు వందలకొలది గణములు పుట్టింపబడినవి. విక్రాంతుడును, ఆ మహాత్ముని చేతనే అశ్వముఖులు పుట్టింపబడిరి. ఆ గుఱ్ఱపు ముఖముగలవారు కిన్నరులు. వారిని గురించి వినుడు. సముద్రుడు, సేనుడు, కాలిందుడు, మహానేత్రుడు, మహాబలుడు. సువర్ణఘోషుడు, సుగ్రీవుడు, వీర్య వంతుడైన మహాఘోషుడు అనునది మహాత్ములైన కిన్నరుల గణము. విద్వాంసులైన గుఱ్ఱపు ముఖములు గల కిన్నరులచే (లోకము) వ్యాపించినది. ఆ విధముగా చక్కగా పైకిఎదిగిన ఆ మహాత్ముడైన విక్రాంతుని చేతనే పుట్టింపబడినవారు నరముఖులైన కిన్నరులు. వారు శాంశపాయనులు. హరిషేణుడు, సుషేణుడు, వీర్యవంతుడైన వారి షేణుడు, రుద్రదత్తుడు, ఇంద్రదత్తుడు, చంద్ర ద్రుముడు, మహాద్రుముడు, బిందువు, బిందుసారుడును, చంద్రవంశులును, కిన్నరులు-సుశోభనులు అనువీరు శ్రేష్టులైన కిన్నరులుగా ప్రసిద్ధులు. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! నృత్య గీతములలో ప్రతిభగల మహాత్ములైన ఈ కిన్నరులయొక్క నూర్లకొలది గణములు లోకమున ఉన్నవి.

యక్షోపశాంతునకు యక్ష, లౌహేయ, రూపశాలిని, సురవింద, ప్రకాశ, సిద్ధ సమ్మాత- అను వారు పుత్రికలు. ఉపాయాకేతన అనువారు కరాలునికి స్వయముగా పుట్టిన గణము. ఆ భూతముల యొక్క నామములను వినుడు. భూతములు భేతగణములు. అవి ఆవేశక నివేశకములు అను భూమియందు కనబడు గణము. ఆ గణమే ఈ లోకమున భూతము లకు భూతనాయకమైన గణము. వీరు ఆకాశాంతరమున చరించు వారికి ఉత్కృష్టులు అగుదురు. వారు వృక్షముల చివరగల ఆకాశమునందు మాత్రము చరింతురు. సంశయము లేదు. అట ఈ దేవ గంధర్వులు బాహుళ్యముగా నాచే చెప్పబడినారు. వారు దేవోప స్థానములందు ఆసక్తులు. కీర్తిమంతులును-అని తెలుసుకొనవలెను. గంధర్వులతో కూడిన నృత్యగీతముల పండితులును నిపుణులై గానము చేయువారును వాద్యములు వాయించు

వారును, సర్వలోకములలో ఉండువారును అయిన దేవతలు; వీరు మహాదేవుడును, ఈశానుడు, జగత్ప్రభువును అయిన శంకరుని; ఇంద్రుడు మొదలుగా గల ఆదిత్యులను (అదితి పుత్రులను), వసువులతోబాటు రుద్రులను; దేవతల గురువు, రజోగుణము లేనివాడు, కమలనేత్రుడు అయిన నారాయణుని (విష్ణువును) అట్లే నాలుగు ముఖములు కలవాడు, స్వయముగా ఉద్భవించినవాడు అయిన హిరణ్యగర్భుని (బ్రహ్మను) సమీపించి ఉపాసించిరి. వారు జ్యేష్ఠుడైన హంసుడు, కనిష్టుడైన మరొకడు, మధ్యములైన హాహా హుహూ అనువారును, నాల్గవవాడు ధిషణుడు, తరువాత వాసిరుచియును, వారిలో ఆఱవవాడు తుంబురుడును తరువాత విశ్వావసుడు– అని పిలువబడుదురు. వీరు పుణ్య లక్షణులైన దివ్య అప్సరసులుగా చెప్పబడిరి. మహాభాగ్యవంతురాలగు వరిష్ఠ దేవ పూజితు లైన ఎనమండుగురిని కనెను. అనవద, అనవశ, అస్వత, మదనప్రియ, అరూప, సుభగ, బాసి అరిష్టఅను ఆమె ఎనమండుగురిని కనెను. మనోవతి, సుకేశ అను ఇద్దరు తుంబురుని యొక్క పుత్రికలు. ఐదుజుట్లుగల ఈ దైవికలైన అప్సరసలు పదుగురు. వారు మేనక, సహజన్య, పర్ణిని, పుంజికస్థల, ఘృతస్థల, ఘృతాచి, విశ్వాచి, పూర్వచి, ప్రమ్లోచ, అనుమోచంతి – అనువారు. తరువాత ఆద్యంతములులేని నారాయణునకు తన తొడ నుండి పుట్టిన సర్వ సుందరాంగి ఊర్వశి పదునొకండవది. మేనుని యొక్క కన్య మేనక. సంతుష్టచేతస్కుడైన బ్రహ్మయొక్క కన్యలు తక్కిన అందరు వారు బ్రహ్మవాదినులు, మహాయోగ్య వతులునుగా ఉండిరి. ఈ అప్సర గణములు పుణ్యులుగను పదునలుగురుగను చెప్పబడిరి. పిలువబడి శోభింపజేయు వీరు పదునాలుగు గణములు. వీరు బ్రహ్మయొక్క మానస కన్యలు. సమస్తమును శోభింపజేయువారైన మనుపుత్రికలు. వేగవతులై అరిష్టకును ఊర్జకును అగ్ని సంభవులైనవారు, ఆయుష్మంతులై సూర్యుని కిరణములందు పుట్టి ప్రకాశించువారు. జలమున పుట్టినవారై అమృతము నుండి పుట్టినవారు. పేరున అమృ తులనబడినవారు. వాయువునకు పుట్టి 'ముద'లనబడు వారు. భూమి యందు పుట్టినవారై 'భవ'లనబడువారు. విద్యుత్తునకు పుట్టిన రుచులు (కాంతులు). మృత్యుకన్యలై భైరవులు అనబడువారు. కామగుణులై శోభింపజేయు పదునాలుగు గణములుగా చెప్పబడి, ఇంద్రునితో ఉపేంద్రుడైన విష్ణువుతోను కూడి దేవగణములచే గొప్పరూపముతో నిర్మింపబడినవారు. శుభమైన రూపము కలది, మహాభాగ్యవంతురాలు, దేవలోకమునకు సంబంధించిన స్త్రీ, దేవతాస్త్రీ, ప్రభావతి, రూప యౌవన సంపన్నురాలును తిలోత్తమఅని లోకప్రసిద్ధి చెందిన అప్సరస బ్రహ్మ వలన అగ్నికుండమునుండి పుట్టినది. అట్లే బుద్ధి మంతుడైన బ్రహ్మకు యజ్ఞవేదీతలము నుండి మహాప్రభావవంతురాలైన దేవతాస్త్రీ వేదవతి

అనునామె, అట్లే యమునియొక్క పుత్రిక రూపయౌవనములతో ఒప్పినది, శ్రేష్ఠమైన బంగారు వన్నె గలది, దేవనారియైన సులోచనఅను ఆమెలు జన్మించిరి. ఈ విధముగ ప్రకాశములైన అప్సరోగణములు పెక్కువేలు కలవు. వారు దేవతలకును, ఋషులకును భార్యలును తల్లులును అయిరి. సుగంధము గలవారును, చంప పుష్పపు వన్నె కలవారును అయిన అప్సరసలు అందరు అన్ని విధముల సమానులు. కాంతునితో సమాగమమున, మదిర లేకుండగనే మత్తిల్లి మత్తెక్కింతురు. వారియొక్క స్పర్శవలన తనవితీరును, ఆనందము వృద్ధిజెందును.

వినత యొక్క పుత్రులు ఇద్దరు, అరుణుడును, గరుడుడు అనువారు. చెల్లెంద్రు ముప్పది ఆరుగురు. గాయత్రి మొదలగు ఛందస్సులు గరుడునికి సంబంధించిన పక్షులు. ఇవియే అన్ని పగళ్లలో దిక్కులలో సన్నిహితమై ఉండును. కద్రువ చరాచరములైన వేయి నాగులను కనెను. అనేక శిరస్సులు కలిగి ఆకాశమున చరించు ఆ మహాత్ముల యొక్క తరచుగా ఉండు నామధేయములను వినుడు. వారిలో ప్రధానులైన నాగులు శేషుడు, వాసుకి, తక్షకుడు, సకణీరుడు, జంభుడు, అంజనుడు, వామనుడు, ఐరావతుడు, మహా పద్మడు, కంబలుడు, అశ్వతరుడు, ఐలపత్రుడు, శంఖుడు, కర్కోటకుడు, ధనంజయుడు, మహా కర్ణుడు, మహానీలుడు, ధృతరాష్ట్రుడు, బలాహకుడు, కుమారుడు, పుష్పదంతుడు, సుము ఖుడు, దుర్ముఖుడు, శిలీముఖుడు, దధిముఖుడు, కాలీయుడు, శాలిపిండకుడు, బిందు పాదుడు, పుండరీకుడు, నాగుడు, ఆపూరణుడు, కపిలుడు, అంబరీషుడు, ధృతపాదుడు, కచ్ఛపుడు, ప్రహ్లాదుడు, పద్మచిత్రుడు, గంధర్వుడు, నమస్వికుడు, నహుషుడు, ఖరరోముడు, మణి–అను మొదలైన వారు కాద్రవేయులు. ఖశయులను గూర్చి వినుడు. ఖశ ప్రసిద్ధులైన పురుషులను తినునట్టి ఇరువురను కనెను. పశ్చిమ సంధ్యయందు జ్యేష్టుని, పూర్వసంధ్య యందు మనుజులను కనెను. ఆమె విలోహితుడైన వికర్ణుని పుత్రునిగా మొదట కనెను. నాలుగు భుజములు కలవాడు, నాలుగు పాదములు కలవాడు, రెండు తలలు కలవాడు, వెనుక ముందులైన రెండు విధముల గమనము కలవాడు, సర్వాంగములందు వెంట్రుకలు కలవాడు, స్థూలశరీరుడు, ఎత్తైన ముక్కు గలవాడు, పెద్ద పొట్ట కలవాడు, లావైన తలకల వాడు, గొప్ప చెవులు కలవాడు, దర్భలవంటి వెంట్రుకలు కలవాడు, మనస్సే రథముగా (మనోవేగము)గలవాడు, ఏనుగు పెదవులు కలవాడు, పొడవైన పిక్కలు గలవాడు, గుబ్బము వంటి కోరలు కలవాడు, గొప్పదవడలు కలవాడు, ఎఱ్ఱని నాలుక కలవాడు, కనురెప్పల వెంట్రుకలు జడలు కట్టినవాడు, లావైన ముఖము కలవాడు, పొడవైన ముక్కు కలవాడు, గుహ్యకుడు (తన్ను తాను రక్షించుకొనువాడు), వాడియైన చెవులు కలవాడు, గొప్ప

ఆనందము గలవాడు, గొప్ప ముఖము కలవాడును–ఈ విధముగా అతిభయంకరముగ ఉన్న పుత్రుని 'ఖశ' అను ఆమె కనెను. ఆతని తమ్ముడైన రెండవ వానిని గూడ 'ఖశ'యే కనెను. ఆతడు మూడు తలలు కలవాడు, మూడు పాదములు కలవాడు, మూడు చేతులు కలవాడు, నల్లని కండ్లు కలవాడు, పైకి నిక్కబొడిచిన వెంట్రుకలు కలవాడు, పచ్చని మీసములుకలవాడు, శిలవంటి శరీరము కలవాడు, దృఢమైనవాడు, పొట్టి శరీరము కలవాడు, మంచిచేతులు కలవాడు, మహాబలుడు, చెవులవఱకు చీల్చిన నోరు కలవాడు, పొడవైన కనుబొమలు కలవాడు, రెండు నాలుకలు, శంఖువు వంటి చెవులు కలవాడు, గోరోజనము వంటి వర్ణముతో పైకి తిరిగియున్న కన్నులు కలవాడు, జడలు కలవాడు, గోరోజనము వంటి రంగు కలవాడు, గొప్ప చెవులు కలవాడు, గొప్ప యెద కలవాడు, నడుములేనివాడు, కృశించిన పొట్ట కలవాడు, గోళ్లుకలవాడు, ఎఱ్ఱని శిరము కలవాడు– ఇట్టి వానిని ఆ 'ఖశ' చివరి వానినిగా కనెను. వారు జన్మించిన వెంటనే అంతగా పెరిగి, అన్నింటిని అనుభవించుటకు తగిన శరీరములతో తల్లిని అలంకరించిరి. క్రూరుడైన పెద్దవాడు తల్లిని ఆకర్షించెను (లాగెను) ఓ అమ్మా! ఆకలిచే పీడింపబడితిని. తినుటకు రమ్ము అని అనెను. అట్టి ఈ పెద్దవానిని చిన్నవాడు నిషేధించెను. తల్లియైన ఈ ఖశను ఎల్లప్పుడు రక్షింపుము–అని ఆ చిన్నవాడు అనెను. అని పెద్దవానిచేతుల నుండి తల్లిని విడిపించెను. ఇంతలో వారి తండ్రి అచట ఆవిర్భవించెను. వివిధాకారములు గలవారిని చూచి కూర్చొనుడు–అని అనెను. ఆ బలవంతులైన ఇరువురు తండ్రిని చూచి వేగముగా తమ మాయచే తల్లి ఒడిలో ఏడ్చిరి. ఆ తరువాత ఋషి (కశ్యపుడు) భార్యతో–"మేము పూర్వము చెప్పితిమి. చెప్పినదానికి విరుద్ధముగా జరిగినదా? నిజము చెప్పుము. పుత్రుడు మేనమామను (పోలికలలో) పొందును. కన్యక తల్లిదండ్రులను (పోలికలను) పొందును. తల్లి ఎట్టి శీలముగలదో పుత్రుడు కూడ అట్టిశీలముగలవాడు అగును. భూమి ఏ వర్ణముకలదో నిజముగా నీరు ఆ వర్ణము కలదియే అగును. తల్లి శీలదోషముచేతను, అట్లే శీలగుణములచేతను సంతానము అంతయు వేరువేరుగా ఉండును. ఖ్యాతివశమున కూడ అట్లే అగును అని చెప్పెను. కశ్యపుని భార్యలలో బల–శీలాదులలో అదితి ధర్మతత్ప రురాలు. ధర్మశీలాదులలోను ఉత్తమ జ్ఞాన బలముతో ఒప్పినది. అట్లే గానశీలము గలది 'అరిష్ట'. ఇక 'దనువు' మాయాశీల అనబడినది. దేవియైన 'వినత'! ఆకాశ యానమున ఆసక్తి గలది. 'సరభి' తపోమయమైన శీలముతో శోభించునది. కద్రువ క్రోధశీల, కోపముతో అసుఖశీలము గలది. 'దనాయుష' యొక్క శీలము వైరానుగ్రహ లక్షణము. ఓ మహాభాగ్య వంతురాలైన దేవీ! నీవు క్రోధశీలవు నాకు ఇష్టురాలవు–అనునవి మానవుల శీలములు.

వారి స్వభావముల చూచినందున తెలియునవి. అవి పనివల్లను, ప్రయత్నముతోను, బుద్ధి తోను, రూపముతోను, బలముతోను, క్షమతోను, భావితమైన అర్థము యొక్క బలముచేతను (శీలములు) వేరువేరుగా అగును. సహజముగా రజోగుణ, సత్త్వగుణ, తమోగుణ ప్రవృత్తుల యందు మేనమామను అనుసరింతురు" అని ఈ విధముగ ఆ సాటిలేని 'ఖశ'కు చెప్పి, పుత్రులు ఇద్దరిని పిలిచి వారిని చంద్రునివలె శాంతులుగను, భయములేనివారినిగను చేసెను. అప్పుడు 'ఖశ' ఆ పుత్రులిరువురు చేసిన దానిని చెప్పెను. పుత్రులు వేరువేరుగా చేసిన పనులను తల్లి చెప్పగా విని, అందులోని ధాత్వర్థము యొక్క యోగముచే ఆ పనిని వారిపనిగా (వృత్తిగా) చేసెను. 'యక్ష' అను ధాతువు తినుట యందును, లాగుటయందును ఉపయోగింపబడును. 'యక్షయ' అని చెప్పినందున వీడు యక్షుడగును. అట్లే 'రక్ష' అను ధాతువు పాలనయందు విశేషముగ భావింపబడును. నా తల్లిని ఖశను 'రక్ష' అనినందున ఆ పేరుతో నీ పుత్రుడు రాక్షసుడు కాగలడు. ఆ కశ్యప ప్రజాపతి అపుడు వారిని ఆ విధ ముగా చూచి ఆశ్చర్యపడి చక్కగా వెదకియు వారు ఇరువురికి రక్త మాంసములను ఆహా రముగా ఆదేశించెను. తండ్రి వారిని ఆకలిగొన్న వారిగా జూచి వారికి ఈ వరమును గూడ ఇచ్చెను. "మీ ఇద్దరి చేతుల స్పర్శ అంతటను రాత్రియందే జరుగును. పగలు ఎవరిని తాకలేరు. మీరు ఇద్దరును రాత్రియందే ఆహార విహారములు కలవారును, పగలు నిద్రా సుఖములను అనుభవించువారును అగుదురు. తల్లిని రక్షించు కొనుడు, బోధించిన ధర్మమును పాలించుడు-అని పుత్రులతో కశ్యపుడు చెప్పి అచటనే అంతర్ధానమందెను.

తండ్రి వెడలగనే ఆ ఇద్దరు వీరులు సహజముగనే భయంకరులు వ్యతిరేకముగనే నడచుచున్నవారు కుత్సితమును భుజించువారు, ప్రాణులను హింసించువారు అయిరి. మహాబలులు, మహాసత్త్వులు, మహాకాయులు, సమీపింప అలవిగానివారు, మాయావులు ఇరువురును అంతర్ధానము చెందిరి. వారు ఇరువురు కామరూపులు (ఇష్టమైన రూపమును దాల్చువారు), భయంకరులు, వికార రూపులు, సహజముగా సద్జ్ఞానము లేనివారు. ఆ ఇద్దరును రూపమునకు తగిన ఆహారములతో ప్రభువులుగా సమర్థులు. ఆ రాక్షసులు దేవరాక్షసులను, ఋషులను, గంధర్వులను, కిన్నరులను, పిశాచులను, మనుష్యులను, సర్పములను, పక్షులను, పశువులను ఆహారముగా అంతటను పొందగోరువారుగను, ఇంద్రునిచే సులభముగా చంపబడునట్లును వరములను పొందిరి. యక్షుడు ఎప్పుడు గూడ చాలాకాలము ఒంటరిగా ఉండడు. ఆతడు ఆహారమును పొందగోరి అరుచుచు తిరిగెనట. ఆతడు (యక్షుడు) జంతుచండులు అను ఇరువురు పిశాచులను సమీపించెను. వారు గోరోజనపు రంగుగల కండ్లు గలవారు. పైకి నిక్కబొడుచుకొన్న వెంట్రుకలు గలవారు.

గుండ్రని కండ్లుకలవారు. మిక్కిలి భయంకరులు. రక్త, మాంస, వసలు ఆహారముగ గల వారు. పురుషులను తినువారు. మహాబలులు. ఆ పిశాచులు ఇద్దరు కన్యలతో కూడి యుండిరి. ఆ పిశాచులు ఆ కన్యకలకు ప్రియమును గూర్చుటకై కూడియుండిరి. ఆ ఇద్దరు కన్యలు కామరూపిణులు పిశాచుల ఆచారములు గలవారు. ఆ కన్యకలతో గూడిన ఆ ఇరువురు ఆహారార్థము తిరుగుచుండిరి. అచట వారు కామ రూపియై మహాబలుడైన రాక్షసుని చూచిరి. అకస్మాత్తుగా జరిగిన అతని ఆ కలయికలో పరస్పరము చూచుకొని, ఒకరినొకరు రక్షించుకొనుచునే ఒకరినొకరు చంపదలచుచుండిరి. అంత తండ్రులు– "మీరు అడుగడుగున మొరయుచున్న ఈతని సజీవునిగా పట్టుకొని వేగముగ రండు" అనిరి. అంత కన్యలు అపుడు అతనిని సమీపించి పట్టుకొనిరి. వారిచే పట్టుకొనబడి తండ్రుల సభకు ఆతడు తీసుకొనిరాబడెను. తరువాత కన్యకలచే పట్టుకొని తీసుకురాబడిన ఆ పిశాచరాక్షసుని–నీవు ఎవ్వడవు? ఎవ్వరివాడవు? అని అడిగిరి. ఆతడును మొత్తము వృత్తాంతమును చెప్పెను. అట్లు తెలిసికొని ఆరాక్షసశ్రేష్ఠులు అజుని, ఖండుని, ఆతని ఈ పుత్రికలను ఇచ్చిరి. వారిద్దరును (అజుడు ఖండుడు) ఆతని పనిచే సంతుష్టిచెందినవారై పుత్రికలైన కన్యలు ఇద్దరిని ఇచ్చిరి. పిశాచుల సంప్రదాయ ప్రయుక్తమైన వివాహముతో చక్కని దంతములు గల తమ కన్యల(తో) కట్టబడిన వాహనము గలవాడై అజుడును, ఖండుడును, ఆతని ఈ పుత్రికలను ఇచ్చిరి. ఆ ఇరువురు కన్యకలకు అపుడు ధనమును ఇప్పించిరి. ఖండుడు ఈమె బ్రహ్మధన అనునది. నా కన్యక లోపములు లేనిది. బ్రహ్మయే సత్త్వము ధనము ఆహారమును అయినది–అని (యెదుట) పలికెను. ఈమె జంతు ధన అనునది సర్వాంగ సుందరియైన కన్య. జంతువులు ఈమెకు ధనము ఆహారము అగును. ఈ విధముగా వారిద్దరు(అజుడు; ఖండుడును) ధనమును వినిపించిరి. జంతుధనయను ఆమె సర్వాంగములందు వెంట్రుకలు గల కన్య. బ్రహ్మ ధన కర్ణాంతము లేనిదైనను రోమ ములు లేని కన్య. ఆ కన్యక ధనానుని వల్ల బ్రహ్మధనుని కనెను. ఈ విధముగా ఆ ఇద్దరు పిశాచ కన్యలు రెండు మిథునములను (జంటలను) కనిరి. వారియొక్క ప్రజాసృష్టిని చెప్పెద వినుడు. హేతి, ప్రహేతి, ఉగ్రుడు, పౌరుషేయుడు, వధుడు, విస్ఫూర్జి, వాతుడు, ఆపుడు, వ్యాఘ్రుడు, సర్పుడు–వీరు యాతుధానాత్మజులైన రాక్షసులు పదుగురు. వీరు సూర్యుని అనుచరులు (సేవకులు). ఆతని తోడనే తిరుగుదురు. హేతు(తి) పుత్రుడు లంకుడు. లంకునకు ఇద్దరు పుత్రులు – మాల్యవంతుడు, సుమాలి అనువారు. ప్రహేతి పుత్రు లను వినుము. ప్రహేతి తనయుడు శ్రీమంతుడైపులోమ అను పేర ప్రసిద్ధుడు. వధుని పుత్రుడు నికుంభుడు. ప్రకూరుడైన బ్రహ్మరాక్షసుడు. వాతుని పుత్రుడు విరాగుడు. ఆపుని

పుత్రుడు జంబుకుడు. వ్యాఘ్రుని పుత్రుడు నిరానందుడు. జంతువులకు విఘ్నములు కలుగ చేయువాడు అను పేర్లుగల వారందరు అంతట వ్యాపించిన క్రూరులైన రాక్షసులు. యాతుధానులను చెప్పితిని. బ్రహ్మధానులను వినుడు. యజ్ఞుడు, పిత, ధుని, క్షేముడు, బ్రహ్మ, పాపుడు, యజ్ఞహస్త, స్వాకోటకుడు, కలి, సర్పుడు–అని బ్రహ్మ ధానాత్మజులు పదుగురు. వారియొక్క చెల్లెండ్రు వీరు బ్రహ్మ రాక్షసీలు, చాల భయంకరలు. రక్తకర్ణ, మహాజిహ్వ, అక్షయ, ఉపహారిణి–వీరి వంశమున పుట్టినవారు భూమిలో బ్రహ్మరాక్షసులు. శ్లేషాత్మక తరువులపైన శ్లేష్మమును ఎల్లప్పుడు పోగొట్టు విరిగిన చెట్లపైన ఈ రాక్షసులు తరచుగా నివాసము ఏర్పరచుకొని ఉందురు. యక్షుని యొక్క సృష్టిని వినుడు. యక్షుడు పంచస్థూలయైన స్తనములు, పిరుదులు, ఉపస్థ, చెంపలు, పెదవులు అను అయిదు లావుగాకల క్రతుస్థలి అను అప్సరసను కామించెను. ఆమెను పొందగోరి ఆమెనే చింతించుచు అతడు నందన వనమున తిరిగెను. అచట నందనవనమున మిక్కిలి ప్రకాశించు సురభిని (కామధేనువు), చైత్రరథమను ఇంద్రోద్యానమును, అప్సరసలతో కూడ ఉన్న ఆమెను చూచెను. అచట ఆమెను పొందకోరి చింతించుచు తన రూపముతోడను, కర్మతోను దూషితుడు అయినందున ఆమెను పొందు ఉపాయమును కానలేకుండెను. భయంకర రూపముతో చుట్టబడియున్న నన్ను చూచి, ప్రాణులు భయము చెందుదురు. కావున నా సుందరాంగి యైన అంగనను ఎట్లు పొందగలను? అని చింతించి ఆ తరువాత ఒక ఉపాయమును కనుగొని ఆ గుహ్యకుడు బహుమతమైన గంధర్వ రూపమును వహించి తొందరగా మరలెను. తరువాత అతడు అప్సరసల మధ్యనున్న క్రతుస్థలిని పట్టుకొనెను. క్రతుస్థలి అను అప్సరసకూడ ఆతనిని చక్కని సుందరునిగా భావించి అనురాగభావముతోనే ప్రవర్తించెను. అప్సరోగణములతో చూడబడుచు ఆమెతో చాటుమాటునకు పోయెను. ఆ యక్షుడు అచట సిద్ధించిన ఇంద్రియ వాంఛలు కలవాడు అయ్యెను. ఈతనికి ఒక పుత్రుడు వెంటనే పుట్టెను. పరిపక్వము చెందిన ఔన్నత్యములతో కూడి వెలుగుచు శ్రీచేత వెంటనే ఆవరింపబడెను. “నేను యక్షుడను. ఈ అప్సర స్త్రీలలో ఉండరాదుగదా” అని తండ్రితో అనెను. నీవిచట పుట్టినందున భయములేదు అని తండ్రి పుత్రునితో అనెను. ఇంకను తండ్రి వీర్యముతో పుత్రుడు తల్లి రూపమునకు అనురూపుడై పుట్టెను. పుత్రుడు అట్లు పుట్టగా గంధర్వ రూపములో ఉన్న యక్షుడు సంతోషముతో తన యక్షస్వరూపమును పొందెను. గొప్పవారైన యక్షులును, రాక్షసులును కామ రూపమున ఉన్నప్పటికిని సంత సించినవారైనను, భీతిజెందినవారైనను, కోపము చెందిన వారైనను, నిద్రించినవారై నను చివరకు మరణించుచున్నవారైనను స్వస్వరూపము (యక్ష, రాక్షస రూపములను) పొందు

దురు. అపుడు ఆ యక్షుడు ఆశ్చర్యపడుచున్నవాడై అప్సరసతో ఓ సుశ్రోణి! (చక్కని పిరుదులు గలదానా!) ఉత్తమురాలా! పుత్రునితో కూడిన దానవై నా గృహమునకు వెళ్లుము అని చెప్పెను. అట్లు వెంటనే స్వస్వరూపమును బొందిన ఆ యక్షుని చూచి విభ్రాంతలై భీతిజెందినవారై ఆ అప్పరోగణములు పరుగెత్తెను. అట్లు పోవుచున్న అప్సరోగణములను వెంబడించి వెళ్లుచున్న క్రతుస్థలిని పుత్రుడు తన మాటలతో ఓదార్చుచు గంధర్వ అప్సరసల మధ్య నుండి తల్లిని తీసికొని మరలెను. అప్సరోగణములు యక్షునియొక్క ఆసము తృప్తినిచూచి-"క్రతుస్థలితో" నీవు యక్షులకు జనయిత్రి(కన్నతల్లి)వని పలికిరి. తరువాత యక్షుడు తన పుత్రునితోబాటు యక్షులుండు స్థలమైన న్యగ్రోధ రోహిణమను (మఱ్ఱిచెట్లు మొలచు స్థలము) తన యింటికి వెళ్ళెను. కావున యక్షులకు మఱ్ఱిచెట్టు అంతటను ప్రియమైన ఆవాసము. యక్షుడైన రజతనాభుడు యక్షులకు తాత (తండ్రి తండ్రి).అతడు అనుహ్రాదుడు అను దైత్యుని యొక్క మిక్కిలి శ్రేష్ఠురాలైన పుత్రియగు 'భద్ర' అను ఆమెను పెండ్లాడెను. ఆమె యందు వశియైన మణివరుడు పుట్టెను. ఆమె ఇంద్రసమాన పరాక్రమవంతుడైన మణిభద్రుని కనెను. క్రతుస్థలికి కూతురులై (తమలో) అక్కచెల్లెండ్రైన ఇద్దరు వారిరువురికి భార్యలు. వారి పేరులు పుణ్యజని,దేవజని అనునవి. పుణ్యజని మణిభద్రుని వల్ల శుభులైన ఈ పుత్రులను కనెను. వారు సిద్ధార్థుడు, సూర్య తేజుడు, సుమంతుడు, నందనుడు, కన్యకుడు, యవికుడు, మణిదత్తుడు, వసువు, సర్వాను భూతుడు, ఖంఖుడు, పింగాక్షుడు, భీరువు, మందరశోభి, పద్ముడు, చంద్రప్రభుడు, మఘపూర్ణుడు, సుభద్రుడు, ప్రద్యోతుడు, మహౌజసుడు, ద్యుతిమత్తు, కేతుమత్తు, మిత్రుడు, మౌళి, సుదర్శనుడు-ఈ ఇరువది నలుగురు శుభులైన పుణ్యజనులు. వారందరు మణిభద్రు నకు పుట్టిరి. వారు పుణ్యలక్షణులు. వారి పుత్రులు, పౌత్రులును శుభులైన పుణ్యజనులు. మణి వరాత్మజుని వలన దేవజనని పుత్రులను కనెను. వారు-పూర్ణభద్రుడు, హేమరథుడు, మణిమంతుడు, నందివర్ధనుడు, కుస్తుంబురుడు, విశంగాభుడు, స్థూలకర్ణుడు, మహాజయడు, శ్వేతుడు, విపులుడు, పుష్పవంతుడు, భయావహుడు, పద్మవర్ణుడు, సునేత్రుడు, యక్షుడు, బాలుడు, బకుడు, కుముదుడు, క్షేమకుడు, వర్ధమానుడు, దముడు, పద్మనాభుడు, వరాంగుడు, సువీరుడు, విజయుడు, కృతి, పూర్ణమాసుడు, హిరణ్యాక్షుడు, సురూపుడు-ఈ మొదలైనవారు మణివరుని పుత్రులు వారు యక్షులు గుహ్యకులు అనబడిరి. వారు సురూపులును విరూపులును, పుష్పమాలలు కలవారును, చూచుటకు ఇంపైన వారును. వారి పుత్రులును, పౌత్రులును నూర్లు వేలుగా ఉన్నారు. ఖశయొక్క మరొక పుత్రులు రాక్షసులు కామరూపులు. వారిలో ప్రధానులను వర్ణించి చెప్పెద వినుడు. వారు లాలవి,

కుధనుడు, భీముడు, సుమాలి, మధువు, విస్ఫూర్జితుడు, విద్యుజ్జిహ్వుడు, మాతంగుడు, ధూమ్రితుడు, చంద్రార్కుడు, సుకరుడు, బుధ్నుడు, కపిలోముడు, ప్రహాసకుడు, క్రీడుడు, పరశునాభుడు, చక్రాక్షుడు, నిశాచరుడు, త్రిశిరుడు, శతదంష్ట్రుడు, తుండకేశుడు, రాక్షసుడు, యక్షుడు, అకంపనుడు, దుర్ముఖుడు, శితముఖుడు – అను వీరు రాక్షసవీరులు, పరాక్రమవంతులు, గుణములే రూపముగా కలవారు, సర్వలోకముల సంచరించువారు. వారు దేవతలతో సమానమైన పరాక్రమము కలవారు.

వీరుకాక మరి ఏడుగురు పుత్రికలు కలరు. వారిని గురించి వరుసగాను పుట్టించిన వారియొక్క ప్రజాసృష్టిని వినుడు. అలంబి, ఉత్కచ, కృష్ణ, నిర్‌ఋత, కపిల, శివ, మహాభాగు రాలైన కేశిని అని ఈ ఏడుగురును తోబుట్టువులు. వారినుండి లోకుల మాంసమును తినువారు, హంతకులు, యుద్ధములచేత మదము ఎక్కినవారు, గొప్పవారును, శుభకరులును అయిన ఈ రాక్షసగణములు పుట్టినవి. ఆలంబేయ గణము క్రూరమైనది. అట్లే ఉత్కచేయ గణమును క్రూరము. కార్ష్ణేయ (కృష్ణకు పుట్టినవారు) రాక్షసులు, శైవేయ (శివకు బుట్టినవారు) రాక్షసులును ఉత్తమ గణములు. అట్లే త్ర్యంబకుడైన శివునియొక్క అనుచరుడైన గణేశ్వరుడు అను సేవకునిచే నైర్‌ఋత గణము అను ప్రజాసృష్టి జరిగినది. బలవంతుడైన గణేశ్వరచరునిచే గొప్ప రాక్షసులు పుట్టిరి. నిర్‌ఋతికి సంబంధించిన దేవ, రాక్షసులు విక్రమించినవారు, శౌర్యసంపన్నులును, వారి అధిపతి సమర్థుడు, విరూపకుడు అను పేర ప్రసిద్ధి చెందినవాడు. గర్వితులైన ఈ మహాత్ముల గణశతములు జగత్ప్రభువైన శంకరుని ఎక్కువగా సేవించును. దైత్యరాజై మహాత్ముడైన కుంభునికి మహాకాయులు, మహావీర్యులు, మహాబలపరాక్రములును పుట్టిరి. కపిలకు పుట్టినవారు మహావీర్యులు, గొప్ప దైత్య రాక్షసులు కంపనుడు అను యక్షునిచేత కేశినికి పుట్టినవారు వేరొక గణమువారు. కేశిని దుహితయైన నీలకు సురసికుడైన ఆలంబేయునిచే పుట్టిన క్షుద్రమనస్కులు నైలులని చెప్పబడి భయంకర పరాక్రమము గలవారై దుర్జయులుగా ఉండిరి. వారు దైవలౌకికులై సమస్త భూమియందు చరింతురు. వారి సృష్టి బహుళమైనందున చెప్పుటకు సాధ్యపడదు. ఆ నీలకునకు 'వికచ' అను రాక్షసి కూతురుగా పుట్టినది. అది సహజముగనే వికృతములైన వెంట్రుకలు కలది. గొప్ప బలపరాక్రములు కలది. ఆ వికచకును నిర్‌ఋతి పుత్రుడైన విరూపునిచే రాక్షస ప్రజలు పుట్టింపబడిరి. వారు భయంకరులు. పూర్వానుక్రమముగ వారిని చెప్పెద వినుడు. వారు–కోరలతో కుటిలులై వికృతాకారము కలవారు. పెద్ద చెవులు కలవారు. పెద్ద కడుపులు కలవారు. హారకులు (హరించువారు), భీషకులు (భయపెట్టువారు), ఆక్రమించువారు మరికొందరు

వైనకులు, పిశాచులు, వామకులు, ప్రాశకులు మరికొందరు–వీరు భూమియందు రాక్షసులుగా తిరుగుదురు. వారుగొప్ప బలసత్త్వములు కల ఖేచరులు (ఆకాశచారులు). స్వల్పాకారులై స్వల్పముగనే లక్ష పర్యాయములు ఆకసమున చరింతురు. వీరిచేత ఈ లోకము నూర్లకొలదిగను వేలకొలదిగను వ్యాపింపబడినది. భూమి రాక్షసులు అందరి చేతను, అనేకులైన నీచరాక్షసులచేతను, అనేక విధముల రూపములుగలవారి చేతను నానాదేశములు ఆక్రమింపబడెను. రాక్షసమాతలు ఎనమండుగురు. ఈ విధముగా సంగ్రహ ముగా చెప్పబడిరి. పూర్వానుక్రమముగ వీరి విభాగములు ఏడు–అవి ప్రసిద్ధములు. భద్రకులు, నికరులు, కొందరు యజ్ఞ, నిష్పత్తికి కారణులు, మర్త్యలోకమున మిక్కిలి చరించువారు లక్షలు కలరు. పూతనామాత సామాన్యముగా కలవారు (పూతనయే తల్లిగా కలవారు). ప్రాణిభయంకరులు, మనుష్యలోకమున బాలగ్రహరూపులు, వైమాన హేతు కులు, స్కంధ గ్రహాదులు, ఆపకులు, త్రాసకులు మొదలైనవారు–వీరిని కౌమారులని గ్రహించవలెను. వీరు బాలగ్రహవృత్తిలో ఉండువారు. ఈ స్కందగ్రహ విశేషములు మాయికములు (మాయాశక్తిగలవి). ఇవి లోకవినాయకములు, పూతన అను పేరుగల భూతములు. లక్షల సంఖ్యలలో ఉన్నవి. అవి మర్త్యలోకమున విశేషముగా చరించునవి. ఈ విధముగ నూరు గణములు ఈ భూమియందు చరించును. యక్షులు మిక్కిలి పుణ్యాత్ములు, అట్లే గుహ్యకులనువారును, యక్షులు దేవజనులు, అట్లే పుణ్యజనులును, గుహ్యకులు అందరిలోను రాక్షసులైన అగస్త్యులును, రాక్షసులైన పౌలస్త్యులును, విశ్వా మిత్రులు అనబడువారును, యక్షులలోను రాక్షసులలోను పౌలస్త్య అగస్త్యులును–వీరందరికిని రాజు అలకాధిపుడై మహారాజైన కుబేరుడు. యక్షులు ఇచట చూచి కూడ నరుల యొక్క మాంసమును, రక్తమును, వసను త్రావుదురు. రాక్షసులు సైతం పైవారిని అనుసరించి ప్రవేశించుటచేతను, పిశాచులు సర్వత్ర పీడించుటచేతను నరుల మాంస రక్త వసలను త్రాగుదురు. వారు సర్వలక్షణ సంపన్నులు, దేవతలతో సమానమైన క్షేత్రము కలవారు, ప్రకాశవంతులు, బలవంతులు, ఈశ్వరులు, కామరూపులు, నాభిని తిననివారు, విక్ర మించువారు, సర్వ లోకములందు నమస్కరింపబడినవారు, సూక్ష్మ రూపులు, తేజో వంతులు, పవిత్రులు, వరములను ఇచ్చువారు, యజ్ఞములకు సంబంధించిన వారును, సమాన ధర్మముగల దేవతలలో వారంతటను రాక్షసులుగా పిలువబడిరి. నాలుగింట మూడు భాగములతో గంధర్వులు. ప్రభావములో దేవతలకు తక్కువవారు. సమస్త గుహ్యకులు (యక్షులు) గంధర్వుల కంటె తక్కువవారు. సమస్త రాక్షసులును ప్రభావములో యక్షులకు సమానులు. ఇక పిశాచులు ఐశ్వర్యములో (ప్రభావములో) యక్షుల కంటె మూడు పాళ్లు

తక్కువవారు. ఈ విధముగా గంధర్వులు మొదలు పిశాచుల వరకు ఉన్న నలుగురు దేవ యోనులు (దేవ మూలకముగా పుట్టినవారు) ధర్మములోను, ఐశ్వర్యము (ప్రభావము)లోను, బుద్ధిలోను, తపములోను, శాస్త్ర జ్ఞానములోను, పరాక్రమములోను - ఇట్లే ధనములోను, రూపములోను, ఆయుష్యములోను, బలములోను పరస్పరము దేవాసురుల కంటె మూడు పాళ్లు తగ్గి ఉందురు.

సూతుడు ఇట్లు అనెను :

ఇక వినుడు. మీకు భద్రమగును. క్రోధవశాత్మకమైన సంతానముగా క్రోధయందు పండ్రెండుగురు కన్యకలు పుట్టిరి. వారు ఆత్మసంభవులు, వారు పులహుని భార్యలైరి. వారి పేర్లను వినుడు. మృగి, మృగమద, హరిభద్ర, ఇరావతి, భూత, కపిశ, దంష్ట్ర, నిశ, తిర్య, శ్వేత, స్వర, సురస. మృగికి హరిణములు (లేళ్లు) పుత్రులు. అవి మృగములు, అట్లే తక్కినవి శశములు (కుందేళ్లు), న్యంకువులు (ఇఱ్ఱులు), శరభములు (ఎనిమిది కాళ్ల మృగములు సింహముల చంపునవి), రురువులు (నల్లచారల దుప్పులు), పృషతములు (దుప్పులు)ను పుట్టినవి. మృగమందకు మృగరాజములు (సింహములు), గవయములు (గోవువంటి క్రూర మృగములు గురుపోతులు), మహిషములు (దున్నలు), ఉష్ట్రములు (ఒంటెలు), వరాహములు (పందులు), ఖడ్గమృగములు, గౌర ముఖములును పుట్టినవి. హరిభద్రకు హరులు (కోతులు) పుత్రులు. గోలాంగూలములు (కొండముచ్చులు), తరక్షువులు (సివంగులు), వానరులు, కిన్నరులు, వ్యాఘ్రములు, కింపురుషులు ఇవి మొదలుగ తక్కినవియు పుట్టినవి. భౌవనుడు సూర్యునిఅండతో కపాలముల రెంటిని తెచ్చి రెండు చేతులతో పరిగ్రహించి రథంతర సామమును గానము చేసెను. అట్లు ప్రసూయమానమగు సామముతో వెంటనే గజము పుట్టెను. ఆ భౌవనుడు ఆ గజమును ఇరావతికి పుత్రునిగా ఇచ్చెను. ఆ భౌవనుడు ఇరావతికి సుతుడు అయినందున ఐరావతుడు అనబడెను. అది దేవరాజైన ఇంద్రునకు వాహనమైన మొట్టమొదటి గజరాజము. తెల్లని మేఘపుకాంతి కలిగి నాలుగు కోరలు గలదియై శ్రీమంతమైనది ఐరావత గజము, నీటిలో పుట్టినది, ఒకే మూలము కలది, బంగారు వన్నెగలది, ఆఱుదంతములు కలదియు అయిన ఆ భద్రగజమునకు ఔపవాహ్యుడైన వాడు బలుడు, ఆతనికి పుత్రులు అంజనుడు, సుప్రతీకుడు, వామనుడు, నాలుగవవాడు పద్మడు-అను నాలుగు ఏనుగులును, అభ్రము-అను ఆడ యేనుగుకు పుట్టినవి. వేగముగా పోవు నాలుగు దిగ్గజములను శ్వేతఅను ఆమె కనెను. భద్రుని, మృగమును, మందుని, సంకీర్ణుని-ఈ విధముగ నలుగురు సుతులను కనెను. సంకీర్ణుడైనప్పటికిని అంజనుడు యమునకు వాహనము. సుప్రతీకమను భద్రగజము

వరుణుని దిక్కునకు వాహనమైనది. తెల్లనిదై మందమైన పద్మము అను గజము ఐల విలునకు (ఉత్తరదిగధిపతి) కుబేరునకు వాహనమైనది. పద్మోత్తరమైన పద్మగజము వరుణ గణ రూపము. అది ఉపలేపన మేష రూపము. దానికి ఎనమండుగురు పుత్రసంతతి. దాని వంశమున ఉన్నత భావము గలవై, తెల్లని తోకలు గోళ్లును కలిగి గోరోజన వర్ణము గలిగిన శరీరము గల మతంగజములు పుట్టును. ఆ మతంగజములను తక్కిన నాగములను క్రమముగా చెప్పెదను. కపిలము పుండరీకము–అను గజములు పుట్టినవి. అవి పుష్పకాంతి గలవి, రథంతర రూపములు (రథంతరసామమున పుట్టినవి). ఆ రెంటికిని సుప్రతిష్ఠ–ప్రమర్ద నములను రెండు గజములు పుట్టినవి, ఆ గజములు–శూలరూపములు, స్థూల ములు, శిరములతో తమింపచేయునవి శుద్ధమైన తోకలు, గోళ్లును గలవి, బలవంతములు, శక్తిమంతములై ఆకులికములైన గజములు అనబడినవి. పుష్పదంతమై, బృహత్సామమై షడ్డంతమై, దంతపుష్పవంతమై, తామ్రవర్ణమైన గజము పుట్టెను. దాని పుత్రుడు సహచారియై కొమ్ములుకలవాడు పుట్టును. ఈతని వంశమున వ్రేలాడు పెదవులు కలిగి, చూడ ఇంపైన శరీరములు కలిగి, నల్లనివి, అందమైనవి, భయంకరమైనవి, అనేక అలంకారములతో విశాలమైన ముఖములు కలిగినవియునైన గజములు పుట్టును. వామ దేవమను గజము కాటుకవలె నల్లనైనది. వామనమను గజము సామము (వేదము) నుండి పుట్టినది. దాని భార్య అంగద. దానికి నీలవంతము లక్షణము అనునవి పుత్రులు. భయంకరములైన తలలు మెడలు గలవియు, విశాలమైన వక్షస్థలములు కలవియు, వేగవంతములైనవియు, నరులచే బద్ధములైన వికారము చెందిన గజములు పై వాని కులములో పుట్టును. సుప్రతీక గజము రూపములో దీనికి సాటియైన గజము లేదు. దానికి–ప్రహారి, సంపాతి, పృథువు–అను మూడు గజములు చిత్తిసుతులుగా పుట్టినవి. ఆతని వంశముననే మృదువునకు పుట్టినవిగా పొడవైన దవడలు పెదవులును కలవియు, చక్కగా వేరైన శిరము ఉదరమును కలవియునైన మతంగజములు పుట్టినవి. అంజనము నుండి అంజనయు, సామము నుండి అంజనావతియు పుట్టినవి. ఇట్లే వారి తల్లియు, ప్రథితాయువు, అను ఇద్దరు అజుని పుత్రులు జన్మించిరి. ఆతని వంశముననే పెద్దగా విభజింపబడిన శిరస్సులు గలిగి, దట్టమైన మేఘములతో సమానమై, అందమైనవై చక్కని ఆకారములు గలిగి, పద్మము వంటి నాభిస్థానములు కలవియు, అంతటను గుండ్రముగా ఉన్నవై, బలిసినవియు, పచ్చని విశాలమైన ముఖములు కలవియు అయిన గజములు పుట్టినవి. చంద్రుని సామము నుండి కలువకాంతిగల పింగల (దిగ్గజముల యొక్క భార్య) జన్మించెను. ఆ పింగళకు మహాపద్మ, ఊర్మిమాలినులను రెండు గజములు పుట్టినవి. సమునకు వరము ఇచ్చునవి,

భయంకరములైనవి, మిక్కిలి పెరిగిన బలము ఉదరమును కలవియునైన నాగములను (గజములను) గజయుద్ధ ప్రియములు. దేవతలు దేవాసుర యుద్ధమున జయము కొరకై ఈ గజములను గ్రహించిరి. యుద్ధమున కృతార్థులై దేవతలు వదలగా పూర్వోక్తము లైన గజములు దిక్కులకు పోయినవి. వీనియొక్క వంశమున పుట్టి వినయవంతములైన గజములను దేవతలు అంగునకును, లోమపాదునకును, సూత్రకారునకును ఇచ్చిరి. రెండు దంతములతో ద్విరదములు అనబడినది. తుండహస్తము వలన హస్తి, కరమొక్కటి ఉన్నందున కరి, వరించుట వలన వారణము, దంతముల (రెంటి)తో దంగి, గర్జించుట వలన గజము, పొదలలో చరించుటచే కుంజరము, నగ (పర్వత) విరోధమున నాగము, మతంగముని వలన పుట్టుటచే మాతంగము. రెండింటితో (నోటితోను తొండముతోను) నీరు త్రాగుటచే ద్విపము అనబడినది. సామగానమున పుట్టుటచే సామజము–(ఇది గజ పర్యాయనామ నిర్వచన క్రమము) ఈ ఏనుగుల నాలుక వెనుకకు తిరిగి అంటి పెట్టుకొన్న ట్లుండుట అగ్ని శాపమువల్ల కలిగినది. తనను సింహాదుల నుండి రక్షింపని బలము ఉండియు, వృషణములు గూఢముగా ఉండుటయు–ఈ రెండును ఏనుగునకు స్వయముగా భూసుర శాపమువలన కలిగినవి. దిగ్గజములచేత దేవదానవ గంధర్వులును, పిశాచ – ఉరగ – రాక్షసులును నానాప్రాణులును తరువాత గజములును కన్యలందుపుట్టిరి. సూర్యుడే రాజయిన ఈ గజములు చక్కగా పుట్టుటయు, బహుళముగా పుట్టుయు, నామముల నిర్వచనమును చక్కగా తెలుసుకొనవలెను. కౌశికాదులు సముద్రమునుండియు, తరువాత గంగ నుండియు పుట్టినవి. ఏకమూలమైన అంజనము నకు ప్రాచ్యము నుండి (తూర్పు నుండి) నాగవనము కలదు. వింధ్యకు ఉత్తరముననను, గంగకు దక్షిణముననను, గంగయొక్క ఉద్భేదము నుండి కరూషముల వరకు సుప్రతీక గజము యొక్క వనము కలదు. పశ్చిమముగా ఉత్కలము నుండి వేది వరకు ఐదవది, ఏకభూతాత్మకుడైన ఈ వామన గజము యొక్క వనము అనబడినది. పశ్చిమముగా లౌహిత్యమై (ఎర్రనిదియు) సింధు పర్యంతము ఉన్న వనము యమగజవనము అనబడును. అది పర్వతమును అనుసరించియే ఉన్నది. భూతి (అను గజము) ప్రభువైన రుద్రుని యొక్క అనుచరులైన భూతములను కనెను. వారు స్థూలులు, కృశులు, పొడగరులు, పొట్టివారు, చిన్నవారు సములును, వ్రేలాడు చెవులవారు, వ్రేలాడు పెదవులవారు, పొడవైన నాలుక, స్తనములు, ఉదరములు కల వారును, ఒక్కరూపము కలవారు, రెండు రూపములుకలవారును వ్రేలాడు పిరుదులు కలవారును, లావైన పిండాకారములైన పిరుదులు కలవారును, సరోవర సముద్రాది నదుల ఇసుకతిన్నెలపై ఉండువారును, నల్లనివారును, తెల్లనివారును, నీలమువారును, శ్వేతము

వారును, లోహితారుణులును, బభ్రు (బూడిద) వర్ణమువారును, చిత్రవర్ణము వారును, పొగవర్ణము వారును, కద్రు (గోరోజనము) వర్ణము గలవారును, గాడిదవలె భయంకర వర్ణము గల వారును, దర్భలవంటి గరుకైన వెంట్రుకలవారును, హృషీ కేశులును (ఇంద్రియాధి పతులును), సర్పములు యజ్ఞోపవీతములు కలవారును, విస్పష్టములైన కన్నులు కలవారును, ఒకేకన్ను కలవారును, పెక్కుతలలు కలవారును, తలలేని వారు, ఒకే తల కలవారును, మొత్తము తలయేగలవారును, చండులు, వికటులు, రోమములు లేని వారును, రోమములు నిండినవారును, అంధులు, జడలు కలవారు, కుంజులు, హేషక వామనులును, సరోవర సముద్రాది నదీపులినములందు ఉండువారును, ఒక చెవిగలవారు, పెద్దచెవులు గలవారు, శంకువు వంటి చెవులు గలవారు, చెవులు లేనివారు, కోరలు గలవారు, గోళ్లు గలవారు, పండ్లులేనివారు, రెండు నాలుకలు గలవారు, ఒక చేయి గలవారు రెండు చేతులు గలవారు, మూడుచేతులు గలవారు, చేతులు లేనివారు, ఒక పాదము గలవారు, రెండు పాదములవారు, మూడు పాదముల వారు, బహుపాదముల వారు, మహా యోగులు, మహాసత్త్వులు, సుతులు వంటగాగలవారు, మహాబలులు, అంతటను గానమును ప్రతిఘటించువారు, బ్రహ్మజ్ఞులు, కామరూపిణులు, భయంకరులు, క్రూరులు, పవిత్రులు, శివులు, పుణ్యులు, చక్కగా మాటాడువారు, దర్భలు చేతకలవారు, పెద్ద నాలుక కలవారు పెద్ద చెవులు, పెద్దనోరును కలవారు, చేతులు తినువారు, ముఖములు తినువారు, శిరమును తినువారు, కపాలమును ధరించినవారు. ధనువులు కలవారు, ముద్గరములు ధనముగా కలవారు, ఖడ్గ శూలములు ధరించువారు, మంటలతో ఉన్న ముఖములు, మంటలుకల కన్నులును కలవారు, చిత్రమైన మాలలు లేపనములు కలవారును, అన్నము తినువారు, మాంసము తినువారు, బహురూపులు సురూపులు, రాత్రిచరులు సంధ్యాచరులు, ఘోరులు, ఒకప్పుడు సౌమ్యులు, దివాచరులు, నక్తంచరులు, చూచుటకు అలవికాని వారు–ఇట్టి భయంకర నిశాచరులను 'భూతి'కనెను. పరత్వమున భయము దైవము. వారందరు గతమనస్కులైరి. వీరికి భార్యలేదు, పుత్రులు లేరు. వారు అందరును ఊర్ధ్వ రేతస్కులు. ఆత్మయోగులైన భూతములు లక్షలుకలవు. ఈ మహాత్ములు అందరు భూతియొక్క పుత్రులు. కపిశ వర్ణముగల కూష్మాండి కుష్మాదులను కనెను. మరల కపిశ వర్ణముతోడనే పిశాచ మిథునములను కనెను. కపిశ వర్ణముగలవారు అగుటచే వారు అందరు పిశాచులు, మాంసాహారులును మరి పదునారు జంటలలో ఉన్నవారు ఆ వంశమువారు. ఆ వంశీకులై పురుషులను తినువారిని పేరులతో చెప్పెదను. ఛగలుడు, ఛగలి, వక్రుడు, వక్రముఖి, ఈ విధముగా పదునారు గణములు కలవు. సూచి–సూచీ

ముఖుడు, కుంభపాత్రుడు-కుంభి వజ్రదంష్ట్రుడు, దుందుభి, ఉపచారుడు, ఉపచార, ఉలూఖలుడు, ఉలూఖలి, అనర్కుడు, అనర్క, కుఖండుడు, కుఖండిక, పాణిపాత్రుడు, పాణిపాత్రి, పాంశువు, పాంశుమతి, నితుండుడు, నితుండి, నిపుణుడు, నిపుణ, ఛలాదుడు, ఛలాద, ఉచ్ఛేషణుడు, ఉచ్ఛేషణ, ప్రస్కందుడు, స్కందిక ఈ విధముగ పదునారు, పిశాచుల పదునారు గణములు చెప్పబడినవి. అజాముఖులు, వక్రముఖులు, పూరిణులు, స్కందినులు, విపాదాంగారికులు, కుంభపాత్రులు, ప్రకుందకులు, ఉపచారులు, ఉలూఖలికులు, అనర్కులు, కుఖండికులు, పాణిపాత్రులు, నైతుండులు, ఊర్ణాశులు, నిపుణులు, సూచీముఖోచ్ఛేషణాదులు-అని ఈ కులములు పదునారు. ఈవీరు కూష్మాండుల అభిజాతులు అనగా వంశమువారు.

వారు పిశాచులని తెలుసుకొనవలెను. వారు సుకల్పులను వారు. వికృతమైన ఆచారము గల భీభత్సుని పుత్ర పౌత్రులతో అనంతుడైనవానిని కనిరి. కావున ఆ పిశాచుల లక్షణమును వినుడు. సర్వాంగములలో వెంట్రుకలు కలవారు, గుండ్రని ముఖము కలవారు, కోరలు కలవారు, గోళ్లు గలవారు, అడ్డముగా పోవువారు, పురుషులను తినువారు అధోముఖులైనవారు-ఆ పిశాచులు. కేశములు లేనివారు, రోమములు లేనివారు, త్వక్కే (చర్మము) వసగా కలవారు, చర్మమే వస్త్రముగా కలవారు-వీరు కూష్మాండికులైన పిశాచులు. వారు నూవులు తినువారు, ఎల్లప్పుడు మాంసము కలవారు. వంకరయైన చేతులు, కాళ్లు కలవారు, వంకర శీలముతో వచ్చువారు. వంకరగా పోవువారు, కామ రూపులు అయిన వారు వక్ర పిశాచులు. వ్రేలాడు పొట్ట గలవారు, తొండము ముక్కుగా కలవారు, పొట్టి శరీరము, తల భుజములను కలవారు. వీరు నితుందక పిశాచులు. తిల భక్షకులు, చెవులు ప్రియమైనవారు, పొట్టి ఆకారము కలవారు, వదరుబోతులు, గంతులు వేయుచు పోవువారు, వారు అనర్కమర్కులు అను పిశాచులు, వృక్షమునందు వసించువారు, ధనప్రియులును, ఊర్ధ్వ బాహువులు కలవారు, పైకి నిక్కిన రోమములు కలవారు, ఉన్నత వృక్షములు ఆలయముగా కలవారు, అంగముల నుండి ధూళికణములను విడుతురు. కావున వీరు పాంశువులు అను పిశాచులు. ధమనులు (పెద్దనరములు) ఇష్టమైనవారు, ఎండనట్లుండు వారు, మీసములు కలవారు, నారచీరలు ధరించువారు, శ్మశానమున నివసించు వీరు ఉపవీరులైన పిశాచులు. రెప్పపాటు లేక నిలచిన కండ్లు గలవారు, పెద్ద నాలుక గలవారు, నాకుచుండువారు, పైకెత్తిన నోళ్లు గలవారు, ఏనుగువలెను, ఒంటెవలెను లావైన తలలు గలవారు, విరతులు గుండ్రముగా చేసిన పిండమువలె ఉండువారు. వీరు కుంభపాత్రులు అను పిశాచులు. కనబడని అన్నములను భుజింతురు. సూక్ష్మ

రూపులు, వెంట్రుకలు కలవారు, గోరోజన వర్ణము కలవారు. వీరు కనబడుచు కనబడ కుండుచు తిరుగుదురు. ఆయుక్తులై నిపుణులైన ఆ పిశాచులు ఇచట ప్రవేశింతురు. వీరు చెవుల వరకు చీరియున్న నోళ్లు కలవారు. పొడవైన కనుబొమ్మలు లావైన ముక్కు కలవారు. చేతులతోను పాదములతోను ఆక్రమించిన గణములు కలవారు, పొట్టివారు, భూమియందే దృష్టి కలవారు, బాలుర తినువారు అయిన పిశాచులు. కాన్పు జరిగిన ఇంటిని పట్టుకొని సేవించువారు, వెనుక వైపునకు చేతులును, పాదములును గలవారు, పొట్టివారు, వాయువేగులు మాంసమును తినువారు అయిన ఆ పిశాచులు యుద్ధమున రక్తము త్రాగువారు. నగ్నులు (వస్త్రములు లేనివారు), ఇల్లు లేనివారు, పొడవు వెంట్రుకలు గలవారు, పిండాకారమువారు అయిన పిశాచులు స్కందినులు. తక్కినవారు ఊపిరిని తినువారు. ఇవి పిశాచులయొక్క పదునాలు జాతులు. ఈ విధముగ పిశాచులను దీనులనుగను, అల్పచేతస్కులుగను జూచి, బ్రహ్మ కారుణ్యముతో వారికి వరమొసంగెను. అంతర్ధానమును (మాయమగు శక్తిని), కామరూపత్వమును,ప్రాతః సాయంసంధ్యలలో చరించుటను, భగ్నములు, శూన్యములు, అల్పజనములు కలవియు, విధ్వంసము చేయ బడినవి, అనాచారులుగా ఉన్నవి, చక్కగా అలుకబడనివి, పసుపు కుంకుమ మొదలగు వానిచే సంస్కారము చేయబడనివియు అయిన ఇండ్లు, రాజమార్గమునకు ఉండు మార్గములు, నిష్కంఠములు (మిక్కిలి దుష్టములు) చత్వరములు (నాలుగు దారులు కలిసిన చోటు), ద్వారములు, కోట బురుజులు, మమత్వము లేనివి, సంక్రమించినవి, పథములు, నదులు, తీర్థములు, చైతన్య వృక్షములు (రచ్చచెట్లు), మహాపథములు, వీటన్నింటి స్థానములలో అంతటను పిశాచములు ప్రవేశించి ఉండును. పై వారందరు అధార్మికులు, వర్ణాశ్రమములు, సంకరికులు, కారువులు, శిల్పజనులును, దేవతలచే జీవన ఆధారము లుగా చెప్పబడినవి. అమృతముతో సమానమైన బలముగల చోరులు, విశ్వాస ఘాత కులునైన వారి యొక్కయు యనేక దుష్టోపాయములచేత ఆర్జింప బడిన ధనములచేత ఆరంభింపబడిన పనులలో పిశాచులే దేవతలు. మధుమాంసములతో కూడిన అన్నము లచేతను, పెరుగుచేతను, నువ్వులపొడి, కల్లు, సారాయిల చేతను, పసువు యొక్క కృశ రముల యొక్కయు ధూపములచేత తిలలతో భద్రమైన గుడాన్నములచేత పిశాచులు భుజింతురు. నల్లని వస్త్రములు, ధూపములు, పూవులు–వీనితో కూడిన మంచి బలులు పర్వసంధులలో పిశాచులకు అనుమతించి అధిపతియైన ఆ బ్రహ్మ పై వరములను ఇచ్చెను. సర్వభూత పిశాచములయొక్క శూలపాణియైన గిరీశుని (శివుని) చూచి భామిని వ్యాఘ్రములను, సింహములను పుత్రులనుగా కనెను. ఆమెకు ఏనుగులును, మాంసమును తిను వ్యాలేయులును, ఋషులును, సుతులు, మొత్తముగాగల ప్రజాసృష్టిని వినుడు. ఆమెకు

ఐదుగురు కూతుళ్లు. వారి పేరులను వినుడు. వారు మీన, మాత, వృత్త, పరివృత్త అను వారలు. వారి సంతానమును గురించి వినుడు. సహస్ర దంతములుగల మొసళ్లు, రాగివలె ఎఱ్ఱనైన కొఱ్ఱ చేపలు- ఈ మొదలుగాగల గణము విస్తీర్ణమైనది. గ్రాహములు (మొసళ్లు) నాలుగు విధములు. అవి జ్యేష్ఠుని అనుసరించినవి. మాతనిష్కలను శిశుమారులను సంతానముగా కనెను. వృత్తయను ఆమె బలచారులయొక్క అనేకములైన తాబేళ్ల రకములను కనెను. అట్లే నైశకుడు అనేకములైన శంఖముల రకములను పుట్టించెను. అనువృత్త కప్పల రకములను కనెను. అట్లే పరివృత్త అను ఆమె తేళ్ల రకములను, శంబూకముల (కప్ప చిప్పల) రకములను కనెను. పరివృత్త అను ఆమె ముత్యపు చిప్పల రకములను, గవ్వల రకములను, శంఖముల రకమును కనెను. కాలకూట విషపు రకములను జలసమూహ ముచే ఏర్పడిన వానిని గూడ పరివృత్తయే కనెను - ఇది ఋషియొక్క వంశము. దానికి అయిదు శాఖలని పైవిధముగా చెప్పబడినది.

మొట్టమొదటి బహుళమైన వంశవిస్తరము పశుపక్ష్యాది తిర్యగ్జంతువులది. వాని వలన చెమట నుండి పుట్టుట మొదలగు వికారములు గల ప్రాణులు పుట్టును. కోకిల శరీరముల నుండి ఉత్పాదకములైన (పుట్టించునవైన) పక్షులు పుట్టును. మనుష్యులు, స్వేదమలమున పుట్టునవి-ఉశనములను జంతువులు, అనేకములైన చీమల గణములు, పాదములు కట్టియున్న కీటకములు, శంఖములు, రాళ్లు వీని వికార రూపములు, కీలకము వలె తిరుగునవి -ఇట్టివి అనేకములు చెమట వల్ల పుట్టు పార్థివగణములు. అట్లే, ఎండ వేడిమి మొదలగు వానిచే వేడెక్కిన నీటినుండియు, వర్షముల నుండియు, మృగ శరీరముల నుండియు-ఈ అనేక జంతువులు పుట్టును. మీనకములు, పిప్పలములు (బాతులు), దంశములు (దోమలు), తిత్తిరి పుత్రికలు, నీలచిత్రములు, బహువిస్తరములైన అలకలును పుట్టును. జలమున పుట్టునవియు, చెమటలో పుట్టు నవియు అయిన ఈ జంతువులు పుట్టును. కాశము నుండి అంజకములు, కీటనలదములు, బహుపాదములు గలవియు, సింహలములు, రోమలములు, పిచ్ఛిలములుగా చెప్పబడినవి, ఇవి మొదలైనవి జలజమును స్వేదజమునైన గణము. మినుములు, పెసలు వీని యొక్క జలముల నుండియు, నేరేడు, బిల్వము, మామిడి, పోక పలముల నుండియు జంతువులు పుట్టును. పెసళ్ల నుండియు, పనసముల నుండియు, బియ్యము నుండియు, అట్లే తొఱ్ఱలలో ఎండిన వాని నుండియు, అచట ఉండిన వాని నుండియు జంతువులు పుట్టును. వరుసగా చెట్లకు వివిధములైన నల్ల ఈగలుపుట్టును. అట్లే ఎండిన (వృక్ష) వికారముల నుండి పుత్రికలు పుట్టును. నూర్ల కాలికల నుండి అంతట పాములు పుట్టును. చెమట నుండి పుట్టు తేళ్లు ఎండిన ఆవుపేడ

నుండి పుట్టును. ఓ ప్రభో! గోవుల నుండి దున్నపోతుల నుండియు జీవ జంతువులు పుట్టును. అనేక విధములైన మత్స్యములు మొదలగునవి. విశేషించి అండము యొక్క పొట్టనుండి పుట్టును. చైవీరికములు, గోజా కులములును తక్కిన సూక్ష్మములైన జలాకాది అనగా జలగ మొదలైన (జలజంతు) జాతులును పుట్టును. ఇక ఇతరములైన ఈగల రకములైన జాతులుగూడ పుట్టును. ఇవి సామాన్యముగా ఉమ్మి నీటి బురదలో ఉండును. దోమల రకములును, తుమ్మెదల రకములును గడ్డినుండియే పుట్టును. అవి-పుత్రికలు, పుత్రభాసకులు, మణిచ్ఛేదములు, సవ్యాలములు (సర్పములు), పోతజములు అనబడినవి. శతవేరి రకములు ఏరుపిడుకల నుండి పుట్టును. ఇంకను లెక్కలేనన్ని స్వేదజ (చెమటవల్ల పుట్టిన) గణము సంగ్రహముగా నాచే చెప్పబడినది. ఇది పూర్వజన్మ కర్మ వశమున కలుగునని చెప్పబడును. అట్లే ఇతరములైన నిర్‌ఋతికి పుట్టిన ప్రాణులు ఉపసర్గజములుగా చెప్పబడినవి. యోని నుండి పుట్టిన కొన్ని పవిత్రములు, కొన్ని ఔత్పత్తికములు అనబడినవి. సామాన్యముగా దేవతలందరు ఉపపత్తిజులుగా తెలియతగినవారు. కొందరు యోని నుండి పుట్టిన దేవతలు, కొందరు నిమిత్తము లేకయే పుట్టినవారు. తూలాలాఘుడు, కోలుడు, కన్యయైన శివయు, సరమ యొక్క సంతానము. సరమాదులు గణములు. శ్యాముడు, శబలుడు, అర్జునుడు, హరితుడు, కృష్ణుడు, ధూమ్రారుణుడు, తూలాలాఘుడును కద్రుకులు. సురస నూరు తలలను కలిగినదని అందరి సమ్మతము. సర్పములకు తక్షకుడు రాజు. నాగులకు వాసుకి రాజు-ఈ గణము తమోబహుళము, క్రోధవశమైనది. ఇది పులహుని సంతానసృష్టి. తామ్ర వల్ల కలిగిన సంతాన సృష్టిని వినుడు. తామ్రకు వేరుగా మిక్కిలి ప్రసిద్ధి చెందిన వారు పెక్కురు పుట్టిరి. శ్యేని, భాసి, క్రౌంచి, ధృతరాష్ట్రి, శుకీ-అనువారు వారిలో కొందరు-అరుణుని భార్య శ్యేని వీర్యవంతములు మహాబలిష్ఠములునైన పక్షిశ్రేష్ఠముల రెండిటిని కనెను. వారు సంపాతి, జటాయువు అను వారు. సంపాతి ఒక్క పుత్రుని, ఒక కన్యకను కనెను. జటాయువు పుత్రులు, కాక-గృధ్ర-అశ్వకర్ణులు. గరుత్మంతుని భార్యలు : భాసి, క్రౌంచి, శుకి, ధృతరాష్ట్రి, భద్ర-అనువారు. వారిలో గరుత్మంతునకు కలిగిన సంతానము చెప్పబడుచున్నది. శుకి గరుత్మతంతునకు ఆరుగురు పుత్రులనుకనెను. వారు ప్రసిద్ధులు. వారు సుముఖుడైన త్రిశిరుడు, బలుడైన పృష్ఠుడు, మహాబలుడైన త్రిశంఖ నేత్రుడు, సురూపుడు, సుముఖుడు, బలుడైన సురసుడు-అనువారు. ఈ మహాత్ములైన గరుడుల యొక్క పుత్రులు, పౌత్రులును పదునాలుగు వేలు. వారు క్రూరులు పాములను తినువారు. వారి పుత్ర పౌత్ర సృష్టి వలన వారి వంశము విస్తరించినది. వారిచే వ్యాపించిన దేశములను వరుసగా చెప్పెదను. మొత్తము

శాల్మలీ ద్వీపము, దేవకూటముఅను పర్వతము, మణి మంతము అనుపర్వత రాజము, సహస్రశిఖర పర్వతము, పర్ణమాలము, సుకేశము, శతశృంగము-అను పర్వతము, కౌరజము, పంచశిఖరము, హేమకూటముఅను పర్వతము. ప్రచండ వాయువులచే ఏర్పడి ప్రకాశించిన పద్మరాగమణులుగల మహాత్ములైన గరుడ వంశీకులచేత పై పర్వత సమూహములు అన్నియు వ్యాపించి ఉన్నవి. ఇక భాసీపుత్రులు, భాసులు, గుడ్లగూబలు, కాకులు, కోళ్ళు, నెమళ్లు, ఊర పిచ్చుకలు, పావురములు, లావుకపిట్టలును, తిత్తిరి పక్షులును-వీరిని కనెను. క్రౌంచి వార్ధీణసములను కనెను, శ్యేని గోరువంకలను, బెగ్గురు పక్షలను, కొంగలను ఇవి మొదలుగాగల ఇతర మాంసాహార పక్షులను కనెను. ధృతరాష్ట్రి హంసలను, కలహంసలను, భామిని చక్రవాక పక్షులను ఆకాశమున పోవు సమస్త పక్షులను కనెను. వీళ్లను అనంతమైన పుత్ర పౌత్ర సంతతి కలవారుగా కనెను. గరుడునకు ఇరయందు పుట్టిన సంతానమును వినుడు. 'ఇర' కమలముల వంటి కన్నులు గల ముచ్చురు కన్యలను కనెను. వనస్పతులైన వృక్షము లకును తీవలకును తల్లులు-లత, వల్లి, వీరుధ-అనువారు. లత వనస్పతులను కనెను. అట్లే పుష్పఫలములతో కూడిన వృక్షములనుగూడ కనెను. ఇక వల్లి- పొదలను కనెను. వీరుధ-త్వక్సారములైన గడ్డి జాతులను వాని సంతానమును గనెను. ఈ వంశము ఇక్కడ సమాప్తి చేయబడుచున్నది. వీరును, ఇవియును కశ్యప మహర్షికి పుట్టిన స్థావర జంగమములు. వీరి పుత్ర పౌత్రులచేతనే ఈ జగమంతయు నిండినది. ఇట్లని సృష్టిలో ఒక భాగము నాచేత చెప్ప బడినది. ఈ మరీచి మహర్షి పుత్రుడు కశ్యపునకు సంబంధించిన ప్రజాసృష్టి, సంగ్రహముగా చెప్పబడినది. ఓ బ్రాహ్మణులారా! నూరేండ్లవరకైనను దీనిని విస్తరముగా చెప్ప సాధ్యపడదు. కశ్యపుని భార్యలలో అదితి ధర్మశీల, దితి బలశీల-అని అందురు. సురభి తపఃశీల, దనువు, మాయాశీల అని చెప్పబడినది. కద్రువ క్రూరశీల, క్రౌంచి శ్రుతిశాలిని అనగా వేదజ్ఞానముకలది. ఇర గ్రహణశీల. దనాయువు భక్షణ ప్రియ. వినత వాహశీల (భారవ హనశీల). తామ్ర పాశశాలిని. ఇవి అంతటను కనబడు లోకమాతలయొక్క స్వభావములు. వీరు ధర్మముతోను, శీలముతోను, క్షమతోను, బలరూపములతోను రజఃసత్త్వతమో గుణ ములతో ఆవరింపబడినవారై ధార్మిక, అధార్మికులు అగుదురు. కశ్యపునకు పుట్టిన సంతానము (ప్రజలు) తల్లితో సమానులై పుట్టిన వంశమును పెంచిరి. వారు దేవతలు, అసురులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, పన్నగులు, పిశాచులు, పశువులు, మృగ ములు, పక్షులు, తీగలుగా అయిరి. మానుషులైన దక్షుని సంతానములందు వీరు పుట్టి నందున మన్వంతరములలో మానుషులైతే శ్రేష్ఠులు. ధర్మ, అర్థ, కామ, మోక్షములలో

మానుషులు సాధకులు. తరువాత అధః స్రోతసులే (క్రిందుగా వీర్యమును స్రవించువారు) గానీ (ఊర్ధ్వరేతస్కులు కారు). సురాసురులు పుట్టుదురు. కార్యసిద్ధి కొరకు మాటి మాటికి మానుషులలో పుట్టుదురు–అని ఈ విధముగా తపస్వుల (మునుల)వంశ ప్రభవము పుట్టుక ప్రకర్షముగా చెప్పబడినది. సురులయొక్కయు, అసురుల యొక్కయు, గంధర్వుల యొక్కయు, అప్సరసల యొక్కయు, యక్షులయొక్కయు, రక్షస్సుల యొక్కయు, పిశాచుల యొక్కయు, గరుడుల యొక్కయు, ఉరగుల యొక్కయు, పక్షుల యొక్కయు, వ్యాలము (సర్పము)ల యొక్కయు, నెమళ్ల యొక్కయు, ఓషధుల యొక్కయు, పురుగుల యొక్కయు, కీటకముల యొక్కయు, పక్షుల యొక్కయు, క్షుద్రములైన జల జంతువుల యొక్కయు, పశువుల యొక్కయు, శ్రీమంతులైన బ్రాహ్మణుల యొక్కయు, పవిత్ర లక్షణము వినదగినది. వారి ఆయుష్యము శ్రీమంతమై, ధనవంతమై, సుఖావహ మైన వారి జీవనము అసూయ లేకుండా ఎప్పుడును వినదగినదియు గ్రహింపదగి నదియు అయినది. ఈ వంశమును నియమముతో మహాత్ములైన బ్రాహ్మణ వైద్యసభలో చదివినవాడు చక్కని పుష్కలమైన సంతాన లాభమును, శ్రీని, ధనమును పొందును. మరణించిన తరువాత శోభనమైన గతిని కూడ పొందును. (8)

ఋషివంశాను కీర్తనము

సూతుడు ఇట్లు అనెను :

ఈ విధముగ మహాత్ముడైన కశ్యపునిచే సృజింపబడి సమస్త స్థావర జంగమాత్మక మైన ప్రజలు ప్రతిష్ఠితులుకాగా వారిలో ఆధిపత్యమునందు అభిషేకించి, తరువాత వారి రాజ్యములను వివరముగ ఆదేశించుటకు క్రమముగా మొదలుపెట్టెను. బ్రహ్మ ద్విజాతులయు, తీగలయు, గ్రహములతోడి నక్షత్రములయు, యజ్ఞములయు, తపస్సులయు, రాజ్యమున సోముని అభిషేకించెను. సమస్త అంగిరసుల రాజ్యమున బృహస్పతిని, భృగువుల రాజ్యమున కావ్యుని (శుక్రుని) అభిషేకించెను. ఆదిత్యులకు విష్ణువును, వసువులకు పావకుని, ప్రజాపతులకు దక్షుని, మరుత్తులకు వాసవుని, రాజుగా అభిషే కించెను. దైత్యుల రాజుగా దితినందనుడైన ప్రహ్లాదుని, సాధ్యులకు నారాయణుని, రుద్రులకు వృషభధ్వజుని, తరువాత దానవులకు విప్రచిత్తిని రాజుగా ఆదేశించెను. జలముల రాజ్యమున వరుణుని, రాజులకు, యక్షులకు, రాక్షసులకు, పార్థివులకు, ధనము నకును వైశ్రవణుని (కుబేరుని) రాజుగా ఆదేశించెను. పితరుల రాజ్యమున వైవస్వతుడైన యముని అభిషేకించెను. సర్వభూత పిశాచములకు గిరీశుడైన శూలపాణిని, శైలములకు హిమ

వంతుని, నదులకు సాగరమును, గంధర్వులకు చిత్రరథుని అధిపతులనుగా చేసెను. అశ్వములకు ఉచ్చైశ్రవమును రాజుగా అభిషేకించెను. తరువాత మృగములకు శార్దూల మును (పులిని), నాలుగు కాళ్ల జంతువులకు గోవృషభమును (ఆబోతు), సమస్త పక్షులకు పక్షిశ్రేష్ఠుడైన గరుడుని, గంధములకు మాతులమును (గంధ విశేషము) ఉమ్మెత్తను, శరీ రములేని భూతములకు, శబ్ద-ఆకాశ బలములకును బలవంతులలో శ్రేష్ఠుడైన వాయువును, సమస్తములైన కోరలుగలవానికి శేషుని, నాగులకు వాసుకిని, సరీసృపములకు, సర్పము లకు, నాగులకును తక్షకుని, సాగరములకును, నదులకును, మేఘములకును, వర్షింపబడిన దానికిని ఆదిత్యులలో ఒకడైన పర్జన్యుని అభిషేకించెను. సమస్త అప్సరోగణములకు కామదేవుని, క్రతువులకును, ఋతుసంబంధములైనవానికి మాసములకు పక్షములకు, విపక్షములకు (సప్తాహములకు లేక దినములకు) ముహూర్తములకు (రెండు గడియల కాలములకు), పర్వములకు (అష్టమి, చతుర్దశి, కుహువు, పూర్ణిమ, రవిసంక్రాంతి), కలా (540 రెప్పపాట్ల కాలము 30 కాష్టల కాలము - కాష్ఠ (18 రెప్పపాట్ల కాలము) - మొదలగు కాల విభాగములకు, ఉత్తర దక్షిణాయన గతులకు, గణితమునకు, యోగము నకును, (కూడికకు మంచి చెడు మోసములకు) సంవత్సరమును ప్రభువుగా చేసెను. బ్రహ్మ రజస్సు యొక్క ప్రసిద్ధుడైన పుత్రుని సుధాముడు అను వానిని తూరుపు దిక్కున రాజుగా అభిషేకించెను. అట్లే రజస్సు యొక్క పుత్రుడైన అచ్యుతుని రాజుగా పశ్చిదిక్కున అభిషేకించెను. ఆతడు కేతుమంతుడు (ధ్వజముగలవాడు). మహాత్ముడును, (తన) సుతుడైన మనువును మనుష్యులకు అధిపతిగాచేసెను. ఈ సమస్త పృథివి వారివారి ప్రదేశాను సారముగ ఇప్పటికిని వారిచే ధర్మముతో పరిపాలింపబడుచున్నది.

వారు పూర్వము స్వాయంభువ మన్వంతరమున బ్రహ్మచే అభిషేకింపబడిరి. రాజులు అభిషేకింపబడుదురు. వారు మనువులు అగుదురు. ఈ మన్వంతరములు గడువగనే రాజులు పోవుదురు. ఇట్లే మన్వంతరము రాగానే ఇతరులు మరల అభిషేకింప బడుదురు. గడచినవారును, రాబోవువారును అందరు మన్వంతరేశ్వరులు అనబడిరి. ఈ నరోత్తములచే రాజసూయమున పృథువు అభిషేకింపబడెను. వేదములో చెప్పబడిన విధానముగా ప్రతాప వంతుడైన పృథువు రాజుగా చేయబడెను. ఈ పుత్రులను పుట్టించి ప్రజాసంతాన కారణ మున ఆ మహాభాగుడు ప్రజలకుపతియై ఈశ్వరుడు అయ్యెను. గోత్ర (వంశ) కాముడైన కశ్యపుడు పరమతపము ఆచరించెను. నాకు గోత్రకరులైన ఇద్దరు పుత్రులు కలుగుదురు గాక అని ధ్యానించెను. ఆ విధముగా ధ్యానించు మహాత్ముడైన కశ్యపునకు తరువాత బ్రహ్మ అంశలుగా మహాబలతేజోవంతులైన ఇరువురు పుట్టిరి. వారిద్దరు వత్సారుడు, అసితుడును-

అను బ్రహ్మవాదులు (బ్రహ్మతత్త్వమును తెలిపి చెప్పువారు). వత్సారుని వలన నిధ్రువుడు, మహాయశస్వి అయిన రైభ్యుడును పుట్టిరి. రైభ్యుని సంతతి వారిని రైభ్యులుగా తెలియవలెను. నిధ్రువుని సంతానమును వినుడు. చ్యవనునకు సుకన్యయందు సుమేధసుడు పుట్టెను. నిధ్రువుని భార్య కుండపాయులకు (కుండలతో త్రాగువారికి) తల్లి. అసితునకు ఏకపర్ణయందు బ్రహ్మిష్ఠుడు పుట్టెను. శాండిల్యుల మాటను విని దేవలుడు సుమహా యశస్కుడు అయ్యెను. నిధ్రువులు, శాండిల్యులు, రైభ్యులు ఈ ముప్పురు తరువాత కశ్య పులు. వరప్రభృతులగు దేవతలు దేవులుని ప్రజలు (సంతానము). ఈ ప్రజలు మనువు యొక్క పదునొకండవ చతుర్యుగము (కృతాదికల్యంతము యుగము) గడువగా పుట్టినవారు. తరువాత మిగిలిన ద్వాపర యుగము నడచుచుండగా, మానసునకు చరిస్యంతుడు, ఆతనికి పుత్రుడు దముడు పుట్టిరి. ఆతని మానస దాయాదుడు (పుత్రుడు) తృణబిందువు.

ఆతడు మూడవ త్రేతాయుగ ప్రారంభమున రాజుగా ఉండెను. ఆతనికి ఇడవిడ అను కన్య ఉండెను. ఆమె రూపమున సాటిలేనిది. ఆ రాజర్షి ఆ కన్యను పులస్త్యునకు ఇచ్చెను. ఇడవిడయందు ఋషియైన విశ్రవసుడు పుట్టెను. ఆతనికి పౌలస్త్య కులమును వర్ధిల్లజేయు నలుగురు భార్యలుండిరి. దేవాచార్యుడైన బృహస్పతికి బృహత్కీర్తి అను పుత్రుడు ఉండెను. ఆతని కన్యను 'దేవవర్ణిని' అను దానిని ఆ విశ్రవసుడు పెండ్లాడెను. మాల్యవంతుని కన్యలైన 'పుష్కోత్కట'ను 'వాక'ను, మాలియొక్క కన్యయైన కైకసిని కూడ విశ్రవసుడు పెండ్లాడెను. వారి సంతానమును వినుడు. దేవవర్ణిని జ్యేష్ఠుడైన వైశ్రవణుని కనెను. ఆతడు దివ్యమైన విధానముతోను, ఋషులనుండి పొందిన పాండిత్యముచేతను, రాక్షస రూపముతోను, ఆసురమైన బలముతోను కూడినవాడు. ఆతడు మూడు పాదములు కలవాడు, మిక్కిలి పెద్ద శరీరము కలవాడు, లావైన తలగలవాడు, గొప్ప ఆకారము కల వాడు, ఎనిమిది కోరలు కలవాడు, పసుపుపచ్చని మీసములు కలవాడు, శంకువు (మేకు) వంటి చెవులు కలవాడు, పొట్టి చేతులు కలవాడు, బలసిన బాహువులు కలవాడు, గోరో జనము వన్నె కలవాడు, మిక్కిలి భయంకరుడు, పరిణామశాస్త్రజ్ఞాన సంపన్నుడు. సత్యజ్ఞాన సంపదచే చక్కని జ్ఞానియైనవాడు. ఈ విధముగ విశ్వరూపమును ధరించిన పుత్రుని జూచి అతడి తండ్రి (విశ్రవసుడు) వీడు 'కుబేరుడు' అని స్వయముగా చెప్పెను. 'కు' అను శబ్దము నిందార్థకము, శరీరము 'బేరము' అనబడును (కవచముగా అవయవములు గలది). కుశీరుడు అగుటచే కుబేరుడని పేరిడబడినాడు. విశ్రవసుని పుత్రుడైనందునను, చెవులు లేనివానివలె ఉన్నందునను లోకమున ఈతడు వైశ్రవణుడు అను పేరు కలవాడు కాగలడు. బుద్ధి అను ఆమెఅందు కుబేరుడు ప్రసిద్ధుడైన నలకూబరుని కనెను. కైకసి

(విశ్రవసుని వలన) రావణుని, కుంభకర్ణుని, శూర్పణఖ అను కన్యకను, విభీషణుని–ఈ విధముగ నలుగురిని కనెను. మేకువంటి చెవులు కలవాడు, పదితలలు కలవాడు, ఎఱ్ఱనివాడు, ఎఱ్ఱని తల వెంట్రుకలు కలవాడు, నాలుగు పాదములు కలవాడు, ఇరువది భుజములు కలవాడు, మహాకాయుడు, మహాబలుడు, పుట్టుకతోనే కాటుకవలె నల్లనివాడు, కోరలు కలవాడు, ఎఱ్ఱని కంఠము కలవాడు, రాజులు సేనగా కలవాడు, రూపముతో, బలముతో, జయముతో కూడినవాడు, సత్యబుద్ధి, దృఢమైనతనువు కలవాడై, రాక్షసులతోనే ధ్వనించు రావణుడు. ఆతడు సహజముగా భయంకరుడు, క్రూరుడు, రావణము (పెద్దగా అరచుట వలన) రావణుడైనాడు. ఆ రాజు (రావణుడు) పూర్వజన్మలో హిరణ్యకశిపుడుగా ఉండెను. ఆ రాజు అచట పదమూడు చతుర్యుగములు (కృత త్రేత ద్వాపర కలి యుగ ములు) రాక్షసుడుగా ఉండెను. బ్రాహ్మణులు సంఖ్యచే వాటిని ఐదుకోట్ల వర్షములు అనిరి. సంఖ్యావేత్తలు అఱువదియొక్క లక్షలని చెప్పిరి. ఆ రావణుడు అఱువది లక్షల యేండ్లు దేవతలకును ఋషులకును భయంకరముగా నిద్రలేకుండా చేసెను. ఇరువది నాలుగవ త్రేతాయుగమున రావణుడు తన తపము క్షీణించుటచే దశరథ పుత్రుడైన రామునితో పోరి తన గణముతో నాశము పొందెను. విశ్రవసునకు పుష్పోత్కట అందు మహోదయుడు, ప్రహస్తుడు, మహాపాంశుఖరుడు, కుంభీనస అను కన్యయును కలిగిరి. విశ్రవసునకు వాకయందు త్రిశిరుడు, దూషణుడు విద్యుజ్జిహ్వుడు, అసలిక అను కన్యయు రాక్షసులుగా జనించిన సంతానము. అను వీరు క్రూర కర్ములు, పౌలస్త్యవంశమున పుట్టిన వారును రాక్షసులు అయిన పదుగురును భయంకర బంధుజనము కలవారు. అందరును దేవతలకు గూడ సమీపింప అలవికానివారు, అందరును వరములు పొందినవారు. పుత్రు పౌత్రులతో కూడినవారు. సమస్త యక్షులకును, పౌలస్త్యులైన రాక్షసులకును, అగస్త్యులకును వైశ్వామిత్రులకును (అగస్త్య, విశ్వామిత్ర సంతతి వారికిని), క్రూరులై బ్రహ్మరాక్షసులై వేదాధ్యయనశీలురై, తపోవ్రతముల సేవించువారైన పైవారందరికిని సవ్యపింగళుడు, పౌలస్త్యుడు అయిన ఐడవిడురాజు. ఇతరులు గూడ యజ్ఞముఖులు. కావున రక్షోగణములు మూడు. యాతుధానులు, బ్రహ్మధానులు (పీడలను వేద విజ్ఞాన మును ధరించువారు). వార్తులు దివాచరులు. ఈ నిశాచర గణములు నాలుగని కవుల న్నారు. "పౌలస్త్యులు, నైరృతులు, అగస్త్యులు, కైశికులు"–అని ఈ ఏడు రాక్షసుల జాతులుగా చెప్పబడినవి. సహజముగా ఉన్న వారి రూపమును చెప్పెదను. వారు–గుండ్రని కండ్లు గలవారు, గోరోజన వర్ణము వారు, మహాకాయులు, పెద్దకడుపుగలవారు, ఎనిమిది కోరలు గలిగి మేకువంటి చేవులు గలవారు, పైకి నిక్కబొడిచికొన్న వెంట్రుకలు గలవారు. చెవుల

వరకు చీలి ఉన్న నోరుకలవారు, ముంజగడ్డి వలె పొగబారి పైకి నిక్కిన తలవెంట్రుకలు గలవారు, లావైన తలకలవారు, తెల్లని కాంతి కలవారు, పొట్టివారు, బలిష్ఠమైన బాహువులు కలవారు, ఎఱ్ఱని ముఖము కలవారు, వ్రేలాడు పొడవైన నాలుక–పెదవులు కలవారు, వ్రేలాడు కనుబొమ్మలు–లావైన ముక్కులును కలవారు, నల్లని అంగములు కలవారు, ఎఱ్ఱని కంఠము కలవారు, లోతైన కండ్లు కలవారు, భయంకరులు, మహాభయంకరమైన కంఠస్వరము కలవారు, వికటస్వరూపులు కట్టబడిన పిండముల వంటి కండరములు గలవారు. లావైనవారు, ఎత్తైన ముక్కులు కలవారు, రాళ్లవంటి దేహములు గలవారు, బలమైనవారు, భయంకరులైన బంధుజనము కలవారు, క్రూరులు, సామాన్యముగా క్లిష్టమైన కర్మలు కలవారు, కుండలములతోను, భుజకీర్తులతోను అలంకరింపబడినవారు, కిరీట మును, తలపాగాను ధరించినవారు, విచిత్రమైన వస్త్రములు ఆభరణములును కలవారు, చిత్రములైన మాలలును, మైపూతలును కలవారు, అన్నము తినువారును, మాంసము తినువారును, పురుషులను తినువారునుగా ఉండిరి. రాక్షసులలో ఈ రూప సాధర్మ్యము (సమానత)ను పండితులు చెప్పిరి. వారికి సామూహిక బలములేదు. అంతయు మాయా కృతమైనందున ఆ బలము అంతయు నిజమైన బలముకాదు.

పులహునకు పుత్రులు అందరు మృగములు, కోరలుగల వ్యాళములు, భూతములు, పిశాచములు, సర్పములు, భ్రమరములు, ఏనుగులు, వానరములు, కిన్నరులు, యమ కింపురుషులు, తక్కిన మాయా క్రోధములకు వశవర్తులై వ్యాపించినవారు. ఆ వైవస్వత మన్వంతరమున 'క్రతువు' అనపత్యుడు (సంతానము లేనివాడు). ఆతనికి తేజస్సును సంక్షేపించి ఉన్న పుత్రుడుగాని, పౌత్రుడుగాని లేడు. తృతీయ ప్రజాపతియైన అత్రియొక్క వంశమును చెప్పెదను. ఆతనికి సుందరులై పతివ్రతలైన పదుగురు భార్యలు ఉండిరి. భద్రాశ్వునకు ఘృతాచి అను అప్సరసయందు పదుగురు పుత్రులు కలిగిరి. వారు భద్ర, శూద్ర, మద్ర, శలద, మలద, వేల, ఖల, గోచపల, మానరస, రత్నకూట–అనువారు పదుగురు. వారియొక్క భర్త ఆత్రేయ వంశకరుడైన ప్రభాకరుడను పేరుగలవాడు. ఆతడు భద్రయందు యశస్వియైన సోముని పుత్రునిగా పుట్టించెను. సూర్యుడు రాహువుచే హతుడై ద్యులోకము నుండి (ఆకాశము నుండి) భూమిపై పడబోవుచుండెను. అపుడు లోకము చీకటితో ఆవరింపబడెను. అపుడు ఈ సోముని చేత కాంతి ప్రకాశింప జేయ బడెను. భూమిపై బడబోవుచున్న సూర్యునిగూర్చి బ్రహ్మర్షి "నీకు స్వస్తి అగుగాక" అని అనెను. ఆ బ్రహ్మర్షి మాట వలన సూర్యుడు ఆకాశమునుండి భూమిపై పడలేదు. మహాతపస్వియైన అత్రి శ్రేష్ఠములైన గోత్రములను (వంశములను) విస్తరింపజేసెను. దేవతలచేత అత్రి

ఘనుడై యజ్ఞములందు ప్రవర్తింపజేయబడెను. ఆతడు మహాతపమున భావిత ప్రభుడై ఆ పదుగురు స్త్రీలయందు తనతో సమానులై అనామకులైన పదుగురు పుత్రులను కనెను. వారు వేదపారగులైన స్వస్త్యాత్రేయులు అను ఋషులుగా ప్రసిద్ధిజెందిరి. అత్రికి ప్రసిద్ధమైన కీర్తికలవారు, బ్రహ్మిష్ఠులైనవారును మహౌజస్కులునైన వారి ఇరువురు పుత్రులు ఉండిరి. జ్యేష్టుడు దత్తాత్రేయుడు. ఆతని తమ్ముడు దుర్వాసుడు. చివరిది కూతురు ఆమెయందు ఒక అబల బ్రహ్మవాదిని అయ్యెను. ఆతని గోత్రాన్వయమున బుట్టిన నలుగురు భూలోక మున ప్రసిద్ధులు. వారు శ్యాములు, ముద్గలులు, బలారకులు, గవిష్ఠిరులు. వీరు మహౌ జస్కులైన నరులపక్షము వారైన నల్గురు అనిరి. కశ్యపుని వలన నారదుడు, పర్వతుడు, అరుంధతియు పుట్టిరి. ఓసత్తములారా! అరుంధతికి పుట్టినవారిని వినుడు. నారదుడు అరుంధతిని వసిష్ఠునకు (భార్యగా) ఇచ్చెను. వృక్ష శాపము వలన మహాతేజస్వియైన నారదుడు ఊర్ధ్వరేతస్కుడు అయ్యెను. పూర్వము తారకాసురమయమైన ఆ దేవాసుర యుద్ధమున లోకము అనావృష్టిచే బాధితముకాగా, ఇంద్రుడు దేవతలతోపాటు వ్యగ్రుడు కాగా, ధీమంతుడైన వసిష్ఠుడు తన తపముతో ప్రజలను కాపాడి ధరించెను. ఇచట మూల ఫలరూపమైనది ఔషధము. ఆ ఔషధులను ప్రవర్తింపచేయుచు ఆ ఔషధములతోనే ప్రజలను కరుణతో జీవింపజేసెను. ఓ బ్రాహ్మణులారా! వసిష్ఠుడు అరుంధతియందు 'శక్తి'ని పుట్టించెను. శక్తి వలన అదృశ్యంతి సాగరుని పరాశరుని కనెను. పరాశరుని వల్ల 'కాలి' కృష్ణద్వైపాయన ప్రభువును కనెను. ద్వైపాయనుని వల్ల అరణియందు గుణా న్వితుడైన శుకుడు పుట్టెను. పీవరియందు శుకుని కుమారులు ఆరుగురు పుట్టిరి. వారు భూరిశ్రవుడు, ప్రభువు, శంభుడు, కృష్ణుడు, ఐదవ వాడు గౌరుడు, ఇక కన్య, కీర్తిమతి, యోగమాత, దృఢవ్రతురాలు. బ్రహ్మదత్తుని తల్లి, సాత్త్వ గుహుని భార్య. శ్వేతులు, కృష్ణులు, గౌరులు, శ్యాములు, సమూలకులైన ధూమ్రులు, ఊష్మపులు, దారకులు, నీలులు-వీరు పరాశరులు. వారు మహాత్ములైన పరాశరుల ఎనిమిది పక్షములుగా చెప్పబడినారు. ఆ తరువాత ఇంద్ర ప్రతిమ సంభవమును వినుడు. వసిష్ఠునకు కపింజలియైన ఘృతాచి యందు 'కుశి' అను వాడు పుట్టెను. వానికి ఇంకొక పేరు ఇంద్రప్రతిముడు. పృథువు యొక్క సుతవల్ల ఆతనికి (ఇంద్రప్రతిమునకు) పుత్రుడుగా వసువుపుట్టెను. ఆతనికి ఉపమన్యువు సుతుడు. ఆతనికి పుట్టిన వీరు ఉపమన్యువులు. మిత్రావరణులకు సంబం ధించి, కుండినులని ప్రసిద్ధిగాంచి యేకార్షేయులైన ఇతరులుగూడ వసిష్ఠులని ప్రసిద్ధిచెందిన వారు. ఈ పదకొండు మంది వసిష్ఠుల పక్షములుగా చెప్పబడిరి. బ్రహ్మయొక్క మానస పుత్రులు వీరు ఎనమండుగురు-ప్రసిద్ధి చెందినవారు. వారి సోదరులు చక్కని మహా

భాగ్యవంతులు. వారి వంశములు ప్రతిష్ఠితములైనవై దేవర్షిగణములతో నిండి ఈ ముల్లోకములను ధరించుచున్నవి. వారు నూర్ల కొలదియు, వేలకొలదియు అయిన సూర్య కిరణములవలె భూమి అంతయు వ్యాపించి ఉన్నవారు. (9)

శ్రాద్ధ ప్రకియ ఆరంభము

శాంశపాయునుడు ఇట్లు అనెను :

“పూర్వము యోగభావిని అయిన సతీదేవి రెండవ జన్మ ఎట్లు ఎత్తినది? పూర్వము దక్షుని పుత్రిసతిగా ఉండెను. ఆమె ‘ఉమ’గా ఎట్లు జన్మించెను. శైలరాజైన హిమవంతుడు పితృకన్యయైన ‘మేన’ యందు ఉమను ఎట్లు జన్మింపజేసెను? ‘మేన’ మానసపుత్రిగా జన్మించిన ఆ పితరులు ఎవరు? పితరులకు మైనాకుడు దౌహిత్రుడు (కూతురు కొడుకు). అట్లే ఉమ దౌహిత్రి (కూతురు కూతురు). అట్లే ఆమె ఏకపర్ణ (ఒకే ఆకును తిని తపమా చరించినది), ఏకపాటల (తెలుపు మించిన ఎరుపు) వన్నెగలది, నదులలో శ్రేష్ఠమైన గంగ హిమవంతునకు వీరందరికంటె ముందుగా పుట్టినది. నాచేత అంతటను పూర్వమే ఇది చెప్పబడినది. పితరులు అనేకులు, వారు ఎక్కడ ఉందురు? శ్రాద్ధము యొక్క పరమ విధి ఎట్టిది? వినగోరుచున్నాను. నీకు భద్రము అగుగాక. ఆ పితరులు ఎవరి పుత్రులు? వారు పితరులు ఎట్లు అయిరి? పితరులు ఎట్లు జనించిరి? ఏ స్వరూపము గలవారు? స్వర్గములో దేవతలకును దేవతలై ఉండు పితరులు వేరు–పితరుల యొక్క ఉత్తమ సృష్టిని వినగోరుచున్నాను. శాస్త్రమును అనుసరించి మాచే చేయబడిన శ్రాద్ధము పితరులను సంతోషపెట్టగలదా? దేనికొఅకు వారు కనబడరు? దానికి కారణము ఏమన బడినది? స్వర్గమున ఏ పితరులు ఉందురు? నరకమున ఏ పితరులు ఉందురు? తండ్రిని, తండ్రి తండ్రిని, అట్లే తండ్రి తాతను మూడు పిండములందు పేరు పేరున కలిపి, ఏ శ్రాద్ధములను చేయవలెను? అవి పితరుల ఎట్లు పొందగలవు? నరకమునందు ఉన్న ఆ పితరులు మనకు (ప్రతి)ఫలము ఇచ్చుటకు ఎట్లు సమర్థులగు దురు? ఇచట మనము పూజించు పితరులు ఎవరు? స్వర్గమున దేవతలు కూడ పితరులను పూజింతురని మేము వింటిమి. ఓ బహు పాండిత్యము కలవాడా! సూతా! ఈ విషయమును విస్తరముగా వినగోరుచున్నాను. దానిని స్పష్టముగా చెప్పుడు” అని అడుగా, అని అడుగగా, వినితత్త్వార్థమును దర్శించిన సూతుడు ఋషులయొక్క ప్రశ్నలకు మనస్సు నకును సరియైన సమాధానము ఇట్లు చెప్పెను.

సూతుడు ఇట్లు అనెను :

ఇచట నేను నా ప్రజ్ఞను అనుసరించి విన్నది విన్నట్లుగా వర్ణింతును. దేవపుత్రులు

పితరులు మన్వంతరములలో పుట్టుదురు. అతీత-అనాగతములందు (భూత-భవిష్య త్కాలములందు) క్రమముగా వారు జ్యేష్టులు-కనిష్ఠులును అగుదురు. దేవతలతోబాటు పూర్వము కడచిన పితరులను గూర్చియు నిశ్చయముగా చెప్పుదును. వీరి శ్రాద్ధమును గూడ చెప్పెదను. శ్రాద్ధము మనుష్యులకే ప్రవర్తిల్లును. బ్రహ్మ దేవతలను సృష్టించెను. కాని వారు పూజింపలేదని, బ్రహ్మను వదిలి ఫలము ఆశించినవారై స్వాత్మను సృజించిరి. వారు (దేవతలు) బ్రహ్మచేత, "మూఢులై సంజ్ఞలేనివారు మీరు అగుదురు" -అని శపింప బడిరి. అంత, వారు ఏమియు తెలియకుండిరి. దాని వలన లోకము మోహపర వశమే అయ్యెను. ఆ దేవతలు అందరు నమస్కరించినవారై బ్రహ్మను యాచించిరి. ప్రభువైన బ్రహ్మ లోకాను గ్రహమునకై మరల దేవతలతో ఇట్లనెను. ఆచారమునుతప్పి నడిచినందున ప్రాయశ్చిత్త మును ఆచరింపుడు. మీ పుత్రులను అడుగుడు. దాని వలన జ్ఞానమును పొందుదురు. తరువాత వారు ప్రాయశ్చిత్తమును ఆచరింపదలచినవారై, సంయతాత్ములై, తమ పుత్రులనే ఒకరిని ఒకరు అడిగిరి. ఆ పుత్రులు నియతాత్ములై ధర్మజ్ఞులై వాక్, మనస్, కర్మలవల్ల కలిగిన ప్రాయశ్చిత్తములను వారికి అనేక విధములుగా చెప్పిరి. అంత ఆ దేవతలు జ్ఞానస్మృతులు పొందినవారై సంతసించినవారై తమ పుత్రులతో ఇట్లనిరి. "మమ్ములను అపస్మృతి నుండి మేలుకొల్పినందున మీరు మాకు పితరులు. ధర్మజ్ఞానము, కామము, ఈ రెంటిలో ఏ వరమును మీకు ఈయవలెనో కోరుకొనుడు" అనగా తరువాత బ్రహ్మ వారితో ఇట్లనెను. "మీరు సత్యవాదులు. కావున మీరు చెప్పినది చెప్పినట్లు అగును. వేరు తీరుగాదు. మా స్వంత పుత్రులు, మా తండ్రులు అని అంటిరి. "వారు (పుత్రులు) పితరులు అగుదురు". వారికి ఈవరము ఈయబడుగాక" అనగా బ్రహ్మయొక్క ఆ వాక్కుతోనే పుత్రులు పితృత్వమును పొందిరి. ఈ విధముగా పితరులు (దేవీపుత్రులు) పుత్రత్వమును పుత్రులు పితృత్వమును పొందిరి. కావున వారు పితరులు, పుత్రులు అగురుదు. వారిలో పితృత్వమును, పుత్రత్వమును ఉన్నవి. ఈ విధముగ పితరులను పుత్రులుగను, పుత్రులను, పితరులుగను స్మరించి బ్రహ్మ పితరులతో ఆత్మ వివృద్ధి చేయుడని పలికెను. శ్రాద్ధమున పితరులకు హోమము చేయక ఏదైన పనిచేసినచో వాని క్రియాఫలమును రాక్షసులును, దానవులును పొందుదురు. మీచేత శ్రాద్ధములచే పితరులు సంతృప్తి చెందినవారై నాశములేని శాశ్వతమైన సోమమును ప్రతినిత్యము వర్ధిల్ల చేయు దురు. శ్రాద్ధములచే తృప్తి చెందిన సోముడు లోకములను సంతోష పెట్టగలడు. పర్వత వనములతోగూడి స్థావర జంగమములతో చుట్టబడిన ఈ సమస్తమును సంతోషపెట్టగలడు. పుష్టికాములై శ్రాద్ధములనుచేయు మానవులకు పితరులు ఎల్లప్పుడును పుష్టిని సంతాన

ములను ఇత్తురు. శ్రాద్ధమున గోత్ర నామములతో మూడు పిండములను ఎవ్వరికి ఇత్తురో ఆ పితరులు అంతట ఉండుచున్న వారై, వారి ప్రపితామహుని (తాత, తండ్రిని) సంతోష పెట్టుదురు). ఈ విధముగా పూర్వము పరమేష్ఠి అయిన బ్రహ్మచే ఆజ్ఞాపింపబడినది. దాని వలన అన్ని విధములుగ దానము, అధ్యయనము, తపమును సిద్ధించినవి. ఆ పితరులు మీకు జ్ఞానము ఇచ్చువారు. సంశయము లేదు అని ఈ విధముగ పితరులు దేవతలు, దేవతలు పితరులును. ఈ దేవతలును పితరులును ఒకరి కొకరు పితరులు. విహితాత్ముడైన సూతుని యొక్క ఈ బ్రహ్మ వాక్కునువిని మునులు సూతుని మరల అడిగిరి.

ఋషులు ఇట్లు అనిరి :

"ఋషి గణములు ఎన్ని ఉన్నవి? అవి యే కాలమునందలి గణములు? దేవతలలో సోమవర్ధనులైన దేవప్రవరులు ఉన్నారా?"

సూతుడు ఇట్లు అనెను :

"ఈ అత్యంత ఉత్తమమైన పితృ సృష్టిని మీకు చెప్పెదను. ఈ విషయమునే 'శంయు' వు అను ముని పూర్వము బృహస్పతిని అడిగెను. సర్వజ్ఞానార్థ కోవిదుడును, సమీపమున కూర్చుని ఉన్నవాడు అయిన బృహస్పతిని వినయాన్వితుడై పుత్రుడైన 'శంయువు' ఈ ప్రశ్నను అడిగెను. "ఈ పితరులు అనువారు ఎవరు? వారు ఎందరు? వారి పేరులు ఏమి? వారు ఎట్లు పుట్టిరి? ఎట్లు పితృత్వమును పొందిరి? పూర్వము ఎందులకు పితరుని నిత్యము యజ్ఞమున జోడించుచుండిరి? మహాత్ముల క్రియలన్నియు శ్రాద్ధ పూర్వములుగా ఎందులకు ఉండెడివి? ఎవరికి శ్రాద్ధములను ఈయవలెను? ఏది ఇచ్చిన మహాఫలము కలుగును? ఎవరియందు శ్రాద్ధము అక్షయము అగును? తీర్థములయందా? నదుల యందా? బ్రాహ్మణోత్తముడు వేనియందు శ్రాద్ధముచేసి సమస్తమును పొందును? శ్రాద్ధమునకు కాలమేది? ఏ విధి అనుసరింపబడును? ఓ భగవంతుడా! (బృహస్పతీ) ! నేను అడిగిన చోటులను ఈ విషయమును ఉన్నది ఉన్నట్లుగా పూర్వానుక్రమమున విస్తరముగ విశేషించి చెప్పుము-అని కోరుచున్నాను.

ప్రశ్నవేత్తలలో శ్రేష్ఠుడును, మహామతియు అయిన బృహస్పతి ఈ విధముగా చక్కగా అడుగబడినవాడై పూర్వానుక్రమముగ ఇట్లు చెప్పెను.

బృహస్పతి ఇట్లు అనెను :

నాయనా! పుత్రా! న్యాయముగను, గంభీరముగను, ఉత్తమముగను నీవు వినయముతో అడిగిన ప్రశ్నకు ఉత్తరమును చెప్పెదను. ప్రకాశించు ద్యులోకము (ఆకాశము) నక్షత్రములు

గల ఆకాశమును, పృధివి, నక్షత్రములు, దిక్కులు, సూర్య చంద్రులు, రాత్రి పగళ్లు, ఇవి మొదట లేకుండెడివి. ఓ తండ్రీ! జగముఅంతయు చీకటియై ఉండెను. అచట ఒక బ్రహ్మచరింప అలవికాని, అతికఠినమైన తపము ఆచరించెను. ఇంతలో శంయువు ఎల్లప్పుడు వ్రతస్నాతుడును, సర్వజ్ఞానవేత్తలలో, బ్రహ్మవేత్తలలోను శ్రేష్ఠుడు అయిన తన తండ్రియైన బ్రహ్మను మరల ఇట్లు అడిగెను. సర్వభూతేశ్వరుడైన ప్రజాపతి (బ్రహ్మ) ఎటువంటి తపము చేసెను? అని అడిగెను. ఇట్లు అడుగబడిన మహాతేజస్వియైన బృహస్పతి పుత్రుడైన శంయువుతో ఇట్లు అనెను. అన్నితపముల యొక్క కలయిక తపోయోగము. అట్టి అతిశ్రేష్ఠమైన తపోయోగమున ధ్యానమున ధ్యానించుచు, ఆ యోగధ్యానముతో లోకములను (క్రిందుగా) సృజించెను. ఆ యోగమును ఆవేశించి యోగదృష్టితో భూత, భవిష్యత్, జ్ఞానములను, లోకములను, వేదములను చూచి సాంతానికములనెడి లోకములను సృష్టించెను. అచట ద్యులోకమున ప్రకాశించుచు వారు ఉందురు. వారు దేవతలలో వైరాజులని చెప్పబడు దేవతలు. అపుడు ముందే బ్రహ్మ తపస్సుతో యుక్తుడయ్యెను. ఆ బ్రహ్మ సనాతనమైన యోగమును అవలంబించి దేవతలను సృజించెను. వారు ఆదిదేవులని చెప్పబడిన మహాబలవంతులు మహాతేజోవంతులును, సర్వకామములను ఇచ్చువారు, దేవ, దానవ, మానవులచే పూజింపదగినవారు. వారు ఏడు గణములు. ఆ గణములు ముల్లోకముల పూజింపబడినవి. వానిలో మూడు గణములు అమూర్తులు (ఆకారము లేనివి). నాలుగు సుమూర్తులు (చక్కని ఆకారములు గలవి). పై చెప్పిన మూడు గణములు భావమూర్తులు (భావ రూపములు)గా ఉందురు. వీరు పైన ఉందురు. తక్కిన నాలుగు గణములు సూక్ష్మమూర్తులుగలవి. వారు భావ రూపులకు క్రింద ఉందురు. తరువాత దేవతలు, తరువాత భూమి, ఇది లోక పరంపర. ఈ లోకమున వారుందురు. వారివల్ల పర్జన్యుడు పుట్టును. వాని వలన వృష్టి కలుగును. ఆ వర్షముచే మరల లోకములు పుట్టును. ఆ దేవతలు యోగము వలన సోముని అన్నముచే సంతోషపెట్టుదురు. అందువలన వారిని పితరులు అని చెప్పిరి. కావున వారు లోకములకు లోకసత్తములు. వారు (పితరులు) మనోవేగము కలవారు, స్వధను భక్షించువారు, అన్ని కోరికలు కప్పుగా కలవారు, లోభ, మోహ, భయము తొలగి, నిశ్చింతులు, శోకమును వీడినవారు. వీరు యోగమును వదిలి సుదర్శనములగు లోకములను పొందినవారై దివ్యులు, పుణ్యులు, మహాత్ములు, పాపములు లేనివారును అగుదురు. తరువాత వేయియుగముల చివర బ్రహ్మవాదులు అగుదురు. మరల యోగమును పొంది అమూర్తులై మోక్షమును పొందుదురు. ఆకాశమున క్షీణించిన విద్యుత్ప్రభవలె, ఉల్కవలెను, వ్యక్తావ్యక్తమును వదిలి, మహాయోగ బలముతో నశిం తురు

(లయమగుదురు). దేహజాతములను వదిలి మహాయోగ బలముతో నదులు, సముద్ర మునందువలె నిరాఖ్యోపాఖ్యతను (నామముగాని, ఉపనామముగాని, లేని తనమును) పొందుదురు. క్రియచేతను గురు (గొప్ప) పూజలచేతను తమను సంతోష పెట్టిన వారిని, ఆ పితరులు వంశవర్ధనులై ఆపూజాది క్రియలచేతనే సంతోషపెట్టుదురు. శ్రాద్ధమున సోమమును త్రాగి పితరులు యోగమునందు ఉన్నవారై ఆ యోగముతో ముల్లోకమును సంతోషపెట్టుదురు. కాన ఆ ముల్లోకములు జీవించును. కావున శ్రాద్ధములను ఎప్పుడు ప్రయత్నించి యోగులకు ఈయవలెను. పితరులకు బలము యోగము. యోగము వలన సోమము ప్రవర్తిల్లును. శ్రాద్ధమున వచ్చిన వేలకొలది బ్రాహ్మణులను భుజింపజేయ వచ్చును. ఒక్క సంతుష్టుడైన యోగి వారందరితో (వేల బ్రాహ్మణులతో) సమానుడు అగును. దానిని వినుము.

వేవురు గృహస్థులకును, నూర్గురు వానప్రస్థులకును, వేవురు బ్రహ్మచారులకును, ఒక్క యోగి విశిష్టుడు అగును. నాస్తికుడు, వికర్ముడు, సంకరుడు, తస్కరుడు, మరొకడుగాని శ్రాద్ధదానమునకు తగడు. బ్రహ్మయోగము కలవారే శ్రాద్ధ దాన యోగ్యులు అని చెప్పినాడు. పుత్రుడుగాని, పౌత్రుడుగాని, యోగిని శ్రాద్ధమున భుజింప జేసినచో ఆ పుత్ర–పౌత్రులతో సువృష్టితో కర్షకులవలె పితరులు మిక్కిలి సంత సింతురు. యోగులుగాని, భిక్షువులుగాని లభించనపుడు ఇరువురు బ్రహ్మచారులను శ్రాద్ధమున భుజింపచేయవలెను. ఎవడు ఒంటి కాలిపై నిలబడి వాయువే ఆహారముగా కలవాడై నూరేండ్లు ఉండునోవాడు, ఉత్కృష్టుడైన యోగి–అని బ్రహ్మానుశాసనము. సిద్ధులు బ్రాహ్మణ రూపమున ఈ భూమిపై చరింతురు. కావున ఇంటికి వచ్చుచున్న అతిథిని చేతులు జోడించి ఎదుర్కొనవలెను. ఆతనిని అర్ఘ్యపాత్రతో (చేతికి నీళ్లిచ్చుట), వసతిని ఇచ్చుటతోను, భోజనము చేయించుట తోను పూజింపవలె. దేవతలైన ఈ యోగేశ్వరులు ప్రజలను ధర్మముతో బాలించుచు అనేక రూపములతో సముద్ర పర్యంతమైన భూమిపై ఎల్లప్పుడు సంచరింతురు. కావున నరుడు బ్రాహ్మణుడైన అతిథికి దానమీయవలె. ఇక ఆ దానములను వాని ఫలములను చెప్పెద వినుడు.

వేయి అశ్వమేధములకును, నూరు రాజసూయ యాగములకును, వేయి పౌండరీక యాగములకును యోగుల నివాసము శ్రేష్ఠము. అమితౌజస్కులైన పితరుల యొక్క మొదటి గణమిది చెప్పబడినది. ఏడు కాలములను భావించుచు ఈ గణము అప్పుడు ఉండెను. ఆ పైన మరల పితృగణముల గురించి చెప్పెదను. వారి సంత తిని, సంస్థితిని, భావనను వరుసగా చెప్పెదను. (10)

శ్రాద్ధ కల్పము

సూతుడు ఇట్లు అనెను :

మేధావంతులలో శ్రేష్ఠములైన పితృగణములు ఏడు. వారిలో నాలుగు మూర్తి మంత ములు. మూడు అమూర్తములు. వారి కూతుళ్ళు, కూతుళ్ల పుత్రులును, ధర్మమూర్తిని ధరించిన వారును మూడు శ్రేష్ఠములైన గుణములు, వారి పేరులను, లోక సృష్టిని సంగ్రహముగా చెప్పుచున్నాను. విరజసములనునవి లోకములు. అచట ప్రకాశ మాన ములును, అమూర్తములైన పితృగణములు ఉండును. వారు ప్రజాపతి యొక్క పుత్రులు. విరజుని యొక్క శ్రేష్ఠులైన పుత్రులు ద్విజులు (బ్రాహ్మణులు) వైరాజులు అని ప్రసిద్ధులు. ఇది వైరాజుల మొదటి కల్పము అని చెప్పబడినది.

ఆ పితరుల యొక్క మానసపుత్రి "మేన" అను ఆమె. ఆమె మహాగిరి అయిన హిమవంతుని పవిత్రమైన భార్య. ఆ మేనయందు మైనాకుడు జనించెను. ఆ మైనాకుడు (పర్వతము) సమస్త ఔషధుల ధరించువాడు, సమస్త రత్నములకు నిధియైన స్వరూపము కలవాడు. శ్రేష్ఠమై పవిత్రమైన క్రౌంచపర్వతము ఆతని పుత్రుడు అయ్యెను. శైలరాజైన హిమవంతుడు మేనయందు ముప్పుర కన్యలను కనెను. వారు–అపర్ణ, ఏకపర్ణ, మూడవది ఏకపాటల. చివరి ఇరువురు చెట్లను ఆశ్రయించియు, అపర్ణ ఏ నివాసము లేకయు తప మును ఆచరించిరి. ఏకపర్ణ మఱ్ఱిచెట్టును ఆశ్రయించి తపము చేసెను. ఏకపాటల, పాటల వృక్షమును (కలిగొట్టు చెట్టును, ఎఱ్ఱ వరి చెట్టును) ఆశ్రయించి తపము చేసెను. ముప్పురును లక్ష యేండ్లు తపము ఆచరించిరి. ఏకపర్ణి ఒకే పర్ణమును (ఆకును) ఆహారముగా తీసికొనెను. ఏకపాటల ఒకే పాటల పుష్పమును ఆహారముగ తీసికొనెను. ఏకపర్ణి నిండు రెండువేల యేండ్లు ఈ ఆహారమును తీసికొని తపముచేసిరి. మొదటిఆమె నిరాహారముగా ఉండెను. అపుడు తల్లి ఆమెతో ఇట్లు అనెను. ఉ–మా (ఓయీ! వలదు) అని తపమును నిషేధించుచున్నదై తల్లి ప్రేమతో దుఃఖితురాలు అయ్యెను. ఆ విధముగా తల్లితో చెప్పబడినదయ్యును, దేవి దుశ్చర్యమైన తపము ఆచరించుచునే ఉండెను. అపుడు ఆ మహాభాగ్యవంతురాలగు ఆ దేవి 'ఉమ' అని ముల్లోకములలో ప్రసిద్ధురాలు అయ్యెను. అట్లే ఈ పవిత్రురాలైన ఉమాదేవిని తల్లి ప్రేమతో 'తపము వలదు' అని నిషేధించుటచే (ఈ నిరుక్తిచే) 'ఉమ' అను పేర పిలువబడినది. ఈ ముప్పురు కూతుళ్లకు సంబంధించినదై, జగము శాశ్వతముగా ఉండకలదు. వీరి తపముచే భూమి ఉన్నంత వరకు జగము శాశ్వతము అగును. తపః శరీరులైన ఆ ముప్పురు మొత్తము యోగబలముతో కూడినవారు. ఆ

ముప్వురు మహాభాగ్యవంతులైన దేవులు స్థిరమైన యౌవనము కలవారు. వారందరు బ్రహ్మవాదినులు (బ్రహ్మను చెప్పువారు). వారందరు ఊర్ధ్వరేతస్కులు. వారిలో ఉమ, వరిష్ఠ, శ్రేష్ఠురాలు, ఉత్తమురాలు. మహాయోగబలముతో కూడినదై, మహాదేవుని (శివుని) చేరినది. ఆమె దంతకాణ్వోశన, ఆమె కుమారుడు భృగునందనుడు (శుక్రుడు). (రుద్ర రేతస్కున పుట్టినవాడు శుక్రుడు) ఏకపర్ణి అసితుని ధర్మపత్ని దృఢవ్రతురాలు, సాధ్వి. యోగా చార్యుడును, ధీమంతుడును అయిన ఆ అసితునకు హిమవంతునిచే ఈయబడినది. ఆమె మానస సుతునిగా బ్రహ్మిష్ఠుడైన దేవలుని కనెను. వీరిలో మూడవ కుమార్తియైన 'ఏకపాటల' శతశిలాకుని పుత్రుడైన జైగీషవ్యుని చేరినది. ఆతనికి గూడ అయోనిజ పుత్రులు ఇరువురు శంఖ, లిఖితులనబడిరి, ఇవ్వీరు మహాభాగ్యవతులు పవిత్రులు అయిన హిమవంతుని కన్యలు. రుద్రాణియైన ఆమె సర్వశ్రేష్ఠురాలుగా తన గుణములచే మించినది. ఈ ఉమా శంకరుల అన్యోన్య ప్రేమ ఇట్టిది. కలిసికొన్న ఉమాశంకరుల కలయికను దెలిసి ఇంద్రుడు శంకితుడు అయ్యెను. మిథునకార్యములో కలిసికొన్న ఉమాశంకరులకు సంతానము కలుగునని భీతిచెందిన ఇంద్రుడు అగ్నిని వారు ఇరువురి కడకు పంపెను. "ఓ అగ్నిదేవా! ఈ ఉమాశంకరుల యొక్క రతికి విఘ్నము చేయుము. అంతట నీవు ఉండువాడవు కావున అప్పుడు నీకు దోషముండదు'అని ఈ విధముగా ఇంద్రుడు చెప్పగా అగ్ని అట్లే చేసెను. అపుడు శంకరుడు ఉమాదేహమును వదలి తన శుక్రమును భూమియందు వదిలెను. ఓ శాంశపాయనా! దాని వల్ల కోపించిన ఉమాదేవిచేత అగ్నిదేవుడు శపింప బడెను. కోపముచే బొంగురు పోయిన మాటతో ఆమె అగ్నిని ఇట్లనెను : ఓ అగ్నీ! ఓ దుర్మతీ! నేను తృప్తి చెందకుండగనే రతికి విఘ్నముచేసి నీవు చేయకూడని దానిని చేసితివి. మహాప్రభావవంతమైన రుద్రుని శుక్రము ఈ విధముగా (నాయందు) గర్భము ధరింపలేదు. కావున నా శివశుక్ర గర్భమును నీవే ధరింపుము. ఇదియే నీకు శిక్ష అని అనెను. ఓ బ్రాహ్మణులారా! రుద్రపత్ని యొక్క శాపకోపమున అగ్ని బహుసంవత్సర గణములు గర్భమును ధరించెను. అపుడు గంగను సమీపించి ఇట్లు అనెను–ఓ గంగానదీ శ్రేష్ఠురాలా! వినుము. గర్భమును ధరించిన కారణమున నాకు మిక్కిలి బాధగా నున్నది. నా హితమునకై ఈ గర్భమును నీవు ధరింపుము. ఓ గంగానదీ! నా అనుగ్రహమున నీకు తక్కువ బాధ కలుగును. ఆ మహానది గంగయు "అట్లే" అని మిక్కిలి సంతుష్టురాలు అయ్యెను. దహింప బడుచున్న చిత్తముతో ఆగర్భమును ధరించెను. ఆమె కూడ మిక్కిలి కష్టముతో బాధపడు చున్నదై చాలకాలము ఆ మహాగర్భమును ధరించుటలో తత్పరురాలు అయ్యెను. గంగ, ఆగర్భమును హిమవత్పర్వ తపు గర్భమువలె ఉండి, పుష్పించిన వృక్షములతో చిత్రమైన

శరవణమను (రెల్లుగడ్డి వనము) చోట వదిలెను. అది మండుచున్న అగ్నివలె ఉండెను. అచట రుద్ర, అగ్ని, గంగల తనయుడు ఎఱ్ఱని కాంతిగలవాడై పుట్టెను. ఆతడు నూరు సూర్యులతో సమానమైన కాంతిగలవాడు, మహాతేజస్వి, ప్రతాపవంతుడును. ఆ మహాభాగ్య వంతుడు గంగాసుతుడు అయిన కుమారుడు పుట్టగనే ఆకాశము విమానయానముగల దేవతలచేత పక్షులచేత ఆక్రమింపబడినట్లు ఆవరింపబడినది. ఆకాశమున దేవదుందుభులు మధుర స్వరములతో మ్రోగినవి. ఆకాశమున చరించు సిద్ధులు చారణులును పుష్ప వర్ష మును కురిపించిరి. అచ్చటచ్చట అంతటను గంధర్వులు మొదలుగ యక్షులు, విద్యాధరులు, సిద్ధులు, కిన్నరులును గానములుచేసిరి. వేలమహానాగులును, శ్రేష్ఠులైన పక్షులును, శంకర పుత్రుడును అగ్నిపుత్రుడు అయిన కుమారస్వామిని సమీపించిరి. ఆ ప్రభావముతోనే దైత్యులు, దానవులు, రాక్షసులును చేరిరి. పై అందరికన్న ముందే గంగా స్నానమునకై వచ్చిన అరుంధతి దక్క తక్కిన సప్తర్షి భార్యలగు షట్ కృత్తికలచేత ఈ కుమారుడు చూడ బడెను. వారు ఆ బాలునియందు ప్రేమగలవారై బాలసూర్యుని వలె మెరయుచున్న ఆరుద్రపుత్రుని స్వమాతలవలె చుట్టుకొనిరి. అప్పుడు ఆ గంగాసుతుడు వారి ప్రేమచే శ్రీమంతుడై మహాతేజస్వియై వారందరిని ఒక్కమారు చూడగోరి, ఆరు ముఖములు గలిగి షణ్ముఖుడు అయ్యెను. శ్రీమంతుడు కమలపత్రముల పోలిన కన్నులుకలవాడు, లేతసూర్యుని వలె ఉన్నవాడును అయిన ఆ కుమారుడు పుట్టి, తన తేజస్సుతో లోకములను అన్నింటిని కప్పివైచెను. ఆ గొప్పవాడు పుట్టుటచే దేవతలను సహించని దానవ గణములును శోషిత ములు అయ్యెను. కావున ఆ ప్రతాపవంతుడు స్కందుడు అయ్యెను. షట్ కృత్తికలచే సంవర్ధితుడై నందున నా పురాతనుడు, రాక్షసహంత కార్తికేయుడు అయ్యెను. రాక్షస శత్రువైన ఆ కుమారుడు ఆవులించుటచే ముఖమున జ్వాలామాలలు ఆకులమయ్యెను. అందుండి తన అపరాజితాశక్తి బయలు వెడలినది. స్కందుడు ఆడుకొనుటకై సర్వసమర్థు డైన విష్ణువు గరుడుని వల్ల మంగళకరమైన రెండు పక్షులు సృష్టించెను. ఒకటి మయూరము (నెమలి) రెండు కోడి, వాయువుచే పతాకము (జెండా) ఈయబడినది. సరస్వతిచే మంచి గొప్ప ధ్వనిగల వీణఈయబడినది. బ్రహ్మచే మేక ఈయబడినది. శంభునిచే గొఱ్ఱె పొట్టేలు ఈయబడినది. ఓ బ్రాహ్మణులారా! మాయా విహారమున క్రౌంచపర్వతము, బాగా విజృం భించిన అసురశ్రేష్ఠుడైన తారకాసురుడు అను రాక్షసుడు ధ్వంసముచేయగా ఇంద్ర-ఉపేంద్రులతో కూడిన మహాభాగ్యవంతులై దేవతలు అగ్నిసుతుడై ప్రభువై ప్రతాప వంతుడైన కుమారస్వామిని సేనాపత్యమున అభిషేకించిరి. దేవ శత్రువులను శోషింపచేయువాడు, సర్వ లోకములకు ఈశ్వరుడు, ప్రభువు, స్కందుడు అయిన నరనాయకుడు కుమారస్వామి ఈ విధముగా దేవసేనాపతిగా పంపబడినాడు.

ఆ కుమారుడు ప్రమథ గణములచేతను, అనేక దేవతలచేతను, భూత గణముల చేతను, వివిధ మాతలచేతను, వినాయక గణములచేతను సేవింపబడెను.

ఆమె (పితృకన్య గంగ) ఆకాశము నుండి జారిపడుచున్నదై త్రసరేణు ప్రమాణము లైన విమానములను చూచెను. వానిలో జారిపడిన పితరులను చూచెను. వారు సుసూక్ష్మలు అపరిత్యక్తులు (వదలబడనివారు) అగ్నులలో ఉంచబడిన అగ్నులవలె ఉన్నవారు. వారిని తలక్రిందుగా పడుచున్న ఆమె రక్షించుడు అని అడిగెను. వారిచే భయపడకుము అని చెప్ప బడినదై పైననే నిలచి ఉండెను. తరువాత ఆమె దీనమైన మాటలతో ఆ పితరులను అను గ్రహించువారిగా చేసికొనెను. ఆ పితరులు వ్యతిక్రమము వలన (క్రమము దప్పినందు వలన) ఐశ్వర్యను జారవిడుచుకొన్న ఆ కన్యతో ఇట్లు అనిరి–ఓ శుచియై చిరునగవు గలదానా! తపమునందలి నీ దోషముచే నీవు ఐశ్వర్యమును కోల్పోయితివి. ఇట దేవతలచే ఏ శరీరములచే కర్మలు చేయబడునో ఆ దేవతలు ఆ శరీరములతోనే కర్మఫలములను ఇచట అనుభవింతురు. దేవత్వమున కర్మలు వెంటనే ఫలించును. మనుష్యత్వమున మర ణించిన తరువాత కర్మలు ఫలించును. కావున మరణించిన తరువాత అమావసుని అపత్యముగా (సంతానముగా) ఫలమును పొందగలవు. ఈ విధముగ చెప్పబడిన ఆమె పితరులను మరల కొంత అనుగ్రహించుటకు వేడుకొన్నది. పితరులు కూడ కొంచెము ధ్యానించి దయతో అనుగ్రహించిరి. సోమపానము చేయు పితృదేవతలు రాజైన 'అమావసు' యొక్క అవశ్యముగా జరుగబోవు భవిష్యత్తును చూచి ఈ కన్యతో ఇట్లు అనిరి. భూమిపై మానుషరూపమున పుట్టిన మహాత్మునకు కన్యవై తరువాత మరల నీ ఈ లోకమును చేరగలవు. పదునెనిమిదవ (మన్వంతరమున) ద్వాపరయుగమున ఈ అమావసురాజు వల్ల అద్రిక అను మత్స్యమునకు (మత్స్యయోనిజవై) కూతురుగా పుట్టెదవు. తరువాత మునివల్ల ఆతని భాగస్వామిగా వ్యాసుని జనింపజేయగలవు. ఆ బ్రహ్మర్షి (వ్యాసుడు) ఒక్కటిగా ఉన్న వేదమును నాలుగు వేదములుగా విభజించగలడు. మహాభిషుని మానవ రూపమైన శంతనునకు నీవు కీర్తి వర్ధనులైన ఇరువురు పుత్రులనుకనెదవు. అందులో విచిత్ర వీర్యుడు ధర్మజ్ఞుడు. చిత్రాంగదుడు తేజో, బల, గుణములతో కూడినవాడు. ఈ పుత్రులను కని మరల ఈ లోకములను చేరగలవు. పితరులకు క్రమము తప్పి నడచినందున కుత్సిత మైన జన్మను పొందగలవు. ఆ రాజునకే (అమావసునకే) అద్రికయందు జనించిన కన్యవు అయ్యెదవు. కన్యవై తరువాత ఈ లోకములను చేరగలవు. ఈ విధముగా చెప్పబడినదై దాశకన్య సత్యవతి అయ్యెను. అమావసునకు అద్రికయందు కూతురు పుట్టెను. గంగలో కలియుటలో అమావసునకు అద్రికామత్స్యమున పుట్టినది. ఆమె అమమావసు రాజుయొక్క

కన్య. ఆ రాజుయొక్క వీర్యముననే ఎల్లప్పుడు ఉన్నది. పితరులు ఉన్న ఆ లోకములు విరాజములు, అనులోకములు (విశేషముగ బ్రకాశించునవి)గా కీర్తిని పొందును. ఆ గణములు దివమున ప్రకాశించును. అచట అగ్నిష్వాత్తులు అను పితరులు ప్రకాశించు కాంతులతో ఉందురు. వారిని దానవ గణములు యక్షులు, రక్షస్సులు, గంధర్వులు, కిన్నరులు, భూతములు, సర్పములు, పిశాచములును ఫలము (ప్రయోజనము) లను కోరి ధ్యానింతురు (భావింతురు). వీరు పులహ ప్రజాపతి పుత్రులుగా చెప్పబడి నారు. వీరు ధర్మమూర్తుల ధరించి మంగళకరులై మూడు గణములుగా చెప్పుదురు. వీరి యొక్క మానసీ కన్య 'పీవరి' అని ప్రసిద్ధి చెందినది. ఆమె యోగిని, యోగపత్ని, యోగమాతయును అగును. ద్వాపర యుగమును పొంది, ఇరువది ఎనిమిదవ దైవముగా పరాశర కులమున పుట్టిన శుకుడను మహాతపస్వి రానున్నాడు. ఆతడు శోభావంతుడు, యోగి, మహాయోగి, యోగమాత అతనివల్ల పుట్టినది, బ్రాహ్మణోత్తముడు, పొగ వీడిన అగ్నివలె వ్యాసునివల్ల అరణియందు (యజ్ఞాగ్ని మథనమున) పుట్టెను. ఆతడు ఆ పితృకన్యయందు ప్రసిద్ధులైన యోగాచార్యులను, కృష్ణుని, తెల్లని ప్రభులైన శంభుని, అట్లే భూరిశ్రుతుని పొందెను. అణుహుని పట్టపురాణి బ్రహ్మదత్తుని తల్లి. ఆమె కీర్తిమతి అను కన్యనుకనెను. ఆమె యోగిని, యోగ మాతయును. ఈ పుత్రులను పుట్టించి, ధర్మాత్ముడైన ఆతడు యోగమును పొంది, మహాయోగ తపస్వియై, పునరావృత్తి లేని గతిని పొందెను. సూర్యకిరణములతో కూడి పునర్జన్మ లేనివాడై సర్వ వ్యాపియై అన్నింటి నుండి విముక్తుడై, ఆ మహాముని ఉండ గలడు. ధర్మమూర్తిధరులైన పితరులు అమూర్తిమంతులు. వారి గణములు ఈ మూడే! తక్కినవి నాలుగు వినుడు.

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! ఎవరిని నేను మహాప్రభావంతులైన మూర్తి మంతులు అని చెప్పెదనంటినో, వారు స్వధకును కవియైన అగ్నికిని కలిగిన కూతుళ్లైన కన్యలు. జ్యోతిస్సుతో ప్రకాశించునట్టియు, సర్వకామ సమృద్ధములైనట్టి దేవలోకములలో మహాకాంతి మంతులై మూర్తిమంతులై పితరులు ఉందురు. బ్రాహ్మణులు వారిని మనములలో భావించు చుందురు. వీరియొక్క మానసపుత్రి "గౌః" అనునది స్వర్గమున ప్రసిద్ధిచెందినది. కుమా రునిచే దత్తసేనయై శుక్రునకు ప్రియమైన భార్య అయినది. కిరణములు మధ్యన ఉన్నవియు కీర్తిని పెంచునవియు అయిన భృగువులయొక్క ఇరువదియొక్క లోకములు స్వర్గమున ఆవరించి ఉన్నవి. వీరు అంగిరసుని పుత్రులు. సాధ్యులతోబాటు పెంచబడి నారు. ఉప హూతులను ఆ పితరులు స్వర్గమున ప్రకాశింతురు. ఆ క్షత్రియ గణములను జూచి ఇష్ట ఫలములు కోరువారు వారిని మనస్సులో భావింతురు. వీరియొక్క మానసపుత్రి యశోద.

విశ్వమహానునకు ఆమె భార్య. విశ్వశర్మికి ఆమెకోడలు. మహాత్ముడైన ఖట్వాంగుడు అను రాజర్షికి ఆదేవి తల్లి. ఆ రాజర్షి యజ్ఞమున బ్రహ్మర్షులచే ఆతని గాథలు గానము చేయ బడినవి. అట్లే శాండిల్య గోత్రమున పుట్టి మహాత్ముడైన అగ్నియొక్క జన్మను చూచి ఎవరు సత్యవ్రతుడు, మహాత్ముడు, యజమానియు అయిన దిలీపుని ఏకాగ్రచిత్తులై చూతురో, వారు స్వర్గచేతసులైన అమరులు (దేవతలు). ఆజ్యపులను (నేయిద్రావు) వారును పితరులు పులహునివల్ల పుట్టిన కర్దమ ప్రజాపతికి మరల పుట్టినవారు. కామగములైన ఈ లోకము లందు విహంగములై (ఆకాశమున చరించువారై) ఉందురు. వీరిని వైశ్య గణములు ఇష్ట ఫలములను కోరినవారై శ్రాద్ధమున భావింతురు. (ధ్యానింతురు). వీరియొక్క మానస పుత్రి విరజయు ప్రసిద్ధిగాంచినది. ఆమె యయాతికి తల్లియైన సాధ్వి. నహుషుని యొక్క భార్య, సుకాలులను పితరులు వశిష్ఠ ప్రజాపతికి సంబంధించిన (పుట్టిన) వారు. హిరణ్య గర్భుని (బ్రహ్మ) పుత్రులైన శూద్రులు వారిని భావింతురు (ధ్యానింతురు). దివమున నుండు మానసములను లోకములలో వారు ఉందురు. వీరియొక్క మానసపుత్రి నదీ శ్రేష్ఠయైన నర్మదానది. ఆమె దక్షిణా పథమున బోవునదై ప్రాణులను భావించును. ఆమె త్రసదస్యునకు తల్లి. పురుకుత్సునకు భార్య, వీరియొక్క రాక వలన మన్వంతరేశ్వరుడు మన్వంతరాది యందు అంతటను తల్లియొక్క శ్రాద్ధములను ప్రవర్తింపజేయును. ఓ బ్రాహ్మణులారా! పూర్వానుక్రమముగా పితరులందరికిని శ్రాద్ధముల ప్రవర్తింపజేయును. కావున ఇచట స్వధర్మమును అనుసరించి శ్రద్ధగా శ్రాద్ధమును చేయవలెను. పితరులందరికై వెండి పాత్ర లతోగాని, వెండితో గూడిన పాత్రలతో గాని పురోహితునకు స్వధను ఈయవలె. అది పితరులను సంతోషపెట్టును. అగ్నికిని సూర్యునకును సోమము యొక్క ఆప్యాయనము చేసి, అగ్నియందు ఉదగాయనమును చేసినచో అశ్వమేధ (ఫల)మును పొందును. పితరు లను భక్తితో సంతోషపెట్టినచో పితరులు వానిని సంతోష పెట్టుదురు. పితరులు పుష్టిని కోరిన వానికి మరి సంతానమును కోరిన వానికిని పుష్టిని సంతానమును స్వర్గమును కూడ ఇత్తురు. సంశయము లేదు. ఎల్లప్పుడు దేవకార్యమున కంటె పితృకార్యము గొప్పది. దేవతలకంటె ముందుగనే పితరుల సంతోషపెట్టవలెనని చెప్పబడినది. (వారి) యోగగతి సూక్ష్మముకాదు. పితరుల యొక్క తృప్తులు గూడ తపముచే ప్రసిద్ధమైన మాంసచక్షువుతో చూడబడుచున్నవి అను ఈ పితరులు, వారి లోకములు, వారి పుత్రికలు, వారి పుత్రికా పుత్రులును, వారిని భావించి యజమానులును చెప్పబడిరి. ఆ ఏడింటిలో నలుగురు మూర్తిమంతులు, ముప్వురు అమూర్తులు. దేవతలు వారిని సత్కరించి, వారికి ప్రయత్న పూర్వకముగా శ్రాద్ధములు చేయుదురు. ఇంద్రునితో కూడిన భక్తులందరు తద్గత మనస్కులై పిత

రులకు చేతులు జోడించిన వారు అగుదురు. సమస్త సికతులును పృశ్నిజులును (కిరణముల పుట్టిన వారును), కొమ్ములు గలవారును, పితరులకు ప్రాంజలులు అగుదురు. కృష్ణులు, శ్వేతులు, అజులును, పితరులను విధి విధానముతో పూజింతురు. అట్లే దివాకీర్తియొక్క వాతరశను లైన ప్రజలును పూజింతురు. లేఖులు, మరుతులు, బ్రహ్మాది దేవలోక నివాసు లును, అత్రి, భృగు, అంగిరాదులగు ఋషులందరును పితరులకు చేతులు జోడింతురు. యక్షులు, నాగులు, సుపర్ణులు, రాక్షసులతోబాటు కిన్నరులు అందరును ఇష్ట ఫలములను గోరి నిత్యము పితరులను పూజించిరి. ఈ విధముగా ఈ మహాత్ములైన పితరులు శ్రాద్ధమున సత్కరించి పూజింపబడినవారై నూర్ల, వేల కోరికలను అన్నింటిని తీర్తురు. పితామహులైన పితరులు ముల్లోకముల సంసారమును, జరా-మృత్యువుల భయమును వదిలి యోగమయ ఐశ్వర్య రూపమూన మోక్షమును ఇత్తురు. సూక్ష్మదేహులై ఆ పితామహులగు పితరులు మోక్షోపాయమును, తరువాత ఐశ్వర్యమును, సమస్తమైన వైరాగ్యమును, ఆనంత్యమును (అంతములేనితనమును) ఇత్తురు. ఐశ్వర్యమే విహితమైన (వేదోక్తమై మిక్కిలి తగిన) యోగము. ఐశ్వర్యమే ఉత్తమమైన ధనము. యోగైశ్వర్యములేక మోక్షము ఎట్లైనను రెక్కలు లేని పక్షికి ఆకాశమున గమనము కుదరనట్లే అసంభవము. సర్వధర్మములలో మోక్షము సనాతనమై వరిష్ఠము. పితరులు అప్సరోగణములతోగూడి సర్వకామ ప్రసిద్ధములైన వేలవిమానములను ఇత్తురు. పితరుల అనుగ్రహమున మహాత్మునిచేత ప్రజ్ఞ, పుష్టి, స్మృతి, మేధ, రాజ్యము, ఆరోగ్యమును పొందగలరు. పితరులు ముత్యములను, వైడూర్య, రత్న ములను, వస్త్రములను (ముత్యములు, వైడూర్యములు పొదిగిన వస్త్రములను), లక్షల గుఱ్ఱములను ఏనుగులను, కోట్ల రత్నములను ఇత్తురు. పితరులు హంసలతో నెమళ్లతోను, కూడినవియు, ముత్యములు వైడూర్యములును కలవియు, చిరుగంటలతో జోడించినవియు అయిన ఆభరణములను, పూవులను, పండ్లను సంతోషముతో ఎల్లప్పుడును ఇత్తురు.(11)

శ్రాద్ధ కల్పము

బృహస్పతి ఇట్లు అనెను :

పితరులకు బంగారు పాత్రగాని, వెండిపాత్రగాని ఉపయోగించవలెను. వెండిది గాని వెండితోకూడినదిగాని అయినపాత్ర పితరులకు శ్రేష్ఠము. పితరులకు వెండిని చూపుట కాని, దానము చేయుటగాని అక్షయమైన స్వర్గము నిచ్చును. ఈ దానము చేత సత్పుత్రులు పితరులను తరింపచేయుదురు. పూర్వము స్వధాభాగమును కోరు పితరులు వెండిపాత్రలో స్వధను చిలికిరట. కావున దానిని ఇచ్చినచో అది అక్షయము అగును. కృష్ణమృగ చర్మమును

శ్రాద్ధమున సమీపము అనుసరించినను, దానిని చూపినను, దానిని దానము చేసినను అది రాక్షసులను చంపును, బ్రహ్మ వర్చస్సును ఇచ్చును, అది పితరులను తరింపచేయును. బంగారము, వెండి, రాగి–వీని వస్తువులు, మేనల్లుడిని (కూతురు కొడుకును) భోక్తగా పిలుచుట, దర్భలు, నూవులు, వసతియోగ్యమైన ఇల్లు, పానీయములు (గవ్యములైన పాలు, పెరుగు, నేయి మొదలగునవి). మనో, వాక్, కర్మ దండములు, యోగము, శ్రాద్ధ కర్మలో ఇది సనాతనమై బ్రాహ్మ్యమైన విధి. ఇది ఆయువును, కీర్తిని, సంతతిని వర్ధిల్ల జేయును. దక్షిణ–పూర్వ (తూర్పు) మధ్య దిక్కైన ఆగ్నేయ దిక్కున విశేషించి అంతటను (నలువైపుల) పిడిమూర చతురస్రస్థానము పితరుల స్థానముగ కూర్పబడినది, పితరుల ఆజ్ఞవలన ఆ స్థానమును శాస్త్రీయముగా చెప్పెదను. అది ధన్యమైనది, ధనమును ఇచ్చునది, ఆరోగ్యమును ఇచ్చునది. ఆయుష్యమును ఇచ్చునది, బలమును పెంచునది. అచట మూడు గుంటలు చేయవలెను. పిడిమూరెడు పొడవైన మూడు చంద్రచెట్టు దండములను వెండిచే అలంకరింపవలెను. అవి పంద్రెండు అంగుళముల పొడవుగా ఉండవలెను. అంతటను నాలుగు అంగుళములుగలవై ఉండవలెను. అవి రంధ్రములు లేనివై భూమిపైన ఆగ్నేయ ముఖముగా ఉంచి తాను శుచియై దర్భలతో పవిత్రమైన నీటిచే తడుపవలెను. వాక్కులతో (మంత్రములతో) శోధనము చేసిన మేకపాలతోగాని, ఆవుపాలతోగాని ఎల్లప్పుడు తర్ప ణము చేయుటవలన పితరులకు శాశ్వతమైన తృప్తి కలుగగలదు. త్రిషవణమున (ప్రాతర్మ ధ్యాహ్న సాయం కాలములందు) స్నానముచేసి మంత్రముతో శాస్త్రీయముగా పితరులను అర్చించినవాడు ఈ లోకములోను పరలోకములోను ఎల్లప్పుడు శ్రీమంతుడై సర్వకర్మల తోకూడి చక్కగా అశ్వమేధ యజ్ఞఫలము అందును. భూమిపై నాలుగు అంగుళముల లోతుగల గుంటలో అమావాస్యను స్థాపించవలెను. ఆ యజ్ఞములు ఇరువది యొక్క పేరులు గలవి. వానిచేత ముల్లోకములు తరింపబడును. ఆ విధముగచేసిన వానికి ఐశ్వ ర్యము, ఆయువు, సంతానము, విచిత్రయైన లక్ష్మి చివరకు మోక్షముగూడ క్రమముగా లభించును. కావున పాపములను పోగొట్టునది, పవిత్రము చేయునది, అశ్వమేధ ఫలము కలది, పితరుల మంత్రము. ఆ విధముగ అశ్వమేధ ఫలముగల ఈ మంత్రము బ్రాహ్మణు లచే సత్కరించి పూజింపబడినది. అందువలన బ్రహ్మ నిర్మితమై అమృతమైన ఆ మంత్ర మును నేను చెప్పెదను. ఆ మంత్రము "దేవతాభ్యః పితృభ్యశ్చ మహాయోగిభ్య ఏవ చ। నమః స్వధాయై స్వాహాయై నిత్యమేవ భవంత్యుత॥" అనగా మహాయోగులై దేవతలైన పిత రులకును స్వధకును, స్వాహాకును నిత్యము నమస్కారము చేయుదునుగాక అని శ్రాద్ధము యొక్క ప్రారంభమునను, చివరను ఎప్పుడు మూడుమారులే మంత్రమును జపింపవలెను.

పిండముల నిర్వాపణము నందు గూడ ఏకాగ్రమనస్కుడై ఈ మంత్రమును జపింపవలెను. దీనివలన పితరులు వెంటనే వత్తురు. రాక్షసులు పారి పోవుదురు. శ్రాద్ధమున ఎల్లప్పుడును నియతముగా (నియమబద్ధముగా) బ్రహ్మవాదులచే పఠింపబడు ఈ మంత్రము ముల్లోకము లందు పితరులను తరింపజేయును. రాజ్యకాము ఈ మంత్రమును ఏమరు పాటులేక ఎల్లప్పుడు జపింపవలెను. వానికి వీర్యము, శౌచము, ధనము, సత్త్వము, సిరి, ఆయువు, బలమును వర్ధిల్లును. ఏ మంత్రముచేత పితరులు నియతముగ ప్రీతులగుదురో! సర్వకామ ప్రదమై, శుభమై సప్తార్చిషమైన ఆ మంత్రమును చెప్పెదను. యోగనేత్రముతో ధ్యానులైన ఆ పితరులకు నమస్కారము. ఇంద్రాదులకును, సప్తర్షులకును, పితరులకును పుట్టించు వారైనవారు భృగు–మారీచులు. కోరికలను అనుగ్రహించువారికి, నమస్కరింతును. మన్వాదులకును, దేవేంద్రులకును, సూర్యచంద్రులకును కుశలదాయకులైన ఆ పితరులు అందరికిని నమస్కరింతును. చరాదులైన నక్షత్రములకును, ద్యావా పృథ్వులకును (భూమ్యా కాశములకును), పితృపితామహులైన పితరులకును, చేతులు జోడించి నమస్కరింతును. దేవర్షులను పుట్టించిన వారును, సర్వలోకములచే నమస్కరింపబడిన వారును, ఎల్లప్పుడును అభయమును ఇచ్చువారునైన ఆ పితరులకు చేతులు జోడించి నమస్కరింతును. ప్రజాపతి యైన కశ్యపునకు సోమునకును, వరుణునకును, యోగయోగేశ్వరులకును చేతులు జోడించి నమస్కరింతును. ఏడు లోకములందలి ఏడు పితృగణములకును, స్వయంభువై యోగనేత్రు డైన బ్రహ్మకు నమస్కారము. ఇప్పుడు చెప్పబడిన మంత్రము సప్తర్షి బ్రహ్మర్షి గణములచే పూజింపబడినది. పవిత్రమైపరమమైనది. శ్రీమంతమై రక్షోవినాశకరమైనది. ఈ విధితో యుక్తుడైననరుడు మూడు వరములను పొందును. వానికి పితృదేవతలు భూలోకమున అన్నమును, ఆయువును, పుత్రులను ఇత్తురు. పరమభక్తితోగూడి, శ్రద్ధగలవాడై, జితేంద్రి యుడై ఎవడు నిత్యమును ఏకాగ్రచిత్తుడై ఈ సప్తార్చిషమును 21నుండి 27వరకు శ్లోకము లతో చెప్పబడిన దానిని జపించునో, వాడు సప్త ద్వీపములుగల భూమియందు ఒకే రాజు అగును. ఆ పితరుల యాయతనమున (నివాసమున్న ఇంట) ఏ భక్ష్య భోజ్యములు వండినను ఎల్లప్పుడును ఆ పితరులకు నివేదింపక భుజింపరాదు. ఈ తరువాత బలి పాత్రముల చెప్పె దను. ఏయే బలిపాత్రకు ఏఏ ఫలములో నా నుండి వినుడు. (12)

శ్రాద్ధకల్పము

బృహస్పతి అనెను :

మోదుగుచెట్టు బ్రహ్మ వర్చస్సు ఇచ్చునది. అశ్వత్థము (రావిచెట్టు) నందు రాజ్య భావన (రాజసంబంధి భావనను) చేయవలెను. జువ్విచెట్టునందు సర్వ భూతాధిపత్యము

నిత్యముగా ఉండును. బలమును, బుద్ధిని, ప్రజ్ఞను, ధైర్యమును స్మృతిని కోరి మణ్టిచెట్టును భావింపవలెను. గుమ్మడుచెట్టుపాత్ర రక్షస్సుల చంపునదిగను, కీర్తిని ఇచ్చునదిగను చెప్ప బడినది. లోకమున మధుకము (తిప్పతీగయందు లేదా విప్పచెట్టు) నందు ఉత్తమ సౌభా గ్యము చెప్పబడినది. ఫల్గు పాత్రయందు (కుక్కమేడిచెట్టు పాత్ర యందు) శ్రాద్ధము చేయు వాడు అన్ని కోరికలను పొందును. రథమున (నెమ్మిమ్రాని) -ప్రబ్బలి పాత్రయందు పరా ద్యుతిని ప్రాకాశ్యమును ఇచ్చును. అట్లే బిల్వ వృక్షమున లక్ష్మి, మేధ, ఆయుష్యమును లభించును. వేణు (వెదురు) పాత్రలలో శ్రాద్ధము చేయువానికివాని పొలములందు, తోటలందు, చెరువులందు అన్ని పంటలయందును పర్జన్యుడు వర్షమును కురియును. ఈ మంచి పాత్రలయందే ఒక్కమారైనను ఆగ్రయణమును (వర్షాకాలము చివరన అగ్ని హోత్రమున సోమరసమను హోమము చేయుట) ఇచ్చినవారు ఈ లోకమున అన్ని యజ్ఞ ముల ఫలములను అందుదురు-అని చెప్పబడినది. పితరులకు సుగంధ మాలలను ఇచ్చువాడు సిరితో గూడినవాడై సూర్యుడై అంతట ప్రకాశించును. తేనెతోను నేతితోను కూడిన గుగ్గులు మొదలగు ధూపములను పితరులకు ఇచ్చినవాడు అశ్వమేధ ఫలము నందును, గంధగుణముతో కూడి మనోహరమయిన ధూపమును పితరుల యందు తత్పరతతో ఏమరుపాటుతో ఇచ్చువాడు ఇహపరములలో స్త్రీలయందు సంతానములను పొందును. నియతుడై పితరులకు దీపము ఇచ్చువాడు లోకమున ఎల్లప్పుడును శుభమైన సాటిలేని నేత్రమును పొందును. తేజముతోను, కీర్తితోను, కాంతితోను, బలముతోను, భూమిలో ప్రకాశించును. స్వర్గమునగూడ తేజరిల్లును. అప్సరసలతో చుట్టబడి విమానా గ్రమున సంతసించును. నియమముగలవాడై శుచియై గంధపుష్పములను, ధూపములను, ఆజ్యాహుతులను ఇచ్చి, ఫలమూలము ఇచ్చియు మొదట నమస్కరించి అన్నసంపదతో శ్రాద్ధకాలమున పితరులను పూజించిన వారికి, పితరులు వాయుభూతులై ఎల్లప్పుడు ఆవేశింతురు. అందువలన నీకుచెప్పుచున్నాను. వస్త్రములతోను, అన్నములతోను, ప్రదానములతోను, భక్ష్యముల తోను, పానీయములతోను, గోవులతోను, గుఱ్ఱములతోను, గ్రామములతోను ఆ బ్రాహ్మణోత్తములను పూజింపవలెను. కావున అన్నముతో బ్రాహ్మణ సత్తములను విధిగా పూజింప వలెను. బ్రాహ్మణుడు ఏమరుపాటులేక సవ్య-ఉత్తర హస్తములతో (కుడి, ఎడమ చేతులతో) శ్రాద్ధకర్మలో ఉల్లేఖనము చేయవలెను. అట్లే ప్రోక్షణము చేయవలెను. దర్భలను, పిండములను, భక్ష్యములను, వివిధ పుష్పములను, గంధదానమును, అలంకారమును క్రమముగా ఒక్కొక్కటినే ఈయవలెను (పితరులకై పిలిచిన బ్రాహ్మణులకు ఈయవలెను). జనమును బాగుగపోషించి ప్రతి బ్రాహ్మణుడును శ్రేష్ఠుడు అగును. అభ్యంగ, దర్భ, పంజాలముల మూటిచేతను యథావిధిగ శ్రాద్ధమును

జేయవలెను. పితరులకై అపసవ్యము (జందెమును ఎడమ చేతి క్రిందికి) వేసికొని శ్రేష్ఠమైన అన్నము నీయవలెను. దానిని ఉచ్చరించి తరువాత అందరికిని వస్త్రార్థముగా సూత్రమునే ఈయవలెను. ఖండనము, పోషణము, ఉల్లేఖనము–ఇవి దేవతలకు ఒక్కమారే చేయవలెను. పితరులకు మాత్రము మూడు మారులు చేయవలెను. చేతితో ఒక దర్భను (భూమిపై) ఉంచవలెను. దానిపై పితరులను అందరిని (పితృ–పితామహ–ప్రపితా మహులను) ఒక్కొక్కరినే ఉంచవలెను. చైల మంత్రముతో పిండములకు శాస్త్రమున చెప్పబడిన వస్త్రాది కమును ఈయవలెను. ఎల్లప్పుడు నెయ్యి, నువ్వులతో కూడిన మూడు పిండములను కుడి మోకాలును భూమియందు ఉంచి పితృపరాయణుడై భూమియందు ఉంచవలెను. శ్రద్ధగా అపసవ్యము జేసికొని, ప్రాచీనులైన పితరులను, పితామహులను, ప్రపితా మహులను, పేరు పేరున పిలిచి, పితృతీర్థముతో పిండములను ఉంచవలెను. అన్నము చేతను, జలములచేతను, పుష్పములచేతను, వేరు వేరు భక్ష్యముల చేతను మాతామహులకు వేరుగా నైవేద్యము చేయవలెనని కొందరు మానవులు తలంతురు. జాన్వంతర స్థితులతో అంగుష్ఠములతో గూడి పుష్టివర్ధనములైన మూడు పిండములను పూర్వానుక్రమమున వరుసగా ఈయవలెను. కుడి, ఎడమ చేతులతో ధర్మమున మంత్రమున ఆవ్యతిక్రమ ముందును. "సూక్ష్మలైన పితరులగు మీకు నమస్కారము" అని శ్రద్ధతో చేతులతో దక్షిణ దిక్కున పిండమును వదలవలెను. "సౌమ్యులగు పితరులైన మీకు నమస్కారము" అని చదువుచు పిండమును వదలవలెను. క్రొత్తదైన క్షేమసూత్రమును ఈయవలెను. ప్రత్తితో చేయబడిన ఎఱ్ఱని దారముచే నేయబడిన వస్త్రమును ఈయవలెను. పత్రోర్ణమైన నార వస్త్రము దారము పితృసూత్రముగా ఈయవలెను. పట్టువస్త్రపు దారమును ఈయరాదు. అహత వస్త్రజమైనను అనగా క్రొత్త వస్త్రపుదైనను యజ్ఞమున దాని కొంగును వాడరాదు. అట్లే ఇవి పితరులను సంతోషపెట్టవు. అది దాతయొక్క సంతోషమునే కలుగజేయును. కాని పితరులను సంతసింప జేయదు. త్రికూట పర్వతము నందలి అంజనము (కాటుక) శ్రేష్ఠమందురు. అది నిత్యమని అందురు. నల్లనూవులనుండి భద్రముగా తీయబడిన తైలము శ్రేష్ఠము. చందన–అగురువులు రెండును, తమాల (చీకటి చెట్టు), ఉశీర (వట్టివేరు), పద్మకము (మెట్టతామర)లతోడి ధూపము, గుగ్గుల ధూపము, తురుష్క (చిల్లమడ్డి) ధూప మును శ్రాద్ధమునకు శ్రేష్టములు. అట్లే తెల్లని పూవులు పద్మ–ఉత్పలములు, గంధవంతములై తగిన తక్కిన పూవులన్నియును శ్రేష్టములు. భండీ (మంజిష్ఠ), రూపకామ (రూపముతో మనోహరములైన) – కురండకములు (పచ్చగోరంట) అయిన సుమనసములు (పూవులు) జవములు (వేగముగా వాసనలవెదజల్లునవి)–ఈ పూవులు శ్రాద్ధకర్మలలో నిత్యము వదిలి

వేయదగినవి. ఐశ్వర్యమును కోరువాడు గంధములేని పూవులను కొద్ది గంధముగల పూవులను శ్రాద్ధమున వదిలివేయవలెను. వెదకి తీసికొని వచ్చిన శ్రాద్ధ బ్రాహ్మణులు నియతులై ఉత్తరముఖులుగా ఉండవలెను. వారిని శాస్త్రోక్తముగ దక్షిణాభిముఖుడై యజమాని పూజింపవలెను. బ్రాహ్మణుల కభిముఖుడై దర్భలను పిండములను ఈయవలెను. ఈ విధితో తన పితరులను సాక్షాత్తుగా అర్చింపవలెను. హరితులు, బంగారు వన్నెకలవారు. పూవులవలె నునుపైనవారు, ఏకాగ్రమనస్కులు, పిడిమూరెడు (హోమమునందు) దానము చేయుటచే పితృతీర్థముతో ఉన్నవారు. ఉపమూలము నీలులు, ప్రస్తరాద్యి కులము నుండి వచ్చినవారు, శ్యామాకనీవారధాన్య రూపులు అయిన పితరులు వారింప అలవికాని వారు. పూర్వము చెప్పబడిన ప్రజాపతి శ్రేష్ఠుడుగా ఉండెను. అతని వాలములు (తల వెంట్రుకలు) ఆకాశ మార్గము నుండి భూమిపై పడినవి. కావున ఆకాశముతో సమానమైనవై పవిత్రములైన వానినే శ్రాద్ధకర్మలో పూజింపవలెను. ఐశ్వర్యముకోరువాడు వానియందు పిండ నిర్వాపణము చేయవలెను. సంతానము, పుష్టి, కాంతి, కీర్తియు కల్గును. సంతానము కాంతితో కూడినది అగును. ప్రజలు పాపములేనివారై నిత్యము ప్రకాశవంతులగుదురు. పిండములకై ఒక్కమారే దర్భలను దక్షిణాభిముఖుడై పరువవలెను. ప్రాక్-దక్షిణ అగ్రములలో నియతుడై విధిని గూడ వెంటనే చెప్పవలెను. దీనుడైకాని కోపియై కాని, అన్యమనస్కుడై కాని శ్రాద్ధము ఆచరింపరాదు. తెలిసినవాడు (జ్ఞాని) మనస్సును ఏకాగ్రముగచేసి శ్రాద్ధమును చేయవలెను. అపవిత్రమైన దానినంతయు చంపెదను. నాచేత అసుర దానవులు అందరును చంపబడిరి. రక్షస్సులు, యక్షులు, పిశాచ సంఘములు, యాతుధానులందరును నాచే చంపబడిరి. ఇట్లు ఎవని అన్నము పితరుల కొఱకు చూడబడినదో, ఆతనిని అసురులందరు వదలుదురు. ఏ దేశమున ఈ మంత్రము పఠింపబడునో ఆ దేశమును గూడ రాక్షసులు వదులుదురు అని మంత్రముతో బ్రాహ్మణుడు ఈ విధానముతో శ్రాద్ధమును చేసినచో పితరులు సంతుష్ఠ మనస్కులు అగుదురు. రక్షస్సులు విమనస్కులు అగుదురు. శ్రాద్ధమున క్షీరజాశుబల్వజములైన తరువులు వారణములు, లవములు, లవ వర్షములును-ఇవి మొదలగునవియు, తక్కినవియు అయిన తృణములను గడ్డిజాతులను వదలవలెను. మరలమరల పుట్టు కాశగడ్డిచే అంజనముతోడి (కాటుకతో) అభ్యంజనము (తలంటుపోత) చేసిన గంధమును, దానిని అనుసరించిన లయమును చేయవలెను. దాని వలన సమస్తఫలము కలుగును. మరలమరల పుట్టు కాశగడ్డి విశేష ములు బర్హణములు ఉపబర్హణములును వృద్ధిపొందును. మరింత వృద్ధిపొందును. ఇక, ఆ పితరులు దేవతలు. ఆ దేవతలు మరల పితరులు. పుష్ప గంధాది ధూపములకు ఈ మంత్రము చెప్పబడినది. బ్రాహ్మణ ప్రయత్నముతో దక్షిణ దిక్కునకు తీసికొని వచ్చి, "పితృమంతుడైనసోమునకు

స్వధ, అంగిరసునకు నమస్కారము"–అని స్వర్గఫలము గాక లౌకికమైనను కర్మసిద్ధికై హోమము చేయవలెను. సమిధను అంతస్సులో నుంచి, అట్లే ప్రయతాగ్నియై ప్రయత్నముతో ఏకాగ్రమనస్సుతో హోమము చేయవలెనని చెప్పబడినది. 'కవ్యమును వహించు అగ్నికి అంగిరసునకు స్వధానమస్కారము, యమునకును అంగిరసునకు స్వధా నమస్కారము' – అని చెప్పుచు హోమము చేయవలెను. ఇవి మంత్రముల యొక్క పూర్వక్రమమును బట్టి హోమమంత్రములు దక్షిణదిక్కునుండి అగ్నికి నిత్యమును, లోపల సోమునకును, వీరిరువురి మధ్యన నిత్యము సూర్యునకును ఉపచారమును స్వధాకారమును, అట్లే ఉల్లేఖనమును చేయవలెను. హోమ–జపములను, నమస్కారమును, విశేషించి ప్రోక్షణ మును, అంజనాభ్యంజనములను, పిండ సంవపనమును చేయవలెను. అది అశ్వమేధ ఫలముతో సమమని స్మరింపబడినది. చెప్పబడిన క్రియలు అన్నింటిని మంత్ర పూర్వకముగా ప్రయత్నముతో ఆచరింపవలెను. అగ్నియందు బహు హవ్యత్వము (హవ్యముల వహించుట) విశేషించి చక్కగ ప్రజ్వలించిన అగ్నియందు బహుహవ్యముల వహించుట సిద్ధము. కావున పొగలేని జ్వాలాజిహ్వలతో ఉన్న అగ్నియందు కర్మసిద్ధి కొఱకు హోమము చేయవలెను. జ్వాలతో ప్రజ్వలింపక చక్కని ధూమము నిండిన అగ్ని యందు హోమము చేసినచో యజమానుడు అంధుడై అపుత్రకుడు అగును అని పూర్వులచే చెప్పబడినది. కొద్ది ఇంధనములు కలిగినను, కరకైనను (చిటపట లాడినను), ఆ అగ్ని ఫలసిద్ధికి పనికి రాదు. అగ్ని దుర్గంధముగా ఉన్నను విశేషించి నల్లగా ఉన్నను, నీలముగా ఉన్నను, భూమి లోకి చొచ్చుకొనిపోయినను, అచట పరాభవము కలుగును. జ్వాలలు కలిగి, పిండితములైన జ్వాలలు కలిగి, నేయి–బంగారముల నుండి పుట్టినవాడై, దట్టమైన వాడై, దక్షిణపు వైపు తిరుగు జ్వాలలు కలవాడైన అగ్ని హోమమున కార్యసిద్ధిని కలుగచేయును. ఆతడు నరనారీ గణముల నుండి శాశ్వతమైన పూజను పొందును. దానిచేత పూజింపబడిన పితరులు అక్షయములు, అవ్యయములును అగుదురు. స్థాలి, ఉదుంబర (మేడి) పాత్రలు, ఫలములు, సమిధలు శ్రాద్ధమున అతి పవిత్రములు, విశేషించి మేధ్యములును అగును. ఓ బ్రాహ్మణశ్రేష్ఠ! జన్మ కర్మలలో దర్భశుద్ధికి ఉపయోగించును. నాచేత శ్రాద్ధకర్మలలో ఆ ఫలము ఉద్దేశింపబడినది. సమిధలలో గూడ వరుసగా అది అంతయు కర్తవ్యముగా తెలియవలెను. నేను చిత్తము ఏకాగ్రముచేసి అగ్నికి హోమపూజలను చేయుదును. బ్రాహ్మ ణులచే "చేయుము" అని అనుజ్ఞను పొందినవాడై భార్యను, పుత్రులను తీసికొని వచ్చి అగ్నికి హోమము చేయవలెను. సమానములైన ప్లక్ష (జువ్వి), న్యగ్రోధ (మట్టి), ప్లక్ష (కలుజువ్వి), అశ్వత్థ (రావి), వికంకత (పుల్ల వెలగ) వృక్షములు, ఉదుంబరములు (మేడిచెట్లు), బిల్వ

(మారేడు), చందన వృక్షములును యజ్ఞియములు (యజ్ఞమునకు ఉపయోగించునవి). సరల (తెల్లతెగడ), దేవదారు, శాల (మద్ది), ఖదిర (చండ) వృక్షములు. ఈ వృక్షములు యజ్ఞ సమిధలకై విశేషించి ప్రశస్తములు. అట్లే గ్రామ్యములు, ముళ్లుకలవియు ఎవరిచేతనో ఒకరిచేత యజ్ఞియములుగా సమిధలకై పూజింపబడినవని పితరుల వచనము-అనగా పనికిరావు. కల్కలేయములైన సమిధలచే అగ్నినిహోమము చేయువాని ఆ యజ్ఞ కర్మ ఫలమును నానుండి వినుము. సర్వకామములకు సంబంధించిన ఆ యాసము (శ్రమ) అది అశ్వమేధ ఫలము. శ్లేష్మాతక (విరుగుడు చెట్టు), నర్తమాల (కానుగ చెట్టు), విభీతక (తాండ్రచెట్టు) తీగలతోబాటు పక్షులకునివాస మైనదియు-ఇట్టి వృక్షములను వదిలి వేయవలెను. అయజ్ఞీయములు అనబడిన వృక్షములను వదిలివేయవలెను. యజ్ఞకర్మలలో మంత్రాంతమున స్వధను చెప్పవలెనని పితరుల వచనము. దేవతలకు యజ్ఞకర్మలో మంత్రాంతమున స్వాహాఅని చెప్పబడినది. (13)

శ్రాద్ధకల్పము

సూతుడు ఇట్లు అనెను :

దేవతలును, పితరులును, అట్లే వారికంటె వేరైన పితరులును-అనునిది ఆథర్వణ విధి అని బృహస్పతి చెప్పెను. మొదట పితరులను పూజింపవలెను. విశేషించి దేవతలను పూజిం పవలెను. ఈ లోకమున దేవతల కంటెను పూర్వము ప్రయత్నముతో పితరులను పూజింతురు.

దక్షునకు కూతురు కలదు. లోకమున ఆమె విశ్వ అను నామముతో ప్రసిద్ధి చెందినది. ఓ ధర్మజ్ఞుడా! ఆమె ధర్మముతో శాస్త్రీయముగా ధర్మునకు(యమునకు) ఈయ బడినది. ఆమె పుత్రులు మహాత్ములైన విశ్వేదేవులని శ్రుతి. ముల్లోకములలో ప్రసిద్ధులును, సర్వ లోకములచే నమస్కరింపబడినవారును అయిన ఆ మహాత్ములందరును మహా ఉగ్ర తపమును చేసిరి. దేవ, గంధర్వులతో సేవింపబడినదియు, సమస్త అప్సరసలచే చరింప బడినదియునై రమ్యమైన హిమవత్పర్వత శిఖరమున ఆ విశ్వేదేవులు ఉగ్రమహాతపమాచ రించిరి. దానికి శుద్ధమైన మనస్సుతో సంతసించిన పితరులు వారితో “వరమును అడు గుడు, మేము సంతసించితిమి, ఏ కోరికను నెరవేర్పవలెను అని అడిగిరి.” పితరులు ఈ విధముగా అడుగగనే, త్రైలోక్య భావనుడైన, ప్రజలకు అధిపతియైన బ్రహ్మ ఆ విశ్వే దేవతలకిట్లు చెప్పెను.

మహాతేజస్వియైన మహాదేవుడు విశ్వేదేవుల తపముచే తపింపబడెను. ఆ తపముతో సుప్రీతుడై మీకు ఏకోరికను నెరవేర్పవలెను? అని అనెను. లోకకర్తయగు బ్రహ్మ ఇట్లు

అడుగగనే విశ్వేదేవులందరును గలిసి లోకభావియైన బ్రహ్మతో ఇట్లనిరి. "శ్రాద్ధమున మాకు భాగము రావలెను. ఇది మేము కోరిన వరము" అనిరి. తరువాత బ్రహ్మ ఆ స్వర్గ పూజితులైన విశ్వేదేవులతో–"మీరు కోరిన వరమట్లే సిద్ధించును అనెను. పితరులు అట్లేయని–ఇది అట్లే అగును సంశయములేదు అనిరి. ఈ లోకమున పితరులకు దేనిని చేసినను విశ్వేదేవులతో గలిపియే చేయబడవలెను. పితరులకు ఏర్పరచిన శ్రాద్ధమున మిమ్ములను (విశ్వేదేవులను) అగ్రాసనము వరించును అని బ్రహ్మ అనెను. మనుష్యులలో ఇది సత్యముగా జరుగునని నేను చెప్పుచున్నాను. మాల్యములచేతను, గంధములచేతను, అన్నముచేతను, మిమ్ములనే (విశ్వేదేవులనే) మొదట శ్రాద్ధకర్త పూజించును. మొదట మీకు దాత. తరువాత మాకు దానము చేయబడును. ఇక విసర్జనము మొదట మాకు పిత రులకు తరువాత దేవతలకు, శ్రాద్ధముయొక్క రక్షణము–ఆతిథ్యము అనునవి శ్రాద్ధమున రెండు విధులు. భూతములయు, దేవతలయు, పితరులయు శ్రాద్ధకర్మయందు ఈ విధముగ శాస్త్రీయముగా చేయబడినది అంతయు చక్కగా జరుగగలదు" అని ఈ విధముగ విశ్వే దేవులకు వరమిచ్చి, భూతానుగ్రహకారియైన ఆ బ్రహ్మదేవుడు పితృగణములతో యథా సుఖముగ తిరిగెను.

వేదమున నరులకు పంచమహాయజ్ఞములు నిత్యకరణీయములుగా చెప్పబడినవి. అవి 1.భూతయజ్ఞము; 2.మనుష్యయజ్ఞము; 3.పితృయజ్ఞము; 4.దేవయజ్ఞము; 5.బ్రహ్మ యజ్ఞము. నరుడు ఎల్లప్పుడు ఈ యజ్ఞములను నిర్వహించవలెను. శ్రాద్ధ యజ్ఞ దాతలు భయములేనిది, అహంకారములేనిది, శోకములేనిది, వ్యధలేనిది, శ్రమతో వాడి పోవుట లేనిది, సర్వకామములతో కూడుకొనినదియు అయిన బ్రహ్మస్థానమును శ్రాద్ధదాత పొందును. శూద్రుడు గూడ ఈ పంచమహాయజ్ఞములను మంత్రములు లేక చేయవలెను. కావున పంచమహాయజ్ఞములు చేయక భుజించువాడు కేవలము ఋణమును భుజించు వాడు అగును. ఆత్మ కారణమున ఏ పాపాత్ముడు పాకము చేయునో వాడు ఋణమును మాత్రమే తినును. కావున పండితుడు ఎల్లప్పుడు ఈ పంచమహా యజ్ఞములు నిర్వర్తింప వలెను. జీవించినవాని విషయమున కూడ కొందరు నైవేద్యమును కోరుదురు. ఈశాన్య దిక్కుగా బలిని, జలకుంభమును ఈయవలెను. బలిని అందరికి తెలియునట్లుగా చేయ వలెను. ఎత్తుకన్న ఎత్తుగా ఉంచవలెను. పరశృంగ గోవుల బలిని మొదట సూక్ష్మముగా ఎత్తి పెట్టవలెను. పితరులలో జీవించినవాడికి పిండ నివేదనము చేయరాదు. ఇష్టమైన అన్నముతో భక్ష్యములతో యథావిధిగా భుజింపచేయవలెను. ఆ విధానము వేదవిహిత మైనది. దానిని చెప్పెదను. పితరులు మహాత్ములైన దేవదేవులు. ఆచార్యులు కొందరు

కొద్ది నివేదనము చేయవలెననియు, తరువాత పిండనివేదనము చేయవలెననియు అందురు. బ్రాహ్మణుల పూజను అంతయు నిత్యము చేయవలెను. బృహస్పతి "ధర్మార్థ కుశలురను పూజింపవలెను" అని అన్నాడు. పూర్వము పిండమును నివేదింపవలెను. తరువాత బ్రాహ్మణులు భుజింపవలెను. యోగాత్ములు, మహాత్ములు అయిన పితరులు యోగ సంభవులు. ఈ పితరులు యోగమునందున్నవారై సోమమును ద్రావి తృప్తి చెందు దురు. కావున శ్రాద్ధతత్పరుడై, శుచియై, యోగులకే పిండములను ఈయవలెను. ఇది పితరులకు సాక్షాత్తుగా హోమము చేసిన హవిస్సు వంటిది అగును. వేల బ్రాహ్మణులలో యోగిముందున్నచో, జలమున నౌకవోలె, యజమానిని, భోక్తలను తరింపచేయును. ఆ సజ్జనులను పరిగ్రహించిన చోటను, సజ్జనులను అవమానించిన చోటను వెంటనే దేవతలు విధించిన దండము దారుణముగా పైబడును. ధర్మముతో బాటు ఆగమమును వదిలి బాలిశుని శ్రాద్ధమున భుజింపజేసిన చోట దాత తన ఆదికర్మను వదిలి వినాశమందును. భోగార్థి అయినవాడు మధ్యపిండమును అగ్నిలో వేయవలెను. సంతానము కోరువాడు దానిని పక్షికి ఈయవలెను. ఉత్తమ కాంతిని కోరువాడు దానిని గోవులకు ఈయవలెను. ప్రజ్ఞను, పూజను, యశస్సును, కీర్తిని కోరువాడు గోవులకు ఈయవలెను. దీర్ఘాయుష్యము కోరువాడు కాకులకు ఈయవలెను. సౌకుమార్యమును కోరువాడు కోళ్లకు ఈయవలెను. ఇది పిండనిర్వపణమువల్ల కలుగుఫలము. సుస్థితి యందు దక్షిణాముఖుడై ఆ పిండము ఆకాశమునకు విసిరివేయవలెను. ఏలనన పితరుల స్థానము ఆకాశము. వారి దిక్కు దక్షిణము. బ్రాహ్మణులు మరల ఒక విషయము చెప్పు దురు. బ్రాహ్మణులచే అనుమతిని పొంది ముందు పిండోద్ధరణమును, తరువాత ధర్భాసనమును తీసివేయుటను చేయవలెను. అన్నము నుండి పుష్పములు, ఫలములు, భక్ష్యములు మొదలగు వాని యొక్క అగ్రమును తీసివేసి అగ్నిలో హోమము చేయవలెను. భక్ష్యము, అన్నము, త్రాగదగినవి, శ్రేష్ఠములైన ఫలములును-వీనిని అగ్నిలో హోమము చేసి తరువాత దక్షిణాముఖుడై పిండములను నిర్వాపము చేయవలెను. అట్లే నేతితో తడిపిన సుగంధములైన భక్ష్యములతోను, రసము లతోను తర్పణము (తృప్తిని కలుగ) చేయవలెను. ఏకాగ్రచిత్తుడై, నియమబద్ధుడై, చేతులు జోడించి నిలిచి ఉపాసింపవలెను. తత్పరుడై శ్రద్ధగలవాడై మానవుడు పై ప్రక్రియ చేయ వలెను. దానివల్ల కోరికలను పొందును. పితరులు నైచ్యము లేమిని, కృతజ్ఞతను, సత్కృ తమైన దాక్షిణ్యమును, తరువాత యజ్ఞమును, దానమును ఇత్తురు. తరువాత బ్రాహ్మణులు భుజించిన తరువాత సౌమ్యమైన విధిని అనుపూర్వముగ చెప్పెదను వినుడు. పితృపరాయ ణుడై ముందు భూమిని ప్రోక్షించి, తరువాత కొంతపైకి తీసి అచట శాస్త్ర దృష్ట క్రియతో

వికిరమును చేయవలెను. ఓ బ్రాహ్మణులారా! తరువాత స్వధను ఉచ్చరించి అన్న శేషమును తినుటకు అనుమతిని పొంది, భూరిదక్షిణలను పొందిన బ్రాహ్మణ శ్రేష్ఠులను సత్కరించి, నియతుడై చేతులు జోడించి ఆసీమాంతము వెంబడించి పంపివేయవలెను. (14)

తీర్థయాత్రా వివరణము

బృహస్పతి ఇట్లు అనెను :

ఒక్కమారు అర్చింపబడిన పితరులు సంతుష్టులు, అవ్యయులు (నాశము లేనివారు), యోగాత్ములు, మహాత్ములు, పాపరహితులు, మహౌజస్కులు (మహాతేజస్వులును) అగుదురు. స్వర్గ ప్రాప్తికై మరణించియు, సువిస్తరమై కోరిన ఐశ్వర్యమును మోక్ష ప్రాప్తిని క్రమమున అనుగ్రహింతురు. ఓ సౌమ్యులారా! వారి ఆ సరస్సులను, నదులను, పుణ్య తీర్థములను, దేశములను, పర్వతములను అట్లే ఆశ్రమములను నేను చెప్పెదను. అందులో ముల్లోకములలో పుణ్యమైనది అమరకంటక పర్వతము. ఆ పర్వత శ్రేష్ఠము పుణ్యమై సిద్ధచారణులచే సేవింపబడినది. పూర్వము ఇచట భగవంతుడైన అంగిరసుడు వేల ఏండ్లు, దశలక్షల ఏండ్లు, కోట్ల ఏండ్లును దుశ్చరమైన తపమునుచేసెను. అచట మృత్యు వునకుగాని, అసుర, రాక్షసులకుగాని గతి (స్థానము) లేదు. అచట భయముగాని, అలక్ష్మి (దారిద్ర్యము)గాని భూమి ఉన్నంత వరకును లేవు. శృంగమాల్యవంతము యొక్క సంవర్తా గ్నివలె (ప్రళయాగ్నివలె) ఆ పర్వతశ్రేష్ఠము తేజస్సుతోను కీర్తితోను నిత్యము ప్రకాశించును. అచటి కుశలు సుగంధములై బంగారువన్నెకలవై చూడ ఇంపుగా ఉండును. దక్షిణపువైపున నర్మదానదిని తాకుచు శాంతములై ఉండును. పూర్వము భగవంతుడైన అంగిరసుడు, మహాతేజస్వియై ప్రస్తరార్థ కుశోత్తమములను (పరచుటకై వేసిన దర్భలను) స్వర్గ సోపానము (మెట్టు)గా చూచెను. అమరకంటక పర్వతమున ఆ దర్భలపై ఒక్కమారు పిండములు పెట్టిన ప్రాజ్ఞుని ఫలమును చెప్పెదను.

ఆ శ్రాద్ధము అక్షయమై పితరులకు ప్రీతిని పెంచును. ఆ క్షేత్రమును పొంది పితరులు ఎల్లప్పుడును అంతర్ధానము చెందుదురు. అచట అంతటను వ్యాపించిన జ్వాలా సరస్సును పవిత్రసరస్సు ఇప్పటికిని కనబడును. శల్యము(ఎముక)లతోగూడిన ప్రాణులను విశల్యులను (ఎముకలు లేనివారినిగ) చేయునది కూడగలదు. అచట ఆ పర్వతోత్తమమున ప్రాగ్దక్షిణ ముగా (ఆగ్నేయముగా) సుడులతో కూడిన బావికలదు. కళింగదేశపు సగము ప్రక్కన పితరులకు ప్రీతిని పెంచునదియు, భూమిలో పరమక్షేత్రమని చెప్పబడినదియు అగు ఒక సిద్ధ క్షేత్రము కలదు. ఓ ఋషి శ్రేష్ఠులారా! అది దేవదైత్యులకును సమ్మతమైనది.

శుక్రుడు కూడ ఒక శ్లోకమును చెప్పెను. పితృపరాయణులై అమరకంటక పర్వతమును చేరి అచట శ్రాద్ధమున పితరులను సంతసింపజేయువారు లోకమున ధన్యపురుషులు అగుదురు. అచట అల్పమైన తపముతోనే సిద్ధిని పొందగలరు. సంశయము లేదు. అమరకంటక పర్వతమున ఒక్కమారే అర్చితులైన పితరులు స్వర్గమును పొందుదురు. రమ్యమైన మహేంద్ర పర్వతమున పుణ్యమైనది. ఇంద్రునిచే సేవింపబడినదికలదు. అచట ఎక్కిన వానికి బహుప్రీతి కలుగును. అచట శ్రాద్ధము మహాఫలమగును.

బిల్వము యొక్క క్రింద శిఖరమున యోగముతో గూడిన దివ్య చక్షువు ప్రవర్తిల్లును. ప్రాణులకు కనబడనిదై దేవునివలె భూమియందు చరించును. సప్త గోదావరమునను (సముద్ర మున కలియునపుడు ఏడు పాయలుగా మారిన గోదావరీ నదీ ప్రాంతమునను), గోకర్ణ క్షేత్రమునను, తపోవనమునను శ్రాద్ధస్నానములుచేసి నరుడు అశ్వమేధ యాగ ఫలము అందును. ధూతపాప స్థలమునుచేరి స్నానము చేసి నరుడు పవిత్రుడు అగును. అచట దేవదేవుడు మహేశ్వరుడు అయిన రుద్రుడు తపముచేసెను. గోకర్ణమున బ్రాహ్మణు లచే నాస్తికులకు నిదర్శనము (తార్కాణము) చూపబడినది. అచట పఠించు అబ్రాహ్మణునకు సావిత్రి సంపూర్తిగా నశించును. సిద్ధచారణులచే సేవింపబడిన దేవర్షి భవన శిఖరమును నియమముతో ఎక్కినవారు స్వర్గమును చేరుదురు. ఆ పర్వతము దివ్యములైన చందన వృక్షముతోను ఇంకను అనేక ఇతర వృక్షములతోను శోభించినది. అట నుండి ఎప్పుడును చక్కని రుచితోగూడిన జలములు ప్రవహించును. ఆ జలములనుండియే తామ్రపర్ణి అను పేరుగల నది బయలుదేరును. అది మహాఖేదముగల స్త్రీవలె దక్షిణ సముద్రమును పొందును. ఆ నదీజలములు సముద్రములో కలిసినవెంటనే శంఖములై, ముత్యములై శంఖ మౌక్తికములు అగును. శంఖమౌక్తికములతో కూడిన జలమును తీసికొనివచ్చి వ్యాధులతోను, మనోవ్యాధులతోను బాధపడుచున్న నరులకు ఇవ్వగా ఆ ముక్తులైన నరులు అమరావతిని చేరుదురు. శంఖముల యొక్కయు ముత్యముల యొక్కయు చందనములవల్ల పాపము చేసిన పితరులనైనను నరులు తరింపచేయుదురు. చంద్రతీర్థమున, కుమారీ తీర్థమున, కావేరీ తీర్థమున, ప్రభవమైన అక్షయ తీర్థమున, శ్రీశైల పర్వత తీర్థములందును, వైకృతగిరియందును శ్రాద్ధ కరణమున పాపులైన పితరులు గూడ తరింతురు. ఉశిర పర్వతమున, పలాశములు (మోదుగులు), ఖదిరములు (చండ్రలు), బిల్వములు (మారేడు), ప్లక్షములు (జడలుగల జువ్వి), అశ్వత్థములు (రావి), వికంకతములు (పుల్లవెలగలు)–ఒక్కచో నున్న వృక్షములు కానబడును. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! ఇది సిద్ధమైన యజ్ఞీయ మండలము. ఇచట శరీరమును వదిలిన మనుజుడు వేగమే అమరావతిని చేరును.

ఈ యజ్ఞీయ మండలమున తనచే చేయబడిన కర్మలు జన్మాంతమున సిద్ధించును. పితరుల విషయమున చెడుగా చేసినకర్మలుసైతము ప్రయుక్తములు అగును. నదీ శ్రేష్ఠయై పుణ్యనదియైన నర్మదానది పితరులకూతురు. అందులో చేయబడిన శ్రాద్ధములు అక్షయము అగును. సిద్ధచారణ సేవితమై పుణ్యమైన మాఠరమను వనమున శ్రాద్ధము అక్షయమగును. ఆ ప్రసిద్ధమైన మహాగిరియందు పితరులు సక్తులై అంతర్ధానము నందుదురు. పుణ్యమైన వింధ్య పర్వతమున ధర్మాధర్మములకు తార్కాణము కలదు. అచట జల ధారను చూచిన వారు పాపధారను చూడరు. అనగా అచ్చటి జలధారను చూచినవారికి పారంపర్యముగ వచ్చిన పాపములు అన్నియు నశించును. ఆ ధారలోనే కొంతమంది పాపకర్ములకు పాపము కనబడదు. ఆ ధార సామాన్యముగ శుభకర్ములకు స్పష్టము అగును. కౌశలయందు పాపనాశనియైన మతంగుని బావి కలదు. అందులో స్నానము చేసినవారు స్వేచ్ఛగా ఆకాశమున తిరుగువారై స్వర్గమును చేరుదురు. కుమారకోశలా తీర్థమునను, పాలపంజర పర్వతమునను, సముద్రాంతమైన పాండుకులమునను, అట్లే పండారక వనమునను, పాపములేనిదై, విమలమైనదై, అభయమై ప్రభవమైన శ్రీవృక్షమునను, గృధ్రకూటమునను, జంబూమార్గమునను, యోగాచార్యుడై, ధీమంతుడైన అసితగురువుయొక్క పవిత్ర క్షేత్రమున, అసితానదియందు చేసిన శ్రాద్ధము ఎల్లప్పుడును ఆనంతఫలము కలది. పుష్కర క్షేత్రము లలో శ్రాద్ధము అక్షయము. తపము మహాఫలము. మహోదధియందును ప్రభాసక్షేత్రము నను శ్రాద్ధము అక్షయము. కావున ఈ విధముగా నిర్దేశింపవలెను.

దేవికయందు వృషము అను సిద్ధనిషేవితమైన బావి కలదు. దాని జలములు గోవుల శబ్దముతో నిత్యమును చక్కగా ఎగిసిపడును. అది సర్వ పాపములనుండి యోగేశ్వరులతో ఎల్లప్పుడును కూడియుండును. అచ్చట శ్రాద్ధము చేసినవానికి కలుగు ఫలమును చెప్పెదను వినుము. అచటి శ్రాద్ధము అక్షయమై సర్వకామములను తీర్చునదై పితరులను ప్రీతులను చేయును. అచట జాతవేదము అను సాక్షాత్తుగా అగ్నియొక్క శిల ప్రాచీనమైనదికలదు. అచట అగ్నిప్రవేశము చేసినవాడు స్వర్గము పైభాగమున ఆనందించును. అట అగ్ని శాంతమై, మరల పుట్టినది. దానియందు దత్తము చేయబడినది అక్షయము అగును. దశాశ్వమేధిక తీర్థమునను, పంచాశ్వమేధిక తీర్థమునను ఉద్దేశించిన క్రతువుల ఫలము ఇచటి శ్రాద్ధమున కలుగును. సంశయములేదు. హయశరము అను ఒక ప్రసిద్ధ తీర్థము కలదు. అది వెంటనే వరములను ఒసగునట్టిది. అచట శ్రాద్ధము అక్షయము. స్వర్గమున ఆనందింపచేయును. కుంభమున శ్రాద్ధదానము చేయుదురు. అది పాపనాశకమని తెలియ వలె. అచట శ్రాద్ధము అక్షయము. జపహోమతపములు గూడ అక్షయములు. అజతుంగము

అను శుభ తీర్థమున ఎప్పుడును పితరులకు తర్పణము చేయవలెను. అచట పర్వములందు దేవతల యొక్క ఛాయ కనబడును. అచట దత్తము చేయబడినది (శ్రాద్ధము మొ॥) భూమిలో అక్షయము అగును. అచట పాండవులు బాధలు లేనివారైరి. అది సర్వ పాపము లకు వెలియైన యోగేశ్వరులతో నిత్యము కూడియుండును. అచట శ్రాద్ధ దానము చేసిన వానికి కలుగు ఫలమునుచెప్పెదను. ఆ శ్రాద్ధకర్తచే ఎల్లప్పుడును పితరులు సాక్షాత్తుగా పూజింపబడినవారు అగుదురు. ఈ లోకమున వశియైనవాడు (సర్వేంద్రియములను తన అధీనమునందు ఉంచుకొన్నవాడు) మరణించి స్వర్గలోకమున ఆనందించును. అట్లే సామాన్యముగా మిక్కిలి శ్రేష్ఠమై పుణ్యమైన శివము అను అడుగు కలదు. అచట పుణ్యమైన వ్యాససరస్సును, దివ్యమైన బ్రహ్మసరస్సును గలవు. ఋగ్, యజుస్, సామ వేదములు శిరస్సులుగాగల మహాత్ముడైన వశిష్టునియొక్క ఉజ్జంతము అను పుణ్యపర్వతముగలదు. అది కపోతము (పావురములు) పుష్పము అను పేరుకలది. వీనియందు బ్రహ్మ పంచమ వేదమును సృష్టించి చెప్పెను. ప్రాచీన ద్విజుడైన అగ్ని ఈ క్షేత్రములను పొంది పాపము నుండి విముక్తుడు అయ్యెను. ఈ క్షేత్రములలో చేసిన శ్రాద్ధము, జపహోమతపములును అనంతము అగును. పుండరీకము అను మహాతీర్థము శ్రాద్ధా దానములకు పుండరీకముతో రాజ్య చిహ్నమైన తెల్లగొడుగుతో సమానమైన ఫలము కలది. బ్రహ్మతీర్థము అను మహా తీర్థమున అశ్వమేధముతో సమానమైన ఫలమును కలిగించును. సింధు సాగర సంగమ మున, పంచనదమునను శ్రాద్ధాది దానములు అక్షయములు అగును. మండవాయమను పర్వతమున కీరకాత్మమైన పుణ్యతీర్థము కలదు. అచట శ్రాద్ధదానము అక్షయము. సప్త హ్రదమున విశేషించి మానస(సర)మున, మహాకూటమున, వందమున, త్రికూట పర్వత మున, శ్రాద్ధాది దానము అక్షయము అగును. సంధ్యాకాలమున మహావేది యందు మహాద్భుతము కనబడును.

శ్రద్ధవహింపనివారిని ఆ సంధ్య చేరదు. చక్కగా వ్రతమును ధరించినవారిని అది చక్కగా వచ్చిచేరును. అచట జాతవేదమను సాక్షాత్తు అగ్నియొక్క శిల ప్రాచీనమైనది కలదు. అచట నిత్యము శ్రాద్ధములను అగ్నికార్యమును చేయవలెను. అవి ఎల్లప్పుడును అక్షయములగును. ఒక సాయాహ్నమును ఆశ్రయించి, ఎప్పుడును పితరుల అక్షయమును కోరువాడు ఒకడే అచట శ్రాద్ధమును చేయవలెను. కృతాత్ముడుగాని, అకృతాత్ముడుగాని మానవుడు స్వర్గమార్గ ప్రదమను తీర్థమునందు తెలియబడును. ఆ తీర్థము వెను వెంటనే వరమును ఇచ్చునట్టిది. దానియందు సప్తర్షులు వైరములను వదలి స్వర్గమునకు వెళ్లిరి. ఇప్పుడుకూడ ఆ పోయిన వైరములే కనబడును. మానవుడు ఆ తీర్థశ్రేష్ఠమున స్నానముచేసి

స్వర్గవాస సుఖమును పొందును. అచట నంది-సిద్ధులచే సేవింపబడిన ప్రసిద్ధమైన నివాస స్థానము కలదు. అచటి నందీశ్వరుని మూర్తి దురాచారులకు కనబడదు. సూర్యో దయమున సంచిష్యమునందు బంగారు యూపములు కనబడును. అవి ప్రదక్షిణముచేసి అంతర్ధానముచెంది స్వర్గమునకు పోవును. కురుక్షేత్రము అంతటను అది విశేషించి పుణ్య మైన సుతీర్థము. అది యోగేశుడైన మహాత్ముడగు కృష్ణునకు సంబం ధించినది. అచట పితరులకు నూవులను ఒసగిననచో, అది నిత్యము, అక్షయమని చెప్పబడినది. ధర్మరాజు నివేశించిన స్థానమున శ్రాద్ధము అక్షయమై కర్తకు ఓజస్సును కూర్చును. అమావాస్యయందు శాస్త్రీయముగా క్రమమును అనుసరించి చేసిన శ్రాద్ధదానము కూడ అక్షయమై ఓజస్సును కూర్చును. విశేషించి కురుక్షేత్రమున సన్నిహితు లకును శ్రాద్ధము చేయతగును. అచట పితరులను అర్చించిన సత్పుత్రుడు ఋణవిముక్తుడు అగును. వినాశనమునను, సరస్వతీ నది యందును, ప్లక్ష ప్రశ్రవణమునను, వ్యాసతీర్థమైన సరస్వతియందును, విశేషించి బ్రహ్మక్షేత్రమునను, అక్షయశ్రాద్ధమును కోరినవాడు ఓంకార పఠనములతో శ్రాద్ధదానము చేయవలెను. అట్లే పర్వత శ్రేష్ఠమైనమైనాక పర్వతమునను, గంగయందు అంతటను ఓంకారపఠనములతో శ్రాద్ధదానము చేయవలెను. అట్లే యమునానది పుట్టిన చోట కూడ చేసినచో సర్వపాపముల నుండి విముక్తి చెందును. అచట ఉన్న అత్యుష్ణములును, అతిశీతలములు అయిన జలములు అందుకు నిదర్శనము. యముని అక్కయు మార్తాండు (సూర్యు)ని కూతురును అయిన పుణ్యనది యమున అచ్చట కలదు. అచట శ్రాద్ధముచేసిన అక్షయమగుని పూర్వము పితరులు చెప్పిరి. బ్రహ్మను గ్రహహ్రదమున స్నానము చేసినవాడు వెంటనే బ్రాహ్మణుడు అగును. అచటచేసిన శ్రాద్ధమును, జపహోమతపములును అనంతములు అగును. అచట మహాతపస్వియైన వశిష్ఠుడు స్థాణువై (మొద్దై) తిరుగు చుండును. అచట ఇప్పుడు కూడ వృక్షములు మణులతో అలంకరింపబడి ఉండును. అచట ధర్మాధర్మముల గురుత్వమును తెలియజేయు త్రాసు (తూకము జేయు త్రాసు) కనబడును. బ్రాహ్మణులు దానితో తీర్థముల యొక్క ఉత్తమ ఫలమును తూచుదురు. పితరుల కూతురు 'యోగ' అనునది, 'గంధకాలి' అని ప్రసిద్ధి గాంచిన నది కలదు. అది బ్రహ్మ యొక్క నాలుగవ అంశము పరాశరకులమును ఉద్ధరించిననది. వేదమును నాలుగు విభాగ ములుగా విభజించి, మహాయోగుడు, ధీశాలియు అయిన వ్యాసముని పుట్టుకకు కారకుడు పరాశరుడు.

అచ్ఛోదము అను సరస్సుకలదు. అచట అచ్ఛోదముఅను నది బయలుదేరినది. వారణ నియోగమున ఆమె మత్స్యయోనియందు మరల పుట్టెను. దాని ఆశ్రమము

పుణ్యము. పుణ్యకర్తలచే సేవింపబడినది. అచట ఒకమారు చేసిన శ్రాద్ధ దానము అక్షయము. దానియందు యోగ సమాధానమున ఈయబడిన శ్రాద్ధాది దానము వెంటనే ఫలమును కలిగించును. కుబేర పర్వతమున, బారెడు ఎత్తైన వ్యాస తీర్థమున పుణ్యుడైన బ్రాహ్మణుడు శ్రాద్ధ దానము చేయవలెను. అది అనంతమై, అక్షయము అగును. అది నిత్యము సిద్ధులచే సేవితము. పాపాత్ములకు కనబడదు. ఈశాన్య దిక్కున నంద అను వేదియందును నివర్తనము ఉండదు అది సిద్ధ క్షేత్రము. దానిని పొందినయెడల, మరల మనుష్యుడు తిరిగిరాడు. ధీమంతుడైన మహాదేవునిచే మహాలయమున అడుగిడబడినది. ఈశ్వరుడు దేవ్యాలయమున ఒంటికాలిపై నిరాహారుడై ఒక దివ్యయుగము తపము చేసెను. ఉమాతుంగము అను పర్వతమున జలము ఉండెను. అట్టి ఉమాతుంగమున, భృగు తుంగమున, బ్రహ్మతుంగమున, మహాలయమున, కాద్రవతియైన శాండిలియందు, వామ ముని గుహయందును, స్నానమాచరించిన జనుడు పవిత్రుడు అగును. అచ్చటచేసిన శ్రాద్ధము అక్షయము అగును. జపము, హోమము, ధ్యానము, తాను చేసిన ఏ పుణ్యమైనను, అవి అక్షయములు అగును. గురుభక్తులు నూరేండ్లు బ్రహ్మచర్యమును పూజింతురు. ఇవి మొదలైన తీర్థములలో స్నానముచేసిన వెంటనే సత్ఫలమును పొందును. అచటనే కుమారధార అను పాప ప్రణాశినిఅగు జలధార కనబడును. అచటకు వెళ్లుట-కూర్చుండుట వెంటనే సఫలములై కనబడును. శైలకీర్తిపుర సమీపమున పుష్కలములైన కామములను పొందును. సర్వ ప్రాణులకు కనబడనివాడై దైవమువలె భూమిపై చరించును.

కాశ్యపుని మహాతీర్థము కాలసర్పి అని ప్రసిద్ధి చెందినది. అక్షయమును కోరువాడు అచట నిత్యము శ్రాద్ధదానము చేయవలెను. శాలగ్రామము అంతటను శ్రాద్ధము అక్షయము అగును. అచట పాపికి తన దృష్టిచే ప్రత్యక్షముగ కనబడదు. అంతయు పరోక్షముగ ఉండును. ఆ పుణ్యహ్రదమున దివ్యుడైన నాగరాజు ఉన్నందున అశిష్టులకు తిరస్కారము, శిష్టులకు ప్రవేశమును జరుగును. ఆ నాగరాజు సజ్జనుల పిండములను గ్రహించును, దుర్జనుల పిండములను గ్రహింపడు. మిక్కిలి ప్రదీప్తములైన సర్పములచేత అన్నము భుజించుటకు శక్యముకాదు. ఈ రెండు తీర్థములలో ధర్మము ప్రత్యక్షముగ కనబడును. దేవదారు వనమున కూడ దానిని నిదర్శనముగ చరింపచేయవలె. పుణ్యాత్ముడు ప్రయాగ యందలి గంగయందు పాపములు కడుగబడుటను చూచును. అచట అతడు చేయు శ్రాద్ధము నిత్యము అక్షయము అని చెప్పబడును. కాలంజరమున, దశార్ణయందు, నైమిశమున, కురుజాంగలమునందు, వారాణసియందు, నగరియందు, శ్రద్ధతో శ్రాద్ధదానము చేయవలెను. వానియందు నిత్యము యోగేశ్వరుడు కృష్ణుడు ఉండును. కావున అచట

శ్రాద్ధదానము అక్షయము ఆనంతమును అగును. తపము, హోమము, ధ్యానము మరే పుణ్యకర్మ అయినను రౌహిత్యమున, వైతరణియందు స్వర్ణవేదియందును చేయవలెను. అవి అక్షయములగును. పుణ్యాత్ములు సముద్రాంతమున ఒక్కమారే చేయుట కనబడినది. గయలోను, ధర్మపృష్ఠమున, బ్రహ్మ సరస్సునను అట్లే కనబడినది. గయలోను గృధ్ర కూటమునను చేయబడిన శ్రాద్ధదానము మహాఫలమును ఇచ్చును. అచట అంతట ఐదు యోజనముల వరకు మంచుపడును. పుణ్యమైన భరతుని ఆశ్రమమునగల అరణ్యము మిక్కిలి పుణ్యప్రదము అనబడినది. అచట మతంగుని స్థానము మాంసచక్షువునకు కూడ కనబడును. ఈ విధముగా పుణ్యమైన పంచవనము పుణ్యకర్తలచే సేవింపబడినది. అచట పాండువిశాల అను తీర్థము వెంటనే కనబడు నిదర్శనము. లగ్నమున పాపులు అచట త్రాసుల తూకములతోను, ధనువులతోను, వివిధములైన శస్త్రములతోను తేలియాడుదురు. అట్లే తృతీయమందును, పాదమునందును, స్వరములేని పాపమండలమందును, మహా హ్రదమునను, కౌశికియందును చేసిన శ్రాద్ధదానము మహాఫలము ఇచ్చును. ధీమంతుడైన మహాదేవుడు అనేక దేవయుగములు చేయుటకు అలవిగాని తీవ్రతపమునుచేసి ముండ పృష్ఠమున అడుగిడెను. ఇచట అల్పకాలములోనే ధర్మపరాయణుడైన నరుడు–పాము తన కుబుసమును వదిలినట్లు – తన పాపమును వదిలివేయును. సిద్ధులకు ప్రీతిని కలిగించునవియు, పాపములకు భయంకరములైనవియు, గొప్ప పడగలుగలవియు అయిన సర్పములచేత రాత్రింబవళ్లు రక్షింపబడును. కనకనంది అను పేరుగల తీర్థము ముల్లోకములలోను ప్రసిద్ధమైనది. అది ముండపృష్ఠమునకు ఉత్తరమున ఉన్నది, దేవర్షి గణములతో సేవింపబడినది. అచట స్నానము చేసిన యెడల స్వేచ్ఛగా చరించు పక్షుల రూపమును పొంది స్వర్గమున కెగసిపోవుదురు. అట్లే ఇచ్చట చేయబడిన శ్రాద్ధదానము అక్షయమైనది. అచట స్నానముచేసిన యెడల నరోత్తముడు మూడు ఋణములతో (దేవ పితృ గురు ఋణముల) నుండి విముక్తుడగును. అచట సరస్సుయొక్క తీరమున ఒక గొప్ప దేవాలయముగలదు. సిద్ధుడు దానిని ఆరోహించి, అచట జపించుచు అట నుండి స్వర్గము నకు వెళ్లును. ఉత్తరమున ఉన్న మానససరస్సును చేరి ఉత్తమ సిద్ధిని పొందును. అచటకు పోయిన, ఒక అద్భుత పురశ్రేష్ఠము కనబడును. అచట యథాశక్తి, యథాబలముగా శ్రాద్ధమును నిర్వర్తింపవలెను. అట్లుచేసినవాడు దివ్యములైన కామములను పొందును. మోక్షోపాయమును కూడ తెలిసికొనును. సరోవర శ్రేష్ఠమైన మానస సరస్సున మహా అద్భుతము ఒకటి కనబడును. దివము నుండి జారిన మహాభాగ్యవతియైన గంగ అంత రిక్షముననే ప్రకాశించును (భూమిపై పడినట్లు కనబడదు). ఆకాశ, భూ, పాతాళముల యందు

ప్రవహించు ఆ గంగాదేవి సోమపాదము నుండి భూమిపైకి జారినది. అక్కడ ఆకాశమున సూర్యునితో సమానమైన తోరణము కనబడును. అది బంగారముతో నిండి, దివ్యమై విశాలమైన స్వర్గద్వారమువలె ఉండును. అట నుండియే తూర్పు సముద్రము చివరిభాగము ప్రారంభమగును. అది సర్వ భూతములకును, విశేషించి ధర్మజ్ఞులకును పవిత్రతను కలుగచేయునది. చంద్రభాగము సింధువున్ను రెండును మానస సరస్సుతో సమానములు. దివ్య సింధునదీ శ్రేష్ఠము. పశ్చిమ సముద్రమును చేరును. హిమవంతము అను పర్వతము అనేక ధాతువులచే అలంకరింపబడి ఉండును. ఎనుబదివేల యోజనముల పొడవు కలది. అది సిద్ధ చారణులతో నిండి ఉండి, సిద్ధచారణులతో సేవింపబడినది. అచట సుందరమైన పుష్కరిణి కలదు. అది సుషుమ్న అని ప్రసిద్ధి చెందినది. అచట పుట్టినవాడు పదివేలయేండ్లు జీవించును. అచట చేయబడిన శ్రాద్ధ దానము ఆనంతమును మహోదయమును అగును. ఆ శ్రాద్ధము కర్తయొక్క పదితరముల పూర్వికులను అట్లే పదితరముల రాబోవువారిని తరింపచేయును. హిమవంతునిదంతయు పుణ్యము, గంగ అంతటను పుణ్యయైనది, సముద్రమును చేరు అన్ని నదులును, సముద్రములు–అన్నియు అంతటను పుణ్యములైనవే. వానిలో పుణ్యముకానిది లేదు. పండితుడు ఇవి మొదలుగాకల అన్నింటిలోను శ్రాద్ధమును నిర్వర్తింపవలెను. అచట స్నానము చేసి శ్రాద్ధాది దానములను చేసి పవిత్రుడు అగును. కొండచరియలందును, కొండలయందును, కందరములందును (దరులందును), గుహలందును, దేవతలచే త్రవ్వబడిన బిలములందును ఏకాంతములైన నితంబ (పర్వత మధ్య) ప్రదేశములందును, పర్వతముల నుండి పారు సెలయేరులందును, నదుల యొక్క ఇసుక తిన్నెలందును, నదులు పుట్టు స్థానములందును, అట్లే పర్వతముల నుండి పారు సెలయేరు లందును. అట్లే నదులయొక్క ఇసుక తిన్నెలందును, నదుల పుట్టు స్థానము లందును, నదుల సంగమములందును, మహోదధియందును, గోవుల గోష్ఠము నందును, సంగమము లందును, వనములందును, వస్త్రాదులతో తుడువబడనివియు, గంధాదులు పూయ బడనివి యున్నై మనోహరములైన ఆవులందును, ఆవుపేడతో పూతపూసిన పవిత్రమైన ఇండ్ల యందును, వీనియందు విధివిధానముతో నిత్యమును శ్రాద్ధదానము చేయవలెను. సర్వ కామములను నెరవేర్పదలచినవారు ప్రదక్షిణ దిశగా వెళ్ళి పై చోట్లలో శ్రాద్ధము చేయవలెను. ఈ విధముగ ఈ సమస్త ప్రదేశములందు శ్రద్ధతో శ్రాద్ధమును జేయవలె. ఈ ఆచరణము చేత మేధావియై, నరుడు బ్రాహ్మీసిద్ధిని పొందును. మూడు వర్ణములకు (బ్రహ్మ, క్షత్రియ, వైశ్యులకు) శాస్త్రము చెప్పిన స్థానమునను, బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థాద్యాశ్రమముననను కోపస్థానమును వదులుటచే, పితరుల పూజనము చక్కగా పొందబడును. శ్రద్ధ గలిగి

జితేంద్రియుడై ధీరుడై తీర్థములను అనుసరించుచు పాపములను చేసినవాడైనను శుద్ధి చెందును. శుభకర్మలు జేసినవాని విషయమున ఇంక చెప్పవలెనా? ఆ బ్రాహ్మణుడు తిర్యగ్యోనిని (పునర్జన్మకై పశుపక్ష్యాది గర్భమును) పొందకలడు. చెడు దేశమున పుట్టడు. స్వర్గవాసి అగును. మోక్షోపాయమును తెలియగలడు. అశ్రద్ధ వహించువారు, పాపకర్ములు, నాస్తికులు, సంశయము గలవారు, కారణముల చూచువారును–వీరు అందరును తీర్థ ఫలమును పొందరు. గురుతీర్థమున పరాసిద్ధి (ఉత్కృష్టమైన సిద్ధి) కలుగును. అది తీర్థ ములలో ఉత్కృష్టమైన స్థానము. ధ్యానము తీర్థాధీనము. కావున బ్రహ్మతీర్థము సనాతన మైనది. ఉపవాసమున కంటె ధ్యానము శ్రేష్ఠము. అది (ధ్యానము) ఇంద్రియము లను విషయములనుండి మరల్చును. ఈలోకమున మరలమరల ప్రాణములచే (వాయువులచే) ఉపవాసము నందు పరాసిద్ధి నిబద్ధమైనది. ప్రాణాపానములను సమముగాచేసి, ఇంద్రి యములను, విషయములను, బుద్ధిని, మనస్సును సంయమనముచేసి అంతర్ముఖముగా మరల్చుట ప్రత్యాహారముగను అది సునిశ్చితమైన మోక్షోపాయముగను తెలుసుకొనవలెను. ఇంద్రియములలో మనస్సు బుద్ధ్యాదులకు ప్రవర్తకమై భయంకరమైనది. మానవుడు నిరాహా రమువలన క్షీణతను పొందును. ఆహారము లేమిని తపముగా తెలియవలెను. బుద్ధి, మనస్సుల నిగ్రహమువలన రమ్యమైన బుద్ధికలుగును. కట్టెలులేని అగ్నివలె, సర్వపాపములు క్షీణించినపుడును, ఇంద్రియములు క్షీణించినపుడును, శుద్ధాత్మ పరినిర్వాణము చెందును. యోగి వ్యక్తా వ్యక్తము యొక్క కారణములనుండియు, గుణముల నుండియు, క్షేత్రజ్ఞుని వేరుగాచేయును. వానివలన యోగముతో యోగవేత్త అగును. ఆతనికి వ్యక్తావ్యక్తమైన గతిస్థానము (జ్ఞానప్రాప్తి స్థానము) లేదు. నిఃసంశయము సమీపమున ఉన్నవాడు, ఉండిలేని వాడు అగుచు ఏ కొద్దివాడుగ అయినను ఉండలేడనుట నిఃసంశయము. (15)

శ్రాద్ధ కల్పము

బృహస్పతి ఇట్లు అనెను :

ఇక, పవిత్రములైనవియు వర్ణింప తగినవియు అయిన శ్రాద్ధకర్మలను, దానము లను వాని ఫలములను చెప్పెదను. మంచుపడినపుడును అగ్ని హోత్రమును చేయవలెను. లేక మంచునైనను అచటినుండి తీసివేయవలెను. అచట(శ్రాద్ధ) అగ్నిహోత్రము పరమ పుణ్యము. రాహుదర్శనము కానపుడు రాత్రి శ్రాద్ధము చేయరాదు. రాహుదర్శనమున వేగముగా సర్వస్వముచేత శ్రాద్ధమును చేయవలెను. రాహుగ్రస్త సూర్య చంద్రగ్రహణ సమయమున శ్రాద్ధము చేయనివాడు బురదలోని గోవువలె నశించును. అపుడు శ్రాద్ధము చేయు

వాడు సముద్రమునందునావవలె పాపమగ్నులను ఉద్ధరించును. విశ్వదేవ సంబంధమైనదియు, సోమసంబంధమైనదియు అయిన, బహుమాంసపరము అయిన హవిస్సును వదలవలెను. ఖడ్గమృగముయొక్క కొమ్మును వదలవలెను. పూర్వము మహాత్ముడైన దేవేంద్రునిచే వారింపబడుచు, త్వష్ట, శచీపతియైన ఇంద్రుని సోమమును త్రాగుచు భూమియందు పడిపోయెను. ఆతనియొక్క తెరచికొన్న ముక్కుల నుండి వెలువడిన సోమ బిందువులు పితరులపై శ్యామాకములుగా (చామలుగా) పుట్టి పూజింపబడినవి. ఆ శ్లేష్మములు (ముక్కు నుండి వెలువడ్డ జల్లు బిందువులు) చల్లనివై చెరకుల వలె మధురము లైనవై మనోహరము లైనవి. శ్యామాకములచేతను చెరకులచేతను పితరుల సార్వకామికమైన ఆగ్రయణమును(శ్రాద్ధమును)చేయవలెను. ఆతడు వేగముగ సిద్ధిని పొందును. చామలు, హస్తి నామకము పొట్ల, ములకపండు, తీవ్రమైన అగస్త్య శిఖ (అగిసె కొస), అన్ని కషాయములును, మొదలగునవియు, తక్కిన స్వాదువులు మధురములును, శొంఠి దీర్ఘమూలకము (తీగతుమడి), రుచ్యములైన వెదురు మొలకలు, సర్జకము (జీవకమను గంధద్రవ్యము), భూస్తృణములు–ఇవి అన్నియు శ్రాద్ధమున ఈయదగినవి. ఇక శ్రాద్ధ కర్మలో నిత్యము వదలవలసిన వానిని చెప్పెదను. గృంజనమైన లశునము (నమలునపుడు కరకరమను వెల్లుల్లి), పలాండువు (గడ్డయే వేరుగాగల నీరుల్లి లేక ఎఱ్ఱ ఉల్లి), కరంభాదులు (పెరుగు గలిపిన వేపుడుపిండి), తక్కిన రసగంధములు లేనివియు, ఇవన్నియు శ్రాద్ధకర్మలో వదిలి వేయతగినవి. ఈ వదలివేయుటకు కారణము ఏమనగా? పూర్వము దేవాసుర యుద్ధమున దేవతలచే జయింపబడిన 'బలి' యొక్క గాయముల నుండి పైకి వచ్చుచున్న రక్తబిందువులు భూమిపైపడి లశునాదులు (వెల్లుల్లి మొదలగునవి)గా ఉద్భవించినవి. అందువల్ల ఇవి శ్రాద్ధకర్మలో నిత్యము వదిలివేయతగినవి. తరువాత వేదమున చెప్పిన చెట్లజిగురులు, ఊషరములైన లవణములు, శ్రాద్ధకర్మలో వదలతగినవి. రజస్వలలైన స్త్రీలుకూడ వదిలివేయదగినవారే. దుర్గంధముకలది, నురుగు కలదియునైన జలము, ఆవునకు తృప్తినీయలేని మగగోవు, రాత్రియందుచరించు గోవు–ఇవి అన్నియు శ్రాద్ధమున వర్జ్యములు. గొఱ్ఱె, మృగము, ఒంటె, గిట్టలు చీలనిగుఱ్ఱము మొదలగునవి, బఱ్ఱె, చమరీ మృగము–వీని పాలు శ్రాద్ధమున తెలిసి వాడరాదు.

ఈ తరువాత శ్రాద్ధమున వదలవలసిన దేశములను చెప్పెదను. శ్రాద్ధము చూడరాని వారు, శ్రాద్ధములో మొత్తము శౌచాశౌచములు–వీనిని చెప్పెదను. వన సంబంధములైన కందమూలములు, ఫలాహారములు–వీనిచే శ్రద్ధగా శ్రాద్ధము చేసినవాడు కోరిన రాష్ట్రమును పొందును. యశస్కరమగు స్వర్గమును మోక్షమును పొందును. అనిష్ట శబ్దముల కల్లోల

మును, జంతువుల వ్యాప్తిని, దుర్గంధ భూమిని శ్రాద్ధకర్మలో వదలవలెను. ఆగ్నేయ దిశా ద్వారముగా సాగర పర్యంతము పోవు నదులు, త్రిశంకుదేశమును పంద్రెండు యోజనముల విస్తీర్ణముగా శ్రాద్ధమున వదిలివేయవలెను. మహానదికి ఉత్తరమున, కైకటమునకు దక్షిణ మునను ఉన్న దేశము త్రైశంకుదేశము, సింధువునకు ఉత్తరమున ఉన్న దేశము–ఇవి ప్రనష్టములైన ఆశ్రమ ధర్మములుగల దేశములు. వీనిని శ్రాద్ధమున ప్రయత్నపూర్వకముగ వదిలి వేయవలెను. సువ్యవస్థితమైన శ్రాద్ధమును దిగంబర నగ్న సన్యాసులు మొదలైనవారు చూడరాదు. వారిచేత చూడబడినవి పితరులనుకాని, పితామహులనుకాని చేరవు.

అంతటశంయువు :

ఓ బ్రాహ్మణ ముఖ్యులలో శ్రేష్ఠా! భగవన్! నగ్నాదులను గూర్చి అడుగుచున్న నాకు వారి విషయమై ఇంకను విస్తరముగా చెప్పుము అని అడుగగా... ఈ విధముగ అడుగబడిన మహాతేజస్వి బృహస్పతి ఆ శంయువుతో – సర్వప్రాణులకు త్రయీ సంవరణము, ఋక్, యజుస్, సామవేదత్రయము చెప్పినవాని, ఇష్టపూర్వకముగా ఆచరించవలెను. అజ్ఞానమున దానిని త్యజించినవారు అగ్నులు. ఆలంబములేని నరుడు, ఆలంబము లేనివృషభము గూడ ప్రలీనము చెందును (నశించును). వృషభమును వదిలి వేరొకచో మోక్షమును వెదకువాడు ప్రలీనుడు అగును. వృషభము వేదములతో సమానమైనది. –దీనిని చక్కగా చూడనివాడు, ప్రలీనుడు అగును. పూర్వము దేవాసుర యుద్ధమున అసురులు పరాజితు లైరి. ఆకారణమున బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులును అన్ని విధములుగ అంతటను వ్యాపించిరి. ఇది పాషండ వైకృత స్థానమున బ్రహ్మ సృష్టికాదు. ద్విశ్రాద్ధకుడు, నిర్గ్రంధులు, శాక్యులు–పుష్టికలంశకులు, వారు ధర్మమును అనుసరింపరు. వారు నగ్నా దులైన జనులు, వ్యర్థముగ జడలు ధరించు వాడు, వ్యర్థముగ ముద్రల ధరించువాడు, వీరందరు నగ్నాదిజనులు. కులంధములు (కుల నాశకులు), నిషాదులు, పుష్టి వినాశకులు, కృత కర్మాక్షితులైన వీరు కుమారులుగా చెప్పబడినారు. వీరిచే నిర్వర్తింపబడినదియు లేక చూడబడినదియు అయిన శ్రాద్ధమునకు వెళ్లిన మానవులు, బ్రహ్మహత్య చేసిన వాడు(రు), చేసినమేలు మరచినవాడు(రు), నాస్తికులు, గురుతల్పగులు (గురు భార్యతో సంగమించినవాడు), దస్యులు (దొంగలు), క్రూరులు – వీరు చూచిన, శ్రాద్ధములను వదలివేయవలెను.

ఇతర పాపకర్ములనుకూడ శ్రాద్ధమును చూడనీయరాదు. విశేషించి దేవదేవర్షుల నిందలో ఆసక్తులైన వారిని శ్రాద్ధమునకు వదిలివేయవలెను. పైవారిచే చూడబడిన శ్రాద్ధములు రాక్షసులను యాతుధానులను చేరునుకాని పితరులను చేరవు. కృతయుగము

బ్రాహ్మముగా (బ్రాహ్మణ సంబంధిగా) చెప్పబడినది. త్రేతాయుగము క్షత్రియయుగము అనబడినది. ద్వాపరము వైశ్య యుగము అనిరి, కలియుగము శూద్రము అనబడినది.

పితరులు ఇట్లు అనెను :

కృతయుగమున వేదములు పూజింపతగినవి, త్రేతా యుగమున దేవతలు పూజ్యులు, ద్వాపరమున నిత్యము యుద్ధములు ప్రకాశింపదగినవి. కలియుగమున పాషండులు పూజ్యులు. అవమానుడైన అపవిత్రుడైనవాడు, కోడియు, ఊరపందియు, కుక్కయును– ఇవి దర్శన మాత్రమున శ్రాద్ధమును ధ్వంసము చేయును. శవ–సూతకము తగిలినవాడు, దీర్ఘ రోగములు తగిలినవాడు, మలినులు, పతితులు, వీరిచేత ఏవిధముగ నైనను శ్రాద్ధము చూడబడరాదు. వీరు శ్రాద్ధాన్నము చూచిన అది హవ్య కవ్యములకు పనికిరాదు. వారిచేత తాకబడిన ప్రధానమైన వస్తువు సంస్కారశ్వాపద అగును. (సంస్కారమునకై నిలబడిన క్రూరము అగును). హవిస్సుల సమూహములు పూర్వమే వదలబడినవి. ఇక మట్టితో గూడిన నీటి ప్రోక్షణము విధింపబడును. తెల్ల ఆవాలను, నల్ల నూవులను చల్లవలెను. గురు, సూర్య, అగ్నివస్తువుల దర్శనము ప్రయత్నపూర్వకముగా చేయవలెను. ఆసనములను ఎక్కుచుండగా పాదములచే త్రొక్కబడినిదియు, అపవిత్రములై చరించు మృగములు చూచి నదియు, ఎండినది, చలిదియైనదియు, తిన్నదియు, అంతట చెడిపోయినదియు, అగ్రమున నాకబడినదియు, ఇసుక, వెంట్రుకలు, రాళ్లు, కీటకములు, వీనిచే కలిసినదియు, తిలయ వాదులలో సారముతీసిన పిడుచరూపమును, ప్రత్యక్షముగా ఉప్పుగా చేయబడిన సిద్ధాక్షతములైన భక్ష్యములు. వస్త్రములతో విదిల్చబడినవియు శ్రాద్ధ కర్మలో వదిలివేయ దగినవి. వేద విరోధముచే కొందరు తమను విజ్ఞానులుగా భావించువారు ఉందురు. అజ(య)జ్ఞపతులను అట్టివారు శ్రాద్ధమునకు రజస్సు వంటివారు. పెఱుగు–శాకము అట్లే తినగూడనివి, శుక్తమును (పులి కడుగు మాంసము)–ఇవి వదిలివేయతగినవి. వంకాయను వదిలివేయవలెను, అన్ని రసాయనముల అభిషవములను, సైంధవ లవణమును, అట్లే మానససంభవమైన దానిని చిత్తము తలచని దానిని ఈయవలెను. ఇది పవిత్రమై పరమమై ప్రత్యక్షముగ కూడ ఉండును. దానిని అగ్నిలోవేసి చేతులను కప్పి ప్రయత్నముతో బంధింపవలెను. తరువాత దానిని శిరమును పొందింపవలెను. అదియే బ్రహ్మతీర్థము అనబడినది. ద్రవ్యములను చూచుటయును తరువాత ఆవపనము చేయుటయును చేయవలెను. అటనుంచి నీటిచే తడుపవలె, అట్లే నీళ్లలో ఉంచవలెను. అరిష్టములు ఎక్కువగా ఉన్నపుడు బిల్వమును, ఇంగువ–శ్వదనములను ఉంచవలెను. విదలములైన వాని అన్నింటికిని ధర్మమునకువలె శౌచము చేయదగినది. అట్లే దంత,

అస్థి, దారువులకును, కొమ్ములకును అవలేఖనము చేయవలెను. అనగా క్రిందుగా రాపిడి చేయవలెను. అన్ని మట్టివస్తువులను మరల కాల్చుటతో శుద్ధి అగును. మణి, వజ్ర, ప్రవాళములకు, ముక్తా, శంఖమణికిని, తెల్లావాలకల్కము (మడ్డి)తోగాని, నూవుల కల్క ముతోగాని శుద్ధి అగును. ఆవికములయొక్క సర్వ వాలములకు అన్ని విధముల శుద్ధి అగును. అన్ని ఆవికముల వాలములకు మట్టి నీళ్లతో శుద్ధి విధింపబడును. ఆద్యంతములో పవిత్రములైన వానిని మరలనీటితో కడుగవలెను. నూలు వస్త్రములకు భస్మముతో శుద్ధి చెప్పబడినది. ఫల, పుష్పశలాక (బాణ)ములకు నీటిలో ముంచి తేల్చుటతో శుద్ధి. ఊడ్చుట, ప్రోక్షణము, అలుకుటయు భూమికి శుద్ధి క్రియలు, గ్రామము వెలుపల నుండి వెలువడిన భూమి వాయువుచేత పవిత్రమగును. ధనుష్మంతునకును పక్షులకును మట్టితోనే శుద్ధి చెప్పబడినది. ఇది శౌచము యొక్క ఉత్తమ విధి. ఈ తరువాత నేను చెప్పునది వినుము.

ప్రొద్దున గృహమునకు వాయవ్యదిశగా బాణము వేయునంత దూరమున బండి కన్ను అంత స్థానమునుచేసి అట దొడ్డికి వెళ్లవలెను. అపుడు తలను గుడ్డతో కప్పుకొనవలె, శిరమును చేతితో తాకరాదు. ఎండిన గడ్డితోకాని, కట్టెలతోకాని, ఆకులతోకాని, వెదురు టాకుతోకాని, మట్టిపాత్రలతోకాని, భూమిని కప్పివేయవలెను. తోడిన నీళ్లను మట్టిని తెచ్చుకొనవలెను. మౌనము వహింపవలెను. పగలు తూర్పువైపు మొగముచేసియు, రాత్రి దక్షిణమువైపు మొగముచేసియు మలవిసర్జనము కూర్చొనవలెను. కుడిచేత కమండలమును తీసికొనవలెను. ఎడమచేతితో గుదమున మూడు పర్యాయములు మట్టిరాచి శుద్ధి చేసి కొనవలెను. తరువాత ఎడమచేత క్రమమున పది పర్యాయములు మట్టి వేయవలెను. లేదా రెండు చేతులతో ఐదు పర్యాయములైనను మట్టిని (దొడ్డికి వెళ్లిన చోట) వేయవలెను. మట్టితో పాదములు కడుగుకొని, యథావిధిగా ఆచమనము చేయవలెను. సూర్య, అగ్ని, వాయు, జల దేవతలకు మూడుమారులు జలమును వదలవలెను. పండితుడు కమండులువును నీటి యందు దగ్గరగా ఉంచవలెను. వీటిచేత అసత్కార్యమును అనగా మలవిసర్జనము చేయవలెను. శాస్త్రీయముగా మొదట పాద ప్రక్షాళనము చేయవలెను. రెండవదిగా ఆచమనము, తరువాత దేవకార్యము (పూజ) చేయవలెను. దుష్టహస్తమున (స్పర్శచేత) మూడు రాత్రముల ఉపవాసము చేయవలెను. దుష్టుని స్పర్శదూరముగా ఉన్నను సాంతపనాది వ్రతముచే ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. కుక్కనుగాని, కుక్కను వండి తినువానినిగాని తాకినచో తప్తకృచ్ఛ్రముఅను వ్రతమును ఆచరింపవలెను. మను ష్యుల ఎముకలను తాకినచో, శుద్ధికారణముగా ఉపవాసము చేయవలెను. అది మూడు రాత్రులుగాని, స్నేహముతో (నేతితో) ఏకరాత్రముగాని ఉపవాసము చేయవలెను.

కారస్కరులు, పులిందులు, అంధశబరాదులు వీరిని తాకినచో, నీటిని త్రాగిన శుద్ధి, ఐశ్వర్యము పోయినచో బండినొగనుచేరి ధరించిన శుద్ధి. సింధువునకు ఉత్తర పర్యంతముగను, అట్లే దివ్యంతరముననను పాపజనులచే నివసింపబడిన పాప దేశములు నూరు కలవు. అవి వేదపారగులై బ్రాహ్మణులైన శిష్టులచే వదిలిపెట్టబడినవి. అట్టి పాపదేశములకు వెళ్లినవాడు సమస్తపాపమును అనుభవించును. మనస్సును వ్యక్తపరచుట, అగ్ని, సకాలమున గోమయాదిలేపనము, శౌచముల ప్రకాశనము. ఇవి శౌచ సాధనములు. కాని వీనిని నిత్యము తెలియకుండుట పాపము. కావున అజ్ఞానము వలన శౌచమునకు సాంకర్యము చేయువాని కార్యఫలములు పిశాచములకు యాతుధాను లను నిస్సంశయముగా అందును. శౌచమున శ్రద్ధ వహింపనివాడు మ్లేచ్ఛ జాతులలో పుట్టును. యజ్ఞము చేయనివాడు, పాపి, పశుపక్ష్యాది యోనిలో పుట్టినవాడైనను, నరుడు శౌచముచే మోక్షమును పొందువాడై స్వర్గవాసి అగును. శుచికాములైన దేవతలు కూడ ఇట్లే అగుదురు–అని దేవతలే చెప్పిరి. దేవతలు ఎల్లప్పుడు బీభత్సుని, అశుచిని వదిలి వేయుదురు. శుభకర్మలను గూర్చి న్యాయముగా మూడు శౌచముల (మనో, వాక్, దేహ)ను చేయుదురు. బ్రాహ్మణ హితుడు, ఆతిథ్యము స్వీకరించువాడు, శౌచములతో కూడినవాడు, బుద్ధిమంతుడు, పితృ భక్తుడు, ఇంద్రియములను దమింపగలవాడు, దయగలవాడును అయినవారికి, బ్రాహ్మణులు, యోగమును వర్ధిల్లజేయువారగు పితరులును ఆయా చర్యలచే సంతుష్టి చెందినవారై, మనస్సుతో కోరిన ముల్లోకములలోని కోరికలను నెరవేర్తురు. (16)

బ్రాహ్మణ పరీక్ష

ఋషులు ఇట్లు అనిరి :

ఓ బుద్ధిమంతుడవైన సూతుడా! ఋషులచే చెప్పబడిన శ్రాద్ధకల్పమును వింటిమి. అది మిక్కిలి విశేష విస్తరముగ చెప్పబడినది. ఓ మహాప్రాజ్ఞ! ఆ ఋషికి సంబంధించిన మిగిలిన విషయమును యథా మతముగా చెప్పుము.

సూతుడు ఇట్లు అనెను :

ఓ బ్రాహ్మణులారా! శ్రాద్ధమునుగూర్చి ఆ ఋషియొక్క మతమును విస్తరముగ చెప్పెదను వినుడు. నాచే నీ వరకే శ్రాద్ధము, శ్రాద్ధకర్మలయందు విధియు చెప్పబడినవి. ఇప్పుడు శ్రాద్ధ బ్రాహ్మణులను గూర్చి వరుసగా చెప్పెదను.

బ్రాహ్మణులు ఎప్పుడును మంచివారని కాని, చెడువారనికాని విచారింపదగరు. ఇది పవిత్రమైనది. ఉత్తమమైనది. కాని దైవకార్యమునను పితృ కార్యమునను దోషములు

కనబడిన బ్రాహ్మణుని, సజ్జనులచే వదిలిపెట్టబడినవానిని, అతి ప్రయత్నముతో ఇంటినుండి వెడలగొట్టవలెను. పండితుడు అర్హుడా అని తెలియని బ్రాహ్మణుని శ్రాద్ధమున(కు) అర్హుడా అని పరీక్షింపవలెను. కారణము సిద్ధులు బ్రాహ్మణ రూపమున భూమిలో చరింతురు గదా! కావున వచ్చుచున్న అతిథికి చేతులు జోడించి ఎదురేగవలెను. పాదోద కముతోను, పాదాభ్యంజన భోజనములతోను పూజింపవలెను. అట్లే ఈ యోగేశ్వరులైన దేవతలు కూడ ప్రజలను ధర్మముతో పాలించుచు, అనేక రూపములతో సాగర పర్యంతమైన భూమిలో చరింతురు. నరుడు అతిథియైన బ్రాహ్మణుని పూజించి వ్యంజనములను, భక్ష్యములను, పండ్లను ఈయవలెను. పాలతో అతిథి పూజచేసిన అగ్నిష్టోమఫలము లభించును. తేనెతో అతిరాత్ర హోమఫలము సిద్ధించును. శ్రద్ధవహించి విద్వాంసుడైన నరుడు అతిథిని కోరినవాని అన్నింటితో భుజింపజేసినచో తాను కోరినవన్ని సిద్ధించును. వాడు సర్వార్థముల ఇచ్చువాడై, సర్వవిప్రులకు ఆతిథ్యము ఇచ్చువాడై సర్వమేధ యజ్ఞము యొక్కఫలమును నిత్యము పొందును.

శ్రాద్ధమునకాని, దైవకర్మయందుకాని, అతిథిని పిలిచి అవమానించిన వానిని- హోతపరమైన వసువునువోలె దేవతలు నిరసింతురు. లోకానుగ్రహకారణమున దేవతలును, పితరులును, అగ్నియు ఆ అతిథులైన బ్రాహ్మణు లను ఆవేశించి భుజింతురు. అపూజితులైనచో వారు దహింతురు. పూజితులైనచో కోరి కలను తీర్తురు. కావున అతిథులనుఎల్లప్పుడు తమసర్వస్వముతోకూడ పూజింపవలెను. వానప్రస్థుడు, గృహస్థుడు, గృహమునకు వచ్చినవాడును, దుఃఖితులైన బాలురు, యతియు - వీరిని అతిథులనుగా తెలియవలెను. అభ్యాగతుడు యాచకుడగును. అతిథి అయాచకుడు అగును. అతిథికి అతిథి శ్రేష్ఠుడు. ఆ అతిథి యోగము అనబడును. ఘోరుడు గానివాడు, సంకీర్ణుడు కానివాడు, విద్యావంతుడు, విశేషములను తెలియనివాడు, సంతుడుగానివాడు, సంపన్నుడుకాని వాడు, సేవకుడుగాని వాడు ఎప్పటికిని తిరుగు వాడును-అతిథి. యజ్ఞ ఫలమును గోరువాడు దప్పిగొన్నవాడును, అలసినవాడును, కళ్లు తిరిగినవాడును, మిక్కిలి ఆకలిగొన్నవాడును అయిన వానిని సత్కరించి అన్నాదులు ఒసంగవలెను. శివుని కొండ లందు ఎక్కియు, పుణ్యయైన సరస్వతీనదిని పొందియు, సముద్రమును చేరు గంగా నదిని పొందియు మానవుడు పాప విముక్తుడగును. గంగాదేవి మహానది. హిమవత్పర్వత మున పుట్టిన నదులు, తక్కిన ఋషి పూజితములైన నదులు, సరస్సులతో, తీర్థములతో గుర్తింపతగిన నదులు, క్రొత్తగా ప్రవహించు నదులు. ఈ నదులకు వెళ్లి స్నానాదులు చేసినచో పాప విముక్తుడగును. స్వర్గమున నిత్యము పూజింపబడును.

బ్రాహ్మణునకు విశేషముగా మృత సూతకము పది రాత్రులు అశౌచము చెప్పబడినది. క్షత్రియ విషయమున పంద్రెండు రాత్రులు, వైశ్యునకు పదియైదు దినములు. శూద్రుడు నెలకు అశౌచమునుండి శుద్ధినందును. రజస్వలయైన స్త్రీ అన్ని జాతులలోను మూడు రాత్రులకు శుద్ధినందును. రజస్వలాస్త్రీని, బాలెంతరాలిని, కుక్కను మంగలవానిని, మాలవానిని, పీనుగపైని హారములను-తాకినచో శౌచము విధింపబడినది. కట్టుబట్టలతో స్నానము చేసి పంద్రెండు మట్టిపూతలతో స్నానము చేసిన శుద్ధినందును. సంభోగమునందుగూడ ఇదియే శౌచపద్ధతి. తొమ్మిది మట్టిపూతలు, చేతులను మట్టితో గడిగికొని నరుడు శౌచవిధిని జేయవలెను. నీటితో చేతులుగడిగి, మట్టితో మరల స్నానము చేసి, గుహ్యాస్థానమున మట్టిని, మరల రెండుమారులు పూసి కడుగవలెను. ఈ విధముగా సర్వజాతులందు శౌచవిధి నిర్వహించవలెను. మూడు పర్యాయములు మట్టిని పూసికొని కాలుచేతులను కడిగికొనవలెను. ఇది అరణ్యమైన శౌచము.

ఈ తరువాత గ్రామ్య శౌచమును చెప్పెదను. పాదముల శుద్ధికై మూడు మృత్తులే! హస్తముల శుద్ధికైగూడ మూడు మృత్తులే! (మృత్తు ఒక నియత పరిమాణము గల మట్టి). అమేధ్యమున (అపవిత్రమున) హస్తాదుల విభాగమును బట్టి పదిహేను (మృత్తులు). చివర నీటితో కడుగుటచే శుద్ధి అగును. మెడనుగాని, తలనుగాని కప్పుకొని రాజమార్గమున పాదములతో ఉన్నను పాదముల శౌచముచేసికొనక ఆచమనము చేసినను శుద్ధిని పొందదు. అశుచియే అగును. ప్రక్షాళనము చేసికొని, పాత్రను అచటనుంచి, ఆచమనముచేసి మరల అభ్యుక్షణము (చేతిని బోర్లగానుంచి నీటిని చల్లుట) చేయవలెను. (చేతిని వెల్లకిలగా నుంచి నీటిని జల్లుట ప్రోక్షణము. చేతిని కొద్దిగ అడ్డముగా వంచి నీటిని చల్లుట అవోక్షణము.) వేఱొక వస్తువునకు కూడ అట్లే మరల అభ్యుక్షణము చేయవలెను. పూలు మొదలగు వానికిని, గడ్డి పోచలకును ప్రోక్షణము చేయవలెను. హవిస్సులకును, తీసివేసిన పదార్థములుగల ద్రవ్యములకును అచట నుంచి అభ్యుక్షణము చేయవలెను. శ్రాద్ధముననను, దైవముననను ప్రోక్షితమైన దానిని కొద్దిగా దీసికొనవలెను. వేదియందు ఉత్తరముగా తీసికొనవలెను, దక్షిణముగా విసర్జింపవలెను. వ్యతిరేకముగా చేసినచో పితృకార్యముకాని లేక దైవకార్యముకాని విచ్ఛిన్నము అగును. కుడిచేతితో దక్షిణవేదిని ఆలేఖింపవలెను. దేవతలకు చేతులతోను, పితరులకు చేతులతో గాక వికరముగా (బదులుగా దేనితోనైనను) ఆలేఖించిన శుభము. క్షుభితునియందు స్వప్నమునందును, మూత్ర-పురీషములందును, బయల్పడిన ఉమ్మియందును, భుజించి కప్పుకొనక ఉండునపుడు, ఉమ్మిని తాకినపుడు, పాదములు తడిపినపుడు, వదిలిపెట్ట బడినవాని మంచిమాటయందు, సమస్త సందేహములందు,

జుట్టుముడి విడిచినపుడును, నియమము గలవానికి శౌచము ఉండదు. యజ్ఞోపవీతము లేక అజ్ఞానమున ఆచమనము చేసినచో దంతముతో పెదవితాకినప్పుడు, మాలవానిని చూచినపుడు, దంతములలో చిక్కిన దానిని నాలుకతో తాకినపుడు, వ్రేళ్లతో శబ్దముచేసి ప్రణతుడై చూచువాడును, అశుచి అగును. అజ్ఞానమున ధర్మమునందుండి ఆచమనము చేసినను అశుచి అగును. శుచియైన ప్రదేశమున ఈశాన్య దిక్కునకు మొగమై కూర్చుండవలెను. కాళ్లు చేతులు కడుగుకొని మోకాళ్ల మధ్యన చేతులు కలవాడై ఆచమనము చేయవలెను. పరిశుద్ధుడై యేకాగ్రచిత్తుడై నిర్మలమైన నీటిని మూడు మారులు త్రాగవలెను. రెండు మారులే మార్జనమును (నీళ్లు చల్లుకొనుట-తుడుచుకొనుట) జేయవలెను. తరువాత ఒక్కమారు అభ్యుక్షణము (అరచేతిని తల్లక్రిందుగాచేసి నీళ్లు జల్లుట) చేయవలెను. ఇంద్రియములను, తలను, తనను, కాలు సేతులను అట్లే అభ్యుక్షణము చేయవలెను. ఇట్లే అతనికి ఆచమనము, వేదములు, యజ్ఞములు, తపములును, దానములు, బ్రహ్మచర్యమును అట్లే సఫలములు అగును. అజ్ఞానమున ఆచమనము చేయకయే క్రియను (యజ్ఞాది క్రియను) చేయువాడు నాస్తికుడు అగును. ఆతనికి ఈ క్రియలన్నియు వ్యర్థములగును. సంశయములేదు. వాక్కు చేతను భావముచేతను శుద్ధమైనదియు దుష్టముగాదు నిందితము గాదు. వీనిని పవిత్రములుగా తెలియవలెను. వీనికి విరుద్ధమైనది దుష్టము. ఎప్పుడును బ్రాహ్మణుడు బాధితుడుగా ఏమాత్రము చెప్పబడరాదు. సత్కరించి ఆతనికి ఇచ్చినది యూపములేని యజ్ఞము అనబడినది. కృశవృత్తిగలవానికి, యాచకుడుగాని వానికి, ఏకాంతముగ ఉండి స్వభావము గలవానికి, సిగ్గుగలవానికి ఎప్పుడును శ్రాద్ధమున మాడని అన్నమును, వండిన అన్నమును భుజింప చేయవలె. మాలవారికి శ్రాద్ధాన్నము పెట్టువాడు బ్రహ్మహత్య చేసిన వాడును, దురాత్ముడును అగును. శ్రాద్ధమున ఒకేపంక్తిలో విషమముగా బ్రాహ్మణులను (భోక్తలను) భుజింపచేయువాడు నూరుజన్మలందినను పాపవిముక్తుడుకాడు. నియుక్తుడుగాని, అనియుక్తుడుగాని పంక్తిచేత దుష్కృతము హరించును. ఇష్టాపూర్తములు నశించును. (యజ్ఞాదులు ఇష్టములు. బావులు, చెఱువులు త్రవ్వించుట మొదలగునవి పూర్తములు).

యతి, బ్రాహ్మణులు అందఱిలోను శ్రాద్ధ ఉత్సవమున ముందుగా పూజింప దగినవాడు. మహాభారతేతిహాసమే ఐదవదిగాగల నాల్గు వేదములు చదివిన బ్రాహ్మణోత్తముడును పూజింప తగినవాడు. ఆ తరువాత బాగుగా తెలిసికొని యోగ్యతను అనుసరించి శ్రాద్ధమున బ్రాహ్మణుని నియోగింపవలెను. ఆ తరువాత (చతుర్వేది లేనిచో) మూడు వేదములు చదివినవాడు, ఆతడు లేనిచో రెండు వేదములు చదివినవానిని, అతడు

లేనిచో ఒక వేదము చదివిన వానిని, ఆతడు లేనిచో న్యాయశాస్త్రమును చదివిన వానిని శ్రాద్ధ బ్రాహ్మణునిగా నియోగింపవలెను. శ్రాద్ధభోక్తల పంక్తియొక్క పవిత్రతకై వారిని చెప్పుచున్నాను వినుడు. పూర్వము చెప్పబడినవారందరు పూర్వానుక్రమముగను, షడంగియు (శిక్షా, వ్యాకరణ, ఛ్ఛందో, నిరుక్త, జ్యోతిషములు చదివినవాడు) యోగియు, అన్నితంత్రములు తెలిసినవాడును, యాయవరుడు (ఔషధజ్ఞాని లేక ఋషి)ని భోజ్య పంక్తిలో పవిత్రులు. పదునెనిమిది విద్యలలో ఒక విద్యయందు పారుగుడైనవాడును భోజ్య పంక్తి పావనుడే. ఉన్నది ఉన్నట్లు నడుచుకొను వారందరును పంక్తి పావనులే. త్రిణాచికేతుడు (నాచికేతాగ్నిని ఉపాసించినవాడు) త్రైవిద్యుడు (మూడు విద్యలు గలవాడు) ధర్మములను చదివిన వాడు అయిన బ్రాహ్మణుడు, బార్హస్పత్య (ధర్మ) శాస్త్ర పారంగతుడు అగు బ్రాహ్మణుడు, వీరు అందరును భోజ్యపంక్తి పావనులుగా చెప్పబడిరి. శ్రాద్ధభోక్తగా పిలువబడి స్త్రీని సేవించినవాని పితరులువాని రేతస్సున పరుందురు. శ్రాద్ధమును జేసికొని శ్రాద్ధభోజనము జేసికొని మైథునమును సేవించినవాని పితరులు వాని రేతస్సున ఉందురు. ఇట సంశయములేదు. కావున అతిథికి శ్రాద్ధ దానము చేయవలెను. బ్రహ్మచారిని భుజింపజేయవలెను. ధ్యాననిష్ఠునకు దయామయునకు శ్రాద్ధ దానము చేయవలెను. ధార్మికుని, యతిని, వాలఖిల్యులను (వాలఖిల్యులవలె సూర్యోపాసకులను) శ్రాద్ధ కర్మలో భుజింపచేయవలెను. వానప్రస్థునకు ఉపకరించువాడు పూజా మాత్రముతో సంతుష్టుడు అగును. శ్రాద్ధమున-గృహస్థుని భుజింపచేసిన విశ్వేదేవులు (సమస్త దేవులు) పూజితులు అగుదురు. వానప్రస్థుని భోజనమున ఋషులు పూజితులు అగుదురు. వాలఖిల్య భోజనమున ఇంద్రుడు పూజితుడు అగును. యతులను పూజించిన సాక్షాత్తు బ్రహ్మనే పూజించిన వాడును అగును. ఐదాశ్రమములు పావనములు. ఉపధలచే (పరీక్షలచే) ఆశ్రమములు కావు. శ్రాద్ధమునను దైవమునను నాలుగు ఆశ్రమములు పూజ్యములు. నాలుగు ఆశ్రమముల బాహ్యులైనవారికి శ్రాద్ధదానముచేయరాదు. నాలుగు ఆశ్రమములకు బాహ్యుడై ఉన్నవాడు ఆకలిగా ఉన్నవాడును యతిగాక మోక్షవాదియు, ఈ ఇరువురు భోజ్య పంక్తి దూష్యులు. వ్యర్థముగా తల గొరిగించుకొన్నవాడు, వ్యర్థముగా జడలు పెంచుకొన్నవాడు, కపటులు అందరును శ్రాద్ధభోజ్యపంక్తికి దూష్యులు. నిర్ఘృణులను (కఠినులను) భిన్నమైన వృత్తముకలవారిని, సర్వభక్షులను (భక్ష్యా భక్ష్యములను అన్నింటిని తినువారిని), శ్రాద్ధ భోజ్యపంక్తికి వదిలివేయవలెను. శిల్పులు మొదలగువారిని, అనాచారులను, సర్వవేదములచే బహిష్కరింపబడినవారిని, గాయకులను, దేవపూజాది వృత్తిగలవారిని, హవ్య-కవ్యముల విషయమున వదిలివేయవలెను. బ్రాహ్మణుల విషయములో హాని చేసిన వానిని

శ్రాద్ధ కర్మలో వదిలివేయవలెను. వీరిలో ఉన్నవాడు సమస్తవర్ణమును చేరును. శూద్రునితో సహభుజించువారందరు పంక్తి దూష్యులు. చంపుట, శక్తిని పూర్తిగా చంపుట, కృషి (వ్యవసాయము), వ్యాపారము, పశుపాలనము గురువు గానివాని సేవించుట, రహస్యముగా చేయరాని పనిచేయుట-ఇవి బ్రాహ్మణునికి పనికి రావు. నిత్యము జ్ఞానులై, ధ్యానులైన బ్రాహ్మణులు పూజ్యులు. కాని మిథ్యాసంకల్పులు, దుర్వృత్తులైన అందరు బ్రాహ్మణులును, మిథ్యాతత్త్వ విదులు ఉపపాతకములతో గూడినవారు, విశేషించి పాతకములతో కూడిన వారును, వేదమున నియోగము (ఉద్యోగము) ఇచ్చువారు, లోభ-మోహ ఫలములను కోరువారును, వేదము (విద్య)ను అమ్ముకొనువారు, శ్రాద్ధకర్మలో వదలబడినవారు, బ్రాహ్మణునికి పనికిరావు. వేదములకు నియోగము (ఉద్యోగము) లేదు. ఆ విధముగ వేదములకు నియోగించువాడుపాపి. ఆ నియోగఫలము (వేతనము) భుజించువాడు ముఖ్యమైన వేదఫలమునుండి భ్రష్టుడగును. ఆ వేతనము ఇచ్చువాడు దానఫలము నుండి భ్రష్టుడగును. (ఆ విధముగ వేదము చదువు వానికి వేద ఫలమురాదు. వేదవిద్యా దానము జేయువానికి దానఫలము రాదు). ధనము తీసికొని వేదము చెప్పువాడును, ధనమిచ్చి వేదము చదువువాడును వేదమును అమ్ముటచేతను కొనుటచేతను శ్రాద్ధమునకు బ్రాహ్మణులుగా ఉండదగరు. జీవనమునకై వేదము అమ్మువారు, కొనువారును మిక్కిలి నిందితులు. ఇది వైశ్యుని యొక్క వృత్తి, బ్రాహ్మణునకిది పాతకము. వేదవేత్తలపై కాని, వేదములపైకాని ఆధారపడి జీవించువారు ఇరువురును శ్రాద్ధమునకు తగరు. కూతురు మొగుడుకూడ శ్రాద్ధమునకు తగడు. వ్యర్థముగా భార్యను భోగించువాడును, అధ్వరమున వ్యర్థముగా యాగము చేయువాడును ఇరువురును శ్రాద్ధభోక్తకు తగరు. నాస్తిక బ్రాహ్మణుడును తగడు. తన కొఱకు అన్నమును వండుకొనువాడును, దేవ-అతిథులకు అన్నమును దానము చేయనివాడును ఇరువురును శ్రాద్ధ భోక్తకు తగరు. వారు పతితులై బ్రహ్మరాక్షసులు అగుదురు. ఎవరి స్త్రీలు, రాత్రియందే ఆసక్తులో! ఎవరు పరస్త్రీల అందు ఆసక్తులో! ఎవరు అర్థ, కామములందు మాత్రమే ఆసక్తులో! వారిని శ్రాద్ధమున భుజింపజేయరాదు. వర్ణాశ్రమ ధర్మములకును, శ్రాద్ధ కర్మకును విరోధులైన వారును, దొంగయును, అందరిని యజ్ఞము చేయించువాడును, వీరందరును శ్రాద్ధ భోజనపంక్తికి నింద్యులు. పందివలె తినువాడును, అరచేతితో తినువాడును, వామముగా (ఎడముగా) తినువాడును తిన్న అన్నము పితరులకు చెందదు. స్త్రీకిని, శూద్రునకును, దగ్గరికిరానివానికి శ్రాద్ధోచ్ఛిష్టమును ఇప్పింపరాదు. రాగ మోహములవలన ఇట్లు ఇచ్చినచో అది ఎప్పుడును పితరులకు చెందదు. కావున శ్రాద్ధ కర్మలో నేయి, పెరుగు తక్క ఉచ్ఛిష్టములైన అన్నాదులను ఎవరికిని ఈయ

రాదు. శిష్యుని విషయమునగాని పుత్రుని విషయమున గాని వేరుగాదు. శ్రాద్ధమున అనుచ్ఛిష్టమునే విశేషించి అట్టి అన్నమునే ఈయవలెను. పుష్ప, మూల,-ఫలములతోను, అన్నము వల్ల నుపితరులు తుష్టిని పొందుదురు. అన్నాదులు పవిత్రములుగా ఉన్నంత వరకు అవి చల్లారనంత వరకును, భోక్త వానిని మాటాడకుండ తినునంత వరకను పితరులు ఆ అన్నాదులు భుజింతురు. దానము, ప్రతిగ్రహము, హోమము, భోజనము, బలియు, అంగుష్ఠముతో గలిపి చేయవలెను. అపుడు అవి అసురులకు పోవు. ఇవియే అన్నియును విశేషించి దానాదులును శ్రాద్ధమున చేయదగినవి తగనివియును. మోకాళ్ల మధ్యలో (చేతులుంచి) ఆచమనము చేయుట అన్నింటికిని సమానము. ముండులను (తలగొరిగి కొన్న సన్యాసులను), జడలను, కాషాయ వస్త్రములను ధరించిన వానిని శ్రాద్ధకాలమున కూడ రానీయరాదు. శిఖలు గలవారికిని, త్రిదండి సన్న్యాసులనుగాని ప్రయత్నపూర్వకముగా శ్రాద్ధమున భోక్తలుగా జేయవలెను. నిత్యమున వ్రతమునందున్న వారును, జ్ఞానులును, ధ్యానులును, దేవభక్తులైన మహాత్ములును దర్శనమాత్రమున శ్రాద్ధ మును పవిత్రము చేయుదురు. ఈ ముల్లోకములు అన్నియు యోగేశ్వరు లచే ఎల్లప్పుడును వ్యాపించి ఉన్నవి. కావున జగత్తులో ఉన్నయే కొంచెమైనను సమస్తమునైనను జూపు దురు. వ్యక్తావ్యక్తమును వశపరచుకొని సర్వమునకును పరమై సంసద్రూపమై చూడబడినది! మహాత్ములకు సదసద్రూపమైనది. మహాత్ములయొక్క సర్వజ్ఞానములును మోక్షాదులును చూడబడినవి. కావున వానిలో ఎల్లప్పుడు ఆసక్తుడైనవాడు అనుత్తమమైన (దేనికంటె ఉత్తమ మైనది ఏదియు లేదో ఆ పరమపద రూపమైన) అశుభమును పొందును. ఋక్కులను తెలిసినవాడు వేదములు తెలియును. యజుస్సులను తెలిసినవాడు యజ్ఞములను తెలుసు కొనును. సామములను తెలిసినవాడు బ్రహ్మను తెలుసుకొనును. మానసమును తెలిసిన వాడు సర్వము తెలియును. (17)

దాన ఫలము

బృహస్పతి ఇట్లు అనెను :

ఆ తరువాత శ్రాద్ధ సంబంధముగ దానములను, ఫలములను చెప్పెదను. సర్వ ప్రాణులను తరింప చేయునదియు, స్వర్గమునకు మార్గమైనదియు, సుఖము కలుగజేయు నదియు, లోకమున మిక్కిలి శ్రేష్ఠమైనదియు, స్వర్గమును ఇచ్చునదియు, తనకును కూడ ఇష్టమైనదియు అయిన సర్వమును పితరులకు అక్షయమునుకోరి ఈయవలెను. పితరులకు అన్నము ఒసగువాడు బంగారముతో జేయబడి దివ్యమై సూర్యునితో సమానమైనదియు

దివ్య అప్సరసలతో కూడినదియు అయిన విమానమును పొందును. శ్రాద్ధ కర్మలో క్రొత్తగా కప్పుకొను వస్త్రమును ఇచ్చువాడు ఆయువును, మిక్కిలి ఐశ్వర్యమును, రూపమును, పుత్రుని పొందును. శ్రాద్ధ కాలమున ధర్మవేత్తఅయి జందెమును ఇచ్చినవాడు, చక్కని పానీయమును ఇచ్చినవాడు సర్వ బ్రాహ్మణులకు బ్రహ్మ (వేద-విద్యా) దానము చేసిన ఫలమును పొందును. శ్రాద్ధ కాలమున చక్కగా చేసిన కమండలువు ఇచ్చినవానికి మధు-క్షీరములను ఇచ్చు ఆవు లభించును. శ్రాద్ధమున చక్రముతో తూట్లుపడని కమండలువు ఇచ్చిన వాడు పాలిచ్చునదియే కాక కోరికలను పిదుకునట్టి దివ్యమైన గోవును పొందును. పుష్పమాలలచే అలంకరింపబడిన పూర్ణశయ్యను ఇచ్చినవానికి ఆ శయ్య ఉత్తమమైన మేడయై, ఎచట ఉన్న అచ్చటికి వెంటాడివచ్చును. శ్రాద్ధమున యతులకు రత్నములు నిండినదియు, చక్కని ఆసనములు పాన్పులు భోజనములు-వీనితో కూడినదియు అయిన భవనమును ఇచ్చినవాడు స్వర్గముపైన ఆనందించును. ముత్యములు వైడూర్యములు గల వస్త్రములను, వివిధములైన రత్నములను ఇచ్చినవాడు పదివేల పదికోట్లు దివ్య వాహనములను పొందును. మహాఅగ్నితో సమమును, రత్నములతోను, కామములతోను కూడినదియు, సూర్య, చంద్రకాంతులు కలదియు, అక్షయము అయిన దివ్య విమానము పొందును. అది అప్సరసలతో చుట్టబడినదియు, కోరిన చోటికి మనో వేగముతో పోవునదియునై ఉండును. దాత ఆ విమానాగ్రమున అంతటను స్తుతింపబడుచు ఉండును. అతనిని దివ్య గంధములతోను పుష్ప వర్షములతోను తడుపుదురు. అచట గంధర్వులు అప్సరసలును గానము చేయుదురు. వాద్యములను వాయింతురు. ముఖ్యులైన కన్యలును యువతులును అప్సరోగణములతో కూడిన వారై మనోహరములైన సుస్వరములతో ఆతడిని ఎల్లప్పుడు మేలుకొల్పుదురు. నరుడు శ్రాద్ధమున వేయి గుఱ్ఱముల దానము చేసియు, నూరు రథముల దానము చేసియు, వేయి ఏనుగుల దానముతోను, యోగిని అను స్త్రీతో నివసించును. మానవుడు శ్రాద్ధమున నీరు లేనిచోట శృంగారముగ ప్రకాశించు వస్తువును పితరులకును యోగులకును దానము చేసిన వేయి బంగారు మాడల ఫలమును పొందును. జీవితము ప్రధానమయినందున వేరొక దానము విశిష్టమైనది కాదు. కావున సర్వప్రయత్న ములతో ప్రాణాభిరక్షణమును చేయవలెను. అహింస సర్వదేవతలకన్న పవిత్రమై సర్వమును ఇచ్చునది. ప్రాణులకు జీవితదానము పరమము అని బుధులందురు. శ్రాద్ధమున గుర్తుంచు కొనదగిన బంగారు పాత్రలను ఇప్పింపవలెను. భక్ష్యములును, రసములును, సౌభాగ్య మును ఆ పాత్రములో చేరి ఉండును. శ్రాద్ధ భోజనమున సుందరమైన తైజస (బంగారు) పాత్రము ఈయవలెను. ఆ పాత్రమే కోరికలకుగాని, రూపమునకుగాని, ధనమునకుగాని

స్థానమగును. శ్రాద్ధ కర్మలో వెండిదానినిగాని, బంగారు దానినిగాని ఈయవలెను అట్లిచ్చిన దాత మిక్కిలి ధర్మమును పొందును. వర్షపుకుండవంటి పొదుగుగల గోవును ఇచ్చిన వానిని గోవులును గో పుష్టియు చేరును. శిశిర ఋతువున బ్రాహ్మణులకు ఇంధనములను (కట్టెలను) ఇచ్చువాడు, చలికాలము రాగా బహుకాష్టముగల అగ్నిని పొందకలడు. యుద్ధ మున నిత్యము జయించును. సిరికలవాడై ప్రకాశించును. సుగంధములైన మాలలను పొందును. దాతను మనోహర యువతులు, శయనములు, ఆసనములు, రమ్యములైన భూములు వాహనములును సేవించును. శ్రాద్ధమునగూడ వీనిని ఇచ్చినవాడు అశ్వమేధ ఫలమును పొందును. ధర్మ శ్రాద్ధము రాగా, శ్రాద్ధ కాలమున ఇవి నివేదింపతగినవి. గుణయుక్తులైన బ్రాహ్మణుల స్మృతిని మేధను పొందును. శ్రాద్ధమున సత్కరించి నేతితో నిండిన పాత్రలను ఇప్పింపవలెను. కుండవంటి పొదుగులుగల అనేకధేనువుల (దాన) ఫలమును పొందును. ఈ లోకమునగూడ మంచి వాహనములుగల రథములతో ఆనం దించును. శ్రాద్ధమున కోరినది ఇచ్చినవాడు పుండరీక యాగఫలము అందును. రమ్యమైన ఇంటిని ఇచ్చిన రాజసూయయాగ ఫలమును పొందును. పుష్పఫలము లతో గూడిన వనమును ఇచ్చిన సౌరభము (కామధేను ఫలమును) పొందును. బావులు, తోటలు, చెరువులు, క్షేత్రములు (పొలములు), పల్లెలు, గృహములు–వీనిని ఇచ్చిన సూర్య చంద్రులు ఉన్నంత వరకు స్వర్గమున ఆనందించును. శ్రాద్ధమున రత్నములు పొదిగి పరచిన శయన మును ఇచ్చినవాడును, సూర్యచంద్రులు ఉన్నంతవరకు స్వర్గమున ఆనందించును. అతని పితరులు సంతసింతురు. అనంతమైన స్వర్గమును అనుభవింతురు. అతడు రాజులచే పూజితుడు అగును. ధనధాన్యములతో వర్ధిల్లును. ఉన్ని, పట్టు వస్త్రములు, శ్రేష్ఠమైన గొంగళ్లు, చర్మము, బంగారు పట్టా, రత్నకంబళి, శాలువ. ఈ దానములను యథావిధిగ శ్రద్ధతో బ్రాహ్మణులకు భోజనము చేయించి ఈయవలెను. నూరు వాజపేయ యాగముల ఫలమును పొందును. మంచి రూపములుగల అనేక స్త్రీలు, పుత్రులు, భృత్యులు, (నౌక రులు), సేవకులు, భూతములును వశమున ఉందురు. ఈ లోకమున ఆరోగ్యము ఉండును. పట్టు వస్త్రము, నారచీర, నూలుచీర, తెల్లని సన్నని వస్త్రము–వీనిని శ్రాద్ధమున ఇచ్చువాడు పుష్కలములైన కోరికల పొందును, సూర్యోదయము చీకటినివలె అలక్ష్మిని పోగొట్టును. నక్షత్రములలో చంద్రునివలె విమానాగ్రమున ప్రకాశించును. వస్త్రము సర్వదేవతలకు సంబంధించినదికదా. సమస్త దేవతలచే ప్రకాశించు నిండు చంద్రునివలె విమానాగ్రమున ప్రకాశించును. సమస్త దేవతలచే ఎక్కువగా వస్త్రము స్తుతింపబడినది. వస్త్రము లేనిచో క్రియలేదు. యజ్ఞములులేవు, వేదములు లేవు, తపములులేవు. కావున వస్త్రములు దానము

చేయవలెను. విశేషించి శ్రాద్ధకాలమున దానిని దానము చేయవలెను. దాత ఆ యజ్ఞ వేదతపములు అన్నింటిని పొందగలడు. పై వానిని నిత్యము శ్రాద్ధమున నియతుడై తత్ప రాయణుడై ఇచ్చువాడు సర్వకామములను సర్వరాజ్యమును పొందగలడు. సర్వకామ సమృద్ధమైన యజ్ఞము యొక్క ఫలమును పొందును. భక్ష్యములను, అటుకులను, పెరుగుతో కలిపిన పేలపిండిని, పిండివంటలను, నేయి శర్కరలను, కృశరములను, మధుపర్కము, పాలపరమాన్నము, నేతి భక్ష్యములను, శ్రాద్ధమున ఇచ్చిన వానికి పెరుగు, కలితిలేని గవ్యము (నేయిపాలును), అనేక విధములైన భక్ష్యములు దానము చేసినవానికి అగ్నిష్టోమ యాగఫలము లభించును. కావున వర్షకాలములోను, మఘానక్షత్ర కాలములోను (సామా న్యముగా భాద్రపద బహుళ త్రయోదశి మఘానక్షత్రయుక్తము అగును) అన్నము శ్రాద్ధమున దుఃఖింపచేయును. అపూపాదులు కావని భావము. దానికై నేతితో బ్రాహ్మణులను భుజింప చేయవలెను. నేతిని భూమిపై వదలవలెను. గయలో శ్రాద్ధమున ఏనుగులను ఇచ్చిన దుఃఖము పొందడు. అన్నమును పాయసమును, నేతిని, తేనెను, మూలకందను, ఫలము లను, వివిధములైన భక్ష్యములను ఇచ్చిన, ఈ లోకమున చచ్చినను పరలోకమున ఆనందిం చును. పాలు శర్కరలతో కూడిన అటుకులు నిత్యము ఇచ్చిన అక్షయము అగును. కృసరములతోను, చిరుసెనగలతోను కలిపిన సత్తును పేలాలను, గుగ్గిళ్లను వ్యంజనములతో పిండివంటలను, నేతిలో నాని మనోహరములైన భక్ష్యములను, పెరుగు-సత్తుపిండిని శ్రాద్ధమున బ్రాహ్మణులచేత భుజింపనీయవలెను. అతడు 'పద్మ' నిధులను పొందును. (నవ నిధులలో 'పద్మ'మనునది ఒక నిధి) శ్రాద్ధమున సత్కరించి, ప్రయత్నముతో క్రొత్త పంటల ఇచ్చినవాడు సర్వభోగములను పొందును. స్వర్గమునకుపోయి పూలను అందు కొనును. భక్ష్య, భోజ్యములను, చోష్యములను, పేయములను, లేహ్యములను సర్వశ్రేష్ఠము లైన వానిని ఇచ్చిననరుడు సర్వశ్రేష్ఠుడు అగును. సౌమ్యమైన వైశ్వదేవమును, ఖడ్గ మృగ మాంసము శ్రేష్ఠమైనహవిస్సు, వీనిని ఈయవలెను. ఖడ్గమృగముయొక్క కొమ్మునుమాత్రము వదలివేయ వలెను. దీనితో అసూయను నశింప చేయగల్గుదుము. భోజనమున అతిథులకు చేతులు జోడించి అగ్రాసనము ఈయవలెను. వాడు సర్వ యజ్ఞక్రియల ఉత్తమోత్తమ ఫలమును పొందును. మిక్కిలి వేడియై బిరుసులేని అన్నము ఆకలిగొన్న వానికి ఈయ వలెను. అట్లే యత్నించి చమురుతో నానిన వ్యంజనమును భక్తిచే సత్కరించి ఈయవలెను. అన్నదానము చేసినవాడు బాలసూర్యునివలె ప్రకాశించునదై, హంస వాహన రూపమైన విమానమును మూడు కల్పకోటుల కాలము వరకును పొందును. అన్న దానమునకన్న ఉత్కృష్టమైనది ఈలోకమున ఏదియులేదు. అన్నము నుండి ప్రాణులు పుట్టుచున్నవి,

జీవించుచున్నవి. సంశయము లేదు. జీవదానము కన్న ఉత్కృష్టమైన దానము ఈ లోక మున ఏదియు లేదు. అన్నములచేతనే ముల్లోకము జీవించుచున్నది. అది అన్న ఫలమే. అన్నమున లోకములు ఉండును. లోక దానమునకు అది ఫలము. అన్నము సాక్షాత్తు ప్రజాపతి. అతనిచే ఈ జగమంతయు వ్యాప్తమైనది. కావున అన్నముతో సమానమైన దానములు ఇంతవరకు లేవు. ఇక ఉండబోవు. పితృ భక్తుడైన మానవుడు భూమిలోఉన్న రత్నములను, వాహనములను, స్త్రీలను వీటిని అన్నింటిని వెంటనే పొందును. ఎప్పుడును చేతులు జోడించి అతిథులకు ఆశ్రయము ఈయవలెను. దివ్యములైన ఆతిథ్యములతో వేలవిధముల ఆ దేవతలు ఎదురుచూతురు. ఈ అన్నింటిని భూమిలో దానము చేసినవాడు ఏకచ్ఛత్రాధి పతి అయిన రాజగును. మూడు రెండు తరువాత ఒకటి దానము చేయుటచే సుఖి అగును. దానములు పరమధర్మము. సత్కరించి పూజింపబడుట సిద్ధి. దానము వల్లనే త్రైలోకాధి పత్యము వ్యవస్థితము. పితృభక్తుడైన నరుడు రాజైనచో రాజ్యము నందును. నిర్ధనుడు అయినచో ఉత్తమ ధనమునందును. అతడు ఏ కోరికలను మనస్సుతో కోరు కొనునో, ఆతని పితరులు వానిని తెలియుదురు. (18)

తిథి విశేష శ్రాద్ధఫలము

బృహస్పతి ఇట్లు అనెను :

ఆ తరువాత శ్రాద్ధ కర్మలో పూజితమైన దానిని చెప్పెదను వినుడు. శ్రాద్ధకర్మలో నిత్యము కామ్యమైనవియు, నైమిత్తికమైనవియు, మాటిమాటికి చేయునవియు అయిన పనులను చెప్పెదను. పుత్రుడు భార్య, ధనము-ఇవి మూలముగాకల మూడే అష్టకములు (శ్రాద్ధ విశేషములు). పూర్వ పక్షము శ్రేష్ఠమైనది. అందులో పూర్వము (మొదటిది ప్రతి పత్తిథి) చిత్రి అనబడినది. ద్వితీయా తిథి ప్రాజాపత్యకము, తృతీయా తిథి వైశ్వదేవికము. మొదటిది పిండివంటలతో చేయదగినది. తరువాతిది మాంసములతో చేయదగినది. తృతీయాతిథి శాకములతో చేయదగినది. ఇది తిథులకు ద్రవ్యముతో విధించిన విధానము. పితరుల యన్వష్టకా శ్రాద్ధము నిత్యము చేయవలసినట్టిది. తరువాతిది చతుర్థి. దానిని విశేషముగ చేయవలెను. చతుర్థులలో పండితుడు, తన సర్వస్వముతో కూడ శ్రాద్ధము చేయవలెను. ఇహపరలోకములలో అన్నింట సుఖి అగును. పూజకులకు ఎప్పుడును ఉత్కర్షము. నాస్తికులకు అధోగతి. సర్వ కాలములందు పితరులు. కాని తిథి కాలములందు దేవతలు, ఆవులు జలాశయమును చేరినట్లు అందరును పురుషుని కడకువత్తురు. వారు సురపూజితములైన అష్టకములకు వెళ్లరాదు. ఆతని లోకము జలాశయమును చేరినట్లు

అందరును పురుషుని కడకు వత్తురు. ఆతని లోకము వ్యర్థమగును. లభించినది కూడ నశించును. దానము చేయువారు దేవతలను పొందుదురు. అట్లుకాక దానము చేయనివారు అడ్డముగా (పక్కకు) పోవుదురు. పూర్ణిమ యందు శ్రాద్ధము చేయువాడు మొదట సంతానమును, పుష్టిని, స్మృతిని, మేధను, పుత్రులను, ఐశ్వర్యమును పూర్ణముగా అనుభవించును. ప్రతిపత్తిథి ధనలాభమును కలిగించును. లభించినది నశింపదు. ద్వితీయయందు శ్రాద్ధము చేసినవాడు రెండు పాదములుకల మానవులకు అధిపతి అగును. తృతీయా శ్రాద్ధము వరము కోరువారి శత్రువులను చంపును. పాపముల నశింపచేయును. చతుర్థియందు శ్రాద్ధము చేసినవాడు శత్రువు యొక్క లోపములను చూచును. పంచమీ శ్రాద్ధకర్త మహాశ్రీని పొందును. షష్ఠీ శ్రాద్ధకర్తను బ్రాహ్మణులు పూజింతురు. సప్తమీ శ్రాద్ధకర్త మహాసత్రమును పొందును. గణములకు అధిపతి అగును. అష్టమీ శ్రాద్ధకర్త సంపూర్ణాభివృద్ధిని పొందును. నవమీ శ్రాద్ధకర్త ఐశ్వర్యమును కోరిన స్త్రీని పొందును. దశమీ శ్రాద్ధకర్త బ్రాహ్మీ సంపదను (విద్యా సంపదను) పొందును. సర్వవేదములను పొందును. వాని పాపములు అన్నియు నశించును. ఏకాదశీ శ్రాద్ధదానకర్త ఎల్లప్పుడు ఐశ్వర్యమునందును. ద్వాదశీ శ్రాద్ధకర్త రాష్ట్రలాభమును జయమును ధనములను పొందునందురు. త్రయోదశీ శ్రాద్ధకర్త సంతానమును, బుద్ధిని, పశువులను, మేధను, స్వాతంత్ర్యమును, ఉత్తమ పుష్టిని, దీర్ఘాయుష్యమును, ఐశ్వర్యమును పొందును. ఇంట యువకులు మరణించినను, శస్త్రములతో చచ్చినను– వారికి చతుర్దశీ శ్రాద్ధము చేయవలెను. విషమముగా పుట్టినవారికిని, కవలలకును మరణించినచో శుచియై ప్రయత్నముతో అమావాస్యా శ్రాద్ధము జేయవలెను. ఆ శ్రాద్ధకర్త సర్వ కామములను పొంది అనంతమైన స్వర్గమునందును. అమావాస్యయందు ఋతమును (జలమును) ఈయవలెను. సోమరసమును ఇచ్చినచో అది పితరులకు మిక్కిలి సంతృప్తిని కలుగ చేయును. ఈ విధముగ తృప్తి చెందిన సోమము ముల్లోకములను ధరించును. సిద్ధ, చారణ, గంధర్వులచే నిత్యము స్తుతింపబడుచుండును. స్తుతులచేతను, మనోహరమైన కోరిన అన్ని వస్తువులచేతను; వేలకొలది అప్సరసలతోడి నాట్యములచేతను, వాద్య సంగీతములచేతను, గానములచేతను, ఆటస్థలములచేతను, విమానములతోను దేవగంధర్వులు సిద్ధ సంఘములును పితృభక్తుడైన దృఢవ్రతుని సేవింతురు. అమావాస్యా శ్రాద్ధమున పితృభక్తుడు సర్వకామములను పొందును. ఆనాడు ఆతనిచే ఎల్లప్పుడును పితరులు ప్రత్యక్షముగ అర్చింపబడినవారు అగుదురు. మఘా నక్షత్రము పితృదేవతాత్మకమైనది. ఆ మఘలయందు శ్రాద్ధము అక్షయము. దానియందు పితృ కార్యము చేయుదురు. విశేషించి పండితుడు చేయును. కావున పితరులు కూడ నిత్యమును 'మఘ'నే కోరుకొందురు. ఆ శ్రాద్ధమున పితృదైవత భక్తులు పరమగతిని పొందుదురు. (19)

నక్షత్రవిశేష శ్రాద్ధ ఫలము

బృహస్పతి ఇట్లు అనెను :

శశి బిందువునకు యముడు చెప్పిన శ్రాద్ధములను వేర్వేరు నక్షత్రములలో మొత్తముగా నా నుండి వినుము. కృత్తికా నక్షత్ర యోగమున ఎప్పుడు శ్రాద్ధము చేయువాడు అగ్న్యాధానముచేసి సంతానముతోబాటు జ్వరములేనివాడు అగును. సంతానకాముడు రోహిణి యందు శ్రాద్ధము చేయవలెను. మృగశీర్షా నక్షత్రమున చేసిన ఓజస్వి అగును. 'ఆర్ద్రా' నక్షత్ర శ్రాద్ధమున సామాన్యముగ క్రూరకర్ముడు అగును. పునర్వసు నక్షత్ర శ్రాద్ధమున క్షేత్రములను పుత్రులను పొందును. పుష్యమీ నక్షత్ర శ్రాద్ధమున ధనధాన్యములు నిండి పుత్ర పౌత్రులతో సమాకులుడు అగును. తుష్టిని పొందును. ఆశ్లేషా నక్షత్ర శ్రాద్ధమున వీరులగు పుత్రులనందును. మఘా నక్షత్ర శ్రాద్ధమున బంధువులలో శ్రేష్ఠుడగును. పూర్వ ఫల్గునీ నక్షత్ర శ్రాద్ధమున సౌభాగ్యమునందును. ఉత్తరఫల్గునీ నక్షత్ర శ్రాద్ధమున సంతాన ముతో కూడి ప్రధానశీలుడు అగును. పూర్వఫల్గునీ నక్షత్ర శ్రాద్ధమున హస్తా సత్పండితులలో ముఖ్యుడగును. చిత్రానక్షత్ర శ్రాద్ధమున రూపవంతులైన సుతులను పొందును. స్వాతీ నక్షత్ర శ్రాద్ధమున చేసిన విద్వాంసుడు లాభమును పొందును. విశాఖా నక్షత్ర శ్రాద్ధమున పుత్రుడు కల్గును. అనూరాధా నక్షత్ర శ్రాద్ధమున చక్రవర్తి అగును. జ్యేష్ఠా నక్షత్ర శ్రాద్ధమున శ్రేష్ఠమైన ఆధిపత్యమునందును. మూలా నక్షత్ర శ్రాద్ధమున ఆరోగ్యమునందును. పూర్వాషాఢా నక్షత్ర శ్రాద్ధమున మహాకీర్తి నందును.

ఉత్తరాషాఢా నక్షత్ర శ్రాద్ధమున దుఃఖము లేనివాడు అగును. శ్రవణా నక్షత్ర శ్రాద్ధమున మంచి లోకములలో పరమగతిని పొందును. ధనిష్ఠా నక్షత్ర శ్రాద్ధమున రాజ్యమును విపుల ధనమును పొందును. అభిజి న్నక్షత్ర శ్రాద్ధ మున అజావికమును (కంబళ్ళను) పొందును. శతభిష నక్షత్ర శ్రాద్ధమున వైద్యసిద్ధిని పొందును. పూర్వాభాద్రా నక్షత్ర శ్రాద్ధమున మేకలను, గొఱ్ఱెలను లేదా కంబళ్ళను పొందును. శతభిష నక్షత్ర శ్రాద్ధమున వైద్యసిద్ధిని పొందును. పూర్వాభాద్ర నక్షత్ర శ్రాద్ధమున అజావికమును (కంబళ్లను) పొందును. ఉత్తరాభాద్రా నక్షత్ర శ్రాద్ధమునవేల గోవులను పొందును. రేవతీ నక్షత్ర శ్రాద్ధమున బహురూపముల చేయబడిన ద్రవ్యమును పొందును. అశ్వినీ నక్షత్ర శ్రాద్ధమున అశ్వములను పొందును. భరణీ నక్షత్ర శ్రాద్ధమున ఉత్తమమైన ఆయువునందును. ఈ శ్రాద్ధ విధిని చేయుచు శశబిందువు ఈ భూమి అంతటిని పొందెను. ఆవిధముగ సమస్త భూ మండలమును పొందిన ఆతనిని బృహస్పతి ప్రశంసించెను. (20)

భిన్నకాలిక తృప్తి సాధము

శంయువు ఇట్లు అనెను :

ఓ ప్రవక్తలలో శ్రేష్ఠుడా (బృహస్పతీ!) పితరులకు ఇచ్చినది కొంచెమైనను సంతోష పెట్టును. కాని ఏది బహురాత్రులు ఉండునది? ఏది అనంతము మోక్షమును ఇచ్చుటకు సమర్థము? అని అడిగెను.

బృహస్పతి దానికి ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను :

"శ్రాద్ధవేత్తలు తెలిసిన శ్రాద్ధకాలపు హవిస్సులను అన్నింటిని, వాని బలమును, దానిని అనుసరించు ఫలితములను తెలుపుచున్నాను వినుము. నువ్వులతోను, వరియవల తోను, మినుములతోను, జలములతోను, కందమూలములతోను, ఫలములతోను చేయ బడిన శ్రాద్ధ దానముతో తాతలు నెలవరకు సంతసింతురు. శ్రాద్ధమున–చేపలతో రెండు నెలలు, లేడి మాంసముతో మూడు నెలలు, కుందేటి మాంసముతో నాలుగు నెలలు, పక్షి మాంసముతో ఐదు నెలలు, పందిమాంసముతో ఆరు నెలలు, మేక మాంసముతో ఐదు నెలలు, దుప్పి మాంసముతో ఎనిమిది నెలలు, నల్లచారల దుప్పి మాంసముతో తొమ్మిది నెలలు, గోవు వంటి అడవి మృగము (గురుపోతు) మాంసముతో పదినెలలు, తాబేటి మాంసముతో పదకొండు నెలలు, గోమాంసముతో సంవత్సరము, పితరులు ఆనందింతురు. గో మాంసముతో కూడిన పాయసము, తేనె నేతులతో కూడిన ఖడ్గ (గండక) మృగము యొక్క మాంసము పితరులకు పండ్రెండేండ్ల తృప్తి కలిగించును. శ్రాద్ధమున ఖడ్గ మృగ మాంసముతో కూడినది పితృలోకమున అనంతమును కూర్చును. అట్లే నల్లని మేకయు, ఉడుమును వీని మాంసము పితరుల అనంతమునకు (మోక్షమునకు) సమర్థ మగును. ఇచట పితరులు గానము చేసిన గాథలు కలవని పురావిదులు చెప్పుదురు. వానిని నేను మీకున్నది ఉన్నట్లు చెప్పెదను వినుడు. త్రయోదశినాడు శ్రాద్ధమున అన్నము ఇచ్చినవాడు మన కులముననే పుట్టవచ్చును. ఏనుగునీడలో శ్రాద్ధమున తేనె, నేతులతో పాయసము ఇచ్చిన వాడును అట్లే అగును. పుత్రులలో ఒక్కడైనను గయకు వెళ్లి శ్రాద్ధము చేసినను, కన్యను వివాహమాడినను, నల్లని కోడెను వదిలిపెట్టినను, తక్కిన బహుపుత్రులు వర్షాకాలమునను మఘలలోను సర్వము లోహమయుడైన బ్రహ్మచే యాగము చేయింప తగినవారు అగుదురు.

శంయువు ఇట్లు అనెను :

ఓ తండ్రీ! గయాది శ్రాద్ధముల ఫలమును అడుగుచున్నాను. చెప్పుడు. దాని వలన పితరులకు కలుగు పుణ్యమును గూడ నాకుచెప్పుడు.

ఆ మాటలకు బృహస్పతి ఇట్లు అనెను :

గయ యందు శ్రాద్ధము, జపహోమ తపస్సులును అక్షయములు అగును. కావున ఓ పుత్రా! నీ పితృక్షయ దినమున అచట శ్రాద్ధ జపహోమ తపములు అక్షయములు అగును. కన్యయందు పుట్టిన సుతుడు ఇరువదియొక్క పితరులను పవిత్రము చేయును. తల్లివైపు తాతలను మరి ఏడుగురిని పవిత్రము చేయునని గయాశ్రాద్ధ ఫలము చెప్పబడినది. (గయా)శ్రాద్ధమున వదలిన ఆబోతుయొక్క ఫలమును చెప్పెద వినుడు. ఆబోతును వదలిన వాడు గడచిన పదితరములవారిని రాబోవు పదితరములవారిని తప్పక పవిత్రముచేయును. జలము నుండి భూమిపైకి ఈది వచ్చిన ఆ ఆబోతును తాకిన యేకొద్ది నీటితోనైనను వృషోత్సర్గము చేసినవానియొక్క పితరులకు అక్షయము (మోక్షము సిద్ధించును). చివరకు తోక మొదలగువానిని తాకిన జలమంతయు వృషోత్సర్గము చేసిన ఆతని పితరులకు మోక్షమై సిద్ధించును. ఇందు సంశయములేదు. ఆ ఆబోతు కొమ్ములతోను, గిట్టలతోను భూమిని క్రుమ్మి రాసిన చోటులనెల్ల తేనెకాలువలు బయలుదేరి పితరులకు అక్షయము లగును. లక్షమూరల చెరువుతో వేదము తెలిపిన తృప్తి కంటె అధికముగనే వృషోత్సర్గము వలన పితరులకు హెచ్చు తృప్తి కలుగును. శ్రాద్ధకర్మములో బెల్లముతో కలిసిన నువ్వులను, తేనెనుకాని, తేనెతో కలిసిన నువ్వులనుకాని ఇచ్చిన అది అంతయు అక్షయము అగును.

బృహస్పతి ఇట్లు అనెను :

మానవుడు దానము ఇచ్చునపుడు బ్రాహ్మణులను పరీక్షింప రాదు. దైవకర్మలోను, పితృకర్మలోను పరీక్షణము చేయుట జరుగుచున్నది. వేదవ్రత స్నాతులందరును (వేదముల చదువు పూర్తిచేసిన వారందరును) శ్రాద్ధభోజన పంక్తిలో పవిత్రులు. వేదోపనిషద్భాష్యములు తెలిసినవారు ముఖ్యులు. వ్యాకరణమునందు అభిరుచి కలవారును ముఖ్యులు. పురాణము లను ధర్మశాస్త్రములను చదివినవారు, త్రిణాచికేత పంచాగ్నిని త్రిసుపర్ణమును ఎరిగిన వాడును, శిక్షాది షడంగముల తెలిసినవాడును, బ్రహ్మ (వేదమే) ధ్యేయముగా ఉన్న వాని (వేదవేత్త యొక్క) సుతుడు, ఛందస్సును తెలిసినవాడు, జ్యేష్ఠసామమును తెలిసిన వాడు, పుణ్యతీర్థములందు అభిషేకము (స్నానము) చేయుటయే వ్రతముగా గలవారు. ముఖ్యములైన యాగములలో అవభృథ స్నానములచే ప్రసిద్ధులైన వారు, నిత్యము వ్రతము చేయువారు, స్వకర్మలలో (వేదోక్త కర్మలలో) ఆసక్తులైనవారు, కోపములేనివారు, శాంతి పరులు-వీరిని శ్రాద్ధమునకు నిమంత్రింప(పిలువ)వలెను. నిత్యము పది పుణ్యకర్మలందు వ్యవస్థితులైనవారు, వీరికి ఈయబడిన దానము అక్షయము అగును. వీరు శ్రాద్ధపంక్తికి పవిత్రులు. యోగధర్మమును అనుసరించి ఉన్న బ్రాహ్మణులు విశ్వాస్యులు. ధర్మాశ్రమ

ములలో వరిష్ఠులైన ఆ బ్రాహ్మణులు హవ్య కవ్యములకు శ్రేష్ఠులు. వారిని పూజించుటచే త్రిమూర్తులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులుకూడ పూజితులు అగుదురు. వీరిని పూజించిన నరులు పితరులకు సమాన లోకస్థులు అగుదురు. ఇది పవిత్రములకు పవిత్రము, మంగళ ములకు మంగళము. సర్వధర్మములకు మొదటగా శ్రేష్ఠమైన ధర్మము యోగధర్మమని చెప్ప బడును. ఇక శ్రాద్ధమున భోక్తల పంక్తిలో కూర్చుండదగని వారిని గురించి చెప్పెదను వినుడు.

జూదరి, మద్యపానము చేయువాడు, క్షయరోగి, పశుపాలుడు, ఆకారము సరిగా లేనివాడు, గ్రామసేవకుడు, వడ్డీ వ్యాపారి, గాయకుడు, వ్యాపారియు, ఇండ్లను కాల్చువాడు, విషము ఇచ్చువాడు, లంజకొడుకు మీద ఆధారపడి జీవించువాడు, పూవులను అమ్మువాడు, సముద్రమున పోవువాడు, చెడుచర్మము కలవాడు, గాండ్లవాడు, కపటము చేయువాడు, తండ్రితో వివాదపడుచున్నవాడు, ఇంటిలో ఉన్న రంకుమగడు, పరస్త్రీ గమనాది నిందితుడు, దొంగ, శిల్పజీవి, కొండెము చెప్పువాడు, పర్వకారి (అమావాస్యాది పర్వము సర్వ సామాన్య ముగ చేయువాడు), మిత్రద్రోహి, గణమునకై యాచించువాడు, నాస్తికుడు, వేదములు విడిచినవాడు, ఉన్మత్తుడు, నపుంసకుడు (అపకారము చేయు) నిందితుడు, గర్భమును చంపువాడు, గురుభార్యను సంగమించినవాడు, వైద్యజీవి, ప్రైషణికుడు (ప్రేరేపకుడు), పరస్త్రీ గమనము చేయువాడు, వేదమును, వ్రతములను, తపములను విక్రయించువాడు- వీరు భోజనపంక్తి బాహ్యులు, నాస్తికునకు, చేసిన మేలు మరచినవారికి, పొగడువానికిని ఇచ్చినది నశించును. వర్తకునకు ఇచ్చినది ఇహపరములకు పనికిరాదు. అట్లే నిక్షేపము (ఉంచుకొనుమని ఇచ్చిన నిధి), ఇల్లడ పెట్టిన సొమ్మును వీనిని అపహరించువానికి, జూదరికి, వేదనిందకునకు ఇచ్చినది ఇహపరములకు రాదు. వడ్రంగి మొదలగు శిల్పికి, వ్యాపారికి, ధర్మమును విడిచినవానికి, నిందించుచు వస్తువులను కొనువానికి, అమ్ముచు వస్తువులను పొగడువానికిని ఇచ్చినది ఇహపరములకు కొరగాదు. అబద్ధమునకు చక్కగా వాసమైన వణిజుడు శ్రాద్ధమునకు తగడు. మారుమనువున పుట్టిన బ్రాహ్మణునకు ఇచ్చినది భస్మములో హోమముచేసిన హవ్యమువలె వ్యర్థమగును. గ్రుడ్డివాడు అరువది (యేండ్లు), నపుంసకుడు నూరేండ్లు, బొల్లి మచ్చువాడు చూచినంత వరకును, పాపరోగి వేయి ఏండ్లు దాతయొక్క ఫలమును నశింపజేయును. బాలిశునకు (అజ్ఞాని) తలను వస్త్రముతో చుట్టికొని భుజించు వానికి దక్షిణ దిక్కు ముఖముజేసి భుజించువానికిని దానమిచ్చిన దాత సత్ఫలము నుండి భ్రష్టుడగును. చెప్పులతో భుజించువాడు, తిరస్క రించిన వాడు-వీరు తిన్నదంతటిని బ్రహ్మరాక్షసుల భాగముగాచేసి ఇచ్చెను. కుక్కలు, రాక్షసులు ఎట్టి పరిస్థితులలో నైనను శ్రాద్ధమును చూడరాదు. కావున తిలలనుచల్లి, దానికి పరివృత్తిని చేయవలెను. మరల్చ

వలెను. రాక్షసులకు నువ్వులు మరల్చునవిగా చెప్పబడినవి. కుక్కలకు పరివృతి (త్రిప్పి పంపుట, చూపుతో పంది(శ్రాద్ధమును) నశింప జేయును. రెక్కలు కొట్టుటచే కోడి శ్రాద్ధ మును నశింపజేయును. ముట్టైన స్త్రీ స్పర్శతో, కోపించి శ్రాద్ధదానము చేసినచో ఆ శ్రాద్ధ ములు ఆ హవిస్సులు, పితరులనుగాని, దేవతలనుగాని సంతోషపెట్టలేవు. అతడును స్వర్గమును పొందడు. రమ్యములైన నదీతీరములందును, నదులందును, సరస్సులందును, విజన ప్రదేశములందును చేయబడిన శ్రాద్ధదానముచే తాతలు సంతసింతురు. ఒకప్పుడైన (శ్రాద్ధమున) కన్నీటిని వదలరాదు, నియమయుక్తుడై మాటాడరాదు. భోజనము చేయుచు మత్సరుడై పరస్పరము మాటాడరాదు. విధివిధానమున దర్భలు చేత పట్టుకొని జందెము అపసవ్యము చేసికొని తాను చచ్చునందాక పితృకార్యము (శ్రాద్ధము)ను చేయవలెను. ఈ విధముగ అతడు పితరులను సంతోషపెట్టగలడు. మొదటినుండియు బ్రాహ్మణుని అనుమతితో యథావిధిగా అగ్నిహవనము చేయవలెను. పితరులకు దర్భలు పరచిన చేటయందుకాని, భూమియందు కాని పిండదానము చేయవలెను. వివేకియైనవాడు శుక్ల పక్షపు పూర్వాహ్ణమున శ్రాద్ధము చేయవలెను. కృష్ణ పక్షమున అపరాహ్ణమున శ్రాద్ధము చేయవలెను. కాని దినముయొక్క పదియైదింట తొమ్మిదవ భాగమును దాటనీయరాదు (దినమునకు 15 భాగములు వానిలో తొమ్మిదవభాగము రౌహిణము). ఈ విధముగ మహాత్ములు, మహాయోగులు, మహా తేజస్సులు, దేశకాలములు ఎప్పుడును చూచువారును అయిన పితరులు నిత్యము పూజింప తగినవారు.

పితృభక్తి యందు నిత్యము ఆసక్తుడైన వాడు అనుత్తమ యోగమును బొందును. ధ్యానముతో వారు శుభాశుభకర్మలను (మిత్ర శత్రువులకు) వదలి మోక్షమునకు పోవుదురు. మహాత్ముడైన కశ్యపుడు జగమును మోహింప జేసి యజ్ఞకారణమున ఉద్ధరించి గుహ యందు అనగా బుద్ధియందు యోగమును ఉంచెను. ఓ యోగవేత్తలలో శ్రేష్ఠుడా! అమృత రూపమై రహస్యమైన యోగమును ఉద్ధరించి ఆ యోగమును చెప్పెను. అది శాశ్వతమైన మహాధర్మము. దేవతలకు పరమ రహస్యమై ఋషులకు ఆశ్రయమై ఇష్టమైనదై, పితృభక్తులు తమ పితృభక్తిచే ప్రయత్నముతో నిత్యము అవలంబనీయమైనది యోగము. పితృభక్తులు తమ పితృభక్తిచే ప్రయత్నముతో నిత్యము అవలంబనీయమైనది యోగము. పితృభక్తుడు తన ప్రయత్నముతో సంగ్రహము గను, మొత్తముగను ఆయోగమును పొందును. ఈ విషయమున సంశయము లేదు. ఏ తీర్థ ములలో ఏ నదులలో శ్రాద్ధము అక్షయమగునో, వేనియందలి శ్రాద్ధము స్వర్గమును పొందించునో సంగ్రహముగ అది అంతయు నీకు చెప్పబడినది.

బృహస్పతి ఇట్లు అనెను :

ఈ విధముగ శ్రాద్ధ కల్పమును విని అసూయచెందు నాస్తిక నరుడు తమస్సుతో కప్పబడినవాడై ఘోర నరకమున మునుగును. సంయత మనస్కుడు గూడ మహారోగముతో అంత్యకాలమున బాధ చెందును. వేదాశ్రయమునుండి వీడినచిత్తముకలవాడై కుంభీ పాకములు అను(నరకములను)పొందును. నాలుకను కోయు దొంగనుచేరి, వానితో పాటు నరకమును పొందుదురు. యోగమును ద్వేషించువారు భూమి ఉన్నంత వరకు సముద్రమున మట్టిగడ్డలై ఉందురు. కావున శ్రాద్ధమున ధర్మము చెప్పబడినది. పురుషుడు దానిని శ్రద్ధతో ఆచరింపవలెను. అపవాదము చేయవలదు. విశేషించి యోగుల విషయ మున బొత్తిగ పనికిరాదు. ఈ అపవాదమును చేయుటచే పురుగై అచటనే పరిభ్రమించును. ధ్యానులకు మోక్ష కారణమైన యోగమును నిందించువాడును, దానిని వినువాడును ఘోరనరకమును పొందును. మానవుడు యోగీశ్వరనిందవలన మొత్తము తమస్సుచే ఆవరింపబడిన భయంకర నరకమును తప్పక పొందును. నిగ్రహించిన ఆత్మలుగల యోగీశ్వరుల వేదనను వినువాడు కుంభీపాక నరకమున చాలకాలము మునిగి ఉండును. ఇందు సంశయములేదు. మనస్సుతోగాని, వాక్కుతోగాని, క్రియతోగాని యోగుల విషయమున ద్వేషమును వహింపరాదు. అట్లు చేసినవాడు భూలోకముననే మరణించి పిశాచమై అన్నమును భుజించును. సంశయములేదు. వేదపారగుడు ఆత్మయొక్కపారమును పొందలేడు. తన కర్మలచే ముల్లోకముల మధ్యచరించును. ఋగ్యజుః సామవేదముల యొక్కయు తదంగముల యొక్కయు అంతమును దెలిసినవాడు ఏవికార మును పొందకయే పోవును. వికారముయొక్క పారమే ప్రకృతియొక్క పారమును పొందును. గుణములయొక్క త్రయి (త్రిగుణసమూహము) త్రిగుణాంత పారమును పొందునది. ఇక ఇరువది నాలుగవ తత్త్వము సాంఖ్యయోగము యొక్క పారమును తెలిసినది. అయనాంత (మార్గము చివరి) పారమును పొందినవాడు నిజమైనపారగుడు. ఈ మొత్తము ఆత్మతత్త్వ సృష్టి ఎట్లో! అట్లే మరల ఆ సదాత్మయొక్క ప్రళయము కూడ. యోగవేత్త తన యోగబలముచే దీనిని అంతయును ఉపసంహరింపవలెను. ఆతడు సర్వపారముల క్రమ మార్గమున కనబడు వాడు. వేదముల తెలిసినవాడు యోగవేత్తయై తెలియదగిన పరమాత్మతత్త్వమును తెలియును. ఆతనినే వేదవేత్తగను వేదపారగునిగను చెప్పుదురు. తెలియదగిన దానిని, తెలియవలసిన దానిని, యథావిధిగా తెలిసికొనినవానిని వేదవేత్తనుగా చెప్పుదురు. తక్కిన వారు వేదచింతకులు మాత్రమే. పితృభక్తుడు యజ్ఞములను, కామములను, వివిధ జ్ఞాన ములను, ఆయువును, సంతానమును, ధనములను పొందును. శ్రాద్ధేయుడు శ్రాద్ధము

చేయదగినవాడు, శ్రాద్ధకల్పము–వీనిలో తరువాతిది నియతమగును. అపుడు దానిని అనుసరించిన శ్రాద్ధ కర్త తీర్థమున దాన ఫలములు మొదలగు వీని అన్నింటిని పొందును. ఆతడు భోక్త పంక్తికి పావనుడు, బ్రాహ్మణులలో ముందుగా భుజించువాడును అగును. దీనిని (కల్పమును) బ్రాహ్మణులకు చదివించి సర్వకామములను పొందును. నిత్యము దీనిని విన్నవాడు కూడ అంతులేని స్వర్గమును పొందును. అసూయలేని వాడు, కోపమును జయించినవాడు, లోభమోహములు లేనివాడు, తీర్థములన్నింటి ఫలమును, దానాదుల ఫలమును పొందును. ఇది (శ్రాద్ధకరణము) శ్రేష్ఠమైన మోక్షో పాయము. ఇది ఉత్కృష్టమైన స్వర్గోపాయము. దీనియందు లోకమున కూడ మిక్కిలి ఆనందము కలుగును. కాబట్టి ప్రయత్నముతో శ్రాద్ధమును చేయవలెను. ఈ శ్రాద్ధకల్ప విధిని ఏకాగ్ర మనస్కుడై అలసట లేక సభలోను పర్వసంధులలోను చదువువాడు సంతానవంతుడు అగును. ఉత్కృష్టమైన తేజస్సుతో స్వర్గవాసులకు సమాన లోకవాసి అగును. ఈ కల్పమును చెప్పిన బ్రహ్మకు నమస్కారము. మహాయోగేశ్వరులకును నిత్యము నేను నమస్కరింతును. ఓ తండ్రీ! ఈ పితరులు – దేవతలకుకూడ దేవతలు. ఈ యేడు స్థానములలో ఆ పితరులు బాధలేనివారు. వీరు బ్రహ్మయొక్క కుమారులు. వీరందరును మహాత్ములు. మొదటిది యోగముల గణము. అది నిత్యము యోగమును వృద్ధి జేయునది. రెండవది దేవతల గణము. మూడవది దేవ శత్రువులైన రాక్షసులగణము. తక్కినవి బ్రహ్మచారి గణములుగా తెలియవలెను–అని ఈ గణములన్నియు చెప్పబడినవి. దేవతలు వీరిని అందరిని పూజింతురు. వీరు అందరిలో ఉందురు. బ్రహ్మచర్యాదులైన నాలుగు ఆశ్రమములలో గూడ వరుసగా వీరిని పూజించును. బ్రాహ్మణాదులైన నాలుగు జాతులు యథావిదిగా వీరిని పూజించవలెను. అట్లే సంకర జాతులు మ్లేచ్ఛులును వీరిని పూజింతురు. పితరులను భక్తితో పూజించినవారిని పితరులు పూజింతురు. పుష్టి కామునకు పితరులు పూజ్యులు. సంతానము కోరువారికిని పితరులు పూజ్యులు. పితరులు పుష్టిని ప్రజలను, స్వర్గమును ఇత్తురు. పుత్రునకు దేవకార్యమున కంటె పితృకార్యము విశిష్టమైనది. కావున దేవతలకు పితరులు ముందుగా స్వయముగా సంతోషపెట్ట తగినవారు. యోగగతి సూక్ష్మమైనది కాదు. పితరులకు ఇది పరాగతి. దూరముగా ఉండియు తపస్సుతో చర్మ చక్షువులతోనే చూడబడును. అందరికి వెండి పాత్రముగాని, వెండితో కలిసిన పాత్రగాని పవిత్రమైనదిగను, ఉత్తమమైనది గను, దేవతలకు పితరులతో సహా ఉపయోగించతగినది. బాంధవులు ఎవరికి నామ గోత్రములుచెప్పి మూడు పిండములను దర్భలు ఉత్తరముగాగల భూమియందు అపసవ్య విధానముతో పెట్టుదురో! ఆ పిండములు విశ్వము అంతట నుండి పితరులను సంతోషపెట్టును. ప్రాణి

ఏ ఆహారము తినువాడో, ఆ ఆహారము అతనికి కలుగును. ఆవుల కొట్టమున కనబడకుండ ఉన్న తల్లిని దూడ ఎట్లు చేరునో!అట్లే శ్రాద్ధమంత్రము శ్రాద్ధమున ఇచ్చిన అన్నమును పితరుడైన ప్రాణి ఉన్నచోటికి చేర్చును. నామము గోత్రము మంత్రము–ఇవి శ్రాద్ధ దత్తమైన అన్నమును పితరులకు చేర్చును. నూర్లజన్మలు అందినను శ్రాద్ధ దత్తాన్న తృప్తి వారిని చేరును. ఈ విధముగా పరమేష్ఠియైన బ్రహ్మచే పితరుల సంస్థ నిలుపబడినది. అక్షయమును కోరు పితరుల యొక్క పితృ లోకముల యొక్కయు ప్రథమ సృష్టి జరిగినది. అను ఈ పిత రులు దేవతలు. ఆ దేవతలు మరల పితరులు. శ్రాద్ధమున పుణ్యాత్ములై దౌహిత్రులు (కూతురు కొడుకులు) యజమానులుగా నాచే చెప్పబడిరి. లోకములు (పితృలోకములు)ను కూతు ళ్లును, కూతురు కొడుకులును, పుత్రులును, శౌచముతో దానములును, తీర్థములును, ఫలములును, బ్రాహ్మణులును, ఆ యావర విధియు, అక్షయత్వమును ఈ సర్వము యధాన్యాయముగా పూర్వము బ్రహ్మ చెప్పినట్లు చెప్పబడినది.

బృహస్పతి ఇట్లు అనెను :

ఈ శ్రాద్ధ కల్పము అంతయు నిత్యము వినుచున్న ఋషులకు అంగిరసుడు ఆ పితరుల సభలో అడిగిన సంశయములకు గూడ ఉత్తరముల చెప్పెను. పూర్వము వేయి యేండ్ల సత్రయాగము ప్రవర్తిల్లగా అందు ప్రభువైన బ్రహ్మ దేవతయై గృహపతిగా (యజమాని) ఉండెను. అచట నూరేండ్లు దేవతలు కూడిరని శ్రుతి. ఈ విషయములో పూర్వము బ్రహ్మవాదులైన ఋషులచే శ్లోకములు గానము చేయబడినవి. అపుడు ఆ సత్ర యాగమున దీక్షితుడై పరమాత్ముడైన బ్రహ్మకు పితరుల అక్షయమునుకోరి లోక హితమును కోరి పరమేష్ఠియైన బ్రహ్మచే అచటనే అత్యుగ్రము సంభవించినది అని బృహస్పతి చెప్పెను.

ఈ విధముగా చెప్పి మరల సూతుడు ఇట్లు అనెను :

ఈ విధముగ పూర్వము బుద్ధిమంతుడైన పుత్రుడుగ బృహస్పతి పితృ వంశమును చెప్పెను. (21)

వరుణ వంశ వర్ణనము

ఈ విధముగ జెప్పబడిన ఋషులు మిక్కిలి సంతోషమును బొందిరి. కాని మరల వినగోరినవారై ఈ విధముగ అడిగిరి.

"అంతులేని తేజస్వులైన రాజులయొక్క వంశములను, వారి స్థితిని, ప్రభావమును అడుగుచున్నాము. అనుపూర్వితో వానిని మాకు చెప్పుడు" ఇట్లు అడుగబడిన లోమ

హర్షణుడు వాక్యకోవిదుడు ప్రవచన కుశలుడునైన సూతుడు సమాధానము చెప్పుటకు వినగోరిన ఋషులకు ఋషి చెప్పినట్లు చెప్పెద వినుడు అనెను. “అమిత తేజస్కులైన రాజుల వంశమును, స్థితిని, ప్రభావమును, ఆనుపూర్వితో జెప్పెదను. వరుణుని యొక్క పత్ని సాముద్రిశునునకు దేవిగా చెప్పబడినది. ఆమెకు కలి, వైద్యుడు–అనువారు పుత్రులు, పుత్రిక సురసుందరి. కలియొక్క పుత్రులైన జయుడు, విజయుడును మహావీర్యులు. వైద్యుని పుత్రులు ఘృణి, ముని అనువారు మహాబలులు. ప్రజలను తినగోరి ఒకరినొకరు తినువారై అట్లే ఒకరినొకరు తిని వినాశమును పొందిరి. కలిసురయందు పుట్టెను. ఆతని పుత్రుడు మదుడు. త్వష్ట కూతురైన 'హింస' కలియొక్క భార్య. ఆతని జ్యేష్ఠ భార్య నికృతి. ఆమె కలివలన పురుష భక్షకులైన నలుగురు పుత్రులను బడసెను. వారు నాకుడు, విఘ్నుడు, ప్రసిద్ధి పొందిన సద్రముడు, విధముడు అనువారు. వారిలో విఘ్నుడు శిరస్సులేనివాడు, నాకుడు శరీరములేనివాడు, సద్రముడు ఒక చేయి మాత్రమే కలవాడు, విధముడు ఒక పాదముగలవాడు. సద్రముని భార్య తామసియైన పూతన. రేవతి, విధముని భార్య వారిరువురి పుత్రులు వేలు. నాకునకు శుకుని పత్ని, విఘ్నునకు భార్య అయోముఖి. రాక్షసులు పెద్దతలలు గలవారై ప్రాతః సాయంసంధ్యలందు చరించువారు. రేవతీ–పూతనల పుత్రులు నైర్ఋుతులు అనుపేర పిలువబడిరి. ఆ రాక్షసులు అందరు గ్రహములు. విశేషించి బాలగ్రహములు. వారి అధిపతి స్కందుడు. బ్రహ్మ సమ్మతించిన ప్రభువు. బృహస్పతి యొక్క అక్కయు, ఉత్తమ స్త్రీయు, బ్రహ్మచారిణియు, యోగ సిద్ధయు, ఎప్పుడును జగమంతటను అసక్తయై తిరుగును. ఆమె వసువులలో ఎనిమిదవవాడైన ప్రభాసునియొక్క భార్య. ఆమెకు శిల్పి బ్రహ్మయైన విశ్వకర్మ పుత్రుడుగా పుట్టెను. ఆతడు త్వష్ట రూపములకు విరాట్టు. ధర్మ పౌత్రుడు, ఉదారబుద్ధి, వేల శిల్పములకు కర్త, దేవతలకు భవన నిర్మాత. ఆతడు దేవతలు అందరికిని విమానములచేసి ఇచ్చెను. ఆ మహాత్ముని శిల్పముపై ఆధార పడి మనుష్యులు కూడ జీవింతురు. ఆ శిల్పి బ్రహ్మకు “ప్రహ్లాది” అని ప్రసిద్ధి చెందిన విరోచన అను భార్యకలదు. ఆమె విరోచనునియొక్క అక్క. త్రిశిరసుని తల్లి. గొప్ప దేవాచార్యుడును, బుద్ధిమంతుడును అయిన విశ్వకర్మయొక్క పుత్రుడు విశ్వకర్మ మయుడు అనబడెను. ఆతనికి సురేణువని ప్రసిద్ధి చెందిన చిన్న చెల్లెలు కలదు. త్వష్టృ పుత్రియైన ఆమె సవితకు (సూర్యునకు) భార్యయై 'సంజ్ఞ'అని ప్రసిద్ధిచెందినది. ఆమె సూర్యుని నుండి తపస్సుచేత మొదటి పుత్రునిగా మనువును కనెను. తరువాత ఈమె యముని, యమునను కనెనను. ఆమె కురుదేశములకు వెళ్లి వడవా (ఆడగుఱ్ఱము) రూపమును ధరించెను. అపుడు అశ్వరూపము ధరించిన సూర్యునకు వడవ తన రెండు ముక్కుల నుండి

అశ్వినీ దేవతలను కనెను. ఆ మహాభాగ్యవంతురాలు (వడవ) అశ్వరూపి సూర్యుని వల్ల (వడవ) అంతరిక్షమున అశ్వినులను (అశ్వినీ దేవతలను) కనెను. వారు నాసత్యుడు దస్రుడును. వీరు సూర్యుని పుత్రులు.

ఋషులు ఇట్లు అనిరి :

పండితులు ఈ వివస్వంతుని మార్తండుడని ఎందులకు పిలుతురు? ఆడగుఱ్ఱము రూపము ధరించిన సంజ్ఞ యొక్క ముక్కులనుండి (అశ్వినీ దేవతలను) ఎందులకు కనెను?

సూతుడు ఇట్లు అనెను :

బ్రహ్మచే (త్వష్టచే) పగలగొట్టబడి భిన్నమైన అండమును చాలకాలమునకు బుద్ధి తెలిసిన కశ్యపుడు చూచి, గర్భవధకు భయపడి మిక్కిలి దుఃఖించెను. అండము రెండుగా చేయబడగా దానినిచూచి (కశ్యపుడు)బ్రహ్మతో ఇట్లనెను. ఇది అండముకాదు. నిజముగా నీవే! కావున ఓ అనఘా! నీవు మార్తండుడవు కమ్ము! వీడు అండమున చావలేదు అని తండ్రి ప్రేమతో అన్నందున ఆ వచనమును విని బ్రహ్మ పేరును (మార్తండుడు అన్న పేరు) యథార్థమని చెప్పెను. అండము రెండుగ చేయబడగా తండ్రి 'మార్తండోభవ' అన్నందున-పురాణజ్ఞులు వివస్వంతుని మార్తాండునిగా చెప్పిరి. అందువలన మార్తాండుడు అనబడు వివస్వంతుని యొక్క సంతానమును చెప్పెదను. పూర్వము సూర్యునకు సంజ్ఞ అను భార్యయందు ముగ్గురుపుట్టిరి. వారు చివరి మనువైన సావర్ణి, ఇద్దరు అశ్వినీ దేవ తలును, శనైశ్చరుడును తక్కినవారు ఆరుగురును మొత్తము మార్తండుని పుత్రులు ఏడుగురని చెప్పబడిరి. మహాయశస్వి వివస్వంతుడు కశ్యపునకు దాక్షాయణి (దక్షపుత్రిక)యందు పుట్టెను. త్వష్టయొక్క పుత్రియైన మహాదేవి ఆ వివస్వంతునకు భార్య అయ్యెను. ఆమె సురేణువని ప్రసిద్ధి చెందినది. తరువాత సంజ్ఞఅని ప్రఖ్యాతి గాంచినది. అతి తేజోవంతుడై భగవంతుడైన మార్తండుని ఆ భార్య రూపయౌవనములచేత ఒప్పినదై భర్తృరూపమున సంతుష్టి పొందలేదు. ఆదిత్యుని ఆ రూపము మార్తండుని తేజస్సు(తో) పర్వతములందు నిరోధింపబడినదై మిక్కిలి కాంతివంతమైనట్లుగ లేకుండెను. అజ్ఞానియైన కశ్యపుడు ప్రేమవల్ల-వీడు అండమున మృతుడుకాడు అన్నందున సూర్యుడు మార్తండుడు అనబడెను. ఆ వివస్వంతునకు నిత్యము తేజస్సు అధికము. ఆ అధిక తేజస్సుతో కశ్యప పుత్రుడైన సూర్యుడు ముల్లోకములను తపింపజేయుచుండెను. ఆ రవి 'సంజ్ఞ యందు ముగ్గురు సంతానమును కనెను. వారిలో ఇద్దరు పుత్రులు మహా వీర్యులు. ఒకర్తె 'కాళింది' అను కన్య. వివస్వంతునకు మనువు జ్యేష్ఠ పుత్రుడు. శ్రాద్ధదేవుడు, ప్రజాపతియును తరువాతి వారు. తరువాత యముడు యమియు అను కవలలు (ఇద్దరు) పుట్టిరి. అపుడు వివస్వం

తునియొక్క ఆ రూపమును శాంతవర్ణముగా చూచి సహించనిదై దానితో సమాన వర్ణముగల తన ఛాయను(కాంతిని)మరల నిర్మించెను. ఆమె నుండి బయలుదేరిన ఛాయ, భామ యయై, స్త్రీయై, చేతులు జోడించి వినమ్రయై మరల 'సంజ్ఞ'తో "నేనేమి చేయవలెనో చెప్పుము" అని అనెను. తరువాత 'సంజ్ఞ' ఆ ఛాయతో "నేను నా తండ్రి ఇంటికి వెళ్ళుచున్నాను. నీకు భద్రమగుగాక. నాకు బదులుగా నీవు ఇచట ఇంటిలో నిశ్శంకముగా ఉండవలెను. నాకు బదులుగా నీవు ఇరువురు బాలకులును, వరవర్ణినియైన కన్యను చూచుకొనవలెను. ఇది భగవంతుడైన నా భర్తకు చెప్పరాదు" అని అనెను. ఇట్లు చెప్పగనే సంజ్ఞ యొక్క పార్థివీ స్వరూపము సంజ్ఞతో "ఓ దేవీ! ఆకాశమును గ్రహించినందున నీ ఆశయమునుగాని నీ మతమునుకాని ఎక్కడను చెప్పను. నీ (తండ్రి) ఇంటికి పొమ్ము. 'సంజ్ఞ'కూడా పార్థివీచ్ఛాయాసంజ్ఞను సమాధానపరచి అట్లే అని ఆమె చెప్పగా సిగ్గిల్లిన దానివలె తండ్రియైన త్వష్టయొక్క సమీపమునకు వెళ్లెను. ఆ విధముగా వచ్చిన సంజ్ఞను జూచి తండ్రి త్వష్ట కోపించినవాడై–'భర్త సమీపమునకు వెళ్లుము. దివాకరుని (సూర్యుని) అసహ్యించుకొనకుము'అని అనెను–తండ్రి ఈ విధముగా మాటిమాటికి చెప్పినను 'సంజ్ఞ' వేయేండ్లు తండ్రి ఇంటనేఉండెను. భర్త సమీపమునకు వెళ్లుమని మాటిమాటికి నియోగింప బడినదై అనిందితయైన సంజ్ఞ ఆడగుఱ్ఱపు రూపమున తన రూపమును గుహ్యపరచి (ఆ రూపము ధరించి) ఉత్తర కురుదేశములకు వెళ్లి గడ్డిమేయుచుండెను.

ఇక రవి, రెండవ (పార్థివీ) సంజ్ఞను నిజమైన సంజ్ఞనుగా భావించి, ఆమె అందు సూర్య తేజోవంతులను ఇరువురిని జనింపజేసెను. వారిద్దరును మొదట పుట్టిన మనువుతో పోలిన ప్రభువులు, వారు ధర్మజ్ఞుడైన శ్రుతశ్రవుడు, శ్రుతకర్మ అనువారు. శ్రుతశ్రవుడు సావర్ణిఅను మనువు అయినవాడు, శ్రుతకర్మయే గ్రహము అయిన శనైశ్చరుడు. పార్థివియైన సంజ్ఞ, తన పుత్రుడైన మనువే సావర్ణియైన మనువు అని తెలుసుకొనెను. కావున వాని యందు అధిక ప్రేమను చూపెను. కాని రవికి మొదట నిజమైన సంజ్ఞయందు జనించిన వారిపై మమకారము చూపలేదు. మనువు దానిని అంతయు సహించెను. యముడు మాత్రము సహింపలేదు. ఆతని అభిమానము సవతిచూపిన పక్షపాతముతో మిక్కిలి దుఃఖితమయ్యెను. కోపమువల్లను, బాల్యము(అజ్ఞానము)వల్లను రాబోవు విధిబలీయమై నందునను యముడు తన పాదముతో తన్నెదనని సంజ్ఞను స్వయముగా బెదిరించెను. వెంటనే సావర్ణిక మను జనని అయిన సంజ్ఞ నీ తండ్రి భార్యను, యశస్విని అయిన నన్ను కాలితో తన్నెదనని బెదరించిన కారణమున "నీ ఈ కాలు పడిపోవును. సంశయము లేదు" అని ఈ విధముగయముని శపించెను. ఆ శాపముతో మిక్కిలి బాధపడిన మనస్సు

గలవాడై ధర్మాత్ముడైన యముడు మనువుతోబాటు సర్వమును తండ్రికి నివేదించెను. "బాల్యమువల్లనో, మోహము వల్లనో! 'సంజ్ఞ'యొక్క శాప వాక్కులచే వినిర్జితుడనూ బల హీనుడనై ఓడినవాడనై మిక్కిలి శాపభయముచే వ్యవస్థ తప్పితిని. కావున నన్ను రక్షింప వలయునని కోరుచున్నాను. ఓ తపస్వి శ్రేష్ఠ! లోకేశ! ఈలోకమున తల్లితో శపింపబడితిని. ఈ మహాభయము నుండి నీ అనుగ్రహమే నన్ను రక్షించును–అని నివేదించెను. ఇట్లు చెప్పగనే ప్రభువైన వివస్వంతుడు "ఓ పుత్రా! నిస్సంశయముగా రాబోవు విధియే దీనికి గొప్ప కారణము. దానివల్లనే ధర్మజుడు, సత్యవాదియు అయిన నిన్ను క్రోధమావేశించినది. దీనిని అసత్యము చేయుటకు సాధ్యపడదు. ఇది నీ తల్లివాక్యము జరుగక తప్పదు. క్రిములు నీ (పాద మాంసమును తీసికొని తిని భూమికి వెళ్లును. తరువాత ఓ మహాప్రాజ్ఞ! నీ పాదమును నీవు పొంది సుఖింతువు. ఈ విధముగ నీ తల్లి శాప వచనము నిజమైనట్లు కాగలదు. శాపము యొక్క పరిహారముతో నీవు (నిన్ను) రక్షించుకొనువాడవు కాగలవు" అని కుమారునికి చెప్పెను. తరువాత ఆదిత్యుడు సంజ్ఞను–"సమానమైన పుత్రులలో ఒక్కరియందే నీవు ఎందుకు అధిక ప్రేమను చూపితివి" అని అడిగెను. ఆమెయు సూర్యుని ఆ మాటను దాటవేసి ప్రత్యుత్తరము చెప్పలేదు. అంత సూర్యుడు ఆత్మతోయోగమును వహించి నిజమును కనుగొనెను. వెంటనే కోపించిన ఆ ప్రభువగు సూర్యభగవానుడు ఆమెను నశింపుమని శపింపబోవగా ఆమె సూర్యునకు తాను నిజమైన సంజ్ఞను కాదను విషయము ఉన్నది ఉన్నట్లు చెప్పెను. సూర్యుడు అదివిని కోపించి త్వష్ట దగ్గరికి వెళ్లెను. త్వష్టయు ధర్మమును అనుసరించి ఆ సూర్యుని పూజించి, కోపముతో కాల్చవేయ కోరుచున్న ఆతనిని మెల్లగ ఓదార్చెను. "నీకు మిక్కిలి తేజస్సుతో కూడిన ఈ రూపము శోభనీయుట లేదు. దానిని సహించలేనిదై "సంజ్ఞ" వనమున ఆడగుఱ్ఱమై పచ్చిక బయలులో మేయు చున్నది ఈ విధముగ ఇపుడు నీవు నీ శుభచారిణియైన భార్యను చూడగలవు. కొని యాడదగినదియు, యౌవనసంపన్నయు అయిన నీ భార్యను యోగమున నిలిచి రక్షిం చుము. సమయము ఇష్టమైనచో ఇది అనుకూలము అగును. ఓ శత్రుమర్దనా! నీ ఆద్యమైన శ్రేష్ఠమైనరూపమును మార్చుము. అపుడు సూర్యుని రూపము అడ్డముగను పైకిని క్రిందికిని వ్యాపించి ఉండెను. దానివలన సూర్య భగవానుడు సిగ్గిల్లెను. అటు పిమ్మట మహాతపస్వి యైన ఆ త్వష్ట సూర్యుని చక్రాకారమైన మండల రూపమును గురించి మిక్కిలి ఆలోచించెను. తరువాత ఎదురు ఏగుట వలన మార్తండుడైన సూర్యుని యొక్క రూపమును మార్చుటకై అనుమతింపబడిన త్వష్ట, ఆతనిని భ్రమిపై (ఒరపిడి చేయు చక్రమున) పెట్టి ఒరపిడిచే ఆతని తేజమును కోయసాగెను. ఆ విధముగా అపహరింపబడిన తేజస్సుతో ఆతని తేజము

ప్రకాశించెను. అశుభమైనను (కొంత తేజము తగ్గుటచే అశుభమైనను) ఆయన రూపము మిక్కిలి మనోహరమైనదై, చూచుటకు మిక్కిలి శోభిల్లెను. అపుడు యోగమున నిలిచి తన భార్యను వడవనుగా(ఆడ గుఱ్ఱమునుగా) చూచెను. ఆమె తేజస్సుతోను నియమము తోను సర్వ భూతములకు (ప్రాణులకు) కనబడనిదిగా ఉండెను. అపుడు సూర్యుడు అశ్వరూపముననే ఆ ఆడగుఱ్ఱపు ముఖముననే సంభావించెను. అపుడు ఆడగుఱ్ఱముగా ఉన్న సంజ్ఞ మైథునమునకై విచేష్ట చేయుచున్నదై, పరపురుష శంకచే ఆ సూర్య శుక్రమును ముక్కులతో వెలుపలికి ఊదివైచెను. అపుడు ఆ సూర్య శుక్రము నుండి దేవవైద్యశ్రేష్ఠులైన అశ్వినీ దేవతలు పుట్టిరి. వారు నా సత్యుడు దస్రుడు అను వారలు. వీరు అశ్వినులు అనబడిరి. వీరు అష్టమ ప్రజాపతియైన మార్తండుని యొక్క పుత్రులు. అపుడు భాస్కరుడు ఆమెకు తన మనోహర రూపమును చూపెను. ఆతనిని చూచి అతని భార్య సంజ్ఞ సంత సించి మోహించెను. యముడు ఆ తల్లి శాపముచే మిక్కిలి పీడింపబడిన మనస్సుగలవాడై, ధర్మములో అందరిని రంజింపజేసినందున యముడు ధర్మరాజు అయ్యెను. అతడు ఆ శుభకర్మచే పరమద్యుతి కలవాడై, పితరులకు ఆధిపత్యమును, లోకపాలకత్వమును పొందెను. ఇక వివస్వంతుని జ్యేష్ఠపుత్రుడైన మనువు ప్రజాపతియు మహాయశస్వియైన సావర్ణి. రాబోవు ఆ సావర్ణిక మన్వంతరమున మనువు. సురమ్యమైన మేరు పృష్ఠమున ఇప్పుడు కూడ ఆ ప్రభువు చరించును. అన్న శనైశ్చరుడు అచట గ్రహత్వమును పొందెను. త్వష్ట (తన) ఆ రూపముతో విష్ణువునకు చక్రమును చేసెను. అది యుద్ధమున రాక్షసులను ఎదిరించి వారిని చంపుటలో గొప్ప యెదురులేని ఆయుధము. వారికి చిన్న చెల్లెలు యశస్వినియైన యమున. ఆమె లోకము భావించునదై శ్రేష్ఠమైన నది అయినది. సూర్య పుత్రులలో ఎవడు జ్యేష్ఠుడో! మహాతేజస్వియో! ప్రస్తుతము స్వర్గము ఎవరిదో! అట్టి వైవ స్వత మనువుయొక్క విస్తరము చెప్పెదను. ఈ దేవతలైన యేడుగురు వైవస్వత పుత్రుల యొక్క జన్మను విన్నవాడును చదివినవాడును ఆపదనుండి విముక్తుడగును. గొప్ప కీర్తిని పొందును. (22)

వైవస్వత మనువుయొక్క సృష్టి కథనము

సూతుడు ఇట్లు అనెను :

ఆ తరువాత చాక్షుష మన్వంతరము గడువగా, దేవతలతో బాటు ఆ మహాత్ముడైన వైవస్వతుడు పృథివీ రాజ్యమును స్వీకరించెను. ఇప్పటి మహాత్ముడైన వైవస్వతుని యొక్క సృష్టిని అనుపూర్వితో స్వీకరించి చెప్పెదను వినుడు. ప్రథమజుడైన మనువునకు ఆతనితో

సమానులైన పుత్రులు తొమ్మండుగురు ఉండిరి. ఇక్ష్వాకువు, నహుషుడు, ధృష్టుడు, శర్యాతి, నరిష్యంతుడు, ప్రాంశువు, నాభాగుడు, అరిష్టుడు, కరూషుడు, పృషధ్రి-ఈ తొమ్మండుగురు మానవులు అనగా మనుపుత్రులు అని పిలువబడిరి. పూర్వము బ్రహ్మచే ప్రేరేపింపబడి, ఈ మనువు యథేచ్ఛగా సృష్టించుటకు ప్రారంభించెను. కాని అది నిష్ఫలమయ్యెను. తరువాత ఆ ప్రజాపతి పుత్రకాముడై గొప్ప ఇష్టిని (యాగమును) చేసెను. అందులో మిత్రావరుణుల అంశమున ఆహుతిని వదలెను. ఆ యజ్ఞమున దివ్యవస్త్రములు ధరించి నదియు, దివ్య ఆభరణములను అలంకరించుకొన్నదియు, దివ్యకవచము గలదియునైన "ఇడ" అను ఆమెపుట్టెనని శ్రుతి. మనువు దండధరుడు అనబడెను. ఆతడు 'నేను నిన్ను అనుసరించి వత్తును, నీకు భద్రమగుగాక' అని ఇలతో అనగా 'ఇల' ధర్మయుక్తుడు, పుత్రకాముడు, ప్రజాపతి అయిన మనువుతో-'వక్తలలో శ్రేష్ఠుడా!' నేను మిత్రావరుణుల అంశమున పుట్టితిని. వారి దగ్గరకు వెళ్లెదను. ఆచరింపబడని ధర్మము మనను వధింప కుండు గాక-అని అనెను. అట్లు చెప్పి ఆదేవి 'ఇల' మిత్రావరుణుల సమీపమునకు వచ్చెను. అట్లు వారి సమీపమునకు వెళ్లి ఆ ఉత్తమురాలు చేతులు జోడించి 'ఓ దేవతలారా! ఇంద్రా వరుణులారా! మీ అంశతో ఇచట పుట్టితిని. మనువు తనను అనుసరించి రమ్మని నాతో చెప్పెను-ఏమి చేయవలెను' అని అడిగెను. ఆ విధముగ చెప్పుచున్న 'ఇల'ను దేవతలైన ఇంద్రావరుణులు-ఓ ధర్మజ్ఞురాలా! సుశ్రోణి! శ్రేష్ఠురాలా! ఈ నీ ధర్మముచేతను, వినయముచేతను, నిగ్రహముచేతను, సత్యము చేతను మేము సంతసించితిమి. ఓ మహాభాగురాలా! మాకన్యవైన నీవు ఖ్యాతిని పొందెదవు. సుద్యుమ్నుడు అనువాడు ప్రసిద్ధుడు, ముల్లోకములలో పూజింపబడినవాడు, జగత్ప్రియుడు, ధర్మశీలుడు, మనువంశమును వర్ధిల్లచేయువాడు. మనుపుత్రుడు అయిన ఆ సుద్యుమ్నుడు ప్రభువు. ఆతడు స్త్రీ భావమును పొందెను. ఆమె దేవియై వరమును పొంది తండ్రికడకు మరలెను. మధ్యలో బుధునితో కలిసిఉండగా అతనిచేత మైథునమునకై కోరబడెను. సోమపుత్రుడైన బుధుని వలన ఈమెకు ఐలుడగు (ఇలాపుత్రుడుగా) పురూరవుడు పుట్టెను. ఈ విధముగా ఆమె బుధునివల్ల ఐలునికని, సుద్యుమ్ని రూపమునకు మరలివచ్చెను. సుద్యుమ్ని దాయాదులు ముగ్గురు పరమధార్మికులు. వారు ఉత్కలుడు, గయుడు, వినతాశ్వుడు అనువారు. ఉత్కలునకు, ఉత్కలరాష్ట్రము. వినతాశ్వునకు దిక్కులలో పశ్చిమ రాష్ట్రము. రాజర్షియైన గయుడు గయాపురికి పాలకులు అయిరి. సూర్యుడు, మనువు సృష్టింప బడగనే, ప్రజలను సృష్టించి ఈ భూమిని పది భాగములుగా వారికి క్షేత్రమును చేసెను. ఇక్ష్వాకువే తక్కిన దాయాదులను పదుగురను పొందును. కన్యాభావమున సుద్యుమ్నుడు ఈ భాగమును పొంద లేదు. మహాత్ముడైన సుద్యుమ్నునకు వశిష్ఠుని వచనము వలన ప్రతిష్ఠానము రాష్ట్రము

ఆయెను. అది మహాకాంతివంతము. ధర్మరాజునకు ప్రతిష్ఠారూప మైనది. మహాయశస్వి ప్రద్యుమ్నుడు మహాభాగ అయిన స్త్రీయై, స్త్రీ పురుష లక్షణమునకు అనువుగా పురూరవసుని నుండి ఆ రాష్ట్రమును పొంది మానవులకు (మనుపుత్రులకు) ఇచ్చెను. ఇదివిని తరువాత ఋషులు మనుపుత్రుడైన సుద్యుమ్నుడు ఏవిధముగా స్త్రీ భావము పొందెను? అని అడిగిరి.

సూతుడు ఇట్లు అనెను :

దేవియైన పార్వతి తన ప్రియకారణముగా–"శివునితో ఓ దేవ! నా ఆశ్రమమున పురుషుడు ప్రవేశించినచో వాడు తప్పక అప్సరసలతో సమానమై శుభయైన స్త్రీ కాగలడు" అని చెప్పెను. అచట అన్ని ప్రాణులను, పిశాచులు, పశువులును స్త్రీలై, శివునితో బాటు అప్సరసలవలె క్రీడింతురు. వేటకై ఉమావనములో ప్రవేశించిన ఆ రాజు సుద్యుమ్నుడు భయంకరములైన పిశాచములతో, భూతములతో పాటు స్త్రీ భావమును పొందెను. కావున రాజైన సుద్యుమ్నుడు స్త్రీ భావమును పొంది మరల శివుని అనుగ్రహమున గాణపత్యమును (ప్రమథాది గణముల ఆధిపత్యమును) పొందెను. (23)

వైవస్వత మన్వంతర వంశ గాంధర్వ మూర్ఛనా లక్షణ కథనము

సూతుడు ఇట్లు అనెను :

మను పుత్రుల యొక్క సృష్టిని విస్తరముగ వినుడు. పృషధ్రుడు గురువు యొక్క గోవును చంపి తినెను. మహాత్ముడైన చ్యవనుని యొక్క శాపము వలన శూద్రత్వమును పొందెను. కరూషునకు కారూషుడను క్షత్రియుడు యుద్ధ ధర్మదుడై వేయి క్షత్రియ గణముల విక్రమము కలవాడై పుట్టెను. నాభాగారిష్టుని పుత్రుడు భలందనుడు. భలందనుని పుత్రుడు ప్రాంశువను మహాబిలుడు. ప్రాంశువునకు ఒక పుత్రుడు. ప్రజానిఅని ప్రసిద్ధి చెందినవాడు. ప్రజానికి ఖనిపుత్రుడు అను వీర్యవంతుడైన పుత్రుడు పుట్టెను. ఆతని పుత్రుడు శ్రీమంతుడైన క్షుపుడు అనువాడు మహాయశస్వి. క్షుపునకు వింశుడను వాడు పుత్రుడు. ఆతనికి సాటిలేదు. వింశుని పుత్రుడు కళ్యాణుడైన వివింశుడు అను ధార్మికుడు. వివింశుని పుత్రుడు ధర్మాత్ముడైన ఖనినేత్రుడు అనువాడు. అతడు ప్రతాపవంతుడు. ఆతని పుత్రుడు కరంధముడు త్రేతాయుగ ప్రారంభమున పుట్టెను. కరంధముని పుత్రుడు ఆవిక్షితుడు అను బిలవంతుడు, ఆవిక్షితునికి మరుత్తు అను చక్రవర్తితో సమానుడైన రాజు పుట్టెను. అతడు గుణములలో తండ్రినిమించెను. ఆతడు సంవర్తుని (పుత్రుని) చేత మిత్ర బాంధవులతో బాటు స్వర్గమును చేరెను. ఇచట సంవర్తునకును బృహస్పతికిని గొప్ప వివాదము జరిగెను. అతడికి చెందిన యజ్ఞము యొక్క సంపదను చూచి బృహస్పతి ఆతనిని కోపించెను.

సంవర్తునిచే యజ్ఞము హరింపబడగా అతడు మిక్కిలి కోపించెను. కాని లోకముల నాశనమునకై ఆతడు దేవతలచే శాంతింపచేయబడెను. చక్రవర్తియైన మరుత్తుడు నరిష్యంతుని (పుత్రునిగా) పొందెను. నరిష్యంతుని దాయాదుడు (పుత్రుడు) రాజైన దండ ధరుడైన దముడు. ఆతని పుత్రుడు రాజైన విక్రాంతుడు. రాష్ట్రమును వృద్ధిజేయువాడు. ఆతని పుత్రుడు సుధృతి అనువాడు. సుధృతి పుత్రుడు నరుడు. ఆతని పుత్రుడు కేవలుడు. కేవలుని పుత్రుడు బంధుమంతుడు. బంధుమంతుని పుత్రుడు ధర్మాత్ముడై రాజైన వేగవం తుడు. వేగవంతుని పుత్రుడు బుధుడు. బుధుని పుత్రుడు తృణ బిందువు. ఆతడు మూడవ త్రేతాయుగ ప్రారంభమున రాజై పుట్టెను. ఆతని కన్య ద్రవిడ అనునది. ఆమె విశ్రవసుని తల్లి. విశ్రవసుని పుత్రుడు రాజై పరమధార్మికుడైన విశాలుడు. విశాలునకు పుట్టినది నయ నిర్మితయైన విశాలుడు. విశాలుని పుత్రుడు రాజై మహాబలుడైన హేమ చంద్రుడు. హేమచంద్రుని తరువాత సుచంద్రుడు అని ప్రఖ్యాతి చెందినవాడు రాజు. సుచంద్రుని పుత్రుడు ధూమ్రాశ్వుడు అని ప్రసిద్ధి చెందిన రాజు. ధూమ్రాశ్వుని పుత్రుడు విద్వాంసుడైన సృంజయుడు. సృంజయుని పుత్రుడు శ్రీమంతుడై ప్రతాపవంతుడైన సహదేవుడు. సహ దేవుని పుత్రుడు పరమ ధార్మికుడైన కృశాశ్వుడు. కృశాశ్వుని పుత్రుడు మహాతేజస్వియై ప్రతాప వంతుడైన సోమదత్తుడు. రాజర్షియైన సోమదత్తుని పుత్రుడు జనమేజయుడు. జనమే జయుని పుత్రుడు ప్రమతిఅని ప్రసిద్ధిజెందినవాడు. తృణబిందువు యొక్క అనుగ్రహమున వారందరు వైశాలకులైన రాజులు. వారు దీర్ఘాయుష్మంతులు, మహాత్ములు, మంచి ధార్మికులు.

శర్యాతియొక్క జంటకు ఆనర్తుడను ప్రసిద్ధుడైన పుత్రుడు సుకన్య అను కన్యయు ఉండిరి. ఆ సుకన్య చ్యవనుని భార్యయైనది. ఆనర్తుని పుత్రుడు రేవుడు అను వాడు వీర్య వంతుడు. ఆతని దేశము ఆనర్త దేశము. పట్టణము కుశస్థలి. రేవునకు రైవతుడు పుత్రుడు. ఆతడు కకుద్మిఅను ధార్మికుడు. ఆతడు తన నూరుగురు తమ్ములకు జ్యేష్ఠుడు, కుశస్థలి నగరమును పొంది రాజయ్యెను. బ్రహ్మ దగ్గర కన్యతో పాటు గంధర్వుని విని దేవదేవుడైన ఆ ప్రభువు, ఒక్క ముహూర్తకాలము మర్త్యలోకములో బహుయుగములుగా వినియు, యువకుడుగానే యాదవులతో చుట్టబడిన తన నగరమునకు వచ్చెను. అది బహు ద్వార ములుగ చేయబడి మనోహరమై ద్వారవతి అని పిలువబడెను. అది వసుదేవుడు మొదలు గాగల భోజ, వృష్ణి, అంధకులచే రక్షింపబడి ఉండెను. శత్రుదమనుడైన రైవతుడు ఆ కథను ఉన్నది ఉన్నట్లుగా విని సువ్రతయై తన కన్యయైన రేవతిని బలదేవునకు ఇచ్చి, మేరు శిఖరమునకు వెళ్లి తపస్సులో ఉండెను. ధర్మాత్ముడైన బలరాముడును ఆ రేవతితో క్రీడావిహారము చేసెను అని తెలుపగా, ఋషులు ఆ కథను విని తరువాత ఇట్లడిగిరి.

ఋషులు :

ఓ సూతపుత్రా! అనేక యుగముల కాలము గడచినను రేవతి వృద్ధాప్యమును గాని తల నెరయుటను గాని ఏలపొందలేదు? మేరుపర్వతమునకు పోయిన ఆ శర్యాతి సంతతి ఈ భూమిలో ఇప్పటికిని ఎట్లు నిలిచి ఉన్నది? నిజముగా తెలియగోరుచున్నాము. అచట ఎన్ని దేవగణములు గంధర్వులుగా చెప్పబడినవి? అని ప్రశ్నించిరి.

సూతుడు ఇట్లు అనెను :

బ్రహ్మలోకమును పొందినవానికి ముసలితనము, ఆకలిదప్పులు, మరణ భయమును లేవు. రోగము కూడ వానికి కలుగదు. ఓ సువ్రతులారా! సత్పురుషోత్తము లారా! గాంధర్వ మును గురించి మీరు అడిగితిరి. కావున దానిని ఉన్నది ఉన్నట్లు చెప్పెదను. ఏడు స్వర ములు, మూడు గ్రామములు, ఇరువది యొక్క మూర్ఛనలు, తాళములు నలుబది తొమ్మిది– అను ఇది స్వర మండలము. షడ్జ ఋషభములు, గాంధారము, మధ్యమము, పంచమము, ధైవతము, నిషాదవంతము అనునవి ఏడు విధములైన స్వరములు (సరిగమపధని). సౌబీరి, మధ్యమగ్రామము, హరిణాస్య, ఉపబలోపేతయైన కల చతుర్థి శుద్ధమధ్యమ, శార్ఙ్గి, పావని, దృష్టాక ఇవి వరుసగా మధ్యమ గ్రామికములుగా ప్రసిద్ధములు. షడ్జగ్రామ మును వినుడు.

ఉత్తరమంద్ర అయిన రజని, అట్లే ఉత్తరాయత అయినదియు, శుద్ధ షడ్జ అగును. అట్లే సప్తమ గ్రామికము అని కూడ తెలియవలెను. తక్కిన గాంధార గ్రామికములను చెప్పెదను వినుడు. మొదటిది అగ్నిష్టోమికము, రెండవది వాజపేయికము, మూడవది పౌండ్రకము. నాల్గవది అశ్వమేధికము. ఐదవది రాజసూయకము, ఆరవది చక్ర సువర్ణకము. ఏడవది గోసవము అనునది, ఎనిమిదవది మహావృష్టికము, తొమ్మిదవది బ్రహ్మదానము. తరువాతిది ప్రాజాపత్యము. నాగపక్షాశ్రయము, గోతరము, హయ క్రాంతము, మృగక్రాంతము, మనోహరమైన విష్ణుక్రాంతము, వరణీయమై మత్తకోకిలల పలికించు సూర్య క్రాంతము, సావిత్రము, అర్ధసావిత్రము, సర్వతోభద్రము, సువర్ణము, సుతంద్రము, విష్ణు–వైష్ణవరులు రెండును, సాగరమును, సర్వభూత మనోహరమైన విజయమును ఇవి గాంధార గ్రామికములు. హంసమునే జ్యేష్ఠమైన గాంధార గ్రామముగా తెలుపుదురు. అది తుంబురునకు ప్రియము, మనోహరము, ధాత్రికి సంబంధించనిది. గంధర్వులు వెంబడించునది. అలంబుషకు ఇష్టమైనది. నారద ప్రియమైనది, సాగర ప్రియమైనది కూడా అని భీమసేనుడు చెప్పెను. చేతులతో తీసికొనిరాబడిన వినయవత్ లక్ష్మికలదని చెప్పబడెను. భార్గవ ప్రియమైనది. మధ్యమగ్రామము ఇరువది విధములు.

షడ్జగ్రామము పదునాలుగు విధములు. గాంధార గ్రామములో ఉన్నవి పదియైదుగా చెప్పుదురు. సౌవీరమైన గాంధారి బ్రహ్మచే గానము చేయబడును. ఉత్తరాది స్వరమునకు బ్రహ్మదేవత. ఇట హరిదేశమున పుట్టిన హరిణాస్య కలిగెను. మూర్ఛన హరిణాస్యయే! దీనికి ఇంద్రుడు అధిదైవతము. స్వరమండలమున వాయువులచేత తీసికొనిరాబడి వశమైనది 'కల'చే సమీపమునకు తీసికొని రాబడును. కావున ఇచట మారుతుడు అధిదైవతము. మనుదేశ సముత్పన్నమైన మూర్ఛన శుద్ధ మధ్యమము. ఇచట మధ్యమ స్వరము శుద్ధము. ఇచట గంధర్వుడు దేవత. సిద్ధులకు మార్గదర్శనము చేయుటలో మృగములతో పాటు సంచరించును. కావున మార్గి అనబడెను. దీనికి మృగేంద్రుడు దేవత. అది ఆశ్రమ సమాయుక్తయై అనేకములైన పౌరవములైన రవములను కూర్చుకొనినది. ఇది ఆరవముల యోజనయే. కావున రజస్సుతో రజని యైనది. తాలము ఉత్తర మంద్రాంశము. దానిని షడ్జదైవతకముగ తెలియుదురు. కావున ఉత్తర తాలమును మొదట స్వాయతముగ భావింతురు. కావున ఇది ఉత్తరమంద్రము. దీనికి ధ్రువము దేవత. ఇది నిశ్చయము. అపానమునకు ఉత్తరమైనందున దైవతమునకు ఉత్తరాయణము- ఇది మూర్ఛన శ్రాద్ధ దేవతలు పితరులు.

మహర్షులు శుద్ధ షడ్జస్వరమునుచేసి అగ్నిని ఉపాసింతురు కావున అగ్నిని శుద్ధ షడ్జకముగా తెలియవలెను. ఈ శుద్ధషడ్జకము సజ్జనులకు మూర్ఛననుచేసి పంచమస్వరము అగును.

యక్షిణుల యొక్క మూర్ఛన యాక్షికము అనబడును. నాగదృష్టి విషము కలదని గానము చేయ బడినది. కావున ఆ మూర్ఛనను సమీపింపరు. బ్రహ్మచే ఈ నాగదేవతలు హరింపబడినవా అన్నట్లుండును. ఇది సర్పముల మూర్ఛన. ఇచట వరుణుడు దేవత. పక్షులను పోల్చుకొని కిన్నరులు పయనింతురు. ఈ మూర్ఛన ఉత్తమమైనది. ఇట పక్షిరాజు దేవత. గాంధార రాగశబ్దము వాక్కును (గోవును భూమిని) ధరించునను అర్థము ఇచ్చును. కావున విశుద్ధ గాంధారి. దీనికి గంధర్వుడు అధి దైవతము. మూర్ఛన గాంధార దేశము. గాంధారము తరువాత వెళ్లి సృష్టింపబడినది. కావున ఉత్తర గాంధారి అనబడినది. ఇట వసువులు దేవతలు. ఇది మహాభూతరూపయై బ్రహ్మను సమీపించినది. కావున ఈ మూర్ఛన షడ్జ అనబడినది. అగ్ని దేవతాకముగ చెప్పబడినది. ఇది దివ్యయై పొడవైనదై మూర్ఛనమున మంద్ర షష్ఠయైనది (మంద్రషడ్జు). గుణ-నామములులేని ఐదవది ఇట దైవతము. ఈ విధముగ పూర్ణములైన సప్తస్వరములు మూర్ఛనలు అనబడినవి. అట్లే నానా సాధారణములైనవి ఆతేయని తెలుసుకొనవలెను. (24)

గీతాలంకార నిర్దేశము

పూర్వాచార్యుల మతమును అనుసరించి, ముప్పది అలంకారములను ఆనుపూర్వి కముగా చెప్పెద వినుడు. తమ తమ వర్ణములతోను, ఆయా సంస్థాన (స్థితి) యోగముల తోను, పాదముల యొక్క అన్వవేక్షణతోను, చమత్కారమునకు ప్రకృష్టములైన హేతువు లైనవి అలంకారములుగ చెప్పుదురు. వాక్యార్థ-పద యోగార్థములతో అలంకారము యొక్క అన్వయము జరుగును. గీతకమునకు ముందుగాని వెనుకగాని పదములు ఉండు నని అందురు. వాని స్థానములు ఉరము (రొమ్ము), కంఠము, శిరము అనునవి మూడు. ఈ మూడు స్థానములలో ప్రవర్తిల్లిన విధి ఉత్తమము. ప్రకృతిలో వర్ణములు నాలుగు. ప్రవిచారము నాలుగు విధములు. వికల్పము ఎనిమిది విధములు. దేవతలు పదునారుగ తెలియవలెను. వర్ణము స్థాయియై ప్రసంచారియు అగును. మూడవది అవరోహణము. నాలుగవది ఆరోహణము. ఈ విధముగ వర్ణమును వర్ణమును వర్ణవేత్తలు తెలుసుకొందురు. అందులో ఒకటి సచరమును అస్తచరమును అగుచు సంచర స్థాయి అగును. తరువాత (ఆ) రోహణ వర్ణములకు అవరోహణమును నిర్దేశింపవలెను. వర్ణవేత్తలు ఆరోహణముతో ఆరోహవర్ణమును తెలుసుకొందురు. ఈ వర్ణములకే అలంకారములను వినుడు.

అలంకారములైతే నాలుగు. స్థాపని, క్రమరేజనము, ప్రమాదము, అప్రమాదము అనునవి. వాని లక్షణములను చెప్పెదను. విస్వరోష్ట్రకలలు స్థానము నుండి ఏకాంతరమును పొందినవి. ఆవర్తమునకు పరిమాణమును బట్టి ఆక్రమోత్పత్తులు రెండు కార్యములు. కుమారము అను వేరొకదానిని విస్తరమై వమనమును పొందినది. ఇదియే కుతారేకమై కలాధికమైన అపాంగము. శ్యేనమనునది ఏకాంతరమున పుట్టినది. కలా మాత్రాంతరమున ఉండినది. దానియందే స్వరమున వృద్ధి తద్విలక్షణమై ఉండును. శ్యేనము, అవరోహము ఉత్తరముగా చెప్పబడును. కలాకల ప్రమాణము వలన అది బిందువను పేర పుట్టును. బిందువు ఏక కలగా చేయదగినది. అది వర్ణాంత స్థాయిని అగును. అది విపర్యయ స్వరముగలది కూడ అగును. దానికి దుర్ఘటిత స్వరము ఉండదు. ఏకాంతరమైన వాద్యమైతే షడ్జము కంటె ఉత్కృష్టమైన స్వరము. కాకికి ఉచ్చ పుష్కలమువలె ఆక్షేపాస్కందనమును చేయవలెను. కార్యముగాని, కారణముగాని అవి రెండు సంతారములు, సంచార్యములును కూడా. అవరోహణము చేసియు ఆక్షిప్తము అగును. ప్రోక్షమధ్యము కూడ అగును. తరు వాత పంద్రెండవ కలాస్థానము ఏకాంతరగతము అగును. ఈ విధముగ ప్రేంఖో లితము అను అలంకారము స్వరసమన్వితము అగును. స్వరసంక్రామకము వలన తరువాత

పుష్కలము అని చెప్పబడినది. ఇతరముల (రెంటి) యొక్క పాదములు కలచే ప్రక్షిప్తము అగును. అట్టిదియే రెండు కలలుకలదై ప్రోసితము అనబడును. ఉచ్చారము వలన విస్వ రారూఢమై అట్లే అష్ట స్వరాంతరము అగును. అవరోహముగగాని, తారముగగాని, మంద్రముగ గాని–ఉన్న స్వరములు ఆ స్వరము లోపలనే ఏకాంతర రహితములు అగును. ఇది మక్షిప్రచ్ఛేదనము అనుపేర చతుష్కలమైన గణముఅనబడును. ఇవి ముప్పది. ఇంతకుముందు చెప్పబడిన అలంకారములు అగును. అవి వర్ణ–స్థాన ప్రయోగముతోను కలా మాత్రా ప్రమాణమును బట్టియు పై విధముగా ఉండును. సంస్థానము, ప్రమాణము, వికారము, లక్షణము–అని అలంకారపు ప్రయోజనములు నాలుగు విధములు. ఆత్మకు (ఆత్మాశ్రిత శరీరమునకు) విపర్యస్తమైన అలంకారము నిందింపబడినట్లే, విషమమైన (విపర్యస్తమైన) వర్ణము ఆత్మను అలంకరించుటకు చాలదు. నానాభరణ వ్యత్యస్త సంయోగము వలన స్త్రీకి వికృతము అలంకారము అయినట్లే కేవల వర్ణము యొక్క అలంకారము విపర్యస్తమై మిక్కిలి నిందింపబడును. పాదమున కుండలములు చూడబడవు. కంఠమున మొలనూలు కనబడదు. ఈ విధముగనే విపర్యస్తమై ఈ అలంకారము మిక్కిలి నిందింపబడును. చేయబడుచున్న అలంకారము, అదిచూపిన రాగము కర్తవ్యమై యథోద్దిష్టమైన మార్గమునకు విధింపబడును. లక్షణమును నిశ్చయించి కూడ వర్ణికలతో ప్రవర్తించుటను మాసోద్భవ ముఖోద్భవములుగా ఉన్నది చెప్పెదను. ఆ అలంకారముల ఈ విపర్యయము ఇరువది మూడును, ఎనుబదియును, షడ్జపక్షము(న) కూడ తత్త్వాదిలో మధ్యమము హీనస్వరముఅగును. షడ్జ–మధ్యమముల యొక్కయు, గ్రామముల యొక్కయు వ్యత్యాసము, అట్లే ఉత్తర మంద్రము యొక్కయు ఆవికము యొక్కయు (గాంధారము యొక్క) మానములు ఇచట ఆతే అగును. సర్వాలంకార ప్రత్యయమే సర్వుల ప్రత్యయము. అనుగమించి బహిర్గతమైనది పంచ దైవతము. గో రూపముల ఎదుట మద్యమాంసము మారును. ఆరెంటి యొక్క విభాగము గీతముల యొక్క లావణ్య మార్గమున ఉన్నది. స్వస్వరూపమైన వేరొక స్వరమును గూర్చి సంబంధము ఉద్దేశింపబడినది. (దాని ఆధారముగ) సప్తస్వర పద క్రమరూపమైన మార్పు జరుగును. నాలుగు మంద్రకములు గాంధారాంశతో గానము చేయబడును. పంచమము, మధ్యమ మును అట్లే గానము చేయబడును. ధైవతమున నిషాదమున పుట్టిన షడ్జర్షభములచే గానము చేయబడును. ఇది అంతయు మంద్రకములందే జరుగును. అంతరమున కాదు. హయ శుల్లాష్టకమునకు రెండు అపరాంతికములు. ప్రాకృతము వైణవములతో (వేణు వాద్యములతో) గాంధారాంశమున ప్రయోగింపబడును. పదమునకు మూడు రూపములు. కౌశికము

ఏడు రూపములు గలది. మొత్తము గాంధారాంశతోనే మార్పుయొక్క విధి చెప్పబడినది. ఈ విధముగా మధ్యమాంశము యొక్క మధ్యమము క్రమోద్దిష్టమైనది. విశేషించి రూపముతో చెప్పబడిన గీతములు సప్తస్వరములుగ చేయవలెను. అది కౌశికము. దీనిని సంగదర్శనము అందురు. రెండు మానములు సమానములు. అట్లే ద్వితీయ భావాచరణ రూపమైన మాత్ర నాభియందు ప్రతిష్ఠితమైనది. ఉత్తరమున ప్రకృతి. ఈ విధముగ మాత్ర తల్లీనమగును. హంతలుండుచోట పిండకము మాత్రయందు మించి వర్తించదు. మాత్రయందు ఒకపావు భాగము నడచుట సామాన్యము. పావుభాగము తక్కువ నడచుట అతివీరణము. అసలు మాత్రయందు సంఖ్యయే లేక నడచుట కూడ చెప్పబడినది. రెండవ పాద భంగము గ్రహముతో అభిప్రతిష్ఠితమైనది. ముందు ఎనిమిది పరీతకముకాని తృతీయమునందైతే రెండవది ప్రతిష్ఠితమైనది. పంచకమున పాద భాగము నుండి పాద సామ్యముగ అర్థముతో (సగముతో) ప్రతిష్ఠితమైనది. ప్రకృతియందుకూడ సపాదమైనా పాదభాగము(సగము)సంస్థితమైనది. (పంచక మున సగము ప్రకృతిలో సగము ఉన్నదని భావము). నాలుగవది ఉత్తర మద్రకమైన మద్రవతి యందున్నది. దక్షిణ మద్రకమున కూడ యథోక్తమైన కల యున్నది. మొదటనే అనుయోగము, రెండవది బుద్ధి అనబడును. దీనివలన రెండు పాదముల (పావు భాగముల) తీసికొనుట జరుగును. ఇట అంతు (హద్దు) లేదు. ఓ ద్విజోత్తమా! ఒకదాని ఉపయోగము, రెంటి ఉపయోగము, అనేకముల ఉపయోగమును పతాకాహరిణ అనబడినది. మూడు వృత్తులు ఒకచోట వర్తించినచోట దక్షిణ వర్తించినది. ఎనిమిది (స్వరములు) కూడినచో సౌవీర మూర్ఛన అగును. అది అనుత్తరమై సప్తత్త్వ స్వరమును వ్యాపింపజేయును. (25)

మనువంశ వర్ణనము

సూతుడు ఇట్లు అనెను :

కకుద్మియొక్క ఆ లోకమును పొందిన రైవతునికి సంబంధించిన వారందరు పుణ్యజనులైన రాక్షసులచే హతులైరి. అది కుశస్థలి. ధార్మికుడును, మహాత్ముడునైన అతని యొక్క ఆ నూరుగురు సోదరులు రాక్షసులచే నిర్బంధింపబడిరి. అందుచే వారు భయము వలన నలుదిక్కులకు పారిపోయిరి. ఓ బ్రాహ్మణోత్తములారా! వారి భయముచే ఆక్రాంతులైన ఆ క్షత్రియులు అచ్చటచ్చట నెలకొనిరి. వారి వంశములు అచ్చటచ్చట మిక్కిలి గొప్పవైనవి. అన్ని దిక్కులకు పోయిన వారు ధార్మికులుగా ప్రఖ్యాతి గాంచిరి. ధృష్టుని ధర్షించునట్టి క్షాత్రము రణమున ప్రౌఢము అయ్యెను. (అపరాధుల దండించునట్టి క్షత్రజాతి యుద్ధరూపమైన

అపరాధము చేయునది అయ్యెను). ఇట్టి మహాత్ములైన క్షత్రియుల యొక్క గణములు మూడు వేలుగా ఉండినవి. అందులో నా భగుని దాయాదుడు (పుత్రుడు) నాభాగుడను వీర్య వంతుడు. నాభాగ పుత్రుడు అంబరీషుడు. ఆతని పుత్రుడు విరూపుడు. విరూపుని పుత్రుడు పృషదశ్వుడు. ఆతని పుత్రుడు రథీతరుడు. ఈ క్షత్ర ప్రసూతులుకూడ మరల ఆంగి రసులు అనబడురు. రథీతరులలో శ్రేష్ఠులు క్షాత్రముతో కూడిన ద్విజాతులు (క్షత్రియులు).

క్షువతుడు అను మనువున కంటె పూర్వము ఇక్ష్వాకువను వాడు ఉద్భవించెను. ఆ ఇక్ష్వాకునకు నూరుగురు పుత్రులు ఉండిరి. వారు భూరిదక్షిణలతో యజ్ఞములు చేసిరి. వారిలో జ్యేష్ఠుడు వికుక్షుడు. తరువాతివాడు నేమి, ఆ తరువాతివాడు దండుడు. ఈ విధముగ ముప్వురు. వికుక్షికి శకుని మొదలగు వారు ఏబదుగురు పుత్రులు. ఉత్తరాపథ దేశమును రక్షించు రాజులు నలుబది. అట్లే దక్షిణ దిక్కున రక్షించువారు ఎనమండుగురు. 'వంశతి' మొదలగు వారు దక్షిణాపథమును రక్షించువారు. తరువాత ఇక్ష్వాకువు వికుక్షిని 'అష్టక' యందు ఆదేశించెను.

రాజు ఇట్లనెను :

"ఓ మహాబలుడా! మృగములను చంపి శ్రాద్ధమున భోక్తలు భుజింపదగిన దానిని నాకు తెచ్చి పెట్టుము. ఇవ్వేళ అష్టకయందు నిఃసంశయముగా శ్రాద్ధము చేయవలసి ఉన్నది" అని ఆజ్ఞ ఇచ్చెను. ధీమంతుడైన ఇక్ష్వాకుని మాట ప్రకారము ఆ వికుక్షి వేటకు పోయి వేలకొలది మృగములను చంపెను. వేటవల్ల పరిశాంతుడైన వికుక్షి అచ్చట కుందే లును భక్షించెను. ఆ వికుక్షి సైనికులతోను, మాంసముతోను రాగా ఇక్ష్వాకువు వశిష్ఠుని ఆ మాంసమును ప్రోక్షించుమని ప్రేరేపించెను. ఆ విధముగ రాజుచే ప్రేరితుడైన వశిష్ఠుడు శాస్త్రీయముగా సమీపించి ఆ మాంసమును చూచి కోపించినవాడై రాజుతో ఆ మాంసమును ఉపహతమైన దానినిగా (కొంత గ్రహించి తినబడినదానినిగా) చెప్పెను. ఓ రాజా! నీ పుత్రుడైన శూద్రునిచే మాంసము అపహరింపబడినది. ఓ మహాద్యుతీ! కుందేటిని భక్షించి నందున ఈ మాంసము తినదగినదికాదు. ఓ పాపరహితుడా! ఆ దురాత్ముడు (వికుక్షి) ముందే అరణ్యమున కుందేటిని తినెను. దానిచేత ఈ మాంసము ఓ రాజోత్తమా! పితరులకు దుష్టమైనది అని పలికెను. అంత ఇక్ష్వాకువు కోపించి వికుక్షినితో ఇట్లనెను–"పితృకార్యమున నాచే ఆజ్ఞాపింపబడి వేటకు వెడలితివి. దయలేనివాడవై అట అరణ్యమున (శ్రాద్ధమునకు) ముందే కుందేటిని నీవు ఏల తింటివి. కావున నిన్ను వదిలిపెట్టు చున్నాను. ఇక నీవు నీ ఇచ్చ వచ్చిన విధముగా వెడలుము. ఈ విధముగ వశిష్ఠుని మాటవలన ఇక్ష్వాకువుచే తన పుత్రుడు వదలిపెట్టబడెను. ఆ ఇక్ష్వాకువు అట్లుండగా ఆ శశి (శశమును భక్షించిన

వికుక్షి) ఈ భూమిని చేరి పరమ ధర్మాత్ముడై అయోధ్యాధిపుడు అయ్యెను. అపుడు అతడు వశిష్ఠప్రేరితుడై రాజ్యము చేసెను. తరువాత ఆ రాజు యొక్క రాజ్యావస్థ ఆ పాపముతో నిండెను. కాలక్రమముగ ఆతడు అట మిక్కిలి తక్కువైన గతిని పొందెను. ఈ విధముగ ఈ ఆఖ్యానమును తెలిసి, అవిధి భక్షింపలేదు. ఎవరి మాంసము ఈ లోకమున నేను తింటున్నానో వాడు జన్మాంతరమున ఆ మాంసమును తినగలడు. (మాంసభక్షయితా అముత్రేతి–మాంసః) అని మాంసత్వమును విద్వాంసులు నిర్వచింతురు.

శశాదుని పుత్రుడు కకుత్స్థుడను వీర్యవంతుడు. పూర్వము ఒక యుద్ధమున వృష భూతుడైన ఇంద్రునకు కకుత్స్థుడు పుట్టెను. దాని వలన కకుత్స్థుడు అనబడెను. కకుత్ స్థునకు అనేనసుడు అను కుమారుడు పుట్టెను. ఆతడు పృథురోముడు అనబడెను. పృథువు యొక్క పుత్రుడు వృషదశ్వుడు. ఆతని వల్ల వీర్యవంతుడైన ఆంధ్రుడు పుట్టెను. ఆంధ్రు (డు)నకు యవనాశ్వుడు, ఆతనికి శ్రావస్తుడు పుత్రుడు, శ్రావస్తునకు మహాయశస్వి యైన బృహదశ్వుడు పుత్రుడు. ఈతనిచేతనే శ్రావస్తినగరి నిర్మింపబడెను. బృహదశ్వుని పుత్రుడు కుబలాశ్వుడని శ్రుతి. ఆతడు దుంధువను వానిని చంపినందున ధుంధుమారుడని పేరుగాంచెను.

ఋషులు ఇట్లు అనిరి :

"ఓ ప్రాజ్ఞుడా! దేనికై కుబలాశ్యుడు దుంధుమారుడు అనబడెనో ఆ దుందువధను సవిస్తరముగా వినదలచితిమి". సూతుడు ఇట్లు అనెను. బృహదశ్వునకు ఇరువది యొక్క వేల పుత్రులు. వారందరు విద్యలలో నిష్ణాతులు, బలవంతులు, చంపుటకు అలవికాని వారు, వారందరును ధార్మికులు, భూరి దక్షిణలు ఇచ్చిన యజ్వులు అయిరి. నరాధిపుడు బృహ దశ్వుడు ఆ రాష్ట్రమున మహావీర్యవంతుడును, శూరుడును, ధార్మికుడు అయిన కుబలాశ్వుని అభిషేకించెను. ఆ విధముగ పుత్రునకు సంక్రమింపచేసిన రాజ్యము కలవాడై బృహదశ్వుడు అనురాజు వనవాసము చేసెను. కాని, ఆవిధముగ వనవాసమునకు వెడలిన శూరుడు ఉత్తమ ధార్మికుడు మహారాజైన బృహదశ్వుని బ్రహ్మర్షియైన ఉత్తంకుడు నివారించెను.

ఉత్తంకుడు ఇట్లు అనెను :

నీచే ఒక రక్షణము చేయవలసిఉన్నది. నీవు దానిని ఇపుడు చేయుటకు అర్హుడవుగా ఉన్నావు. ఓ రాజా! నేను ఉద్వేగము లేనివాడనై తపము చేయలేకున్నాను. నా యొక్క ఆశ్రమ సమీపమున సమముగా ఉన్న మరుధన్వములలో (మరుభూమియందుండు పర్వతములలో) ఇసుకతో నిండిన సముద్రము ఉండును. అచట ఇసుకలో దాగి భూమి అంతర్భాగమున దేవతలకు అవధ్యుడును, మహాకాయుడు, మహాబలుడు అయిన గొప్ప

వాడు ఉన్నాడు. అతడు మనుపుత్రుడు, క్రూరుడు, మిక్కిలి భయంకరుడునైన ధుంధువు, లోకవినాశమునకై భయంకరమైన నూరు వర్షముల తపమును అవలంబించి ఉన్నాడు. ఆతడు సంవత్సరము చివర నిఃశ్వాసమును వదలును. అపుడు అచటి భూమి తన అడవులతో కూడ కంపించునట. ఆతని నిఃశ్వాస వాయువుతో పెద్ద దుమ్ము బయలుదేరును. అది సూర్యమార్గమును ఆవరించును. ఏడు దినములు భూమి కంపించును. అది నిప్పులతోను, మంటలతోను, అతిభయంకరమైన ఉష్ణముతోను నిండిఉండును. ఓ రాజా! ఆకారణము చేత నేను నా ఆశ్రమమున నిలువజాలకున్నాను. ఓ మహాబాహూ! లోకముల హితమును కోరి వానిని నివారింపుము. మహావిష్ణువు నీ తేజస్సును తన తేజస్సుచే ఆప్యాయనము చేయకలడు. ఈనాడు ఆ రాక్షసుడు చంపబడినచో లోకములు స్వస్థములు అగును. ఓ రాజా! ఈనాడు నీవు ఆతని చంపుటకు శక్తి గలవాడవు కదా! నాకు పూర్వము ఓ పాపరహితా! విష్ణువుచే వరము ఈయబడినది. కావున మహావీర్యుడైన ధుంధువు అల్పవీర్యముతో అణచుటకు శక్తిగలవాడు కాడు" అని మహాత్ముడైన ఉత్తంకునిచే ఈవిధముగ చెప్పబడినవాడై రాజర్షియైన బృహదశ్వుడు, తన కుమారుడైన కుబలాశ్వునిని ఆ ధుంధునివారణమునకై ఉత్తంకునకు ఇచ్చెను. ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! నేను శస్త్రములను విసర్జించినవాడను. ఈనాసుతుడు రాజై, నిఃసంశయముగా ధుంధుమారుడు (ధుంధువును చంపువాడు) కాగలడు. అని ఆ బృహదశ్వుడు, తన కుమారుని ధుంధుమారణ సముద్యతునిగా ఆదేశించి శంసితవ్రతుడై తపమునకై పర్వతమునకు జనెను. ధర్మాత్ముడైన కుబలాశ్వుడు తండ్రిమాటయందు నిలబడి ఆ ధుంధువును నివారించుటకై ఉత్తంకునితో సహా వెడలెను. అంత, ఉత్తంకుని నియోగమున లోకముల హితముకోరి భగవంతుడైన విష్ణువు ఆతనిని ఆదేశించెను. ధర్షింప అలవికాని అతడు వెళ్లిపోగా, ఆకాశమున ఒక మహాశబ్దము కలిగెను. ఇప్పటి నుండి ఈ రాజు ధుంధు మారుడుగా పేరు పొందెను. దేవతలు దివ్య పుష్పములచేత ఆతనిని అద్భుతముగ సంభావించిరి. పురుషశ్రేష్ఠుడైన ఆ వీర్యవంతుడు కుమారులతో కూడ వెడలి, సముద్రమును త్రవ్వెను. అది అవ్యయమైన ఇసుక సముద్రము. ఆ రాజర్షి నారాయణునితో ఆప్యాయితుడు (ఆదేశింపబడినవాడు) గదా. ఉత్తంకుని వశమందు ఉండి అతడు అతిబలుడు అయ్యెను. ఇసుక సముద్రమును త్రవ్వుచున్న అతని పుత్రులు అప్పుడు అట పశ్చిమదిక్కున ఇసుకలో దాగియున్న ధుంధువును చూచిరి. ఆతడు ముఖాగ్నిచే లోకములను నశింపచేయుచున్నాడా అన్నట్లు కోపించి ఉండెను. ఆ సముద్రము సోముని యొక్క ఉదయమున ధారోర్మికలిలమై గొప్పనైన మహోదధివలె యోగముతో నీటి అలల శబ్దమును వినెను. రాక్షసులైన ఆతని (ధుంధువుయొక్క) పుత్రులు

ముగ్గురు తప్ప తక్కిన వారందరు దహింపబడిరి. తరువాత ఆ రాజు అతిబలుడై ధుంధు బంధువులను చంపెను. ఆ రాజు అతని (ధుంధువు యొక్క) జలమయమైన వేగమును త్రాగి వైచెను. యోగియైన రాజు యోగ(ముతో) జలముతో అగ్నిని శమింపజేసెను. మహాకాయుడైన ఆ జలరాక్షసుని బలముతో కూల్చెను. తరువాత ఆ రాజు కార్యము ముగించినవాడై ఉత్తంకుని చూపెట్టెను. ఉత్తంకుడును ఆ మహాత్ముడైన రాజునకు వరమును ఒసగెను. ఆతనికి అక్షయమైన విత్తమును, శత్రువులకుకూడ అపరాజితుడు అగుటను, ధర్మమునందు ఎల్లప్పుడు ఆసక్తి కలిగి ఉండుటను, స్వర్గమున అక్షయమైన నివాసమును, హతులైన రాక్షసులకుకూడ అక్షయ లోకములను వరముగా ఒసగెను. ఆ ధుంధువు యొక్క ముగ్గురు పుత్రులు మాత్రము మిగిలిరి. అందుజ్యేష్ఠుడు దృఢాశ్వుడు. భద్రాశ్వ–కపిలాశ్వులు తరువాతి సోదరులు. ధుంధుమార పుత్రుడైన దృఢాశ్వునకు పుత్రుడు హర్యశ్వుడు. ఎల్లప్పుడును క్షత్రధర్మరతుడైన నికుంభుడు హర్యశ్వుని పుత్రుడు. నికుంభుని పుత్రుడు సంహతాశ్వుడు. ఈతడు రణపండితుడు. సంహతాశ్వుని పుత్రులు కృశాశ్వుడు, అక్షయాశ్వుడు–అను ఇరువురు. ఆతని భార్య హైమవతి. సత్పురుషులలో మతిదృషద్వతి అని ముల్లోకములలో ప్రసిద్ధిజెందినది. ఆమె పుత్రుడు ప్రసేనజిత్తు. ఆతని పుత్రుడు యవనాశ్వుడు. ఆతడు ముల్లోకములలో అతి తేజస్వియు, అత్యంత ధార్మికుడు, ఆతని భార్య పతివ్రతయగు గౌరి. ఆమె భర్తచే దూషింపబడినదై (శపింపబడినదై) బాహుదా నదిగా చేయబడినది. ఆమె పుత్రుడు గౌరికుడు చక్రవర్తి అయ్యెను. యవనాశ్వ పుత్రుడైన మాంధాత త్రైలోక్య విజయమందిన రాజు. ఇట పౌరాణిక బ్రాహ్మణులు సూర్యుడు ఉదయించి ఎంతవరకు ఉండునో! ఎంతవరకు ఆకాశమున ప్రకాశించుచు నడచు చుండునో అంతవరకు మొత్తము భూమి యవనాశ్వ పుత్రుడైన మాంధాతయొక్క రాజ్యము. (సూర్యుడు అస్తమించని రాజ్యము అని భావము) (దీనివల్ల భూమి గుండ్రముగ ఉన్నదనియే అప్పటి భావనఅని తేలును). మహాత్ముడు, యజ్వయు, అమిత పరాక్రమియునైన మాంధాత విష్ణువు యొక్క శరీరమే అని వంశవేత్తలైన జనులు చెప్పుదురు. ఆతనికి శశబిందుని యొక్క పుత్రియైన చైత్రరథి భార్య అయ్యెను. ఆమె సాధ్వి, బిందుమతిఅను పేరుగలది, రూపములో భూమిపై సాటిలేనిది. ఆమె పదివేల అన్నలకు జ్యేష్ఠురాలు, పతివ్రత. ఆమె యందు ప్రభువైన మాంధాత ముగ్గురు పుత్రులను కనెను. వారు పురుకుత్సుడు, అంబరీషుడు, ప్రసిద్ధుడైన ముచుకుందుడును. అంబరీషుని పుత్రుడు రెండవ యవనాశ్వుడు అనబడెను. యవనాశ్వునకు హరితుడు పుత్రుడు. హారీతులు (హరిత పుత్రులు) శూరులు. వీరు అంగిరసుని పుత్రులు. క్షాత్రముతో కూడిన ద్విజాతులు. పురుకుత్సుని పుత్రుడు

మహాయశస్వి అయిన త్రసదస్యువు. నర్మద యందు పుట్టిన సంభూతుడు (త్రసదస్యునకు పుత్రుడు). సంభూతునకు పుత్రుడు ప్రతాప వంతుడైన అనరణ్యుడు. ఈతడు పూర్వము త్రిలోకవిజయమున రావణునిచే చంపబడెను. అనరణ్యుని పుత్రుడు త్రసదశ్వుడు. ఆతని పుత్రుడు హర్యశ్వుడు. హర్యశ్వునకు దృషద్వతి యందు వసుమతుడు అను రాజు పుట్టెను. ఆతని పుత్రుడు ధార్మికుడును, రాజుఅయిన త్రిధన్వుడు. త్రిధన్వునకు త్రయియందు రణప్రభువైన విద్వాంసుడు పుట్టెను. ఆతనికి సత్యవ్రతుడు అను మహాబలుడైన కుమారుడు పుట్టెను. వాడు స్వర్గవాసులను చంపి విదర్భుని భార్యను అపహరించెను. పాణిగ్రహణ మంత్రములలో నిష్ఠను పొందింపగా, ఇట ఆతనికి విష్ణువృద్ధుడు అను పుత్రుడు కలిగెను. వీరు క్షాత్ర తేజముతో కూడినవారు. సమాశ్రయించినవారును అగు అంగిరసుని పుత్రులు.

కామము వలనను, బలము వలనను, మోహము వలనను, సంకర్షణ బలము చేతను (శత్రువులను సంహరించు బలముచేతను), కానున్న భవితవ్య బలము వలనను, ఆ బుద్ధిమంతుడు అయిన సత్యవ్రతునిచే పరుని భార్యను అపహరించు దుష్కార్యము చేయబడినది. ఆ విధముగ అధర్మముతో కూడిన ఆతనిని త్రయీగుణుడైన (వేదములే గుణముగాకల) తండ్రి వదలివేసెను. కోపముతో కూడినవాడై 'నశింపుము' అని పలు మారులు అనెను. ఆ సత్యవ్రతుడు 'ఒంటరినై ఎటకు పోవుదును!" అని మాటి మాటికి అడిగెను. అంత తండ్రి ఆతని శ్వపాకులతో (కుక్కలను వండువారితో, మాలవారితో) ఉండుము అనెను. "ఓ కులదూషకుడా! పుత్రుడు అయిన, నీచే నేను పుత్రార్థిని (పుత్రుని కోరినవానిని) కాను"-అని చెప్పి "ఓ విభో! తన మాటతో ఆతనిని నగరము నుండి వెడలగొట్టెను" భగవంతుడును ఋషియునైన వశిష్ఠుడును ఆతనిని అడ్డుకొనలేదు. ఆ ధీమంతుడైన సత్యవ్రతుడు తండ్రితో వదిలిపెట్టబడినవాడై, మాలవారి ఇండ్ల సమీపమునకు వెళ్లెను. ఆతని తండ్రియు వనమునకు వెళ్లెను. అప్పుడు ఆ అధర్మముచే ఆ దేశమున పండ్రెండేండ్లు ఇంద్రుడు వర్షింపలేదు. ఆ దేశమున మహాతపస్వి అయిన విశ్వామిత్రుడు భార్యను ఆ ప్రదేశమున నుంచి సముద్ర ప్రాంతమున జల ప్రదేశమున విపులమైన తపము చేసెను. ఆతని భార్య తన ఔరసుడైన (తనకు తన భర్తకును పుట్టిన) మధ్యమ పుత్రుని జుట్టుతో మెడను కట్టి తన పోషణమునకై నూరు గోవులకు అమ్మెను. మెడను కట్టబడి అమ్మబడిన ఆ విశ్వామిత్ర మహర్షి పుత్రుని చూచి, ధర్మాత్ముడు, నరోత్తముడు, సువ్రతుడు అగు సత్యపుత్రుడు ఆతనిని క్రయము నుండి వదిలించెను. మహామతియైన ఆ సత్యవ్రతుడు విశ్వామిత్రుని సంతోషము అనుగ్రహములకై ఆతని పోషణ భారము వహించెను. గళమునందు (అమ్ముటకు పశువులకు పలుపుత్రాడు కట్టిన విధముగా కట్టబడిఉన్న)

బద్ధుడైన ఆ మహాతపస్వి తరువాత కాలవుడు అయ్యెను. దీనివలన తండ్రియై మహర్షియైన కౌశికుడు ఆతని పరాక్రమముచే ముక్తుడు కావింప బడినట్లు అయ్యెను. ఆతని వ్రతముచేతను, భక్తిచేతను, దయచేతను, ప్రతిజ్ఞచేతను, వినయవంతుడై సత్యవ్రతుడు విశ్వామిత్రుని భార్యను భరించెను. తరువాత తేళ్లను, అడవి పందులను, అడవి దున్నలను ఇంకను వనచరములను చంపి విశ్వామిత్రుని ఆశ్రమ సమీపమున వాని మాంసమును వండెను. రాజు వనవాసికాగా, తండ్రి ఆజ్ఞవలన సత్య వ్రతుడు ఉపాంశు వ్రతమున నుండి పండ్రెండు వర్షముల దీక్షను వహించెను. అయోధ్యను, రాజ్యమును అట్లే అంతః పురమును ఆతడు పొందెను. మునియైన వశిష్టుడు యాజ్యో పాధ్యాయ సంయోగము వలన రక్షింపబడెను. సత్యవ్రతుడు భవితవ్యము యొక్క బలీయత వల్ల బాల్యము నుండియు కోపముతో వశిష్టునిపై కోపమును వహించి ఉండెను. ఇంకను పూర్వము తండ్రిచేత రాష్ట్రమునుండి వెడలగొట్టబడిన తన కుమారుని వశిష్ఠుడు వారించ లేదు. ఆ కారణమున సత్యవ్రతునకు బాల్యము నుండియు వశిష్ఠునిపై కోపముండెను. పాణిగ్రహణ మంత్ర ములకు ఏడవ పదమున నిష్ఠ (సమాప్తి) అగును. ఈ విధముగనే సత్యవ్రతుడు ఆ మంత్రములను ఏడవ పదమున పూర్తి చేసెను. ధర్మములను తెలియుచునే వశిష్ఠుడు ఇచట మంత్రములను ఇష్టపడలేదు-అని సత్యవ్రతుని విషయమున వశిష్ఠుడు మనస్సున కోపము వహించెను. గురువై భగవంతుడైన వశిష్ఠుడు బుద్ధిచే అపుడు ఆ విధముగా చేసెను. దీనికి సత్యవ్రతుడు ఉపాంశువ్రతమును కావలయుననే చేయలేదు. ఆతడూ రకుండగా తండ్రి విషయమున వశిష్ఠుడు మహామనస్వియై ఉండెను. దానివల్ల పండ్రెండు ఏడులు ఇంద్రుడు వర్షము కురియలేదు. దానివలన ఇపుడు భూమిలో ఆ దీక్షను అనేక విధములుగా దుర్బలము చేయును. ఇది తన కులమునకు చేసిన నిష్కృతి అగును అనిపించును. అంతట భగవంతుడైన వశిష్ఠుడు తండ్రిచే వదిలిపెట్టబడిన సత్య వ్రతుని వారించెను. "తరువాత ఈతనిని రాజ్యమునందు ప్రభువుగా అభిషేకింతును" అనెను. రాజపుత్రుడైన సత్యవ్రతుడు బలియై పండ్రెండేడులు దీక్షను వహించుచు, మాంసము లేకపోగా, మహాత్ముడైన వశిష్ఠునియొక్క సర్వకామములను విదుకు ధేనువును జూచెను. కోపమువల్లను, మోహమువల్లను, శ్రమవల్లను, ఆకలిగొన్నవాడై దస్యుధర్మమును పొంది మహాబలియై దానిని చంపెను. దాని మాంసమును ఆతడు తాను తినెను. విశ్వామిత్ర పుత్రులకు తినిపించెను. అది విని అప్పుడు వశిష్టుడు అతనిని వదిలిపెట్టెను. భగవంతుడైన వశిష్ఠుడు రాజపుత్రుడగు సత్య వ్రతునితో ఓ క్రూరుడా! పురుషాధముడా! నీకు మూడు శంకువులు లేని పక్షమున లోహమయమైన నీ శంకువును (మాలాపరాధ కీలమును)

పడగొట్టుచున్నాను. తండ్రియొక్క అసంతోషమునను, గురువు యొక్క ధేనువును చంపుట చేతను, అప్రోషితమును ఉపయోగించుటచేతను, నీవు మూడు విధముల క్రమమును తప్పితివి" అని ఈ విధముగ మహాతపస్వి వశిష్ఠుడు మూడు శంకువులను చూచి ఆతనిని త్రిశంకువు అనెను. కావున అతడు త్రిశంకువనబడెను. తపము నుండి వచ్చిన విశ్వామిత్రుడు తన భార్యను భరించినందున సంతుష్టుడై త్రిశంకువునకు వరమును ఇచ్చెను. వరముచే సంతసింపజేసిన రాజపుత్రుడగు సత్యవ్రతుడు (త్రిశంకువు) విశ్వామిత్రుని గురువుగా వరించెను. ఆ పండ్రెండేళ్ల అనావృష్టి భయముపోగా, తండ్రియొక్క రాజ్యమున అభిషేకించి విశ్వామిత్రుడు సత్యవ్రత త్రిశంకువుతో యజ్ఞము చేయించెను. ప్రభువైన విశ్వామిత్రుడు దేవతలును వశిష్ఠుడును చూచుచుండగనే ఆ సత్యవ్రత త్రిశంకువును అపుడు సశరీరముగ స్వర్గమున అధిరోహింపచేసెను. చూచుచున్న వశిష్ఠునకు అది అద్భుతముగ తోచెను. విశ్వామిత్ర అనుగ్రహమున త్రిశంకువు స్వర్గమున విరాజిల్లు చున్నాడు. దేవతలతో పాటు మహాతేజము అనుగ్రహించుటచే ఆ బుద్ధిమంతుడు అగు త్రిశంకువు యొక్క అబల స్త్రీ హేమంతమున చంద్రమండితయై రమ్యయై మెల్లిగా చేరినది. ఆమె మూడు భావములచే అలంకృతయైనది. త్రిశంకు గ్రహణముచే అలంకరింప బడినది అని జనులు ప్రశంసించిరి. త్రిశంకువునకు కేకయ వంశమున బుట్టిన 'సత్యరత' భార్య అయ్యెను. ఆమె పాపరహితుడైన హరిశ్చంద్రుని కుమారునిగా కనెను.

ఆ రాజైన హరిశ్చంద్రుడు త్రైశంకవుడని వినికిడి. రాజసూయ యాగమును చేసినవాడు సమ్రాట్టని ప్రసిద్ధి చెందినవాడు. హరిశ్చంద్రుని కుమారుడు రోహితుడు అను పరాక్రమవంతుడు. తరువాత రోహితునకు హరితుడు, హరీతునకు చుంచువు, చుంచువునకు విజయుడు సుదేవుడు అను ఇరువురు పుత్రులు కలిగిరి. సర్వ క్షాత్రమును జయించినందున మొదటివాడు విజయుడు అనబడెను. ఆతనికి పుత్రుడు రురుడు. ఆతడు ధర్మార్థ కోవిదుడైన రాజు. రురునకు ధృతకుడు పుత్రుడు. ఆతనికి బాహువను వాడు పుట్టెను. బాహువు హైహయములచేత (హేహయరాజ్యపువారు) తాలజంఘుల చేతను (తాటి వృక్షముల వంటి పిక్కలు గలవారిచే), నిరస్తుడైన వ్యసనవంతుడైన (చెడు అలవాట్లు గల) రాజు కలిగెను. అతడు శకులచేతను, కాంబోజులచేతను, పారదులచేతను, పహ్లావులచేతను తిరస్కరింపబడెను. అట్లే ధర్మమయమైన సత్యయుగమున ఆతడు ధార్మికుడు కాకుండెను. ఆ బాహువునకు కరముతో (విషముతో) జనించిన సగరుడు పుట్టెను. భృగువు యొక్క ఆశ్రమమును చేరి తుర్వసునిచే రక్షింపబడెను. సగరుడు అను ఆ రాజు భార్గవునినుండి ఆగ్నేయాస్త్రమును పొంది, భూమి పైకి వెళ్లి, హైహయములతో పాటు

తాలజంఘులను కూడ సంహరించెను. అచ్యుతుడై (చ్యుతిలేనివాడై). ధర్మవేత్తయైన ఆతడు క్షత్రియుల యొక్కయు, అట్లే ఆ పారదుల యొక్కయు ధర్మములను నిరసించెను.

ఋషులు ఇట్లు అనిరి :

ఆ సగరరాజు విషముతో ఎట్లు పుట్టెను? అచ్యుతుడైన సగరుడు కోపించినవాడై మహౌజస్కులైన శకాది క్షత్రియుల యొక్క కులోచితములైన ధర్మములను ఏల నిరసించెను?

అని అడుగగా సూతుడు ఇట్లు అనెను :

పూర్వము వ్యసనవంతుడైన బాహువుయొక్క రాజ్యము శకులతో పాటు వచ్చిన హైహయుల చేతను, తాలజంఘులచేతను అపహరింపబడినది. యవనులు, పారదులు, కాంభోజులు, పహ్లావులు, హైహయులకై పరాక్రమించిన వీరు ఐదు గణములుగా అప్పుడు ఉండిరి. బలవంతులైన ఈ క్షత్రియ శ్రేష్ఠులచే బాహు రాజ్యము అపహరింపబడినది. అపహరింపబడిన రాజ్యముకల బాహురాజు అపుడు సన్యసించి వనమున భార్యతోసహ ప్రవేశించి ధర్మాత్ముడై తపమాచరించెను. కొంతకాలమునకు జలము కొరకై బయలురేరిన ఆరాజు ముదుసలి అగుటచేతను బలము లేనివాడగుట చేతను మధ్యలోనే మరణించెను. ఆతని భార్యయైన యాదవి ఆతనిని (శ్మశానమునకు) వెంబడించెను. అంతకుపూర్వమే ఆమె సవతి, ఆమె గర్భమును జంపుటకై ఆమెకు విషమిచ్చి ఉండెను. ఆ యాదవియు తన భర్త చితిఏర్పరచి అగ్నిలోనికి భర్తను ఎక్కించెను. భృగువంశీయుడైన ఔర్వుడు ఆమెను చూచి కారుణ్యముతో సహగమనమును నివారించెను. ఔర్వుని ఆశ్రమమున ఆమె ఆ గర్భమున విషముతో బాటు మహా బాహువైన సగరుడను ధార్మికుని గనెను. ఔర్వుడు ఆ మహాత్మునకు జాతకర్మాదులను ఆచరించి, వేదశాస్త్రముల చదివించి తరువాత ఆగ్నేయ అస్త్రమును ప్రసాదించెను. రాక్షసులకు గూడ సహింపనలవిగాని ఆ ఆగ్నేయాస్త్రమును జామదగ్న్యునినుండి పొంది, దాని బలముచేతను తన బలముచేతను కూడిన వాడై పశు గణములను కోపించిన రుద్రునివలె, కోపించి హైహయులను చంపెను. తరువాత యవనులతో బాటు శకులను, కాంబోజులను, పారదులను, పహ్లావులను నిశ్శేషము చేయుటకు పూనెను. మహాత్ముడు వీరుడైన సగరునిచే చంపబడుచున్నవారై పైవారు అందరు శరణమును కోరిన వశిష్ఠుని యవనాదుల వధనుండి నివారించెను. సగరుడును తన ప్రతిజ్ఞను గురువచనమును విని వారియొక్క ధర్మమును నశింపచేసెను, వారికి భిన్న రూపమున కలుగునట్లుగను చేసెను. శకులను సగము తలలు గొరిగించి వదిలెను. యవనులను మొత్తము తలలను గొరిగించి వదలెను, కాంభోజులను కూడ అట్లే చేసెను. పారదులు ముక్తకేశులైరి. పహ్లావులు మీసములుధరించిరి. ఆ మహాత్మునిచేవారు స్వాధ్యాయ

వషట్కారములు లేనివారుగా చేయబడిరి. పారదులతో బాటు పహ్లవులు, శకయవన-కాంభోజులు, కేలిస్పర్శులు, మాహిషికులు, దార్వులు, చోళులు, ఖసులు వీరందరు క్షత్రియ గణములు. పూర్వము వశిష్టుని వచనము వలన మహాత్ముడైన సగరునిచే ఈ క్షత్రియ గణములు తమ ధర్మమును వదలుటచేత వేరొక ధర్మము స్వీకరింపబడినది. అట్టి సర్వ ధర్మవిజేతయైన సగరరాజు ఈ వసుంధరను జయించి అశ్వమేధయాగ దీక్షితుడై యజ్ఞాశ్వమును చరింపజేసెను. ఆ విధముగ చరింపచేయబడిన ఆ అశ్వము ఆగ్నేయ సముద్రమున చెలియలికట్ట సమీపమున అపహరింపబడి భూమిలోనికి కొంపోబడినది. ఆ సగర రాజు తన కుమారులందరిచే ఆ దేశమును త్రవ్వించెను. వారు మహా సముద్రమున అంతర్భాగమున ఆదిపురుషుడును, దేవుడును, హరియును, కృష్ణుడును, ప్రజాపతియును, విష్ణువును, కపిల రూపముతో ఉన్న హంస స్వరూపియునైన నారాయణుని దర్శించిరి. ఆతని నేత్రమును చూడ అందు తేజము ఉద్భవిల్లెను. అపుడు ఆ పుత్రులు అందరును ఆ తేజముతో దహింపబడిరి. కాని నలుగురు మాత్రము మిగిలిరి. వారు బర్హికేతువు, సకేతువు, ధర్మరతుడు, శూరుడు-అనువారు. ఈ అయిదుగురు సగరునికి వంశకరులు. భగవంతుడు, హరియైన నారాయణుడు ఆతనికి తన వంశము యొక్క అక్షయత్వమును, నూరు అశ్వమేధయాగములను, విభువైన సముద్రుని పుత్రునిగను, అక్షయమైన స్వర్గ నివాసమును వరములుగా ఇచ్చెను. ఆ సముద్రుడు అశ్వమును తీసికొని నమస్కరించెను. సరిత్తులకు పతియైన ఆ సముద్రుడు సగరుని ఆ కర్మవల్ల సాగరత్వమును పొందెను. సముద్రుని నుండి అశ్వమేధిక అశ్వమును పొంది రాజైన సగరుడు మరలమరల నూరు అశ్వమేధములను చేసెను. అశ్వమును అనుసరించిన అరువది వేల సగర పుత్రులు దహింపబడిరి. నారాయణ తేజము ప్రవేశించి దహింపబడిన మహాత్ములైన ఆ (సగర) పుత్రుల సంఖ్య అఱువది వేలు.

ఋషులు ఇట్లు అనిరి :

రాజైన సగరునకు ఏ విధానముతో ఆరువది వేల పుత్రులు జనించిరి? తెలుపుడు.

సూతుడు ఇట్లు అనెను :

సగరునకు ఇరువురు భార్యలు ఉండిరి. వారు తమ పాపములను తమ తపముచే నశింపచేసికొనిరి. అందులో పెద్దది విదర్భరాజు కూతురు పేరు 'కేశిని'. ఆతని చిన్నభార్య పరమ ధర్మాత్మురాలు, అరిష్టనేమి కూతురు, భూమిలో సాటిలేని సుందరి. వారిరువురు తపముచే ఆరాధింపగా 'ఔర్వ'ముని వారికి మొదటి భార్య వంశకర్తయై యష్టుడైన పుత్రుని కనగలదు. రెండవభార్య అరువది వేల పుత్రులను కనగలదు-అని వరము ఒసగెను.

మునివచనమును విని కేశిని శ్రేష్ఠయై రాజ సభలో వంశకర్తయైన పుత్రుని వరముగా ఔర్వుని నుండి గ్రహించెను. అట్లే సుపర్ణ భగినియైన రెండవ భార్య సుమతియు తనబుద్ధిని అనుసరించి ఆ మహాత్ముడైన ఔర్వునినుండి వరముగా అరువది వేల పుత్రులను గ్రహించెను. తరువాత కొంతకాలమునకు జ్యేష్ఠ భార్య కకుత్స్థ వంశజుడు, సగరపుత్రుడు, అసమంజుడని పిలువబడిన జ్యేష్ఠ పుత్రుని కనెను. యశస్వినియైన రెండవ భార్య సుమతియు, గర్భరూపమైన సొరకాయను కనెను. ఆ సొరకాయ మధ్యనుండి అఱువది వేల పుత్రులు గర్భములుగా బయలువెడలిరి. రాజు నేయినింపిన కుండలలో ఆ గర్భములను ఉంచునట్లుగా చేసెను. తరువాత అరువది వేల దాదులను ఒక్కరొక్కరుగా వారి పోషణమునకై నియోగించెను. తొమ్మిది మాసముల తరువాత ఆ ఘృతకుంభముల నుండి సగర ప్రీతి వర్ధనులైన పుత్రులు బయలువెడలిరి. చాలకాలమునకు వారు యౌవనము నందిరి. యజ్ఞాశ్వమును వెంబడించు ఆ అరువది వేల పుత్రులలో జ్యేష్ఠుడైన సగర పుత్రుడు, నరశ్రేష్ఠుడు, అసమంజుడని పేరుకాంచినవాడు, నెమలి ధ్వజముగా కలవాడు, మహాబలుడును పౌరుల అహితమున పూనుకొన్న వాడగుటచే పూర్వము ఆతడు తండ్రిచే వెడలగొట్టబడెను. ఆ అసమంజుని పుత్రుడు బలపరాక్రమవంతుడైన అంశుమంతుడు, ఆతని పుత్రుడు ధర్మాత్ముడు దిలీపుడు అని ప్రసిద్ధిచెందినవాడు. దిలీపునకు మహాతేజస్వి, వీరుడుఅయిన భగీరథుడు పుట్టెను. యజ్ఞము చేయు ఆ భగీరథునకు విమానములతో అలంకరింపబడి నదీశ్రేష్ఠయైనగంగ సముద్రుని వలన కూతురుగా కల్పింపబడెను. ఈ సందర్భమున పౌరాణిక జనులు భగీరథుడు తన కర్మలచే ఆ గంగను తీసికొనివచ్చెను. కావున గంగను భాగీరథి (భగీరథపుత్రి) అందురు. భగీరథసుతుడు శ్రుతుడనువాడు. నాభాగుడు ఆతని పుత్రుడు. ఈతడు నిత్యము ధర్మ పరాయణుడు. ఆతని పుత్రుడు అంబరీషుడు. ఆతనికి సింధుద్వీపుడు కలిగెను.

నాభాగపుత్రుడైన అంబరీషుని భుజములచే పరిపాలింపబడిన భూమి ఆధి భౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మిక తాపములతో సంపూర్తిగా వదలబడినదై, సుఖముగా ఉండెను. సింధుద్వీపునకు వీర్యవంతుడైన అయుతాయువు పుత్రుడు. అయుతాయు పుత్రుడు మహా యశస్వియైన ఋతుపర్ణుడు. ఈతడు దివ్యాక్షముల హృదయము దెలిసిన రాజు, నలుని సఖుడు, బలవంతుడును కూడా. పురాణములలో దృఢవ్రతులైన నలులు ఇరువురు చెప్పబడిరి. వీరసేన పుత్రుడు. ఇక్ష్వాకు కులమును ఉద్ధరించినవాడు. ఋతుపర్ణుని పుత్రుడు సర్వకాముడై జనేశ్వరుడుగా ఉన్నవాడు ఒక నలుడు. ఆతని పుత్రుడు సుదాసుడు ఆతడు హంసముఖుడు అను రాజు. సుదాసుని పుత్రుడు సౌదాసుడు అను రాజుగా చెప్పబడెను.

ఆతడు కల్మాషపాదుడు అను పేర ప్రసిద్ధుడు, మిత్రసహుడు, కల్మాషపాదుని క్షేత్రమున ఇక్ష్వాకుకుల వృద్ధికై వశిష్ఠుడు అశ్మకుని జనింపచేసెను. అశ్మకునకు ఉరకాముడు ఆతనికి మూలకుడు అను పుత్రులు. మూలకరాజును గూర్చి మూలకరాజు ఈశ్వరుడైనను పరశురాముని భయముచే వివస్త్రుడై నారీకవచముగా స్త్రీ పరివృతుడై తన రక్షణకొరకు నివసించెను అని ఈ విషయము చెప్పెదరు. మూలకునకు ధర్మాత్ముడై రాజైన శతరథుడు పుత్రుడు. ఆ శతరథునకు బలియైన ఇడవిడుడు అను రాజు పుత్రుడు. ఇడవిడుని పుత్రుడు శ్రీమంతుడై ప్రతాపవంతుడైన కృతశర్మ పుత్రీకుడు. ఆతని పుత్రుడు విశ్వమహత్తు, ఆతని పుత్రుడు దిలీపుడు. ఆతడు ఖట్వాంగుడు అని పేరొందినవాడు. ఆతడు స్వర్గము నుండి ఇటకు (భూమికి) వచ్చి ముహూర్త కాలము ప్రాణమును పొంది సత్యముచేతను, వృద్ధి చేతను, ముల్లోకములను జోడింపచేసెను. ఆతని పుత్రుడు దీర్ఘబాహువు. ఆతనికి రఘువు పుట్టెను. రఘువునకు అజుడు పుట్టెను. ఆతనికి వీర్యవంతుడైన దశరథుడు పుట్టెను. ఆతనికి ఇక్ష్వాకుకులమును ఆనందింపచేయు రాముడు కలిగెను.రాముడు దశరథ పుత్రుడు వీరుడు, ధర్మజ్ఞుడు, లోకప్రసిద్ధుడు, భరతుడు, లక్ష్మణుడు, మహాబలుడైన శత్రుఘ్నుడును దశరథునికి పుట్టిన ఇతరపుత్రులు. శత్రుఘ్నుడు మధుపుత్రుడైన లవణుని చంపి మధువనమునుచేరి ఆతని పట్టణమైన మధురలో ప్రవేశించెను. సుబాహువు, శూరసేనుడు అను ఇరువురు విదేహరాజ పుత్రులు, శత్రుఘ్నునితో కూడినవారై మధురా పురిని పాలించు చుండిరి. అంగదుడు, చంద్రకేతువు ఇరువురు లక్ష్మణునిపుత్రులు. హిమవ త్పర్వత ప్రాంతమున వారి జనపదములు విశాలమైనవి. అంగదునకు 'అంగదీయా' అను పట్టణము కారపథ దేశమున కలదు. మల్లుడైన చంద్రకేతువునకు 'చంద్రవక్త్ర'అను పురి శుభమైనది కలదు. భరతుని పుత్రులు ఇరువురు వీరులు. తక్షుడు, పుష్కరుడు అనువారు. ఆ మహాత్ముల పట్టణములు గాంధార దేశమున ఉన్నవి. తక్షునకు దిక్కుల యందు ప్రసిద్ధిగాంచిన రమ్యమైన తక్షశిల అను పట్టణము కలదు. వీరుడగు పుష్కరునకు కూడ ప్రసిద్ధమైన పుష్కరావతి అను పట్టణముకలదు. పురాణవేత్తలైన జనులు రాముని ఈ గాథను గానము చేయుదురు. మహాబుద్ధిశాలియైన రాముని మాహాత్మ్యము వలన సత్త్వములును, అర్థములును రామునియందే నిబద్ధమై ఉన్నవి. ఆతడు శ్యాముడు (నల్లని సుందరుడు) యువకుడు, ఎఱ్ఱని కన్నులు గలవాడు, తేజముతో వెలిగిన ముఖము కలవాడు, మితముగ మాటాడువాడు, ఆజానుబాహువు (మోకాళ్ల వరకు పొడవైన చేతులు కలవాడు, మంచి ముఖముతో అనుకూలుడు, సింహము వంటి స్కంధము (మూపురము) గలవాడు, మహాభుజములు కలవాడు. ఋగ్వేద, సామవేద, యజుర్వేదముల ఘోషము (ధ్వనియు) ధనువు యొక్క నారి

యొక్క ఠంకార ధ్వనియు రెండే మహాధ్వనులు వెలుగు నట్లుగా రాముడు పదివేల ఏండ్లు రాజ్యము చేసెను. ఆతని రాష్ట్రమున ఎప్పుడు నెడతెగ కుండగా "ఈయబడుగాక, భుజింప బడుగాక (ఈయుడు, తినుడు)" అను మాటలు పలుకబడుచుండును. జనస్థానమున ఉండుటచే దేవతల కార్యములను నిర్వహించెను. ఆ మానవ శ్రేష్ఠుడు మహాయశస్వి. పూర్వము సీతయొక్క స్థానమును వెదకి వెంటాడుచు అపరాధముచేయు పులస్త్యకుల సంభూతుడైన రావణుని చంపెను. సత్త్వవంతుడై, గుణసంపన్నుడై, తనతేజముతో వెలుగు చున్నవాడై సూర్యాగ్నులనుమించి దశరథ పుత్రుడైన రాముడు ప్రకాశించెను. ఈ విధముగనే మహాబాహువై ఇక్ష్వాకు కులనందనుడై విభువైన రాముడు రావణుని తనగణములతో పాటు సంహరించి స్వర్గమును ఆక్రమించెను. శ్రీరామునకు పుత్రులు కలిగిరి. వారిలో ఒకడు కుశుడు, మరొక పుత్రుడులవుడు, మహాబలశాలి. వారి దేశములను వినుడు. కుశునిది కోశలా రాజ్యము. పట్టణము కుశస్థలి. అది వింధ్య పర్వతము చరియలందు రమ్యముగా నివేశించి ఉన్నది. ఉత్తరా కోశలలు మహాత్ముడైనలవుని రాజ్యము. లోక పసిద్ధమైన శ్రావస్తి పట్టణము. కుశ వంశమును వినుడు. కుశుని పుత్రుడు ధర్మాత్ముడైన ప్రియాతిథియైన 'అతిథి'. అతిథి పుత్రుడు ప్రసిద్ధుడైన నిషధుడు అను రాజు. నిషధునకు నలుడు, నలునకు నభసుడు, నభసునకు పుండరీకుడు, ఆతనికి క్షేమధన్వుడును పుత్రులు, క్షేమధన్వుని పుత్రుడు రాజై ప్రతాపవంతుడైన దేవానీకుడు. దేవానీక పుత్రుడు ప్రభువైన అహీనగుడు. అహీనగుని పుత్రుడు మహా యశస్వి అయిన పారియాత్రుడు. ఆతని పుత్రుడు దలుడు, ఆతని పుత్రుడు బలుడు అనురాజు. బలుని పుత్రుడు ధర్మాతుడైన ఔంకుడనువాడు. ఆతని పుత్రుడు వజ్రనాభుడు, ఆతని పుత్రుడు శంఖణుడు. శంఖనుని పుత్రుడు విద్వాం సుడైన ధ్యుషితాశ్వుడు. ధ్యుషితాశ్వుని పుత్రుడు రాజైన విశ్వసహుడు. కౌశల్యుడు, కోశల దేశాధిపతియైన విశ్వసహుని పుత్రుడు హిరణ్యానాభుడు. ఆతని పుత్రుడు వశిష్ఠుడు. సమస్త సుఖములలోను పౌత్రుడైన జైమినికి శిష్యుడు. ఆయననుండి నూట అయిదు సంహితలను అధ్యయనముచేసెను. ఆతని నుండి బుద్ధిశాలి అయిన యాజ్ఞవల్క్యునిచే యోగము నేర్చుకొనబడినది. ఆతని పుత్రుడు విద్వాంసుడైన పుష్యుడు. ఆతని పుత్రుడు ధ్రువసంధి. ఆతని పుత్రుడు సుదర్శనుడు. ఆతని పుత్రుడు అగ్నివర్ణుడు. అగ్నివర్ణునకు శీఘ్రుడు. శీఘ్రునకు మనువు పుత్రులు. మనువు యోగమును వహించి కలాప గ్రామమున నిలిచెను. అతడు పందొమ్మిదవ ప్రయోగమున క్షత్రప్రావర్తకుడైన ప్రభువు అయ్యెను. మనుపుత్రుడు ప్రసుశ్రుతుడు. ఆతని పుత్రుడు సుసంధి. సుసంధికి అమర్షుడు పేరుగల సహస్వంతుడు పుత్రుడు. సహస్వంతుని పుత్రుడు రాజైన విశ్రుతవంతుడు. ఆ విశ్రుతవం

తునకు పుత్రుడు రాజైన బృహద్బలుడు. వీరు ఇక్ష్వాకు వంశపుత్రులు సామాన్యమున రాజు అనబడిరి. ఈ వంశమున ముఖ్యులు ఎవరో వారే ప్రాధాన్యముతో చెప్పబడిరి. ఆదిత్యుడైన వివస్వంతుని (సూర్యుని) యొక్క ఈ సృష్టిని చక్కగా పఠించువాడు సంతానవంతుడై వైవస్వతమనువు యొక్క సాయుజ్యమును పొందును. ప్రజలకు పుష్టిని ఇచ్చు యమదేవుని అనుగ్రహమును పొంది, పాపరహితు డై, విరజుడై, ఆయుష్మంతుడై అచ్యుతుడు అగును.(26)

మనువంశకీర్తనము

సూతుడు ఇట్లు అనెను :

తమ్ముడై వికుక్షియైన నిమియొక్క వంశమును వినుడు. ఈతడు గౌతమాశ్ర మము చుట్టున ఉండి దేవపురముతో సాటియైన జయంతము అని పేరొందిన పట్టణమున నివసించెను. ఆతని వంశమున ఋషిసత్తముడైన జనకునినుండి నేమి అనువాడు పుట్టెను. ఆతడు చక్కని ధర్మాత్ముడు, సర్వప్రాణులచే నమస్కరింపబడువాడు. విశాల తేజస్కు లైన ఇక్ష్వాకునకు మహాప్రాజ్ఞుడైన పుత్రుడు ఉండెను. ఆతడు వశిష్ఠుని శాపముచే విదేహు (దేహము లేని)డు అయ్యెను. ఆతనికి మూడు పర్వములతో 'మిథి' అను వాడు పుట్టెను. అరణి మథింపబడుచుండగా ఈ మహాయశస్వి పుట్టెను. పేరు 'మిథ'. జనించుట వలన జనకుడు అయ్యెను. మిథి అనువాడు మహావీర్యుడు. ఆతనిచేతనే ఇది మిథిలయైనది. ఈతడు జనకుడను రాజు. జనకునకు ఉదావసుడు పుట్టెను. ఉదావసునకు సుధర్మాత్ముడై నందివర్ధనుడు జనించెను. నందివర్ధనునకు శూరుడు ధార్మికుడునైన సుకేతువు కలిగెను. సుకేతువునకు ధర్మాత్ముడై మహాబలుడైన దేవరాతుడు కలిగెను. దేవరాతునకు బృహదుచ్ఛుడు కలిగెనని వింటిని. బృహదుచ్ఛునకు ప్రతాపవంతుడైన మహావీర్యుడు కలిగెను. మహావీర్యునకు ధృతిమంతుడు, ఆతనికి సుధృతియు పుత్రులు. సుధృతికి ధర్మాత్ముడై పరంతపుడైన ధృష్టకేతువు కలిగెను. ఆతని పుత్రుడు హర్యశ్వుడు అని ప్రసిద్ధిగాంచినవాడు. హర్యశ్వునకు మరుడు, మరుపుత్రుడు ప్రతిత్వకుడు, ప్రతిత్వకునకు ధర్మాతుడై రాజైన కీర్తిరథుడు సుతుడు. కీర్తిరథుని పుత్రుడు దేవమీఢుడు. దేవమీఢునకు విబుధుడు, విబుధునకు ధృతియు పుత్రులు. ఆ మహాధృతికి ప్రతాపవంతుడై రాజైన కీర్తిరాజు పుత్రుడు. కీర్తిరాజపుత్రుడు విద్వాంసుడైన మహారోముడు అని ప్రసిద్ధుడు. మహారోమునకు ప్రసిద్ధి చెందిన స్వర్ణరోముడు కలిగెను. స్వర్ణరోముని పుత్రుడు హ్రస్వరోముడు అను రాజు. హ్రస్వరోముని పుత్రుడు విద్వాంసుడైన సీరధ్వజుడు. ఈతడు దున్నుచుండగా యశస్విని అయిన సీత ఉద్భవించినది. ఆమె రామునకు భార్య అయ్యెను. సాధు స్వభావము గలది, చక్కని వ్రతనియమములుగలది. గొప్ప పతివ్రత.

శాంశపాయనుడు ఇట్లు అనెను :

"దున్నుచుండగా సీత ఎట్లు పుట్టినది? ఆ సీత ఉన్న ఆ క్షేత్రము ఆ రాజు జనకుడు ఎందులకు దున్నెను?"

సూతుడు ఇట్లు అనెను :

ఆ మహాత్ముడైన జనకుని యొక్క అశ్వమేధ యాగమున అగ్ని క్షేత్రము చక్కగా వేదోక్త విధితో దున్నబడుచుండగా అందుండి సీత ఉద్భవిల్లెను. సీరధ్వజుని వల్ల పుట్టిన వాడు, భానుమంతుడు అనువాడు, ఆతడు మిథిలకు సంబంధించినవాడు. కుశధ్వజుని అన్న. ఆతనికి కాశ్యధిపతి రాజు. ఆ భానుమంతుని పుత్రుడు ప్రతాపవంతుడైన ప్రద్యు మ్నుడు. ఆతని సుతుడు ముని. ఆతనికి ఊర్జవహుడు పుత్రుడు. ఊర్జవహునకు సుతద్వా జుడు, ఆతనికి శకునియు పుత్రులు. శకునికి స్వాగతుడు పుత్రుడు. ఆతని పుత్రుడు సువర్చుడు. ఆతని పుత్రుడు శ్రుతుడు. ఆతని పుత్రుడు సుశ్రుతుడు. సుశ్రుతునకు పుత్రుడు జయుడు. ఆతనికి పుత్రుడు విజయుడు. విజయునకు ఋతుడు పుత్రుడు, ఋతునకు పుత్రుడు సునయుడు. సునయునకు వీతహవ్యుడు, వీతహవ్యునకు ధృతియు పుత్రులు. ధృతికి బహులాశ్వుడు కలిగెను. బహులాశ్వ పుత్రుడు కృతి. మహాత్ములైన జనకుల వంశము ఆతనియందు నిలచినది – వీరు అందరు మైథిలులని చెప్పబడిరి. ఇక ముందు నేను చెప్పబోవుచున్న సోముని వంశమును కూడ వినుడు. (27)

సోమోత్పత్తి వర్ణనము

అని సూతుడు ఇట్లు అనెను :

ఓ బ్రాహ్మణులారా! సోముని తండ్రి భగవంతుడైన అత్రి అను ముని. ఆ భగవంతుడు తన తేజముతో సమస్త లోకములలోను మించి ఉండెను. పూర్వము ఆతడు మనో, వాక్, కాయములతో శుభములనే ఆచరించుచు, కాష్ఠమువలెను గోడ యందలి (చిత్తరువు) రాతివలెను కదలక చేతులు పైకెత్తిన వాడై, మహాతేజస్వియై, దేవమానములో మూడు వేలయేండ్లు చరింపనలవికాని మహాతపమును చేసెనని మేము వింటిమి. దేవత్వమును కోరి ఊర్ధ్వ రేతస్కుడై అట ఉన్న అతని శరీరము సోమత్వమును పొందెను. మహాబుద్ధి శాలియైన ఆద్విజుడు (అత్రిముని) భావితాత్ముడైన అత్రియొక్క ఆ సోమత్వము ఊర్ధ్వమును అంతయు ఆక్రమించెను. అపుడు ఆ సోముడు ఆతని రెండు కన్నుల నుండియు పది దిక్కులను ప్రకాశింపచేయుచు స్రవించెను. అపుడు పదుగురు దిగ్దేవతలు విధిచే ఆదేశిం పబడినవారై ఆ సోముని గర్భముగా ధరించిరి. ఆ దిగ్దేవతలు అందరును ఒక్కచో కలిసియే

ఆగర్భమును ధరించిరి. కాని తరువాత దానిని ధరించుటకు అసమర్థు లైరి. వెంటనే ఆ గర్భము సర్వభావనుడై, శీతాంశువై, ఆ దిక్కుల నుండియే లోకములను అన్నింటిని ప్రకాశింపచేసెను. దిగ్దేవతలు ఆ గర్భమును ధరింపజాలనందున ఆ సీతాంశుడు దిగ్దేవతా గర్భముల నుండి భూమిపైపడెను. ఆ విధముగా పడుచున్న చంద్రుని చూచి లోకపితా మహుడైన బ్రహ్మ లోకహితమును కోరి ఆతనిని రథము ఎక్కించెను. ఓ బ్రాహ్మణులారా! ఆతడు దేవమయుడు. సత్యమే సంగరముగా కలవాడు. ఆ రథము వేయి తెల్లని గుఱ్ఱము లతో పూన్చబడినదని వింటిని. పరమాత్మ స్వరూపుడైన ఆ అత్రి పుత్రుడు పడగనే ప్రసిద్ధులైన బ్రహ్మమానస పుత్రులు ఏడుగురును స్తోత్రము చేసిరి. అచటనే అంగిరసుడును, ఆతని యొక్కయు, భృగువు యొక్కయు పుత్రులును, అనేకములైన ఋక్కులచేతను యజుస్సుల చేతను అథర్వాంగిరసముల చేతను స్తోత్రము చేసిరి. తరువాత ఆ స్తుతింప బడుచున్న, ప్రకాశించు సోముని (చంద్రుని) తేజస్సు ఆప్యాయమానమగుచు అంతటను ముల్లోక ములను భావించుచుండెను. సమముగ ఉన్న రథశ్రేష్ఠముచే సాగరాంతమైన భూమిని ప్రకాశముతో సంతృప్తి పరచి, విశాలుడై ఇరువది యొక్క మారులు భూప్రదిక్షణము చేసెను. అట్లు తిరుగుచున్న ఆతని ఆ తేజము పృథివిని చేరెను. అచట పుట్టిన ఆ ఓష ధులు ఆ తేజముతో చక్కగా ప్రకాశించినవి. ఈ సోముడు ఆ ఓషధులచే లోకము లను, నాలుగు విధములుగా ఉన్న ప్రజలను ధరించును. ఓ బ్రాహ్మణోత్తములారా! ఈ విధముగా భగవంతుడైన సోముడు జగమును పోషించువాడు. స్తోత్రములచేతను, కర్మలచేతను తపముచేతను పొందిన తేజస్సుకల ఆ సోముడు మహాభాగుడై నూరు పద్మసంఖ్యల (లక్ష లక్ష కోట్ల) ఏండ్ల తపము చేసెను. తన కర్మతో ప్రసిద్ధి చెందిన సోముడు తమ బంగారు వర్ణముతో జగమును ధరించు దేవులకు విభుడు అయ్యెను. తరువాత ఓ ద్విజులారా! బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైన బ్రహ్మ విప్రులయొక్కయు, నీళ్లయొక్కయు బీజౌష ధులందు రాజ్యము ఇచ్చెను. మహాతేజస్వియైన సోముడు మహా రాజ్యముతో రాజరాజుగా అభిషేకింపబడినవాడై, తపస్వి శ్రేష్ఠుడైన ఆతడు లోకములను సహజముగనే భావింప సాగెను. ప్రచేత సుపుత్రుడైన దక్షుడు తనపుత్రికలగు దాక్షా యణులలో మహావ్రతముకల ఇరువది ఏడుగురిని చంద్రునికి ఇచ్చెను. వారిని అందరు నక్షత్రములుగా అనగా అశ్విని మొదలగు రేవతి అంతములుగా తెలియుదురు. అచట ఆ మహారాజ్యమును పొంది సోమవంతులకు ప్రభువైన ఆ సోముడు లక్షదక్షిణలుకల రాజసూయ యాగమును చేసెను. అందు హిరణ్యగర్భుడు ఉద్గాతఅయ్యెను. బ్రహ్మ బ్రహ్మత్వమును పొందెను. భగవంతుడును ప్రభువును హరియు అయిన నారాయణుడు సదస్యుడు అయ్యెను. ఆతడు సనత్కుమారుడు

మొదలగు ఆద్యులైన బ్రహ్మర్షులచే పరివృతుడై ఉండెను. ఓ బ్రాహ్మణులారా! సోముడు ఆ యాగమున నా సదస్యులకును బ్రహ్మర్షి ప్రముఖులకును ముల్లోకములను దక్షిణగా నిచ్చెనని మేము వింటిమి. ఆతనిని సిని, కుహువు, వపువు, పుష్టి, ప్రభ, వసువు, కీర్తి, ధృతి, లక్ష్మి అను తొమ్మండుగురు దేవులు సేవించిరి. తరువాత రాజసూయ అవభృథ స్నానమును జేసి, ప్రశాంతచిత్తుడై, సమస్త దేవతల చేతను ఋషులచేతను పూజింప బడినవాడై రాజాతి రాజేంద్రుల మించినవాడై దిక్కులను పది విధములుగ తపింపచేసెను.

అప్పుడు పొందనలవికానిదియు ఋషులచే స్తుతింపబడినదియు అయిన ఆ ఐశ్వర్యమును పొంది, సోముడు విలాసమతియై వినయము కోల్పోయెను. వెంటనే అంగిరసుని సుతులను అవమానించి బృహస్పతియొక్క యశస్వినియైన భార్యయగు తారను అపహరించెను. దేవతలును దేవర్షులును అడిగినను, తారను బృహస్పతికి ఈయలేదు. ఓ బ్రాహ్మణులారా! శుక్రుడు అంగిరసుడైన బృహస్పతి పార్ష్ణిని(మడమను)వెనుకనుండి గ్రహించెను. (అనగా శత్రువు అగుట వలన వెనుకనుండి కాళ్లులాగు శత్రువు అయ్యెను, దేవగురుద్వేషియైన రాక్షసగురువగుట వలన బృహస్పతికి శత్రువై వెన్నంటి ఉండెనని భావము). శివునకు పుత్రుడు శుక్రుడు. ఈతడు పూర్వము బృహస్పతి తండ్రియగు అంగిర సునకు శిష్యుడు. కాగా శుక్ర సహాధ్యాయి, అందువలన శుక్రునకు బృహస్పతి స్పర్థలో ద్వేషి. కాని శుక్రుని తండ్రియగు శివునకు మాత్రము బృహస్పతియందు తన పుత్రునకు సహాధ్యాయి అన్న స్నేహము ఉండినది. ఆ స్నేహముచేతనే రుద్రుడు తన యావద్గణములతో పినాకము అను ధనువును ధరించి బృహస్పతికి వెన్నంటి ఉన్న రక్షకుడుగా అయ్యెను. శుక్రునిచేత (చంద్రునిచేతను) బ్రహ్మర్షులు మొదలగు (చంద్ర పక్షము) వారిపై పరమాస్త్రము (సోమాస్త్రము) ప్రయోగింపబడెను. అట్లే మహాత్ముడైన రుద్రునిచే దేవతలపై కూడ పరమాస్త్రము (బ్రహ్మ శిరోనామ కాస్త్రము) ప్రయోగింపబడెను. వాని వలన వీరు ఇరువురి కీర్తియు నశింపజేయబడినది. అచట ఆ దేవదానవుల యుద్ధము ప్రత్యక్షముగ తారకామయమై (చుక్కలు రాలచేయునదై), గొప్పలోక నాశకమైన యుద్ధముగా అయ్యెను. అందు మువ్వురు దేవతలు మిగిలిరి. వారు తుషితులు అనబడిరి. వారు ఆదిదేవుడై పితా మహుడైన బ్రహ్మను శరణముపొందిరి. అంత పితామహుడైన బ్రహ్మ స్వయముగ శుక్రుని, జ్యేషుడగు శంకరుని రుద్రుని యుద్ధము నుండి నివారించి తారను అంగిరసుడైన బృహస్ప తికి ఇచ్చెను. విప్రుడైన బృహస్పతి చంద్ర ముఖియైన తారను గర్భవతిగా జూచి 'నీవు గర్భమును వదులుచు లేవు, వదులుము'అనెను. 'ఏమైనను సరియ; నాకు సంబంధించి ఉన్న శరీరయోనియందే గర్భము ధరించవలెను అనెను. తరువాత నా తారదస్యు

హంతముడైన (దస్యులను మిక్కిలి చంపు వాడైన) కుమారుని పుట్టించెను (గర్భమును జార్చెను). పుట్టిన వెంటనే భగవంతుడైన ఆ చిన్నవాడు ముండ్లదుబ్బును చేరి మండుచున్న అగ్నివలె ఉన్నవాడై దేవతల శరీరమును కప్పివైచెను. అంత, సంశయమును పొంది దేవతలు తారను ఈతడు ఎవరి పుత్రుడు? నిజముగా చెప్పుము. సోముని పుత్రుడా? లేక బృహస్పతి పుత్రుడా? అని అడిగిరి. సిగ్గుపడుచున్నదై దేవతలకు ఆమె మంచి, చెడు లలో ఏదియు చెప్పలేదు. అపుడు కుమారుడైన దస్యు హంతముడు శపింప బోయెను. బ్రహ్మ ఆతనిని వారించి "చంద్రునకు గూడ సంశయము (తనవాడా! కాడా!) కలుగుచున్నది అనెను. అపుడు ఆ తార చేతులు జోడించి వరదుడై ప్రభువైన బ్రహ్మతో మహాత్ముడై కుమారుడైన దస్యుహంతముని చంద్రుని కుమారునిగా చెప్పెను. అంత సోముడు ఆకుమారుని శిరమున మూర్కొనెను. ధాతయైన ప్రజాపతి అతని బుద్ధిమంతుడైన పుత్రునకు "బుధు"డు అని నామకరణము చేసెను". సూర్యుడు పూర్వదిక్కున పొడసూపినపుడు బుధులు ఆతనికి ఎదురుగా లేచి నిలుతురు. ఆ సమయమున రాజపుత్రికయైన తార పుత్రుని బుధుని కనెను. ఆతని పుత్రుడు మహా తేజస్వియై ఇలా పుత్రుడైన పురూరవుడు. ఆతనికి ఊర్వశియందు ఆరుగురు మహౌజస్కులు పుత్రులు కలిగిరి. మహాశయుడైన అత్రి అతని పాపములను శమింపచేసెను. చంద్రుడు రాజయక్ష్మనుండి ముక్తుడై కాంతితో అన్ని విధములుగ ప్రకాశించెను. ఓ బ్రాహ్మణోత్తము లారా! సోముని జన్మ చెప్పబడినది. ఆతని వంశమును గురించి చెప్పెద వినుడు. ధనమును ఇచ్చునది, ఆరోగ్యమును ఇచ్చునది, ఆయుష్యమును ఇచ్చునది, పుణ్యమైనది, పాపముల శుద్ధి చేయునదియు అయిన జన్మను గురించి వినినంతనే సర్వ పాపముల నుండి విముక్తుడు అగును. (28)

చంద్రవంశ కీర్తనము

సూతుడు ఇట్లు అనెను :

సోమునకు బుధుడు పుత్రుడు. బుధునకు పుత్రుడు పురూరవుడు. ఆతడు తేజస్వి, దానశీలుడు, విపులకు దక్షిణలను ఇచ్చిన యజ్వ బ్రహ్మవాది, పరా(శక్తి)చే క్రాంతుడు, యుద్ధమున శత్రువులకు దుర్జయుడు. అగ్నిహోత్రయాగమును ఆహరించివాడు, యజ్వలకు భూమిని ఇచ్చెను. సత్య వచనుడు, కర్మబుద్ధిగలవాడు, మనోహరుడు, గొప్ప పుత్రుడు కలవాడు, లోకములలో రూపమున సాటిలేనివాడుగా ఉండెను. యశస్విఅయిన ఊర్వశి సిగ్గువదలి, ఆ బ్రహ్మవాదియు, ఇంద్రియ నిగ్రహము కలవాడును ధర్మజ్ఞుడును సత్య వాదియు అయిన పురూరవుని వరించెను. వీర్యవంతుడు అయిన ఆ రాజు ఆమెతో అఱువది

నాలుగు ఏండ్లు రమ్యమైన చైత్రరథోద్యానవనమునను, మందాకినీ తీరమునను, విశాలమైన అలకానగరమునను, వనోత్తమమైన నందనవనమునను, గంధమాదన పర్వత ప్రాంతము లందును, నగోత్తమమైన మేరుశృంగమునందును, ఉత్తరకురు దేశములనుచేరి, కలాప గ్రామమునను, దేవతలచే పూర్తిగా చరింపబడిన ఈ వనముఖ్యములందు ఊర్వశితో పరమసంతోషముతో క్రీడించెను".

ఋషులు ఇట్లు అనిరి :

"దేవియైన ఉర్వశి గంధర్వజాతికి చెందినది. ఆమె దేవతలను వదలి మనుష్యుడైన రాజును ఎట్లు చేరికూడినది? ఓ బహుశ్రుతుడా! అది మాకు తెలియ చేయుము".

సూతుడు ఇట్లు అనెను :

బ్రహ్మ శాపముచే తిరస్కరింపబడినదై ఆ ఊర్వశి ఒక ఒప్పందము చేసికొనినదై మానుషుడై ఇలాపుత్రుడైన ఆ పురూరవుని చేరెను. ఆమె తన శాపము నుండి విముక్తి కొఱకే ఆ ఒప్పందము చేసెను. వస్త్రహీనముగ చూడరాదు, కోరికలేనపుడు బలాత్కార మైథునమునకు పూనరాదు. రెండు గొఱ్ఱెలు శయన సమీపమున ఉండగా వానికి కాపలాగా ఉండవలెను. ఓ రాజా! ఒక్కమారు నేయి మాత్రమే నాకు ఆహారము. ఎంతకాలము ఈ ఒప్పందము నీవు దృఢముగా పాటింతువో అంత కాలము నీతో ఉందును-ఇది మన ఒప్పందముగా చేయబడినది. ఆ రాజు ఆమె ఒప్పందమును అంతయు సంపూర్ణముగ పాలించెను. ఆ ఊర్వశీ, భామినియు అంతకాలము పురూరవునితో ఉండెను. తరువాత శాపమోహితయై ఊర్వశి అఱువది నాలుగేండ్లు పురూరవునియందు అనురక్తితో మానుషుడైనను అతనితో చేరెను. గంధర్వులు అందుకు చింతాక్రాంతులైరి.

గంధర్వులు ఇట్లు అనిరి :

ఓ మహాభాగులారా! స్వర్గమున కలంకారమై శ్రేష్ఠ స్త్రీయైన ఆ ఊర్వశి మరల స్వర్గమునకు వచ్చు ఉపాయమును ఆలోచించుడు అనిరి. తరువాత వక్తలలో శ్రేష్ఠుడైన విశ్వావసువనువాడు ఇట్లు అనెను. "ఉర్వశి అచట ఒక ఇష్టమైన గొప్ప ఒప్పందము చేసి కొన్నది. కావున ఆ ఒప్పందమును అతిక్రమింపజేసి రాజు ఊర్వశిని వదిలిపెట్టునట్టి ఉపాయమును మీకు చెప్పెదను. వెంటనే మీ కార్యసిద్ధికై యోగమును పొందెదను అని చెప్పి మహాయశస్వియైన విశ్వావసువు ప్రతిష్ఠానమునకు (ఉర్వశీ పురూరవులున్న చోటికి) వెళ్లెను. తరువాత ఒక రాత్రియందు వారున్న చోటికి వచ్చి ఒక గొఱ్ఱెను దొంగిలించు కొనిపోయెను. ఆ సుందరమైన నగవుగల ఊర్వశి ఆ గొఱ్ఱెలయెడ తల్లివలె ఉండుచుండెను.

గంధర్వుని రాకను తెలిసి పడకపైనున్న ఆయశస్విని ఊర్వశి "నా పుత్రుని దొంగిలించుకొని పోవుచున్నాడు" అని రాజైన పురూరవునితో చెప్పెను. ఈ విధముగా చెప్పబడినను, రాజు తాను నగ్నుడై (వస్త్రహీనుడై) ఉన్నాడు – నగ్నుడనైన నన్ను దేవి ఊర్వశి చూచినచో ఒప్పందము ఉల్లంఘింప బడినదగును అని నిశ్చయించి రాజు నగ్నుడై అట్లే ఉండెను. అంత మరల గంధర్వులు రెండవ గొఱ్ఱెను దొంగిలించు కొని వెడలిరి. అట్లు రెండవ గొఱ్ఱె అపహరింపబడగా దేవి ఊర్వశి ఇలా పుత్రుడైన పురూరవునితో "ఓ రాజా! ఓ ప్రభూ! భర్తలేని దాని పుత్రులవలె నా పుత్రులు దొంగిలింప బడిరి" అని అనెను. ఈ విధముగ జెప్పబడిన రాజు అపుడు నగ్నుడై గంధర్వులు వెడలిన మార్గమున గొఱ్ఱెలకై పరువిడెను. తరువాత ఆ మహాభవనమున గొప్ప మాయ పుట్టింప బడెను. అంత వెలుపల నగ్నుడైన పురూరవుని చూచి కామరూపిణి అయిన ఊర్వశి అంతర్ధానము అయ్యెను. అట్లు అంతర్ధానమైన ఊర్వశిని తెలిసి గంధర్వులందరు ఆ గొఱ్ఱెలు రెండింటిని అచ్చటనే వదలి అంతర్ధానమైరి. ప్రభువై, రాజైన పురూరవుడు ఆ వదలి పెట్టబడిన గొఱ్ఱెలను తీసికొని (ఇంటికి)వచ్చెను. అపుడు ఆ రాజు అచట ఊర్వశి కనిపించనందున మిక్కిలిదుఃఖితుడై ఏడ్చెను. అచటచట ఆమెను వెదకుచు భూమినంతయు తిరిగెను. అంత మహాబలుడైన రాజు కురుక్షేత్రమున ప్లక్ష తీర్థమున పుష్కరిణిలో మునిగి నీటితో తడిసినట్టిదియు, ఐదుగురు అప్సరసలతో క్రీడించుచున్నదియు, శోభనయు అయిన ఊర్వశిని చూచెను. అంత ఊర్వశియు సమీపముగనే రాజును (పురూరవుని) చూచెను. అపుడు ఉర్వశి తన సఖులతో 'ఈతడు నేనీవరకు బద్ధానురాగనైయె ఉన్న ఆ పురుషోత్తముడు' అని ఆ రాజునుచూపెను. అంత ఆ ఊర్వశి సఖులు ప్రకాశముగ కనబడిరి. వారు పంచచూడాప్సరసలు (ఐదు జడలుకల అప్సరసలు) ఇక, రాజు ఆమెను చూచి సంతసించి బహు ప్రలాపములు చేయసాగెను. ఓ ప్రియురాలా! రమ్ము మనస్సుతో నాయందు ఉండుము, ఘోరమైన వాక్కున ఉండిన ఉండుము. ఇవి మొదలుగాగల సూక్ష్మములైన మాటలను పరస్పరముగ మాట్లాడెను. ఉర్వశియు ఓ ప్రభూ! నీచేత నేను గర్భవతిని అని పురూరవునితో అనెను. ఒక సంవత్సరమునకు నీకు కుమారుడు కలుగ గలడు. సంశయములేదు అని ఆతనితో చెప్పెను. ఆమెతోసహ రాజు ఒకరాత్రి ఉండెను. తరువాత సంతసించినవాడై ఆ మహాయశస్వి తన నగరమునకు వచ్చెను. సంవత్సరము గడవగనే ఊర్వశి కడకు మరలవచ్చెను. ఆమెతో ఒకరాత్రి ఉండి ఆ మనస్వియైన రాజు కామార్తుడై దీనుడై "నీవు నిత్యమును నాదానిగనే ఉండుమ"ని అడిగెను. ఉర్వశి "ఓ మహారాజా! గంధర్వులు నీకు వరము ఒసగిరి. వారిని నీవే వరము అడిగికొనుము" అనెను. అట్లేఅని పురూరవుడు తాను

“నిత్యము మహాత్ములైన గంధర్వుల యొక్క లోకమున ఉండునట్లు వరమును అడిగి కొను చున్నాను” అనెను. గంథర్వులును “తథాస్తు” (అట్లే అగుగాక) అనిరి. అంత గంధర్వులు అగ్నికుండమును నింపి దానితో యాగముచేసి ఓ రాజా! నీవా గంధర్వ లోకమును పొందగలవు అనిరి. రాజు అగ్నికుండ(ము)ను కుమారుని తీసికొని తన నగరమునకు బయలుదేరెను. అరణియందు ఆ అగ్ని కుండ(ము) నుంచి ఆరాజు సపుత్రముగా ఇంటికి వెడలెను. అగ్నికుండమును మరలదెచ్చి, అచట కనబడు చున్న అగ్నిగల రావిచెట్టును చూచెను. ఆ రావిచెట్టును సమీపమునుండియేచూచి ఆశ్చర్య పడెను. అట్లు జరిగినదానిని గంధర్వులకు చెప్పుటకై అగ్నితోపాటు ఆరాజు భూమికి వెళ్లెను. ఆ విషయము అంత యువిని, ఆరణిని ఆజ్ఞాపించెను. అశ్వత్థము నుండి అరణిని చేసి యథావిధిగా అగ్నిని మథించి, దానితో యాగము చేసి ఓ రాజా! నీవు మాకు సమానమైన లోకమును పొంద గలవు. రాజు అట్లు అగ్నిని మథించి దానిని మూడు విధములుగా గార్హపత్య, దక్షిణాగ్ని, ఆహవనీయ రూపమున అర్చనచేసి యాగము చేసెను. బహువిధములైన యజ్ఞములతో యాగము చేసి, గంధర్వ సమాన లోకవాసత్వమును పొందెను. నివాసము కొఱకు ఆతడు గంధర్వుడు. త్రేతాయుగమున అతడు మహారథుడు అయ్యెను. పూర్వము యాగములందు ఒకే అగ్ని ఉండెను. పురూరవుడు మూడు అగ్నులను కల్పించెను. ఓ బ్రాహ్మణసత్తములారా! మహర్షులచే అలంకరింపబడి మిక్కిలి పుణ్యవంత మైన దేశమున పురూరవ మహారాజు ఇట్టి ప్రభావముకలవాడుగా ఉండెను. మహాయశస్వియైన ఆ పురూరవ మహరాజు ఉత్తరమైన యమునా తీరమున ప్రతిష్ఠానమునను, ప్రయాగలోను రాజ్యమును చేయిం చుచుండెను.

ఆ పురూరవుని పుత్రులు ఇంద్రసమాన తేజోవంతులై ఆరుగురు ఉండిరి. వారు గంధర్వలోకము తెలిసినవారు. ఆయువు, ధీమంతుడు, అమావసువు, విశ్వాయువు, శతా యువు, గతాయువు అనువారు. అమావసుని పుత్రుడు విశ్వజిత్తైన భీమరాజు, భీముని పుత్రుడు శ్రీమంతుడు. ఈతడు బంగారు వన్నెగల రాజు, కాంచనుని పుత్రుడు విద్వాంసుడై మహాబలుడైన సుహోత్రుడు. సుహోత్రునకు కేశికా గర్భమున పుట్టినవాడు జహ్నువు. గంగ ఈతని యజ్ఞ కర్మలో ప్రవేశించి రాబోవు అనర్థము జూపుటకై ఆ దేశమునంతయు పారెను. యజ్ఞవాటి అంతయు గంగముంచుటను చూచి, సుహోత్రుని పుత్రుడు వరదుడు గంగను కోపించి ఎఱ్ఱని కన్నులు గలవాడై ఓ గంగా! ఈ మదమునకు వెంటనే ఫలితము నందుము. ఈ నీ ప్రయోజనము అంతయు వ్యర్థమగును. నేను నీ జలమంతయు త్రాగివైచెదనని శపథముచేసెను-అంతపీతజలయైన గంగను చూచి దేవర్షులు మహాభాగులై

గంగను జహ్నువునకు కూతురుగా గొంపోయి జాహ్నవిగా జేసిరి. యౌవనాశ్వుని యొక్క మనుమరాలైన కావేరిని జహ్నువు ఆవహించెను. యువనాశ్వుని శాపమున ఆతనిచే (జహ్నువుచే) గంగ నిర్మింపబడెను. నదీ శ్రేష్ఠమైన కావేరిని అనిందితయైన జహ్ను భార్యగా (దేవర్షులు) చేసిరి. జహ్నువు సుహోత్రుడను ధార్మికుని తన ప్రియపుత్రునిగా కావేరియందు జనింపచేసెను. సుహోత్రుని పుత్రుడు అజకుడు. అజకుని పుత్రుడు మహాయశస్వియైన బలాకాశ్వుడు. ఆతని పుత్రులు గయుడు, శీలుడు, కుశుడు అనువారు. కుశపుత్రులు నలుగురు దేవవర్చస్సు గలవారు. వారు కుశాశ్వుడు, కుశనాభుడు, అమూర్తారి యశుడు వసువు. రాజసత్తముడైన కుశస్తంబుడు పుత్రార్థియై తపముచేసెను. వేయి ఏండ్లు నిండుగా ఇంద్రుని చూచెను. సహస్రాక్షుడైన ఇంద్రుడు ఉగ్రతపస్వియైన ఆ కుశస్తంబునిచూచి శాశ్వతుడై స్వయముగనే ఈతనికి పుత్రునిగా జనించుటలో సమర్థుడయ్యెను. ఇంద్రుడు తానే అతనికి పుత్రత్వమును పొందెను. అట్లు పాకశాసనుడు (ఇంద్రుడు) కౌశికుడు అయిన ఇంద్రుడు (ఆతనికి) గాధిఅను పుత్రుడు అయ్యెను. కుశ స్తంబునకు పురుకుత్సుని పుత్రి పౌరుకుత్స అను ఆమె భార్య అయ్యెను. ఆమె యందు గాధి జనించెను. పూర్వము కుశస్తంబుని పుత్రుడు గాధి తన కన్యను మహాభాగ్యవతియు శుభ లక్షణయు అయిన సత్యవతి అను దానిని కావ్యుడైన ఋచీకునకు ఇచ్చెను. ఆమె భర్తయై (సత్యవతి) భార్గవుడై, భృగునందనుడైన ఋచీకుడు తన భార్యయైన సత్యవతికిని, తన అత్తయైన గాధిభార్యకును పుత్రులు కలుగుటకై చరువును (యజ్ఞ కుండమున పక్వమైన మంత్రౌషధి పూతమైన అన్నమును) సిద్ధము జేసెను. అపుడు మంచి ధారణాశక్తిగల ఆ భృగువంశీకుడైన ఋచీకుడు భార్యను (సత్యవతిని) పిలిచి – ఓ శుభే! ఈ చరువు నీ చేతను ఈ చరువు నీ తల్లిచేతను భుజింపదగును. దీనిచేత నీ తల్లియందు క్షత్రియ శ్రేష్ఠులను గూడ జంపువాడై క్షత్రియులకు అజేయుడైన పుత్రుడు జనించును. ఓ కల్యాణీ! ఈ చరువు నీకుకూడ ధైర్యవంతుడు, తపోధనుడు, శమగుణము నిండిన ఆత్మకలవాడు అయిన బ్రాహ్మణశ్రేష్ఠుని పుత్రునిగా జనింపచేయును" అని ఈ విధముగ భార్యతో జెప్పి భృగుపుత్రుడైన ఋచీకుడు నిత్యము తపమునందు అభిరతుడై అరణ్యమున ప్రవేశించెను. అపుడు గాధిరాజు భార్యతో బాటు తీర్థయాత్రా సందర్భమున సత్యవతిని చూచుటకై ఋచీక ఆశ్రమమునకు వచ్చెను. ఎప్పుడును సమాహిత చిత్తముతో నుండు సత్యవతి సంతోషముతో చరువుల రెంటిని దీసికొనివెళ్లి తల్లికి తనభర్త చెప్పిన మాటను నివేదించెను. తల్లి మాత్రము దైవవశమున తన చరువును తన కూతురికి ఇచ్చెను. అజ్ఞానము వలన ఆమె (కూతురి) చరువును తనదిగా స్వీకరించెను. తరువాత సత్యవతి మంటవలె వెలిగిన శరీరముతో భయంకరముగా

కనబడుచున్నదై క్షత్రియనాశకమగు శుభమైన గర్భమును ధరించెను. అంత బ్రాహ్మణ శ్రేష్ఠుడైన ఋచీకుడు అది చూచి, యోగశక్తితో జరిగినదంతయు చక్కగా తెలిసికొని ఉత్తమురాలైన భార్యతో ఇట్లనెను. "ఓ మంగళకరమైన దానా! చరువులు మారిన కారణ మున నీ తల్లికి నీవు కోరుకొనిన పుత్రుడు సిద్ధించు చున్నాడు. నీకు క్రూరకర్ముడు అతి భయంకరుడు అయిన పుత్రుడు జనింపబోవుచున్నాడు. నీవు తలచినట్టి తపోధనుని నీ తల్లి జనింపబోవుచున్నది. సమస్తమైన బ్రహ్మసత్త్వమును నేను ఆ చరువునందు ఉండ జేసితిని" అని భర్త ఈ విధముగా చెప్పగనే, అపుడు సత్యవతి "నా పుత్రుడు అట్లు కారాదు" అని అనుగ్రహింపవేడెను. బ్రాహ్మణాపసదుడు (బ్రాహ్మణ నీచుడు) వేరొకడు కావలెను గాని, నా వాడుకారాదు అని వేడగా ముని ఇట్లనెను. "ఓ మంగళకరమైనదానా! తల్లి దండ్రుల కారణమున పుత్రుడు ఉగ్రకర్ముడగును ఇది నీవు గాని నేను గాని సంకల్పిం చినది కాదు. దైవికమున జరిగినది. అనగనే సత్యవతి వెంటనే మరల ఇట్లనెను. ఓ మునీ! నీవు కోరినచో లోకములనే సృజింపగలవు. ఈ చిన్ని సుతుని మాట చెప్పవలెనా? ఓ పతిదేవా! శాంతస్వరూపుడును అకుటిలుడునైన పుత్రుని మీరు నాకు ప్రసాదించగలరు. ఈ విధమైన పుత్రుడే నాకు కలుగునని ఓ ప్రభూ! చెప్పుడు. ఓ బ్రాహ్మణోత్తమా! నా విషయమున వేరొక విధముగా చేయకుడు. అది మీకు తప్పక సాధ్యమని వేడికొనెను. అంత తన తపోబలమున ఋచీకుడు ఆమెపై అనుగ్రహించెను. ఓ శ్రేష్ఠురాలా! పుత్రుని యందు గాని, పౌత్రుని యందుగాని నాకు పెద్ద భేదము లేదు. నీవు చెప్పినట్లుగనే నీ పుత్రుడట్టివాడు కాడు కాని అన్యుడు అనగా వేఱొక తరమువాడు పౌత్రుడు అట్లు కాగలడని అనుగ్రహించెను. కావున సత్యవతి భృగువంశీయుడు, నిత్యము తపమునందు ఆసక్తుడు, ఇంద్రియములు అన్నింటిని అణచినవాడు, శాంతస్వరూపుడు అయిన జమదగ్నిని కనెను. ఈ విధముగ పూర్వ రౌద్ర-వైష్ణవములైన చరువులు తారుమారు కాగా, భృగువుయొక్క (ఋచీకుని యొక్క) సత్యవతీ గర్భముననున్న వైష్ణవాగ్నియొక్క దమనము వలన జమదగ్ని జనించెను. (జమదగ్ని అనగా వైష్ణవాగ్ని క్షత్రతేజము, దానిని దమింపజేసినందున జమదగ్ని యయ్యెను) కుశిక నందనుడు అయిన గాధి విశ్వామిత్రుని పుత్రునిగా పొంది బ్రహ్మర్షులతో కూడిన మార్గమున బ్రహ్మ తేజముతో ఆవరింపబడినవాడై పయనించెను. ఆ పవిత్రురాలైన సత్యవతి సత్యవ్రత పరాయణురాలై 'కౌశికి' అని పిలువబడు ఈ మహానదియై ప్రవహిం చినది. ఇట్లు ప్రవహించిన ఈ మహాభాగ్యవంతు రాలైన కౌశికి నదులలో శ్రేష్ఠమైన నది అయినది. ఇక్ష్వాకు వంశమున సువేణువు అను రాజు ఉండెను. ఆతని కన్య మహా భాగ్యవతియైన 'కామలీ' అను రేణుక. ఆ రేణుకయైన కామలియందు ఋచీక పుత్రుడైన

జమదగ్ని భయంకరుడును, సర్వ విద్యాపారంగతుడును, శ్రేష్ఠుడును, ధనుర్వేద పారగుడును, గొప్పగా మండుచున్న అగ్నివలె ఉన్నవాడును క్షత్రియ నాశకుడు అయిన పరశురాముని జనింపజేసెను. ఈ విధముగా ఔర్వుడైన అనగా ఉర్వపుత్రుడైన ఋచీకునకు సత్యవతి యందు మహామనస్వియైన జమదగ్ని జనించెను. ఆతని నుండి వీర్యము వలన బ్రహ్మ వేత్తలలో శ్రేష్ఠుడై ధర్మాత్ముడైన విశ్వామిత్రుడు జనించెను. పేరుతో నీతడు విశ్వరథుడు అనబడువాడు భృగు ప్రసాదమున కౌశికాన్వయ వర్ధనుడై జనించెను. మధ్యముడు శునఃశేపుడు, కనిష్ఠుడు శునఃపుచ్ఛుడు. విశ్వామిత్రుని పుత్రుడు శునఃశేపుడు అను ముని అయ్యెను. ఆతడు హరిశ్చంద్రుని యజ్ఞమున పశువుగా నియమింపబడెను. దేవతలచే నీయబడినందున అతడు తరువాత దేవరాతు అయ్యెను. విశ్వామిత్రుని పుత్రులలో శునః శేపుడు ముందు జనించినవాడు అనబడెను. మధుచ్ఛందుడు, నయుడు, కృతుడు, దేవుడు, ధ్రువుడు, అష్టకుడు, కచ్ఛపుడు, పూరణుడు–వీరు విశ్వామిత్రుని పుత్రులు. కౌశికులై మహాత్ములైన వారియొక్క గోత్రములు అనేక విధములు. పార్థివులు, దేవరాతులు, యాజ్ఞ వల్క్యులు, మర్షణులు, ఉదుంబరులు, ఉదుమ్లానులు, తారకులు, యమముచంతులు, లోహిణులు, రేనువులు, కారీసవులు అనువారు అయిరి. బభ్రవులు పాణినులు ధ్యానజప్యు లును, శాలావత్యులు, హిరణ్యాక్షులు, సంకృతులు, గాలవులు అని కూడా అనబడిరి. దేవలులు, యామదూతులు, శాలంకాయనులు, బాష్కలులు, దదాతులు, బాదరులు, తక్కిన వారును ధీమంతుడైన విశ్వామిత్రునివారును, వేరొక ఋషులచే వివాహము చేసికొన దగినవారు పెక్కురు కౌశికులు అనబడిరి. కౌశికాసులు, అశ్రుములు, అట్లే తక్కిన సైధవా యనులు పుణ్యులై పౌరోరవునకు సంబంధించినవారు, బ్రహ్మర్షియైన కౌశికునకు సంబంధిం చినవారును, దృషద్వతీపుత్రుడైన అష్టకుడును విశ్వామిత్రుని వల్ల కలిగినవాడు. అష్టకుని పుత్రుడు. వీరు అందరూ నాచే చెప్పబడిన జహ్నుగణము.

ఋషులు ఇట్లు అనిరి :

"విశ్వామిత్రాదులైన రాజులు ఏ విధమైన ధర్మముతో, తపముతో వైదిక పాండిత్యము తోను ఇట బ్రాహ్మణత్వము చక్కగా పొందిరి? ఏ ఏ పేరుతో క్షత్రియులు బ్రాహ్మణత్వమును పొందిరి? తపముతోనా? దానముతోనా? విశేషమును తెలియ గోరుచున్నాము" ఈ విధముగ అడుగబడిన సూతుడు అర్థవంతమగు మాటలలో ఈ విధముగ పలికెను. అన్యాయముగ సంపాదించిన ద్రవ్యములతో యజ్ఞముచేయు బుద్ధితో ధర్మమును కోరి యాగము చేయును. కాని యజ్ఞఫలమునందదు. ఈ ధర్మమును చెప్పి పాపాత్ముడైన పురుషాధముడు కాపట్య కారణమున బ్రాహ్మణులకు దానము చేయును. తీవ్రముగా

జపముచేసి ధన లోభమున నిరంకుశుడై మోహములతో కూడి అంత్య కాలమున పవిత్రత కొరకు దానము చేయును. వానిచే ఈయబడిన దానములు నిష్ఫలములగును. ఆ ధర్మము నందు కపటముతో బ్రర్తిల్లిన హింసకుడైన దురాత్మునకు తాను దానము చేసిన ఫలములు నిష్ఫలములగును. న్యాయముగా వచ్చిన ద్రవ్యములను తీర్థములలో దానము ఇచ్చువాడు, కోరికలకు సంబంధించక యాగము, చేయువాడు దానము చేయువాడునుదాన ఫలమును పొందును. ఆ దానము సుఖోదయమును ఇచ్చును. దానముచే భోగములనును అందు కొనును. సత్యముతో స్వర్గమును పొందును. చక్కగా తపించిన తపముతో లోకములలో ఉప్పొంగి నిలుచును. అట్లా తేజస్వి లోకములను ఉప్పొంగజేసి లోకములలో అంతములేని తనమును పొందును. దానమున కన్న యజ్ఞము శ్రేయోదాయకము. యజ్ఞమునకన్న తపము శ్రేస్కరము. తపమున కన్న సన్యాసము శ్రేయస్కరము. సన్యాసమున కన్న జ్ఞానము అధికము. అది గురువు అనబడినది. క్షాత్రముతో కూడినవారు తపఃసిద్ధులై ద్విజాతులైన వారుగా చెప్పబడుచున్నారు. రాజైన విశ్వామిత్రుడు, మాంధాత, సంకృతి, కపి, కపి తరువాత పురుకుత్సుడు, సత్యుడు, అనృహవంతుడు, ఋధువు, ఆర్ష్టిషేణుడు, అజమీఢుడు, భాగాన్యోన్యుడును, కాక్షీవుడు, శిజయుడు, ఇతర మహారథులును, రథీతరుడు, రుందుడు, విష్ణువృద్ధాదులగు రాజులును క్షాత్రముతోకూడిన తపముతో ఋషిత్వమును (బ్రాహ్మ ణత్వమును) పొందిరి. ఈ రాజర్షులందరు గొప్ప సిద్ధిని పొందిరి. ఆ తరువాత మహాత్ముడైన ఆయువు యొక్క వంశమును చెప్పెదను. (29)

రజియుద్ధము

సూతుడు ఇట్లు అనెను :

ప్రభయందు పుట్టిన రాహువు యొక్క పుత్రులు ఐదుగురు మహాత్ములును బలవంతు లును అయిన రాజులుండిరి. వారిలో మొదటివాడు నహుషుడు, ఆతని నుండి పుత్రధర్ముడు పుత్రుడు అనిపిలువబడెను. ధర్మవృద్ధుని పుత్రుడు మహాయశస్వియైన సుత హోత్రుడు. సుతహోత్రుని పుత్రులు పరమధార్మికులైన ముగ్వురు. అ ముగ్వురు కాశుడు, శలుడు, గృత్సమదుడను ప్రభువు. గృత్సమదుని పుత్రుడు శునకుడు. ఆతనికి శౌనకుడు పుత్రుడు. ఈతని వంశములో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులును పుట్టిరి. వారు విచిత్రకర్మలతో ద్విజులు. శలుని పుత్రుడు ఆర్ష్టిషేణుడు, ఆతని పుత్రుడు చరంతుడు శౌన కులు, ఆర్ష్టిషేణులును క్షాత్రముతో కూడిన ద్విజాతులు. కాశునకు కాశుయుడు రాష్ట్రుడు ఆతనికి పుత్రుడు దీర్ఘతపుడు, దీర్ఘతపునకు ధర్మడు, విద్వాంసుడైన ధన్వంతరియు, వృద్ధ

డైన ధీమంతునకు తపస్సుతో సుమహాతేజస్వి జనించెను” అని చెప్పెను. ఆ తరువాత ఋషులు మరల ఇట్లని అడిగిరి.

“దేవుడైన ధన్వంతరి భూమిలో మనుష్యుడై యెట్లు జనించెను? దీనిని మేము వినదలచితిమి. కావున మాకీ ప్రియమైన విషయమును చెప్పుడు”

సూతుడు ఇట్లు అనెను :

ఓ బ్రాహ్మణులారా! ధన్వంతరి పుట్టుక చెప్పుచున్నాను వినుడు. పూర్వము అమృత మథన సమయమున సముద్రాంతమున ఆతడు జనించెను.అతడు సకలము కన్న పూర్వము పుట్టెను. అంతటను ఆవృతుడయ్యెను. సర్వసంసిద్ధకాయుడైన ఆతనిని విష్ణువు స్తంభించి నిలిచెను. నీవజుడవని అనెను. దాన నాతడు అజుడు అనబడెను. ఆ అజుడు విష్ణువుతో “నేను నీ పుత్రుడను మహాప్రభో–కావున ఓ దేవోత్తమా! లోకమున నాకు భాగమును స్థానమును కల్పింపుము” అనెను. ఈ విధముగ అడుగబడి ఆ విష్ణు ప్రభువు ఆతనినిచూచి ఇట్లనెను. యజ్ఞమునకు సంబంధించిన దేవతలచే యజ్ఞ విభాగము చేయబడినది. అట్లే మహర్షులచే విధియుక్తమైన విధి హోత్రముగూడ చేయబడినది. ఇక ఇచట ఎప్పుడైనను హోమము సమానముగా చేయుటకు సాధ్యము కాదు. ఓ దేవ! నీవు తరువాత (క్రిందుగా, ముందుగాగాక) పుట్టినవాడవు. పేరుకు మాత్రము దేవుడవు. రెండవ జన్మయందు లోకమున ఖ్యాతిని పొందెదవు. గర్భమునందు ఉన్నపుడే నీకు అణిమాదులతో కూడిన సిద్ధి కలుగగలదు. ఓ ప్రభూ! ఆ శరీరము తోడనే దేవత్వమును పొందగలవు. బ్రాహ్మణులు చక్కని మంత్రములతో, నేతులతో, గంధములతోను నిన్ను యజ్ఞమున పూజింతురు. ఇక నీవు మరల ఆయుర్వేదమును రచింపకలవు. ఈ విషయము తప్పనిసరిగా జరుగబోవునది. ఇది పూర్వము పద్మజన్ముడైన బ్రహ్మచే ఆదేశింపబడినది. రెండవ ద్వాపర యుగమును పొంది నీవు పై చెప్పిన విధముగ కాగలవు, సంశయములేదు. అని ఆతనికి వరమిచ్చి తరువాత విష్ణువు అంతర్థానమయ్యెను.

రెండవ ద్వాపరము రాగనే కాశిరాజైన సౌనహోత్రుడు పుత్రకాముడై దీర్ఘ తపస్వియై తపము చేసెను. ఆ రాజు పుత్రుని పొందు కొరకై అజదేవుని ఆరాధింపదలచెను. సంతసించిన ధన్వంతరి వరముతో రాజును అనుగ్రహించెను.

రాజు ఇట్లు అనెను :

“ఓ భగవంతుడా! నీవు నా యెడ సంతసించినచో, నా పుత్రుడవై ధృతిమంతుడవు కమ్ము అని ప్రార్థించెను. ధన్వంతరియు అట్లేఅని అనుమతించి అచటనే అంతర్ధాన

మందెను. అపుడు ఆ దేవుడైన ధన్వంతరి ఆ రాజు ఇంట జనించెను. మహారాజైన కాశి రాజుగా జన్మించిన సర్వరోగ ప్రణాశనుడు భరద్వాజుడు ఆయుర్వేదమును రచించెను. వైద్య ప్రక్రియారూపమైన ఆ వేదము ఎనిమిది విధములుగా వేరుపరచి శిష్యులకు ఇచ్చెను. ధన్వంతరి సుతుడు గూడ కేతుమంతుడని ప్రసిద్ధి చెందినవాడు. ఓ ప్రభో! తరువాత కేతుమంతుని పుత్రుడు భీమరథుడు అను రాజు. ఈ కాలముననే పూర్వము శూన్యమైన వారాణసిని క్షేమకుడు అను రాక్షసుడు ప్రవేశించెను. ఆ వారాణసీ (కాశీ) పురి పూర్వము నికుంభుడను మహాత్మునిచే వేయి సంవత్సరములు శూన్యవగుదువు అని మాటి మాటికి శపింపబడినది. అట్లు శపింపబడినంత మాత్రముననే రాజైన దివోదాసు ఆదేశము చివర గోమతియందు రమ్యమైన పట్టణమున ప్రవేశింపజేసెను.

ఋషులు ఇట్లు అనిరి :

"పూర్వము నికుంభుడు ఆ వారాణసీ పురిని ఎందులకు శపించెను? నికుంభుడుని కూడ ధర్మాత్ముడు సిద్ధ క్షేత్రమును అట్లేల శపించెను?" అని అడిగిరి.

సూతుడు ఇట్లు అనెను :

రాజర్షియైన దివోదాసు ఆ నగరిని పొంది విశాలమైన ఆ నగరి యందు మహా తేజస్వియై నివసించుచుండెను. ఈ కాలముననే భార్యను పరిగ్రహించిన మహేశ్వరుడు తన దేవికి ప్రియము చేయగోరి దేవతల దగ్గర ఉండుచుండెను. దేవాజ్ఞతో శివపారిషదులు (ప్రమథ గణములోని చండికేశ్వరాదులు) తపోధనులై విశ్వరూపులు పూర్వము చెప్పబడిన రూప విశేషములచే మహేశ్వరిని సంతోషపెట్టుచుండిరి. వారిచేత మహాదేవుడు గూడ సంతసించుచున్నాడు. కాని మేనాదేవి సంతసించుట లేదు. ఆమె నిత్యము శివుని, పార్వతిని అసహ్యించు కొనుచుండెను. ఓ పాపరహితురాలా పార్వతీ! నీ ప్రక్కన అనాచారుడైన నీ భర్త మహేశ్వరుడు దరిద్రుడు ఉన్నాడు. ఇచట ప్రతివాడును సులభముగా పల్టీలు కొట్టు చున్నాడు. తల్లి అట్లనుటను పుత్రియైన పార్వతి స్త్రీ స్వభావము వల్ల సహించలేదు. చిరు నవ్వు నవ్వి తరువాత హరుని ప్రక్కకు చేరెను. విషాదము చెందిన ముఖముకలదై శివునితో 'దేవ! నేనిచట ఉండను. నన్ను మీ ఇంటికి తీసికొని పొందు'అని అనెను. పార్వతి అట్ల నగనే, ఓ బ్రాహ్మణోత్తములారా! మహాతేజస్వియైన శివుడు అన్ని లోకములను చూచి భూమి యందలి సిద్ధక్షేత్రమైన వారాణసియందు నివసించుటకై ఇష్టపడెను. భవుడు వారాణసిని దివోదాసుడు నివసించియున్న దానినిగా ఎరిగి తన ప్రక్కనున్న గణేశుడైన క్షేమకుని పిలిచి, ఓ గణేశ్వరా! ఈ పట్టణమునకు వెళ్లి వారాణసిని శూన్యముగా చేయుము. ఆ రాజు దివోదాసు అతి బలవంతుడుగాన మెత్తగను ఉపాయముతోను వారాణసిని శూన్య

ముగా చేయుము-అనెను. తరువాత పూర్వము నికుంభుడు వారాణసిపురికి వెళ్లి స్వప్నమున అంకసుడను మంగలివానికి చూపెను. ఓ పాప రహితుడా! నీకు శ్రేయమును కలుగ చేసెదను, నాకు స్థానమును కల్పింపుము. నా రూపముతో ఒక ప్రతిమను (విగ్రహమును) చేసి ఈ కాశీ నగరము చివర ప్రతిష్ఠించి ఉంచుము. ఓ బ్రాహ్మణులారా! స్వప్నమున చూచిన విధమును యథావిధిగా రాజునకు తెలిపి, అనుమతిని పొంది, ఆ విధముగనే నగరీ ద్వారమున (నికుంభుని) గణేశుని రూపమున విగ్రహము జేయించి నగరి చివరన నిలిపెను. నిత్యము గంధములతో, ధూపములతో, సుందర మాలలతోను ఆ గణేశునకు మహాపూజ జరుగుచుండెను. అన్న ప్రదానముతో గూడిన పై పూజలు జరుగుచుండ అత్యద్భుతముగా ఉండెను. ఈ విధముగ అచట నిత్యము గణేశ్వరుడు పూజింపబడు చుండెను. తరువాత నగరవాసులకు వేల వరములను ఇచ్చుచుండెను. పుత్రులను, బంగా రమును, ఆయువులను అట్లే అన్ని కోరికలను ఇచ్చుచుండెను. రాజునకు శ్రేష్ఠయై సుయశ అను పేరొందిన పట్టపురాణి ఉండెను. రాజుచే ప్రేరేపింప బడినదై పతివ్రతయైన దేవి పుత్రప్రాప్తికై ఆ గణేశుని కడకు వచ్చెను. విశాలమైన పూజను చేసి ఆ దేవి పుత్రులను ఇమ్మని అడిగెను. తరువాత గూడ పుత్రకారణమున మాటి మాటికి అనేక పర్యాయములు వచ్చి పూజించి పుత్రులను అడిగెను. నికుంభ గణేశుడు మాత్రము రాజు కోపించినచో కొంత ప్రవర్తింప గలిగి ఉండుట వలన పుత్రులను ఈయలేదు. కాని, చాల కాలమునకు రాజును క్రోధము ఆవేశించెను. ఈ భూతము మహాద్వారమున నగరవాసులకు ప్రేమతో నూర్లకొలది వరములు ఇచ్చుచున్నది. నా వారితో నిత్యము ఆ నగరిలో పూజింప బడుచున్నాడు. ఏ మాత్రము అనుగ్రహమున ప్రవర్తించుట లేదు. నా దేవిచేత అచట పుత్ర కారణమున అనేక విధముల పూజింపబడియు నాకు పుత్రుని ఈయడు. ఈతడు బహుభోజనుడైన కృతఘ్నుడు. కావున నా నుండి పూజకీతడు అనర్హుడు. కావున ఎటులనైనను ఆ దురాత్ముని యొక్క స్థానమును నశింపజేయుదును అని ఈ విధముగ నిశ్చయించి పాపియైన రాజు దురాత్ముడై దుర్మతియై ఆ నికుంభగణేశుని స్థానమును నశింపజేసెను. ఆ విధముగ భగ్నమైన నివాసమును జూచి ప్రభువైన గణేశుడు రాజు కడకు బోయెను. ఓ రాజా! నీవు నా అపరాధము లేకుండగ నీచే నా స్థానము ధ్వంసము చేయబడినది. కావున నీ పురి అకస్మాత్తుగా శూన్యమగును. అందువలన నికుంభ గణేశుని శాపముచే వారాణసి శూన్యమైనది. తరువాత శపించిన వారాణసీ పురికి శివుని తీసికొని వచ్చెను. శూన్యయైన ఆపురిని మహాత్ముడైన శివుడు పరమాత్మతో నిర్మించెను. దేవతల ఐశ్వర్యమునకు సమానముగను, దేవి (పార్వతి) యొక్క యైశ్వర్యమునకు సమానముగను వారాణసిని నిర్మించెను. అచట ఈశ్వరుడు రమించుచుండ దేవియు రమించుచుండెను.

కాని, గృహ విస్మయము వలన దేవి రతిని పొందలేదు. దేవియొక్క క్రీడకై ఈశానదేవుడు నేను ఈ ఇంటిని వదలను, అవిముక్తమే (వదలబడనిదే) అనగా కాశియే నా గృహము అని అనెను. దేవి! నేనిటనుండి వెళ్లను, నీవు వెళ్లుము. ఇచట నేను ఆనందముగ క్రీడింతును. అందువలన అది దేవునిచే స్వయముగ వదలబడనిదై యవిముక్త (క్షేత్ర) మని చెప్పబడినది. ఈ విధముగ వారాణసి శపింపబడినది. అవిముక్తమని కీర్తింపబడినది. అచట సర్వదేవ నమస్కృతుడైన మహాదేవుడు నివసించును. మూడు యుగములలో ధర్మాత్ముడైన మహాదేవుడు తన దేవితో బాటు ఇటనుండును. కలియుగమున మహాత్ముని ఆ పురము అంతర్ధానమును పొందును. పురము అంతర్ధాన మందినను మరల ఆ పురి ఉండును. ఈ విధముగ వారాణసిని శపించి తన స్థానమునకు మరల వచ్చినది. ఉత్తమ ధనుర్ధారులైన నూర్వురు భద్రశ్రేణ్యుని పుత్రులను చంపి దివోదాసుడను రాజు ప్రవేశించెను. మహాబలవంతుడైన ఆతనిచే భద్రశ్రేణ్యుని రాజ్యము అపహరింపబడినది.

భద్రశ్రేణ్యుని పుత్రుడు పేరుతో దుర్దముడు. దివోదాసుని చేత బాలుడని దయతో వదిలిపెట్టబడెను. దివోదాసునకు దృషద్వతియందు వీరుడైన ప్రతర్దనుడు పుట్టెను. ఆ పుత్రుడైన బాలునిచే (దుర్దమునిచే) దివోదాసుపై ప్రహారము చేయబడినది. ఈ వైరమునకు అంతము చేయదలచిన దివోదాస రాజుచే మరల దుర్దమునిపై ప్రహారము చేయబడినది. ప్రతర్దుని పుత్రులు ఇద్దరు. వత్సుడు, గర్గుడు అని ప్రసిద్ధి చెందినవారు. వత్సుని పుత్రుడు అర్కుడు, ఆతని పుత్రుడు సన్నతి. అలర్కుని గూర్చి రాజర్షిచే గానము చేయబడిన ప్రాచీన శ్లోకములు రెండు. అరువది వేల అరువది వందల సంవత్సరములు యువక రూపములో ఉన్న అలర్కుడు కాశి సత్తముడు. లోపాముద్రా ప్రసాదమున పరమాయువును పొందెను. శాపావసానమున మహాబాహువైన అలర్కులు క్షేమక రాక్షసుని చంపి రమ్యమైన వారణసీ పురిలో నివసించెను. సన్నతి పుత్రుడు ధార్మికుడైన సునీథుడు. సునీథుని పుత్రుడు సుకేతుడు. సుకేతుని పుత్రుడు ధర్మకేతువు. ధర్మకేతుపుత్రుడు మహారథి సత్యకేతువు. సత్యకేతు పుత్రుడు ప్రజేశ్వరుడైన విభువు, విభు పుత్రుడు సువిభువు. ఆతని పుత్రుడు సుకుమారుడు. సుకుమార పుత్రుడు ధార్మికుడైన ధృష్టకేతువు. ధృష్టకేతు పుత్రుడు రాజైన వేణుహోత్రుడు. వేణుహోత్ర సుతుడు ప్రసిద్ధుడైన గార్గ్యుడు, గార్గ్యునకు గర్గభూమి, వత్సునకు వాత్స్యుడును పుత్రులు. వారిరువురికి సుధార్మికులైన బ్రాహ్మణులును క్షత్రియులును పుత్రులు. వారు విక్రమము బలమును కలవారు, సింహముతో సమానమైన పరాక్రమము కలవారు. వీరిని కాశ్యపులుగా చెప్పుదురు. రజియొక్క పుత్రులను కూడ వినుడు. రజికి నూర్గురు పుత్రులు ఉండిరి. భూలోకమున అయిదుగురు వీర్యవంతులు. రాజేయమని ప్రసిద్ధి చెందిన క్షత్రమిది.

ఇంద్రునకు గూడ భయము గొల్పునది. అపుడు మిక్కిలి భయంకరమైన దేవాసుర యుద్ధము జరుగగా దేవతలును రాక్షసులును బ్రహ్మదేవుని అడిగిరి. "ఓ భగవంతుడా! మా ఇరువురిలో విజేత యెవ్వడు అగును? ఓ సర్వలోకేశా! మాకు చెప్పుము వినదలచితిమి" అనిరి.

బ్రహ్మ ఇట్లు అనెను :

ఆయుధములను గ్రహించి ప్రభువైన 'రజి' యుద్ధము చేయుచో! వారు త్రిలోకములను జయింతురు. రాజు కోపించినచో కొంత ప్రవర్తింప కలిగి ఉండుట సంశయములేదు. రజి ఎట ఉండునో అట లక్ష్మి ఉండును. లక్ష్మి ఉన్నచోట ధృతి (ధైర్యము) ఉండును. ధృతి ఉన్న చోట ధర్మము, ధర్మము ఉన్నచోట జయమును ఉండును. అది విని దేవ దానవులు అందరు జయమును గోరి రజి రాజును పొగడుచు చేరిరి. ఆ దేవదానవులు అందరు సంతసించిన మనములు గలవారై ఆ రజి రాజుతో 'మా జయమునకై నీవు ధనువును గ్రహింపుము' అనిరి.

రజి ఇట్లు అనెను :

మన యుద్ధములో శుక్రుడు మొదలుగా గల దేవతలను జయింతును. ధర్మాత్ముడనై ఇంద్రుడను అగుదును. అందులకే రణమున యుద్ధము చేయుదును.

దానవులు ఇట్లు అనిరి :

మనకు ఇంద్రుడు ప్రహ్లాదుడు. ఆతని కొరకు విజయమును పొందెదము. ఈ సమయమున ఓ రాజా! దితికి సంబంధించిన మా కొఱకై నిలువుము. రజి అట్లే అను చుండగనే దేవతలు గూడ–'నీవు మా వైపు నుండి జయించి ఇంద్రుడవు కాగలవు'అని ప్రేరేపింపించి ఆహ్వానించిరి. అపుడు రజి ఇంద్రుని యొక్క ఎదుటనే సమస్త దానవులను జంపివైచెను. అట్లు దానవులను జంపి దానవులు ఈ వరకు గ్రహించుటచే వినష్టమైన దేవతలయొక్క శ్రీని గ్రహించి పరమ శ్రీమంతుడై రజి వశియై ఉంటిని అనెను. ఇంద్రుడు ఆ విధముగ దేవతలతో ఉన్న 'రజి'ని చూచెను. నేను రజిపుత్రుడను–అని చెప్పి, మరల ఇట్లనెను. ఓ రజిరాజా! నీవు సర్వ దేవతలకు ఇంద్రుడవు. ఈ విషయమున సంశయము లేదు. ఓ శత్రుహంతా! దేవతలకు ఇంద్రుడవైన నీకు పుత్రునిగా ఖ్యాతిని పొందుదును. ఆ రజి ఇంద్రునిమాటను విని అతని మాయచే వంచింప బడినవాడై, ఆ మాటలకు సంతసించుచు రజిరాజు అట్లే అని ఇంద్రునితో అనెను. దేవ సమానుడు అయినన ఆ రజిరాజు స్వర్గమునకు చేరగా రజిపుత్రులు ఇంద్రుని నుండి దాయాద్యమును (ఇంద్రపుత్ర భాగమును) ఆచారమును హరించిరి. ఈ రజియొక్క ఆ నూర్వురు పుత్రులును ఆ శచీపతి

యైన ఇంద్రుని యొక్క స్థానమును, మూడవ లోకమైన స్వర్గమును ఆక్రమించిరి. తరువాత పెద్దకాలము జరిగిపోగా, మహాబలుడును, హరింపబడిన రాజ్యము కలవాడును హరింపబడిన (యజ్ఞ)భాగము కలవాడును అయిన ఇంద్రుడు బృహస్పతితో ఇట్లనెను. ఓ బ్రహ్మర్షీ! నాకు రేగుబండంత పురోడాశమును సిద్ధింప చేసి ఇమ్ము. దానివల్ల తృప్తిచెందిన వాడనై, తేజస్సుతో ఉండగలను. ఓ బ్రహ్మదేవా ! రజిపుత్రులచే ఈ ఇంద్రుడు క్షీణించినవాడు, విమనస్కుడు, హరింపబడిన రాజ్యము గలవాడు, హరింపబడిన భోజనము కలవాడు, ధ్వంసము చేయబడిన ఓజస్సు కలవాడు, దుర్బలుడు, మూఢుడును అయినాడు. నన్ను అనుగ్రహింపుము.

బృహస్పతి ఇట్లు అనెను :

"ఓ ఇంద్ర! పూర్వమే నీవు ఇట్లు నన్ను ప్రేరేపించి ఉండినచో (నాకు జెప్పియుండినచో) నీ ఇష్టసిద్ధికై నాకు చేయరానిది అనెడిది ఉండెడిది కాదు. ఓ మహాద్యుతి ఇంద్రా! నీ హితము కొఱకు ప్రయత్నింతును. దానివలన నీ భాగమును రాజ్యమును తొందరలోనే పొందగలవు. దానికై పోవుదును. నీ మనము బాధ చెందకుండుగాక. తరువాత బృహస్పతి ఆతని తేజమును వృద్ధిచేయు మహాకర్మ (యాగము)ను చేసెను. బుద్ధిమత్పండిత ఉత్తముడు అయిన బృహస్పతి ఆరజి మొదలగు వారి బుద్ధికి సమ్మోహమును కలిగించెను. దానివల్ల అపుడు ఆ రజిసుతులు మూఢులు, రోగోత్పన్నులు, విధర్ములు బ్రహ్మ ద్వేషులును నశించిన బలపరాక్రమములు కలవారును అయిరి. దాని వలన ఇంద్రుడు కామ క్రోధ పరాయణులైన రజిసుతుల అందరిని చంపి దేవైశ్వర్యమును, ఉత్తమమైన ఐంద్ర స్థానమును బొందెను. శతక్రతువైన ఇంద్రుని యొక్క ఈ పవిత్ర స్థానమును ప్రతిష్ఠానమును, రజియొక్క స్థాన ప్రతిష్ఠానములను గాని వినువాడు ధన్యాత్ముడు కాగలడు. (30)

చంద్రవంశకీర్తనము

ఋషులు ఇట్లు అనిరి :

"మహాత్ముడైన మరుతుని చేత తన కన్య రాజునకు ఎట్లు ఈయ బడినది? మరుత కన్యలు ఏ శక్తిగలవారై మహాత్ములైరి?"

సూతుడు ఇట్లు అనెను :

ప్రతి మాసమున మహాతేజస్వియైన రాజు అన్నకాముడై ప్రజేశ్వరుడైన మరుత్సోముని అఱువది సంవత్సరములు పిలిచెను. ఆ మరుత్సోమునిచేత మరుతులు సంతోషపెట్టబడిరి. సంతసించిన మరుతులు సర్వకామ పరిచ్ఛదముగా అక్షయ్యమైన అన్నము ఇచ్చిరి.

ఒకమారు వండిన అతని అన్నము సూర్యోదయము మొదలుకొని కోట్ల కొలందులకు ఈయబడుచున్నను, రాత్రింబవళ్లు క్షీణింపదు. సూర్యుని వల్ల ధీమంతుడైన మరుతుని కన్యయందు జ్యోతి పుట్టెను. ఆతని నుండి పుట్టినవారు మహాసత్త్వులు, ధర్మజ్ఞులు, మోక్ష దర్శులు, గృహధర్మములను సన్యసించి, వదిలి వైరాగ్యమును పొందినవారు. ఈ లోకమున యతి ధర్మమును పొంది బ్రహ్మత్వమును పొందుటకై వారు వెళ్లిరి. తరువాత అనపాయుడు పుట్టెను. అపుడు ధర్మము చక్కగా ప్రకాశించినది. ఆతని నుండి క్షత్రధర్ముడు పుట్టెను. ఆతని నుండి మహాతపస్వి ప్రతిక్షుడు, ప్రతిపక్షపుత్రుడు సంజయుడని ప్రసిద్ధి చెందినవాడు పుట్టెను. సంజయపుత్రుడు జయుడు, జయపుత్రుడు విజయుడు, విజయునకు జియుడు, ఆతనికి హర్యంద్వతుడు, హర్యంద్వతుని నుండి రాజై, ప్రతాపవంతుడైన సహదేవుడు, సహదేవునకు ధర్మాత్ముడై అదీనుడని ప్రసిద్ధిచెందినవాడు, అదీనునకు జయత్సేనుడు, ఆతనికి సంకృతి, సంకృతికి ధర్మాత్ముడై మహాయశస్వియైన కృత ధర్ముడును పుట్టిరి. ఇవ్వీరు క్షత్రధర్ములు. నహుష పుత్రులను వినుడు.

నహుషుని పుత్రులు ఆఱుగురు ఇంద్రసమాన తేజస్కులు. ఈ మహౌజస్కులు పితృకన్యయైన విరజయందు నహుషునకు పుట్టినవారు. యతి, యయాతి, సంయాతి, ఆయాతి, ఐదవవాడు ద్వయుడు (అయుడు అను ధువుడు). వారిలో జ్యేష్ఠుడు యతి. యయాతి తరువాతివాడు. అపుడు యతి కాకుత్స్థ కన్యయైన 'గా'మను కన్యను పత్నిగా పొందెను. సంయాతి మోక్షమున నిలిచి బ్రహ్మభూతుడైన ముని అయ్యెను. ఆ అయిదుగురి మధ్యలో యయాతి రాజు. ఆతడు ఉశనసుని (శుక్రుని) పుత్రిని దేవయానిని భార్యగా పొందెను. వృషపర్వుని పుత్రియై ఆసురి (రాక్షసపుత్రి) అయిన శర్మిష్ఠను కూడ భార్యగా పొందెను. దేవయాని యదువు తుర్వసులు అను పుత్రులను కనెను. శర్మిష్ఠ ద్రుహ్యువు, అనువు, పూరువు-అను పుత్రులను దేవ పుత్రులతో సమానమైన వారిని మహావీర్యులను కనెను. రుద్రుడు సంతుష్టుడై ఆతనికి మిక్కిలి ప్రకాశించునదియు. సంగము (అతుకు) లేనిదియు, బంగారుమయమైనదియు, దివ్యమైనదియు అయిన రథమును, అక్షయములైన అమ్ములపొదులను రెండింటిని ఇచ్చెను. ఆ రథము మనోవేగములైన గుఱ్ఱములు పూన్చి నట్టిది. దానిచేత కన్యను పెండ్లాడెను. ఆ రథోత్తమముచే అతడు భూమిని జయించెను. యుద్ధమున దేవ, దానవ, మానవులచేత జయింపబడనివారు, పౌరవులగు సమస్త రాజు లకు ఆ రథము సంక్రమించెను. వత్సు దేశమునకు ప్రభువైన వాడు కౌరవుడైన జనమే జయుడు. కురుపుత్రుడై రాజైన పారిక్షితునకు నా రథము సంక్రమించినది. ఆ రథము ధీమంతుడైన గార్గ్యుని శాపమున నాశమందెను. బాలుడై రాజైన జనమేజయుడు దుర్బు

ద్ధియై గార్గ్యుని పుత్రుడును లోహగంధుడైన రాజును హింసించెను. ఆ లోహగంధ రాజర్షి ఇటునటు పరిగెత్తుచు పౌరజానపదులచే వదిలిపెట్టబడినవాడై ఎచ్చట కూడ సుఖము పొందలేదు. ఆ తరువాత ఆతడు దుఃఖముచే తపింపబడినవాడై ఎచ్చట కూడ జ్ఞానము పొందలేదు. శరణ్యుడై (రక్షకుడై) హేతువైన ఋషిని బాధితుడై శపించెను. ఆ ముని ఉదారబుద్ధి కల బ్రాహ్మణోత్తముడై ఇంద్రోతుడని ప్రసిద్ధి చెందినవాడు. ఇంద్రోతుడైన శౌనకుడు జనమేజయరాజును పవిత్రత కొఱకు అశ్వమేధ యాగము చేయునట్లు చేసెను. ఆ లోహగంధుడు ఆతని నివాసమునుచేరి నశించెను. ఆతని నుండి ఆ దివ్య రథము ఛేదిపతియైన వసువునకు సంక్రమించెను. ఆతని నుండి ఇంద్రుడు పొందెను. ఆతని నుండి బృహద్రథుడు పొందెను. అంత జరాసంధుని (బృహద్రథుని)చంపి భీముడు ఆత్తమ రథమును పొందెను. కౌరవనందనుడు భీముడు ప్రేమతో వాసుదేవునకు (కృష్ణునకు) ఇచ్చెను. నహుష పుత్రుడై రాజర్షియైన ఆ యయాతి ముసలితనమును పొంది జ్యేష్ఠ పుత్రుడును, వరిష్ఠుడును నైన యదువుతో ఇట్లనెను. నాయనా! నన్ను ముసలితనము, ముడుతలుపడుట, వెంట్రుకలు తెల్లపడుట–ఇవి పూర్తిగా ఆవరించి (పొంది)నవి. శుక్రా చార్యుని శాపమే కారణము. యౌవనమున కామ తృప్తిని పొందలే కుంటిని. ఓ యదూ! నా పాపముతో పాటు ముసలితనమును తీసికొనుము అని అనెను. యదువు ఇట్లు మారుపలికెను. బ్రాహ్మణునకు ఈయదగిన జరాభిక్ష నాకు నిర్దేశింపతగదు. నీకు యౌవనమిచ్చి జరను తీసికొన్న తరువాత నా జరా నివారణము వ్యాయామముతో సాధ్యము గాదు. కావున నీ ముసలితనమును నేను స్వీకరింపను అనెను. పానభోజనములను ప్రభావితము జేయు దోషములు జరకు పెక్కు గలవు. కావున ఓ రాజా! నీ జరను తీసి కొన ఉత్సహింపను. ముసలితనమున శిథిలుడైనవాడు తెల్లని మీసములు కలవాడు, దీనుడును, ముడుతలుపడ్డ శరీరముకలవాడును, వంగిన శరీరము కలవాడును, దుర్దశ కలవాడునై, దుర్బలాకారము కలవాడు అగును. పనులు చేయుటలో అశక్తుడును, యౌవనమున తిరస్కృతుడునునై, మహాభీతులచేతను, ఉప భీతులచేత తిరస్కృతుడు అగును. కావున ఆ జరను(దీసికొన) కోరను. రాజా! నాకంటె మిక్కిలి ప్రియులైన పుత్రులు నీకు పెక్కురు కలరు. ఓ ధర్మజ్ఞుడా! వారు నీజరను గ్రహింతురు గాక. వేరొక పుత్రుని ఎన్నుకొనుము. యదువు ఈ విధముగ చెప్పగనే మహాప్రవక్తయైన యయాతి తీవ్ర కోపముతో తన జ్యేష్ఠ పుత్రుని నిందించుచు ఇట్లనెను. ఓ దుర్బుద్ధీ! నన్ను ఆనాదరించిన నీకు నాకన్నవేరైన ఆశ్రమముకాని, ధర్మవిధికాని ఏవికలవు? నాకు కొత్తగురువై ఉపదేశించు చున్నావు. అని ఇట్లని యయాతి కోపియై యదువును. నా హృదయమునుండి పుట్టి

నాకు నీ వయస్సు నీయకుంటివి. దానివల్ల ఓ మూఢుడా! నీసంతతి రాజ్యమును పొందదు అని శపించెను. ఓతుర్వసూ! నాపాపమును జరతో బాటు స్వీకరింపుము–అని తుర్వసుని అడిగెను.

తుర్వసువు ఇట్లు అనెను :

"ఓ తండ్రీ! కామ భోగములను నశింపచేయు జరను కోరను. పాన–భోజనములను బట్టి వచ్చిన జరా దోషములు అనేకములు కదా! కావున రాజా! నీ ముసలితనమును స్వీకరింపఉత్సహింపను"

యయాతి ఇట్లు అనెను :

నా హృదయము నుండి పుట్టిన నీవు నీ వయస్సు నీయకున్నావు. కావున నీకు ప్రజా సముచ్ఛేదము కలుగగలదు. ఓ మూఢుడా! అది ధర్మముతో ప్రతిలోమజాతి శ్రేష్టులలో కలియకు ఉండును. ధర్మ వ్యతిరేకులు పిశాచాదులు తక్కినవారు–వీరికి రాజువు అగుదువు. గురు భార్యలతో సంగమించినవారు తిర్యక్కులగు పశుపక్ష్యాది యోనులలో జనించువారు, పశుధర్మాచారులైన మ్లేచ్ఛులు (గోమాంసముతిని పాపరతులైనవారు)–వీరికి రాజు కాగలవు. సంశయము లేదు.

సూతుడు ఇట్లు అనెను :

ఈ విధముగ తుర్వసుని శపించి, శర్మిష్ఠకు కలిగిన తన పుత్రుడైన ద్రుహ్యునితో యయాతి ఇట్లనెను. ఓ ద్రుహ్యూ! వర్ణ–రూపముల నశింపచేయు నా జరను వేయి ఏండ్లకు గాను దీసికొని నీ యౌవనమును నాకు ఇమ్ము. వేయి ఏండ్లు నిండగనే నీ యౌవ నము మరల నీకిత్తును. నా ముసలితనముతో పాటు నా పాపమును మరల తీసికొందును.

ద్రుహ్యుడు ఇట్లు అనెను :

ముసలివాడు ఏనుగునుకాని, రథమునుకాని, గుఱ్ఱమునుకాని ఎక్కి స్వారి చేయలేడు. అట్లే స్త్రీని గూడ అనుభవింపలేడు. వీరికి ఎవ్వరితోను సంగముకూడ జరుగదు. కావున నేను జరను కోరను.

యయాతి ఇట్లు అనెను :

నా హృదయము నుండి పుట్టిన నీవు నీ యౌవనమును ఈయకున్నావు. కావున ఓ ద్రుహ్యూ! కాముడు నీకు ఎచ్చటను ప్రియమును ఈయడు. నావలతో తెప్పలతో ఉత్తర సంచారము కలచోట నీవు రాచరికముతో ప్రకాశింపని వంశము కలవాడవై నిత్యము ఉందువు. అనూ! నీవు నా పాపమును జరతో పాటు స్వీకరింపుము, అట్లే నీ యౌవనమున

వేయి యేండ్లుందును అనెను. "ముసలివాడు నిత్యము జరతో అశుచియై ఒక ఉత్తమ శిశువుగా ఉండును. సకాలమున హోమము చేయలేడు. కావున నా జరను కోరను. అని యయాతికి అనువు చెప్పెను. అటుతర్వాత యయాతి : నా హృదయము నుండి పుట్టిన నీవు నీ యౌవనము నీయకున్నావు. నీవు చెప్పిన ఈ జరాదోషమును నీవు పొందెదవు. అందువలన నీ సంతానము యౌవనమును పొంది నశించును. అగ్ని శోషణపరుడవై నీవు గూడ ఇట్లే అగుదువు అనెను. ఓ పూరూరవ! నీవు నా పాపమును జరతో పాటు గ్రహిం పుము. నా కన్నతండ్రీ! ముసలితనము, ముడుతలు పడుట, వెంట్రుకలు తెల్లపడుట– ఇవి పూర్తిగా ఆవరించినవి. కారణము శుక్రాచార్యుని శాపము. కాని యౌవనమున కామ తృప్తి చెందలేదు. కొంత కాలము ఈజర నీది అగుగాక. నీ వయసుతో విషయసుఖములను అనుభవింతును. వేయేండ్లు నిండగనే నీ యౌవనమును మరల నీకు ఇత్తును. నా పాప మును జరతో పాటు తీసికొందును.

సూతుడు ఇట్లు అనెను :

ఇట్లనగనే పుత్రుడు పూరువు తండ్రితో "నీవెట్లు ఇష్టపడుదువో! అట్లే ఆచరింతును. ఓ రాజా! నీ పాపమును జరతోపాటు స్వీకరింతును. నా నుండి యౌవనమును స్వీకరింపుము. నీ ఇష్టము వచ్చిన కామములను అనుభవింపుము. నేను నీ ముసలి తనముతో కప్పబడినవాడనై, నీ వయస్సును, రూపమును ధరించినవాడనై, యౌవనమును నీకు ఇచ్చి యథార్థ వృద్ధునివలె ఆచరింతును"–అని అనెను.

యయాతి ఇట్లు అనెను :

ఓ పూరూ! నేను సంతుష్టుడను అయితిని. సంతుష్టుడనై, నా ఈ వార్ధక్యమును నీకు ఇచ్చుచున్నాను. నీ రాజ్యమున నీ ప్రజ సర్వకామ సమృద్ధమగును.

సూతుడు ఇట్లు అనెను :

పూరువు నుండి అంగీకారము పొందినవాడై రాజైన యయాతి శుక్రుని అనుగ్రహము వలన తన జరను పూరునకు సంక్రమింపచేసెను. తరువాత నహుష పుత్రుడైన యయాతి పూరువుయొక్క యౌవనముగల వయస్సుచేత ప్రీతియుక్తుడై, తన విషయ సుఖములను అన్నింటిని అనుభవించెను. కామమునకు అనుగుణముగను, ఉత్సాహమునకు అను గుణము గను, కాలమునకు అనుగుణముగను, ధర్మమునకు విరోధముకాకుండా రాజుకు ఎట్లు తగునో అట్లు సర్వభోగములను అనుభవించెను. యజ్ఞములతో దేవతలను, శ్రాద్ధములతో పితరులను, అనుగ్రహములతో దీనులను, ఇష్టకామములతో బ్రాహ్మణ శ్రేష్ఠులను తృప్తి

చెందించెను. అన్నపానములతో అతిథులను, పరిపాలనములతో వైశ్యులను, అహింసా, దయలతో శూద్రులను తృప్తిపరచి చెరలో బంధించుటచే, దస్యువులను (దొంగ లను) దండించెను. ధర్మములో ప్రజలను అందఱిని సంతసింపచేయుచు, సాక్షాత్తు వేరొక ఇంద్రునివలె యయాతి రాజ్య పాలనము చేసెను. ఆ రాజు సింహపరాక్రముడు, యువకుడు, దేశమునందు అంతటను కనబడువాడు, ధర్మవిరోధము కాకుండా ఉత్తమ సుఖమును అనుభవించెను. ఆతడు (రాజు) కామములను మనస్సులో వెదకుచు, దోషములు కనబడుట వలన, అందముగా ప్రకాశించు నందన వనమున దోషములు ఉండవను విశ్వాసముతో క్రీడించెను. అపుడు ఆతడు వృద్ధాప్యము వృద్ధి చెందుచున్నట్లుగనే చూచెను కాని కామము తృప్తిపడి సమసిపోవుటను చూడలేదు. అపుడు యయాతి పూరుని సమీపమునకు వెడలి తన జరను స్వీకరింపుమని అడిగెను. యయాతి పూరుని యౌవనమును పొంది ఆ కామములను పొంది, తృప్తుడును దుఃఖితుడును అయ్యెను. అంత రాజు వేయి వర్షముల కాలము గడచినట్లు స్మరించెను. కలా–కాష్ఠలతో బాటు ఆ కాలమును పూర్తిగా లెక్కించి, వేయి ఏండ్లు పూర్తి అయినట్లుగ తలచి, పుత్రుడైన పూరువుతో ఇట్లు అనెను. ఓ శత్రుదమనుడవైన పుత్రుడా! పూరూ! నీ యౌవనముతో నా చేత యథా సుఖముగ, యథోత్సాహముగ, యథాకాలముగ ప్రాపంచిక సుఖములు సేవింపబడినవి. ఓ పురూ! సంతుష్టుడను అయితిని. నీకు భద్రమగుగాక. నీ యౌవనమును నీవు తీసికొనుము. ఈ రాష్ట్రమును కూడ తీసికొనుము. నీవే నాకు ప్రియమునుగూర్చిన కుమారుడవు అని, నహుషపుత్రుడైన యయాతి రాజు తన జరను తిరిగి పుత్రుని నుండి పొందెను. పూరువు మరల తన యౌవనమును పొందెను. కనిష్ఠ పుత్రుని రాజ్యమును అభిషేకింపదలచిన యయాతిని ఓ ప్రభూ! శుక్రుని మనుమడు, దేవయాని జ్యేష్ఠపుత్రుడు అయిన యదువును వదిలి పూరువునకు రాజ్యము ఎట్లు ఒసగుచున్నావు? యదువు నీ జ్యేష్ఠ పుత్రుడు. ఆతని తరువాత వాడు తుర్వసువు. తరువాతివాడు శర్మిష్ఠాపుత్రుడు, ద్రుహ్యువు, తరువాతివాడు అనువు, తరువాతివాడు పూరువు. జ్యేష్ఠులు అందరిని వదిలిపెట్టి చిట్టచివరివాడు, చిన్నవాడు రాజ్యమునకు ఎట్లు అర్హుడు? అందువలన ధర్మమును పాలించుమని నిన్ను కోరుచున్నాము అని బ్రాహ్మణాది సమస్త జాతివారు అనిరి.

అంతట వారితో యయాతి :

"ఓ బ్రాహ్మణాది సమస్త జాతులారా! మీరందరు నా మాట వినుడు. ఎన్ని విధములుగ ఆలోచించినను నా జ్యేష్ఠ పుత్రునకు రాజ్యము ఈయ తగదు. మాతా పితరులు చెప్పినది చేయువాడు పుత్రుడు అని ప్రశంసింపబడును. నా జ్యేష్ఠపుత్రుడైన యదువు నేను చెప్పినది

ఆచరింపలేదు. తండ్రికి వ్యతిరేకియైనవాడు పుత్రుడుకాడని సజ్జనుల మతము. తల్లిదండ్రుల ఎడ పుత్రునివలె వర్తించువాడు పుత్రుడు. యదువుచేత నేను తిరస్కరింపబడితిని. అట్లే తుర్వసునిచేత గూడ తిరస్కరింపబడితిని. ద్రుహ్యుచేతను, అనువుచేతను మిక్కిలి తిరస్కరింప బడితిని. పూరునిచే నేను చెప్పినది చేయబడినది. నా మాట విశేషముగా గౌరవింపబడినది. కనిష్ఠుడైన పూరువు నా జరను గ్రహించినవాడగుటచే రాజ్యమును పొందువాడు. పుత్రుడుగా ఆచరించిన పూరువుచే నేను సర్వకామములను అందినవాడను సర్వ కర్మలు చేసినవాడను అయితిని. కావ్యుడు ఉశనసుడు అయిన శుక్రుడు గూడ స్వయముగా–ఓ మహామతీ! యయాతీ! నీ మాటతో నిన్ను అనుసరించిన పుత్రుడు నీ రాజ్యమునకు రాజగునని– వరమిచ్చెను. మీకు ఈ విధముగా సమ్మతుడైన పూరువు రాజ్యమున రాజుగా అభిషేకింప బడుగాక. ఏ పుత్రుడు గుణసంపన్నుడో! ఎల్లప్పుడు మాతాపితరులకు హితుడో! వాడు కనిష్ఠుడైనను ప్రభువై సమస్త కల్యాణమునకు అర్హుడు అగును. ఈ రాష్ట్రమునకు పూరువు అర్హుడు. కారణము ఆతడు నీకు ప్రియమును చేసినవాడగుట. శుక్రుని వరదానముచేత గూడ ఆతడే రాజ్యార్హుడు అని చెప్పవలెను అని చెప్పెను. ఈ విధముగా పౌరజానపదులు చెప్పగా నహుషపుత్రుడైన యయాతి తన కనిష్ఠపుత్రుడు అయిన పూరుని తన రాష్ట్రమునకు రాజుగా అభిషేకించెను. తరువాత ఆగ్నేయ దిక్కునకు తుర్వసుని, నైరృతియందు యదు వును, పశ్చిమమున ద్రుహ్యుని, ఉత్తరమున అనువును నివేశింపజేసెను. ఈ విధముగ సప్తద్వీపములతోను, సాగరములతోను కూడియున్న భూమిని నాహుషుడైన అనగా నహు షుని పుత్రుడు అయిన యయాతి జయించి పుత్రులకు ఐదు విధములుగా విభజించి ఇచ్చెను. సప్త ద్వీపములతో పట్టణములతో కూడి ఉన్న ఈ పృథివి అంతయు, ప్రదేశమునకు అనుగుణముగా ధర్మజ్ఞులైన వారిచే ధర్మముగా పరిపాలింపబడుచుండెను. యయాతి ఈ విధముగా భూమిని పుత్రులకు వదిలి, వారియందు సంక్రమింపచేసి సర్వ సంపదగల వాడై సంతసించెను. ధనుస్సును, బాణములను, రాజ్యమును, పుత్రుల యందుంచి భారము అంతయు బంధువులందు (పుత్రులందే) ఉంచి యయాతి ఆనందమును పొందెను. ఇచట మహారాజైన యయాతి పాడిన గీతములు కలవు. యయాతి తన కామములను తాబేలు తన అవయవములవలె ఉపసంహరించుకొనెను. కామమును అనుభవించుటచే ఎప్పుడును కామము శాంతింపదు. నేతిహవిస్సుతో అగ్ని మాటి మాటికి వృద్ధినే పొందును. భూమిలో ప్రభూతములైన బియ్యము, గోధుమలు, బంగారము, పశువులు, స్త్రీలు, వీరం దరును ఒక మనుష్యునకు అనుభవించుటకు సరిపోరు అను విషయమును తెలిసికొనుచు మానవుడు మోహము చెందడు. సర్వ భూతములలో ప్రాణులలోను మనోవాక్కర్మలతో తేజో

భావమును భావించువాడు (సర్వము తేజోమయమని భావించువాడు) బ్రహ్మీభూతుడు అగును. ఇతరులను భయపెట్టనివాడు, వీనినుండి భయపడని వాడు), కోరనివాడు, ద్వేషింపనివాడును, బ్రహ్మీభూతుడు అగును. తృష్ణ (ఆశ) దుర్మతులకు త్యజింపనలవిగానిది, జీర్ణించువానికి జీర్ణముకానిది. ప్రాణాంతకమైన రాగముకలది, దోషమయమైనది. ఆ తృష్ణను త్యజించిన వానికి సుఖము కలుగును. త్యజింపనివానికి కేశములు క్షీణించును, దంతములు క్షీణించును. జీవితాశయు, ధనాశయు తాను క్షీణించుచున్నను క్షీణింపవు. లోకమున కోరిక లేమి సుఖము, దివ్యమైన మహాసుఖము, తృష్ణాక్షయ సుఖము యొక్క పదునారవ భాగమునకు సమానముకావు" అని ఈ విధముగాచెప్పి ఆ రాజర్షియైన యయాతి, భార్యలతోబాటు వనమునకు బయలుదేరెను. భృగుతుంగమున తపముచేసి అచటనే ఆ మహాయశస్వి నూరు వ్రతములు చేసి స్వర్గమునందెను. ఆతని వంశములు ఈ ఐదు. ఇవి పుణ్యములు. దేవర్షులుకూడ సత్కరించినట్టివి. సూర్యుని కిరణములు వ్యాపించినట్లు ఈ యైదు వంశములు భూమిలో వ్యాపించినవి. యయాతి చరితమును మొత్తమును చదువుచు వినుచున్న బ్రాహ్మణోత్తముడును, నరుడును సంతానవంతుడు, ఆయుష్మంతుడు, కీర్తిమంతుడునై ధన్యుడగును. (31)

కార్తవీర్యార్జునోత్పత్తి వివరణము

సూర్యుడు ఇట్లు అనెను :

శ్రేష్ఠుడు, ఉత్తమ తేజస్కుడు అయిన యదువు యొక్క వంశమును ఆనుపూర్వితో విస్తరముగ చెప్పెదను వినుడు. యదుపుత్రులు ఐదుగురు దేవ పుత్రులతో సమానులు. సహస్రజిత్తు, క్రోష్టువు, నీలుడు, జితుడు, లఘువు అనువారు. సహస్రజిత్తు పుత్రుడు శ్రీమంతుడైన శతజిత్తను రాజు. శతజిత్తుయొక్క పుత్రులు విఖ్యాతులైన ముచ్చురు పరమ ధార్మికులు. హైహయుడు, హయుడు, రాజైన వేణుహయుడు అనువారు. హైహయుని పుత్రుడు ధర్మతత్త్వుడని వినికిడి. ఆతనికి ధర్మతంత్రుడు, కీర్తి, సంజ్ఞేయుడు అను వారు పుత్రులు. సంజ్ఞేయుని పుత్రుడు మహిష్మంతుడు అను రాజు. మహిష్మంతుని పుత్రుడు ప్రతాపవంతుడైన భద్రశ్రేణ్యుడు. ఈతడు వారాణసికి అధిపతియైన రాజని ముందే చెప్ప బడినది. భద్రశ్రేణ్యుని పుత్రుడు దుర్మదుడు అను రాజు. దుర్మదుని పుత్రుడు బుద్ధి శాలియై కనకుడని ప్రసిద్ధి చెందినవాడు. కనకుని పుత్రులు నలుగురు లోకప్రసిద్ధులు. కృతవీర్యుడు, కార్తవీర్యుడు, కృతవర్మ, కృతుడు, జాతుడు అనువారు. కృతవీర్యుని నుండి వేయి బాహు వులతో సప్త దీపాధిపతియైన రాజు (కార్తవీర్యార్జునుడు) పుట్టెను, ఆతడు మిక్కిలి దుశ్చరమైన

(ఆచరింపనలవిగాని) తపమును పదివేలయేండ్లు చేసి అత్రి కుమారుడు అయిన దత్తాత్రేయుని ఆరాధించెను. ఆ దత్తాత్రేయుడు కార్తవీర్యునకు మహా తేజోవంతములైన నాలుగు వరములు ఇచ్చెను. కార్తవీర్యుడు, ముందు, మొదటి వరముగా వేయి బాహువులను కోరెను. అధర్మమున ఈయబడు దానికి సజ్జనులతో నివారణము, ధర్మముతో భూమిని జయించి ధర్మముతోనే దాని పరిపాలనము. వేలకొలది శత్రువుల వధించి బహు యుద్ధములలో జయించుట రణమున యుద్ధము చేయుచున్నపుడు తనకంటె అధికజాతివానిచే తన వధ జరుగుట. ఆ కార్తవీర్యునిచే సద్వీపయై, సపట్టణయై, సప్త సముద్రములు చుట్టుగా ఉన్నదైన ఈ సమస్త భూమియు, అందలి జనులును క్షాత్ర విధానముతో పరిపాలింపబడినది. కార్తవీర్యుడు యుద్ధము చేయుచున్నపుడు ఆతనికి వేయిబాహువులు, యుద్ధ ధ్వజము, రథము మాయచే ప్రాదుర్భవించును. ఆ ధీశాలి చేత ఆ సప్త ద్వీపములలో పదివేల యజ్ఞములు నిరర్గళముగా జరుపబడినవని వినబడినది. ఆ మహాబాహువు యొక్క సమస్త యజ్ఞములు భూరి తేజస్సుగలవై ప్రకాశించినవి. అవి అన్నియు బంగారు వేదులు బంగారు యూప స్తంభములు కలవి. అవి మహాభాగులైన దేవతలచే విమానముల నుండిదిగి అలంకరింపబడినవి. గంధర్వాప్స రసలచే ప్రకాశించినవి. ఇది ఆతని యజ్ఞముల వైభవము. గంధర్వుడును నారదుడును ఆ రాజర్షియొక్క చరితమును మహిమను సాక్షాత్తుగా చూచి గాథలుగా గానముచేసిరి. యజ్ఞ, దాన, తపములలోను, పరాక్రమమునను, పాండిత్యమునను మానవులు నిశ్చయముగా కార్తవీర్యుని మార్గమున పోలేరు. సప్తద్వీపములలో అతడే ఖడ్గధారి, శ్రేష్ఠ బాణధనుర్ధారి, రథి, అతడితో సమానమైన రాజు వేరొండులేదు. ఉన్ననుఆతడు కార్తవీర్యుని అనుచరుడుగనే కనబడును, ఎదురు నిలుచువాడుగా కాదు. ప్రజలను ధర్మముతో రక్షించుచున్న కార్తవీర్య మహారాజ ప్రభావముతో ప్రతివాడును నశింపని ద్రవ్యములు కలవాడుగనే ఉండెను. శోకము లేదు. ఆశ్చర్య భ్రమలు లేవు. ఆ రాజు ఎనుబదియైదు వేలయేండ్లు రాజుగా ఉండి తొమ్మిది పర్యాయములు సమ్రాట్టై చక్రవర్తి అయ్యెను. ఆతడే పశుపాలుడై, క్షేత్రపాలుడై పర్జన్యుడై వర్షించి, యోగి అగుటచే అర్జునుడు అయ్యెను. ఆతడు అల్లెత్రాటి దెబ్బలచే కరుడు బారిన వేయి బాహువులచే, వేయికిరణములచే ప్రకాశించు శరత్కాల సూర్యునివలె ప్రకాశించును. ఆ రాజు వేయి ఏనుగులతో మాహిష్మతి పురియందు కర్కోటకుని సభను జయించి ప్రవేశించినవాడు. కార్తవీర్యార్జునుడు వర్షాకాల మేఘమువలె నల్లనైన కన్నులు గలవాడు. సముద్రము యొక్క అలల వేగమున క్రీడించెను. ఆ క్రీడాసుఖమున ఉద్వేగము పొందెను. దాని వలన అతని వేయి బాహువులు వేగముగా అన్ని వైపుల కదలుటచే సముద్రపు నీరు ఎగజిమ్మి పడుటచే

అచట వర్షాకాలము అయ్యెను. ఈ విధముగ వర్షాకాల సముద్రమీనము వలె కన్నులున్న వాడు సుఖోద్విగ్నుడై ఆడుచున్న వానివలెనే వర్షాకాలము చేసెను. ఒకమారు నర్మదానది కార్తవీర్యుడు క్రీడించుటచే దొరలినది. ఆతని బంగారు హారముల మాలలు కలదైనది. తన అలలు అనెడు బొమ్మముడి గలదై చక్కని నాదముకలదై శంకించి ధారలు కలదైనను అలలచేతనే మరలివచ్చినది. పూర్వము ఆనర్మదను అనుసరించుచు కార్తవీర్యుడు మహా సముద్రమును ప్రవేశించెను. అది తెలిసి వెంటనే తన వేయి చేతులతో పైకి లేచెను. దానితో సముద్రమును అలలతో చెలియల కట్టను తగులునట్లు చేసెను. దానివల్ల లేచిన తుంపరలు సముద్ర జలమును, తీరమునందుగల వనమును ఆవరించెను. కార్తవీర్యుని వేయి బాహువులచే ఆ సముద్రము మథింప బడినట్లు అయ్యెను. అపుడు పాతాళమున ఉన్న మహాసురులు నిశ్చేష్టులై దాగియుండిరి. మహాతరంగములు అన్నియు చూర్ణములైనవి. వానిలో మీనములు లీనమైనవి. వీనితో గూడిన తరంగజలములు సుడులుపడి దుస్సహమైన నురుగు సమూహమున పడినవి. దేవాసురులు క్షీరసాగరమును మందరముతో మథించినట్లు కార్తవీర్యార్జున మహారాజు తన వేయి బాహువులచే మథించి వైచెను. మందర పర్వత మథనమున కలిగిన అమృత జలములని శంకించి వెంటనే బయలుదేరి వచ్చినవారు ఆ భయంకరుడైన కార్తవీర్యార్జున రాజోత్తముని చూచి భయపడిరి. సాయంకాలమున వాయువు లేమి నిశ్చలములుగా ఉన్న అరటిచెట్ల గుంపువలె మహాసర్పములు అన్నియు తలలు వంచి నిశ్చలముగా నిలిచి ఉండెను. మహా ప్రౌఢుడైన ఆతడు (కార్తవీర్యుడు) ఐదు బాణములతో లంకలో రావణుని ససైన్యముగా మూర్ఛిల్లచేసి జయించెను. బలముతో బంధించెను. ధనువులు బెట్టు రథమున బంధించి తీసికొని వచ్చి మాహిష్మతి పురమున బంధించెను. తరువాత పులస్త్యుడు వెళ్లి కార్తవీర్యార్జునుని శాంతింపజేసి అనుగ్రహించునట్లు చేసెను. అపుడు కార్తవీర్యరాజు పులస్త్యునిచే అనుపాలితుడైన పౌలస్త్యుని (రావణుని) బంధము నుండి వదిలివేసెను. వేయిబాహువులు కల ఆతని వింటినారి ధ్వని ప్రళయాంత మున పిడుగువలన చీల్చబడిన అంబుద ధ్వనివలె ఉండెను. ఆశ్చర్యము. అట్టి కార్త వీర్యార్జునుని బాహువుల వేయింటిని బంగారు తాడిచెట్ల వనమును ఖండించునట్లు భార్గ వుడు (పరశురాముడు) ఖండించెను. రణమునందలి ఆతని మహావీర్యమును ఏమని పొగడవలెను? ఒకనాడు అగ్నిదేవుడు కార్తవీర్యార్జునుని భిక్షము అడిగెను. ఆ రాజు ఆత నికి సప్తద్వీపములు గల పృథివిని భిక్షగా నిచ్చెను. అగ్ని ఆతని బాణములను దహింపదలచి నగరములను, గొల్లపల్లెలను, గ్రామములను, పత్తనములను అంతట దహించివైచెను. ఆ పురుషేంద్రుడైన కార్తవీర్యుని ప్రభావముచే మహాయశస్వియైన అగ్ని కార్తవీర్యుని యొక్క

శైలములను వనములను దహించెను. ఆ అగ్ని వరుణుని ఆత్మజునియొక్క (వశిష్ఠునియొక్క) శూన్యమైన ఆశ్రమము నంతటిని, వన ద్వీపములను హైహయునితో కూడినవాడై దహించెను. పూర్వము వరుణుడు ప్రకాశవంతుడై ఉత్తముడైన పుత్రుని పొందెను. ఆతడు వశిష్ఠుడు అను మునిని ఆపుడని ప్రసిద్ధుడు. శ్రితుడని వినబడెను. అచట విభువైన ఆప దుడు (ఆపవుడు వశిష్ఠుడు) కోపముతో కార్తవీర్యార్జునుని శపించెను. “ఓ హైహయ! కార్తవీర్య! అగ్నికి దానమిచ్చునపుడు ఈ నా వనమును వదలలేదు. కావున దుష్కర్మ నీచే చేయబడినది. నిన్ను అన్యుడు క్షత్రియేతరుడైనఅధికుడు బ్రాహ్మణుడు చంపగలడు. కుంతీ పుత్రుడైన అర్జునుడు అను వాడును రాజుగాడు. ఓ కార్తవీర్యార్జున! ఖడ్గప్రహారము చేయువారిలో శ్రేష్ఠుడై మహావీర్యుడు అయిన పరశురాముడు బలవంతుడై వేగముగా నీ బాహువుల వేయింటిని ఖండించును. తపస్వియై, బ్రాహ్మణుడైన పరశురాముడు మహా బలుడై కార్తవీర్యా! నిన్ను చంపును” అని పల్కెను, ఈ విధముగా ధీమంతుడైన వశిష్టుని శాపమున పరశురాముడు కార్తవీర్యునకు మృత్యువు అయ్యెను. ఆ కార్తవీర్యరాజుచేతనే పూర్వము స్వయముగా ఈ వరము కోరుకొనబడినది. కార్తవీర్యునకు నూరుగురు పుత్రు లుండిరి. వారిలో ఐదుగురు మహారథులు. అస్త్రములు కలవారు, బలవంతులు, శూరులు, ధర్మాత్ములు, యశోవంతులు. వారు–శూరుడు, శూరసేనుడు, వృష్ట్యాద్యుడు, వృషుడు, జయధ్వజుడు అనువారు కార్తవీర్యునకు అవంతి దేశములో పుత్రులు. జయధ్వజుని పుత్రుడు ప్రతాపవంతుడైన తాలజంఘుడు. ఆతనికి నూరుగురు పుత్రులు వారు తాల జంఘులని పిలువబడిరి. మహాత్ములై, హైహయులైన వారిలో ఐదుగణములు ప్రసిద్ధము లైనవి. లెక్కలేనంత మంది వీరహోత్రులు. అట్లే భోజులు, ఆవర్తయులు, తుండికేరులు, విక్రాం తులు, తాలజంఘులు అనువారు. వీరహోత్రసుతుడు అనంతుడు అను రాజు. ఆతని పుత్రుడు దుర్జయుడు. వాడు శత్రువులను చూడని వాడు. ఆతని ద్రవ్యములు నష్టములు కానివిగా ఉండెను. ఆ మహారాజు తన ప్రభావముతో ప్రజలను పరిపాలించెను. ఆతనికి ధననాశము లేదు. నశించినదానిని అతడు మరల పొందును. ధీమంతుడైన కార్తవీర్యుని జన్మ వృత్తాం తమును ఈ లోకమున చెప్పినవాడు భూలోకముననే విత్తవంతుడు అగును. ఆతని ధర్మము వర్ధిల్లును. త్వష్టవలెను బ్రహ్మవలెను స్వర్గమున పూజింపబడును. (32)

జ్యామఘ వృత్తాంత కథనము

ఋషులు ఇట్లు అనిరి :

“మహాత్ములకు అపవస్యమైన భువనము (జగము) కార్తవీర్యునిచే ఎందులకు దహిం పబడినదో! తెలియవలెనను కుతూహలముగల మాకు తెలుపుడు. ఆ రాజర్షి ప్రజలను

రక్షించువాడని చెప్పుదురు. రక్షించువాడైన ఆ కార్తవీర్యుడు ఎందుకు ఆ తపోవనమును నశింపచేసెను?"

సూతుడు ఇట్లు అనెను :

"సూర్యుడు బ్రాహ్మణ రూపమున కార్తవీర్యుని కడకు వచ్చెను. 'తృప్తిని కోరిన వాడను, అన్నమును ఇమ్ము. నేను సూర్యుడను" అని అనెను.

రాజు :

"ఓ భగవంతుడా! దేనితో నీకు తుష్టి కలుగునో చెప్పుము. ఎటువంటి భోజనము ఈయవలెనని కోరుకొనుచున్నావు, నీవు చెప్పిన, విని దానిని నేను సిద్ధముచేయుదును అనెను".

అందుకు సూర్యుడు :

"దానము చేయువారిలో శ్రేష్ఠుడా! చర, స్థావరములలో స్థావరమైన (కదలక ఉన్న) సర్వము ఆహారముగా ఇమ్ము. దానితో తృప్తుడను అగుదును. అన్యము నాకు తుష్టి కలు గదు అనెను. ఆ మాటలనువినిన రాజు మానుషమైన తేజస్సుతో స్థావరమైన సర్వమును దహించుటకు శక్యముకాదు. ఇక నీకే నేను ప్రణమిల్లుచున్నాను" అని పలికెను.

అందుకు సూర్యుడు :

"నీ విషయమున నేను సంతసించితిని. అంతట సుఖములైనవి, అక్షయములైనవియు అయిన శరములను ఇచ్చుచున్నాను. ఈ బాణములు ప్రయోగింపబడిన నా తేజముతో కూడినవై మండును. నా తేజముతో ఆదేశింపబడిన ఎడల మేఘ సాగరమును (వర్షము గురియు మేఘములను, జలములు నిండియున్న సాగరమును) ఎండింప చేయ గలవు. ఓ రాజా! ఆ ఎండినదానిని భస్మము చేయుదును. దానిచేత సంతసించినవాడను అగుదునని చెప్పెను. తరువాత, ఆదిత్యుడు కార్తవీర్యార్జును నకు బాణములను ఇచ్చెను. కార్తవీర్యుడు ఆ బాణములను ప్రయోగించెను. ఆ తరువాత సూర్యుడు విశాలమైన స్థావరమును అంతయు (భూమినంతయు) పొంది, ఆశ్రమములను, గ్రామములను, గొల్లపల్లెలను, నగరములను, తపోవనములను, రమ్యములైన వనములను ఉపవనములను ఈ విధముగా తూర్పువైపు అంతయు దహించెను. తరువాత దక్షిణమును దహించెను. అపుడు భూమి సూర్యునిచే తన తేజముచే దహింపబడినదై వృక్షములు లేనిదై, గడ్డి లేనిది అయినది. ఈ కాలముననే తపోనిలయమును ఆశ్రయించి, పదివేల ఏండ్లు జలవాసియైన వశిష్ఠమహర్షి వ్రతము సమాప్తిచెందగా, ఆ ముని పైకిలేచి కూర్చొనెను. ఆ మహర్షి(వశిష్ఠుడు)కార్తవీర్యార్జునునిచే

దగ్ధమైన తన ఆశ్రమమును చూచెను. నేను మీకు ఇంతకుముందు చెప్పిన విధముగ కోపముతో రాజర్షిని శపించెను.

సూతుడు ఇట్లు అనెను :

"రాజర్షియైన క్రోష్టువు యొక్క ఉత్తమ పూరుషమైన వంశమును వినుడు. ఆతని వంశముననే వృష్ణికులోద్ధారకుడైన వృష్ణి జన్మించెను. క్రోష్టువునకు మహా యశస్వియైన వృజినీవంతుడు అను ఒక పుత్రుడు కలడు. ఆతనికి స్వాహిపుత్రుడు జన్మించెను. ఆతడు స్వాహో వంతులలో శ్రేష్ఠుడు. స్వాహి పుత్రుడు దాతలలో శ్రేష్ఠుడైన రాజైన రశాదువు. రశాదునకు మొదటి పుత్రుడు ఘృతుడు. ఆతడు ఆప్త దక్షిణములై వివిధములైన మహా క్రతువులతో యజ్ఞము చేసెను. చిత్రములైన చిత్రకర్మలు చేయు చిత్రరథుడు అతని పుత్రుడు. వీరుడైన చిత్రరథుడు విపుల దక్షిణములైన యజ్ఞములను చేసెను. ఆతని తరువాత అతని పుత్రుడు శశబిందువు రాజర్షులకు అనుష్ఠితుడు, చక్రవర్తి, మహాసత్త్వుడు, మహావీర్యుడు, బహు సంతానము కలవాడు అని పురావేత్తలు ఆతని విషయమున గానముచేసిరి. ఆ శశబిందువు నకు నూరుగురు పుత్రులుండిరి. వారు ధీమంతులు, అనురూపులు, విశాలమైన ద్రవ్యము, తేజస్సు కలవారు. వారిలో ఆఱుగురు ముఖ్యులు. వారు మహాబలులైన పృథు షట్కులు అనబడిరి. వారు పృథుశ్రవుడు, పృథుయశుడు, పృథుధర్ముడు, పృథుంజయుడు, పృథుకీర్తి, పృథుందాత–అనువారు. వీరు శాశబిందువులైన రాజులు. వీరిని గురించి పురాణములు పార్థశ్రవసుని అంతరునిగా చెప్పును. పూర్వము ఈ అంతరుడు యజ్ఞుని తనయుడు అయ్యెను. శుక్రుడు సుతధర్మాత్ముడై ఈ పృథివిని పొంది, ఉత్తమధాముడై నూరు అశ్వమేథములు చేసెను. ఆతని పుత్రుడు రాజర్షులకు అనుష్ఠితుడైన మరుత్తుడు. మరుత్త పుత్రుడు వీరకంబల బర్హి యనబడెను. కంబలబర్హిషుని పుత్రుడు విద్వాంసుడైన రుక్మ కవచుడు. రుక్మకవచుడు పూర్వమురణమున వాడియైన బాణములచే ధనుర్ధారులను చంపి ఉత్తమ మైన సంపదను పొందెను. అశ్వమేథముచే మహాయశస్వియై, బ్రాహ్మణులకు విత్తము ఒసగెను. రాజైన రుక్మకవచుని నుండి మరలక వీరహంతలైన అయిదుగురు పుత్రులుపుట్టిరి. వారు మహాసత్త్వులు, మహాబలులు. వారు రుక్మేషువు, పృథురుక్ముడు, జ్యామఘుడు, పరిఘుడు, హరి–అనువారు. తండ్రి, పరిఘుని, హరిని, విదేహదేశమున నిలిపెను. బ్రహ్మేషు (రుక్మేషువు) రాజు అయ్యెను. పృథురుక్ముడు వానిని ఆశ్రయించి ఉండెను. జ్యామఘుడు వారిని రాజ్యమును వదలి, సన్యాసమును స్వీకరించి ఆశ్రమమున ఉండెను. ఘోరమైన వనమున ప్రశాంతుడై జ్యామఘుడు బ్రాహ్మణు లచే బోధితుడై, ధనుస్సును స్వీకరించి రథము కలవాడై, నర్మద యొక్క జలప్రాయ

ప్రదేశమున ఏకాకియై వెళ్లెను. అటనుండి మేఖలా వృత్తికలను, ఋక్షవత్పర్వతమునకు వెళ్లి మరొక శుక్తిని ప్రవేశించెను. జ్యామఘునకు మిక్కిలి బలవంతురాలైన శైబ్య (శిబిపుత్రి) భార్య అయ్యెను. పుత్రుడు కలుగకున్నను రాజు మరొక భార్యను చేసికొనలేదు. ఆతనికి యుద్ధమున విజయము లభించెను. తరువాత ఆతడు కన్యను పొందెను. అపుడు ఆ రాజు ఆమె కోడలని అనెను. ఆమె కూడ నీకు ఇది కోడలుగా కోరదగినది. నీకు పుట్టబోవు పుత్రునకు ఈమె భార్య కాగలదు అని అనెను. ఆతని యొక్క ఉగ్రతపస్సుచే శైబ్య వైశ్యుని కనెను. సుందరియైన శైబ్య పరిణతురాలు అగుచునే విదర్భుడు అను పుత్రుని కనెను. విదర్భుడు ఆ కోడలియందు విద్వాంసులును, రాజపుత్రులును, శూరులును, రణ విశార దులునైన క్రథు–కౌశికులను కనెను. తరువాత నా సుధార్మికుడైన విదర్భుడు మూడవవానిగా లోమపాదుని కనెను. లోమపాద పుత్రుడు వస్తువు. ఆతని పుత్రుడు ఆహృతి. కౌశికుని పుత్రుడు చిది. ఆతని పుత్రులు రాజులు, చైద్యులు అనబడిరి. విదర్భ పుత్రుడైన క్రథువునకు పుత్రుడు 'కుంతి'కుంతికి ధృష్ట సుతుడు పుట్టెను. ఆతడు పురోధృష్టుడు ప్రతాపవంతుడు. ధృష్టుని పుత్రుడు ధర్మాత్ముడును శత్రువీరుల జంపువాడైన నిర్వృతి ఆతని పుత్రుడు దశా ర్హుడు. మహాబలపరాక్రమవంతుడు. దశార్హుని పుత్రుడు వ్యోముడు. ఆతని పుత్రుడు జీమూతుడు. జీమూత పుత్రుడు వికృతి. ఆతని పుత్రుడు భీమరథుడు. ఆతని పుత్రుడు రథవరుడు. ఆతడు దాత నిత్యము ధర్మరతుడు, శీల సత్యపరాయణుడును. ఆతని పుత్రుడు నవరథుడు, ఆతని పుత్రుడు దశరథుడు, ఆతని పుత్రుడు ఏకాదశరథుడు, ఆతని పుత్రుడు శకుని. ఆతనికి ధన్వియైన కరంభకుడు, ఆతనికి దేవరాతుడు, దేవరాతికి దేవక్షత్రుడు, ఆతనికి క్షత్రనందనుడైన దేవనుడు పుత్రుడు. దేవనునకు మధువు పుట్టెను. ఆతని మేధ ధనోత్పత్తి కారణమగును. మధువునకు మహాతేజస్వియైన మనువు, మనువశుడు. నందనుడు, మహాతేజస్వియైన మహాపురవశుడును పుత్రులు. పురవశునకు పుత్రుడు పురు షోత్తముడైన పురుద్వంతుడు. పురుద్వంతునకు భద్రవతియందు పురూద్వహుడు పుట్టెను. ఏకాక్షి భార్యఅయ్యెను. ఆమెయందు సత్త్వుడు పుట్టెను. సత్త్వుని నుండి సత్త్వగుణ ముతో గూడి కీర్తి వర్ధనుడైన సాత్వతుడు పుట్టెను. మహాత్ముడైన జ్యామఘుని ఈ సృష్టిని తెలిసినవాడు సంతానవంతుడై, ధీమంతుడై, రాజైన సోముని యొక్క సాయుజ్యమును అందును.(33)

విష్ణు వంశ కీర్తనము

సూతుడు ఇట్లు అనెను :

సాత్వతియైన కౌశల్య రూప సంపన్నులైన సుతులనుకనెను. వారు భజి, భజమానుడు, దివ్యుడు, దేవావృధుడు, అంధకుడు, మహాభోజుడు, యదునందనుడైన వృష్ణి అనువారు.

వారియొక్క సృష్టులు నాలుగు. విస్తరముగా వినుడు. భజమానునకు శృంజయియందు బాహ్యకుడు ఉపరిబాహ్యకుడు కలిగిరి. శృంజయుని యొక్క పుత్రికలు ఇరువురు. బాహ్యకుడు వారిని పెండ్లాడెను. ఆ సృంజయ సుతలైన సోదరస్త్రీలు బాహ్యకుని భార్యలు. వారు బహుపుత్రులనుకనిరి. వారు నిమి, పణవుడు, శత్రుపురములను జయించు వృష్ణి అనువారు. బాహ్యకార్యులు, శృంజయియందు భజమానుని వల్ల పుట్టినవారు. వారిలో పది లక్షలకోట్లను జయించినవాడైన వామకుడును పుట్టెను. భజమానుని వల్ల భగినియందు పుట్టినవారు బాహ్యకార్యులు. వారిలో దేవావృథరాజు మహాగొప్ప తపమునుచేసెను. సర్వగుణములతో కూడినవాడు నాకు పుత్రుడు కావలెను అని ఆత్మసంయోగము కావించి సవర్ణయైన ఆమె జలమును స్పృశించెను. ఆమె జలమును స్పృశించుటచే నదియై నర పత్నిని రాజర్షిగాచేసెను. ఈ విధముగా ఆ నదీశ్రేష్ఠ రాజునకు కల్యాణమును (శుభమును) చేసెను. తరువాత చింతాపరివృతాంగియై సర్వగుణోపేతుడైన పుత్రుని కనదగు స్త్రీ కనబడకున్నది. అట్టి సర్వగుణోపేతుడైన పుత్రుడు రాజైన దేవావృధునకే కలుగును. కావున ఆతనికి నేను స్వయముగా భార్యను అగుదును అని ఒక నిశ్చయమునకు వచ్చెను. ఆమెకు దేవావృధుని భావమునకు అనుగుణముగనే స్వయముగా హస్తుడనువాడు పుట్టెను. ఆ తరువాత సావిత్రి కుమారియై కన్యయై రాజును గూర్చియే చింతించెను. రాజు కూడ ఆమెను కోరెను. ఉదార ధీమంతుడైన దేవావృధుడు ఆమెయందు గర్భమున తేజస్విని ధరింపచేసెను. తరువాత తొమ్మిదవ నెలలో ఆ నదీశ్రేష్ఠ దేవావృధుడు కోరిన విధముగా సర్వగుణోపేతుడైన పుత్రుని కనెను. మహాత్ముడైన దేవావృధుని యొక్క గుణములను కీర్తించుచు దేవావృథుడు దూరము నుండి వినబడి నట్లుగనే దగ్గరి నుండియు కనబడును. మనుష్యులలో బభ్రువు శ్రేష్ఠుడు. దేవావృధుడు దేవతలలో సమానుడు. ఆతని నుండి బభ్రువు నుండియు డెబ్బది వేల అఱువదియైదుగురు అమృతత్త్వమును పొందిరి. ఆతడు యజ్వ, దానపతి, వీరుడు, సత్యవచనుడు, బుధుడు, కీర్తిమంతుడు, మహాభాగుడు, సాత్వతులలో అతడిని మహారథుడు అని కీర్తింతురు. ఆతని వంశమున మార్తికావలులైన సుమహాభోజులున్నారు. వృష్ణికి గాంధారి, మాద్రిఅను ఇరువురు భార్యలు ఉండిరి. గాంధారి మిత్రులను ఆనందింపజేయు సుమిత్రుని కనెను. మాద్రి దేవతలకు శివుని వంటివాడైన యుధాజిత్తును, అనమిత్రుని కనెను. వారిద్దరును పురుషోత్తములు. అనమిత్రుని పుత్రుడు నిఘ్నుడు. ఆతని పుత్రులు ఇద్దరు. మహాభాగుడైన ప్రసేనుడు, శక్రజిత్తు. వారిలో మొదటివాడు అయిన ప్రసేనుడు శక్రజిత్తునకు స్నేహితుడు ప్రాణ సమానుడును అయ్యెను. ఆ రథి శ్రేష్ఠుడైన శక్రజిత్తు వేకువ జామున సూర్యోపస్థానము చేయుటకు నీటి తీరము నుండి నీటిని తీసికొనుటకు వెళ్లెను. ఆ విధముగ నీటితో ఉపస్థానము

చేయు చున్న శక్రజిత్తు ఎదుట అస్పష్టమూర్తియు, భగవంతుడును, తేజోమండల వంతుడును, విభువునైన సూర్యుడు సాక్షాత్తుగా నిలిచెను. తరువాత శక్రజిత్తు రాజు తన యెదుట నిలిచిన సూర్యునితో ఇట్లనెను. ఓ వెలుగుల రేడా! నిన్ను ఆకాశమున తేజో మండలు నిగా ఎట్లు చూతునో! అట్లే నా ఎదుట ఉన్నప్పుడును చూచుచున్నాను. ఓ సూర్యుడా! సాక్షాత్తుగా నీవు కనబడుటలో విశేషమేమి? అని అడిగెను. ఇది విని సూర్యభగవానుడు మణిశ్రేష్ఠమైన స్యమంతకమణిని తన కంఠము నుండి తీసి శక్రజిత్తుని కంఠమున వేసెను.

అపుడు ఆ శక్రజిద్రాజు సూర్యుని ఆకారవంతునిగా చూచెను. (పూర్వము స్యమంతక మణి కాంతిలో సూర్యుని ఆకారము కనపడలేదు). అపుడు ముహూర్త కాలము సూర్యుని ఆకారమును చూచి ఒక క్షణము అట్లే నిలిచెను. మరల వేగముగా బయలుదేరిన అగ్నితో సమానమైన వర్ణము కలిగి లోకములను దిరుగు సూర్యునితో–నీవు ఆకాశమునకు పోవకముందే ఆ మణిరత్నమును నాకు ఇమ్మని అడిగెను. సూర్యుడు ఆ స్యమంతకము అను మణిని శక్రజిత్తునకు ఇచ్చెను. ఆ శక్రజిద్రాజు ఆ మణిని కంఠమున ధరించి నగర మున ప్రవేశించెను. జనులు అతనిని ఇతడే సూర్యుడు (భూమిపై) పోవుచున్నాడు అని అతనిని చూచుటకు పరువిడిరి. శక్రజిత్తు రాజసభను అంతఃపురమును తన ప్రవేశముతో ఆశ్చర్యము కలుగజేసెను. శక్రజిత్తు ఆ దివ్యమైన ఉత్తమమైన స్యమంతక మణి రత్నమును ప్రేమతో భ్రాతయైన ప్రసేనజిత్తునకు ఇచ్చెను. స్యమంతకమను మణి ఎవ్వని రాష్ట్రమున ఉండునో, ఆ రాష్ట్రమున పర్జన్యుడు (వరుణుడు) సకాలమున వర్షించును. వ్యాధి భయము ఉండదు. కృష్ణుడు ప్రసేనునుండి ఆ మణిని పొందకోరెను. కాని అతడు ఈయనందున పొంద లేదు. తాను ఆ మణిని తీసికొన సమర్థుడైనను ఆమణిని కృష్ణుడు హరింపలేదు. ఒకప్పుడు ప్రసేనుడు ఆమణిని అలంకరించుకొని వేటకువెళ్లెను. స్యమంతకమణి కొఱకై సింహముచే దారుణముగా వధింపబడెను. భల్లూక రాజైన జాంబవంతుడు ఆ సింహమును చంపి, ఆ దివ్యమైన స్యమంతకమణిని తీసికొని తన గుహబిలమున ప్రవేశించెను. తరువాత వృష్ణి–అంధకులపెద్దలు, ఆ దుష్కార్యము మణిని పొందగోరిన శ్రీకృష్ణునిపనియే అని శ్రీకృష్ణుని శంకించిరి. బలవంతుడై, శత్రు సంహారకుడైన, కృష్ణభగవానుడు వారి నుండి ఆ అసత్య నిందను సహింపనివాడై వనమున సంచరించెను. తరువాత ప్రసేనుని వేటాడిన చోటున తిరిగెను. తరువాత ఆప్తకారులు అయిన పురుషులతో ప్రసేనుని స్థానమును చేరెను. ఋక్ష వంతమను పర్వత శ్రేష్ఠమును, వింధ్యపర్వత శ్రేష్ఠమును వెదకి పరిశ్రాంతుడై ఆ మహా మనస్వి కృష్ణుడు గుఱ్ఱముతోసహా చంపబడిన ప్రసేనుని కనుగొనెను. కాని అచట మణిలేదు. తరువాత ప్రసేనుని శరీరమునకు సమీపములోనే భల్లూకముచేత చంపబడిన సింహమును

చూచెను. తరువాత భల్లూక పాదచిహ్నములతో సూచింపబడిన జాంబవంతుని గుహను వెదకెను. అచట ఆడవారితో పెద్దగా పాటపాడుచున్న మాటలను వినెను. దాది జాంబ వంతుని కుమారుని తీసికొని సంతోషముతో–ఏడవకుము అన్నమాటను వినెను. ధాత్రి (దాది) : సింహము ప్రసేనుని చంపెను. ఆ సింహమును జాంబవంతుడు చంపెను. ఓ సుకుమారకా! ఇక ఏడువకుము. ఈ శ్యమంతకము నీదే! అని అనెను. వినబడిన ఈ శబ్దమును అనుసరించి వేగముగా ఆ బిలములోనికి కృష్ణుడు వెళ్లెను. ఆ గుహాబిల సమీ పమున చీల్చబడిన ప్రసేనుని చూచెను. వెంటనే ఉదారబుద్ధి గల భగవంతుడైన కృష్ణుడు ఆ బిలములో ప్రవేశించి భల్లూక రాజైన జాంబవంతుని చూచెను. వాసుదేవుడు ఇరువది యొక్క దినములు జాంబవంతునితో బాహువులతో యుద్ధముచేసెను. కృష్ణుడు బిలమున బ్రవేశింపగా వాసుదేవునికి తోడుగా వచ్చినవారు మరల ద్వారకకు వచ్చి కృష్ణుడు చంపబడి నట్లుగా నివేదించిరి. వాసుదేవుడు మాత్రము మహాబలుడైన జాంబవంతుని జయించి, భల్లూకరాజైన జాంబవంతునకు ఇష్టురాలైన కన్యయగు జాంబవతిని పొందెను. శ్రీకృష్ణుని తేజముతో పరాజితుడైన జాంబవంతుడు ప్రభతో గూడిన మణిని, జాంబవతి అను తన కన్యను విష్వక్సేనుడైన శ్రీకృష్ణునకు ఇచ్చెను. కృష్ణుడు తనపై నిందను పోగొట్టు కొనుటకై స్యమంతక మణిని స్వీకరించెను. తరువాత జాంబవంతునితో వెళ్లివత్తునని బిలమునుండి బయలుదేరెను. ఈ విధముగా మణిని దీసికొని వచ్చి తాను తనపై నున్న అపనిందను తొలగించి సాత్వతుని సన్నిధిలో ఆ మణిని సత్రాజిత్తునకు ఇచ్చెను. తరువాత కృష్ణుడు జాంబవతితో జనార్దనుడైన తాను ఆ అపనింద నుండి విముక్తుడనైతిని అనెను. శ్రీకృష్ణుడు ఈ అపనింద పోగొట్టుకొన్న విధమును తెలిసినవాడు ఎక్కడగూడ అపనిందను పొందడు.

సత్రాజిత్తు నుండి వారిలో వారు తోబుట్టువులైన పదుగురు భార్యల నుండి నూరుగురు పుత్రులు జన్మించిరి. వారిలో ముగ్గురు ప్రసిద్ధి చెందినవారు. వారిలో మొట్టమొదటివాడు భంగకారుడు, (సత్రాజిత్తు) వీరుడైన వ్రతపతి, సుప్రియుడైన అపస్వాంతుడు. భంగకారునకు మంచి సంతానముగల ద్వారవతి భార్య. ఆమె రూపగుణాన్వితలైన ముగ్గురు పుత్రికలను కనెను. ఆ స్త్రీలలో ఉత్తమురాలు సత్యభామ. ఆమె దృఢవ్రత, తపస్విని. తండ్రి ఆమెను కృష్ణు నకు ఇచ్చెను. కృష్ణుడు సత్రాజిత్తునకు ఇచ్చిన మణిరత్నమైన స్యమంతక మణిని అపుడు శతధన్వుడైన భోజుడు తీసికొనెను. అపుడు అక్రూరుడు మణిరత్నమైన స్యమంతకమణిని కోరుచు అనిందితయైన సత్యాభామను అడిగెను. తరువాత మహాబలుడైన శతధన్వుడు భద్రకారుని (సత్రాజిత్తును) జంపి రాత్రియందు ఆ మణిని తీసికొని వచ్చి అక్రూరునకు ఇచ్చెను. అపుడు నరశ్రేష్ఠుడైన అక్రూరుడు కారణమును చెప్పి నీవీ మణిని ఇతరులు

తెలియకుండ మెదలవలెనని నియమము చేసెను. కృష్ణునిచేత నీవు భయపెట్ట బడుదువు అని మాకు తెలియును. నాకు ద్వారకా ప్రజలందరు వశమునందున్న వారు, సందేహము లేదు అనెను. తండ్రి చంపబడగా యశస్వినియై సత్యభామ దుఃఖార్తయై రథమును ఎక్కి వారణావత నగరమునకు వెళ్లెను. సత్యభామ శతధన్వుడైన భోజుని యొక్క ఆచర్యను (తన తండ్రిని చంపుటను) భర్తయైన కృష్ణునకు నివేదించి దుఃఖపీడితయై కృష్ణుని ప్రక్కనచేరి కన్నీరుకార్చెను. అపుడు దహింపబడిన పాండవులకు కృష్ణుడు జలతర్పణాది క్రియనుచేసి, అదే క్రియను తనసోదరులకు చేయుటకై సాత్యకిని నియోగించెను. తరువాత కృష్ణుడు తొందరగా ద్వారకకువచ్చి, తనఅన్నయైన బలరామునితో 'మణికొరకు ప్రసేనుడు సింహ ముతో చంపబడెను. ఆ మణికొరకే శతధన్వునిచేత సత్రాజిత్తు చంపబడెను. ఓ ప్రభూ! బలరామా! నేనాతని మార్గమున స్యమంతకమును జూతును. నీవు ఆతనిని చంపుము' అనెను. కావున తొందరగా రథమెక్కుము. మహాబలుడైన భోజుని (శతధన్వుని) చంపుము. ఓ మహాబాహో! శ్యమంతకము మనది అగును అనెను. తరువాత భోజకృష్ణులకు తుముల యుద్ధము జరిగెను. శతధన్వునికి ఏ దిక్కునగూడ అక్రూరుడు కానరాలేదు. ఎక్కిన గుఱ్ఱ ములును దిగకుండా భోజజనార్దనులు యుద్ధముచేసిరి. అక్రూరుడు తానుగూడ యుద్ధము చేయ శక్తుడైనను శ్యమంతకమణి రక్షణము సాధ్యమైనందునను వార్ధక్యము వల్లను కృష్ణునితో యుద్ధము చేయలేదు. భోజుని ఆడ గుఱ్ఱము విజ్ఞాత హృదయమను నూరు యోజనములు బోవు దివ్యమైన గుఱ్ఱము. దానితోనే శత ధన్వుడు కృష్ణునితో యుద్ధము చేసెను. మిక్కిలి పెంచిన వేగముకల ఆడగుఱ్ఱము నూరుయోజనముల మార్గమునుదాటెను. ఇది శతధన్వుని కొంత బాధించెను. ఓ ఋషులారా! తరువాత ఆ గుఱ్ఱములు శ్రమవల్లను, ఖేదము వల్లను, ఆకాశమునకు ఎగసినవి. వాని ప్రాణములుకూడ ఆకాశమునకు ఎగసినవి. అంత కృష్ణుడు బలరామునితో గుఱ్ఱములందు దోషము కనబడినది. ఓ మహాబాహో! బలరామా! మీరు ఇచటనే ఉండుడు. పాదములతోనే నడచివెళ్లి శతధన్వుని కడనున్న శ్యమంతకమణి రత్నమును హరింతును అని చెప్పెను. తరువాత కృష్ణుడు పాదములతో నడచియే వెళ్లి మిథిలాధిపతియు పరమాస్త్రవేత్తయు నైన శతధన్వుని చంపెను. మహా బలుడైన భోజుని చంపినను ఆతని వద్ద శ్యమంతకమణిని కానలేదు. ఆ విధముగ (లేక) మరల వచ్చిన కృష్ణుని బలరాముడు మణిని ఇమ్మని అడిగెను. కృష్ణుడు మణిలేదు అనెను. అంత బలరాముడు కోపించినవాడై ధిక్కారము ధిక్కారము అని మాటిమాటికి ధిక్కారమును బలికి కృష్ణునితో అన్నను అగుట వలన దీనిని సహించుచున్నాను. నీకు శుభమగుగాక, నేను వెళ్లుచున్నాను. నాకు ఇక ద్వారకతోను, నీతోను, వృష్ణులతోను పనిలేదనెను. తరువాత

శత్రుమర్దనుడైన బలరాముడు మిథిలలో ప్రవేశించెను. ఆ మిథిలలో కోరిన అన్నింటితోను మిథిలారాజుచేత పూజింప బడెను. ఈ కాలములోనే బభ్రువను మహాబుద్ధిశాలి అనేక విధములైన సమస్తములైన క్రతువులను ఏ విఘ్నములులేక చక్కగా చేసెను. గాధిపుత్రుడై మహాయశస్వియైన రాజు (అక్రూరుడు) శ్యమంతకమణి రక్ష కొఱకు దీక్షామయమైన కవచమున ప్రవేశించెను. అర్థములను, శ్రేష్ఠములై వివిధములైన రత్నములను, అఱువది ఏండ్లు గడచిన కాలములో యజ్ఞముల వినియోగించెను. ఇవి అక్రూర యజ్ఞములని ఆమహాత్ముడైన అక్రూరుని యజ్ఞములు ప్రసిద్ధిచెందినవి. అవి అన్నియు బహ్వాన్నములు బహుదక్షిణాకములు సర్వకామములను ఇచ్చునవి. తరువాత రాజై, ప్రభువైన దుర్యోధనుడు మిథిలానగరమునకు వెళ్లి బలరాముని నుండి గదాశిక్షను (విద్యను) పొందెను. తరువాత విప్రులు వృష్ణి–అంధక మహారథులచే అనుగ్రహింపచేసెను. మహాత్ముడైన కృష్ణునిచే ద్వారకకు తీసుకొని రాబడెను. పురుష శ్రేష్టుడై బలవంతుడైన కృష్ణుడు బంధుమంతునితో బాటు శత్రుఘ్నుని (శత్రుహంతను) యుద్ధమున చంపి అంధకులతో బాటు అక్రూరుని దగ్గరకు వచ్చెను. భంగకారునకు శ్వఫల్క తనయయైన 'నర' యందు నరసత్తములును, మహాబలవంతులు, ప్రసిద్ధులు అయిన తనయులు పుట్టిరి. అంధక ముఖ్యుని పుత్రులైన వారు–శత్రుఘ్నుడును బంధుమంతుడును. భంగకారుని వధకొఱకు కృష్ణుడు సంతుష్టుడు కాడు. జ్ఞాతులలో భేదము పుట్టునను భయముచేత అక్రూరుని చంపుటకు ఉపేక్షించి వదలెను. ఆ విధముగ అక్రూరుడు వెడలిపోగా ఇంద్రుడు వర్షింపలేదు. అనావృష్టి పీడిత మైన రాష్ట్రముగల ఆతనిని చంపుటకు బయలుదేరెను. తరువాత, కుకురాంధకులు అక్రూరుడు ద్వారవతికి వచ్చుటకు అనుగ్రహింపచేసిరి. అపుడు దానపతియైన అక్రూరుడు మరల ద్వారవతికి రాగా ఇంద్రుడు సముద్ర మధ్యన (ద్వారవతిలో)వర్షించెను. యదుశ్రేష్ఠుడై శ్రీమంతుడైన అక్రూరుడు తన కన్యను, శీలసమ్మతయైన చెల్లెలిని ప్రీతికొఱకై కృష్ణునకు ఇచ్చెను. అంత, కృష్ణుడు యోగ శక్తితో బభ్రువు దగ్గర ఉన్న మణిని తెలిసి సభామధ్యమున అక్రూరునితో ఇట్లనెను. ఓ ప్రభూ! నీ హస్తగతమై ఉన్న స్యమంతకమణి రాజము దానిని ఇమ్ము. ఇచట వ్యతిరేకమతిని చూపకుము. అరువది ఏండ్లు గడచిన కాలమున నుండిన నా కోపము ఆ కాలమున ఆశ్రయించి సుదృఢమై ఒక్కసారిగా నాలోనికి మహత్తైవచ్చినది అనెను. తరువాత, కృష్ణుని మాటవలన, బభ్రువు(అక్రూరుడు)మహామతియై ఏ క్లేశము లేకుండగనే సర్వసాత్వత సభలో ఆ మణిని ఇచ్చెను. తరువాత, అది దమనుడైన కృష్ణుడు బభ్రు హస్తము నుండి అకుటిల మార్గమును పొందిన ఆ శ్యమంతకమణిని సంతసించిన మన స్సుతో మరల బభ్రునకే ఇచ్చెను. కృష్ణుని చేతినుండి ఆ శ్యమంతకమణిని రాజ్యమును

పొంది గాందినీ పుత్రుడైన బభ్రువు (అక్రూరుడు) కంఠమున బంధించుకొని సూర్యునివలె ప్రకాశించెను. కృష్ణుని అపనింద విశుద్ధమై ఉత్తమమైన విధమును తెలిసినవాడు ఏ విధముగ అయినను అపనిందను పొందడు.

కనిష్ఠ వృష్ణి నందనుడైన అనిమిత్రునివల్ల శిని పుట్టెను. సత్యవాక్కు సత్య సంపన్నుడయిన సత్యకుడు శినియొక్క పుత్రుడు. సత్యక పుత్రుడు సాత్యకి. యుయుధానుడు అయిన ఆ సాత్యకికి పుత్రుడు 'భూతి'. భూతికి కుమారుడు యుగంధరుడు అని భౌత్యులు చెప్పిరి. పృశ్నికి శ్వఫల్కుడు చిత్రకుడును పుత్రులు. శ్వఫల్కుడు మహారాజు. ఆ ధర్మాత్ముడు ఉన్నచోట వ్యాధి భయములేదు. అనావృష్టి భయము లేదు. ఓ బ్రాహ్మణోత్తములారా! ఒకప్పుడు ప్రభువైన కాశిరాజు రాజ్యమున ఇంద్రుడు మూడేండ్లు వర్షింపలేదు. అపుడు కాశిరాజు అచ్చట పరమార్చితుడైన శ్వఫల్కుని నివసింపజేసెను. శ్వఫల్కుడుండుటచేత ఇంద్రుడు వర్షించెను. శ్వఫల్కుడు కాశిరాజు యొక్క పుత్రికను, అనిందితయైన భార్యగా స్వీకరించి గాందిని అను గోవును గ్రహించెను. అది నిత్య ధనమును విప్రునకు ఇచ్చెను. ఆమె (గో గర్భమునఉన్న కూతురు) తల్లి గర్భములో పెక్కు వందల యేండ్లు వసించుచుండెనేగాని జన్మించుట లేదు. అపుడు గర్భములో ఉన్న ఆమెతో ఆమె తండ్రి తొందరగా జన్మింపుము. నీకు భద్రమగుగాక. ఎందుకు గర్భములో ఉండుచున్నావు? అని అడిగెను. అంత గర్భస్థయైన కన్నెగోవు-ప్రతిదినము నేను ఈయబడినచో ఉండును. నేనున్నచో ఓ తండ్రీ నన్ను కోరుకొనుము-అని అనగా అది అట్లే అగుగాక అని దానిపిత దాని కోరికను పూరించెను. ఆమె పుత్రులుదాత, యజ్వ, శూరుడు, శాస్త్రజ్ఞాని, అతిథి ప్రియుడు, యజ్ఞములందు భూరి దక్షిణలు ఇచ్చువాడునైన అక్రూరుడు, అతడు శ్వఫల్కుడును, ఉపమంగువు, మంగువు, మృదురుడు, అరిమేజయుడు, గిరిరక్షుడు, యక్షుడు, శత్రుఘ్నుడు లేదా అరిమర్దనుడు, ధర్మభృత్తు, శృష్టచయుడు, వర్గమోచుడు, అపరుడు, ఆవాహ ప్రతివాహులు, వసుదేవ అను వరాంగనయును అనువారు. అక్రూరుని వల్ల ఉగ్రసేని యందు ఇద్దరు కుల సంతోషకారులు పుత్రులు-దేవుడు, అనుదేవుడు అనువారు పుట్టిరి. వారు దేవతలతో సమానులు. చిత్రకునకు పుత్రులు-పృథువు, విపృథువు, అశ్వగ్రీవుడు, అశ్వబాహువు, సుపార్శ్వకుడు, గవేషణుడు, అరిష్టనేమి, అశ్వుడు, సువర్మ, వర్మచర్మభృత్తు, అభూమి, బహుభూమి, శ్రీ విష్ఠ-శ్రవణా అను స్త్రీలును జన్మించిరి. సత్యకుని వల్ల కాశిదుహిత (కూతురు) నలుగురిని కుమారులను కనెను. వారు కకుదుడు, భజమానుడు, శమీకుడు, బలబర్హిషుడు అనువారు. కకుదునకు వృష్టి, వృష్టికి కపోతరోముడు, వానికి రేవతుడు పుత్రులు. ఆతనికి తుంబురు సఖుడైన విద్వాంసుడు పుత్రుడు. ఆతని పేరనే చందనోదక దుందుభి ప్రసిద్ధమై

నది. ఆతనికి అభిజిత్తు, అభిజిత్తునకు పునర్వసు పుత్రుడు. అభిజిత్తు పుత్రునికోరి అశ్వ మేధము చేసెను. దానియొక్క అతిరాత్ర సదోమధ్యము నుండి మిథునము పైకివచ్చెను. తరువాత విద్వాంసుడు, ధర్మజ్ఞుడు, దాత, యజ్వయైన పునర్వసువు పుట్టెను. ఆతనికి కూడ పుత్రమిథునము పుట్టినది. అది బాహు, బాణములచే జయింపబడనిది. ఆ మిథు నము-ఆహుకుడు ఆహుకి, అని బుద్ధిమంతులలో శ్రేష్ఠులు. అమ్ముల పొదులు ధ్వజములు (జండాలు) రథముల నొగళ్ల చివరి మ్రానితుండ్లుకల పదివేల సేనల యొక్కయు, మేఘధ్వని గల రథముల యొక్కయు బలముకలవాడు ఆహుకుడు అని ఆ ఆహుకుని గూర్చి ఒక శ్లోకములను పెద్దలు ఉదాహరింతురు. ఆతడు అసత్యము పలుకనివాడు, యాగము చేయక ఉండనివాడు, వేయికి తక్కువ దక్షిణలు ఈయనివాడు, అశుచిగా ఉండనివాడు, అధర్మము లేనివాడు, విద్వాంసుడు అయినవాడు, కృశింపని వాడునై ఉండెను. ఆహుకునకు పుత్రుడు ధృతి. ఆతడు తెల్లని పరిచారముతో కిశోరముల వలెనున్న లక్ష ఎనుబది గుఱ్ఱము లను కలిగి ఆహుకునితో సమానుడు అయ్యెను. తూర్పుదిక్కున భోజునకు వెండి బంగారు కక్షలుకల ఇరువది యొక్క వేల ఏనుగులు ప్రకాశించినవి. భూపాలుడైన భోజునకు ఉత్తర దిక్కున కూడ అన్నివేల (21000) ఏనుగులు ప్రకాశించి, చిరుగంటలు మ్రోగిం చినవి. ఆహుకుడు తన చెల్లెలిని ఆహుకాంధునకు ఇచ్చెను. ఆహుకాంధునకు కూతురు దేవకుడు, ఉగ్రసేనుడు అనువారు ఇద్దరు పుత్రులును కలిగిరి. వీరిరువురు దేవగర్భసములు. దేవకునకు దేవతలతో సమాన వీరులు పుత్రులు. దేవతలకు కూడ దేవుడైనవాడు (దేవ దేవుడు), సుదేవుడు, దేవ రంజితుడనువారు. వారి తోబుట్టువులు అయిన స్త్రీలు ఏడుగురు ఉండిరి. వారిని వసు దేవునకు ఇచ్చెను. వృకదేవ, ఉపదేవ, దేవరక్షిత, శ్రీదేవ, శాంతిదేవ, మహాదేవ, ఏడవది సునామ. ఆమె సుందరరూపము కలది. ఉగ్రసేనుని పుత్రులు తొమ్మం దుగురు. వారిలో కంసుడు మొదటివాడు. న్యగ్రోధుడు, సునాముడు, కద్వశంకుడు, భూమ యుడు, సుతనువు, రాష్ట్రపాలుడు, యుద్ధతుష్టుడు, సుపుష్టిమంతుడు. వారి చెల్లెండ్రు ఐదుగురు. కర్మధర్మవతి, శతాంకూ, రాష్ట్రపాలా, కహ్వా, వరాంగనా. కుకుర వంశమున పుట్టిన ఉగ్రసేనుడు మహాపత్యుడుగా ప్రసిద్ధుడు. అమిత తేజస్కులైన కుకురుల ఈ వంశమును గురించి తెలిసికొన్న నరుడు విపుల వంశమును పొందును. సంతానవంతుడు అగును. భజమానుని యొక్క పుత్రుడు రథి ముఖ్యుడైన విదూరథుడు, రాజ్యాధిదేవుడు, శూరుడు, విదురుడుఅను సుతులు ఉండిరి. ఆ శూరునికి మిక్కిలి బలవంతులైన సుతులు పుట్టిరి. వారు-వాతుడు, నివాతుడు, శోణితుడు, శ్వేత వాహనుడు, శమి, గదవర్మ, నిదాతుడు, శక్ర శక్రజిత్తు అనువారు. శమిపుత్రుడు ప్రతిక్షిపుడు. ప్రతిక్షిప్తుని పుత్రుడు స్వయం

భోజుడు, స్వయం భోజునకు హృదికుడు పుట్టెను. హృదికునకు భీమపరాక్రమవంతులు పదుగురు పుత్రులు. కృతవర్మ, శతధన్వుడు, కృతుడు, దేవార్హుడు, వనార్హుడు, భిషక్కు, ద్వైతరథుడు, సుదాంతుడు దియాంతుడు, నకవంతుడు, కనకోద్భవుడు-అనువారు. దేవార్హుని సుతుడు విద్వాంసుడైన కంబలబర్హిషుడు. ఆతని పుత్రుడు అసమౌజుడు, ప్రసిద్ధుడైన సుమహౌజుడు. అపుత్రుడైన అసమౌజసునకు వీరిని ఇచ్చెను. సుదంష్ట్రుడు, సురూపుడు, కృష్ణుడు-అను వీరంధకులు అనబడిరి. అంధకుల ఈవంశమును నిత్యము కీర్తించువాడు తనయొక్క విశాల వంశమును పొందును. సంశయము లేదు.

శూరుడు అస్మకి యందు దేవమానుషిని పుట్టించెను. అతడు మాషియందు దేవమీఢుషుని పుట్టించెను. భోజయైన భాషియందు శూరుని వల్ల పదుగురు జనించిరి. వారికి మహాబాహువైన వసుదేవుడు జనించెను. మొదట ఈతడు ఆనక దుందుభి. ఆతడు జనింపగనే ఆతని దుందుభి (భేరి) ఆకాశమున మ్రోగెను. అట్లే పెద్ద తప్పెటల చప్పుడు కూడ ఆకాశమున మ్రోగెను. శూరుని భవనమున పెద్ద పుష్పవర్షము కురిసెను. మొత్తము మనుష్య లోకమున కూడ రూపమున వసుదేవునితో సమానుడు లేడు. పురుష శ్రేష్ఠుడైన ఆతని కీర్తి చంద్రుని వెన్నెల వలె వ్యాపించి ఉండెను. తరువాత మహాబాహువు. తరువాత దేవభాగుడు పుట్టిరి. తరువాత దేవశ్రవుడు పుట్టెను. అనాదృష్టిపరుడు, నందనుడు, భృంజనుడు, శ్యాముడు, శమీకుడు, గండూషుడు, నలుగురు శ్రేష్ఠ స్త్రీలునుపుట్టిరి. వారు పృథ, శ్రుతవేద, శ్రుతకీర్తి, శ్రుతశ్రవ, రాజాధిదేవి-ఈ అయిదుగురు వీరమాతలు. వసుదేవుడు సంతానములేక వృద్ధుడైన కుంతిభోజునకు పృథను ఇచ్చెను. కుంతిభోజుడు ఆమెను కూతురినిగా చేసికొనెను అప్పటి నుండి పృథ కుంతి అనబడెను ఈ కుంతిని పాండురాజు వివాహము ఆడెను. కావున భోజాత్మజయైన పృథ కుంతి అని ప్రసిద్ధి గాంచెను. కురువీరుడై ముఖ్యుడైన పాండువు భోజునినుండి కుంతిని భార్యగా పొందెను. తరువాత పృథ (కుంతి) అగ్ని సమాన తేజోవంతులైన ముప్వురు పుత్రులను కనెను. వారు లోకమున ఎదురులేని వీరులు, ఇంద్ర సమానపరాక్రములు. యమధర్మరాజు వల్ల యుధిష్ఠిరుని, వాయుదేవుని వల్ల భీముని, ఇంద్రునివల్ల అర్జునుని పుత్రులనుగా కనెను. మాద్రవతియందు అశ్వినులు (అశ్వినీ దేవతల పుత్రులు) పుట్టిరని ప్రసిద్ధి వచ్చినది. వారు నకులుడు, సహదేవుడును. వీరురూపము సత్త్వము గలవారు. వృద్ధశర్మకు శ్రుతదేవ యందు పుత్రుడు పుట్టెను. ఆతడు కరూష దేవాధిపతి, వీరుడు, దంతవక్త్రుడను వాడు, మహాబలుడు. కేకయరాజ పుత్రియైన శ్రుతకీర్తియందు సంతర్దనుడు, చేకితాన-బృహత్ క్షత్రులు, అట్లే ఇతర మహాబలులును పుట్టిరి. వారు విందానువిందులు, వీరవంతీ దేశపు రాజులు, సోదరులు, మహాబలులు,

శ్రుతశ్రవయందు చేది దేశాధిపతియైన శిశుపాలుడు పుట్టెను. దమఘోషుడను రాజర్షికి ఈతడు పుత్రుడు. విఖ్యాతమైన పౌరుషము కలవాడు. ఈతడు పూర్వజన్మలో శత్రుమర్దనుడై దశగ్రీవుడైన రావణుడుగా ఉండెను. ఆతనికి యదుశ్రవుడు అనుజుడు, రుజుకుడు మరొక అనుజుడు. వసుదేవుని భార్యలు పదముగ్గురు శ్రేష్ఠ స్త్రీలు. పౌరవి, రోహిణి, మదిర, అపర, భద్ర, వైశాఖి, ఏడవది దేవకి, సుగంధి, వనరాజి, తక్కిన ఇద్దరు పరిచారికలును. రోహిణి, పౌరవియు వల్మీకునకు పుత్రికలైరి. వసుదేవునియొక్క జ్యేష్ఠపత్ని రోహిణి, జ్యేష్ఠుడైన పుత్రునిగా బలరాముని పొందెను. అట్లే సారణుని నిశవుని, దుర్దముని, దమనుని, శుభ్రుని, పిండారక–కుశీతకు లను, చిత్రయను పుత్రికను, రోహిణిని ఈ ఎనమండుగురిని కనెను. బలరామునకు ఇద్దరు పుత్రులు పుట్టిరి. వారు నిశిత–ఉత్సుకులు. పార్శ్వి, పార్శ్వనంది, శిశువు, సత్య, ధృతి, మంద బాహ్యుడు, రామాణ–గిరికులు, గిరుడు, శుక్లగుల్ముడు, గుల్ముడు, దరిద్రాంతకుడు–వీరు పుత్రులు. పుత్రికలు మొదటివారు ఐదుగురు. పేరులతో వారిని వినుడు. అర్చిష్మతి, సునంద, సురస, సువచ, శతబల–వీరు సారణుని సుతలు. భద్రాశ్వుడు, భద్రగుప్తి, భద్రవిష్నుడు, భద్రబాహువు, భద్రరథుడు, భద్రకల్పుడు, సుపార్శ్వకుడు, కీర్తిమంతుడు, రోహితాశ్వుడు, భద్రజుడు, దుర్మదుడు, అభిభూతుడు వీరు రోహిణి యొక్క కులమున పుట్టినవారు. నంద–ఉపనందులు, మిత్రుడు, కుక్షిమిత్రుడు అచలుడు, చిత్ర–ఉపచిత్ర అను కన్యలు, స్థితుడు, పుష్టి, అపరుడు సుదేవుడు–వీరు మదిర యొక్క సుతులుగా పుట్టిరి. ఉపబింబుడు, బింబుడు, సత్వదంత మహౌజసులు–మహాబలులైన ఈ నలుగురు భద్రాపుత్రులు. శౌరి వైశాఖయందు కైశికుడను ఉత్తమ పుత్రుని పొందెను. దేవకియందు శౌరి, సుషేణుడు, కీర్తిమంతుడు, తదయుడు, భద్రసేనుడు, యజుదాయుడు, భద్రుడు, విదేకుడు–అనువారిని కనెను. వీరినందరిని (శౌరిదక్క) కంసుడు వధించెను. తరువాత అట్టి అవస్థలో ఆయుష్మంతుడు, లోకనాథుడు, మరల వచ్చిన విష్ణువు, ప్రజాపతియునైన పూర్వకృష్ణుడు పుట్టెను. ఆతని తరువాత కృష్ణ భద్రభాషిణియైన సుభద్ర జన్మించెను. తరువాత కృష్ణ సుభద్రఅని ఆ వృష్ణికుల నందిని అని తెలుసుకొన వలెను. సుభద్రయందు అర్జునునివల్ల రథియైన అభిమన్యుడు పుట్టెను. వసుదేవుని భార్యలైన ఏడుగురు మహా భాగ్యవంతు రాండ్రయందు పుట్టిన శూరులైన వారిపేర్లను వినుడు. ఇతనికి సహదేవయందు శూరుడైన అభయాసఖుడు పుట్టెను. శార్ఙ్గదేవుని గర్భంనుంచి తాబుడు అనువాడు పుట్టెను. శౌరి కులోద్ధారకులైన ఉపసంగుని, వసువును–అను దేవరక్షితు లైన పుత్రులను కనెను. ఈ విధముగ వసుదేవునకు పదుగురు పుత్రులు. వారిని కంసుడు చంపించెను. ఉపదేవ–విజయుని, రోచనుని, వర్ధమానుని, ఈ మహాభాగులను అందరిని

కనెను. వృకదేవి మహాత్ముడైన స్వగాహవుని కనెను. ఈతనికి ఆగాహి చెల్లెలు. ఆమె సురూపను, శిశిరాయణిని కనెను. దేవకి ఏడవ పుత్రునిగా కృష్ణుని కనెను. సునాసభువుని (భూమిని) కనెను. మహాభాగుడై యుద్ధమున చిత్రముగా యుద్ధముచేయు గవేషణుని కనెను. ఈ గవేషణుడే పూర్వము వనమున శ్రాద్ధదేవుని కనెను. శౌరి శైబ్యయందు నాశములేని కౌశికుని ఇచ్చెను. సుగంధి, వనరాజియు శౌరి పెండ్లాడినవారు. పుండ్రుడు, కపిలుడును, వసుదేవ పుత్రులు. వారిలో పుండ్రుడు రాజయ్యెను. కపిలుడు వనమునకు పోయెను. ఆమెయందు వసుదేవ పుత్రుడై బలవంతుడు పుట్టెను. ఆతడు రాజైన నిషాదుడు. ఈతడు మొదటి ధనుర్ధరుడు. దేవరాతునకు మహాభాగుడై ప్రసిద్ధుడైనవాడు పుత్రుడుగా పుట్టెను. దేవశ్రవసునివల్ల పుట్టినది పండిత సమ్మతమైనదిగా పెద్దలు చెప్పుదురు. నివర్తుడు అస్మకియందు యశస్వియైన అనాదృష్టిని, ఇంద్ర శత్రువును చంపు మహాబలుడైన శ్రాద్ధ దేవుని పుత్రునిగా పొందెను. శ్రాద్ధ దేవుడు నిషధునిగా తెలిసినందున మహావీర్యుడైన ఏకలవ్యుడు నిషాదులచే పెంచబడెను. సంతసించిన కృష్ణుడు సంతానములేని గండూషునకు ఇద్దరు పుత్రులను ఇచ్చెను. వారు చారుదేష్ణుడు, సాంబుడును. వీరు అస్త్రముల ప్రయోగమును నేర్చినవారు ప్రశస్త లక్షణములు కలవారు. కనకునకు తంతిజుడు, తంతి మాలుడును స్వపుత్రులు. ప్రతాపవంతుడైన వసుదేవుడు అపుత్రకుడైన వస్తావనికి తంతిజ-తంతి మాలులను ఇచ్చెను. సౌతి వీరుడైన సుతుని శౌరిని కౌశికుని కూడ ఇచ్చెను. తపుడు, కోధనుడు, విరజుడు, శ్యామ-సృంజిములు కనకపుత్రులు. శ్యాముడు అనపత్యుడు అయ్యెను. శ్యామకుడు వనమునకు ఏగెను. భోజత్వమును ఏవగించుకొనుచు రాజర్షిత్వమును పొందవలెను. నియతవ్రతముగా ఈ కృష్ణ జన్మమును పఠించువాడు బ్రాహ్మణునకు వినిపించినవాడును మహాసుఖమును పొందును.

పూర్వము దేవదేవుడును, మహాతేజస్వియు, ప్రజాపతియు అయిన నారాయణ ప్రభువు మనుష్యులలో విహరించుటకై కృష్ణుడుగా జన్మించెను. వసుదేవుని చేతతన తపస్సుతో దేవకియందు పుట్టినవాడు, కమలాక్షుడు విష్ణువు. నాలుగు బాహువులు కలవాడు, దివ్య రూపుడు, లక్ష్మితో కూడినవాడు. ఆతడు మానుష రూపమును పొంది భూమిలో యోగియై ప్రకాశించిన భగవంతుడైన కృష్ణుడు. ఆతడు అవ్యక్తుడు (సత్య స్వరూపము ప్రకాశింపనివాడు) వ్యక్తలింగుడు (ప్రకాశించిన లక్షణములు కలవాడు). ఆతడే భగవంతుడు, ప్రభువు. ఆతడు నారాయణుడు, ఆతని నుండి సర్వము పుట్టినది. ఆతడు నాశములేనివాడు. దేవుడై నారాయణుడై (మోక్షస్థానమై) సనాతనుడైన హరి అతడే. ఆతడు పూర్వము ఆదిపురుషుడు అయిన బ్రహ్మను సృజించెను. ఇపుడు ఈ యాదవ నందనుడైన కృష్ణుడు

అదితికి పుత్రుడై, ఇంద్రునకు తమ్ముడై, దేవుడైన విష్ణువని ఖ్యాతి చెందెను. ఆతడు అదితికి పుత్రుడు అగుటకు కారణము దేవ శత్రువుడైన దైత్య, దానవ, రాక్షసుల వధకొఱకై అనుగ్రహించుటయే. యయాతి వంశమున పుట్టిన ధీమంతువైన వసుదేవుని కులము పుణ్యమయము. నారాయణ ప్రభువు ఆ కులమున జన్మకర్మ నందుట దానికి కారణము. ఆతడు యాదవ కులమున పుట్టగనే సాగరములు కంపించినవి. పర్వతములు చలించినవి. అగ్నిహోత్రములు ప్రజ్వలించినవి.

జనార్దనుడు (కృష్ణుడు) పుట్టినపుడు-అభిజిత్తను నక్షత్రము, జయంతి అనురాత్రి, విజయమను ముహూర్తము వర్తిల్లుచున్నవి. అవ్యక్తుడు, శాశ్వతుడు, హరి, నారాయణుడు, ప్రభువుఅగు శ్రీకృష్ణభగవానుడు ప్రజలను మోహింప చేయుచు జన్మించెను. దేవేంద్రుడు ఆకాశమునుండి పుష్పవర్షమును కురిపించెను. వేలకొలది మహర్షులు గంధర్వులతో కూడి మంగళ వాక్యములతో స్తోత్రము చేయుచు శ్రీకృష్ణుని కడకు వచ్చిరి. వసుదేవుడు మాత్రము ఆ రాత్రియందు పుట్టిన విష్ణువును చూచెను. ఆకాశమున వ్యాపించిన దివ్యములైన మంచి లక్షణములతోను, శ్రీ వత్సచిహ్నముగల ఆ వాసుదేవుని చూచి ఓ ప్రభో! దివ్యమైన నీ స్వరూపమును ఉపసంహరింపుము. తండ్రీ! నేను కంసుని వల్ల భయము చెందినాను. నీకంటె జ్యేష్టులును, ఆశ్చర్యకరమైన రూపము కలవారును అయిన నా పుత్రులు ఆ కంసునిచే వధింపబడిరి. కావున నీ స్వరూపమును ఉపసంహరింపుమని ప్రార్థించుచున్నాను అని అడిగెను. వసుదేవుని మాటవిని, ప్రభువు గూడ తన స్వరూపమును ఉపసంహ రించెను. కృష్ణ భగవానునిచే అనుమతింపబడినవాడై, తండ్రి నందగోప గృహమునకు వెళ్ళెను. అచట ఉగ్రసేనుని అనుమతితో కృష్ణుని యశోదకు ఇచ్చెను. యశోదా దేవకులు ఇద్దరును సమాన కాలమున గర్భిణులు. నందగోప పతియైన, నందగోవుని పత్ని యశోద. విష్ణు కులప్రభువైన కృష్ణుడు ఏ రాత్రిలో పుట్టెనో! ఆ రాత్రియందే యశోద కూడ కన్యకను కనెను. మహాయశస్వియైన వసుదేవుడు పుట్టిన వానిని రక్షించుటకై ఆ పుత్రుని యశోదకు ఇచ్చెను. తాను ఆమె కన్యను గ్రహించెను. ఈ విధముగ పుత్రుని నందగోపునకు ఇచ్చి నన్ను రక్షింపుముఅనెను. నందగోపుడు అపుడు వసుదేవునితో-నీ పుత్రుడు యాదవులకు సమస్త కల్యాణములను ఇచ్చువాడు అగును. ఈ దేవకీ గర్భము (కృష్ణుడు) మన కష్టములను నివారింపగలడు అనిచెప్పెను.

ఉగ్రసేనపుత్రి అయిన దేవకియందు వసుదేవునకు కన్య కలిగినదని చెప్పి శుభలక్షణయైన ఆ కన్యను కంసునకు నివేదించెను. కంసుడు తన చెల్లెలియందు కన్య జన్మించెనని నమ్మలేదు. తరువాత ఆ కన్యను గూడ ఆ దుష్టాత్ముడగు కంసుడు, సంతోష

ముతో పైకివిసిరి వదలివేసెను. వ్యర్థబుద్ధి కంసుడు కన్యగూడ చంపబడినది అని మరల మరల అనుచు జపించునంతలో ఆ కన్య వృష్ణి (యాదవుల) ఇంట పూజితురాలై వృద్ధి చెందెను. దేవతలు పుత్రునివలె (కృష్ణుని) పరిపాలించుచున్నవారై, దైవవిధితో పుట్టిన ఆ కన్యను ప్రజాపతిగా చెప్పుదురు. విశ్వరక్షణకై జన్మించిన విష్ణువు యొక్క పదునొకండవ అవతారముగా ఆమెను దేవతలందరును యాదవులును పూజింతురు. దివ్యశరీరము కల దేవుడైన కృష్ణుడు ఈమెచే రక్షింపబడినాడు అని తెలుపగా...

ఋషులు ఇట్లు అనిరి :

"భోజవంశ రాజైన కంసుడు వసుదేవుని పుత్రులను బాలురునే ఎందులకు చంపెను. దానిని మాకు వివరింపవలెనని కోరుచున్నాము."

సూతుడు ఇట్లు అనెను :

కంసుడు వ్యర్థమతియై వసుదేవుని పుత్రులను పుట్టినవారిని పుట్టినట్లే ఉన్న శిశువులను అందరిని ఎందులకు కుత్తుక పిసికి చంపెనో, అట్లే భయమువలన మహా బాహువైన కృష్ణుడు పుట్టగనే యశోదకడకు ఎట్లు చేర్పబడెనో, పురుషోత్తముడైన గోవిందుడు గోవులలో ఎట్లు పెరిగెనో–వినుడు. కంసుడుయువ రాజైనపుడు దేవకికిని ధీమంతుడైన వసుదేవునకును రథమెక్కించి సారథ్యము చేసెనని చెప్పెడివారు. అపుడు ఆకాశమున ఒకానొక దివ్యభూతము యొక్క వాణి వినబడెను. అది పుష్కలమై ఆకాశమయమై లోకసాక్షిణి అయినది. దానిచేత కంసుడు ఎల్లప్పుడు భయపడెను. పరకారణమున నీవు రథములో గొనిపోవు నీ చెల్లెలి యొక్క ఏడవ గర్భము నీకు మృత్యువు కాగలదు అని ఆ వాణి పలికెను. కంసుడు అపుడు ఆ దివ్యవాణిచేత బాధితుడై, మతిచెడినవాడై, కత్తిదీసి ఆ చెల్లెలిని చంప కోరెను. అంత మహాబాహువైన, ప్రతాపవంతుడు అయిన వసుదేవుడు సౌహార్దముతోను ప్రేమతోను ఉగ్రసేన పుత్రుడైన కంసునితో ఇట్లనెను. ఏ క్షత్రియుడైనను స్త్రీని ఎప్పుడు చంపడు. ఓ యాదవ నందనా! ఈ విషయమున నాకు ఒక ఉపాయము తోచినది. ఓ రాజా! ఈమె ఏడవ గర్భమున పుట్టినవానిని నేను నీకిత్తును. వానిని నీకు తోచిన క్రమమున చేయుము. ఓ భూరిదక్షిణుడా! (యజ్ఞములందు భూరిదక్షిణలు ఇచ్చిన వాడా!) ఈ మీ చెల్లెలి యొక్క అందరి పుత్రులను పుట్టగనే నీ వశము చేయుదును. ఇక నీవు ఇపుడు స్వేచ్ఛగా (భయము వీడి)వర్తింపుము. అని ఈ ఆకాశవాణి అసత్యము అగును అని ఈ విధముగా వసుదేవునిచే అనునయింపబడిన కంసుడు వసుదేవునకు దేవకియందు పుట్టిన తనయులను అందరినిగ్రహించెను. వసుదేవుడు ఆ భార్యను పొంది సంతుష్టుడయ్యెను. మతిచెడిన కంసుడు పాపకర్ముడై దేవకీ పుత్రులను అందరిని చంపెను.

ఋషులు :

విష్ణువును జనింపజేసిన ఈ వసుదేవుడు ఎవరు? ఈ యస్వినియైన దేవకియు ఎవతె? ఈ నందగోపుడు అనువాడు ఎవడు? విష్ణువును పెంచి మహాయశ్వసిని అగు ఈ యశోద ఎవతె ? అని ప్రశ్నించిరి.

సూతుడు ఇట్లు అనెను :

కశ్యపునకు ఆదిత్యులైన (అదితి సంతానమైన) పురుషులును స్త్రీలును సంతానముగ ఉండిరి. ఆ తరువాత మహాబాహువు (విష్ణువు) దేవకియొక్క కామములను బాగుగా వర్ధిల్ల చేసెను. ఆ విష్ణుదేవుడు భూమి అంతయు తిరిగెను. యోగాత్ముడై యోగమాయచే సర్వభూత ములను మోహింపచేయుచు, మనుష్య శరీరమున ప్రవేశించెను. అపుడు ధర్మము నశించెను. అపుడు ధర్మ సంస్థాపనమును అసురుల నాశమును, చేయుటకై స్వయముగ విష్ణువు వృష్ణి కులమున జన్మించెను. ఈ కృష్ణునిచేత రుక్మిణి అను కన్య హరింపబడినది. నగ్న జితునిపుత్రి సత్య, సత్రాజిత్‌పుత్రి సత్యభామ, జాంబవతి, రోహిణి, శైబ్య, సుదేవి, మాద్రి, సుశీల, కాళింది, మిత్రవింద, లక్ష్మణ, జాలవాసిని వీరు మొదలుగా గలవారు, దేవతా స్త్రీలును, పదునాఱు వేలమంది ఇతర స్త్రీలను, కృష్ణుడు పెండ్లిచేసుకొనెను. స్వర్గ మున పదునాలుగు గణములని చెప్పబడు అప్సరసలు విశిష్టులైనవారు. వీరు దేవతలతో చింతించి ఇంద్రునిచే ఇచటికి పంపబడిరి. వారు వాసుదేవుని భార్యలు అగుటకు రాజుల ఇండ్లలో పుట్టిరి. ఈ మహాభాగ్యవతులైన స్త్రీలు విష్వక్సేనుని (విష్ణువైన కృష్ణుని) భార్యలుగా ప్రసిద్ధి చెందిరి. ప్రద్యుమ్నుడు, చారుదేష్ణుడు, సుధేష్ణుడు, శరభుడు, చారువు, చారుభద్రుడు, భద్రచారువు, చారువింధ్యుడును చారుమతిఅను కన్యయు రుక్మిణి యందు పుట్టిన కృష్ణుని సంతానము. (ఇక సత్యభామా సంతానము) సానువు, భానువు, అక్షుడు, రోహితుడు, మంత్రులును, జరాంధకుడు, తామ్రవక్షుడు, భౌమరి, జరంధముడు, వారి నలుగురు చెల్లెంద్రును గరుడధ్వజ విష్ణువైన కృష్ణునకు పుట్టిరి. వారిలో భానువు, భౌమరికా, తామ్రపర్ణి, జరంధమ–వీరందరు సత్యభామా సంతానము. జాంబవతీ సంతానమును వినుడు. భద్రుడు, భద్రగుప్తుడు, సప్తబాహువని పేరుగలవాడును, భద్రావతి, సంబోధిని యను కన్యలును–జాంబవతీ సంతానము. సంగ్రామజిత్తు, సహస్రజిత్తును, సుదేవికిని కృష్ణునికిని గలిగిన పుత్రులు. వృకుడు, వృకాశ్వుడు, వృకజిత్తు, వృజిని, సురాంగన, మిత్రబాహువు, సునీథుడును, నాగ్నజితికి గలిగిన కృష్ణుని సంతానము. ఈ విధముగ వేల పుత్రులు– అని తెలుసుకొనుడు. పదిలక్షలు వాసుదేవుని పుత్రులని చెప్పబడినది. రణవిశారదులు అయిన శూరులు పదునెనిమిది వేలు. ఇది జనార్దనుని (శ్రీకృష్ణుని) వంశము.

మహాత్ముడైన శౌనేయునకు నర్తకులచే పైకి తీసికొనిరాబడినదియు, మంచి నీతిలో సంగతయైనదియు అయిన బృహతి అను కన్య కలిగినది. ఆమె పుత్రులు ప్రసిద్ధులు, సభలో సుందరులు, వారు, అంగదుడు, కుముదుడు, శ్వేతుడు, శ్వేతఅను కన్య, అవ గాహుడు, చిత్రుడు, శూరుడు, చిత్రవరుడు, చిత్రవరుని సుతుడు చిత్రసేనుడు, కన్య చిత్రవతి. తుంబుడు, తుంబబాణుడు, జనస్తంబుని ఇరువురు పుత్రులు. ఉపాంగుని సుతులు ఇరువురు. వజ్రారుడు, క్షిప్రుడు. గవేషుని పుత్రులు ఇరువురు భూరీంద్ర సేనుడు, భూరియును. యుధిష్ఠిరుని యొక్క కన్య సుతనువని ప్రసిద్ధి గాంచినది. ఈ సుతనువునందు అశ్వసుతుడై వజ్రుడను మహాయశస్వి జన్మించెను. వజ్రునకు ప్రతి బాహువు, ఆతనికి సుచారువును పుత్రులు. కాశ్మసుపార్శ్వుని కనెను. సాంబతరస్విని కనెను. మహాత్ములైన యాదవులకు మూడు కోట్లమంది పుత్రులు. అరువది లక్షలమంది వీర్యవంతులైన మహా బలులు. వీరందరుకూడ దేవాంశలు కలవారై ఇచట జన్మించిరి. వారు మహాతేజో వంతులు. మహాతపస్వులై దేవాసుర యుద్ధమున చంపబడినవారు ఇచట మనుష్యులలో పుట్టినవారై, సర్వమానవులను బాధింతురు. వారిని పెరికివేయుటకై దేవతలు యాదవకులమున పుట్టిరి. మహాత్ములైన యాదవుల యొక్క కులములు పదునొకండు కలవు. కాని అన్నియు ఒకే వైష్ణవ కులమున ఏకమై మెలగును. వారికి ప్రమాణమునగాని, ప్రభుత్వమునగాని, విష్ణువే (కృష్ణుడే) నిలచి ఉండును. ఆతని ఆదేశమున ఉండు వారిచేత అందరు మానవులును కట్టుబడి ఉందురు. ఇది వృష్ణుల వంశము సంగ్రహ విస్తారములతో చెప్పబడినది. దీనిని కీర్తించినందువల్ల అభీప్సిత సిద్ధి కలుగును. (34)

విష్ణుమాహాత్మ్య శంభు కీర్తనము

మనుష్య ప్రకృతిలో ఉండు దేవతలను చెప్పెదవినుడు, సంకర్షణుడు, వాసుదేవుడు, ప్రద్యుమ్నుడు, సాంబుడు, అనిరుద్ధుడు–ఈ ఐదుగురు వంశ వీరులుగా చెప్పబడుదురు. సప్తర్షులు, కుబేరుడు, యక్షుడు, మణివరుడు. శాలకి బదరుడు, విద్వాంసుడైన ధన్వంతరి, నందినుడు, మహాదేవుడు, శాలంకాయనుడు, ఆదిదేవుడైన జిష్ణువును ఈ దేవతలతో పాటు దేవుడుగా చెప్పబడును.

ఋషులు ఇట్లు అనిరి :

విష్ణువు ఎందులకు జన్మించెను? ఆతని జన్మలు ఎన్ని? ఆ మహాత్ముని యొక్క రాబోవు జన్మలు ఎన్ని? యుగాంతములలో ఈ లోకమున బ్రహ్మ క్షేత్రములందు ఎందు మనుష్యులలో మాటిమాటికి జన్మించును. అని అడుగుచున్న మాకు సమాధానము

చెప్పుడు. శత్రు సంహారకుడై ధీశాలియైన కృష్ణుని (యవతార) దేహములచే చేయబడిన పనులు అన్నింటిని వినగోరుచున్నాము. ఓ సూతుడా! మొదటి నుండి చివరి వరకు ఆతడు చేసినపనులను, ఆతని జన్మలను, ఆతని ప్రకృతియు మాకు చెప్పుము. పుణ్య కారులైన అమరులచేత ఏ పుణ్యము అత్యంతముగా చేయబడినది? ఆయన దేవలోకమును వదిలి ఈ మర్త్యలోకమునకు ఎందులకు వచ్చెను? దేవ-మనుష్యులకు నాయకుడు, భూలోక, భువర్లోక, సువర్లోకములను సృష్టించినవాడు అయిన హరి తన దివ్యాత్మను మానుష దేహమున ఏల ప్రవేశింపచేసెను. మనుష్యులకు అతీతమైన దేవుడై, చక్రధారులలో శ్రేష్ఠుడైన విష్ణువు మనుష్యుల మనోమయమైన చక్రమును భ్రమింప చేయువాడు, మను ష్యులలోచేరు బుద్ధిగలవాడు ఎట్లు అయ్యెను? జగత్తులకు సార్వలౌకికమైన రక్షణమునుఇచ్చు ప్రభువు భూమినిచేరి గోపాలకత్వము ఏల అనుసరించెను? మహాభూతములను సృష్టించి, ధరించి భూతాత్ముడైన శ్రీగర్భుడు విష్ణువు భూమిపై చరించు ఒక స్త్రీచేత ఏల గర్భమున ధరింపబడెను? దేవతల కోరికచేత మూడు అడుగులతో స్వర్గ మర్త్య పాతాళములను ఆక్రమించి, జయించి ధర్మార్థకామ రూప త్రివర్గములను చేరు మార్గములను జగమునకు ఏర్పరచినవాడు మర్త్యలోకమున ఏల జన్మించెను. ప్రళయ కాలమున జగము అంతయు త్రావి తరువాత దృశ్యా దృశ్య మార్గముతో ఆ జగమును అంతయు జలమయ శరీరముగా ఏకార్ణవము చేసినవాడు భూమియందు ఏల జన్మించెను? పూర్వము పురాణాత్ముడై వరాహ రూపమును ధరించి మునిగిన భూమిని అంతయు పైకెత్తి జయించి దేవతలకు ఇచ్చిన దేవోత్తముడు భూమిలో ఏల జన్మించెను? ఆతడు తన శరీరము రెండు భాగములుగా (నరునిగా క్రిందుభాగమును, సింహముగా ఊర్ధ్వ భాగమును చేసి) నరసింహుడై మహాబల వంతుడై, పూర్వము రాక్షసుడైన హిరణ్యకశిపుని చంపెను. ఆతడు పూర్వము సంవర్త ప్రళయాగ్నికారి అయిన ఆ విభువు పాతాళ సముద్రగతుడై ఔర్వమను బడబాగ్ని రూపియై జలమయమైన హవిస్సును త్రాగివైచెను. ప్రతియుగమున ఆతనిని వేయి (అనంత) పాద ములుగల దేవునిగను, వేయి కిరణములుకల సూర్యునిగను, వేయిశిరస్సులుగల దేవునిగను పిలుతురు. ఆతని నాభిఅను అరణి నుండి పుట్టినది పితామహుడు అయిన బ్రహ్మయొక్క గృహమైన కమలము లోకము అంతయు ఏకార్ణవము కాగా ఆ కమలము బురద నుండి పుట్టినది. ఆ మహావిష్ణువు నాభి జ్ఞానాగ్నియైన బ్రహ్మను పుట్టించినది. ఆతడు తన దేహ మున సర్వాయుధములు ధరించి సర్వదేవ మయముగాచేసి తారకామయమైన రణమున రాక్షసులను అందరిని చంపెను. అతడు గరుడ వాహనుడై మదించిన కాలనేమిని చంపెను. ఆతడు పాలసముద్రము యొక్క ఉత్తరాంశమున మహాంధకారమున శాశ్వతయోగమును వహించి పడుకొనును. పూర్వము అరణి అగ్నిని గర్భమున ధరించినట్లు పూర్వము అదితి

తపో అతిశయమున దివ్యమైన గర్భము (వామన విష్ణువు) ను ధరించెను. ఆ గర్భమును అవమా నించుటవలన రాక్షస గణముచే నిరోధింపబడిన ఇంద్రునికూడ మిక్కిలి గొప్ప వానిగా చేసెను. వాయువు లోకములోని రాక్షస స్థానములను మరిచి రాక్షసులను సముద్ర జలమున పరుండువారినిగా చేసినపుడు ఆదిదేవుడైన విష్ణువు దేవతలను స్వర్గవాసులుగా చేసి వారికి అధిపతినిగా ఇంద్రుని చేసెను. ఆతడు గార్హపత్యవిధితోను, అన్వాహార్య కర్మ తోను ఆ హవనీయాగ్నిని, కుశస్రవమైన వేదిని, ప్రోక్షణీయమును, స్రువమును, అట్లే అవభృథమునుచేసి, యజ్ఞమున హవ్యభాగములను ఇచ్చువానినిగా ఇట మూడింటిని చేసెను. ఆతడు యజ్ఞ కర్మయందు భోగముకొఱకై యజ్ఞ విధితో చేయబడు యజ్ఞమున దేవతలను హవ్యములను స్వీకరించువానిగాను, పితరులను కవ్యమును స్వీకరించువారిని గాను చేసెను. యూపములను, సమిధలను, స్రువములను, సోమమును, పవిత్రమును (దర్భను), పరిధులను, యజ్ఞ సంబంధ ద్రవ్యములను, యజ్ఞసంబంధులైన అగ్నులను, సదస్సులను, యజమానులను, అశ్వమేధములను, క్రతుశ్రేష్టములను, పారమేష్ఠ్యమైన ఏ కర్మచే పూర్వము తాను ప్రకాశించెనో ఆ కర్మలనుకూడ సృష్టించెను. యుగమునకు తగినట్లుగా ముల్లోకములను వరుసగా నిర్మించెను. క్షణములు, నిమేషములు, కాష్ఠలు, కలలు, భూత, భవిష్యత్ వర్తమాన కాలములు మూడును. ముహూర్తములు, తిథులు, మాసములు, దినములు, సంవత్సరములును, ఋతువులు, కాలయోగములు, త్రివిధము లైన ప్రమాణములును, ఆయువు, క్షేత్రములు, ఉపచయము, లక్షణము, రూపసౌష్ఠవమును, మేధ, విత్తము, శౌర్యము, శాస్త్రపారణము, త్రివర్ణములు (జాతులు) మూడు లోకములు, మూడు విద్యలు, మూడు మాయలు, మూడు గుణములు ఇవి అన్నియు ఆ మహావిష్ణువుచే సృష్టింపబడెను. అత్యంత కర్మియైన సర్వభూతగణాత్ముడైన ఆ మహావిష్ణువుచే లోకములు సురలు సర్వభూతగణములును సృష్టింపబడినవి.

ఆ మహావిష్ణువు, ఇంద్రియపూర్వమైన యోగముతో రమించువాడు. గతాగతములు తెలిసినవాడు, వివిధములకు అన్నింటికి, అంతట ఈశ్వరుడు. ఆతడు ధర్మయుక్తులకు గతి (ప్రాప్తి స్థానము). పాపకర్ములకు అగతి (పొందనలవి గానివాడు). చాతుర్వర్ణ్యమునకు కారణుడు. చాతుర్వర్ణ్యమును రక్షించువాడు. చాతుర్విద్యలను తెలిసినవాడు, చతురాశ్ర మములకు ఆశ్రయుడు. దిక్కులయొక్క అంతరము, నభస్సు (ఆకాశము), భూమి, జలము, వాయువు, విభావసువు (అగ్ని), చంద్ర సూర్యులు ఇరువురు, జ్యోతిర్యుగేశుడు, రాత్రిచరుడు, పరదేవుడు, పరంతపుడు, తపస్సునకు పరుడు, పరముడు, పరమాత్మవంతుడు, ఆదిత్యునకు ఆదిదేవుడు, దైత్యాంతకుడైన విభువు యుగాంతములలో అంతకుడు, లోకాంతకునకు

అంతకుడు. లోకసేతువులకు సేతువు, మేధ్య (పవిత్ర) కర్మలకు మేధ్యుడు. వేదవేత్తలకు తెలియతగినవాడు, ప్రభవాత్మలకు ప్రభువు, భూతములకు సోమభూతుడు, అగ్నితేజస్కులకు అగ్నిభూతుడు, మనుష్యులకు మనోభూతుడు, తపస్వులకు తపోభూతుడు, నయతృప్తులకు వినయము, తేజస్వులకు తేజస్వి, విగ్రహములకు విగ్రహము.గతిమంతులకు గతి. ఆకాశ కారణమైన (ఆకాశము నుండి పుట్టిన) వాయువు, వాయుప్రాణమైన (వాయువు నుండి పుట్టిన) అగ్ని, అగ్ని ప్రాణమైన (అగ్ని నుండి-తేజము నుండి-పుట్టిన) పగలు, అగ్నికి ప్రాణమైనవాడు మధుసూదనుడు (విష్ణువు). రసము రక్తమైనది. రసము వల్ల మాంసము ఏర్పడును. మాంసమువల్ల మేధస్సు పుట్టును. మేధస్సునుండి ఎముక, ఎముకచేత మజ్జ, మజ్జచే శుక్రము(వీర్యము) పుట్టును. శుక్రము నుండి రసమూలమైన కర్మచే (మిథున కర్మచే)గర్భము పుట్టును. అచటకూడ, మొదట జలములు అవి సౌమ్యములై రాశి అన బడును. గర్భోష్మవలన పుట్టినది రెండవరాశి అనబడును. (పురుషుని) శుక్రము సోమా త్మకము (చంద్రాత్మకము). స్త్రీ ఆర్తవము (రజస్సు లేక శోణితము) అగ్న్యాత్మకముగా తెలియవలె. ఈ చంద్రాగ్నులను భావములు వీర్యమున రసమును అనుసరించి వెళ్లునవి (ఆనంద రసమునను సరించి వెళ్లునవి) అని తెలియవలె. శుక్రము కఫవర్గమునకు చెందును. శోణతము పిత్తవర్గమునకు చెందును. కఫమునకు హృదయము స్థానము. పిత్తమునకు నాభిస్థానము. దేహము యొక్క మధ్యన హృదయము. అది మనస్సునకు స్థానము అనబడినది. నాభికోష్ఠాంతరమున దేవుడైన అగ్ని ఉండును. మనస్సు బ్రహ్మ అని తెలియవలెను. కఫము సోముడు అని తెలియవలెను, పిత్తము అగ్ని. ఈ ఇరువురు గలిసి అగ్నిసోమాత్మకమైన జగము. ఈ విధముగ ఏర్పడిన గర్భము మేఘమువలె ఉండును. పరమాత్మచే సంగతమైన వాయువు అందు ప్రవేశము చేయును. ఆ వాయువు ఐదువిధముల శరీరమునందున్నదై శరీరమును వృద్ధి చెందించును. అవి ప్రాణ, అపానము, సమానము, ఉదానము, వ్యానము-అనునవి. ప్రాణము ఈ శరీరము యొక్క పరమాత్మను వర్ధిల్ల చేయుచు మారును. అపానము పశ్చిమ శరీరమున ఉండును. ఉదానము ఊర్ధ్వశరీరమున ఉండును. వ్యానము శరీరమును నశింపజేయును (శరీరమున వ్యాపించును). సమాన ముగా ఏర్పడి సర్వసంధులయందు సమముగా ఉండును. తరువాత ఆతనికి భూతావాప్తి (పంచ భూత ప్రాప్తి) ఇంద్రియములందు శబ్దాది గుణ రూపమున గోచరము అగును. పృథివి, వాయువు, ఆకాశము, జలము, అగ్ని అయిదవ భూతము. సర్వేంద్రియములును ఆ శరీరిని ప్రవేశించినవై తమ తమ యోగమును చేయును. పార్థివముగా ఆ దేహమును చెప్పుదురు. వాయువును ప్రాణరూపునిగా చెప్పుదురు. చెవిరంధ్రములు ఆకాశభూత

రూపములుగా చెప్పుదురు. జలముయొక్క ఆ స్రావమైన జిహ్వా జలభూత రూపము. చక్షుష్విత (కన్నులు కలిగియుండుట) తేజో భూత రూపము. జ్యోత్స్నా (వెన్నెల) రూపము కూడ. ఇవి పంచభూత నామములతో చెప్పబడినవి. సంగ్రామ (యుద్ధ) విషయములు ఆ ప్రాణి వ్యక్తియొక్క బల పరాక్రమమువల్ల ఏర్పడినవి అని ఈ విధముగా సమస్త లోక ములను సృజించుచు ఆ సనాతనుడైన పురుషుడు (విష్ణువు) ఈ మర్త్య లోకమున ఏల నరత్వమును పొందెను? ఓ బుద్ధిశాలీ! ఇది మా సంశయము. ఇది గొప్ప ఆశ్చర్యము. గతిమంతులకు గతిరూపుడైన భగవంతుడు మానుష శరీరమును ఏల పొందెను? విష్ణువు యొక్క ఆశ్చర్యములైన కర్మలను వరుసగా వినగోరుచున్నాము. విష్ణువు పరమును తెలి యును–అని దేవతలచే చెప్పబడుచున్నాడు. ఓ మహామతీ! విష్ణువు యొక్క ఆశ్చర్యమైన జననమును చెప్పుము. ఈ ఆశ్చర్యకరమైన సుఖావహమైన ఆఖ్యానము చెప్పబడుగాక. ప్రఖ్యాతమైన బలవీర్యముల మహాత్ముడైన విష్ణువు యొక్క జన్మలు (అవతారములు) చెప్పబడుగాక–కర్మతో ఆశ్చర్యభూతుడైన విష్ణువు యొక్క సత్త్వము ఇప్పుడు తెలుపబడును.

సూతుడు ఇట్లు అనెను :

మహాతపస్వియైన ఆ భగవంతుడు మనుష్యులయందు ఎట్లు జనించెనో ఆ మహాత్ముని పుట్టుకను నేను చెప్పెదను. సప్తతపుడని చెప్పబడిన ఆతడు యుగాంతములలో దేవ కార్యార్థ సిద్ధికై భృగు శాపమున మనుష్య రూపమున జన్మించును. ఆ మహావిష్ణువుయొక్క దివ్య తనువును చెప్పెద వినుడు. యుగధర్మము మారగా, కాలము శిథిలముగాగా ప్రభువైన విష్ణువు ధర్మ వ్యవస్థాపనమును చేయుటకై దేవాసుర కృతమైన భృగుశాపకారణముగ ఈ లోకమున మనుష్య రూపమున జన్మించును.

ఋషులు ఇట్లు అనిరి :

ఆ మహావిష్ణువు దేవాసురులకుగాను అధ్యాహారమును (ఊహా విషయమును) పొంద వలసివచ్చెను. దేవాసురుల యుద్ధము ఎట్లు సంభవించినదో మేము తెలియగోరుచున్నాము.

సూతుడు ఇట్లు అనెను :

దేవాసుర యుద్ధము ఎట్లు జరిగెనో చెప్పెద వినుడు. పూర్వము హిరణ్యకశిపుడను దితి పుత్రుడు ముల్లోకములను ప్రకాశించుచుండెను. క్రమముగా ఆ లోకత్రయ రాజ్యము బలిచే జయింపబడినది. వారిలో దేవతలకు అసురులతో మిక్కిలి సఖ్యముండెను. జగమంతయు ఈ విధముగా సంకీర్ణముగాఉండి పది యుగములు అవ్యాహతముగా (ఏ బాధలేక) గడచినవి. దేవాసురులు అందరు ఆ ఇరువురి (బలి హిరణ్యకశిపుల) ఆజ్ఞ

యందు నిలచియుండిరి. దాయ భాగనిమిత్తముగా వారి మధ్య బలిష్ఠమై మిక్కిలి భయంకరమైన వివాదము జరిగెను. అది ఘోర క్షయమును కలుగజేయు గొప్ప వివాద మయ్యెను. ఆ దేవ రాక్షసులకు దాయభాగ కారణముగ అనేక యుద్ధములు జరిగినవి. ఈ వారాహకల్పమున అవి షండా మార్కోత్తరములుగా పండ్రెండుగా ఉండును. సంగ్రహ ముగా వారిని పేరులతో చెప్పెదనువినుడు. మొదటిది నారసింహము. రెండవది వామ నము, మూడవది వారాహము, నాలుగవది అమృత మంథనము, ఐదవది మిక్కిలి భయంకరమైన తారకా మయము, ఆఱవది ఆడీబకము, ఏడవది త్రైపురము. ఎనిమిదవది అంధకారము, తొమ్మిదవది ధ్వజము అనబడినది, పదవది వార్తము. తరువాత పదకొండ వది హాలాహలము. తరువాత పండ్రెండవది ఘోరకోలాహలము.

హిరణ్యకశిపుడను దైత్యుడు నరసింహునిచే చంపబడెను. వామనునిచే త్రైలోక్యా క్రమణము చేయగా బలి బద్ధుడయ్యెను. మహాబలుడు, మహాసత్త్వుడునై యుద్ధములలో ఓటమి ఎఱుగని హిరణ్యాక్షుడు వరాహవిష్ణువుచే సముద్రము నుండి భూమి ఉద్ధరింప బడినపుడు దేవతలచే ప్రతివాద ద్వంద్వ యుద్ధమున చంపబడెను. ప్రహ్లాదుడు అమృత మథన సమయమున యుద్ధమున ఇంద్రునిచే జయింపబడెను. ప్రహ్లాదపుత్రుడైన విరో చనుడు నిత్యము ఇంద్రవధకై పూనుకొనుచుండెను. ఆ విరోచనుడు ఇంద్రుని చేతనే పరాక్రమించి తారకామయ యుద్ధమున చంపబడెను. శివునివల్ల విశేష అస్త్రాదులచే వధింపబడకుండునట్లుగా వరము పొందిన సంజభుడు ఆఱవ యుద్ధమున ఇంద్రుని ఆవేశించిన విష్ణువుతో చంపబడెను. దేవతలలో త్రిదైవతమైన పురమును రక్షించుకొనుటకు అశక్తులైన సమస్తదానవులు, త్రిపురములును త్ర్యంబకునిచే (శివునిచే) చంపబడిరి. ఎనిమిదవ యుద్ధమున అసురులును, అంధకారకులు, రాక్షసులును దేవ మనుష్యులను జయించిన పితరులతో కలసి చుట్టబడిన దానవులను, విష్ణు సహాయముగల మహేంద్రు నిచే పూర్తిగా చంపబడిరి. ధ్వజమున లక్ష్యము ఉంచి విప్రవర్తియైన మహాభుజుడు ధ్వజుడు మాయతో కప్పబడి యుద్ధము చేయించుచు, మహేంద్రునిచే చంపబడెను. గుమిగూడిన దైత్యదానవులు అందరిని రజి కోలాహల యుద్ధమున దేవతలతో పరివృతుడై జయించెను. షండామార్కులు దేవతలచే యజ్ఞామృతముతో జయింపబడిరి. ఇవి దేవాసురు లకు సంబం ధించిన పండ్రెండు యుద్ధములు. ఇవి దేవాసుర క్షయకరములు ప్రజలకు అశివమును గూర్చునవి.

హిరణ్యకశిపుడు రాజై పదికోట్ల యేండ్లు ప్రకాశించెను. అట్లే లక్ష ఎనుబది వేల డెబ్బది రెండు ఏండ్లు ముల్లోకములకు ఈశ్వరుడు అయ్యెను. వరుస క్రమములో దానికి

రాజై బలి పదికోట్ల (కోటి) అఱువదివేల ముప్పదిలక్షలయేండ్లు పాలించెను. బలి రాజ్యాధి కార మున్నంత కాలమే అసురులతోబాటు ప్రహ్లాదునిచే రాజ్యము పాలింపబడెను.

మహౌజస్కులైన హిరణ్యకశిపుడు, బలి, ప్రహ్లాదులు అసురులకు ముప్వురు ఇంద్రు లుగా ప్రసిద్ధిచెందిరి. ఈ రాజ్యము అంతయు పదియుగములు దైత్యులయందు నిలిచి ఉండెనట. తరువాత పూర్వము ఈ త్రైలోక్య రాష్ట్రమంతయు పది యుగములు శత్రు రహితముగా మహేంద్రునిచే పాలింపబడెను. ప్రహ్లాదుని ఈ త్రైలోక్యరాజ్యము కాలపు మార్పువలన క్రమముగా ఇంద్రునకు రాగా, ఇంద్రుడు యజ్ఞమున అసురులను వదిలెను. అట్లే యజ్ఞమున అసురులను వదిలి దేవతలు వచ్చిరి. ఆ విధముగ యజ్ఞమున దేవతలు పోగా, అసురులు శుక్రునితో ఇట్లనిరి. చాలుచాలు! రాష్ట్రమును కోరు మనలను వదిలి దేవతలు మరల యజ్ఞమునకు చేరిరి. ఇపుడు మేము ఇచట నిలువలేకున్నాము. పాతాళ మున ప్రవేశింతుము అని ఈ విధముగ చెప్పగనే దుఃఖితుడై శుక్రుడు–ఓ అసురులారా! భయము చెందకుడు. నా తేజముచే మిమ్ములను నిలిపెదను–అని ఓదార్చుచు, వృష్టి, ఓషధులు, భూమి రెండు విధములైన ధనము–సమస్తమును నాయందు ఉన్నవి. దీనిలో నాలుగవ పాలుమాత్రమే దేవతలందు ఉన్నది. దానిని అంతయు నేనే ధరింతును. కావున దానిని మీకిత్తును. తరువాత ధీశాలియైన శుక్రునిచే నిలుపబడిన దేవ, అసురులను చూచి అపుడు వారు విచలితులై విజయేచ్ఛచే ఆలోచించిరి. 'ఇదిగో ఈ శుక్రుడు మన సర్వమును బలవంతముగా మరల్చుచున్నాడు. మంచిదే! పోవుదము, క్షీణించినవారిని ఓదార్చుచు ఉండకుడు, బలాత్కారముగా చంపి మిగిలినవారిని పాతాళమునకు చేర్చెదము' అని చెప్పెను. అంత, దేవతలు చక్కగా విజృంభించి దానవులను వెంబడించి చంపిరి. ఆ విధముగ చంపబడుచునే ఆ అసురులు శుక్రుని కడకేపారిరి. అంత, యుద్ధమున దేవతలచే అస్త్రములచేత క్షతులై, ఆర్తులైన వారును దేవతల నుండి వేగముగా పారి వచ్చిన వారును అయిన దితిసుతులైన రాక్షసులను శుక్రుడు చూచెను. అట్లే శుక్రుడు అచట నిలిచి ఉన్న దేవతలను కూడ చూచెను. పూర్వము దేవతలు చేసినది అంతయు స్మరించుచు వారితో ఇట్లనెను. వామనునిచే మూడడుగులతో ముల్లోకములు జయింప బడినవి. బలి బద్ధుడు అయ్యెను, జంభుడు చంపబడెను. విరోచనుడు కూడ చంపబడెను. పంద్రెండు గొప్ప సంగ్రా మములలో దేవతలచే నా ఉపాయములతో అనేకులు చంపబడిరి. ముఖ్యముగా చివరి యుద్ధ ములలో కొద్దిగా మీరు మిగిలినారు. మీకు నేను స్వయముగా నీతిని చెప్పెదను. కొంత కాలము ప్రతీక్షింపుడు. మీ విజయమునకై మంత్రముల కొఱకు మహాదేవుడైన శివుని కడకు పోవుదును. బృహస్పతిహోతయై మంత్రములచేత అగ్నిని సంతోషపెట్టును. అందు

వలన నేను మంత్రముల కొఱకై నీలలోహితుడైన శివుని కడకు పోవుదును. మరల ఇటకు వచ్చి మిమ్ములను అనుగ్రహింతును. మీరు కూడ నారచీరలు ధరించి వనమున తపము ఆచరింపుడు. నేను వచ్చునంత వరకు దేవతలు మిమ్ములను వధింపలేరు. దేవుడైన మహేశ్వరునినుండి ఎదురులేని మంత్రములను పొందెదము. తరువాత మరల దేవతలతో యుద్ధము చేసెదము. విజయమును పొందెదము అని ఈ విధముగా సంభాషించు కొన్న అసురులు దేవతలతో ఇట్లనిరి. మేము అందరము మా వాదములను (అస్త్రములను) వదిలితిమి. మీరు లోకములను ఆక్రమించుడు. మేము నారచీరలు ధరించి వనమున తపము ఆచరించెదము–అని పల్కిన ప్రహ్లాదుని ఈ మాటలను విని–అవి సత్య వాక్కులే అని భావించి దేవతలు (యుద్ధము నుండి)మరలిరి. జ్వరము లేనివారైరి. సంతసించిరి. రాక్షసులు ఆయుధములు పడవేయగా తాము ఎచట నుండి వచ్చిరో అచటికి ఏగిరి.

తరువాత, "శుక్రుడు ఇంద్రునితో బాటు సమస్త దేవతలు నా తండ్రి ఆశ్రమమున ఉన్నవారు. ఉత్సాహము కోల్పోయినను కార్యసాధకులై తపోయుక్తులై కొంతకాలము శివుని ఉపాసింపుడు" – అని రాక్షసులతో అనెను. శుక్రుడు రాక్షసులను పై విధముగా చేయుమని చెప్పి, మహాదేవుడగు శివుని కడకు పోయి నమస్కరించి జగత్కారణుడైన ఆ ఈశ్వరునితో "దేవతల పరాభవము కొరకును, రాక్షసుల అభయము కొఱకును ఓ దేవా! బృహస్పతికడ లేని మహామంత్రములను పొందగోరుచున్నాను"–అని అనెను. అట్లు అనగనే, శివుడు ఓ బ్రాహ్మణా! మంత్రములను కోరుచున్నావా! అట్లైన నేను చెప్పిన వ్రతమును బ్రహ్మచారివై ఏకాగ్ర మనస్సుతో ఆచరింపుము. నిండు వేయేండ్లు తలక్రిందుగా చేసి కండ ధూమమునకు ఎదురుగా తలక్రిందుగా ఉంచినవాడవై ఆ ధూమమును ఉపాసించినచో నీకు భద్రమగును, నా వల్ల మంత్రములను పొందగలవు అని అనెను. అనగనే మహాతపస్వియైన శుక్రుడు దేవదేవుడైన శివుని పాదములను స్పృశించి అట్లే చేసెదనని ప్రతిజ్ఞచేసి ఓ ప్రభూ! మీరు చెప్పిన విధముగనే శేష వ్రతమును చరింతును అని అనెను. ఆ తరువాత శివుడు శుక్రుడు తలక్రిందుగా నుంచి ధూమమును ఉపాసించుటకు వీలుగా ఒక పొగచిమ్ము కుండను ధరించువానిని నియోగించెను. అసురుల హితమునకై శుక్రుడు వెడలి మంత్రమును పొందుటకై బ్రహ్మచర్యమున ఉండగా ఈశ్వరుడు అచట ఉండెను. అది తెలిసి, అంతకు కొద్ది పూర్వమే అసురులచే తపమునకై రాజ్యము వదులుటను కూడ తెలిసి, అది అవకాశముగా తీసికొని కోపోద్రిక్తులైన దేవతలు అందరు బృహస్పతిని ముందిడుకొని వాడియైన ఆయుధములను తీసికొని అసురులపై దాడిచేసిరి. రాక్షసగణములు ఆయుధములు ధరించి అకస్మాత్తుగా దాడిచేసిన దేవతలను చూచి, ఒక్కసారి ఎగిరిపడి

తరువాత భయభీతులైరి. అసురులు శస్త్రములు పడవేయుట చేత దేవతలకు జయము లభించినది. అసురుల ఆచార్యుడైన శుక్రుడు తపోవ్రతమున ఉన్నాడు. ఇట్టి సమయమున అసురులను చంపుట ధర్మవిరుద్ధమన్న నియమమునుకూడ పాటింపక, ఆ దేవతలు రాక్షసులను చంపపూనిరి. "ఆచార్యుడు దగ్గరలేనివారైనను మీకు భద్రము కలుగును అని శుక్రుడు అనుటచే విశ్వాసము కలవారమై నార చీరలు ధరించి నిష్క్రియులమై నిష్పరిగ్రహులమై (దానాదులు స్వీకరింపని వారమై) తపమునందు ఉంటిమి. ఏ విధముగ నైనను రణమున దేవతలను జయింపజాలము. అశుద్ధమైన ఆపదతో శుక్రుని తల్లిని శరణు పొందెదము. గురువు వచ్చునందాక ఈ వ్యాపించిన ఆపదను ఆమెకు తెలిపెదము. శుక్రుడు మరలిరాగానే యుద్ధమున దేవతలతో యుద్ధము చేయుదుము అని ఇట్లు అనుకొని దేవతలతో యుద్ధము చేయుటకు భయపడి అసురులు శుక్రమాతను శరణుపొందిరి. అపుడు భయపడి, అభయమును కోరిన అసురులకు శుక్రమాత దేవి 'ఓ దానవులారా! భయపడకుడు, భయపడకుడు భయము వీడుడు' అని అభయము ఇచ్చినది. మీరు నా సమీపమున ఉండుడు. మీకు భయము ఉండదు అనిఉద్బోధించెను. ఆ విధముగ భయము వల్ల దేవికడకు వచ్చినవారిని అయినను అసురులను బలాబలములను విచారింపక బలాత్కారముగ వెంబడించి దాడిసలిపిరి. అపుడు దేవతలచే భయపడి వధింపబడుచున్న అసురులను చూచి, శుక్రమాత దేవి కోపించి "ఈ దేవతలకు ఇంద్రుడు లేకుండగాచేతు" ను అనెను. తరువాత వెంటనే ఇంద్రుని స్తంభింపజేసి ఆతనికి ఎదురుగా నడచెను. అంత దేవతలు యూపస్తంభమువలె ఇంద్రుని స్తంభితునిగా చూచి, ఇక ఇంద్రుడు ఆమెచే వశీకృతుడు అయ్యెనని కూడ తెలిసి, పారిపోయిరి. అట్లు దేవతా సంఘములు పారిపోగా విష్ణువు ఇంద్రునితో–తనలో ప్రవేశింపుడు అనియు, ఇంద్రునకు దేవేంద్రత్వ మును లభించునట్లు చేతుననియు అనెను. అట్లు అనగనే, ఇంద్రుడు విష్ణువులో ప్రవేశించెను. ఆ విధముగ విష్ణువుతో రక్షింప బడినట్లుగా ఇంద్రుని చూచి శుక్రమాతదేవి కోపించి, ఓ ఇంద్రా! "ఇదిగో నేను విష్ణువుతో కూడ సర్వభూతములు చూచుచుండగా నిన్ను దహింతును. నా తపోబలమును చూడుము"–అనెను. ఆ దేవి ప్రభావమున తిరస్కరింపబడిన ఇంద్ర విష్ణువులు ఇరువురు మాటాడుకొనిరి. ఏ విధముగా మనము ఇరువురము ఈమె నుండి విడివడెదము అని విష్ణువు అనెను. "ఓ ప్రభూ! ఈమె మనసు దహింపకముందే ఈమెను చంపుము, ఈమెచే విశేషముగ నేనును నీవును తిరస్కరింపబడితిమి. కావున ఆలసింప కుము అని ఇంద్రుడు అనెను. తరువాత విష్ణువు బాగుగా ఆలోచించి స్త్రీ వధను జేయుటకే పూనుకొనెను. వెంటనే ఆపన్నుడైన ప్రభువు చక్రమును ధ్యానించెను. వేగిరపడి ఆదేవి

చేయదలచిన క్రౌర్యమును తెలిసి, శీఘ్రకారియు, సురారుల చంపువాడును, మాధవుడైన విష్ణువు కోపించి చక్రాస్త్రమును ప్రయోగించి ఆమె శిరమును ఖండించెను. ఆ ఘోరమైన స్త్రీ వధనుచూచి ఈశ్వరుడైన భృగువు కోపించెను. భార్యావధ కారణమున విష్ణువు శపింపబడెను. ధర్మములను తెలిసిన విష్ణువే వధింపదగని స్త్రీని వధించినందున, ఏడు మారులు మనుష్యులలో జన్మను పొందగలడని శపింపబడెను. తరువాత ఆ అభిశాపముచే ధర్మము నష్టముకాగా విష్ణువు లోకహితము కొఱకు భూలోకమున మరలమరల పుట్టెను. ఆ విధముగ విష్ణువును శపించి, భృగువు స్వయముగా ఆ శిరమును తెచ్చి మొండెమునకు అతికించి జలము తీసికొని ఇట్లనెను. ఓ సత్య స్వరూపిణివైన దేవీ! ఇదిగో విష్ణువుచే చంపబడిన నిన్ను నేను బ్రతికించుచున్నాను. నేను ధర్మము అంతయు ఆచరించినచో లేదా తెలిసినచో, ఆ సత్యముతో నేను పలికినచో జీవింపుము. సత్యముచే పలుకబడినదైన ఆతని దేవి అపుడు సంజీవితురాలైనది. అపుడు చల్లని నీళ్లతో ప్రోక్షణముచేసి, భృగువు దేవిని జీవింపుము" అనెను. ఆ తరువాత సర్వ భూతములు ఆమెను నిద్ర నుండి లేచిన దానిగా చూచినవి. దిక్కులు బాగుబాగని అదృశ్యముగ సాధువాదములను పలికెను. భృగువుచే సంజీవితురాలైన ఆమెను చూచిన సర్వ భూతములకు అది ఒక అద్భుతమువలె అయ్యెను. ఆశ్చర్యపడకుండగనే భృగువుచే సంజీవితురాలు అయిన (భృగు)పత్నిని చూచిన తరువాత ఇంద్రుడు శుక్రుని భయము వలన సుఖము పొందలేదు.

తరువాత ఇంద్రుడు ప్రజాగరమున (నిద్రలేమిలో) ఉండెను. మతిమంతుడైన ఇంద్రుడు జయంతి అను తన స్వంత కూతురుతో ఇట్లు అనెను. ఇదిగో ఈ శుక్రుడు ఇంద్ర నాశమునకై దారుణమైన తపము చేయుచున్నాడు. ఆ ధైర్యవంతుడైన శుక్రునిచేత ఓ పుత్రి! నేను మిక్కిలి వ్యాకులునిగా చేయబడితిని. కావున నీవు ఆతని కడకువెళ్లుము. శ్రమను పోగొట్టునవియు, మనస్సునకు అనుకూలమైనట్టివియు అయిన ఆ మంచి ఉపరాచరములచే ఏ ఏమరుపాటు లేక ఆతనిని సంభావించి సేవింపుము. ఇంద్రదుహిత అయిన ఆ దేవి జయంతి, శుభచారిణియై, యోగయుక్తమైన ధ్యానము గలిగి, శమగుణము గలిగి, దుర్బలుడైనను ధృతిమంతుడైన ఆ శుక్రుని ఎడ తన తండ్రి చెప్పినట్లెల్ల చేసినది. అనుకూలమై చక్కనైన మాటలతో స్తుతించినది. సమయానుకూలముగ ఒళ్లు పట్టుటచేతను సుఖమును కలుగచేయుచు, సేవించుచు పెక్కు ఏండ్లు అనుకూలురాలై ఉండెను.

ఘోరమై వేయేండ్లు జరుగునది అయిన ధూమవ్రతము పూర్తికాగా సంతుష్టుడైన శివుడు వరముతో అనుగ్రహించెను. నీ ఒక్కనిచేతనే ఈ తపము చేయబడినది అని ఈ విధముగా పలుకుచు "ఇతరులు ఎవ్వరును చేయలేదు. కావున నీవు తపముతో, బుద్ధితో,

వైదిక పాండిత్యముతో, బలముతో, తేజముతోను దేవతలను అందరిని జయింతువు. ఓ భృగు నందనా! శుక్రా! బ్రహ్మీభూతుడవైన వాడా! నాకు ఉన్నది అంతయు యజ్ఞములకును, ఉపనిషత్తులకును సంబంధించి, సాంగమై సరహస్యమైనది అంతయు ఆద్యంతముగా నీకు ప్రతిభాసించును. (బుద్ధి గోచరము అగును) మరొకరికి ఎవ్వరికిని కాదు. నీవు సర్వులను తిరస్కరించు బ్రాహ్మణ శ్రేష్ఠుడవు కాగలవు". ఈ విధముగా శుక్రునకు వరములు ఒసగి మరల మరల అజేయత్వమును (ఎవ్వరికిని జయింప నలవికానితనమును), ధనేశత్వ మును, అవధ్యత్వమును (వధింప అలవికానితనమును) ఇచ్చెను. ఈ వరములను పొంది శుక్రుడు సంతోషముతో పులకరించినవాడు అయ్యెను. సంతోషము వలన ఆతనికి బుద్ధిలో మహేశ్వర రూపమైన దేవ స్తోత్రము ప్రాదుర్భవించినది. అపుడు తిర్యక్ స్థితుడై అడ్డముగా భూమిపై పడి నీల లోహితుడైన శివుని స్తుతించెను.

శుక్రాచార్యులు చేసిన శివ త్రిశతి నామ స్తుతి :

కాలకూట విషపు నలుపు కంఠముకల వానికి నమస్కారము, సురనుత్రావు వానికి నమస్కారము, మంచి కాంతి కలవానికి నమః, విరహాణునకు నమః, లోపునకు నమః, వత్సరరూపునకు నమః, జగత్పతికి నమః, జటాజూటము కలవానికి నమః, పైకి పోవు వెంట్రుకలు కలవానికి నమః, గుఱ్ఱపు రూపునకు నమః, అన్నింటికిని సాధకతముడైన వానికి నమః, సంస్కృత స్వరూపునకు నమః, మంచి తీర్థ స్వరూపునకు నమః, దేవతలకు సుదేవుడైనవానికి నమః, వేగస్వరూపునకు నమః, పాగా కలవానికి నమః, మంచి ముఖము కలవానికి నమః, వేయి కన్నులు కలవానికి నమః, నేచనము చేయువానికి నమః, అగ్ని రేతస్సుగా గలవానికి నమః, రుద్రునకు నమః, తపోరూపునకు నమః, నారచీర వస్త్రముగా గలవానికి నమః, హ్రస్వ స్వరూపునకు నమః, విదిల్చిన తలవెంట్రుకలు గలవానికి నమః, సేనను నడిపించువానికి నమః, ఎఱ్ఱని రూపముగలవానికి నమః, కవియైనవానికి నమః, రాజులలో పెద్ద అయిన వానికి నమః, తక్షకుడు ఆటవస్తువుగా కలవానికి నమః, కైలాసగిరి యందు శయనించువానికి నమః, సూర్యుడు నేత్రమైన వానికి నమః, యతిస్వరూపునకు నమః, నేరేడుపండు వంటి వానికి జంబూ ఖండ భూస్వరూపునకు నమః, వేయి (అనంత) బాహువులు కలవానికి నమః, వేయి (అనంత) స్వచ్ఛ నేత్రములు కలవానికి నమః, వేయి (అనంతమైన) పొట్టలు కలవానికి నమః, వేయి (అనంత పాదములు కలవానికి నమః, వేయి (అనంత) శిరములు కలవానికి నమః, పెక్కు రూపములు కలవానికి నమః, బ్రహ్మ స్వరూపునకు నమః, భవునకు అంతయు తానే అయిన వానికి నమః, విశ్వస్వరూపునకు నమః, తెల్లగా ఉన్న వానికి నమః, ప్రాణి శరీరము అనుపురమును

ఆత్మరూపుడై పాలించువానికి నమః, అమ్ములపొదిని ధరించినవానికి నమః, కవచమును ధరించిన వానికి నమః, సూక్ష్మ స్వరూపునకు నమస్కారము, సర్వవ్యాపారములను క్షయింప చేయు వానికి నమః, తామ్ర స్వరూపునకు నమః, భయంకరరూపునకు నమః, ఉగ్ర స్వరూపునకు నమః, మంగళ స్వరూపునకు నమః, బూడిద వర్ణునకు నమః, పిశంగవర్ణునకు నమః, పింగళ వర్ణునకు నమః, అరుణవర్ణునకు నమః, మహాదేవునకు నమః, ప్రళయ మందు భూతములను హింసించువానికి నమః, విశ్వరూపుడు అయ్యును శివస్వరూపుడైన వానికి నమః, హిరణ్య రూపునకు నమః, వేదాచార స్వరూపునకు నమః, అందరిని మించినవానికి నమః, మధ్యమునకు నమః, పినాకము అను ధనువు ధరించినవానికి నమః, బాణములు కలవానికి నమః, చిత్రవర్ణము కలవానికి నమః, రక్తస్వరూపునకు నమః, తప్పెట ధ్వని రూపునకు నమః, ఏకపాదునకు నమః, సర్వులకును పూజార్హుడైన వానికి నమః, సర్వము తెలిసినవానికి నమః, మృగములను వేటాడువానికి నమః, సర్పరూపునకు నమః, మొద్దు వలె ఉన్నవానికి నమః, పాపులను భయపెట్టువానికి నమః, అనేక రూపములు కలవానికి నమః, ఉగ్రునకు నమః, ముక్కంటికి నమః, ఈశ్వరునకు నమః, కపిలరూపునకు నమః, ఏకవీరునకు నమః, సర్వ ప్రాణులకు మృత్యువైన వానికి నమః, మూడుకన్నులు గలవానికి నమః, గృహ క్షేత్రాదులకు పతి అయినవానికి నమః, పినాకము అను ధనువునుదాల్చిన వానికి నమః, సుఖమును కలుగజేయువానికి నమః, శివునకు నమః, అరణ్యమున ఉండువానికి నమః, గృహమున ఉండు వానికి నమః, యతియైన వానికి నమః, బ్రహ్మచారి యైన వానికి నమః, సాంఖ్య సిద్ధాంత స్వరూపునకు నమః, యోగ సిద్ధాంత స్వరూపునకు నమః, ధ్యానము చేయువానికి నమః, దీక్ష వహించి నవానికి నమః, అంతర్ధానము పొందిన వానికి నమః, శర్వునకు నమః, మాన్యునకు నమః, మాలలు ధరించినవానికి నమః, బుద్ధునకు నమః, శుద్ధునకు నమః, ముక్తుడైనవానికి నమః, అద్వితీయుడై ఏకమైన వానికి నమః, తీరమైనవానికి నమః, మహర్షిరూపునకు నమః, నాలుగు పాదములుగల గవాది రూపునకు నమః, పవిత్రమైన వానికి నమః, ధర్మవంతునకు నమః, శ్రీఘ్రముగా పోవువానికి నమః, నెమిలిపింఛము ధరించినవానికి నమః, కపాలము ధరించిన వానికి నమః, కోరలు కలవానికి నమః, విశ్వము యొక్క మేధస్సు కలవానికి నమః, ఎదురుదెబ్బ లేనివానికి నమః, వెలిగిన వానికి నమః, సూర్యరూపునకు నమః, చక్కని మేధస్సుకల వానికి నమః, క్రూరునకు నమః, వికారము చెందిన ఆకారముకల వానికి నమః, బీభత్స రూపునకు నమః, శివునకు నమః, సౌమ్య స్వరూపునకు నమః, పుణ్యస్వరూపునకు నమః, ధార్మికునకు నమః, శుభస్వరూపునకు నమః, వధింప అలవిగాని వానికి నమః, మృతమైన అంగములు మాత్రమే కలవానికి

నమః, జరామరణములు లేని నిత్యస్వరూపునకు నమః, శాశ్వతుడైన వానికి నమః, సాధ్యస్వరూపునకు నమః, శరభాకారునకు (నారసింహమును ఉపసంహరింపచేయు అష్టపద మహామృగస్వరూపునకు) నమః, శూలమును ధరించినవానికి నమః, త్రినేత్రములు కలవానికి నమః, సోమపానము చేయువానికి నమః, నేతిని పానము చేయువానికి నమః, రేరిహారణునకు (హింసించువానికి సుఖింపచేయు వానికి) నమః, సద్యోజాతునకు (అప్పుడే పుట్టిన శిశురూపమైన భగవత్స్వరూపునకు) నమః, మృత్యుస్వరూపునకు నమః, మాంస భోజికి నమః, ఖర్వునకు (పొట్టివానికి) నమః, మేధాస్వరూపునకు నమః, విద్యుచ్ఛక్తి స్వరూపునకు నమః, విశేష ఆశ్రితునకు నమః, శ్రవణా నక్షత్రస్వరూపునకు నమః, కాంతి యందే ఆసక్తి గలవానికి నమః, ఆకాశ స్వరూపునకు నమః, క్షమా స్వరూపునకు నమః, సహించు వానికి నమః, సత్య స్వరూపునకు నమః, తపింపచేయువానికి (సూర్య రూపునకు) నమః, త్రిపురములను నశింపచేసిన వానికి నమః, ప్రజ్వలితునకు నమః, చక్రరూపునకు నమః, ఎక్కువ రోమములు కలవానికి నమః, వాడియైన ఆయుధములుకలవానికి నమః, పవిత్రునకు నమః, సిద్ధునకు నమః, పులస్త్య బ్రహ్మాకాదియైన పులస్తి రూపునకు నమః, రోచమానునకు (ప్రకాశించుచున్న) వానికి) నమః, ఖండస్వరూపునకు నమః, బలసినవానికి నమః, ఋషభ స్వరూపునకు నమః, భోగియైన వానికి నమః, గుంపుగా ఏర్పడుచున్న వానికి నమః, శాంతస్వరూపునకు నమః, ఊర్ధ్వముగా పోయిన రేతస్సు గలవానికి నమః, పాపముల నశింపచేయువానికి నమః, యజ్ఞ సంబద్ధునకు నమః, అగ్నిహోత్ర స్వరూపునకు నమః, వరుణ స్వరూపునకు నమః, వహ్ని స్వరూపునకు నమః, కిశలునకు నమః, ఇసుకలో నుండి వచ్చిన ద్రవ స్వరూపునకు నమః, ప్రసన్నునకునమః, వరణీయునకు నమః, నేత్ర స్వరూపునకునమః, వేగముగా పోవు ఇంద్రియములు కలవానికి నమః, మంచి ధనుస్సు గలవానికి నమః, ప్రకర్షముగా పవిత్రుడైనవానికి నమః, పివునకు (పానము చేయువానికి) నమః, రాక్షసుల చంపువానికి నమః, పశువుల (అజ్ఞానులను) చంపువానికి నమః, విఘ్న స్వరూపునకు నమః, శయనరూపునకు నమః, విభ్రాంతునకు (విశేష స్వరూపునకు) నమః, మహంతునకు నమః, అంతస్వరూపునకు నమః, పొంద అలవిగాని వానికి నమః, సమర్ధుడైన వానికి నమః, మిక్కిలి నీచుడైన వానికి నమః, లోకేశ్వరునకు నమః, ఆరోగ్య రూపునకు నమః, ఊర్ధ్వరూపునకు నమః, కొట్టి లేక కలిసి వాని స్థానమునకు అధికారియై కూర్చున్న వానికి నమః, బంగారు లేదా తేజస్సు బాహువులుగా గలవానికి నమః, సత్యస్వరూపునకు నమః, సర్వపాపాదుల శమింపజేయు వానికి నమః, కత్తిలో నేర్పరియైన వానికి నమః, తనయందు అఘము (పాపము) లేని వానికి నమః, రీరిణ్యునకు

(ద్రవీభావము చెందిన ఆనంద రసాత్మునకు) నమః, నేత్రమైన వానికి నమః, శ్రేష్ఠునకు నమః, వామదేవునకు (ఎడమప్రక్కన దేవిని ధరించిన వానికి) నమః, ఐశ్వర్యము గలవానికి నమః, సమస్త ధీమంతునకు నమః, మహాకల్ప స్వరూపునకు నమః, స్వాత్మ జ్ఞానముతో వెలిగినవానికి నమః, పాపులను ఏడ్పించువానికి నమః, హాసరూపునకు నమః, వరించిన ధనుస్సుగలవానికి నమః, కవచము ధరించినవానికి నమః, రథము గలవానికి నమః, సైన్యము గలవానికి నమః, భృగువునకు నాథుడైన వానికి నమః, (భృగువునకు ఇష్ట దైవము) శుక్ర స్వరూపునకు నమః, వహ్ని స్వరూపుడై శుభాశుభములను కలిగించువానికి నమః, హింసించువానికి నమః, ధీశాలికి నమః, సజ్జనుల వదలని వానికి నమః, దెసమొల గలవానికి నమః, చర్మవస్త్రము ధరించినవానికి నమః, సూర్యుని దంతములు పోవునట్లుగా తన్ని శిక్షించినవానికి నమః, అజ్ఞానులకు జ్ఞానదర్శకుడై, అధిపతి అయినవానికి నమః, భూతములకు పంచభూతముల నియామకుడైన వానికి నమః, మిక్కిలి స్తోత్రము చేయబడు వానికి నమః, ఋగ్యజుస్సామ్నే – ఋగ్వేద స్వరూపునకు నమః, యజుర్వేద స్వరూపునకు నమః, సామవేద స్వరూపునకు నమః, పితృదేవతలకు ఇచ్చు స్వధాస్వరూపునకు నమః, సుధాస్వరూపునకు (చక్కగా ధరించువానికి) నమః, "శిఖాయైవషట్" శిఖకు ఇచ్చు వషఫట్ స్వరూపునకు నమః, ప్రళయ స్వరూపునకు నమః, నీకు నమః, సృష్టించువానికి నమః, సృష్టికర్తయైన బ్రహ్మస్వరూపునకు నమః, హోమము చేయువాడైన వానికి నమః, సర్వమును హరించువానికి నమః, సర్వచేష్టలను క్షీణింపజేయువానికి నమః, భూత భవ్య భవాయ– భూతకాల స్వరూపునకు నమః, భవిష్యత్కాల స్వరూపునకు నమః, వర్తమాన కాల స్వరూపునకు నమః, కాల సామాన్య స్వరూపునకు నమః, అష్టవసువుల లేక ధన స్వరూపునకు నమః, సాధ్య (గణదేవతా) స్వరూపునకు నమః, రుద్ర స్వరూపునకు నమః, ఆదిత్య (సూర్య) స్వరూపునకు నమః, అశ్వినీ నక్షత్రముతో కూడిన పూర్ణిమ గల ఆశ్వీయుజ మాస స్వరూపునకు నమః, అంతట ప్రవేశించు వానికి నమః, వాయు స్వరూపునకు నమః, దేవతల ఆత్మ స్వరూపుడైన వానికి నమః, నీకు నమః, అగ్ని స్వరూపునకు నమః, సోమలతా రస స్వరూపునకు నమః, ఋత్విక్ స్వరూపునకు నమః, యోగస్వరూపునకు నమః, అజ్ఞాని పశువులకు మంత్రౌషధ స్వరూపునకు నమః, దక్షిణ అవభృథ స్వరూపునకు నమః, యజ్ఞ స్వరూపునకు నమః, నీకు నమః, తపస్స్వరూపునకు నమః, సత్యస్వరూపునకు నమః, త్రికాల బాధ్యరూపునకు నమః, త్యాగస్వరూపునకు నమః, శమ స్వరూపునకు నమః, అహింసా స్వరూపునకు నమః, లోభము లేనివానికి నమః, చక్కని ప్రదేశముకల ఇల్లు గల వానికి నమః, శయనమును దాటిన వానికి, నిర్నిద్రునకు నమః, సర్వప్రాణుల

ఆత్మభూతునకు నమః, యోగ స్వరూపునకు నమః, నీకు నమః, పృథివీ స్వరూపునకు నమః, అంతరిక్ష (ఆకాశ) స్వరూపునకు నమః, స్వర్గరూపునకు నమః, మహాలోక స్వరూపునకు నమః, జనలోక స్వరూపునకు నమః, తపోలోక స్వరూపునకు నమః, సత్యలోక స్వరూపునకు నమః, ఊర్ధ్వలోక సామాన్యాత్మ స్వరూపునకు నమః, నీకు నమః, అవ్యక్తమైన సూక్ష్మ స్వరూపునకు నమః, మహత్ స్వరూపునకు నమః, పంచభూత స్వరూపునకు నమః, పంచేంద్రియ స్వరూపునకు నమః, పంచ తన్మాత్ర స్వరూపునకు నమః, మహత్తునకు కూడ అనంతమైన వానికి నమః, తత్త్వస్వరూపునకు నమః, నీకు నమః, ఆద్యంతము లేని వానికి నమః, అర్థమునకు చిహ్నమైన శబ్ద స్వరూపునకు నమః, సూక్ష్మ స్వరూపునకు నమః, చేతనా స్వరూపునకు నమః, శుద్ధ స్వరూపునకు నమః, సర్వవ్యాపి వైభవముగల వానికి నమః, నిత్య (అవినాశి) స్వరూపునకు నమః, ముల్లోకములలోను ఉన్నవానికి నమః, సర్వాంతములలో ఉన్నవానికి నమః, జన్మాదులందున్న వానికి నమః, సత్యాంతము లందున్న వానికి నమః, మహాంతములలో ఉన్న వానికి నమః, ధర్మార్థ కామ మోక్ష చతుర్విధ పురుషార్థములలో ఉన్నవానికి నమః ఓ ప్రభూ! ఈ నమః స్తోత్రములలో నేను ఉన్నది లేనట్లుగా చెప్పినచో ఓ బ్రహ్మణి సాధో (బ్రహ్మాత్మా!) నా భక్తుడని సర్వమును క్షమింప వలసినవానికి నమః.(35)

విష్ణు మాహాత్మ్య కథనము

సూతుడు ఇట్లు అనెను :

ఈ విధముగ దేవేశుడును ఆరాధింపతగినవాడును ఈశానుడును అయిన బ్రహ్మ యొక్క ఫాలభాగము నుండి జారిన చెమట బిందువు అగ్నిలో బడి నల్లనై, ఎఱ్ఱన అయినది. అందుండి పుట్టి నీలలోహితుడు అయిన శివుని పరబ్రహ్మ అని శుక్రుడు చేతులు జోడించి ప్రణమిల్లెను. అంత, శివుడు శుక్రుని శరీరమును తన హస్తముతో నిమిరి మిక్కిలి సంత సించినవాడై, సంపూర్ణ దర్శనమొసగి అచటనే అంతర్ధాన మయ్యెను. దేవేంద్రుడే సేవకు డుగాకల శివుడు అంతర్ధానమునందగా, శుక్రుడు చేతులుజోడించి నిలిచి ఉన్న జయంతితో ఇట్లనెను. ఓ సుందరీ! నీవెవ్వరిదానవు? ఎవ్వతెవు? నా దుఃఖమున దుఃఖితవై మహా తపముతో కూడిన నన్ను ఎందులకు రక్షించితివి. ఈ నీ యొక్క నిరంతర భక్తిచేతను, వినయముచేతను, దమముచేతను, స్నేహము చేతను ఓ ఉత్తమురాలా! సంతుష్టుడను అయితిని. శ్రేష్ఠమైన గుణములు కలిగిన ఓ ఉత్తమురాలా! ఏమి కోరుచున్నావు? నీ కోరిక ఏమి? అది నెరవేరుగాక. అది ఒకవేళ సుదుర్లభమైనను ఈ నీకోరికను ఈనాడు పూర్తిగా

తీర్చెదను. అనగా, ఆమె (జయంతి), నీ తపముతో దానిని తెలియుమనెను. ఓ బ్రహ్మిష్టుడా! నాచేయదలచిన దానిని ఉన్నది ఉన్నట్లుగా నీవే తెలుసుకొనుము అనగానే, శుక్రుడు తన దివ్య దృష్టితో జూచి, నీవు మహేంద్ర పుత్రివి, నా హితార్థము ఇటకు వచ్చితివి. ఓ భామిని! పదేండ్లు నాతోగూడ సర్వభూతములు చూడకుండ అదృశ్యముగా ఇల సంభోగమును కోరుచున్నావు. దేవేంద్రాగ్ని వంటి కాంతిగలదానా! చక్కని కన్నులు గలదానా! సుందరముగా మాటాడుదానా! ఈ నీ కామమును నా నుండి వరముగా తీసికొనుము. అట్లేఅగుగాక. ఓ మధుపానము లేకయే మత్తెక్కినట్లున్న దానా! మన ఇంటికి వెళ్లెదము అని, జయంతితో గూడి ప్రభువైన శుక్రుడు స్వగృహమునకు వచ్చెను. అపుడు ఆ శుక్రుడు మాయతో ఆవరింపబడి సర్వ భూతములకు అదృశ్యుడై ఆ జయంతితో ఒక్కొక్కటిగా పదేండ్లు కూడి ఉండెను. తపములో సాఫల్యమునంది శుక్రుడు వచ్చెననివిని, దితిసుతులైన అసురులు అందరును సంతుష్టులై శుక్రుని చూడగోరి శుక్రుని ఇంటికి వెడలిరి. కాని అట జయంతితో కలసిఉన్న గురువును చూడరైరి. శుక్రుని దాక్షిణ్యమును (తాము వచ్చినను కనబడకుండ ఉండవలెనను తిరస్కార భావమును) తెలిసికొని, అసురులు వచ్చినదారిని మరలి వెళ్లిరి. బృహస్పతి, తండ్రికొఱకై హితమునుకోరిన ఇంద్రుని పుత్రిక అగు జయంతితో పదేండ్లు అదృశ్యభోగమున మునిగిఉన్న వానిగా శుక్రుడు ఉన్నట్లు తెలిసికొనెను. దానిని అవకాశముగా చేసికొని వెంటనే దైత్యుల మేలుకొరకై ఉన్న వానివలె, శుక్రుని రూపమును ధరించి, తరువాత వచ్చిన రాక్షసులను చూచి బృహస్పతి, నాతో యజ్ఞము చేయించువారికి స్వాగతము. మీ హితము కొఱకే వచ్చితిని. నేను మిమ్ములను చదివించెదను. తపమునకు ముందు మనము అనుకొన్న విద్య నాచేత పొందబడినది. అనగానే సంతసించిన మనస్సులు కలవారై అసురులు విద్యకొరకై శుక్రరూపమున ఉన్న బృహస్పతిని చేరిరి. శుక్రుడు పదేండ్ల సమయమున పూర్ణకాముడు అయ్యెను. అప్పుడు ఆ కాలమున శుక్ర రూపమున ఉన్న బృహస్పతి వెంటనే తెలివి గలవాడై స్వర్గమును వదలి వెడలిపోయెను. ఆ పదేండ్ల సమయము చివర జయంతికి దేవయాని అను పుత్రిక సద్యోజాత (అప్పటికప్పుడు పుట్టినది) జన్మించెను. తరువాత శుక్రుడు తనచేత యజ్ఞము చేయించు రాక్షస శిష్యులను చూడదలచెను.

శుక్రుడు ఇట్లు అనెను :

స్వచ్ఛమైన చిరునగవు కలదానా! పతివ్రతయైనదానా! ఓ దేవీ! నీ యొక్క యాజ్యుల (యాగము చేయింపదగు భక్తుల) కడకు పోవుదము. అనగానే, శుక్ర భార్యదేవి, ఓ మహావ్రతా! భక్తులను సేవింపుము. ఓ బ్రహ్మోత్ముడా! ఇది సత్పురుషుల ధర్మము. నేను ధర్మమును లోపింపజేయను- అనెను.

సూతుడు ఇట్లు అనెను :

తరువాత శుక్రుడు వెళ్లి, బుద్ధిశాలియైన దేవాచార్యుడు అగు బృహస్పతిచే శుక్ర రూపమున మోసగింపబడినవారును, విధివంచితులు అయిన వారగు అసురులను చూచి ఇట్లనెను. నాయనలారా! నన్ను శుక్రునిగా తెలుసుకొనుడు. ఈ శుక్రుడుగ కనబడువాడు భూమిపైకి వచ్చిన ఆంగిరసుడు(బృహస్పతి). ఓ దానవులారా! బృహస్పతిచే మీరు నేనే అనుకొని మోసగింపబడితిరి అని ఈ విధముగా చెప్పుచున్న శుక్రుని మాటలను విని దైత్యులు సంభ్రాంతులై శుద్ధమైన చిరునవ్వుకల శుక్ర-బృహస్పతులను ఇరువురిని చూచుచుండిరి. అందరు ముగ్ధులై ఏమియు పొందలేక నిశ్చేష్టులై ఉండిరి. వారు ఆవిధమున ప్రమూఢులై ఉండగా శుక్రుడు వారితో మరల మీ ఆచార్యుడను శుక్రుడను నేను. ఈతడు దేవాచార్యుడైన అంగిరసుడు (బృహస్పతి). మీరందరు నన్ను అనుసరించుడు. ఈ బృహస్పతిని విడువుడు అనెను. ఇట్లు అనగానే దైత్యులు అందరు వారు ఇరువురిని తేరిపార జూచిరి. అపుడు వారు ఇరువురిలో భేదమును తెలుసుకొనలేక పోయిరి. అపుడు బృహస్పతి ఏ భయములేక (తొందరపాటులేక) ఆ దైత్యులతో-ఈతడు అంగిరుడు (బృహస్పతి) మీ గురువైన శుక్రుడను నేను. ఓ దైత్యులారా! నా రూపమున ఉన్న బృహస్పతి వీడు. నా రూపముతో మిమ్ములను వంచించుచున్నాడు. అనగానే దైత్యులు ప్రయోజనమును పరస్పరము ఆలోచించి ఈతడు పదేండ్లు ప్రభువై మమ్ముల శాసించుచున్నాడు అనిరి. ఈతడే మన గురువు. మధ్యన అవకాశమును పొందకోరినవాడు ఈ బ్రాహ్మణుడు. అంత ఆ దానవులందరు చాల కాలము అలవడిన వారగుటచే వంచితులై ఆ కృత్రిమ బృహస్పతికే ప్రత్యేకముగ పేరులు చెప్పినమస్కరించి ఆతని మాటలనే స్వీకరించిరి. తరువాత ఆ అసురులు అందరును కోపించి ఎఱ్ఱని కన్నులు కలవారై, మా యొక్క హితమున ఈతడే గురువు, నీవు వెళ్లుము. నీవు మా ఆచార్యుడవు కావు! ఈతడు శుక్రుడు గాని, బృహస్పతిగాని కానిండు. ఈతడే మాకు గురువు అగుగాక! మేము ఈతని ఆజ్ఞలో ఉన్నాము. మంచిది. ఆలసింపక వెళ్లిపొమ్ము. అని ఇట్లు అసురులు అందరు బృహస్పతినే చేరిరి. ఈ విధముగా వారు శుక్రుడు చెప్పిన మహా హితము నమ్మనపుడు శుక్రుడు వారి మదమునకు కోపించి, నేను బోధించినను ఓ దానవులారా! మీరు నన్ను చేరుటలేదు. కావున మీరు తెలివి నశించి పరాభవము పొందుదురు గాక-అని శపించి, తాను ఎచట నుండి వచ్చెనో అటకు ఏగెను. ఇట్లు శుక్రునిచే శపింపబడిన అసురులను తెలిసి అపుడు బృహస్పతి కృతార్థుడై (తలచిన పనిని చేసిన వాడై) సంతసించి స్వస్వరూపమును (తన బృహస్పతి రూపమును) పొందెను. తరువాత అసురులను భ్రష్టులనుగా తెలిసి, కృతార్థుడై అంతర్థానము చెందెను.

ఆ మాయాశుక్రుడు బృహస్పతియై మాయముకాగా అప్పుడు దానవులు ఆశ్చర్యముచెంది, అహో! మాకు ధిక్కారము. మనము ఇట వంచితుల మైతిమని ఒకరికొకరు మాటాడుకొనిరి. విముఖులమైన మేము విధిచే వీపున తన్నబడితిమి. మా ప్రయోజనములలో ఉపయోగ పడుటకు దూరమై మా అంతట మేమే మాయచే దహింపబడితిమి అని భావించి అటు తరువాత, దేవతలవల్ల భయపడి అసురులు తొందరగా ప్రహ్లాదుని ముందు ఇడుకొని, మరల శుక్రుని అనుసరించుటకు వెళ్ళిరి. శుక్రుని చేరి తలలువంచి ఆతని మ్రోల నిలిచిరి. శుక్రుడు మరల తనకడకు వచ్చిన తన శిష్యులైన అసురులను చూచి సమయమున నాచే బోధింప (మేలుకొలుప) బడినవారైనను మీరు నన్ను అభినందించకుంటిరి. కావున ఆ గర్వముచేతనే ఈ పరాభవమును పొందితిరి. అనగనే, ప్రహ్లాదుడు, ఓ భార్గవ (శుక్రా చార్యా!) నీవు అభిమానమును విడువుము. నిన్ను సేవించు నీ శిష్యులను విశేషించి నీ భక్తులను అనుగ్రహింపుము. నీచే రమ్మని అడుగబడినను ఆ దేవాచార్యుడైన బృహస్పతిచే మోహితులము అయితిమి. కరుణించి భక్తులమైన మమ్ములను రక్షింపుము. ఓ భృగుపుత్రా! నీవు మమ్ములను అనుగ్రహింపకున్నచో నీచేత తిరస్కరింపబడి ఇవ్వేళ పాతాళమున ప్రవేశింతుము.

సూతుడు ఇట్లు అనెను :

ఈ విధముగాఅని, అనునయింపబడి, స్తుతింపబడిన ఆ శుక్రుడు ఉన్న సత్యమును తెలిసి, కారుణ్యముతోడను అనుకంపతోడను, తన కోపమును అణచివైచెను. వెంటనే, భయపడకుడు, భయపడకుడు, పాతాళమునకుకూడ పోవలదు. నేను మేలుకొని ఉండగనే తప్పనిసరిగా జరుగవలసిన ఈపని విధివశమున జరిగినది. దానిని మార్చుటకు అలవి కాదు. ఇపుడు జరిగిన విధి చేష్టితము మిక్కిలి బలీయమైనది. ఈవరకు మీ తెలివిని కోల్పోతిరి. దానిని ఇపుడు మరల పొందుడు. మీకు పర్యాయ కాలము (వరుస క్రమమున రాతగిన రాజ్యకాలము) వచ్చినదని బ్రహ్మ చెప్పెను. నా అనుగ్రహమున సంపాదింపబడిన త్రైలోక్య రాజ్యము మీచే అనుభవింపబడినది. యుగము అను పేరుగల పదియేడులు దేవతల శిరమును ఆక్రమించి రాజ్యము ఉండుట సంపూర్ణము అయినది. అంతకాలమే వారికి రాజ్యమని బ్రహ్మ చెప్పెను. సావర్ణిక మన్వంతరమున మీకు మరల రాజ్యము రాగలదు. నీ పౌత్రుడైనబలి మరల లోకములకు అధిపతి కాగలడు. ఈ విధముగనే బ్రహ్మ స్వయముగా, నీ పౌత్రుడు త్రిలోకాధిపతి కాగలడని నాతో చెప్పెను. అట్లే లోకములు అపహరింపబడగా ఈతనికి తపము జరుగలేదట. ఈతని ప్రవృత్తులు కామములతోకూడి లేవుగాన దానికి సంతసించిన బ్రహ్మసావర్ణికమన్వంతరములో రాజ్యప్రాప్తి ఒసగెను.

దేవరాజ్యము బలికి రానున్నదని నాకు ఈశ్వరుడు చెప్పెను. కావున భూతములకు అదృశ్యుడై కాలమునకు ఎదురు చూచుచు, ఉన్నాడు. సంతుష్టుడైన బ్రహ్మ నీకు అమరత్వము ఇచ్చెను. కావున నిరుత్సుకుడవై పర్యాయక్రమముతో వ్యాకులము పొందకుము. నాకుకూడ నాపర్యాయక్రమము ముందుగా, తొందరగా వచ్చునట్లు చేయ శక్యము కాదు. భవిష్య కాలమును తెలిసిన బ్రహ్మచే అట్లు చేయుటకు నిషేధింపబడితిని. బృహస్పతితో సమానులు అయిన ఈ నాశిష్యులు ఇద్దరు(షండామార్కులు)నా కొఱకుగాను దేవతలతో అన్నింటిని నిర్వహింతురు అని అక్లిష్టకర్ముడైన శుక్రుడు ఇట్లనగా ప్రహ్లాద ప్రముఖులైన దైత్యులు వారిద్దరితో (షండామార్కులతో) పాటువెళ్లిరి. తప్పనిసరిగా జరుగబోవు విషయమును శుక్రునివల్ల విన్న దానవులు, శుక్రుడు చెప్పిన జయమును పొందగోరుచుండిరి. తరువాత కవచము ధరించి సాయుధులై, అందరు దైత్యులు దేవతలను యుద్ధము నకు ఆహ్వానించిరి. ఈతడు యుద్ధమునకు వచ్చిన దేవఅసురులను చూచెను. తరువాత పూర్తి చేసిన సన్నాహములు గలవారై దేవతలు దానవులతో యుద్ధము చేసిరి. తరువాత దేవ అసుర యుద్ధము నూరేండ్లు జరిగినది. అసురులు దేవతలను జయించిరి. భగ్నులైన దేవతలు మంతనములు చేసిరి.

దేవతలు ఇట్లు అనిరి :

మనకు అసురులతో షండామార్కుల ప్రభావమును తెలియదు. కావున ఆత్మ హిత మును ఉద్దేశించి యజ్ఞమును చేయవలెను. ఈ షండామార్కులను ఆ యజ్ఞ జ్ఞానాప హృతులనుగాచేసి అసురులను జయింతము అని ఆలోచించి, తరువాత ఆ షండామార్కులు ఇరువురితోను ఓ బ్రాహ్మణులారా! షండా మార్కులారా! మిమ్ములను యజ్ఞమునకు ఆహ్వానింతుము. అసురులను విడువుడు. దానవులను ఓడించి, మరల జ్ఞానమును పొందెదము అని సమాలోచించిరి. ఈ విధముగ (దేవతల మాటలు విని) అపుడు ఆ షండామార్కులు అసురులను విడిచిరి. దానివలన దేవతలు జయించిరి. దానవులు పరాజయమును పొందిరి. దేవతలు అసురులను ఓడించి షండామార్కుల కడకు చేరిరి. ఆ దానవులు మాత్రము శుక్రశాపముచే దేవతలచే తిరస్కరింపబడివారై నిరాధారులై, అప్పుడు దేవతలచే వధింపబడుచున్నవారై మరల పాతాళమును ప్రవేశించిరి. ఈ విధముగ ఇంద్రునిచే దానవులు ఉద్యమము లేనివారుగా చేయబడిరి. అప్పటి నుండి భృగునిమిత్త మయిన శాపముచే. యజ్ఞము శిథిలమై ప్రభువైన విష్ణువు ధర్మవ్యవస్థాపనము చేయుటకును, అధర్మమును నశింపచేయుటకును, మరల మరల జన్మించెను.

ప్రహ్లాదుని ఆజ్ఞలో లేని అసురులు అందరును మనుష్య వధ్యులు అగుదురని ప్రభువైన బ్రహ్మ చెప్పెను. ఆ ధర్మము వలన నారాయణుడు చాక్షుష మన్వంతరమున పుట్టెను.

వైవస్వత మన్వంతరమున యజ్ఞశాలలో యజ్ఞమును జరుపుచుండెను. ఆతడు పుట్టినపుడు ఆ యజ్ఞమునకు బ్రహ్మ పురోహితుడు అయ్యెను. నాలుగవ యుగము అసురులు ఆపద చెందినవారుకాగా, హిరణ్యకశిపుని యొక్కవధకై సముద్ర మధ్యలో హరి పుట్టెను. రెండవ వాడు నారసింహుడు అయ్యెను. ఆతడు రుద్రుడు దేవతలను ముందిడుకొన్నవాడు. బలి ఉన్న లోకములలో త్రేతయైన ఏడవ యుగమునందు, ముల్లోకములు దైత్యులచే ఆక్రమింప బడియుండగా, మూడవవాడు వామనుడుపుట్టెను. పూర్వము తనను అంగములలో చిన్నగా వామనునిగాజేసి, బృహస్పతి ముందు నడువగా, అదితికి కులనందనుడై బ్రాహ్మణుడైన వామనుడు, శుభకాలమున, హోమము చేయుచున్నవాడును, రాక్షసేంద్రుడును విరోచన పుత్రుడునుఅగు బలిచక్రవర్తి కడకు వచ్చెను. నీవు త్రైలోక్యమునకు రాజువు. నీయందే సర్వము నిలిచియున్నది. ఓ రాజా! నాకు మూడుఅడుగుల నేలను దానముచేయుము- అని ప్రభువైన వామనుడు అడిగెను. రాజైన విరోచన పుత్రుడగు బలి ఆతనిని వామనునిగా తెలిసి, తాను స్వయముగా సంతసించి ఆ మూడు అడుగులను ఇత్తునని అనెను. ఓ ద్విజోత్తములారా! అపుడు ప్రభువైన ఆ వామనుడు స్వర్గమును, ఆకాశమును, భూమిని, మూడుపాద విక్షేపములచేత సమస్త జగమును ఆక్రమించెను. మహాయశస్వియై భూతా త్ముడైన ఆ వామనుడు తన తేజముతో సర్వదిక్కులను ప్రకాశింపచేయుచు ప్రకాశించెను. రాక్షస శ్రీయైన ముల్లోకములను హరించి అసురులను పుత్రపౌత్ర సమేతముగ పాతాళ మునకు తెచ్చెను. నముచి, శంబరుడు, ప్రహ్లాదుడును-ఈ క్రూరులు విష్ణువుచే హతులై ఎగురగొట్టబడి దిక్కులను పొందిరి. భూతాత్ముడైన మాధవుడు, సవిశేషముగా పృథివ్యాది మహాభూతములను, సమస్త కాలమును అచట బ్రాహ్మణులకు అద్భుతముగా తన విశ్వ రూపమున చూపెను. ఆతని శరీరమున జగము అంతయును తనను సైతము (బలి) చూచుచున్నాడు. ఆ దానవ, మానవులు అందరును విష్ణు తేజముతో విమోహితులై మోహము చెందిరి. మిత్రబంధు సమేతముగ బలి మహాపాశములతో బద్ధుడు అయ్యెను. మొత్తము విరోచనుని కులమంతయు పాతాళములో ప్రవేశింపజేయబడినది. తరువాత సమస్తమైన దేవ ఐశ్వర్యమును ఇంద్రునకు ఇచ్చి, మహాబాహువైన విష్ణువు మనుష్యులలో ప్రాదుర్భవించెను. ఈ మూడు విష్ణువు యొక్క శుభకరములై దివ్యములైన మూడు సంభూ తులు (జన్మలు) ఇక శాపమువల్ల కలిగిన మానుష్యములు అయిన ఏడు విష్ణువు అవతా రములను వినుడు. పదవ యుగము అయిన త్రేతాయుగమున విష్ణువు దత్తాత్రేయుడు అయ్యెను. ధర్మము నశింపగా మార్కండేయ పురస్సరమైన నాల్గవ సంభవము. పదియైదవ దైన త్రేతాయుగమున ఐదవ సంభవము జరిగినది. అది మాంధాత చక్రవర్తిగా ఉన్నపుడు తథ్య పురస్సరమై ఉండెను. పదునొకండవ త్రేతాయుగమున విశ్వామిత్రుని ముందుగా

ఇడుకొని పరశురాముడు సర్వ క్షత్రియనాశకుడు అయ్యెను. పదునాల్గవ యుగమున వశిష్ఠ పురోహితునిచే (యజ్ఞముచే), రావణ వినాశమునకై ఏడవ అవతార పురుషుడుగా దశరథ పుత్రుడై రాముడు ఉద్భవించెను. ఇరువది ఎనిమిదవ ద్వాపర యుగమున, జాతూకర్ణ పురస్సరుడై విష్ణువు ఎనిమిదవ అవతారముగా, పరాశరునివల్ల వేదవ్యాసుడై జన్మించెను. అట్లే, అదితికి కశ్యపునివల్ల పుట్టిన విష్ణువు తొమ్మిదవ అవతారముగా దేవకియందు వసుదేవునకు బ్రహ్మ గార్గ్యపురస్సరుడై జన్మించెను. అప్రమేయుడై (ప్రమాణములకు దొరకని వాడై) కామచరుడై (స్వేచ్ఛాచరుడై, అడ్డులేని ఆచరణముకలవాడై) వశియై, (ఇంద్రియా దులను స్వపశమునందు ఉంచుకొన్నవాడైన), మహావిష్ణువు ఇచట భూమిలో, ఆజ్ఞాపింప బడువాడై బొమ్మలచే బాలుడువలె కృష్ణభగవానుడు క్రీడించును. ఈ మధురాక్షసహంత, మహాబాహువు ఇంతటి వాడని కొలుచుటకు అశక్యుడు. ఈతనికి పరమై ఉత్కృష్ట మైనది ఒక్క విశ్వరూపమే. మరొకటి లేదు. అట్లే ఇరువది ఎనిమిదవ ద్వాపర యుగము ఒక్క అంశముగడువగా, ధర్మము నష్టముకాగా, అపుడు మహావిష్ణువు వృష్ణి కులమున జన్మిం చెను. ధర్మసంస్థాపనము నకును, అసురవినాశనమునకును, యోగాత్ముడై కృష్ణ భగవానుడు యోగమాయచే మానుషీ యోనిలో ప్రవేశించి సర్వప్రాణులను మోహింపచేయుచు, కన బడనివాడై సాందీపని పురస్సురుడై మనుష్యులలో విహారమునకై భూమిలో సంచరించు చుండెను. అచట, కంసుని, సాల్వుని, ద్వివిదుడను మహాసురుని, అరిష్ఠుని, వృషభుని, పూతనను, కేశిని, హయుని, కువలయా పీడమను ఏనుగును, మల్లరాజ గృహాదిపుని, మనుష్య దేహమున ఉన్న రాక్షసులను వీర్యవంతుడైన కృష్ణుడు వధించెను. అద్భుత కర్మలు చేసిన బాణుని వేయి బాహువులు, కృష్ణునిచే ఖండింపబడినవి. యుద్ధమున నరకా సురుడును, మహాబలుడైన యవనుడును వధింపబడిరి. పరాక్రమముచే రాజుల సమస్త రత్నములను అపహరింపబడినవి. పాతాళమునఉన్న దురాచారులైన రాజులు హతులు అయిరి. ఇవి మహాత్ముడు అయిన మహావిష్ణువుయొక్క లోకహితము కొఱకైన జన్మలు. ఈ యుగమే క్షీణించి రాబోవు కలియుగము సంధిచే కలియగా. ప్రతాపవంతుడై పరాశరునివల్ల పుట్టిన విష్ణుయశుడు అను కల్కి యాజ్ఞవల్క్యపురస్సరుడై రాబోవు పదియవ విష్ణువు అవతారముగా పుట్టెను. వేల కొలదిగా స్వీకరించిన ఆ యుధములుగల బ్రాహ్మణు లచే పరివారితుడై హస్తి–అశ్వ–రథములతో సంకులమైన సేనను ఆకర్షించు మిక్కిలి ధార్మికులుగాని వారిని, కొండొకచో–ధర్మమును ద్వేషించువారిని, ఉత్తర దిక్కు వారిని, మధ్య దేశపు వారిని, అట్లే వింధ్యా పరాంతికులను, అట్లే దాక్షిణాత్యులను, సింహళులతోబాటు ద్రవిడులను, గాంధారులను, పారదులను, పహ్లావులను, యవనులను, శకులను, తుషారు

లను, బర్బరులను, పులిందులను, దురదులను, ఖసులను, లంపాలకులను, అంధకులను, రుద్రులను, కిరాతులను పాలించి ప్రభువై రాజ్యచక్రమును నడిపించి, బలవంతుడై మ్లేచ్ఛులను నాశముచేసి, మహాబలియై, సర్వప్రాణులకు కనబడకుండగనే భూమి అంతయు తిరుగును. ఆతడు ధీశాలియైన విష్ణు దేవాంశతోనే మానవుడై జన్మించెను. పూర్వజన్మలో ఆతడు ప్రమతిఅను వీర్యవంతుడైన విష్ణువు. ఆతడు మొత్తము కలియుగమున చంద్రునితో సమాన కాంతిగల శరీరము గలవాడయ్యెను-అనునివి విష్ణుదేవుని యొక్క పది జన్మలు.

శ్రీ మహావిష్ణువు ఆయాకాలములను బట్టియు, ఆయా కార్యమును బట్టియు, ఆయా కార్యమున ఉద్దేశించిన కారణమును బట్టియు, ముల్లోకములలో ఆయా యోనులను పొందును. ఇరువది అయిదవ కల్పమున ఇరువది అయిదు సంవత్సరములు సర్వ ప్రాణులను చంపుచు, అంతటను మనుష్యులను కూడ చంపుచు, క్రూరకర్మతో సామాన్య ముగా అధార్మికులను, పాపాత్ములను వధించి భూమిని కేవల బీజావశేషముగ చేయును. తరువాత తలంపు నెరవేరినవాడై, సేనతో కూడిన ఆ కల్కి చంపిన వారందరు మరల స్వయముగనే సిద్ధులు అగుదురు. అకస్మాత్తుగా పరస్పరము కోపించి మోహితులు అగుదురు. విధి బలీయతచే అట్లు ప్రేరేపింపబడిన వారందరిని నశింపజేసి, కల్కి తన వెంటవచ్చినవారితో పాటు గంగా-యమునల మధ్యన నిశ్చలమైన స్థితిని పొందగలడు. తరువాత సామాన్యులైన సైనికులతోబాటు కల్కి కడచిపోగా, రాజులు నశించిపోగా, ప్రజలు అపుడు పట్టపగ్గములు లేనివారై రక్షణము లేకపోగా యుద్ధమున పరస్పరము చంపుకొనిరి. ఆ విధముగా పరస్పరము ఊరటలేనివారై, రోదనములు కూడలేనివారై మిక్కిలి దుఃఖితులై పురములను గ్రామములను వదిలి, ఆలుబిడ్డలులేనివారై, నశించిన వేదధర్మములు కలవారై, నశించిన ధర్మబద్ధమైన ఆశ్రమములు కలవారై, పొట్టివారై, అల్పాయుష్కులైన ఈ ప్రజలు వనవాసులు అగుదురు. వారు నదీపర్వతముల సేవించువారై, ఆకులు, కందమూలములు, ఫలములు తినువారై, నారచీరలను ఆకులను చర్మములను ధరించినవారై వావివరుసలులేని స్త్రీ సంపర్కములతో భయంకరమైన సాంకర్యమును పొందిరి. అల్పాయుష్కులు, నశించిన జీవన వ్యాపారములు కలవారు, అనేక బాధలు కలవారు, మిక్కిలి దుఃఖితులైరి. కలియుగ సంధ్యంశకమున ఈ విధముగ ప్రజలు కష్టమును పొందిరి. ప్రజలు కలియుగముతో పాటు నాశమును పొందుదురు. కలియుగము క్షీణింపగా, కృతయుగము మరలరాగా, ప్రజలు ఏ ఒత్తిడులు లేక స్వాభావిక ముగనే (వారంతటవారే) న్యాయానుగుణముగా మెదలుదురు-అనునిది మొత్తము దేవాసురుల విచేష్టితము అని చెప్పబడినది. యదువంశ ప్రసంగమున వైష్ణవమైన కీర్తి (విష్ణు మాహాత్మ్యము) గొప్పగా చెప్పబడినది. తరువాత

తుర్వసువు యొక్కయు, పూరువు యొక్కయు, ద్రుహ్యువు యొక్కయు, అట్లే అనువు యొక్కయు వంశమును చెప్పెదను. (36)

అనుషంగపాద కథనము

సూతుడు ఇట్లు అనెను :

తుర్వసుని పుత్రుడు వహ్ని. వహ్ని పుత్రుడు గోభానువు. గోభానువు సుతుడు వీరుడును, అపరాజితుడును అయిన త్రిసానువు. త్రిసానుసుతుడు కరంధముడు. కరంధమునిపుత్రుడు అవీక్షిత్తు, అవీక్షిత్తు పుత్రుడు మరుత్తు. మరుత్తునకు పుత్రులు లేరు. అవీక్షిత్తుపుత్రుడైన వేరొక రాజు మరుత్తను గూర్చి పూర్వము చెప్పబడెను. సంతానములేని మరుత్తు రాజుగా ఉండెను. పౌరవుడైన దుష్కృతుని మరుత్తునకు పుత్రునిగా అందరు కల్పించిరి. ఈవిధముగ యయాతి శాపముతోను, ముసలితనము సంక్రమించుటచేతను, పూర్వము పౌరవ వంశము తుర్వసు వంశమున ప్రవేశించెను. దుష్కృతునకు పుత్రుడు రాజైన శరూథుడు అనువాడు. శరూథునకు పుత్రుడు జానాపీడుడు. ఆతనికి నలుగురు పుత్రులు. పాండ్యుడు, కేరళుడు, చోళుడు, కుల్యుడు. వారి దేశములు పాండ్య దేశములు, కేరళ దేశములు, చోళ దేశములు, కుల్య దేశములు. ద్రుహ్యునకు ఇద్దరు పుత్రులు బభ్రువు, సేతువు–అని ప్రసిద్ధులు. సేతు పుత్రుడు అరుద్ధుడు, బభ్రుపుత్రుడు రిపువు. యుద్ధమున పాపియైన యౌవనాశ్వునిచే బలి నిహతుడు అయ్యెను. వారి యుద్ధము చాలగొప్పది. పదునాలుగు నెలలు జరిగెను. అరుద్ధుని పుత్రుడు గాంధారుడు అను రాజు. ఆతని పేరుతోనే గాంధారదేశమని ఒక పెద్ద దేశము పిలువబడుచున్నది. గాంధార దేశమున పుట్టిన గుఱ్ఱములు గుఱ్ఱములలో శ్రేష్ఠములు అయినవి. గాంధార పుత్రుడు ధర్ముడు. ఆతని పుత్రుడు ఘృతుడు. ఘృతునకు దుర్మదుడు పుట్టెను. ఆతనికి ప్రచేతసుడు పుట్టెను. ప్రచేతసుకు నూరుగురు పుత్రులు. వారు అందరును రాజులే. వారు అందరు మ్లేచ్ఛరాష్ట్ర అధిపులై, ఉత్తర దిక్కును ఆశ్రయించిరి. అనువు యొక్క పుత్రులు ముర్వురు. వారు మహాత్ములు, పరమ ధార్మికులును. వారు–సభాసరుడు, పక్షుడు, పరపక్షుడును, సభాసరుని పుత్రుడు విద్వాంసుడును రాజు అయిన కాలానలుడు. కాలానలునకు ధర్మాత్ముడై ధార్మికుడైన సృంజయుని కుమారుడు, వీరుడు రాజయిన పురంజయుడు. సృంజయునకు పుత్రుడు పురంజయసుతుడు మహాసత్త్వుడు అయిన జనమేజయుడు. జనమేజయ రాజర్షికి పుత్రుడు రాజు అయిన మహాశాలుడు. మహాశాలునకు పుత్రుడు ఇంద్రసముడైన రాజును, స్వర్గమున ప్రతిష్ఠింపబడిన కీర్తి కలవాడును, ధార్మికుడు అయిన మహామనుడు. సప్త ద్వీపేశ్వరుడైన రాజును, చక్ర

వర్తియు, మహాయశస్వియు అయిన మహామనునకు ప్రసిద్ధులైన పుత్రులు ఇరువురు. వారు ధర్మజ్ఞుడైన ఉశీనరుడు, ధార్మికుడైన తితిక్షువు, ఉశీనరుని భార్యలు రాజర్షి వంశజులైన ఐదుగురు. వారు–మృగా, కృమీ, నవా, దర్వా, ఐదవది దృషద్వతి. ఉశీనరుని పుత్రులు పై స్త్రీలయందు జనించిన ఐదుగురు. కులోద్వహులు. వారు మంచి గొప్ప తపస్సుచే వృద్ధులైన ధార్మికులు. మృగకు పుత్రుడు మృగుడు, నవకునవుడు, కృమికి కృమి, దార్వకు సువ్రతుడను ధార్మికుడును పుత్రులు. దృషద్వతికి ఔశీనరునకు గలిగిన పుత్రుడు శివి. శివికి శివపురము ప్రసిద్ధమైనది. మృగునకు యౌధేయ పురము, నవునకు నవరాష్ట్రము, కృమికి కృమిలాఅనుపురి, సువ్రతునకు వృష్టా అనుపురి రాజధానులు. శివి పుత్రులను గురించి వినుడు. శివికి శివులను నలువురు పుత్రులు లోక సమ్మతులు. వారు వృషదర్భుడు, సువీరుడు, కేకయుడు, మద్రకుడును. వారియొక్క విశాలములైన దేశములు వరుసగా–వృషదర్భములు, సూచిదర్భములు, కేకయములు, మాద్రకములు. తితిక్షువుయొక్క సంతానమును గురించి వినుడు. ఆతని పుత్రుడు తైతిక్షు వనువాడు రాజై, తూర్పు దిక్కున ప్రసిద్ధిచెందెను. అతడి కుమారుడు ఉశద్రథుడను మహాబాహువు. ఆతనికి హేముడు సుతుడు. హేముని సుతుడు సుతపుడు. ఆతని సుతుడు సుతులకే యశస్వియైన బలి. సంతాన వాంఛచే వంశము క్షీణించుచుండగా, మనుష్య యోనిలో పుట్టెను. ఆ బలి మహాయోగి, ఆ మహామనస్వి (విష్ణువుచే) బద్ధుడయ్యెను. ఆతడు చాతుర్వర్ణ్య కారులను నలుగురిని పుత్రులను భూమిలో జనింప చేసెను. అంగుని, వంగుని, సుహ్లుని, పుండ్రుని, కళింగుని–బలి జనింపజేసెను. ఇది బలి జనితమైన క్షత్రియ సంతానము. బలికి సంబంధించిన (జన్మించిన)వారును, బ్రాహ్మణులును సైతము ప్రభువైన ఆతని వంశ కరులు. ప్రీతి చెందిన బ్రహ్మచే ధీమంతుడైన బలికి. వరములు ఈయబడినవి. మహాయోగిత్వము, కల్పాయుఃపరిమాణకమైన ఆయువు, యుద్ధమున అజేయత్వము, ధర్మమున ప్రకృష్టమైన భావనయు, ముల్లోకముల దర్శనము, ప్రసవమున ప్రాధాన్యము, బలమున సాటిలేనితనము, ధర్మతత్త్వార్థదర్శనము, నియతమైన బ్రాహ్మణాది చతుర్వర్ణములకు స్థాపకత్వము. ఇవి బలికి బ్రహ్మ ఇచ్చిన వరములు. బ్రహ్మ ఈ వరములు ఈయగానే రాజైన బలి పరమమైన శాంతిని పొందెను. చాలా కాలము గడచిన తరువాత విద్వాంసుడైన బలి స్వస్థానమునకు వచ్చెను. వారియొక్క విశాలములైన దేశములు వంగ, అంగ, సుహ్లక, పుండ్ర, కళింగములు. వారియొక్క వంశమును వినుడు. బలియొక్క ఆ తనయులు అందరును బలియొక్క క్షేత్రము (భార్య)నందు మునివల్ల కలిగినవారు, దీర్ఘతముడను మునికి సుధేష్ణయందు పుట్టిన తేజోవంతులు.

ఋషులు ఇట్లు అనిరి :

"ఓ ప్రభూ! బలిపుత్రులు అయిదుగురును దీర్ఘతముడను ఋషిచే ఎట్లు క్షేత్రజులుగా పుట్టిరి? ఇది మాకు చెప్పుడు."

సూతుడు ఇట్లు అనెను :

పూర్వము అశిజుడు అను ప్రసిద్ధి చెందిన ధీశాలియైన ఋషి ఉండెను. ఆ మహాత్మునకు మమత అను భార్య ఉండెను. అశిజునికి చిన్న సోదరుడును, దేవతలకు పురోహితుడును, గొప్ప తేజస్సు గలవాడును అయిన బృహస్పతి అన్న భార్య అగు మమతను సంగమించుటకు కూడ పోయెను. ఆ బృహస్పతిని ఇష్టపడనిదై మమత ఆతనితో–'నీ జ్యేష్ఠభ్రాత (అశిజుని) వల్ల గర్భవతినై అష్టమితనైన (ఎనిమిది నెలలైన) దానను. ఓ బృహస్పతీ! ఈ నా మహాగర్భము అశిజుని నుండి షడంగ వేదము అభ్యసించి, దాని ఉచ్చరించుచు మిక్కిలి దుఃఖించుచున్నాడు. నీవుకూడ వ్యర్థముగాని రేతస్సు కలవాడవు. కావున నన్ను భోగించుటకు తగవు. ఈ విధముగా ఉన్న ఈ సమయమున ఓ ప్రభూ! నీవు ఎట్లు తలంతువో!" అట్లే అని అనెను. ఇట్లు చక్కగా చెప్పబడిన ఆ మహా వీర్యుడై మహాత్ముడైన బృహస్పతి కామము నిండిన ఆత్మగల తననునిలుపుకొన లేకపోయెను. ధర్మాత్ముడై (కూడ) బృహస్పతి ఆమెతో సంభోగించనే సంభోగించెను. అపుడు రేతస్సును వదులుచున్న బృహస్పతితో గర్భస్థుడైన శిశువు ఇట్లు పలికెను. వేదాధ్యయనముచేసి స్నాతక బ్రహ్మచారి అయినవాడు నేనున్న ఈ గర్భయోనిలో రేతస్సు ఉంచరాదు. ఇచట నిరువురు పుట్టుటకు అవకాశములేదు. నీవు కూడ వ్యర్థముగాని వీర్యము కలవాడవు. కాని, అంతకన్న పూర్వమే నేను ఇచట ఊపిరి పోసికొని వచ్చినవాడను అని అనగానే కోపించిన భగవత్ రూపుడును ఋషియును అయిన బృహస్పతి గర్భములో ఉన్నవాడును, అన్నగారి సుతుడునునై యాశిజుడైన ఆతనిని శపించెను. సర్వ ప్రాణులును కోరునట్టి ఈ సంభోగరేతస్రవణ కాలమున అజ్ఞానమున నన్ను ఇట్లు నిషేధించితివి కావున నీవు దీర్ఘమైన తమమున ప్రవేశింపగలవు (దీర్ఘతముడవు) కాగలవు అని శపించెను. తరువాత ఆ శాపమున దీర్ఘతముడను ఋషి జన్మించెను. ఆ తరువాత అశిజ పుత్రుడైన ఆశిజుడు విశాలకీర్తి కలవాడై తేజస్సుతో బృహస్పతివలె ప్రకాశించెను. తరువాత అన్నగారి ఆశ్రమమున నివసించెను. కామధేను సంతానమైన వృషభము నుండి గోధర్మమును వినెను. ఆతని అన్నయు, తండ్రి, సోదరుడును, అపుడు ఒక భవనము నిర్మించిరి. దీర్ఘతముడు అచట ఉండగా ఒక వృషభము అనుకోకుండా స్వేచ్ఛగా వచ్చెను. అది ఆవులతో గూడినదై యాగ ధర్మమునకై తెచ్చిన దర్భలను మేసెను. దీర్ఘతముడు కొమ్ములతో విసరుచున్న ఆ వృషభము కొమ్ములు పట్టుకొని

నిలిపి వారించెను. అట్లు ఆతనిచే పట్టుకొనబడిన ఆ వృషభము ఒక్క అడుగైనను కదల్పలేక నిలిచెను. తరువాత ఆ వృషభము–ఓ బలవంతులలో శ్రేష్ఠుడా! నన్ను వదలుము. నాయనా! ఇంతవరకు నీవంటి బలవంతుడు నాకు ఎక్కడను తటస్థ పడలేదు. నేను ముక్కంటిని మోయుదును. భూతలమున పుట్టితిని. 'ఓ బలవంతులలో శ్రేష్టుడా! నీ విషయమున సంతుష్టుడను అయితిని. వరము అడుగుము' అనగానే దీర్ఘతముడు–జీవించు నానుండి విడిపించుకొని ఎక్కడికినిపోలేవు. కావున పరుల వస్తువుల హరించు నాలుగు కాళ్ల జంతువైన నిన్ను వదలను–అనగనే ఆ వృషభము దీర్ఘతమునితో ఇట్లనెను. "నాయనా! మాకు దొంగతనము మొదలగు ఏ పాతకమును లేదు. మేము అన్ని విధముల తినదగిన దానిని తినతగని దానిని, త్రాగతగినవానిని, త్రాగతగని దానిని ఎఱుగము". చేయదగిన దానిని, చేయతగనిదానిని, కూడతగినదానిని, కూడదగని దానిని ఎఱుగము. ఓ బ్రాహ్మణా! మేము పాపులము కాము. ఇది గోవుల ధర్మమని చెప్పబడినది' అని పలికెను. దీర్ఘతముడు ఈ విధముగ గోవుల ధర్మమునువిని ఆశ్చర్యపడి ఆ వృషభమును వదలి, శ్రవణ పరంపరగా వచ్చిన గోభక్తిచేత ఆ వృషభమును శాంతింపచేసెను. ఆవిధముగ శాంతించిన వృషభము వెళ్లిపోగానే, ఆ గోధర్మమునే భక్తితో మనస్సుతో (దానియందే) నిష్ఠావంతుడై, పరమాసక్తి కలవాడై స్వీకరించెను. తరువాత దైవవశమున మూఢచిత్తుడై విదిలించు కొనుచు, ఏడ్చుచు న్నదియు, తన తమ్ముడైన యుతథ్య పుత్రుని భార్యయు అయిన ఆమెను కామించెను. దానిని గర్వమని తలంచి శరద్వంతుడు ఆతనిని క్షమింపలేదు. దీర్ఘతముడు గోధర్మమని బలాత్కరించి కోడలివంటి (తమ్ముని భార్య కోడలి వంటిదైనందున) దానిని కామించెను. మానవులకు వ్యతిరేకముగ ప్రవర్తించు ఆతనిని చూచి ఆలోచించెను. ముందు అవశ్యముగా జరుగ నున్న విషయమును ఆతనికి మృత్యువులేమియును తెలిసి. కోపముచే నెఱ్ఱనైన కన్నులు కలవాడై–"ఈమె కూడతగినది–కూడతగనిదియను విచారము లేక గోధర్మముతో (పశుధర్మముతో) కోడలిని కామవాంఛ తీర్చుటకై ప్రార్థించితివి. నీవు చెడు ప్రవర్తనము కలవాడవు, నిన్ను వదిలిపెట్టుచునే ఉన్నాను. నీ కర్మతో నీవు వెళ్ళుము. నీవు గ్రుడ్డివి, ముదుసలివి. ఇతరులచే భరింపదగినవాడవు. కాని ఇపుడు చెడుగా ప్రవర్తించితివి. కావున వదిలి పెట్టబడితివి. నీవు దురాచారుడవని నా తలంపు" అనెను.

సూతుడు ఇట్లు అనెను :

అంత శరద్వంతునకు ఈ క్రూర కర్మయందు బుద్ధి కలిగెను. అనేక విధములుగా భయపెట్టి బాహువులతో పరిగ్రహించి (బంధించి) సముద్రకోష్ఠమున గంగాజలమున దీర్ఘతముని వదిలెను. అపుడు సముద్రుడైన (యోగముద్ర కలిగియున్న) అతనిని గంగ

తన ప్రవాహముతో ఏడు దినములు మోయుచుండెను. ధర్మార్థ తత్త్వవేత్తయై రాజైన బలి తన భార్యలతో ఉండి, ఆ ప్రవాహముతో మునుగుచు–సమీపమునకు వచ్చిన ఆ దీర్ఘతముని చూచిరి. ఆ ధర్మాత్ముడై విరోచన పుత్రుడైన బలి అతనిని పట్టుకొని భక్ష్య భోజ్యములతో అతనిని సంతృప్తిపరచుచు అంతఃపురమున రక్షించెను. దానిచే సంతుష్టి చెందిన దీర్ఘతముడు బలిని వరమును కోరుకొమ్మనెను. దానవరాజైన బలి తనకు పుత్రులు కలుగునట్లు వరమడిగెను.

బలి ఇట్లు అనెను :

మహాభాగ్యవంతుడవై గౌరవము ఇచ్చు ఓ దీర్ఘతముడా! సంతానము కొఱకు నా భార్యతో ధర్మార్థములతో కూడిన పుత్రులను జనింపజేయగలవు అనగనే ఆ దీర్ఘతముడను ఋషి తథాస్తు (అట్లే అగుగాక) అని హితమును పలికెను. అపుడు రాజు అతని కడకు సుధేష్ణ అను తన భార్యను పంపెను. గ్రుడ్డియై ముదుసలియైన ఆ ఋషిని చూచి ఆదేవి ఆతని కడకు పోలేదు. కాని తన దాసిని చక్కగా అలంకరించి ఆతని కడకు పంపెను. ధర్మాత్ముడు వశియునైన ఆ ఋషి ఆ శూద్ర యోనియందు కక్షీవ చక్షుషులను మహౌజస్కులైన పుత్రులను పుట్టించెను. ఆ కక్షీవచక్షుషులను ఇద్దరిని చక్కగా శాస్త్రీయముగా వేదాధ్య యనము చేసినవారిగను, తత్త్వభావనతో ఈశ్వరులై–బ్రహ్మను (వేదమును, సాక్షాత్తు పరబ్రహ్మను) చెప్పువారిగను, తపస్సిద్ధులుగను, ధర్మమును ప్రత్యక్షము చేసికొన్నవారిగను, జ్ఞానులుగను, అత్యంతముగ సర్వశ్రేష్ఠులైనవారిగను చూచి విరోచన పుత్రుడైన బలి ఈ పుత్రులు నా పుత్రులేఅని ఋషితో అనెను. ఋషికాదని బలితో అనెను. తరువాత వీరు నా పుత్రులనియు అనెను. ఈమిషగా శూద్రయోనియందు నాకు పుట్టినవారు దేవోత్తములు. నన్ను అంధుని గను ముదుసలిగను తలచి నీ భార్య సుధేష్ణ నాకుఅవమానముగా శూద్రు రాలయిన దాసిని పంపెను అనగానే ఆ ఋషిసత్తముని శాంతింపచేసి బలిప్రభువు భార్యయైన సుధేష్ణను బెదరించెను. తరువాత ఆమెను మరల అలంకరించి ఋషికడకు పంపెను. అంత, దీర్ఘతమ ఋషి దేవితో ఇట్లనెను. “ఓ మంగళ స్వరూపురాలా! ఉప్పు కలిపిన పెరుగును శరీరము అంతయు పూసికొని వివస్త్రుడనుగా ఉన్న నన్ను పాదముల నుండి శిరము వరకు ఏవగించుకొనక నాకినచో నీవు కోరుకొన్న పుత్రులను పడయుదువు అన గానే ఆమె కూడ ముని చెప్పినది అంతయు చేయుచు అపాన (గుద) ప్రదేశము వరకు వచ్చి అసహ్యించుకొని ఆ భాగమున వదలివేసెను. అంత, ఋషి ఓ మంగళ మయురాలా! నీవు ఏ భాగమును వదిలితివో! ఆ భాగములేని పుత్రుని కనెదవు–అనెను. అంత, ఆ దేవి సుధేష్ణ “ఓ మహాభాగుడా! నీవు నాకు ఇటువంటి పుత్రుని ఇచ్చుట న్యాయముకాదు” అని దీర్ఘతమునితో అనెను.

ఋషి ఇట్లు అనెను :

"ఓ దేవీ! ఇది నీ అపరాధము. ఇది వేరొకతీరు కానేరదు. ఓ సువ్రతురాలైన దేవీ! ఇపుడు నేను నీకు పుత్రుని ఇచ్చెదను. అతనికి అపానము లేకయే యోగ్యస్థితి కలుగ గలదు అని దీర్ఘతముడు ఆమె కడుపుపై స్పృశించి" ఓ శుద్ధమైన చిరునగవు గలదానా! నా శరీరము నుండి నీవు నాకిన పెరుగుతో నీ గర్భము చంద్ర కళలతో పూర్ణిమవలె నిండినది. నీకు దేవకుమారులతో సమానులును, తేజస్వులును, పరాక్రమము కలవారును, యాగముచేయువారును, ధార్మికులునైన ఐదుగురు పుత్రులు పుట్టుదురు" అని చెప్పెను. తరువాత సుధేష్ణకు అంగుడను జ్యేష్ఠ పుత్రుడు పుట్టెను. తరువాత, వంగుడు, కళింగుడు, పుండ్రుడు, బ్రహ్మయు పుట్టిరి. ఈ ఐదుగురు బలియొక్క క్షేత్రమున ఆతని వంశమును పొందినవారై పుట్టిరి. వీరు పూర్వము దీర్ఘతమునిచే బలికి ఈయబడిన పుత్రులు. ఆతని యొక్క సంతానములు ఒక కారణమును బట్టి బ్రహ్మచే అపహతములైనవి. కావున ఆ మహాత్మునకు తన అపత్య, అమాత్య, దారలయందు సంతానము కలుగకుండెను. కావున ఆతడు మనుష్య యోనియందే సంతానమును పుట్టించెను. తరువాత సురభి(గోవు) సంతు ష్టురాలై దీర్ఘతమునితో ఇట్లనెను. నీవు తెలిసి ఈ విధముగ గోధర్మము ఆచరించితివి. కావున ఆ న్యాయముతోనే నిన్ను వదిలిపెట్టు చున్నాను. నీయొక్క ఆ న్యాయముచే ప్రీతుడ నైతిని. కావున ఈనాడు ఈ దీర్ఘతమమును పోగొట్టు చున్నాను. నీ శరీరమున బృహస్పతికి సంబంధించిన తక్కిన పాపమును కూడ పోగొట్టుచున్నాను. నీ జరా, మృత్యు భయములను కూడ నిన్ను వాసన జూచి పోగొట్టెదను–అని వాసన చూడగనే దీర్ఘతమము నశించి దీర్ఘతముడు చూడగలిగెను. తరువాత ఆయుష్మంతుడును, యువకుడును, నేత్రములు కలవాడును అయ్యెను. గోవుచేత ఆ దీర్ఘతముడు తరువాత గౌతముడుగా మారెను. తరువాత కక్షీవంతుడు తండ్రితో బాటు గిరివ్రజమునకు వెళ్లి ఉద్దేశించిన విధముగా తండ్రికొఱకు విపులమైన తపము ఆచరించెను. తరువాత చాలా కాలమునకు తమస్సుతో భావింపబడి మనుజప్రభువై దోషములను పోగొట్టి బ్రాహ్మణ్యమును పొందెను. అంత, తండ్రి ఆతనితో నేను పుత్రవంతుడనైతిని, సత్పుత్రుడవై యశస్వివైన నీచేత కృతార్థుడనైతిని అనెను. యోగయుక్తాత్ముడైన ఆతడు బ్రహ్మచే అక్షయమును పొందెను. బ్రాహ్మణ్యమును పొందిన కక్షీవంతుడు వేయి పుత్రులనుసృష్టించెను. నల్లని శరీరములుగల ఆ గౌతములు కక్షీవంతుని కుమారులు. ఇట్లు దీర్ఘతమసుని యొక్కయు వైరోచనుడైన బలియొక్కయు సమాగమము. వారిరువురి సంతానము కూడ చెప్పబడినది. బలి పాపరహితులైన ఆ అయిదుగురు పుత్రులను రాజ్యమునందు అభిషేకించి, కృతార్థుడై, ఆతడుకూడ యోగాత్ముడై యోగమును ఆశ్రయించి సర్వప్రాణులకును అదృశ్యుడై కాలాకాంక్షియై చరించుచున్నాడు.

అచట అంగుడను రాజర్షికిపుత్రుడు రాజైన దధివాహనుడు, సాపరాధయైన సుధేష్ణకు అనపానుడను రాజు పుత్రుడు, అనపానుని పుత్రుడు రాజైన విరథుడు, విరథుని పుత్రుడు విద్వాంసుడై రాజైన ధర్మరథుడు. ఈ శ్రీమంతుడైన ధర్మరథుడే విష్ణుపదము అను పర్వతము నందలి యజ్ఞమున మహాత్ముడైన ఇంద్రునితో కూడి సోమము త్రాగెను. ధర్మరథునకుకూడ రాజైన చిత్రరథుడు కలిగెను. అతని పుత్రుడు లోమపాదుడు, అతని పుత్రిక శాంత. అతనికి చండికుడు, అతనికి ఇంద్రుని వారించునట్టి వారణము ఉండెను. ఆతడు మంధువు యొక్క ఉత్తమ వాహనమును భూమికి తెచ్చెను. హర్యంగుని పుత్రుడు రాజైన భద్రరథుడు. భద్రరథునకు రాజైన బృహత్కర్ముడు. ఆతనికి బృహద్రథుడు, అతనికి బృహన్మనుడు పుత్రులు. బృహన్మనునకు రాజైన జయద్రథుడు, అతనికి రాజైన దృఢరథుడు, దృఢరథునకు విశ్వజేత జనమేజయుడును పుత్రులు. జనమేజయునకు అంగుడు, ఆతనికి రాజైన కర్ణుడు, కర్ణునకు శూరసేనుడు, అతనికి ద్విజుడును పుత్రులు.

ఋషులు ఇట్లు అనిరి :

"కర్ణుడు సూత పుత్రుడు ఎట్లు అయ్యెను. అంగవంశజుడు ఎట్లు అయ్యెను?"

సూతుడు ఇట్లు అనెను :

బృహద్భానువునకు రాజైన బృహన్మనుడు పుత్రుడుగా పుట్టెను. ఆతనికి ఇరువురు భార్యలు ఉండిరి. వారు ఇరువురును చైద్యుని పుత్రికలు. వారు యశోదేవీ, సత్య అనువారు. వారి వంశము వేరు వేరైనది. యశోదేవియందు జయద్రథుడను రాజేంద్రుడు పుట్టెను. బ్రహ్మ క్షత్రాంతరుడు (బ్రహ్మ క్షత్రముల మధ్యవాడు) సతియందు విజయుడని ప్రసిద్ధి గాంచెను. విజయునకు పుత్రుడు ధృతి. ఆతని పుత్రుడు ధృతవ్రతుడు. ధృతవ్రతుని పుత్రుడు మహాయశస్వి సత్యకర్మ–సత్యకర్మ పుత్రుడు అతిరథుడైన సూతుడు. ఆతడు కర్ణుని తీసి కొనెను. దాని వలన కర్ణుడు సూతజుడు. కర్ణుని విషయమున పూర్వము చెప్పబడినది అంతయు మీకు ఇపుడు చెప్పబడినది. వీరందరును అంగవంశరాజులు. నాతో చెప్పబడిరి. పూరువు యొక్క సంతానమును విస్తరముగను ఆనుపూర్వితోను వినుడు.

సూతుడు ఇట్లు అనెను :

పూరువునకు పుత్రుడు మహాబాహువై, రాజైన జనమేజయుడు. అతని పుత్రుడు అవిద్ధుడు, ఈతడు తూరుపు దిక్కును జయించెను. అవిద్ధునకు ప్రవీరుడు. అతనికి మనస్యువు, మనస్యునకు రాజైన జయదుడు. అతనికి రాజైన ధుంధువు. ధుంధువునకు బహుగవి, ఆతనికి సంజాతి, సంజాతికి రౌద్రాశ్వుడు పుత్రులు, ఆతని పుత్రులను వినుడు–

రౌద్రాశ్వునకు ఘృతాచిఅను అప్సరయందు పదుగురు పుత్రులు పుట్టిరి. రజేయువు, కృతేయువు, వక్షేయువు, స్థండిలేయువు, ఘృతేయువు, జలేయువు, ఏడవవాడు స్థలేయువు, ధర్మేయువు, సన్నతేయువు, పదవవాడు వనేయువు. రద్ర, శూద్ర, మద్ర, శుభ, జామలజ, తల, ఖల, ఈ యేడుగురును, గోపజల, తామ్రరస, రత్నకూటి ఈ పదుగురు పుత్రికలు. వంశతః ఆత్రేయుడను పేరుతో ప్రభాకరుడనువాడు వారికి భర్త. అనాదృష్టుడు రాజర్షియు అయిన రివేయువు ఆతని పుత్రుడు. రివేయుని భార్య తక్షకపుత్రియైన జ్వలన. ఈమె యందు రాజర్షి రంతినారుని కనెను. రంతినారుడు సరస్వతియందు మంగళకరులైన పుత్రులను కనెను. వారు త్రసువు, ప్రతిరథుడు, అతిధార్మికుడైన ధ్రువుడును, గౌరియని ప్రఖ్యాతి గాంచిన కన్యయు కలిగినది. ఆమె మాంధాతకు తల్లి. ప్రతిరథునకు ధుర్యుడు, ఆతనికి కంఠుడు పుత్రులు. ఆతనికి సుతుడు మేధాతిథి. అతని వల్ల కంఠాయనులను ద్విజులు కలిగిరి. యమునకు ఇతిన అనుకన్య ఉండెను. ఆమె పుత్రులను కనెను. త్రసువు సుదయితుడును, మలినుడును, బ్రహ్మవాదియు అయిన ఉపదాతుని పుత్రునిగా పొందెను. తరువాత యమకన్య ఇతిన (ఇలిన) సుష్మంతుడు, దుష్యంతుడు, ప్రవీరుడు, అనఘుడు– అను నలుగురిని కనెను. తరువాత రాజశ్రేష్ఠుడైన చక్రవర్తియైన దుష్యంత పుత్రుడు జనించెను. శకుంతలయందు దుష్యంతునకు భరతుడు జనించెను. అతని పేర భారతమైనది. అశరీరవాణి దుష్యంతునితో ఇట్లనెను. తల్లి సంచివంటిది. పుత్రుడు తండ్రికి చెందినవాడే. ఎవనిచే జనించునో వాడే వాడగును (తండ్రియే పుత్రుడగును). శకుంతల తన పుత్రుడు నీ పుత్రుడేయని సత్యము బలికినది. కావున దుష్యంత పుత్రుడైన దౌష్యంతిని భరింపుము. ఓ రాజా! రేతస్సున ధరించువాడు యముని ఇంటి నుండి పుత్రుని దీసికొని వచ్చును. ఈ గర్భమునకు నీవే ఆధానకర్తవు. శకుంతలను అనుమానింపకుము. భరతుడు ముగ్గురు స్త్రీలయందు పుత్రులను కనెను. కాని, రాజు తనకు అనురూపులుగా లేరని వారిని అభినందింప లేదు. కావున వారి తల్లులు కోపించినవారై ఆ పుత్రులను యమ నిలయమున కంపిరి (చంపిరి). అందువలన రాజునకు ఆ పుత్రుల జన్మ వ్యర్థమైనది. అందువలన ఆతడు (భరతుడు) మరుత్తులచే బృహస్పతియొక్క పుత్రుని భరద్వాజుని రప్పించి ఆ మరుత్తులచే యజ్ఞముల ద్వారా భరద్వాజుడు పుత్రుడుగా సంక్రమింప జేయబడెను. అచటనే మరుత్తులచే భరతునకై భరద్వాజుని ఈ జన్మసంక్రమణము జరిగినదని చెప్పుదురు.

పూర్వము భార్య ప్రసవించుటకు సమీపింపగా అశిజుడు భార్యతోనే ఉండెనట. తరువాత, బృహస్పతి తన అన్న భార్యను చూచి–ఓ మంగళకరమైనదానా! నిన్ను నీవు చక్కగా అలంకరించుకొని నాకు మిథునచర్యా సుఖము ఒసంగుమని అడిగెను. అనగనే–

ఓ విభో! (సర్వ వ్యాపియైన విజ్ఞుడా!) నేను గర్భవతిని. ఈ గర్భము పరిణతమై తన వాక్కుతో వేదమును పలుకుచున్నది. నీవు గూడ వ్యర్థముగాని రేతస్సు (వీర్యము) కలవాడవు. ఈ నీ ధర్మము కూడ మిక్కిలి నిందింపబడినది–అని అన్న భార్య అనెను. అనగనే చిరు నవ్వు నవ్వుచు బృహస్పతి– 'ఏమైనను నాకు వినయమును ఉపదేశింపకుము'–అని సంతసించుచునే బలాత్కారముగ ఆమెతో మిథున కార్యమును ప్రారంభించెను. ఆ విధముగ హర్షించుచున్న బృహస్పతితో ఆమె గర్భము (లోనున్న శిశువు) 'ఓ తండ్రీ! బృహస్పతీ! ముందే నేను ఇచట ప్రవేశించి ఉన్నాను, మీరు అమోఘ రేతస్కులు. ఇద్దరికి ఇచట అవ కాశము లేదు' అనెను. అనగనే కోపించి బృహస్పతి–'సర్వ ప్రాణులకు ఇష్టమైన ఈ సమయమున నన్ను నిషేధించుచున్నావు, కావున దీర్ఘమైన తమమున ప్రవేశింతువు'– అని శపించెను. ఆ శిశువు తన పాదములచే తల్లి (యోని) ద్వారమును కప్పెను. బృహస్పతి యొక్క ఆ రేతస్సు ఆ శిశువు పాదముల మధ్యన నివారింపబడి చిన్న శిశువుగా మారి వెలువడెను. అప్పటికప్పుడే బృహస్పతి రేతస్సున పుట్టిన ఆ కుమారుని చూచి మమత (బృహస్పతి అన్న అశిజునిభార్య) 'ఓ బృహస్పతీ! ఈ ద్వాజుని (ఇరువురికి పుట్టిన వీనిని) భరింపుము. నా గృహమునకు వెళ్లుదును అని వెళ్లిపోవగనే, ఆ క్షణముననే బృహస్పతి కూడ విడిచిపెట్టెను. "భరస్వబాధమితి"–నిన్ను నీవే ప్రయత్నముతో భరించు కొనుము' అని చెప్పబడుటచే తరువాత ఈతడు భరద్వాజుడు అయ్యెను. తరువాత, తల్లి దండ్రులచే వదిలిపెట్టబడిన ఆ శిశవును చూచి మరుత్తులు (మరుత్తులు అను దేవతలు) దయతో ఈ భరద్వాజుని తీసికొని అటనుండి వెళ్లిపోయిరి. ఆ కాలమున భరతుడు పుత్రలాభమునకై మరుద్దేవతలచే వరుసగా కామ్య–నైమిత్తికములైన యజ్ఞముల చేయుచుండెను. యజమాని భరతుడు తనకు వీనివలన పుత్రులు కలుగనందున పుత్రార్థమై మరల మరుత్సోమ యాగమునుచేసెను. ఆ మరుత్సోమయాగముతో మరుత్తులు సంతోషించిరి. తరువాత బృహస్పతి పుత్రుడును మనీషియు అయిన భరద్వాజుని పుత్రునిగా భరతునకు ఇచ్చిరి. భరతుడు భరద్వాజుని తన పుత్రునిగా పొంది, అపుడు ఇట్లనెను. ఓ ప్రభూ! సంతానము సంపాదింపబడగనే నీచేత ధన్యుడనైతిని. పూర్వము సంతానమునకై భరతుడు చేసిన యాగము వితథమైనది (వ్యర్థమైనది). కావున భరద్వాజుడు ఆ విధముగా వితథుడనబడెను. కావున దివ్యుడైన భరద్వాజుడు బ్రాహ్మణ్యము నుండి క్షత్రియుడు అయ్యెను. ద్వాముఖ్యా యనుడు అనువాడు ద్వి పితృకుడు అనబడెను. తరువాత, వితథుడు పుట్టగనే ఆ భరతుడు స్వర్గమునకు పోయెను. వితథుని పుత్రుడు భువమన్యుడు. భువమన్యుని పుత్రులు మహా భూతములతో సాటియైన నలుగురు. వారు–బృహత్ క్షత్రుడు, మహావీర్యుడు, నరుడు,

వీర్యవంతుడైన గార్గుడును. నరునకు పుత్రుడు సాంకృతి. ఆతని పుత్రులు ఇరువురు మహౌజస్కులు. గురువీర్యుడు, త్రిదేవుడు అను సాంకృతి పుత్రులు చిన్నవారు. గార్గుని పుత్రులు శినిబద్ధునివల్ల కలిగిరి. తరువాత గ్రాగ్యులు క్షాత్రముతో కూడిన ద్విజాతులు అనబడిరి. మహార్యుని పుత్రుడు భీముడు. ఆతని వల్ల ఉభక్షయుడు. ఆతని భార్య విశాల ముప్వురు పుత్రులనుకనెను. వారు-త్రయ్యారుణి, పుష్కరిణుడు, మూడవవాడు కపి. కపికి ఈ క్షత్రవరులు, తక్కిన ఈ ఇరువురికి మహర్షులును కలిగిరి. గ్రాగ్యులు సాంకృతులు, వీర్యులు క్షత్రో పేతులైన ద్విజాతులు. ఆంగిరసుని ఆశ్రయించిన పక్షమును బృహత్ క్షత్రునకు సంబంధించినదిగా చెప్పుము. బృహత్ క్షత్రుని పుత్రుడు సుహోత్రుడను ధార్మికుడు. సుహోత్రుని పుత్రుడు హస్తిఅనువాడుండెను. పూర్వము ఆతనిచేత ఈ హస్తినము అనుపురము నిర్మింపబడినది. హస్తినునకు కూడ ముప్వురు పుత్రులు పరమ ధార్మికులు. వారు-అజమీఢుడు, ద్విమూఢుడు, పురుమీఢుడును.

అజమీఢుని పుత్రులు శుభులు శుభకులోద్వహులు. మిక్కిలి గొప్పనై వృద్ధుడైన రాజు తపముయొక్క చివర పరమధార్మికులు. భరద్వాజుని అనుగ్రహమున కలిగిన ఆతని విస్తారమును వినుడు. అజమీఢునకు కేశినియందు కంఠుడు కలిగెను. ఆతనికి మేధాతిథి పుత్రుడు. ఆతని వల్ల కంఠాయనులైన ద్విజులు కలిగిరి. అజమీఢునకు ధూమిని యందు రాజైన బృహద్వసువు జనించెను. బృహద్వసువునకు బృహద్విష్ణువు, ఆతనికి మహాబలుడు, ఆతనికి బృహత్కర్ముడు, ఆతనికి బృహద్రథుడు, ఆతనికి విశ్వజిత్తు, ఆతనికి సేనజిత్తు, సేనజిత్తునకు లోకప్రసిద్ధులైన నలుగురు పుత్రులు-రుచిరాశ్వుడు, కావ్యుడు, రాముడును, వత్సుడు ఆవంతికరాజు. ఈతనికి వారు పరివత్సరులు. రుచిరాశ్వుని పుత్రుడు మహాయశస్వి పృథుషేణుడు. పృథుషేణునికి పారుడు, పారునకు నీపుడు పుట్టిరి. నీపునకు నూర్వురు పుత్రులు. వారందరును నీపులని పిలువబడిరి. వారికి వంశకరుడు శ్రీమంతుడై రాజకీర్తి వర్ధనుడై, కాంపిల్యమున సమరుడను వాడు. ఆతనికి సమరుడు అన్న ఎక్కువ ప్రీతి. సమరునకు-పరుడు, పారుడు, సత్వదశ్వుడు-అను ముప్వురు పుత్రులు సర్వగుణోపేతులు. పారపుత్రుడు వృషువు ప్రకాశించెను. వృషునకు పుత్రుడు ప్రకృతి అనువాడు. సుకృత కర్మతో పుట్టిన సర్వగుణోపేతుడు. ఆతని పుత్రుడు విభ్రాజుడు. విభ్రాజుని పుత్రుడు అణుహుడను రాజు. ఈతడు శుకజామాత, ఋచీభర్త, మహాయశస్వి, అణుహుని పుత్రుడు మహాతపస్వి యైన బ్రహ్మదత్తుడు. ఆతని పుత్రుడు యోగసూనుడు. ఆతని పుత్రుడు రాజైన విష్వక్సేనుడు. విభ్రాజుని పుత్రులు ఇచట సుకృత కర్మతో రాజులు. విష్వక్సేనుని పుత్రుడు ఉదక్సేనుడు. ఆతనికి పుత్రుడు భల్లాటుడు. ఆతనిచే పూర్వము రాజు

హతుడయ్యెను. భల్లాటుని పుత్రుడు రాజైన జనమేజయుడు. ఆతని కొరకు ఉగ్రాయుధునిచే నీపులందరును నశింపజేయబడిరి.

ఋషులు ఇట్లు అనిరి :

ఉగ్రాయుధుడు ఎవని పుత్రుడు? ఏ వంశమునకు చెందినవాడు? ఎందులకు ఆతనిచే నీపులందరు నశింపజేయబడిరి?

సూతుడు ఇట్లు అనెను :

ద్విమీఢునకు విద్వాంసుడైన యవీనరుడు జనించెను. ఆతని పుత్రుడు ధృతిమంతుడు. ఆతని పుత్రుడు సత్యధృతి. ఇక సత్యధృతి పుత్రుడు ప్రతాప వంతుడైన దృఢనేమి. దృఢనేమి పుత్రుడు రాజైన సువర్మఅనువాడు. సువర్మపుత్రుడు ప్రతాపవంతుడైన సార్వభౌముడు. సార్వభౌముడని ప్రసిద్ధి చెందినవాడు అతడు పృథివిలో ఒకే రాజుగా ప్రకాశించెను. ఆతని మహావంశమున మహాత్పౌరవుడు నందనుడు. ఆ మహత్ పౌరవుని పుత్రుడు రాజైన రుక్మరథుడు అనువాడు. తరువాత రుక్మరథునకు సుపార్శ్వుడు అను రాజు. సుపార్శ్వుని పుత్రుడు సుమతి అను ధార్మికుడు. సుమతికి పుత్రుడు రాజై ధర్మాత్ముడైన సన్నతిమంతుడను ప్రభువు. ఆతని పుత్రుడు సనతి అనువాడు ఆతని పుత్రుడు కృతుడు. ఆతడు హిరణ్యనాభియొక్క శిష్యుడు. ఆతడు మహాత్ముడైన కౌథుముడు. ఆ కౌథుమునిచేత ఇరువది నాలుగు విధములుగా సామసంహితలు చెప్పబడినవి. అవి ప్రాచ్యములను పేరుగలవై కార్తములు (కృతుని నుండి వచ్చినవి) అని పిలువబడినవి. సామములలో సామమును పొందిన కార్తి (కృతుని పుత్రుడు) ఉగ్రాయుధుడు. ఆతడు వీరుడైన పౌరవనందనుడు. ఆతడు పరాక్రమించి, పృషతుని తాతయు మహాబాహువునైన నీలుడును పాంచాలాధిపతిని వధించెను. ఉగ్రాయుధుని పుత్రుడు మహాయశస్వి, క్షేముడు అనువాడు. క్షేమునకు సువీరుడు, సువీరునకు నృపంజయుడు, నృపంజయునకు వీరరథుడును జనించిరి. వీరిని పౌరవులు అందురు.

అజమీఢునకు నీలిని యందు నీలుడను రాజు కలిగెను. నీలునకు ఉగ్ర తపస్సుతో సుశాంతి అనువాడు కలిగెను. సుశాంతికి పురుజానువు, పురుజానునకు రిక్షుడు, ఆతని పుత్రుడు బేదులు, వారి పుత్రులు–ముద్గలుడు, సృంజయుడు, రాజైన బృహద్విషువు, చిన్నవాడు విక్రాంతుడు, ఐదవవాడు కంపిల్యుడు అనువారు. ఈ ఐదుగురి రక్షణకొఱకు తండ్రివారితో "మీ ఐదుగురికి ఈ అయిదు విశాల దేశములు కూర్చబడినవి" అని చెప్పెను. ఇవివారి సంరక్షణకు సమర్థములు. ఇవి పాంచాలములని ప్రసిద్ధములు. ముద్గలు

నకు కూడ మౌద్గల్యులను క్షాత్రముతో గూడిన ద్విజాతులు కలిగిరి. వీరు అంగిరసుని పక్షమును ఆశ్రయించిన కంఠముద్గలులు. ముద్గలుని జ్యేష్ఠపుత్రుడు మహాయశస్వియైన బ్రహ్మిష్ఠుడు. ఈతనివల్ల ఇంద్రసేన గర్భము ధరించి బధ్యశ్వుని కనెను. బధ్యశ్వునివల్ల మేనక మిథునమును కనెనని వినికిడి. ఆ మిథునము రాజర్షియైన దివోదాసు, యశస్విని యైన అహల్యయు. అహల్య శారద్వంతునివల్ల పుత్రుని శతానందునికనెను. ఆతని పుత్రుడు మహాయశస్వి, ధనుర్వేదపారగుడు అయిన సత్యధృతి. తన ఎదుట అప్సరసను చూచి సత్య ధృతికి శుక్రము స్ఖలించి రెల్లుగడ్డిపైన పడగా అది జంటగా మారెను. వేటకు వెళ్లిన శంతనుడు కృపతో ఆ జంటను స్వీకరించెను. ఆ కారణమున ఆ జంటలోని పురుషుడు కృపుడనియు, స్త్రీయైన గౌతమి కృపి అనియుఅనబడిరి. వీరికి శారద్వతులు అనికూడా పేరు వచ్చినది. ఋతథ్యుడు గౌతమ వంశీకుడు. ఆ పైన దివోదాసుని సంతతిని చెప్పెదను వినుడు.

దివోదాసుని పుత్రుడు బ్రహ్మిష్ఠుడైన మిత్రయుడు అను వసురాజు. ఆతని పుత్రుడు మైత్రేయుడు. వీరు గూడ సంశ్రితులు అనబడిరి. వీరు కూడ పక్షమును ఆశ్రయించిన క్షాత్రోపేతులైన భార్గవులు. అందులో చ్యవనుడు విద్వాంసుడైన రాజుకూడ. ఆతనివల్ల ప్రతిరథుడు కలిగెను. ఆతరువాత చ్యవనునివల్ల ధీమంతుడైన సుదాసుడు జనించెను. సుదాస పుత్రుడు సహదేవుడు. ఆతని పుత్రుడు సోమకుడు. వంశము క్షీణింపగా సోమ కునితో పాటు అజమీఢుడు మరల జన్మించెను. సోమకుని పుత్రుడు జంతువు. ఆతడు హతుడుకాగా మహాత్ముడైన అజమీఢునకు సోమకదశలో నూర్గురు పుత్రులు కలిగిరి. వారిలో చిన్నవాడు పృషతుడు. ఈతడు ద్రుపదుని తండ్రి తండ్రి. పృషతునకు పుత్రుడు ధృష్టద్యుమ్నుడు. ఆతని పుత్రుడు ధృష్టకేతవు. అజమీఢుని మహిషి ధూమిని పుత్రుని కోరెను. మరుసటి జన్మలో నూరేండ్లు చరింపనలవిగాని కఠిన తపము చేసెను. అగ్ని హోమము చేసి, పవిత్రమిత భోజనయై నిద్రలేనిది అయ్యెను. రాత్రింబవళ్లు సుమహా వ్రతయై ఆమె కుశల (దర్భల) యందే పరుండెను. ఆమె ధూమ్రవర్ణ కాగా ఆమెయందు వీర్యవంతుడైన అజమీఢుడు ధూమ్రవర్ణుడును సితాగ్రజుడును అయిన ఋక్షుని (భల్లాకుని) కనెను. ఆ ఋక్షుని నుండి సంవరణుడు జనించెను. ఆతని నుండి కురువు జనించెను. ఈ కురువే ప్రయాగను పాదముతో ఆక్రమించి మహాతేజస్వియై చాలయేండ్లు ఈ క్షేత్రమును దున్ని కురుక్షేత్రముగా చేసెను. ఆ విధముగా దున్నగా అచట ఇంద్రుడు వర్షించి వరదుడై ప్రకాశించెను. ఆ క్షేత్రము పుణ్యమైనది. రమణీయమైనది. పుణ్యముజేసిన వారిచే సేవింప బడిన. ఆ వంశమున పుట్టిన రాజసత్తములు కురువులని ప్రసిద్ధిచెందిరి. కురువునకు ప్రియులైన పుత్రులు–సుధన్వుడు, జహ్నువు, పరీక్షిన్మహారాజు, అరిమర్దనుడైన పుత్రకుడు

అనువారలు. సుధన్వుని పుత్రుడు మతిమంతుడైన సుహోత్రుడు. సుహోత్రుని పుత్రుడు చ్యవనుడు. ఆతని పుత్రుడు రాజై ధర్మార్థ కోవిదుడైన కృతుడు. ఈ మహాతపస్వి అనేక యజ్ఞములచేసి ఇంద్రసఖుడైన విశ్రుతుని, విద్యోపరిచరుని, వీరుడై అంతరిక్షమున పోగల వసువును కనెను. విద్యోపరిచరుని వల్ల గిరికయు ఏడుగురు పుత్రులును కలిగిరి. వారు- మహారథుడు, బృహద్రథుడు అని ప్రసిద్ధిగాంచిన భగధరుడు, ప్రత్యగ్రహుడు, మణి వాహ నుడని చెప్పబడు కుశుడు, మాథైల్యుడు, లలిత్థుడు, ఏడవవాడు మత్స్యకాలుడు అనువారు. బృహద్రథుని పుత్రుడు కుశాగ్రుడని ప్రసిద్ధిగాంచినవాడు. కుశాగ్రుని పుత్రుడు వీర్యవంతుడైన ఋషభుడు. ఋషభుని పుత్రుడు ధార్మికుడైన పుష్పవంతుడు. ఆతని పుత్రుడు విక్రాంతుడు. ఆతడు రాజు సత్యహితుడును. ఆతని పుత్రుడు సుధన్వుడు. ఆతని పుత్రుడు ప్రతాప వంతుడైన ఊర్జుడు. ఊర్జుని పుత్రుడు నభసుడు. ఆతనికి ఆ వీర్యవంతుడు జనించెను. ఆతడు మొదలు రెండు ముక్కలుగా పుట్టెను. జరచేత అతడు అతికింపబడెను. జరతో సంధింపబడిన ఆ మహాబాహువు జరాసంధుడు అయ్యెను. మహాబలుడైన జరాసంధుడు సర్వక్షత్రమును జయించెను. జరాసంధుని పుత్రుడు ప్రతాపవంతుడైన సహదేవుడు. సహ దేవుని పుత్రుడు శ్రీమంతుడును, సుమహాతపస్వియు అయిన సోమాధి. సోమాధికి శ్రుత శ్రవుడు. ఈతడు మాగధుడని పిలువబడెను.

సూతుడు ఇట్లు అనెను :

పరీక్షితుని పుత్రుడు జనమేజయుడు. శ్రుతసేనుని పుత్రునికి భీమసేనుడు అని పేరు. జహ్నువు సురథుడను రాజును పుత్రునిగా బడసెను. సురథుని పుత్రుడు వీరుడును రాజు అయిన విదూరథుడు. విదూరథుని పుత్రుడు సార్వభౌముడు. సార్వభౌముని పుత్రుడు జయత్సేనుడు, ఆతని పుత్రుడు ఆరాధి. ఆరాధికి మహాసత్త్వుడు, ఆతనికి అయుతాయువు పుత్రులు. అయుతాయువునకు అక్రోధనుడు, ఆతనికి దేవాతిథి పుత్రులు. దేవాతిథి పుత్రుడు ఋక్షుడు. ఈతనికి పుత్రుడు భీమసేనుడు. ఆతనికి దిలీపుడు పుత్రుడు. దిలీపుని పుత్రుడు ప్రతిపుడు. ఆతనికి నలుగురు పుత్రులు. వారు-దేవాపి, శంతనుడు, బాహ్లీకుడును- అను ముప్వురు. బాహ్లీకుని పుత్రుడు సప్తబాహ్లీశ్వరుడు అను రాజు. బాహ్లీకుని పుత్రుడు మహాయశస్వి అయిన సోమదత్తుడు. సోమదత్తుని వల్ల భూరి, భూరిశ్రవుడు, శల్యుడును పుత్రులు. దేవాపి ధర్మమును పొందగోరి పరివ్రాజి (సర్వమును పరిత్యజించినవాడు) అయ్యెను. దేవాపి మునియై దేవతలకు ఉపాధ్యాయుడు అయ్యెను. ఈ మహాత్ముని పుత్రులు చ్యవనుడు, ఇష్టకుడును. శంతనుడు రాజు, విద్వాంసుడు, మహాభిషుడును. ఆ మహాభిషుని గూర్చి ఈ రాజైన మహాభిషుడు సమయ ప్రకారము ఏయే జీర్ణించిన రాజును స్పృశించునో!

ఆ రాజు మరల యువకుడగును. అందువలననే వారు ఈతనిని శంతనుడని తెలియుదురు అని ప్రజలచే చెప్పబడెను. ఆ తరువాత ప్రజలలో శంతనుత్వము ప్రసిద్ధి చెందినది. ఆ ధర్మాత్ముడైన శంతనుడను రాజు జాహ్నవిని (గంగను) పెండ్లాడెను. ఆమె యందు ఆ ప్రభువైన శంతనుడు భీష్ముని పుత్రునిగా కనెను. ఆతడు భీష్ముడు పాండవుల పితామహుడు అనియు ప్రసిద్ధిగాంచెను. కొంతకాలమునకు శంతనుడు విచిత్రవీర్యుని పుత్రునిగా పడసెను. ఆతడు శంతనునకు ప్రియపుత్రుడు, ప్రజాహితము చేయువాడును అయిన ప్రభువు. కృష్ణద్వైపాయనుడు విచిత్ర వీర్యుని క్షేత్రమున ధృతరాష్ట్రుని, పాండురాజును, విదురునిని కనెను. ధృతరాష్ట్రునివల్ల గాంధారి నూరుగురు పుత్రులను కనెను. వారిలో దుర్యోధనుడు జ్యేష్ఠుడు. సర్వ క్షత్రమునకును ప్రభువు. రాణి మాద్రి, పృథయును పాండువు (పాండురాజు) యొక్క భార్యలు. పాండువు కొఱకు దేవతలచే ఈయబడిన పుత్రులను ఇరువురు పాండుభార్యలు కనిరి. యమధర్మరాజు వలన యుధిష్ఠిరుడు జన్మించెను. వాయువు వలన భీముడు జనించెను. ఇంద్రునివల్ల అర్జునుడు జనించెను. ఈతడు ఇంద్రునితో సమానమైన పరాక్రమము కలవాడు. అశ్వినీదేవతల వల్ల మాద్రిజులుగా సహదేవ నకులులు జనించిరి. పాండవుల వల్ల ద్రౌపదికి ఐదుగురు పుత్రులు జనించిరి. ద్రౌపది యుధిష్ఠిరుని వల్ల జ్యేష్ఠుడైన శ్రుతివిద్ధుని (ప్రతివింధ్యుని) కనెను. హిడింబ భీమసేనుని వల్ల ఘటోత్కచుడను పుత్రుని కనెను. కాశిఅను ఆమె భీమసేనుని వల్ల సర్వవృకుడు అను పుత్రుని కనెను. మద్రదేశకన్యయైన విజయ, సహదేవుని వల్ల సుహోత్రుడు అను పుత్రుని కనెను. చైద్యయైన కరేమతి (కరేణుమతి) యందు-భీమసేన పుత్రుడుగా నిరమిత్రుడు జనించెను. అర్జునుని వల్ల సుభద్రయందు రథియైన అభిమన్యుడు జనించెను. విరాటరాజకన్యయైన ఉత్తరయందు అభిమన్యునకు పరీక్షిత్తు జనించెను. పరీక్షిత్తు పుత్రుడు రాజైన జనమే జయుడు. ఆతడు శత్రువులు లేకుండా బ్రాహ్మణులను వాజసనేయికులనుగా స్థాపించెను. అపుడు కోపించిన వైశంపాయనుడే-ఓ దుర్బుద్ధీ! ఈ భూలోకమున నీ ఈ వచనము నిలువదు. నేను ఈలోకమున ఉన్నంతవఱకు ఇది గౌరవింపబడదు. తఱువాత, అంతటను ఉన్నప్పటికిని జనమేజయుడు, పౌర్ణమాస్య హవిస్సుతో దేవుని హోమము చేసి, బ్రహ్మను తెలిసికొన్నవాడై విభువుయొక్క యజ్ఞమున ఆతనికి బ్రహ్మకు ఇష్టునిగా (యజ్ఞము చేయబడిన వానిగా) చూచెను. పరీక్షిత్తు తనయుడై పౌరవుడైన జనమేజయుడు రెండు మారులు అశ్వమేధయాగమును చేసి, ఆ తరువాత వాజసనేయకము అయిన బ్రహ్మను ప్రవర్తింపచేసియు త్రిఖర్వి అయ్యెను. అశ్వకముఖ్యుల ఖర్వము ఒకటి, అంగనివాసుల ఖర్వము రెండు, మధ్య దేశముల ఖర్వము మూడు. ఈ విధముగ జనమేజయుడు

త్రిఖర్వి అయ్యెను. తరువాత దుఃఖము వలన శపింపబడినవాడై బ్రాహ్మణులతో పాటు నాశమును పొందెను. ఆతని పుత్రుడు శతానీకుడు బలవంతుడు. సత్య పరాక్రమము కలవాడు. తరువాత బ్రాహ్మణులు జనమేజయ సుతుని శతానీకుని రాజ్యమందు అభిషేకించిరి. శతానీక పుత్రుడు 'అశ్వమేధదత్తు'డయ్యెను. ఆతడు వీర్యవంతుడు అశ్వమేధ దత్తుని వల్ల పరపురంజయుడు జనించెను. ఇప్పటివాడు, మహాయశస్వి, ధర్మాత్ముడునైన వాడు, అధిసామకృష్ణుడు, ఆతడు భూమిని పరిపాలించుచుండగా మీచేత మూడేండ్లు నిర్వర్తింప అలవికానిదియు, పొందనలవికానిదియు అయిన ఈ దీర్ఘ సత్రము (యాగము) నిర్వహింపబడినది. బ్రాహ్మణోత్తములారా! రెండేండ్లు కురుక్షేత్రమున దృషద్వతియందు ఇది నిర్వహింపబడినది.

ఋషులు ఇట్లు అనిరి :

ఓ మహాబుద్ధిశాలీ! ప్రజలయొక్క భవిష్యమును వినగోరు చున్నాము. ఓ సూతుడా! రాజులచే కడచిన దానిని నీవు చెప్పితివి. ఇక రాజులతో పాటు భవిష్యము ఎట్లుండునో తెలుపకోరెదము. ఏది నిలువబోవుచున్నదో! ఏ రాజులు జనింపబోవుచున్నారో! ఒక యేడు ముందరనైనను పేర్లతో సహా ఆ రాజులను చెప్పుము. కాలము, యుగప్రమాణము, కలుగబోవు గుణదోషములు, ధర్మార్థకామముల వల్ల ప్రజలకు కలుగు సుఖదుఃఖములును, ఇది అంతయు చక్కగా లెక్కించి అడుగుచున్న మాకు సంపూర్ణముగ చెప్పుము. అనగానే బుద్ధిమంతులలోశ్రేష్ఠుడైన సూతుడు జరిగినది జరిగి నట్లు, చూచినది చూచినట్లు, విన్నది విన్నట్లు చెప్పెను.

సూతుడు ఇట్లు అనెను :

అద్భుతకర్ముడైన వ్యాసునిచే నాకు చెప్పిన విధముగ, భవిష్యమైన కలియుగమును, అట్లే మన్వంతరములను, తక్కిన జరుగబోవు వృత్తాంతములను అన్నింటిని చెప్పెద వినుడు. ఇకముందు ఏ రాజులు రానున్నారో! ఆ ఐలులును, అట్లే ఇక్ష్వాకులును, సౌద్యుమ్నులును (సుద్యుమ్న సంబద్ధులైనవారు) అయిన రాజులును-వీరియందే ఈ ఐక్ష్వాకమైన ఈ శుభ క్షేత్రము సంస్థాపింపబడును. భవిష్యమున పఠింపబడబోవు మీ అందరికి చెప్పెదను. వారి తరువాత పుట్టబోవు రాజులను గురించి కూడ చెప్పెదను. క్షాత్రులు, శకులు, పారశవులు (పరస్త్రీలయందు పుట్టినవారు-శూద్ర స్త్రీయందు బ్రాహ్మణునకు పుట్టినవారు), శూద్రులు, తక్కిన ద్విజాతులును, అంధులు, శకులు, పుళిందులు, యవనులతో పాటు తూలికలు, కైవర్తులు, ఆభీరులు, శబరులు, తక్కిన మ్లేచ్ఛ జాతులును-ఒక ఏడు ముందరగా ఈ రాజులను అందరిని పేరులతో చెప్పెదను. ఆ అధిసామకృష్ణుడు అను ఇతడు ఇపుడున్న

పౌరవుని నుండి వచ్చిన రాజు. ఆతని వంశములో రాబోవు రాజులు అందరిని గురించి చెప్పెదను. అధిసామకృష్ణ పుత్రుడు నిర్వక్త్రుడు అనువాడు రానున్నాడు. నాగపట్టణము అనునది గంగతో గొట్టుకొనిపోవగా దానిని వదిలి కౌశాంబియందు సుఖవాసముగా ఉండగలడు. అతనికి కలుగబోవు పుత్రుడు ఉష్ణుడు. ఉష్ణునకు చిత్రరథుడు, చిత్రరథునకు శుచిద్రథుడు, శుచిద్రథునకు వృతిమంతుడు. అతనికి మహాయశస్వియు, మహావీర్యుడునైన సుషేణుడు, అతనికి సుతీర్థుడను రాజును, సుతీర్థునునకు రుచుడు, అతనికి త్రిచక్షుడు, త్రిచక్షునకు సుఖీబలుడును, సుఖీబలునకు రాజైన పరిప్లుతుడు, పరిప్లుతునకు సునయుడను రాజును, సునయునకు రాజైన మేధావియు, మేధావికి దండపాణియు, దండపాణికి నిరామిత్రుడు, నిరామిత్రునకు క్షేమకుడును పుత్రులుగా కలరు. ఈ ఇరుదియైదుగురు రాజులు రాబోవు పూర్వ (పూరు) వంశరాజులు. బ్రహ్మ క్షత్రియులకు కారణమైన వంశము దేవర్షి సత్కృతము. అది క్షేమకుని పొంది కలియుగమున చక్కని స్థితిని పొందగలదు. ఇట పురావిదులైన బ్రాహ్మణులు ఆనువంశికమైన ఈ శ్లోకమును గానము చేయుదురు అని ఈ పౌరవవంశము ఉన్నది ఉన్నట్లు చెప్పబడినది. ఇది ధీమంతుడై మహాత్ముడైన పాండు పుత్రుడైన అర్జునుని యొక్క వంశము. దీని తరువాత మహాత్ములైన ఇక్ష్వాకుల యొక్క వంశమును చెప్పెదను.

బృహద్రథుని పుత్రుడు వీరుడును రాజుఅయిన బృహత్క్షయుడు. అతనికి క్షయుడు, క్షయునకు వత్సవ్యూహుడు, అతనికి ప్రతివ్యూహుడు, అతనికి దివాకరుడును పుత్రులు. దివాకరుడు ఇపుడు రాజై అయోధ్యానగరిలో ఉన్నాడు. దివాకరునకు మహాయశస్వి సహదేవుడు పుత్రుడుగా కలడు. సహదేవునకు బృహదశ్వుడు జనింపగలడు. అతనికి భానురథుడు కలుగగలడు. ఆతనికి ప్రతీతాశ్వునకు సుప్రతీతుడు, అతనికి సహదేవుడు, అతనికి సునక్షత్రుడును సుతులుగా కలరు. సునక్షత్రునకు పరంతపుడైన కిన్నరుడు, అతనికి గొప్పవాడైన అంతరిక్షుడును కలుగగలరు. అంతరిక్షుని వల్ల సుపర్ణుడు, సుపర్ణుని వల్ల అమిత్రజిత్తు, అతని వల్ల భరద్వాజుడు, అతని వల్ల ధర్మియు, సుతులుగా కలుగుదురు. ధర్మికి కృతంజయుడు కలుగును. అతనివల్ల వ్రాతుడు, అతనివల్ల రణంజయుడును కలుగుదురు. రణంజయునకు వీరుడైన సంజయుడు కలుగును. సంజయునకు శాక్యుడు, శాక్యునకు శుద్ధోధనుడును కలుగును. శాక్యుని కొరకై శుద్ధోదనునకు రాహులుడు, ఆతనికి ప్రసేనజిత్తు, అతనికి క్షుద్రకుడును కలుగును. క్షుద్రకునకు క్షులికుడు, క్షులికునకు సురథుడు, సురథునకు సుమిత్రుడు చివరిరాజుగా జనింపగలడు. వీరు కలియుగమున రాబోవు ఇక్ష్వాకులు అనగా ఇక్ష్వాకు వంశమున పుట్టినవారు. బృహద్బల వంశమున కలియుగమున

జనింపబోవు వారు శూరులు, చక్కగా విద్యల నేర్చినవారు, సత్యసంధులు, ఇంద్రియముల జయించినవారును అగుదురు. ఐక్ష్వాకుల ఈ వంశము కలియుగమున సుమిత్రునితో అంతముకాగలదు. రాజైన సుమిత్రుని పొంది తరువాత సంస్థను పొందగలదు–నిది మానవమైన క్షేత్రము ఐలమని కూడ ఉదాహరింపబడినది.

ఈ తరువాత మగధదేశీయులైన బృహద్రథులను గురించి చెప్పెదను. వారు జరాసంధుని వంశమున సహదేవవంశము నందలి రాజులు. గడచినవారు, వర్తమానులు, భవిష్యత్కాలమున కలుగువారును. ప్రాధాన్యమును బట్టి వారిని గురించి చెప్పెద వినుడు. భారత సంగ్రామమున సహదేవుడు పడిపోయెను. అతని పుత్రుడు సోమాధి అను రాజర్షి. గిరివ్రజమున ఏబది ఎనిమిదిఏండ్లు రాజ్యము చేసెను. అతని పుత్రుడు శ్రుతశ్రవుడు అఱువది నాలుగేండ్లు రాజ్యము చేసెను. అయుతాయువు ఇరువది యాఱేండ్లు రాజ్యము చేసెను. నిరామిత్రుడు నూరేండ్లు రాజ్యము చేసి స్వర్గమునకు వెళ్లెను. సుకృతుడు ఏబదియేండ్లు రాజ్యము చేసెను. బృహత్కర్ముడు ఇరువది మూడేండ్లు రాజ్యమును చేసెను. సేనాజిత్తు ఇప్పటికిని ఈ భూమిని పాలించును. శ్రుతంజయుడు నలుబదియేండ్లు పాలింపగలడు. మహాబుద్ధియు మహాభీమపరాక్రముడును అయిన మహాబాహువు ముప్పది అయిదుఏండ్ల రాజై భూమిని పాలించును. 'శుచి' ఏబది ఎనిమిది ఏండ్లు రాజ్యమున ఉండగలడు. క్షేముడు ఇరువది ఎనిమిదేండ్లు రాజు కాగలడు. వీర్యవంతుడైన భువతుడు అఱువది నాలుగు ఏండ్లు రాజ్యము చేయగలడు. ధర్మ నేత్రుడు నిండు ఐదేండ్లు రాజుగా కలడు. నృపతి ఏబది ఎనిమిదేండ్లు రాజ్యము అనుభవింపగలడు. సువ్రతుడు ముప్పది ఎనిమిది యేండ్లు రాజుగా ఉండగలడు. తరువాత సుమతి ముప్పది మూడేండ్లు రాజ్యమును చేయగలడు. సుచలుడు పండ్రెండేండ్లు రాజ్యము అనుభవింపగలడు. సునేత్రుడు నలుబది ఏండ్లు రాజ్యమును అనుభవింపగలడు. సత్యచిత్తు పృథివీ రాజ్యమును ఎనుబది మూడేండ్లు అనుభవింపగలడు. వీరజిత్తు ఈ భూమిని పొంది ముప్పది అయిదు ఏండ్లు ఏలగలడు. అరింజయుడు ఈ భూమిని పొంది ఏబదియేడేండ్లు ఏలగలడు. ఈ బృహద్రథులు ముప్పది రెండేండ్లు రాజులు అగుదురు. వారి రాజ్యము నిండు వేయేండ్లు ఉండును. బృహద్రథులు గతించి వీతిహోత్రులురాగా మునికుడు స్వామిని వధించి పుత్రుని ఆ స్థానమున అభిషేకింప గలడు. ద్వేషించుచున్న రాజులకు బలవంతముగ ముని సుతుడు ప్రద్యోతుడు రాజుకా గలడు. ఆతనికి సామంతులు నమస్కరింతురు. ఆతడు నీతి తప్పినవాడు. ఆ నరోత్తముడు ఇరువది మూడేండ్లురాజు అగును. తరువాత నలుబది ఏండ్లు పాలకుడు రాజగును. విశాఖ యూపుడు ఏబది ఏండ్లు రాజగును. అజకుని రాజ్యము ముప్పది యొక్క ఏండ్లు

నడచును. అజకపుత్రుడు వర్తివర్ధనుడు ఇరువది ఏండ్లు పాలింపగలడు. ఇరువది ఎనిమిది యేండ్లు ప్రాద్యోతులు (ప్రద్యోతపుత్రులు) ఉండగలరు. ప్రాద్యోతులు ఐదుగురు (ప్రద్యోతుని) పుత్రులు వారియొక్క కీర్తిని మొత్తము ధ్వంసముచేసి శిశునాగుడు రాగలడు. అతని పుత్రుడు వారాణసిలో గిరివ్రజమును బొందగలడు. శిశునాగుడు రాజ్యవర్షములు నలుబది యేండ్లు కాగలవు. అతని పుత్రుడు శకవర్ణుడు. ముప్పది ఆరేండ్లు పాలించును. తరువాత క్షేమవర్మ ఇరువది యేండ్లు రాజు కాగలడు. అజాతశత్రువు ఇరువది అయిదు ఏండ్లు రాజు కాగలడు. తరువాత క్షత్రౌజుడు నలుబది ఏండ్లు రాజ్యమును పొంది ఉండగలడు. వివిసారుడు ఇరువది ఎనిమిది ఏండ్లు రాజు కాగలడు. దర్శకుడు ఇరువది అయిదు ఏండ్లు ఏలును. ఆతని తరువాత ఉదాయి ముప్పది మూడేండ్లు రాజుకా గలడు. నాలుగవ ఏట ఆతడు కుసుమపురము అను శ్రేష్ఠ పురము రాజధానిగా, గంగయొక్క దక్షిణ తీరమున రాజ్యము ఏలును. నందివర్ధనుడు నలుబది రెండు ఏండ్లు రాజు కాగలడు. మహానంది నలుబది మూడేండ్లు రాజ్యము ఏలగలడు. ఈ పదుగురు శైశునాగులు రాజులుగా కలరు. వారికాలము మూడు వందల అఱువది రెండేండ్లు కాగలదు. అంతే కాలము ఇతర రాజులు పాలింతురు. వీరితో బాటు రాజులు క్షత్ర బాంధవులు కాగలరు.

ఐక్ష్వాకులు ఇరువది నాలుగేండ్లు, పాంచాలురు ఇరువది అయిదు ఏండ్లు, కాలకులు ఇరువది నాలుగేండ్లు, హైహయులు ఇరువది నాలుగేండ్లును పాలింతురు. కళింగులు ముప్పది రెండేండ్లు, శకులు ఇరువది అయిదు ఏండ్లు, కురువులు ఇరువది ఆఱేండ్లు, మైథిలులు ఇరువది ఎనిమిది ఏండ్లు, శూరసేనులు ఇరువది మూడేండ్లు, వీతిహోత్రులు ఇరువది ఏండ్లును రాజ్యములను పాలింతురు. అందరు రాజులు (సరాసరి) సమానమైన కాలమునకు రాజులు కాగలరు. సర్వక్షత్రముల మధ్యన గొప్పవాడును, శూద్ర స్త్రీయందు మహానందుడను పుత్రుడును, కాలముచే ఆవరింపబడినవాడై మహాపద్ముడు అను రాజు జన్మింపగలడు. అప్పటి నుండి రాజులు శూద్ర యోనియందు పుట్టువారు కాగలరు. ఆ మహాపద్ముడు ఒకే రాజై ఏకచ్ఛత్రుడై ఉండగలడు. కానున్నది బలీయమైనందున సర్వ క్షత్రమును హరించువారిని పెరికివైచి ఇరువది యెనిమిదేండ్లు భూమిని పరిపాలింపగలడు. ఆతని పుత్రులు వేయి ఎనిమిదేండ్లు పరిపాలించిరి. వారు పండ్రెండుగురు రాజులు. మహాపద్ముని మరణా నంతరమున వరుసగా వారు రాజులు అగుదురు. వారందరిని కౌటిల్యుడు పదునారింటి చేత పెరికివైవగలడు. నూరేండ్లు భూమిని పాలించి ఆతడు నందేందువు కాగలడు. కౌటిల్యుడు చంద్రగుప్తుడను రాజును రాజ్యమున స్థాపింపగలడు. చంద్రగుప్తుడు ఇరువది నాలుగేండ్లు రాజుకాగలడు.

భద్రసారుడు ఇరువది యైదేండ్లు రాజు కాగలడు. అహో(శో)కుడు ఇరువది ఆరేండ్లు రాజు కాగలడు. అతని పుత్రుడు కునాలుడు. ఎనిమిదేండ్లు రాజ్యముచేయగలడు. కునాల పుత్రుడైన బంధుపాలితుడు ఎనిమిది ఏండ్లు రాజ్యమును అనుభవింపగలడు. బంధుపాలిత పుత్రుడు ఇంద్రపాలితుడు పదేండ్లు పరిపాలింపగలడు. దేవవర్ముడను రాజు ఏడేండ్లు రాజ్యము ఏలును. అతని పుత్రుడు శతధరుడు రాజై ఎనిమిది ఏండ్లు పాలించును. బృహదశ్వుడు ఏడేండ్లు రాజు కాగలడు. అను నీతొమ్మండుగురు రాజులు నిండు నూట ముప్పది ఏండ్లు భూపరిపాలనా సుఖమును అనుభవింతురు. వారివలన భూమి చక్కగా ఉండగలదు.

సేనానియైన పుష్పమిత్రుడు బృహద్రథుని పెరికివైచి అరువదేండ్లు రాజ్యము చేయ గలడు. పుష్పమిత్రుని పుత్రులు ఎనిమిది ఏండ్లు రాజులు కాగలరు. వారిలో జ్యేష్ఠుడు ఏడేండ్లు రాజు కాగలడు. తరువాత కుమారుడైన వసుమిత్రుడు పదేండ్లు రాజు కాగలడు. తరువాత కుమారుడైన ధ్రుకుడు రెండేండ్లు రాజ్యమేలును. అతని నుండి మూడేండ్లు పులిందకులు ఉండగలరు. రాజు ఘోషసుతుడు కూడ మూడేండ్లు రాజుగా ఉండును. ఆ తరువాత విక్రమిత్రుడు అనురాజు కొన్నియేండ్లు, భాగవతుడను రాజు పంద్రెండు ఏడులును ఉండగలరు. అతని కుమారుడు క్షేమభూమి పదియేండ్లు రాజు కాగలడు. ఈ పదుగురు తుంగరాజులు ఈ భూమిని పరిపాలింతురు. వారినుండి నిండు నూట పంద్రెండు ఏడులు బాల్యమునుండియు వ్యసనియైన (చెడు అలవాట్లుగల) అపార్థి వసుదేవుని ఈ రాజ్యము చేరగలదు? తరువాత శృంగములలో (శృంగ దేశములలో) దేవభూమియు వాని తరువాత ఇతరుడును రాజుకాగలరు. కంఠాయనుడను రాజు తొమ్మిదేండ్లు రాజుకాగలడు. ఆతని పుత్రుడు భూతిమిత్రుడు ఇరువది నాలుగు ఏండ్లు రాజుగా కలడు. అతని తరువాత పంద్రెండేండ్లు నారాయణుడు రాజుగా కలడు. అతని పుత్రుడు సువర్మయు పదేండ్లు రాజుకాకలడు. ఆ నలుగురు తుంగ కృత్యులైన రాజులై కంఠాయనులైన ద్విజులు. వారు రాబోవువారు, నమస్కరించిన సామంతులు గలవారు, నలుబది అయిదు గురు, వారి అంత్యకాలమున తరంధుడు రాజుకాగలడు. ఆతరువాత, సింధుకుడను ఆంధ్రజాతీయుడు, కంఠాయనుడైన సుశర్మను బలాత్కారముగా పెరకివైచియు, శృంగులకు మిగిలిన సైన్యమును నశింపచేసియు, ఈ వసుంధరను (భూమిని) పొందగలడు. ఆ తరువాత ఇరువది మూడేండ్లు సింధుకుడు రాజుగా కలడు. తరువాత భాతుడు ఎనిమిది ఏండ్లు తరువాతివాడు పదేండ్లును రాజులుగా కలరు.

తరువాత శ్రీ సాతకర్ణి రాజు కాగలడు. ఆతనిపుత్రుడు మహోనుడు, ఏబది ఏడేండ్లు సాతకర్ణి రాజుగా పాలించును. ఆతని పుత్రుడు ఆపాదబద్ధుడు పదేండ్లు రాజు కాగలడు.

ఆ తరువాతివాడు ముప్పది ఏండ్లు పరిపాలించును. నేమికృష్ణుడు ఇరువది ఏండ్లు రాజుగా ఉండగలడు. ఆ తరువాత, ఒక నిండు సంవత్సరము హాలుడు రాజుగా కలడు. తరువాత పండ్రెండుగురు మహాబలులు రాజులు గాగలరు. పుత్రికషేణుడను రాజు ఇరువది యొక్క ఏండ్లు రాజ్యము చేయగలడు. సాతకర్ణి ఒక యేడు రాజు కాగలడు. ఇరువది ఎనిమిదేండ్లు శివస్వామి రాజు కాగలడు. గౌతమీపుత్రుడు (సాతకర్ణి) ఇరువది యొక్క ఏండ్లు మానవులకు రాజుకాగలడు. తరువాత, యజ్ఞశ్రీ సాతకర్ణి ఇరువది యొక్క ఏండ్లు రాజగును. ఆ తరువాత, విజయు(సాతకర్ణి)డు ఆఱేండ్లు రాజుకాగలడు. ఆతని పుత్రుడు దండశ్రీ సాతకర్ణి మూడేండ్లు పాలించును. పులోవాపి సాతకర్ణి ఏడేండ్లు రాజ్యము చేయగలడు. ఇతరులకు (రాజులకు) కూడ ఏడేండ్లు కాగలవు–ఈ రాజులు ముప్పదిమంది అంధ్రరాజులు–వీరు భూమిని పాలింతురు. వీరి రాజ్యపాలనా కాలము నాలుగు, ఐదు ఆఱు వందల ఏండ్లు. ఆంధ్రుల యొక్క సంస్థితులు వారి వంశములు ఐదు సంవత్స రములు. ఏడుగాగలవు. తరువాత ఆ భీరులు పదేండ్లు, గర్దభులు ఏడేండ్లు, తరువాత శకులు పదేండ్లు, యవనులు ఎనిమిదేండ్లు, తుషారులు పదునాలుగు ఏండ్లు, మరుండులు పదమూడు ఏండ్లు, మౌనులు పదునెనిమిది ఏండ్లును రాజులై పాలింతురు. అంధ్రులు మున్నూరేండ్లు (మూడు వందల సంవత్సరాలు) భూమిని పరిపాలింతురు. శకులు మూడు వందల ఎనుబది ఏండ్లు భూమిని పరిపాలింతురు. యవనులు ఎనుబది ఏండ్లు భూమిని పరిపాలింతురు. తుషారులు ఐదువందల ఏండ్లు రాజులై భూమిని పరిపాలింతురు. వృషలులతో బాటు తక్కిన మ్లేచ్ఛజాతులు మూడువందల ఏండ్లు భూమిని పాలింతురు. మ్లేచ్ఛులు పదకొండేండ్లు పాలింతురు. వారితో ఆవరింపబడిన కాలముతో తరువాత కోలికిలులను వృషలు పరిపాలింతురు. తరువాత, కోలికిలుల నుండి వింధ్యశక్తి కలుగగలడు. తొంబదియారేండ్లు తెలిసికొని భూమికి రాగలడు.

వృషలను, వైదిశకులను, భవిష్యులను గురించి వినుడు. నాగరాజైన శేషునకు పుత్రుడు స్వరపురంజయుడు. నాగకులోద్వహుడైన భోగిరాజు కాగలడు. చంద్రాంశుడైన సదాచంద్రుడు మొదటివాడు, రెండవవాడు నఖవానుడు. తరువాత ధనధర్ముడు. తరువాత నాలుగవవాడు వింశజుడు. తరువాత భూతినందుడు వైదేశమున రాజుగా కలడు. అంగదేశములకు నందనుని తరువాత మధునంది రాజుకాగలడు. ఆతని చిన్న సోదరుడు నందియశుడు. ఆతని వంశమున ముగ్గురు రాజులు కలుగగలరు. దౌహిత్రుడైన శిశుకుడు అనువాడు పురికయందు రాజయ్యెను. వింధ్యశక్తి పుత్రుడు గూడ వీర్యవంతుడైన ప్రవీరుడు. ఈతడు అఱువది ఏండ్లు కాంచనక అను పురిని పరిపాలింపగలడు. సమాప్తమైన శ్రేష్ఠ

దక్షిణలుకల వాజపేయ యాగములచే యజ్ఞము చేయగలడు. ఆతని పుత్రులు నలుగురు రాజులుగా కలరు. వింధ్యకుల కులము గడచిపోగా బాహ్లిక రాజులు ముగ్గురు పరి పాలింతురు. సుప్రతీకుడు నభీరుడు ముప్పది ఏండ్లు పరిపాలింపగలరు. శక్యముడు అనురాజు మాహిషులకు మహీపతి (రాజు). పుష్పమిత్రులు పట్టమిత్రులును పదముగ్గురు రాజులుగా గలరు. మేకలయందు సత్తములు ఏడుగురు రాజులుగాగలరు. కోమలయందు మహాబలులు రాజులు అగుదురు. మేఘులు అని చెప్పబడు బుద్ధిమంతులైన రాజులు తొమ్మండుగురు. నైషధులను రాజులందఱు మనుక్షయమువఱకు ఉండగలరు. నల వంశమున పుట్టిన ఆ రాజులు వీర్యవంతులును మహాబలులును. మాగధులలో మహా వీర్యుడు విశ్వస్ఫాని అను వాడు గలడు. ఆతడు విశ్వస్ఫాని సమస్త రాజులను పెరకివైచి అన్యవర్ణులను (రాజులుగా) చేయగలడు. కైవర్తులు, కంచకులు, పులిందులు, బ్రాహ్మణులు, వీరిని నానా దేశములందు రాజులుగా చేయగలడు. విశ్వస్థాని మహాసత్త్వుడు, యుద్ధమున విష్ణుసముడైన బలవంతుడు. విశ్వస్ఫాని రాజు నపుంసక ఆకారము కలవానివలె ఉండును. అతడు క్షత్రమును పెరికివైచి వేరొక క్షత్రమును రాజుగా చేయగలడు. ఆ బలవంతుడు దేవతలను, పితరులను, బ్రాహ్మణులను ఒక్కమారు మరల సంతృప్తిపరచి, గంగాతీరముచేరి శరీరమును త్యాగముచేయ ప్రయత్నించును. చివరకు అతడు తన శరీరమును సన్యసింప చేసి ఇంద్ర లోకమునకు వెళ్లగలడు. నవనాకులు అను రాజులు చంపావతీపురిని పరిపాలింతురు. రమ్యమైన మధురాపురిని ఏడుగురు నాగులు పరిపాలింతురు. గంగను అనుసరించి ప్రయాగను, సాకేతమును, మగధములను–ఈ జనపదము(దేశము) లను అన్నింటిని గుప్తవంశ రాజులు పరిపాలింతురు. నిషధులను, యదుకులను, శైశీతులను, కాలతోపకులను–ఈ దేశములను అన్నింటిని మణిధాన్యజులు పాలింపగలరు. కోశలము లను, ఆంధ్రములను, పౌండ్రములను, సాగరములతో కూడిన తామ్రలిప్తములను రమ్యము అయిన దేవరక్షితమైన చంపాపురిని పరిపాలింతురు. కళింగములు, మాహిషములు, మహేంద్ర నిలయములు–ఈ దేశములను గుహుడు పరిపాలించగలడు. కనకుడనువాడు స్త్రీ రాష్ట్రమును, భక్ష్యకములను పరిపాలింప కలడు. ఈ అందఱు రాజులు సమానమైన కాలముననే రాజులుగా ఉండగలరు.

ఈ భూమిలో యవనులు అల్పమైన ప్రేమ కలవారును, అసత్యవాదులుగను, మిక్కిలి కోపము కలవారుగను, అధార్మికులుగను ఉందురు. ధర్మములోను, అర్థములోను, కామము లోను కూడ పై విధముగనే ఉందురు. ఆ రాజులు పట్టము కట్టిన రాజులుగా ఉండరు. ఆరాజులు యుగదోషములు గలవారై దురాచారులుగా ఉందురు. స్త్రీల బలాత్కా వధల

చేతను, పరస్పర వధలచేతను యవనరాజులు కలిశేషమున భూమిని పరిపాలింతురు. కాలముతో వారు ఉదయించి ఉదయమును పొందు వంశములు కలవారుగను, ఉదయించి అస్తమించు వంశముకలవారుగను వరుసగా రాజులుగాకలరు. అంతటను దురాచార ములు కాగలవు. అపుడు ఆ రాజులు ప్రజలకు వ్యతిరేకముగ ఉందురు. ప్రజల నశింప జేయుదురు. లోభులై అసత్యప్రియులుగా ఉందురు. వారి క్రమము గడచిపోగా, బహుస్త్రీలు కలయుగమున, ఆయువులోను, రూపములోను, బలములోను, పాండిత్యములోను అణువణువున భ్రష్టులగుచున్న వారుగా ఉందురు. ఆవిధముగ వారు ప్రజలలో గౌరవమును పొందినవారై జగమునందు ప్రభువులు అగుదురు. అపుడు ఆ రాజులు కాలోపహతులై నశింతురు. కల్కిచే కొట్టబడినవారై ఆ మ్లేచ్ఛులు అందఱును అంతటను వెళ్లుదురు. అధార్మికులైన ఆ మ్లేచ్ఛులు అన్ని విధముల మిక్కిలి వేదబాహ్యులు. నరులను పాలించునని అర్థమును చెప్పు నృప శబ్దము నశింపగా, కలియుగము సంధిలో ఉండగా, ధర్మము నష్టము కాగా, భార్యలు లేనివారై ప్రజలు కొందరే మిగులుదురు. కార్య సాధనములు లేనివారు, ఊరడింపులు లేనివారు, రోగబాధలచే పీడింపబడినవారు, వర్షాభావము చేతను, ఒకరికొకరు చంపుకొనుటచేతను దెబ్బతిన్నవారును, ప్రభువులులేని వారును, భయము చెందినవారును, జీవన వృత్తిని వదలి దుఃఖించినవారును, పురములను గ్రామములను వదలి వనములలో నివసించినవారును జనులు కాగలరు. ఈ విధముగా రాజులు నశింపగా, ప్రజలు గృహములను వదిలిపోవుదురు. స్నేహము నశింపగా భ్రష్టమైన స్నేహముకలవారై, మిత్రజనులు దుఃఖములను పొందినవారు అగుదురు. వర్ణ–ఆశ్రమముల నుండి భ్రష్టులై భయంకరమైన సాంకర్యమును పొందినవారై అపుడు ప్రజలు నదీపర్వతముల సేవించువారుగా అగుదురు. మానవులు నదులను, జలప్రాయమైన సాగర తీరములను, పర్వతములను, అంగదేశములను, కళింగ, వంగ, కాశ్మీర, కోసల దేశములను, ఋషికాంత గిరి ద్రోణులను సేవింతురు. ఆర్యులు మ్లేచ్ఛ జనులతో గూడి హిమవత్పర్వతము యొక్క పృష్ఠభూమిని, లవణ సముద్ర తీరమును, అరణ్యములను చేరుదురు. మానవులు–లేళ్లు, చేపలు, పక్షులు, పులులు, వడ్లపిట్టలు, తేనెలు, కూరలు, పండ్లు–వీనిచే జీవనము గడుపుదురు. నారచీరలు, వివిధములైన ఆకులు, వృక్ష చర్మము లైన నారలు, మృగాదుల చర్మములు స్వయముగా వస్త్రములుగ చేసికొని మునిజనులవలె ఉందురు. కాని మునిజనులుకారు. వారు విత్తనములతో కాష్ఠశంకువులతో క్రింద బీజాన్న ములను సిద్ధము చేయువారై, మేకలను, గొఱ్ఱెలను, గాడిదలను, ఒంటెలను, పాలింతురు. మానవులు నీటికొఱకై నదీతీరములను ఆశ్రయించి నివసింతురు. రాజులను వ్యవహా

రముతో పరస్పరము బాధింతురు. అపుడు ధర్మమునందు వ్యవస్థితులైన నరులు మిక్కిలి గర్వితులు, సంతానము లేనివారును, శౌచాచారములు లేనివారును కాగలరు. ప్రజలు హీనాతి హీనమైన ధర్మములను అనుసరింతురు. అపుడు ఎవ్వడు కూడ ముప్పది ఏండ్లకు మించి జీవింపడు. దుర్బలులు, విషయ సుఖములలో తగుల్కొన్నవారును, ముసలి తనము మీదబడినవారును, ఆకులు, కంద మూలములు, ఫలములు ఆహారముగా కలవారును, నారచీరలు, దుప్పిచర్మములు-వస్త్రములుగాకల వారును, జీవనాధారమునకై వెదుకు వారును అయి భూమియందు చరింతురు. ఇట్టికాలమును కలియుగము అంతమున ప్రజలు పొందుదురు. దేవమానముతో వేయి ఏండ్లు కల కలియుగము క్షీణింపగా ప్రజలు కలియుగముతో పాటు నిఃశేషులు (మిగులనివారు) అగుదురు. సంధ్యాంశముతో బాటు కలియుగము నిశ్శేషముగాగా, కృతయుగము రాగలదు. సూర్యుడును, చంద్రుడును తిష్య-బృహస్పతులను (పుష్యమీ నక్షత్రము-బృహస్పతియు) ఒకే రాత్రియందు భరింప గలిగిన నాడు కృతయుగము అగును. ఇది అతీతములయు, వర్తమానములయు, భవిష్య త్కాలమున జరుగబోవునవియునైన మొత్తము వంశముల యొక్క క్రమము. వరుసగా మీకు చెప్ప బడినది.

మహాదేవుని అభిషేకము నుండి పరీక్షిత్తు జన్మవఱకుఉన్న కాలము వేయి మఱియు ఏబదియేండ్లు. అట్లే మహాపద్మాంతరమని ప్రమాణము కూడ చెప్పబడినది. అంతరము ఎనిమిది వందల ముప్పదియాఱేండ్లు. ఇదే కాలాంతరమున రాబోవు ఆంధ్రాంతులకు కూడ తెలియవలెను. ఇవి భవిష్య పురాణజ్ఞులైన పండిత ఋషులచే అచట లెక్కింపబడినవి. ప్రతీపుడు రాజుగా ఉండగా సప్తర్షులు నూరేండ్లని చెప్పిరి. ఆంధ్రుల యొక్క కాలము ఇరువది యేడు వందలని నీవు భావింపవలెను. ఇరువది యేడు వఱకు ఉన్న సమస్త నక్షత్ర మండలమున క్రమముగా సప్తర్షులు నూరు నూరేండ్లుందురు. ఇది దివ్య సంఖ్యతో చెప్పబడిన సప్తర్షుల యుగము. ఆయా ఆఱవది దివ్యము అనబడినది. ఏడింటిచే దివ్యా హ్నాములు అనబడినవి. స్తుతింపబడిన సప్తర్షులచేత వారికొఱకు దివ్యమైన కాలము ప్రదర్తిల్లును. సప్తర్షులలో పూర్వులు ఉత్తరదిక్కులో కనబడుదురు. కావున వారితో సమముగా ఆకాశ మధ్యమున క్షేత్రము కనబడదు. అందుచేత సప్తర్షులు నూరేండ్లు ఆకాశము నంటి ఉండిరని తెలుసుకొనవలెను.

ఇది నక్షత్రముల యొక్కయు ఋషుల యొక్కయు యోగమునకు నిదర్శనము. పరీక్షిత్తు కాలమున ఇరువది నాల్గవదైన ఆంధ్రాంశలో ఆ మతమున సప్తర్షులు నూరు మారులు మఘానక్షత్రయుక్తులుగా కలరు. అపుడు ప్రకృతివల్ల ఈ ప్రజలు మిక్కిలి ఆపదను

పొందగలరు. అందరు ప్రజలు ధర్మార్థకామములలో అసత్య పీడితులు అగుదురు. అపుడు వర్ణాశ్రమ ధర్మమున శ్రౌత - స్మార్తములు శిథిలములుకాగా, దుర్బలాత్ములై మోహితులు అయి చివరకు శంకరుని చేరుదురు. శూద్రులు ద్విజులతో సహ కూడినవారు కాగలరు. బ్రాహ్మణులు శూద్రులతో యజ్ఞముల చేయింతురు. శూద్రులు మంత్ర యోనులు (మంత్రముల సిద్ధము చేయుటకు కారణభూతులు అగుదురు). అపుడు బ్రాహ్మణులు జీవన లాభమునకై శూద్రులను సేవింతురు. క్రమముగా ప్రజలు అణువణువున నశించు చుందురు. కృష్ణుడు స్వర్గమునకు వెళ్లిన దినమున యుగక్షయము. ఆ యుగ క్షయమున క్షీణింపగా మిగిలినవారు కూడ క్షీణింతురు. వచ్చినది కలియుగము. దాని సంఖ్యను వినుడు. మానుష సంఖ్యచే మూడు లక్షల అఱువది వేలయేండ్లు కలియుగము. దివ్య సంఖ్యలో అది వేయి ఏండ్లు. అది సంధ్యాంశమని చెప్పబడినది. అది నిఃశ్శేషమైనపుడు కృతయుగము వచ్చును. మీకు ఐలవంశము, ఇక్ష్వాకు వంశము భేదములతో సహ చెప్పబడినవి. వివస్వంతునకు సుమిత్రాంతముగా ఇక్ష్వాకువు వలన క్షత్రమని చెప్పబడినది. సోమవంశవేత్తలు ఐలమైన నక్షత్రము సోమకాంతము అందురు. వీరు కీర్తివర్ధనులైన వివస్వంతుని పుత్రులుగా చెప్పబడిరి. గడచినవారు, ప్రస్తుతమున్న వారు, రాబోవు వారును అయిన బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులును ఈ ఐలవంశము నందలివారే. ప్రతి యుగమున వేలకొలది మహాత్ములు గతించిరి. వారి నామధేయములు బహుళము లైనందున ప్రతి కులమున పరిసంఖ్యానము జరుగును (సంగ్రహింపబడును). అనేకమగుట వల్ల సంఖ్య పునరుక్తమగును. కావున నాచే చెప్పబడలేదు. ఈ వైవస్వత మన్వంతరమున నిమి వంశము సమాప్తి చేయబడును. క్షత్రము ప్రవర్తిల్లు ఏవాయ అను యుగము పేరునందు నిమి వంశము సమాప్తిచెందును. అది ఎట్లో చెప్పెదను వినుడు. ఇక్ష్వాకువంశమువాడుగా సమ్మతుడైన దేవాపియను పౌరవరాజు మహా యోగబలముతో కూడినవాడై కలాప గ్రామమునకు చేరెను. సువర్చుడను సోమపుత్రుడు ఇక్ష్వాకువంశము వాడేకాగలడు. ఇరువది నాల్గవ చతుర్యుగమున వీరు ఇరువురు క్షత్ర నాయకులు. ఇరువది యవ యుగమున సోమ వంశమునకు ప్రారంభముకాదు. దేవాపి శత్రువులు లేనివాడై ఐలవంశమునకు మొదటిరాజు కాగలడు. చతుర్యుగము (నాలుగు యుగముల సముదాయము)న వీరు ఇరువురు క్షత్రజాతి ప్రవర్తకులు అగుదురు. ఈ విధముగ సంతానము కొఱకు లక్షణమును అంతటను తెలిసికొనదగినది. ఆ కలియుగము క్షీణింపగా కృత యుగము రాబోగా మరల మొదటి త్రేతాయుగమున స్తుతింపబడిన సప్తర్షులతో బాటు క్షత్రియ గోత్రముల ప్రవర్తకులుగా కలరు. ద్వాపరాంశమున క్షత్రియులు ఋషులతో కూడి

ఉండరు. కృతయుగ కాలము క్షీణింపగా, త్రేతాయుగమున వారు బ్రహ్మ క్షత్రియుల బీజార్థమై మరల జనింపగలరు. ఈ విధముగనే అన్ని అంతరములలోను ప్రతియుగమున సంతానార్థమై సప్తర్షులు రాజులతో కూడియుందురు. బ్రాహ్మణులచే క్షత్రజాతి సముచ్ఛేదమే సంబంధము అనబడినది. ఏడు మన్వంతరములయొక్క ఆ సంతానములుకూడ వినబడినవి. యుగములయొక్క పరంపరయు, బ్రహ్మ క్షత్రముల పుట్టుకయు, వారి ప్రవృత్తి ఎట్లు జరిగినదో అట్లే ప్రవర్తించినవారి నాశముకూడ జరిగినది. ఆ సప్తర్షులే వారి దీర్ఘాయువు కలిగియుండుటను, నాశము లేమియును తెలియుదురు. ఈ క్రమ యోగముతో ఐల–ఇక్ష్వాకు వంశములవారు ద్విజులు. త్రేతాయుగమున జన్మించుచున్నవారై కలియుగము క్షీణించుచుండగా మరల వారు మన్వంతరము చివరి వఱకును యుగాఖ్యను పొందుదురు. జమదగ్ని పుత్రుడైన పరశురామునిచేత క్షత్రజాతి నిశ్శేషము చేయబడగా, కృత యుగమున సమస్త వంశములు కులములును రాజులైన క్షత్రియులచేత ద్వి వంశ కరణములు (రెండు వంశములకు సాధనములు)గా చేయబడినది. చెప్పెదను వినుడు. ఐలుని యొక్కయు ఇక్ష్వాకు నందుని యొక్కయు ప్రజ మారును. వరుస గట్టిన రాజులును, తక్కిన క్షత్రియ రాజులును మారిపోవుదురు. ఐలవంశమునను ఇక్ష్వాకు వంశమునను ప్రసిద్ధిచెంది రాజ్యాభిషేకము నందిన రాజులకు కులములకును నూరేండ్లు నిండును. భోజుల యొక్క విస్తారము రెండింతలు. క్షత్రము ముప్పది యేండ్ల కాలము నందును నలుదెసల వ్యాపించును. వారిలో గడచిన వారిని సమానులైన వారిని చెప్పెద వినుడు. ప్రతివింధ్యులు నూరేండ్లు, నాగులు నూరు, హయులు నూరు, ధృతరాష్ట్రులు నూరు, జనమేజయులు ఎనుబది, బ్రహ్మదత్తులు నూరు, శీరులను, వీరులను నూరు నూరు, తరువాత పులోములు నూరు, శ్వేత–వాశ–కుశాదులు, తరువాత గడచిన శత బిందువులు వేయి యేండ్లు పరిపాలింతురు. వారందరు లక్షదక్షిణలుకల యశ్వమేధము లతో యాగము చేసిరి. ఈ విధముగా నూర్లకొలది వేలకొలది రాజర్షులు కడచిపోయిరి. వర్తమానమై వైవస్వతమన్వంతరమున లోకమున జనించినట్లుగా చెప్పబడిన వారి సంతతులను చెప్పెద వినుడు. వారి సంతానముల యొక్క విస్తరమును, పరంపరను తత్పూర్వాపర యోగక్రమముతో వేయియేండ్లు గూడ చెప్పశక్యము గాదు. వైవస్వత మన్వంతరమున ఈ రాజర్షులతో పాటు ఇరువది ఎనిమిది యుగాఖ్యులు గతించినవి. మిగిలిన వానిని వినుడు. తరువాత యుగాఖ్యులలో విశిష్టులైన వారు వైవస్వత క్షయమున రాజులతోపాటు ఇరువది నలుగురు రాగలరు. ఇది అంతయు సంగ్రహ–విస్తర యోగములతో మీకు చెప్పబడినది. బహుళమైనందున పునరుక్తము అయి ఉండవచ్చును. యుగములతో గూడ పునరుక్తి లేకుండ చెప్ప

సాధ్యముగాదు. వీరు యయాతి పుత్రులలో ఇరువది అయిదుగురు ప్రజలకు హితులు. అమితులు (పరిమితిలేనివారు)గా చెప్పబడినారు. వీరు నా లోకములను ధరింతురు. ఇచట చెప్పినవాడు ఈ లోకమున వరింపదగిన దానిని పొందును. దుర్లభములైన లౌకిక సుఖములను పొందును. ఆయువును, కీర్తిని, ధనమును, పుత్రులను, స్వర్గమును, చివరకు ఆనంతము (మోక్షము)ను అనుభవించును. దీనిని బుద్ధిలో ధరించుటవల్లను, వినుటవల్లను, వారు లోకములను ధరింతురు–అనునది మూడవ పాదము. ఓ బ్రాహ్మణులారా! విస్తరముగ నానుపూర్వితో మీకు నాచే చెప్పబడినది. మరి ఇంకేమి చెప్పవలెను? (37)

వాయుపురాణము మూడవ పాదము సమాప్తము

మన్వంతర కథనమ్

ఋషులు ఇట్లు అనిరి :

"ఓ సూతా! నీచేత మూడవ పాదము చెప్పబడినది. నాలుగవ పాదమును ఉప సంహారముతో పాటు విస్తరముగ చెప్పుము. తరువాతి మన్వంతరములతో పాటు పూర్వ మన్వంతరములను ఇప్పటి మన్వంతరమునను ఈ సప్తర్షుల చరిత్రమును విస్తర వివరణ ముతో చెప్పుము. ఆ మహాత్ముని సృష్టియొక్క విస్తారమును సావయవముగ సర్వమును మాకు తెల్పుము.

సూతుడు ఇట్లు అనెను :

"ఓ ముని సత్తములారా! ఈ నాలుగవ పాదమును సంహారముతో కూడ ఉన్నది ఉన్నట్లుగా చెప్పెదను. ఓ ద్విజులారా! మహాత్ముడైన ఇప్పటి వివస్వత మనువు యొక్క ఈ సృష్టిని విస్తరముగా నానుపూర్వితో పాటు వినుడు. ఏడు భవిష్యముల (రాబోవువాని) తో పాటు మన్వంతరముల సంక్షేపమును, లోకముల ప్రళయమును చెప్పెద వినుడు. ఇవి నాచేత ఇప్పటికే చక్కగా ఏడు మన్వంతరములు చెప్పబడినవి. రాబోవు మన్వంత రములను సంక్షేపముగా నానుండి వినుడు. సావర్ణిక మనువు యొక్కయు, వైవస్వత మన్వంతరము యొక్కయు, భవిష్యములో భవిష్యన్మన్వం తరముల యొక్కయు వృత్తాంత మును సంగ్రహముగా వినుడు.

ఈ లోకములో భవిష్యన్మహర్షులు ఏడుగురు, కౌశికుడైన గాలవుడు, జామదగ్న్యు డైన భార్గవుడు, ద్వైపాయనుడైన వశిష్ఠుడు, శారద్వతుడైన కృపుడు, ఆత్రేయుడైన దీప్తి మంతుడు, కాశ్యపుడైన ఋష్యశృంగుడు, భారద్వాజుడు ద్రౌణియునై యశస్వియైన అశ్వత్థామ–ఈ యేడుగురు మహాత్ములు భవిష్యత్ కాలమున రాబోవు పరమర్షులు.

సుతపులు, అమితాభులు, సుఖులు–ఈ మూడు వారి గణములు. ఆ దేవతల యొక్క గణము లొక్కొక్కటి ఇరువది మంది కలవి.

వారినిగురించి పేరులతో చెప్పెదను ఏకాగ్రచిత్తముతో వినుడు. రితుడు, తపుడు, శుక్రుడు, ద్యుతి, జ్యోతి, ప్రభాకరుడు, ప్రభాసుడు, భాసకృత్తు, ధర్ముడు, తేజస్సు, రశ్మి, ఋతువు, విరాట్టు, అర్చిష్మంతుడు, ద్యోతనుడు, భానువు, యశస్సు, కీర్తి, బుధుడు, ధృతి–వీరు సుతపులు అను పేరులతో చెప్పబడిరి. ప్రభువు, విభువు, విభాసుడు, జేత, హంత, రిహుడు, రితువు, సుమతి, ప్రమతి, దీప్తి, సమాఖ్యాతుడు, మహుడు, మహానుడు, దేహుడు, ముని, నయుడు, జ్యేష్టుడు, సముడు, సత్యుడు, విశ్రుతుడు–అను వీరు ఇరువది మంది అమితాభులు. దముడు, దాత, విదుడు, సోముడు, విత్తుడు, వేద్యుడు, యముడు, నిధి, హోమము, హవ్యము, హుతము, దానము, దేయము, దాత, తపస్సు, శమము, ధ్రువము, స్థానము, విధానము, నియమము–అను ఈ ఇరువది(సుఖులు)సావర్ణ ప్రథమ మన్వంతరమున ముఖ్యులు.

వారు మారీచుడై మహాత్ముడైన కశ్యపుని పుత్రులుగా ఇప్పటి సావర్ణ మన్వంతర మున ఉండగలరు. పూర్వము వైరోచనుడైన బలి, వారికి ఇంద్రుడు కాగలడు. వీరవంతుడు, వరీయుడు, నిర్మోహుడు, సత్యవాక్కు, కృతి, చరిష్ణుడు, ఆజ్యుడు, విష్ణువు, వాచుడు, సుమతి–ఈ తొమ్మండుగురు సావర్ణి మనువు యొక్క పుత్రులు కాగలరు. సావర్ణియొక్క ఇతర మన్వంతరములలో తొమ్మండుగురిని చెప్పెదను. ఇతరులైన సావర్ణమనువులు బ్రహ్మ యొక్క పుత్రులు కాగలరు. వారు మేరు సావర్ణినులు, దివ్యదృష్టులచే చూడబడిరి. దక్షుని (పుత్రియైన ప్రియయొక్క) ప్రియపుత్రియొక్క పుత్రులై దక్షునకు దౌహిత్రులైనవారు. మేరువు యొక్క పృష్ఠ భాగమునచేసిన గొప్పతపముతో కూడినవారు, మహౌజస్కులు. వారు బ్రహ్మాదులచే పుట్టినవారు. ధీమంతుడైన దక్షునిచే ఆవరించి మహర్లోకమున ఉండు వారై మేరువును ఆశ్రయించినవారు. మహాభావమువలన పూర్వము చాక్షుష మన్వంతర మున పుట్టిరి".

ఋషులు ఇట్లు అనిరి :

"దక్షునిచే తన కన్యయందు పుత్రులు జనించిరనుట ఎట్లు? మహాత్ముడైన బ్రహ్మ ధర్మముతో అది జరిగియుండును."

సూతుడు ఇట్లు అనెను :

"ప్రచేతసునకు నమస్కరించి రాబోవు సావర్ణి మనువులను వారి జన్మను ప్రభావమును

చెప్పెదను. వైవస్వతుడు స్పృశింపబడగా, చాక్షుష మన్వంతరము కొద్దిగా మిగులగా, భవిష్యానాగతాంతరమున వారు జనించిరి. ప్రాచేతసుడైన దక్షునియొక్క పుత్రికి పుత్రులైన వారు పేరుతో సావర్ణులు, పరమర్షివల్ల పుట్టినవారు అయిదుగురు. సంజ్ఞాపుత్రుడైన సావర్ణుడు ఒక్కడైన వైవస్వతుడు అట్లే జ్యేష్ఠుడై సంజ్ఞాసుతుడైనవాడు ప్రభువైన వైవస్వత మనువు. వైవస్వత మన్వంతరమురాగా ఇరువురి జన్మ శుభమైనది. పదునలుగురు మనువు లైన వీరు కీర్తివర్ధనులుగ కీర్తింపబడిరి. శ్రుతియైన వేదమునందును, పురాణము నందును వారందరును ప్రభావవంతులైనవారు. వారందరు ప్రజలకు పతులు(రాజులు) భూతము లకును పతులు. ఈ సప్త ద్వీపములతోను పర్వతములతోను కూడుకొన్న ఈ సమస్తభూమి వేయియుగముల నిండుగ ఆ నరేశ్వరులచేత, ప్రజలచేత, తపస్సుచేత పరిపాలింపబడును. వారి విస్తరణము చెప్పబడును. స్వాయంభువాదులైనవారు, వారి సృష్టులును పదునాలుగే. వారు ఒక్కొక్కమారు మన్వంత రాధికారములలో ఉందురు. అధికారము నుండి విడిపోయిన వారు మహర్లోకమును ఆశ్రయింతురు. వారిలో గడచినవారు ఎనమండుగురు. తక్కినవారు ఆఱుగురు, పూర్వులలో ఇప్పటివాడు వైవస్వత ప్రభువైన శాంతి. ఇక మిగిలినవారిని దేవర్షి దానవులతో పాటు-ప్రజా సృష్టితో కూడ మొత్తము రాబోవు ద్విజులను చెప్పెదను. వైవస్వత సృష్టితో వారియొక్క విస్తారము తెలియవలెను. వారందరును వివస్వతులైనందున హెచ్చుతగ్గులు లేనివారు. బాహుళ్యమైనందున పునరుక్తులు అగుదురు. కావున భూత భవిష్యములైన మన్వంతరములలో వారి విస్తరమును చెప్పను. అట్లే ప్రతికులము నందలి సృష్టులను కూడ చెప్పను. కావున వారికంటె మిగిలిన అర్థమును మరల మరల విభాగ పూర్వకముగను విస్తారముగను క్రమముగను చెప్పెదను.

దక్షునకు సర్వకన్యలకు మిగిలిన యొక కన్య కలదు. ఆమె ధర్మనిష్ఠ గలది, సువ్రతఅని ప్రసిద్ధి గాంచినది, శ్రేష్ఠయైనది, ధర్మపరయైన పుత్రిక. తండ్రి అయిన దక్షుడు ఆ కన్యను తోడ్కొని బ్రహ్మ సమీపమునకు వెళ్లెను. ధర్మునితోను, భవునితోను సమీపమున కూర్చుని భవధర్మ సమీపస్థుడైన దక్షునితో వైరాజగు బ్రహ్మఇట్లనెను. దక్షుడవైన నీ ఈ కన్య సువ్రత నలుగురిని మనువులను చాతుర్వర్ణ్యకరులై మంగళమయులైన పుత్రులనుగా జనింప జేయగలదు. బ్రహ్మ మాటనువిని ధర్ముడు, భవుడు, దక్షుడు ముప్వురును బ్రహ్మతో కూడ అపుడు ఆకన్యను మనమున కలిసిరి. సత్యమును చింతించు ఆ నలుగురికి అనురూపు లైన నలుగురు కుమారులను వెంటనే ఆ కన్య కనెను. సద్యోజాతములై ఆయా విషయము లను అనుభవించుటకు సమర్థములైన చిన్న శరీరములచే సర్వకార్యముల చేయుటకు సంసిద్ధులై చక్కగా కూడినవారై, ఆ నలుగురు జనించిరి. బ్రహ్మాదులు వారిని జూచి,

స్వయముగా తెలిసి, సంతసించినవారై అపుడు సంరంభముతో వీడు నా పుత్రుడని, వీడు నా పుత్రుడనియు లాగజొచ్చిరి. సువ్రతను ధ్యానించు మనస్సువల్ల పుట్టినవారి విషయమున పరస్పరముగ బ్రహ్మాదులు ఇట్లు అనిరి. "ఎవడు ఎవని శరీరవర్ణమును పొందియుండునో ఆ బాలుడు ఆ తండ్రిని పొందుగాక. ఎవడు రూపమునను, వీర్యమునను, పేరునను ఏ తండ్రితో సమానుడో ఆతనిని ఆ తండ్రి స్వీకరించుగాక. వర్ణమున ఎవడు ఎవనికి సముడో వాడు ఆతని పుత్రుడు. ఎల్లప్పుడును పుత్రుడు తండ్రి రూపమును నిశ్చయముగా అనుసరించును. కావున ఆత్మసముడైన పుత్రుడే తండ్రికిని తల్లికిని జనించును" అని ఈ విధముగ వారు ఒప్పందము చేసికొని తమకు సవర్ణులైన సుతులను స్వీకరించిరి. కావున బ్రహ్మాదుల కుమారకులు బ్రహ్మాదులకు సమానవర్ణము కలవారు. మననమువలన సవర్ణత్వమును పొందుటవలన సవర్ణ మనువులైరి. (బ్రహ్మాదుల సవర్ణత్వము నందుట వలన ఆ మనువులు సవర్ణులైరి. అత్యంత మనసు వలన జనించిన వారు కావున మనువులైరి)

చాక్షుష మన్వంతరము గడచి వైవస్వత మన్వంతరమురాగా, ప్రజాపతిఅయిన రుచికి జనించిన పుత్రుడు రౌచ్యుడు. భూతియందు జనింపజేసిన పుత్రుడు భౌత్యుడు. వైవస్వత మన్వంతర ప్రాప్తిలో ఇద్దరుమనువులు, ఇద్దరు వివస్వతులకు పుట్టినవారు. వైవస్వత మనువనియు, సావర్ణమనువనియు వారు ప్రసిద్ధులు. అందులో జ్యేష్ఠుడు సంజ్ఞాసుతుడు, విద్వాంసుడు ప్రభువైన వైవస్వత మనువు. సవర్ణయొక్క సుతుడు వేరొక వైవస్వత మనువు అనబడెను. సవర్ణ మనువులైన నలుగురును మహర్షి సంజాతులు. తపస్సుచే చక్కగా నిండిన ఆత్మగలవారై వారు వారి రాబోవు మన్వంతరము లలో సర్వకార్యార్థ సాధకులు అగుదురు. మొదట దక్షపుత్రుడైన మేరు సావర్ణిక మనువునకు పుత్రులు, మరీచి (కిరణ) గర్భులు, సుశర్ములు అయినవారు ముువ్వురు జనించిరి. మహాత్ము లైన వారు అందరును వైవస్వత మన్వంతరమున ఉండిరి.

వారు దక్షపుత్రుడైన రోహిత ప్రజాపతి పుత్రులు. భవిష్యునకు భవిష్యుడు, ఒక్కొక్కటి పండ్రెండు గణములు కలది. ఐశ్వర్యసంగ్రహుడు, రాహుడు, బాహువశుడు, అట్లే పారులు పండ్రెండుగురని తెలియవలె. ఉత్తరులను గూర్చి వినుడు. వాజియుడు, వాజిజిత్తు, ప్రభృతి, కకుది, దధిక్రావ, ఆయుడు, పక్వుడు, ప్రణీతుడు, విజయుడు, మధువు, తేజ స్మంతుడు, అథవుడు అను ఈ పండ్రెండుగురు మరీచులు. సుశర్ముల గురించి చెప్పెదను వినుడు. వర్ణుడు, అగ-విశ్వులు, మురణ్యుడు, వ్రజనుడు, అమితుడు, ద్రవకేతువు, జంభోస్థుడు, అజస్రుడు, శక్రకుడు, సునేమి, ద్యుతపుడును సుశర్ములుఅనువారు. అపుడు వారికి కాబోవు

ఇంద్రుడు అద్భుతుడనువాడు. స్కందుడు సోమప్రతీ కాశుడు కార్తికేయుడు పావకుడు మాఘాతిథి పౌలస్త్యుడు వసువు కాశ్యపుడు. జ్యోతి ష్మంతుడు భార్గవుడు ద్యుతిమంతుడు అంగిరుడు వసితుడు వాశిష్టుడు ఆత్రేయుడు హవ్య వాహనుడు. సుతపుడు పౌలవుడు– ఈ యేడుగురు రోహిత మన్వంతరమున ఉండువారు. ధృతి, కేతువు, దీప్తికేతువు, శాప హస్తుడు, నిరామయుడు, పృథశ్రవుడు, నాకుడు, భూరి ద్యుమ్నుడు, బృహద్రథుడు– వీరు మొదటికి తొమ్మండుగురు పుత్రులు. పదవ పర్యాయమున ధర్మ పుత్రుడైన మనువునకు రాబోవు రెండవ సావర్ణిక మన్వంతరమున సుఖామనులు, విరుద్ధులు అను రెండే గణములు చెప్పబడినవి. వారందరును కాంతిమంతులు. వారి యేండ్లునూరు. ప్రాణాయామము చేయు యోగులగు ఋషులచే పురుష విషయమున శతాయుష్యముకలవారగుదురని చెప్పబడినది. వారు ధర్మ పుత్రుడైన మనువునకు చెందినవారై దేవతలుగా కలరు. వారికి ఇంద్రుడు విద్వాంసుడై రాబోవు శాంతి అనబడుచున్నాడు. పౌలహుడైన హవిష్మంతుడు, శ్రీమంతుడు భార్గవుడునైన సుకీర్తి, ఆత్రేయుడైన ఆపో మూర్తియు, వశిష్ఠుడు, పౌలస్త్యుడైన ప్రతిపుడు, కావ్యపుడైన నాభాగుడు, ఆంగిరసుడైన అభిమన్యువు – ఈ యేడుగురును పరమర్షులు. సుక్షేత్రుడు, ఉత్తమౌజుడు, భూరిషేణుడు, వీర్యవంతుడు, శతానీకుడు, నిరామిత్రుడు, వృషసేనుడు, జయద్రథుడు, భూరిద్యుమ్నుడు, సువర్చుడు–ఈ పదుగురు మానవులు (మనుపుత్రులు) అనబడిరి. పదునొకండవ పర్యాయ మున మూడవ సావర్ణిక మన్వంతరమున దేవతలు సృష్టియందు ఆసక్తి గలవారు, మనోవేగము కలవారు. మహాత్ములైన ఈ దేవతల యొక్క గణములు మూడు అని చెప్పబడినవి. ఆ దేవతలకు ఒక్కొక్కరికి ముప్పది గణములు. వానినే కవులు నెలలోని ముప్పది దినములుగా తెలుపుదురు. నిర్మాణమునందు ఆసక్తి కలవారు దేవతలు. రాత్రులు విహంగములు (పక్షులు). భవిష్యత్కాలమున అవి దేవతలయొక్క మూడు గణములని చెప్పబడును. మనోవేగముకల ముహూర్తములు దేవతలని చెప్పబడిరి. వీరు బ్రహ్మపుత్రులు అనియు రాబోవు మనువులు అనియు చెప్పుదురు. వారికి ఇంద్రుడు వృషుడనువారు, రాబోవు సురరాజు. తరువాత వారికి సప్తర్షులుకూడ ఉన్నారు. చెప్పెద వినుడు. పదునొకం డవ (మను)అంతరమున కాశ్యపుడైన వపుష్మంతుడు, భార్గవుడైన వపుష్మంతుడు, ఆత్రేయుడైన వారుణి, వాశిష్ఠుడైన భగుడు, అంగిరసుడైన పుష్టి, పౌలస్త్యుడైన నిశ్చరుడు, పౌలహుడైన అగ్నితేజుడును దేవతలు. సర్వవేగుడు, సుధర్ముడు, దేవానీకుడు, పురోహవుడు, క్షేమ ధర్ముడు, గృహేషువు, ఆదర్శుడు, పౌండ్రకుడు అనువారు ప్రాజాపత్యుడైన సావర్ణమనువు యొక్క పుత్రులు. పండ్రెండవ పర్యాయమున రుద్ర పుత్రుడైన మనువుయొక్క పుత్రులు. నాలుగవ వాడైన ఋతుసావర్ణ

మన్వంతరమున దేవతలను వినుడు. దేవతల రాబోవు గణములు ఐదేయని చెప్పబడినది. హరితులు, రోహితులు, దేవతలైన సుమనసులు, సుకర్ములు, సుపారులు-అను ఐదు దేవగణములు అనబడినవి. వీరు బ్రహ్మ మనస్సు నుండి పుట్టిన వారు. ఒక్కొక్క గణము పదుగురితో కూడినది. అరుంతిజుడు, హరి, వేయి విధములైన విద్వాంసుడు. పర్వతా నుచరుడు, అపాంశువు, మనోజవుడు, ఊర్జ, స్వాహ, స్వధ, తార-ఈ పదుగురు హరితులు అనబడుదురు. తపుడు, జని, భృతి, వాచాంబంధువు, రజుడు, రాజు, స్వర్ణపాదుడు, వృష్టి, విధి, దేవుడు-ఈ పదుగురు రోహితులు అనబడిరి. ఉషితాద్యులైన దేవతలు ముప్పది ముగ్గురు. దేవతలను సుమనసులుగా తెలియవలెను. సుకర్ములను వినుడు. సుపర్వుడు, వృషభుడు, కృషి ద్యుమ్నుడు, విపశ్చితుడు, విక్రముడు, క్రముడు, నిభృతుడు, కాంతుడు-వీరు సుకర్ములను దేవతలు. వీరి పుత్రులను వినుడు. వర్యుడు, దితుడు, జిష్టుడు, వర్చస్వి, ద్యుతిమంతుడు, హవిస్సు, శుభుడు, హవికృతుడు, ప్రాప్తి, వ్యాపృథుడు పదవవాడు. వీరు సుపారులు (బ్రహ్మ) మనస్సున పుట్టిన దేవతలు. వారికి ఇంద్రుడు మహాయశస్వియైన ఋతధాముడు. వశిష్ఠ పుత్రుడైన కృతి, ఆత్రేయుడైన సుతపుడు, ఆంగిరసుడైన తపోమూర్తి, కాశ్యపుడైన తపస్వి, అశయానుడైన తపుడు, పౌలస్త్యుడైన పులహుడు, భార్గవుడైన తపోరతి. వీరిలో ఏడవవాడు తపోమతి అని తెలుసుకొనవలెను. వీరు సావర్ణిక మన్వంతరమున సిద్ధులైన తక్కిన సప్తర్షులు. దేవవంతుడు, దేవుడు, దేవశ్రేష్ఠుడు, విదూరథుడు, మిత్రవంతుడు, మిత్రబంధువు, మిత్ర సేనుడు, అమిత్రహుడు, మిత్రబాహువు, సువర్చుడు ఈ పండ్రెండుగురు మనువుయొక్క పుత్రులు. పదమూడవ పర్యాయమున రాబోవు రౌచ్య మన్వంతరమున దేవతల గణములు మూడేఅని బ్రహ్మచే చెప్పబడినవి. ఆ మహాత్ములు అందరును బ్రహ్మ యొక్క మానస పుత్రులు. సుత్రాములు, సుధర్ములు, సుకర్ములు-అని వారు ముప్వరు. సోమపానము చేయు రాబోవు దేవతా గణములు. వారు యాజ్ఞికులచే ముప్పది ముగ్గురు దేవతలుగా ప్రభవించగలరు. ఆజ్యము తోను, పృషదాజ్యముతోను, గ్రహ శ్రేష్ఠముతోను, దేవతలచే ముప్పది ముగ్గురు దేవతలు వేరుగా చెప్పబడిరి. వారిని గూర్చి వినుడు సుత్రాములు ప్రయాజ్యులు, ఇపుడు ఆద్యాజ్యులు సుకర్ములు అను యాజ్యులు, పృషదాజ్యా శినులు. ఉపయాజ్యులు సుధర్ములు-అను వీరు దేవతలుగా. మహాసత్త్వుడు అయిన దివస్పతి వారికి రాబోవు ఇంద్రుడు. పులహాత్మజ పుత్రులైన వారు రుచియొక్క సుతులు. ఆంగిరసుడైన ధృతిమంతుడు, పౌలస్త్యుడైన పథ్య వంతుడు, పౌలహుడైన తత్త్వ దర్శి, భార్గవుడైన నిరుత్సుకుడు, ఆత్రేయుడైన నిష్ప్రకంపుడు, కాశ్యపుడైన నిర్మోహుడు, వాశిష్ఠుడైన స్వరూపుడు, ఈ ఏడుగురు పదమూడవ పర్యాయమున

రౌచ్య మన్వంతరమున సప్తర్షులు. చిత్రసేనుడు, విచిత్రుడు, తపుడు, ధర్మధృతుడు, భవుడు, అనేక క్షత్రబద్ధుడు, సురసుడు, నిర్భయుడు, పృథుడు–వీరు పదమూడవ రౌచ్య మన్వంతరమున మనువు యొక్క పుత్రులు. పదునాల్గవ పర్యాయము భౌత మన్వంతరమున రాబోవు దేవతా గణములు ఐదే ఉండును. చాక్షుషులు, కనిష్ఠులు, పవిత్రులు, భాజరులు, వాచావృద్ధులు–అను వీరు ఐదు దేవగణములు. ఏడుగా ఉన్న ఆయా భాగములను చాక్షుషములనెడి భాగములు అందురు. బృహదాద్యములైన సామములను ఆ కనిష్ఠములు అయిన ఏడుగా తెలుసుకొనవలెను. స్వాయంభువ మనువునకు సంబంధించిన వాచావృద్ధులను ఋషులను తెలుసుకొనుడు. వారందరు సమానమైన లక్షణములుకల మన్వంతర ఇంద్రులుగా తెలియవలెను. మన్వంతర ఇంద్రులైనట్టివారు ముల్లోకములలో ఉన్న చరస్థిరములైన ప్రాణులను అంతటను తమ తేజస్సుతో, తపముతో, సంపదతో బల పాండిత్య–పరాక్రమములతో, స్వగుణములతోను తిరస్కరింతురు. భూతపవాదులు హృష్టులు, భూతవాదులు మధ్యస్థులు, భూతానువాదులు సక్తులు జరిగిన దాని చెడుగా చెప్పువారు సంతుష్ఠులు అగుదురు. కేవలము జరిగిన దానిని చెప్పువారు మధ్యస్థులు, జరిగినదానిని అనుసరించి చెప్పువారు సక్తులు అని ఈ విధముగా ప్రవాదుల (ఎక్కువగా వాదించువారి) భేదములు మూడు. కాశ్యపుడైన అగ్నీధ్రుడు, పౌలస్త్యుడు, మాగధుడు, భార్గవుడైన అగ్నిబాహుడు, ఆంగిరసుడైన శుచి (అగ్ని), ఓజస్వి, సుబలుడు–వీరు భౌత్య మనువు యొక్క పుత్రులు. బ్రహ్మపుత్రులైన ఈ నలుగురు మనువులు సవర్ణులు. వైవస్వతుడైన ఒక్కడు సావర్ణ మనువు అనబడును. రౌచ్య–భౌత్యులనువారు పౌలవ భార్గవ మనువులకు సంబంధించినవారు. భౌత్యుని ఆధిపత్యమున మొత్తము కల్పము పూరింపబడును".

సూతుడు ఇట్లు అనెను : అపుడు ఇచట మన్వంతరములు అన్నియు నిఃశ్శేషములుకాగా చివర ఆ అనేక యుగములు క్షీణముకాగా సంహారమని చెప్పబడును. అపుడు మన్వంతర అంతమున ఈ ఏడుగురు భార్గవులైన దేవతలు త్రైలోక్య మధ్యన ఉన్నవారై, డెబ్బదియొక్క యుగములను అనుభవించి (పాలించి) పితరులతోను, మనువులతోను, సప్తర్షులతోను, యాగము చేయువారితోను, తద్భక్తులతోను, ఈశ్వరులు (అధిపతులు) త్రైలోక్యమును వదిలి మహర్లోకమునకు పోవుదురు. వారు ఆ విధముగ పైకి వెడలిపోగా, అపుడు ఈ త్రైలోక్యము అంతయు నిరాధారము అగును. ఓ బ్రాహ్మణులారా! తరువాత, వెళ్లిపోయిన వారి ఆస్థానములు వారిచే వదిలిపెట్టబడినందున నక్షత్ర తారాగ్రహములతో గూడ జారి నశించిపోవును. తరువాత ఇచట త్రైలోక్యాధిపతులైన ఆ ఇంద్రాదులగు ఎనమండుగురు గడచిపోగా, వారు మహర్లోకమునుచేసి కల్పకాలము వసింతురు. ఇచట, జితుడు

మొదలుకొని చాక్షుషుడు చివరగల పదునాలుగు మన్వంతరముల అన్నింటియందును వారు మహౌజస్కులైన దేవతలు అగుదురు. తరువాత వారు అట్లు పైకి పోగా కల్పవాసుల యొక్క సాయోజ్యమును పొంది దేవతలై, వారందరు గుమికూడి సంకలనము చెందగా అపుడు, మహర్లోకమును వదిలి ఆ పదునాలుగు గణములు సశరీరులై తమను వెన్నంటి వచ్చువారితో సహా జనలోకమునకు పోవుదురు. ఈ విధముగ దేవతలు మహర్లోకము నుండి జనలోకమునకు పోగా, స్థావరాంతములైన భూతాదులు మిగిలి ఉండగా, భూరాది మహాంతములైన లోక స్థానములు శూన్యములు కాగా, దేవతలు ఊర్ధ్వ లోకమున కల్ప వాసుల యొక్క సాయోజ్యమును పొందగా, తరువాత యుగక్షయమున బ్రహ్మ, దేవర్షి పితృదానవులను సంహరించి మహద్దృష్టితో సర్గమును (సృష్టిని) స్థాపించును. అట, వేయి యుగములు బ్రహ్మకు ఒక పగలనియు, వేయి యుగములు రాత్రి యనియు అహో రాత్రవేత్తలైన జనులు చెప్పుదురు.

నైమిత్తికము, ప్రాకృతికము, ఆత్యంతికము–అని అర్థదృష్ట్యా ఈ సర్వభూతముల ఉపసంహార ప్రళయము (ప్రతిసంచరము) మూడు విధములు. బ్రాహ్మము నైమిత్తికము. దానియొక్క కల్పదాహము ప్రసంయమము. మన్వాది సృష్టిలో (ప్రతిసర్గమున) భూతములకు ప్రాకృతమైన (ప్రకృతివల్ల ఏర్పడిన) కరణక్షయము కలుగును. జ్ఞానము వలన కరణముల అసంభవము (పుట్టకుండుట) ఆత్యంతికము అనబడినది. ఆ తరువాత బ్రహ్మ త్రైలోక్య వాసులైన ఆ దేవతలను ఉపసంహరించి, పగటియొక్క చివర (సాయంకాలమున) మరల సృష్టియొక్క ప్రళయమును చేయును. అపుడు, భగవంతుడైన బ్రహ్మ నిద్రింపదలచిన వాడై ప్రజలను ఉపసంహరించును. తరువాత వేయి యుగముల సమాప్తిలో యుగక్షయము రాగా, అచట బ్రహ్మ ప్రజలను ఆత్మస్థలనుగా చేయసాగెను. అపుడు అనావృష్టి కలుగును. అదియును నూరేండ్ల అనావృష్టి సంభవించును. అట్లే భూతములన సత్త్వములు (ప్రాణులు) అల్పసారములై పోవును. ఆ ప్రాణులే ఇచట లీనమగును, భూ రూపమును చెందును. సప్తరశ్మి (సూర్యుడు) క్రిందుగానై విభావసువు (సూర్యుడు) లేచి నిలిచెను. సహింప అలవి గాని కిరణములుగల ఆ భగవంతుడగు సూర్యుడు తన ఏడు కిరణములచే నీరు త్రాగు చుండును. ఆతని హరితములైన కిరణములు ప్రకాశించుచున్నవై మెల్లిగా వనమంతయు (జలమంతయును) వ్యాపించుచున్నవై మరల తిరిగి వచ్చును. ఆ జలముల చేత భూ సంబంధమైన కాష్ఠము, ధనము, తేజమును మిక్కిలి ప్రకాశించును. కావున, తపించుచున్న సూర్యునకు జలము అధికమగునని చెప్పబడును. అవృష్టిచేత సూర్యుడు తపించడు. అవృష్టిచేత సూర్యుడు పరివేషింపబడడు (వరదగూడుచే చుట్టబడడు). అవృష్టి చేత

ధాన్యాదులను ఏరుకొనలేరు. సూర్యుడు నీటిచేత ప్రకాశించును. కావున సూర్యుడు నీటిని త్రాగుచునే ఆకాశమున ప్రకాశించును. ఆతని ఏడుకిరణములు మహాసముద్రము నుండి నీరు త్రాగును. ఆ ఆహారముతో చక్కగా ప్రకాశించినవాడై సూర్యుడు ఏడు (రూప ములు) అగును. తరువాత, ఆ ఏడు కిరణములు సూర్యులుగానై నలుదెసలను వ్యాపించును. అపుడు అగ్నులై ఈ మొత్తము నాలుగు లోకములను దహించివేయును. తమ కాంతులచే ఊర్ధ్వమును (పై ఆకాశమును) అధస్సును (క్రింది ఆకాశమును) వ్యాపించును. తమ కిరణములచే ఏడుగురు సూర్యులు యుగాంత ప్రళయాగ్నిని ప్రజ్వలింప చేయువారై ప్రకాశింతురు (మండుచుందురు). వారు జలముచే మరింత ప్రకాశించినవారై అనేక సహస్ర కిరణములు కలవారై భూమిని దహించివైచుచు ఆకాశము ఆవరించి ఉందురు. తరువాత ఆ సూర్యుల ప్రతాపముచే దహింపబడుచున్నదై భూమి తన పర్వతనదీ సము ద్రములతో బాటు తడిలేనిది అయ్యెను. ప్రకాశించినవియు, చిత్రములైనవియు, అంతట వ్యాపించి నవియునైన సూర్యకిరణములచే ఊర్ధ్వాకాశమునను క్రింది ఆకాశమునను అడ్డముగను సమస్తము (కాంతులచే) నిరోధింపబడినది, పెంపొందియు పరస్పరము కలిసిపోయినవియు అయిన సూర్యాగ్నుల జ్వాలలు ఏకమైనవి. సర్వలోక ప్రణాశకమైన ఆ అగ్ని మండలాకారమై తన తేజముతో ఈ నాలుగు లోకములను నిఃశ్శేషముగా వెంటనే దహించును. తరువాత స్థావర జంగమ మంతయు (పశు పక్ష్యాదులు వృక్షాదులు) లయమై పోవును. వృక్షములు లేక గడ్డిలేకభూమి తాబేటి చిప్పవలె అగును. మారిషితమైన (చంపబడిన సమస్త ప్రాణులు గల) ఈ జగమంతయు మంగలము (మూకుడు)వలె ప్రకాశించినది. అపుడు ఆకాశ మంతయు జ్వాలలచే పూర్తిగా మండును. పాతాళమున ఉన్న ప్రాణులును, మహాసముద్ర మున ఉన్న ప్రాణులును అవి అన్నియు ప్రళయమును చెంది భూమి రూపమును పొందును. సర్వాత్మకుడైన ఆ అగ్ని ద్వీపములను, పర్వతములను, వర్షములను, మహాసముద్రమును సర్వ మును భస్మముచేసెను. సముద్రములనుండియు, నదులనుండియు, పాతాళముల నుండియు జలమును త్రాగుచు అగ్ని ఉద్దీప్తము అయినదై, భూమిని ఆశ్రయించి అచట జలమును త్రావును. తరువాత ఆ సంవర్తకాగ్ని (ప్రళయాగ్ని) శైలములను దాటి గొప్ప దగును. తరువాత దీప్తమై భయంకరమైనదైన ఆ సంవర్తకాగ్ని లోకములను సంహరించును. తరువాత అది భూమిని భేదించి పాతాళమును ఎండింపచేయును. ఆ పాతాళములను పూర్తిగా దహించి తరువాత నాగలోకమును దహించెను. క్రింద పృథివిని దహించి, అది ఊర్ధ్వమున స్వర్గమును కూడ దహించును. వేల యోజనములవరకును, కోటి యోజనముల వరకును, ఆ సంవర్త కాగ్ని యొక్క అనేక జ్వాలలు ఉవ్వెత్తునలేచి నిలిచినవి. అపుడు ఆ సందీ

ప్తమైన అగ్ని గంధర్వులను, పిశాచులను, మహోరగ రాక్షసులను భూగోళమును అంతయు దహించును. భయంకరమైన కాలాగ్ని భూలోకమును, భువర్లోకమును, స్వర్లోకమును, అట్లే మహర్లోకమును, నాలుగు లోకములను ఈ విధముగా దహించును. అగ్నిచేత ఆ లోకములు అడ్డముగను ఊర్ధ్వముగను వ్యాపింపబడగా, ఆ తేజము మెల్లగా ఈ జగమును అంతయు పొంది అపుడు అదిఅంతయు ఒక అయోగుడము (ఇనుప గుండు లేదా గోళము) వలె ప్రకాశించును. దాని నుండి ఏనుగుల గుంపుల ఆకారములుగలవై, మెఱుపులచే అలంకరింపబడినవై భయంకరములైన సంవర్తక ప్రళయ మేఘములు ఆకాశమున లేచును. ఆ మేఘములు కొన్ని నల్లకలువలవలె నల్లనివి. కొన్ని కలువలతో (రంగున) సమానమైనవి. కొన్ని వైడూర్యమణి వర్ణము గలవి, మరికొన్ని ఇంద్ర నీలమణి వర్ణము గలవి. కొన్ని శంఖమువలెను, మొల్లపూవుల వలెను తెల్లనైనవి, అట్లే కొన్ని జాత్యంజనము (జాజిపూవుల కాటుక)వలె నల్లనైనవి. కొన్ని పొగవర్ణములుకలవి. కొన్నిపచ్చనైనవి. కొన్ని గాడిద వర్ణము కలవి. కొన్ని లక్కవలె ఎఱ్ఱనైనవి. కొన్ని మణిశిల (ఎఱ్ఱమన్ను) రంగు కలవి. మరికొన్ని పావురపు రంగుకలవి, కొన్ని ఇంద్రగోపము (ఆర్ద్రపురుగు)ల వలె ఎఱ్ఱనైనవి–ఇట్టి మేఘములు ఆకాశమున పైకి లేచును. కొన్ని పురధరుని (పట్టణ పాలకుని) ఆకారములు కలవి, కొన్ని ఏనుగు గుంపుల ఆకారములు కలవి. కొన్ని పర్వతములవలె ఉన్నవి, కొన్ని స్థలములవలె ఉన్నవి, కొన్ని కుమ్మరివాడు పేర్చిన కుండల ఇల్లువలె ఉన్నవి, కొన్ని చేపల గుంపువలె ఉన్నవి, అనేక రూపములు కలవై, భయంకర రూపములు గలవై, భయంకర గర్జానాదముచేయుచున్నవై, ఆ మేఘములన్నియు ఆకాశ స్థలమును నింపివేయును. తరువాత ఆ మేఘములు భయంకరములై క్రొత్తవై సూర్యాత్మకములై ఏడు విధములుగా ఏర్పరచుకొన్న ఆకారములు కలవై, ఆ అగ్నిని చల్లార్చును. అంత, ఆ మేఘములు గొప్ప వర్షమును కురియును, మిక్కిలి భయంకరమైన అమంగళమైన ప్రళయాగ్నిని నశింపచేయును. అట్లు అత్యంతము కురిసిన వర్షజలముచే జగమంతయు నిండును. ఆ జలములచే తేజము తిరస్కరింపబడి అగ్ని జలములలో ప్రవేశించును. అట్లు నూరేండ్లు అగ్ని నశింపగా, ఆ పాకమున పుట్టిన మేఘములు తమ గొప్ప జల ప్రవాహములచే జగమంతయు ముంచివేయును. బ్రహ్మచే ప్రేరేపింపబడినవై ఈ జగమును జలధారలతో నింపివేయును. మరికొన్ని మేఘములు జలసమూహములతో చెలియలి కట్టలను సైతము దాటింపజేసి తిరస్కరించును. అపుడు భూమి అంతటిని తన పర్వతములతోపాటు, ద్వీపాంతరములతోపాటు, నీటితో కప్పివేయును. ఓ బ్రాహ్మణులారా! సూర్యుని కిరణములచే త్రాగబడిన జలమంతయు మేఘ వృష్టిచే పరిమండితమై (సంస్కరింపబడి

తీయనిదై) సముద్రమున ప్రవేశించును. సూర్య కిరణములచే త్రాగబడిన జలము మేఘము లందు ఉండును. అందువలన, సముద్రములు తమ చెలియలికట్టలను (హద్దు కట్టలను) అంతట అతిక్రమించును. పర్వతములు బ్రద్దలగును. భూమి నీట మునిగిపోవును.

ఆ తరువాత అకస్మాత్తుగా ఆకాశమున అంతట లేచి తిరిగి భయంకరము అయిన ప్రళయ వాయువు ఆ మేఘముల ఆకాశమున చుట్టివైచును. అట్లు అంతయు భయంకరమై ఏకార్ణవము (విశ్వమంతయు ఒకే సముద్ర రూపముగా అయినది) కాగా, వేయి యుగ ములు నిండగా, కల్పము నిఃశేషమైనదని చెప్పబడును. అంత, భూతలము ఆకాశము వాయువు–ఈ మూడు ఒక్క సముద్రమాత్రము కాగా, లోకమంతయు జలముతో ఆవరిం పబడగా, బుధులు ఏకార్ణవమని అందురు. అపుడు భావము (స్థితి–జ్ఞానము) నష్టము కాగా ఆ విశ్వము అంతయు అవలీనమగును. అపుడు ఏమియు తెలియదు. పార్థివములు (పృథివీ సంబద్ధములు), సాముద్రములు (సముద్ర సంబద్ధములు) హైమములు (మంచువల్ల ఏర్పడినవి) అయిన జలములు అంతట ప్రసరించుచున్నవై ఒకే సలిలమను పేరును పొందును. అపుడు వచ్చిచేరినదియు, ఎచ్చటికినిపోక ఉండు నదియు, సలిలము అన బడినది. అర్ణవమను ఆ జలము భూమిని అంతయు కప్పిఉండును. సమస్త భస్మను పొంది (భాభిః) కాంతులచే (ఆభాంతి) ప్రకాశించును. కావున 'అంభస్సులు' అని (జలములు) నిరుక్తములైనవి. ఏకార్ణవమున అపుడు ఎవరు శీఘ్రముగా ఉండరో వారు నరులు. ఆ యుగ సహస్రాంతమైన బ్రహ్మయొక్క పగలు గడచిపోగా, అంతకాలము జగమంతయు ఏకార్ణవము అయి ఉండును. అపుడు బ్రహ్మయొక్క అన్ని వ్యాపారములు ఉపసంహరింపబడును.

ఈ విధముగా ఆ ఏకార్ణవమున స్థావరజంగమములు నశింపగా, అపుడు సహస్రాక్షుడు (అనంత నేత్రుడు), సహస్రపాదుడు (అనంత పాదములు కలవాడు) అయిన బ్రహ్మ ఉండును. వేదపథమున పురుషుడు అని నిర్వచింపబడినవాడు, వేయి శిరములు, వేయి కాళ్లు, వేయి చేతులు, చివరకు వేయి వాక్కులును గల దేవుడైన మొదటి బ్రహ్మ. ఆతడు సూర్యుని వర్ణము కలవాడు, భువనమును రక్షించువాడు, పూర్వము లేని ఒకే ఒకడు, ఆతడు మొదటి ఇంద్రుడు, బ్రహ్మ, చీకటి ఆవల ఉన్న మహాపురుషుడై ఉండును. ఆ ప్రభువు నాలుగువేల యుగముల (పగటి)చివర అంతట జలప్రళయము ఏర్పడగా పడుకొనదలచినవాడై వెలుతురులేని తన రాత్రిని కలుగజేసెను. అపుడు సర్వాండ మండి తులై నాలుగు విధములైన ప్రజలు నిద్రింతురు. అపుడు సప్తమహర్షులు మహాత్ముడైన ఆ కాలుని చూతురు. వారు జనలోకవివర్తము చివరవరకు ఉండువారు, తపముచే పొందిన

జ్ఞాన నేత్రములు కలవారు, భృగువు మొదలగు మహాత్ములు. వీరు ఎట్లు ఉందురో ఈవరకే చెప్పబడినది. వారు తమ నేత్రముతో సత్యాది సప్తలోకములను చూతురు. వారు మహా బ్రాహ్మీ రాత్రులలో బ్రహ్మను చూతురు. సప్తర్షులు తమ రాత్రులలో నిద్రించిన కాలస్వరూపుని చూతురు. కల్పములకు బ్రహ్మయైనందున ఆతడు ఆద్యుడు అనబడుచున్నాడు. ఆతడు కల్పాదులలో మరల మరల సర్వ భూతములకు యజ్ఞము చేయువాడు. బ్రహ్మతనయందే ఈ విధముగ ఆవేశింపచేసికొని స్రష్టఅగును. తరువాత ఆ మహాతేజస్వి తనలోకి సర్వమును తెచ్చి సర్వమును చేయును. అంత, చీకటిలో సమస్తము ఏకసముద్రమైన జలమున రాత్రిఅంతయు (ఆ బ్రహ్మ) ఉండును. తరువాత రాత్రి అంతము కాగా బ్రహ్మ మేలుకొనును. సృష్టికొఱకు మరల తన మనమును సృష్టించు కోరికతో కూర్చుకొనును. ఈవిధముగ, ఆ లోకము బయలువెడలును. బ్రహ్మ ఉపశాంతుడు అగును. బ్రహ్మ నిమిత్తముగా ఆ ప్రసంయమము కల్పింపబడును. అపుడు ఆలోకమున అంతటను ప్రాణులకు దేహవియోగము జరుగును. అపుడు ఆ సంకలనమున సూర్య కిరణములచే భూతములు దేవ, ఋషి, మనువర్యులును దహింపబడుటయే కారణము. గంధర్వులు మొదలుకొని పిశాచాంతములైన ప్రాణులు అంతట కల్పాదిలో దహింపబడని వారును జనలోకమునే ఆశ్రయింతురు. అడ్డముగానడచు పశ్వాదులును, నరకమునకు సంబంధించిన ప్రాణులైనను అంతట దహింపబడి పాపములు కడుగబడినవారై జలప్రళయమున జగము ఉన్నంతవఱకు జనలోకమునకు చేరుదురు. బ్రహ్మకు రాత్రి గడిచి ప్రాతఃకాలము రాగా ఆ సర్వ భూతములును మొత్తముగా మరల జనించును. ఋషులు, మనువులు, దేవతలు, ప్రజలు-అని ప్రజలు నాలుగు విధములు. ఇచట సిద్ధులైన వారికికూడ మరణ జననములు కలుగును. సూర్యునకు ఉదయ, అస్త మయములు ఉన్నట్లే ఇచట భూతములకు (ప్రాణులకు) జనన మరణములు కనబడును. మహాభూత ప్రళయము వరకు పుట్టినది సంసారము అనబడును. వర్షాకాలములలో ఇచట సర్వ ప్రాణులు జనించినట్లే ప్రతి కల్పమున స్థావరాది ప్రాణులు ప్రజలును జనింతురు. ఋతువుల మార్పులలో నానారూపములైన ఋతు చిహ్నములు కలిగినట్లే, బ్రహ్మ పొందిన రాత్రులలో సృష్టియొక్క ఉపసంహారమునందును, సృష్టియందును ఆయా క్రియలు సంచలించును, స్థిరములగును కూడ. ప్రజాస్వరూపుడు, ప్రజాపతియు, బ్రహ్మయునై మహాయోగముగల మహేశ్వరుని నుండి బయల్వెడలుదురు. తరువాత చివరకు ఆతనిలోనే ప్రవేశింతురు. కల్పాదులలో మరల మరల సర్వ భూతములను సృష్టించువాడు వ్యక్తావ్యక్తుడైన మహాదేవుడే, ఈ జగమంతయు ఆతనిదే. మొదట సృష్టింపబడిన జలములు ఈ భూమిలోనే ఏ మార్గమున

ప్రవహించినవో, తరువాత సృజింపబడిన జలములు ఆయా మార్గములనే భూమిలో స్రవించు చుపోవును. సూర్యుని వశమున శుభముచేతను, అశుభముచేతను, జలములచ్చటనే మార్పులు చెంది తిరుగుచున్నట్లే, మరణశీలురైన మానవులు కూడ దేహాంతరముల స్థితిని పొందుటచే ఊర్ధ్వ లోకమును అధోలోకమును గూడ పొందుచు తిరుగుచుందురు. దేవతలు మనువులు ప్రజాపతులు తక్కిన సిద్ధులును మంచివారుగా భావింపబడినవారును పేరు ప్రఖ్యాతులచే ధర్మాత్ములు అయిన వారు స్వర్గమును పొందియు పునఃసృష్టితో మరల ప్రాణులు అగుదురు.

ఆ తరువాత మహాభూత ప్రళయము వఱకుగల కాలమును చెప్పెదను. ఓ బ్రాహ్మణులారా! పదునాలుగు మన్వంతరములను, వారి ప్రజ్ఞా, సృష్టితోబాటు దేవతలతో పాటు ఈవరకే చెప్పితిని. అన్ని మన్వంతరములు వేయియైన యుగము అనబడును. ఈ యుగములు రెండువేలు ఒక నిఃశేషమైన కల్పము (పూర్ణ కల్పము). ఇది బ్రహ్మదినమని తెలియవలెను. దాని సంఖ్యను (లెక్కింపును) వినుడు. ఒక లఘ్వక్షరమునకు సమానమైన ఏకమాత్రాకాలము నిమేషము అనబడినది. మనుష్యుని పదియైదు కనురెప్పపాట్ల కాలము కాష్ఠము అనబడును. ఐదు క్షణములు లవము. ఇరువది క్షణములు కాష్ఠ. ఆ మూడు క్షణములు ప్రస్థము. ఏడు ఉదకములుకల సాధికలు లవము అనబడును (చిన్న బుట్ట నీళ్లలో మునుగు కాలము ప్రస్థము. అట్టివి ఏడు-లవము కావచ్చును). ముప్పది లవములు కళ. ముప్పది కళలు ముహూర్తము. ముప్పది ముహూర్తములు ఒక అహో రాత్రము. అహోరాత్రమున వ్యధికములైన ఆరువందల కళలు. చంద్రాదిత్యుల గతివలె సంఖ్యచే తెలియవలె. పదియైదు నిమేషములు ఒక కాష్ఠ. ముప్పది కాష్ఠలు ఒక కళ. ముప్పది కళలు ఒక ముహూర్తము, పది భాగములు కలది కళ అనబడును. ఇరువది నాలుగు కళలు ముహూర్తము. ముహూర్తములు లవములును ప్రమాణజ్ఞులచేత కల్పిం బడినవి. ఆ స్థానమున నీటియొక్క ముప్పది ఫలములు (చెప్పబడినవి). మగధ దేశపు కొలత ప్రకారము జల ప్రస్థము చెప్పబడును. ఈ జల ప్రస్థములు నాలుగు ఒక నాళిక, ఘటము. రంధ్రము చేయబడిన నాలుగు అంగుళములుకల నాలుగు హేమ మాషములచేత సమ ముగానైన పగటి యందును రాత్రి యందును ముహూర్తము రెండు నాళికలుగా ఉండును. సూర్యుని గతివిశేషముచే మనుష్యులందరిలోను ప్రతి నిత్యము ఆరు వందల ఐదు కళలు ఉండును. ఆ పగలు మనుష్యులకు సంబంధించిన పగలు అని తెలియవలెను. నక్షత్రము లకు సంబంధించినది పది ఎక్కువగా ఉండును. సావన మాసముతో ఈ సంవత్సరము మనుష్య సంవత్సరము. ఇది దేవసంబంధమైన అహోరాత్రమని శాస్త్ర నిశ్చయము. ఇట్టి

దినములతో ఏర్పడిన సంఖ్యలు మాసము అనియు, ఋతువు అనియు, అయనము అనియు, సంవత్సరము అనియు చెప్పబడును. అపుడు ఈ విధముగా నిబంధింపబడిన సంజ్ఞ యొక్క జ్ఞానమును గమనింపవలెను. కళలయొక్క సుపరిమాణము వలన కాలమని చెప్పబడినది. బ్రహ్మకు దినమని చెప్పబడిన దివ్యమైన కోటి అనబడినది. పంద్రెండు లక్షలును తొంబదివేలును, అట్లే తక్కినవియు. ఇది విని ఋషులు పరమ అద్భుతమును విస్మయమును పొంది అపుడు సంస్థా విభాగమైన జ్ఞానమును అంతరమును అడిగిరి.

ఋషులు ఇట్లు అనిరి :

"జలప్రళయ (సంప్లావన) కాలమును మానుషమానము (కొలత)తో సమ్మతమైన దానిని సంగ్రహమైన అర్థ-పద అక్షరములు కలుగునట్లుగా వినదలచితిమి" వారి మాటలను విని భగవంతుడై ప్రభువైన వాయుదేవుడు దివ్యనేత్రుడై సంగ్రహముగా చెప్పెను. ఈ భూలోకమున పూర్వము ఈ రాత్రి-అహములు చెప్పబడినవి. ఆ రాత్రి-పగళ్ల వర్షాగ్రమును లెక్కించి అహః క్షయమున (పగటి చివర) బ్రాహ్మ్యమును (బ్రహ్మ దినమును) చెప్పెదను. నాలుగు వందల ముప్పది రెండు కోట్లు, ఎనుబది తొమ్మిది లక్షల యెనుబది వేల (4,32,89,80,000) మానుష సంవత్సరములు జలప్రళయ కాలమని బ్రాహ్మణులచే చెప్పబడినది. మహాభూతములతోడి జలప్రళయముయొక్క కాలము మనుష్యమానమున చెప్పబడినది. అపుడు ఏడుగురు సూర్యులు ముందు లోకములలోను లీనము అగుదురు. లోకము అంతయు జలముచే నిండి ప్రవహింపగా, స్థావర-జంగమములు నశింపగా, నాలుగు విధములైన ప్రజలు మహాభూతములలో లీనమగుదురు. సంహారము అంతయు జరిగిపోగా, ప్రజాపతి (బ్రహ్మ)శాంతింపగా, జగము అంతయు దహింపబడి వెలుగు లేక రాత్రితో ఆవరింపబడగా, అంతయు ఏక సముద్రముగానైనది ఈశ్వరునిచే నధిష్ఠితమగును. ఏక సముద్రస్థితి వచ్చునంత వరకు (ఆతప ప్రళయము) ఆ ప్రభువునకు పగలని తెలియవలెను. జలావస్థ రాత్రి. అది నివర్తింపగనే పగలుఅనబడును. ఈప్రభువునకు ఈవిధముగ క్రమముగా అహోరాత్రములు తిరుగుచుండును. ఈ ఆ భూతసంప్లము ప్రభువునకు అహోరాత్రము అగును. ముల్లోకములలో ఉన్న స్థావర జంగమములైన ప్రాణులు మహాభూతముల వరకే లీనము అగుదురు గావున ఇది ఆ భూత సంప్లవమైనది. ప్రజలకు ముందుగా ఉన్నవాడు కావున ప్రజాపతి (బ్రహ్మ) భూతము అనబడెను. ఈ జలప్రవాహము ఆభూతము వఱకే ఉండును. కావున ఇది ఆ భూతసంప్లవమైనది. శాశ్వతము నందును అమృతత్వము నందును ఆ భూత సంప్లవ శబ్దము వర్థిల్లును. కావున ఇందు భూత-భవిష్య ద్వర్తమాన ప్రజలు లీనమై ఉందురు. ఈ విధముగ అపరార్ధ

ముచే ద్విగుణీకృతమైన దివ్యసంఖ్య చెప్పబడినది. పరార్థముల యొక్క ద్విగుణితమైనది పరమ వాయువుగా చెప్పబడినది. అజుడైన బ్రహ్మ యొక్క స్థితికాలము ఇంతే. ఈ స్థితి అంతమున పరమేష్ఠియైన బ్రహ్మయొక్క మన్వాది సృష్టిజరుగును. వాయువేగమున దీపజ్వాల చల్లారినట్లే ప్రతిసర్గముచే (మన్వాది సృష్టిచే) బ్రహ్మ ఉపశమించును. ప్రతి సంసృష్టుడు కానట్టియు, మహత్తునకు ఆది (మూలము) అయినట్టియు, అవ్యక్తుడైన మహేశ్వరుని యందు మహత్తు ప్రలీనము చెందును. దానగుణ సామ్యము ఏర్పడును. అని ఈ మహాభూత సంప్లవము నాచే చెప్పబడినది. ఇది బ్రహ్మ నైమిత్తికమైన సంప్రక్షాళన సమయము సంగ్రహముగా చెప్ప బడినది. మఱి ఇంకేమి మీకు చెప్పవలెను. దీనిని నిత్యము బుద్ధియందు ధరించువాడును, మాటి మాటికి దీనిని వినువాడును, చెప్పువాడును, వినువాడును మహాసిద్ధిని పొందును" (38)

శివపురవర్ణనము

వాయువు :

అసాధారణ వృత్తులుగల హుతశేషాది బ్రాహ్మణులతోను, చూర్ణములోని సూక్ష్మము లను కూడ (పరమాణువులను కూడ) చూచునట్టి ధర్మ వైశేషికులతోను, దేవతలతోనుకూడ, మహర్లోకమున నివసించువారు ఉందురు. ఈ మనువులు పదు నలుగురుగను కీర్తిని పెంచువారుగను పండితులు చెప్పుదురు. గడచినవారును ప్రస్తుతము ఉన్నవారును, భవిష్యత్తులో రాబోవువారును ఋషులతో, దేవతలతో, గంధర్వ రాక్షసులతోను, మన్వంత రాధికారములలో ఇట మరలమరల పుట్టుదురు. దేవతలు, సప్తర్షులు, మనువులు, పితరు లును, అందరును క్రమమును మించిన సురులు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులతోపాటు మహర్లోకమును ఆశ్రయింతురు. సత్యము ఆచరించువారును, సమర్థులును, శ్రద్ధగల వారును, మదములేనివారును, శ్రౌతస్మార్త ధర్మములందును వర్ణాశ్రమ ధర్మములందును నిలచినవారును అగు ఆత్రిజాతీయులచేత ఆ దేవతలు మన్వంతర క్షయము వరకు అధికారము లేనివారగుదురు అని చెప్పెను.

ఋషులు :

"ఓ వాయు ప్రభో! మహర్లోకమని నీవు చెప్పిన లోకమునందు కర్తవ్యమేమి? దానిని గూర్చి చెప్పుము. ఎంతవరకు ఆలోకములు దహింపబడక ఉండినవై అనేకులచే అధిష్ఠితములు అగునో ఈ విషయమును ప్రేమతో మాకు చెప్పుము. నీవే అందున్నది ఉన్నట్లు తెలియుదువు" అని అడిగిరి. ఈ విధముగా వినయవంతులైన మునులు అడుగగనే తత్త్వవేత్తఅయిన వాయువున్న సత్యమును మధుర వాక్కులతో చెప్పెను.

వాయువు :

మానవులు ఉండు లోకములు అనబడు స్థానములు పదునాలుగని ఋషులు చెప్పిరి. వానిలో ఏడు కృతములనియు మరియేడు అకృతములని అందురు. ఇచటి లోకములుగా భూరాది లోకములు–కృతములు అనబడినవి. ప్రాకృతములైన (ప్రకృతి నిర్మితములైన) ఏడు స్థానములు అకృతములు. స్థానములు స్థానులతో (స్థానవాసులతో) బాటు కృతములని నిబంధనము. పృథివి, అంతరిక్షము, దివ్యము, మహస్సు, ఈ నాలుగు స్థానములు అర్ణవకములు అనబడును. ఇవి క్షయ–వృద్ధులతో కూడుకొన్నవి. అట్లు క్షయ వృద్ధులతో ఉక్తములుకాని వానినిగూర్చి చెప్పెదను. అవి నైమిత్తికములు. భూత సంప్లవము వఱకును ఉండును. జనోలోకము, తపోలోకము, సత్యలోకము–ఈ మూడు స్థానములు ఐకాంతి కములు. ఇచట ప్రసంయమము (ప్రళయము)వఱకు ప్రాణులుండును. ఇక వ్యక్తములైన ఏడు స్థానములను చెప్పెదను. వానిలో మొదటిది భూర్లోకము. రెండవది భువర్లోకము, మూడవది స్వర్లోకము, నాలుగవది మహర్లోకము, ఐదవది జనలోకము, ఆఱవది తపో లోకము, ఏడవది సత్యలోకము. ఆ తరువాత నిరాలోకము. బ్రహ్మ పూర్వము భూః– అనగనే భూలోకము ఏర్పడెను. 'భువః' అనగనే భువర్లోకము, దాని నుండి అంతరిక్షము ఏర్పడినవి. 'స్వః' అనగనే స్వర్గము ఏర్పడెను. బ్రహ్మ ఈ మాటలతో బ్రహ్మ లోకమును ఏర్పరచెను. తరువాత, భూమి పార్థివలోకము భూమినుండి అంతరిక్షము అనబడెను. స్వర్లోకము దివము అని పురాణమున నిశ్చయము నందెను. భూతమునకు (భూమికి) అధిపతి అగ్ని. అందువలన అగ్ని భూతపతి అనబడెను. భువర్లోకమునకు వాయువు అధిపతి. దాన వాయువు భువఃపతి. దివమునకు సూర్యుడు అధిపతిగాన సూర్యుడు దివస్పతి. బ్రహ్మ 'మహః' అనగానే మహర్లోకము ఏర్పడెను. పోయిన అధికారములుకల దేవతలకు అచట క్షయము. జనమనునది ఐదవ లోకము దాని నుండి జనులు పుట్టుదురు. ఆ స్వాయంభువాది ప్రజలు జనించుట వలన 'జన' లోకమైనది. ఆ లోకము కల్పదగ్ధము కాగా పూర్వము చెప్పబడిన స్వాయంభువాదులు తపమున (తపోలోకమున) కూర్చుందురు. ఋభువు, సనత్కుమారాదులగు ఊర్ధ్వరేతస్కులు ఆ తపోలోకమున ఉందురు. వారు అచట తపస్సుతో భావితాత్ములై ఉందురు కావున అది తపోలోకము అనబడినది. సత్యము అనునది బ్రహ్మయొక్క (వాచకమైన) శబ్దము. సత్తా మాత్రమును చెప్పునది అందురు. అందువలన బ్రహ్మలోకము, సత్యలోకము ఏడవ భాస్కరుడు (సూర్యుడు), గంధర్వులు, అప్సరసలు, యక్షులు, గుహ్యకులు, రాక్షసులు, సర్వభూత పిశాచులు మనుష్యులతో కూడ నాగులును సమస్త దేవతలును భూమియందు నివసించువారు. మరుతులు, మాత

రిశ్వులు, రుద్రులు (రుద్ర దేవులు), అశ్వినులు అంతరిక్షమున ఉండని వారై భువర్లోక వాసులైన దివౌకసులు (స్వర్గ వాసులు). ఆదిత్యులు, ఋభువులు, విశ్వులు, సాధ్యులు, పితరులు, ఋషులు, అంగిరసులను భువర్లోకమును ఆశ్రయించిరి. ఈ విమానములలో పయనించు దేవతలు తారాగ్రహ నివాసులు–అను ఈ బ్రహ్మవచనమున పుట్టిన లోకములు క్రమముగా చెప్పబడినవి. అవి భూర్లోకము మొదలుకొని మహర్లోకాంతము వరకున్న లోకములు అనబడినవి. తన్మాత్రలచేత ఆరంభింపబడును. వారిలో అవి పరస్పరములు శుద్ధములు. శుక్రాదులు చాక్షుషాంతములు అయిన కడచినవారు భూలోకమును ఆశ్రయించిరి. నాలుగవది మహర్లోకము. దానియందు వారు కల్పవాసులు. భూర్లోకము మొదలుకొని మహదంతములైన లోకములను అన్నింటిని ఆ యేడుగురు సూర్యులు తమ కిరణములచే దహించివైతురు. మరీచి, కశ్యపుడు, దక్షుడు, స్వాయంభువు, అంగిరుడు, భృగువు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు–అను మొదలగు ప్రజాపతులు అందరును వారితో గూడ (మరీచ్యాదులతో కూడ) మహర్లోకమున ఉందురు. అచటి వారు నిస్సత్త్వులు, నిర్మములును, ఊర్ధ్వ రేతస్కులునై ఉందురు. ఋభువు, సనత్కుమారాదులును వైరాజ్యులై, తపోధనులు అగుదురు. వారు సావర్ణ మన్వంతరములు అన్నింటికిని, పదునాలుగు మన్వంతరములకును పునరుత్పత్తి హేతువులు అగుదురు. యోగమును, తపమును, సత్యమును, తమ ఆత్మయందు చక్కగా నిలిపి ఆయా అహస్సులు మారగనే ఆరవ కాలమున మరలి పోవుదురు. సత్యము ఏడవ లోకము. అది మరల మార్గమున పోనివారికి ప్రతిఘాతములేని (ఎదురు దెబ్బలేని) బ్రహ్మ లోకముగా చెప్పబడినది. పర్యాసపారిమాణ్యముతో భూర్లోకము సమితి అనబడినది. సూర్యుని నుండి భూమి మధ్య భాగము, భూమి యొక్క అంతరిక్షము అనబడును. సూర్య ధ్రువుల మధ్య భాగము స్వర్గ లోకము, దివము అనబడును. ఏడు లోకములగురించి విపులముగా చెప్పబడిన వాని సిద్ధులను చెప్పెదను. భూలోకవాసులు అందరును అన్నదాతలు రసాత్మకులు. భువమున స్వర్గమునను ఉన్నవారు అందరును సోమము, నేతిని హవిస్సుగా త్రావువారు. నాలుగవదైన మహర్లోకమును ఆశ్రయించని వారి మానసీ సిద్ధి అయిదు లక్షణములు కలది. వారికి మనస్సుతో కోరినది అంతయు వెంటనే సిద్ధించును. ఈ దేవతలు సమస్త యజ్ఞములతో అతీతులను, వర్తమానులను, రాగల వారిని పరస్పరము పూజించుకొందురు. అంత దేవగణము అతీతముకాగా, మొదటివారు తరువాతివారితో యజ్ఞము చేసియు, తరువాతివారు అప్పటివారితో యజ్ఞము చేసియు సంబంధము ఉన్నంతవరకు నివర్తింతురు (మరలి పోవుదురు). అధికారముల నుండి మరలినవారికి సిద్ధి మానసికముగానే కలుగును. వారికి శుద్ధమైన సిద్ధి పరంపర మాన

సికముగానే కలుగునని తెలుసుకొనవలెను. ఓ బ్రాహ్మణులారా! నాలుగు లోకములను, జనలోకము యొక్కయును విధిని సంగ్రహముగా చెప్పితిని. మరల దానిని మీకు వివరింతును.

వాయువు ఇట్లు అనెను :

"మరీచి, కశ్యపుడు, దక్షుడు, వశిష్ఠుడు, అంగిరుడు, భృగువు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు–మొదలగువారు, పూర్వము బ్రహ్మయొక్క మనస్సుతో ఇచట పుట్టుదురు. తరువాత వారు ప్రజలను నిలబెట్టి, జనలోకమును ఆశ్రయింతురు. అపుడు ఆ కాలములు కల్ప దాహమున(ప్రళయాగ్ని జ్వాలల) మండిపోగా, భూర్లోకాది మహర్లోకాంతములు అగ్నిచే చాలా ఎక్కువగా వ్యాపింపగా జనులు, మహర్లోక నివాసులైన యామాది గణములను, సంవర్తక ప్రళయాగ్ని జ్వాలలు పొందురు. మహర్లోకములు మండిపోగా వారు జన లోకమునే ఆశ్రయింతురు. అచట ఉన్నవారందరు సూక్ష్మశరీరులుగా ఉందురు. అచటికి వచ్చినవారు అచటి స్థానికులతో సమాన సామర్థ్యము, సమాన ఆకారమును కలవార గుదురు. జగములు జలప్రళయమున ఉన్నంత వరకు వారు జనలోకములో ఆ విధముగా మార్పుచెంది ఉండుచుందురు. రాత్రి తెల్లవారగనే దిన ప్రారంభమున, అవ్యక్తయోనియైన బ్రహ్మవలన పూర్వము వలెనే క్రమముగా ఇట జనింతురు. స్వాయంభువాది మరీచ్యంత సాధకులు, వారి దేవతలును మరల ఇచట వారి నిధనములందు (సమాధులందు) జనింతురు. యామాదులు కనిష్ఠాదులును ప్రజాపతివలన మొదటివారు మొదటను, తరువాతి వారు తరువాతను జనింతురు. దేవతావంశమున దేవతలు ఏడు సంభూతులుగా చెప్పబడిరి. వారిలో కడచిన వారు కల్యజులు. తక్కినవారు ముగ్గురు శిష్టులు. ఈ క్రమ ముతో ఆ దేవతలు అంతటను తిరుగుచున్నవారై మాటి మాటికి పదిమారులు జవంతవీ భావమును పొందుదురు. తరువాత ఆ సమస్త గణములు భావములలో (స్థితులలో) అనిత్యత్వమును చూచి, జరుగబోవు దాని బలము వలనను, పుణ్యఖ్యాతి బలమునను, నివృత్త వృత్తులై (వదిలి పోయిన వ్యాపారములు కలవారై) వారందరు స్వస్థులై, అట్లే సుమనస్కులై ఆ జన లోకమును వదలి వైరాజమున ఉందురు. తరువాత కొంత కాలము నకు, నిత్య యోగులైన తపస్వులై ధర్మకథనమున వైరాజుల వంశమున వారు జనింతురు. ఇచట పుట్టినవారై, తరువాత వారు దేవత్వమునను, ఋషిత్వమునను, మనుష్యత్వమునను అంతటగల స్థానములను నింపుదురు. ఈ విధముగ దేవగణములు పదిమారులు మరలి, వైరాజములందున్నవారై, పదియుప్లవముల వరకు ఉందురు. ఆ తరువాత వైరాజకమున నుండి కల్పము పూర్ణముకాగా, పూర్వపూర్వ క్రమమున మరల బ్రహ్మలోకమున మరలి

వత్తురు. వైరాజకకల్పము గడచిపోగా ఈ బ్రహ్మ లోకమునందు మరల కూడ వైరాజము అను కల్పస్థానమును కల్పించిరి. ఈ విధముగ బ్రహ్మలోకమున ఉన్న పూర్వానుపూర్వ క్రమముతోవారు గడచిపోగా, తపము చేత పరికల్పితమైన వైరాజమునకు చేరుదురు. ఈ విధముగ పదిమారులు మరలును. బ్రహ్మలోకమున ఋషులతోపాటు నిధనమును (మరణమును) పొందిన వారికి ఈ విధముగ వేలదేవయుగములు ఇచ్చటగడచి పోయినవి.

సూతుడు ఇట్లు అనెను :

"కాలము అనాది అగుటయు, అన్ని విధముల లెక్కింప లేకపోవుటయును. ఇందుకు కారణము ఈ విధముగ చెప్పినంత వరకు సందేహము లేదు. ఉన్నది ఉన్నట్లు చెప్పితిని". ఋషులు ఆ వాక్యార్థమునువిని సంశయముతో కూడినవారై మహామతియు, వ్యాస శిష్యుడును, పురాణజ్ఞుడు అయిన సూతునితో ఇట్లనిరి.

ఋషులు ఇట్లు అనిరి :

"వైరాజులు అనువారు ఎవరు? వారి ఆహారము ఏమి? వారి బలము ఎట్టిది? వారి ఆశ్రయము ఏమి? వారుఉన్న కాలము ఏది? ఇది ఉన్నది ఉన్నట్లు మాకు చెప్పుము. ఋషులు అడిగిన పైమాటను విని, లోకార్థతత్త్వవేత్తయైన సూత పౌరాణికుడు వినయముతో ఇట్లు చెప్పెను. "తరువాత, శుద్ధతములైన వారందరు అట శుద్ధిని పొందిరి. ఆ భూత సంప్లవము (భూత, జల ప్రళయము) వరకు అటనుండు జనులు పదుగురు ఉందురు. వారందరు సూక్ష్మశరీరులు, విద్వాంసులు, గొప్ప ఆకారములుకలవారు. ఉన్న లోకమున ఉండనందున వారికి భూతము లేదు. యోగధర్మము కలిగి సిద్ధులైన సనత్కుమా రాదులు వరుస క్రమమురాగా, ఆ వైరాజుల ఖ్యాతిని నైమిత్తికమని చెప్పుదురు. స్థాన త్యాగము జరుగగా, మనస్సుగూడ ఒకే మారు ప్రవర్తిల్లును. అపుడు శుద్ధబుద్ధులందరు వైరాజులతో అన్యోన్యముగా పలికిరి. ఈ విధముగనే ఆ మహాభాగులు ప్రణవమును ప్రవేశించి బ్రహ్మలోకమున ప్రవర్తిల్లిరి. అది మనకు శ్రేయము కాగలదు. ఈ విధముగా పలికి అపుడు అందరును బ్రహ్మాంతమున ప్రయత్నశీలురైరి. అపుడు వారందరు ఆత్మ యోగము చేసి యోగధర్ములుగా ఉందురు. దీపజ్వాలలు చల్లారినట్లు బ్రహ్మలోనే సంప్రతీయ మానులు అగుదురు. పునరావృత్తి దుర్లభమైన బ్రహ్మ శరీరమున ఉందురు. వారందరు భావనా మయమైన ఆ లోకమును పొంది, బ్రహ్మానందమును పొందియు అమృతత్త్వమునకు పోయిరి. తరువాత, వైరాజులకంటె ఊర్ధ్వమున షడ్గుణాంతరమున బ్రహ్మలోకము ప్రసిద్ధమై ఉండును. అచట బ్రహ్మ పురోహితుడై ఉండును. వారందరును ప్రణవాత్ములై బుద్ధమై శుద్ధమైన తపముకలవారై బ్రహ్మానందమును పొంది అమృతత్వమును పడయుదురు.

భావత్రయము పడినవారై శీతోష్ణాది ద్వంద్వములచే బాధింపబడరు. ఆ మహౌజస్కులు ఒక ఆధిపత్యము దక్క తక్కిన వాటిలో బ్రహ్మతో సమానులు. లౌకికులైన వారందరు ప్రభావ, విజయ, ఐశ్వర్య, స్థితి, వైరాగ్య, దర్శనములచే మారునట్టి మార్గమును పొంది బ్రహ్మను చేరుదురు. బ్రహ్మతో పాటు దేవతలతో ప్రతిసంచరము రాగా, తపము యొక్క చివర క్రియాత్ములై బుద్ధావస్థ కలవారై విద్వాంసులైన వారందరు క్షణదర్శినులై అవ్యక్తమున లీనము చెందుదురు. ఇది అమృతము, శుక్రము, నిత్యము, అక్షయము, అవ్యయము. దేవర్షులు సనాతనమైన ఆ బ్రహ్మ సత్రమును ఉపాసింతురు. అపునర్మార్గాగాదులై ఊర్ధ్వరేతస్కులైన వారియొక్క కర్మాభ్యాసమున-వచ్చిన శుద్ధి వేదాంతములందు (ఉపనిషత్తులందు) లభించును. అచట ఆ అభ్యాసము చేయువారు యోగయుక్తులై పరాకాష్ఠయైన బ్రహ్మను ఉపాసింతురు. వారు శరీరమును పాపమును వదలి అమృతత్వమునకు పోవుదురు. రాగములేనివారు, కోపమును జయించినవారు, మోహములేనివారు, సత్యము పలుకువారు, శాంతులు, బ్రహ్మయందు ఉంచిన ఆత్మగల వారు, దయావంతులు, ఇంద్రియములు జయించినవారు, సంగము లేనివారు, శుద్ధులైన వారును అగు వారు బ్రహ్మ సాయుజ్యమును పొందువారని చెప్పబడిరి. కామయోగము లేక వీరులై తపములచే పాపముల దహించిన వారికి అంతులేని సుఖముకల లోకములు జారిపోవును. దివ్యమై, పరమమై, ఆకాశమున భాస్వరమైన ఈ బ్రహ్మ పదమును పొంది దుఃఖములేనివారై బ్రహ్మతో పాటు అమరులు అగుదురు.

ఋషులు ఇట్లు అనిరి :

"దేని నుండి పరార్ధము? పరుడు ఎవడు? దీనిని తెలియతలచితిమి. ఓ ముని సత్తమా! మాకు దానిని చెప్పుము"

సూతుడు ఇట్లు అనెను :

"పరార్ధమును పరముయొక్క పరిసంఖ్యను(పరిగణనమును)గురించి చెప్పు చున్నాను వినుడు. లెక్కలో ఒకటి, పది, నూరు, వేయి అని ఒకటినుండి వేయి వరకు తెలియవలెను. పదివేలు-అయుతము (10,000). ఒక నూరు వేలు-నియుతము (లక్ష 1,00,000), అని బుధులచే చెప్పబడును. అట్లే శతసహస్రముల శతము లేక (1,00,00,000) కోటి అనబడును. పదికోట్లు అర్బుదము, కోటినూర్లు అబ్జము-అని తెలియుదురు. కోటివేలు ఖర్వమని విద్వాంసులు చెప్పుదురు. పదికోటివేలు నిఖర్వమని తెలియుదురు. కోటివేలు నూరులు శంకువు (100000000000) మరల పదితో గుణించిన పై అంకెలు అనగా వేయికోట్ల వేల సముద్రమని సంఖ్యావేత్తలు చెప్పుదురు. (1000000000000) దశధా

పునః అన్నందున ప్రతిపూర్వ సంఖ్య పదితో గుణింపబడి ప్రతి ఉత్తర సంఖ్యయైనది అనవచ్చును. వేయికోట్ల అయుతములు (10000000000000) మధ్యము అనబడును. కోటివేల నియుతములు (10000000000000) అంతము అనబడినది. కోటి కోట్ల వేలు పరార్ధము అనబడినది. (10000000000000000) పరార్ధ ద్విగుణమును (పరార్ధము యొక్క రెండింతలు) పరమని విద్వాంసులు చెప్పుదురు. (ఒకటిపైన 34 సున్నలు). అవి నూరు పరిదృఢము అనియు, వేయి పరిపద్మకము అనియు తెలియవలెను. కావున తరువాత అవి వేలువేలు సంఖ్యలు వరుసగా అయుతము, ప్రయుతము, అర్బుదము, నిర్బుదము, ఖర్బుదము, ఖర్వము, నిఖర్వము, శంకువు, పద్మము. సముద్రము, మధ్యమము, పరార్ధము, అపరము ఈ విధముగా గణన విధిలో అంకెలకు 18 స్థానములు ఉండును.

మహర్షులచే పేర్కొనబడిన సంఖ్యలు నూరు. కల్పసంఖ్యతో ప్రవృత్తుడైన బ్రహ్మకు సంబంధించిన పరార్ధము ఇదియే. ఈతని కాలము అంతవరకే మిగిలి ఉండును. దాని చివర ప్రతిసృష్టి చేయబడును. పరము పరార్ధము అంకెల పేర్లతో లెక్కింప (సూచింప) బడినవి. బ్రహ్మాది ఉత్కృష్టమైన వీర్యము, ఉత్కృష్టమైన ఆయువు. ఉత్కృష్టమైన తపము, ఉత్కృష్టమైన శక్తి, ఉత్కృష్టమైన ధర్మము. ఉత్కృష్టమైన విద్య, ఉత్కృష్టమైన ధైర్యము. ఈతడు అత్యుత్కృష్టమైన బ్రహ్మ, ఉత్కృష్టమైన జ్ఞానము, ఉత్కృష్టమైన ఐశ్వర్యము. బ్రహ్మకన్న పరతరమైన (ఉత్కృష్టతరమైన) వేరొక భూతము లేదు. సర్వార్ధములందును అన్నింటికిని పరమున ఉన్న వీడు పరుడు. కావున ఈతడు పరుడు. పరుడు బ్రహ్మఅని చెప్పబడును. ఆతని యొక్క అర్ధము పరార్ధత. సంఖ్యేయుడైనను అసంఖ్యేయుడు. ఎల్లప్పుడును త్రికస్వరూపుడు. సంఖ్యచేత సంఖ్యేయుడుగా చూడబడిన ఆతనిని గూర్చి అపరార్ధము వలన విభాషింపబడుచున్నది. ధాన్యాదుల రాశి అని చెప్పుటయే కానీ ధాన్యముల సంఖ్య ఉండదు. అది అసంఖ్యము లెక్కింపను అలవిగానిది. ఇది అసంఖ్యము. యొక్క లక్షణము. కాని శుద్ధులైనందున ఈశ్వరులచే దివ్యదృష్టులచే ఆ రాశి లెక్కింపబడును. ఈ విధముగా జ్ఞానమునందలి ప్రతిష్ఠ ఉండుటచే బ్రహ్మసర్వమును చూచును. ఇది విని నైమిశారణ్యవాసులైన తపస్వులు (మునులు) ఆనందమున కన్నీరు నిండినవారై గద్గద కంఠస్వరము కలవారైరి. ఆ బ్రహ్మవాదులు అందరును వాయు దేవుని ఈ విధముగా అడిగిరి. "ఓ భగవత్ప్రభూ! బ్రహ్మలోకము ఎంత దూరమున ఉన్నది? ఎన్ని యోజనాగ్రము లలో లెక్కింపబడినది? ఎన్నియోజన సాధ్యమేమి? క్రోశము యొక్క పరిమాణము ఎంత? ఇది యథార్ధముగా వినదలచితిమి. తెలుపుము అనగా వారి ఆ మాటవిని వాయుదేవుడు

వినయముతో కూడి మధురములైన మాటలతో చూచిన విధముగా క్రమముగా ఇట్లు చెప్పసాగెను. నేను చెప్పదలచిన దీనిని మీకు చెప్పెదను వినుడు. అవ్యక్తముకంటె వ్యక్త విభాగము మహాస్థూలము. విశేషముగా చెప్పబడును. మహత్తుల యొక్క భాగములు పదియే. భూతాది స్థూలము అనబడును. దశభాగమునకన్న అధికమైనది భూతాది పరమాణుకము. పరమాణువు మిక్కిలి సూక్ష్మము. లోకమున కంటితో దాని స్థితి తెలియరానిది, మిక్కిలి అభేద్యము (భేదింపనలవిగానిది) ఇది పరమాణువు. కిటికీ రంధ్రము నుండి వచ్చిన సూర్య కిరణమున కనబడు అతిసూక్ష్మమైన దుమ్ముకణముతో సమాన పరిమాణముగల దానిని పరమాణువు అందురు. ఎనిమిది పరమాణువులు కలిసిన సముదాయము త్రసరేణువు అనబడును. అది పద్మ రజము అని కూడా అనబడును. ఎనిమిది త్రసరేణువులు ఒక రథరేణువు. రథరేణువులు ఎనిమిది కల్గిన దానిని బుధులు బాలాగ్ర (వాలాగ్ర వెంట్రుక చివర) అనిరి. ఎనిమిది వాలాగ్రములు 'లిక్ష'అగును. ఎనిమిది రిక్షలు 'యూక' అగును. ఎనిమిది యూకలు 'యవ'ము అనిరి. ఎనిమిది యవలు అంగుళము. పండ్రెండు అంగుళ భాగములు వితస్థి స్థానము. ఇరువదియొక్క అంగుళ భాగములు 'రత్ని'. ఇరువది నాలుగు అంగుళములు హస్తము (మూర). రెండు రత్నులు అనగా నలుబది రెండు అంగుళములు – 'కిష్కువు'. తొంబది ఆఱు అంగుళములు ధనువని విద్వాంసులు అందురు. ఇది ధనుష్పాదముల గవ్యూతి సంఖ్యలోనిది. ధనువు, దండము, యుగము, నాభి–ఇవి అంగుళములతో సమానములు. సంఖ్యా వేత్తలైన జనులు ముప్పది ధనువులు 'నల్వ'ము అనినారు. రెండువేల ధనువులు గవ్యూతి అనబడును. (వేయి ధనువులు క్రోశము–కోసు). ఎనిమిదివేల ధనువులు యోజనము అనబడును. ఈ ధనువు చేతనే యోజనము పూర్తిచేయబడును. సంఖ్యాజ్ఞానవిశారదులు వేయి యోజనములు శక్ర క్రోశాంతరము అని తెలిపిరి. ఈ యోజనాగ్రముతో బ్రహ్మ అంతరమును వినుడు. భూతలము నుండి వేయి నూర్ల (లక్ష) యోజనముల ఊర్ధ్వమున సూర్యుడు ఉండును. సూర్యుని కంటెవేయి యోజనముల ఊర్ధ్వమున చంద్రుడు. చంద్రునకు నూరువేల (లక్ష) యోజనముల ఊర్ధ్వమున సమస్త నక్షత్రమండలము ప్రకాశించును. దానికి రెండు లక్షల యోజనముల పైన మేరువు ఉండును. ఇక నక్షత్ర మండలములకు ఊర్ధ్వమున గ్రహముల అంతరము (దూరము) వినుడు. సమస్త తాంగ్రహములకు అధోభాగమున బుధుడు చరించును. ఆతనికిపైన శుక్రుడు, ఆతనికి పైన కుజుడు, ఆతనికి పైన బృహస్పతి, ఆతనికి పైనశనైశ్చరుడు, శనైశ్చరునకు లక్ష యోజనముల పైన మొత్తము సప్తర్షి మండలము ప్రకాశించును. లక్ష యోజనములపైన ఋషులు ప్రకాశింతురు. ఈ దివమున తారా

మయమై చిన్నదైన దివ్య విమానమున ఉత్తాన పాదపుత్రుడు ధ్రువుడు ఇరుసువలె స్తంభీభూతుడై ఉండును. ఈ త్రైలోక్యపు పై పొడవు (ఎత్తు) యోజనములలో నాచే చెప్ప బడినది. అచట మన్వంతరములలో దేవతల పూజాయజ్ఞములు లౌకికములు. ఈ లోక మున వర్ణాశ్రమముల కన్న యజ్ఞము ప్రవర్తిల్లును. ఈ సమస్త దేవయోనుల స్థితికి బ్రహ్మయే కారణుడు. ఇది త్రైలోక్యము, ఆ తరువాత వినుడు. ధ్రువునకు ఊర్ధ్వమున మహర్లోకము, అచటివారు కల్పవాసులు. అది ఒక కోటి యోజనముల దూరమున ఉన్నది. మహర్లోకము నుండి రెండుకోట్ల యోజనములలో జనలోకము ఉన్నది. అచటివారు కల్పవాసులు. అచట బ్రహ్మపుత్రులైన దక్షాదులు సాధకులు ఉందురు అనబడినది. జనలోకమునకు నాలుగింతల దూరమున ఊర్ధ్వమున తపోలోకము ఉండును. అచట భూతదాహములు లేని దేవతలగు వైరాజులు ఉందురు. తపోలోకమున కన్న ఆఱింతల దూరమున సత్యలోకము ఉన్నది. అపునర్మారకాములకు (మరల మన్మథకామము లేని వారికి) అది బ్రహ్మలోకము. అచట చేరినవాడు మరల భ్రష్టుడుకాడు. బ్రహ్మనే ఉపాసించును. సత్యలోకమున కన్న ఒక కోటి యేబది లక్షల యోజనముల దూరమున బ్రహ్మలోకము ఉండును. బ్రహ్మలోకము నుండి (బ్రహ్మ) అండము యొక్క ఊర్ధ్వ భాగము నాలుగుకోట్ల అరువది యైదు లక్షల యోజనముల దూరమున కలదు. ఇది బ్రహ్మలోకము యొక్క సగభాగముయొక్క విస్తారము. 'గత్యంతము' తరువాతిది. యోజన అగ్రమునుండి ధ్రువ అగ్రము వివరముగా చెప్పబడినది.

అధోగతి గల ప్రాణులకు జరిగిన స్థానకల్పనను చెప్పుదును. ఘోరకర్మలు చేసిన వారు తమ కర్మల కారణముగా అచటికి పోవుదురు. నరకము, రౌరవము, రోధము, సూకరము, తాలము, తప్తకుంభము, మహాజ్వాలము, శబము, విమోచనము, కృమి, కృమిభక్షము, లాలాభక్షము, విదంసనము, అధఃశిరము, పూయవహము, రుధిరాంధము, వైతరణము, కృష్ణము, అసిపత్రవనము, అగ్నిజ్వాలము, మహాఘోరము, సందంశము, శ్వభోజనము, తమము, కృష్ణసూత్రము, లోహము, అసిజము, అప్రతిష్ఠము, వీచ్యశ్వము– మొదలగునవి నరకములు. తామసములైన నరకములు అన్నియు యముని యొక్క దేశమున (లోకమున) ఉన్నవి. వానిలో పాపకర్ములు అందరు వేరువేరుగా పడుదురు. భూమికి క్రింద రౌరవాదులైన సమస్తములును ఉన్నట్లుగా చెప్పబడినవి. కపట సాక్ష్యము చెప్పువాడు, అబద్ధముగా నిందించువాడు, పక్షవాదియై సత్యములేని నరుడు క్రూర గ్రహములుకల రౌరవ నరకము అనబడును. గోహత్యజేయువాడు, భ్రూణ (గర్భమును) హత్య చేయువాడు, పురమును అగ్నితో కాల్చువాడు, రోధముఅను నరకమున పడును.

బ్రహ్మహత్య చేయువాడు, సురాపానము చేయువాడు, బంగారమును దొంగిలించువాడు సూకర నరకమున పడుదురు. క్షత్రియుని, వైశ్యుని చంపినవాడు, బ్రహ్మహత్య చేసినవాడు గురుభార్యను సంగమించినవాడును తాలమను నరకమున పడుదురు. చెల్లెలిని సంగ మించినవాడు, రాజభటుడు, తప్తకుంభ (కాచిన కుండ) నరకమున పడుదురు. అశ్వ వ్యాపారి, బంధనము (జైలు)నుండి రక్షించినవాడు, పతివ్రతను అమ్మువాడు, భక్తుని వదిలినవాడును తప్తలోహ (కాచిన ఇనుప పెంక) నరకమున పడుదురు. కూతురిని, కోడలిని సంగమించినవారు మహాజ్వాలా నరకమున పడుదురు. వేదమును అమ్ముకొను వాడు, వేదమును తిట్టువాడు, గురువులను అవమానించువాడు, వారిని మాటల కొరడా లతో కొట్టువాడు, పొందరాని దానిని పొందువాడునుఅగు నరులు శబల (చిత్ర)మను నరకమున పడుదురు. విమోహమునను, పతితుని యెడను, దొంగతనమునను మర్యాదను దాటి చెడుమార్గము నిర్మించువాడు కీటలోహమను నరకమునుపొందును. దేవ-బ్రాహ్మణులను ద్వేషించువాడు, గురువులను పూజింపనివాడు, రత్నమును నిందించువాడు, కృమి భక్ష్యము (కృములతో తినబడు) నరకమునపడును. మిత్ర పుత్రియైన బ్రాహ్మణస్త్రీని అనుభవించువాడు దుర్గంధమైన లాలాభక్షమను నరకమున పడును. కాండకర్త, కుమ్మరి వాడు, బంగారు నాణెములు హరించువాడు, చికిత్సకుడు, తోటలను కాల్చువాడు విశంసన మనునరకమున పడుదురు. చెడును ప్రతిగ్రహించువాడు, యజ్ఞము చేయింపతగని వానిని యజ్ఞము చేయించువాడు, నక్షత్రములతో (జ్యోతిష్యముతో) జీవించువాడును అధోముఖ నరకమున పడుదురు. పాలను, సురను, మాంసమును, లాక్షను (లక్కను), గంధమును, రసమును, తిలలను మొదలగు వానిని అమ్ముచుండువాడు పూయవహము (చీము ప్రవా హము) అను నరకమున పడును. కోళ్లను, పిల్లులను, పందులను, పక్షులను, లేళ్లను, మేకలను బంధించువాడును ఈ నరకమున పడును. అ జీవకుడు, మాహిషికుడు (రాణివాస పాలకుడు), చక్రధ్వజి (చక్రము ధ్వజముగా గలవాడు), నాటకరంగము ఆధారముగా బ్రతుకు బ్రాహ్మణుడు, శాకుని గ్రామయాజకుడు (పక్షిద్రావమున యజ్ఞము చేయించువాడు), ఇండ్లను తగులబెట్టువాడు, విషమును ఇచ్చువాడు, కుండలో భుజించువాడు, సోమమును అమ్మువాడు, సురాపానము చేయువాడు, మాంసమును భక్షించువాడు, పశువులను చంపువాడు, దున్నలు మొదలగువానిని కోయువాడు, మృగములను చంపువాడు, పర్వ కారుడు, సూచి, మిత్రుల చంపువాడు-వీరందరు రుధిరాంతమను నరకమున పడుదురు-అని విద్వాంసులు చెప్పుదురు. ఏకపంక్తిలో కూర్చున్న వానిని విషమముగా భుజింప చేయువారు అశుద్ధము తిను ఘోరనరకమున పడుదురు. ఇందు సంశయములేదు.

అసత్యములు ఆడువాడు, మిక్కిలి ఎలుగెత్తి ఏడ్చువాడు, అశుభుడును, పాపము చేయువాడును మూత్రము నిండిన నరకమున పడుదురు. మధువును తీసికొన్నవారిని చంపువారు వైతరణిని (నరక నదిని) పొందుదురు. పిచ్చివారు, చిత్తభంగము చెందినవారు, శౌచాచారమును వదిలిన వారు, కోపస్వభావముకలవారు, పరులకు దుఃఖము కలిగించువారు, మోసగించువారు, దున్నిన భూమిలో నడచువారు, చెఱకుతోటను ఖండించువాడు, గొఱ్ఱెల సముదాయపు వారును, మృగముల వేటాడువారును భయంకరములైన కత్తెరలతో వికారముగ కత్తిరింపపడుదురు. ఆశ్రమమున విరుద్ధముగ ఉన్నవారు, అగ్నిజ్వాలఅను నరకమున పడుదురు. నల్లగను చిత్రవర్ణములోఉన్న ముక్కులతో కాకులచేత పొడిచి తినబడుదురు. యజ్ఞములో వ్రతలోపము వలన సందంశ నరకమున (పట్టుకార్ల నరకమున) పడుదురు. బ్రహ్మచర్య వ్రతమున ఉన్నవారు స్వప్నమున వీర్యస్ఖలనము కావించినను, పుత్రులచే చదివింపబడిన వారును, పుత్రులచే ఆజ్ఞాపింపబడినవారును, శ్వ భోజనమను (కుక్కలు పీకుకొని తిను) నరకమును పొందుదురు. క్రోధహర్షములతో కూడినవారై వర్ణాశ్రమ విరుద్ధములైన పనులనుచేయు వారందరును నిరయమను నరకమును పొందుదురు. దానికిపైన తెల్లనిది భయంకరమైనది ఉష్ణ స్వరూపము కలదియు అయిన మహారౌరవ నరకము. దానికి క్రింద మిక్కిలి భయంకరమైనది శీత స్వరూపము కలదియు అయినది తపమను నరకమనబడును. ఈ క్రమముతో వర్ణింపబడు నరకములను వినుడు. భూమికి క్రిందుగా ఏడు నరకములు కలవు. అవి అధర్మపుత్రులు, అంధతామిశ్రకము మొదలగునవి. వానిలో రౌరవము మొదటిది, మహారౌరవము. దీనికి క్రింద మరొకటి చల్లనిది తపమనబడినది మూడవది కాలసూత్రము మహాహవవిధి అనబడినది. నాలుగవది అప్రతిష్ఠము, ఐదవది అవీచి అనబడినది. లోహపృష్ఠము ఆఱవది. వానిలో ఏడవది అవిధేయము. ఘోరమైనందున రౌరవము అనబడినది. సాంభకము (ధ్వనికలది) అనునది దహనము (అగ్ని) అనబడును. సుదారుణము అయినది చల్లనిది, దాని క్రింద తపము అధమము. కత్తిరించు సర్పము భయంకరమైన కాలసూత్రమని చెప్పబడినది. అప్రతిష్ఠమున స్థితిలేదు. దానిలోని భ్రమ (సుడి) భయంకరమైనది. యంత్రముల సంపీడనము వలన అవీచి అనున్నది భయంకరము అనబడును. దాని కంటెను మిక్కిలి భయంకరమైనది లోహ నరకము. కారణము ఇది చేసిన కర్మలను (అనుభవింపజేసి) నశింపజేయుట. అట్టిదే, చేయదగని పనులు చేయుట వల్ల ఏర్పడిన శరీరము గలదై, అవిధి అనబడినది. అది పీడనము, బంధనము, వధ–వీనితో కూడినందున ఎదురులేనిది. పైన పర్వతములంతటివి నిరాలోకములు అనబడినవి. వీని అన్నింటి యందును అధర్మ కారణముగా దుఃఖాతి

శయము ఉండును. పైన లోకములతో కలిసి ఉన్నవి నిరాలోకములు. అవి రెండు నిప్పు కుప్పలు అంతటి శరీరము (ఆకారము) కలది, మూత్రదాకయము (మూత్రమును పొందించునది) అనుభవించుటకు సమర్థములైన (అనుభవింపతగిన) కర్మలచే అచట వెంటనే జనింతురు. వారందరిలోను దుఃఖాతిశయము భయమును ఉండును. అట్లే నరకవాసులకు లెక్కలేనన్ని తీవ్ర వేదనలు ఉండును. అచట దుఃఖము అనుభవింపబడును. కృతకర్మ క్షీణింపగనే మరల పశుపక్ష్యాది యోనులలో పుట్టుదురు. కర్మశేషము కడచిపోగా, ఊర్ధ్వ లోకములలోను అధోలోకముల లోను దేవతలును, నరకవాసులుగాను వరుసగా ఉందురు. ధర్మాధర్మ నిమిత్తముగా వెంటనే వారికి మూర్తులు(ఆకారములు) కలుగును. ఔపపత్తిక కర్మలవల్ల వానిని అనుభవించుటకు ఉత్పత్తి కలుగును. దేవతలు నరకవాసులను తలక్రిందు ముఖములు కలవారుగను, క్రింది లోకమును పొందినవారిగను చూతురు. అట్లే నరక వాసులు దేవతలు అందరిని అధోముఖములు కలవారిగను (క్రిందనున్న వారిని చూచు నపుడు అధోముఖముగా చూచుట ఉండును) చూతురు. లోకాలోకమున, మొదలు-చివరలు లేనందునను, సహజముగనే ధారణ ఉండుటవల్లను పైన-క్రింద అను భావముండదు. ఈ స్వాభావికమైన సంజ్ఞ లోకాలోకమున ప్రర్తిల్లును. అని చెప్పగా అపుడు సత్రయాగము చేయు మునులు, బ్రాహ్మణులు వాయువుతో ఇట్లనిరి.

లోకాలోక నివాసులైన సమస్త ప్రాణులలో ఎంతమంది జననమరణ ప్రవాహమున ప్రవహించుచున్నారో, వారిని అంకెలతో లెక్కించి తరువాత మొత్తమును తెలుపుము. ఋషుల ఆ మాటను విని వాయుదేవుడు ఇట్లు చెప్పెను.

ఎట్లైనను సమస్త ప్రాణులను లెక్కించుట సాధ్యము కాదు. ఆద్యంతములు లేక కలిసిపోయినవి. ఊహతో మాత్రమే వ్యవస్థితములైనవి. ఆనంతముగా చెప్పబడినవి. కావున వీని గణనము ప్రవర్తింపదు. దివ్యనేత్రముతోగాని జ్ఞానముతోగాని లెక్కింప సాధ్యము కాదు. అందువలన చివరకు నరాధిపుడు నేత్రముతో లెక్కించుట సాధ్యముగాదు. పూర్ణ జ్ఞానము కానందునను, తెలియరానిదైనందునను, ఇట ప్రశ్న ఉండదు. బ్రహ్మచే గుర్తింపబడిన దానిని మాత్రము చెప్పెద వినుడు. ఈ లోకమున స్థావరములలో వేయవ భాగమున సంకేతాదులలో పార్థివకృములు పుట్టును. సంసేకమువల్ల (తడుపుట వల్ల) పుట్టినవాని వేయవ భాగముతో ఔదక జంతువులు (జలజంతువులు) అన్నియు సమానముగ కూడి ఉండునని నిశ్చయముగా భావింపబడినది. జలనివాసులైన ప్రాణుల వేయవ భాగమునకు సమానముగా లౌకికములైన పక్షులు అంతట ఉండును అని తెలియవలెను. పక్షుల యొక్క వేయవ భాగముతో సమానముగా లౌకికములైన నాలుగు కాళ్ల పశువులు

ఉండునని తెలియవలెను. మొత్తము నాలుగు కాళ్ల జంతువుల వేయవ భాగమునకు సమానముగా ఈ లౌకికమునంతట రెండుకాళ్ల ప్రాణులు ఉందురని తెలియవలెను. రెండుకాళ్ల ప్రాణుల భాగము నందలి వేయవభాగముతో సమానమైన భాగముతో ధార్మికులు ఉందురు. వారిలో ధార్మికుల వేయవ భాగమునకు సమానముగా మోక్షమును పొందినవారు ఉందురు. సర్గోపపాదకులతో సమానముగా, యాతనా (నరక) వాసులు ఉందురు. ఉన్నత ప్రదేశము నుండి చూర్ణముగాపడిన వారైన దురాత్ములు మరణింతురు. వీరు రౌరవ–తామస నరకములలో శీతమును ఉష్ణమును పొందుదురు. తీవ్ర బాధగలవారై యాతనా నరక స్థానమునకు వచ్చినవారై, స్తబ్ధులు అగుదురు. రౌరవము వేడియైన నరకమని తెలియవలెను. తేజస్సు భయంకరమైన రస ద్రవ్య రూపము కలది. తరువాతిది ఘన రూపము, ఎల్లప్పుడును చల్లనైనది. అది తపము అనునరకము. ఈ విధముగా సత్పురుషులై ధార్మికులైన నరులు స్వర్గమున కూడ లభింపరు. స్వయంభువుడు అయిన ఈశ్వరునిచే చేయబడిన సంఖ్య ఈ సంఖ్య. ఈ సంఖ్య లెక్కింపరానిదై బ్రాహ్మియు, మానుషియు అయినది.

ఋషులు ఇట్లు అనిరి :

మహము, జనము, తపము, సత్యము, భూతము, భావ్యము, భవము–లోకముల అంతరములతో ఈ లోకములు నీచేత చెప్పబడినవి. ఇక లోకాంతరము ఎట్లుండును? దానిని ఉన్నది ఉన్నట్లు చెప్పుము. ఊర్ధ్వరేతస్కులైన ఆ ఋషుల మాటనువిని ఆ వాయు దేవుడు చూచి తత్త్వార్థము కలవాడై (నిజమైన అర్థమును తెలిసిన వాడై) ఈ తత్త్వమును చెప్పెను.

వ్యక్తమైన (ఇంద్రియ గోచరమైన) దాని తత్త్వమును తర్కముతో (హేతువాద దృష్టితో) చూతురు. యోగము వలన తత్త్వమును ప్రత్యక్షముగ చూతురు. క్రియాత్ములు విషయముల నుండి తమ ఇంద్రియములను నివర్తించుట చేతను, ధ్యానముచేతను తత్త్వ మును చూతురు. ఋభువు, సనత్కుమారాదులు, చక్కగా తత్త్వమును తెలిసినవారు, కలుషితము కాక శుద్ధమైన బుద్ధులు కలవారును. వారు శోకము తొలగినవారు, రజో గుణము లేని వారును, వారు సత్పురుషులు, బ్రహ్మవలె సత్పురుషోత్తములు. యోగులు నిత్య సంతోష ముతో కూడినవారై, అక్షయులై(నాశము లేనివారై)బ్రహ్మయందు నివసింతురు. వాలఖి ల్యాదిఋషుల ప్రభువులైన వారిచే చూడబడిన విధముగనే, బంధింపబడక సత్కృ తార్థులైన వారి యొక్క ఆలయమైన ఈశ్వరాలయము సన్నిధిలో ఉన్న నాచేత చూడబడినది. ఈశ్వ రుడు పరమాణు స్వరూపుడగుట వలననే విద్వాంసులకు భావ గ్రాహ్యుడు (అంతర్ని

గూఢమైన ఇచ్ఛతో గ్రహింపదగినవాడు). జ్ఞానము, వైరాగ్యము, ఐశ్వర్యము, తపము, సత్యము, క్షమ, ధృతి, ద్రష్టృత్వము, ఆత్మ సంబంధము, అధిష్ఠాసత్వము–ఈ పది అవ్యయ ములై (నాశము లేనివై) ఆ శంకరునిలో ఉండును. యోగాగ్ని విభువైనందున బ్రహ్మయొక్క అనుగ్రహమున ఆసక్తమై అది లోకాకారము దాల్చి సహాయపడును. ఆ ఈశ్వరుని యొక్క మాత్రస్థానము అక్షరము, ధ్రువము, అవ్యగ్రము, అష్టమమై యౌపసర్గికము. అది మాయా మయమై పరమైనది. మాయకలిగి మాయియైన మహేశ్వరుడు మాయచే చేయబడిన దానిని చెప్పును. దేవతల ఉపసంహారము దాని ప్రమాణమును చెప్పబడును. దానిని విస్తరముగను ఆనుపూర్వితోను చెప్పెదవినుడు. భూర్లోకము నుండి బ్రహ్మ లోకము పద మూడు కోట్ల పదియైదు లక్షల యోజనముల దూరమున ఉన్నదని చెప్పబడును. బ్రహ్మ లోకమునకు పరమున ఊర్ధ్వమున ఒక కోటి యేబది లక్షల యోజనములు భాగవతాండము (బ్రహ్మాండము) ఉండును. ఈ ఊర్ధ్వగ ప్రచారము తరువాత గత్యంతము చెప్పబడినది. తరువాత ప్రకృతులు నిత్యములు, అపరి సంఖ్యేయములు, (లెక్కించుటకు అలవిగానివి) పరస్పర గుణాశ్రయములని తెలుసుకొనవలెను. అవి సూక్ష్మములు ప్రసవ ధర్మము కలవి అనబడినవి. వాని నుండి ఒక అధికర్త, బ్రహ్మ సంజ్ఞితుడైన క్షేత్రజ్ఞుడు జనించెను. ఆ ప్రకృతులలో ప్రకృతిమత్తు, సూక్ష్మము, అధిష్ఠాతృత్వము, అవ్యయము, పుట్టింపబడనిది, పరమధామము అయినది, పరమాణువు అయినది, పరమున శయనించునది. నాశములేని వాడు, మోయబడనివాడు, ఆకారము లేని ఈతడు మూర్తిమంతుడు. పుట్టుక, తిరోభావము (మాయమగుట), స్థితియు అనుగ్రహమే. ఈతని విధి సాటిలేనిది. పరమాణువు మహే శ్వరుడు. తేజముతో కూడిన ఈతడు తమస్సునకు ఆవల ప్రకాశకుడు (వెలుగు చూపించు వాడు) మొదట సువర్ణ అండముగా ఉన్నది ఔపసర్గికము. పెద్దది, అంతట గుండ్రముగా చుట్టుకొని ఉన్నది. అది ఈశ్వరుని నుండియే పుట్టెను. ఈశ్వరుని బీజనిర్భేదము జరుగును. క్షేత్రజ్ఞుడే (జీవుడే) బీజము అనబడును. యోనిని ప్రకృతినిగా చెప్పుదురు. అది నారాయణా త్మకము. విభువు లోకము యొక్క సృష్టికొఱకు లోకసంస్థానమునే చేసెను (లోకము నందుండెను). చక్కని సృష్టిగలవాడై తనువుతో ఆ మహాత్ముని లోకధాతువయ్యెను. బ్రహ్మ లోకము యొక్క ముందుకును బ్రహ్మయొక్క అండమునకు క్రిందికిని, ఈ రెంటి మధ్యమున ఒక పురముగలదు. అది ఆ ఈశ్వరుని యొక్క మనోమయమైన స్థానము. అది అమితౌజ స్కుడై ఆకారము తాల్చిన, ఈశ్వరుని యొక్క స్థానము. అది ఆ ఈశ్వరుని యొక్క మనో మయమైన స్థానము. అది శివమనుపురము. జన్మభయము కలవారికి శరణ (రక్షక) మైనది. ఓ బ్రాహ్మణోత్తములారా! నిండైన లక్ష యోజనముల దూరమున వ్యాపించిన

భూమండలమున అది ఉన్నది. పరతేజములను పరిభవించు మధ్యాహ్న సూర్యుని తేజముగా ప్రకాశించి, గొప్పనైన బంగారు కోటగోడతో చుట్టబడినది. సూర్యకాంతితో విరాజిల్లునవియు, ముత్యాల హారము లచే నలంకరింపబడినవియునైన నాలుగు బంగారు ద్వారములచేతను అలంకరింపబడినది అది ఆకాశమున ఉన్న పురము, రమ్యమైనది, దివ్యమైనది, ఘంటాదులతో ధ్వనింపబడినది. అచట మృత్యువు అడుగిడదు. తపము ఉండదు, ముసలితనము ఉండదు, శ్రమ ఉండదు. ఆ పురమునకు ఇతరములతో సాటియే లేదు. అది దశదిక్కులలో నిండుగా లక్ష యోజనములు విస్తరించి ఉన్నది. ఆ పురము గోవృషాంకుడైన (వృషభధ్వజుడైన) శివుని తేజముతో వ్యాపించి ఉండును. మనోభావము తోనే బంగారుమయమైన భూమి ఏర్పరుపబడినది. రత్నముల ఇసుకలో పొదుగబడినదై ఆ భూమి మిక్కిలి ప్రకాశించినది. అచట వనములందును (జలము లందును) తోటలం దును దివ్యములైన పద్మములు ప్రకాశించును. అవి కొన్ని శరత్కాల చంద్రునివలె తెల్లని కాంతిగలవి. కొన్ని బాలసూర్యునివలె ఎఱ్ఱనివి. కొన్ని సగము తెల్లనివి, సగము ఎఱ్ఱనివి. బంగారుమయమైన వియును. అవి మరకత కాంతులు కలిగి రథచక్రము లంతటి పద్మములు. సుకుమారమైన రూపముతోను సాటిలేని సుగంధముతోను గూడినవి యా దివ్యపద్మములు. కొన్ని తుమ్మెదలవలె నల్లనివి, కొన్ని బంగారు వన్నెకలవి, సగము నలుపు, సగము ఎఱుపు కలవి. సుకుమారమైన మధ్యభాగములు కలవి. కొన్ని గొడుగు లంతటి పరిమాణములు కలవి. కమలములతో చుట్టబడినవి. అచట ఏడు మహానదులు కలవు. వాని పేరులను వినుడు. వరా, వరేణ్యా, వరదా, వరార్హా, వరవర్ణినీ, పరమా, వరభద్రా–ఇవి ఆయుత్తమమైన శివపురమునందలి రమ్యములైన నదులు. అచటి నదీ శ్రేష్ఠములు ప్రవహించు జలములు పద్మ–ఉత్పల దళములతో మిశ్రితములైనవి. అలల నురుగులు, సుళ్లు మొదలగు రూపములు ధరించినవి. మణిదళములతో సమానమైన కాంతి కలవి. బ్రహ్మర్షులు గాని, దేవతలుగాని, అసురులుగాని, పితరులుగాని, ఇతరులు గాని జ్ఞానాతీతుడైన ఈశ్వరుని ఆ పురమును తెలియరు. అచట అవ్యగ్రులై (ఏకాగ్ర చిత్తులై) జితేంద్రియులై చక్కగా యోగయుక్తులైన మహాత్ములు గోవృషాత్ముడైన శివుని పురమును చూతురు. సాటిలేని తేజస్వియైన శివుని యొక్క ఆ పురవరము యొక్క మధ్యమున మిక్కిలి గొప్పదియు, మేరు పర్వతమువలె ప్రకాశించునదియు, దివ్య మైన దియు, భద్రశ్రీలతో చుట్టబడినదియు, బంగారు మయమైనదియు, శుభమైన వేయి కిరణ ములుగల సూర్యునివలె ఉండు భవనము గలదు. అది సాటిలేని రత్నములతో అంతట అలంకరింపబడినది. చంద్రునితో సమాన కాంతిగల స్ఫటిక మణులతోను, సోమునితో

సమాన కాంతిగల చంద్రకాంత మణులతోను, వైడూర్యమణులతోను, బాలసూర్య కాంతి మణులతోను, అగ్నిసంభవములైన సువర్ణములతోను, వెండితోను చేయబడిన (పాషాణ ములలో) శుభములైన ఇంద్రనీల మణులతోను ఆ భవనము శోభిల్లెను. దృఢమైన వజ్ర మయ మణులతో అది చక్కగా కూర్చబడినది. అనేక ఆకారములతో ఏర్పరుపబడి జల ములతో (జలావాసములతో) ఒప్పినది. చంద్రకిరణ కాంతులుగల పతాకలతో అలంకరింప బడినది. (శ్వేత ధ్వజములతో అలంకరింపబడినది). నిత్యము బంగారు గంటల నాదము లతో సంధ్యాకాల మేఘములవలె ప్రకాశించిన కిన్నరుల యొక్క భవనములతోను ప్రతి నిత్యము సంతసిల్లిన ఉత్సవములు కలది. హిమశిఖరములతో మేరుపర్వతశ్రేష్టమువలె చుట్టంతట బంగారు పుష్పోదక కాంతులతోను, బంగారు మయములైన పతాకలతోను ప్రకాశించును. ఈ విధముగా భవన శ్రేష్ఠము అనేక భూమికలతో (రచనలతో) విరాజిల్లును. త్ర్యంబకుడు అగు శివుని ఇంట వసంత ప్రతిమయు, శ్రీ, లక్ష్మి, మాయ, కీర్తి, శోభ, సరస్వతి దేవితో కూడిన వీరందరు రూప గంధములతో కూడినవారై నిత్యలై, లెక్కలేనివారై, పరస్పరగుణముల ఆశ్రయించినవారై ఉందురు. కాంతి విలాసములకు ప్రత్యేకమై సర్వ రత్నములకు అలంకారమైనది ఆ భవనరాజము. ఈ మహాభాగ్యవంతులు తమ్ముతాము నూరు కోట్లు విభజించు కొని ఏ మాత్రము ఏమరుపాటులేనివారై భగవంతుడై మహాత్ముడైన శివుని సంతోషపెట్టి ఆనందింతురు. వారిలో వేలకొలది ఇతరులు వెనువెంబడి ఉండు పరిచారికలు, రూపవతులు, శ్రీతో కూడిన వారు. అందరును కమలముల వంటి కన్నులు గలవారు. లీలా విలాసములతో కూడిన అతిమనోహర భావములచేతను వారు శైలముల వలె ఉండి, అగ్నివలె పవిత్రులైన గణములతో పాటు ఆనందింతురు. కొందరు స్త్రీలు కుబ్జలు (పొట్టివారు), కామనికామములతో శ్రేష్ఠమైన శరీరము కలవారు, గుజ్జుపు ముఖములు కలవారు, విభూతిరేఖలు కలవారు, వికటవేషములు, క్రూరులు, చప్పిడి ముక్కులు, లావుచ్రేలాడు కడుపులు కలవారు, పొట్టి భుజములు కలవారు, వికార నేత్ర ములు కలవారు, పొట్టి పాదములు కలవారు, సింహముఖము కలవారు, మరికొందరు ఏనుగు వంటి ముఖము కడుపు కలవారు. అట్లే మరికొందరు ఏనుగు ముఖము కలవారు, సింహ ముఖము, పెద్దపులి ముఖము, ఎఱ్ఱని కన్నులు, పెద్ద స్తనములు, సుందరులై, సుందర నేత్రములు కలవారు, పొట్టిగా ముడుచుకొన్న తలవెంట్రుకలు, కొందరు కామ రూపిణిలు అనగా ఇచ్చవచ్చిన రూపములు ధరింపకలవారు, అనేక వేష ధారిణులు అయిన స్త్రీలు అంతఃపురమునుండి దేవావాస గృహములకు తగినవారు. భగవంతుడై పది బాహువులుకల మహేశ్వరుడు ఆ భవనమున విశ్రమించెను. నందితోను, విశ్వరూపులై

మహాత్ములైన గణములతోను, సమానమైన ఔదార్యము పరాక్రమమును కల రుద్రగణముల తోను, అగ్నిపుత్రులతో సమానులై, యూపమువంటి కోరలతోను భిన్నముఖములుకల శివపరులైన ప్రమథగణ భక్తులతో నమస్కరింపబడుచు, మహేశ్వరుడు పూజింపబడు చుండును. తన ఎదపైఉన్న సర్వ ఋతువులలో పూయు పుష్పముల మాలను వాసన చూచుచుండును. నల్ల కలువలవలె నల్లనివాడు, విశాలమై, ఎఱ్ఱనైన కన్నులు కలవాడు. కొద్దిక్రూరమై వ్రేలాడు పెదవులు కలవాడు. వాడియైన కోరలు గణములతో కూడినవాడు. ఆరు ఊర్ధ్వ నేత్రములు కలవాడు, చూడనలవికానివాడు, సుందరుడు, నారచీరను ధరించిన వాడు. యుద్ధములలో అలయనివాడు, దేవతల శత్రువులను నశింప చేయువాడు, ఎడమ ప్రక్కన చేతిలో చేతిని మధ్యన చొప్పించి ఉన్న వాడును – అయిన మహేశ్వరుని పూజింప వలెను. అపదిశగా ఆతనియొక్క ఎడమ అరచేతిలో కనబడునదియు, మహాభయంకరమైన ధ్వనికలదియు, బలముచే సాటిలేని ఓజస్సు కలిగినదియు, విచిత్రమైన పది వర్ణములతో మిక్కిలి శోభించునదియు. విద్యుత్తుతో ప్రకాశించునదియు, శత్రువులను నశింపచేయు నదియు, శరీరముతో జ్వాలలతో మండుచున్నదియు అగు శివకాంతితోకూడి పరమమైన త్రిశూలముల మిక్కిలి శోభతో ప్రకాశించును. వేదియందు అగ్ని శిఖవలె మహాత్ముడైన దేవేశుని యొక్క కత్తి, తేజోమయమైన శరీరముతోను, కాంతితోను ప్రకాశించును. ఓజస్సులలో శ్రేష్ఠుడైన చంద్రుడు కూడ అట్లే (శిరమున) ప్రకాశించును. మహేశ్వరుని యొక్క ముందు బంగారుమయమై సుందరమై శోభించు ఆ జలములతో కూడిన పెద్ద కమండలము ప్రకాశించెను. అంగములలో కత్తిని ప్రవేశింపజేసి, తెల్లని వస్త్రమును ధరించినదై, ముత్యములతో ప్రకాశించు పెద్ద ఎదకప్పుతోను, నాలుగు భుజములుకలదై, మహాభాగ్యవతియైన విజయలోక సమ్మతయై ఉండును. దేవికి మొదటిదై రెండవ శ్రీవలె సాటిలేనిదై, మహేశ్వరునకు అంజలి ఘటించినదై ప్రతీహారి ప్రకాశించు చుండును. ఆ ప్రతీహారికి వెనువెంటనే వచ్చు మరి కొందరు స్త్రీలు అప్సరోగణములతో కూడినవారై అభినవులైన కాంతులతో (భర్తలతో) శంకరుని సమీపమున సేవకై ఉందురు. గంధర్వ యోనులైన (జాతియు) గణములు సర్వలక్షణ సంపన్నులై వాద్యములతో కూడినవారై దేవేశుడైన పరమేశ్వరుని గానము చేయుదురు. ఆ ఈశ్వరుని ఇంట ఎత్తైనదియు, పెద్ద మూపురము కలదియు, శరత్కాల మేఘమువలె తెల్లనైనదియు, గోపతియైన వృషభరాజము సంతసించు చున్నదై ప్రకాశించును. ఈశ్వరుని కుమారుడు వీర్యవంతుడు, ఎఱ్ఱ వస్త్రమును ధరించినవాడు, శ్రీమంతుడు, ఉత్తమమైన కమలదళములతో సమానమైన నేత్రములు కలవాడు, సపరివారుడు అయిన స్కందుడు (కుమారస్వామి) ప్రకాశించును. ఆతనికి

శాఖుడు, విశాఖుడు, నైగమేయుడు, చాష్టవంతుడు-అనువారు పరివారము. వీరు ఏ వ్యసనములు లేనివారు, అక్రూరులు, ప్రజాపాలనమున ఆసక్తులు. వారితోబాటు ఆ మహావీర్యవంతుడైన నెమిలి వాహనముగాకల కుమారస్వామి శోభిల్లును. అతడు అచట సర్పములతోను ఆటవస్తువులతోను సర్వతో ముఖుడై ఆడును. దేవేంద్రులకు బంగారము నిచ్చు రాజులును, స్వంత ఇండ్లలో నుండి గృహస్థులై బ్రహ్మావాదులైన బ్రాహ్మణులును, రహస్యమైన స్వాధ్యాయము (వేదా ధ్యయనము) తపమును కలిగి ఉంఛవృత్తులుగలవారు (రోళ్ల ప్రక్కనబడి బియ్యపు గింజలను ఏరుకొని జీవనము గడుపువారును), ఆ దేవేశునకు ఇష్టులైన సభాసదులు (సభలో కూర్చుండువారు). ఈ విధముగా అనేక మన్వంతరములు మరల మరల అచట నడచినవి. ఆ దేవదేవుడైన ఈశ్వరుని యొక్క ఉత్తమమైన భవిష్యమగు ఆశ్చర్యకరమైన విషయమును వినుడు. అచట బంగారువన్నె కలవియు, వేగము గలవియు అయిన పెద్దపులులు వెంబడి వచ్చునవై ఉండును. స్వేచ్ఛగా చరించు వానినన్నింటిని దేవదేవుడైన ఈశ్వరుడు నిర్మించెను. అవి మృత్యువుకే మృత్యువుతో సమానమైనవి. కావున యముని గర్వమును ఉపహరించునవి. ఇక ఈశ్వరుని యొక్క లెక్కలేని ఐశ్వర్యమును ఎవడు చెప్పక ఉండగలడు? అంతకంటెను భవునిచే భూతముల అనుగ్రహమునకై చేయ బడిన మహాద్భుతము కలదు. దానిని వినుడు. మందరాదుల కాంతి కలవియు, బలముతో సాటిలేని తేజస్సు కలవియు, హారమువలె మల్లెమొగ్గవలె చంద్రునివలె తెల్లనై నవియు, మెఱుపు మేఘములవలె గర్జించునవియు, చూడామణిని ధరించునవియు, మేఘముతో సమానమైన వస్త్రములు కలవియు శ్రీ వత్సాంకిత వజ్రములు కలవియు. వ్రేళ్లు శూలము లుగాకల చేతులు కలవియు, ఆ ఉత్తమములైన శివపుర శివభవనము యొక్క ముఖ్య స్తంభములందు వేర్వేరుగా బంధించిన అగ్నిమయములైన సంకెల (గొలుసుల)లతో ఒప్పి నవియు, ఆ శివ భవనమున సుఖముగా నివసించునవియు అయిన వేలమాయా సింహ ములు ఆ శివ భవనమున ఒప్పుచుండును. స్తంభమునను షష్టమును తొలగించి ఉండును. తరువాత వాయుదేవుని మాటను గౌరవించి, ఆశ్చర్యము చెందినవారై, నైమిశారణ్యమున తపస్వినులైన ఋషులు.

ఓ భగవంతుడా! సర్వ భూతములకు ప్రాణస్వరూపుడా! అంతటను పోవువాడా! ఓ వాయుదేవ ప్రభూ! ఆ సింహ మహాభూతములు ఎవరు? అవి ఎక్కడ పుట్టినవి? ఏ స్వరూపము కలవి? భూతముల ప్రభువులైన శివునిచే ఏ అపరాధముతో అగ్నిమయ పాశములచే వేరు వేరుగా కట్టబడినవి ? అని ప్రశ్నించిరి. ఋషులు ఆ మాటలను విని వాయుదేవుడు మహాత్ముడైన ఈశ్వరుడు వేయిసింహములను తన దేహమునుండి

తొలగించగా అవి క్రోధాకారములైనవి. అపుడు ఈశ్వరాజ్ఞచే ప్రాణులకు అభయమిచ్చి యజ్ఞ భాగనిమిత్తమై పూర్వము అగ్నిపాశ బంధనమున ఉన్నవి. వాని ఈ బంధన విధానము నుండి విడివడిన ఒక సింహముచే దేవి కోపించిన కోపముగా తెలిసి దక్షయజ్ఞము ధ్వంసము చేయబడినది. ఆత్మకర్మసాక్షియైన మహాదేవి (సతీదేవి) చేత మహేశ్వరియైన మహాకాళి తన వెంబడివచ్చు భూతములతో సహా బయలుదేరినది. ఆయా భగవత్స్వరూప అయిన క్రోధము రుద్రావాసము ఇల్లుగా చేసికొన్నదై దేవియొక్క కోపమును చల్లార్చు అప్రమేయాత్ముడైన (కొలవలేనంతటి శరీరము కలిగిన) వీరభద్రుడయ్యెను. ఆతని ఇల్లు మిక్కిలి రహస్య స్వరూపుడైన దేవాధీశుని యొక్క చక్కని ఇల్లు. అది సాటిలేనిది అని చెప్పి, ఇది నేను మీకు ఇంతకుముందే చెప్పితిని. ఆతరువాత, రమ్యమైనదియు ఉత్తమోత్త మము అయినదియు అయిన ఆ శివపురమునను, ఆకాశ భూములలోను అచట నివసించు వారిని గురించి చెప్పెదను. ఆ ఆకాశభూములు అనేక రత్నములతో విచిత్రములైనవి, పతాకలతో నిండినవి, సర్వకామ సమృద్ధములు, వనములు ఉపవనములు–వీనితో ప్రకాశిం చునవి. వెండితోను, బంగారుతోను నిర్మితములైనవి, సంధ్యాకాల మేఘములవలె ఉన్నవి, కైలాసముతో సమానమైనవి. ఇష్టములైన శబ్దాది భోగములచే శివుని అనుసరించువారై సువ్రతులైనవారు ఆ శ్రేష్ఠములైన మేడలు అనెడు పుష్పములు కల ఆకాశభూములందు ఆనందింతురు. ఆ సువ్రతులు వేదఘోషలతో ఎడతెగనివారు, అనేక విధములై శుభములైన కథలను చెప్పుకొనువారు, గీత–వాద్యఘోషలు కలవారు, అంతటను పరిచయస్తులు కలవారు, ఒకచోట కూడినవారు, సాటిలేనివారు, అనేక ఆశ్రయముల చేసినవారును. వారి మేడల చివర ఉండును. ఆ భవనము (మేడ) దేవ గృహము సహస్ర పాదము (సూర్యునివలె సహస్రకిరణ ప్రకాశము కలది). బంగారముతో నిర్మితమైనది, శుభమైనది. సాటిలేని శ్రేష్ఠరత్నములతో అంతటను అలంకరింపబడినది. చంద్రకాంత మణికాంతుల తోను, స్ఫటికమణులతోను, వైడూర్యమణి కాంతులతోను, బాలసూర్యమయ కాంతులతోను, అగ్ని సంభవములైన సౌవర్ణకాంతులతోను, ఆ భవనములు అలంకరింపబడినవి. నైమిశారణ్యవాసులైన తపస్వినులైన ఋషులు ఇదివిని ఆక్రోశించిరి. సంశయమును పొందినవారై వాయు దేవునితో ఇట్లనిరి.

"శివుని అనుసరించుచున్న వారై శివునిచే మిక్కిలి అనుగ్రహింప తగినవారై, ఆ పురోత్త మమున ఆనందించువారు ఏ మహాత్ములో?" అని ఋషులు అనగా విని వాయువు ఇట్లనెను.

దేవదేవుడైన శివుని భక్తిని పొందినవారిని వినుడు. వారు హ్రీమంతులు (సిగ్గుగల వారు), చక్కని దృఢులు, సర్వేంద్రియములను అణచి దాంతులైనవారు, శౌర్యముతో

కూడినవారు, లోభములేనివారు, మధ్యాహారులు, సూక్ష్ములు, ఆత్మయందే రమించువారు, ఇంద్రియములు జయించినవారు, శీతోష్ణాది ద్వంద్వముల జయించినవారు, మహోత్సాహము కలవారు, సౌమ్యులు, మత్సరము లేనివారు, సర్వప్రాణుల భావములో ఉండువారు, ఇతర వ్యాపారములేనివారు, వ్యాకులము చెందనివారు, కర్మతోను, మనస్సుతోను, మాటతోను, విశుద్ధమైన అంతరాత్మతోను ఈశ్వరైక మనస్కులై మహేశ్వరుని పొందినవారు. వారు రుద్రసాలోక్యమును (రుద్రుడున్న లోకమున ఉండుట) పొందిరి. నాశము లేని శాశ్వత శివపదమును పొందిరి. అత్యంత ఉత్తమోత్తమమైన శివుని రూప సాదృశ్యమును (సారూప్యమును) పొందింపబడిరి. అచటి అందరును అగ్నిముఖులు, విశ్వరూపులు, జటాజూటము కలవారు, నీలకంఠులు, తెల్లని కంఠము కలవారు, వాడియైన కోరలు కలవారు, ముక్కంటులు. అర్ధచంద్రునితో అలంకరించిన తలపాగా కలవారు, జటయును కిరీటమును ధరించినవారు. అందరును పది భుజములు కలవారు. వీరులు, పద్మాంతరము లోని సుగంధము కలవారు. బాలసూర్యునితో సమానులు. వారు అందరును పచ్చని వస్త్రములు కలవారు. పినాక ధనువును చేత పట్టినవారు. అందరును తెల్లని ఆబోతు వాహనముగా కలవారు. శ్రీతోకూడినవారు, కుండలములు కలవారు,ముత్యముల హారములతో అలంకరింపబడినవారు, తేజమున దేవతలందరిని మించినవారు, సర్వజ్ఞులు, సర్వమును చూడగలవారు. జరామృత్యువులను వదలి, తమను అనేక విధములుగా విభజించి, పొందరాని భోగములను పొంది, అనేక భావములతో క్రీడింతురు. స్వేచ్ఛాగమనము కలవారు, సిద్ధులు. ఇతర సిద్ధులతో మేలుకొల్పబడినవారు. అనేక మహాత్ముల యొక్కయు, ఏకాదశ రుద్రుల యొక్కయు కోట్ల స్వరూపులు. అచటి వారందరును సర్వాత్మనా ఈశ్వర స్వరూపులు. వీరందరితో కూడి దేవదేవుడైన మహేశ్వరుడు మహాత్ముడు గదా! ఆతడు భక్తులను దయదలచువాడై, భగవంతుడై, పార్వతీప్రియుడై ఆనందించును. నేను, ఆ రుద్రులలో గాని, మహాత్ముడైన శివునిలో గాని నానాత్వము (అనేకత్వము)ను చూడను. ఏకత్వమునే చూతును. మీకీ సత్యమును చెప్పుచున్నాను" అని వాయుదేవుడు ఈ పుణ్యమైన కథను చెప్పెను. ఈశ్వరుడు గూడ చెప్పెను. ఆ తరువాత, సూర్యునితో సమానమైన కాంతిగల ఆ ఋషులు అందరు ఈ పరమ పుణ్యమై ముక్కంటికి సంబంధించిన ఈ కథను విని, మిక్కిలి శివానుగ్రహమును పొంది, ఉత్తమ సంతోషమును కూడ అందియు, ఈ కథను చక్కగా మనమున భావించి, మహాబలుడైన వాయుదేవునితో ఇట్లనిరి.

"ఓ వాయుదేవా! మహాభాగ్యవంతుడా! ఓ సర్వవ్యాపీ! ఈశ్వరుని యొక్క పవిత్రమైన ఉత్తమమైన ఎనిమిదవ ఔపసర్గికమును మీరు మాకు చెప్పితిరి. పరమాత్మ గంధముచే

సమృద్ధమై ఉత్కృష్టమైన ఆ పరమేశ్వరుని స్థానమును ప్రమాణమును ఉన్నది ఉన్నట్లుగా చెప్పితిరి. తన మాహాత్మ్యయోగముతో వేల రూపముల ధరించి అంతులేని యోజస్సు కల ఆ మహాదేవుని మాహాత్మ్యము దేవతలకు కూడ తెలియుటకు అలవికానిది. ఆ ఈశ్వరునకు భక్తులయెడ ఏమాత్రము ఏమరుపాటు ఉండదు. భక్తుల దయదలచుట కొరకే బ్రాహ్మ లక్ష్మితో స్వయముగా కూడినదై ఈశ్వరశక్తి ఒక ప్రతిమగా ఒప్పియుండును. అది వెన్నెలతో ఆకాశమున వ్యాపించి, విశ్వరూపమును ధరించునదై చంద్రునియందు ఉంచబడినదై, దేవదేవుడైన శివుని ఇంట ఐశ్వర్యమై మిక్కిలి ప్రకాశించును. ఆ మహాదేవునకు సమానులై మహాత్ములైన రుద్రుల యొక్క ముఖము నుండి ఆ విభూతి యంతయు ఒక అమృత ప్రవాహమైనది. ఓ సువ్రతులారా! దానిని ద్రావక, భక్తిచే మాచే తెలియరానిది మరొకటేదియు లేదా? ఓ దేవశ్రేష్ఠ! ప్రాణవాయుదేవా! ఈ ప్రశ్నకు సమాధానము ఉన్నది ఉన్నట్లు చెప్పుడు" అని అడిగిరి. అందుకు.....

సూతుడు వారితో ఇట్లు అనెను :

ఆ భగవంతుడైన వాయువు "నేనింకేమి ప్రవర్తిల్ల జేయవలెనో? నేనేమి చెప్ప వలెనో? ఓ సువ్రతులారా! దానిని చెప్పెద వినుడు" అనెను.

ఋషులు ఇట్లు అనిరి :

ఆదిత్యులు, వారి ప్రక్కన నుండు మాఠరపింగళ దండాదులును, క్రోధ విక్రములైన సింహములు, అగ్నులు, భూతగణములు, వ్యాఘ్రములును వెంబడివచ్చువారును వీరు భయంకరమైన మహాభూత జల ప్రళయమున సర్వప్రాణులును నశింపగా, ఏ అవస్థలు కలవారు అగుదురు? దానిని చెప్పుడు. సింహవ్యాఘ్ర గణములతో పాటు వీరందరిని గురించి మీరు(వాయువు)చెప్పితిరి. నేను ఈపరతత్త్వమును చెప్పెదను వినుడు. అది అవ్యక్త ప్రభవమైనది. ఈశ్వరుడు ఉన్నాడను దానిని తెలియవలెను. అచట పూర్వము ఉన్న వారిలో కుమారులు బ్రహ్మయొక్క పుత్రులు. వారు సనకుడు, సనందుడు, మూడవ వాడు సనాతనుడు. వారిలో వోఢుడు, కపిలుడు మహాయశస్వియైన ఆసురియు, మునియైన పంచశిఖుడు, ఈ మొదలుగా గల తక్కిన ఇతరులును బ్రహ్మ పుత్రులు తరువాత, కాలము గడచిపోగా, కల్పముల యొక్క అతిక్రమణము జరిగిపోగా, మహాభూతముల వినాశము చివర ప్రళయము కలుగును. అప్పుడు అనేక రుద్రకోటులు, ప్రసన్నురాలైన మహేశ్వరియు, సత్యము యొక్క ఎనిమిది విధముల ఆశ్రయించుటచే శబ్దాది విషయభోగములను అనుభవించి, సర్వ భూతములను ప్రవేశించి, జ్ఞానయుక్తమైన తేజముతో అనంతమైన ఆకాశ (దివ్య) పదమును పొంది, ప్రాణుల విషయమైన దయచే, ఆ మహాత్ములందరు

అచట పరమాణు స్వరూపుడైన మహేశ్వరుని చేరుదురు. మిక్కిలి గొప్ప సుడులు కలిగి, జన్మ మృత్యువులను జలములు గల నదిని తరింతురు. తరువాత ప్రళయ కాలములో భూతములను హింసించు శర్వుడను పరబ్రహ్మస్వరూపుడైన శివుని దర్శింతురు. అచట దేవితో కూడియుండు దేవులు ఏడుగురు అనబడిరి. వేయి సింహములు, వేయి ఆదిత్యులును, అగ్ని, భూత భవిష్య త్ప్రాణులు, వెనువెంబడి వచ్చువారును, వారందరిని తన ఆత్మయందు ఆవేశింపజేసి, అట్లే ఉపద్రవములను (రానున్న పీడలను) లెక్కించి చెప్పి, ఈ సమస్తములైన ఏడు లోకములను, ఐదుమహా భూతములను, విష్ణువుతో కూడునట్లుగా చేయును. విడిపోవనట్లు కూడచేయును. ఇట్లు చేయువాడు రుద్రుడు. ఆతడు సామ వేదమయుడు అట్లే యజుర్వేద మయుడును. ఆ యీ రుద్రుడు వెలుపలను లోపలను ఓతప్రోతముగా (పడుగు పేకగా) నిశ్చయముగా అల్లుకొని ఉండును. ఓ బ్రాహ్మణులారా! ఒకడే భగవంతుడు, నాథుడు, భావాతీతుడు, శాంతమును చేయువాడు. తరువాత సూర్య సమాన కాంతిగల ఆ ఋషులు అందరును తమ ఆత్మ యందు తమ తమ ఆశ్రమముల నెలకొన్న అగ్నిని ఆరోపించుకొని, కర్మతో మనస్సుతో, మాటతో, విశుద్ధమైన అంతరాత్మతో మహేశ్వరైక మనస్కులై మహేశ్వరుని పొందుదురు. వ్రతోపవాసములందు నిరతులై సర్వ ప్రాణులందు దయాపరులై, సంశయములు అన్నింటిని ఛేదించి, సాటిలేని దివ్యమైన యోగమును పొందుదురు. అట్లు దివ్య యోగమును పొంది, పరమ భక్తితోను, జ్ఞానముతో కూడిన చిత్తముతోను, రుద్రసాలోక్యమును (సమాన లోకవాసమును) అవ్యయమై శాశ్వతమైన పదమును పొందుదురు. వాయుదేవుడు చెప్పిన ఈ స్తుతిని తపోయుక్తుడై చదివిన బ్రాహ్మణుడుగాని, క్షత్రియుడుగాని, వైశ్యుడుగాని తన శివయోగ క్రియాసక్తుడైన వాడు రుద్ర సాలోక్యమును పొందును. మహాభూత ప్రళయము వరకును ఎదురులేనివాడై సర్వకామ రూపమైన స్థానమును గాని గాణపత్యమును గాని పొందును. మద్యపానము చేయువాడు మద్యపానము చేయు భూత సంఘమలుతో పాటు ఆనందించును. భూమిలో పూజింపబడుచు మర్త్యులకు (మరణశీలురైన మానవులకు) కోరిన వరములు ఇచ్చు వాడు అగును-అని భగవంతుడై శ్రేష్ఠుడైన వాయుదేవుడు ఈ వాక్యముల చెప్పెను. (39)

శివపుర వర్ణనము

సూతుడు ఇట్లు అనెను :

బ్రహ్మ యొక్క స్థితికాలము క్షీణింపగా అపుడు ఆ పరము యొక్క చివర ప్రభువై స్వయంభువైన బ్రహ్మయొక్క ప్రత్యాహారమును (ఉపసంహారము) చెప్పెదను. ఈశ్వరుడు

విశ్వమును అధ్యాత్మముగా మిక్కిలి సూక్ష్మముగా చేయు విధమును చెప్పెదను. ప్రత్యాహార మున మొత్తముగా వ్యక్తము అవ్యక్తములను మ్రింగును. అనుకల్పములలో కల్ప సంక్షయము పూర్ణము గాదు, ఎవ్వనికిని ప్రత్యక్షముగాని మహాభయము వచ్చిపడును. పశ్చిమ మనువు అనుద్రుమము యొక్క అంతము వచ్చును, కలియుగము అంతమున ఆ క్షణమున జగము క్షీణించును. అప్పుడు సంహారము చెప్పబడును. అపుడు సంప్రోక్షణము జరుగగా, ప్రత్యా హారము (ఉపసంహారము) రాగా, ఆ ప్రత్యాహారమున భూతతన్మాత్రల (శబ్ద స్పర్శ రూప రస గంధముల) సంక్షయము (నాశము) జరుగును. మహదాది విశేషాంత వికారము యొక్క సంక్షయము జరుగును, స్వభావముగా చేయింపబడి ప్రతిసంచరము (విశ్వము మరల ప్రకృతిలో లయము చెందుట) ప్రవర్తిల్లును. అపుడు జలములు ముందు భూమి యొక్క గంధగుణమును మ్రింగును. గంధము ఉపసంహరింపబడిన భూమి ప్రళయత్వ మును కలుగజేయును. గంధతన్మాత్ర జలములో ప్రవేశింపగా భూమి జలస్థితిని పొందును. అపుడు జలములు ప్రనష్టములై, వేగవంతములై మహాధ్వనిగలవై ఈ సమస్తమును నిండి నిలుచును మరియు మిక్కిలి చరించును. జలములగుణమైన రసము తేజమున లీన మగును. అపుడు రసతన్మాత్ర నశించినందున (తేజమున లీనమగుటచే) చివరకు జల ములు నశించును. తేజముతో సంహరింపబడిన జలములు తేజోరూపమునే ధరించును. ఈ విధముగ జలము తేజముతో మ్రింగబడగా, తేజము అంతట వీక్షించును. ఆ తరువాత అంతట వ్యాపించిన అగ్నిజ్వాలలతో నింపబడును. ఆవిధముగ అగ్ని జ్వాలలు అడ్డముగను పైన క్రింద అంతటను వ్యాపింపగా సర్వము తేజోమయమగును. తరువాత తేజోగుణమై ప్రకాశమైనరూపమును వాయువు మ్రింగును. దీపజ్వాల వాయువులో జల్లార్పడి లీనమైనట్లు ఆ తేజోరూపము వాయువునందు లీనము అగును. ఆ విధముగా రూప తన్మాత్ర వాయు వులో నశింపగా, రూపములేని వాడై సూర్యుడు ఉపశమించును, అపుడు తేజము వాయు వుచే గాఢముగ కంపించి విదిలిపోవును. అపుడు లోకము నిరాలోకము (వెలుగులేనిది) కాగా, తేజము అంతయు వాయువైపోగా, వాయువు తనమూలమై (పుట్టు స్థానమై)న ఆకాశమును పొందును. పైనను క్రిందను అడ్డముగను పదిదెసల మాటి మాటికి విదిలించి వేయును. వాయువు యొక్క గుణమైన స్పర్శ ఆ ఆకాశమును మ్రింగును. అపుడు వాయువు ప్రశమించును. ఆకాశము ఆవరింపబడక, రూపములేక, స్పర్శలేక, గంధములేక మూర్తి మత్తు (ఆకారముకలది) గాకయు ఉండును. సర్వమును నాదములచే నింపుచు మిక్కిలి మహత్తై ప్రకాశించును. అది మండల ఆకాశములుగల ఒక మహారంధ్రము. అది శబ్దలక్షణ మైన ఆకాశము. శబ్దము మాత్రముగల ఆకాశము సర్వము ఆవరించి ఉండును. ఆ శబ్ద

గుణమును భూతాదియైన అహంకారము మ్రింగును. (శబ్దతన్మాత్ర అహంకారమున లీనమగును). భూతేంద్రియములు (శ్రోత్ర, త్వక్, చక్షుస్, జిహ్వా, ఘ్రాణేంద్రియములు) ఒక్కమారే భూతాది యందు (అహంకారమునందు) ఉండగా అభిమానాత్మకమైన ఈ భూతాది (అహంకారము) తామస అనబడినది. ఈ భూతాదిని (అహంకారమును) కూడ బుద్ధి లక్షణ మహత్తు మ్రింగును. (అహంకారము హత్తులో లీనమగును). ఆ మహత్తు సంకల్ప నిశ్చయాత్మకమైన ఆత్మగా తెలుసుకొనవలెను. తత్త్వ చింతకులు ఆ భూతాదిని (మహత్తును) "మనస్సు, లింగము, మహత్తు, అక్షరుడు"-అను పర్యాయ వాచకములు అగు శబ్దములతో చెప్పుదురు. భూతములు పూర్వపూర్వములలో లీనమైపోగా, త్రిగుణ సమస్థితి కేవల తమోమయము కాగా, లోకకారణమైన కారణము స్వాత్మయందే ఉండగా, అపుడు సృష్టి వెనుకకు మరలి పోగా, త్రిగుణ సామ్యరూపమైన ప్రకృతిగా ఉండును. అది ఆద్యంతము ఇంద్రియాతీతమై ఎవ్వరికిని ఇంద్రియగోచరము కానందున, చెప్పనందు వలనను, తెలియనందువలనను, జ్ఞానులకు కూడ తెలియనందువలనను, రాకపోకలు లేనందునను, దాని గ్రహణమన్నది (తెలియుట అన్నది) ఉండదు. సదసదాత్మకమైన ఆ నిత్యమగు కారణము ఉండగా, భారముతో (స్థితిలో) గ్రహింపదగిన అనుమానమువలన ఊహించి ఇది చెప్పబడుచున్నది. అది సాత్వికమైన ప్రవృత్తి కారణముతో నిర్దేశింపరానిది. ఈ విధముగా అభ్యస్తమైన క్రమమువలన సప్తాదులు ప్రకృతులు. సృష్టియొక్క ఉపసంహార మున పరస్పరముగా (ఒండొం టొంటిలో)ప్రవేశించును. దానిచేత ఈ ఆవరింపబడిన సమస్త భూమండలము (జలములో) లీనమగును. సప్తద్వీపసముద్రముల చివరి వరకు ఉన్నదియు, పర్వతములతో కూడినదియునై జలావరణము అంతయు జ్యోతిస్సులో (అగ్నిలో) లీనమగును. తైజసావరణము వాయువున లీనమగును. వాయువు యొక్క ఆవరణము ఆకాశమున లీనమగును. ఆకాశావరణము భూతాదియైన మహత్తున లీన మగును. ఆ మహత్తు బుద్ధి లక్షణమైనది. ఆ మహత్తు అవ్యక్తములోను తరువాత గుణసామ్య రూపమై ప్రకృతిలోను లీనమగును. ఇవి సంహార-విస్తారములు. తరువాత మరల బ్రహ్మ-అవ్యక్తము (ప్రకృతి)లు మరల సృష్టిలో సృజించును, సంహారములో వికారములను ఉపసంహరించును. జ్ఞానులైన వారు సంహార కార్యముల చేయువారుగా సంసిద్ధులై ఉందురు. క్షేత్రజ్ఞులు (జీవులు) ఈ స్థానములలో సంసార భావమున విశేష సంయమముల వహించినవారిని పొంది, ఉపసంహార ప్రళయమున తమ ఇంద్రియాది కరణములకు (సాధనములకు) దూరము అగుదురు. అవ్యక్తమును (ప్రకృతిని) క్షేత్రమని అందురు. బ్రహ్మ క్షేత్రజ్ఞుడు అనబడును. సాధర్మ వైధర్మ్య కృతమైన వారు ఇరువురి సంయోగము,

అనాది మత్తు (మొదలు లేనిది). ఓ బ్రాహ్మణులారా! ఈ విధముగా క్షేత్రజ్ఞుల సృష్టుల విషయమై తెలుసుకొనవలెను. క్షేత్ర జ్ఞానము కంటె వేరువేరుగా బ్రహ్మవేత్తయే తెలియ తగినవాడు. క్షేత్ర క్షేత్రజ్ఞులకు క్రమముగా విషయావిషయత్వములు చెప్పబడినవి. బ్రహ్మ విషయుడు, క్షేత్రము అవిషయము. క్షేత్రజ్ఞునిచే అధిష్ఠితమైన క్షేత్రము క్షేత్రజ్ఞుని కొఱకైనదని చెప్పుదురు. ప్రతి శరీరమునను సుఖదుఃఖముల అనుభవము ఉండుటచే విజ్ఞానియైనవాడు పురుషులు అనేకులని తెలియవలె. ఈ భేదముల యొక్క సంయమములు ప్రవర్తిల్లినపుడు, చాల కాలమునకు స్వభావ కారితులు (సహజముగా పనిజేయింపబడువారు) అందరును మరలి పోవుదురు. అపుడు బ్రహ్మయొక్క స్థితి రాగము బ్రహ్మలోక నివాసులై సాయుజ్యమును (సహయోగమును) పొందినవారితో పాటు నివర్తిల్లును. ఆత్మ నివాసుల స్థితిలో ఆ రాగము నివర్తిల్లినపుడు, దానియందు దోషమును చూచువారును తత్త్వాల నివాసులును అయిన వారికి, భోజ్య భోక్తృత్వ నానాత్వమున తద్భవదర్శులైన వారికి ఆత్మవాద ప్రణాశనమైన వైరాగ్యము పుట్టును. 'వేరు' అను జ్ఞానముచే క్షేత్రజ్ఞులైనవారు తరువాత లౌకికులై బ్రహ్మను వేరుగా తెలియుదురు. వారందరును ప్రకృతియందు సాధనములలో చేరినవారై నానా త్వమును చూతురు. ప్రశాంతులై, దర్శనాత్మకులై, శుద్ధులై, నిరంజనులై, ఆ చేతనాచేతను లందరు స్వాత్మయందే నిలచియుందురు. అచటనే మోక్షము నందినవారై వారు, మరల భూలోకమునకు రారు. కారణము-నిర్గుణులు అగుటచేతను ప్రకృతియొక్క అంత్యమున వ్యతిక్రమమువలనను వారు నిరాత్ములు-అని ఈ విధముగా బ్రహ్మయొక్క ప్రాకృత ప్రతి సర్గము చెప్పబడినది. ప్రసంయమమున సర్వ భూతములయొక్క కరణములు భేదించును. అనుఇది కరణములతో పాటు తత్త్వముల యొక్క సంయమము. బ్రాహ్మణులారా! ఇది ఆవర్తకమైన తత్త్వ ప్రసంయమము."

సూతుడు ఇట్లు అనెను :

ధర్మాధర్మములు, తపము, జ్ఞానము, శుభములైన సత్యా నృతములు, ఊర్ధ్వభావము, అధోభావము, సుఖదుఃఖములు, ప్రియాప్రియములు. ఇది అంతయు ప్రయాతుని (చని పోయినవాని) యొక్క గుణమాత్ర స్వరూపము. నిరింద్రియ ములు (ఇంద్రియములను ఉపయోగింపనివారు) అయిన జ్ఞానులయొక్క శుభా శుభములు, పుణ్యము, పాపము, అది అంతయు ప్రకృతియందే ఉండును. శరీరధారుల యోన్యవస్థ స్వభావముగానే వీర్య ముతో తడపబడును. జంతువుల పాపపుణ్యములు ప్రకృతియందు ఉండును. ఆ పుణ్య పాపములే అవ్యక్తమున ఉన్న జంతువులు. ఆ దేహమున మరల పుట్టును. వేరొక దేహము నందైనను అట్లే పుట్టును. ధర్మాధర్మములను రెండు ప్రాణుల యొక్క గుణమాత్రాత్మకములు.

ఆ జంతువులచే, తమ కరణములచేత శరీర భావమున (రూపమున) మిక్కిలి వృద్ధి చెందును. క్షేత్రజ్ఞాధిష్ఠితములైన గుణములు సుచేతనములై లీనమగును. సృష్టియందును ప్రతిసృష్టియందును సంసారమునను జంతువులు తమ కరణములతో సంయోగము చెందుదురు, వియోగమును చెందుదురు, సంచరింతురు. సాత్త్వికములు, తామసములు, రాజసములు–అను మూడు విధములైన వృత్తులు గుణమాత్రములై పురుషాధిష్ఠితములై మూడు విధములుగా ప్రవర్తిల్లును. ఊర్ధ్వమున (పైన) దేవాత్మకమైనది సత్త్వము. అధో భాగాత్మకమైనది (క్రిందిది) తమము. ఆ రెంటికిని ప్రవర్తకము, మధ్యన ఇచటనే త్రిప్పు నదియు రజము అని ఈ విధముగా, మూడు గుణములు ప్రవాహగుణ రూపములై, మార్పు చెందుచు తిరుగుచుండును. జ్ఞానియైన వాడు సర్వప్రాణుల లోకములలో దుష్కృతము చేయరాదు. మానవులు అజ్ఞాన విశ్వాస ప్రారంభులై ఆరంభింతురు. ఈ మూడు గతులును శుభములనియు పాపాత్మకము లనియును చెప్పబడినవి. తమస్సుతో తిరస్కరింప బడి నందున ప్రాణి నిజమును తెలియదు. అందువలన, కానిదానినైన అయిన దానిగా చూచి నందున ఆతడు తరువాత మూడు విధములుగా బంధింపబడును. ప్రాకృతబంధము చేతను, వైకారిక బంధముచేతను, దక్షిణలను మూడవ బంధముతోను బంధింపబడినవాడై మిక్కిలి తిరిగి వచ్చును అను ఈ మూడును అజ్ఞాన హేతుకములైన బంధములని చెప్ప బడినవి. అనిత్యమునందు నిత్యము అనుజ్ఞానము, దుఃఖమున సుఖమునుచూచుట, తాను గాని దానియందు తాను అనుజ్ఞానము, అపవిత్రము నందు పవిత్రజ్ఞానము–ఇవి ఉన్నవారు విరుద్ధ జ్ఞానులైనందున మనోదోషము కలవారును జ్ఞానదోషము కలవారును. రాగద్వేషములు లేమి జ్ఞానమనబడును. అజ్ఞానము తమస్సునకు మూలము. (ఐహిక–ఆముష్మిక) కర్మద్వయ ఫలరూపమైనది రజస్సు. కర్మము వల్ల పుట్టిన పునర్జన్మతో శరీరము ధరించుట మహా దుఃఖమును కలుగజేయును. చెవుల వల్ల కలిగినదియు, నేత్రములవల్ల కలిగినదియు, చర్మేంద్రియము వల్లను, జిహ్వేంద్రియము వల్లను, ఘ్రాణేంద్రియము వల్లను కలిగినదియు – ఈ విధముగ పంచేంద్రియముల వల్ల కలిగిన కర్మల వల్ల కలిగినది పునర్జన్మ కారకమై దుఃఖమైనదగును. కోరికలతో కూడినవాడు బాలుడు. తన కర్మ ఫలములచే జీవుడు తైలపాకమువలె (కాగిన నూనెలోని భక్ష్యమువలె) అచ్చటనే తిరుగును. కావున నిష్ప్రయో జనులకు స్థూలమైన అజ్ఞానము ఉపదేశింపబడును. అందులో ఒకనిని సుశక్తునిగా నిశ్చయించి జ్ఞానమునకై యత్నింపవలెను. జ్ఞానము వలన సర్వమును జయించును. త్యాగమువలన బుద్ధి విరాగమును చెందును. వైరాగ్యము వలన పరిశుద్ధుడగును. పరి శుద్ధుడు సత్త్వముతో మోక్షమునందును.

ఆ తరువాత భూతాపహారియైన రాగమును చెప్పెదను. రాగము అవశాత్మునకు (ఆత్మను (మనస్సును) వశమునందు ఉంచుకొనని వానికి) విషయమగును. (అట్టివాడే రాగమునకు వశుడగును). కావుననే వాడు సంగమునకు సన్నద్ధుడగును. అనిష్టమైన సంగము ప్రీతిని, తాపవిషమును తినిపించును. దుఃఖము కలుగుటచే తాపమును, సుఖ స్మరణమును కలుగచేయును అను ఈ విషయములకు సంబంధించిన రాగము సంభూతికి (జన్మకు) కారణము. ఇది బ్రహ్మాది స్థావరాంతమైన ఆధిభౌతిక సంసారమున అజ్ఞాన పూర్వకముగా జరుగును. కావున అజ్ఞానమును వదిలివేయవలెను. ఋషిప్రోక్తమైనది ప్రమాణముకానివాడు. అట్లే శిష్టాచారము ప్రమాణముకానివాడు, వర్ణాశ్రమములకు విరోధియైనవాడును శిష్ట-శాస్త్రములకు విరోధి అగును. ఈ మార్గము పైకి పోవునదికాదు. పశుపక్ష్యాదులలో జనించుటకు కారణము అగును. తిర్యగ్యోని గతమునకు కారణము నిర్వచింపబడును. ఆరు విధములైన తిర్యగ్యోని స్థానముల యాతన (తీవ్రబాధ) అనేక విధములు. కారణమునను విషయమునను అన్ని విధముల ప్రతిఘాత ముండును. ఆ మొత్తము అనైశ్వర్యము ప్రతిఘాతాత్మకము అగును అని ఈ విధముగా భూతాదుల తామసీవృత్తి నాలుగు విధములు.

సత్త్వ ప్రదర్శనము వలన చిత్తము సత్త్వస్థ మాత్రకమైనట్లే, తత్త్వదర్శనము వలన తత్త్వముల యొక్క తత్త్వమును పొందును. సత్త్వ-క్షేత్రజ్ఞుల నానాత్వము జ్ఞానార్థదర్శనము అగును. నానాత్వదర్శనము జ్ఞానము. జ్ఞానమువలన యోగము చెప్పబడును. ఆ నానా జ్ఞానముచే బద్ధునకు బంధము. ఆ నానా జ్ఞానముచే ముక్తునకు మోక్షమును కలుగును. సంసారము మరలిపోగా ముక్తుడు లింగముతో (కారణ శరీరముతో)ను ముక్తుడగును. సంబంధము లేనివాడు అచైతన్యుడు. ఆతడు స్వాత్మయందే ఉండును. స్వాత్మయందున్న వాడైనను విరూపమను దానితో చిత్రింపబడును. అనునిది సంగ్రహముగా జ్ఞానమోక్షముల లక్షణముగా చెప్పబడినది. తత్త్వదర్శులైనవారిచే ఆ మోక్షము కూడ మూడు విధములుగా చెప్పబడినది. జ్ఞానముచేత సంసార వియోగము మొదటిది. రాగము నశించుట వల్ల కలిగినది రెండవది. లింగము (సంసారకారణము) లేనందువలన కైవల్యము (మోక్షము) ఆ కైవల్యము వలన నిరంజనము (చీకటిలేమి) జ్యోతిర్భావము కలుగును. నలుపులేనివాడు శుద్ధుడు. అటనుండి మరొకచోటు లేనందున కొనిపోవువాడు ఉండడు. తృష్ణాక్షయము వలన (కోరికలు నశించినందు వలన) కలిగిన సంసార మోక్షము మూడవది. ఈ విధముగ మోక్షకారణము వ్యాఖ్యానింప బడినది. ఇష్టశబ్దాదులచే లక్షణముగా (గుర్తుగా) చెప్పబడు, ఎదురుదెబ్బలేని మోక్షమునకు నిమిత్తముగా ప్రాకృతములైన ఈ ఎనిమిది రూపములు

వరుసగా ఉన్నవి. గుణమాత్రాత్మ కములైన అవి క్షేత్రజ్ఞులగు జీవులందు జోడింపబడును. ఇకముందు దోషదర్శనము వల్ల వైరాగ్యమును చెప్పెదను. దివ్యమైనదియు (దేవసంబంధమైనదియు), మానుషమైనదియు (మనుష్య సంబంధమైనదియు) అయిన పంచలక్షణమైన విషయమున (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధముల విషయమున) ప్రద్వేషముగాని గాఢ సంగముగాని లేకుండుట చేయ తగినది. తాపము, ప్రీతి, దుఃఖము వీనిని వర్జింపవలెను. ఈ విధముగ వైరాగ్యము నందుండి శరీరమును ధరించిన మానవుడు నిర్మముడు (మమకారము–ఇది 'నాది'అను భావము లేనివాడు) కావలెను. దుఃఖము అనిత్యమనియు అశివమనియును చింతించి విశుద్ధమైన కార్యమును చేయువాడు చక్కగా మోక్షమును పొందును. పరిపక్వమైన కషాయము కలవాడు (పరిపక్వమైన సన్యాసము కలవాడు) సమస్త దోషములను చూడగలడు. తరువాత మరణకాలమున (నరక) నిమిత్తకములైన దోషములచేత శరీరమున ప్రకుపితమైన అగ్ని తీవ్ర వాయువుచే ప్రేరేపింపబడినదై శరీరము ఆశ్రయించి సమస్త దోషములను బంధించును. ప్రాణ స్థానములను భేదించుచు, మర్మములను ఛేదించుచు దాటి శైత్యము వల్ల ప్రకుపితమైన వాయువు తరువాత ఊర్ధ్వమునకు వ్యాపించును. ఆ వాయువు సర్వ భూతముల యొక్క ప్రాణస్థానములలో నిలచును. సంగ్రహముగా జ్ఞానము కుంచించుకొని పోగా, కర్మలు గూడ చుట్టుకొని ఉండగా, పురాకృతములైన తన కర్మలచే ఆ జీవుడు తన స్థానమున నిలకడ తప్పినవాడగును. ఆతడు శరీరములోని అష్టాంగములలో ప్రాణ వ్యాపారములను వదలింపజేయును. తరువాత శరీరమును వదిలిపెట్టుచు ప్రాణి ఊపిరిలేనివాడు అగును. ఈ విధముగ ప్రాణములతో (ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులతో నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయ వాయువులతోను) వదిలిపెట్టబడినవాడు మృతుడు (చచ్చినవాడు) అనబడును. ఈ లోకమున ఇటుఅటు తీసికొనిపోబడు మిణుగురుపురుగు ఆకాశమున ఎగురుచు కాంతితో ప్రకాశించు పురుగు) రంజనము రంజింపచేయునది ఆకాశమును కాంతివంతము చేయునది అగునట్లే, దానిని చంపినపుడు ఆ రంజనమును ఇటునటు కొనిపోవువాడుగాని, కొనిపోని వాడుగాని ఉండడు. కోరికలు నశించుట అను మూడవ మోక్ష లక్షణము వ్యాఖ్యానింపబడినది. దోష విషయములైన ఐదు విధములైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధముల విషయములయెడ మిక్కిలి ద్వేషము, మిక్కిలి ఆసక్తి, ప్రీతి. తాపములను వదిలివేయుట ఇవి వైరాగ్య కారణములగును. ప్రకృతుల లయము నకును కారణమగును. ప్రకృతులు ఎనిమిది అని తెలియవలెను. అవి వరుసగా పూర్వము చెప్పబడినవి. అవ్యక్తాదులై భూతాంతములైనవి ప్రకృతియొక్కలయములుగా తెలియవలెను.

వర్ణాశ్రమాచారములతో కూడినవారు శిష్టులు. వారు శాస్త్రములకు విరోధులుకారు. వర్ణాశ్రమముల ఈ ధర్మము దేవస్థానములందు కారణమగును. బ్రహ్మాదులై పిశాచాంతములైనవి ఎనిమిది స్థానములు దేవతా రూపములు. అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్య, ఈశిత్వ, వశిత్వ రూపములైన ఐశ్వర్యములు ఎనిమిది విధములైన కారణములు. శబ్దస్పర్శాది లక్షణమైన ఇష్టమున ఎదురుదెబ్బలు లేకుండుట నిమిత్తము అగును. ఈ ఎనిమిది వరుసగా ప్రాకృత (ప్రకృతి సంబంధమైన) రూపములు. గుణ మాత్రాత్మకములు అయిన ఇవిజీవులయందు అంటుకొని పోవును. వర్షాకాలములో ఆ గుణమాత్రాత్మకములను (అంకురములలో వేరుగా చూతురు). కాని జీవమును నేత్రముతో చూడలేరు. ఇట్టి జీవుని సిద్ధులు తమ దివ్యనేత్రముతో జూతురు. శ్వా-అను వాడును శ్వానపానుడును పునర్జన్మలకై యోనులను ప్రవేశింతురు. అడ్డముగను, ఊర్ధ్వముగను, క్రిందకును, వరుసగా పరుగిడుచున్న వానికి కూడ జీవము, ప్రాణము, లింగము, కారణము-అను ఈ నాలుగును పర్యాయ వాచకములు. ఏకార్థకము లైన ఈ పర్యాయ వాచక శబ్దములతో నా జీవుడు లిఖింపబడును. వీడు వ్యక్తావ్యక్తమున ప్రమాణుడు. అది ఆతని మొత్తము రూపము. అది అవ్యక్తాంతముచే గ్రహింపబడినది (తెలియబడినది). క్షేత్రజ్ఞునిచే (జీవునిచే) అధిష్ఠింపబడినది. ఈ విధముగా తెలిసికొని పవిత్రుడై అజ్ఞానము నుండి వదిలిపెట్టబడును. భిన్నమైన దేహమును జీవుడు సునిర్వృతుడు కాగా స్వేచ్ఛగా అటనుండి బయలు వెడలును. అపుడు తత్త్వము నష్టమైనట్లే (ఇంద్రియ అగోచరమైనట్లే) తత్త్వముల దర్శనముగూడ గోచరముగాకుండును. తరువాత అవ్యక్త అజ్ఞానికి కారణము కూడ (సాధనముకూడ) భిన్నమగును. దానిచేత ప్రాణాద్యమైన గుణ శరీరముతో అన్ని విధముల ముక్తుడు అగును. బీజము దగ్ధమైనపుడు అంకురము రానట్లే సంసారము నుండి విడివడిన జీవికుడు బీజశారీర మానసుడై మరొక శరీరమును స్వీకరింపడు. పదునాలుగవ జ్ఞానమువలన శుద్ధుడై వాడు ప్రకృతిని అనుసరించును. ప్రకృతిని సత్యము అందురు. వికారము అసత్యము అనబడును. వికారసద్భావము అసత్యమని తెలియవలెను. ప్రకృతిసద్భావము సత్యము అనబడును. నామ రూపములు లేని క్షేత్రజ్ఞుని నామరూపములు కలవానిగ చెప్పుదురు. క్షేత్రమును తెలియుట వలన క్షేత్రజ్ఞుడు అనబడును. క్షేత్రజ్ఞానము వలన క్షేత్రజ్ఞుడు శుభుడనబడును. క్షేత్రజ్ఞుడు స్మరింపబడినందు వలన తజ్ఞులచే క్షేత్రము వివరముగా చెప్పబడును. క్షేత్రతత్వ జ్ఞానము అనుభూతమైనది. కావున క్షేత్రజ్ఞుడు ఎల్లప్పుడును జ్ఞాని అగును. క్షీణించుట వలనను, సాధనమై, చేయుటవలనను, క్షతమునుండి రక్షించుటవలనను, అనుభవింపతగిన దగుటవలనను, జ్ఞాన విషయమగుట వలనను,

క్షేత్రవేత్తలు క్షేత్రమును క్షేత్రమని అందురు. మహదాద్యమును విశేషాంతమైనది. విరూపములతో కూడినది, విలక్షణమైనది, అక్షరమును క్షరమును అయినది వికార లక్షణము కలది (వికృతి) అగును. ఆ వికారమునే క్షరమని అందురు. కారణము-అది మరల క్షరమగుట (నశించుట). సుఖదుఃఖ మోహ భావములు భోజ్యమని అనబడును. అచేతనమయినందున (చైతన్యము (జ్ఞానము) లేనిది) విషయమగును. అది ధర్మవిభువ నబడును. వికారములో ప్రసరించియు క్షీణింపనిది, నశింపనిది అక్షరమగును. దానికి క్షయ, నాశములు ఉండవు. పురమున (శరీరమున) అనుశయించును (నిద్రించును). కావున పురుషుడు అనబడును. పురుషులు పురుషుని ఏ విధముగ వివరించి చెప్పుదురో ఆ పురుషుని చెప్పుము. శుద్ధుడు, నిరంజ నాభాసుడు, జ్ఞానా జ్ఞానములు లేనివాడు. అస్తి - నాస్తి ఉండును-ఉండుడు అనబడువాడు, వాడు మరొకడును, బద్ధుడు ముక్తుడును, పోయినవాడు-ఉన్నవాడును, నిర్హేతుకుడు అంతనిర్దేశ్యుడు (కారణము లేనివాడు మహా ప్రళయాంతమున ఉండువాడు) సూక్తుడును, ఆతనిలో మరొకడు లేనివాడు. శుద్ధుడైన దేశ్యుడుగాడు. హృష్టుడైనందున సమదర్శి. ఆత్మ ప్రత్యయకారి (ఆత్మజ్ఞానకారి). ఆతనిని సారభూతునిగను, నిశ్చయభూతుని గను, హేతుకునిగను, భావ గ్రాహ్యునిగను, అనుమాన ప్రమాణముతో దెలియదగినవాని గను చింతించువాడు ముక్తుడగును. ఆత్మను శాంతమైన ప్రయోజనములు కలవానినిగను, చూచువానిగను, తెలియువానిగను, దృశ్యాదృశ్యములో నిర్దేశింపదగిన వానిగను, తన్ను ఉద్ధరించువానిగను, శ్రేష్ఠునిగను జూడవలెను. ఈ విధముగ తెలిసినవాడు జ్ఞాత (తెలిసినవాడు) అగును. దానివలన శాంతిని పొందును. కార్యమునగాని, కారణమున గాని, బుద్ధ్యాదులందుగాని, భౌతికమందుగాని, కలిసినవాని యందుగాని, విడివడిన వానియందుగాని, జీవించినవానికి గాని, మరణించినవానికి గాని ఈ లోకమున అంతట వేరుగా జ్ఞాత (తెలియువాడు) కనబడడు. తనతో ఆత్మను నియమించును, కారణాత్మ ఆ ఆత్మను నియమించును. కారణమై ప్రకృతియైన ఆత్మయందే నిలిచి ఉండును. ఉండును-లేదు అనికాని, అతడు-మరొకడు-అనికాని, ఈ లోకమున-పరలోకమున-అనికాని, ఒకడు-భిన్నుడు అనికాని, క్షేత్రజ్ఞుడు-పురుషుడు అనికాని, ఆత్మవంతుడు-నిరాత్ముడు అనికాని, చేతనుడు-అచేతనుడు అనికాని, కర్త-అకర్త అనికాని, భోక్త-భోజ్యము అనికాని, తెలిసినవారు నిరంజనుడైన క్షేత్రజ్ఞునందు (జీవునందు) మరలిరారు. చెప్పనందువలన అది అవాచ్యమైనది (చెప్పనలవి కానిదైనది). హేతువునందు గ్రహింప రానందునను, చింతింప అలవి కానందునను అది ఊహింప నలవికానిది. అన్ని విధములుగా పొందదగి నందున ఆ తత్త్వము మనస్సుతో పొందినను మనకంటదు.

క్షేత్రజ్ఞుడు, నిర్గుణుడు, శుద్ధుడు, శాంతుడు, క్షీణుడు, నిరంజనుడు, తొలగిన సుఖ దుఃఖ ములు కలవాడు, నిరుద్ధుడు, శాంతిని పొందినవాడు, నిరాత్మకుడు అయిన ఆతని యందు వాచ్యుడు (చెప్పదగినవాడు) అవాచ్యుడు (చెప్పదగనివాడును) ఉండడు. తరువాత మరల నీ సంహార-విస్తారములు వ్యక్తా వ్యక్తములు అగును. ఆతడు సృష్టించును, మ్రింగి వేయును, మ్రింగబడియు మరల పూర్తిగా ఉండును. అంతయు క్షేత్రజ్ఞునిచే అధిష్టింపబడిన దయ్యీ మరల ప్రవర్తిల్లును. అధిష్ఠాన ప్రవృత్తుడగుటచే ఆతనికి వారు బుద్ధిపూర్వకముగనే ప్రవర్తిల్లుదురు. వారిరువురికి (ప్రకృతి పురుషులకు) సాధర్మ్య వైధర్మ్య కృతమైన సంయోగము విధిని బట్టి కలుగును. మహాపురుషుని వల్ల ప్రకృతికి జరిగిన సంయోగము అనాది అయినది. సర్గ ప్రతిసర్గ కాలమున్నంత వరకు ఆతడు అన్నింటిని బాగుగా నిరోధించి ఉండును. హితముగా తగినదానియందు అది ఆ పురుషుని కొరకే అబుద్ధి పూర్వకముగనే ప్రవర్తిల్లును. ఇది సర్గ ప్రతి సర్గములకు ముందు ప్రాధానికి (ప్రకృతికి సంబంధించినదైన) యైన ఈశ్వరకారితము (ఈశ్వరుని చేయుతనము). అది అనాద్యనంతమై (ఆద్యంతములు లేనిదై) అభిమాన పూర్వకముగా జగమును భయపెట్టుచు వచ్చును అను ఇది మూడవ ప్రాకృత సర్గము. హేతు లక్షణము. దీనియందు ప్రాకృత సర్గము యొక్క ఆద్యంతములు చెప్పబడినవి. పండితులు దానిని వదలి వేయుదురు అను ఈ ప్రతిసర్గము మూడు విధములుగా నాచే విస్తారముగను ఆనుపూర్వితోను చెప్పబడినది. మరల మీకింకేవి చెప్పవలెను. (40)

సృష్టి వర్ణనము

ఋషులు ఇట్లు అనిరి :

ఓ సూత! మనువులతోడి ప్రజలయొక్కయు, ఋషులతోడి దేవతలయొక్కయు మిక్కిలి గొప్పనైన ఆఖ్యానమును నీవు చెప్పితివి. పితృ-గంధర్వ-భూతముల యొక్కయు, పిశాచ-ఉరగ-రక్షసుల యొక్కయు, దైత్యుల యొక్కయు, దానవుల యొక్కయు, యక్షుల యొక్కయు, పక్షుల యొక్కయు కర్మలను, విధితో కూడిన ధర్మ నిశ్చయమును, విచిత్రములైన కథా యోగములను, శ్రేష్ఠమై ఉత్తమోత్తమమైన జన్మమును భూతములు పుట్టునంతవరకు మీరు చక్కని వాక్కులతో చెప్పగా చెవులద్వారా మా మనస్సు విని సంతసించినది. ఈ విధముగా ఆ మహర్షులు అందరును సూతుని ఆరాధించి సత్కరించి నమస్కరించినవారై పునః సృష్టి ప్రవర్తిల్లిన విధమును అడిగిరి. ఓ మహాప్రాజ్ఞుడ వైన సూతా! బంధములు పూర్తి లయము చెందగా, సత్త్వ రజస్తమో గుణముల సామ్యావస్థ కేవల తమోమయముకాగా,

వికారములు సృష్టింపబడకుండగా, అవ్యక్తము (ప్రకృతి) ఆత్మయందు ఉండగా, బ్రహ్మసృష్టికై ప్రవర్తిల్లకుండగా, అపుడు మహాసాయుజ్యమును (బ్రహ్మతో సహా యోగమును) పొందిన వారిచే సృష్టి ఎట్లు జరిగినది? దానిని అడుగుచున్న మాకు చెప్పుము. ఇట్లనగనే లోమ హర్షణ పుత్రుడు సూతుడు అపుడు పునః సృష్టి ప్రవర్తిల్లిన విధమును వ్యాఖ్యానించుటకు ప్రారంభించెను.

సూతుడు ఇట్లు అనెను :

సృష్టి ఎట్లు జరుగునో నేను మీకు చెప్పెదను. అది పూర్వము వలెనే జరుగునని తెలియవలెను. దానిని సంగ్రహముగా వినుడు. దృష్టమైన దానినిగాని, అనుమానమైన దానినిగాని (అనుమాన ప్రమాణముచే తెలియదగిన దానినిగాని) యుక్తితో అర్థనిర్ణయము చేసి చెప్పెదను. కావుననే వాక్కులు ఆ బ్రహ్మను పొందలేక మనస్సుతో సహా మరలివచ్చును. (బ్రహ్మ తత్త్వము శాబ్దప్రత్యక్షమున కతీతము). అది అవ్యక్తమువలె (వ్యక్తముగాని ప్రకృతి వలె) ఇంద్రియ ప్రత్యక్షమునకు అతీతముగాగల అది తెలియరానిది. గుణసామ్యము (సత్త్వ, రజస్, తమో గుణముల సామ్యావస్థ) వికారములతో చెదరిపోగా, ప్రధానము (ప్రకృతి) పురుషుల సాధర్మ్యముతోనే ఉండును. ఎల్లప్పుడును, ప్రాణులయొక్క ధర్మా ధర్మములు అవ్యక్తమైన ప్రకృతి యందు లీనములగును. సత్త్వమాత్రాత్మకమైన ధర్మము ప్రకృతి గుణమైన సత్త్వమునందు నిలిచి ఉండును. తమోమాత్రాత్మకమైన ధర్మము ప్రకృతి గుణమైన తమమునందు నిలచి ఉండును. గుణసామ్య స్థితిలో ఈ రెండును విభాగము లేకయే ఉండును. ప్రధానముయొక్క (ప్రకృతియొక్క) సమస్త కార్యమునందును బుద్ధి పూర్వకముగనే ప్రవర్తిల్లును. క్షేత్రజ్ఞుడైన పురుషుడు అబుద్ధి పూర్వకముగనే ఆ గుణములను అధిష్ఠించును. ఈ విధముగా అపుడు ఆ గుణములను అభిమానముతో ఎదుట పొందును. క్షేత్రక్షేత్రజ్ఞులు ఇరువురు ప్రవర్తిల్లవలసినపుడు, వారు ఇరువురును కలసియే భోజ్య భోక్తృత్వ సంబంధమును పొందుదురు. కావున గుణసామ్యమున ఉండి అవ్యక్తము (ప్రకృతి) గుణా త్మకములకు శరణమగును. అదే అవ్యక్తము క్షేత్రజ్ఞాధిష్ఠితమై గుణవైషమ్యమును పొందును. (వికృతియగును). తరువాత క్షేత్రక్షేత్రజ్ఞులు ఇరువురిని వ్యక్త రూపమును (వికృతి రూపమును) పొందును. క్షేత్రజ్ఞాధిష్ఠితమైన ప్రకృతిలో సత్త్వము వికారమును కలుగ చేయును. ఇరువదినాలుగు గుణములతో ఉన్న మహదాద్యమై విశేషాంతమైనది. క్షేత్రజ్ఞుడైన పురుషునకును ప్రధానమునకును సంబంధించినది అగును. ఆతడు బ్రహ్మాండమున ప్రథముడు మరల ఈశ్వరుడును కాగలడు. తరువాత జ్ఞేయమైన సమస్తము నకును సర్వభూతపతి శివుడు అగును. సర్వముక్తులకు ఈశ్వరుడును బ్రహ్మమయుడైన మహా

బ్రహ్మయు అయిన ఆదిదేవుడు ప్రధానము యొక్క అనుగ్రహమునకై వచ్చుదురు. వారిద్దరును అనాద్యులు, స్వయంభువులు, సూక్ష్మలును, అనాది సంయోగముతో కూడిన వారును, సర్వక్షేత్రజ్ఞునినే అబుద్ధిపూర్వకముగా కలిసినవారును, శ్రేష్ఠులైన మశకులును, అప్రత్యయమును అనాద్యమును అయిన ఉదకమున ఉన్నవారును అగుదురు. ముందుగా పూర్వము పునఃసృష్టి ప్రవర్తిల్లగనే ఇది అంతయు జరుగును. అజ్ఞులు గుణములచే రజః సత్త్వ గుణాత్మకమున ప్రవర్తింతురు. రజోగుణముల యొక్క ప్రవృత్తి కాలమున మనుష్యులు తమ పతులతో (రాజులతో) అభిన్న మహత్వ భూతాది విశేష్యతను పొందుదురు. గుణావ సానమున విశేషతను ఇంద్రియతను పొందుదురు. ఆతని యొక్క సత్యమును అభిధ్యానించు వారు సన్నిమిత్తకముగా ధ్యానించువారు. రజస్, సత్త్వ, తమోగుణములు వ్యక్తములు. పరస్పరముగా అవి విధర్మములు కలవి. క్షేత్ర తజ్జ్ఞులు ఆద్యంత్యములలో అన్ని విధము లుగా వచ్చి చేరుదురు. అభిమానులు సంసిద్ధమైన కార్యమును చేయువారై జన్మింతురు. అన్ని సత్త్వములును అవ్యక్తమునకన్న పూర్వమే తెలియబడును. ప్రకృతి వానిని ప్రస వించును. అవి సాధికములు అసాధికములును. స్థాన ప్రకరణములతో సంసారములో దొరలుచున్నవై కార్యములను పొందును. మరల మరల పుట్టును. గుణ మాత్రాత్మకులు ఈ లోకమున అన్యోన్యము వరముతోను అనుగ్రహముతోను పరస్పరముగా ధర్మా ధర్మ ములను ఆరంభింతురు. అందరును సమానులు సృష్టి కొరకై ఆ సృష్టి మొదట వికారమును చెందుదురు. గుణములు వారివెంట పరుగిడును. కావున అది ఆతనికి రుచించును. అవి గుణములు, అవి అన్నియు దృష్టికి పూర్వమే పొందబడినవి. అవియే మరల మరల సృష్టింపబడుచున్నవై పొందబడును. హింసా, హింసలును, మృదు-క్రూరములును, ధర్మా ధర్మములును, ఋత-అనృతములును తద్భావనతో భావింపబడినవై ప్రాప్తించును. కావున అది దానికి (ఆతనికి) రుచించును. మహాభూతములలోను, ఇంద్రియార్థములు అయిన మూర్తులలో నానాత్వము; భూతముల యొక్క విప్రయోగములు (వేరుపాటులును) గుణముల వల్లనే ప్రవర్తిల్లును అని ఈ పునః సృష్టి సంగ్రహముగా చెప్పబడినది. ఇక బ్రహ్మయొక్క పుట్టుకను సంగ్రహముగనే చెప్పెదను.

నిత్యమై సదసదాత్మకమైన అవ్యక్త కారణము వలన (ప్రకృతి లేక ప్రధాన కారణము వలన) ప్రధాన-పురుషుల వలన మహేశ్వరుడు పుట్టును. ఆతడు మరల సంభావింప చేయువాడై బ్రహ్మఅను పేరుగల వాడగును. అభిమాన గుణాత్మకములైన లోకములను మరల సృజించును. మహత్తునుండి అహంకారము పుట్టును. అహంకారాత్మ నుండి భూతములు పుట్టును. భూతములును ఇంద్రియములును ఒకే మారు పుట్టును. భూతముల

నుండి భూత భేదములు పుట్టును. ఈ విధముగ సర్గము (సృష్టి) ప్రవర్తిల్లును. వానియొక్క విస్తార అవయవరూపము నా ప్రజ్ఞను అనుసరించియు, నేను విన్నట్లును, పూర్వము ఉన్నట్లును చెప్పబడినది. దానిని అట్లే విని ధరించుడు" అని చెప్పగా

నైమిశారణ్యవాసులైన ఋషులు ఈ లోకోత్పత్తిని, లోకస్థితిని, లోకనాశమును విని అపుడు ఆ సత్ర యాగమున అవబృథస్నానము ఆచరించి, శుద్ధులై పుణ్యలోకమును పొందిరి. మీరు వేద విధిని అనుసరించి దేవతాదులను యజ్ఞముజేసి పూజించి, అవబృథ స్నానముచేసి శుద్ధులైనట్లే ఆయుష్యాంతమున దేహములను వదలి, మీ కృతమునకు ప్రయోజనములైన (ఫలములైన) పుణ్యలోకములను స్వేచ్ఛగా పొందుడు. నైమిశారణ్య వాసులైన వారు యజ్ఞము చేసి ప్రజాసృష్టి చేసి సత్రయాగమునందు ఉన్నవారై అందరును అవబృథ స్నానము చేసినవారై స్వర్గమును పొందిరి. ఓ బ్రాహ్మణోత్తములారా! మీరు గూడ బహు విధములైన యజ్ఞములనుచేసి, ఆయుష్యము యొక్క అంతమున స్వర్గమునకు పోవువారగుడు. ప్రథమ పాదమున ప్రక్రియా పాదము అందు కథావస్తు పరిగ్రహము జరిగినది. అనుషంగ పాదము, ఉపోద్ఘాత పాదము, ఉపసంహార పాదము అని నాలుగు పాదములు. ఈ విధముగ ఈ పురాణము నాలుగు పాదములు గలదై లోక సమ్మతమైనది. లోకహితమునందు ఆసక్తిగల సాక్షాత్‌భగవంతుడైన వాయుదేవుడు దీనిని చెప్పెను. ఓ మునిసత్తములారా! ఆ వాయుదేవుడు నైమిశారణ్యమున సత్రయాగమునకు వచ్చి మునులకు ఈ పురాణమును చెప్పెను. ఆతని అనుగ్రహమున నిస్సందేహముగా, భూతముల ఉత్పత్తి (స్థితి) లయములను ఈశ్వరునిచే చేయింపబడిన ప్రాథావిక సృష్టిని బాగుగా దెలిసిన మేధావి అజ్ఞానమును పొందడు. ఈ బ్రహ్మయొక్క పురాతనమైన ఇతిహాసమును విన్న వాడును వినిపించినవాడును చదివించినవాడును అయిన విద్వాం సుడు, మహేంద్రుని స్థానములలో శాశ్వతములైన, సంవత్సరముల వరకు సంతోషించును. బ్రహ్మ సాయుజ్య మును పొందినవాడై బ్రహ్మతోపాటు ముక్తినందును. ప్రజలకు ఈశులై మహాత్ములై కీర్తి మంతులైన ఆ పృథివీపతుల కీర్తిని వ్యాపింపచేయుచు బ్రహ్మత్వము నందును. బ్రహ్మవాది యైన కృష్ణద్వైపాయనునిచే నీ ధన్యమును, యశస్యమును (కీర్తినిచ్చున దైన) ఆయుష్యమును ఇచ్చునదియు, పుణ్యమును, వేదములచే సమ్మతమైన ఈ పురాణము చెప్పబడినది. విశాల మైన ధనము తేజస్సును గలిగిన దేవతల యొక్క ఋషుల యొక్కయు మన్వంతరేశ్వరుల యొక్కయు కీర్తిని వ్యాపింపచేయువాడు సర్వపాపముల నుండి విముక్తుడై మహాపుణ్యమును పొందును. దీనిని ఎల్లప్పుడు ప్రతిపర్వమున వినిపించువాడు పాపప్రక్షాళ నము జరిగి, స్వర్గమును జయించి బ్రహ్మత్వము నందుటకు సమర్థుడగును. దీనిని శ్రాద్ధమున భోక్తలగు

బ్రాహ్మణులకు ఒక పాదము చివరివరకు వినిపించినవాడు పితరులకు సర్వ కామీయమైన అక్షయ స్థానమును సంపాదించిపెట్టగలడు. పూర్వము దీనిని చెప్పిరి దీని ఆధారముగా జీవించిరి కావున (పురా అనంతీతి పురాణమ్) పురాణము అనబడినది. ఈ పురాణ నిరుక్తమును తెలిసినవాడు సర్వపాపములనుండి విముక్తుడగును. అట్లే మూడు వర్ణముల వారు. (ఈ ఇతిహాసమును విని ముఖ్యముగా దర్మబద్ధులైన మానవులు) వారి శరీరములో ఉన్న రోమ కూపములన్ని కోట్ల వేల యేండ్లు స్వర్గమున నుండి సంతసించును. బ్రహ్మ సాయుజ్యమును పొంది దేవతలతో పాటు ఆనందించును. సర్వ పాపహరమును, పుణ్యమును, పవిత్రమును, కీర్తిమంతమును, శాస్త్రముసునైన ఈ పురాణమును పూర్వము బ్రహ్మ వాయుదేవునకు ఇచ్చెను. ఆతని నుండి దీనిని శుక్రుడు పొందెను. ఆతని నుండి దీనిని బృహస్పతి పొందెను. బృహస్పతి సవితకు (సూర్యునకు) చెప్పెను. తరువాత సూర్యుడు యమునకు ఇచ్చెను. యముడు ఇంద్రునకు ఇచ్చెను. ఇంద్రుడు వశిష్ఠునకు ఇచ్చెను. ఆ వశిష్ఠుడు సారస్వతునకు ఇచ్చెను. సారస్వతుడు త్రిధామునకు, త్రిధాముడు శరద్వంతునకు, శరద్వంతుడు త్రివిష్టునకు, ఆతడు అంతరిక్షు నకు ఇచ్చెను. అంతరిక్షుడు వర్షికి, ఆతడు త్రయ్యారుణునకు, త్రయ్యారుణుడు ధనంజయు నకు, ఆతడు కృతంజ యునకు, కృతంజయుడు తృణంజయునకు, తృణంజయుడు భరద్వాజునకు, ఆతడు గౌతమునకు, ఆతడు నిర్యంతరునకు ఇచ్చెను. నిర్యంతరుడు వాజశ్రవునకు, ఆతడు సోమశుష్మునకు, ఆతడు తృణబిందువునకు, తృణబిందువు దక్షునకు, దక్షుడు శక్తికి, శక్తి గర్భస్థుడైన పరాశరునకు, పరాశరుడు జాతుకర్ణునకు, ఆతడు ప్రభువైన ద్వైపాయనునకు ఇచ్చెను. ఓ బ్రాహ్మణోత్తములారా! ద్వైపాయనుని వల్ల నేను ఈ పురాణమును పొందితిని.

శాంశపాయనుడు ఇట్లు అనెను :

నేను దానిని అమితబుద్ధియైన నా పుత్రునికి ఇచ్చితిని-అని బ్రహ్మాదిగురువుచే వాక్కుచే చెప్పబడినది. విద్వాంసులకు కూడ గురువులు నమస్కరింప తగినవారు, ధనము ఇచ్చునది, కీర్తిని ఇచ్చునదియు, ఆయుష్యము ఇచ్చునదియు, పుణ్యము అయినదియు, సర్వార్థములు సాధించునదియు, పాపనాశకమైనదియు అయిన ఈ పురాణము బ్రాహ్మణులచే నియమ ముతో ఎల్లప్పుడు వినదగినది. అపవిత్రునకు, పాపికి, అసంవత్స రోషితునకు శ్రద్ధలేని వానికి, పుత్రులు లేనివానికి, అహితునకును ఈ పవిత్రమై ఉత్తమమైన పురాణము ఈయరాదు. ఆదిబ్రహ్మకు అవ్యక్తమైన ప్రకృతి యోనిగా చెప్పుదురు. కాలమును వ్యక్తమై అంతర్గతమైన దేహముగా చెప్పుదురు. వహ్నిని ముఖముగా, చంద్ర సూర్యులను నేత్రములుగా, దిక్కులను శ్రోత్రములుగా, వాయువును ముక్కుగాను చెప్పుదురు. వేదములు

వాక్కులు, అంతరిక్షము శరీరము, భూమి పాదములు, తారకలు రోమ కూపములు, తక్కిన విశ్వాంగములు తక్కిన అంగములు, తక్కినవన్నియు ఆతనితోక అని చెప్పుదురు. జనులకు జనకుడు, సర్వలోకములలో ప్రతిష్టితుడు, వరులలో వరుడు, వరదుడు, మహేశ్వరుడునైన ఆది బ్రహ్మకు ప్రణతుడనై నమస్కరింతును.(41)

వ్యాస సంశయాపనోదనము

శౌనకాది ఋషులు ఇట్లు అనిరి :

ఓ సూత! మహాభాగ్యవంతుడా! భగవంతుడ వైన నీచేత వ్యాసానుగ్రహమునను, ఇతరులకు బోధించుటచేతను, నీకు శాస్త్రము అబ్బినది. ఓ అనఘా! ఇతిహాసములతో పాటు, ఉపక్రమోపసంహారవిధితో చెప్పబడిన పదునెనిమిది పురాణములు మొత్తము నీకు తెలిసినవి. పదునాలుగు వేల (14000) శ్లోకములతో అతి స్ఫుటముగా మాత్స్య పురాణము చెప్పబడినది. అంతటి సంఖ్యతో పదియైదు శ్లోకములను చేర్చి (14015) భవిష్య పురాణము చెప్పబడినది. మహారమ్యమైన మార్కండేయ పురాణము తొమ్మిదివేల శ్లోకములు (9000) గలది. బ్రహ్మవైవర్త పురాణము పదునెనిమిది వేల(18000) శ్లోకములు కలది. బ్రహ్మాండ పురాణము పంద్రెండువేల ఒకవంద (12100) శ్లోకములు కలది. దివ్యమైన భాగవత పురాణము పదునెనిమిది వేల (18000) శ్లోకములు కలది. బ్రహ్మ పురాణము పదివేల (10000) శ్లోకములతో చెప్పబడినది. వామనము అను పురాణము అయుత (పదివేలు) (10000) శ్లోకములతో కూర్చబడినది. ఆది (అగ్ని) పురాణము పదివేల ఆరు వందల (10600) శ్లోకములు కలది. శుభమైన వాయుపురాణము ఇరువది మూడు వేల (23000) శ్లోకములు కలది. నారదీయ పురాణము ఇరువది మూడు వేల (23000) శ్లోకములు కలదిగా చెప్పబడినది. గరుడ పురాణము పందొమ్మిదివేల (19000) శ్లోకములు కలదిగా చెప్పబడినది. మిక్కిలి విస్తారమైన పాద్మ పురాణము ఏబదియైదు వేల (55000) శ్లోకములు కలదిగా చెప్పబడినది. మనోహరమైన కూర్మ పురాణము పదునేడువేల (17000) శ్లోకములు కలదిగా చెప్పబడినది. పరమాద్భుతమైన వారాహపురాణము ఇరువది నాలుగు వేల (24000) శ్లోకములు కలది. సువిస్తృతమైన స్కాంద పురాణము ఎనుబదియొకవేల (81000) శ్లోకములు కలది.

ఈ పురాణములలో బహుధర్మములు విశేషముగా నిరూపింపబడినవి. రాగుల యొక్కయు, విరాగుల యొక్కయు, యతుల యొక్కయు, బ్రహ్మచారుల యొక్కయు, గృహస్థుల యొక్కయు, వనస్థుల యొక్కయు, విశేషించి స్త్రీ–శూద్రుల యొక్కయు ధర్మములు

చెప్పబడినవి. గంగాది మహానదులును, యజ్ఞములు, వ్రతములు, తపములు అనేక విధ దానములు, యమములు, నియమములు, బహువిధములైన యోగధర్మములును, సాంఖ్య మతములు, భాగవత మతములును, భక్తి మార్గములు, జ్ఞాన మార్గములు, వైరాగ్యము వల్లను, వాయువు వల్లను, జలము వల్లను కలుగు పారమార్థిక మార్గములును చెప్పబడినవి. కర్మ సంశుద్ధ చేతస్కుల ఉపాసనా విధిగూడ చెప్పబడినది. బ్రాహ్మము, శైవము, వైష్ణవము, సౌరము, శాక్తము, ఆర్హతము (బౌద్ధము)–అను స్వభావ నియతము లైన ఆఱు దర్శనములును చెప్పబడినవి. ఇదియును వివిధములైన వేరు విషయములును నిరూపింపబడినవి. ఇంతకంటె వేరుగా తెలియదగిన ఉత్తమమైన విషయము ఏమైన ఉన్నదా? లేదా? అది వ్యాసునకే తెలియకుండ వచ్చును. లేదా నీవే దాచుచుండవచ్చును. నీవు నిండైన పౌరాణికుడవు కావున ఈ విషయమున మా సంశయమును ఛేదింపుము.

సూతుడు ఇట్లు అనెను :

ఓ శౌనకా! ఈ సుదుర్లభమైన ప్రశ్నకు సమాధానము చెప్పెద వినుడు. అది మిక్కిలి దాచదగినది, దివ్యమైనది. ఎవ్వరికిని చెప్పరానిది అని చెప్పుదురు. పరాశర సుతుడైన వ్యాసుడు సర్వ వేదార్థములచే కూర్చబడిన పౌరాణిక కథను నిర్మించి మనసులో చింతించెను. వర్ణాశ్రమములు గలవారి ధర్మము నాచే చక్కగా చెప్పబడినది. వేదవిరోధము లేకుండా బహువిధములైన ముక్తి మార్గములు చెప్పబడినవి. బ్రహ్మ సూత్రముల నిర్ణయ మున జీవేశ్వర బ్రహ్మ భేదము నిరాకరింపబడినది. శ్రుతియుక్తమైన విచారముతో పరబ్రహ్మ స్వరూపము నిరూపింపబడినది. అక్షరము (నాశము లేనిది), పరమమైన బ్రహ్మ, అదియే పరమాత్మ, పర(మ)మైన పదము. దాని కొఱకే మహా ప్రాజ్ఞులు బ్రహ్మచర్య–గృహస్థ–వానప్రస్థ–యతి వ్రతములను ఆచరింతురు. వేరు విధమై ధారణమును కూడ చేయుదురు. మునిశ్రేష్ఠులు, యోగాసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణము, ధ్యానము, సమాధి, నియమములతో పాటు యమములు–ఈ అష్టాంగ యోగములను ఆ పరబ్రహ్మ ప్రాప్తి కొఱకు చేయుదురు. వేదముల ఆజ్ఞా మాత్రమునందే తత్పరులైనవారు దానికొఱకే యజ్ఞాది కర్మను చేయుదురు. కోరికలు లేనివారు గహనమైనది లేనివారై పరార్పణ బుద్ధితోనే పనులు చేయుదురు. ఆ బ్రహ్మజ్ఞానము కొఱకై తన పాపాచరణమును నివారిం చుటకు శుచివ్రతులు గంగాది తీర్థ చర్యలను సేవింతురు. అది పరబ్రహ్మము, శుద్ధము, ఆద్యంతములు లేనిది, రోగము లేనిది, నిత్యమైనది సర్వమునందు ఉండునది, స్థాణువైనది, ప్రళయమునందు కూడ కదలక ఉండునది, కూటస్థమైనది (ఏకరూపమున కాలవ్యాపియై ఉండునది), కూటవర్జిత మైనది (ఏ వికారములేనిది). సర్వేంద్రియములందు

చరించునట్లుగా ప్రతిఫలించునది ప్రకృతి నిర్మితములైన ఇంద్రియములు లేనిది, దిక్కాలాదులతో వేరుపరుపబడనిది, శాశ్వతమైనది, చిన్మాత్రమైనది (సమస్త వస్త్వవభాసకమైనది), నాశములేనిది, త్రాడునందు సర్పమువలె దీనియందు ఈ విశ్వమంతయు అధ్యస్తమై ప్రకాశించును (ఆరోపితమై భాసించును). అట్లు త్రాడునందు భాసించిన సర్పమునందు అంతటను త్రాడు అనుసరించి ఉన్నట్లు బ్రహ్మయందు ఆభాసించిన విశ్వమందు అంతటను నిర్వికారమై బ్రహ్మను అనుసరించి ఉండును. నురుగు-అలలు-బుడగలు-నీరు వేర్వేరుగా కనబడినను నీరుకన్న భిన్నము కానట్లే వేర్వేరుగా చరింపచేయబడినను విశ్వముకన్న బ్రహ్మ వేరుకాదు. నిగమములు సర్వము బ్రహ్మయే! నానాత్వము లేదు అని అందురు. కారణము బ్రహ్మాండ కోటులు పుట్టుట నశించుటయును తన ఉన్మేష నిమేషములతో (సహజమైన కనురెప్పల పాటులు-తెరచుటలు) జగత్తుల ప్రళయ-ఉదయములను కలుగచేయు పరాశక్తి ఆ పరబ్రహ్మ ఆధారముగా నిలిచినది. దానియందు విశ్వమున్నది. దానిచేతనే ఈ విశ్వము వచ్చినది అనబడినది. ఆ బ్రహ్మను తెలియమి వలన జగము భాసించును. ఆ బ్రహ్మను తెలిసినచో జగము భాసింపదు. జగము అసత్యమనియు, జడమనియు, దుఃఖమనియు, అవస్తువనియు నిరూపింపబడినది. దీనికి విరుద్ధమైనది సచ్చిదానందమూర్తికము. జీవుడు మేల్కొని ఉన్నపుడు అది విశ్వమను నది. జీవుడు స్వప్నమున (కలలో) ఉన్నప్పుడు అది తైజసమనబడును. జీవుడు నిద్రించినపుడు ప్రాజ్ఞుడు అనబడును. ఇట్టి పరబ్రహ్మ జీవుని సర్వావస్థలయందు ఉండునదిగా చెప్పబడినది. అది కన్నులకు కన్ను, చెవులకు చెవి, చర్మములకు చర్మము (చర్మేంద్రియములకు చర్మేంద్రియము) నాలుకకు నాలుక, ప్రాణములకు ప్రాణము-అని బుద్ధిమంతులు తెలియుదురు. బుద్ధి జ్ఞానము చేతను, ప్రాణములు నిరంతరము తమ క్రియాశక్తిచేతను పరబ్రహ్మను చేరుటకుగాని పరమార్థముగా తెలియుటకుకాని సమర్థములు గావు. త్రాడునందు పామువలె, మరుభూమి యందు నీరువలె, ఆకాశమున నీలిమవలె ఆ పరబ్రహ్మయందు జ్ఞాన కల్పితమై అసత్తైన (అసలులేని) ఈ విశ్వము భాసించును. ఈ మహాకాశము కుండయందు వేరుగా కన్పించి వేరుచేయబడును. అట్లే కార్యోపాధిచే వేరుగానై ఆ పరబ్రహ్మ జీవుడు అని పిలువబడును. విచిత్ర గుణ శీలములు కలిగిన చిత్రకారిణియైన మాయచే గోడమీదవలె పరబ్రహ్మపై ఈ సాటిలేని బ్రహ్మాండము చిత్రిత మైనది. పరిగెత్తుచున్నవానికి ఇతరులచే అతిక్రమింప బడనిది, చెప్పువానికి వాక్కులకు గోచరముగానిది, వేదవేదాంత సిద్ధాంతములచే నిర్ణయింపబడినది ఆ అక్షరమైన (నాశములేని) పరబ్రహ్మము. ఆ అక్షరము కన్న పరమైన దేమియు లేదు. అదియే (అక్షరమే)

పర్యవసానము. ఉత్కృష్టమైన ప్రాప్తిస్థానము. అనేక విధముల విచారింపబడిన వేదము ఈ విధముగ వినబడును. అక్షరమైన తనకును ఆత్మరూపముగ ఉన్నవాడు, పరమానంద సమూహరూపుడు, ఆనందమే ఆకారముగా గలవాడు, లీలా విలాసముల రసికుడు, గోపికాస్త్రీల సమూహ మధ్యమున ఉన్నవాడు, ప్రకాశించు రత్నములు పొదిగిన నెమిలి పింఛముకల కిరీటముతోను ప్రకాశించుచున్న మెరుపు కాంతులు కల కర్ణకుండలముల తోను ప్రకాశించినవాడు, చెవుల సమీపము వరకు కదలాడుచున్న కాటుక పిట్ట వంటి కన్నులతో మనోహరముగా ఉన్నవాడు, ప్రతి పూపొదరింటిలోను ప్రియురాండ్ర సమూహ ముల విలాస రతియందు అత్యాసక్తి కలవాడు, పీతాంబరమును ధరించువాడు, దివ్యుడు, చందనపు మైపూతతో అలంకరింపబడినవాడు, అధరామృతముతో తడిసిన వేణువు యొక్క నాదముచే గోపికాస్త్రీలను మోహింప చేయువాడు, చిదానందుడు, మన్మథ మదమును భంగము చేయువాడు, కోటికామ కళలతో నిండినవాడు, కోటిచంద్రుల కిరణములవలె నిర్మలుడు, మూడు రేఖలలో కంఠమున ప్రకాశించు రత్నములు గురిగింజలుగల మృగము లతో వ్యాకులుడు, యమునానదిలోని ఇసుకతిన్నెలలోను, కదంబ- చంపక-అశోక-పారిజాత వృక్షములతో మనోహరమై నెమళ్ళయొక్క, పావురములయొక్క, చిలుకలయొక్క, కోకిలల యొక్కయు కోలాహలములచే వ్యాకులమై ఎత్తైన కానుగచెట్ల అడవిలో మేతమేయు విచ్చలవిడిగా పోవు గోవుల నిరోధించుటకు ఇటునటు పరుగెత్తుచున్నవాడును, రాధతో విలాసరసికుడైన కృష్ణుడు అను పరమపురుషుని-వేద వాక్కులకు గోచరుడైనందున-ఆ వేదములవలన వింటిని. ఈ విధముగ భేదమువదలి నిర్గుణుడై, జ్ఞానమాత్రుడై గోలోకమను బ్రహ్మయందు క్రీడించి శోభించునని నేను వింటిని. దీనికంటె పరతరమైనది ఏమియులేదు. నిగమాగమములలోకూడ నిగమము అక్షరము కంటెను పరమైన పరము కంటెను పరుడని ఆతని చెప్పును. గోలోకవాసియైన భగవంతుడు అక్షరమున కంటె పరుడుగా చెప్పబడును. ఆతని కంటెను పరుడై ఎల్లప్పుడు వేదములచే గానముచేయబడు వీడెవడు ? వేద వచనములచే ఉద్దేశింపబడినవాడెవడు? విశేషము ఎట్లు తెలియును? అక్షరమునకన్న పరముగా ఉండువాడన్న శ్రుతియొక్క అర్థము వేరుగా తెలియవలెనా? వేదార్థమున సంశయమును పొందినవాడై సత్యవతీ సుతుడైన వ్యాసుడు చాలాకాలము విచారించెను (ఆలోచించెను). నిజముగాఉన్న తత్త్వమును అందలేదు.

సూతుడు ఇట్లు అనెను :

ఎంత విచారించుచున్నను వేదార్థ నిశ్చయమును వ్యాసుడు పొందలేదు. వేదము సాక్షాత్తుగా నారాయణుడు. దానిలో పండితులు ముగ్ధులు అగుదురు. ఐనను వ్యాసుడు

సజ్జనుల హృదయమును తపింపచేయు మహాబాధనందెను. మరల విచారించెను. ఎవరి కడకు పోవుదును? ఏమి చేయుదును? ఈ జగమున సర్వజ్ఞుని సర్వమును చూచు వానిని కానను, అనేకులలో ఒక్కని నైనను సందేహమును నివారించు వానిని తెలియక, మేరువు యొక్క కుహరిణిని (గుహను) చేరి అచట వ్యాసుడు పరమ తపస్సును చేసెను. అచట బంగారపు కాంతులతోను, వజ్రనిర్ఘోషములతోను, వెన్నెలల (మెరపుల) సమూహములతోను నిరంతరముగా కన్నుల బాధించు చిమ్మచీకటులను అంతటను ఆ గుహ బాధించును. అచటఅతిసుందరమై ఉత్కృష్టమైన అడవి ప్రకాశించును. అది అనేక వృక్షములలో తీవలలో పొదరిండ్లలోను కూయుచున్న పక్షులచే ప్రతిధ్వనింప చేయబడినది. ఆకలి, దప్పి, భయము, క్రోధము, తాపము, బాధ ఇవేవియు లేనట్టిది. అది బహువిధములు అయిన జలాశయములతో కూడినది. ఆ జలాశయములు తామర తూండ్లతో అలంకరింప బడినవి. బంగారు శిలలతో కట్టబడిన ఒడ్డులందు తిరుగుచున్న పక్షులుకలది. కమల ములపై వీచు వాయువులతో ఆవనము అంతయు సేవింప బడును. అది మంగళకరము లైన భావములతో అధ్యాసితమైనది. హింసించు ప్రాణులు లేనిది. జనములు లేనిది, దివ్యములైన తీగలు ప్రియమైన శాఖలతో విరాజిల్లినది. మనోహరములు అయిన చిలు కలతో, పావురములతో, మిక్కిలి మదించిన మత్తకోకిలలతోను కూడినది. పైకెగిరి వచ్చు పద్మముల పుప్పొడుల సమూహముల పరిమళములుకల దిఙ్ముఖములు కలది. అచట కూడ పరమ శోభనమైన బంగారు గుహకలదు. వ్యాసుడు ఆ గుహలో ప్రవేశించి, ఆహా రమును, చిత్తమును, ఆసనమును వదిలినవాడై తదేకాగ్ర మనస్కుడై నాలుగు వేదములను స్మరించెను. అట్లు వేదలములను స్మరించుచున్న ఈ వ్యాసునకు మూడువందల ఏండ్లు కడచినవి. అంత సుందర దర్శనములైన నాలుగు వేదములు ఎదుట ఆవిర్భవించినవి.

అట్లు ఆవిర్భవించిన ఆ వేదపురుషులు స్ఫురించు పద్మ దళముల వంటి కన్నులు కలవారు, జటలను ముకుటములుగా ధరించినవారు, దర్భముష్టులు గల పద్మముల వంటి చేతులు కలవారు, లేడి చర్మముతో అలంకరించిన భుజములు కలవారు. పదునారు స్వరములతో (అచ్చులతో) నిండిన ముఖములు కలవారు, ఓంకారము లోపల (హృద యమున) కలవారు. కవర్గ-చవర్గములలో పుట్టిన (కఖగఘఙ-చఛజఝఞ వర్ణములతో ఏర్పడిన) ఐదేసి వ్రేళ్లు కలిగిన చేతులు కలవారు. పవర్గలోని 'పఫబభమ' వర్ణములతో ఏర్పడిన కుడిపాదములు కలవారు. 'త' వర్గలోని 'తథదధన' వర్ణములతో ఏర్పడిన యెడమ పాదములు కలవారు. కుక్షి ద్వయాత్మకములు అయిన అంతస్థ వర్ణములు (యరవలవ-శషసహలు) కలవారై తరింతురు. నాభినిద్ర కలవారు. కాంతములు పృష్ఠము

(వీపు)గా కలవారు. 'మ' కారము ఉదరముగా కలవారు. 'యరలవలు' ఊర్ధ్వములైన వెంట్రుకలుగా కలవారు. అగ్ని దక్షాంశముచే ప్రకాశించువారు, భూమి కంఠముగా కలవారు. భృతములు భుజములుగా కలవారు, అంతస్థములైన 'యరలవలు' సంధి సంస్థానములుగా కలవారు. వైఖరీ వాక్కులతో విజృంభించినవారు. ఈ వేదపురుషుల యొక్క హృదయ కమలమున కల్పితమైన మధురానగరమును (వ్యాసుడు) చూచెను. ఆ మధుర భగవంతుడైన హరి కృష్ణుడు సాక్షాత్తుగా ఆవిర్భవించిన స్థలము. వేదపురుషుల యొక్క భ్రూమధ్యమున (కనుబొమ్మల నడుమ) కాశీ నగరమును చూచెను. మూలా ధారమున ఉన్నదానినిగా మాయను ఉజ్జయిని (నగరమును) చూచెను. లింగ ప్రదేశమున కాంచీ నగరమును, నాభిమండలమున అవంతీ నగరమును, కంఠస్థముగ ద్వారకను, ప్రాణగతముగా ప్రయాగను, సవ్యాపసవ్యము (కుడి యెడమ)లలో గంగాయమునలను, మధ్యన సరస్వతీనదిని, ముఖమున గయాక్షేత్రమును, కంఠమునకు చెక్కిళ్ల పై భాగమునకు ఉన్న ప్రదేశమున ప్రభాస క్షేత్రమును, వీరి (వేద పురుషుల) బ్రహ్మరంధ్రమున బదరి ఆశ్రమమును చూచెను. కన్నుల జంటలో పౌండ్రవర్ధన నేపాల పీఠమును, ఫాలభాగమున పూర్ణగిరియను పీఠమును చూచెను. వీరి కంఠమున మధురాపీఠమును, కటిస్థలమున (నడుమున) కాంచీపీఠమును, స్తన ప్రదేశములలో జాలంధర పీఠమును చూచెను. చెవుల ప్రదేశమున భృగుపీఠమును, ముక్కుపుటమున అయోధ్యను, బ్రహ్మ రంధ్రమున బ్రాహ్మ్యమైన పీఠమును, సీమంత (పాపెట) ప్రాంతమున శైవపీఠమును, నాలుక చివర బుద్ధిమంతమైన శాక్తపీఠమును, హృదయకమలమున వైష్ణవపీఠమును, కన్నులలో ఉన్నదిగా సౌరపీఠమును, ఛాయా సుసంగతముగా (నీడనంటి ఉండునదిగా) బౌద్ధ పీఠమును, కంఠదేశమున సౌత్రామణి యాగమును, ఎదపైన పశుబంధ యాగమును, నడుమున వాజపేయ యాగ మును, ముఖమున అగ్నిహోత్ర యాగమును, కటితటమున (నడుమున) అశ్వమేధ యాగమును, కడుపుపైన నరమేధ యాగమును, తలపైన రాజసూయ యాగమును, క్రింది పెదవిపైన ఆవసథ్య యాగమును, పై పెదవిపైన దక్షిణాగ్నిని, నోటిలోపల గార్హప త్యాగ్నిని, చెవియందు హవ్యమును, రోమములందు ఉండునవిగా మంత్ర భేదములను చూచెను. సేవకులచే మహారాజు సేవింపబడినట్లు వేద పురుషులు న్యాయములలో కూడిన పురాణములతోను, సంహితల తోను, తంత్రముల తోను వేరువేరుగా ఉపాసింపబడినవారు. కర్మ, జ్ఞాన, ఉపాసనలతో జనకానుగ్రహకారకులు, ఇట్టి వీరిని (వేదపురుషులను) చూచి ఆశ్చర్యము చెందినమనస్సు కలవాడై వ్యాసముని కృష్ణుడు అయ్యెను. (నల్లనివాడు కృష్ణు డును-కృష్ణ వ్యాసుడు). బ్రహ్మ తేజోమయులు, దివ్యులు. భూమికి జారిపడి తపించు

సూర్యునివలె ఉన్నవారు, మండుచున్న అగ్నులవలె ఉజ్జ్వల భవిష్యత్తు కలవారు, కోటి చంద్రులతో సమానమైన చల్లని తెల్లని కాంతిగలవారు-ఇట్టివారైన వేదపురుషులను వ్యాసముని చూచి వెంటనే లేచి నేను ధన్యుడను, నేను ధన్యుడను-అనుచు వారికి దండ ప్రణామములు చేసెను. మీరు ప్రత్యక్ష మైనందున ఈనాడు నాజన్మ సఫలమైనది. ఈనాడు నా మనము (చింతించుట) సఫలమైనది. ఈనాడు నా ఆయువు (బ్రదికి ఉండుట) సఫలమైనది. లౌకికముగాని, అలౌకికముగాని మీకు తెలియనిది లేదు. అట్లే తెలియదగిన భూతముగాని, భవిష్యత్తుగాని, వర్తమానముగాని మీకు తెలియనిదిలేదు. వానిని ఎల్లప్పుడు మీరు చూచుచున్నను వానిలో ప్రవర్తించుట ఫలముగా కలవారు కారు. రాగుల విషయ మున స్వేచ్ఛగానే పనుల చేయుటగాని, ఉపసంహరించుటగాని చేయుదురు. ప్రపంచము కూడ మిథ్య అనిగాని, బ్రహ్మ అనిగాని, విధించుటగాని, నిషేధించుటగాని మీకుండవు. దాని సంకోచ-విధి-క్షయములు వ్యర్థముగా మీరాగ విషయములు కావు. అందువలననే పరమార్థ నిరూపణమున లోకహితులచేత స్వోక్తములైన స్వర్గాది విషయములు నిశ్చ యముగా నశ్వరములని నిందింపబడినవి. శబ్ద బ్రహ్మాత్మ మూర్తులచే అధికారి విభేదముచే కర్మ జ్ఞాన ఉపదేశము ద్వారా జగమంతయు నిశ్చయముగా రక్షింప బడినది. కావున నేను అడుగదలతును. మీరు దయాళువులైనచో చెప్పుడు. కామైకచిత్తులకు కర్మల ఫలము సర్గము(సృష్టి) మోక్షము కాదు. అని చెప్పుదురు. ఈశ్వరార్పిత బుద్ధితో చేసినను పురుషుల ఆకర్మకు ఫలము చిత్తశుద్ధి. దాని తరువాత జ్ఞానము, దాని తరువాత మోక్షము కలుగును. బ్రహ్మైక్యము అగుట అన్నదే మోక్షము. అది సచ్చిదానంద రూపము. అది తెలిసినపుడు కృతాకృతము అంతయు (చేసినది చేయనిది అంతయు) సమాప్తి చెందును. అది సంగములేనిది, జ్ఞానాకాశము, ఆవరణములేని అనంత జ్ఞాన రూపము, కోరికలు లేనిది, చలింపనిది, శుద్ధమైనది, గుణములేనిది, వ్యాపకముకానిది అగును. గాఢాంధకారము వ్యాపించిన లోకమున సూర్యుడు తన నిర్వికారమైన తేజస్సుతో నశింప కయే ఉండును. కాని యాకాంతికి చీకటి మాత్రము నశించుచునే ఉండును. అట్లే వికారములు నశించు చుండ నిర్వికారము నశింపదు. లోహమువలన అయస్కాంత మణిలోని ఆకర్షక శక్తి బయల్పడి విజృంభించును. మథనమువల్ల అరణిలోని అగ్ని బయల్పడి విజృంభించును. అట్లే మిథ్య యొక్క ఆభాసమున (అసత్యమైనదని తెలియుటచే) సత్య బ్రహ్మ జ్ఞానము సత్తను వెలువరచి విజృంభించును. మొదట జీవేశ్వర ఆకారముతోను, విశ్వాకారముతోను భాసించి అది ప్రలీనముకాగా ఒకే ఒకడైన కూటస్థుడు ఉండును. మీచేత ఈ విధముగ నిర్ణయింపబడినది. అదిఅంతే సంశయములేదు. అయినను కేవలము నా హృదయమున

తెలిసికొను కోరిక (జిజ్ఞాస) కలదు. అంతకంటెను పరమైనది ఏమైన ఉన్నదా? లేదా ? ఓ మహాభాగ్యవంతులారా! మీరు తత్త్వమును చూచినవారు దానిని చెప్పుడు. దానిని వినుట అన్నఫలమే ఇట నాజన్మకు సార్థక్యము. ఈ విధముగా చెప్పుచున్న సత్యవతీసుతుడైన వ్యాసుని బాగు బాగు అని పొగిడి ఆ వేదములు వేద పురుషులు ఈ మాటలు పలికిరి. వేదములన్నవి (వేదపురుషులు అనిరి) ఓమహాప్రాజ్ఞా! బాగుబాగు. శరీరులకు ఆత్మ విష్ణువు. నీవు జన్మలేని వాడవు అయినను జన్మను పొంది లోకము అనుగ్రహమును కోరుచున్నావు. కాకున్న, నీకు కర్మబంధన రూపమైన సంసారము ఘటింపదు. ఒకప్పుడు జ్ఞానమును కప్పివేయు మాయచే తాకబడనివాడవు. కాని స్వేచ్ఛచేతనే రూపమును ధరించుచున్నావు. స్వేచ్ఛచేతనే రూపమును కప్పి వేయుచున్నావు. మాకు సమ్మతమైన అర్థమునే (విషయమునే) నీవు చెప్పితివి. పురాణములలోను, ఇతిహాసములలోను, సూత్రములలోను (బ్రహ్మ సూత్రములలోను) అనేక విధములుగా సర్వకారణములకు కారణమై, అక్షరమై, పరమమైన బ్రహ్మ చెప్పబడినది. పూవునకు గంధమువలెను(మకరంద) రసమువలెను, ఈ ఆత్మకాత్మగా ఉన్న రూపమును ఆ పరబ్రహ్మ రూపముగా తెలియుము. ప్రాకృతికమైన మహాప్రళయము జరుగగా అది మాచే అనుభవింప బడినది. అది అక్షరమునకన్న పరముగా పరమమై కేవలానంద రసరూపము. శబ్దాతీత మైన ఆ పరబ్రహ్మ విషయమున శబ్దాత్మకులమైన మేము వివరించుటకు అశక్తులము. (42)

గయా మాహాత్మ్యము

వాయువు ఇట్లు అనెను :

ఆ తరువాత ఉత్తమమైన గయా మాహాత్మ్యమును చెప్పెదను. అది విని మానవుడు సర్వపాపముల నుండి విముక్తుడగును.

సూతుడు ఇట్లు అనెను :

దేవర్షియైన ఆ నారదుడు మహాభాగ్యవంతులైన సనకాదులతో కూడి విధి విధాన పూర్వకముగా సనత్కుమారునకు నమస్కరించి ఇట్లు అడిగెను.

నారదుడు ఇట్లు అనెను :

ఓ సనత్కుమారా! పఠించునట్టియు వినునట్టియు సర్వ భూతములను తరింప చేయునదియు ఉత్తమ తీర్థములలో ఉత్తమోత్తమమైన తీర్థమును నాకు చెప్పుము.

సనత్కుమారుడు ఇట్లు అనెను :

సర్వ దేశములందు తీర్థములు అన్నింటికంటెను అధికమైనది, శ్రాద్ధాదులలో సర్వ

తారకమైనది, తీర్థ శ్రేష్ఠమైనదియు అయిన గయా తీర్థమును చెప్పెద వినుము. బ్రహ్మచేత క్రతువునకై కోరబడిన గయాసురుడు తపము ఆచరించెను. తనను చేరిన ఆతని శిరమున ధర్ముడు శిలను ధరింపచేసెను. అచట బ్రహ్మ యాగమును చేసెను. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా! అట రాత్రింబవళ్లు బ్రహ్మాదులైన దేవతలతో పాటు గయాసురుని యొక్క ఫల్గు తీర్థాది రూపమున నిశ్చలనమునకై గదాధరుడు (విష్ణువు) కూడ ఉండెను. యజ్ఞము చేసిన బ్రహ్మ బ్రాహ్మణులకు గృహములు మొదలగు వానిని ఇచ్చెను. వారాహశ్వేతకల్పమున గయా యాగమును చేయించెను. గయా నామముతో గయ పిలువబడినది. ఆ క్షేత్రము బ్రహ్మాదులచే కోరబడినది. నరకము వలన భయము చెందిన పితరులు పుత్రులను కోరుదురు. గయను చేరిన పుత్రుడు తమను రక్షించగలడని పితరులు తలంతురు. గయను చేరిన పుత్రుని చూచి పితరులకు ఉత్సవ సంతోషము కలుగును. వాడు పాదములతో జలమును తాకి మాకు ఇచ్చినను మాకు ఉత్సవ సంతోషము కలుగును. గయకు వెళ్లి అన్నదానము చేసిన పుత్రునివల్ల పితరులు నిజముగా పుత్రవంతులు అగుదురు. అచట మూడు పక్షములు (45 దినములు) ఉండిన పుత్రుడు ఏడు తరముల వరకు వంశమును పవిత్రము చేయును. కానిచో, పదునైదు దినములు గాని, ఏడు రాత్రులుగాని, చివరకు మూడు రాత్రులుగాని గయలో ఉండి అన్నదానము చేసిన పుత్రుని వల్ల పితరులు నిజముగా పుత్రవంతులు అగుదురు. గయను చేరినచో మహాకల్పము నుండి చేసిన పాపము సైతము నశించును. అచట పిత్రాదులకు పిండమును పెట్టవలెను. తనకుకూడ తిలలు లేకుండా పెట్టవలెను? బ్రహ్మహత్య, సురాపానము, దొంగతనము, గురుస్త్రీగమనము వీని సంగమున కలిగిన సర్వపాపములును గయా శ్రాద్ధము వలన నశించును. గయా క్షేత్రమున ఎప్పుడైనను (ఎప్పుడో ఒకప్పుడు) తన పుత్రుడు కాని, వేరొకని పుత్రుడుకాని ఎవరి పేరున పిండమును పెట్టినను వానిని శాశ్వతమైన బ్రహ్మ లోకమును పొందించును. బ్రహ్మజ్ఞానము, గయాశ్రాద్ధము, గోగృహము(శాల)లో మరణము, కురుక్షేత్రమున నివాసము–ఇవి పురుషులకు నాలుగు విధములైన ముక్తులు. పుత్రుడు గయకు వెళ్లినచో, ఇక బ్రహ్మజ్ఞానముతోగాని, గోశాలలో మరణమున గాని, కురుక్షేత్ర నివాసమునగాని ప్రయోజనము లేదు అవి వ్యర్థము. విజ్ఞానము కలవాడు గయలో సర్వకాలములందును పిండమును పెట్టవలెను. అధికమాసమున, జన్మ దినమున, గురు శుక్రులు అస్తమించినపుడు (గురు శుక్ర మౌఢ్యములలో) సింహరాశిలో గురువు ఉన్నప్పుడుగాని దైవ ప్రమాదమునగాని, గాయములు అయినపుడుగాని గయాశ్రాద్ధమును వదలరాదు. అచట శ్రాద్ధము చేయువాడు మరల కర్మాధికారియై బ్రహ్మ లోకమును పొందును. ఒకమారు గయకు

పోవుట, ఒకమారు అచట పిండము పెట్టుటయు దుర్లభము. ఇక నిత్యము అచటనే ఉండువాని పుణ్యవిషయము చెప్పనలవికాదు. బ్రహ్మాదులకే ముక్తినిచ్చు ఈ క్షేత్రమున మరణించిన వానికి బ్రహ్మజ్ఞానికి లభించినంతటి ముక్తి లభించును. ఇందు సంశయము లేదు. అచట మరణించిన కీటకాదులకు, పితరులకును నిస్సంశయముగా బ్రహ్మ జ్ఞానముక్తి లభించును. కావున సర్వప్రయత్నముతో పండితులు గయాశ్రాద్ధమును చేయవలెను. బ్రహ్మ ప్రకల్పితులు అయిన (బ్రహ్మత్వ బుద్ధితో) బ్రాహ్మణులను బిలిచి హవ్యకవ్యాదులతో (దేవతలకు ఇచ్చునది హవ్యము పితరులకు ఇచ్చునది కవ్యము) అర్పింపవలెను. వారు సంతుష్టులు అయినచో పితరులతో బాటు దేవతలందరును సంతోషింతురు. సర్వతీర్థము లందును ముండనము (తల గొరిగించుకొనుట) ఉపవాసము–అన్నది విధానము (చేయ దగినది), కురుక్షేత్రము నను, విశాలమై విరజస్కమైన గయలో పై వానిని చేయబనిలేదు. భిక్షువు (సన్న్యాసి) గయకు వెళ్ళి దండమును చూపించవలె. పిండమును పెట్టరాదు. గయలో విష్ణు పాదమున దండము ఉంచిన భిక్షువు పితరులతోబాటు ముక్తి నందును. పరమార్థతః (సత్యముగా) దండి (సంన్యాసి) పాపమునుగాని, పుణ్యముగాని ధరింపడు. అంతస్సులో సర్వ క్రియను వదిలి భావుకుడై విష్ణువును ధ్యానించును. సర్వ కర్మలను సన్యసింపవచ్చును. కాని ఒక్క వేదమును మాత్రము వదలరాదు. ముండనము చేసికొన వలెను. గయా క్షేత్ర మానము–తూరుపునను, పశ్చిమమునను, దక్షిణోత్తరములను, రెండు న్నర క్రోశముల కొలతగలది గయయని బ్రహ్మచే చెప్పబడినది. గయాక్షేత్రము పంచ క్రోశములు కలది. గయాశిరము ఒకక్రోశము, ముల్లోకములలో ఉన్న తీర్థములన్నియు దాని మధ్యలో ఉన్నవి. గయాక్షేత్రమున శ్రాద్ధము చేయువాడు, పితరులకు ఋణ విముక్తుడగును. గయా శిరస్సున శ్రాద్ధము చేయువాడు నూరు వంశములను ఉద్ధరించును. గయా గమనమునకై ఇంటి నుండి పుత్రుడు బయలుదేరినంత మాత్రమున (ఆతని) అడుగడుగున పితరులకు స్వర్గారోహమున మెట్లెక్కుట జరుగును. గయకు పోవుచున్నవానికి అడుగడుగున అశ్వమేధ యాగమున వచ్చు పూర్తి ఫలము నిశ్చయముగావచ్చును. సంశయ ములేదు. పాయసముతోగాని, చరువుతోగాని, సక్తువు (పేలపిండి)తోగాని, గోధుమపిండితో గాని, బియ్యముతోగాని, ఫలమూలాదులతోగాని గయలో పిండమును పెట్టవలెను. నూవుల కల్కము (ముద్ద)తోగాని నేయితో కూడిన శర్కరతోగాని, బెల్లముతోగాని, ఫలమూలా దులతోగాని గయలో పిండమును పెట్టవలెను. నూవుల కల్కము (ముద్ధ)తోగాని నేయితో కూడిన శర్కరతోగాని, బెల్లముతోని, కేవలము పెరుగుతోగాని, ఊర్జముతో కూడిన తేనెతో గాని పిండమును పెట్టవలె. నేతితోగూడిన ఖండము (ఖండశర్కర), నూవుల ముద్దయు

పితరులకు అక్షయము (అక్షయమును ఇచ్చునది). వార్తవమైన (నీరోగమై బలిష్టమైన) భుజింపతగిన పదార్థము, మునులు చెప్పిన హవిష్యాన్నము పితరులకు అక్షయమును ఇచ్చునవి. రసవంతములై తీయనివైన సర్వవస్తువులు ఒకయెత్తు, విష్ణుపాదకమలముల స్మరించిన ఫల్గు తీర్థజలము ఒక యెత్తు (రెండు సమాన ఫలములు). పిండము ఉంచుట, పిండమును ఇచ్చుట, మరల ప్రత్యవనేజనము చేయుట (దర్భలపై నీళ్లు జల్లి పాదములు కడుగుట), దక్షిణ, అన్న సంకల్పము–ఇది తీర్థశ్రాద్ధములందలి విధి. పండితులు, ఆవాహనము, దిగ్బంధము, దృష్టిదోషము కలుగుట–ఇవిలేకయే కారుణ్యముతో తీర్థ శ్రాద్ధమును చేయవలెను. ఇతర స్థలములో నావాహితులు అయినను పితరులు సకాలమున గయా క్షేత్రమునకు వత్తురు. ఈ తీర్థమున పితరులు ఎల్లప్పుడును ఉందురు. కావున ఇట వారి ఆవాహనము అక్కరలేదు. ఫలమును కాంక్షించి ఇట తీర్థ శ్రాద్ధముచేయు పురుషులు ఎల్లప్పుడు కామమును, క్రోధమును, లోభమును వదిలి శ్రాద్ధక్రియను చేయ వలెను. ఇచట బ్రహ్మ చారియై ఒకపూట భోజనము చేయువాడై, భూమియందు మాత్రము పడుకొనువాడై, సత్యమే పలుకువాడై, పవిత్రుడై, సర్వప్రాణుల హితమునందు ఆసక్తుడై ఉండవలెను. వాడు తీర్థ ఫలమునందును. ధీరుడై తీర్థములను అనుసరించుచు ముందే పాషండమును వదలవలెను. స్వేచ్ఛగా కామమును బట్టి ఆచరించువాడు పాషండుడు అని తెలియవలెను. తీర్థములందు తద్గత చిత్తులై కర్మలచేయు ధీరులైన నరులు, బ్రహ్మవేత్తలు అనన్యచేతస్కులై (తదేక చిత్తులై) వేద్యమైన బ్రహ్మతత్త్వమును ప్రవేశించినట్లే, బ్రహ్మ పరాయణులై పరేశుడను బ్రహ్మను ప్రవేశింతురు. ముల్లోకములలో ప్రసిద్ధి చెందిన వైతరణిఅను నది పితరులను తరింపచేయుటకై గయా క్షేత్రమున అవతరించినది. వైతరణీ నదిలో స్నానము చేసినవాడును, గోదానము చేసినవాడును ఇరువదియొక్క తరముల వంశమును ఉద్ధరించును. అట్లే అక్షయ వటమును (శాఖలను)చేరి బ్రాహ్మణులను సంతోష పెట్టవలెను. బ్రహ్మత్వబుద్ధి నుంచి పిలిచిన (శ్రాద్ధ) బ్రాహ్మణులను హవ్యకవ్యాదులతో అర్చింపవలెను. వారు సంతోషించినచో పితరులతో పాటు సమస్త దేవతలును సంతో షింతురు. గయలో తీర్థములేని స్థలములేదు. అది సర్వతీర్థములకు సన్నిధానము. అందు వలన గయా తీర్థము శ్రేష్ఠమైనది. మీనరాశిలోను, మేషరాశిలోను, కన్యారాశిలోను, ధనూరాశి లోను, కుంభరాశిలోను సూర్యుడు ఉన్నపుడు ముల్లోకములలోను అంతటి మహాత్మ్యము లభ్యముకాని గయా క్షేత్రమున పిండము పెట్టవలెను. అట్లే మకరరాశిలో సూర్య చంద్రుల గ్రహ ణము జరుగుచుండగా గయా శ్రాద్ధము ముల్లోకములలో దుర్లభమై నది. కావున అపుడు గయా శ్రాద్ధము చేయుట ఉత్తమము. గయలోపిండ దానమున నరుడు పొందు ఫలము ఇంతటిదని నేను కల్పకోటి శత సంవత్సరములలో కూడ చెప్పనలవికాదు. (43)

గయా మాహాత్మ్యము-1

నారదుడు ఇట్లు అనెను :

గయాసురుడు ఎట్లు జన్మించెను ? ఆతని ప్రభావ మెట్టిది? అతడు ఎట్టి స్వరూపము గలవాడు. ఆతడు తపమెందులకు జేసెను? ఆతనికి దేహ పవిత్రత ఎట్లు కలిగినది?

సనత్కుమారుడు ఇట్లు అనెను :

దేవదేవుడైన విష్ణువు చెప్పుటచే విష్ణు నాభికమలము నుండి పుట్టిన లోకపితామహుడు అయిన బ్రహ్మ ప్రజలను సృజించెను. ముందు అసుర (రాక్షస) భావముతోనే అసురుల సృజించెను. చక్కని సుమనోభావముతోనే దేవతలను సుమనస్కులుగా సృజించెను. గయాసురుడు అసురులలో మహాబలపరాక్రమములు కలవాడు. నూట ఇరువది అయిదు యోజనములు ఆతనిఎత్తు. అరువది యోజనముల లావుగలవాడు. శ్రేష్ఠుడైన ఈతడు వైష్ణవుడు. కోలాహలమను పర్వత శ్రేష్ఠమున ఈతడు దారుణమైన తపము చేసెను. అనేకములైన వేలయేండ్లు నిరుచ్ఛ్వాసముగా (ఊపిరి పీల్చక) స్థిరముగా నుండెను. ఆతని తపస్సుతో తపింపబడినవారై దేవతలు మిక్కిలి సంక్షోభము చెందిరి. తరువాత, బ్రహ్మలోకమునకు పోయి బ్రహ్మతో ఓ దేవా! గయాసురుని నుండి (మమ్ముల) రక్షింపుము అనిరి. అంత బ్రహ్మ వారితో శంకరుని కడకు వెళ్లెదమనెను. బ్రహ్మాదులు కైలాసమున శివుని కడకుపోయి నమస్కరించి, దేవా! మహాసురుని నుండి రక్షింపుమనిరి. శివుడు బ్రహ్మాదులతో హరి శరణమునకు వెళ్లెదమనెను. "పాల సముద్రమున ఆ దేవదేవేశుడు ఉండును. ఆతడు మనకు శ్రేయమును చేయగలడు" అనెను. అంత బ్రహ్మమహేశ్వరుడు దేవతలును విష్ణువు కడకు వెళ్ళి నమస్కరించి స్తుతించిరి.

దేవతలు ఇట్లు అనిరి :

ఓంకార స్వరూపుడవై సర్వవ్యాపియైన విష్ణువునకు భరించువానికి, సర్వులకు సమర్థప్రభువైన వానికి, ప్రకాశించువానికి, జయించువానికి, రాక్షసాదులను గ్రసించు వానికి, ఈ విశ్వమునంతయు ధరించువానికి, యోగులను తరింపజేయు సామర్థ్యము గలవానికి, విశ్వమునందు అంతటను వృద్ధి జెందువానికి, అంతము లేనివానికి జ్యోతిస్సు లలో బ్రకాశించువానికి నమస్కారము.

సనత్కుమారుడు ఇట్లు అనెను :

ఈ విధముగా స్తుతింపబడిన వాసుదేవుడు దేవతలకు దర్శనమిచ్చెను. ఓ దేవతలారా! మీరెందులకు వచ్చితిరి అనగా దేవతలు ఆ విష్ణువుతో "ఓ దేవా! గయాసుర భయము

నుండి మమ్ముల రక్షింపుడు" అనిరి. అంత హరి–"బ్రహ్మాదులు ఆ రాక్షసునికడకు వెళ్లుదురు గాక. నేనుకూడ వచ్చుచున్నాను" అనెను. కేశవుడు గయా సురునకు వరమిచ్చుటకు గరుడారూఢుడై వెళ్లెను. తక్కిన అందరు దేవతలును వారివారి ఉత్తమ వాహనముల నెక్కి గయాసురుని కడకు వెళ్లిరి. వాసుదేవాదులు గయాసురా! నీవు ఎందులకు తపము ఆచరించుచున్నావు? సంతుష్టులై సర్వదేవతలు చక్కగా వచ్చియున్నారు. నీవు కోరు వరమేమో చెప్పుము.

గయాసురుడు ఇట్లు అనెను :

ఓ బ్రహ్మ–విష్ణు–మహేశ్వర దేవతలారా! మీరు నా తపమునకు సంతుష్టులైనచో సర్వదేవ–బ్రాహ్మణ–క్షత్రియ–వైశ్యులకన్నను, యజ్ఞ–తీర్థ–పర్వతములకన్నను, దేవతలకన్నను, ఋషులకన్నను, శివరూపమైన అవ్యయమున కన్నను, మంత్రముల కన్నను, దేవదేవులకన్నను, యోగులకన్నను, న్యాసము చేయు కర్మలకన్నను, తరువాత ధర్మము చేయువారి అందరికన్నను, అతి పవిత్రులైన జ్ఞాతులకన్నను ఎల్లప్పుడు నేను పవిత్రుడను కావలెను అని వరము అడిగెను. త్రిమూర్తి దేవతలు ఆ అసురుని అట్లే పవిత్రత నీకు గలుగుగాక అని వరమిచ్చి స్వర్గమునకు పోయిరి. దైత్యుని చూచియు, తాకియు, అందరు వైకుంఠమునకు చనిరి. అపుడు లోకత్రయము శూన్యమయ్యెను. యమపురికూడ శూన్యమయ్యెను. అంత, యముడు ఇంద్రాదులతో బాటు బ్రహ్మ లోకము నకు వెళ్లెను. గయాసురునిచే విలోపము చెందింపబడినవారై దేవతలు బ్రహ్మతో – "ఓ పితామహా! బ్రహ్మదేవా! నీవు ఇచ్చిన అధికారమును (గయాసురుని నుండి) మరల తీసికొనుము" అనిరి. అంత వారు బ్రహ్మతో కలిసి అవ్యయుడైన విష్ణువు కడకు పోయిరి. ముల్లోకములు శూన్యములు అయినవి అని అనిరి. దేవతలు ఈ విధముగా చెప్పగా వాసుదేవుడు బ్రహ్మతో ఇట్లనెను. "నీవు వెళ్లి గయాసురుని యజ్ఞమునకై తన దేహమును ఇమ్మని ప్రార్థించుము అని విష్ణువు చెప్పగా దేవతలతో సహా బ్రహ్మ వెళ్లి గయాసురుని చూచెను. గయాసురుడు బ్రహ్మను దేవతలను చూచి, పూజించి, లేచి విధి విధానమున శ్రద్ధతో నమస్కరించి ఇట్లనెను.

గయాసురుడు ఇట్లు అనెను :

"ఈనాడు నా జన్మ సఫలము. ఈనాడు నా తపము సఫలము. బ్రహ్మ అతిథిగా నా కడకు వచ్చినందున ఈనాడు నాకు సమస్తము లభించినది. ఓ యోగీ! యోగాంగ వేత్తా! సర్వలోకస్వామీ! తండ్రీ! గురో! ఓ బ్రహ్మ నీవు వచ్చిన కార్యమును చేసిపెట్టెదను.

అనగా బ్రహ్మ ఇట్లు అనెను :

భూమియందు యజ్ఞమునకై తిరుగుచు నేను చూచిన తీర్థములు అన్నియు నీ శరీర మున కన్న పవిత్రములు కావు. విష్ణువు అనుగ్రహమున నీవు శరీరమున సర్వ పవిత్ర త్వమును అందితివి. కావున యజ్ఞమునకై ఓ అసురా! నీ పవిత్రమైన దేహమును నాకు ఇమ్ము.

గయాసురుడు ఇట్లు అనెను :

ఓ దేవదేవేశా! నీవు నా దేహము అడిగినందున నేను ధన్యుడను. నా దేహమున యాగము చేసినచో నా పితృవంశము కృతార్థము (ధన్యము) అగును. నీవే ఈ దేహమును పుట్టించితివి. నీవే దీనిని పవిత్రము చేసితివి. సర్వుల ఉపకారమునకై ఈ దేహమున యాగము తప్పక జరుగుగాక అని గయాసురుడు శ్వేత కల్పమున అపుడు కోలాహల పర్వతముపై గల, భూమిపై నైరృతి దిక్కును ఆశ్రయించి, ఉత్తరము వైపున శిరముంచి, దక్షిణము వైపున పాదములు ఉంచి పరుండెను. బ్రహ్మయు యజ్ఞసంభారములు అన్నియు సంపాదించి, మానసికముగా ఋత్విజులను సృజించెను. వారు : అగ్నిశర్మ, అమృతుడు, శౌనకుడు, యాంజలి, మృదువు, కుముధి, వేదకౌండిల్యుడు, హారీతుడు, కాశ్యపుడు, కృపుడు, గర్గుడు, కౌశిక వాశిష్ఠులు, అవ్యయుడు, భార్గవముని, వృద్ధుడైన పారాశరుడు, కణ్వుడు, కేవల శ్రుతి శక్తిగల మాండవ్యుడు, శ్వేతుడు, సుతాలుడు, దమనుడు, సుహోత్రుడు, కంకుడు, లౌకాక్షి, మహాబాహువైన జైగీషవ్యుడు దధి పంచముఖుడు, విప్రుడైన ఋషభుడు, కర్కుడు, కాత్యాయనుడు, గోభిలుడు, ఉగ్రముని, మహావ్రతుడు, సుపాలకుడు, గౌతముడు, వేదశిరోవ్రతుడు, జటామాలి, అవ్యగ్రుడు, చాటుహాసుడైన దారుణుడు, ఆత్రేయుడు, అంగిరసుడు, మహావ్రతుడైన ఔపమన్యుడు, గుహావాసియైన గోకర్ణుడు, ఉమావ్రతుడైన శిఖండి అనువారు–వీరిని, మరికొందరిని బ్రాహ్మణోత్తములను లోకపితామహుడైన బ్రహ్మ మనసుతో పరికల్పించి, గయాసుర శరీరమున యాగమును చేసెను. అంత, అగ్నిశర్మయు పంచాగ్నులను సృజించెను. దక్షిణాగ్నిని, గార్హపత్యాహవనీయములను, తపోఅవ్యయుడై సత్యావసథ్యములను సృజించెను. ఈ అగ్నులలో యజ్ఞములు ప్రతిష్ఠితములైనవి. యజ్ఞము యొక్క ప్రతిష్ఠ కొఱకు బ్రాహ్మణులకు దక్షిణ ఇచ్చెను. పూర్ణాహుతి హోమమునుచేసి, అవబృథ స్నానము చేసి, సురలతో బాటు యజ్ఞయూపమును తెచ్చి వ్యరోపింపచేసెను (నిలిపెను). సరస్సులలో శ్రేష్ఠమైన బ్రహ్మ సరస్సునందే శుభము ఆశ్రయించినది. అసురుడు చలితుడైనందున ఆశ్చర్యము చెందిన బ్రహ్మ (యమ) ధర్మరాజుతో నీ యొక్క గృహమున శిల పుట్టినది. విచారింపకుండ దానిని తెచ్చి, నా ఆజ్ఞచే దానిని ఈ అసురుని శిరమున

శీఘ్రముగా ధరింపచేయుము అని పలికెను. అది విని, అసురుడు చలింపకుండుటకై అతని శరీరమున ఆ శిలను ధరింపచేసెను. కాని శిలను ధరింపగనే ఆ శిలతోబాటు అసురుడు కదిలెను. తరువాత బ్రహ్మరుద్రాది దేవతలతో–దేవతలు అందరును ఆ శిలపై కదలక నిలచి ఉండుడు–అనెను. అనగనే దేవతలు అట్లేఅని శిలపై నిలిచిఉండిరి. అంత, దేవతలు తమ పాదముల ద్వారా–అట్లు తాము శిలపై నిలచియున్నను అసురుడు చలితుడ య్యెనని కనిపెట్టిరి. బ్రహ్మ, వ్యాకులుడై పాలసముద్రమున పడుకొని ఉన్న విష్ణువు కడకు వెళ్లెను. ఆ ప్రభువునకు నమస్కరించి ఆదరించి స్తుతించెను.

బ్రహ్మ ఇట్లు అనెను :

ఓ బ్రహ్మాండపతీ! నాథా! జగత్పతివి, కీర్తిమంతులైన మానవులకు గతియు, భుక్తిముక్తి ప్రదాయకుడును అయిన నీకు నమస్కరింతును అని స్తుతించెను. అంత విష్వక్సేనుడు దేవా! బ్రహ్మ నిన్ను స్తుతించుచున్నాడు అనెను. అనగానే హరి నీవు అతనిని తీసికొని రమ్మనెను. అనగనే విష్వక్సేనుడు ఆ బ్రహ్మను విష్ణువు కడకు తీసికొనివచ్చెను. హరి బ్రహ్మతో–అకస్మాత్తుగా వచ్చితివి. దానికి కారణమైన విషయమును చెప్పుము. అనగనే– బ్రహ్మ అనెను : ఓ దేవదేవా ! గయాసురుని దేహముపై యాగము చేయగనే దేవరూపిణి అయిన శిలను వాని శిరముపై ఉంచినను గయాసురుడు చలించెను. ఆ శిలపైన రుద్రాదిదేవతలందరు నిలిచియున్నను, ఆ అసురుడు చలించెను. ఓ మాధవా! వాడు నిశ్చలుడు అగుటకు అనుగ్రహింపుము అని బ్రహ్మ అనగానే విని హరి తన శరీరము నుండి ఒక మూర్తినిలాగి ఆ అసురుడు నిశ్చలుడు అగుటకై దానిని బ్రహ్మకు ఇచ్చెను. బ్రహ్మయు ఆ మూర్తిని ఆ శిలయందు ధరింపజేసెను. అట్లైనను అసురుడు చలించగా బ్రహ్మ మరల విష్ణుదేవుని పిలిచెను. పాలసముద్రము నుండి విష్ణువు వచ్చి ఆ శిలయందు జనార్దనుడను పేరను, పుండరీకుడను పేరను స్వయముగా ఆ దిగదాధరుడై అసురుడు నిశ్చలుడగుటకై నిలచినవాడు అయ్యెను. అసురుడు నిశ్చలుడు అగుటకు విష్ణువు ఆ శిలయందు ఐదు విధములుగా ఉండెను. ప్రపితామహుడు, పితామహుడు, ఫల్గ్వీశుడు, కేదారుడు, కనకేశ్వరుడు–అనునవి ఐదు విధములైన రూపములు. అచట బ్రహ్మ స్వయ ముగా అచట గజరూపి అయిన వినాయకుడుగా ఉండెను. అచట రవి గయాదిత్యుడు అనియు, ఉత్తరార్కుడు అనియు దక్షిణార్కుడనియు మూడు విధములుగా ఉండెను. లక్ష్మి, సీత అను పేరను, గౌరి, మంగళ అను పేరను, గాయత్రి, సావిత్రి త్రిసంధ్య అయిన సం స్వతియు, ఇంద్రుడు, బృహస్పతి, పూషుడు, మహాఋషులు అయిన వసువులు ఎనమండుగురు, ఆశ్వినేయులైన విశ్వేదేవులు, విశ్వనాయకుడైన మారుతుడు, యక్ష–

రక్షో–గంధర్వులతో సహా దేవతలందరు తమ శక్తులతో నా శిలయందు నిలిచిరి. మొదటి గదతో విష్ణువు వలన ఆ అసురుడు నిశ్చలుడుగా చేయబడినందున విష్ణువు ఆది గదాధరుడు అయ్యెను.

గయాసురుడు దేవతలతో "నేను ఎందులకు వంచింపబడితిని? నా పవిత్రమైన శరీరమును యజ్ఞమునకై బ్రహ్మకు ఇచ్చితిని. విష్ణువు యొక్క వచన మాత్రముచే నేను నిశ్చలుడనుకాకుంటినా? దేవతలతో మిక్కిలి బాధింపబడితిని. అట్లే విష్ణువుచే తన గదతో పీడింపబడితిని. నేను పీడింపబడినచో దేవతలు ఎల్లప్పుడు ప్రసన్నులు అగుదురుగాక అని పలికెను. అంత, విష్ణువు మొదలగువారు సంతుష్టులై గయాసురునితో–మేము ప్రసన్నులము అయితిమి, వరమును అడుగుము–అనగానే గయాసురుడు భూమి, పర్వతములు ఉన్నంతవరకు, చంద్ర–సూర్య–తారకలు ఉన్నంత వరకును, బ్రహ్మ–విష్ణు–మహేశ్వరులు ఇతరులైన సకల దేవతలును (ఈ నాపై ఉన్న) శిలయందు ఉందురుగాక. ఈ క్షేత్రము నా పేరనే గయా క్షేత్రముగా వరలుగాక. ఐదు క్రోశములుగలది గయాక్షేత్రము. ఒక క్రోశము గయాశిరము. దాని మధ్యన సర్వ తీర్థములుండి మానవులకు హితమును కూర్చుదునుగాక. స్నానాది తర్పణములుచేసి పిండదానము వలన ఫలముగా మహాత్ముడై నరుడు ఐదువేల వంశమును ఉద్ధరింపవలెను. ఇచట మీరు కూడ ఎల్లప్పుడు వ్యక్తావ్యక్త రూపమున ఉండుడు. లోకమునుండి సర్వపాపముల నశింపజేసినందున విష్ణువిట స్వయముగా గదాధరుడు అగుగాక. ఇచట సపిండక శ్రాద్ధము జరిగినవారు బ్రహ్మ లోకమును పొందుదురు గాక. గయను సేవించిన వారికి బ్రహ్మ హత్యాది పాపములు నశించుగాక. ఓ దేవతలారా! నైమిశము, పుష్కరము, గంగ, ప్రయాగ, అవిముక్తము, ఇవి మరి ఇతర క్షేత్రములును దివము నుండియు భూమి నుండియు అంతరిక్షము నుండియు ఇచ్చటికి వచ్చి చేరిన నరులకు హితమును గూర్చుగాక. పలుమాటలేల! ఓ దేవగణములారా! మీలో ఒక్క దేవతకూడ ఇటలేకున్నచో నేనుకూడ ఉండను–ఈ ఒప్పందము పాటింపబడుగాక. గయాసురుని మాటలు విని విష్ణ్వాది దేవతలు–నీవు కోరినది అంతయు నిస్సంశయముగా జరుగుననిరి. అచట మా పాదములను అర్చించి నరులు పరమపదమును పొందుదురు. ఈ విధముగ దేవతలచే వరము పొందిన గయాసురుడు సంతుష్టుడై నిశ్చలుడయ్యెను. ఆ విధముగా అచట దేవతలందరు ఉండగా, బ్రహ్మ బ్రాహ్మణులకు ఏబది అయిదు గ్రామములను, ఐదు కోసుల గయను, సకల సౌకర్యములతో కూడిన దివ్యగృహములను నిర్మించి ఇచ్చెను. కామధేనువును, కల్పవృక్షమును, పారిజాతాది వృక్షములను, పాలను ప్రవహించు మహానదిని, నేతి

కాలువలను, తేనెలుజాలువారు తేనె కాలువలను, పెరుగు మొదలగు వానితో ఏర్పడిన గొప్ప సరస్సులను, బంగారు బావిని, అనేకములైన అన్నాది పర్వతములను, భక్ష్య-భోజ్య-ఫలాదులను, సమస్తమును బ్రహ్మ సృజించి ఇచ్చెను. అట్లు ఇచ్చి ఆదిగదాధరుడు అయిన విష్ణువునకు నమస్కరించి బ్రహ్మ. తన లోకమునకు పోయెను. అచట ధర్మారణ్యమున (యమ) ధర్మరాజును యజ్ఞము చేయించి బ్రాహ్మణులు ఆ ధర్మ యాగమున లోభము వలన ధనాదికము అడిగి తీసికొనిరి. అంత బ్రహ్మ అచ్చటికి వచ్చి బ్రాహ్మణులను శపించెను. ఓ బ్రాహ్మణులారా! నేను ఇచ్చినవి అన్నియు ఉన్నను లోభించి ధర్ముని మరల ధనమడిగి తీసికొంటిరి. కావున ఎల్లప్పుడు మీరు ఋణాధికులు (అప్పులెక్కువ కలవారు) అగుదురు. నీరు ప్రవహించు మీ నది పాషాణ పర్వతమయమగును. నీరు ప్రవహించు నద్యాదులు గృహములును మట్టితో నిండిపోవును. కామధేనువు కల్పవృక్షము నా లోకమునకు వచ్చును. ఈ విధముగా శపింపబడిన బ్రాహ్మణులు బ్రహ్మతో ఇట్లనిరి. "నీవు ఇచ్చినది అంతయు నీ శాపముతో పోయినది. మా బ్రతుకు తెరువునకై ఓ భగ వంతుడా! అనుగ్రహింపుము. అది విని బ్రహ్మ దయగలవాడై బ్రాహ్మణులతో ఇట్లనెను. తీర్థమును ఉపజీవికగా (జీవనాధారముగా జేసికొని) మీరు ఆచంద్రతార్కము ఉందురు. గయా శ్రాద్ధమును ఆచరించిన లోకులు బ్రహ్మ లోకమును పొందుదురు. ఇచట మిమ్ములను పూజించినవారు, నన్ను ఎల్లప్పుడు పూజించినవారు అగుదురు. ధర్మరూపియైన విరజాద్రిచే గయాసురుని జఠరము (జీర్ణకోశము) ఆక్రమింపబడినది. నాభికూప సమీపమున విరజాదేవి ఉండును. అచట పిండాదికమును చేసినవాడు ఇరువది యొక్క తరముల వంశమును ఉద్ధరించును. మహేంద్ర పర్వతము చేత గయాసురుని పాదములు నిశ్చల ములుగా చేయబడినవి. అచట పిండదానాది కర్మలను చేయు నరుడు ఏడు తరముల వంశమును ఉద్ధరించును. (44)

గయా మాహాత్మ్యము- 2

నారద మహర్షి :

"గయాసురుని ఆక్రమించిన శిల ఎట్లు పుట్టినది. దాని రూపమేమి? మాహాత్మ్య మేమి? దాని పేరేమి?" అని అడిగెను. ఆ ప్రశ్నను వినిన సనత్కుమారుడు వారితో ఇట్లు అనెను : సర్వవిజ్ఞాన పారగుడు, మహాతేజస్వియు అయిన ధర్ముడు అనువాడు ఉండెను. ఆతని భార్య విశ్వరూప ఆమె భర్తృవ్రత పరాయణురాలు. ఆమె యందు ధర్మునకు ధర్మవ్రతఅను సతి (పతివ్రత) కన్య జనించెను. ఆమె సర్వలక్షణ సంపన్న. లక్ష్మివలె

గుణాధికురాలు. మూడు జగములలో ఉండు సద్గుణములన్నియు ఆమె యందు ఉండెను. ధర్ముడు ధర్మవ్రతకు తగిన వరునకై ముల్లోకములలో వెదకినను అనురూపుడైన వరుడు లభింపలేదు. అంత, ధర్ముడు వరసిద్ధికై నీవు తపము చేయుమని పుత్రికకు చెప్పెను. ఆమె ఉన్నది ఉన్నట్లే తపమునకై వనమునకు ఏగెను. లక్షయుగములకు పూర్వము శ్వేతకల్పమున ఆమె వాయుభక్షణము మాత్రముచేసి అందరికి సాధ్యముగాని తపము చేసెను. బ్రహ్మకు మానస పుత్రుడు మరీచిఅని ప్రసిద్ధి చెందినవాడు కలడు. ఆతడు భూమి అంతయు తిరుగుచు ఈ కన్యారత్నమును చూచెను. రూప, యౌవన సంపన్నయై పరమ తపమున ఉన్న ఆమెను మరీచి–నీవు ఎవ్వతెవు? ఎవ్వరిదానవు? నీ వృత్తాంతము చెప్పుమని అడిగెను. ఓ సువ్రతురాలా! భయశీలురాలా! ఈ రూపముతో నన్ను మోహింప చేయుచున్నావు. నేను బ్రహ్మయొక్క తేజోరూపుడను (పుత్రుడను), వేదముల అంతమును తెలిసినవాడను మరీచి అని ప్రసిద్ధి చెందినవాడను అని మరీచి అనగా విని, ఆ కన్య మునితో–నేను ధర్మవ్రత అను ధర్మపుత్రిని, తపోన్వితను. బ్రాహ్మణ శ్రేష్ఠా! పతివ్రత అగుటకు పరమ తపస్సును చేయుచున్నాను. అనగా మరీచి ఆ ధర్మవ్రతతో ప్రేమ పూర్వకముగా ఇట్లనెను. ఓ శుభవ్రతురాలా! నాకు నీకు పతివ్రతగా కనబడుటచే నీవు నాదానవు అనిపించుచున్నది. నేను పతివ్రతను పొందు కోరికతోనే, రాత్రింబవళ్లు భూమిలో తిరుగుచున్నాను. నీవు పతివ్రతవు అయినచో నిన్ను నేను పొందెదను. నన్ను నీవు వరునిగా పొందుము. లోకమున నీవంటి కన్యలేదు. నాతో సమానము అయిన వరుడు నీకును లేడు. కావున ఓ ధర్మవ్రతా! ఇప్పుడే నీవు నాకు ధర్మపత్నివి కమ్ము అనగనే ఆ కన్య ధర్మవ్రతమునిని తన తండ్రియైన ధర్ముని అడుగుము అనెను. మరీచిముని ధర్ముని కడకు పోయెను. ధర్ముడు ఆతనినిచూచెను. తేజస్సుల గుంపువలె ఉన్న ఆ వరునకు నమస్కరించి ఆసన–అర్ఘ్యాదులతో పూజించెను. ఎందులకు వచ్చితివని అడుగగా మరీచి ధర్మునితో కన్యకకై భూమియందు తిరుగుచు శ్రేష్ఠురాలైన ఈ కన్యను చూచితిని. ఆ కన్యను నాకిమ్ము. నీకు శ్రేయము కలుగగలదు అని అనెను. ఆ మాటలను వినిన ధర్ముడు ఆతనిని అర్ఘ్యాదులచే పూజించి–అట్లే అనెను. ధర్మవ్రతను తీసికొని వచ్చి ఆమెను మరీచికిచ్చెను. ఆతనికి వరమునుకూడ ఇచ్చెను. ధర్ముని మాట ఈ విధముగా ఆచరింప బడినది. అగ్నిహోత్రముతోపాటు ఆ ధర్మవ్రతను మరీచి తన ఆశ్రమమునకు తీసికొని పోయెను. ఆచట ముని ఆమెతో విష్ణువు లక్ష్మితోవలె, శివుడు పార్వతితోవలె, బ్రహ్మ సరస్వతితోవలె క్రీడించెను. ఆమెయందు మరీచికి విష్ణువుతో సమానులైన నూరుగురు పుత్రులు కలిగిరి. ఒకనాడు మరీచి ఫలపుష్పములకై వనమునకు వెళ్లి వచ్చెను. అలసిన

ఆతడు భుజించి ఆ పతివ్రతయైన తన భార్యను పడకపైనున్న తనకు కాళ్లనొత్తు మనెను. ధర్మవ్రత అట్లేయని, పడకపైనున్న మునిపాదములకు శ్రద్ధతో నేయి రాచి సంవాహనము చేసెను (రుద్దెను). అపుడు ముని నిద్రబోవుచుండగా ఆ ప్రదేశమునకు బ్రహ్మ వచ్చెను. ధర్మవ్రత బ్రహ్మనుచూచి ఆ ప్రభువును అర్చింపవలెనని మనమున తలచెను. ఈతడు జగద్గురువు పూజ్యుడు. భర్తకు పాదసంవాహనము చేయుదునా? లేక బ్రహ్మను పూజింతునా? అని వ్యాకులురాలై లేచెను. బ్రహ్మను తన గురువైన (భర్తయైన) మరీచికి గురువని (తండ్రియని) తలంచి అర్ఘపాద్యాదులనిచ్చి బ్రహ్మను పూజించెను. శయ్యను గూడ ఏర్పరుచగా బ్రహ్మ విశ్రమించెను. ఇంతలో భర్త శయ్యనుండి లేచెను. ధర్మవ్రతను తనశయ్యపై చూడక మరీచి కోపించి ఆమెను శపించెను. నా పాద సంవాహనమును వదిలి, ఈ విధముగా నా ఆజ్ఞను ఉల్లంఘించి వేరొక చోటికి పోయితివి. ఆ పాపము వలన నా శాపముచే దగ్ధురాలవై శిలవు కమ్ము ! అని శపించెను. భర్తచే శపింపబడిన ధర్మవ్రత కోపముతో–నీవు పడుకొనుచుండగా నీ గురువైన తండ్రి వచ్చెను. అపుడు నీవు లేచి నీ తండ్రికి పూజనము చేయవలెను. నీ సహధర్మచారిణియైన, నేను నీవు చేయ వలసి నీతండ్రి పూజనమునుచేసితిని. ఈ విధముగ దోషములేని నన్ను శపించితివి. కావున నేను నీకు శాపమిత్తును. ఓ భర్తా! నీవు మహాదేవుని వల్ల నిశ్చయముగా శాపమును పొందెదవు అని శాపమును ఇచ్చెను. అంత వ్యాకులుడైన పతినిచూచి తాను వ్యాకులయై బ్రహ్మదగ్గరికు వెళ్లి నమస్కరించి, నిద్రించుచున్న బ్రహ్మను కట్టెలతో అగ్నిని ప్రజ్వలింపజేసి గార్హపత్యాగ్నిలో ఉన్నదై మిక్కిలి దుష్కరమైన తపమును చేసెను. పతివ్రత యొక్క తపముచేతను, మరీచియొక్క తపము చేతను ఇంద్రాదులు సంతప్తులై విష్ణువును శరణము పొందిరి. తపస్సంతపులు అయిన దేవతలు పాలసముద్రమున పరుండియున్న విష్ణువుతో– ఓ హరీ! కేశవా! పతివ్రతనుండియు, మునినుండియు ముల్లోకములను రక్షింపుమని వేడుకొనిరి. ఇంద్రాదుల మాటలు విని విష్ణువు ధర్మవ్రత కడకు పోయెను. ఈ కాలములోనే భగవంతుడైన బ్రహ్మ మేలుకొనెను. విష్ణువుతో కూడిన దేవతలు అగ్ని యందున్న ధర్మవ్రతతో ఓ పతివ్రతా! అగ్నిమధ్యన తపము చేయుటకు ఎవరికిని శక్తి చాలదు? సర్వలోక భయంకరమైన ఆ అగ్నిమధ్య తపమును నీవు చేసితివి. ఓ ధర్మజ్ఞురాలా! మానుండి నీ అభీష్టమైన వరమును కోరుకొమ్ము అని పలికిరి. విష్ణ్వాదుల ఈ మాటలు విని ధర్మవ్రత దేవతలతో ఇట్లనెను. నా తేజముతో భర్త ఇచ్చిన శాపమును నివర్తింప చేయుటకు అశక్తురాలను అయితిని. అసహ్యమైన మరీచి ఇచ్చిన శాపము మరలిపోవుకాక ! అను ధర్మవ్రత మాటలువిని దేవతలు మరల ఆమెతో ఇట్లనిరి. ధర్ముని పుత్రివైన ధర్మవ్రతా !

ఈ శాపము పరమర్షిచే ఈయబడినది. దేవ బ్రాహ్మణులతో అది నివారింప శక్యముగాదు. ఓ శుభవ్రతురాలా! ముల్లోకములో వేదోక్త ధర్మ సంస్థాపనము జరుగు మరొక వరమును కోరుకొనుము. అని దేవతలు అనగనే ధర్మవ్రత దేవతలతో భర్త శాపమునుండి నన్ను మీరు విముక్తురాలిని చేయలేనపుడు, మీరు నాకు ఈ విధమైన ఉత్తమ వరము ఈయుడు. నేను శిలనగుదును. అది బ్రహ్మాండమునే పవిత్రము చేయునది శుభమైనది కావలెను. అది నదీ-నద, సరస్-తీర్థ-దేవాదులకన్నను అతి పవిత్రకారి కావలెను. అది ఋష్యాదుల కన్నను, మునులకన్నను, ముఖ్య దేవతలకన్నను, పవిత్రకారి కావలెను. ముల్లోకమున ఉన్న వ్యక్తావ్యక్త లింగములన్నియు నా దేహమున తీర్థరూపమున ఎల్లప్పుడు ఉండవలెను. సమస్త తీర్థములు, నక్షత్రములు మొదలగునవియు, సమస్త స్త్రీ, పుందేవతలు, మునులును నా దేహమున ఉండవలెను. బ్రహ్మ-విష్ణు-రుద్రులు వారి పాదముల గుర్తులను నాపైన నుంచవలెను. పంచాగ్నులు, కుమారాదులును బహురూపములతో నాయందు ఉండ వలెను. దేవతలు మూర్తామూర్త స్వరూపములతోను, పదరూపముననను, క్రోశ మాత్రముతో శిలయందు అమూర్త రూపముననను భూమిలో మూర్తరూపముననను ఉండవలెను. మహాపాతక నాశినియగు ఆ శిలనుచూచి సర్వలోకము పవిత్రము కావలెను. అచట శ్రాద్ధము చేయువాడు ధర్మాధికారియై బ్రహ్మలోకమును చేరువాడు కావలెను. శిలయందున్న తీర్థములలో స్నానముచేసి, తర్పణముచేసి, ఎవరికి సపిండక శ్రాద్ధమును చేయుదురో, వారు బ్రహ్మలోకమునకు పోవుదురు గాక. సర్వతీర్థోత్త మోత్తమమైన గదాధర దృశ్య తీర్థమున ఉన్నవారును, చచ్చినవారును అయిన నరులు బ్రహ్మపురిని చేరవలెను. వారాణసి, ప్రయాగ, పురుషోత్తమసంజ్ఞ కలది. గంగాసాగరసంగము కూడ నా నిస్సారమైన రాతి దేహమున నిత్యముండుగాక. ఆ సర్వతీర్థోత్తమమైన శిలాతీర్థము గదాధరుడైన విష్ణువుచే అధిష్ఠింపబడినదై అచటి శ్రాద్ధమున మృతులకును పితరులకును ఎల్లప్పుడు ముక్తి కలుగవలెను. మావివల్ల పుట్టినవారుగాని, అండమువల్ల పుట్టినవారుగాని, చెమటవల్ల పుట్టినవారుగాని, భూమిని భేదించుకొని పుట్టినవారుగాని నా శిలయందు తమ దేహమును వదిలి వారు విష్ణు స్వరూపమును పొందవలెను. హరిని అర్చించినందున సర్వ యజ్ఞములు పూర్ణములైనట్లే నా శిలయందలి శ్రాద్ధము తర్పణము స్నానము అక్షయమగుగాక. నా దేహశిలయందు చేసిన బ్రహ్మ-విష్ణు-రుద్ర-ఇంద్రాది దేవేశుల వ్రతాదులు వెంటనే ఫలసిద్ధిదాయకములగు గాక. వ్రతకర్తలు ఫలభాక్కులగుదురు గాక ! ఇచట శ్రాద్ధాదులను చేసిన నరుడు తనతోబాటు వేయితరముల పితరుల వంశమును ఉద్ధరించి నిశ్చయముగా విష్ణు లోకమును చేరవలెను. నా దేహశిలపైన శ్రాద్ధము చేయువారి విముక్తికై నదీ

శ్రేష్ఠములు అన్నియు, గంగాది నదీ నదులు, శుభములైన హ్రదములు (మడుగులు), సముద్రాదులు, మానసాది ముఖ్య సరస్సులును నాయందు నివసించుగాక ! దేవతలందరు శరీరముతో నాయందు ఉందురుగాక ! ఎక్కడికిని పోకుందురుగాక ! పండితులు ఒకే విష్ణువును బ్రహ్మ విష్ణు రుద్ర మూర్తులచే మూడు విధములుగా చెప్పుదురు. దేవతలతో పాటు వీరందరును, సర్వతీర్థములును మునులును గంధర్వ గణములును నా శిలయందు ఉందురుగాక ! ఈ శిల సర్వదేవ స్వరూపయై దేవ రూపిణియై బ్రహ్మాండము ఉన్నంత వరకుండుగాక ! నా శిలా దేహమున వారందరు జపింతురు గాక ! తపింతురుగాక ! ఇచట అగ్నిలోహోమము చేయువారికి అక్షయము సిద్ధించుగాక ! ఇచటి శ్రాద్ధము జప–హోమ–తపములు, అక్షయములు అగుగాక. ఆ జపహోమతపములు శిలాపర్వత రూపమున నాయందు ఎల్లప్పుడు ఉండుగాక అని ప్రార్థించెను. పతివ్రత యొక్క ఆ మాటలను విని దేవతలు ఆ పతివ్రతతో–"నీవు కోరినదంతయు సిద్ధింపగలదు. సంశయము లేదు" అనిరి. నీ దేహశిల గయాసురుని శిరముపై స్థిరముగా ఉన్నప్పుడు మేమందరము దేవతలము. పాదాది రూపములతో నీపైన సుస్థిరులమై ఉందుము అని చెప్పిరి. అంతట దేవతలు శిలారూపిణియైన ధర్మవ్రతకు ఈ విధముగా వరమిచ్చి అంతర్ధానము చెందిరి. (45)

గయా మాహాత్మ్యము- 3

సనత్కుమారుడు అనెను :

"ఓ నారదా! ముక్తినిచ్చు శిలా మాహాత్మ్యమును చెప్పెద వినుము. ఆ శిలామాహాత్మ్యమును దేవతలు, మునిశ్రేష్ఠులును గానము చేయుదురు. శిలయందున్న ఆ ధర్మవ్రత భూమిని మిక్కిలి పవిత్రము చేయునది. అచటి విచిత్రమను శిలాతీర్థము ముల్లోకములలో ప్రసిద్ధిచెందినది. ఆ శిలాస్పర్శవలన సర్వలోకములలోని జనులు వైకుంఠమునకు పోయిరి. అప్పుడు ముల్లోకములు శూన్యముకాగా, యమపురి కూడా శూన్యము అయ్యెను. యముడు ఇంద్రాదులతో వెళ్ళి బ్రహ్మతో ఆశ్చర్యముగ ఇట్లనెను. ఓ పితామహా, బ్రహ్మా! నా అధికారమైన యమదండమును తీసికొనుము. అనగానే బ్రహ్మ యమునితో నీ స్వగృహమున దానిని ధరింపుము అనెను. అనగానే ధర్మరాజు గృహమున దానిని ధరించెను. యముడు పాపుల శాసించుట మొదలగు తన అధికారమును నిర్వహించెను. ఈ విధముగా శిల జగమున మిక్కిలి బరువైనదని ప్రసిద్ధి చెందినది. బ్రహ్మాండమున, బ్రహ్మవలెను. విష్ణువు వలెను, మహేశ్వరుని వలెను, మేరువు వలెను ఈమె దేవరూపిణియై ఉండును. బరువైనదిగా గయాసురుని శిరమున ధరింపబడి నందున, రెండు పవిత్రముల యోగము పితరులకు

మోక్షదాయకము. రెండు పవిత్రముల యోగమున బ్రహ్మ హయమేధ యాగముచేసెను. అందలి భాగమునకై వచ్చిన విష్ణ్వాదులను చూచి శిల "పితరుల ముక్తి కొఱకు శిలయందు ఉండుమని ప్రతిజ్ఞను చేయుడు" అనగనే, అట్లేఅని ఆ శిలయందు ఆ విష్ణ్వాదులు ఉండిరి. దేవతలు శిలారూపమున ఆకారముతోను, పాదముల రూపమునను, పూర్వ ప్రతిజ్ఞచే మూర్తామూర్త (ఆకార నిరాకార) రూపమున ఉండిరి. గయాసురుని తలవెనుకభాగమున ఆ శిల ఉన్నందున, నది ముండ పృష్ఠాద్రి అనబడినది. అది పితరులకు బ్రహ్మలోక ప్రాప్తినిచ్చును. శిలాపాదము ప్రభాసించు పర్వతముతో కప్పబడినందునను, సూర్యునితో ప్రకాశింపబడినందునను, అట ప్రభాసము ఏర్పరుపబడినది. ఆ ప్రభాసమును భేదించుకొని శిలయొక్క అంగుష్ఠము బయల్పడినది. ఆ అంగుష్ఠము నుంచి లేచిన ఈశుడు ప్రభాసేశుడనబడెను. శిలాంగుష్ఠము యొక్క ఒక భాగము ప్రేతశిల అనబడినది. అచట పిండదానము చేయుటచే నరుడు ముక్తుడగును. మహానదీ-ప్రభాసాదుల యొక్క సంగమున స్నానముచేయు నరుడు ముక్తుడగును. అచట రాముడు తనదేవి సీతతో పాటు స్నానము చేసినందున, మహానదిచేత "ఓ రామా ఇచట స్నానము చేయుము" -అని రాముడు ప్రార్థింపబడినందున ఇది రామతీర్థము అని ముల్లోకములలోను ప్రసిద్ధి చెందినది. రామతీర్థమున స్నానము చేసినందున నూరు జన్మాంతరములలో నేనుచేసిన పాపములు పూర్తిగా అన్నియు నశించుగాక అను మంత్రముతో ఇట స్నానముచేసి శ్రాద్ధముచేసిన రామతీర్థమున పిండమును పెట్టు మానవుడు, విష్ణు లోకమునకు పోవును. రాముడు అట్లేయని సీతతో పాటు అచట నిలిచెను. ఓ రామా! రామా! మహాభుజములు కలవాడా! దేవతలకు అభయము ఇచ్చు వాడా! ఇచట దేవేశుడవైన నీకు నమస్కరించుచున్నాను. నా పాతకము నశించుగాక" - అను మంత్రముతో స్నానముచేసి సపిండముగా శ్రాద్ధము చేసినవాని పితరులు ప్రేతత్వమును వీడి పితృదేవతలు అగుదురు. "ఓ దేవేశా! నీవు నీరు. తేజస్సులకు పతివి, ఓ దేవేశ! నాయొక్క మనో-వాక్-కాయ-కర్మల వల్ల గలిగిన పాపమును నశింప చేయుము" అని ప్రార్థించు మానవుడు ప్రభాసేశునికి నమస్కరించి ప్రకాశించుచున్నవాడై శివుని పొందును. ఆ శివునికి నమస్కరించిన తరువాత యమబలిని (పూజను) చేయవలెను. రాముడు వనమునకేగగా, భరతుడు ఈ శైలమునకు వచ్చి యుండెను. అచట పితృపిండాది కర్మలను చేసి, రాముని సంస్థాపించి, రాముని, సీతను, లక్ష్మణుని, మునులను ఆ ప్రభువు నిలిపెను. పవిత్రమైన భరతుని ఆశ్రమమున మతంగ మహాముని పదము మిక్కిలి పుణ్యాత్ములచే నిత్యము చుట్టబడి సర్వమానవులకు కనబడును. ఈ లోకముయొక్క ధర్మ సర్వస్వము నిదర్శనముగా స్థాపింపబడినది. మతంగముని పద

మున శ్రాద్ధము చేయువాడు పితరులనందరిని తరింపచేయును. రామతీర్థమున స్నానము చేసి, రాముని, సీతను పూజించి, రామేశ్వరునకు నమస్కరించి దేహము ధరించిన నరుడు మరల జన్మింపడు.

ఆ శిలయొక్క జఘన భాగము (పిరుదులున్న భాగము) మరల ఒక నగరముతో (పర్వతముతో) ఆక్రమింపబడినది. ధర్మరాజుచే 'నగచ్ఛ ! (పోవకుము)' అని చెప్పబడుటచే ఆ పర్వతము నగమైనది. యమరాజ, ధర్మరాజులు గయాసురుని నిశ్చలతకై అచట (శిల యందు) ఉండిరి. వారిరువురికి పితరుల విముక్తి కొఱకు బలిని ఇత్తురు. "రెండు కుక్కలు నలుపు చిత్ర వర్ణము గలవి. వైవస్వతకులమున పుట్టినవి. వానికి బలిని ఇత్తును. అవి హింసింపనివి అగు గాక ! తూరుపు, పడమర, వాయవ్యము, దక్షిణము, నైరృత్యము– ఈ దిక్కులలో ఉన్న కాకులు మరల నేను ఉంచిన పిండమును ప్రతిగ్రహించుగాక. ఓ మహాబలా! వాయుదేవా! నీవు యముడవు, యమదూతవు. కాకివి . నేనిచ్చిన బలిని తిని ఏడు జన్మలలో చేసిన పాపమును నశింపజేయుము" అని ప్రార్థించవలెను. రాముడు వనమునకు వెళ్లగా, భరతుడు ఇటకు వచ్చి పిండదానాది కర్మలజేసి రామేశ్వరుని స్థాపించెను. ఈ తీర్థమున స్నానము చేసి రామసీతాసమేతుడైన రామేశునికి నమస్కరించి, అచట సపిండకముగా శ్రాద్ధముజేసిన నరుడు నూరుతరముల పితరులతో సహా విష్ణుపురమునకు పోవును. శిలయొక్క కుడిచేతియందు కుండపర్వతము స్థాపింపబడినది. చీకటి పోగొట్టు సూర్యుడు, ఈశాన–భర్గులు, మహేశ్వరులు, అగ్ని, ఇద్దరు వరుణులు, నలుగురు రుద్రులును పితరులకు మోక్షమును ఇచ్చువారు. భరతాశ్రమమునకు వచ్చి నరుడు వారికి నమస్కరింపవలెను. ఓ నారదా! భరతాశ్రమములో ఎచ్చటనైనను స్నానము చేసి శ్రాద్ధముచేసినచో నరుడు ఆ కల్పమున కూడ నశింపడు, పితరులతో పాటు పాపముల నుండియు, ఉపపాపముల నుండియు విముక్తుడు అగును. గయలో చేసిన శ్రాద్ధము, జప–హోమ–తపములును అక్షయములగును. భరతాశ్రమములో దానము ఇచ్చినది అంతయు అనంతమగునని అందురు. నాలుగు యుగముల స్వరూపములలో చూడ బడియు, తాకబడియు, పూజింపబడిన నాలుగు రవి మూర్తులు పితరులకు ముక్తిని ఇచ్చునవి. ముక్తివామనుడనువాడే తారకము అను విధి శ్రేష్ఠమైనది. సంసార సముద్రమున తపించినవారికి ఈ సురేశ్వరులు నౌకలు. మరణించినవారందరికిని, జీవించుచున్న వారందరికిని ఈ బ్రహ్మతారకము తరింపచేయునట్టిది. మూడడుగులు వేసి విశ్వమంతయు ఆక్రమించిన బ్రహ్మరూపియైన పురుషోత్తముని (విష్ణువును) ఇచ్చట చూచినవాడు ధర్మాత్ముడై పితరులతో పాటు పరమపదమును చేరును.

అచట ఉద్యంతకమను కుండము గీతవాదిత్రకము అను పర్వతమును కలవు. శిలయొక్క ఎడమ పాదమున కూడఅట్లే అభ్యుద్యంతకమను పర్వతము స్థాపింపబడినది. అచట పిండమునిడినవాడు తన పితరులను బ్రహ్మపురమునకు కొనిపోవును. అచట ఉద్యంతకమను కుండమున బ్రహ్మను తన తపముచే చేసెను. అచట సావిత్రి తన ఇరువురి కుమారులతో కూడ ఉండినది. హా హా హూ హూ మొదలగు (గంధర్వులు) అచట గీతి నాదమును చేసిరి. అచట భగవంతుడైన అగస్త్యుడు ఉగ్రమైన తపము చేసెనట. భూమిలో దుర్లభమైన వరమును బ్రహ్మనుండి పొందెను. అట్లే లోపాముద్రఅను భార్యను పొందెను. పితరుల పరమగతిని పొందెను. అచట స్నానముజేసి, మధ్యాహ్నమున సావిత్రిని ఉపాసించినవాడు, కోటిజన్మలలోగూడ బ్రాహ్మణుడై ధనాఢ్యుడై వేదపారగు డగును. అగస్త్య పదమున స్నానము చేసి పిండమునిడువాడు బ్రహ్మలోకమునకు పోవును. ఆ ధర్మాత్ముడు పితరులతోసహా దేవతలకు పూజింపతగినవాడు అగును. ఇట, బ్రాహ్మణ జాతిలో పుట్టిన వాడు పరబ్రహ్మనుచేరి యోని సాంకర్యమునుండి విముక్తుడగును. గయాకుమారుని నమస్కరించిన నరుడు బ్రాహ్మణ్యమును పొందును. సోమకుండము స్నానము చేసినవాడు పితరులను సోమలోకమునకు చేర్చును. కాకశిలయందు ఇచ్చిన బలి (బలిగా ఈయబడిన అన్నము) కాకుల నుండి ఋణమోక్షము నిచ్చును. స్వర్గద్వారేశ్వరునకు నమస్కరించి స్వర్గము నుండి బ్రహ్మ పురమునకు పోవును. ఆకాశగంగయందు పిండమిడువాడు నిర్మలుడై పితరులను స్వర్గమును పొందించును. నారదా! భస్మ కూటమును శిలయొక్క కుడిచేత బ్రహ్మ ధరింపచేసెను. ఆ తరువాత ఇది భస్మ కూటాద్రియై భస్మముచే స్నాతమైనది. ఓ బ్రహ్మచారీ నారదా! అచట వటేశ్వరుడై విష్ణువు ఉన్నవాడు. మతంగ పదమున పిండమిడువాడు తన పితరులను స్వర్గమునకు చేర్చును. దానికి ముందు రుక్మిణీ కుండమున్నది. పశ్చిమమున కపిలానదికలదు. కపిలానదియందు స్నానముచేసి కపి లేశునకు నమస్కరించినవాడును మాహేశీ కుండమున శ్రాద్ధముచేసినవాడును, స్వర్గగామి అగును. అచటి గౌరి మంగళయై సర్వ సౌభాగ్యములను ఇచ్చును. భస్మ కూటమున జనార్దనుడు ఉండును. ఆతని హస్తమున పిండమిడు వాడును, తనయొక్కగాని, ఇతరుల యొక్కగాని, జీవించువారి యొక్క గాని, ఎడమ చేతియందు తిలలు లేక పెరుగుకలిపిన మిశ్రమమును మంత్రముతో ఇడువారందరు విష్ణు లోకమునకు పోవుదురు. "ఓ జనార్దన ! ఈ పిండమును నీ చేత నిడితిని. నేను మరణించినపుడు నాకై యీ పిండమును గయా శీర్షమున నీవు ఇవ్వవలెను. ఓ జనార్దనా ! పితృరూపివైన నీకు నమస్కారము. పితృపతివైన నీకు నమస్కారము. ముక్తికి హేతువైన నీకు నమస్కారము. జనార్దనా! గయలో నీవు

పితృరూపమున ఉన్నావు. ఓ లక్ష్మీపతీ! నీకు నమస్కారము. పితరులకు మోక్షమొసగువాడా! నీకు నమస్కారము అని ప్రార్థనచేయుచు నరులు పుండరీకాక్షుని (కమలనేత్రుడైన విష్ణువును) ధ్యానించి మూడు (దేవ–ఋషి–పితృ) ఋణముల నుండి విముక్తులు అగుదురు. అట్టి పుండరీకాక్షుని పూజించి నరులు నిశ్చయముగా స్వర్గమును పొందిరి. ఎడమ మోకాలు భూమిపై నుంచి భీముడు జనార్దనునకు (విష్ణువునకు) నమస్కరించి సపిండక ముగా శ్రాద్ధముజేసి సోదరులతో సహా విష్ణు లోకమైన వైకుంఠమునకు పోయెను. శిలయొక్క ఎడమ పాదమున ప్రేతకూటము అను పర్వతము ధరింపబడినది. ధర్మరాజు తనపాదము లతో ప్రేతశిలాశ్రయమైన పర్వతము శిలయొక్క పాపభారము నుండి దూరముగా కరగ్రహణ కాననమున ప్రేతభావ స్వరూపముతో ఉంచబడినది. ధర్మవ్రత శిలయొక్క అంగస్పర్శవలన ప్రేతకూటము పవిత్రమైనది. శ్రాద్ధాదులకు కారణమైనందున ఈ తీర్థము నరులకు పితృముక్తిని ఇచ్చును. ప్రేతకూటము అక్కడ ఉన్నది. దేవతలు అచటి పదమున ఉన్నారు. అచట శ్రాద్ధాదులనుచేసి పితరులకు ప్రేతత్వము నుండి విముక్తి పొందింపవలెను. ఓ నారదా! శిలాసమీపమున ఉన్న భయంకరులైన ప్రేతరూపు అందరును యమ లోకమునను భూమిలోను తిరుగుచుందురు. పుణ్యమై ప్రేతాది వర్జితమైన గయాసుర శిరమున బ్రహ్మాదులు ఉన్నారు. దానివలన వాడుగూడ పవిత్రుడైనాడు. కీకటదేశమున గయ పుణ్యమైనది. రాజవనమైన గృహము పుణ్యము. చ్యవనుని ఆశ్రమము పుణ్యము, పునఃపునః అను నది పుణ్యమైనది. వైకుంఠమున హేమదండము పుణ్యమైనది. హేమ కూటమను గిరి పుణ్యమైనది. అచట శ్రాద్ధము చేయువాడు పితరులకు బ్రహ్మ లోకమును పొందించును. శిలయొక్క దక్షిణ (కుడి) పాదమున గృధ్రకూటమను పర్వతము ధరింప బడినది. ధర్మరాజుచే సుస్థైర్యమును కలుగచేయుటకై అది చక్కగా పవిత్రమైనది. అచట మహర్షులు గద్దల రూపములో తపము చేసి విముక్తులైరి. కావున ఇది గృధ్రకూటమైనది. అచట గృధ్రేశ్వరుడు ఉన్నాడు. అచట గృధ్రేశ్వరుని చూచి నరులు శివపదమును పొందు దురు. అచట గృధ్రవటమునకు (మఱ్ఱిచెట్టును) నమస్కరించి కోరికలు తీరినవాడై స్వర్గము నకు పోవును. అచట గృధ్రగుహలో పిండమునిడువాడు శివలోకమును పొందును. అచ టనే మాహేశ్వరీధార (జలధార)కలదు. అచట పిండమిడువాడు పితరులను స్వర్గము చేర్చును. అచట మూల క్షేత్రమను సరస్సుగలదు. అచట పిండమిడువాడు బ్రహ్మలోకమును పొందును. అచట శివుని చూచి ఋణవిముక్తిని, పాప విముక్తిని పొంది చివరకు శివుని చేరును. శిలయొక్క కడుపు ఆదిపాలమను పర్వతముచే ఆక్రమింపబడినది. అచట గజరూపముతో (ఏనుగు రూపమున) విఘ్నేశుడు విఘ్నముల నశింపచేయువాడై ఉండును.

ఆతని నాభిలో పిండమిడువాడు పితరులను బ్రహ్మపురము చేర్చును. తలవెనుకకు మూపురము భాగమున దేవదారు వనము కలదు. తలవెనుకన అరవిందాద్రిని చూచిన నరుడు పాపమును నశింప చేసుకొనును. క్రౌంచ రూపమున ప్రవేశించిన ముని అచట తపము చేసెను. దాని అడుగులతో చిహ్నితము అయినందున అది క్రౌంచపాదము అనబడినది. అచటి జలాశయమున స్నానముచేసినవాడు మూడు కులములను (మాతృ–పితృ–శ్వశృ వంశములను) స్వర్గమును చేర్చును. సాక్షాత్తు లక్ష్మీపతియైన విష్ణువు దేవతలు అందరితో వ్యక్తావ్యక్తాత్మతతో (సూక్ష్మ రూపమునను, వ్యక్త రూపమునను) ఉన్నవాడు. కావున ఈ శిల దేవమయియైనది.

బ్రహ్మ దేవతలతో సహా నైమిశారణ్యము ప్రక్క యజ్ఞము చేసెను. ఆ తీర్థము ముఖ్యము అను పేరుగలది. అచట దేవతలు అడుగున ఉందురు. ఓ మునిశ్రేష్ఠ! నారదా! ఆ మూడు పదములందే ఏదైన అశుభకర్మ ఉన్నచో అది నశించును. ఆ నైమిశవనము పుణ్యమైనది. అది పుణ్య పురుషులైన వ్యాసుడు, శుకుడు, పైలుడు, కణ్వుడు, బ్రహ్మ, శివుడు, హరి–వీరిచే సేవింపబడినది. వారియొక్క దర్శన మాత్రమున నరుడు పాతకముల నుండి ముక్తుడగును. ఆ శిలయొక్క (ధర్మవ్రత శిలయొక్క) ఎడమచేతి యందు ఉద్యంత కమను పర్వతము కలదు. ఆ పర్వతము మహాత్ముడైన అగస్త్యునిచే తీసికొని రాబడినది. అచట బ్రహ్మ, హరుడును ఉగ్రమైన తపమును చేసిరి. అచట ముల్లోకముల దుర్లభమై శ్రేష్ఠమైన అగస్త్యుని కుండము కలదు. అచట ఎనమండుగురు మునులు తపముచేసి శివుని చేరిరి. ఆ కుండమున ఎనమండుగురు మునులకు నమస్కరించి నరుడు పితరులను బ్రహ్మపురమునకు చేర్చును. ఓ దేవర్షీ! నారదా! మహాత్ముడు అయిన అగస్త్యుడు తపము చేసి ఉదయాద్రి నుండి ఒక శుభమైన పర్వత శ్రేష్ఠమును చేర్చెను. ఆ పర్వతమే శిలయొక్క ఎడమచేతి యందు స్థాపింపబడినది. అది వీణా–వేణు–మృదంగాది వాద్యములచేతను, దివ్యములైన గీతముల చేతను శ్రేష్ఠమై ఒప్పిన వాదిత్రకగిరి. అచట విద్యాధరుడు అనువాడు గంధర్వాప్సరో గణములతో సహదివ్యములైన గీతముల గానము చేయును. మోహనుడు, సునీథుడు, శైలూజుడు, మోహనోత్తముడు, పర్వతుడు, నారదధ్యాని, సంగీతి, పుష్ప దంతకుడు, హాహాహూహూ మొదలగువారు అచట గీత దానముచేసిరి. అట్లే ఈ పర్వతము నందు సర్వగంధర్వులతో కూడిన చిత్రరథుడు మధురములైన గీతములను ఉత్సవముగా గానము చేయును. కావున ఇప్పటికిని నిత్యము ఆ పర్వతము దేవతలచే సేవింపబడును. అచట ధర్మజులు, భస్మమే మైపూతగాగల దేవేశుడైన హరుడు ఉందురు. గీతములచే ప్రతిధ్వనించిన ఆ పర్వతమున పార్వతీ సహితుడైన రుద్రుడు పూజింపబడి సంతసించును.

ఆతడు ధ్యానింపతగినవాడు. అది పితరులకు పరమగతిని ప్రసాదించును. ఓ నారదమునీ! గయలో పరమాత్మ గోపతియైన గదాధరుడు(విష్ణువు). అచట రుద్రార్చనతో వైష్ణవీమాయ నశించును. శిలయొక్క కుడిచేతియందు భస్మకూటము అను గిరి ధరింపబడినది. అచట ధర్మరాజుతో అగస్త్యుడు భార్యతో కూడియుండును. అగస్త్యుని పదమున స్నానముచేసి పిండమిడువాడు బ్రహ్మ లోకమునకు పోవును. అగస్త్యుడు భూలోకమున దుర్లభమైన మాహాత్మ్యమును బ్రహ్మనుండి వరముగా పొందెను. పితరులకు పరమగతి రూపమైన లోపాముద్రఅను భార్యనుకూడ పొందెను. సీతాద్రికి దక్షిణమున ఉన్న గిరియందు దండి నాథుడు తపము చేసెను. అచట వటశ్రేష్ఠమైనవటము (మఱ్ఱి వృక్షము) ప్రపితామహుడై (విష్ణువై) అచ్చట ఉన్నవాడు. పితరులకు ముక్తిని కలిగించును, దాని ఎదుట రుక్మిణీ కుండము, పశ్చిమమున కపిలానది, నదీతీరమున కపిలేశుడును ఉందురు. అమావాస్యతో సోముడు కలిసిఉన్నపుడు దర్శయందు–(దర్శ అనగా సూర్య చంద్ర సంగము). కపిలానదిలో స్నానముచేసి, కపిలేశుని పూజించి, నరుడు శ్రాద్ధమున పిండదానము చేయగా పితరులు మోక్షము చెందుదురు. అచట ఉద్యంతక పర్వతమును అనుసరించి అగ్నిధార వచ్చినది. అచట సరస్వతి చేత సారస్వతమను కుండము కల్పింపబడినది. అచట ప్రభువైన శుక్రుడు షండామర్కాది పుత్రులతో పాటు ఉండును. "ఓ నారదముని సత్తమా! అటనట మునీంద్రుల పదములలో స్నానము చేసి శ్రాద్ధ పిండాదులను ఇడువాడు పితరులను తరింపచేయును. శిలయొక్క ఎడమ చేతియందు గృధ్రకూటము అను గిరి ధరింపబడినది. అచట మహర్షులు గృధ్ర రూపమున ఉండి తపముచేసి, సంసిద్ధులైరి. అందువల్ల అది గృధ్రకూటమైనది. అచట గృధ్రేశ్వరుడు ఉన్నవాడు. ఆ గృధ్రేశ్వరుని చూచి, నమస్కరించి, నరుడు శివ పదమును చేరును. అచట గృధ్రగిరిలో గుహయందు పిండమిడువాడు శివలోకము నందును. అచట గృధ్రగిరియందు. వటవృక్షమునకు నమస్కరించి, కోరికలు నిండినవాడై స్వర్గమునకు పోవును. అచట శివుని దర్శించి, ఋణవిముక్తిని, పాపవిముక్తిని పొంది శివుని చేరును. అచట, శూలక్షేత్రమున్నది. అచట పిండమిడువాడు పితరులకు స్వర్గమును అందించును. శిలయొక్క ఉదరమున (కడుపు భాగమున) ఆదిపాల అను గిరి ఆక్రమించి ఉన్నది. అచట విఘ్నేశుడు గజరూపమున విఘ్ననాశనుడై ఉన్నాడు. ఆతని దర్శించి విఘ్నముల నుండి విముక్తుడు అగును. పితరులను బ్రహ్మ పురమును చేర్చును. శిలయొక్క తలవెనుకల మధ్యన దేవదారువనము కలదు. గయానాభిలో సుషుమ్నయందు పిండము నిడువాడు పితరులను స్వర్గమును పొందించును. శిలయొక్క ఎడమ పాదమున ధర్మ రాజుచేత ప్రేత పర్వతము స్థాపింపబడినది. శిలయొక్క పాదభాగము నుండియు, పాపముల

నుండియు ప్రేతశిల అనునది పాదముతో దూరమున ఉంచబడినది. ఐనను ఆ శిలా సంసర్గము వలన ప్రేతకూటము పవిత్రమైనది. అచట ప్రేతకుండము కూడ నున్నది. అచట పదమున దేవతలున్నారు. అచట కుండాదులను ఇడి, పితరులను ప్రేతత్వము నుండి విముక్తి పొందించవలెను. దీనికి వేరుగాఉన్న చాలమందియు విఘ్నకారులే. ఈ తీర్థమున శ్రాద్ధాదులు చేసినవారి పితరులను విముక్తి పొందించును ప్రేతలు ధానుష్క (ధనుస్సులు ధరించినవారి) రూపమున కరగ్రహణకారకములు అగును. దేవపాదముల గుర్తులు కలిగిన ఆ శిలయొక్క తలవెనుక భాగమున మహాదేవుడు (శివుడు) ఉండును. ఆతనిని దర్శించినవాడు పాపముల నుండియు, ఉపపాతకముల నుండియు విముక్తుడు అగును. సర్వపాప వివర్జితమైన శిలాశిరమున నేను ఉంటిని. అది ప్రేతాదులచే వదల బడినదై అతి పవిత్రమై శ్రేష్ఠమైనది. కీకటదేశమున గయ పుణ్యమైనది. రాజగృహమైన వనము పుణ్యమైనది. చ్యవనుని ఆశ్రమము పుణ్యమైనది. పునఃపున అను నది పుణ్యమైనది. వైకుంఠము, లోహదండము, గృధ్రకూటము, శోణకము–ఇచట చేసిన శ్రాద్ధాదులతో నరుడు సమస్త పితరులను బ్రహ్మపురమును చేర్చును. శిలయొక్క ముండపృష్ఠమున (తలవెనుక) ముని క్రౌంచపక్షిరూపమున తపము చేసెను. ఆతని పాదములచే అంకిత మైనందున అది క్రౌంచ పాదము అనబడినది. అట జలాశయమున స్నానము చేసినవాడు తన వంశమును స్వర్గమునకు చేర్చును. కాకశిలయందు కాకులకిచ్చినబలి ఋణమోక్షము ఇచ్చును. లోమశుడు లోమహర్షణుడును (అనువారు) ఇరువురు ముండపృష్ఠమున పర్వతపు చరియయందు మహా తపముజేసి పరమసిద్ధిని పొందిరి. లోమశునిచేత నదీశ్రేష్ఠములు అచటికి పిలువబడినవి. అవి–మహానది, శరావతి, వేత్రవతి, చంద్రభాగ, సరస్వతి, కావేరి, సింధువు, ఈర, చందన, వాశిష్ఠి, సరయు, గంగ, యమున, గండకి, ఇందిర, మహావైతరణి, నిక్షర, (ఇవి స్వర్గస్థములు), సావని, అలకనంద, ఉదీచి, కనకాహ్వాయ, కౌశికి, బ్రహ్మద, జ్యేష్ఠ, సర్వాఘ విమోచని, కృష్ణవల్వ, చర్మవతి. ఇవి ముక్తిదాయకములు. లోమహర్షణునిచే సాహసమున పిలువబడినవి. అట్లే ఆతనిచే తపః ప్రభావమున పిలువబడిన నది నర్మద. ఓ నారదా! ఆ అన్ని నదులందు స్నానముచేసి పిండమును ఇడువాడు పితరులను స్వర్గమునకు చేర్చును. ఇచట బ్రాహ్మణ యోనిలో ప్రవేశించి వెలువడినవాడు (బ్రాహ్మణ జాతిలో పుట్టినవాడు) యోని సంకటము నుండి విముక్తుడై పరబ్రహ్మను చేరును. నిక్షర అను పుష్కరిణిలో స్నానముచేసి, నియమముతో మూడు వాసరములు క్రౌంచపదమున శ్రాద్ధాదికమునుచేయు నరుడు పంచపాపులనైనను సమస్త పితరులను స్వర్గమును పొందించును. భస్మ కూటమున జనార్దనుడు ఉండును, ఆతని హస్తమున పిండమునిడువాడును, ఇతరులకుగాని, తనకుగాని పిండమిడువాడును, తిలలు

లేక సవ్యముతో పెరుగుతో కలిపి జీవించువారికి పిండమునిడువాడు-వీరందరును విష్ణు లోకమునకు పోవువారు. ఓ జనార్దనా! విష్ణో! ఓ ప్రభో! నేను నీచేత నిడిన పిండము, నేనెవరికి ఇచ్చితినో మరణించినతరువాత వారికి దానిని నీవు చేర్చవలెను. ఓ జనార్దనా! నేను నీచేత యిడిన ఈ పిండము నా అంత్య కాలమున (మరణమున) నీవు నాకు గయాశిరమున నా పిండము నీయవలె. ఓ జనార్దన! పితరులకు మోక్షమును ఇచ్చువాడా! నీకు నమస్కారము. ఓ పితృపతీ! నీకు నమస్కారము. పితృరూపివైన నీకు నమస్కారము. గయలో జనార్దనుడు స్వయముగా పితృరూపమున ఉండును. ఆ పుండరీకాక్షుని చూచి దేవ పితృగురు ఋణముల నుండి విముక్తుడు అగును. ఋణత్రయ విమోచకుడవైన ఓ పుండరీకాక్షా! నీకు నమస్కారము. ఓ లక్ష్మీకాంతా! నీకు నమస్కారము. నా పితరులకు మోక్షమునిమ్ము. భీముడు ఎడమ మోకాలును భూమియందు ఉంచి జనార్దనునకు నమ స్కరించి, సపిండకముగా శ్రాద్ధముచేసి, సోదరులతో సహా బ్రహ్మ లోకము నందెను. ఆ ధర్మాత్ముడు తన నూరుతరముల వంశమును గూడ బ్రహ్మలోకము అందించెను. లక్ష్మీ పతియైన విష్ణువు శిలయందు దేవతలతో బాటు వ్యక్తరూపమునను, వ్యక్తావ్యక్త రూప మునను (ఇంద్రియ గోచరుడుగను, ఇంద్రియములకు గోచరుడై గోచరుడుకానట్లును) ఉన్న వాడు. కావున ఈ ధర్మవ్రతశిల సర్వదేవమయి అయినది అని సవిస్తరముగా తెలిపెను. (46)

గయా మాహాత్మ్యము- 4

నారదుడు ఇట్లు అనెను :

"ఆదిగదాధరుడు వ్యక్తస్వరూపముతో ఎట్లున్నాడు? వ్యక్త స్వరూపముతో వ్యక్తా వ్యక్తాత్మగా ఎట్లుండెను? ఆది గదాధరుడు అయినందులకు కారణమైన ఆ మొదటిగద ఎట్లు పుట్టినది? విష్ణువుయొక్క రూపము సర్వపాపక్షయకరమైన గదతో ప్రకాశించునది ఎట్లు అయ్యెను?"

సనత్కుమారుడు ఇట్లు అనెను :

వజ్రమునకన్న మించిన వజ్రమై బలిష్టుడైన గదుడను అసురుడు ఉండెను. ఆతడు పూర్వము భయంకరమైన తపముచే బ్రహ్మనుండి వరమును పొంది బ్రహ్మకోరగా త్యజింపరాని తన శరీరము యొక్క ఎముకను ఇచ్చెను. బ్రహ్మ చెప్పగా విశ్వకర్మకూడ దానిని అద్భుతమైన గదనుగా చేసెను. ఆ ఎముకను వజ్రములవంటి కుందములచే (మల్లెమొగ్గలచే) అలంకరింపబడిన దానిని స్వర్గమున విష్ణువు ధరించెను. తరువాత, స్వాయంభువ మన్వంతరమున చాలకాలమునకు బ్రహ్మపుత్రుడైన హేతిఅను రాక్షసుడు

మిక్కిలి భయంకరమైన తపముచేసెను. లక్ష దివ్యసంవత్సరములు వాయువును మాత్రము తినెను. పైకెత్తిన ముఖముగలవాడై, చేతులు పైకెత్తి, ఒకే కాలి బొటన వ్రేలిపై నిలబడెను. జారిపడిన ఆకులను, గాలిని మాత్రము తిని ఏకాగ్రచిత్తుడై తపము చేసెను. తపముచే సంతుష్టులై వరప్రదులైన బ్రహ్మాదులనుండి “దేవతలచేత, దైత్యులచేత, శస్త్రాస్త్రములచేత, వివిధ మనుజాదులచేత కృష్ణ–ఈశానాదుల చేతను వధింపరాని వాడనై నేను మహాబలుడను కావలెను” అని వరము కోరెను. బ్రహ్మాది దేవతలు అట్లే అగుగాక అని అంతర్ధానమైరి. ఆ తరువాత హేతిరాక్షసుడు దేవతలను జయించెను. తానే ఇంద్రత్వమును నిర్వహించెను. బ్రహ్మ–హరుడు మొదలగు వారు భయము చెందిరి. వారు హరిని శరణుబొందిరి. హేతి రాక్షసుని చంపుమనిరి. అనగనే “హరి ఓ దేవతలారా! ఈ హేతిరాక్షసుడు దేవాసురులతో గూడ చంపుటకు అలవికాని వాడు. మీరు నాకు మహాస్త్రము నీయుడు. దానితో హేతిరాక్షసుని చంపెను అనెను. అనగనే దేవతలు ఆ గదను హరికిచ్చిరి. దేవతలు చెప్పగా ఆ గదను మొదట ధరించి హరి గదాధరుడయ్యెను. ఆ గదతో హేతి రాక్షసుని వధించి దేవతలతో స్వర్గమునకు వెళ్లెను. శిలయందు గదను నిలిపి గయాసురుని నిశ్చలునిగా జేసెను. దీనివలన హరి ఆదిగదాధరుడు అయ్యెను. ఆదిగదాధరుడు శిలయందలి పర్వత రూపమున వ్యక్తుడు అయ్యెను. ఈ శిల ముండపృష్ఠాద్రి అయినది. అది ప్రభాసమను పర్వతము. ఉద్యంతము, గీత నాదము, భస్మ కూటము, మహాగిరి, గృధ్ర కూటము, ప్రేత కూటము, ఆదిపాలము, అరవిందకము, పంచలోకము, సప్తలోకము, వైకుంఠము, లోహదండకము, క్రౌంచపాదము, అక్షయవటము, ఫల్గుతీర్థము, మధుశ్రవము, దధికుల్య, మధుకుల్య, దేవిక, మహానది, వైతరణి–మొదలగు పర్వత, క్షేత్ర, నదీ రూపములతో ఆదిగదాధరుడు వ్యక్తుడు. విష్ణుపదము, రుద్రపదము, ఉత్తమ బ్రహ్మపదము, రెండు హస్తములు వెలికి వచ్చిన దివ్యకాశ్యప పదము. పంచాగ్నుల పదములు, తరువాత ఇంద్ర అగస్త్య పదములు, రవి యొక్కయు, కార్తికేయుని (కుమారస్వామి) యొక్కయు, క్రౌంచ–మాతంగుల యొక్కయు పదములు, ఈ సమస్త ముఖ్య చిహ్నములన్నింటి రూపమున హరి వ్యక్తావ్యక్తాత్మతో నున్న ఆద్యగదాధరుడు గూడ వ్యక్తుడై శ్రీమంతుడైన గదాధరుడు. గాయత్రి, సావిత్రి, సంధ్య, సరస్వతి, గయాదిత్యుడు, ఉత్తరార్కుడు, దక్షిణార్కుడు, నైమిషుడు, శ్వేతార్కుడు, గణనాథుడు, అష్టవసువులు, మునీశ్వరులును, పదునొకండు రుద్రులు, అట్లే సప్తర్షులు, సోమనాథుడు, సిద్ధేశుడు, వినాయకుడు, నారాయణుడు, మహాలక్ష్మి, బ్రహ్మ, శ్రీ పురుషోత్తముడు, మార్కండేయేశుడు, కౌటీశుడు, అంగిరేశుడు, పితామహుడు (బ్రహ్మ), జనార్దనుడు, మంగళ, ఉత్తముడైన పుండరీకాక్షుడు. ఈ మొదలగు వ్యక్తరూపమున కూడ ఆదిగదాధరుడు అచ్చట ఉన్నవాడు.

హేతియను ఆ రాక్షసుడు చంపబడగా, విష్ణువు తన పురమునకు వెళ్లెను. బ్రహ్మతో బాటు రుద్రాదులతో గయాసురుడు నిశ్చలుడుగా చేయబడగా బ్రహ్మ హర్షముతో సుఖించినవాడై ఆద్యగదాధరుని సంతసింప చేసెను.

బ్రహ్మ ఇట్లు అనెను :

"గదను ధరించినవాడు, కాలునకు సంబంధించిన పాపములు లేనివాడు, గయలో నున్నవాడు, తెలియబడిన సర్వగుణములు గలవాడు, గుణాదులలో ఉన్నవాడు, బుద్ధిలో ఉన్నవాడు, పర్వతశ్రేష్ఠము యొక్క తెల్లని గృహమున ఉన్నవాడు, గణములతో నర్చింపబడినవాడు, వరమునిచ్చువాడునైన విష్ణువునకు నమస్కరింతును. పగటికి శోభయైనవాడు, దేవ గణములకు ఆది తేజము, భవుని తేజము, రాక్షసులను చీల్చు తేజము, కలిసంపదయైనవాడు, కలిమలమును మర్దించు తేజము, ఆశ్రయించిన వారికి సంపత్స్వరూపుడునైన గదాధరునికి నమస్కరింతును. గట్టిదాని కంటె గట్టియైనవాడు, ఏలికలు అందరితో స్తుతింపబడినవాడు, ఆద్యగుడు, దృఢమైన పాపాదులు చెందనివాడు, స్వాత్మను పొందినవాడు, బలిష్ఠమైన గోత్రము–సూక్తియు–కాంతియు కలవాడు. దేహము లేనివాడు, కరణములు కళలు(అంశములు) లేనివాడు, జన్మలేనివాడు, సూర్యునితోను వేదములతోను అలంకరింపబడినవాడు, ధ్వనిముఖములేనివాడు, అనాదీశ్వరుడైన గదాధరునికి ఎల్లప్పుడు నమస్కరింతును. మనమునకు అతీతుడు, మతిగతులు (బుద్ధి–బుద్ధిచే తెలియబడునది) లేనివాడు, పరుడు, ఎల్లప్పుడును అద్వయుడు, బుధులచే వేదాంతములందు నుతింపబడినవాడు, చిదాత్మకుడు, కలిలోని కారణములకు మించినవాడు–అట్టి హృదయవాసియైన గదాధరునకు నమస్కరింతును" అని స్తుతించగా,

సనత్కుమారుడు ఇట్లు అనెను :

దేవతలతోసహా బ్రహ్మచేత ఈ విధముగా స్తుతింపబడిన గదాధరుడు బ్రహ్మను వరము అడుగుమనెను. బ్రహ్మ వరమును అడిగెను. దేవరూపిణియైన శిలయందు నీవు లేక మేము ఉండలేము. వ్యక్తాదిరూపివైన నీతో పాటే నిత్యము ఉండెదము. ఇట్లే అగుగాక–అని గదాధరుడు లక్ష్మితోపాటు లోకముల రక్షించుటకును, జగములముక్తి కారణమునకును అచట శిలపైన ఉండెను. అపుడు పుండరీకాక్షుడు (కమలనేత్రుడు) జనార్దనుడు సువ్యక్తుడని పేరు పొందగలడు. వేదగమ్యుమై ఆదిభూతమై, సనాతనమైన హరియొక్క మూర్తి పూర్వము శ్వేతవారాహకల్పమున వ్యక్తమై, వ్యక్తినిపొంది మరల సువ్యక్తముగాగలదు. లోకులను తరింపచేయుటకును, దేవతల రక్షణమునకును, గయా శిరమున సువ్యక్తుడవు అగుదువు. సంశయము లేదు. భక్తితో నెల్లప్పుడు గదాధరుని చూచినవారు కుష్ఠరోగాదులు పోయి

హరిమందిరమును చేరుదురు. దేవుడైన ఆది గదాధరుని భక్తితో చూచినవారు, ధనమును, ధాన్యమును ఆయురారోగ్యములను పొందుదురు. శ్రద్ధతో గదాధరునికి నమస్కరించినవారు భార్యా పుత్ర పౌత్రాది గుణ కీర్తి సుఖములను, రాజ్యమును అనుభవించిన నరులును తమ పుణ్యఫలముగా ఎల్లప్పుడును బ్రహ్మ లోకమును పొందుదురు. అచట గంధ దానమున గంధాఢ్యుడగును. పుష్పదానమున సౌభాగ్యమునందును. ధూపదానమున రాజ్యమును పొందును. దీపదానమున తేజోదీప్తిని పొందును. ధ్వజదానమున పాపము నశించును. యాత్ర చేయువాడు బ్రహ్మలోకము నందును. శ్రాద్ధపిండము నిడువాడు పితరులను విష్ణువును చేర్చును. స్తోత్రముతో శ్రద్ధగా నాది గదాధరునకు నమస్కరించి పూజించినవాడు పితరులను విష్ణువును పొందించును. శివుడు సైతము ప్రీతితో ఆది గదాధరుని స్తుతించెను.

శివుడు ఇట్లు అనెను :

ముండపృష్ఠ పర్వతాది రూపమున ఫల్గు తీర్థాది రూపమునను అవ్యక్తరూపుడైన దేవుడగు ఆదిగదాధరునికి నమస్కరింతును. ముఖాది చిహ్నములుకల రూపముతో పద రూపమున వ్యక్తావ్యక్త రూపమున ఉన్న ఆదిగదాధరునికి నమస్కరింతును. అవ్యక్తరూపుడు అయిన దేవుడు జనార్దన స్వరూపమున ముండపృష్ఠాద్రి యందు స్వయముగా పుట్టిన ఆదిగదాధరునికి నమస్కరింతును. దేవరూపిణియైన శిలయందు బ్రహ్మాది దేవతలతోసహా ఉన్నవాడును, దేవతలచే పూజింపబడి సత్కృతుడైన గదాధరునికి నమస్కరించుచున్నాను. ఎవనిని శ్రాద్ధాదులలో చూచి, తరువాత బూజించి ప్రణమిల్లి, బ్రహ్మలోకమునందు ఉందురో, ఆ ఆదిగదాధరునికి నమస్కరింతును. మహదాది వ్యక్త జగత్తునకు ఒకేకారణుడై అవ్యక్త జ్ఞాన రూపుడైన ఆ ఆదిగదాధరునికి నమస్కరింతును. దేహ-ఇంద్రియ-మనస్-బుద్ధి-ప్రాణ-అహంకారములు లేనివాడును, జగమను స్వప్నము లేనివాడును అయిన ఆ ఆదిగదాధరునికి నమస్కరింతును. నిత్యానిత్యముల వదిలినవాడు, సత్యస్వరూపుడు, ఆనంద స్వరూపుడు, అవ్యయుడు (నాశము లేనివాడు) అయి ఆది గదాధరునికి నమస్కరింతును.

సనత్కుమారుడు ఇట్లు అనెను :

ఈ విధముగ మహేశ్వరునితో స్తుతింపబడిన ఆది గదాధరుడు ప్రీతుడై బ్రహ్మాది దేవతలతో సహశిలయందు నిలిచెను. ముండపృష్ఠాద్రియందు నిలచిన దేవుడైన ఆదిగదాధరుని ఇచటస్తుతింతురు. పూజింతురు. వారు చివరకు బ్రహ్మ లోకమును చేరు దురు. ఆది గదాధరుని బూజించి, ధర్మార్థి ధర్మమునందును, ధనార్థి ధనము నందును, కామార్థి కామమునందును, మోక్షార్థి మోక్షమునందును ఆది గదాధరుని జూచి-గొడ్రాలు వేద పారగుడైన పుత్రుని పొందును. రాజు విజయము నందును, శూద్రుడు సుఖమునందును.

పుత్రుల కోరినవారు పుత్రుల నందురు. హరియొక్క పూజాదులచే మనమున కోరినవి ఎల్లను సిద్ధించును. (47)

గయామాహాత్మ్యము - 5

సనత్కుమారుడు ఇట్లు అనెను :

ఓ నారదా! ముక్తినిచ్చు గయాయాత్రను చెప్పెద వినుము. పూర్వము ఇది శ్రాద్ధ కర్తలకు ప్రాయశ్చిత్తమని బ్రహ్మచే చెప్పబడినది. గయకు పోవుటకు పూనుకొన్నచో విధి విధానమున శ్రాద్ధముచేసి పవిత్రనదీ జలమును వెంటగొని పోవు యాత్రికుని వేషము వేసికొని గ్రామ ప్రదక్షిణముచేసి బయలుదేరవలెను. గ్రామాంతరమునకు వెళ్ళి శ్రాద్ధ శేషమును భుజింపవలెను. తరువాత ప్రతిదినము ఏ దానమును తీసికొనకుండ వెళ్లవలెను. ప్రతిగ్రహము చేయక సంతుష్టుడై, నియమము కలవాడై, పవిత్రుడై, అహంకారవిముక్తుడై తీర్థయాత్రకు బయలుదేరినవాడు తీర్థఫలమును పొందును. ఎవని పాదములు, చేతులు, మనస్సును, విద్య, తపము, కీర్తియు సుసంయతములో (చక్కని నియమ నిబంధనలతో కూడినవో), ఆతడు తీర్థఫలము అనుభవించును. ఆ తరువాత గయా ప్రవేశమున ముందు (తూర్పున) మహానది ఉన్నది. అచట జలమును చీల్చినట్లుచేసి నిర్మలజలమున స్నానము చేయవలెను. తరువాత దేవాదులకు తర్పణముచేసి, తన వేదశాఖలో చెప్పిన విధమున, అర్ఘ్య-ఆవాహనములు నిర్వహించి యథావిధిగా శ్రాద్ధము చేయవలెను. మరుసటి దినమున పవిత్రుడై ప్రేత పర్వతమునకు పోవలెను. తరువాత బ్రహ్మకుండమున స్నానముచేసి సద్బుద్ధి కలవాడై దేవాదులకు తర్పణము చేయవలెను. ప్రేతపర్వతమున నియమము కలవాడై సపిండులకు (ఏడు తరములలోపలి జ్ఞాతులకు) శ్రాద్ధము చేయవలెను. అపుడు ఆ సద్బుద్ధి దక్షిణము వైపునకు ముఖము చేసినవాడై ప్రాచీనావీతి (అపసవ్య యజ్ఞోపవీతము చేసికొన్నవాడు అనగా కుడి భుజము మీదుగా ఎడమ చేతిక్రిందికి వ్రేలాడు జందెము గలవాడు కావలెను. కవ్యమును మోయు అగ్ని, సోముడు, యముడు, అర్యముడు (సూర్యుడు) అగ్నిష్వాత్తులు (అగ్నులయందు నేయి మొదలగువానిని భుజించువారు), బర్హిషదులు (దర్భలపై ఆవహింపబడి ఉండువారు), సోమపులు(సోమరసమును త్రాగువారు) పితృ దేవతలను ఓ మహాభాగులారా! ఇటకు రండు నా కులమున పుట్టి నాకు జ్ఞాతులైన నా పితరులు మీచేత రక్షింపబడిరి. వారికి పిండములను ఇడుటకై ఈ గయకు వచ్చి ఉన్నాను. వారందరు ఈ శ్రాద్ధముచేత శాశ్వతముగా తృప్తినందుదురు గాక అని ఆవాహనముచేసి తదుపరి ఆచమనముచేసి తిథి వార నక్షత్ర యోగకరణ

రూపమైన పంచాంగ సంకల్పము చెప్పి ప్రయత్నముతో ప్రాణాయామముచేసి, పునరావృత్తిలేని శాశ్వత బ్రహ్మలోక ప్రాప్తికై ముందుగా శాస్త్రానుసారము క్రమముగా శ్రాద్ధముచేసి, పితరులను ఆవాహనముచేసి మంత్రములతో పూజించి పిండమిడవలెను. తీర్థమున ప్రేతశిలాదులందు ఆ స్థానమును మొదట పంచగవ్యములతో వేరువేరుగా కడిగి నేతితో గూడిన చరువుతో (ప్రత్యేకముగా హోమమునకై వండిన అన్నముతో) ఆ మంత్రములతో దేవతను పూజింపవలెను. పితృ కర్మలలో మనుష్యులు నూవులు చేత పట్టుకొనునంతలోనే, సింహమునకు భయపడిన మృగములవలె, రాక్షసులు పరుగెత్తి పోవుదురు. అష్టకాశ్రాద్ధమున గాని, వృద్ధిశ్రాద్ధమునగాని, గయలో మృత తిథియందుగాని మాతృశ్రాద్ధమును మరల ప్రత్యేకముగా చేయవలెను. వేరొకచోట మాత్రము భర్తతోకలిపి చేయవలెను. వృద్ధిశ్రాద్ధమున మాత్రాదిగను (తల్లితో మొదలుపెట్టి), గయయందు పితృపూర్వకముగను, పిత్రాదులకై దక్షిణాగ్రములైన దర్భలతో వరుసగా పరచి, పాద్య పూర్వకముగా ప్రారంభించి తక్కిన శ్రాద్ధమును గృహ్యోక్తముగ ఆచరింపవలెను. వారికి దక్షిణ భాగమున కుశలను పరచి ఒకమారు తిలోదకమును ఇచ్చి సపిండులకు (ఏడు తరముల జ్ఞాతులకు) శ్రాద్ధము పెట్టవలెను. పితృతీర్థమునందలి జలముతో పిడికెడు సత్తుపిండిని పిండముగా చేసి దోసిలితో అక్షయ్య పిండకమును ఈయవలెను. తరువాత తిల జలములతో దర్భలందు సంబంధినుల ఆవహింపచేయవలె. బ్రహ్మ మొదలుకొని తృణగుచ్ఛము వరకుండు దేవర్షి-పితృ-మానవులు, సమస్త పితరులును, మాతృమాతా మహాదులును, తృప్తి చెందుదురు గాక ! బ్రహ్మ లోకమునుండి ఈ లోకమువరకు సప్తద్వీపములందు గడచిన మా కోటివంశముల వారికి ఈ తిలోదకము తర్పణమగు గాక! తండ్రి, తండ్రి తండ్రి, ఆ తండ్రికి తండ్రి (తాతకు తండ్రి); తల్లి, తల్లికి తండ్రి, తల్లికి తాత (తల్లి తండ్రికి తండ్రి), ఆ తాతకు తండ్రి (మాతృ, మాతామహ, మాతుః పితామహ, మాతుః ప్రపితామహులు) మొదలగువారు-నేను వారికి ఇడిన పిండము అక్షయ్యమగు గాక! గయాశిరమున పిడికెడంతగాని, పచ్చి ఉసిరిక కాయ అంతగాని, జమ్మి ఆకు అంతగాని పిండమును ఇడవలెను. ఆతడు ఏడు గోత్రములు ఉద్ధరించును. నూరు వంశములను ఉద్ధరించును. తండ్రి యొక్కయు, తల్లి యొక్కయు, తన భార్య యొక్కయు, తన అక్క యొక్కయు, తన కూతురి యొక్కయు, తండ్రి చెల్లెలి (మేనత్త) యొక్కయు, తల్లి చెల్లెలి (పిన్నమ్మ) యొక్కయు, గోత్రములు మొత్తము ఏడు గోత్రములని చెప్పబడినవి. ఇరువది నాలుగు, ఇరువదియు, పదునారును, పండ్రెండును, రుద్రాది వసువులు కులములు నూట ఒక్కటిగల వారికి విచణులు తీర్థ శ్రాద్ధమును చేయవలె.

ఆవాహనము లేదు దిగ్బంధము లేదు. వర్ష సంభవమువలన దోషము లేదు. కారుణ్యముతో తీర్థ శ్రాద్ధమును చేయరాదు. పిండాసనము, పిండదానము, మరల ప్రత్యవనేజనము, దక్షిణ, అన్న సంకల్పము–తీర్థ శ్రాద్ధములలో ఇది విధి. మా వంశమున పుట్టినవారు, గతిలేనివారు–వారిని, అందరిని దర్భపృష్ఠమున తిలోదకములచే ఆహ్వా నింతును. అను ఈ సజల మంత్రములతో దర్భలందు ధ్యానవంతుడై, వారిని ఆవహించి పూజించి వారికి యథాక్రమముగా పిండములను ఇడవలెను. "మా వంశమున మరణించి గతిలేని వారి ఉద్ధరణమునకై ఈ పిండము నేనిడుచున్నాను. అమ్మమ్మగారి వంశమున గతిలేనివారి ఉద్ధరణమునకై నే ఈ పిండమును ఇడుచున్నాను. బంధువర్గ వంశమున గతిలేనివారి ఉద్ధరణమునకై నేను ఈ పిండమును ఇడుచున్నాను. అగ్నిచే దహింపబడిన వారి యొక్కయు, పిడుగులచేతను, దొంగలచేతను మరణించినవారియొక్కయు ఉద్ధరణమునకై నేను ఈ పిండమును ఇడుచున్నాను. కారుచిచ్చులో కాలినవారియొక్కయు, పులిచే చంపబడిన వారికిని, కోరలు కలవానిచేతను కొమ్ములు కలవానిచేతను చంపబడిన వారికిని నేను పిండమును ఇడుచున్నాను. ఉరితీయబడినవారికిని, విష–శస్త్రములచేత చచ్చిన వారికిని, ఆత్మహత్య జేసికొన్నవారికిని నేను పిండమును ఇడుచున్నాను. అరణ్యముననను, మార్గముననను ఆకలితోను, దప్పికతోను చచ్చినవారికిని భూతప్రేత పిశాచాదులచే చచ్చినవారికిని నేను పిండమును ఇడుచున్నాను. యమపాశమున అంధతా మిస్రమున రౌరవమున (నరకమున) ఉన్నవారి ఉద్ధరణమునకై నేను ఈ పిండమును ఇడుచున్నాను. భయంకరమైన అసిపత్రవనము–కుంభీపాకములు అను యమలోక నరకములో ఉన్న వారి యుద్ధరణమునకై నే నీపిండమును ఇడుచున్నాను. అనేక యాతనలలో ఉన్న వారియొక్కయు, ప్రేతలోకమునకు పోయిన వారియొక్కయు ఉద్ధరణమునకై నేను ఈ పిండమును ఇడుచున్నాను. యమకింకరులచే గొంపోబడి అనేక యాతనలలో నున్నవారి ఉద్ధరణమునకై నేను ఈ పిండమును ఇడుచున్నాను. సమస్త నరకములలో యాతనలలో ఉన్నవారి ఉద్ధరణమునకై నేను ఈ పిండమును ఇడుచున్నాను. పశు యోనిని బొందినవారియొక్కయు పక్షి–కీట–సరీసృపములైన వారి యొక్కయు ఉద్ధరణమునకై నేను ఈ పిండమును ఇడుచున్నాను. తన కర్మతోనే జాత్యంత రములలో భ్రమించుచున్న వారికి మరల మనుష్య జన్మ దుర్లభము. అట్టివారికి నేను ఈ పిండమును ఇడుచున్నాను. దివ్య–అంతరిక్ష–భూములలో ఉన్న పితరులకు, బంధువులు మొదలగు వారికి, మరణించి సంస్కారమును పొందని వారికిని నేను ఈ పిండమును ఇడుచున్నాను. నా ఈ పిండ దానముతో ప్రేత రూపమున ఉన్న నా పితరులు ఎల్లప్పుడును తృప్తినందుదురు గాక!

అబాంధవులు, బాంధవులు, వేరుజన్మలలో బాంధవులు అయిన వారికి నేను ఇచ్చిన పిండము అక్షయ్యమగుగాక. పితృవంశమున మరణించినవారు, మాతృవంశమున మరణించినవారు, గురు–శ్వశుర–మామ అనగా భార్య తండ్రి బంధువులలో మరణించిన వారు, ఇతర బంధువులలో మరణించినవారు, నా వంశమున భార్యా పుత్రులతో విడిచిపెట్ట బడినవారై లుప్తపిండులై శ్రాద్ధక్రియా లోపము చెందినవారు, పుట్టుగ్రుడ్డివారు, కుంటివారు, విరూపులు, ఆమగర్భులు, నా వంశమున తెలిసి తెలియక ఉన్నవారు (మరణించిన) ఈ పై చెప్పిన వారికి నేను ఇడిన ఈ పిండము అక్షయ్యమగు గాక! బ్రహ్మ మొదలుకొని నా పితృ వంశమున పుట్టినవారు, అట్లే మాతృ వంశమున పుట్టిన నా వారు, రెండు కులముల లోను నాకు దాసులైనవారు, సేవకులైనవారు, అట్లే ఆశ్రయించి సేవించువారు. మిత్రులు, శిష్యులు, పశువులు, వృక్షములు, కనబడినవారు కనబడని వారునై ఉపకారముచేసిన వారు, నా జన్మాంతరమున నాతో కలిసియున్నవారు–వీరందరికి నేను పిండమును ఇడు చున్నాను" అని ఈ అన్ని మంత్రములతో స్త్రీ లింగాంతముగా ఊహించి పురుషులకు పిత్రాదిక క్రమమునను, స్త్రీలకు మాత్రాదిక క్రమమునను పిండలములను ఇడవలెను. స్వగోత్రమున గాని, పరగోత్రమున గాని దంపతులకు ఏకముగా పిండమును ఇడుట, శ్రాద్ధముచేయుట, పిండ–ఉదక తర్పణములను చేయుటయు నిష్ఫలములు. కావున దంపతులైనను స్త్రీ–పురుషులకు శ్రాద్ధ–పిండ–తర్పణములు వేరువేరుగా చేయవలెను. పిండ పాత్రమున తిలలనువేసి, మంచినీటితో నింపి, మూడు మారులు పరిషేచనముచేసి అందరికి నమస్కరించి ముగింపవలెను. పితరులను విసర్జించి, ఆచమనముచేసి, సాక్షులైన దేవతలకు ఇది వినిపింపవలెను. "ఓ బ్రహ్మ ! ఈశానాది దేవతలారా! నేనే గయకు వచ్చి పితరులకు శ్రాద్ధముచేసి ఋణము తీర్చికొంటిని. మీరు సాక్షులుగా ఉందురు గాక! ఓ గదాధరదేవా! విష్ణో! నేను గయకు వచ్చితిని, పితృకార్యమున నీవు సాక్షివి. నేను దేవ–ఋషి–పితృ ఋణముల మూడింటి నుండి విముక్తుడనైతిని. ఓ నారదా! అన్ని స్థానము లందును పిండదానము ఈ విధముగనే ఉండును. ప్రేత పర్వతము మొదలుకొని తీర్థము లలో క్రమముగా శ్రాద్ధ పిండ దానాదులను చేయవలెను. ఓ దేవర్షీ! నారదా! ప్రేత పర్వతమున దక్షిణాభిముఖుడై అపసవ్యము చేసికొని తిలలు కలిసిన సత్తు పిండిని ఉంచ వలెను. ప్రేతరూపమునఉన్న నా పితరులందరును ఈ తిలలు కలిసిన సక్తువులతో (సత్తుపిండితో) తృప్తి చెందుదురుగాక! నేను ఇచ్చిన జలముతో బ్రహ్మ మొదలుకొని తృణగుచ్ఛము వరకును ఉన్న చరాచరములు అన్నియు అన్ని విధములుగా తృప్తిచెందుగాక! ఓ నారదా! ఆతని (గదాధర విష్ణుని) మాహాత్మ్యమువలన కర్తయొక్క పితరులు ప్రేతత్వము

నుండి విముక్తులగుదురు గాక ! అని ప్రార్థించవలెను. అందుచే కర్తయొక్క కులమున ఏ ప్రేతత్వము కలుగదు. గయా శిరమున ప్రేతశిల అనునది ముక్తి కొఱకు ప్రసిద్ధిచెందినది. ఇచట తీర్థ మంత్రాది రూపమున ఆదిగదాధరవిష్ణువు నిలిచియున్న వాడు అని చెప్పగా...(48)

గయా మాహాత్మ్యము-6

సనత్కుమారుడు ఇట్లు పలికెను :

మొదట పంచతీర్థమైన ఉత్తర మానసమున (సరస్సున) శ్రాద్ధవిధిని ఆచరింపవలెను. అచట ఆచమనముచేసి దర్భలుకల చేతితో జలముతో శిరమున చల్లుకొని ఆ విధిని చేయ వలెను. ఉత్తర మానసమునకు పోవలెను. అట మంత్రముతో స్నానము ఆచరింపవలెను.

మంత్రము :

ఆత్మవిశుద్ధికొఱకు ఉత్తర మానసమున స్నానము చేయుచున్నాను. సూర్యలోకాది సంసిద్ధులు సిద్ధించుటకై పితరుల విముక్తికొఱకును దేవాదులకు తర్పణము చేసి సపిండక శ్రాద్ధమును చేయవలెను. ఇచట మానససరస్సు కలదు. కావున అది ఉత్తర మానసమైనది. ఇచట సూర్యునకు నమస్కరించి పితరులను సూర్యలోకము చేర్చును. భగవంతుడైన భర్తకు (భరించువానికి) నమస్కారము. ఆతడు చంద్ర, కుజ, బుధరూపుడు, గురు, శుక్ర, శని, రాహు, కేతు స్వరూపుడు ఆతనికి నమస్కారము. ఉత్తరమానస సరస్సునుండి మౌనము ధరించినవాడై దక్షిణ మానససరస్సునకు పోవలెను. అది ఉదీచీ తీర్థమనబడును. అట ఉత్తర దిక్సంబంధముగా చేయునది విముక్తి నిచ్చునది. ఇచట స్నానము చేసిన మానవుడు తన శరీరముతో స్వర్గమునకు పోవును. మధ్యన కనఖలమను తీర్థము కలదు. అది ముల్లోకముల ప్రసిద్ధము. ఇచట స్నానము చేసిన నరుడు బంగారమువలె ప్రకాశించును. పవిత్రుడగును. దానికి దక్షిణ భాగమున దక్షిణ మానస సరస్సను తీర్థము కలదు. అందువలన లోకమున కనకలమను తీర్థము ప్రసిద్ధమై అంతకన్న ఉత్తమమైన తీర్థములేనిది. దక్షిణ మానసమున కూడ మూడు తీర్థములు చెప్పబడినవి. వానిలో విధి విధానముతో స్నానముచేసి వేరువేరుగా శ్రాద్ధము పెట్టవలె. ఆత్మ విశుద్ధి కొఱకును, సూర్యలోకాదులలో సిద్ధించు సిద్ధికొఱకును, పితరుల విముక్తి కొఱకును, దక్షిణ మానస సరస్సున స్నానము చేయుచున్నాను. పితరుల తృప్తికై, వారు తరించుటకై, పుత్ర, పౌత్ర, ధన, ఐశ్వర్య, ఆయురారోగ్యముల వృద్ధికొఱకును సూర్యునికి నమస్కరించుచున్నాను. ఈ మంత్రముతో స్నానపూజాదులు చేసి, సపిండక శ్రాద్ధమును చేసియు, మౌన్యర్క సంబంధమైన ఈ మంత్రమును పఠింపవలెను. అక్కడి నుండి ఫల్గు తీర్థమునకు బోవలెను.

అది సర్వతీర్థములలో ఉత్తమోత్తమమైనది. అచటి శ్రాద్ధము వలన కర్తలకును, పితరులకును ముక్తి కలుగును. పూర్వము ఇచట బ్రహ్మ కోరగా విష్ణువు ఫల్గుకుడు అయ్యెను. అచట దక్షిణాగ్నియందు హోమము చేయబడినది. దాని రజము ఫల్గు తీర్థకము. ఆ ఫల్గువుచే భూమియు, కామధేనువును, జలమును ఫలించును. ఈ ఫల్గు తీర్థము దృష్టికి లోపల ఉండును. కావున ఫల్గు తీర్థము నిష్ఫలముగాదు. భువనములలో ఉన్న సమస్త తీర్థములు దేవతలతోసహా స్నానము చేయుటకు ఇచటకి చేరును. విష్ణు పాదోదకమైన గంగ, ఫల్గువు (నది) ఆది గదాధర విష్ణువు–వీరు స్వయముగా ద్రవరూపమున ఇట ఉందురు. కావున గంగకన్న అధికము ఫల్గువని చెప్పుదురు. ఫల్గుణా తీర్థమున పొందిన ఫలము లక్ష అశ్వమేధములు చేసిన లభింపదు. పితరులకు విష్ణు లోకము సిద్ధించుటకై భుక్తి ముక్తులు లభించుటకును ఫల్గుతీర్థమున విష్ణు జలమున ఆదరముతో స్నానము చేయుదును. అని స్నానము చేయవలె నరుడు ఫల్గు తీర్థమున స్నానము చేసి స్వ సూత్రోక్తముగా తర్పణమును సపిండక శ్రాద్ధమును చేయవను తరువాత తండ్రి తండ్రికి నమస్కరింపవలెను. దేవుడై, ఈశుడై, పురుషుడై, అఘోరుడై, వామదేవుడై, సద్యోజాతుడై, శంభువై ఈ విధముగ పంచ బ్రహ్మ మంత్ర స్వరూపుడై పంచాక్షర స్వరూపుడైన శివునకు నమస్కారము. ఫల్గు తీర్థమున స్నానము చేసి, గదాధర దేవుడైన విష్ణువును చూచి, మానవుడు తనకు పది తరముల పూర్వులను, పదితరముల తరువాతి వారిని, తనను వెంటనే తరింపచేయును. గదాధర విష్ణుదేవునికి నమస్కరించి ఈమంత్రముతో పూజింపవలెను. ఓం వాసుదేవునకు నమస్కారము. సంకర్షణునకు నమస్కారము. ప్రద్యుమ్ననకు నమస్కారము, అనిరుద్ధునకు నమస్కారము, శ్రీధరునకు నమస్కారము, విష్ణువునకు నమస్కారము–అని పంచ తీర్థములలో స్నానము చేసిన నరుడు పితరులను బ్రహ్మలోకము చేర్చును. అచట గదాపాణియైన విష్ణువునకు పంచామృతస్నానమును, పుష్పవస్త్రాది అలంకారమును చేయక శ్రాద్ధము చేసినచో అది నిష్ఫలమగును. నాగకూటము నుండియు, గృధ్ర కూటము నుండియు, ఉపకూటము నుండియు, ఉత్తర మానసము నుండియు పైనున్నది గయా శిరము అనబడును. అది ఫల్గుతీర్థము అనబడును. ముండపృష్ఠ పర్వతము క్రింద ఉత్తమోత్త మమైన ఫల్గు తీర్థము కలదు. ఇచట శ్రాద్ధాదులతో పితరులందరు మోక్షమును పొందు దురు. మొదటి దినమున (శ్రాద్ధాది) విధి చెప్పబడినది. రెండవ దినమున ధర్మా రణ్యము నకు పోవలెను. అచట ధర్ముడు యజ్ఞము చేయించెను. మతంగవాపి (బావి) యందు స్నానముజేసి, తర్పణమును, శ్రాద్ధమును ఆచరింపవలెను వెళ్లి, మంతంగేశునకు నమస్కరించి ఈ మంత్రమును పఠింపవలెను. "దేవతలు నేను ఇచట పెట్టిన శ్రాద్ధమునకు

ప్రమాణముగా ఉందురు గాక ! లోకపాలురు సాక్షులుగా ఉందురుగాత ! నేను మతంగ తీర్థమునకు వచ్చి పితరుల ఋణ విముక్తుని చేసితిని (దీనికి సాక్షులుగా ఉండుడు)" పూర్వము బ్రహ్మ తీర్థము ఉండును. ఆ కూపమున(బావిలో)శ్రాద్ధాదులను చేయవలెను. ఆ కూపమునకును యూపమునకు (యజ్ఞ యూపస్తంభమునకు)ను మధ్యన శ్రాద్ధాదులు ఆచరించుటచే నరుడు సమస్త పితరులను తరింపజేయును. ధర్ముని, ధర్మేశ్వరునికి నమస్కరించి అట మహాబోధి వృక్షమునకు నమస్కరింపవలెను. బ్రహ్మ–విష్ణు–శివ స్వరూపమైనదియు బుద్ధునకు జ్ఞానోదయము కలిగించిన బోధి వృక్షమైనదియు, శ్రాద్ధ కర్తలను పితరులను తరింపచేయు నదియు అయిన అశ్వత్థ వృక్ష రాజమునకు అనగా శ్రేష్ఠమైన రావిచెట్టుకు నమస్కారము.

"నా కులమునను, మాతృ వంశమునను దుర్గతినిపొందిన బాంధవులు నీ దర్శనము వల్లను, స్పర్శనము వల్లను శాశ్వతమైన స్వర్గగతిని పొందుదురుగాక! ఓ వృక్షరాజమా! నేను గయకు వచ్చి మూడు ఋణములను తీర్చివేసితిని" నీ అనుగ్రహము వలన నేను మహాపాపము నుండియు, సంసార సముద్రము నుండియు విముక్తుడనైతిని" అని ప్రార్థించి మూడవదైన బ్రహ్మ సరస్సున స్నానముచేసియు, సపిండకముగా సర్వప్రమాణమైన మంత్రముతో శాస్త్రీయముగా పుత్రుడు శ్రాద్ధము చేయవలెను. ఈ తీర్థమున మూడు ఋణముల ముక్తి కొఱకు స్నానము చేతునని స్నానము చేయవలెను. ఆ తీర్థ–కూపముల మధ్యన శ్రాద్ధముచేసి పితరులను బ్రహ్మలోకమును చేర్చవలెను. బ్రహ్మయాగము చేయగా బయలుదేరిన ఈ ఊపము అనబడినది. అచట బ్రహ్మ సరస్సులో శ్రాద్ధముచేసి నరుడు సమస్త పితరులను తరింపచేయును. ఆ ఊపమునకు ప్రదక్షిణముచేసి వాజపేయ యజ్ఞ ఫలము పొందును. బ్రహ్మకు నమస్కరించి పితరులను బ్రహ్మలోకమును చేర్చును. జన్మలేనివాడును, జగజ్జన్మాది రూపుడు, భక్తులను పితరులను తరింపచేయువాడును అయిన బ్రహ్మకు నమస్కారము. అచట గోవులు తిరుగుచోటికి సమీపమున ఉన్నవిగా మామిడిచెట్లు బ్రహ్మచే ప్రకల్పింపబడినవి. వానికి నీళ్లు పోసినంత మాత్రమున పితరులు మోక్షమునకు పోవుదురు. సేచన మంత్రము–బ్రహ్మ సరస్సున పుట్టినదియు బ్రహ్మ దేవమయమై విష్ణు రూపమైన మామిడి చెట్టును పితరుల విముక్తికి గాను తడుపుదును (నీళ్లు పోయుదును). కుండను దర్భలనుచేత ధరించిన ఒకే మునినై మామిడిచెట్టు మొదలులో నీరు పోయుదును. మామిడిచెట్టు తడుపబడును. అందుచే పితరులు తృప్తి పొందుదురు. ఒకే పని రెండు ప్రయోజనముల పూర్తిచేయుననుట ప్రసిద్ధమగును. తరువాత ఈ మంత్రముతో నియతుడై యమబలి ఈయవలెను. యమరాజ ధర్మరాజులు గయాసుర

నిశ్చలతకై శిలయందు ఇచట ఉన్నారు. పితరుల విముక్తికై వారు ఇరువురికి బలి ఇచ్చు చున్నాను-అను మంత్రముతో బలి ఈయవలెను. తరువాత ఓ నారదా! ఈ మంత్రముచేత కుక్కలకు బలి ఈయవలెను. రెండు కుక్కలు ఒకటి నల్లనిది మరొకటి చిత్రవర్ణము కలది. ఇవి వైవస్వత (సౌర) కులమున పుట్టినవి. ఆ రెంటికిని బలి ఇచ్చుచున్నాను. అవి మార్గమున ఎప్పుడును రక్షించుగాక (అనునది మంత్రము ఓ నారదా! తరువాత నీ మంత్రముతో కాక బలిని ఈయవలె. ఐంద్రములు తూరుపు దిక్కు నందలివియు, వరుణ వాయవ్య యామ్యములు (పశ్చిమదిక్కునందలివియు, వాయవ్య దిక్కునందలివియు, దక్షిణదిక్కు నందలివియు, నిర్ఋతి దిక్కునందలివియు) అయిన కాకులు భూమియందు సమర్పించిన పిండమును గ్రహించుగాక. (ఇది మంత్రము). నాలుగవ దినమున ఫల్గు తీర్థమున స్నానాదికమును చేయవలెను. తరువాత, గయా శిరమున పాదమున సపిండకముగా శ్రాద్ధమును చేయవలెను. అచట సాక్షాత్తుగా గయా శిరస్సు ఫల్గు తీర్థ శ్రితముగా చేయబడినది. నాగము నుండియు, జనార్దను నుండియు, బ్రహ్మ ఊపము నుండియు, ఉత్తర మానస సరస్సు నుండియు, ఈ గయా శిరము చెప్పబడినది. ఇదియే ఫల్గు తీర్థము అనబడినది. ఉత్తర మానసము వరకు బ్రహ్మను చేరినది. ఫల్గు తీర్థమని తెలియవలె. అది దేవతలకును పొందరానిది. క్రౌంచ పాదము ఉండి సాక్షాత్తుగా గయా విరము వరకు ఫల్గు తీర్థము. ఇది గయాసురుని ముఖము. కావున ఇట శ్రాద్ధము అక్షయము. ముండపృష్ఠ పర్వతము క్రిందుగా నున్నది సాక్షాత్తు ఫల్గు తీర్థము. ఇట ఆద్యుడైన గదాధర విష్ణువు వ్యక్తావ్యక్త రూపమున ఉన్నవాడు. విష్ణ్వాది పదరూపమున ఇది పితరులకు ముక్తి హేతువు. ఇది దివ్యమైన విష్ణు పదము. దర్శనమున పాపనాశము చేయునది. ఇచట స్పర్శనము వల్లగాని, పూజించుట వల్లగాని, పితరులకు ఇచ్చినది అక్షయమగును. ఇచట సపిండక శ్రాద్ధముచేసి తనతో పాటు వేయి కులములను దివ్యమై, అనంతమై, శివమై అవ్యయమైన విష్ణు పదమును చేర్చును. నరుడు రుద్ర పదమున శ్రాద్ధము చేసి నూరు కులములను తనతోబాటు శివ పురమును చేర్చును. అట్లే బ్రహ్మ పదమున శ్రాద్ధముచేసిన నరుడు వంశ శతమును ఉద్ధరించి పితరులను బ్రహ్మ లోకమును చేర్చును. కశ్యపుని పదమున శ్రాద్ధము చేయువాడు దక్షిణాగ్ని పదమున శ్రాద్ధము చేయువాడు పితరులను బ్రహ్మ పురమును చేర్చును. గార్హపత్యాగ్ని పదమున శ్రాద్ధము చేయువాడు వాజపేయ యజ్ఞ ఫలమును పొందును. ఆహవనీయాగ్ని పదమున శ్రాద్ధము చేయువాడు అశ్వమేధ యాగ ఫలము నందును. సభ్యాగ్ని పదమున శ్రాద్ధము చేసినవాడు జ్యోతిష్టోమ యాగఫలమును పొందును. ఆవసథ్యాగ్ని పదమున శ్రాద్ధము చేసినవాడు శక్ర (ఇంద్ర)

పదమున శ్రాద్ధము చేసినవాడు పితరులను బ్రహ్మ పురము చేర్చును. క్రౌంచ-మాతంగముల మధ్యన శ్రాద్ధము చేసినవాడు పితరులను బ్రహ్మలోకము చేర్చును. సూర్య పదమున శ్రాద్ధము చేసినవాడు పంచపాపులను కూడ సూర్య పురమును చేర్చును. కార్తికేయ పద మున శ్రాద్ధము చేసినవాడు పితరులను శివలోకము చేర్చును. గణేశ పదమున శ్రాద్ధము చేసినవాడు పితరులను రుద్రలోకము చేర్చును. గజకర్ణ (ప్రదేశ) తర్పణమున పితరులను నిర్మల స్వర్గమునుచేర్చును. ఇతరులయొక్క పదమున కూడ శ్రాద్ధము చేసినవాడు పితరు లను బ్రహ్మ పురము చేర్చును. అన్ని తీర్థములలో కాశ్యప తీర్థము శ్రేష్ఠమైనది. అచట విష్ణు పదము, రుద్ర పదము శ్రేష్ఠమైన బ్రహ్మ పదము కూడ చెప్పబడినవి. ప్రారంభమునను సమాప్తిలోను వానిలో ఒక్కటి స్వీకరింపవలె. ఓ నారదా! అచట శ్రాద్ధకర్తకు అది శ్రేయ స్కరము. పూర్వము కశ్యపుని దివ్యపదమున భారద్వాజముని శ్రాద్ధముచేసి పిత్రాదులకు పిండము ఇడుటకు పూనుకొనెను. అంత తెలుపు-నలుపు హస్తములు రెండు పదమును చీల్చుకొని బయలువెడలినవి. ఆ రెండు హస్తములను చూచి భారద్వాజముని సంశ యించెను. వెంటనే ఆ మహాముని తన తల్లియైన శాంతను అడిగెను. "ఓ తల్లీ! కశ్యపుని దివ్యపదమున తెల్లని నల్లని రెండుచేతులు వచ్చినవి. నా తండ్రిని నీవు ఎరుగుదువు. పిండము ఏ చేతిలో ఉంచవలెనో చెప్పుము" అని అడిగెను.

శాంత ఇట్లు పలికెను :

ఓ మహాప్రాజ్ఞుడవైన భారద్వాజా! నల్లని చేతిలో పిండము నిడుము. తరువాత భారద్వాజుడు నల్లని చేతిలో పిండము నిడుటకు పూనెను. అచట తెల్లని చేయి అదృశ్యమై నీవు నా ఔరస పుత్రుడవు (నాకు నా వీర్యమున పుట్టినవాడవు) గదా! అని అనెను. అంత నల్లనిచేయి క్షేత్రము నాది. కావున పిండమును నాకే ఇడుము. అనెను. తరువాత స్వైరిణి (స్వేచ్ఛాచారిణియైన తల్లి) క్షేత్రియైన (పెండ్లియైన) మొగునికిని బీజియై వీర్యము నిచ్చిన విటునికిని పిండము నిడుమని చెప్పెను. తరువాత భారద్వాజుడు కశ్యపుని పదమున ఇద్దరికిని పిండమునిడెను. హంసలతో గూడిన విమానముతో ఇరువురును బ్రహ్మ లోకమునకు పోయిరి. రాముడు రుద్రపదమున శ్రాద్ధమునందు పిండము ఇడుటకు పూనెను. తండ్రియైన దశరథుడు స్వర్గమునుండి చేయిచాచి వచ్చెను. తరువాత రాముడు ఆ చేతిలో పిండమిడక రుద్ర పదముననే ఇడెను. శాస్త్రార్థాతి క్రమమున భయముచెందిన రామునితో దశరథుడు ఇట్లనెను. "ఓ పుత్ర! నీచేత నేను తరింపబడితిని. రుద్రలోకమును పొందుదును. చేతిలో పిండమిడుటచే నాకు స్వర్గగమనము ఉండెడిది కాదు. నీవును, కలకాలము రాజ్యముచేసి, బ్రాహ్మణులను ప్రజలను పాలించి, దక్షిణలతో యజ్ఞములను

చేసి, విష్ణు లోకమునకు పోగలవు. అయోధ్యాపురి కూడ జనులతోను కృమి కీటాదులతోను విష్ణు లోకమునకు పోగలదు"–అని చెప్పి దశరథుడు పరమ రుద్ర లోకమునకు పోయెను. భీష్ముడు శ్రేష్ఠమైన విష్ణుపదమున తన తండ్రిని పిలిచి, శ్రాద్ధముచేసి పిత్రాదులకు పిండము ఇడుటకు పూనెను. అంత గయాశిరమున తండ్రియైన శంతనుని చేతులు వెలువడినవి. భీష్ముడు పిండమును చేతిలో నిడక విష్ణు పదముననిడెను. శంతనుడు సంతుష్టుడై "నీవు శాస్త్రములు చెప్పిన యర్థమున (విషయమున) చలనములేక స్థిరుడవు. నీకు త్రికాల (భూత భవిష్య వర్తమాన కాల) దృష్టి కలుగును. చివర విష్ణువును పొందుదువు. స్వేచ్ఛా మరణము (ఇచ్ఛవచ్చినపుడు చచ్చుట) జరుగును"–అని పలికి ముక్తిని పొందెను. కనకేశుని, కేదారుని, నారసింహుని, వామనుని, ఉత్తరమార్గమున పూజించి సమస్త పితరులను తరింపచేయవలెను. గయాశిరమున ఎవరిపేర పిండములను ఇడుదురో వారు నరకము నందున్నను స్వర్గమునందున్నవారై మోక్షమునందుదురు. గయాశిరమున జమ్మి ఆకు అంతటి పిండమును కందమూలఫలాదులతో నిడవలెను. పితరులను స్వర్గమును చేర్చవలెను. విష్ణువు మొదలగు దేవతల పదములు కనబడినచోట, వాని ముందు, వారికి సపిండకముగా శ్రాద్ధమునుచేసి పితరులను వారివారి (ఎవరి పదమున పిండము ఇడుదురో వారి) లోకములకు చేర్చవలెను. అంతటను ముండపృష్ఠ పర్వతము ఈ పదములతో చక్కగా గుర్తింపబడినది. అచట శ్రాద్ధము చేసినందున పితరులందరు ఆరోగ్యవంతమైన బ్రహ్మ లోకమునకు పోవుదురు. గదచేత హేతిఅను అసురుని శిరము రెండుగా చేయబడిన చోటు ప్రక్షాళితమై పితరుల విముక్తికై తీర్థమైనది. అది అందరికిని గదాలోలమని ప్రసిద్ధి చెందినది. "హరియొక్క గదా ప్రక్షాళనమున మహాతీర్థమైన గదాలోలమున మోక్షసిద్ధి కొఱకు స్నానము చేయుచున్నాను. అక్షయ పదమును పొందుదును" అని అచటి స్నాన మంత్రము. ఐదవదినమున గదాలోలమున స్నానముచేసి సపిండకముగా శ్రాద్ధముచేసి పితరులను తనను బ్రహ్మలోకమును చేర్చవలెను. బ్రహ్మగా ప్రకల్పితులైన బ్రాహ్మణులను హవ్యకవ్యాదులతో పూజింపవలె. వారు సంతసించినచో పితరులతో సహా సమస్త దేవతలు సంతసింతురు. అక్షయవటమున ప్రయత్నపూర్వకముగా అన్న శ్రాద్ధముచేసి పితరులను అక్షయమై సనాతనమైన బ్రహ్మ లోకమును చేర్చవలెను. వటవృక్ష సమీపమున శాకముతోగాని, జలముతోగాని, ఒక్కడు భుజింపజేయబడినచో కోటిమంది భుజించిన ఫలము వచ్చును. పుత్రులు గయాతీర్థమున తీర్థ పురోహితునకు చక్కగా వస్త్ర గంధాదులతో పూజించి షోడశదానముచేయవలెను. గయాతీర్థవటమున పితరులకు ఇచ్చినదంతయు అక్షయమగును. అచట వటేశుని చూచి, నమస్కరించి, ఏకమనస్కుడై పూజించి, పితరులను

సనాతనమై అక్షయమైన బ్రహ్మలోకము చేర్చును. గయ యందు, ధర్మపృష్ట(నగ)మున, బ్రహ్మ సరస్సున, గయా శిరమున, వటమునను పితరులకు ఇచ్చినది అక్షయమగును. మహాప్రళయమున సర్వము ఏక సముద్రము కాగా వటవృక్షము యొక్క అగ్రమున యోగ నిద్రలో బాలరూపధరుడై ఉండి యోగశాయియై సంసారమను వృక్షమును ఛేదించుటకు శస్త్రమై సమస్తపాపములను హరించు విష్ణువునకు నమస్కారము. అక్షయ బ్రహ్మమును ప్రసాదించునట్టియు, అక్షయవటస్వరూపుడైనట్టి విష్ణువునకు నమస్కారము. ఎవనిచేత కలిలో లోకులు మహేశ్వరులైరో ఆ గదాధర విష్ణువు లింగరూపుడయ్యెను. అట్టి లింగ రూపియై శ్రీప్రపితా మహుని (విష్ణువును–పితామహుడైన బ్రహ్మకు తండ్రియైన విష్ణువునకు) నేను నమస్కరించు చున్నాను. (49) అని చెప్పెను.

గయా మాహాత్మ్యము- 7

సనత్కుమారుడు ఇట్లు అనెను :

గయుడను రాజు బహు అన్నములు కలదియు, బహు దక్షిణలు కలదియునైన యజ్ఞమును చేసెను. అచటి ద్రవ్య (వస్తు) సమూహములను లెక్కింపనలవిగాదు. దేశ దేశములలో చక్కగా పూజింపబడిన బ్రాహ్మణులు గయయందుండి అచటి ఇరువదియైదు అన్నాది పర్వతములను ప్రశంసింతురు. ఈ విధముగా పూర్వము ఎవ్వరును చేయలేదు. తరువాతి వారునుగూడ చేయలేరు. భూ లోకమున ఇసుకవలె, ఆకాశమున తారకలవలె అనేక సువర్ణాదుల తోడి దక్షిణలు అసంఖ్యాతములు (లెక్కకు మించినవి). ఇచట పూర్వులు ఎవ్వరు ఇట్లుచేసిన వారులేరు. ముందుకూడ నెవ్వరును చేయలేరు. దేశదేశములలో చక్కగా పూజింపబడిన ప్రజలు ఇచట తృప్తినంది గయుని ప్రశంసింతురు. తరువాత విష్ణువు మొదలగువారు తుష్టులై వరమును అడుగుమని గయునితో అనిరి. గయుడువారిని "పూర్వము ఇచట అభిశప్తులైన (శాపమును బొందిన) బ్రాహ్మణులు పవిత్రులై యజ్ఞముల పూజింపబడుదురుగాక" అని ఈవిధముగా ప్రార్థించెను. గయా శ్రాద్ధ విధానమునకై మూర్త రూపమును ధరించిన బ్రాహ్మణులు పదునాలుగురు. సాక్షాత్తు బ్రహ్మ స్వయముగా ఉన్నను వారి మాటలను ఆచరింపవలెను. గౌతమము, కాశ్యపము, కౌత్సము, కౌశికము, కణ్వము, భారద్వాజము, ఔశనసము, వాత్స్యము, పారాశరము, హరిత్కు మార మాండవ్యము, లోకాక్షి, లోకసంమహత్తు, వాశిష్ఠము, ఆత్రేయము–అని వీరి గోత్రములు పదునాలుగు. బ్రహ్మపురి వలెనే గయాపురియని ఇది నా పేర ప్రసిద్ధి చెందవలెను–అని వరమడుగ దేవతలు అట్లే అగుగాక అని అంతర్ధానము చెందిరి. గయుడు కూడ భోగము

లను అనుభవించి పరమమైన విష్ణులోకమునకు వెళ్లెను. విశాలఅను నగరి యందు విశాల అను పేర రాజు ఉండెను. ఆతడు పుత్రుడు లేనివాడై బ్రాహ్మణులను అడిగెను– నాకు పుత్రాదులు ఎట్లు కలుగుదురు? అని అడిగెను. అనగానే బ్రాహ్మణులు విశాలునితో– గయలో పిండ దానము చేసిన నీకు సర్వము కలుగును అనిరి. విశాలుడుకూడ గయా శీర్షమున పిండమును ఇడి పుత్రవంతుడు అయ్యెను. ఆతడు ఆకాశమున తెల్లని–యెఱ్ఱని–నల్లని పురుషులనుచూచి, మీరు ఎవరు అని అడుగగా, వారిలో ఒక తెల్లనివాడు విశాలకునితో ననెను. తెల్లని నేను నీ జనకుడను. ఇంద్రలోకము నుండి ఇటకు వచ్చితిని. ఓ పుత్రుడా! నా తండ్రి ఎఱ్ఱనివాడు. మిక్కిలి పాపములు చేసినవాడు. ఈ నల్లనివాడు నీ తండ్రి తండ్రి. ఈతనిచే ఋషులు చంపబడిరి. అవీచియను నరకమును పొందిన వీరు ఇరువురు నీవు పిండమిడుట వలన ముక్తిని పొందిరి. పితరులను, పితామహులను (తండ్రి తండ్రిని) అట్లే ప్రపితామహులను (తాత తండ్రిని) సంతోషింపచేతును అను నీ మాట వలనను, నీవు ఇచ్చిన జలము వలనను, ఓ శత్రుదమనుడా! సజ్జనోత్తముడా! మా ఈ యొక్కమారు కలయిక జరిగినది. ఓపుత్రా! నీచేత మాకు ముక్తి ఈయబడినది. ఆ ఉత్తమమైన స్వర్గమునకు పోయెదము – ఈ విధముగా పుత్రులు పితరులకు ఉత్తమ ముక్తిని ఇప్పింపవలె.

ఇంకను "నీచేత అందరు ముక్తులుగా చేయబడిరి. ఇక అక్షయమైన స్వర్గమునకు పోయెదము. సుపుత్రుడవైన నీచేత మేము అందరము బ్రహ్మలోకమునకు పోవుచున్నాము. పుత్ర–పౌత్ర–ఆదులతో గూడినవాడవై రాజ్యముచేసి, స్వర్గమునకు పోయి అచటి భోగములతో చక్కగా తృప్తి చెందినవాడవై తరువాత మోక్షమును పొందుము.

నీవు గూడ చాలకాలము రాజ్యముచేసి, దుర్లభములైన భోగములను అనుభవించి, దక్షిణలతో యజ్ఞములను చేసి, తరువాత విష్ణుపురమునకు పోవలెను" అని ఈ విధముగా వరము పొందిన రాజు రాజ్యమునుచేసి స్వర్గమునకు పోయెను. ప్రేతరాజైన ఆతడు గయా శ్రాద్ధము వలన ప్రేతలతో కూడ స్వర్గమునకు పోయెను. ఒక ప్రేత తన విముక్తికై ఒక కోమటితో నా పేర గయాశీర్షమున పిండ నిర్వాపణము చేయుము–అని అనెను. నా ప్రేతభావ విముక్తి చేయించుటకై నీవు నా ధనమును తీసికొనుము. ఆ ధనము అంతయు తెచ్చి గయాశ్రాద్ధమునకు వ్యయము చేయుము. నీకు నేను ఇరువదియొక్క భాగముల నిచ్చితిని. న్యాయానుసారముగా నాపేరులను చక్కగా చెప్పితిని. ఆతడు గయలో గయాశీర్షము కడకుబోయి ప్రేతరాజునకు పిండమిడెను. తరువాత బంధువులతో పాటు తన పితరులకు పిండమిడెను. ప్రేత తన ప్రేతత్వము నుండి విముక్తమయ్యెను. కోమటి

ఇంటికి వచ్చెను. ఈ విధముగా ఇది గయుని యొక్కయు, శంభుని యొక్కయు, విష్ణువు యొక్కయు, రవి యొక్కయు క్షేత్రము. ఆ తరువాత ఉపవసించి, మహానదిలో ఉన్న గాయత్రీ తీర్థమున గాయత్రి ఎదుట స్నానము జేసి ప్రాతః సంధ్యను ఉపాసింపవలెను. సపిండకముగా శ్రాద్ధమునుచేసి కులమును బ్రాహ్మణ హితముగా చేయవలెను. సూర్యోదయ మున గాయత్రీతీర్థమున స్నానము చేసి, సావిత్రి యెదుట నరుడు మధ్యాహ్నమున సంధ్యో పాసనముజేసి నూరు కులములను స్వర్గమును చేర్చును. తరువాత పితరుల ముక్తిని కోరి పిండదానము చేయవలెను. తూరుపు సరస్వతీ తీర్థమున విధి విధానమున స్నానము చేసి సాయంకాలమున సంధ్యను ఉపాసించి పితరులను విష్ణు లోకమును చేర్చవలెను. విశాలలోని లేలిహాన తీర్థమున భరతాశ్రమమున మూడు సంధ్యల చేయువాడు బహుజన్మలనుండి చేసిన సంధ్యాలోపమునుండి విముక్తుడు అగును. దేవపాదాంకిత మైన ముండపృష్ఠ పర్వతమున, గదాధర విష్ణుసమీపమున, ఆకాశగంగా తీర్థమున, గిరికర్ణ ముఖములందును స్నానముచేసి పిండమునిడువాడు తన నూరు కులములను బ్రహ్మ లోకమునకు గొంపోవును. దేవనదియైన వైతరణిలో స్నానము చేసినవాడు పితరులను స్వర్గము చేర్చును. వైతరణిలో స్నానముచేసి గోదానము చేయువాడు తన ఇరువదియొక్క వంశములను ఉద్ధరించును. వైతరిణి విషయమున ఇది ముమ్మాటికి నిజము. ఓ నారదా! వంశములు ఇరువదియొక్కటియని చెప్పుదురు. వైతరణీ స్నానము ఆ వంశములను తరింపచేయును. సంశయము లేదు. వైతరణి అనునది ముల్లోకములలో ప్రసిద్ధి చెందినది. అది పితరులను తరింపచేయుటకై గయాక్షేత్రమున అవతరించినది. గోదావరిలోను, వైతరణిలోను, యమున యందును, అట్లే దేవనది గంగయందును, గోప్రచార క్షేత్రముననను శ్రాద్ధము చేయువాడు పితరులను స్వర్గము చేర్చును. పుష్కరిణి యందు ఘృతకుల్యయందు, మధుకుల్య యందు అట్లే, రుక్మిణీయైన కోటి తీర్థమందును పిండమిడువాడు పితరులను స్వర్గము పొందించును. పై తీర్థములలో మూడురాత్రుల ఉపవాసముతోను, తీర్థమునకు వచ్చుట చేతను, పితరులను స్వర్గము చేర్చును. ఘృతకుల్యా, మధుకుల్యా, దేవికా, మహానదీ-వీనిలో బంగారమును గోవును దానము చేయక నరుడు దరిద్రుడగును. శిలా సంగమము జరిగినది మధుస్రవ అనబడినది. ఆ నదిలో స్నానము చేసినవాడు పదివేల అశ్వమేధ యాగముల ఫలమునందును. అట, సపిండక శ్రాద్ధముచేసి, పిండదానము చేసిన నరుడు తన నూరు వంశములను ఉద్ధరించి విష్ణులోకమును చేర్చును. దశాశ్వమేధికమున, హంస తీర్థమున, అమరకంకటమున, కోటితీర్థమున, రుక్మకుండమున పిండమిడువాడు పితరులకు స్వర్గమును అందించును. వైతరణియందు, ఘృతకుల్యయందు,

మధుకుల్యయందు, కోటితీర్థమునందు స్నానముచేసి, కోటీశ్వరుని చూచిన బ్రాహ్మణుడు కోటి జన్మలలోను బ్రాహ్మణుడై ధనాఢ్యుడును వేదపారగుడును అగును. అట మార్కండేయేశ-కోటీశులకు నమస్కరించిన పితృకారకుడు (పితరుల మోక్ష కారకుడు) అగును. పూర్వము రుక్మపారిజాత వనమున పార్వతితో కూడి ఏకాంతమున నుండి శంకరుడు పదివేల ఏండ్లు క్రీడించెను. అపుడు మరీచిముని ఫల పుష్పములకై పారిజాత వనమునకు పోయెను. ఆతనిని జూచి శంకరుడు తన సుఖ విఘాతకుడు అయినందున దుఃఖివికమ్మని శపించెను. దానిచే భయము చెంది మరీచి శంకరుని శాపవిమోచనము కోరెను. శివుడు గయలో నీకు విముక్తి లభించుననెను. మరీచి గయకు వెళ్లెను. అచట శిలయందు సర్వ దుష్కరమైన తపముచేసెను. పూర్వము ఈశ్వరశప్తుడు అయిన మరీచి నలుపుదనమును పొందెను. ఇచటి దారుణమైన తపముచేత ఆ బ్రాహ్మణుడు (మరీచి) తెల్లనివాడయ్యెను. విష్ణువు-ఓ పుత్రకా! వరమును కోరుకొమ్ము అనెను. మరీచి మాధవునితో నీవు సంతుష్టుడవైనచో లభింపనిది ఏమున్నది? శివశాపము నుండి నేను విముక్తుడను కావలెను. శిలపవిత్రమైనది కావలెను, పితరులకు విముక్తిని ఇచ్చునది కావలెను అని అడిగెను. విష్ణువు అట్లే అగునని స్వర్గమునకు పోయెను. దేవతల పుష్కరిణిని పొంది నరుడు శుచియగును. అచట పితరులకు ఇడిన పిండము అక్షయమగును. అచట స్నానముచేసిన మానవుడు తన శరీరముతో స్వర్గమునకు పోవును. పాము కుబుసమును వదలినట్లు ఇట స్నానముచేసినవాడు పాపమును వదిలివేయును. అచటి కమలవనము పుణ్యమైనది. దానిని పుణ్యము చేసినవారే సేవింతురు. అచట తెల్లని శిల ఉన్నది. అచట శ్రాద్ధముచేసిన అక్షయమగును. ఓ నారదమునీ! ఆ శిలయందు యుధిష్ఠిరుడు శ్రాద్ధము చేయుటకు వెళ్లెను. అచట శ్రాద్ధకాలమున పాండురాజు-నాచేత పిండము నిడుము-అని చేయిచాచెను. కాని ధర్మరాజు మాత్రము ఆ చేతిని వదలి శిలయందే పిండ దానముచేసెను. శిలయందు పిండ దానముచే వ్యాసపుత్రుడైన పాండురాజు సంతుష్టుడయ్యెను. తన పుత్రునితో ఓ పుత్రక! భూమండలమున రాజ్యము జేయుము, నీ రాజ్యము కంటకమై సంపూర్ణ మగును. నీవు నా రక్షకుడవు. సోదరులతో కూడినవాడవై, శరీరముతో పాటు స్వర్గమునకు పొమ్ము. నరకములో ఉన్నవారిని దర్శన మాత్రమున పవిత్రులనుచేసి స్వర్గమును పొందించుము' '-అని చెప్పి పాండురాజు శాశ్వతమైన అవ్యయమైన పదమును పొందెను. భూమిని ఛేదించుకొని పుట్టు వృక్షాదులు, చెమటవల్ల పుట్టునవి, గ్రుడ్లవల్ల పుట్టునవి, మావివల్ల పుట్టునవియును మధుస్రవ నదిని చేరి మరణించినవై స్వర్గ పురమును చేరినవి. దశాశ్వమేధికమున, హంసతీర్థమునను శ్రాద్ధము వలన స్వర్గమునకు పోవును. దశాశ్వ మేధ

హంసలకు నమస్కరించి శివపురమునకు చేరును. భరతుని ఆశ్రమమున శ్రాద్ధము వలన పితరులను బ్రహ్మ లయమును చేర్చును. మతంగుని పదమున శ్రాద్ధము చేయువాడు పితరులను బ్రహ్మ లోకమును చేర్చును. బ్రహ్మ విష్ణ్వాదులతో సహా శమీ గర్భమున మథించి యజ్ఞమునకై అగ్నిని పొందెను. తరువాత దానితో యాగము చేయుటకై ముల్లోక ముల ప్రసిద్ధిచెందిన ఈ తీర్థమును పొందెను. ఆ తీర్థము ముఖమను పేరుగలది. అది పితరులకు ముక్తినిచ్చునది. అచట స్నానముచేసి పిండమును ఇచ్చువాడు ముక్తిని పొందును. సంగమమున అంగారక–ఈశ్వరులకు నమస్కరించి పితరులను స్వర్గము చేర్చును. గయా కూటమున పిండదానము వలన అశ్వమేధ ఫలమును పొందును. భస్మ కూటమున భస్మనాథుని నమస్కరించి పితరులను తరింపజేయును. పాపములు వదిలిన వాడై ముక్తుడై సంగమమున స్నానము చేయవలెను. మునిసత్తముడైన వశిష్ఠుడు అశ్వ మేధమను ఇష్టిని చేసెను. ఆ ఇష్టి నుండి వెలువడిన శివుడు వశిష్ఠుని వరము అడుగు కొమ్మనెను. వశిష్ఠుడు గూడ– “ఓ శివా! దేవేశా! నావల్ల సంతుష్టుడవు అయినచో ఇచట ఉండవలెను” అని కోరెను. శివుడు అట్లేఅని అచటనే ఉండెను. ధేనుకారణ్యమున, కామధేనుపదములందు స్నానముచేసి నమస్కరించి పిండమిడువాడు పితరులను బ్రహ్మ లోకమునకు చేర్చును. ముండపృష్ఠ పర్వత సమీపమున గయానాభిలో కర్దమాలమున స్నానముచేసి శ్రాద్ధాదికమును చేసియు పితృ–ఋణ విముక్తుడు అగును. ఫల్గు, చండి, శ్మశానాక్షి, మంగళ మొదలగు శక్తులకు సమర్పింపవలెను. గయలో వృషోత్సర్గము (ఆబోతును వదలుట) వలన ఇరువది యొక్క వంశములను ఉద్ధరించును. దేవతలు, జితేంద్రియులైన ఋషులును అక్కడ అటనటను ఉందురు. ఆద్యగదాధరుడైన విష్ణువును ధ్యానించుచు చేసిన శ్రాద్ధపిండాది దానములవలన నూరు వంశములను ఉద్ధరించి పిత రులను బ్రహ్మలోకము చేర్చును. గయ, గయుడు, గయాదిత్యుడు, గాయత్రి, గదాధరుడు, గయాగయాసురుడు–ఈ యారుగయలు ముక్తి దాయకములు. ఈ పుణ్యమైన గయా ఖ్యానము నెల్లప్పుడు పఠించు నరుడును శ్రద్ధతో వినువాడును పరమపదమును పొందు దురు. ఓ నారదా! గయాఖ్యానమును బ్రాహ్మణులవల్ల చదివించువాడును పుణ్యముచేయు నరుడగును. గయా శ్రాద్ధము చేయుట, సునిశ్చితముగా చేయదగిన పుణ్యము చేయుట, గయయొక్క మహిమను అభ్యసించిన మానవుడు రాజసూయ యాగమును, అశ్వమేధ యాగమును చేసినవాడగును. ఈ గయామాహాత్మ్యమును వ్రాసిన వాడును, వ్రాయించిన వాడును, పుస్తకమును పూజించినవాడును రాజసూయ, అశ్వమేధ యాగముల చేసినవాడ గును. ఈ పుస్తకము ఇంటనున్నవారి గృహమున లక్ష్మి స్థిరురాలై సుప్రసన్నురాలు అగును.

అచట సర్ప–అగ్ని–చోరుల వల్ల భయముండదు. శ్రాద్ధ కాలమున ఉత్తమమైన ఈ గయా మాహాత్మ్యము ఎవడు చదువునో, వాడు పెట్టిన శ్రాద్ధము విధి విహీనమైనను గయా శ్రాద్ధముతో సమానము అగును. ఓ నారదమునీ! ఈ గయాఖ్యానము తెలిసిన వానిలోను, విన్నవానిలోను, చదివిన వానిలోను, ముల్లోకములలో ఉన్న తీర్థములు అన్నియు ఉండును అని చెప్పగా...

సూతుడు ఇట్లు అనెను :

సనత్కుమారుడు ముని శ్రేష్ఠుడైన నారదునకు ఈ పుణ్యమైన యాగమాహాత్మ్య కథను భక్తితో తెలిపి, సంగీతగురువైన నారదుని వదలి, పుణ్యవనములతో కూడిన తన ఆశ్రమమునకు వెళ్లెను.

ఇది శ్రీవాయుమహాపురాణమున
గయా మాహాత్మ్యము అను
ఏబదియవ అధ్యాయము
సమాప్తము

వాయు మహాపురాణము సమాప్తము

ఓం తత్ సత్